# ఋగ్వేద సంహిత

**రెండవ భాగం**

**దాశరథి రంగాచార్య**

శుక్లాంబర ధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం |
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోపశాంతయే ||

## నాలుగవ అష్టకము

**మొదటి అధ్యాయము ఐదవ మండలము**
**మొదటి అనువాకము తొమ్మిదవ సూక్తము**

ఋషి - ఆత్రేయ గయుడు, దేవత - అగ్ని ఛందస్సు 5-7 పంక్తి, మిగిలినవి అనుష్టుప్

1. అగ్నీ ! నీవు దీప్యమానుడవు. హోమసాధక ద్రవ్యయుక్తులయ. మర్త్యులు నిన్ను స్తుతింతురు. నీవు చరాచర భూతగణములను ఎరుగుదువు. మేము నిన్ను స్తుతించుచున్నాము. నీ హవన సాధన హవ్యమును నిరంతరము వహింతువు.

2. సకల యజ్ఞములు అగ్నితోడనే సాగును. యజమానికి కీర్తి సంపాదక హవ్యము అగ్నివలననే ప్రాప్తించును. యజమాని కుశచ్ఛేదకుడు హవ్యదాత అగును. అగ్ని అతని యజ్ఞమునకు దేవతలను ఆహ్వానించును.

3. అగ్ని ఆహారాది పాకములద్వారా మానవులకు పోషకుడు అగుచున్నాడు. యజ్ఞములకు శోభనకర్త అగుచున్నాడు. అట్టి అగ్నిని అరణి ద్వయము శిశువునువలె కనుచున్నది.

4. అగ్నీ! కుటిలగతి సర్పము లేక వక్రగతి అశ్వ శిశువువలె నన్ను ధరించుట కష్టతరమగును. గడ్డి మధ్యన వదిలిన జంతువు గడ్డి మేసినట్లు నీవు అడవులనన్నింటిని దహింతువు.

5. ధూమవంతములగు అగ్ని శిలలు శోభాయమానములయి సర్వత్ర వ్యాపించును. కమ్మరి తిత్తి ద్వారా అగ్నిని ప్రజ్వరిల్ల చేసినట్లు మూడు స్థానములందు వ్యాపించిన అగ్ని స్వయముగా అంతరిక్ష దిశగా ప్రజ్వరిల్లును. తిత్తి ద్వారా కమ్మరి అగ్నిని తీక్ష్ణము చేసినట్లు అగ్ని హనాను తాను తీక్ష్ణతమము చేసికొనును.

అగ్నీ ! నీవు అందరి మిత్రుడవు. నీ రక్షణవలనను నిన్ను స్తుతించుట వలనను మానవులమగు మేము శత్రుభూతములగు పాపసాధక కర్మలనుండి ఉత్తీర్ణులము కావలెను.

అగ్నీ! నీవు బలమానుడవు. హవ్యవాహనుడవు. నీవు మా వద్దకు ప్రసిద్ధ ధనమునుకొని తెమ్ము. మా శత్రువులను పరాభూతులను చేయుము. మమ్ము పోషింపుము. మాకు అన్నము ప్రసాదించుము. యుద్ధమున మాకు సమృద్ధి కలుగు విధానము చూపుము.

## పదవ సూక్తము

ఋషి - ఆత్రేయగయుడు, దేవత-అగ్ని ఛందస్సు - 4, 7 పంక్తి, మిగిలినవి అనుష్టుప్.

1. అగ్నీ ! నీవు మా కొఱకు అతి ఉత్కృష్ట ధనమును సముపార్జించుము. నీ గతి అప్రతిహతము కావలెను. నీవు మాకు సర్వత్ర వ్యాపించిన ధనము ప్రసాదించుము. అన్న లాభమునకుగాను పథమును ఆవిష్కరించుము.

2. అగ్నీ ! నీవు అందరిని మించిన ఆశ్చర్యభూతుడవగుము. మేము చేయు యజ్ఞాది కార్యములకు ప్రసన్నుడవగుము. మాకు బలమునుగాని ధనమునుగాని ప్రసాదించుము. నీ బలము అసురులను నష్టపరచునట్టిదగును. నీవు సూర్యునివలె యజ్ఞకార్యమును నిర్వహింపుము.

3. అగ్నీ! ప్రసిద్ధ స్తవకారులగు మానవులు నిన్ను స్తుతించి గోధనాది లాభము పొందుదురు. మేము నిన్ను స్తుతించుచున్నాము. మా ధనమును, పుష్టిని వర్ధిల్లజేయుము.

4. ఆనందదాయకుడవగు అగ్నీ! సుందర స్తుతుల ద్వారా నిన్ను స్తుతించు వారు అశ్వ ధనమును పొందుదురు. తమ బలమున శత్రువులను ఓడింతురు. స్వర్గమును మించిన కీర్తిని ఆర్జింతురు.

అగ్నీ ! గయ ఋషి స్వయముగా నిన్ను జాగృతము చేయుచున్నాడు.

5. అగ్నీ! నీ కిరణములు అత్యంత ప్రగల్భములు. దీప్తివంతములు. అవిసర్వత్ర వ్యాప్త విద్యుత్తువలె శబ్దాయమాన రథమువలె అన్నార్థులవలె సర్వత్ర సంచరించును.

6. అగ్నీ ! నీవు త్వరగా మమ్ము రక్షింపుము. ధనము దానము చేయుము. దారిద్ర్యము తొలగింపుము. మా పుత్రులు, మిత్రులు నిన్ను స్తుతించి పరిపూర్ణ మనోరథులు కావలెను.

7. అంగిరా! పురాతన ఋషులు నిన్ను స్తుతించినారు. ఇప్పటి ఋషులును నిన్ను స్తుతించినారు. ఇప్పటి

ఋషులును నిన్ను స్తుతించుచున్నారు. ధనము మహా వ్యక్తులను సహితము లొంగదీయును. అట్టి ధనమును మా కొఱకు తెమ్ము.

8. దేవతల ఆహ్వానకారి అగ్నీ ! మేము నిన్ను స్తుతించుము. మాకు స్తుతి సామర్ధ్యము ప్రసాదించుము. యుద్ధమున మాకు సమృద్ధికలుగు విధానము ఏర్పరచుము.

## పదకొండవ సూక్తము

ఋషి ఆత్రేయసుతుడు భరుడు, దేవత-అగ్ని, ఛందస్సు-జగతి.

1. అగ్ని లోక రక్షకుడు. సదా ప్రవృద్ధుడు. అందరి ద్వారా శ్లాఘనీయుడు. బలశాలి. అతడు జనులకు నవశుభములు కలిగించుటకు ఆవిర్భవించినాడు. అగ్ని ఘృతము ద్వారా ప్రజ్వలితుడగును. తేజోయుక్తుడగును. పరిశుద్ధుడు అగును. ఋత్విక్కులకొఱకు ద్యుతిమంతుడగును. ప్రకాశవంతుడగును.

2. అగ్ని యజ్ఞమునకు కేతన స్వరూపుడు. ప్రజ్ఞాపకుడు. అగ్ని యజమానిచే సన్మానితుడగును. పురోభాగమున స్థాపించబడును. అగ్ని ఇంద్రాది దేవతల దర్శకుడు. ఋత్విక్కులు మూడు స్థానములందు అగ్నిని సమిద్ధము చేసినారు. శోభనకర్ముడు, దేవతల ఆహ్వానకారి అగ్ని కుశయుక్త స్థానమున యజ్ఞము కొఱకు ప్రతిష్ఠించబడినాడు.

3. అగ్నీ ! మాతృ స్వరూప అరణిద్వయము నుండి నీవు నిర్విఘ్నముగా ఆవిర్భవించినావు. నీవు పవిత్రుడవు. కవివి. మేధావివి. యజమానులద్వారా అవతరింతువు. పూర్వ మహర్షులు ఘృతము ద్వారా నిన్ను వర్ధిల్ల చేసినారు.

హవ్యవాహకా ! నీ అంతరిక్ష వ్యాపి ధూమము కేతన స్వరూపమగును. ప్రజ్ఞాపకమగును. అనుమాపకమగును.

5. అగ్నీ ! నిన్ను గూర్చిన స్తుతులు సుమధుర వాక్యప్రయుక్తములు. స్తుతులు నీ మనసునకు సుఖము కలిగించవలెను. మహానదులు సముద్రమును పూరించును. బలయుక్తములను చేయును. అట్లే స్తుతులు నిన్ను పూర్ణుని, బలశాలిని చేయును.

6. అగ్నీ! నీవు గుహామధ్యమున దాగినవాడవు. వనములను ఆశ్రయించి నిలిచినవాడవు. అంగిరులు నిన్ను ఆవిష్కరింప చేసినారు. నీవు విశేషబలమున మథించినపుడు పుట్టెదవు. అందుకే అందరు నిన్ను బలపుత్రుడందురు. "త్వమాహుఃసహస పుత్రమంగిరః"

## పన్నెండవ సూక్తము

ఋషి-ఆత్రేయ పుత్రుడు భరుడు, దేవత-అగ్ని, ఛందస్సు-త్రిష్టుప్.

1. అగ్ని సామర్థ్యాతిశయమున మహానుడు. యాగ యోగ్యుడు. జలవర్షకారి. బలశాలి. అభీష్టవర్షి. యజ్ఞమున అగ్నిముఖమున హుతమయిన పరమ పవిత్ర ఘృతమువలె స్తుతులు అగ్నికి ప్రీతికరములు కావలెను.

2. అగ్నీ ! మేము నిన్ను స్తుతించుచున్నాము. నీవు మా స్తుతులను అర్థము చేసికొనుము. ఆమోదింపుము. విశేష జలవర్షమునకు సమాయత్తమగుము. మేము యజ్ఞమున బలప్రయోగముచేసి విఘ్నములు కలిగించము. విధ్యుక్తముకాని వైదిక కార్యములందు ప్రవర్తించము. నీవు దీప్తిమంతుడవు. కోరికలు తీర్చువాడవు. మేము నిన్ను స్తుతించుచున్నాము.

3. అగ్నీ ! నీవు ఉదక వర్షకారకుడవు. స్తుతి యోగ్యుడవు. మేము చేయునట్టి ఎటువంటి సత్యకార్యము వలన నీవు మా స్తుతులను ఎరుగగలవు?

అగ్ని ఋతువుల రక్షకుడు. దీప్తిమంతుడు. అతడు మమ్ము తెలియవలెను. మేము అగ్ని భక్తులము. మా పశువులు మున్నగు ధనముల స్వామి అగ్నిని తెలియకున్నాము.

4. అగ్నీ ! ఎవడు శత్రువుల బంధనకారి? ఎవడు లోకరక్షకుడు?

అసత్యవాదుల ఆశ్రయదాత ఎవడు? దుష్టవచనుల ఉత్సాహకర్త ఎవరు?

(అగ్నిని ఆరాధించువారు అట్టివారు కారని అర్థము)

5. అగ్నీ! నీ బంధుగణము సర్వత్ర వ్యాపించి ఉన్నారు. వారు పూర్వము నీ ఉపాసనను త్యజించి కష్టముల పాలయినారు. తదుపరి మరల నిన్ను ఆరాధించి సౌభాగ్యవంతులయినారు. మేము సరళ భావమును ఆచరించువారము అయినను అసాధు భావమున మమ్ము కుటిలాచారుడు అన్నవాడు మాకు శత్రువయి తన అరిష్టమును తానేకొని తెచ్చుకొనును.

6. అగ్నీ! నీవు దీప్తిమంతుడవు. అభీష్టప్రదుడవు. నిన్ను హృదయ పూర్వకముగ స్తుతించువాడును. నీ కొఱకు యజ్ఞమును రక్షించువాడును విశాలగృహవంతుడగును. నీకు చక్కగా పరిచర్య చేయువానికి కోరికలు తీర్చగల పుత్రుడు కలుగును.

## పదమూడవ సూక్తము

ఋషి - ఆత్రేయ భరుడు - దేవత - అగ్ని ఛందస్సు - గాయత్రి

1. అగ్నీ! మేము నిన్ను పూజింతుము. ఆహ్వానింతుము. స్తుతింతుము. మా రక్షణకుగాను నిన్ను ప్రజ్వలితుని చేయుదుము.

2. అగ్ని దీప్తిమంతుడు. ఆకాశస్పర్శి. మేము ధనార్థులము. అగ్నిని గూర్చి పురుషార్థ సాధక స్తుతిని పఠింతుము.

3. అగ్ని మానవుల మధ్య నిలుచును. సాగును. దేవతలను ఆహ్వానించును. అట్టి అగ్ని మా స్తుతులను గ్రహించవలెను. యజ్ఞీయ ద్రవ్యజాతమును దేవతల సమక్షమునకు చేర్చవలెను.

4. అగ్నీ ! నీవు సర్వదా సంతోషివి. నీవు హోతవయి జనులకు వరణీయుడవయి బలవంతుడవగుదువు. నీ వలన యజమానులు యజ్ఞ సముపార్జకులగుదురు.

5. అగ్నీ ! నీవు అన్నదాతవు. స్తుతియోగ్యుడవు. మేధావులగు స్తోతలు విశిష్ట స్తుతుల ద్వారా నిన్ను వర్థిల్ల చేయుదురు. నీవు మాకు ఉత్కృష్ట బలమును ప్రసాదించుము.

6. అగ్నీ ! ఇరుసు చక్రమునందలి ఫలకములను త్రిప్పినట్లు నీవు దేవతలను వ్యాపింప చేసెదవు. నీవు మాకు నానా విధ ధనమును ప్రదానము చేయుము.

## పదునాలుగవ సూక్తము

ఋషి-ఆత్రేయసుతుడు భరుడు, దేవత-అగ్ని, ఛందస్సు-గాయత్రి.

1. యజమానీ ! నీవు అమరుడగు అగ్నిని స్తుతులద్వారా ప్రభోదితుని చేయుము. అగ్ని ప్రదీప్తుడయినపుడు అతడు దేవతలవద్దకు మన హవ్యమును చేర్చును.

2. అగ్ని దీప్తమానుడు. అమరుడు. మానవులకు పరమారాధ్యుడు. నరులు అగ్నిని యజ్ఞస్థలమున స్తుతింతురు.

3. యజ్ఞస్థలమున అనేకులు స్తోతలు ఘృతసిక్త స్రుక్ సహితులయి దేవతలవద్దకు హవ్యము చేర్చుమని అగ్నిని స్తుతించెదరు.

4. అగ్ని అరణి మధ్యమున ఆవిర్భవించినాడు. అతడు తన తేజః ప్రభావమున అంధకారము యజ్ఞవిఘాతక వస్తువులను నష్టపరచి ప్రజ్వరిల్లును. గోవులు, అగ్ని సూర్యుడు అగ్ని నుండియే పుట్టినారు.

5. అగ్ని జ్ఞాని. ఆరాధ్యుడు. ఊర్ధ్వభాగమున ఘృతాహుతి ద్వారా ప్రదీప్తుడగువాడు. నరులారా! అట్టి అగ్నిని పూజించుడు. అగ్ని మా ఆహ్వానమును ఆలకించవలెను తెలియవలెను.

6. ఋత్విక్కులు ఘృతము, స్తోమము ద్వారా స్తుత్యభిలాషులు, ద్యానగమ్యులగు దేవతల సహితముగా సర్వదర్శి అగ్నిని, సంవర్ధితుని చేయుదురు.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగవ అష్టకము, ఐదవ మండలమున మొదటి అధ్యాయమున మొదటి అనువాకము సమాప్తము)

**రెండవ అనువాకము పదిహేనవ సూక్తము**

ఋషి - అంగీరస ధరణుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్ని బలశాలి. సుఖస్వరూపుడు. ధనాధిపతి. హవ్యవాహకుడు. గృహదాత. విధాత. క్రాంతదర్శి. స్తుతియోగ్యుడు. యశస్వి. శ్రేష్ఠుడు. హవిస్స్వరూప ఘృతమున అగ్ని ప్రసన్నుడగును. అట్టి అగ్నిని మేము స్తుతింతుము. ప్రణమిల్లుదుము.

2. యజమానులు - ద్యులోకధారకులు, యజ్ఞస్థల ఆసీనులు నేతృ దేవతలను ఋత్విక్కులద్వారా పొందుదురు. ఆ యజమానులు యజ్ఞధారకుడు, సత్యస్వరూపుడగు అగ్నిని యజ్ఞమునకుగాను ఉత్తమ స్థానమగు వేదికమీద స్తుతుల ద్వారా ప్రతిష్ఠింతురు.

3. పముఖ అగ్నికి రాక్షసులకు దుష్ప్రాప్యమగు హవి స్వరూప అన్నమును ప్రదానము చేయు యజమాని పాప విముక్తుడు అగును. నవజాత అగ్ని సింహమువలె శత్రువుపై లంఘించును. శత్రువును దూరము చేయును. సర్వత్ర వసించుశత్రువు నన్ను వదిలి దూరము జరుగవలెను.

4. అగ్ని సర్వత్ర ప్రఖ్యాతుడు. తల్లివలె సమస్త జనులను దరి చేర్చుకొనును. తమను పోషించుమని దర్శనమిమ్మని జనులెల్లరు అగ్నిని ప్రార్థింతురు. అగ్ని ధరించువాడయినపుడు సకల అన్నములను జీర్ణము చేయును. అగ్ని నానారూపుడయి సర్వభూత జాతములందు చేరును.

5. అగ్ని ద్యుతిమంతుడు. బలమైన కోర్కెలు తీర్చగలవాడు. హవిర్లక్షణ అన్నము అతని సంపూర్ణ బలమును రక్షించవలెను. దొంగ, ఇంటి నడుమ దాగి, దొంగిలించిన సొమ్మును కాపాడినట్లు అగ్నీ ! నీవు అనంత ధనలాభమునకుగాను సన్మార్గమును ప్రకాశితము చేయుము. అత్రిమునిని ప్రీతుని చేయుము.

## పదహారవ సూక్తము

ఋషి - ఆత్రేయ పురోరుడు, దేవత - అగ్ని ఛందస్సు చివరిది పంక్తి, మిగిలినవి అనుష్టుప్.

1. అగ్ని స్నేహ స్వరూపుడు. మానవులు విశిష్ట స్తుతుల ద్వారా అగ్నిని స్తుతింతురు. పురోభాగమున స్థాపింతురు. ద్యుతిమంతుడగు అగ్నికి హవిర్లక్షణ అన్నము సమర్పింతురు.

2. అగ్ని దేవతలకు హవ్యము వహించును. అతడు బాహుబల ద్యుతియుక్తుడు. అట్టి అగ్ని యజమానుల కొఱకు దేవతలను ఆహ్వానించును.

అగ్ని సూర్యునివలె నరులకు విశేషరూపమున వరణీయ ధనమున ప్రసాదించును.

3. ఋత్విక్కులు హవ్యము, స్తోత్రములద్వారా అగ్నిని చక్కగా పూజించి బలవర్ధకుని చేయుదురు. మేము అతనినే ప్రవృద్ధ తేజోవంతుని, ధనస్వామియగు అగ్నిని స్తుతింతుము. మేము అతని స్నేహము కోరుదుము.

4. అగ్నీ ! మేము యజమానులము. నీవు మాకు ఎల్లరు వాంఛించు బలమును ప్రసాదించుము. ద్యావాపృథ్వులు సూర్యునివలె శ్రవణీయ అగ్నిని పరిగ్రహించినారు.

5. అగ్నీ ! మేము యజమానులము. నిన్ను స్తుతించుచున్నాము. నీవు త్వరత్వరగా మా యజ్ఞమునకు విచ్చేయుము. మా కొఱకు వరణీయ ధనమును సముపార్జించుము. మమ్ము యుద్ధమున సమృద్ధియుక్తులను చేయుము.

## పదిహేడవ సూక్తము

ఋషి-ఆత్రేయ పురోరుడు, దేవత-అగ్ని, ఛందస్సు-చివరిది పంక్తి. మిగిలినవి అనుష్టుప్.

1. అగ్ని స్వతేజమున ప్రవృద్ధుడు. ఋత్విక్కులు స్తోత్రములద్వార సంతృప్తుని చేయుటకు అగ్నిని ఆహ్వానింతురు. నరులగు స్తోతలు యజ్ఞకాలమున రక్షణకుగాను అగ్నిని స్తుతింతురు.

2. ధర్మవిశిష్టస్తోతా ! నీ యశస్సు సర్వశ్రేష్ఠము కావలెను. నీవు వర్ధమానుడవయి దుఃఖము ఎరుగని, తేజోవిశిష్టుడగు అగ్నిని, స్తుతియోగ్యుని సద్వచనముల స్తుతింతువు.

3. అగ్ని జగద్రక్షక బలయుక్తుడు. స్తుతియుక్తుడు. సూర్యునివలె ద్యుతిమంతుడు. అతని కాంతి జగత్ వ్యాప్తము.

అతనివలననే సకలదీప్తులు ప్రకాశవంతములగును. అట్టి మహాగ్ని ప్రభాజ్యోతులతోనే ఆదిత్యుడు వెలుగుచున్నాడు.

4. చక్కని మతిగల ఋత్విక్కులు దర్శనీయ అగ్నిని యజించి ధనమును, రథమును పొందుదురు. యజ్ఞార్థము ఆహూతుడగు అగ్ని పుట్టగానే సమస్తజనులచే స్తుతించబడును.

5. అగ్నీ ! స్తోతలు నిన్ను స్తుతించి పొందునట్టి వరణీయ ధనమును ఆలస్యము చేయక మాకు ప్రదానము చేయుము. మాకు అభిలషిత అన్నము అందించుము. మమ్ము రక్షింపుము. మేము మంగళకరములగు పశ్వాదులను యాచించుచున్నాము. సంగ్రామమునందు మా సమృద్ధికిగాను అగ్నీ ! నీవు ఉపస్థితుడవగుము.

## పద్దెనిమిదవ సూక్తము

ఋషి-ఆత్రేయ ద్వితుడు, దేవత-అగ్ని ఛందస్సు-చివరిది పంక్తి. మిగిలినవి అనుష్టుప్.

1. అగ్ని బహుప్రియుడు. యజమానులకు ధనదాత. వారి ఇండ్లయందు ఉండువాడు. అగ్ని ప్రాతఃకాలమున స్తుతుడగును. అమరుడగు అగ్ని యజమానుల మధ్యనున్న సకల హవ్యములను వాంఛించును.

2. అగ్నీ ! అత్రిపుత్రుడు ద్వితుడు సర్వకాలములందు నీకొఱకు సోమము సిద్ధపరచును. నిన్ను స్తుతించును. విశుద్ధ హవ్యముల వహించును. అందువలన అతనికి నీ బలమును ప్రదానము చేయుము.

3. అగ్నీ ! నీవు అశ్వదాతవు. దీర్ఘగమనుడవు. దీప్తిమంతుడవు. ధనికుల కొఱకుగాను మేము స్తోత్రముల ద్వారా నిన్ను ఆహ్వానించుచున్నాము. అందువలన ధనికుల రథము శత్రువుల ద్వారా అహింసితమయి యుద్ధమునకు సాగవలెను.

4. ఋత్విక్కులద్వారా యజ్ఞవిషయక నానావిధ యజ్ఞకార్యము సముపార్జించబడును. వారు ఉచ్ఛారణల ద్వారా స్తోత్రములను రక్షింతురు. అట్టి ఋత్విక్కులు యజమానులకు స్వర్గ ప్రాపకమగు యజ్ఞమున విశాల కుశాసనమున అన్నమును స్థాపింతురు.

5. అమర అగ్నీ ! నిన్ను స్తుతించినంత నాకు ఏబది అశ్వములు దానము చేసిన ధనికునకు దీప్త శీల పరిచారకయుక్త మహాన్నమును ప్రసాదించుము.

## పందొమ్మిదవ సూక్తము

ఋషి-ఆత్రేయ వర్వి, దేవత-అగ్ని  ఛందస్సు 1-2 గాయత్రి, 3-4 అనుష్టుప్ 5 విరాట్.

1. భూమాత వద్ద నిలిచి పదార్థజాతములను చూచునట్టి అగ్ని వర్వి ఋషి అశోభన దశను ఎరుగవలెను. అతని హవ్యమును గ్రహించి, అతనిని ఉద్ధరించవలెను.

2. అగ్నీ ! నీ ప్రభావమును ఎరిగిన జనులు యజ్ఞము కొఱకుగాను నిన్ను సదా ఆహ్వానింతురు. హవియు, స్తుతులద్వారా నీ బలమును కాపాడుదురు. అట్టివారు శత్రువునకు అగమ్యములగు పురములందు ప్రవేశింతురు.

3. మహా స్తుతులు చేయువారు అన్నాభిలాషులు స్వర్ణాలంకార భూషణలు ఉత్పన్నశీలురగు ఋత్విక్కులు స్తోత్రములద్వారా అంతరిక్షవర్తి వైద్యుతాగ్నియొక్క దీప్తిమంతమగు బలమును వర్ధిల్ల చేయుదురు.

4. పాలు కలిపిన హవ్యమువలె ఏ అగ్ని జఠరమున అన్నము ఉన్నది. ఎవడు స్వయం శత్రువుల ద్వారా అహింసకుడయి శత్రువులను హింసించునో ద్యావాపృథ్వులకు సహాయభూతుడగు ఆ అగ్నియే కమనీయుడు, నిర్దోషియయి మా స్తోత్రమును ఆలకించవలెను.

5. ప్రదీప్తుడవగు అగ్నీ ! నీవు వనములను భస్మము చేసిక్రీడింతువు. వాయు ప్రేరకుడవయి మనోహరుడవయి మా ముందునకు విచ్చేయుము. శత్రునాశకములగు నీయొక్క తీవ్రజ్వాలలు మా వద్ద సుకోమలములు కావలెను.

## ఇరువదవ సూక్తము

ఋషి-ఆత్రేయ ప్రయస్వతుడు, దేవత-అగ్ని ఛందస్సు - చివరిది పంక్తీ. మిగిలినవి అనుష్టుప్.

1. అగ్నీ ! నీవు అత్యంత అన్న ప్రదుడవు. మేము నీకు హవిరూప అన్నము సమర్పింతుము. అది నీకు ఇష్టమగును. మా స్తుతుల సహితముగా ఆ హవ్యధనమును దేవతలకు చేర్చుము.

2. అగ్నీ ! పశువులు మున్నగు ధనముగలవాడై నీకు హవ్యప్రదానము చేయునట్టి వ్యక్తి అన్నహీనుడు, బలహీనుడు అగును. వేదభిన్నములగు అన్యకార్యములు చేయువాడు అసురుడు అగును. అతనిని నీవు హింసింతువు.

3. అగ్నీ ! నీవు దేవతల ఆహ్వాతవు. బలముల సాధకుడవు. అన్నవంతులమగు మేము నిన్ను కోరుకుందుము. యజ్ఞమునందు శ్రేష్ఠ అగ్నిని స్తుతిరూప వచనములతో భజింతుము.

4. బలశాలివగు అగ్నీ ! నిత్యము నీ రక్షణలు కలుగునట్లు చేయుము. మాకు ధనలాభము కలుగునట్లును, మేము యజ్ఞము చేయగలుగునట్లును చేయుము. మాకు ఆవులు కలుగునట్లును, పుత్రులు కలిగి సుఖించునట్లును సేయుము.

## ఇరువది ఒకటవ సూక్తము

ఋషి-ఆత్రేయ పసుసు, దేవత-అగ్ని ,ఛందస్సు అనుష్టుప్. చివరిది ఫంక్తి.

1. అగ్నీ ! మనువువలె మేము నిన్ను స్థాపింతుము. జ్వలింపచేతుము. అంగిరాత్మక అగ్నీ ! దేవాభిలాషులగు మానవ యజమానులకొఱకు నీవు దేవతలను యజింపుము.

2. అగ్నీ ! నీవు స్తోత్రముల ద్వారా సుప్రీతుడవు అగుదువు. నరుల కొఱకు ప్రదీప్తుడవగుదువు. ఘృతయుక్తాన్న హవ్యవిశిష్టపాత్ర నీకు నిత్యము లభించుచుండును.

3. క్రాన్తదర్శివగు అగ్నీ ! ప్రసన్నులయిన సకల దేవతలు నిన్ను వారి దూతను చేసినారు. అందువలననే పరిచర్య చేయు యజమానులు యజ్ఞములందు దేవతలను ఆహ్వానించుటకు నిన్ను యజింతురు.

4. దీప్తిశాలివగు అగ్నీ ! మానవులు దేవ యజ్ఞమునకుగాను నిన్ను స్తుతింతురు. హవిద్వారా ప్రవృద్ధుడవయి ప్రజ్వరిల్లుము. నీవు సత్యభూత ససఋషియొక్క యజ్ఞ, సాధన స్థలమున దేవరూపమున నిలువుము.

## ఇరువది రెండవ సూక్తము

ఋషి-ఆత్రేయ విశ్వపాముడు, దేవత-అగ్ని ఛందస్సు-అనుష్టుప్ చివరిది పంక్తి.

1. అగ్ని ! యజ్ఞమున సకల ఋత్విక్కులకు స్తోతవ్యుడు. దేవతల ఆహ్వాత. అత్యంత స్తవనీయుడు. విశ్వసామ ఋషీ ! నీవు అత్రివలె దీప్తివంతుడగు అగ్నిని అర్చింపుము.

2. అగ్ని జాతవేది. ద్యుతిమంతుడు. యజ్ఞకారకుడు. యజమానులారా ! అట్టి అగ్నిని వహించుడు స్థాపించుడు. దేవతలకు ప్రియమయినది. యజ్ఞసాధకమగు మేము అందించు హవ్యము అగ్నికి అందవలెను.

3. అగ్నీ ! నీవు దీప్తిశాలివి. నీ హృదయము జ్ఞానసంపన్నము. మా రక్షణకుగాను మేము నీ దరికి చేరినాము. మేము మానవులము. అగ్ని మాకు అర్చనీయుడు. అగ్నికి తృప్తిపరచుటకు మేము అతనిని స్తుతింతుము.

4. అగ్నీ ! నీవు బలపుత్రుడవు. సుందర హను నాసికలు గలవాడవు. గృహపతివి. నీవు మా ఈ పరిచారకస్తవమును గ్రహించుము. అత్రిపుత్రులు స్తోత్రమున నిన్ను వర్ధిల్లచేయుదురు. వచనములతో అలంకరింతురు.

## ఇరువది మూడవ సూక్తము

ఋషి - ద్యుమ్నుడు, దేవత-అగ్ని, ఛందస్సు-అనుష్టుప్, చివరిది పంక్తి

1. అగ్నీ ! నేను ద్యుమ్న ఋషిని. బలవంతుడగు శత్రువును జయించు పుత్రుని నాకు ప్రసాదింపుము. ఆ పుత్రుడు స్తోత్రయుక్తుడయి సంగ్రామమున సమస్త శత్రువులను పరాభూతులను చేయవలెను.

2. అగ్నీ ! నీవు బలశాలివి. సత్యభూతుడవు. అద్భుతుడవు. గోయుక్తుడవు. అన్నదాతవు. నీవు మాకు ఒక పుత్రుని ప్రసాదించుము. అతడు సేనలను పరాభూతులను చేయు సమర్థుడు కావలెను.

3. అగ్నీ ! నీవు దేవతల ఆహ్వాతవు. సకల జనులకు ప్రియంకరుడవు. సమాన ప్రీతిగలవారు. కుశచ్ఛేదులగు అఖిల ఋత్విగ్గణములు యజ్ఞగృహమున నిన్ను బహువిధ వరణీయ ధనమును యాచింతురు.

4. అగ్నీ ! లోక ప్రసిద్ధ విశ్వచర్షణ ఋషికి శత్రువులను హింసించు బలము కలుగవలెను. ద్యుతిమాన్ ! నీవు మా ఇంట ద్యుతిమంతుడవయి ప్రకాశించుము. పాపపరిహారక అగ్నీ ! నీవు ద్యుతియుక్తుడవు, యశోయుక్తుడవగుము. దేదీప్యమానుడవగుము.

## ఇరువది నాలుగవ సూక్తము

ఋషి - బంధు, శుబంధు, శ్రుతబంధు, విప్రబంధులను నలుగురు ఋషులు; లేదా గౌపాయన తాపాయనులు, దేవత-అగ్ని, ఛందస్సు-ద్విపద విరాట్

1.2 అగ్నీ ! నీవు పూజనీయుడవు. రక్షకుడవు. సుఖంకరుడవు. గృహదాతవు. అన్నదాతవు. నీవు మాకు దగ్గరివాడవగుము. అనుకూలుడవగుము. అతిశయదీప్తిశీల పశుస్వరూపధనమును ప్రసాదించుము.

3.4 అగ్నీ ! నీవు మమ్ము గ్రహించుము. మా ఆహ్వానములను ఆలకించుము. సమస్త పాపాచారునుండి మమ్ము రక్షింపుము. స్వతేజమున ప్రకాశించు అగ్నీ ! మేము సుఖములకొఱకును, పుత్రుల కొఱకును నిన్ను యాచించుచున్నాము.

## ఇరువది అయిదవ సూక్తము

ఋషి-ఆత్రేయ వసుయులు, దేవత-అగ్ని, ఛందస్సు-అనుష్టుప్.

1. వసుయు ఋషులారా ! మీ రక్షణ కొఱకు అగ్నిని స్తుతించుడును అగ్నిహోత్రమునకుగాను యజమానుల ఇండ్లయందుండు అగ్ని మా కోరికలు తీర్చవలెను. ఋషి పుత్రుడు, సత్యవంతుడగు అగ్ని మమ్ము శత్రువులనుండి రక్షించవలెను.

2. అగ్ని పూర్వపు ఋషులవలనను దేవతలవలనను సందీప్తుడయినాడు. ఆ అగ్ని మోదన జిహ్వుడు, శోభన దీప్తియుక్తుడు, అతిశయ ప్రభావానుడు, దేవతల ఆహ్వాత, సత్యప్రతిజ్ఞుడు అగును.

3. అగ్నీ ! నీవు స్తుతుల ద్వారా స్తూయమానుడవు. మేము అతిశయ ప్రశస్తము, అత్యంత శ్రేష్ఠమగు పరిచర్యలు చేయుదుము. స్తుతింతుము. నీవు ప్రసన్నుడవగుము. మాకు ధన దానము చేయుము.

4. అగ్ని దేవతల మధ్య దేవతా స్వరూపమున ప్రకాశించును. మానవుల మధ్య ఆహవనీయ రూపమున ప్రవేశించును. యజ్ఞములందు దేవతలకు హవ్యము వహించును. యజమానులారా ! స్తుతులద్వారా మీరు అట్టి అగ్నికి పరిచర్యలు చేయుడు.

5. హవి సమర్పించు యజమానులకు - అగ్ని - పుత్రుని ప్రసాదించవలెను. ఆ పుత్రుడు బహువిధ అన్నయుక్తుడు, బహుస్తోత్రవంతుడు, ఉత్తముడు, శత్రువులద్వారా అహింసితుడు, తన కర్మలతో పితాప్రపితామహాదుల యశస్సును ప్రఖ్యాతము చేయువాడు కావలెను.

6. అగ్నీ ! నీవు మాకు పుత్రుని ప్రసాదించుము. అతడు సత్యపాలకుడు. బంధుజనులను అభిమానించువాడు. యుద్ధమున శత్రువును పరాభవించగలవాడు కావలెను. అట్లే అగ్నీ ! వేగవంతము, శత్రుపరాజయకారకమగు అశ్వమును ప్రసాదించుము.

7. శ్రేష్ఠతమ స్తోత్రములన్నియు అగ్నికొఱకే రచించబడును. తేజోధనుడవగు అగ్నీ ! మాకు బహుళ ధనమును ప్రదానము చేయుము. ఎందుకనగా నీ వద్ద నుండియే మహాధనములు ఉత్పన్నములయినవి. నిఖిల అన్నములు ఉత్పన్నములయినవి.

8. అగ్నీ ! నీ శిఖలు దీప్తిమంతములు. నీవు సోమలతా పోషక శిలవలె మహామహుడవనబడుచున్నావు. నీవు ద్యుతిమంతుడవు. నీ శబ్దము మేఘ గర్జనవలె ద్యుతిమంతమయి వ్యాపించును.

9. మేము వసుయు గణములము. బలశాలియగు అగ్నిని స్తుతించుచున్నాము. పడవద్వారా నదిని దాటించినట్లు శోభనకర్ముడగు అగ్ని మమ్ము సకల శత్రువుల నుండి ఉత్తీర్ణులను చేయవలెను.

## ఇరువది ఆరవ సూక్తము

ఋషి-ఆత్రేయ వసుయులు, దేవత-అగ్ని, ఛందస్సు-గాయత్రి.

1. అగ్నీ ! నీవు శోధకుడవు. ద్యుతిమంతుడవు. నీ దీప్తిచేతను, దేవతలను ప్రహృష్టము చేయు జిహ్వాచేతను యజ్ఞమునకు దేవతలను ఆహ్వానించుము. పూజించుము.

2. అగ్నీ ! నీవు ఘృతోత్పన్నుడవు. బహువిధ కిరణవంతుడవు. సర్వద్రష్టవు. హవ్యభక్షణకుగాను దేవతలను తీసికొని రావలసినదిగా నిన్ను యాచించుచున్నాము.

3. అగ్నీ ! నీవు క్రాంతదర్శివి. హవ్యభక్షణశీలుడవు. దీప్తిమంతుడవు. మహామహుడవు. మేము నిన్ను యజ్ఞ స్థలమున ప్రజ్వలింప చేసెదము.

4. అగ్నీ ! నీవు దేవతల ఆహ్వాతవు. హవ్యదాత యజమాని యజ్ఞమునకు దేవతలందరి సహితుడవయి విచ్చేయుమని నిన్ను ప్రార్థించుచున్నాము.

5. అగ్నీ ! యజ్ఞము చేయు యజమానికి నీవు శోభన బలమును ప్రసాదించుము. దేవతలతో కూడ కుశలమీద ఆసీనుడవగుము.

6. వేలమందిని గెలువగల అగ్నీ! హవిద్వారా ప్రజ్వలితుడవయి, ప్రశస్తమానుడవయి, దేవదూతమయి మా యజ్ఞకర్మమును పోషించుము.

7. అగ్ని భూతజాతములను తెలిసినవాడు. యజ్ఞప్రాపకుడు. యువతముడు. ఋత్విక్కు యజమానులారా! మీరు అట్టి అగ్నిని స్థాపించుడు.

8. ప్రకాశమానులగు స్తోతల సమర్పించిన హవిరన్నము నేడు నిరంతరము దేవతలకు అందవలెను. ఋత్విక్కులారా ! కుశలు పరచుడు. అగ్నిని ఆసీనుని చేయుడు.

9. మరుద్గణములు, దేవవైద్యులు అశ్వినులు, సూర్యుడు, వరుణాది దేవతలు తమ తమ పరిజన సహితులయి కుశలమీద ఆసీనులు కావలెను.

## ఇరువది ఏడవ సూక్తము

ఋషి - త్రివృష్ణ పుత్రుడు త్రయారుణుడు, పురుకుత్సుని సుతుడు త్రసదస్యుడు, భారత పుత్రుడు అశ్వమేధుడు, వీరు

రాజులు కావచ్చును. దేవత- ఇంద్రాగ్నులు ఛందస్సు-1-3 త్రిష్టుప్, 4-6 అనుష్టుప్.

1. అగ్నీ ! నీవు మానవులనేతవు. సాధువుల పాలకుడవు. జ్ఞానసంపన్నుడవు. ధనవంతుడవు. బలవంతుడవు. త్రివృష్ణపుత్రుడగు త్రియారుణుడను రాజర్షి నాకు రెండెద్దులబండి పదివేల సువర్ణములు దానముచేసి ప్రఖ్యాతుడు అయినాడు.

2. త్రయారుణుడు నాకు నూరు సువర్ణములు. ఇరువది గోవులు, రథము వాటి భారము వహించుటకు రెండు అశ్వములు ఇచ్చినాడు.

వైశ్వానరాగ్నీ! మా స్తుతులు హవితో వర్తమానుడవయి త్రయారుణునకు సుఖములు ప్రసాదించుము.

3. అగ్నీ ! మేము బహుసంతానవంతులము. మా స్తుతులకు ప్రసన్నుడవగుము. త్రయారుణుడు మాతో "ఇది గ్రహించుము. అది గ్రహించుము" అన్నాడు. అట్లే నీ స్తుతులను నిత్యముకోరు త్రసదస్యుడు కూడా మమ్ము "ఇది గ్రహించుము అది గ్రహించుము" అని ప్రార్థించినాడు.

4. అగ్నీ ! ఎవడేని యాచకుడు నిన్ను స్తుతించి ధనదాత రాజర్షి 'అశ్వమేధుని' వద్ద కేగి ధనము ఇమ్మని యాచించిన ఆ రాజర్షి యాచకునకు ధనము దానము చేయును. యజ్ఞేచ్ఛగల అశ్వమేధునకు నీవు యజ్ఞము చేయు బుద్ధిని ప్రసాదింపుము.

5. రాజర్షి అశ్వమేధుడు కోరికలు తీర్చువాడు. అతడు దానము చేసిన నూరు ఎద్దులు మమ్ము ఎంతో సంతోషపరచినవి. అగ్నీ ! పెరుగు, సత్తు, పాలు కలిసిన సోమమువలె ఆ ఎద్దులు నిన్ను ప్రీతుని చేయవలెను.

6. ఇంద్రాగ్నులారా ! యాచకులకు అపరిమిత ధనమున దానముచేయు రాజర్షి అశ్వమేధునకు అంతరిక్ష స్థిత సూర్యునివలె శోభనబలము, జరారహిత ధనమును ప్రసాదించుడు.

## ఇరువది ఎనిమిదవ సూక్తము

ఋషి-ఆత్రేయీ విశ్వవారా ఋషికి మహిళ, దేవత-అగ్ని ఛందస్సు
1-3 త్రిష్టుప్, 2 జగతి - 4 అనుష్టుప్ - 5-6 గాయత్రి.

1. చక్కగా వెలుగొందునట్టి అగ్ని ద్యుతిమంతమగు అంతరిక్షమున వెలుగులు వెదజల్లును. అగ్ని ఉష ఎదుట విస్తరించి శోభాన్వితుడగును. 'విశ్వవారా' ఇంద్రాది దేవతలను స్తుతించుచు, పురోడాశాది యుక్త స్రుక్కును గ్రహించి పూర్వదిశా ముఖియయి అగ్నికి అభిముఖముగ సాగును.

2. అగ్నీ ! నీవు చక్కగా ప్రజ్వరిల్లుదువు. జలములపై ప్రభుత్వము సాగింతువు. హవ్యదాత యజమాని తనకు శుభములు కలుగుటకు నిన్ను స్తుతించును. ఏ యజమాని వద్దకు నీవు చేరుదువో, అతడు పశువులు మున్నగు సమస్త ధనములు కలవాడగును.

3. అగ్నీ ! మాకు ప్రభూత ఐశ్వర్యము. శోభన ధనము కలుగుటకుగాను శత్రువులను పరిమార్చుము. నీ ధన తేజములు ఉత్కృష్టములు.

అగ్నీ ! నీవు దాంపత్య కార్యమును చక్కగా నియమితము చేయుము. శత్రువులను నీ తేజమును ఆక్రమింపుము.

4. అగ్నీ ! నీవు కోరికలు తీర్చువాడవు. ధనవంతుడవు. యజ్ఞస్థలమున దీప్తుడవు. నీవు ప్రజ్వలితుడవయి, దీప్తివంతుడవయినపుడు యజమానులమగు మేము నీ దీప్తిని స్తుతింతుము.

5. అగ్నీ ! నీవు హవ్యవాహకుడవు. యజమానుల ఆహూతుడవు. శోభన యజ్ఞవంతుడవు. నీవు చక్కగా ప్రజ్వరిల్లి ఇంద్రాది దేవతలను యజింపుము.

6. ఋత్విక్కులారా ! మీరు యజ్ఞమున ఉపస్థితులుకండు. హవ్యవాహక అగ్నిలో హవనము చేయుడు. అగ్నికి పరిచర్యలు చేయుడు. భజించుడు. దేవతలకు హవ్యము వహించుటకు అగ్నిని వరించుడు.

## ఇరువది తొమ్మిదవ సూక్తము

ఋషి-శక్తిగోత్ర గౌరవీతి, దేవత-ఇంద్రుడు, ఛందస్సు-త్రిష్టుప్.

1. మను సంబంధ యజ్ఞమున ఉన్న మూడు తేజములను అంతరిక్షమున ఉన్న రోచమానమగు వాయు, అగ్ని, సూర్యాత్మక తేజములను మరుత్తులు ధరింతురు.

ఇంద్రా ! మంచి బలముగల మరుద్గణములు నిన్ను స్తుతించును. నీవు బుద్ధిమంతుడవు. మరుత్తులను కనిపెట్టియుండుము.

2. ఇంద్రుడు అభిషుత సోమరసమును తృప్తిగా పానము చేసినాడు. అప్పుడు మరుత్తులు ఇంద్రుని స్తుతించినారు. ఇంద్రుడు వారి స్తుతులు విన్నాడు. వజ్రము ధరించినాడు. వృత్రుని పరిమార్చినాడు. వృత్రుడు నిరోధించిన మహాజలరాశిని విముక్తము చేసినాడు. స్వేచ్ఛ ఇచ్చినాడు.

3. మహా మరుత్తులారా ! మీరు ఇంద్ర సహితులయి విచ్చేయండి. మేము సిద్ధము చేసిన అభిషుత సోమమును స్వీకరించండి. మీరు సోమాత్మక హవ్యము. స్వీకరించినందున యజమానికి గోలాభము కలుగును. ఈ సోమరసమును పానము చేసియే ఇంద్రుడు వృత్రుని వధించినాడు.

4. ఇంద్రుడు సోమపానము చేసి ద్యావాపృథ్వులను నిశ్చలము చేసినాడు. ఇంద్రుడు గమనశీలుడు అయినాడు. వృత్రుడు భయభీతుడయి పారిపోయినాడు. వృత్రుడు దాగినాడు. అతనికి ఊపిరి ఆడలేదు. అట్టి వృత్రుని ఇంద్రుడు ఆచ్ఛాదన విహీనుని చేసి కూల్చినాడు.

5. ఇంద్రా ! నీవు ధనశాలివి. నీవు అద్భుత కార్యము చేసినావు. అందుకుగాను అగ్ని మున్నగు దేవతలు ఒక్కొక్కరు నీకు సోమరసము అందించినారు. నీవు 'ఏతశు' ని కొఱకు సూర్యుని అశ్వములను నిలిపినావు.

6. ధనవంతుడగు ఇంద్రుడు శంబరుని తొంబది నగరములను ఏకకాలమున ధ్వంసము చేసినాడు. అప్పుడు యుద్ధభూమియందే మరుత్తులు త్రిష్టుప్ ఛందమున ఇంద్రుని స్తుతించినారు. అట్లు మరుత్తుల మంత్రములద్వారా స్తుతుడయి, దీప్తుడయిన ఇంద్రుడు శంబరుని పీడించినాడు.

7. అగ్ని ఇంద్రునకు మిత్రుడు. మిత్రుడగు ఇంద్రుని కార్యమునకుగాను అగ్ని మూడు వందల మహిషములను అతి త్వరగా వండినాడు.

ఇంద్రుడు పరమైశ్వర్యయుక్తుడు. వృత్రుని వధించుటకుగాను మనుసంబంధమగు మూడు పాత్రలలో ఉన్న సోమమును ఒకేసారి త్రాగినాడు.

8. ఇంద్రా ! నీవు మూడువందల మహిషముల మాంసమును భక్షించినావు. మూడు పాత్రలలో ఉన్న సోమరసము త్రావినావు. అప్పుడు నీవు వృత్రుని వధించినావు. అంతట దాసులు స్వామిని ఆహ్వానించినట్లు దేవతలందరు యుద్ధమునకుగాను సోమపాన పూర్ణుడగు ఇంద్రుని ఆహ్వానించినారు.

9. ఇంద్రా ! నీవు, కవి వేగవంతములగు అశ్వములమీద కుత్సుని గృహమునకు చేరినపుడు శత్రువులను హింసించినావు. అప్పుడు నీవు ఇతర దేవతల సహితముగా ఒకే రథము మీద ఎక్కినావు. ఇంద్రా ! శుష్ణాసురుని నీవు వధించినావు.

10. ఇంద్రా ! నీవు ముందే సూర్యుని రెండు చక్రములలో ఒకదానిని వేరు చేసినావు. మరొక చక్రమును ధనలాభమునకుగాను కుత్సునికి ఇచ్చినావు. నీవు శబ్ద రహిత అసురులను హతబుద్ధులను చేసినావు. వజ్రముతో సంగ్రామమున వారిని హతమార్చినావు.

11. ఇంద్రా ! గౌరివీత ఋషి స్తోత్రము నిన్ను వర్ధిల్ల చేయును. విదథి పుత్రుడు ఋఖిశ్వుని కొఱకు పిప్రనామక అసురుని వశీభూతుని చేసుకున్నావు. ఋజశ్వృషి నీతో స్నేహము చేయుటకుగాను పురోడాశాదులను వండి నీకు సమర్పించినాడు. నీవు ఋజశ్వుని సోమరసమును పావము చేసినావు.

12. తొమ్మిది నెలలకు పూర్తిఅగునదియు, పదినెలలకు పూర్తిఅగునదియునగు యజ్ఞములనుచేయు అంగిరులు సోమాభిషవముచేసి, అర్చనీయ స్తోత్రముల ద్వారా ఇంద్రుని స్తుతించినారు. ఇంద్రుని స్తుతించు అంగిరులు అసురులు దాచి ఉంచిన గోసమూహములను విడిపించినారు.

13. ధనవంతుడవగు ఇంద్రా ! నీవు చేసిన పరాక్రమ కార్యములన్నియు మాకు తెలియును. కాని దానిని ఎట్లు ప్రకటించవలెనో, ఎట్లు స్తుతించవలెనో తెలియకున్నది.

బలవంతుడవగు ఇంద్రా ! నీవు కొత్తగా పరాక్రమమును ప్రదర్శించినపుడు యజ్ఞమున నీ అట్టి పరాక్రమమును కీర్తింతుము.

14. ఇంద్రా ! నిన్ను శత్రువులు ఎదిరించజాలరు. నీవు నీ ప్రకృతి సిద్ధ బలమున ప్రత్యక్ష దృశ్యమానములగు అనేక భువనజాతములను సృష్టించినావు.

వజ్రధరా ! శత్రువును శీఘ్రముగా నష్టపరచుటకు నీవు చేయు కార్యమును, నీ అసమాన బలమును ఎంతటివాడును నివారింపజాలడు.

15. ఇంద్రా ! నీవు అతిశయ బలవంతుడవు. మేము నేడు నీ కొఱకు నవస్తోత్రములను రచించినాము. మేము సమర్పించు ఆ నూతన స్తోత్రములను నీవు పరిగ్రహింపుము. మేము ధీమంతులము. శోభన కర్మవంతులము ధనాభిలాషులము. ఈ సుందర స్తోత్రములను రథమువలెను, వస్త్రమువలెను మేము నీకు అర్పింతుము.

## ముప్పదవ సూక్తము

ఋషి-బభ్రుడు, దేవత- ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వజ్రధరుడు అనేకుల ద్వారా ఆహ్వానించబడు ఇంద్రుడు. అతడు దానయోగ్య ధనముతో సాగును. సోమాభిషవము చేయు యజమానిని వాంఛించును. యజమానిని రక్షించుటకు అతని ఇంటికి చేరును. అటువంటి పరాక్రమవంతుడగు ఇంద్రుడు ఎచట ఉండును? తన అశ్వద్వయము లాగునట్టి సుఖకరమగు రథముపై వెళ్లు ఇంద్రుని ఎవడు చూచినాడు?

2. మేము ఇంద్రుని అంతరంగమును, బహిరంగమును చూచినాము. అన్వేషించుచు ఆధారభూతుడగు ఇంద్రుని స్థానమునకు వెళ్లినాము. ఇతర విద్వాంసులను కూడ ఇంద్రుని విషయమున అడిగినాము. యజ్ఞనేతలు, జ్ఞానాభిలాషులు వారికి ఇంద్రప్రాప్తి కలిగినదని చెప్పినారు.

3. ఇంద్రా ! నీవు ఎన్నో గొప్ప కార్యములు చేసినావు. మేము స్తోతలము. సోమాభిషవ సమయమున వానిని వర్ణింతుము. నీవు మా కొఅకు అనేక కార్యములు చేసినావు. వానిని గురించి తెలియనివారు తెలిసికొనవలెను. తెలిసినవారు తెలియనివారికి తెలియచెప్పవలెను. సమస్త సేవా సమేతుడయి, ధనవంతుడగు ఇంద్రుడు అశ్వమున ఆరోహించి తెలిసినవారి వద్దకును వినువారి వద్దకును వెళ్లవలెను.

4. ఇంద్రా ! నీవు జన్మించగనే సకల శత్రువులను జయించుటకు దృఢముగా సంకల్పించినావు. నీవు వంటరిగానే అనేకమంది రాక్షసులమీదికి యుద్ధమునకు పోయినావు. గోవులను ఆవరించిన పర్వతమును స్వబలమున బద్దలు కొట్టినావు. క్షీరదాయినులగు గోసమూహములను నీవే పొందినావు.

5. ఇంద్రా ! నీవు సర్వప్రధానుడవు. ఉత్కృష్టతముడవు. నీవు దూరమునుంచి శ్రవణీయమగు నామమును ధరించి జన్మించినపుడు అగ్ని మున్నగు దేవతలు భయభీతులయినారు. వృత్రుడు పాలించిన సకల ఉదకములను ఇంద్రుడు వశపరచుకున్నాడు.

6. మరుద్గణములు స్తోత్రపాఠముచేయు సుఖవంతులు. వారు స్తోత్రముల ద్వారా సుఖములు కలిగింతురు. ఇంద్రా ! వారు నిన్నే స్తుతింతురు. సోమలక్షణ అన్నమును సమర్పింతురు. వృత్రుడు సమస్త జలరాశిని ఆక్రమించుకొని నిద్రించినాడు. ఇంద్రుడు స్వశక్తితో కపటి, దేవతలకు బాధలు కలిగించు వృత్రుని ఓడించినాడు.

7. ఇంద్రా ! నీవు ధనికుడవు. మేము నిన్ను స్తుతింతుము. దేవతలను పీడించు వృత్రుని నీవు వజ్రమున పీడించుము. నీవు జన్మతోనే శత్రుసంహారము చేసినావు. ఈ యుద్ధమున నీవు మా సుఖమునకుగాను దాసుడగు నముచి తలను పిండిచేయుము.

8. ఇంద్రా ! శబ్దించుచు భ్రమణశీలమగు మేఘమువలె అసుర నముచి శిరమును చూర్ణము చేసినావు. మాతో స్నేహము చేసినావు. అప్పుడు మరుత్తుల ప్రభావమున ద్యావా పృథ్వులు చక్రమువలె తిరిగినవి.

9. నముచి స్త్రీలను యుద్ధసాధనములగు సేనను చేసినాడు. అసురుల ఆ స్త్రీ సేన నన్నేమి చేయగలదు అనుకున్న ఇంద్రుడు సేనా మధ్యమునుండి అసురుని ఇద్దరు ప్రేయసీ స్త్రీలను పట్టి తన ఇంట ఉంచుకున్నాడు. నముచితో యుద్ధమునకు సాగినాడు.

(అసుర నముచి, స్త్రీ సేనను ఏర్పరచినాడట నేటి అత్యంత ఆధునిక యుగమునకు స్త్రీ సేన లేదు)

10. దూడలు ఆవులకు దూరమయినవి. అప్పుడు నముచి అపహరించిన గోవులు చెల్లాచెదరయినవి. బభ్రుఋషి సమర్పించిన అభిషుత సోమమును సేవించి హృష్టుడయి ఇంద్రుడు సమర్థులగు మరుత్తుల సహితుడయి బభ్రుని గోవులను దూడలతో కలిపినాడు.

11. ఇంద్రుడు కోరికలు తీర్చువాడు. బభ్రుడు అభిషవించిన సోమముచే ఇంద్రుడు ప్రహృష్టుడు అయినాడు. సంగ్రామమున మహా శబ్దము చేసినాడు. పురందర ఇంద్రుడు సోమపానము చేసినాడు. బభ్రుని గోవులను మరల పాలిచ్చువానినిగా చేసినాడు.

12. అగ్నీ ! ఋణంచయ రాజు కింకరులు రుష్మదేశవాసులు నాకు నాలుగువేల గోవులనిచ్చి శుభంకర కార్యము చేసినారు. నేతలందు శ్రేష్ఠనేత ఋణంచయ రాజు ఇచ్చిన గోరూప రత్నములను నేను స్వీకరించినాను.

13. అగ్నీ ! ఋణంచయ రాజు కింకరులు రుష్మ దేశవాసులు నాకు అలంకార, ఆచ్ఛాదాదులతో కూడిన గృహమును, వేల గోవులను దానము చేసినారు.

ఉషఃకాలమున సరససోమము ఇంద్రుని ప్రసన్నుని చేసినది.

(ఇంద్రుడు గోవులను విడిపించినంతనే బభ్రుడు సోమరసము అందించినాడని)

14. రుశ్మ దేశపు రాజు ఋణంచయుని వద్దనే సర్వత్ర వ్యాపించిన రాత్రి గడచిపోయినది. రాజు పిలువగా బభ్రుడు - వేగవంతమగు అశ్వమువలె వెళ్లినాడు. నాలుగువేల శీఘ్రగామిని గోవులను అందుకున్నాడు.

15. అగ్నీ ! మేము మేధావులము. రుశ్మదేశ వాసులు మాకు నాలుగు వేల గోవులను దానము చేసినారు. వారు మాకు పాలు పితుకుటకుగాను బంగారు కలశమును దానము చేసినారు. అది యజ్ఞము కొఱకు అగును.

## ముప్పది ఒకటవ సూక్తము

ఋషి-ఆత్రేయ అవస్యుడు, దేవత-ఇంద్రుడు, ఛందస్సు-త్రిష్టుప్.

1. ఇంద్రుడు ధనవంతుడు. అతడు ఎక్కిన రథమును అతడే నడుపును. గోపాలురు పశు సమూహములను ప్రేరేపించినట్లు - ఇంద్రుడు శత్రు సేనలను పురికొల్పును. శత్రువులద్వారా అహింసితుడు, దేవశ్రేష్ఠుడగు ఇంద్రుడు శత్రువుల ధనమును కోరి సాగును.

2. హర్యశ్వవంతా ! ఇంద్రా ! నీవు మాకు అభిముఖముగా విచ్చేయుము. మా విషయమున హీన మనోరథుడవు, ఉదాసీనుడవుకారాదు.

బహువిధ ధనములుగల ఇంద్రా ! నీవు మమ్ము ఆదుకొనుము. నిన్ను మించి శ్రేష్ఠమయినది మరొకటి లేదు. అపత్నీకులకు నీవు స్త్రీని ప్రదానము చేతువు.

3. ఉష తేజమును సూర్యుని తేజము అతిక్రమించినపుడు ఇంద్రుడు యజమానులకు అఖిల ధనమును ప్రసాదించును అతడు నివారక పర్వత మధ్యమున బంధించి ఉంచిన పాడి ఆవులను విడిపించినాడు. సర్వత్ర వ్యాప్త స్వతేజమున ఇంద్రుడు అంధకారమును దూరము చేసినాడు.

4. బహుజన ఆహూత ఇంద్రా ! ఋభువులు నీ రథమును అశ్వ సంయుక్త యోగ్యము చేసినారు. త్వష్ట నీ వజ్రమును ద్యుతిమంతము చేసినాడు. ఇంద్రుని పూజించు అంగిరులు వృత్రవధకుగాను ఇంద్రుని తమ స్తోత్రములతో సంవర్ధితుని చేసినారు.

5. ఇంద్రా ! నీవు కోరికలు తీర్చువాడవు. సేచన సమర్థులగు మరుత్తులు నిన్ను కొనియాడినప్పుడు సోమాభిషవ శిలలు సహితము ప్రసన్నములయి - సంగతములయినవి. ఇంద్రుడు పంపగా అశ్వహీన, రథహీన మరుత్తులు దండెత్తి శత్రువులను ఓడించినారు.

6. ఇంద్రా ! నీ యొక్క పురాతనములు, నీ వనములగు కార్యములను మేము స్తుతింతుము. నీవు చేసిన కార్యములను మేము తెలియపరతుము. నీవు ద్యావా పృథ్వులను వశపరచుకున్నావు. నరులకు విచిత్రములగు జలములను ప్రసాదించినావు.

7. ఇంద్రా ! నీవు దర్శనీయుడవు. బుద్ధిమంతుడవు. వృత్రుని వధించి ఈ లోకమున నీ బలమును ప్రదర్శించినావు. అది నీకు మాత్రమే తగును. నీవు "శుష్ణ" అసురుని యువతిని గ్రహించినావు. యుద్ధస్థలమునకు చేరి నీవు అసురులను నష్టపరచినావు.

8. ఇంద్రా ! యదు, తుర్వశ రాజులు నదీతీరములందు ఉండువారు. వనస్పతులను పెంచుటకుగాను వారికి నీవు జలమును ప్రసాదించినావు. కుత్సునిపై ఆక్రమణ జరిపిన శుష్ణుని వధించి కుత్సుని అతని ఇంటికి చేర్చినావు. అప్పుడు అశన మఱియు దేవతలు ఉభయులు నిన్ను భజించినారు.

9. ఇంద్ర-కుత్సులు ఒకే రథమున ఎక్కవలెను. అశ్వగణములు వారిని యజమానివద్దకు తీసికొనిరావలెను. మీరు ఉభయులు శుష్ణుని అతని నివాసమగు జలమునుండి దూరము చేసినారు. ధనవంతులగు యజమానుల హృదయములనుండి అజ్ఞానాంధకారమును దూరము చేసినారు.

10. విద్వాంసుడగు అవస్యుఋషి వాయువేగము గలవి - రథమునకు పూన్చదగినవి అయిన అశ్వములను పొందినాడు.

ఇంద్రా ! అవస్యుని మిత్రులగు సకల స్తోతలు, స్తోత్రములతో - నీ బలమును వర్థిల్లచేయుదురు.

11. పూర్వము ఏతశ ఋషికి సూర్యునితో సంగ్రామము జరిగినది. అప్పుడు ఇంద్రుడు సూర్యుని వేగవంతమగు రథపు నడకను నిలిపివేసినాడు. ఇంద్రుడు సూర్యుని ద్విచక్ర రథము నుండి ఒక చక్రమును ఊడ పెరికినాడు. ఆ చక్రముతోనే ఇంద్రుడు శత్రువులను నష్టపరచినాడు. ఇంద్రుడు మాకు బహుమతులనిచ్చి మా యజ్ఞమునకు విచ్చేయవలెను.

12. ఇంద్రా ! నీవు అమరుడవు. నిన్ను అభిలషించి పూజించు మరణశీల నరునకు ఎవడును అనర్థము చేయజాలడు. నీవు యజమానులను కరుణింపుము. వారి విషయమున ప్రసన్నుడవగుము. మానవుల మధ్యనున్న మేము - స్తోతల మందరము నీవారము కావలెను. నీవు అట్టి మానవులకు బలమును ప్రసాదించుము.

## ముప్పది రెండవ సూక్తము

ఋషి-ఆత్రేయ గాతుడు, దేవత-ఇంద్రుడు, ఛందస్సు-త్రిష్టుప్.

1. ఇంద్రా ! నీవు వర్షించు మేఘమును విదీర్ణము చేసినావు. మేఘస్థ జల నిర్గమన ద్వారమును ఏర్పరచినావు. విశాల మేఘముతో వర్షము కురిపించినావు. ధనుపుత్రుడు వృత్ర సంహరించినావు.

2. వజ్రవాన్ ఇంద్రా ! బంధించిన మేఘములను నీవు వర్షకాలమున బంధవిముక్తులను చేయుము. జలమున శయనించిన వృత్రుని నీవు వధించినావు. అప్పుడు నీ బలము లోక విఖ్యాతమయినది.

3. అప్రతిద్వంద్వి, ఏకమాత్ర ఇంద్రుడు మృగమువలె శీఘ్రగామియయిన వృత్రుని ఆయుధములను స్వబలమున నష్టపరచినాడు. అప్పుడు వృత్రుని దేహమునుండి మరొక అతిశయ బలశాలి అసురుడు పుట్టినాడు.

4. వర్షించు మేఘములను ప్రహరించు వజ్రధర ఇంద్రుడు వజ్రమున బలవంతుడగు శుష్ణుని కూల్చినాడు. శుష్ణుడు వృత్రుని క్రోధమున జనించినాడు. అంధకారమున వసించినాడు. కురువనున్న మేఘమును కట్టిపెట్టి కాపున్నాడు. అతడు సంపూర్ణ ప్రాణజాలపు అన్నమును తానొక్కడే తిని మురిసినాడు.

5. ఇంద్రా ! నీవు బలవంతుడవు. మాదక సోమరస పానమున హృష్టుడవు అయినావు. అంధకార నిమగ్నుడు,

యుద్ధాభిలాషి వృత్రుని కనుగొన్నావు. తనను అవధ్యునిగా భావించు వృత్రుని ప్రాణస్థానమును - వాని చర్యలవలననే తెలిసికున్నావు.

6. వృత్రుడు సుఖకర ఉదక సహిత జలమున శయనించినాడు. అంధకారమున వర్ధిల్లినాడు. అభిషుత సోమపానము హృష్టుడయిన-అభిలాషపూరక ఇంద్రుడు వజ్రమును ఎత్తి వృత్రుని కొట్టినాడు.

7. ఇంద్రుడు ఆ విరాట్ దానవ వృత్రునిమీద విజయ వజ్రమును ఎత్తినపుడు వజ్రముతో వృత్రుని ప్రహారము చేసినపుడు అందరి ప్రాణులలో వృత్రుని నీచుని చేసినాడు - ఇంద్రుడు.

8. వృత్రుడు గమనశీల మహా మేఘములను ఆక్రమించి శయనించినవాడు. సంహారకుడు. అందరిని ఆచ్ఛాదించినవాడు. ఉగ్ర ఇంద్రుడు అట్టి వృత్రుని పట్టినాడు. యుద్ధమున పాదరహితుని పరిమాణ రహితుని చేసినాడు. తన విరాట్ వజ్రమున వృత్రుని కూల్చినాడు.

9. ఇంద్రుని యొక్క ఇతరులను శోషింప చేయు బలమును ఎవడు నివారింప గలడు? ఇంద్రుడు అప్రతి ద్వంద్వి. ఒక్కడే శత్రువుల ధనమును హరించును. ద్యుతిమంతములగు ద్యావాపృథ్వులు వేగవంతుడగు ఇంద్రుని బలమునకు భయపడి వెంటనే కదలినవి.

10. స్వయముగా భరించగల ద్యుతిమంత ద్యులోకము ఇంద్రునిముందు కొంచమై సాగును. అభిలాషగల స్త్రీవలె భూమి ఇంద్రునకు ఆత్మార్పణము చేయును. ఇంద్రుడు తన సమస్త బలమును ప్రజల మధ్య స్థాపించినపుడు మానవులు బలశాలియగు ఇంద్రునకు నమస్కరింతురు.

11. ఇంద్రా ! నీవు మానవులలో ముఖ్యుడవని సజ్జనపాలకుడవని పంచజనుల హితముకొఱకు జన్మించినావని మాకు ఋషులు చెప్పగా విన్నాము. నీవు యశోవంతుడవు. రాత్రింబవళ్లు స్తుతించునట్టి - తమ కోర్కెలను వ్యక్తపరచగలట్టి మా సంతానము స్తుతి యోగ్య ఇంద్రుని అనుగ్రహమునకు పాత్రము కావలెను.

12. ఇంద్రా ! నీవు సమయానుసారము జంతువులను ప్రేరేపింతువని స్తోతలకు ధనదానము చేతువని విన్నాము. అది నిజము కానట్లున్నది.

ఇంద్రా ! తమ ఆశలన్ని నీ మీద పెట్టుకొని, నీకు మిత్రులయిన స్తోతలకు ఏమి దొరికినది?

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగవ అష్టకము ఐదవ మండలమున మొదటి అధ్యాయమున రెండవ అనువాకము సమాప్తము)

ఓం వతామినన్తిమాయినో వధీరా వ్రతాదేవానాం ప్రథమాద్రవాణి
వరోదపీ అద్రుహో వేద్యాభిర్న పర్వతావి వమే తస్థివాంసః

## రెండవ అధ్యాయము

**మూడవ అనువాకము ముప్పది మూడవ సూక్తము**

ఋషి - ప్రజాపతి పుత్రుడు సంవరణుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. నేను సంవరణ ఋషిని. అత్యంత దుర్బలుడను. ఇంద్రుడు మహాబలసంపన్నుడు. నేను ఇంద్రుని గూర్చి అనేక స్తవములు వచింతును. అందువలన నా వంటి మనుష్యుడు బలవంతుడగును. సంగ్రామమునందు అన్నలాభము కొఱకు స్తుతించగా ఇంద్రుడు స్తోతలతో కూడ నన్ను అనుగ్రహించును.

2. ఇంద్రా ! నీవు కోరికలు తీర్చువాడవు. నీకు ప్రియములయిన స్తోత్రములు రచించిన వారిని నీ దృష్టిలో ఉంచుకుందువు. ఆ స్తోత్రములతో రథమునకు కట్టిన గుఱ్ఱముల కళ్లెము పట్టుకొందువు. ఆవిధముగా నీవు మా శత్రువులను ఓడించుము.

3. తేజో విశిష్టుడవగు ఇంద్రా ! నీ భక్తులకు భిన్నమైనవాడు, నీ వెంట ఉండనివాడు, బ్రహ్మ కర్మహీనుడు నీవాడుకాడు. కావున నీవు మా యజ్ఞమునకు వచ్చునపుడు నీవు స్వయముగా నడిపించు రథమున విచ్చేయుము.

4. ఇంద్రా ! నిన్ను కీర్తించు స్తుతులు అనేకములు ఉన్నవి. నీవు భూమి మీద జలవృష్టిని నిరోధించువారిని సంహరింతువు. నీవు అభీష్ట పూరకుడవు. సూర్యుని స్వస్థానమున వర్ష ప్రతిబంధకారకులగు దాసులతో యుద్ధము చేసినావు. వారి పేరు సహితము మిగలకుండ నష్టపరచినావు.

5. ఇంద్రా ! మేము ఋత్విక్కులము. యజమానులము. మేమందరము నీవారలము. మేము యజ్ఞము చేయుదుము. నీ బలమును పెంచుదుము. హోమము చేయుటకు నీ దగ్గరికి చేరుదుము. నీ బలము సర్వవ్యాపకము. నీ అనుగ్రహమున యుద్ధక్షేత్రమున భాగము -ప్రశంసనీయ, విశ్వసనీయ భృత్యులు మున్నగువారు మాకు లభించవలెను.

6. ఇంద్రా ! నీవు పూజనీయుడవు. సర్వవ్యాపివి. అమరుడవు. నీవు నీ తేజమున జగములను నింపుము. శ్వేతవర్ణ మగు విశేష ధనమును మాకు ప్రసాదించుము. మేము విశేష ధనవంతుడగు దాత దానగుణమును ప్రశంసింతుము.

7. ఇంద్రా ! నీవు శూరుడవు. మేము నిన్ను స్తుతింతుము. భజింతుము. మాకు రక్షణ కల్పించుము. పాలించుము.

సంగ్రామమున నీవు నీ ఆచ్ఛాదక రూపమును ప్రదానము చేయుము. మా అభిషుత సోమరసము సేవించి సంతుష్టుడవగుము.

8. గిరిక్షిత గోత్రోత్పన్నుడు, పురుకుత్స పుత్రుడు త్రసదస్యుడు హిరణ్యవంతుడు. దాత. అతడు మాకు పది అశ్వములను దానము చేసినాడు. అవి శుభ్ర వర్ణములు. అవి మమ్ము వహించవలెను. రథనియోజక కార్యములద్వారా మేము శీఘ్రగమనులము కాగలము.

9. మరుతాశ్వుని పుత్రుడు విదథుడు మాకు రక్తవర్ణములు, శ్రేష్ఠములగు అశ్వములను దానము చేసినాడు. అవి మమ్ము వహించవలెను. అతడు మమ్ము పూజించి సహస్ర పరిమిత ధనము ఇచ్చినాడు. అతని వంటి మీది అలంకారములను ఇచ్చినాడు.

10. లక్ష్మణపుత్రుడు ధ్వన్యుడు మాకు దీప్తిమంతములు, కర్మక్షమగల అశ్వములను ఇచ్చినాడు. అవి మమ్ము వహించవలెను. గోవులు కొట్టములకు చేరినట్లు ధ్వన్యుడు ఇచ్చిన మహాధనము సంవరణ ఋషి ఇంటికి చేరవలెను.

## ముప్పది నాలుగవ సూక్తము

ఋషి - ప్రజాపతి పుత్రుడు సంవరణుడు. దేవత-ఇంద్రుడు. ఛందస్సు - జగతి. చివరిది త్రిష్టుప్.

1. అజాత శత్రువగువాడు, శత్రువులను నాశనము చేయువాడు, అక్షీణ, స్వర్గప్రద, అపరిమిత హవ్యమును అందుకొనును. ఋత్విక్కులారా ! అట్టి ఇంద్రుని కొఱకే మీరు పురోడాశాదుల పాకము చేయుడు. తగిన విధమున పూజింపుడు.

ఇంద్రుడు స్తోత్రవాహకుడు. బహుస్తుతుడు.

2. ఇంద్రుడు మృగనామక అసురుని వధించదలచినపుడు సోమరసముతో అతని జఠరమును నింపినాడు. ప్రముదితుడు అయినాడు. అప్పుడు ఇంద్రుడు అపరిమిత తేజోవంతమగు తన మహా వజ్రమును ఎత్తినాడు.

3. ఇంద్రుని కొఱకు అహర్నిశలు సోమమును అభిషవించు యజమానులు ద్యుతిమంతులు అగుదురు. యజ్ఞము చేయనివారయి ధర్మసంతతి కోరువారిని సుందర అలంకారాదులు ధరించువారిని ధనవంతులయ్యు కుత్సితులకు సాయము చేయువారిని ఇంద్రుడు విడిచి పెట్టును.

4. తనను పూజించువాడు మాతాపితరులను భ్రాతను వధించిన వానిని సహితము ఇంద్రుడు దూరము చేయడు. అతడు సమర్పించిన హవ్యమును కాంక్షించును. శాసకుడు, ధనాధిపతియగు ఇంద్రుడు పాపములకు సహితము

విచలితుడు కాడు.

5. ఇంద్రుడు శత్రువులను సంహరించుటకు అయిదుగురి, పదిగురి సహాయమును ఆశించడం. సోమాభిషవము చేయనివానితోను, బంధువులను పోషించనివానితోను ఇంద్రుడు సాంగత్యము చేయడు. వారిని బాధించును. వధించును.

ఇంద్రుడు యజ్ఞము చేయు యజమానుల గోష్ఠములను గోవులతో నింపును.

6. ఇంద్రుడు యుద్ధమున శత్రువును క్షీణింప చేయును. రథపు వేగమును పెంచును. అతడు సోమాభిషవము చేయని యజమానిని దూరము చేయును. సోమాభిషవము చేయువానిని వర్ధిల్ల చేయును. విశ్వరక్షకుడు, భయజనక స్వామి ఇంద్రుడు యధేచ్ఛగా దాస కర్మము చేయువారిని తన వశమున ఉంచుకొనును.

7. ఇంద్రుడు వర్తకులవలె ధనమును తస్కరించును. మానవుల శోభను పెంచు నట్టి ధనమును బహువిధ అన్య ధనములను తెచ్చి యజ్ఞము చేయు యజమానులకు ఇచ్చును. బలశాలియగు ఇంద్రునకు కోపము కలిగించినవాడు మహావిపత్తుల పాలగును.

8. ధనబలము, అంగబలముగల ప్రత్యర్థులు సంపన్నములగు గోవుల కొఱకు పరస్పరము ఘర్షణ పడుదురు. అప్పుడు ఇంద్రుడు వారిలో యజ్ఞము చేయువారికి సాయపడును. మేఘములను కంపింప చేయగల ఇంద్రుడు అట్టి యజ్ఞకారి యజమానికి గోసమూహములు ప్రదానము చేయును.

9. గుణ విశిష్టుడవగు ఇంద్రా ! అపరిమిత ధనదాత అగ్నివేశపుత్రుడు ప్రసిద్ధ శత్రినామక రాజర్షిని స్తుతింతుము. అతడు ఉపమానభూతుడు ప్రఖ్యాతుడు. జలరాశి అతనిని సంపూర్ణముగ సంతుష్టుని చేయవలెను. అతని ధనము బలవంతము, దీప్తివంతము కావలెను.

## ముప్పది అయిదవ సూక్తము

ఋషి-అంగిరస గోత్రజుడు ప్రభూవసుడు, దేవత-ఇంద్రుడు, ఛందస్సు - అనుష్టుప్, చివరది పంక్తి.

1. ఇంద్రా ! నీ అతిశయ ప్రజ్ఞ మమ్ము రక్షించవలెను. నీ కార్యములు సమస్త జనులకు కళ్యాణ కారకములగును. పరిశుద్ధములగును. సంగ్రామమున ఇతరులు ఎదిరించరానివి అగును.

2. ఇంద్రా ! నీవు చేయునట్టి చతుర్వర్ణముల రక్షాకార్యమును త్రిలోకముల రక్షాకార్యమును, పంచజనుల రక్షాకార్యమును అట్టి సమస్త రక్షాకార్యములు నీవు మా కొఱకు భద్రపరచుము.

3. ఇంద్రా ! నీవు అభిమత ఫలసాధకుడవు. వృష్టికర్తవు. శీఘ్ర శత్రు సంహారకుడవు. నీ రక్షణ కార్యము వరణీయము. మేము దానిని ఆహ్వానింతుము. నీవు సర్వవ్యాపి మరుత్తులతో కలిసి మాకు ఫలప్రదానము చేయుము.

4. ఇంద్రా ! నీవు అభీష్ట వరదుడవు. యజమానులకు ధనము ఇచ్చుటకే నీవు జన్మించినావు. నీ బలము ఫలప్రదము అగును. నీ మనసు ధృడమయినది - విరోధులను అణచివేయునదగును. నీ పౌరుషము సంఘవినాశకము. "సత్రాహమింద్ర పౌంస్యమ్"

(సత్రాహం సంఘహంతృ అని శాయణుడు ఇంద్రుని కోపము సంఘ వినాశకారి అని అర్థము కావచ్చును)

5. ఇంద్రా ! నీవు వజ్రధారివి. నీ రథము సర్వత్ర అప్రతిహతముగ సంచరించును. నీవు నూరు యజ్ఞములు చేసినవాడవు. శతక్రతువవు. నీవు బలములకు అధిపతివి. నీ విషయమున శత్రుత్వము చూపినవాడిపై నీవు దండెత్తిదవు.

6. ఇంద్రా ! నీవు శత్రుహంతవు. ఉద్యతాయుధుడవు. బృహత్ ప్రజలలో పురాతనుడవు. యజ్ఞము చేయువారు యుద్ధములందు నిన్ను ఆహ్వానింతురు.

7. మా రథము సంగ్రామమున సకల విధ ధనములను కాంక్షించును. అనుచరుల వెంటసాగును. దుర్నివార్యము, రణ సంకులము అగును. ఇంద్రా ! అట్టి మా రథమును నీవు రక్షింపుము.

8. ఇంద్రా ! నీవు మా వద్దకు ఆత్మీయుడవయి రమ్ము. నీ ఉత్కృష్ట బుద్ధితో మా రథమును కాపాడుము. నీవు నిరతిశయ బలశాలివి. దీప్తిమంతుడవు. నీ అనుగ్రహమున మేము వరణీయ ధనమును, యశస్సును పొందవలెను.

ఇంద్రా ! మేము నిన్ను స్తుతించుచున్నాము.

## ముప్పది ఆరవ సూక్తము

ఋషి-అంగిరస గోత్రజుడు ప్రభూవసుడు, దేవత-ఇంద్రుడు ఛందస్సు-త్రిష్టుప్. మూడవది జగతి.

1. ఇంద్రుడు మా యజ్ఞమునకు విచ్చేయవలెను. ధనమునకు ప్రతీక అయిన దేవత ఎటువంటివాడు? ఇంద్రుడు స్వభావతః దాత. ధనుస్సు వెంటసాగు ధనుర్ధారివలె సాహసపూర్ణ గమనముగల, అత్యంత సంతుష్టుడయిన ఇంద్రుడు అభిషుత సోమపానము చేయవలెను.

2. ఇంద్రుడు అశ్వద్వయ సంపన్నుడు. శూరుడు. మేము సమర్పించు సోమరసము పర్వత శిఖరమువంటి అతని హనుప్రదేశమును ఆరోహించవలెను. గడ్డి వలన అశ్వములు తృప్తి చెందును. అట్లే మేము స్తుతుల ద్వారా నిన్ను ప్రీతిని చేతుము.

ఇంద్రా ! నీవు బహుస్తుతుడవు.

3. ఇంద్రా ! నీవు బహుస్తుతుడవు. వజ్రవంతుడవు. భూమిమీద తిరుగు చక్రమువలె మా హృదయము దారిద్ర్య భయమున గడగడలాడుచున్నది. సర్వదా వర్ధమానుడవగు ఇంద్రా ! పురూవసు ఋషి బహుళ స్తుతులతో నిన్ను స్తుతించుచున్నాడు. నీవు రథారూఢుడవగుము.

4. ఇంద్రా ! విశేష ఫలమును అనుభవించు స్తోతలు అభిషశిలవలె నిన్ను స్తుతింతురు. ధనవంతుడవు, హర్యశ్వవంతు ఇంద్రా ! నీవు కుడి, ఎడమ రెండు చేతులతో ధనదానము చేతువు. నీవు మమ్ము విఫల మనోరథులను చేయకుము.

5. ఇంద్రా ! నీవు అభీష్ట వరదుడవు. అభీష్ట వర్షులగు ద్యావాపృథ్వులు నిన్ను సంవర్ధితుని చేయుదురు. నీవు వర్షకారివి. అశ్వములు నిన్ను యజ్ఞస్థలమునకు చేర్చును. శోభన హనువులుగల వజ్రధారివైన ఇంద్రా ! నీ రథము కళ్యాణవహము అగును. యుద్ధమున నీవు మమ్ము రక్షింపుము.

6. ఇంద్ర సాహాయక మరుత్తులారా ! అన్నవంతుడగు శృతరథ మహారాజు మాకు లోహిత వర్ణములగు రెండు అశ్వములను మూడువందల గోరూప ధనమును దానము చేసినాడు. నిత్య యవ్వనుడగు ఆ శృతరథ రాజును సకల ప్రజ ప్రసన్నమై ప్రణమిల్లును.

## ముప్పది ఏడవ సూక్తము

ఋషి - అత్రి, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. యథావిధి ఆహుత అగ్నిలో హవ్య ప్రదానము చేయుట వలన అగ్ని ప్రదీప్తము అగును. సూర్యరశ్మి సహితముగా ఆహూయ మానుడు అగును. "ఇంద్రుని కొఱకు హోమము చేయుము" అన్న యజమాని కొఱకు ఉష అహింసితము అగును.

2. అగ్నిని ప్రదీప్తము చేయునట్టి కుశలను విస్తృతపరచునట్టి యజమాని అగ్నిని భజించును. సోమరసమును అభిషవించు వారు స్తుతింతురు. ఏ అధ్వర్యుని పాషాణమున సుమధుర శబ్దమగునో ఆ అధ్వర్యుడు హవ్యము తీసికొని నదిలోనికి చేరవలెను.

3. పత్ని పతిని వాంఛించి యజ్ఞమున అతనిని అనుసరించును. ఇంద్రుడు అదేరీతి తనను అనుసరించు మహిషిని అనుగమించును. ఇంద్రుని రథము విశేష ధనము వహించి మా వద్దకు రావలెను. అది అధిక శబ్దము చేయును. అది నలువైపుల వేల ధనము విసరవలెను.

4. ఎవని యజ్ఞమున దుగ్ధమిశ్రిత మదజనక సోమరసమును ఇంద్రుడు పానము చేయునో ఆ యజ్ఞము చేయు రాజు ఎన్నటికి వ్యాధితుడు కాడు. అతడు అనుచరుల వెంట సర్వత్ర సంచరించును. శత్రుసంహారము చేయును. ప్రజలను రక్షించును. సుఖసంతోషములు కలిగి ఇంద్రుని సేవించును.

5. ఇంద్రునకు అభిషుత సోమము సమర్పించువాడు బంధువులను, బాంధవులను పోషించును. ప్రాప్తధనమును రక్షించును. అప్రాప్త ధనమును సాధించును. వర్తమాన అహోరాత్రులను గెలుచును. అతడు సూర్యుడు, అగ్ని ఇద్దరికి ప్రీతిపాత్రుడు అగును.

## ముప్పది ఎనిమిదవ సూక్తము

ఋషి - అత్రి, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - అనుష్టుప్.

1. ఇంద్రా ! నీవు సర్వదర్శివి. శోభన ధనవంతుడవు. నీవు మహా కార్యములు చేసినావు. నీవు విశేష ధనమును మహాదానము చేతువు. నీవు మాకు మహాధనమును ప్రసాదించుము.

2. ఇంద్రా ! నీవు మహాబలశాలివి. హిరణ్య వర్ణుడవు. నీవు సుప్రసిద్ధము. ప్రచురమగు అన్నమునకు అధిపతివి. అయినను ఆ విషయము అత్యంత దుర్లభరూపమున సర్వత్ర కీర్తితము అగును.

3. వజ్రధర ఇంద్రా ! పూజనీయులు, విఖ్యాత కర్మవంతులగు మరుత్తులు నీకు బలస్వరూపులు. మీరిద్దరు ఇంద్ర మరుత్తులు భూమిమీద స్వేచ్ఛా విహారులగుచు శాసించెదరు.

4. వృత్రహంత ఇంద్రా ! మేము నిన్ను ఉపాసింతుము. నీవు మమ్ము ధనాఢ్యులను చేయ కోరినవాడవు. మాకు ఎవరేని క్షమతాశీలుని ధనము తెచ్చి ఇమ్ము.

5. శతక్రతువగు ఇంద్రా ! నీ రాకతో మేము త్వరగా సమృద్ధులము కావలెను. నీ సుఖమున మమ్ము భాగస్వాములను చేయుము. నీ వలన మేము సురక్షితులము కావలెను.

## ముప్పది తొమ్మిదవ సూక్తము

ఋషి - అత్రి, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - అనుష్టుప్, చివరిది పంక్తి

1. ఇంద్రా ! నీవు వజ్రధరుడవు. ధనవంతుడవు. నీ రూపము అత్యంత విచిత్రము. ఇచ్చుటకు నీవద్ద ఉన్న బహుమూల్య ధనమును మాకు రెండు చేతులతో ప్రసాదించుము.

2. ఇంద్రా ! నీవు అతి శ్రేష్ఠము అనుకున్న ధనమును మాకు ప్రదానము చేయుము. మేము ఆ ధనమునకు దానపాత్రులము కావలెను.

3. ఇంద్రా ! నీ మనసు దానము చేయుటకు ఆతురత గలది గొప్పది. నీవు మాకు సాదరముగా సారవంత అన్నము ప్రదానము చేయదలతువు.

4. ఇంద్రుడు హవిర్లక్షణ ధనయుక్తుడు. అతడు మాకు అత్యంత పూజనీయుడు. అతడు మానసాదిపతి. స్తోతలు ప్రాచీన స్తోత్రములతో ఇంద్రుని స్తుతించి సేవింతురు.

5. ఇంద్రుని కొఱకు మాత్రమే ఈ కావ్యము, వాక్యము, ఉక్థము ఉచ్చరితములయినవి. ఇంద్రుడు స్తోత్రవాహకుడు. అత్రిపుత్రుడు ఇంద్రునిముందే స్తోత్రములను ఉచ్చైస్వరమున ఉచ్చరించును. ఉద్దీప్తము చేయును.

## నలుబదవ సూక్తము

ఋషి - ఆత్రేయుడు, దేవత - ఇంద్రుడు ఛందస్సు 1-3 ఉష్ణిక్, 5,9 అనుష్టుప్ మిగిలినవి త్రిష్టుప్.

1. ఇంద్రా ! నీవు ఫలప్రదాతవు. శత్రుహంతవు. నీవు మా యజ్ఞమునకు విచ్చేయుము. వచ్చి సోమస్వామివగు నీవు శిలాభిషుత సోమమును పానము చేయుము. ఫలవర్షులగు మరుత్తుల సహితముగా సోమపానము చేయుము.

2. అభిషవ సాధన పాషాణము వర్షణకారి అగును. సోమపానజనిత హర్షము వర్షణకారి అగును. అభిషుత సోమము వర్షణకారి అగును. ఫలవర్షక, శత్రుహంత ఇంద్రా ! నీవు ఫలవర్షకులగు మరుత్తులతో సోమపానము చేయుము.

3. ఇంద్రా ! నీవు వజ్రధరుడవు. ఫలవర్షివి. శత్రుహంతవు. సోమరస సేవన కర్తవు. అభీష్ట వరదుడవు. మమ్ము రక్షించుమని నిన్ను ఆహ్వానించుచున్నాము. ఫలవర్షులగు మరుత్తులతో కలిసి సోమపానము చేయుము.

4. ఇంద్రా ! నీవు ఋజీషివి. వజ్రధరుడవు. అభీష్టవర్షివి. శత్రు సంహారకర్తవు. బలవంతుడవు. సర్వులకు

ఈశ్వరుడవు. వృత్రహంతవు. సోమపాయివి. అట్టి ఇంద్రుడు గుఱ్ఱములను రథమున పూన్చి మా వద్దకు రావలెను. మధ్యందిన సవనమున సోమము సేవించవలెను. హృష్టుడవు కావలెను.

(రెండు సవనములందు అభిషుతమయి తృతీయ సవనమున మరల అభిషవించబడిన సోమము ఋజీషము)

5. సూర్యుడా ! స్వర్భాను నామక అసురుడు నిన్ను అంధకారమున ఆచ్ఛాదించినపుడు అక్కడి జనులు తమను మరచిన మూఢులవలె సకల భువనములు కళ్లప్పచెప్పిచూచినవి.

6. ఇంద్రా ! సూర్యుని అధోదేశమున నిలిచిన స్వర్భానుని ద్యుతిమంతమగు మాయను దూరము నుండియే కొట్టివేసినావు. అప్పుడు వ్రతవిధాత, అంధకార సమాచ్ఛన్న సూర్యుని అత్రి నాలుగు ఋక్కులతో మంత్రములతో మరల ప్రకాశితుని చేసినాడు.

7. సూర్యుడు అనుచున్నాడు.

అత్రీ ! నేను ఈ దశలో ఉన్నాను. నేను నీవాడను. అన్నమునకుగాను ద్రోహము చేయు అసురుడు భయంకరమగు అంధకారమున నన్ను మ్రింగునేమో ! అందువలన నీవు వరుణుడు మమ్ము రక్షించవలెను. నీవు నాకు మిత్రుడవు. సత్యపాలకుడవు.

8. అప్పుడు ఋత్విక్ అత్రి సూర్యునకు ఉపదేశము ప్రసాదించినాడు. ప్రస్తరఖండ ఘర్షణమున ఇంద్రుని కొఱకు సోమాభిషవము చేసినాడు. స్తోత్రములతో దేవిని పూజించినాడు. మంత్ర ప్రభావమున అంతరిక్షమున సూర్యచక్షువును స్థాపించినాడు. అప్పుడు అత్రి స్వర్భానుని సమస్త మాయలను దూరము నుండియే నిష్ఫలము చేసినాడు.

9. అసుర స్వర్భానుడు అంధకారమున సూర్యుని ఆవరించినాడు. అత్రి పుత్రుడు అట్టి సూర్యుని విముక్తుని చేసినాడు. అది చేయు సమర్థుడు మరొకడు లేడు.

## నలుబది ఒకటవ సూక్తము

ఋషి - భౌమ అత్రి, దేవత - విశ్వేదేవతలు ఛందస్సు - 7,16 జగతి, 20 విరాట్ మిగిలినవి త్రిష్టుప్.

1. మిత్రావరుణులారా ! మీ ఉభయుల యజ్ఞము చేయుటకు ఏ యజమాని సమర్థుడగును? మీరు పృథివి, అంతరిక్షపు ఏ స్థానమున నిలిచి మమ్ము రక్షింతురు? హవ్యదాత యజమానికి పశువులు, ధనము ఎట్లు ప్రసాదింతురు?

2. మిత్రా ! వరుణా ! ఆర్యమా ! ఆయూ ! ఇంద్రా ! ఋభుక్షా ! మరుద్గణములారా ! మీరందరు మాయొక్క శుభంకరము, పాపవర్జితమగు స్తోత్రమును ఆలకింపుడు. మీరందరు రుద్రసహితముగా ప్రీతులగుడు. మా పూజలను స్వీకరించుడు.

3. అశ్వినులారా ! మీరిద్దరు దమనకారులు. మీ రథమును వాయువేగవంతము చేయుటకు మేము మిమ్ము ఆహ్వానించుచున్నాము.

ఋత్విక్కులారా ! ద్యుతిమంతుడు, ప్రాణాపహారకుడగు రుద్రుని స్తోత్రములు, హవ్యములు స్వీకరించుడు.

4. మేధావులు ఆహ్వానించువారు; యజ్ఞములను సేవించువారు, శత్రువినాశకులు, స్వర్గీయులగు వాయువు, అగ్ని, పూషలు క్షితిజాది మూడు స్థానముల నిలిచి సూర్యునివెంట సమానరూపులయి ప్రియము కలిగింతురు. ఈ సకల విశ్వరక్షక దేవతలు యజ్ఞస్థలమునకు వేగవంతమగు అశ్వము యుద్ధమునకు పరుగులిడినట్లు త్వరగా విచ్చేయవలెను.

5. మరుత్తులారా ! మీరు అశ్వసాహిత్ ధనమును సముపార్జించుడు. స్తోతలు గోవులు, అశ్వములు మున్నగు ధనలాభమునకును, ఉన్న ధనమును రక్షించుటకును మిమ్ము స్తుతింతురు. ఉశిజ పుత్రుడు కక్షీవంతుని హోత అత్రి గమనముగల అశ్వములతో సుఖించవలెను. వేగవంతములగు ఆ అశ్వములు మీవే అగును.

6. మా ఋత్విక్కులారా ! ద్యుతిమంతుడు, కోరికలు తీర్చువాడు, విప్రునివలె పూజ్యుడు, స్తుతియోగ్యుడగు వాయువును యజ్ఞమునకు చేరుటకుగాను స్తుతులద్వారా రథారూఢుని చేయండి. గమనవతులు, యజ్ఞగ్రహణ కారిణులు, రూపవతులు, ప్రశంసనీయులగు దేవపత్నులు మా యజ్ఞమునకు విచ్చేయవలెను.

7. అహోరాత్రి దేవతలారా ! మీరు మహామహులు. వందనీయులగు స్వర్గస్థ దేవతల వెంట మేము నీకు సుఖప్రదములగు జ్ఞాపక మంత్రములతో హవ్యములు సమర్పింతుము.

దేవతలారా ! మీరు సకల కర్మజాతములను ఎరుగుదు. యజమాని యజ్ఞమునకు అభిముఖముగా విచ్చేయుడు.

8. మీరందరు అనేకుల పోషకులు. యజ్ఞమునకు నేతలు. స్తోత్రాదులద్వారాను, హవి సమర్పించియు మా ధనలాభము కొఱకు మిమ్ము నుతింతుము. వాస్తుపతి త్వష్టను మేము స్తుతింతుము. ధనములు ప్రసాదించునది, అన్యదేవతల వెంట సాగునది అనిందితవాణిని మేము స్తుతింతుము. వనస్పతులను ఓషధులను స్తుతింతుము.

9. వీరులవలె లోకములను స్థాపించిన మేఘము విస్తృత దాన విషయమున మాకు అనుకూలుడు కావలెను. మేఘుడు స్తుతియోగ్యుడు. ఆప్తుడు. యజనీయుడు. మానవ హితకారి. అతడు మా స్తుతులకు ప్రసన్నుడు కావలెను.

మమ్ము సమృద్ధులను చేయవలెను.

10. మేఘము వర్షకారి. అంతరిక్ష స్థితుడు. అతని గర్భస్థ జలమును రక్షింపుమని వైద్యుతాగ్నిని పాపవర్జిత శోభన స్తోత్రములతో స్తుతింతుము. అగ్ని మూడు స్థానములందుండి త్రివిధుడయి ఉన్నాడు. నేను ప్రయాణించునపుడు సుఖకర కిరణములు కలవాడగును. కోపింపడు. కాని ప్రదీప్త జ్వాలలు ధరించిన అగ్ని అడవులను ధ్వంసము చేయును.

11. మేము అత్రిగోత్రజులము. మహారుద్రపుత్రులు మరుత్తులను ఎట్లు స్తుతించవలెను? సర్వవిదుడగు భగుని ధనలాభమునకుగాను ఎట్లు స్తుతించవలెను? జలదేవత, ఓషధులు, ద్యుదేవత, వనములు, వృక్షములు కేశములుగాగల పర్వతము మమ్ము రక్షించవలెను.

12. జలములకు - అన్నములకు అధిపతి. ఆకాశ సంచారి వాయువు మా స్తుతులు ఆలకించవలెను. నగరమువలె ఉజ్వలము, పర్వతపు నలుదిశలపడు జలధార మా వాణిని వినవలెను.

13. మహామరుత్తులారా ! మీరు వెంటనే స్తుతులను తెలియండి. మేము మిమ్ము స్తుతించువారము. హవ్యములు పట్టుకొని నిన్ను స్తుతింతుము.

మరుద్గణములు అనుకూల భావమున విచ్చేయవలెను. క్షోభకలిగించు మానవవైరులను అస్త్రములు ప్రయోగించి పరిమార్చి మావద్దకు విచ్చేయవలెను.

14. దేవసంబంధి, భూసంబంధి జనులకు జల లాభమునకుగాను సుందర యజ్ఞవంతులగు మరుత్తులను స్తుతింతుము. మా స్తుతులు వర్ధిల్లవలెను. ప్రీతిదాయకము స్వర్గము సమృద్ధి సంపన్నము కావలెను. మరుత్తుల ద్వారా పరిపుష్టములగు నదులు జలపూరములు కావలెను.

15. మేము సదా స్తుతింతుము. ఉపద్రవములు నివారించి మమ్ము రక్షించుటకు సమర్థురాలు, సర్వ నిర్మాత్రి, పూజ్యురాల్గు భూమి మా స్తుతులను స్వీకరించవలెను. ప్రశస్త వచనులగు మేధావులగు స్తోతల విషయము భూమి ప్రసన్నురాలు కావలెను. అనుకూల హస్త అయి మాకు శుభములు కలిగించవలెను.

16. దానశీల మరుత్తులను మేము ఏరీతి సముచితముగా స్తుతింతుము? వర్ధమాన స్తుతుల ద్వారా ఎట్లు మరుత్తులను ఉపాసింతుము? వర్తమాన స్తుతుల ద్వారా మరుత్తులను ప్రశంసించుట ఎట్లు సాధ్యము?

అహిబుధ్న్య దేవుడు మాకు అనిష్టుడు కారాదు. శత్రువులను నష్టపరచవలెను.

17. దేవతలారా ! మానవ యజమానులు సంతానము కొఱకుగాను, పశువుల కొఱకును శీఘ్రముగా మిమ్ము ఉపాసింతురు. ఈ యజ్ఞమందు నిఋృతి దేవత కళ్యాణకర అన్నమున మా శరీరములను పోషించవలెను. వార్ధక్యమును దూరము చేయవలెను.

18. వసువులారా ! మీ సుమతి ధేనువు యొక్క బలకరము, హృదయ పోషకమగు అన్నము మాకు లభించవలెను. ఆదానశీల, సుఖదాయిని దేవి మాకు సుఖములు ప్రసాదించుటకు త్వరత్వరగా విచ్చేయవలెను.

19. గోసంఘ నిర్మాతలు ఇడ - ఊర్వశీ నదుల సహితముగా మా విషయమున అనుకూలవతులు కావలెను. నిరతిశయ దీప్తిశాలిని ఊర్వశి మా యజ్ఞాది కార్యములను ప్రశంసించవలెను. యజమానులను ప్రకాశవంతము చేయుటకు విచ్చేయవలెను.

20. అర్జువ్యరాజు యొక్క దేవసంఘము మమ్ము అనుగ్రహించవలెను.

## నలుబది రెండవ సూక్తము

ఋషి-భౌమ ఆత్రేయుడు, దేవత-విశ్వేదేవతలు, ఛందస్సు-త్రిష్టుప్.

1. హవ్య సహితులమయిన మేము నిరతిశయ, సుఖదాయక స్తుతులతో వరుణ, మిత్ర, భగ ఆదిత్యుల వద్దకు చేరుదుము.

వాయువు పంచప్రాణ సాధకుడు అంతరిక్షమున సంచరించువాడు. అప్రతిహతగమనుడు. ప్రాణదాత. సుఖ సముపార్జకుడు. అట్టి వాయువు మా స్తుతులను వినవలెను.

2. మా స్తోత్రములు హృదయంగమములు. సుఖకరములు. తల్లి బిడ్డను దగ్గరకు తీసుకున్నట్లు అదితి మా స్తోత్రములను స్వీకరించవలెను.

అహోరాత్రులకు, మిత్రావరుణులకు మేము మనోహరములు. ఆనందదాయకములు, దేవగ్రాహ్యములగు స్తోత్రములను సమర్పింతుము.

3. ఋత్విక్కులారా ! మీరు అతిశయ క్రాంతదర్శి, పురావర్తి అగ్ని - సవితను ప్రముదితుని చేయండి. మధుర సోమరసము మఱియు ఘృతమున అతనిని అభిషిక్తుని చేయండి.

సవిత మాకు పరిశుద్ధము, హితకరము, ఆహ్లాదకరమగు హిరణ్యమును ప్రదానము చేయవలెను.

4. ఇంద్రా ! నీవు ప్రసన్న మనమున మాకు గోవులను దానము చేయుము. నీవు మాకు మేధావి పుత్రులను, దేవతలకు హితకరమగు అన్నమును, యజ్ఞ దేవతల అనుగ్రహమును ప్రసాదింతువు.

5. భగదేవుడు; ధనస్వామి సవిత; వృత్రహంత ఇంద్రుడు; ధన విజేత ఋభుక్షుడు, వాజ, పురంధి ఆది సమస్త అమరులు శీఘ్రముగా మా యజ్ఞమునకు విచ్చేయవలెను. మమ్ము రక్షించవలెను.

6. మేము యజమానులము. మరుద్వంతుడగు ఇంద్రుని కార్యములను వర్ణింతుము. ఇంద్రుడు యుద్ధమున ఎన్నడును వెన్నుచూపడు. అతడు విజయుడు. జరారహితుడు.

ఇంద్రా ! నీ పరాక్రమము ఏ పురాతన పురుషునకుగాని అటు తరువాత వచ్చినవారికి గాని లభించలేదు. ఏ నవీనుడు సహితము నీ పరాక్రమమును అందుకొనలేదు.

7. అంతరాత్మా ! నీవు అతిశయ శ్రేష్ఠుడు. రమణీయ ధనదాత బృహస్పతిని స్తుతించుము. అతడు హవిర్లక్షణ ధనవిభాజకుడు. బృహస్పతి స్తోత్రకర్తలగు యజమానులకు మహాసుఖములు ప్రసాదించును. ఆహ్వానించు యజమాని వద్దకు అతడు విశేష ధనము చేకొని విచ్చేయును.

8. బృహస్పతీ ! నీవు రక్షించు మానవుడు అహింసితుడు, ధనవంతుడు, సుందర పుత్రయుక్తుడు అగును. నీవు అనుగ్రహించిన ధనవంతుడు అశ్వములు, గోవులు, వస్త్రములు దానము చేయును. అతనికి ధనలాభము కలుగవలెను.

9. బృహస్పతీ ! స్తుతిప్రతిపాదకులమగు మాకు దానము ఇవ్వక తానే సర్వము అనుభవించువానిని, వ్రతములు ఆచరించనివానిని మంత్ర విద్వేషిని నష్టపరచుము. అతని ధనమును నష్టపరచుము. అట్టివాడు ఒకవేళ సంతతి సమృద్ధుడయి, వర్ధమానుడు అగుచున్నను వానిని అంధకారమున త్రోయుము.

10. మరుత్తులారా ! దేవయజ్ఞమునకు రాక్షసులను పిలుచు యజమానిని అన్నము, అశ్వము, కృష్యాదుల ద్వారా ఉత్పన్నములగు భోగములకు బాధలు కలిగించువానిని నిన్ను స్తుతించువారిని నిందించువానిని మీరు చక్రహీన రథముగ అంధకారమున త్రోయుడు.

11. రుద్రుని ధనుర్బాణములు సుందరములు. శత్రునాశకములు. ఆత్మా ! అట్టి రుద్రుని స్తుతించుము. రుద్రుడు సమస్త ఓషధులకు ఈశ్వరుడు. ఆత్మా ! నీవు అట్టి రుద్రుని యజింపుము. రుద్రుడు ద్యుతిమంతుడు. బలవంతుడు. ప్రాణదాత. ఆత్మా ! లోక కళ్యాణమునకుగాను అట్టి రుద్రునకు పరిచర్యలు చేయుము.

12. దాంత మనస్కులు చమూసము, అశ్వము, రథము, గోవులు మున్నగువాని నిర్మాణమున కుశల హస్తులగు

ఋభువులు; వర్షణకారి ఇంద్రుని పత్ని; గంగాది నదులు; విభుకృత సరస్వతి; దీప్తిమతి రాకా మున్నగునవి దీప్తములయి ఉన్నవి. అవి మాకు ధనమును ప్రసాదించవలెను.

13. ఇంద్రుడు మహామహుడు. శుభముల రక్షకుడు. అతనికి అత్యంత స్తుత్యములు. సద్యోజాతములగు స్తుతులను సమర్పింతుము. ఇంద్రుడు వృష్టికారకుడు. అతడు కన్యారూపమగు పృథ్వి హితమునకుగాను నదులకు రూప కల్పన చేసినాడు. మాకు జలములను అనుగ్రహించినాడు.

14. స్తోతలారా ! మీ శుభంకర స్తుతులు గర్జనశీలుడు, శబ్దకారి, ఉదకస్వామి పర్జన్యుని చేరవలెను. అతడు మేఘములను ధరించును. జలవృష్టి కలిగించును. ద్యావాపృథ్వులను వైద్యుతా లోకమునుండి పరికించి పయనము సాగించును.

15. మేము సముపార్జించిన స్తోత్రము రుద్రుని యువ పుత్రులు మరుత్తుల అభిముఖమున ఉపస్థితము కావలెను.

మనసా ! ధనేచ్ఛ మమ్ము నిరంతరము ఉత్తేజితులను చేయును. వివిధ వర్ణ అశ్వములు ఆరోహించి యజ్ఞమునకు వచ్చువారిని స్తుతింపుము. "కామో రాయేహవతే".

16. ధనముకొఱకుగాను మా ద్వారా విహితములయిన స్తుతులు పృథ్వి, స్వర్గము, వృక్షములు, ఓషధులకు చేరవలెను. మా కొఱకుగాను అందరు సుందర దేవతలు ఆహూతులు కావలెను. భూమాత మాకు చెడు తలంపులు కలుగనీయరాదు.

17. దేవతలారా ! మాకు నిరంతరము నిర్విఘ్నముగా మహా సుఖభోగములు కలుగవలెను.

18. అశ్వినుల రక్ష ఆనందదాయకము. సుఖసంపన్నము. అంతకుముందు మరెవరికి లభించని అశ్వినుల రక్ష మాకు లభించవలెను. అమరులగు అశ్వినులారా ! మీరు మాకు ఐశ్వర్యమును, వీరపుత్రులను, సౌభాగ్యమును ప్రసాదించుడు.

## నలుబది మూడవ సూక్తము

ఋషి - అత్రి, దేవత - విశ్వేదేవతలు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వేగవతులగు నదులు బాధలు కలిగించక మధుర రసముతో మావద్దకు విచ్చేయవలెను. విశేష ప్రీతి కలిగించు స్తోతలు మహాధనలాభమునకుగాను ఆనందదాయకములగు సప్తమహానదులను ఆహ్వానించవలెను.

(శాయణుడు ఏడు నదుల పేర్లు ఇవ్వలేదు. "ఇమే గంగా ఇతి మంత్రోక్తః" అన్నాడు. వీటిని గంగ అనియే మంత్రము చెప్పుచున్నది.

మాక్సుముల్లర్ పంజాబులో ప్రవహించు అయిదు నదులతోపాటు సింధు, సరస్వతి కలిపి సప్తనదులని చెప్పినాడు. సప్త సింధూ దేశము పేరు కూడ కావచ్చును.)

2. మేము శుభంకర స్తవము హవ్యము ద్వారా - అన్న లాభమునకుగాను - అహింసారూపములగు ద్యావాపృథ్వులను ప్రసన్నము చేయవలెనని కోరుచున్నాము. ప్రియవదన, శోభన హస్త, యశోయుక్త, మాతా పితృస్వరూప ద్యావాపృథ్వులు యుద్ధమున మమ్ము రక్షింపవలెను.

3. అధ్వర్యులారా ! మధుర ఆజ్యాది హవ్యమును సమర్పించండి. రమణీయము, దీప్తమగు సోమమును సర్వప్రథమముగా వాయువుకు సమర్పించండి. వాయువా ! నీవు హోతవలె ఈ సోమమును ఇతర దేవతలకన్న ముందు స్వీకరించుము. ఈ మధుర సోమరసమును నీ ఆనందమునకుగాను సమర్పించుచున్నాము.

4. ఋత్విక్కుల సోమ పేషకములగు పది చేతివ్రేళ్లు సోమరస నిష్పంద పటుత్వముగల రెండు బాహువులు శిలలను గ్రహించును. కుశలాంగుళియుక్తులగు ఋత్విక్కులు ఆనందితులయి సోమలత నుండి శైలజ రసమును పితుకుదురు. సోమము నుండి శుభ్ర రసము స్రవించును.

5. ఇంద్రా ! నిన్ను సేవించుటకు - వృత్రాదివధ కార్యములకు - నీ బలమునకు - నీకు మహా హర్షము కలిగించుటకు నీకు సోమరసము అర్పించబడును. అందుకే నిన్ను మేము ఆహ్వానింతుము. నీవు ప్రియములు, సుశిక్షితములు, వినమ్రములగు అశ్వద్వయమును రథయుక్తము చేసి మా వద్దకు విచ్చేయుము.

6. అగ్నీ ! నీకు మాకు ప్రియంకరుడవు. మధుర సోమర్స పానమున ప్రహృష్టమగుటకుగాను దేవతల మార్గమున గ్నాందేవిని మావద్దకు కొనిరమ్ము. బలశాలినియగు ఆదేవి సర్వత్ర సంచరించ వలెను. యజ్ఞమును తెలిసికొనవలెను. స్తోత్రముల సహితముగా ఆ దేవికి హవిసమర్పితము కావలెను. ("గ్నాః గ్నాం దేవీం సర్వైర్గంతవ్యా మేతే న్నామకాం దేవతాం" అని శాయణుడు. అందరు చేరుకోగల దేవత గాన ఆ పేరు వచ్చినదని.

"గచ్ఛన్తి జ్ఞానం యయా" అని దయానందుడు జ్ఞానము కలిగించు దేవత అని. గ్నామ్ స్త్రీకి సమానార్థము)

7. మేధావులైన అధ్వర్యులు తండ్రి వడిలో తనయునివలె అగ్నిమీద హవ్యపాత్రను స్థాపించినారు. అది చూడగా స్థూలకాయముగల పశువును వారందరు అగ్నిద్వారా పితుకుచున్నట్లున్నది.

8. మా ఈ స్తోత్రము పూజనీయము. మహంతము. సుఖదాయకము. అశ్వినులను ఈ స్థానమునకు

ఆహ్వానించుటకు మా స్తోత్రము దూతవలె పనిచేయవలెను. సుఖదాయకులగు అశ్వినులారా ! మీరు ఒకే రథమున ఎక్కి మేము సమర్పించు సోమము వద్దకు - బరువు మోయు మేకువలె- విచ్చేయండి. మేకులేని నాభితో రథము నడువనట్లు మీరు లేకుండ సోమయాగ నిర్వహణ జరుగదు.

9. మేము బలవంతుడు, వేగవంతుడగు పూష మఱియు వాయుదేవులను స్తుతింతుము. ఆ ఉభయులు ధనము, అన్నమునకుగాను జనుల బుద్ధులను ప్రేరేపించవలెను. వారు ధనదానము చేయవలెను.

10. అగ్నీ ! నీవు సమస్త సృష్టిని ఎరిగినవాడవు. మేము నిన్ను ఆహ్వానించుచున్నాము. నీవు ఇంద్ర వరుణాది నామములు ధరించి విభిన్నాకృతులుగల నిఖిల మరుత్తులను యజ్ఞమునకు తీసికొని రమ్ము.

మరుత్తులారా ! మీరు సకల రక్షణలతో యజమాని యజ్ఞమునకు ఫలవతి స్తుతికి - పూజకు విచ్చేయండి.

11. సరస్వతి మాచే పూజలు అందుకొన తగినది. ఆమె ద్యుతిమంతమగు ద్యులోకము నుండియు మహా మేఘమునుండియు యజ్ఞస్థలమున అవతరించవలెను. ఆమె మా స్తుతులకు ప్రసన్నం కావలెను. స్వేచ్ఛగా సుఖకరములగు సంపూర్ణ స్తోత్రములను ఆలకించవలెను.

12. బృహస్పతి బలవంతుడు. పుష్టికారకుడు. స్నిగ్ధాంగుడు. అతనిని యజ్ఞగృహమున స్థాపించవలెను. అతడు గృహమధ్యమున నిలిచి అంతట వెలుగులు విరజిమ్మగలడు.

బృహస్పతి హిరణ్యవర్ణుడు. దీప్తిమంతుడు. మేము అతనిని పూజింతుము.

13. అగ్ని సమస్తమును భరించును. అతడు అత్యంత దీప్తిశాలి. అభీష్టవరదుడు. శిఖా, ఓషధి సమూహమున ఆచ్ఛాదితుడు. అప్రతిహతగమనుడు. లోహిత, శుక్ల, కృష్ణవర్ణ త్రివిధ శృంగ జ్వాలా విశిష్టుడు. వృష్టికారకుడు. అన్నదాత. మేము అతనిని ఆహ్వానించుచున్నాము. అగ్ని సంపూర్ణ రక్షణలతో విచ్చేయవలెను.

14. యజమానియొక్క హోత, హవ్యపాత్రధారి ఋత్విగ్గణము - మాతృస్వరూప పృథ్వి ఉజ్వల, ఉత్కృష్టమగు ఉత్తరవేదికి చేరుదురు. చిరంజీవి అగుటకు పసిబిడ్డను నిమిరినట్లు నవజాత కొమలాంగుడగు అగ్నిని స్తుతులు, హవ్యప్రదానముచేసి పోషింతురు.

15. అగ్నీ ! నీవు బృహత్ స్వరూపుడవు. వ్రతములందు చిక్కిన దేహములుగల దంపతులు నీకు ఒకేసారి విశేష అన్నమును అర్పింతురు. దేవగణములు మాచే ఆహూతులు కావలెను. తల్లి భూదేవి మా విషయమున విరుద్ధబుద్ధి కలిగి ఉండరాదు.

16. దేవతలారా ! మేము మర్యాదగల, బాధలు లేని సుఖములు అనుభవించవలెను.

17. అశ్వినులరక్ష ఆనందదాయకము. సుఖసంపన్నము. అంతకుముందు మరెవరికి లభించని అశ్వినులరక్ష మాకు లభించవలెను. అమరులగు అశ్వినులారా ! మీరు మాకు ఐశ్వర్యమును, వీరపుత్రులను, సౌభాగ్యమును ప్రసాదించుడు.

## నలుబది నాలుగవ సూక్తము

ఋషి - కశ్యపగోత్రజుడు అవత్సారుడు దేవత - విశ్వేదేవతలు, ఛందస్సు - జగతి 14, 15 త్రిష్టుప్.

1. ప్రాచీన యజమానులు. మా పూర్వులు సమస్త ప్రాణిజాలము. ఆధునికులు ఇంద్రుని స్తుతించి పరిపూర్ణ మనోరథులు అయినారు. అంతరాత్మా ! అట్లే నీవు ఇంద్రుని స్తుతించి పరిపూర్ణ మనోరధుడవు అగుము.

ఇంద్రుడు దేవతలలో శ్రేష్ఠుడు. కుశాసీనుడు. సర్వజ్ఞుడు. సముఖవర్తి. బలశాలి. వేగవంతుడు. జయశీలుడు. అంతరాత్మా ! స్తుతుల ద్వారా ఇంద్రుని వర్ధిల్ల చేయుము.

2. ఇంద్రా ! నీవు స్వర్గమునందలి కాంతిని విస్తరింప చేతువు. వర్షించని మేఘమధ్యమున అందమగు జలరాశి ఉండును. మానవ హితమునకుగాను ఆ మేఘమును ప్రేరేపింతువు. అన్ని దిశలందు వర్షము కలిగింతువు. వృష్టి మున్నగు చక్కని పనుల ద్వారా నీవు మానవ జాతిని రక్షింతువు. నీవు ప్రాణులను వధించకుము. శత్రువుల మాయలను అతిక్రమింపుము.

ఇంద్ర ! నీ పేరు సత్యలోకమున ప్రఖ్యాతము.

3. ఇంద్రుడు అప్రతిహతగమనుడు. హోమ నిర్వాహకుడు. బలవిధాయకుడు. ఫలప్రదాత. శిశువు. తరుణుడు. జరారహితుడు. ఓషధుల మధ్య స్థితుడు. విశేషముగ కుశలమీద సంచరించువాడు. నిత్యము, ఫలసాధకము, విశ్వదారకము అగు హవ్యమును అగ్ని నిరంతరము వహించును.

4. యజ్ఞమును వర్ధిల్లచేయు సూర్యకిరణములు పరస్పర సంయుక్తములయి - యజమాని కొఱకుగాను యజ్ఞ భూమిలో సంచరించు అభిలాషతో అవతీర్ణములు అగును. సూర్య కిరణములు వేగగాములు. అందరిని నియమించునవి. ఈ సమస్త కిరణములతో ఆదిత్యుడు జలరాశిని దిగువ్ ప్రాంతమునకు ప్రేరేపించును.

5. అగ్నీ ! నీ స్తోత్రము అత్యంత మనోహరము. సోమరసము చెక్క పాత్రలో ఉండును. దానిని నీవు స్వీకరింతువు. మనోహర స్తోత్రములను ఆలకింతువు. అట్లు నీవు ఉల్లాసవంతుడవు అగుదువు. అప్పుడు నీవు ఉపాసకుల మధ్య

ఎంతో శోభింతువు.

జీవనదాతా ! యజ్ఞమున నీవు రక్షించుజ్వాలను సర్వత్ర వర్ధిల్లచేయుము.

6. ఇది ఎట్లు కనిపించునో అట్లే వర్ణించబడును. సాధక దీప్తియుక్తమయి అది జలమధ్యమున తన రూపము ధరించును.

ఆ దేవతలు మాచే పూజింపబడవలెను. వారు మాకు విశేషధనము, మహావేగము, అసంఖ్యాకులగు వీర పుత్రులను, అక్షయ బలమును ప్రసాదించవలెను.

(శాయణుడు "ఏషావైశ్వదేవీ" ఈమెవైశ్వదేవి అన్నాడు. మంత్రమున ఆ పేరు కనిపించదు. వైశ్వదేవిని గురించి వివరణ లేదు. "యాదృగేవదృశ్యతే తాదృగుచ్యతే" అని మంత్రము)

7. సూర్యుడు సమదర్శి. అగ్రగామి. అతడు అసురులతో యుద్ధాభిలాషగలవాడు. భార్య ఉషతో విహరించుటకు సాహస పూర్వకముగ అగ్రసరుడు అగును. ధనము సూర్యాధీనము. అతడు మాకు ఉజ్వలము, సర్వత్ర రక్షణలు కలిగించు గృహమును పరిపూర్ణ సుఖమును ప్రసాదించవలెను.

8. సూర్యుడు సర్వదేవ శ్రేష్ఠుడు. సూర్యా ! యజమానులు నీవద్దకు చేరుదురు. నిన్ను ఉదయాది లక్షణముల ద్వారా తెలుసుకొనవచ్చును. ఋషులు నిన్ను స్తుతింతురు. అందున నీ పేరు వర్ధిల్లును.

ఋషులు కోరిన దానిని వారు తమ కార్యముల ద్వారా సాధింతురు. మనస్ఫూర్తిగా పూజించువారికి ఫలితము దక్కును.

9. మా సమస్త స్తోత్రములందు ప్రధాన స్తోత్రములు సముద్రతుల్యుడగు సూర్యుని చేరును. యజ్ఞ గృహమున విస్తరించిన సూర్య స్తుతికి క్షతిలేదు. పవిత్ర సూర్యునకు తవ చిత్తము సమర్పించిన ఉపాసకుని హృదయగత అభిలాష విఫలముకాదు. ఫలించును.

10. సవిత అందరితో స్తుతించబడువాడు. అందరి కోరికలు పూరించువాడు. అతనివద్ద మాకు క్షత్రి - మనన - అవద-యజత సిద్ధి - అవత్సారనామక ఋషిజ్ఞానులద్వారా భోగయోగ్యము బలప్రదమగు అన్నము లభించును.

11. విశ్వవార, యజత, మాయీ ఋషుల సోమరస జనిత మదము ప్రశంసనీయ గమనముగల శ్యేన పక్షివలె శీఘ్రగామి అగును. అదితివలె విస్తారమగును. వారు సోమ పానమునకుగాను పరస్పరము ప్రార్థింతురు. విశేషపానము చేయుదురు. అతిరిక్త మత్తత పొందుదురు.

12. సదాస్పృణ; యజత; భువృక్తః; శృతవిత్; తర్య ఋషులు మీతో కలిసి శత్రుసంహారము చేయవలెను. ఆ ఋషులు ఇహపర లోకములందు సకల శ్రేష్ఠకోరికలను సాధించి దీప్తులు కావలెను. ఎందుకనగా వారు హవ్యము, స్తోత్రములద్వారా విశ్వదేవతలను ఉపాసింతురు.

13. యజమాని అవత్సారుని యజ్ఞమున సుతంభర ఋషి సుందర ఫలముల పాలయిత అగును. సమస్త యజ్ఞకార్యములు ఫలప్రదములగును. గోవులు స్వాదుదుగ్ధములను ప్రదానము చేయును. పాలు అందించబడును. ఈ క్రమమును చాటి అవత్సారుడు నిద్రను వదిలి అధ్యయనము సాగించును.

14. సర్వదా గృహమున జాగృతులగు దేవతలను ఋక్కులు అభిలషించును. సర్వదా జాగృతుడగు దేవతలను సామము వరించును. సర్వదా జాగృతుడగు దేవతతో అభిషుత సోమము ఇట్లనవలెను.

"మమ్ము స్వీకరించుము. అగ్నీ ! నీనియత స్థానమున సహవాసము చేయుదుము"

"ఆహతవాహమస్మి సఖ్యేన్యోకాః"

15. అగ్ని సర్వదా గృహమున జాగృతుడగును. ఋక్కులు అతనిని అభిలషించును. అగ్ని సర్వదా జాగృతుడగును. సామము అతనిని వరించును. అగ్ని సర్వదా జాగృతుడగును. అతనితో అభిషుత సోమము ఇట్లనవలెను.

"ఆహతవాహమస్న్ని సఖ్యేన్యోకాః"

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగవ అష్టకము ఐదవ మండలమున మొదటి అధ్యాయమున మూడవ అనువాకము సమాప్తము)

**నాలుగవ అనువాకము నలుబది అయిదవ సూక్తము**

ఋషి - ఆత్రేయ సదాపృణుడు, దేవత - విశ్వేదేవతలు, ఛందస్సు - త్రిష్టుప్.

1. అంగిరులు ఇంద్రుని స్తుతించినారు. ఇంద్రుడు స్తుతులు విన్నాడు. స్వర్గమున వజ్రము అందుకున్నాడు. పణులు అపహరించి దాచిన గోవులను పునరుద్ధరించినాడు.

కదలివచ్చు ఉషాకిరణములు సర్వత్ర వ్యాపించును. పుంజీభూత అంధకారమును నష్టపరచి సూర్యుడు

ఉదయించును. అతడు మానవుల ఇళ్లవాకిళ్లను తెరిపించినాడు.

2. ఘట, పటాది పదార్థము భిన్న రూపములుగా కనిపించును. అట్లే సూర్యుడు తన దీప్తిద్వారా విస్తరితుడగును. కిరణజాలములకు జనని ఉష సూర్యుని ఆగమమునకు వీక్షించి విస్తార అంతరిక్షమున అవతరించును. దరులను కూల్చునదులు ప్రవాహమానమగు జలరాశి వెంట ప్రవహించును. ఇంటిని నిలుపుటకు ఏర్పరచిన గట్టి స్తంభమువలె స్వర్గము సుదృఢ భావమున నిలిచి ఉండును.

3. మహాస్తోత్రముల స్రష్టలగు ప్రాచీనులవలె మేము ఎంతకాలము స్తుతింతుమో అంతకాలము మేఘ గర్భములందున్న జలరాశి మా మీద పడుచుండును. మబ్బులు వాన కురిపించును. ఆకాశము తన కార్యసాధన చేయును. సర్వత్ర పరిచర్యలు చేయు అంగిరులు కర్మానుష్ఠానము ద్వారా నితాంత పరిశ్రాంతులు అగుదురు.

4. ఇంద్రాగ్నులారా ! మా రక్షణ కొఱకు దేవతలు సేవించు ఉత్కృష్ట స్తోత్రములతో మేము మీ ఇద్దరిని ఆహ్వానింతుము. చక్కగా యజ్ఞము చేయు మరుత్తులవలె కర్మతత్పరులు, పరిచర్యలు చేయు జ్ఞానులు స్తోత్రములతో మీ ఉభయులను ఉపాసింతురు.

5. ఈ యజ్ఞదినమున శీఘ్రముగ విచ్చేయుడు. మేము శుభంకర కర్మలు చేయువారలము. ప్రత్యేకముగ శత్రువులను హింసింతుము. ప్రచ్ఛన్న శత్రువులను దూరము చేయుదుము. యజమానులముందుకు త్వరత్వరగా చేరుదుము.

(ఇవి అంగిరులు అన్నమాటలు)

6. మిత్రులారా ! రండు, మనము స్తోత్ర పాఠము చేతము. ఎవనిద్వారా దొంగలించబడిన గోవుల కొట్టము కనిపెట్టబడినదో, ఎవనిద్వారా మనువు హనువిహీన శత్రువును జయించినాడో, ఎవనివలన వర్తకునివలె బహుఫలాకాంక్షి - కక్షీవంతుడు జలమునుకోరి, అడవులకు పోయి జలము పొందినాడో.

(అతనిని స్తుతింతమని "ఇదమప్యంగిరసాం వాక్యం" ఇదియ అంగిరస వాక్యము)

7. ఈ యజ్ఞమున ఋత్విక్కుల చేతులందు కదలాడిన శిలాఖండ శబ్దము ఉత్పన్నమగును. ఆ శబ్దము ద్వారముననే నవశ్వులు, దశశ్వులు ఇంద్రుని పూజించినారు.

యజ్ఞమందున్న సరమ గోవులను పొందినది. అంగిరుల సకల స్తవాది కర్మలు సఫలములు అయినవి.

8. అది పూజనీయ ఉష అవతరించిన కాలము. అప్పుడే అంగిరులకు గోవులు లభించినవి. గోవులు ఉషతో కలిసినపుడు సత్యమార్గమున సరమ గోవులను చూచినది. అంతట అక్కడి ఉత్కృష్ట యజ్ఞశాలలలో పాలవాగులు

పారినవి.

9. సూర్యుడు ఏడు గుఱ్ఱముల స్వామి. అతడు మా ముందుకు విచ్చేయవలెను. అతడు శ్రమ సాధ్యమగు బాటన ఒక సుదూర గంతవ్య ప్రదేశమునకు చేరవలసి ఉన్నది. సూర్యుడు శ్యేన పక్షివలె శీఘ్రగామి యయి సమర్పిత హవ్యము కొఱకు అవతరించును. అతడు స్థిర యవ్వనుడు. దూర దర్శి.

సూర్యుడు. నిజ కిరణముల మధ్య నిలిచి వెలుగులను పరచును.

10. ఉజ్జ్వల జలరాశిమీద సూర్యుడు ఆరోహించును. అతడు వెలుగు వెన్నుగల గుఱ్ఱములను రథమునకు జోడించినపుడు ధీమంతుడగు యజమాని - నదిలోని ఓడనువలె సూర్యుని ఆహ్వానించును. అతని ఆదేశము వినియే జలరాశి అవనతమగును.

11. దేవతలారా ! ఈ స్తోత్రము సర్వదాయకము. ఈ స్తోత్రముననే నవగ్వులు దశమాస సాధ్య యజ్ఞమును సముపార్జించినారు. మేము నీటి కొఱకుగాను అట్టి స్తోత్రములతో మిమ్ము స్తుతింతుము. ఏ స్తోత్రము ద్వారా మాకు దేవతల రక్షణ కలుగునో, దేనివలన పాపపు సీమను అతిక్రమించగలమో అట్టి స్తోత్రమును ఉచ్చరింతుము.

## నలుబది ఆరవ సూక్తము

ఋషి - ప్రతిక్షత్రుడు, దేవత - తొలి ఆరింటికి విశ్వేదేవతలు, మిగిలినవారికి దేవపత్నులు, ఛందస్సు - జగతి 2, 3 త్రిష్టుప్.

1. సర్వజ్ఞ ప్రతిక్షుత్రుడు శకటమున అశ్వమువలె తనను యజ్ఞభారమునకు జోడించినాడు. హోతలమగు మేము అలౌకిక రక్షావిధాయక భారమును వహింతుము. ఈ భారమును తప్పించు కొనవలెను అనుకొనము. ఈ భారము మాటి మాటికి మాకు కలుగవలెనని సహితము కోరము. దారి తెలిసిన అంతర్యామి దేవతలు పురోగాములయి సరళ మార్గమున మానవులను నడిపించవలెను.

2. అగ్ని - ఇంద్ర - వరుణ - మిత్రాది దేవతలారా ! మీరందఱు మాకు బలమును ప్రసాదించండి. విష్ణువు, మరుత్తులు మాకు బలమును ప్రసాదించవలెను. ఆసత్యద్వయము, రుద్రుడు, దేవ పత్నులు, పూష, భగుడు, సరస్వతి మా పూజలకు ప్రసన్నులు కావలెను.

3. మా రక్షణకుగాను మేము ఇంద్రుని - అగ్నిని - మిత్రుని - వరుణుని అదితిని - ఆదిత్యుని - ద్యావాపృథ్వులకు - మరుత్తులను - పర్వతములను- జలములను - విష్ణువును - బ్రాహ్మణస్పతిని సవితను ఆహ్వానింతుము.

4. విష్ణువు - అహింసకారి వాయువు - దానదాత సోముడు మాకు సుఖములు ప్రసాదించవలెను. ఋభువులు - అశ్వినులు - త్వష్ట - విభుడు మాకు ఐశ్వర్యము ప్రసాదించుటకు అనుకూలురు కావలెను.

5. పూజనీయులు స్వర్గలోక స్థితులు మరుద్గణములు కుశలపై ఆసీనులగుటకు మావద్దకు రావలెను. బృహస్పతి - పూష - వరుణుడు - మిత్రుడు - ఆర్యమ మాకు గృహసంబంధములగు సంపూర్ణ సుఖములను ప్రసాదించవలెను.

6. శుభంకర స్తోత్రవంతములగు పర్వతములు దానశీలలగు నదులు మమ్ము రక్షించవలెను. ధనదాత భగుడు అన్నము, రక్షణలతో విచ్చేయవలెను. సర్వత్ర వ్యప్తయగు అదితి మా స్తోత్రములను ఆలకింపవలెను.

7. ఇంద్రాది దేవతల పత్నులు మా స్తోత్రములు వినవలెను. మమ్ము రక్షించవలెను. వారు మాకు బలశాలురగు పుత్రులను, సమృద్ధ అన్నమును ప్రసాదించవలెను.

దేవేరులారా ! మీరు భూమిమీద ఉన్నను అంతరిక్షమున ఉన్నను ఉదక వ్రతమున నిమగ్నులగుడు. మేము మిమ్ము ఆహ్వానించుచుందుము. మీరు మాకు సుఖములు అనుగ్రహించుడు.

8. దేవేరులగు దేవపత్నులు హవ్యమును ఆరగించవలెను. ఇంద్రాణి; అగ్నాని; దీప్తిమతి; అశ్విని; రోదసి; వరుణాని ఆదులు విశేషముగా మా స్తుతులను వినవలెను. దేవ పత్నులలో ఋతువుల అధిష్ఠాత్రిదేవి మా స్తోత్రములను ఆలకించవలెను. హవ్యమును ఆరగించవలెను.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఐదవ మండలమున నాలుగవ అష్టకము రెండవ అధ్యాయము సమాప్తము)

*ఓం వతామినన్తి మాయినో వధీరావ్రతా దేవావాం ప్రధమాధ్రివాణి*
*నరోదసీ అద్రుహా వేద్యాభిరన్న పర్వతావి వమేస్థివాంసః*

**మూడవ అధ్యాయము          నలుబది ఏడవ సూక్తము**

ఋషి - ప్రతిరథుడు, దేవత - విశ్వేదేవతలు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉష పరిచర్యకారిణి, నిత్యతరుణి, పూజనీయ; పూజిత ఉష ఆహూతురాలై శక్తిగల తల్లివలె కన్యస్వరూప పృథ్విని ఆలకించును. మానవులను పనులందు ప్రవర్తితులను చేయును. ద్యులోకమునుండి రక్షకులగు దేవతల సహితముగా యజ్ఞభూమికి విచ్చేయును.

2. కిరణములు ఎల్లలు ఎరుగనివి. సర్వత్ర వ్యాపించునవి. అవి వెలుగులతో తమ కర్తవ్యమును నిర్వహించును. అమర సూర్యమండలమున ఏకత్రితమగును. ద్యావాపృథివి, అంతరిక్షములకు పయనించును.

3. సూర్యుని రథము జలప్రదము. దేవతలకు ఆనందాయకము. దీప్తిమంతము, ద్రుతగామి. అది జనక స్వరూపమగు తూర్పుదిక్కున ప్రవేశించినది. తదుపరి స్వర్గమధ్యమున నిలిచినది. విభిన్న వర్ణుడు, సర్వవ్యాపి సూర్యుని అంతరిక్షపు ఉభయ భాగముల అగ్రసరుని చేసినది. సూర్యుడు జగత్తులను రక్షించుచున్నాడు.

4. నలుగురు ఋత్విక్కులు తమ శుభములు కోరి సూర్యుని హవి సమర్పించి సేవింతురు. సూర్యుడు దశ దిశల గర్భజాతుడు. దశదిశలు సూర్యుని నిత్యగమనమునకు ప్రేరేపించును. ఆదిత్యునకు శత, గ్రీష్మ; వర్ష; భేదమున త్రివిధ కిరణములు కలవు. ఆ కరిణములు అంతరిక్షపు సీమలందు ద్రుతవేగమున సంచరించును.

5. పురోభాగమున దృశ్యమానమగు సూర్యమండలము అత్యంత స్తవనీయము. ఈ మండలము నుండియే నదులు ప్రవహించును. జలరాశి ఇందుననే నిలిచి ఉండును. అంతరిక్షమున ఇతర యుగళములతో సమాన బలముగల అహోరాత్రులు ఇందునుండియే ఉత్పన్నములు.

ఋత్విక్కులారా ! మీరు ఆమండలమును సేవించుడు.

6. అట్టి సూర్యుని కొరకే యజమానులు స్తోత్రములను, యజ్ఞములను విస్తరింతురు. పుత్ర స్వరూపుడగు సూర్యుని కొరకే తల్లులు-ఉష-దిశలు-బట్టలు నేయును. వర్షకారి సూర్యుని సంపర్కమున తృప్తులయిన పత్నీ స్వరూపరశ్ములు ఆకాశమార్గము నుండి మావద్దకు అవతరించును.

7. మిత్రావరుణులారా ! ఈ స్తోత్రమును స్వీకరించండి.

అగ్నీ ! మాకు కలగలుపు సుఖములు కలుగుటకుగాను ఈ స్తోత్రమును స్వీకరించుము. మేము కీర్తి ప్రతిష్ఠల వారలము కావలెను. మేము దీప్తిమంతుడు, శక్తిమంతుడు, సకల జనులకు ఆశ్రయ భూతుడగు సూర్యునకు ప్రణమిల్లుదుము.

**నలుబది ఎనిమిదవ సూక్తము**

ఋషి - ప్రతిభానుడు, దేవత - విశ్వేదేవతలు, ఛందస్సు - జగతి.

1. వైద్యుత విద్యుత్ సంబంధ తేజము సర్వప్రియము. పూజనీయము. బలములు అతని ఆధీనములు. అన్నములు

అతని స్వాధీనములు. ఆచ్ఛాదనకారియగు ఆగ్నేయశక్తి ప్రజ్ఞారూపమగును. అది మబ్బుల పైభాగమున వాననీటిని విస్తారము చేయును.

మేము అట్టి వైద్యుతాగ్నిని ఎప్పుడు పూజించగలము?

2. ఋత్విక్కుల ద్వారా లభించగల జ్ఞానమును ఉషస్సులు బోధించగలవా? ఉషస్సులు ఒకరకముగా ఆవరించు కాంతిని సకల జగములందు వ్యాపింప చేయును. దేవాభిషులగు జనులు గడచిన, రానున్న ఉషస్సులను వదిలి వర్తమాన ఉషస్సువలన తమ బుద్ధిని వర్ధిల్ల చేసికొందురు.

3. ఇంద్రుడు అహోరాత్రముల విష్పన్నమగు సోమము సేవించును. హృష్టుడగును. అప్పుడు మాయావి వృత్రునిపైకి తన సుధీర్ఘ వజ్రమును ప్రదీప్తము చేయును. ఇంద్రాత్మక ఆదిత్యుని శతసంఖ్యాక రశ్మలు దినములను నివర్తితము, ప్రరివర్తితము చేయును. అవి తమ ఇల్లగు ఆకసమున సంచరించును.

4. పరశువు వంటి అగ్నియొక్క స్వాభావిక స్వరూపమును మేము చూచినాము ! రూపవంతుడగు ఆదిత్యుని కీర్తిపుంజమును మా భోగలాభమునకుగాను కీర్తింతుము. ఆదిత్యుడు సహాయకుడయి యజ్ఞస్థలమునకు ఆహ్వానించు యజమానికి అన్నపూర్ణ గృహము రత్నములు ప్రదానము చేయవలెను.

5. అగ్ని రమణీయ తేజమున ఆచ్ఛాదితుడగును. అంధకారమును అడుగంటించును. శత్రువులను దునుమాడును. అగ్ని నలుదిశల తన జ్వాలలను విస్తరించును. జిహ్వాద్వారా ఘృతాదులను స్వీకరించును. పురుషత్వము బలము ద్వారా కోరికలు తీర్చు అగ్నిని మేము ఎరుగము. ఏలననగా భజనీయుడగు సవిత వరణీయమగు ధనమును ప్రదానము చేయును.

## నలుబది తొమ్మిదవ సూక్తము

ఋషి - ఆత్రేయ ప్రతిప్రభుడు, దేవత - విశ్వేదేవతలు ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇదిగో ఇప్పుడే మేము మీ యజమానులకొఱకు సవిత మఱియు భగుని వద్దకు చేరుదుము. వారు మనవ యజమానులకు ధనము ప్రదానము చేయుదురు.

నేతృ స్వరూపులగు బహుభోగ కర్తలు అశ్వినులారా ! మేము మీ మైత్రి కోరుచున్నాము. మేము నిత్యము మీ ఉపస్థితికి ప్రార్థింతుము.

2. సవిత శత్రు నివారకుడు. అంతరాత్మా ! నీవు సవిత ప్రత్యాగమనమును తెలియుము. స్తోత్రములద్వారా అతని

పరిచర్య చేయుము. సవిత మానవులకు శ్రేష్ఠ ధనము ప్రసాదించును. అతనికి నమస్కరించిగాని హవిస్సులు అర్పించిగాని స్తుతించుము.

3. అగ్ని పోషకుడు. భజనీయుడు. అఖండుడు. అతడు నాలుకతో కట్టెలను కాల్చును. సూర్య తేజమును కప్పివేయును.

ఇంద్ర విష్ణు, వరుణ మిత్ర అగ్ని ఆది దర్శనీయ దేవతలు దినములను ఉత్పన్నము చేయుదురు.

4. ఎంతటివాడును తిరస్కరించజాలని సవిత మాకు అభిమత ధనమును ప్రదానము చేయవలెను. ఆ ధనమును మాకు అందించుటకు స్పందనశీల నదులు ప్రవహించవలెను. అందుకే మేము యజ్ఞహోతలము. స్తోత్రపాఠము చేయుదుము. మేము బహువిధ ధనస్వాములము కావలెను. అన్నము, బలము రమణీయులము కావలెను.

5. వసువులను గమనశీల అన్నము అర్పించిన యజమానికి మిత్రావరుణులను స్తుతించిన వానికి మహా తేజస్సు కలుగవలెను. దేవతలారా ! వారికి దీర్ఘతర సుఖమును ప్రసాదించుడు. మాకు ద్యావాపృథ్వుల రక్షణ లభించవలెను. మేము హృష్టులము కావలెను.

## ఏబదవ సూక్తము

ఋషి - ప్వస్త్యాయముని, దేవత - విశ్వదేవతలు ఛందస్సు - అనుష్టుప్, చివరిది పంక్తి.

1. సర్వజనులు సవిత స్నేహముకోరి ప్రార్థింతురు. సర్వమానవులు సవిత నుండి ధనము కోరుదురు. సవిత అనుగ్రహమున సర్వజనులు పుష్టి కొఱకు తగిన ధనమును పొందుదురు.

2. నేతా ! దేవా ! మేము యజమానులము. నీ ఉపాసకులము. హోతలు ఇంద్రాదిదేవతల ఉపాసకులు. మేము మీవారము కావలెను. మేము ధనయుక్తులము కావలెను. మా కోరికలు తీరవలెను.

3. ఈ యజ్ఞమున ఋత్విజుల అతిథులవంటి దేవతలకు పరిచర్య చేయండి. దేవపత్నులకు హవి సమర్పించి పరిచర్య చేయండి దేవతలారా ! దూరమార్గమున వర్తించు శత్రువులను దూరము చేయండి.

4. యజ్ఞవాహకమగు యూపయోగ్య పశువు యూపస్తంభమున ఉన్న యజ్ఞమున సవిత యజమానికి కౌశల్యముగల ధీరురాలగు స్త్రీవలె పుత్ర భృత్యాది ధనమును ప్రసాదించును.

5. నేతా ! సవితా ! నీ రథము ధనవంతము. అది అందరిని పాలించునది. ఆ రథము మాకు శుభములు

కలిగించవలెను. మేము స్తుతి యోగ్యుడగు సవిత స్తోతలము. ధనము, సుఖమునకుగాను సవితను స్తుతింతుము.

## ఏబది ఒకటవ సూక్తము

ఋషి - స్వస్త్యాత్రేయుడు, దేవత - విశ్వేదేవతలు
ఛందస్సు - 1-4 గాయత్రి, 5-10 ఉష్ణిక్, 11-13 త్రిష్టుప్, 14-15 అనుష్టుప్.

1. అగ్నీ ! మేము హవ్యము సమర్పించు యజమానులము. ఇంద్రాది సకల రక్షక దేవతలతో సోమపానమునకు మా వద్దకు విచ్చేయుము.

2. సత్యస్తుతుల దేవతలారా ! మీరందరు మా యజ్ఞమునకు విచ్చేయండి. అగ్ని జిహ్వాద్వారా ఆజ్యమును, సోమరసమును స్వీకరించండి.

3. అగ్నీ ! నీవు అభీష్టవరుదుడువు. పూజనీయుడవు. ఉదయమున వచ్చు దేవతల సహితుడవయి సోమపానమునకు విచ్చేయుము.

4. పురోభాగమున ఉంచబడిన ఈ సోమము అభిషవణ ఫలకమున అభిషవించబడినది. పాత్రలో నింపబడినది. ఇది ఇంద్ర వాయువులకు ప్రియమయినది. ఇంద్ర వాయువులారా ! ఈ సోమరస పానమునకు విచ్చేయుడు.

5. వాయువా ! హవి అందించు యజమాని విషయమున ప్రీతుడవగుము. సోమపానమునకు విచ్చేయుము. విచ్చేసి అభిషుత సోమమును సేవింపుము.

6. ఇంద్ర వాయువులారా ! మీరు అభిషుత సోమపాన యోగ్యులు. కావున అహింసకులయి సోమరసమును సేవించండి. సోమాత్మక అన్నము కొఱకు విచ్చేయండి.

7. ఇంద్రవాయువుల కొఱకు పెరుగు కలిపిన సోమము అభిషుతమయినది. ఇంద్రవాయువులారా! పల్లమునకు పారునదులవలె సోమము మీముందునకు చేరును.

8. అగ్నీ ! నీవు సమస్త దేవతలతో కలిసి అశ్వినులు ఉషవెంట సమాన ప్రీతుడవయి విచ్చేయుము. యజ్ఞమున అత్రి ఆనందించినట్లు నీవు అభిషుత సోమమున ఆనందించుము.

9. అగ్నీ ! నీవు మిత్రుడు వరుణుడు సోముడు విష్ణువు సహితముగ విచ్చేయుము. యజ్ఞమున అత్రి ఆనందించినట్లు నీవు అభిషుత సోమము ఆనందించుము.

10. అగ్నీ ! నీవు ఆదిత్యుడు వసువులు ఇంద్రుడు వాయువు సహితముగ విచ్చేయుము. యజ్ఞమున అత్రి ఆనందించినట్లు నీవు అభిషుత సోమము ఆనందించుము.

11. అశ్వినులు మాకు అనశ్వర శుభములు కలుగజేయవలెను. భగుడు శుభములు కలిగించవలెను. అదితి శుభములు కలిగించవలెను. బలవంతుడు, సత్యశీలుడు శత్రుసంహారకుడు పూష మాకు శుభములు కలిగించవలెను. జ్ఞానవిశిష్ట ద్యావాపృథ్వులు మాకు శుభములు కలిగించవలెను.

12. మాకు శుభములు కలిగించుమని వాయువును స్తుతింతుము. సోముని స్తుతింతుము. సోముడు అఖిలలోక పాలకుడు. సకల దేవతల సహితముగా మంత్రపాలకుడగు బృహస్పతిని మా కళ్యాణమునకుగాను స్తుతింతుము. అదితి పుత్రులు దేవగణములను శుభములు కూర్చుమని ప్రార్థింతుము.

13. ఈ యజ్ఞ దినమున సమస్త దేవతలు మాకు శుభములు కూర్చవలెను. రక్షించవలెను. మానవులనేత, గృహదాత, అగ్నిమాకు శుభములు కూర్చవలెను. రక్షించవలెను. దీప్తిమంతులగు ఋభువులు మా శుభములను రక్షించవలెను. రుద్రదేవుడు మా శుభములను రక్షించవలెను. పాపములనుండి కాపాడవలెను.

14. అహోరాత్ర అభిమానులగు మిత్రావరుణులారా ! మాకు శుభములు ప్రసాదించుడు. హితమార్గగామిని, ధనవతి దేవి మాకు శుభములు ప్రసాదించవలెను. ఇంద్రాగ్నులు మాకు శుభములు ప్రసాదించవలెను. దేవి అదితి మాకు శుభములు ప్రసాదించవలెను.

15. సూర్యచంద్రులు నిరాలంబ మార్గమున రాక్షసాది ఉపద్రవరహితులయి సంచరింతురు. అట్లే మేము మార్గమున సుఖముగా ప్రయాణము చేయవలెను. ప్రవాసమున చిరకాలము ఉన్నప్పటికి అక్రోధనులు, స్మరణశీలురగు బంధువులతో మేము కలియవలెను.

## ఏబది రెండవ సూక్తము

ఋషి - ఆత్రేయ శ్యావాశ్వుడు, దేవత - మరుత్తు ఛందస్సు 1-5, 7-15 అనుష్టుప్, 6, 16,17 పంక్తి.

1. శ్యావాశ్వ ఋషీ ! నీవు నెమ్మదిగా స్తుతియోగ్యులగు మరుత్తులను అర్చింపుము. యాగ యోగి మరుద్గణము నిత్యము హవిర్లక్షణ అన్నముపొంది ఆనందింతురు.

2. వారు మరుత్తులు బలములకు మిత్రులు. ధీరులు. వారు మార్గములందు పరిభ్రమింతురు. స్వేచ్ఛగా మా పుత్రులను భృత్యులను రక్షింతురు.

3. మరుత్తులు స్పందనశీలుడు. జలవర్షకులు. వారు రాత్రిని అతిక్రమించి సంచరింతురు. మరుత్తుల తేజము ద్యావాపృథ్వులందు నిలిచి ఉన్నది. మేము దానిని స్తుతింతుము.

4. మరుత్తులు మర్త్యులగు మానవులను సర్వకాలములందు హింసకుల నుండి రక్షింతురు. హోతలారా ! అందుకే మీరు మరుత్తులను మృదువుగా స్తుతించుచున్నారు.

5. మరుత్తులు పూజనీయులు. విశేషదాన విశిష్టులు. కర్మ నేతలు. అధిక బలవంతులు, హోతలారా! అట్టి యాగయోగ్యులు, ద్యుతిమంతులగు మరుత్తులకు యజ్ఞసాధక హవ్యమును సమర్పించుడు.

6. వృష్టి నేతలగు మహా మరుద్గణములు వెలుగు విరజిమ్ము ఆభరణములను ఆయుధ విశేషములను ధరింతురు. వారు మేఘ భేదనమునకుగాను విశేష ఆయుధములను ప్రక్షిప్తము చేయుదురు. ఉరుములు ఉరుము జలరాశివలె మరుత్తులు వత్తురు. ద్యుతిమంతులగు మరుత్తుల కాంతి స్వయం ప్రకాశకము అగును.

7. భూ సంబంధ మరుత్తులు వర్థిల్లుదురు. అంతరిక్ష సంబంధి మరుత్తులు వర్థిల్లుదురు. వారు నదుల ప్రవాహ మధ్యమునను ద్యులోక మధ్యమునను వృద్ధి చెందవలెను. వర్షకార్యమునకుగాను సర్వత్ర వర్తమానులగు మరుత్తులు మేఘ భేదనమునకుగాను ఆయుధ విశేషములను దాచి ఉంచెదరు.

8. స్తోతలారా ! మరుత్తుల ఉత్కృష్ట బలమును స్తుతించుడు. వారి బలము అత్యంత ప్రవృద్ధము సత్యమూలము. వర్ష నేతలు మరుత్తులు గమనశీలురయి అందరి రక్షణలను వృద్ధిచెందింతురు. జలములకుగాను స్వయముగా పరిశ్రమింతురు.

9. మరుత్తులు 'పురుష్ణి' నదిలో ఉందురు. అందరిని శుద్ధము చేయు కాంతులను కప్పుకొందురు. వారు తమ రథచక్రమున మేఘములను పర్వతములను చెదరగొట్టుదురు.

10. మాకు అభిముఖ మార్గమున వచ్చు మరుత్తులు సర్వత్ర సంచరించువారు గిరికందరముల తిరుగువారు అనుకూల మార్గగాములగు నాలుగు పేర్లుగల మరుత్తులు విస్తరించవలెను. మా కొఱకు యజ్ఞమును వహించవలెను.

11. అభిమత వృష్ట్యాదుల నేతలగు మరుత్తులు లోకములను భద్రముగా వహింతురు. స్వయం సమ్మిళిత స్వయం నిర్మిత జగత్తును విశేషముగ వహింతురు. దూర దేశమగు అంతరిక్షమున మరుత్తులు గ్రహ, నక్షత్ర, మేఘాదులను వహింతురు. ఆవిధముగా మరుత్తుల రూపము నానావిధము దర్శనీయమగును.

12. ఛందస్సున స్తుతించువారు, ఉదకమును అభిలషించు స్తోతలు మరుత్తులను స్తుతించినారు. దూపగొన్న

గోతముడు త్రాగుటకుగాను నూతిని ఏర్పరచినారు. మరుత్తులలో కొందరు దొంగచాటుగా మమ్ము రక్షించినారు. మరుత్తులు ఎన్నియో ప్రాణరూపమున కనిపించి దేహబలమును పెంపొందించినారు.

13. మరుద్గణములు దర్శనీయ విద్యుత్ రూప ఆయుధములతో విద్యోతమానులు, మేధావులు, అందరి విధాతలు. శ్యావాశ్వాఋషీ ! నీవు అట్టి మరుద్గణములను రమణీయ స్తుతులతో పరిచర్య చేయుము.

14. ఋషీ ! నీవు హవిర్దానము మఱియు స్తుతుల సహితుడవయి ఆదిత్యునివలె మరుత్తుల వద్దకు చేరుము. మీ బలమున అందరిని ఓడించగల మరుత్తులారా ! మీరు ద్యులోకము నుండిగాని ఇతర లోకము నుండిగాని యజ్ఞమునకు విచ్చేయుడు. మేము స్తుతింతుము.

15. స్తోతలు త్వరగా మరుత్తులను స్తుతింతురు. అన్య దేవతా ప్రాప్తి కోరరు. స్తోతలు జ్ఞాన సంపన్నులు, శీఘ్రగాములు ప్రసిద్ధులు, ఫలప్రదాతలగు మరుత్తులనుండియే అభీష్టఫల సిద్ధిపొందుదురు.

16. మేము మా బంధువుల అన్వేషణలో ఉన్నాము. అప్పుడు మరుత్తులు మమ్ము ప్రేరేపించినారు. వారు ద్యుదేవతను తల్లిని చేసికొన్నారు. అన్నవంతుడగు రుద్రుని తమ తండ్రిగా చూపినాడు.

17. మరుత్తులు సప్త సంఖ్యాకములు. సర్వ సమర్థులు. వారిలో ఒక్కరొక్కరు మాకు వేలగోవులను అశ్వములను ఇవ్వవలెను. వారు మాకు అందించిన గోసమూహ ధనము మాకు యమునా తీరమున లభించవలెను. వారు అందించిన అశ్వ సమూహ ధనము మాకు లభించవలెను.

## ఏబది మూడవ సూక్తము

ఋషి - ఆత్రేయ శ్యావాశ్వడు, దేవత - మరుత్తులు ఛందస్సు - 1,5,11,15 కకుభ, 2 బృహతి, 3 అనుష్టుప్, 4 ఉష్ణిక్, 8,12 గాయత్రి, 6,7,9,13,14,16 బృహస్పతి.

1. మరుత్తుల ఉత్పత్తిని ఎరిగినవాడు ఎవడు? తొలుత మరుత్తుల సుఖమున వర్తమానుడు ఎవడు? మరుత్తుల పృథ్విని రథమున జోడించినపుడు వారి బలరక్షక శక్తిని ఎవడు ఎరిగినాడు?

2. మరుద్గణములు రథమున కూర్చున్నారని ఎవడు విన్నాడు? వారి రథధ్వనిని ఎవడు విన్నాడు? వారు ఏ రీతిగా సాగుదురో ఎవరు ఎరుగుదురు? ఏ దానశీలుని కొఱకు బంధుభూత, వర్షక మరుద్గణము మరింత అన్నముతో అవతరింతురు?

3. మరుత్తులు సోమపానము చేసినారు. హర్షము పొందినారు. గుఱ్ఱములు ఎక్కినారు. మావద్దకు వచ్చినారు.

అడిగినారు:-

"మానవులకు హితము కూర్చు నిరాకారుడెవ్వడు" వారు అప్పటి మా స్థితిని చూచినారు. న్నారు. "ఋషీ ! నీవు స్తుతించుము"

4. మరుత్తులారా! మీ దీప్తి - ఆభరణములను ఆశ్రయించిన దీప్తి; ఆయుధములు, మూలలదీప్తి; ఉరపు భూషణముల దీప్తి; హస్త, పాద భూషణములదీప్తి; రథపు దీప్తి; ధనస్సు దీప్తి; అట్టి సమస్త దీప్తులకు మేము ప్రణమిల్లుదుము.

5. శీఘ్రదానశీలురగు మరుత్తులారా ! సర్వత్ర వర్షపు గమనశీల దీప్తివంటి దృశ్యమానమగు మీ రథము మాకు సంతోషము కలిగించును. మేము స్తుతింతుము.

6. మరుత్తులు నేతలు. శోభన దానశీలురు. వారు హవి సమర్పించు యజమానుల కొఱకు ఆకసమునుండి నీరునిండిన మబ్బును కురిపింతురు. వారు ధ్యావాపృథ్వులకుగాను మబ్బులను విడిపింతురు. తదనంతరము సర్వత్ర సంచరించి ఉదక సహితులయి వ్యాపింతురు.

7. పాలిచ్చు కొత్తగా ఈనిన ఆవో అనునట్లు భేదించరాని మేఘమునుండి వెడలిన జలరాశిలోని నీరు అంతరిక్షమున ప్రసారితమగును. బాటన సాగుటకు వదలిన వడిగల గుఱ్ఱమువలె నదులు మహావేగమున ప్రవహించును.

8. మరుత్తులారా ! మీరు ద్యులోకమునుండిగాని అంతరిక్షము నుండిగాని ఈ లోకమునుండిగాని వేంచేయుడు. దూరప్రదేశములగు ద్యులోకము మున్నగువానిలో నిలువరాదు.

9. మరుత్తులారా ! రసా, అనితభ, కుభనామక నదులును సర్వత్రగమించు సింధు మిమ్ములను నిలుపరాదు. జలమయి 'సరయు' మిమ్ము నిలుపరాదు, మాకు మీరాక వలన సుఖము కలుగవలెను.

10. మరుత్తులారా ! మీకు ప్రేరకమగు నీ నూతన రథ బలమును దీప్తిమంతులగు మిమ్ము మేము స్తుతించుచున్నాము. వర్షము మరుత్తులను అనుసరించును.

11. మరుత్తులారా ! మేము స్తుతులతోను హవి ప్రదానమునను నీ బలమును అవివక్షిత గణమును సప్త సముద్రగణమును అనుసరింతుము.

12. నేడు హవ్యములు సమర్పించు ఏ యజమాని వద్దకు ప్రకృష్ట రథమున మరుత్తులు విచ్చేయుదురు?

13. మరుత్తులారా ! మీరు దయార్ద్రులు మీరు పుత్ర, పౌత్రాది, అక్షీణ ధాన్య భీజమును బహు పర్యాయములు ప్రదానము చేయుదురు. అట్టి కరుణాపూరిత హృదయముననే మాకు సహితము అటువంటి ధాన్య భీజమును ప్రదానము చేయుడు. మేము మీనుంచి సౌభాగ్య ధనమును వాంఛింతుము.

14. మరుత్తులారా ! మాకు శుభములు కలుగవలెను. పాపములు మమ్ము పరిత్యజించవలెను. మేము నిందకులగు శత్రువులను జయించవలెను. మీరు వర్షము కలిగింతురు. అందువలన మాకు శుభము కలుగవలెను. పాపనివారక జలము గోయుక్త ఔషధము లభించవలెను.

15. మరుత్తులారా ! మీరు నేతలు, పూజ్యులు. మీరు రక్షించు వారిని దేవతలు అనుగ్రహింతురు. శోభన పుత్ర పౌత్రాదియుక్తులను చేయుదురు. మేము నీవారము. మేము నీ రక్షణ పొందినవారము కావలెను.

16. ఋషీ ! యజమాని స్తుతించువాడు. అతని యజ్ఞమున దాతలగు మరుత్తులను స్తుతించుడు. తృణాదులు తినుటకు గోవులు సాగును. అట్లే మరుత్తులు ఆనందింతురు. పురాతన బంధువుల వంటి మరుత్తులను ఆహ్వానించుము. స్తోత్రప్రియ మరుత్తులను వచనములతో స్తుతించుము.

## ఏబది నాలుగవ సూక్తము

ఋషి - శ్యావాశ్వుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు జగతి 14 త్రిష్టుప్.

1. మరుత్తుల బలమును ప్రశంసించండి. వారు తేజోవిశిష్ట పర్వతములను చెదరగొట్టువారు. ఉష్ణ నివారకులు. ద్యులోకము నుండి వచ్చువారు. ద్యుతిమంతులు. అన్నవంతులు. వారికి ఎంతో అన్నము ప్రదానము చేయుడు.

2. మరుత్తులారా ! మీ గణములు ప్రాదుర్భవించినవి. అవి దీప్తిమంతములు. జగద్రక్షణార్థము జలాభిలాషులు. అన్న వర్ధయితులు. గమనించుటకు రథమును అశ్వయుక్తము చేయునవి. విద్యుత్తుతో కలిసి పోవునవి. నలుదిక్కుల పయనించు జలరాశి అంతరిక్షము నుండి నేల మీద పడును.

3. మరుత్తుల ద్యుతిమంత తేజోవంతులు. వర్ష నేతలు. ఆయుధయుక్తులు. ప్రదీప్తులు, మేఘవిదీర్ణులు. వారంవారం ఉదకదాతలు. వజ్ర క్షేపకులు. ఏకత్ర శబ్దాయమానులు. ఉద్ధతబలులు.

మరుద్గణములు వర్షము కొరకు ప్రాదుర్భూతులు అయినారు.

4. రుద్రపుత్రులగు మరుత్తులారా ! మీరు రాత్రింబవళ్లను కలుగచేతురు. సర్వ సమర్థులారా ! మీరు అంతరిక్షమును లోకములను వెల్లడి చేయుదురు. కంపనకారులారా ! సముద్ర మధ్యస్థ నౌకవలె మేఘములను కంపింప చేయుడు.

మరుత్తులారా ! శత్రునగరములను ధ్వంసము చేయుడు. "నాహరిష్యధ" హింసించకండి.

5. సూర్యుడు ఎంతో దూరమువరకు తనకాంతిని విస్తరింప చేయును. అట్లే మరుత్తులారా ! మీ సుప్రసిద్ధ వీర్యమును బలమును స్తోతలు ఎంతో దూరము వరకు విస్తరింప చేయుదురు.

6. మరుత్తులారా ! మీరు వృష్టి విధాతలు. మీరు జలవంతమగు మేఘమును బాదుదురు. మీ బలము శ్రేయస్కరము. పరస్పర గమనప్రీతిగల మరుత్తులారా ! మార్గ ప్రదర్శనమున నేత్రము నాయకత్వము వహించినట్లు మమ్ము సుగమ మార్గమున ధనాదుల వద్దకు చేర్చుడు.

7. మరుత్తులారా ! మీరు మంత్రద్రష్టయగు ఏ ఋషిని లేక రాజును సత్కర్మలకు ప్రేరేపింతురో అట్టివాడు ఇతరులచే పరాభూతుడు కాడు. హింసితుడు కాడు. అతడు ఎన్నడూ క్షీణించడు. పీడింపబడడు. అతనికి ఎటువంటి బాధకలుగదు. అతని రక్షణలకు, ధనమునకు నష్టము వాటిల్లదు.

8. నియుతనామక అశ్వయుక్తులు, సంఘూత్మకులు, నరాకారులు, ఆదిత్యునివలె దీప్తులగు మరుత్తులు ఉదకవంతులు. వారు అధిపతులయినపుడు నేలనున్న బావులను - ఆకాశమున ఉన్న మబ్బులను జలపూర్ణము చేసెదరు. శబ్దాయమాన సారభూత, సుమధుర జలములతో భూమిని తడిపెదరు.

9. మరుత్తుల కొరకు పృథ్వి విస్తీర్ణమగును. ద్యులోకము మరుత్తుల సంచారమునకు విస్తీర్ణమగును. అంతరిక్ష మార్గములు మరుత్తుల రాకపోకలకు విస్తీర్ణములగును. మరుత్తుల కొరకే మేఘములు పర్వతములు వర్షకారకములగును.

10. మరుత్తులు మహాబలవంతులు. అందరినేతలు - ద్యులోక నాయకులు. వారు సూర్యోదయమున సోమపానమున హృష్టులు అగుదురు. అప్పుడు వారి అశ్వములు నడకలో శిథిలములు కావు. వారు ముల్లోకముల మార్గములన్నింటిని దాటుదురు.

11. మరుత్తులారా ! మీ మొలకు ఆయుధములున్నవి. కాళ్లకు కడియములు, ఉరమున ఆభరణములున్నవి. మీరు రథమున దేదీప్యమానులయి ఉన్నారు. మీ చేతులందు అగ్ని దీప్త కిరణములు ఉన్నవి. తలమీద బంగారు మకుటము ఉన్నది.

12. మరుత్తులారా ! మీరు నడక సాగించినపుడు అప్రతిహత దీప్తిశాలి స్వర్గము సముజ్వల జలరాశి విచలితములు అగును. మేము సమర్పించిన హవ్యములు ఆరగించి బలశాలురు అయినపుడు ఉజ్వల భావమున దీప్తిప్రకాశితము చేయుదురు. మీరు జలవర్షము కలిగించ తలచినపుడు భీషణ రూపమున గర్జింతురు.

13. వివిధ బుద్ధులుగల మరుత్తులారా ! మేము రథాధిపతులము. మేము మీరు ప్రసాదించిన అన్నవంతమగు ధనములకు స్వాములము. మీరు ప్రసాదించిన ధనమునకు నష్టము వాటిల్లదు. సూర్యుడు ఆకాశము నష్టపడడు కదా ! మరుత్తులారా ! దుమ్ము అపరిమిత ధనమున ఆనందింప చేయుడు.

14. మరుత్తులారా ! మీరు మాకు ధనము, పుత్రులు, భృత్యులు మున్నగువానిని ప్రదానము చేయుడు. మీరు సోమ సహిత విప్రుని రక్షించండి. మీరు శ్యావాశ్వునకు ధనము, అన్నము దానము చేయండి. అతడు దేవతలను యజించువాడు. రాజును సుఖయుక్తుని చేయండి.

15. మరుత్తులారా ! మీరు సద్యో రక్షణశీలురు. మీవద్ద మేము ధనమును యాచింతుము. సూర్యుడు తనకాంతితో దూరదూరములకు విస్తరిల్లినట్లు - ఆధనము వలన మేము పుత్ర, భృత్యాదులతో విస్తరిల్లుదుము.

మరుత్తులారా ! మీరు మా ఈ స్తోత్రమును అభిలషించుడు. అందువలన మేము బలము కలిగి వంద హేమంతములు జీవింతుము. "తరేమ తరసా శతం హిమాః"

## ఏబది అయిదవ సూక్తము

ఋషి -శ్యావాశ్వుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు - జగతి, చివరిది త్రిష్టుప్.

1. మరుద్గణములు అత్యంత పూజనీయులు. దీప్తి ఆయుధవంతులు. యవ్వనరూపులు. బృహత్ అన్నమును ధరించినవారు. వారు వక్షమున హారములు ధరింతురు. సులభముగా అదుపులో ఉంచదగినవి, వడిగల గుఱ్ఱములు వారిని వహించును. జలప్రియులయిసాగు మరుత్తుల రథము అన్నింటిని వెనుక సాగును. "యాతామనురథా అవృత్సత"

2. మరుత్తులారా ! మీరు సరి అనుకున్న సామర్థ్యమును స్వయముగా సాధింతురు. మీ సామర్థ్యము అప్రతిహతము. మీరు మహామహులయి, అత్యున్నతులయి శోభిల్లండి. అంతరిక్షమును బలము ద్వారా వ్యాప్తము చేయండి. జలప్రియులగు సాగు మరుత్తులుమీరు, "యాతామనురథా అవృత్సత"

3. మహా మరుద్గణములు ఒకేసారి పుట్టినవి. ఒకేసారి వర్షకములు అగును. వారు అత్యంత శోభతో ఎల్లెడల వర్ధిల్లుదురు. సూర్య రశ్మివలె వారు యుగాది కార్యములనేతలు శోభాసంపన్నులు అగుదురు. జలప్రియులయిసాగు మరుత్తులు "యాతామనురథా అవృత్సత"

4. మరుత్తులారా ! మీ మహత్తు స్తవనీయము. మీ రూపము సూర్యునివలె దర్శనీయము. మా స్వర్గ ప్రాప్తికి మీరు సహాయకులగుడు. జలప్రియులయిసాగు మరుత్తులుమీరు "యాతామనురథా అవృత్సత"

5. మరుత్తులారా ! మీరు అంతరిక్షమున వర్షమును ప్రేరేపించండి. జల సంపన్నులారా ! మీరు వర్షము కలిగించండి. దర్శనీయులగు శత్రు సంహారకులారా ! మీకు ప్రియమగు మేఘము ఎన్నటికిని శుష్కించదు. జలప్రియులయి సాగు మరుత్తులుమీరు "యాతామనురథా అవృత్సత"

6. మరుత్తులారా ! మీరు రథమునకు అగ్రభాగమున 'పృషతీ' అశ్వమును జోడించినప్పుడు మీ బంగారు కవచమును విప్పివేయుదురు. మీరు సకల సంగ్రామములందు గెలుపొందుదురు. జలప్రియులయిసాగు మరుత్తులుమీరు "యాతామనురథా అవృత్సత"

7. మరుత్తులారా ! నదులు, పర్వతములు మీకు అడ్డంకులు కారాదు. మీరు వెళ్లదలచిన యజ్ఞాది స్థానములకు వెళ్లితీరుదురు. వర్షమునకుగాను మీరు ద్యావాపృథ్వులందు వ్యాపింతురు. జలప్రియులయిసాగు మరుత్తులుమీరు "యాతామనురథా అవృత్సత"

8. మరుత్తులారా ! పూర్వము చేయబడిన యాగాది కార్యమును ఇప్పుడు జరుగుచున్నవానిని మీరు తెలిసికొనుడు. వసువులారా ! మంత్రగతమయినవానిని స్తోత్రపాఠమయినవానిని తెలిసికొనుడు. జలప్రియులయిసాగు మరుత్తులుమీరు "యాతామనురథా అవృత్సత"

9. మరుత్తులారా ! మీరు మమ్ము సుఖవంతులను చేయండి. మేము ఏదేని అనిష్ట కార్యముచేసి ఉన్నచో అందువలన మీకు కోపము కలిగినచో మాకు బాధ కలిగించకండి. మాకు అత్యంత సుఖమును ప్రసాదించండి. మా స్తోత్రములను గ్రహించండి. మాతో స్నేహము చేయండి. జలప్రియులయిసాగు మరుత్తులుమీరు "యాతామనురథా అవృత్సత"

10. మరుత్తులారా ! మీరు మమ్ము ఐశ్వర్యమువైపు నడిపించండి. మా స్తోత్రములకు ప్రసన్నులు కండి. మమ్ము పాపములనుండి విముక్తులను చేయండి. మీకు మేము సమర్పించిన హవ్యమును స్వీకరించండి. అందువలన మేము బహువిధ ధనములకు అధిపతులము కాగలము.

## ఏబది ఆరవ సూక్తము

ఋషి - శ్యావాశ్వుడు, దేవత - మరుత్తు, ఛందస్సు - బృహతి.

1. అగ్నీ ! రోచమాన ఆభరణయుక్తులు, శత్రువులను పరాభవించువారు, యజ్ఞవిషయమున ఉత్సాహవంతులగు మరుత్తులను ఆహ్వానింపుము. నేటి యజ్ఞదినమున దీప్తిమంతమగు స్వర్గము నుంచి మాముందునకు విచ్చేయవలసిందిగా మరుత్తులను ఆహ్వానించుచున్నాము.

2. అగ్నీ ! మరుత్తులు అత్యంత పూజనీయులని నీవు ఎరుగుదువు. నీవు వారిని ఆదరింతువు. అట్లే ఆ మరుత్తులు ఉపకార భావమున మావద్దకు రావలెను. నీ ఆహ్వానమును విన్నంత మాత్రమున వచ్చువారు. భీకర రూపులగు మరుత్తులను హవ్యప్రదానమున వర్థిల్లచేయుము.

3. భూమిమీది మానవుడు మరొకరితో అవనింపబడును. అప్పుడు అతడు సత్వరమే బలవంతుడగు తనస్వామి వద్దకు పరుగెత్తును. అట్లే మరుత్సేన ఉల్లసితమయి మా వద్దకు రావలెను. మరుత్తులారా మీరు అగ్నివలె కర్మవంతులు. ఆ బోతులతో కోడిన గోవువలె దుర్ధర్షులు.

4. పొగరుబోతు గుఱ్ఱమువలె మరుత్తులు స్వబలమున అనాయాసముగ శత్రువును పరాజితుని చేయుదురు. వారు తమ గమనమున శబ్దాయమానము, వ్యాప్తము, లోకములను పూరించు జలగర్భ మేఘమును ప్రేరేపింతురు.

5. మరుత్తులారా ! ఉత్తిష్ఠ. జలరాశివలె సమృద్ధశాలి, బలసంపన్న, అపూర్వ మరుత్తులను స్తోత్రమున వర్థిల్లచేసి ఆహ్వానించుచున్నాము.

6. మరుత్తులారా ! మీ రథమున అరుషి ఆడ గుఱ్ఱమును పూన్చండి. రథ సమూహమును రోహితవర్ణ అశ్వయుక్తము చేయండి. బరువులు మోయుటకుగాను హర్యశ్వములను జోడించండి. మోయుటకు గట్టివానిని కట్టండి.

7. మరుత్తులారా ! మీ రథమునకు కట్టిన అశ్వములు దీప్తిమంతములు. విశేషధ్వనికారులు. దర్శనీయులు. అవి మీ ప్రయాణమున జాగు చేయరాదు. రథమునగల అశ్వములు ఆలస్యము చేయకుండ వానిని ప్రేరేపించండి.

8. మరుద్గణముల రథము అన్నపూర్ణ. ఆ రథమున చక్కని జలములు, ధరించిన మరుత్తుల వెంట రోదసి ఆసీనమయి ఉన్నది. అట్టి రమ్య రథమును మేము ఆహ్వానించుచున్నాము.

(రోదసి=రుద్రపత్ని, మరుత్తుల మాత వాయుపత్ని. మాధ్యమికాదేవి.)

9. మరుత్తులారా ! మీ రథము శుభంకరము దీప్తిమంతము. పూజనీయము. మేము ఆరథమును ఆహ్వానింతుము. ఆ రథ మధ్యమున సుజాత, సౌభాగ్య శాలిని 'మీహలుషీ' మరుత్తులతో పాటు పూజింపబడును.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగువ అష్టకము ఐదవ మండలమున నాలుగవ అనువాకము సమాప్తము)

## అయిదవ అనువాకము          ఏబది ఏడవ సూక్తము

ఋషి - శ్యావాశ్వుడు దేవత - మరుత్తులు, ఛందస్సు 7,8 త్రిష్టుప్, మిగిలినవి జగతి.

1. మరుత్తులారా ! మీరు పరస్పర కరుణా హృదయులు. సువర్ణమయి రథారూఢులు, ఇంద్రుని అనుచరులు. రుద్ర పుత్రులు. మీరు సుగమ్య యజ్ఞమునకు విచ్చేయండి. మేము మిమ్ము స్తుతింతుము. మీరు తృషార్తుడు, జలాభిలాషి గోతముని కొఱకు స్వర్గము నుండి జలము తెచ్చి ఇచ్చినారు. అట్లే మా వద్దకు విచ్చేయుడు.

2. సమృద్ధులగు మరుత్తులారా ! మీ రక్షణ సాధనములగు ఆయుధములు ఛురక, ఉత్కృష్ట ధనుర్బాణములు, శ్రేష్ఠ అశ్వము, రథము అగును. మీరు అస్త్ర సజ్జితులు కండు. పృశ్ని పుత్రులారా ! మాకు శుభములు కలిగించుటకు విచ్చేయండి.

3. మరుత్తులారా ! అంతరిక్షమున మీరు మేఘములను వెల్లడించుడు. హవ్యదాతకు ధనము ప్రదానము చేయుడు. మీరు వస్తున్నారన్న భయమున అడవులు గడగడలాడును. పృశ్ని పుత్రులారా ! ఆగ్రహవంతులగు బలశీలులారా ! మీరు జలములు కురిపించుటకు మీ రథమునకు 'పృషతి' అశ్వములను జోడించినపుడు పృథ్విమీద మీ ఆగ్రహమును ప్రదర్శింతురు.

4. మరుద్గణములు దీప్తిమంతులు. వర్షకారకులు. కవలలవలె తుల్యరూపులు. దర్శనీయులు. శ్యామ, అరుణ అశ్వాధిపతులు. నిష్పాపులు, శత్రుక్షయ కారకులు. వారు విశాల ఆకాశమువలె విస్తీర్ణులు.

5. మరుత్తులు వర్షకారకులు. ఆవరణధారులు. ఉజ్వల మూర్తులు. అక్షయ ధనసంపన్నులు. సుజన్ములు. వక్షమున హారధారులు. పూజనీయులు. వారు ద్యులోకము నుండి రావలెను. అమృతజలమును ప్రసాదించవలెను.

6. మరుత్తులారా ! మీ మొలలందు ఆయుధవిశేషములు బాహుద్వయమున శత్రునాశకబలము శిరసున సువర్ణ కిరీటము - రథమున ఆయుధ ప్రభృతులు, అవయవములందు శోభకలిగి విరాజిల్లుచున్నారు.

7. మరుత్తులారా ! మీరు మాకు అనేక గోవులను, అశ్వములను, రథములను, ప్రశస్త పుత్రులను, హిరణ్యమును, అన్నమును ప్రసాదించండి. రుద్రపుత్రులారా ! మీరు మా సమృద్ధిని రక్షించండి. మేము మీరు ప్రసాదించిన స్వర్గీయ రక్షణను అనుభవించవలెను.

8. మరుత్తులారా ! మీరు నేతలు. అనంత ఐశ్వర్యవంతులు. అవినశ్వరులు. జలవర్షకులు. సత్యఫల ప్రసిద్ధులు.

జ్ఞానసంపన్నులు. తరుణులు. విశేష స్తుతియుక్తులు. నిరంతర వర్షకారులు. మీరు మాకు అనుకూలురు కావలెను.

## ఏబది ఎనిమిదవ సూక్తము

ఋషి - శ్యావాశ్వుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. మరుత్తులు శీఘ్రగాములు. అశ్వాధిపతులు. దీప్తిమంతులు. స్తుతియోగ్యులు. బలపూర్వకముగ అంతటికి చేరగలవారు. జలాధిపతులు. నిజప్రభతో ప్రభావాన్వితులు, నేటి యజ్ఞమున మేము మరుత్తులను స్తుతింతుము.

2. మరుత్తులు దీప్తిమంతులు, బలశాలులు. వలయమండిత హస్తులు. కంపన విధాయకులు. ధనదాతలు. హోతా ! నీవు మరుత్తులను పూజింపుము. సుఖదాతలు, అపరిమిత మహంతులు, అతులిత ఐశ్వర్యవంతులు, నేతలగు మరుత్తులకు ప్రణమిల్లండి.

3. విశ్వవ్యాపులగు మరుద్గణములు జలములను స్పందింప చేతురు. జలవాహకులగు మరుత్తులు మీ వద్దకు చేరవలెను. జ్ఞానసంపన్నులు, యవ్వనవంతులగు మరుత్తులారా ! మీ కొఱకు అగ్ని ప్రజ్వలితమయినది. ఆ అగ్నివలననే మీకు ప్రీతి లాభము కలుగును.

4. పూజనీయులగు మరుత్తులారా ! మీరు యజమానికి లేక రాజుకు దీప్తివంతుడు, రూపవంతుడు, శత్రుసంహారకుడగు పుత్రుని ప్రసాదించుడు.

మరుత్తులారా ! మీ వలననే స్వభుజ బలమున శత్రువులను వధించువాడు, బాహుబల ప్రేరకుడు, అసంఖ్య అశ్వాధిపతియగు పుత్రుడు కలుగగలడు.

5. రథపు మేకులవలె మరుత్తులు ఒకేసారి పుట్టినారు. దినములవలె వారు పరస్పర సమానులు. పృశ్ని పుత్రులు సమానరూపమున పుట్టినారు. ఏ ఒక్కరు దీప్తి విషయమున తగ్గరు. వేగవంతులగు మరుద్గణములు స్వతః ప్రవృత్తులయి చక్కని వర్షము కలిగింతురు.

6. మరుత్తులారా ! 'పృషతి' అశ్వములు కట్టిన దృఢచక్ర రథమును ఎక్కి మీరు ఏ తెంచినపుడు జలరాశి వర్షించును. అడవులు పడిపోవును. సూర్యకిరణ సంపృక్త జలవర్షణకారి పర్జన్యుడు అధోముఖుడయి వర్షమునకుగాను శబ్దము చేయును.

7. మరుత్తులు రాగా పృథ్వికి ఉర్వరత ప్రాప్తించును. పతి భార్యకు గర్భము కలిగించునట్లు మరుత్తులు భూమిమీద గర్భస్థానీయమగు జలమును స్థాపింతురు. రుద్ర పుత్రులు వేగవంతములగు అశ్వములను రథపు ముందు భాగమున

కట్టి వర్షము కలిగింతురు.

8. మరుత్తులారా ! మీరు నేతలు. విపుల ఐశ్వర్యవంతులు. అనశ్వరులు. జలవర్షకులు. సత్యఫల ప్రసిద్ధులు. జ్ఞాన సంపన్నులు. తరుణులు. ప్రచుర స్తుతియుక్తులు. సమృద్ధ వర్షణకారులు. మీరు మాకు అనుకూలురు కండు.

## ఏబది తొమ్మిదవ సూక్తము

ఋషి - శ్యావాశ్వుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు - జగతి 8 త్రిష్టుప్.

1. మరుత్తులారా ! హవ్యదాతలు. తమకు శుభములు కలుగవలెనని మిమ్ము విశేషముగ స్తుతింతురు. హోతా ! నీవు ద్యుతిమంతుడగు ద్యుదేవుని స్తుతించుము. మేము పృథ్విని స్తుతింతుము. మరుద్గణములు సర్వవ్యాపి వర్షమును కురిపింతురు. వారు అంతరిక్షమున సర్వత్ర సంచరింతురు. మేఘములతో కూడ తమ తేజస్సును ప్రకాశింపచేతురు.

2. మనుష్యులు నిండిన పడవ నీటిమధ్యన వడికినట్లు మరుత్తుల భయమున భూమి వడకును. వారు దూరమున దృశ్యమానులు అయినప్పటికి చలనము ద్వారా గోచరులగుదురు. నేతలగు మరుత్తులు ద్యావా పృథ్వులమధ్య హవ్యభక్షణకు ఉపక్రమింతురు.

3. మరుత్తులారా ! మీరు అలంకారమునకుగాను ఆవుకొమ్మువంటి ఉత్కృష్ట శిరోభూషణము ధరింతురు. దినములనేత సూర్యుడు తన వెలుగులను విస్తరించినట్లు మీరు వర్షము కొఱకు సర్వప్రకాశదీప్తి విస్తరింతురు. మీరు అశ్వమువలె మనోహరులు వేగవంతులు. యజమానులు మున్నగువారు యజ్ఞాది కర్మలను ఎరిగినట్లు మీరుకూడ ఎరుగుదురు.

4. మరుత్తులారా ! మీరు వాన కురిపించుట వలన భూమి కిరణమువలె కదలాడును. మీరు పూజనీయులు. మిమ్ములను ఎవడు పూజించగలడు? మీ పరాక్రమమును ఎవడు ప్రకటించగలడు? ఎవడు మిమ్ము స్తుతించుటకు సమర్థుడగును?

5. మరుత్తులు అశ్వమువంటి వేగవంతులు. దీప్తిమంతులు. సమాన బంధువులు. వారు వీరులవలె యుద్ధకార్యమున నిమగ్నులగుదురు. సమృద్ధి సంపన్నులగు మానవులవలె మరుద్గణములు అత్యంత శక్తిశాలురయి వర్షమున సూర్యచక్షువును ఆవరింతురు.

6. మరుద్గణములందు ఒకరు చిన్న, ఒకరు పెద్ద కారు. శత్రుసంహారక మరుత్తులలో మధ్యముడు ఉండడు. అందరు తేజో విశేషమున వర్ధమానులగుదురు.

సుజన్ములు, మానవహితకరుల పృశ్ని పుత్రులగు మరుత్తులారా ! మీరు ద్యులోకునుండి మాకు అభిముఖముగా విచ్చేయండి.

7. మరుత్తులారా ! వరుసకట్టి ఎగురు పక్షులవలె మీరు బలపూర్వక విస్తీర్ణము సమున్నత నభోమండలపు పైభాగమున అంతరిక్షము వరకు సంచరించెదరు. మీ అశ్వములు మేఘము నుండి వర్షము కురిపించును. ఈ విషయము దేవతలు - మానవులు ఇరువురు ఎరుగుదురు.

8. ద్యావాపృథ్వులు మాపుష్టి కొఱకు వర్షము కలిగించవలెను. నిరతిశయ దానశీల ఉష మాకు శుభములు కలిగించుటకు యత్నించవలెను. ఋషీ ! ఈ రుద్రపుత్రులు నీ స్తుతినివిని ప్రసన్నులయి వర్షము కురిపించవలెను.

## అరువదవ సూక్తము

ఋషి - శ్యావాశ్వుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు - 6,8 జగతి, మిగిలినవి త్రిష్టుప్.

1. నేను శ్యావాశ్వ ఋషిని. స్తోత్రములతో రక్షకుడగు అగ్నిని స్తుతించుచున్నాను. అతడు ఇప్పుడే యజ్ఞమునకు విచ్చేసి ప్రసన్నముగా ఆ స్తోత్రమును గ్రహించవలెను. రథము కోరిన స్థలమునకు చేరినట్లు - అన్నాభిలాషులమగు మేము స్తోత్రములతో మా కోరికలు నెరవేర్చుకుందుము. ప్రదక్షిణచేసి మేము మరుత్తుల స్తోత్రములను వర్థిల్లచేతుము.

2. ఉద్యతాయుధులగు రుద్రపుత్ర మరుత్తులారా ! మంచి గుఱ్ఱములు లాగునదియు, శుభంకరమగునదియు, అక్ష సమన్వితమగు రథము నెక్కి సాగుడు. మీరు రథములు నెక్కినపుడు అడవులు భయమున గడగడలాడును.

3. మరుత్తులారా ! మీరు మరింత భయంకర శబ్దము చేసినపుడు మహా మహా పర్వతములు కూడ గడగడలాడును. అంతరిక్షమున ఉన్నత, విస్తృత ప్రదేశములో కూడ కంపించును. మరుత్తులారా ! మీరందరు ఆయుధపాణులు. మీరు ఆటలాడినప్పుడు నీటివలె పరుగులు పెట్టుదురు.

4. వివాహయోగ్యుడు, ధనవంతుడగు యువకుడు స్నానాదుల ద్వారాను, బంగారునగలతోను తన తనువును అలంకరించుకొనును. అట్లే సర్వశ్రేష్ఠ బలశాలురగు మరుత్తులు రథమున ఆసీనులయినపుడు శరీర శోభకుగాను తేజస్సును వహింతురు.

5. మరుద్గణములు ఒకే సమయమున పుట్టినారు. వారు సమాన బలవంతులు. వారిలో వారికి పెద్ద, చిన్నలు లేవు. వారు అన్నదమ్ములవలె సౌభాగ్యముతో వర్థిల్లుదురు. నిత్య తరుణులు, సత్కర్ములగు మరుత్తుల తండ్రి రుద్రుడు జననీ స్వరూపిణి, దోహన యోగ్య పృశ్ని మరుత్తులకుగాను శుభదినములను కలిగించవలెను.

6. సౌభాగ్యశాలురగు మరుత్తులారా ! మీరు ఉత్తమ ద్యులోకమున మధ్యమ ద్యులోకమున అధమ ద్యులోకమున వర్తింతురు. ఆ స్థానముల నుండి మా వద్దకు విచ్చేయండి.

అగ్నీ ! మేము నేడు సమర్పించు హవిని తెలియుము.

7. సర్వజ్ఞులగు మరుత్తులారా ! మీరును, అగ్నియు ద్యులోకపు ఉత్కృష్టతర ఉపరి ప్రదేశమున ఉందురు. మీరు మా స్తోత్రములకు, హవ్యములకు ప్రసన్నులుకండు. శత్రువులను కంపింపచేసి నష్టపరుచుడు. యజమానులకు కోరిన ధనము ప్రసాదించుడు.

8. మరుత్తులు శోభాయమానులు, పూజనీయులు, సంఘీభావులు, ఆశ్రయప్రదాతలు, పవిత్రులు, ప్రీతిదాయకులు, చిరంజీవులు.

వైశ్వానరాగ్నీ ! పురాతన జ్వాలా సమూహయుక్తుడవయి మరుత్తులతో కూడి సోమపానము చేయుము.

## అరువది ఒకటవ సూక్తము

ఋషి - శ్యావాశ్వుడు, దేవత - మరుత్తు ఛందస్సు - గాయత్రి, 9 బృహతి.

1. శ్రేష్ఠతములగు నేతలారా ! మీరు ఎవ్వరు? అంతరిక్షమునుండి ఒక్కొక్కరుగా విచ్చేయండి.

2. మరుత్తులారా ! మీ అశ్వములు ఎక్కడ? కళ్లెములు ఎక్కడ? గుఱ్ఱములు వడిగా వెళ్లగలవా? వాటి నడక ఎట్టిదగును? గుఱ్ఱపు వెనక భాగమున పటకా, నాసికాద్వయమునకు త్రాడు ఉండును.

3. శీఘ్రగమనమునకుగాను గుఱ్ఱపు జఘన భాగము కశాఘాతము (కొరడా దెబ్బలు) పడును. ప్రసవ సమయమున రమణుల తొడలు విడదీసినట్లు మరుత్తులు అశ్వపు ఊరుద్వయమును విడదీయుదురు.

4. వీరులారా ! శత్రుసంహారకులారా ! మానవ కళ్యాణ కారులారా ! శోభన జన్మవంతులారా ! మరుత్పుత్రులారా ! మీరు అగ్నిలో కాలిన రాగివలె ప్రదీప్తులయి కనిపించుచున్నారు.

5. శ్యావాశ్వుడు ఎవనిని స్తుతించినాడో, ఎవడు వీరుడగు 'తరంతు' ని భుజపాశ బద్ధుని చేసినాడో, ఆ తరంతుని భార్య 'శశీయసి' మాకు గుఱ్ఱములు, ఆవులు, వందల బఱ్ఱెల పశు యూథమును ప్రదానము చేసినది.

6. దేవతలను ఆరాధించని ధన దానము చేయని పురుషునికన్న శశీయసి సర్వవిధములు శ్రేష్ఠురాలు.

7. ఆ శశీయసి వ్యధితుల బాధలు ఎరుగును. దప్పిగొన్నవారిని ఎరుగును. ధనాభిలాషిని ఎరుగును. దేవతల ప్రీత్యర్థము ఆమెకు దానబుద్ధి ఉన్నది.

8. శశీయసి భర్త తరంతుని స్తుతించియు పూర్తిగా స్తుతించినట్లు భావించము. ఏలననగా దానవిషయమున వారిద్దరిది ఒకేమాట.

9. యవ్వనవతి శశీయసి ముదిత మనమున శ్యావాశ్వునకు దారిచూపినది. ఆమె ఇచ్చిన రెండు లోహిత వర్ణ అశ్వములు మమ్ము యశస్వి, విజ్ఞుడగు 'పురుమీహ్లు' ని వద్దకు చేర్చును.

10. విదదశ్వుని పుత్రుడు 'పురుమీహ్లుండు' కూడ తరంతుని వలెనే మాకు వంద ఆవులు. బహుమూల్య ధనము మున్నగునవి ఇచ్చినాడు.

11. మరుద్గణములు వడిగల గుఱ్ఱములను ఎక్కి, సంతసము కలిగించు సోమరసము త్రావుచు ఈ చోటుకు వచ్చిఉండిరి. ఆ మరుద్గణములకు ఇక్కడ బహువిధ స్తోత్రములు లభించును.

12. మరుత్తుల కాంతికి ద్యావాపృథ్వులు వెలుగొందును. పైన ద్యులోకమున వెలుగొందు ఆదిత్యునివలె మరుద్గణములు రథముపై వెలుగొందుదురు.

13. మరుత్తులు నిత్య యవ్వనులు. దీప్తిరథ విశిష్టులు - అనింద్యులు. సుందరులు - సంచారులు. అప్రతిహతగతిమంతులు.

14. జలవర్షము కొరకు పుట్టినవారు, శత్రువులను కంపింపచేయువారు నిష్పాపులగు మరుత్తులు ఏ స్థానమున తృప్తులయినారో ఆ స్థానమును ఎవడు ఎరుగును?

15. స్తోత్రప్రియులగు మరుత్తులారా ! మిమ్ము స్తుతించి ప్రసన్నులనుచేయు యజమానికి అతడు కోరిన స్వర్గాది స్థానములను చూపెదరు. యజ్ఞమునకు ఆహుతలయిన మీరు ఆహ్వానమును ఆలకించెదరు.

16. శత్రుసంహారక, పూజనీయ, వివిధ ధనశాలురగు మరుత్తులారా ! మీరు మాకు కోరిన ధనమును ప్రసాదించండి.

17. ధాత్రీదేవీ ! నీవు మావద్దనుండి రథవీతివద్ద మరుత్ స్తుతిని అందుకొనుము. ఇది మరుత్తుల కొఱకు రచించబడినది. రథి వివిధ వస్తువులను రథమున ఉంచి గమ్యస్థానమునకు చేర్చినట్లు మా ఈ సకల స్తుతులను

వహింపుము.

18. ధాత్రీదేవీ ! సోమయజ్ఞము ముగిసిన పిదప రథవీతితో నీ కూతురు విషయమున మా కోరిక తక్కువదికాదు, అన్నట్లు చెప్పుము.

19. ధనవంతురాలగు రథవీతి గోమతి తీరమున నివసించును. హిమాలయ ప్రాంతమున గృహము కలదు.

*ఆలోచనామృతము*

1. స్త్రీకి ఏకాలముననను పురుషునితో అన్ని విషయములందు సమాన ప్రతిపత్తిలేదు. కొందరు మహిళలు తం ప్రతిభాపాటవములతో పురుషులను మించిన ఉదాహరణలు ఉన్నవి. అవి వ్యక్తిగతములు. సమాజమున స్త్రీకి గౌరవము, ఆదరము ఉన్న కాలములు ఉన్నవి. లేనికాలములు ఉన్నవి. కాలము పాదరసమువంటిది. ఒకచోట నిలువదు. అది పరిణామ శీలము. కావున స్త్రీల విషయముననను హెచ్చుతగ్గులగుట సాధారణము.

వేదకాలము మొత్తమున స్త్రీకి ఏ స్థాయి ఉన్నది నిర్దిష్టముగ చెప్పుట సాధ్యపడదు. కాని స్త్రీకి పురుషుని నుండి ఆదరాభిమానములు లభించినవని మాత్రము చెప్పవచ్చును. స్త్రీకి నీచదశ లేకుండెను.

ఈ సూక్తమున 'శశీయసి', అను స్త్రీ వృత్తాంతము పేర్కొన్నబడినది. ఆమె స్వతంత్రముగా దానము చేయునది. ఆమెను గురించి

"వియా జానాతి జసురిం వితృష్యతం వికామినమ్ | దేవత్రా కృణుతేమనః" అన్నది మంత్రము.

శశీయసి వలననే భర్తకు కీర్తి కలిగినదని 8వ మంత్రమున చెప్పబడినది.

2. శాయణాచార్యులు ఈ సూక్తమునకు సంబంధించి ఒక వృత్తాంతమును ఉదాహరించినారు. "అత్రాశ్చర్యం పురావృత్తమాహురాగమపారగాః" ఆగమ పారగులు చెప్పు ఆశ్చర్యకరమగు పూర్వవృత్తాంతము అన్నాడు.

రథవీతి అను రాజు ఆత్రేయ వంశజుడయిన అర్చనానుని హోతగా ఏర్పరచినాడు. యజ్ఞ సందర్భమున హోత రాజు కూతురును చూచినాడు. ఆమెను తనకొడుకు శ్యావాశ్వునకు ఇవ్వవలసినదని రాజును అడిగినాడు. రాజు అందుకు సిద్ధపడినాడు. కాని రాణిని సంప్రదించదలచినాడు.

రాణి శ్యావాశ్వునకు తన కూతురును ఇచ్చుటకు అంగీకరించలేదు. ఋషి కానివానికి తమ కుటుంబమున పిల్లను ఇవ్వలేదన్నది.

శ్యావాశ్వునకు ఆ పిల్లమీద మనసయింది. తాను ఋషి కాదలచినాడు. కఠోర నియమములు పాటించినాడు. భిక్ష చేయుచు సంచారము సాగించినాడు.

సంచార సందర్భము శశీయసివి కలిసినాడు. ఆమె అతనిరాకను గురించి భర్తకు చెప్పినది. శశీయసి భర్త తరంతరుడు వచ్చినవానిని ఆదరించమని చెప్పినాడు.

శశీయసి పశువులను ఆభరణములను శ్యావాశ్వునకు ఇచ్చినది. తరంతరుడు సహితము అనేక ధనము ఇచ్చినాడు. శ్యావాశ్వుని రాజు తన తమ్ముడు పురుమీహ్లునివద్దకు పంపినాడు.

శ్యావాశ్వుడు పురుమీహ్లుని వద్దకు వెళ్లుచుండగా మార్గమధ్యమున మరుత్తులు దర్శనమిచ్చినారు.

శ్యావాశ్వరుడు వారిని స్తుతించినాడు. మరుత్తులు అతనిని ఋషిగా గుర్తించినారు. అతనిని వేద స్తోత్రముల ద్రష్టను చేసినారు.

ఆవిధముగా ఋషియయి శ్యావాశ్వుడు రథవీథిని చేరినాడు. అతడు తన భార్య సమ్మతితో తన కూతురును శ్యావాశ్వునకు ఇచ్చి వివాహము చేసినాడు.

## అరువది రెండవ సూక్తము

ఋషి - ఆత్రేయ శ్రుతవిది, దేవత - మైత్రావరుణులు ఛందస్సు - త్రిష్టుప్.

1. సూర్యమండలము మీకు ఆధారభూతము. అది నీటితో కప్పబడినది. శాశ్వతము. సత్యభూతము. ఆ స్థానమందున్న అశ్వములను కిరణములను స్తోతలు విడిచిపెట్టుదురు. ఆ మండలమున వేలకొలది రశ్ములు ఉన్నవి. తేజోవంతుడగు అగ్ని మున్నగు సాకార దేవతలమధ్య మేము సూర్యుని శ్రేష్ఠమండలమున దర్శించినాము!

2. మిత్రావరుణులారా ! మీ మహాత్మ్యము అత్యంత ప్రశస్తము. మీ మహత్తువలననే నిరంతర పరిభ్రమణకారి సూర్యుడు తనదైనిక గతులందు స్థావరజలరాశిని పిదుకును. మీరు స్వయముగా భ్రమణకారి సూర్యుని ప్రీతిదాయక దీప్తిని వర్ధిల్లచేయుదురు. మీ ఇద్దరి ఒకే రథము అనుక్రమమున పరిభ్రమించును.

3. మిత్రావరుణులారా ! స్తోతలు మీ అనుగ్రహమున రాజపదము పొందుదురు. మీరు మీ సామర్థ్యమున ద్యావాపృథ్వులను భరించి నిలిచినారు. మీరు శీఘ్రదాన కర్తలు. ఔషధములను గోవులను వర్ధిల్ల చేయండి. వర్షము కురిపించండి.

4. మిత్రావరుణులారా ! మీ రథము అశ్వయుక్తమయి మిమ్ము వహించవలెను. సారథి ద్వారా నియంత్రితమై సాగవలెను. మూర్తిమంతమగు జలము మిమ్ము అనుసరించును. మీ అనుగ్రహమున పురాతన నదులు ప్రవహించుచున్నవి.

5. మిత్రావరుణులారా ! మీరు అన్నవంతులు. బలసంపన్నులు. మీరు దేహదీప్తిని వర్ధిల్ల చేయుదురు.

యజ్ఞము మంత్రమున రక్షించబడినట్లు మీ వలన భూమి రక్షించబడును. మీరు యజ్ఞభూమి మధ్యనున్న రథము ఎక్కండి.

6. మిత్రావరుణులారా ! యజ్ఞమున మిమ్ము శోభన స్తోత్రముల స్తుతించు యజమాని విషయమున మీరు దానశీలురుకండు. అతనిని రక్షింపుడు. మీరు రాజులు, క్రోధహీనులాయి ధనమును సహస్రస్తంభ సౌధమును వహించుడు.

7. వీరి రథము హిరణ్మయము. మేకులు సహితము బంగారపువి! వారి రథము అంతరిక్షమున విద్యుత్తువలె విరాజిల్లును. మేము యూపయష్టి సమన్విత యజ్ఞభూమియందు రథముపైన సోమరసము స్థాపించెదము.

8. మిత్రావరుణులారా ! ఉషఃకాలమున సూర్యోదయమయినపుడు లోహకీల సమన్విత హిరణ్మయ రథమున మీరు యజ్ఞమునకు వెళ్లుటకు ఎక్కండి. అట్లే దితి, అదితులను అవలోకించండి.

("అదితి మఖండనీయ భూమిం దితిం ఖండితాం ప్రజాదికాం" శాయణుడు. అదితి అనగా అఖండభూమి. దితి అనగా ఖండిత - ముక్కలయిన ప్రజలు మున్నగువారు.

భూమి ఎల్లప్పుడు అఖండమే ! ప్రజలే ఖండితులు !! గొప్ప ఆలోచన !!)

మిత్రావరుణులారా ! మీరు దానశీలురు. విశ్వరక్షకులు. మీరు అనుభవించు సుఖము విఘాత రహితము. అచ్ఛిన్నము. బహుముఖము. ఆ సుఖముతోనే మమ్ము రక్షించండి. మాకు అభిలషించిన ధనలాభము శత్రువిజయము కలుగవలెను.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఐదవ మండలము మూడవ అష్టకమునమూడవ అధ్యాయము సమాప్తము)

*ఓం వతామినన్తిమాయివో వధీరావ్రతానాం ప్రథమాధ్రివాణి*
*నరోదసీ అద్రుహా వేద్యాభిర్న పర్వతావి నమేస్థివాం పః*

## నాలుగవ అధ్యాయము          అరువది మూడవ సూక్తము

ఋషి - ఆత్రేయ అర్చనానుడు, దేవత - మిత్రావరుణులు, ఛందస్సు - జగతి.

1. మిత్రావరుణులారా ! మీరు ఉదక రక్షకులు. సత్య ధర్మవంతులు. మీరు మా యజ్ఞమునకు వచ్చుటకుగాను నిరతిశయ ఆకాశమున రథమును ఎక్కుదురు. మీరు ఈ యజ్ఞమును రక్షించు యజమాని కొఱకు ద్యులోకపు మేఘము నుండి సుమధుర జలవర్షము కలుగచేయుదురు.

2. స్వర్గద్రష్టలగు మిత్రావరుణులారా ! ఈ యజ్ఞమున విరాజిల్లి మీరు భువనములను శాసింతురు. మేము మిమ్ము వృష్టిరూప ధనము, స్వర్గము ప్రార్థింతుము. మీ విశాలరశ్మలు ద్యావాపృథ్వుల మధ్య సంచరించును.

3. మిత్రావరుణులారా ! మీరు అత్యంత విరాజమానులు. ఉద్యతబలులు. వారి వర్షకులు. ద్యావాపృథ్వికి భర్తలు. సర్వద్రష్టలు. మీరిద్దరు మహానుభావులు. విచిత్ర మేఘసహితులయి స్తుతిశ్రవణమునకుగాను విచ్చేయుడు. తదనంతరము వర్షవిధాయకుడగు పర్జన్యుని ద్వారా ద్యులోకము నుండి వర్షము కురిపించండి.

4. మిత్రావరుణులారా ! సూర్యుడు మీకు అస్త్రభూతుడు. జ్యోతిర్మయుడు. సూర్యుడు అంతరిక్షమున సంచరించినపుడు మీ సామర్థ్యము స్వర్గమున వెల్లడియగును. మీరు ద్యులోకమున మేఘము, వర్షము ద్వారా సూర్యుని రక్షించుచున్నారు. పర్జన్యుడు మిత్రావరుణులతో ప్రేరితుడవయి ఆకసమునుండి వర్షబిందువును రాల్చుము.

5. మిత్రావరుణులారా ! వీరుడు యుద్ధమునకుగాను తన రథమును సిద్ధము చేసినట్లు మరుద్గణములు మీ అనుగ్రహమున వర్షమునకుగాను మీ రథమును సిద్ధము చేసెదరు. జలవర్షమునకుగాను మరుద్గణములు వివిధ లోకముల సంచరింతురు. మీరు మరుద్గణ సహితులయి ద్యులోకమునుండి మా మీద వాన కురిపించండి.

6. మిత్రావరుణులారా ! మీ అనుగ్రహముననే మేఘము అన్నసాధకము, ప్రభావ్యంజకము, విచిత్రమగునది అయినది. మరుద్గణములు తమ ప్రజ్ఞాబలమున మేఘములను రక్షింతురు. వారితో మీరు అరుణవర్ణ, నిష్పాప ఆకసము నుండి వాన కురిపింతురు.

7. విద్వాంసులగు మిత్రావరుణులారా ! మీరు జగములకు ఉపకారకులు. వృష్టి మున్నగువాని ద్వారా యజ్ఞమును రక్షించెదరు. జలవర్షకుడు పర్జన్యుని ప్రజ్ఞవలన జలమున సమస్త భూతజాతములను దీప్తము చేయును. పూజ్యుడు, వేగవంతుడగు సూర్యుని ద్యులోకమున నిలుపుదురు.

## అరువది నాలుగవ సూక్తము

ఋషి - ఆత్రేయ అర్చనానుడు, దేవత - మిత్రావరుణులు ఛందస్సు - అనుష్టుప్, చివరిది పంక్తి.

1. మిత్రావరుణులారా ! మేము ఈ మంత్రమున మీ ఉభయులను ఆహ్వానించుచున్నాము. బాహుబలమున ఆవులమందను అదుపు చేసినరీతి మీరు శత్రువులను దూరము చేయండి. స్వర్గమార్గమును కనబరచండి.

2. మీరిద్దరు ప్రజ్ఞాసంపన్నులు. మీరు మా స్తుతి కర్తలకు అభిమత సుఖములు ప్రసాదించండి. మేము శోభన హస్తముల స్తుతింతుము. మీరు ప్రసాదించిన సుఖములు సర్వత్ర వ్యాపించవలెను.

3. మాకు ఇప్పుడే గమనము ప్రాప్తించవలెను. మిత్రుడు చూపిన బాటన సాగవలెను. అహింసక మిత్రుని సుఖము మా ఇంట సమకూరవలెను.

4. మిత్రావరుణులారా ! మేము మిమ్ము స్తుతింతుము. ధనమును పొందుదుము. ఆ ధనమును చూచి ధనికులు స్తుతికర్తలు ఈర్ష్య పడుదురు.

5. మిత్రావరుణులారా ! మీరు సుందర దీప్తియుక్తులయి మా యజ్ఞమునకు విచ్చేయండి. ఐశ్వర్యశాలి యజమానుల గృహములందును, మా ఇంటను సమృద్ధిని వర్థిల్ల చేయండి.

6. మిత్రావరుణులారా ! మా స్తుతుల కొరకును మా కొరకును మీరు విశేష అన్నమును ధరించండి. మీరు మాకు అన్నము, ధనము, బలములు శుభములు కలిగించండి.

7. అధినాయక మిత్రావరుణులారా ! ఉషఃకాలమున సుందర కిరణయుక్త ప్రాతస్సవనమున దేవబల విశిష్ట గృహమునందు మీరిద్దరు పూజనీయులు అగుదురు. ఆ ఇంట మేము అభిషవించిన సోమమును మీరు అవలోకించండి. మీరు 'అర్జనాను' ని విషయమున ప్రసన్నులుకండు. గుఱ్ఱములపై ఇప్పుడే విచ్చేయండి.

## అరువది అయిదవ సూక్తము

ఋషి - ఆత్రేయ రాతహవ్యుడు, దేవత - మిత్రావరుణులు ఛందస్సు - అనుష్టుప్, చివరిది పంక్తి.

1. మిత్రావరుణులారా ! దేవతలందు మీ ఇద్దరికి స్తుతి తెలిసినవాడే అనుష్ఠానవంతుడగును. అట్టివాడు మాకు ఉపదేశము చేయవలెను. ఆ స్తుతిని అందగాళ్లయిన మిత్రావరుణులు స్వీకరించవలెను.

2. మిత్రావరుణులు ప్రశస్త తేజోవంతులు. ఈశ్వరభూతులు. వారు దూరదేశమునుండి ఆహూతులయినను

వినగలరు. యజమానుల స్వాములు, యజ్ఞవర్ధకులు మిత్రావరుణులు విశేషస్తోతకు శుభములు సమకూర్చుటకు చరింతురు.

3. మీరు పురాతనులు. మేము మీవద్ద నిలిచి మా రక్షణ కొఱకు నుతింతుము. వేగవంతములగు అశ్వములకు అధిపతులమై అన్నప్రదానము చేయవలసినదిగా మిమ్ము స్తుతింతుము. మీరిద్దరు శోభన జ్ఞానవంతులు.

4. మిత్రదేవుడు పాపి అగు స్తోతకుగూడ విశాల గృహమున నివసించు ఉపాయము చేయును. హింసక పరిచారకునికి సహితము సమృద్ధిని ప్రసాదించును.

5. యజమానులమగు మేము దుఃఖ నివారకుడగు మిత్రదేవుని రక్షలు కలవారమగుదుము. మేమందరము నీ రక్షణల వలన పాపరహితులమయి వరుణుని పుత్రస్వరూపులము కావలెను.

6. మిత్రావరుణులారా ! మేము మిమ్ము స్తుతింతుము. మీరు మావద్దకు విచ్చేయుడు. మేము కోరిన సమస్త వస్తువులను ప్రసాదించండి. మేము అన్నసంపన్నులము. మమ్ము పరిత్యజించకండి. సుతసోమయజ్ఞమున మమ్ము రక్షించండి.

## అరువది ఆరవ సూక్తము

ఋషి - ఆత్రేయ రాతహవ్యుడు, దేవత - మిత్రావరుణులు, ఛందస్సు - అనుష్టుప్.

1. స్తుతివిజ్ఞాతలగు మానవులారా ! శుభకర్మవంతులు, శత్రుహింసకులగు దేవద్వయమును ఆహ్వానించండి. ఉదక స్వరూపుడు, హవిర్లక్షణుడు, అన్నవంతుడు, పూజనీయుడగు వరుణునకు హవ్యప్రదానము చేయండి.

2. మీరిద్దరు మహాబలవంతులు. సూర్యుడు అంతరిక్షమున దృశ్యమానుడయినట్లు మానవులమధ్య మీ ఉభయుల దర్శనీయ బలము యజ్ఞమున స్థాపితమగును.

3. మిత్రావరుణులారా ! మీరు 'రాతహవ్యు' ని ప్రకృష్ట స్తుతివలన శత్రువును పరాభవించు బలము పొందుడు. మేము పయనించు మా రథము ముందు మార్గరక్షణార్థము సాగుదురు. మేము మిమ్ము స్తుతించుచున్నాము.

4. స్తుతియోగ్యులు, శుద్ధబలవంతులగు దేవద్వయమా ! మా ప్రవర్ధమాన స్తుతులకు మీరు ఆశ్చర్యచకితులగుదురు. మీరు అనుకూల మనమున యజమాని స్తోత్రములను తెలియుదురు.

5. భూదేవీ ! మా ఋషుల ప్రయోజన సిద్ధికొఱకే నీమీద నీరు నిలిచి ఉన్నది. గమనశీల దేవద్వయమా ! మీ గతి

విధివలన ఎక్కువ పరిమాణమున మరింత వర్షము కురిపించును.

6. దూరదర్శులగు మిత్రావరుణులారా ! మేము స్తోతలము మిమ్ము ఆహ్వానించుచున్నాము. మేము మీయొక్క సువిస్తీర్ణము బహుజన రక్షితమగు రాజ్యమునకు ఎదగవలెను.

## అరువది ఏడవ సూక్తము

ఋషి - ఆత్రేయ యజితుడు, దేవత - మిత్రావరుణులు ఛందస్సు - అనుష్టుప్.

1. ద్యుతిమంతులగు అదితి పుత్రులు మిత్రా, వరుణ, ఆర్యములారా ! మీరు ప్రస్తుత ప్రకారమున యజనీయము. బృహంతము, అత్యంత ప్రవృద్ధబలము ధరింతురు.

2. మిత్రావరుణులారా ! మానవ రక్షకులారా ! శత్రుసంహారకులారా ! మీరు ఆనందజనక యజ్ఞభూమికి విచ్చేసినపుడు మమ్ము సుఖవంతులను చేయుదురు.

3. సర్వవిదులగు మిత్ర, వరుణ, ఆర్యమలు తమతమ స్థానములనుండి మా యజ్ఞమును చేరుదురు. హింసకులనుంచి మానవులను పరిరక్షింతురు.

4. వారు సత్యదర్శనులు. జలవర్షకులు. యజ్ఞ రక్షకులు. వారు యజమానికి మంచి మార్గము చూపుదురు. భూరిదానము చేయుదురు. మహానుభావులగు వరుణాదులు స్తోత పాపి అయినను అతనికి మరింత ధనము ఇచ్చెదరు.

మిత్రావరుణులారా ! మీరిద్దరు అందరి స్తుతియోగ్యులు, మేము అల్పబుద్ధులము. అత్రిగోత్రజులు మిమ్ము స్తుతింతురు.

## అరువది ఎనిమిదవ సూక్తము

ఋషి - ఆత్రేయ యజితుడు, దేవత - మిత్రావరుణులు ఛందస్సు - గాయత్రి.

1. ఋత్విక్కులారా ! మీరు ఉచ్చైస్వరమున మిత్రావరుణులను స్తుతించండి. విశేష బలవంతులగు మిత్రావరుణులారా ! ఈ మహా యజ్ఞమునకు దయచేయండి.

2. మిత్రావరుణులు ఇద్దరును అందరికి స్వాములు. జలముల ఉత్పాదకులు, ద్యుతిమంతులు. దేవతలలో అత్యంత స్తుత్యులు, ఋత్విక్కులారా ! మీరు వారిద్దరిని స్తుతించండి.

3. ఆ ఇద్దరు దేవతలు మాకు పార్థివధనము - దివ్యధనము ప్రసాదించు సమర్థులు. మిత్రావరుణులారా ! పూజనీయమగు మీ బలము దేవతలలో ప్రసిద్ధము. మేము ఆ బలమును స్తుతింతుము.

4. ఉదకముద్వారా యజ్ఞమును స్పృశించిన ఇద్దరు దేవతలు హవ్యమును వ్యాప్తము చేయుదురు. ద్రోహరహిత మిత్రావరుణులారా ! మీరు వర్ధిల్లుదురు.

5. ఏ ఇద్దరు అంతరిక్షమున వర్షకారకులో - ఏ ఇద్దరు అభిమత ఫలప్రావకులో - ఏ ఇద్దరు వృష్టిప్రదులగుటవలన అన్న అధిపతులో ఏ ఇద్దరు దాత విషయమున అనుకూలురో ఆ ఇద్దరు మహానుభావులు. యజ్ఞమునకు విచ్చేయుటకు మహారథమున అధిష్ఠితులగుదురు.

## అరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - ఆత్రేయ ఉరుచక్రి, దేవత - మిత్రావరుణులు ఛందస్సు - త్రిష్టుప్.

1. మిత్రావరుణులారా ! మీరు రోచమానములగు మూడు ద్యులోకములవారు. మూడు అంతరిక్షలోకములవారు. మూడు భూలోకములవారు. మీరు ఇంద్రుని రూపమును, కర్మను నిరంతరము రక్షింతురు.

2. మిత్రావరుణులారా ! మీ ఆజ్ఞవలననే ఆవులు పాలిచ్చుచున్నవి. స్పందనశీల మేఘము మఱియు నదుల సుమధుర జలములను ప్రదానము చేయుచున్నవి. మీ ఉభయుల అనుగ్రహముననే జలవర్షకము, జలధారకము, ద్యుతిమంతమగు అగ్ని, వాయువు, ఆదిత్యుడు, భూమి, అంతరిక్షము ద్యులోకమున నిలిచి ఉన్నారు.

3. ప్రాతఃకాల - మధ్యాహ్న సవనములందు ఋషులమగు మేము దేవతల ద్యుతిమతి జనని అదితిని ఆహ్వానింతుము. మిత్రావరుణులారా ! మేము ధనము, పుత్రులు, పౌత్రులు, అరిష్టశాంతి, సుఖముల కొఱకు మిమ్ము యజ్ఞమున స్తుతింతుము.

4. ద్యులోకమున పుట్టిన అదితి పుత్రద్వయమా ! మీరు ద్యులోక భూలోకములను ధరింతురు. మేము మిమ్ము స్తుతింతుము.

మిత్రావరుణులారా ! మీ కార్యములు స్థిరములు వాటిని ఇంద్రాది అమరదేవతలు సహితము హింసించజాలరు.

## డెబ్బదివ సూక్తము

ఋషి - ఆత్రేయ ఉరుచక్ర, దేవత - మిత్రావరుణులు, ఛందస్సు - గాయత్రి.

1. మిత్రావరుణులారా ! మీ రక్షణ కార్యము నిశ్చయముగా అత్యంత దీర్ఘతరము. మేము మీ అనుగ్రహ బుద్ధిని భజింతుము.

2. ద్రోహ వివర్జిత దేవద్వయమా ! మాకు మీవద్ద మా భోజనమునకుగాను అన్నలాభము కలుగవలెను. రుద్రపుత్రులారా ! మేము మీ స్తోత్రలము. మేము మీవారలము కావలెను. సమృద్ధులము కావలెను.

3. రుద్రపుత్రులారా ! మీ ఉభయుల రక్షణలతో మమ్ము రక్షించండి. మాకు ఇష్టప్రాప్తి కలుగవలెను. అనిష్ట నివారణ జరుగవలెను. అభిమత ఫలము లభించవలెను. మేము మాపుత్రుల సహితులమయి శత్రువులను హింసించవలెను.

4. ఆశ్చర్యకర కార్యములు చేయువారలారా ! మేము ఇతరులను పూజించుట వలన లభించిన ధనమును అనుభవింపము. మేము మీ అనుగ్రహమున సమృద్ధులము. మేము ఇతరుల ధనముతో దేహ పోషణచేసికొనము. పుత్ర పౌత్రుల యుక్తమయిసహితము మీకు వ్యతిరిక్త ధనమును అనుభవించము. మా కులమందు ఎవరును మీరు కాక ఇతరులవలన లభించిన ధనమును అనుభవించరు.

## డెబ్బది ఒకటవ సూక్తము

ఋషి - ఆత్రేయ బాహువృక్తుడు, దేవత - మిత్రావరుణులు, ఛందస్సు - గాయత్రి

1. మిత్రావరుణులారా ! మీరు శత్రు ప్రేరకులు. శత్రుహంతలు. మీరు హింసావర్జితమగు మా ఈ యజ్ఞమునకు విచ్చేయండి.

2. ప్రకృష్ట జ్ఞానయుక్త మిత్రావరుణులారా ! మీరు అందరకు స్వాములు. ఫలప్రదానము ద్వారా మా కార్యములను పాలించండి.

3. మిత్రావరుణులారా ! మీరు మా అభిషుత సోమము కొఱకు విచ్చేయండి. మేము హవి అందించు వారలము. మేము సమర్పించు సోమపానము చేయుటకు విచ్చేయండి.

## డెబ్బది రెండవ సూక్తము

ఋషి - ఆత్రేయ బాహువృక్తుడు, దేవత - మిత్రావరుణులు, ఛందస్సు - ఉష్ణిక్.

1. మా గోత్ర ప్రవర్తకుడగు అత్రివలె మేము మంత్రములతో మిమ్ము ఆహ్వానింతుము. మిత్రావరుణులారా ! మీరు సోమపానమునకుగాను కుశాసనమున ఆసీనులు అగుడు.

2. మిత్రావరుణులారా ! మీరు జగదుద్ధారక కర్ములు. మీరు స్థానచ్యుతులు కారు. ఋత్విక్కులు మీకు యజ్ఞప్రదానము చేసెదరు. సోమపానమునకు గాను కుశాసనమున ఆసీనులుకండి. "నిబర్హిషి సదతం సోమపీతయే"

3. మిత్రావరుణులారా ! మీరు మా యజ్ఞమునుకోరి స్వీకరించండి. సోమపానమునకుగాను కుశాసనమున కూర్చుండుడు "నిబర్హిషి సదతం సోమపీతయే"

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఐదవ మండలమున నాలుగవ అష్టకము ఐదవ అనువాకము సమాప్తము)

**ఆరవ అనువాకము డెబ్బది మూడవ సూక్తము**

ఋషి - ఆత్రేయ పౌరుడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - అనుష్టుప్.

1. లెక్కకు మిక్కిలి యజ్ఞములందు భుజించు అశ్వినీకుమారులారా ! మీరు ఇప్పుడు అత్యంత దూరదేశమగు అంతరిక్షమున ఉన్నారు. ద్యులోకమున ఉన్నారు. అట్లయ్యు అన్ని స్థానములనుండి ఇచటికి విచ్చేయండి.

2. అశ్వినులారా ! మీరు అనేక యజమానులకు ఉత్సాహదాతలు. వివిధ కర్మల కర్తలు. వరణీయులు. అప్రతిహతగాములు. అనిరుద్ధకర్ములు. ఈ యజ్ఞమున మేము మీవద్దకు చేరెదము. విశేష భోగము, రక్షణ కొఱకు మేము మిమ్ము ఆహ్వానించుచున్నాము.

3. అశ్వినులారా ! సూర్యుని స్వరూపమును ప్రదీప్తము చేయుటకుగాను రథపు దీప్తిమంతమగు చక్రమును నియమించినారు. మీ సామర్థ్యమును మానవుల అహోరాత్రికాలమును నిరూపించుటకుగాను అన్య చక్రములను లోకములందు పరిభ్రమింప చేసినారు.

4. వ్యాపక దేవద్వయమా ! మేము మిమ్ము స్తుతించు స్తోతలము ఇది 'పౌరు'ని ద్వారా సుసంపాదితము. పృథిక్ ఉత్పన్నులు - నిష్పాపులగు మీరు మాకు బోలెడు అన్నము ప్రసాదించండి.

5. అశ్వినులారా ! మీ భార్య సూర్యమీ సర్వథా శీఘ్రగామి - రథమున ఎక్కినపుడు - అప్పుడు వెలుగులు చిమ్ము మీ దీప్తి నలుదిశల క్రమ్ముకొనును.

6. నేతలగు అశ్వినులారా ! మా తండ్రి అత్రి మిమ్ము స్తుతించినపుడు అగ్ని తాపము సుఖ సేవ్యమయినది. అతడు అందుకు కృతజ్ఞతచిత్తమున మీ ఉపకారమును స్మరించినాడు.

7. అశ్వినులారా ! మీ రథము గట్టిది. ఉన్నతము. నడకనేర్చినది. ఆ రథము యజ్ఞములందు ప్రసిద్ధము. మా తండ్రి అత్రి మీవలననే తరించినాడు.

8. మధుర సోమరసమును కలుపు దేవద్వయమా ! మేము సమర్పించు పుష్టికరమగు స్తుతి మీ మీద మధుర రసమును చల్లవలెను. మీరు అంతరిక్ష సీమను అతిక్రమింతురు. సుపక్వ హవ్యము మిమ్ము పోషించును.

9. అశ్వినులారా ! పండితులు మిమ్ము సుఖదాతలనుగా పేర్కొందురు. అది నిశ్చయ సత్యము. మా యజ్ఞమునకు సుఖదానార్థము ఆహ్వానించుచున్నాము. మీరు అతిశయ సుఖదాతలు కావలెను.

10. శిల్పి రథమును అందముగా చెక్కినట్లు మేము అశ్వద్వయమును సంవర్ధితులను చేయుటకు స్తుతులు సమర్పించుచున్నాము. ఆ స్తుతులు అశ్వినులకు ప్రీతికరమును కావలెను.

## డెబ్బది నాలుగవ సూక్తము

ఋషి - ఆత్రేయ పౌరుడు దేవత - అశ్వినులు, ఛందస్సు - అనుష్టుప్.

1. అశ్వినులారా ! మీరు స్తుతిధనులు. ధనవర్షులు. మీరు నేడు ఈ యజ్ఞ దినమున ద్యులోకమునుండి విచ్చేయండి. భూమి మీద నిలువండి. ఈ స్తోత్రమును వినండి. ఈ స్తుతిని మీ కొఱకు అత్రి సర్వదా పఠించును.

2. దీప్తిమంతులగు నా సత్యద్వయము - అశ్వినులు ఏరి? నేటి ఈ యజ్ఞదినమున ద్యులోకమునందలి ఏ స్థానము నుండి శ్రుతులగుచున్నారు?

దేవద్వయమా ! మీరు ఏ యజమాని దగ్గరకు విచ్చేయచున్నారు? ఏ స్తోత మీ స్తుతులకు సహాయకుడు అగుచున్నాడు?

3. అశ్వినులారా ! మీరు ఏ యజ్ఞము - ఏ యజమానివద్దకు ఏతెంచుచున్నారు? అట్లు వెళ్ళి ఎవరిని కలిసి కొందురు? ఎవరి ఎదుట నిలిచి మాట్లాడుటకు రథమునకు గుఱ్ఱములు కట్టుచున్నారు? ఎవరి స్తోత్రములు మీకు ప్రీతికరములు? మేము మిమ్ము పొందవలెనను కోరికగలవారము.

4. పౌరసంబంధి అశ్వినీ కుమారులారా ! మీరు పౌరునివద్ద జలవాహక మేఘమును ప్రేరేపించండి. అడవిలో పులులు సింహమును కొట్టినట్లు యజ్ఞకర్మ వ్యాప్త పౌరునివద్ద మేఘమును కొట్టుడు.

5. చ్యవనుడు జరా జీర్ణుడు. పురాతనుడు. కురూపి. అశ్వినులారా ! మీరు అతనిని కవచమువలె విముక్తము చేసినారు. మీరు చ్యవనుని మరల ప్రాయపు వానిని చేసినపుడు అతనిని రూపమును సురూపయువతి కామించినది. పొందినది.

6. అశ్వినులారా ! ఈ యజ్ఞస్థలమునకు మీ స్తోతలు వచ్చియున్నారు. మాకు సమృద్ధి కలుగుటకుగాను మేము మీ దృష్టిలో ఉండవలెను. నేడు మీరు మా ఆహ్వానమును ఆలకించండి. మీరు అన్నరూప ధనవంతులు మీరు రక్షణలతో ఇటకు ఏతెంచండి.

7. అశ్వినులారా ! మీరు అన్నరూప ధనవంతులు. మానవులను మిమ్ము మించి ప్రసన్నులను చేయువాడు ఎవడు? జ్ఞానులచే వందితులగు దేవద్వయమా ! ఏ జ్ఞాని మిమ్ము అందరిని మించి ప్రసన్నులను చేయగలడు?

8. అశ్వినులారా ! దేవతలందరి రథములలో మీ రథము వేగవంతము, అసంఖ్యాక శత్రుసంహారకము. ఆ రథమును యజమానులు నుతింతురు. మీ రథము దూరహితమును కోరవలెను. మావద్దకు చేరవలెను.

9. మధుమంతులగు అశ్వినులారా ! మీ కొఱకుగాను మరల మరల సమకూర్చిన స్తోత్రములు మాకు సుఖములు కలిగించవలెను. విశిష్ట జ్ఞానసంపన్నులగు అశ్వద్వయమా ! మీరు శ్యేన పక్షివంటి సర్వత్ర సంచరించు అశ్వమును ఎక్కి మాకు అభిముఖముగా రండి.

10. అశ్వినులారా ! మీరు ఎక్కడ ఉన్నను మా ఆహ్వానమును వినిపించుకొనుడు. మీ వద్దకు వచ్చుటకు అతురపడు ఈ హవ్యము మీవద్దకు చేరవలెను. మీకు అందవలెను.

## డెబ్బది అయిదవ సూక్తము

ఋషి - ఆత్రేయ అవస్యుడు - దేవత - అశ్వినులు, ఛందస్సు - పంక్తి.

1. అశ్వినులారా ! అవస్యు ఋషి మీ ఉభయుల స్తుతికర్త. అతడు మీ ఫలప్రద, ధనపూర్ణ రథమును అలంకృతము చేయును. మధు విద్య ఎరిగిన వారలారా ! మా ఆహ్వానమును ఆలకించండి. "మమశ్రుతం హవమ్"

2. అశ్వినులారా ! మీరు శత్రుసంహారకులు. హిరణ్మయ రథారూఢులు. ప్రశస్త ధనసంపన్నులు. నదులను ప్రవహింప చేయువారు. మధువిద్యావిశారదులు. మీరు అందరు యజమానులను అతిక్రమించి ఇచటకి విచ్చేయండి. అందువలన

మేము సమస్త విరోధులను ఓడించగలము. మీరు ఆహ్వానములు వినండి. "మమశ్రుతం హవమ్"

3. అశ్వినులారా ! మీరు సువర్ణ రథారూఢులు. స్తుతియోగ్యులు. అన్నరూపధనవంతులు. యజ్ఞమున అధిష్ఠించినారు. మధువిద్యావిశారదులు. మీరు మా పిలుపు వినండి. మా కొఱకు రత్నములు తీసికొని రండి.

4. ధనమును వర్షించు అశ్వినులారా ! నేను మీ స్తోతను. ఈ స్తోత్రములు మీ కొఱకు ఉచ్చరించబడినవి. ప్రసిద్ధుడు, మూర్తిమంతుడగు యజమాని ఏకాగ్రచిత్తమున మీకు హవి సమర్పించును. "మమశ్రుతం హవిం"

5. అశ్వినులారా ! మీరు విజ్ఞ మనస్కులు. రథారూఢులు. ద్రుతగాములు. స్తోత్రశ్రవణకర్తలు. మీరు త్వరగా రథమునెక్కి కపటము ఎరుగని చ్యవనుని వద్దకు వెళ్లినారు. మీరు మధువిద్యావిశారదులు "మమశ్రుతం హవమ్"

6. నేతలగు అశ్వినులారా ! మీ గుఱ్ఱములు సుశిక్షితములు. ద్రుతగాములు విచిత్రరూపులు. ఆ అశ్వములు మిమ్ము ఐశ్వర్యయుక్తముగ సోమపానమునకుగాను ఇచటికి తీసికొని రావలెను. "మమశ్రుతం హవమ్"

7. అశ్వినులారా ! మీరు ఇచటికి ఏతెంచండి. మీరిద్దరు ప్రతికూలురుకారాదు. అజేయ ప్రభువులారా ! ఏ ప్రచ్ఛన్న ప్రదేశమునుండియైనను యజ్ఞగృహమునకు వేంచేయండి. మధువిద్యావిశారదులారా ! "మమశ్రుతం హవమ్"

8. జలాధిపతులు, అజేయులగు అశ్వినులారా ! ఈ యజ్ఞమున మీ స్తోత్రకారుడగు అవస్యుని అనుగ్రహించండి. మధువిద్యావిశారదులారా ! "మమశ్రుతం హవమ్"

9. ఉషస్సు వికసించినది. సముజ్వల కిరణ సంపన్న అగ్ని వేదిమీద సంస్థాపితమయినది. ధనవర్షకారులు, శత్రుసంహారకులగు అశ్వినులారా ! మీ అక్షయ్య రథమును అశ్వయుక్తము చేయండి. మధువిద్యావిశారదులారా ! "మమశ్రుతం హవమ్"

## డెబ్బది ఆరవ సూక్తము

ఋషి - ఆత్రేయ భౌముడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉషఃకాలమున జాగృతుడయిన అగ్ని ప్రజ్వరిల్లును. మేధావులగు స్తోతల దేవాభిలాష స్తుతులు ఉద్గీతములగును. రథాధిపతులగు అశ్వినులారా ! నేడు మీరు ఈ యజ్ఞస్థలమునకు అవతరించండి. సోమరస పూర్ణ సమృద్ధ యజ్ఞమునకు విచ్చేయండి.

2. అశ్వినులారా ! ఇది సంస్కారవంతమగు యజ్ఞము. దీనిని హింసించరాదు. కాని యజ్ఞమునకు త్వరగా వచ్చి

స్తుతిభాజనులుకండి. ప్రాతఃకాలమున రక్షణ సహితులయి విచ్చేయండి. అందువలన అన్నమునకు అభావము కలుగదు. హవ్యదాత యజమానిని సుఖవంతుని చేయండి.

3. అశ్వినులారా ! మీరిద్దరు రాత్రిశేషమున పాలుపితుకుకాలమున ప్రాతఃకాలమున అపరాహ్నమున రాత్రిపూట ఏ సమయమందయినను సుఖకర రక్షణలతో విచ్చేయండి. అశ్వినులను విడిచి ఇతర దేవతలు సోమపానమునకు ఉద్యుక్తులుకారు.

4. అశ్వినులారా ! ఈ ఉత్తర వేది మీకు నివాసయోగ్యమగు ప్రాచీనస్థలము. ఈ సమస్త గృహము ఆలయము మీ కొఱకే అగును. మీరు ఇరువురు వాయుపూర్ణ, మేఘ సమాకీర్ణ అంతరిక్షము నుండి అన్నము, బలమును తీసికొని మా వద్దకు చేరండి.

5. మేమందరము అశ్వినుల శ్రేష్ఠరక్షణలు సుఖప్రద ఆగమములతో ముడిపడవలెను. అమర దేవద్వయమా ! మీరు మాకు ధనము, సంతానము, సమస్త కళ్యాణములను ప్రసాదించండి.

## డెబ్బది ఏడవ సూక్తము

ఋషి - ఆత్రేయుడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. అశ్విద్వయము ఉదయమే - అందరి దేవతలకన్నముందు విచ్చేయుదురు. ఋత్విక్కులారా ! వారిని పూజించండి. కాంక్షగల అదానపరులగు రాక్షసులు మున్నగువారికన్నముందే వారు హవ్యపానము చేయుదురు. వారు ప్రాతఃకాలముననే యజ్ఞమును భజింతురు. పూర్వకాలపు ఋషులు ప్రాతఃకాలమున అశ్విద్వయమును ప్రశంసించినారు.

2. మానవులారా ! ప్రాతఃకాలముననే అశ్వినులను పూజించండి. వారికి హవ్యము సమర్పించండి. సాయంకాలపు హవ్యము దేవతలకు చేరునదికాదు. దేవతలు దానిని స్వీకరించరు. అది అసేవ్యమానమగును. మనకన్నముందు సోమము ద్వారా వారిని యజించువాడు. వారికి హవ్యములు అందించి తృప్తిపరచువాడు. యజించువాడు దేవతలకు అభిమతుడు అగును.

3. అశ్వినిద్వయమా ! మీ రథము హిరణ్య ఆచ్ఛాదితము. మనోవేగముగలది. వాయువేగముకలది. అన్నము ధరించునది. ఆ రథము వచ్చుచున్నది. మీరు దానిమీద సంపూర్ణదుర్గమ మార్గములను అతిక్రమించెదరు.

4. హవి విభాగము జరుగు యజ్ఞమున అశ్వినులకు విపులహవ్యము సమర్పించు యజమాని కర్మద్వారా తనపుత్రుని పోషించును. అశ్వినులు అగ్నిని ప్రదీప్తము చేయనివారిని హింసింతురు.

5. మేమందరము అశ్వినీ కుమారుల శ్రేష్ఠరక్ష మఱియు వారి ఆగమనముతో కూడి ఉందుము. అమర అశ్వినిద్వయమా ! మాకు ధనము, సంతతి, సమస్త కళ్యాణములు ప్రసాదించండి.

## డెబ్బది ఎనిమిదవ సూక్తము

ఋషి - ఆత్రేయ సప్తవధి, దేవత - అశ్వినులు ఛందస్సు - 1-3 ఉష్ణిక్, త్రిష్టుప్, మిగిలినవి అనుష్టుప్.

1. అశ్వినులారా ! ఈ యజ్ఞమునకు విచ్చేయండి. నా సత్యద్వయమా ! మీరు ప్రమత్తులుకారాదు. హంసద్వయము నిర్మల జలములవైపు సాగినట్లు మీరు అభిషుత సోమమువైపు సాగండి.

2. అశ్వినులారా ! హరిణి, గౌరమృగము పచ్చగడ్డి వెంట పరిగెత్తినట్లు హంసద్వయము నిర్మల ఉదకము వైపు సాగినట్లు మీరు అభిషుత సోమమువైపు సాగండి.

3. అన్నము నిమిత్తము నివాసప్రదులగు అశ్వినులారా ! యజ్ఞమునకు అభీష్ట సిద్ధికొఱకు విచ్చేయండి. హంసద్వయము నిర్మల ఉదకమువవైపు సాగినట్లు అభిషుత సోమమువైపు సాగండి.

4. అశ్వినులారా ! లాలించినంత భార్య భర్తను ప్రసన్నుని చేసినట్లు మా పితరుడు అత్రి మిమ్ము స్తుతించి తుషాగ్ని కుండమునుంచి విముక్తుడయినాడు. మీరు శ్యేనపక్షి వంటి వేగమున సుఖప్రదమగు రథమున మమ్ము రక్షించుటకు విచ్చేయండి.

5. వనస్పతి నిర్మిత పేటికా కట్టు పెట్టే ! ప్రసవించనున్న స్త్రీయోనివలె విచ్చుకొనుము. అశ్వినులారా ! మా ఆహ్వానము వినండి. నేను సప్తవధ్రి ఋషిని. నన్ను విడిపించండి.

("అత్రబ్రువన్తీతిహాసం సప్తవధ్రేః పురావిదః" పూర్వకాలము తెలిసినవారు ఈ సందర్భమున సప్తవధ్రి కథ చెప్పుదురు అని ఒక వృత్తాతంము వివరించినాడు శాయణుడు.

సప్తవధ్రి సోదరుని పుత్రులు సప్తవధ్రిని అతని భార్యతో కలియకుండ చేయవలెను అనుకున్నారు. వారు సప్తవధ్రిని ఒకపెట్టెలో రాత్రిళ్లు దాచువారు. ఉదయమున వదిలిపెట్టువారు.

సప్తవధ్రి ఆ బాధ భరించలేక అశ్వినులను ప్రార్థించినాడు. వారు అతనికి విముక్తి కలిగించినారు. రాత్రిళ్లు పెట్టెనుంచి బయటకి వచ్చిన ఋషి మరల ఉదయమున పెట్టలో ఉండువాడు.

పెట్టె వనస్పతి కట్టతో చేయబడినది కావున ముందు వనస్పతిని ప్రార్థించినాడు)

6. అశ్వినులారా ! భీతుడు నిర్గమనమునకు ప్రార్థించు సప్తవధ్రి ఋషికొఱకు మీమాయతో పేటికను మూసినారు తెరిచినారు.

7. వాయువు సరోవరాదులను సంచలితము చేసినట్లు నీ గర్భము చలించవలెను. పదినెలలు తరువాత గర్భస్థ ప్రాణి బయటపడవలెను.

8. వాయువు, అరణ్యము, సముద్రము కంపించినట్లు పదినెలలు నిండిన గర్భస్థజీవి మాయచుట్టుకొని బయటపడును.

9. పదినెలలు తల్లిగర్భమున ఉన్న ప్రాణి సజీవముగా అక్షతరూపమున జీవించిన జననికి పుట్టవలెను.

("గర్భిణ్యాః ప్రసవాయాశుస్తుతవానశ్వినావృషిః" ఇవి గర్భస్థ స్త్రీలు ప్రసవ సమయమున అశ్వినులను స్తుతించు మంత్రములని శాయణుడు)

## డెబ్బది తొమ్మిదవ సూక్తము

ఋషి - ఆత్రేయ సత్యశ్రవుడు, దేవత - ఉష, ఛందస్సు - పంక్తి.

1. దీప్తమతీ ! ఉషా ! నీవు మమ్ములను ఇదివరకు ప్రబోధితులను చేసినావు. అట్లే నేడును ప్రచుర ధనప్రాప్తికొఱకు ప్రబోధితులను చేయుము. శోభన ప్రాదుర్భావవతీ ! అశ్వప్రాప్తికిగాను జనులు నిన్ను స్తుతింతురు. వయ్యుపుత్రుడు సత్యశ్రవుని అనుగ్రహింపుము.

2. సూర్యసఖియా ఉషా ! నీవు శుచద్రథ పుత్రుడగు 'సునీథి' అంధకారమును దూరము చేసినావు. శోభన ప్రాదుర్భవతీ ! అశ్వప్రాప్తికిగాను జనులు నిన్ను స్తుతింతురు. వయ్యుపుత్రుడు అతిశయజలరాశి సత్యశ్రవుని తిమిరమును నివారించుము.

3. ద్యులోక దుహితా ! నీవు ధనసమార్జన పరురాలవు. నీవు మా చీకట్లను దూరము చేయుము. సుజాతా ! అశ్వప్రాప్తికిగాను జనులు నిన్ను స్తుతింతురు. వయ్యు పుత్రుడు అతిశయ బలశాలి సత్యశ్రవుని తిమిరమును నివారించినావు.

4. ప్రకాశవతీ ఉషా ! స్తోత్రములతో నిన్ను ఋత్విక్కు ఐశ్వర్యము ద్వారా సమృద్ధి సంపన్నుడయి దానశీలుడగును.

ధనశాలినీ, సుజాతా ఉషా ! జనులు అశ్వలాభమునకుగాను నిన్ను స్తుతింతురు.

5. ఉషా ! ధనప్రదానమునకుగాను నీముందు నిలిచిన ఉపాసకులు అక్షయ్య హవ్యధనము సమర్పించి మా విషయమున అనుకూలురు అయినారు. అశ్వప్రాప్తికొఱకు జనులు నిన్ను స్తుతింతురు.

6. ధనవంతురాలవగు ఉషాదేవీ ! నీవు స్తోతలగు యజమానులకు వీరపుత్రయుక్త అన్నము ప్రసాదించుము. అందువలన వారు ధనవంతులయి మాకు విశేష ధనమును దానము చేయవలెను. సుజాతా ! అశ్వప్రాప్తి కొరకు జనులు నిన్ను స్తుతింతురు.

7. ధనశాలిని ఉషా ! మాకు అశ్వములు, గోవులు మున్నగు ధనములు దానముచేసిన యజమానికి నీవు సంపూర్ణ ధనము విశేష అన్నము ప్రసాదింపుము. సుజాతా ! అశ్వప్రాప్తి కొఱకు జనులు నిన్ను స్తుతింతురు.

8. ద్యులోకదుహితా ! ఉషా ! నీవు సూర్యుని శుభ్రమగు రశ్మి ప్రజ్వలిత అగ్ని ప్రదీప్తి జ్వాలతో మావద్దకు అన్నము, ఆవులను కొనిరమ్ము. సుజాతా ! అశ్వప్రాప్తి కొరకు జనులు నిన్ను స్తుతింతురు.

9. ద్యులోకదుహితా ! ఉషా ! నీవు వెలుగులు పుట్టింపుము. మా విషయమున జాగుచేయకుము. రాజు దొంగను శత్రువును సంతృప్తుని చేసినట్లు సూర్యుడు తన కిరణములతో నిన్ను సంతప్తను చేయరాదు. సుజాతా ! అశ్వప్రాప్తి కొఱకు జనులు నిన్ను స్తుతింతురు.

10. ఉషా ! మేము ప్రార్థించినది. ప్రార్థించనిది కూడ ప్రసాదించుటకు నీవు సమర్థురాలవు. దీప్తివతీ ! నీవు స్తోతల తమస్సు నశింప చేతువు. వారిని హింసించవు. సుజాతా ! అశ్వప్రాప్తి కొరకు జనులు నిన్ను స్తుతింతురు.

## ఎనుబదవ సూక్తము

ఋషి - ఆత్రేయ సత్యశ్రవుడు, దేవత - ఉష, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉష దీప్తిమంత రథారూఢ. సర్వవ్యాపిని. యజ్ఞపూజిత. అరుణవర్ణ. సూర్యపురోవర్తిని. దీప్తిమతి. అట్టి ఉషను ఋత్విక్కులు స్తవములద్వారా స్తుతింతురు.

2. దర్శనీయ ఉష్ నిద్రలో ఉన్న జనులను ప్రభోదితులను చేయును. మార్గములను సుగమము చేయును. విశాల రథముపై ఎక్కును. సూర్యుని కన్నముందు సాగును. మహతి, విశ్వవ్యాప్తిని ఉష దివసారంభమున దీప్తిని విస్తరింప చేయును.

3. ఉష తన రథమున ఎరుపురంగు ఎద్దును కట్టును. ఆక్షీణ జలములను అవిచలితము చేయును. దీప్తమతి, బహుస్తుత, వరణీయ ఉష మార్గములను కనబరచి వెలిగించును.

4. ఉష అంతరిక్షమున ఊర్ధ్వ, మధ్యమ భాగములందు వసించును. తన రూపమును తూర్పున విదితమగును. విశేష శ్వేత వర్ణ ఉష బ్రహ్మాండమును ప్రబోధితము చేయును. ఆదిత్యుని మార్గమును అనుసరించును. ఆమె దిశలను బాధించదు ప్రకాశింప చేయును.

5. సుందర అలంకారములుగల యువతివలె ఉష తన దేహమును ప్రకాశింపచేయును. జలకములాడిన పడతివలె తూర్పున ఉదయించును. ద్యులోక దుహిత ఉషద్వేషక అంధకారమును బాధించును. వెలుగులతో అవతరించును.

6. ద్యులోకదుహిత ఉష పశ్చిమాభిముఖి అయి శుభంకర వేషమును ధరించు యువతి రీతి తన రూపమును ప్రకటించును. ఆమె తనకు హవ్యము అందించు యజమానికి వరించదగిన ధనము ప్రదానము చేయును. నిత్య యవ్వన ఉష పూర్వమువలెనే వెలుగులు వెదజల్లును.

## ఎనుబది ఒకటవ సూక్తము

ఋషి - శ్యావాశ్వుడు, దేవత - సవిత, ఛందస్సు - జగతి.

1. ఋత్విక్కులు, యజమానులు సర్వకర్మములందు తమ మనసులు లగ్నము చేయుదురు. మేధావి. మహానుడు, స్తుతియోగ్యుడగు సవిత ఆజ్ఞచే యజ్ఞకార్యమున నిమగ్నులగుదురు. సవిత హోత కార్యములను తెలిసికొనును. వారిని యజ్ఞకార్యములకు ప్రేరేపించును. సవిత స్తుతి అత్యంత విశాలము.

2. సవిత మేధావి. అతడు స్వయం సంపూర్ణ రూపమును ధరించును. అతడు మానవుల జంతువుల గమనాది విషయక కళ్యాణమును ఎరుగును. సర్వులను ప్రేరేపించును, వరణీయ సవిత స్వర్గమును ప్రకాశింప చేయును. అతడు ఉష ఉదయించిన తరువాత ప్రకాశించును.

3. అగ్ని మున్నగు ఇతర దేవతలు ద్యుతిమంతుడగు సవితను అనుసరించి మహిమ బలమును పొందుదురు. తను మాహాత్మ్యమున పృథివ్యాది లోకములను పరిచ్ఛిన్నము చేయు సవిత శోభాయమానుడయి విరాజిల్లును.

4. సవితా ! రోచమానములగు మూడు లోకములందు సంచరింతువు. సూర్యకిరణములతో కలిసెదవు. నీవు రాత్రికి ఉభయ పార్శ్వములయి సాగుదువు. నీవు జగమును ధరించినందున మిత్రుడు అనబడుదువు.

5. సవితా ! నీవు ఒక్కడవే సర్వమును పాలింప సమర్థుడవు. గమనమున నీవు పూషవు అగుము. నీవు సమస్త

భువనములు ధరించ సమర్థుడవు. శ్యావాశ్వుడు. నిన్ను స్తుతించును.

## ఎనబది రెండవ సూక్తము

ఋషి - ఆత్రేయ శ్యావాశ్వుడు, దేవత - సవిత ఛందస్సు - 1 అనుష్టుప్ మిగిలినవి గాయత్రి.

*"తత్సవితు వృణీమ హే వయం దేవస్య భోజనం*
*శ్రేష్ఠం సర్వధా తమం తురంభగస్య ధీమహి".*

1. మేము ప్రసిద్ధము. భోగయోగ్యమగు ధనము కొఱకు సవితను ప్రార్థించుచున్నాము. సవిత అనుగ్రహమున భగుని నుండి శ్రేష్ఠము, సర్వభోగప్రదము, శత్రుసంహారకమగు ధనమును పొందగలము.

2. సవిత యొక్క అసాధారణము, సర్వప్రియము, రోచమానమగు ఐశ్వర్యమును అసురాదులు సహితము నష్టపరచజాలరు.

3. సవిత భజనీయ భగుడు హవ్యదాతలమగు మాకు రమణీయ ధనము ప్రదానము చేయుదురు. మేము భజనీయ భగదేవుని రమణీయ ధనము యాచింతుము.

4. సవితా ! నేటి యజ్ఞదినమున పుత్రాదియుక్త సౌభాగ్యము ప్రసాదించుము. దుస్వప్నజనిత దారిద్ర్యమును దూరము చేయుము.

5. సవితా ! మా సమస్త అమంగళములను దూరము చేయుము. పుత్రులు, పశువులు, గృహాదిరూప కళ్యాణములను మావద్దకు పంపుము.

6. మేము అనుష్ఠాన పరులము. సవితృదేవుని ఆజ్ఞచే అఖండనీయ అదితిముందు నిరపరాధులము కావలెను. మాకు సంపూర్ణ ధనము లభించవలెను.

7. సవిత సర్వదర్శనీయుడు. భక్తజన రక్షకుడు. సత్యసాధకుడు. నేటి యజ్ఞదినము మేము సూక్తములతో సవితను ఆరాధింతుము. ఉపాసింతుము.

8. సవిత ధ్యాయోగ్యుడు. అతడు అప్రమత్తుడయి పగలు - రాత్రికి ముందుసాగను. నేటి యజ్ఞదినమున ఆసవితను మేము సూక్తములతో ఆరాధింతుము - ఉపాసింతువు.

9. సమస్త ఉత్పన్న ప్రాణిజాలము సవితృదేవుని యశస్సును ఎరుగును. అతడు సమస్త ప్రాణుల ప్రేరకుడు. నేటి యజ్ఞదినమున మేము సూక్తలతో ఆ సవితను ఆరాధింతుము. ఉపాసింతుము.

## ఎనుబది మూడవ సూక్తము

ఋషి - ఆత్రేయ  భౌముడు, దేవత - పర్జన్యుడు ఛందస్సు 1-3 జగతి, మిగిలినవి త్రిష్టుప్.

1. స్తోతా ! బలవంతుడగు పర్జన్యుని అభిముఖవర్తివయి అతనిని ప్రార్థింపుము. స్తుతివచనములతో పొగుడుము. హవిర్లక్షణ అన్నముతో పరిచర్య చేయుము. జలవర్షకుడు, దర్శనీయుడు, దానశీలుడు, గర్జనకారి పర్జన్యుడు వర్షము కలిగించి ఓషధులను గర్భిణులను చేయును.

2. పర్జన్యుడు వృక్షములను నష్టపరచును, రాక్షసులను వధించును. మహావధరూపమున సమస్త భువనములను భయ కంపితులను చేయును. గర్జించు పర్జన్యుడు పాపులను సంహరించును. అందువలన నిరపరాధులు సహితము వర్షము కురిపించు పర్జన్యునివద్ద భయభీతులయి పారిపోవుదురు.

3. రథికుడు కశాఘాతమున అశ్వమును ఉత్తేజితముచేసి యోద్ధలను ఉత్సాహపరచినట్లు పర్జన్యుడు మేఘములను ప్రోత్సహించి జలవర్షక మేఘములను ప్రకటించును. పర్జన్యుడు జలద సమూహములను అంతరిక్షమున వ్యాపింప చేసినపుడు సింహగర్జనచేయు మేఘధ్వని దూరమున ఉత్పన్నమగును.

4. పర్జన్యుడు వర్షమున పృథ్విని రక్షించినపుడు అప్పుడు వర్షమునకుగాను వాయువు వీచును. నలువైపుల మెరుపులు మెరియును. ఓషధులు ఎదుగును. అంతరిక్షము స్రవించును. సంపూర్ణ భువనహితమునకుగాను భూమి సమర్థమగును.

5. పర్జన్యా ! నీ కర్మవలననే భూమి అవనతమగును. పాదయుక్తములు, ఖురవిశిష్ట జంతువులు పరిపుష్టములగును. ఓషధులు వివిధ వర్ణములు వహించును.

పర్జన్యా ! మాకు మహా సుఖములు ప్రసాదించును.

6. మరుత్తులారా ! అంతరిక్షము నుండి మాకు వర్షప్రదానము చేయండి. వర్షము కలిగించు, సర్వవ్యాపకమగు మేఘమును కురిపించండి.

పర్జన్యా ! జల సేచనచేసి ఉరుముల మబ్బులతో మావద్దకు ఏతెంచుము. నీవు జలవర్షకుడవు. మమ్ము పాలించువాడవు.

7. పృథ్వీమీద నీవు శబ్దము చేయుము. గర్జించుము. ఉదకమున ఓషధులకు గర్భాదానము చేయుము. జలములు నిండిన రథమున అంతరిక్షమున పరిభ్రమించుము. నీరునిండిన మబ్బులను విడువుము. సర్వము జలపూర్ణము చేయుము.

8. పర్జన్యా ! జలభండారమగు మేఘమును ఉన్నత స్థానమునకు చేర్చుము. అచటినుంచి దాని అధోముఖముగా కురిపింపుము. అప్రతిహత వేగావతులగు నదులు పూర్వాభిముఖులయి ప్రవహించవలెను. జలములతో ద్యావాపృథ్వులు తడసిపోవలెను. గోవులు త్రాగుటకు సుమధుర జలము విశేషముగ లభించవలెను.

9. పర్జన్యా ! నీవు గాండ్రించి, గర్జించి దుష్కృత మేఘమును విడగొట్టినపుడు అప్పుడు సంపూర్ణ విశ్వాత్మక చరాచర ప్రాణులు ఆనందింతురు. సమస్త జగము ప్రసన్నమగును.

10. పర్జన్యా ! చాల వర్షము కురిపించినావు. ఇక ఉపసంహరించుము. నీవు మరు భూములను సస్యవంతములు చేయుటకు జలయుక్తములు చేసినావు. మానవుల భోగమునకు ఓషధులను పెంచినావు. ప్రజలనుంచి స్తుతులు అందుకున్నావు.

## ఎనుబది నాలుగవ సూక్తము

ఋషి - ఆత్రేయ భౌముడు, దేవత - పృథివి, ఛందస్సు - అనుష్టుప్.

1. పృథివీ ! నీవు ఇచట అంతరిక్షమున మబ్బులను దాల్తువు. బలశాలినివి. శ్రేష్ఠవు. నీ మాహాత్మ్యమున నేలను ప్రసన్నను చేతువు.

2. రకరకాల నడకలుగల నేల తల్లీ ! స్తోతలు గమనశీలములగు స్తోత్రములతో నిన్ను స్తుతింతురు. నీవు చప్పుడు చేయు గుఱ్ఱమువలె నీరునిండిన మబ్బును చేర్చుకుందువు.

3. భూమీ ! విద్యోతమానమగు అంతరిక్షమునుండి నీసంబంధమగు వాన కురిసినపుడు నీవు భూమి సహితముగ వనస్పతులను వహింతువు.

## ఎనుబది అయిదవ సూక్తము

ఋషి - ఆత్రేయుడు, దేవత - వరుణుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వరుణుడు రాజమానుడు. సర్వత్ర విశ్రుతుడు. ఉపద్రవ నివారకుడు. అత్రీ ! వరుణుని కొఱకు ప్రభూతము, బహుళార్ధకము, ప్రియతమమగు స్తోత్రమును ఉచ్చరింపుము. పశుహంతకులు చంపిన జంతువుల చర్మములు పరచినట్లు, వరుణుడు సూర్యసంచారమునకుగాను అంతరిక్షమును విశాలము చేయును.

2. వరుణుడు వృక్షముల ఉపరిభాగమున అంతరిక్షమును విస్తారము చేయును. అశ్వములకు బలము ఆవులకు పాలు హృదయమునకు సంకల్పము విస్తరింపచేయును. అతడు జలములందు అగ్నిని అంతరిక్షమున సూర్యుని పర్వతములందు సోమలతను ఏర్పరచినాడు.

3. వరుణుడు స్వర్గ, పృథ్వి, అంతరిక్ష హితమునకుగాను మేఘపు అధోభాగమును సచ్ఛిద్రము చేయును. వర్షము యవాది సస్యములను సిక్తము చేసినట్లు అఖిల భువములకు అధిపతియగు వరుణుడు సమస్త జగమును ఆర్ద్రము చేయును.

4. వరుణుడు వృష్టిరూపమగు దుగ్ధమును కోరినపుడు - అప్పుడు స్వర్గ, పృథ్వి, అంతరిక్షములను తడిచేయును. తదుపరి పర్వత శిఖరములపై మబ్బులను దింపును. మరుద్గణములు తమబలమున ఉల్లాసము కలిగి మబ్బులను సడలింతురు.

5. వరుణుడు అంతరిక్షమున నిలిచి కొలతబద్దవంటి సూర్యునితో పృథ్విని అంతరిక్షములను కొలతలు వేయుచున్నాడు. అట్టి ప్రసిద్ధ అసురహంత వరుణుని మహాప్రజ్ఞను మేము ఘోషింతుము.

6. ప్రకృష్ఠ జ్ఞానసంపన్నుడు. ద్యుతిమంతుడగు వరుణుని మహాప్రజ్ఞను ఎంతటివాడును ఖండింపజాలడు. నీటిని పారించు శుభ్రములగు నదులు ఏకమాత్ర సముద్రమును నింపజాలవు ! అది వరుణుని మహాకార్యమగును.

7. వరుణా ! మేము ఎప్పుడైనా ఎవడైన దాతను మిత్రుని చెలికానిని సోదరుని పొరుగువారిని మూగవానిని బాధించిన అపరాధము చేసి ఉన్నచో అట్టి అపరాధములను నాశము చేయుము.

8. వరుణా ! జూదమున వంచించు జూదరివలె మేము తెలిసియో తెలియకో ఏదేని అపరాధము చేసి ఉన్నచో వానిని విడిన ముడివలె విడిపింపుము. తదనంతరము మేము నీకు ప్రీతిపాత్రులము కావలెను.

## ఎనుబది ఆరవ సూక్తము

ఋషి - ఆత్రేయుడు, దేవత - ఇంద్రాగ్నులు, ఛందస్సు - అనుష్టుప్.

1. ఇంద్రాగ్నులారా ! సంగ్రామమున మర్త్యులను రక్షించండి. వారు శత్రుసంబంధమగు ద్యుతిమంతమగు ధనమును

భగ్నము చేయుదురు. ప్రతివాదుల మాటలను ఖండింతురు. శత్రువాక్యమువలె ముల్లోకముల వర్తింతురు.

2. ఏ ఇంద్రాగ్నులు యుద్ధమున అజేయులో అన్న సంబంధమున స్తవనీయులో పంచశ్రేణి మానవులను రక్షించెదరో ఆ మహానుభావులను మేము నుతింతుము.

3. ఈ ఉభయుల బలము శత్రువులను పరాజితులను చేయునది. వారు ఒకే రథమును ఎక్కి ఆవులను ఉద్ధరించుటకును వృత్రుని సంహరించుటకును సాగినపుడు - అప్పుడు ఈ ఉభయ ధనశాలులు చేతులందు వాడియైన వజ్రము విరాజిల్లును.

4. ధనాధిపతులు, స్వరజ్ఞులు, నిరతిశయ వందనీయులగు ఇంద్రాగ్నులారా ! యుద్ధములందు మా రథములను ప్రోత్సహించుటకుగాను మిమ్ము ఆహ్వానించుచున్నాము.

5. అహింసనీయ దేవద్వయమా ! మేము అశ్వములకుగాను మిమ్ము స్తుతించుచున్నాము. మీరు మానవులవలె సర్వదా వర్ధమానులగుదురు. ఆదిత్యద్వయమువలె దీప్తిమంతులు అగుదురు.

6. రాళ్లతో నూరిన సోమరసమువలె బలవర్ధక హవ్యము సిద్ధమయినది. మీరు జ్ఞానులకు అన్న ప్రదానము చేయండి. స్తుతికారులకు విశేష ధనము, అన్నము ప్రసాదించండి.

## ఎనుబది ఏడవ సూక్తము

ఋషి - ఆత్రేయుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు - జగతి.

1. ఏవయా ఋషి వచన నిష్పన్న స్తోత్రములు మరుత్తుల సహితముగా విష్ణువు వద్దకు చేరవలెను. అట్లే బలశాలులు, పూజనీయులు, శోభనాలంకృతులు, శక్తి సంపన్నులు, స్తోత్రప్రియులు, మేఘ సంచాలకులు, ద్రుతగాములగు మరుత్తుల వద్దకు చేరవలెను.

2. ఇంద్రుని సహితముగను యజ్ఞగమన విషయిక జ్ఞానముతోను ఆవిర్భవించిన మరుత్తులను ఏవయామరుత్తు స్తుతించినాడు.

మరుత్తులారా ! మీ బలము అభిమత ఫలముకన్న గొప్పది. పరాభవించరానిది. మీరు పర్వతములవలె పటిష్ఠులు.

3. దీప్తము స్వచ్ఛందముగా విస్తీర్ణమగు స్వర్గమునుండి వినగలవారును. తమ గృహములకు చేరినంత ఎవరిచేతను కదలింపరానివారును. తమ దీప్తితో దీపించువారును అగ్నివలె నదులను ప్రవహింప చేయువారునగు మరుత్తులను

ఏవయా మరుత్తు ఉపాసించును.

4. స్వేచ్ఛగా సంచరించు మరుత్తుల అశ్వములను రథమున జోడించినపుడు ఏవయామరుత్తు వానిని అపేక్షించును. సర్వవ్యాపి మరుద్గణములు మహా అంతరిక్షము నుండి బయలుదేరుదురు. పరస్పర స్పర్ధాకారులు, బలశాలురు సుఖప్రదాతలగు మరుద్గణములు వెడలినారు.

5. మరుత్తులారా ! మీరు స్వాధీనతేజులు. స్థిర దీప్తులు. స్వర్ణాభరణ భూషితులు. అన్నదాతలు. మీరు ఏ ధ్వనితో శత్రువులను పరాభవించి మీ కార్యము సాధింతురో అట్టి ప్రబలవర్షకారి, దీప్తి, విస్తృత, ప్రబద్ధ ధ్వని ఏవయామరుత్తును వడకించరాదు.

6. సమధిక బలశాలురగు మరుత్తులారా ! మీ మహిమ అపారము నిరవధికము. మీ శక్తి ఏవయామరుత్తును రక్షించవలెను. నియమయుక్త యజ్ఞమును దర్శించు విషయమున మీరే నియామకులు. మీరు ప్రజ్వలిత అగ్నివలె ప్రదీప్తులు. మమ్ము నిందకులనుండి రక్షించండి.

7. పూజనీయులు, అగ్నివలె ప్రభూత దీప్తిశాలురగు రుద్రపుత్రులారా ! ఏవయా మరుత్తును రక్షించండి. అంతరిక్ష సంబంధమగు దీర్ఘము, విస్తీర్ణమగు గృహము మరుత్తులద్వారా ప్రఖ్యాత మగును. నిష్పాప మరుద్గణము పయనించునపుడు అనంతశక్తిని వెల్లడింతురు.

8. విద్వేషరహిత మరుద్గణములారా ! మా స్తోత్రములకు సన్నిహితులు కండు. స్తోతయగు ఏవయామరుత్తు ఆహ్వానమును ఆలకించుడు. ఇంద్రునితోబాటు యజ్ఞభాగము పొందు మరుత్తులారా ! యోద్ధలు శత్రువుల పారద్రోలునట్లు మీరు మా నిగూఢ శత్రువును దూరము చేయండి.

9. యజన యోగ్య మరుత్తులారా ! మా యజ్ఞమునకు విచ్చేయండి. అందువలన మా యజ్ఞము సుసంపన్నమగును. మీరు నిర్విఘ్నులు. మా పిలుపును వినండి. విశేష జ్ఞానసంపన్నులగు మరుత్తులారా ! వింధ్యాది పర్వతములవలె అంతరిక్షమున నిలిచి నిందకులను శాసింతురు.

("యజ్ఞగమన విషయ జ్ఞానేన సహప్రజాతాః మరుతః ఏవయా మరుత్ బ్రూయతే" అని శాయణుడు. యజ్ఞమునకు చేరు జ్ఞానమున తొడపుట్టిన మరుత్తును ఏవయా మరుత్తు అందురు)

విద్వాంసుడు, బహుభాషావేత్త, కవి, కథకుడు, నవలాకారుడు, నాటకకర్త, చలనచిత్ర రచయిత, విమర్శకుడు, వ్యాసకర్త, అనువాదకుడు, వక్త, స్వాతంత్ర్య సమరయోధుడు, వినయవంతుడు, భగవద్భక్తుడు, దాశరథి రంగాచార్య

రచించిన ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగవ అష్టకమున అయిదవ మండలము సమాప్తము.

**అధనా స్పధనా స్పంతు**

***జ్ఞానాందమయందేవం నిర్మలస్ఫటికాకృతిం***
***ఆధారప్పర్వ విద్యానాం హయగ్రీముపాస్మహే***

## అయిదవ అష్టకము

### ఆరవ మండలము

**మొదటి అనువాకము** **మొదటి సూక్తము**

మండలద్రష్ట భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్నీ ! నీవు దేవతలలో అధికుడవు. దేవతల మనసు నీలో నిలిచి ఉన్నది. ఈ యజ్ఞమున నీవే దేవతలను ఆహ్వానించువాడవు. సమస్త బలశాలి శత్రువులను ఓడించుటకు మాకు అనివార్య బలమును ప్రసాదించుము.

2. అగ్నీ ! నీవు అతిశయ యజ్ఞకర్తవు. హోమనిష్పాదకుడవు. హవ్యములు గ్రహించువాడవు. స్తుతియోగ్యుడవు. వేదిరూపస్థానమున ప్రవేశించును. ధర్మానుష్ఠానపరులగు, ఋత్విక్కులు ధనము పొందవలెను. ఆశతో దేవతలలో ప్రథముడవుగా నిన్నే అనుసరింతురు.

3. అగ్నీ ! నీవు దీప్తిమంతుడవు. దర్శనీయుడవు. మహా హవ్యభోజనుడవు. సర్వకాలములందు దీప్తిమంతుడవు. అంతరిక్ష మార్గమున పయనించువాడవు. ధనాభిలాషులగు యజమానులు నిన్నే అనుసరింతురు.

4. ధనాభిలాషులగు యజమానులు స్తోత్రములు చదువుచు అగ్నియొక్క ఆహవనీయ స్థానమునకు సాగుదురు. అవధ్య రూపమున విశేష అన్నమును పొందుదురు. అగ్నీ ! నీ దర్శనము అయినంత వారు అట్టి స్తుతులకు ఆనందింతురు. జాతవేద, వైశ్వానర ఇత్యాది నీ నామ స్మరణ చేయుదురు.

5. అగ్నీ ! మానవులు నిన్ను వేదిమీద వర్ధిల్లచేయుదురు. నీవు యజమానులు పశు, అపశు ధనమును వర్ధిల్లచేయుదువు. అధ్వర్యాదులు ఉభయవిధ ధనప్రాప్తికిగాను నిన్ను వర్ధిల్ల చేయుదురు. నీవు స్తుతులు అందుకొనుము. మానవుల రక్షక, మాతా, పితృస్థానుడవగుము.

6. అగ్నీ ! నీవు అభీష్టవర్షివి. హోమనిష్పాదకుడవు. అత్యంత పూజనీయుడవు, వేదిమీద స్థాపితుడవు. అగుదువు.

గృహమున ప్రజ్వలితుడవగుదువు. మేము ప్రణమిల్లి, స్తోత్ర సహితముగా నీవద్దకు చేరుదుము.

7. అగ్నీ ! నీవు స్తుతియోగ్యుడవు. మేము శోభనవృద్ధిగలవారము. సుఖాభిలాషులము. నిన్ను అభిలషించువారము. మేము నిన్ను స్తుతింతుము. నీవు దీప్తిమంతుడవు. ఆదిత్య మార్గమున మమ్ము స్వర్గమునకు చేర్చుము.

8. అగ్ని యజమానాదుల స్వామి; జ్ఞాన సంపన్నుడు. శత్రువినాశకుడు. కోరికలు తీర్చువాడు. స్తోతలకు ప్రాప్తవ్యుడు. అన్నవిధాయకుడు. శుద్ధతాసముపార్జకుడు. ధనార్థులచే యష్టవ్యుడు, దీప్తిమంతుడు, అట్టి అగ్నిని మేము ఋత్విక్కులము స్తుతింతుము.

9. అగ్నీ ! నిన్ను యజించు యజమాని నిన్ను స్తుతించు యజమాని ప్రజ్వలిత ఇంధన సహితముగా హవ్యములు అర్పించు యజమాని స్తుతులతో నీకు ఆహుతులు అందించు యజమాని నీచే రక్షితుడయి సమస్త అభిలషిత ధనప్రాప్తుడు అగును.

10. అగ్నీ ! నీవు మహామహుడవు. మేము నమస్సులు, ఇంధనము, హవ్యములతో నీకు పరిచర్యచేయుదుము. మేము స్తోత్రము, శస్త్రములతో వేదిమీద నిన్ను అర్చింతుము. నీశుభంకర అనుగ్రహము పొందుటకు ప్రయత్నింతుము. మేము సఫలులము కావలెను.

11. అగ్నీ ! నీవు నీదీప్తితో ద్యావా పృథ్వులను విస్తరింప చేసినావు. పరిత్రాణకర్తవు. స్తుతులతో పూజనీయుడవు. మరింత అన్నము, విశిష్ట ధనముతో మావద్ద ప్రదీప్తుడవగుము.

12. ధనవంతుడవగు అగ్నీ ! మాకు పుత్ర, పౌత్రాదియుక్త ధనమును ప్రసాదించుము. మా పుత్ర పౌత్రులకు అనేక పశువులను ప్రసాదించుము. కోరికలు తీర్చునట్టి పాపరహితమయినట్టి సరిపోవునంత అన్నమును, సౌభాగ్యమును ప్రసాదించుము.

13. దీప్తిమంతుడవగు అగ్నీ ! మేము నీ నుండి గోవులు, అశ్వస్వరూపమగు ధనములను పొందవలెను. ధనవంతుడవు. సర్వరమణీయుడవగు అగ్నీ ! నీవు శుభంకరుడవు. నీలో అనంత ధనములు ఉన్నవి.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగువ అష్టకము ఆరవ మండలమున నాలుగవ అధ్యాయము సమాప్తము)

*ఓం నతామినన్తి మాయినో న ధీరావ్రతాదేవానాం ప్రథమాధ్రవాణి*
*నరోదసీ అద్రుహో వేద్యా భిర్న పర్వతావి నమే స్థివాంసః ||*

**ఐదవ అధ్యాయము     రెండవ సూక్తము**

ఋషి - భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - అనుష్టుప్, చివరిది శక్వరి.

1. అగ్నీ ! నీవు సర్వదర్శివి. సంపన్నుడవు. మిత్రునివలె ఎండిన కట్టెతో హవిమీద పడుదువు. అన్నపు పుష్టితో మమ్ము వర్ధిల్ల చేయుము.

2. అగ్నీ ! మానవులు హవ్యము, స్తుతులతో నిన్ను అర్చింతురు. హింసవర్జితుడు, జల ప్రేరకుడు, సర్వద్రష్ట సూర్యుడు నిన్ను అధిగమించును.

3. అగ్నీ ! సమానప్రీతిగల ఋత్విక్కులు నిన్ను ప్రజ్వలితుని చేయుదురు. నీవు యజ్ఞప్రజ్ఞాపకుడవు. మనువు సంతతియగు యజమానులు సుఖాభిలాషులయి నిన్ను యజ్ఞములకు ఆహ్వానింతురు.

4. అగ్నీ ! నీవు దానశీలుడవు. మర్త్యుడగు యజమాని యజ్ఞకార్యరతుడై నిన్ను స్తుతించునో అతడు సమృద్ధిగలవాడగును. అతడు నీ ద్వారా రక్షితుడయి భీషణ పాపమువలె శత్రువులను నాశనము చేయును. నీవు దీప్తియుక్తుడవు.

5. అగ్నీ ! కట్టెలతో నీకు మంత్ర సంస్కృత ఆహుతులిచ్చువాడు పుత్ర పౌత్రాదియుక్తడయిన గృహమున నూరేళ్లు భోగములు అనుభవించును.

6. అగ్నీ ! నీవు దీప్తిశాలివి. నీ శుభ్రవర్ణ ధూమము అంతరిక్షమున వ్యాపించి మేఘరూపము దాల్చును. నీవు స్తోత్రములకు ప్రసన్నుడవగుము. సూర్యునివలె వెలుగులతో కాంతివంతుడవగుము.

7. అగ్నీ ! నీవు మాకు అతిథివలె ప్రియుడవు. అందుకే నీవు ప్రజలకు స్తుతిభాజనుడవు. నగరమున ఉండు హితోపదేశముచేయు వృద్ధునివలె ఆశ్రయయోగ్యుడవు. పుత్రునివలె పోషణీయుడవు.

8. అగ్నీ ! అరణిమంథనమున నీ ఉనికి వ్యక్తమగును. గుఱ్ఱము రౌతును మోసినట్లు నీవు హవ్యములను వహింపుము. వాయువువలె సర్వత్ర సంచరించగలవు. అన్నము, గృహము ప్రసాదించుము. అశ్వము, శిశువువలె వంకర నడకలవాడవు.

9. అగ్నీ ! గడ్డిమేయుటకు విడిచిన పశువు గడ్డిని సొంతము మేయును. అట్లే నీకు ఎండిన కట్టెలను క్షణమాత్రమున భక్షింతువు. అనశ్వర అగ్నీ ! నీవు దీప్తిశాలివి. నీ శిఖలు అడవులను ఛిన్నాభిన్నము చేయును.

10. అగ్నీ ! యజ్ఞాభిలాషి యజమాని ఇంట హోతరూపమున ప్రవేశింతువు. మానవ పాలక అగ్నీ ! మాకు సమృద్ధి విధానము చూడుము. అంగారరూప అగ్నీ ! మా హవ్యములను స్వీకరింపుము.

11. అగ్ని అనుకూల దీప్తిమంతుడు. దేవదానాది గుణసంయుక్తుడు. ద్యావాపృథ్వులందు ఉండువాడు. అగ్నీ ! దేవతలముందు మా స్తుతులను ఉచ్ఛరించును. స్తోతలమగు మమ్ము శుభప్రద నివాసయుక్త సుఖములకు నడిపించుము. మేము శత్రువులను, పాపములను కష్టములను అతిక్రమించవలెను. జన్మాంతరకృత పాపములనుండి విముక్తులము కావలెను. నీ రక్షణలందు మేము శత్రువుల బారినుండి తప్పుకొనవలెను.

## మూడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. యజ్ఞము కొఱకు పుట్టినవాడును. యజ్ఞపాలనచేయు యజమాని చిరంజీవి అగును. మిత్రావరుణులతో సమానప్రీతిగలవాడవయి, నీ తేజమున పాపములనుండి రక్షించిన యజమానికి నీ విశాలజ్యోతి ప్రాప్తించును.

2. వరణీయ ధన సమృద్ధుడగు అగ్నికి హవ్యము సమర్పించు యజమాని యజ్ఞము సఫలము అగును. అగ్ని కర్మమున అతనికి సంపూర్ణ ఫలప్రాప్తి కలుగును. అతనికి యశస్విపుత్రులు లేరను అభావము ఉండదు. అతనిని పాపము, అనర్ధక గర్వము అంటవు.

3. సూర్యుని దర్శనమువలె అగ్నిదర్శనము పాపరహితమగును. అగ్నీ ! ప్రజ్వలితములయిన నీభయంకర జ్వాలలు చొరరానిచోటు ఉండదు. నీవు రాత్రిపూట ధ్వనిచేయు ధేనువువలె విస్తృతమగుదువు. నివాసప్రదము, అరణ్యజాత అగ్ని పర్వతాగ్రము నుండి రమణీయముగా కనిపించును.

4. అగ్ని మార్గము తీక్ష్ణము. అతని రూపము అత్యంత దీప్తము. అశ్వమునోటితో గడ్డిని అందుకున్నట్లు అగ్ని తన శిఖలతో హవ్యములను అందుకొనును. గొడ్డలి కర్రలపై వేటు వేసినట్లు అగ్ని లతాగుల్మాదులపై వేటు వేయును. స్వర్ణకారుడు బంగారమును కరిగించినట్లు అగ్ని అడవులను బూడిద చేయును.

5. బాణము వేయువాడు లక్ష్యమువైపు వదులును. అట్లే అగ్ని తన జ్వాలలను లక్ష్యంవైపు చాపును. గొడ్డలిపట్టినవాడు పదును పెట్టినట్లు అగ్ని తన జ్వాలలను విసరునపుడు తీక్ష్ణము చేయును. చెట్టుమీది పక్షివలె రాత్రిని అతిక్రమించును. చీకట్లను దూరము చేయును.

6. స్తవనీయ సూర్యునివలె అగ్ని వెలుగు మంటలను కప్పుకొనును. ఎల్లరకు అనుకూల ప్రకాశమును విస్తరింపచేసి స్వతేజమున పెద్దధ్వని చేయును. గ్ని రాత్రులందు వెలిగి మానవులను పగటివలె వారి పనులందు నియమించును. అమర సుందర అగ్ని పగలు దేవతలను హవియుక్తులను చేయును.

7. దీప్తిమంతమగు సూర్యునివలె కిరణములు విస్తరించగల అగ్ని మహాధ్వని చేసినాడు. అభీష్టవర్షి, దీప్తుడగు అగ్ని ఓషధుల మధ్య మహాధ్వని చేయును. ఇటునటు ఉపరిభాగమున వర్తించు అగ్ని మా శత్రువును అణచివేయును. శోభనవంతము, సంపన్నములగు స్వర్గమును పృథ్వివి ధనముతో నింపును.

8. అశ్వమువలె స్వయం పూజ్యమానుడు, అర్చనీయుడు అగు అగ్ని దీప్తితో పయనము సాగించును. అదే అగ్ని తన తేజమున విద్యుత్తువలె మెరుపులు మెరియును. మరుత్తుల బలములను అల్పము చేయు అగ్ని నిరతిశయ దీప్తిశాలి సూర్యునివలె ప్రదీప్తుడు, వేగసంపన్నుడు, ప్రకాశమానుడగును.

## నాలుగవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్ని దేవతల ఆహ్వానకర్త. బలపుత్రుడు. అగ్నీ ! ప్రజాపతి యజమాని యజ్ఞమున దేవతలను యజించినావు. అట్లే మా యజ్ఞమున యజనీయ ఇంద్రాది దేవతలను నీ సమానులనుకొని వారిని యజింపుము.

2. అగ్ని ప్రకాశకుడు. సూర్యునివలె దీప్తిమంతుడు. అందరకు బోధించువాడు. ఎల్లరకు జీవనభూతుడు. అనశ్వరుడు. అతిథి. జాతవేద. మానవులందు ఉషఃకాలమున ప్రబుద్ధుడగువాడు. అట్టి వందనీయ అగ్ని మాకు ధనము ప్రసాదించవలెను.

3. స్తోతలు అగ్నియొక్క మహాకార్యములను స్తుతింతురు. అతడు అగ్ని సూర్యునివలె శుభ్రవర్ణుడు. తన వెలుగులను కప్పుకున్నవాడు. జరారహితులను పవిత్రులను చేయగల అగ్ని దీప్తిద్వారా సకల పదార్థములను ప్రకాశింపచేయును. వ్యాపించు రాక్షసులను పురాతన నగరములను ధ్వంసము చేయును.

4. అగ్నీ ! నీవు సర్వ ప్రేరకుడవు. వందనీయుడవు. అగ్ని హవ్యములమీద ఆసీనుడగును. ఉపాసకుల గృహములందు అన్నము కలిగించుము. రాజువలె మా శత్రువులను గెలుచును; ఉపద్రవరహితమగు మా అగ్ని గృహమున నివసించును.

5. అగ్ని అంధకార నివారకుడు. స్వతేజమును తీక్ష్ణము చేయువాడు. హవిభక్షకుడు. వాయువువలె అందరిని శాసించువాడు. అతడు చీకట్లను తొలగించును.

అగ్నీ ! నీ అనుగ్రహమున మేము నీకు హవి సమర్పించని వానిని ఓడించవలెను. అశ్వమువలె వేగవంతుడవయి మాపై ఆక్రమణచేయు శత్రువులను నష్టపరచుము.

6. సూర్యుడు తన దీప్తిమంతములు, పూజనీయములగు కిరణములతో ద్యావాపృథ్వులకు ఆచ్ఛాదించినట్లు అగ్ని విశేషరూపమున ద్యావా పృథ్వులను ఆచ్ఛాదించును. తన మార్గమున సాగు సూర్యునివలె విచిత్ర అగ్ని అంధకారములను దూరము చేయును.

7. అగ్నీ ! నీవు అత్యంత స్తవనీయుడవు. పూజార్హుడవు. దీప్తిశాలివి. మేము నిన్ను భజింతుము. నీవు మా యొక్క మహాస్తుతులను ఆలకింపుము. నేతరూపులగు ఋత్విక్కులు హవిర్లక్షణ ధనమున నిన్ను సంతుష్టుని చేయుదురు. నీవు బలమున వాయు సదృశుడవు. దేవరూపమున ఇంద్ర సదృశుడవు.

8. అగ్నీ ! నీవు త్వరగా తోడేళ్లులేని మార్గమున మమ్ము నిర్విఘ్నముగా ఐశ్వర్యము వద్దకు తీసికొని పొమ్ము నడిపింపుము. పాపములనుండి ఉద్ధరింపుము. స్తోతలకు ప్రసాదించునట్టి సుఖములను మాకు ప్రసాదించుము. మేము సంతాన సంపన్నులమై నూరేళ్లు సుఖముగా జీవించవలెను.

## అయిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్నీ ! మేము స్తోత్రములతో నిన్ను ఆహ్వానించుచున్నాము. బలపుత్రుడవు. నిత్యతరుణుడవు. ప్రశస్త స్తుతులతో స్తవనీయుడవు. ప్రకృష్ట జ్ఞానవంతుడవు. బహుస్తుతుడవు. ద్రోహరహితుడవు. అట్టి అగ్ని స్తోతలకు అభిలషించిన ధనము ప్రసాదించును.

2. అగ్నీ ! నీవు జ్వాలా విశిష్టుడవు. దేవతల ఆహ్వానకర్తవు. యాగయోగ్యులగు యజమానులు అహర్నిశలు నీకు హవ్యరూప ధనము సమర్పింతురు. దేవతలు సమస్త జీవులను భూమిమీద ఏర్పరచినారు. అట్లే సంపూర్ణ ధనమును అగ్నిలో ఏర్పరచినారు. "సౌభాగ్యాని దధిరే పావకే"

(సమస్త ధనములు వాస్తవముగా అగ్ని నుండియే కలుగుచున్నవి. ఇది నేటికిని వాస్తవ సత్యము)

3. అగ్నీ ! నీవు ప్రాచీనులు అధునాతులగు ప్రజలందరిలోను ఉన్నావు. నీ పనులు ద్వారా యజమానులకు కోటిన ధనములు ఇచ్చుచున్నావు. జ్ఞానీ ! జాతవేదా ! పరిచర్య చేయు యజమానులకు నిరంతరము ధనము ప్రసాదించుము.

4. అనుకూలదీప్తిగల అగ్నీ ! అంతర్హిత దేశమున ఉండి బాధించునట్టి అభ్యంతర వర్తియై బాధించునట్టి శత్రువులను నీ తేజమున దహింపుము. నీ తేజస్సు జరారహితము వృష్టిప్రదము. అసాధారణము.

5. బలపుత్ర అగ్నీ ! యజ్ఞము ద్వారా నీకు పరిచర్య చేయునట్టి ఇంధనము. శస్త్రములు, స్తోత్రములతో నీకు పరిచర్యలు చేయునట్టి యజమాని మానవులలో ప్రకృష్ట జ్ఞానవంతుడు, అన్నవంతుడు, యశోవంతుడగును.

6. అగ్నీ ! నీకు నిర్దేశించిన పనిని త్వరగా ముగించుము. నీవు బలవంతుడవు. నీకు ఇతరులను పరాజితులనుచేయు బలము ఉన్నది. ఆ బలముతో శత్రువులను నష్టపరచుము. నిన్ను స్తోత్రములతో నుతించువానిని అనుగ్రహింపుము. నీవు ద్యుతిమంతమగు తేజోయుక్తుడవు.

7. అగ్నీ ! నీ రక్షణలతో మాకు కోరిన ధనము లభించవలెను. ధనాధిపతీ ! మాకు శోభన పుత్రాదియుక్త ధనము లభించవలెను. మేము అన్నాభిలాషులము. మాకు నీ వలన అన్నలాభము కలుగవలెను. జరారహిత అగ్నీ ! మాకు నీయొక్క అజరము ద్యుతిమంతమగు యశము లభించవలెను.

## ఆరవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్ని స్తుతి యోగ్యుడు. బలపుత్రుడు. అడవులను కాల్చువాడు. మసిదారివాడు. తెల్లనివాడు. కమనీయుడు. హోత. స్వర్గీయుడు. యజమానులు అన్నాభిలాషులు, వారు నవీన యజ్ఞయుక్తులయి అగ్నివద్దకు వెళ్లుదురు.

2. అగ్ని శ్వేతవర్ణుడు. శబ్దకారి. అంతరిక్ష సంచారి. అజరుడు. అతడు అత్యంత ధ్వనికారులయిన మరుత్తులతో కలిసి యువతముడగును. అగ్ని పావకుడు మహానుభావుడు. అతడు అసంఖ్యాకములగు కట్టెలను భక్షించి కాల్చి సాగును.

3. విశుద్ధ అగ్నీ ! ప్రదీప్తములగు నీశిఖలు జ్వాలలు గాలికి సంచరించును. అనేక కట్టెలను భక్షించును. సర్వత్ర వ్యాపించును. మంటలతో కలిగిన కొత్త కిరణములు ఘర్షణకారులయి తమ దీప్తితో అడవులను ఆక్రమించును. దహించును.

4. దీప్తిసంపన్నుడవగు అగ్నీ ! నీ కిరణములు శుభ్రములు. సంపూర్ణములు. అవి భూమికి జుట్టువంటి ఓషధులను కాల్చును. అప్పుడు అవి విడిచిన గుఱ్ఱములవలె ఇటునటు ఉరుకులు పెట్టును.

5. వర్షము కలిగించు అగ్ని జ్వాలలు మాటిమాటికి వెడలుచుండును. అవి వృత్రుని వధించుటకు పోయిన వజ్రము మాటిమాటికి వెడలినట్లుండును. వీరుల పౌరుషమువలె అగ్నిజ్వాలలు దుస్సహములు దుర్నివార్యములు.

6. అగ్నీ ! నీ వెలుగు ప్రబలము. ఉత్తేజకరము. ఆ వెలుగుతో భూమిమీద చేరగల స్థానములను వెలిగించుము. నీవు

సమస్త విపత్తులను దూరము చేయుము. నీ కాంతి ప్రభావమున విరుద్ధులను ఓడించుము. శత్రువులను దనుమాడుము.

7. అగ్నీ ! నీవు విచిత్రము. అద్భుతమగు బలసంపన్నుడవు. ఆనందదాయకుడవు. మేము ఆహ్లాదకర స్తోత్రములతో నిన్ను స్తుతింతుము. నీవు మాకు అద్భుతము. అత్యద్భుతము, యశస్కరము, అన్నప్రదము, అన్నదాయకము. పుత్రపౌత్రాది సమన్వితమగు విపుల ఐశ్వర్యము ప్రసాదించుము.

## ఏడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - వైశ్వానరాగ్ని, ఛందస్సు 6,7 జగతి. మిగిలినవి త్రిష్టుప్.

1. వైశ్వానరాగ్ని స్వర్గమునకు శిరోభూతము. భూమిమీద సంచరించువాడు. యజ్ఞమునకుగాను పుట్టినవాడు. రాజువంటివాడు. యజమానులకు అతిథి స్వరూపుడు. దేవతలకు ముఖము నోరు వంటివాడు. రక్షా విధాయకుడు. దేవతలు, ఋత్విక్కులు అగ్నిని ఆవిర్భవింప చేసినారు.

2. అగ్ని యజ్ఞబంధకుడు, ధనస్థానము. హవ్యమునకు ఆశ్రయ స్వరూపుడు, స్తోతలు అతనిని చక్కగా స్తుతింతురు. అతడు యజ్ఞ ద్రవ్యవాహకుడు, యజ్ఞమునకు కేతనమువంటివాడగు వైశ్వానరాగ్నిని దేవతలు పుట్టించినారు.

3. అగ్నీ ! హవిరూప అన్నయుక్త పురుషుడు నీవద్ద నుంచే జ్ఞానవంతుడగును. వీరులు నీవద్ద నుంచే శత్రు పరాభవకారులు అగుదురు. అందువలన మాకు కోరిన ధనమును ప్రసాదించుము.

4. అమృత అగ్నీ ! నీవు అరణిద్వయమునుండి పుత్రునివలె జన్మించినావు. దేవతలు నిన్ను శిశువునువలె పోషించినారు. వైశ్వానరా ! నీవు ద్యావాపృథ్వుల మధ్య కనిపించినపుడు యజమానులు నీకు సంబంధించిన యజ్ఞముచేసి అమరత్వలాభము పొందుదురు.

5. వైశ్వానరా ! ప్రసిద్ధములయిన నీ మహాకార్యములను ఎంతటివాడయినను ఆటంకపరచజాలడు. మాతాపితృ స్వరూపులగు ద్యావాపృథ్వుల క్రీడాభూమి అయిన అంతరిక్షమున జన్మించినావు. దినములను శాసించు సూర్యుని అంతరిక్షమున నిలిపినావు.

6. వైశ్వానరుని జలశాసక తేజముద్వారా అంతరిక్షపు ఉన్నత ప్రదేశము - నక్షత్రాదులు ఏర్పడినవి. వైశ్వానరుని శిరోభాగమున జలరాశికాపురముండును. అచటినుండియే ఏడునదులు చెట్లకొమ్మలవలె పుట్టినవి.

7. శోభన కర్ముడగు వైశ్వానరాగ్ని లోకములను నిర్మించినాడు. జ్ఞానసంపన్నుడయి, ద్యులోకపు వెలుగులు

నక్షత్రములను సృష్టించినాడు. సమస్త భూతజాతములకు నాలుగు దిక్కులు ఏర్పరచినాడు. అజేయుడు, పాలకుడు, జలరక్షకుడగు అగ్ని విజయము చేయును.

## ఎనిమిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - వైశ్వానరుడు, ఛందస్సు - జగతి, చివరిది త్రిష్టుప్.

1. వైశ్వానరుడు వారి వర్షకుడు. దీప్తిమంతుడు. జాతవేద. అతని బలమునకుగాను ఈ యజ్ఞమును మేము విశేషముగా స్తుతించుచున్నాము. వైశ్వానరాగ్నిముందు - నవీనము, నిర్మలము, శోభస్కరమగు స్తుతులను సోమరసమువలె సమర్పించుచున్నాము.

2. సత్కర్మపాలకుడగు వైశ్వానరుడు ఉత్కృష్ట ఆకాశమున జాయమానుడయి లౌకిక, వైదిక ఉభయకర్మలను రక్షించును. అంతరిక్షమును అంచనా వేయును. శోభనకర్మలు చేయు వైశ్వానరుడు తన తేజమున ద్యులోకమును స్పృశించును.

3. వైశ్వానరుడు అందరకు మిత్రభూతుడు. ఆశ్చర్యకారకుడు. అతడు ద్యావాపృథ్వులను తమతమ స్థానములందు స్తంభింప చేసినాడు. తన తేజమున చీకట్లను దూరము చేసినాడు. ఆధార భూతములగు ద్యావా పృథ్వులను పశుచర్మములవలె విస్తృతపరచినాడు. వైశ్వానరాగ్ని సమస్త వీర్యములను ధరించును.

(పశు చర్మములను ఆరవేయునపుడు ఒకదాని తరువాత ఒకదానిని ఆరవేయుచు పోవుదురు. అదియు నేలమీద పరచి)

4. మహామరుత్తులు అంతరిక్ష మధ్యమున అగ్నిని ధరించినారు. మానవులు వారిని పూజనీయ స్వాములు అనుకున్నారు. స్తుతించినారు. దేవతల దూత, వేగవంతుడగు మాతరిశ్వవాయువు సుదూర సూర్యమండలము నుండి వైశ్వానరాగ్నిని ఈ లోకమునకు తెచ్చినాడు.

5. అగ్నీ ! నీవు యాగయోగ్యుడవు. నిన్ను నవీన స్తుతులతో అర్చించువానికి నీవు ధనము, యశస్విపుత్రులను ప్రసాదింతువు. జరారహిత, విరాజమాన అగ్నీ ! పిడుగు చెట్టును కూల్చినరీతి నీ తేజమున శత్రువును కూల్చుము.

6. అగ్నీ ! మేము హవిర్లక్షణ ధనయుక్తులము. మాకు నీవు అనపహార్యము, అక్షయము, సువీర్యమగు ధనమును ప్రసాదించుము. మేము నీచే రక్షితులమై వందల, వేల రకముల అన్నమును పొందవలెను.

7. మూడులోకములందున్న యాగార్హా అగ్నీ ! ఎవరిచేతను హింసించబడని రక్షణ కలిగించు బలమున స్తోతలను

రక్షింపుము. హవ్యాదాతలమగు మా బలమును రక్షింపుము. మేము నిన్ను స్తుతించుచున్నాము. నీవు మమ్ము వర్ధిల్ల జేయుము.

## తొమ్మిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - వైశ్వానరుడు, ఛందస్సు - జగతి.

1. నలుపురాత్రి - తెలుపు పగలు తమతమ ప్రవృత్తులతో లోకములను రంజింపచేసి నియమప్రకారము పరిణామమొందురు. వైశ్వానరాగ్ని రాజువలె ప్రకాశితుడయి, తన వెలుగుతో తమోనాశము చేయును.

2. మాకు పడుగు పేకలు తెలియవు. నిరంతర కార్యక్రమమున నేయు బట్టను గురించిన అవగాహనలేదు. ఈ లోకమున నిలిచి తండ్రిద్వారా ఉపదేశము పొందిన ఏ పుత్రుడు పరలోకమును గురించిన మాట చెప్పుటకు సమర్ధుడగును?

(పడుగు పేకలు యజ్ఞకార్యములు వస్త్రము యజ్ఞమని. పడుగు పేకలు ద్యావాపృథ్వులు వస్త్రము సృష్టియని. పడుగు పేకలనగా బట్ట నేయునపుడు ఇటునటు సాగుదారములు)

3. వైశ్వానరునకు ఒక్కనికే తంతు-ఓతు (పడుగు పేకల) జ్ఞానము ఉన్నది. జలరక్షకుడు, భూలోకమున సంచరించు అగ్ని అంతరిక్షమున సూర్యరూపమున సమస్త జగత్తునకు వెలుగులను ఇచ్చును. అందువల్ల అతడు సమస్త ప్రాణులను అవగతము చేసికొనగలడు.

4. వైశ్వానరాగ్ని తొలిహోత అగును. మానవులారా ! మీరు అగ్నిని భజించండి. అమరణశీల అగ్ని మరణశీల శరీరమున జఠర రూపమున వర్తమానుడగును. నిశ్చలము, సర్వవ్యాపి, అక్షయ అగ్ని దేహము ధారణపూర్వకముగ ఉత్పన్నమయి వర్ధిల్లును.

5. మనోవేగమునకన్న వేగము కలిగియు నిశ్చలమగు జ్యోతి సుఖమయ మార్గములు చూపుటకు గాను జంగమ జీవులలో అంతర్నిహితమయి ఉండును. సమస్త దేవగణములు సమాన ప్రజ్ఞులయి, సన్మానముతో ప్రధాన కర్మ కర్త వైశ్వానరులకు అభిముఖవర్తులు అగుదురు.

("జ్యోతిః బ్రహ్మచైతన్యం నిహితం నకేనచిత్ స్థాపితం" ఈ జ్యోతి బ్రహ్మచైతన్యమగును. ఎవరిచేతను నిలుపబడినదికాదు అనిశాయణుడు)

6. నీ గుణములు వినుటకు చెవులు - నీరూపముకనుటకు కనులు పరువులిడుచున్నవి. హృదయ

కమలమందున్నజ్యోతి బుద్ధి, నీ స్వరూపమును అవగతముచేసికొనుటకు ఆరాటపడుచున్నది. ఎక్కడి వానినో గురించి చింతించు మాహృదయము మీముందునకు ఉరుకులు పెట్టుచున్నది. మేము వైశ్వానరుని ఏ రూపమును వర్ణించవలెను?

7. వైశ్వానరా ! అంధకారమున అవస్థితుడవైన నీకు సమస్త దేవతలు నమస్కరింతురు. నీ రక్షణలతో మమ్ము రక్షింపుము.

## పదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - గ్ని, ఛందస్సు - 7 విరాట్, మిగిలినవి త్రిష్టుప్.

1. ఈ యజ్ఞము ప్రవర్తమానము. విఘ్నరహితము. అగ్ని స్తవనీయుడు. స్వర్గోద్భవుడు. దోషవర్జితుడు. యజమానులారా ! ఈ యజ్ఞమున అగ్నిని స్తోత్రముల ద్వారా సమ్ముఖమున స్థాపించండి. జాతవేద యజ్ఞమున మా సమృద్ధి మార్గము చూపును.

2. అగ్ని దీప్తిమంతుడు. బహుజ్వాలా విశిష్టుడు. దేవతల ఆహ్వానకర్త.

అగ్నీ ! అవయవభూతములగు అన్యఅగ్నుల సహితుడవై మానవస్తోతల ఈ స్తోత్రమును వినుము. స్తోతలు మమతవలె అగ్నికి మనోహర స్తోత్రములను ఘృతమువలె సమర్పింతురు.

3. యజమాని స్తోత్రముల సహితముగా అగ్నికి హవ్యము సమర్పించును. అతడు అగ్నిద్వారా మానవులందు సమృద్ధిగలవాడగును. అగ్నివిచిత్రదీప్తివంతుడు. అతడు ఆశ్చర్యకర రక్షణలతో ఆ యజమానిని గోయుక్త గోష్ఠ భోగమునకు యజమానిని చేయును.

4. అగ్ని పుట్టగానే పొగవలన నల్లనివాడయినాడు. దూరమునుంచి కనిపించువాడు. దీప్తిద్వారా విస్తీర్ణమైన ద్యావాపృథ్వులను పూరించినాడు. నింపినాడు. పావకుడగు అగ్ని తన కాంతులతో కటికచీకట్లను పారదోలి పరిదృశ్యమానుడగును.

5. అగ్నీ ! మేము హవిర్లక్షణ అన్నయుక్తులము. మాకు చాల అన్నము, రక్షణలతో కూడిన ధనమును ప్రసాదించుము. ధనము, అన్నము, ఉత్కృష్ట వీర్యము కలిగి మానవులను పరాజితులను చేయగల పుత్రుని ప్రసాదించుము.

6. అగ్నీ ! హవ్యయుక్త యజమాని కూర్చొని నీ కొఱకు హవనము చేయును. నీవు హవ్యాభిలాషివి. అతని అన్నమును స్వీకరింపుము. భరద్వాజ వంశీయుల నిర్దోష స్తోత్రములను గ్రహింపుము. వారిని అనుగ్రహింపుము.

అందువలన వారికి నానావిధ అన్నములు లభించును.

7. అగ్నీ ! శత్రువులను పరిమార్చుము. మా అన్నమును వర్ధిల్ల చేయుము. మేము శోభన పుత్ర పౌత్రాది యుక్తులమయి శతహేమంతములు సుఖములు అనుభవించవలెను.

## పదకొండవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్నీ ! నీవు దేవతల ఆహ్వానకర్తవు. యజన కర్తలలో శ్రేష్ఠుడవు. మేము నిన్ను ప్రార్థించుచున్నాము. మేము చేయుచున్న ఆరాధ్య యజ్ఞమునకు శత్రుహింసక మరుత్తులను యజింపుము. మిత్రావరుణులను నాసత్య అశ్వినీద్వయమును, ద్యావాపృథ్వులను మా యజ్ఞమునకు తీసికొని రమ్ము.

2. అగ్నీ ! నీవు అత్యంత స్తవనీయుడవు. మా విషయమున ద్రోహరహితుడవు. దానాది గుణయుక్తుడవగుము. హవ్యవాహనుడవు. శుద్ధివిధాయకుడవు. దేవతలకు ముఖస్వరూపుడవు. జ్వాలలతో నీ దేహమును యజింపుము.

3. అగ్నీ ! స్తుతి ధనాభిలాషి అగును. అది నిన్ను కోరును. నీవు పుట్టినంతనే యజమానులు ఇంద్రాది దేవతలను యజించు సమర్థులు అగుదురు. ఋషులందు అంగిరులు స్తుతులను అత్యంతముగా ప్రేరేపించువారు. మేధావి భరద్వాజుడు యజ్ఞమున హర్షదాయక స్తుతులను ఉచ్చరించును.

4. అగ్ని దీప్తిమంతుడు. బుద్ధిశాలి. శోభాయమానుడగును.

అగ్నీ ! నీవు ద్యావాపృథ్వులను హవ్యములతో పూజింపుము. నీవు హవ్య సంపన్నుడవు. మానవ యజమానులవలె హవి సమర్పించు ఋత్విక్ యజమానులు హవ్యములతో నిన్ను సంతృప్తుని చేయుదురు.

5. అగ్ని దగ్గరకు హవ్యముతో కుశ అందినపుడు దోషవర్జిత ఘృతపూర్ణ స్రుక్ కుశ మీదపెట్టినప్పుడు - అప్పుడు అగ్నికి ఆధారభూతమగు వేది ఏర్పడును. సూర్యుడు తేజోరాశి సమవేతుడైనట్లు యజమాని యజ్ఞకార్య సమాశ్రితుడు అగును.

6. అగ్నీ ! నీవు బహుజ్వాలా విశిష్టుడవు. దేవతల ఆహ్వానకర్తవు. దీప్తిశాలురగు అన్య అగ్నుల సహితుడవై మాకు ధనప్రదానము చేయుము. మేము హవితో నిన్ను కప్పివేయుదుము. శత్రుతుల్యమగు పాపములనుంచి మమ్ము విముక్తులను చేయుము "ప్ర సేమ వృజనం నాంహః"

(పాపములు శత్రుతుల్యములు అనుట సామాన్యముకాదు. బాధించునవి కాన పాపములు చేయరాదని అర్థము)

## పన్నెండవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్ని దేవతల ఆహ్వానకారి. యజ్ఞములకు అధిపతి. ద్యావాపృథ్వులను యజించుటకుగాను అగ్ని యజమాని గృహమునకు వచ్చును. యజ్ఞసంపన్నుడు, బల పుత్రుడగు అగ్ని దూరమునుండియే సంపూర్ణ జగత్తును సూర్యునివలె ప్రకాశింపచేయును.

2. యాగార్హా, దీప్తిసంపన్న అగ్నీ ! నీవు బుద్ధి సంపన్నుడవు. యజమానులందరు కోరికలుగలవారై నీకు ప్రచురహవ్యము సమర్పింతురు. నీవు త్రిభువనములందు నిలువుము. మానవులు సమర్పించిన హవ్యమును దేవతలవద్దకు చేర్చుటకు సూర్యునివలె వేగవంతుడవగుము.

3. అగ్నిజ్వాలలు సర్వవ్యాపినులు. అత్యంత తేజస్వినులు. అవి అరణ్యమున నుండును. వర్ధిల్లును. సూర్యునివలె అంతరిక్షమున విరాజిల్లును. అందరకు శుభముల నొసంగు వాయువువలె అగ్నిజ్వాలలు అక్షయములు, అనివార్యములగు ఓషధులలోనికి వేగముగప్రవేశించును. తమవెలుగులతో జగములనన్నింటిని వృద్ధిచెందించును.

4. జాతవేద అగ్ని - యాజకుల సుఖదాయక స్తుతులవంటి మా స్తోత్రముల ద్వారా యజ్ఞగృహమున స్తుతుడగును. యజమానులు వృక్షభోజనుడు, అరణ్య ఆశ్రయకారి, దూడల తండ్రి, ఆబోతువంటి క్షిప్రకర్మకారి అగ్నిని స్తుతింతురు.

(దూడల తండ్రి ఆబోతు తప్పినబిడ్డకై వెదికినంత లేక ఆవుకొఱకు వేగముగా పరుగెత్తినట్లు అని అర్థము)

5. అగ్ని అనాయాసముగా అరణ్యములను భస్మముచేసి నేలమీద విస్తరించినపుడు స్తోతలు ఈ లోకమున అగ్నిశిఖలను మంటలను స్తుతింతురు. అప్రతిహత వేగమున సంచరించువాడును. దొంగవలె వేగగమనముగల అగ్ని మరుభూమి మీద విరాజమానుడగును.

6. వడిగల నడకలుగల అగ్నీ ! నీవు సమస్త అగ్నుల సహితముగా ప్రజ్వలితుడవగుము. మమ్ము నిందలనుండి రక్షింపుము. మాకు ధనము ప్రసాదించుము. దుఃఖదాయక శత్రుసైన్యమును దూరము చేయుము. మేము శోభన పుత్ర, పౌత్ర యుక్తులమై నూరు హేమంతములు సుఖములు అనుభవించవలెను.

## పదమూడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్నీ ! నీవు శుభప్రద ధనవంతుడవు. చెట్లు నుండి కొమ్మలు పుట్టినట్లు - రకరకముల ధనములు నీనుండియే పుట్టినవి. పశు సమూహములు త్వరత్వరగా నీనుండియే పుట్టినవి. యుద్ధమున శత్రువును గెలుచు బలము నీనుండియే పుట్టినది. అంతరిక్షమున వర్షములు కూడ నీవల్లనే పుట్టినవి. అందువలననే నీవు అందరి స్తవనీయుడవు.

2. అగ్నీ ! నీవు భజనీయుడవు. మాకు రమణీయ ధనము ప్రసాదించుము. దర్శనీయ దీప్తుడవగుము. సర్వత్ర వ్యాపించు వాయువువలె సర్వత్ర నిలువుము. మిత్రునివలె ప్రచుర యజ్ఞము, కోరిన ధనమును ప్రసాదించుము.

3. అగ్నీ ! నీవు ప్రకృష్ట జ్ఞాన సంపన్నుడవు. యజ్ఞముకొఱకు సముద్భూతుడవు. నీవు జలపుత్రుడు వైద్యుతాగ్నితో కలిసి ఒక వ్యక్తిని అనుగ్రహింతువు. అట్టి వ్యక్తి సాధురక్షకుడు, బుద్ధిమంతుడగును. అతడు తన బలమున శత్రువులను సంహరించును. ఫణుల శక్తిని అపహరించును.

4. బలపుత్రా ! ద్యుతిమంతా ! అగ్నీ ! ఒక యజమాని నిన్ను స్తుతించును. ఉపాసించును. యజ్ఞముద్వారా యజ్ఞభూమిలో నీ తీక్ష్ణ కాంతిని ఆకర్షించును. అట్టి యజమానికి మానవుల సమస్త ప్రాచుర్యములు కలుగును. ధనధాన్య సంపన్నుడగును.

5. బలపుత్రా అగ్నీ ! నీవు మమ్ము పోషించుటకుగాను శత్రువులనుండి తెచ్చిన ధనమున ఉత్కృష్ట పుత్ర సహిత శోభన అన్నము ప్రదానము చేయుము. విద్వేషపూర్ణ శత్రువులనుండి గుంజుకున్న పశుసంబంధమగు దధ్యాది అన్నమును మరింతగాచేసి మాకు ప్రసాదించుము.

6. అగ్నీ ! నీవు బలపుత్రుడవు. బలశాలివి. మాకు ఉపదేష్టవగుము. మాకు అన్నముతో పాటు పుత్ర, పౌత్రులను ప్రసాదించుము. మేము స్తుతులద్వారా పరిపూర్ణ మనోరథులము కావలెను. మేము శోభన పుత్ర, పౌత్రులతో శత హేమంతములు సుఖించవలెను. "మదేమ శతహిమాః"

## పదునాలుగవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - అనుష్టుప్ చివరిది శక్వరి

1. స్తోత్రములతో అగ్నిని సేవించినవాడును - యాగాది కార్యములు చేసినవాడును - మానవులనుండి శీఘ్రముగా యాగాది కార్యములు చేసినవాడును మానవులలో శీఘ్రముగా ప్రముఖుడు అగును. పుత్ర పౌత్రాదుల పోషణకుగాను శత్రువు నుండి మరింత అన్నమును సాధించును.

2. ఒక్క అగ్నిమాత్రమే జ్ఞానసంపన్నుడు. అన్యుడుకాడు. అతడు యజ్ఞకార్యమున అతిశయ నిర్వాహకుడు. సర్వద్రష్ట, యజమాని పుత్రాదులు యజ్ఞమున అగ్నిని దేవతల ఆహ్వానకర్త అని స్తుతింతురు.

3. అగ్నీ ! శత్రువుల ధనము వారినుండి విడిపోవును. స్తోతలను రక్షించుటకు ఆ ధనములు పరస్పరము స్పర్ధించును. నీ స్తోతలు శత్రువిజేతలగుదురు. నీ యజ్ఞము చేయుదురు. వ్రత విరోధులను ఓడించవలెను అనుకొందురు.

4. అగ్ని స్తోతలకు కార్యాన్వితుడు, శత్రుంజయుడు సాధువుల కార్యమును రక్షించగల పుత్రుని ప్రసాదించును. అతని బలములకు భయభీతులయిన శత్రువులు గడగడలాడుదురు.

5. ఎవని హవ్యస్వరూపధనము రాక్షసులవల్ల విఘ్నము కాకుండునో, ఇతరులద్వారా పంచుకొనబడదో, అట్టి యజమానిని జ్ఞానసంపన్నుడగు అగ్ని నిందకులనుండి రక్షించును.

6. అగ్నీ ! నీవు అనుకూల దీప్తివంతుడవు. దానాది సద్గుణయుక్తుడవు. ద్యావాపృథ్వులందు వర్తమానుడవు. నీవు దేవతలవద్ద మా స్తుతులను ఉచ్ఛరింపుము. స్తోతలమగు మమ్ము శోభన నివాసయుక్త సుఖములవైపు తరలింపుము. మేము శత్రువులను పాపములను కష్టములను అతిక్రమించవలెను. మేము జన్మాంతరకృత పాపములనుండి విముక్తులము కావలెను. నీవు మమ్ము శత్రువులనుండి రక్షింపుము.

## పదిహేనవ సూక్తము

ఋషి - అంగిరసుడు లేక వీతహవ్యుడు లేక భరద్వాజుడు. దేవత - అగ్ని, ఛందస్సు - వివిధములు

1. అగ్ని హవ్యవాహకుడు. ఉషఃకాలమున ప్రవృద్ధుడు. స్వభావతః శుద్ధుడు. అతిథిరూపుడు. అగ్ని సర్వకాలములందు ద్యులోకము నుండి అవతరించును. అక్షయ హవ్యమును భక్షించును. భరద్వాజ ఋషీ ! అట్టి అగ్నిని ప్రసన్నుని చేయుము.

2. అగ్నీ ! నీవు అరణిమధ్యమున దాగి ఉన్నావు. అచటినుండియే ఉద్భవించినావు. స్తుతివాహకుడవు. ఊర్ధ్వజ్వాలలవాడవు. నిన్ను భృగు మహర్షులు తమ మిత్రునివలె వారి గృహమందు నిలుపుకొందురు. భరద్వాజులు ఉత్కృష్ట స్తోత్రములతో నిన్ను పూజింతురు. నీవు వారి విషయమున ప్రసన్నుడవగుము.

3. అగ్నీ ! యాగాది అనుష్ఠానపరునకు నీవు సమృద్ధి ప్రసాదింతువు. దూరమున దగ్గర ఉన్న శత్రువుల నుండి అతనిని రక్షింతువు. మానవులందు భరద్వాజునకు ధనము, గృహము ప్రసాదించుము.

4. అగ్ని శోభనస్తుతులవాడు. హవ్యవాహనుడు. దీప్తిమంతుడు. అతిథివలె పూజనీయుడు. స్వర్గప్రదర్శకుడు. మనువు యజ్ఞమున దేవతల ఆహ్వానకర్త. యజ్ఞసంపాదకుడు. మేధావి. ఓజస్వి. వక్త. భరద్వాజా ! అట్టి అగ్నిని ప్రసన్నుని చేయుము.

5. అగ్ని ఉషప్రకాశమున శోభాయమానుడగును. అగ్ని భూమి పవిత్రకారకము, చేతనావిధేయక దీప్తిద్వారా విరాజమానుడు. అగ్ని-శత్రుసంహారక వీరునివలె-ఏతశఋషికి సాయము చేయుటకు ప్రజ్వరిల్లినాడు. అగ్ని సర్వభాక్షుడు క్షయరహితుడు వీతహవ్య భర ద్వాజా! అట్టి అగ్నిని ప్రసన్నుని చేయుము.

6. ఓ మాయొక్క స్తోతలారా ! అత్యంతప్రియుడు, అతిథివలె పూజనీయుడగు అగ్నిని సమిధలతో నిరంతరము పూజించండి. దేవతలలో దానగుణయుక్తుడగు అగ్ని సమిధలను, పూజలను గ్రహించును. అందువలన అనశ్వర అగ్నిముందు నిలిచి అగ్నిని పూజించండి.

7. మేము సమిధలతో ప్రజ్వరిల్లు అగ్నిని స్తుతించి ప్రసన్నుని చేయుదుము. స్వతః పరిశుద్ధుడు, పవిత్రతా సంపన్నుడు, నిశ్చలుడగు అగ్నిని యజ్ఞమున స్థాపించెదము. జ్ఞాన సంపన్నుడు, దేవతల ఆహ్వానకర్త సర్వజనవరణీయుడు, సదాశయ సంపన్నుడు, సర్వదర్శి, సర్వభూతజ్ఞడగు అగ్నిని సుఖకర స్తోత్రములతో భజింతుము.

8. అగ్నీ ! దేవతలు, మనుష్యులు, నిన్ను దూతను చేయుదురు. నీవు అమరుడవు. విశేష సమయములందు హవ్యవాహనుడవు. పాలకుడవు. స్తవనీయుడవు. జాగరణశీలుడు, వ్యాప్తుడు, ప్రజాపాలకుడగు అగ్నిని నమస్కరించి, స్థాపించెదరు.

9. అగ్నీ ! నీవు దేవతలను మనుష్యులను విశేషరీతిన అలంకరింపచేతువు. యజ్ఞమున దేవదూత వగుదువు. ద్యావాపృథ్వులందు సంచరింతువు. మేము నిన్ను స్తోత్రములతో స్తుతింతుము. యజ్ఞముచేసి భజింతుము. అందువలన నీవు త్రిభువన వర్తివి అగుము. మాకు సుఖ విధానము చూపుము.

10. అగ్ని శోభనాంగుడు. మనోజ్ఞమూర్తి. గమనశీలుడు. మేము అల్పబుద్ధులము. అట్టి అగ్నిని సేవింతుము. తెలిసికొనవలసిన వానిని తెలిసికొను అగ్ని దేవతలను భజించవలెను. దేవతలలో మాహవ్యమునకు ప్రాచుర్యము కలిగించవలెను.

11. హే శౌర్యసంపన్న అగ్నీ ! నీవు దూరదర్శివి. నిన్ను స్తుతించువానిని రక్షింతువు. అతని కోరికలు తీర్చెదవు. యజ్ఞముచేయువానిని హవి అర్పించువానిని బల, ధన పూర్ణుని చేసెదవు.

12. అగ్నీ ! మమ్ము శత్రువులనుండి రక్షింపుము. బలసంపన్న అగ్నీ ! మమ్ము పాపములనుండి కాపాడుము. మేము అర్పించిన నిర్దోష హవ్యము నీకు చేరవలెను. నీవు దత్తము చేసిన వేలవిధములధనము మాకు చేరవలెను.

13. దేవతల ఆహ్వానకర్త. దీప్తిమంతుడగు అగ్ని గృహమునకు అధిపతి. సర్వజ్ఞుడు. అందువలన అగ్ని సమస్తప్రాణులను ఎరుగును. అగ్ని దేవతలలోను మానవులలో అతిశయ యజ్ఞకారి. సత్యసంపన్నుడగు అగ్ని ఉత్తమరూపమున యజ్ఞము చేయవలెను.

14. అగ్ని యజ్ఞనిష్పాదకుడు. శోధక దీప్తిమంతుడు అగ్నీ ! ఈ సమయమున ఇప్పుడు యజమాని హవ్య నిర్వహణను ఆశింపుము. నీవు దేవతల యజనము చేయువాడవు. కావున యజ్ఞమున దేవతలను యజింపుము. యువతమ అగ్నీ ! నీవు నీ మాహాత్మ్యముననే సర్వవ్యాపకుడవు. నేటి దినమున్ మేము నీకు సమర్పించు హవ్యమును స్వీకరింపుము.

15. అగ్నీ ! వేదిమీద యథావిధిగ ఉంచిన హవ్యమును అవలోకింపుము. యజమాని నిన్ను యజ్ఞమునకుగాను ద్యావాపృథ్వులందు స్థాపించినాడు. ఐశ్వర్య సంపన్న అగ్నీ ! మమ్ము యుద్ధమున రక్షింపుము. అందువలన మేము సమస్త పాపములనుండి విముక్తులమగుదుము.

16. సుందర శిఖాసంపన్న అగ్నీ ! సమస్త దేవతలందు సర్వాగ్ర గణ్యుడవగుము. ఉర్ణ - కంబళి యుక్తమగు కులాయ గూటి వంటి ఘృతసంయుక్త ఉత్తరవేదిన నిలువుము. హవ్యదాత యజమాని యజ్ఞమును సముచిత రీతిన దేవతల వద్దకు చేర్చుము.

17. కర్మ విధానమును నిర్వహించు ఋత్విక్కులు అధ్వర్యఋషివలె అగ్నిమంథనము చేసినారు. దేవతల నుంచి బయలుదేరి అటునిటు పరుగులెత్తు, బుద్ధిమంతుడగు అగ్నిని రాత్రిళ్లు అంధకారమున ఆహ్వానించినారు.

18. అగ్నీ ! దేవాభిలాషులగు యజమానుల శుభములను అనంతము చేయుటకుగను యజ్ఞమందు మథనమున ఉద్భవించుము. యజ్ఞవర్ధకులు, అమరులగు దేవతలను ఆహ్వానించుము. వారివద్దకు మా యజ్ఞమును చేర్చుము.

19. యజ్ఞపాలక అగ్నీ ! ప్రాణులందు మానవులమగు మేమే నీకు ఇంధనము అర్పించి మహానుని చేయుదుము. అందువలన గార్హపత్య అగ్ని మాపుత్ర, పౌత్ర, ధనాదులను పరిపూర్ణము చేయవలెను. తీక్ష్ణ తేజమున మమ్ము నియోజింపుము.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగవ అష్టకము ఆరవ మండలమున నాలుగువ అధ్యాయమున మొదటి అనువాకము సమాప్తము)

రెండవ అనువాకము          పదహారవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అగ్ని, ఛందస్సు - వివిధములు.

1. అగ్నీ ! నీవు దేవతల ఆహ్వానకర్తవు. మనుసంబంధి మనుష్యుల యజ్ఞమున దేవతలద్వారా హోతకార్యమున నియుక్తుడవగుము.

2. అగ్నీ ! మా యజ్ఞమున మదించిన జ్వాలలతో గొప్పగొప్ప దేవతలను భజింపుము. ఇంద్రాది దేవతలను పిలువుము, వారికి హవ్యము అర్పింపుము.

3. విధాతా ! శోభన కర్మకారీ ! దానాదిగుణవిశిష్టా ! అగ్నీ ! దశపూర్ణమాసాది. యజ్ఞములందు గొప్పమార్గములను హీనమార్గములను త్వరగా ఎరుగుదువు. అందువలన యజ్ఞమార్గమున భ్రష్టుడగు యజమానిని సన్మార్గగామిని చేయుము.

4. దుష్యంత పుత్రుడు భరతుడు హవ్యదాతలు. ఋత్విక్కుల సహితుడయి అగ్నీ ! నిన్ను స్తుతించును. నీ వలన ఇష్టప్రాప్తి అనిష్ట నివారణము జరుగును. నీవు యాగ యోగ్యుడవు. నిన్ను స్తుతించిన పిదప భజింతురు.

(భరతుడు కాళిదాసు మహానాటకము అభిజ్ఞాన శాకుంతలమునందలి వానికి బీజప్రాయుడుగా అగుపించుచున్నాడు)

5. అగ్నీ ! సోమాభిషవకారి దివోదాసునకు బహువిధరమణీయ ధనమును ప్రసాదించి ఉన్నావు. హవ్యప్రదానము చేయు భరద్వాజ ఋషికి అటువంటి బహువిధ రమణీయ ధనమును ప్రసాదించుము.

6. అగ్నీ ! నీవు అమరుడవు. దూతవు. మేధావివి. భరద్వాజుని స్తుతిని ఆలకింపుము. మా యజ్ఞమునకు దేవతలను కొనితెమ్ము.

7. ద్యుతిమంత అగ్నీ ! సదాలోచనగల మానవులు దేవతలను తృప్తిచెందించుటకుగాను యజ్ఞమున నిన్ను స్తుతింతురు. యాచింతురు.

8. అగ్నీ ! మేము దర్శనీయమగు నీ తేజస్సును చక్కగా పూజింతుము. మేము ఒక్కరమేకాదు. ఇతర యజమానులు కూడా నీ అనుగ్రహమున సఫలాభిలాషులు అగుటకు నిన్ను సేవింతురు.

9. అగ్నీ ! మనవు నిన్ను హోతృకార్యమున నియమించినాడు. నీవు జ్వాలాముఖమున హవ్యము వహించువాడవు. విద్వాంసుడవు. ద్యులోకసంబంధజనుల దేవతలను యజింపుము.

10. అగ్నీ ! నీవు హవ్యభక్షణకు రమ్ము. దేవతల వద్దకు హవ్యము వహించుటకు రమ్ము. స్తుతి భాజనుడవై హోతరూపమున కుశలపై ఆసీనుడవగుము.

11. అంగారరూప అగ్నీ ! మేము కట్టెలు, నేతితో నిన్ను ప్రవర్ధుని చేయుదుము. అందువల్ల తరుణారుణ అగ్నీ దీప్తిమంతుడవగుము.

12. ద్యుతిమాన్ అగ్నీ ! మాకు విస్తీర్ణము, ప్రశంసనీయము మహంతమగు ధనమును ప్రసాదించుము.

13. అగ్నీ ! మస్తకమువలె లోకములను ధరించిన పుష్కర పుత్రునిమీద అరణిద్వయ మధ్యమున అధర్వఋషి నిన్ను ఉత్పత్తి చేసినాడు.

("అధర్వా" అధర్వవేదపు యౌగికనామముని మేకొనల్, కీత్ అభిప్రాయము. మంత్రమున "అధర్వా" ఉన్నది. ఇది ఋషి పేరని శాయణుడు)

14. అగ్నీ ! అధర్వపుత్రుడు దధ్యంగుడు నిన్ను సముజ్వలితము చేసినాడు. నీవు ఆక్రమించునట్టి శత్రువుల సంహారకుడవు. అసుర నగర వినాశకుడవు.

(దధ్యంగుడు ఒక పౌరాణిక ఋషి. ఇతడు అధర్వణుడు. ఋగ్వేదమున ఇతడు దివ్యపురుషుడు.)

15. అగ్నీ ! పాథ్యవృషడను ఋషి నిన్ను సముద్దీపుని చేసినాడు. నీవు దస్యుహంతవు. విశేష యుద్ధములందు ధనవిజేతవు.

(యజుర్వేదమున "మనోవైపాథ్యోవృషా" అన్నాడు. అతడు మనువుకు సంబంధించినవాడు కావచ్చును. మనసే కావచ్చును)

16. అగ్నీ ఇచటికి విచ్చేయుము. మేము నీ గురించి ఉచ్చరించు స్తోత్రములను వినుము. ఇచటికి వచ్చి నీవు సోమరసమున వర్ధిల్లుము.

17. అగ్నీ ! నీ అనుగ్రహ పాత్రములగు దేశము, యజమాని శ్రేష్ఠబల సంపన్నులు అగుదురు. నీవు ఆయజమానినే నీ

తావరము చేసికొందువు.

18. అగ్నీ ! దీప్తిపుంజమగు నీ నేత్రమునకు విఘాతము కలుగరాదు. అది మమ్ము సదా దర్శన సమర్థులను చేయవలెను. కొద్దిమంది యజమానులకు గృహములు కల్పించు అగ్నీ ! యజమానులమగు మేము చేయు పరిచర్యలు గ్రహింపుము.

19. స్తుతులు ఉచ్ఛరించుచు మేము అగ్నికి ఎదురేగుదుము. అగ్ని హవి స్వామి దివోదాసుని శత్రువుల పరిమార్చువాడు, సర్వజ్ఞుడు, యజమానుల పాలకుడు.

20. అగ్ని తన మహిమతో మాకు సంపూర్ణ పార్థివ ధనమును మరింతగా ప్రసాదించును. అగ్ని తన తేజమున శత్రువుల నాశనము చేయును. అగ్ని శత్రువులకు అజేయుడు. అతనిని ఎవరును హింసింపజాలరు.

21. అగ్నీ ! ప్రాచీనవంతమగు నవీన దీప్తితో విస్తీర్ణ అంతరిక్షమును మరింత విస్తరింపచేయుదువు.

22. మిత్రులగు ఋత్విక్కులారా ! శత్రుహంత, విధాతస్వరూప అగ్నిని స్తుతించు గానము చేయండి. యజ్ఞసాధన హవ్యమును సమర్పించండి.

23. అగ్ని దేవతల ఆహ్వాత. అతిశయ బుద్ధిమంతుడు. మానవ యజ్ఞములందు దేవదూత. హవ్యవాహకుడు. అట్టి అగ్నిమా యజ్ఞమునకు విచ్చేయవలెను. కుశలపై ఆసీనుడు కావలెను.

24. గృహప్రదాతవగు అగ్నీ ! ఈ యజ్ఞమున ప్రసిద్ధులు, రాజమానులు, సుందర కర్మవంతులు మిత్రావరుణులు, అదితిపుత్రులు, మరుద్గణములు ద్యావా పృథ్వులను యజింపుము.

25. బలపుత్రా ! అగ్నీ ! నీవు మరణ రహితుడవు. నీదు ప్రశస్తమగు దీప్తి మానవ యజమానులకు అన్నప్రదానము చేయును.

26. అగ్నీ ! హవి ఇచ్చు యజమానులు నిన్ను సేవింతురు. భజింతురు. వారు అత్యంత ప్రశంసనీయము. శోభనమగు ధనవంతులు కావలెను. వారు నిన్ను సర్వదా స్తుతించువారగుదురు.

27. అగ్నీ ! నీ స్తోతలు నీవలన రక్షణ పొందుదురు. అభిలాషలు అన్నిపూర్తి అగును. సంపూర్ణ అన్నవంతుడు, ఆయుష్కుడు అగును. తనను ఆక్రమించ తల పెట్టిన శత్రువును పరాజితునిచేసి, నష్టపరచును.

28. అగ్ని తన తీక్ష్ణ తేజమున సర్వభోజనుడు, రాక్షస సంహారకుడు, మాకు ధనప్రదాత అగును.

29. జాతవేద అగ్నీ ! శోభన పుత్ర పౌత్రాదియుక్త ధనమును కూర్చుము. రాక్షసులను నాశము చేయుము.

30. జాతవేదాగ్నీ ! మమ్ము పాపములనుండి రక్షింపుము. స్తుతిరూపమంత్రకర్తా అగ్నీ విద్వేషకారులనుండి మమ్ము కాపాడుము.

31. అగ్నీ ! దురభిప్రాయమున మమ్ము బాధించుటకు ఆయుధము ఎత్తువానినుండి, పాపములనుంచి మమ్ము రక్షింపుము.

32. ద్యుతిమాన్ అగ్నీ ! మమ్ము హింసించకోరు దుర్మార్గుని నీ జ్వాలలతో బాధించుము.

33. శత్రువులను పరాభవించు అగ్నీ ! మాకు - భరద్వాజునకు మరింత సుఖము, గృహము, వరణీయ ధనము ప్రసాదించుము.

34. అగ్ని చక్కని దీప్తిగలవాడు. శుక్లవర్ణుడు. హవిద్వారా ఆహూతుడు. స్తుతులతో నుతుడయి హవిని ఆశించును. అగ్ని శత్రువులను చీకట్లను నష్టపరచును.

35. నేలతల్లి కడుపున అక్షయవేదిమీద అగ్ని విద్యుతమానుడగును. "విదిద్యుతానో" ద్యులోకపాలకుడగు అగ్ని హవిద్వారా యజ్ఞపు ఉత్తరవేదిమీద వేంచేయును. శత్రువులను నాశము చేయును.

36. అగ్నీ ! నీవు జాతవేదవు. సర్వదర్శివి. పుత్ర పౌత్రసహితమగు అన్నమును సముపార్జించుము. అది ద్యులోకమున దేవతల మధ్య ప్రశస్తమై శోభాయమగునదిగా ఉండవలెను.

37. బలమునుంచి పుట్టిన అగ్నీ ! నీ దర్శనము అత్యంత రమణీయము. హవిరూప అన్నముతో వచ్చి నీవద్ద స్తోత్రములు ఉచ్చరింతుము.

38. అగ్నీ ! నీ తేజము బంగారమువలె మెరియునది. నీవు దీప్తి సంపన్నుడవు. ఎండకు తపించినవాడు నీడను ఆశ్రయించినట్లు మేము నీశరణు కోరుదుము.

39. ప్రచండ బలశాలియగు ధనుర్ధారివలె అగ్ని బాణములతో శత్రువులను హతమార్చును. అగ్ని వాడి కొమ్ములుగల ఆభోతువంటివాడు.

అగ్నీ ! నీవు త్రిపురాసురుని మూడు నగరములను ధ్వంసము చేసినావు.

40. అధ్వర్యులు అరణి మంథనమున అగ్నిని కలిగించినారు. పసి పుత్రునివలె చేతిలోనికి తీసికున్నారు.

ఋత్విక్కులారా ! హవ్య భక్షకుడు మానవుల శోభన యజ్ఞనిష్పాదకుడగు అగ్నిని సేవించుడు.

41. అధ్వర్యులారా ! దేవతల ఆరగింపునకు సమర్పించు భక్ష్యము అగ్నియందు అర్పించండి. అగ్ని ద్యుతిమంతుడు. ధనముల జ్ఞాత. అగ్ని తన ఆహవనీయ స్థానమున విరాజిల్లవలెను.

42. అధ్వర్యులారా ! ప్రాదుర్భూతుడు. అతిథివంటి ప్రియుడు, గృహస్వామి అయిన అగ్నిని జ్ఞానప్రదాయకుడు, సుఖకర ఆహవనీయ అగ్నిలో సంస్థాపించండి.

(గృహాగ్నిని - జ్ఞానాగ్నిలో ప్రవేశపెట్టుమని గృహము జ్ఞానమయము కావలెనని)

43. ద్యుతిమంతుడవగు అగ్నీ ! నిన్ను యజ్ఞమునకు సరిగా చేర్చగల సమస్త సుశీల అశ్వములను నీ రథమునకు జోడించుము.

44. అగ్నీ ! నీవు మాకు అభిముఖముగా విచ్చేయుము. హవ్య భోజనము సోమపానమునకు దేవతలతో విచ్చేయుము.

45. హవ్యవాహక అగ్నీ ! నీవు అత్యంత ఊర్ధ్వ తేజుడవయి దీప్యమానుడవగుము. జరారహిత అగ్నీ ! అజస్ర ద్యుతిమంత తేజమున ప్రకాశితుడవగుము. ముందు ఉద్దీప్తుడవగుము. తదుపరి నీ తేజమున సమస్త జగములను ప్రకాశింప చేయుము.

46. హవియుక్త యజమాని హవిర్లక్షణ అన్నమున ఏ దేవతను సేవించినను ఆ యజ్ఞమున అగ్నిని అర్చించుట జరుగును. ద్యావాపృథ్వులందున్న దేవతలకు అగ్ని ఆహ్వానకర్త. సత్యరూపమున పూజ్యుడు. యజమానులు చేతులు జోడించి నమస్కార పూర్వకముగా అగ్నిని భజింతురు.

47. అగ్నీ ! నీకు ఋక్కునే హవ్యముగా సమర్పింతుము. ఋక్ స్వరూపమగు ఆ హవి నీ భక్షణకుగాను వృషభ, గోరూపములుగ మారవలెను.

(అగ్ని సర్వభక్షకుడు. అతనికి గోవృషభములు లెక్కలోనివి కావు.)

48. అగ్ని బలశాలి. యజ్ఞవిరోధక రాక్షసులను సంహరించినాడు. అసురుల ధనమును హరించినాడు. అట్టి

వృత్రహంత ప్రధాన అగ్నిని దేవగుణములు ఉద్దీప్తుని చేయుదురు.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగువ అష్టకము ఆరవ మండలమున అయిదవ అధ్యాయము సమాప్తము)

*ఓం నతామినన్తిమాయినో నధీరావ్రతాదేవానాం ప్రథమాధ్రువాణి*
*నరోదసీ అద్రుహా వేద్యాభిర్న పర్వతాణి నమే తస్థివాంసః*

**ఆరవ అధ్యాయము పదియేడవ సూక్తము**

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! నీవు ప్రచండ బలశాలివి. నిన్ను అంగిరులు స్తుతించినారు. నీవు సోమపానము కొఱకు ఫణులు అపహరించిన గోవులను వెల్లడించినావు. రమ్ము. సోమపానము చేయుము. శత్రునాశక, వజ్రధర ఇంద్రా ! బలయుక్తుడవయి శత్రువులనందరిని నాశనము చేసినావు.

2. ఋజీషి సోమపాన ఇంద్రా ! నీవు శత్రువుల నుండి రక్షించువాడవు. శోభన కపోలవంతుడవు. స్తోతల కోరికలు తీర్చువాడవు. ఈ సోమరసమును పానము చేయుము.

ఇంద్రా ! నీవు వజ్రధారివి. పర్వత విదారకుడవు. అశ్వసంయోజకుడవు. మాకు విచిత్ర అన్నమును ప్రకాశితము చేయుము.

3. ఇంద్రా ! నీవు ప్రాచీనమగు సోమరసపానము చేసినవాడవు. మేము సమర్పించు సోమరస పానము చేయుము. ఇది నిన్ను ప్రసన్నుని చేయవలెను. మా స్తోత్రములను వినుము. వాటివలన వర్ధమానుడవగుము. సూర్యుని ఆవిష్కరింపుము. మాకు అన్న భోజనము చేయించుము. మా శత్రువులను పరిమార్చుము. ఫణులు అపహరించిన గోవులను వెల్లడించుము.

4. ఇంద్రా ! నీవు అన్నవంతుడవు. దీప్తివంతుడవు. మహానుడవు. అఖిలగుణవంతుడవు. ప్రవృద్ధుడవు. విభవవంతుడవు. శత్రువులను పరాభవించువాడవు. నీవు త్రావిన మాదక సోమము నిన్ను ఆర్ద్రుని చేయవలెను. నీకు అతిశయ హర్షము కలిగించవలెను.

5. ఇంద్రా ! సోమపానమున ముదమునొందినావు. గాఢాంధకారమును వదిలించినావు. ఉషను, సూర్యుని తమతమ స్థానముల నిలిపినావు. నీ స్థానమునుండి కదలకనే ఫణుల దొంగిలించి, గోవులను దాచిన పర్వతమును

బ్రద్దలు చేసినావు.

6. ఇంద్రా ! నీ బుద్ధియు, కార్యకుశలతతో గోవులను పాలిచ్చునట్లు మార్చినావు. గోవులను బయాటికి రప్పించుటకు రాతిగోడలను కూల్చినావు. అంగిరులతో కలిసి గోవులను గోష్ఠమునుండి విముక్తములను చేసినావు.

7. ఇంద్రా ! మహాకార్యములతో విశాలభువిని విశేషముగ పూరించినావు. మహామహుడవు. ద్యులోకము పడిపోకుండునట్లు దానిని భరించినావు. ద్యావాపృథ్వులను పోషించినావు. దేవతలు ద్యావాపృథ్వుల బిడ్డలు. ద్యావాపృథ్వులు పురాతనములు. యజ్ఞమునకు జలములకు నిర్మాణకర్తలు. అతి గొప్పవి.

8. ఇంద్రా ! వృత్రసంహారమునకుగాను దేవతలు బయలుదేరినారు. అట్టి సంగ్రామమున దేవతలందరు నిన్ను అగ్రగామిని చేసినారు. అధిపతిని చేసినారు. నీవు అత్యంత బలశాలివి. ఆ సంగ్రామమున మరుత్తులు నీకు సాయపడినారు.

9. విపుల అన్నముగల ఇంద్రుడు తానుపడుకొనుటకు ఆక్రమించిన వృత్రుని వధించినపుడు ఇంద్రుని క్రోధము, వజ్రపు భయమున ద్యులోకము కంపించినది.

10. అత్యంత బలశాలి ఇంద్రా ! దేవశిల్పి త్వష్ట నీ కొఱకు వేయిధారలు, వందగంట్లుగల వజ్రము నిర్మించినాడు. ఋజీషి సోమపాన ఇంద్రా ! ఆ వజ్రముననే నీవు నియతాభిలాషి ఉద్ధత పాకృతుడు ధ్వనిచేయు వృత్రుని చూర్ణము చేసినావు.

11. ఇంద్రా ! సంపూర్ణ మరుద్గణములు సమాన ప్రీతిగలవారయి నిన్ను స్తోత్రము ద్వారా వర్ధిల్ల చేయుదురు. నీ కొఱకు పూష, విష్ణువు నూరు మహిషములను వండుదురు-సోమపాత్రను నింపుదురు. సోమపానము చేసిన ఇంద్రుడు వృత్రుని వధించుటకు సమర్థుడు అగును.

12. ఇంద్రా ! వృత్రునిచే సమాచ్ఛాదితములు, సర్వత్ర స్థిత నదీజలములను విముక్తము చేసినావు. అందువలన నదులు ప్రవహించసాగినవి. ఉదక తరంగములను విముక్తము చేసినావు. ఆ నదులు నిన్ను మార్గమున ప్రవహించినవి. నీవు వేగవతులగు నదులను సముద్రమునకు చేర్చినావు.

13. ఇంద్ర ! ఆవిధముగా నీవు ఘనకార్యములు చేయువాడవు, ఐశ్వర్యశాలివి, మహాఓజస్వివి, అజరుడవు, బలదాతవు, శోభన మరుత్తుల సాయము పొందువాడవు, అస్త్రధారివి, వజ్రధారివి అయినావు.

14. ఇంద్రా ! మాకు బలము, పుష్టి, అన్నము, ధనము కూర్చుము. మేము శక్తి సంపన్నులమగు మేధావులము. మా భరద్వాజులను భక్తులలో చేర్చుకొనుము. నిన్ను స్తుతించు వారిని పుత్ర, పౌత్రవంతులను చేయుము. భవిష్యత్తులో

మమ్ము రక్షింపుము.

15. ఈ స్తుతులతో మాకు ఇంద్రుడు అన్నము ప్రసాదించవలెను. మేము శోభన పుత్రయుక్తులమయి వంద సంవత్సరములు ఆనందించవలెను.

(జీవించవలెనని మాత్రముకాదు ఆనందించవలెనని ఆశించుచున్నాడు "మదేమ శతహిమాః")

## పద్దెనిమిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రుడు అనభిభూత తేజస్కుడు. శత్రుహింసకుడు. అనేకులు ఆహ్వానించువాడు. భరద్వాజా ! అట్టి ఇంద్రుని స్తుతించుము. అనభిభూతుడు. ఒజస్వి, శత్రువిజయ, మానవుల కోరికలు తీర్చు ఇంద్రుని స్తుతులతో సంవర్ధితుని చేయుము.

2. ఇంద్రుడు సంగ్రామమున శత్రునాశకుడు. ముఖ్యుడు. బలవంతుడు. యోద్ధ. దాత. యుద్ధసంలగ్నుడు. సానుభూతి సంపన్నుడు. వర్షము కలిగించి అనేకులకు ఉపకారము చేయువాడు. శబ్ద విధాయకుడు. మూడు సవనములందు సోమపానము చేయువాడు. ఇంద్రుడు మను సంతానమును రక్షించువాడు.

3. ఇంద్రా ! కర్మవిహీన మానవులను వెంటనే వశీభూతులను చేసికొనును. నీవు ఒక్కడవే కర్మానుష్ఠాన కారకులగు ఆర్యులను పుత్రులను, దాసులను ప్రసాదించినావు. ఆవిధముగా చేయు సమర్థుడవగుదువా? కావా? అప్పుడప్పుడు నీ పరాక్రమమును ప్రదర్శించుచుండుము.

4. ఇంద్రా ! నీవు బలవంతుడవు. ఓజస్వివి. సమృద్ధి సంపన్నుడవు. అజేయుడవు. జయశీలుడవు. శత్రువినాశకుడవు. అనేక యజ్ఞములందు ప్రాదుర్భవించినావు. నీవు ప్రచండ, ప్రవృద్ధ బల సంపన్నుడవని మేము ఎరుగుదుము.

5. ఇంద్రుడు, కదలని కొండలను కదిలించినవాడు. మన సఖ్యము చిరకాలపుది. దానిని చిరస్థాయిని చేయుము. నీవు స్తవకారులగు అంగిరులతో కలిసి అస్త్రనిక్షేపకుడగు "బలాసురు"ని వధించినావు. వాని నగరములను, నగర ద్వారములను చెదరగొట్టినావు.

6. ఇంద్రుడు ఓజస్వి, స్తోతలను సమర్థులుగ చేయువాడు. అతడు మహా సంగ్రామమునకు స్తోత్రముల ద్వారా ఆహూతుడగును. పుత్రలాభమునకు ఇంద్రుని ఆహ్వానింతురు. వజ్రధారి ఇంద్రుడు యుద్ధములందు విశేషరూపమున వందనీయుడు.

7. ఇంద్రుడు వినాశరహితుడు. శత్రువులను పరాభవించగల బలసంపన్నుడు. మానవ జన్మకు ప్రసిద్ధి కలిగించినాడు. ఇంద్రుడు తన యశస్సువలన సమాన స్థానము కలవాడగును. నేతృతమ ఇంద్రుడు తన ధనము, సామర్ధ్యముతో సమాన స్థానము కలవాడగును.

8. ఇంద్రుడు యుద్ధములందు కర్తవ్యవిమూఢుడుకాడు. ఎన్నడును వృధావస్తువులను ఉత్పన్నము చేయడు. అతడు ప్రఖ్యాతుడు. శత్రునగరములను ధ్వంసము చేయుటకును, శత్రువులను వధించుటకును కార్యరతుడగువాడు.

ఇంద్రా ! నీవు చుమరి, ధుని, పిప్రు, శంబరి, శిష్ణ అసురులను నష్టపరచినావు.

9. ఇంద్రా ! నీవు ఊర్ధ్వగామివి. శత్రుసంహారకుడవు. స్తవనీయ బలసంయుక్తుడవు. శత్రుసంహారమునకు రథమును అధిరోహింపుము. కుడిచేత నీ అస్త్రమగు వజ్రమును దాల్చుము. ధనశాలి ఇంద్రా ! నీవు వెడలి ఆసురీమాయను అంతమొందింపుము.

10. అగ్ని ఎండు చెట్లను కాల్చినట్లు ఇంద్రా ! నీవు వజ్రముతో శత్రువులను పరిమార్తువు. నీవు వజ్రము వంటి భయంకరుడవు. వజ్రముతో రాక్షసులను భస్మము చేయుము. ఇంద్రుడు అనభిభూత మహావజ్రమున శత్రువులను భంగపరచినాడు.

ఇంద్రుడు సంగ్రామమున గర్జించును. సమస్త దురితములను దూరము చేయును.

11. బహుధన సంపన్నుడవు. అనేకులచే ఆహూతుడవు. బలపుత్రుడవగు ఇంద్రా ! నీ మహాబలమును ఎంతటి అసురుడయినను విరువజాలడు. ధనయుక్తుడవయి, అసంఖ్య బలశాలి ఆయుధములతో మా ముందుకు విచ్చేయుము.

12. ఇంద్రుడు బహుధన - యశోవంతుడు. శత్రునిహంత. ప్రవర్ధమానుడు. అతని మహిమ ద్యావాపృథ్వులను మించినది. మహాబుద్ధిశాలి, శత్రుపరాభవకర్త ఇంద్రునకు శత్రువులు లేరు. ప్రతినిధిలేడు. ఆశ్రయము లేదు.

13. ఇంద్రా ! శుష్ణనామక రాక్షసుని నుండి కుత్సుని శత్రువులనుండి ఆయువు, దివోదాసులను రక్షించినావు. మా అతిథిఋత్విగ్వులకు శంబరుని నుండి తెచ్చిన చాలధనము ప్రదానము చేసినావు. విజయ వజ్రమున శంబరుని త్రుంచినావు. భూలోకవాసి, శీఘ్రగమనముల వాడగు దివోదాసుని ఆపదల నుండి కాపాడినావు.

14. ద్యుతిమంతుడవగు ఇంద్రా ! స్తోతలందరు వానకొఱకు నిన్ను పొగడుచున్నారు. నీవు మేధావులలో శ్రేష్ఠతముడవు. స్తోతల పొగడ్తలకు ప్రసన్నుడవగుము. దారిద్ర్య పీడితులగు యజమానులకు వారి పుత్రులకు ధనము

ప్రసాదించుము.

15. ఇంద్రా ! ద్యావాపృథ్వులు, అమర్త్యులు నీ బలమును గుర్తించినారు. బహుకార్య వ్యగ్రుడవగు ఇంద్రా ! అసంపూర్ణ కార్యములను పూర్తిచేయుము. అనంతరము నవీనతమ స్తోత్రములను కల్పించుము.

## పందొమ్మిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. రాజు పగిది స్తోతలగు మానవుల కోర్కెలను తీర్చు మహా ఇంద్రుడు విచ్చేయవలెను. ఉభయ లోకములందు పరాక్రమమును పెంచువాడును, శత్రువులు బాధింపజాలనివాడును అగు ఇంద్రుడు పౌరుష ప్రదర్శనకుగాను మావద్ద వర్ధిల్లును.

2. ఇంద్రుడు పుట్టజ్జే అత్యధిక వర్ధమానుడయినాడు. దానమునకుగాను మా స్తుతి ఇంద్రుని వహించవలెను. ఇంద్రుడు గొప్పవాడు గమనశీలుడు. జరారహితుడు శత్రువు వలన అనభిభూతుడు. ఇంద్రుడు బలమున వర్ధమానుడగును.

3. ఇంద్రా ! నీవు మాకు అన్నదానము చేయుటకుగాను నీ హస్తములను విస్తీర్ణములను, కార్యకర్తలను, అతిశయ దానశీలములను చేయుము. నీవు శాంత మనస్కుడవు. పశుపాలకుడు పశువులను నడిపించినట్లు యుద్ధమున నీవు మమ్ము నడిపించుము.

4. మేము స్తోతలము. అన్నాభిలాషులమై ఈ యజ్ఞమున సమర్థ సహాయకులగు మరుత్తుల సహితుడు, శత్రునిహంత ప్రసిద్ధ ఇంద్రుని స్తుతింతుము. ఇంద్రా ! నీవు పురాతన స్తోతలనువలెనే మమ్ము అనింద్యులము. పాపరహితులను అహింసితులను చేయుము.

5. నదులు ప్రవహించి సముద్రమున పడినట్లు స్తోతల హితకర ధనము ఇంద్రుని చేరును. ఇంద్రు ధనకర్మకారి వాంఛిత ధనస్వామి. సోమరసమున ప్రవర్ధమానుడు అగును.

6. పరాక్రమశాలి ఇంద్రా ! మాకు ప్రకృష్ట తమ ధనము ప్రసాదించుము. శత్రువులను పరాభవించు ఇంద్రా ! మాకు ఇతరులు సహించలేని, అతిశయ ఓజస్సు దీప్తిని ప్రదానము చేయుము. అశ్వవంత ఇంద్రా ! సేచన సమర్థము, ద్యుతిమంతము, మానవ భోగయోగ్యమగు సంపూర్ణ ధనమును ప్రదానము చేయుము.

7. ఇంద్రా ! నీవు, మాకు శత్రు సేనలను పరాభవించు అహింసిత హర్షమును ప్రసాదించుము. నీ వలన రక్షితులమై

మేము జయశీలురమగుదుము. పుత్ర, పౌత్ర లాభమునకుగాను ఆ హర్షముననే నిన్ను స్తుతింతుము.

8. ఇంద్రా ! మాకు అభిలాషపూరక సేనారూప బలము ప్రసాదించుము. అ బలము ధనమును రక్షించునది వృద్ధి చెందునది, శుభంకరమగునది కావలెను. ఆ బలముతో యుద్ధమున తెలిసిన, తెలియని శత్రువులను మేము వధించ కలుగవలెను.

9.ఇంద్రా ! నీవు మాకు ప్రసాదించు అభీష్టవరద బలము పడమర, ఉత్తరము, దక్షిణము, తూర్పు నలుదిశలనుండి మమ్ము చేరుకొనవలెను. అది ఒకే దిశనుండి అయినను మీ వద్దకు రావలెను. మాకు సర్వవిధ ధనమును ప్రదానము చేయుము.

10. ఇంద్రా ! నీ రక్షణలు మాకున్నవి. పరిచారక యుక్తము, వినదగు కీర్తి సహితమగు శ్రేష్ఠధనమును నీరక్షణల నీడన అనుభవింతుము. నీవు పార్థివ, దివ్య ధనములకు అధిపతివి. మాకు గొప్పవి, అంతులేని, గుణయుక్త రత్నములను ప్రసాదించుము.

11. అభినవ రక్షణలకుగాను ఈ యజ్ఞమునకు, ప్రసిద్ధ ఇంద్రుని ఆహ్వానించుచున్నాము. ఇంద్రుడు మరుత్ యుక్తుడు. అభీష్టవర్షి. సమృద్ధుడు. శత్రుపరాభవకర్త. దీప్తిమంతుడు. శాసనకారి. లోకమును అభినందించువాడు ప్రచండుడు. బలప్రదుడు.

12. వజ్రధర ఇంద్రా ! మానవులందు తమనుతాము అధికులముగా భావించువారిని వశీభూతులను చేసికొనుము. మేము ఈ లోకమున, ఇప్పుడు, యుద్ధసమయమందును పుత్ర, పౌత్ర, జలలాభమునకును నిన్ను ఆహ్వానింతుము.

13. బహుజన ఆహూతుడవగు ఇంద్రా ! స్తోత్ర రూప స్నేహమున నీతో కలిసి తలెత్తిన శత్రువులను వధించవలెను. వారికన్న బలవంతులము కావలెను. నీవు మమ్ము రక్షించవలెను. మేము మహాధనమున ప్రసన్నులము కావలెను.

## ఇరువదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. బలపుత్ర ఇంద్రా ! సూర్యుడు తన తేజస్సుతో భువిని ఆక్రమించిన రీతి యుద్ధమున శత్రువును ఆక్రమించగల పుత్ర ధనమును ప్రసాదించవలెను. ఆ పుత్రుడు వేనవేల విధముల ధనములకు స్వామి, సత్యపూర్ణ భూమికి అధిపతి, శత్రునిహంత కావలెను.

2. ఇంద్రా ! నీవు సూర్యుని వంటివాడవు. స్తోతలు స్తోత్రములతో సముచిత సంపూర్ణ బలములను నీకు

అర్పించినారు. తక్కువ రసముగల సోమపానముచేయు ఇంద్రా ! నీవు విష్ణు సహితుడవయి నీ బలమున జలనిరోధకుడగు వృత్రుని వధించినావు.

3. సంపూర్ణ శత్రునగరములను భగ్నము చేయు వజ్రము ఇంద్రునకు అందినది. అప్పుడు అతడు మధుర సోమరసమునకు స్వామి అయినాడు.

ఇంద్రుడు హింసకుల హింసకుడు. అతిశయ ఓజస్వి. బలశాలి - అన్నప్రదాత - ప్రవృద్ధ తేజోవంతుడు.

4. ఇంద్రా ! మేధావి కుత్సుడు యుద్ధములందు బృహత్ అన్నదాత. నీకు సాయము చేయువాడు. కుత్సుని ఫణినామక అసురుడు చూచినాడు. తన శతసంఖ్యాక సైన్యముతో పలాయనము చిత్తగించినాడు. నీవు శుష్ణనామక అసురుని కాపట్యమును ఆయుధమును అంతమొందించినావు. వాని సమస్త అన్నములను అపహరించినావు.

5. ఇంద్రుడు వజ్రము పడినది. శుష్ణుడు ప్రాణములు వదిలినాడు. అప్పుడుగాని ద్రోహియగు శుష్ణని సమస్త బలములు అంతముకాలేదు. ఇంద్రుడు సూర్యుని భజించదలచినాడు. సారథివంటి కుత్సుని తన రథమును విస్తరింపచేయుమన్నాడు.

6. ఇంద్రుడు ప్రాణులకు ఉపద్రవము కలిగించు నముచి అసురుని మస్తకమును చూర్ణము చేసినాడు. 'సప' పుత్రుడు 'నమి' ని రక్షించుటకుగాను పశువులు మున్నగు ధనమును, అన్నమును ప్రసాదించినాడు. అప్పుడు శ్యేనపక్షి ఇంద్రుని కొఱకు మాదక సోమము తెచ్చి ఇచ్చినది.

అపాం ఫేనేన నముచి జలముల నురుగు నముచి, "పాప్మావై నముచిః" పాపమే నముచి.

(నామీసాప్య - నముచితో తలపడినవాడు. పంచవింశ బ్రాహ్మణమున విదేహరాజుగా చెప్పబడినాడు)

7. వజ్రధర ఇంద్రా ! 'పిప్రు' అసురుడు మాయావి. వాని దుర్గములను నీవు నీ బలమున బ్రద్దలు కొట్టినావు. శోభన దానసంపన్న ఇంద్రా ! హవ్యరూప ధనము సమర్పించు ఋజిశ్వునకు అనంత ధనము ప్రసాదించినావు.

("పిప్రు" పదము 'పృ' ధాతుజన్యము. అట్లు "పిప్రు" అవరోధములు కలిగించువాడు అగును. ఇంద్రుడు ఋజశ్వుని కొఱకుగాను పిప్రుని అనేకమార్లు పరాజితుని చేసినాడు.

ఋజిశ్వుడు విదథివంశపురాజు. ఇది అస్పష్టమగు ప్రాచీన నామము. అతడు పిప్రుని వధించుటకు ఇంద్రునకు సాయము చేసినట్లు చెప్పబడినది)

8. ఇంద్రుడు అభిలషిత సుఖప్రదాత. అతడు 'ద్యోతను'ని వద్దకు వెళ్లదలచినాడు. వేతసు, దశోణి, తూతిజ, తుగ్రాసులు అడ్డముగా నిలిచినారు. తల్లికి పుత్రుడు వశీభూతుడయినట్లు ఇంద్రుడు ఆయా అసురులను వశీభూతులను చేసికొన్నాడు.

(శాయణుడు ద్యోతనుని రాజునుగా పేర్కొన్నాడు. ఈ పదమునకు 'తేజస్వీకరణము' అని అర్థము. ద్యోతనునకు వేతసాది అసురులకున్న వైరము తెలియదు)

9. ఇంద్రుడు అజేయుడు. శత్రువులను పరిమార్చు ఆయుధము ధరించువాడు. తనకు ఎదురయిన వృత్రాది రాక్షసులను హతమార్చినవాడు. శూరుడు రథమును ఎక్కినట్లు ఇంద్రుడు తన అశ్వములను అధిరోహించును. వచన మాత్రమున పూజితులగు ఆ రెండు అశ్వములు ఇంద్రుని వహింపవలెను.

10. ఇంద్రా ! మేము స్తోతలము. నీ రక్షణలు అర్థించుచున్నాము. నవీన ధనము కొరకు నిన్ను భజించుచున్నాము. యజ్ఞద్వేషులగు ప్రజలను బాధించి పురుకుత్సరాజునకు ధనము ప్రదానము చేసినావు. అట్టి నీ ఘనకార్యములను యజ్ఞములందు స్తుతింతుము. నీవు 'శరత్' నామకు అసురుని ఏడు పురములను ధ్వంసము చేసినావు.

11. ఇంద్రా ! కవిపుత్ర ఉశనుడు, ధనాభిలాషి. అతనికి నీవు ప్రాచీన ఉపకారివి. నవవాస్త్వుడను అసురుని వధించినావు. క్షమతాశీల పిత ఉశనుని వద్దకు శత్రువులు అపహరించిన పుత్రుని చేర్చినావు.

(కావ్య ఉశనుడు ఋగ్వేదమున ప్రాచీనద్రష్ట. తరువాత అసురుల పురోహితుడు అగును.)

12. ఇంద్రా ! నీవు శత్రు కంపనుడవు. ధుని అను అసురుడు జలములను కట్టి పెట్టినాడు. నీవు ఆ జలములను విడిపించినావు. ప్రవహింప చేసినావు. నీవు సముద్రములను దాటిపోయినపుడు యదు, తుర్వశులను సముద్రము దాటించినావు.

13. ఇంద్రా ! యుద్ధములందు, ధుని, చుమురి అసురులను హతమార్చినావు. అప్పుడు హవ్యపాకము చేయువాడు, ఇంధనస్వామి, నీ కొఱకు సోమభిషవము చేయు రాజు "దభీతుడు" హవిరూప అన్నము సమర్పించి నిన్ను ప్రదీప్తుని చేసినాడు.

## ఇరువది ఒకటవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. శూరఇంద్రా ! బహుకార్యాభిలాషియు, స్తోతయు అగు భరద్వాజుని ప్రశంసనీయ స్తుతులు నిన్ను

ఆహ్వానించును. ఇంద్రుడు రథారూఢుడు. జరారహితుడు. నవీనతరుడు. శ్రేష్ఠములగు ఐశ్వర్యములు ఇంద్రుని అనుసరించును.

2. ఇంద్రుడు అందరు ఎరిగినవాడు. స్తుతులద్వారా ప్రాపణీయుడు. యజ్ఞములద్వారా ప్రవర్ధమానుడు. అట్టి ఇంద్రుని మేము స్తుతింతుము. ఇంద్రుడు అనంత ప్రజ్ఞావంతుడు. అతని మాహాత్మ్యము ద్యావాపృథ్వులను అతిక్రమించును.

3. వృత్రుడు విస్తీర్ణము, అప్రకాశితమగు అంధకారమును పరచినాడు. ఇంద్రుడు సూర్యుని ద్వారా ఆ అంధకారమును ప్రకాశింప చేసినాడు. ఇంద్రా ! నీవు బలశాలివి. అమరుడవు. మానవులు నీనివాసమగు స్వర్గమును సర్వదా భజింతురు. వారు ఏ ప్రాణినీ హింసించరు "యక్షన్తో న మినన్తి స్వధావః"

4. వృత్రవదాది ప్రసిద్ధ కార్యములు. నిర్వహించిన ఇంద్రుడు ఇప్పుడు ఎక్కడ ఉండును? ఏ దేశమున ఉండును? ఏ ప్రజల మధ్య ఉండును? ఇంద్రా ! ఏవిధమగు యజ్ఞము నీ చిత్తమునకు సుఖకరమగును? నిన్ను ప్రసన్నుని చేయుటకు ఎట్టి మంత్రము సమర్ధమగును? నిన్ను ప్రసన్నుని చేయదగు సమర్థుడు ఎవడు? వాడు ఎటువంటివాడు?

5. బహుకార్యములు నిర్వహించు ఇంద్రా ! పూర్వకాలపు అంగిరాదులు నేటివారివలెనే పనులు చేయుచునే నీ స్తోతలయినారు. మధ్యకాలపువారు, నవీనులు కూడ నీ స్తోతలు అయినారు. బహుజన ఆహూత ఇంద్రా ! ఆర్వాచీనుడనగు నా స్తుతిని ఆలకింపుము.

6. ఇంద్రా ! నీవు శూరుడవు. మంత్రములతో ప్రాపణీయుడవు. అర్వాచీనులు నీ సుగుణములను అర్చింతురు. ప్రాచీనములగు నీ ఘనకార్యములను స్తోత్రములందు కట్టిపెట్టెదరు. నీవు చేసిన కార్యములలో మాకు తెలిసిన వానినే మేము అర్చింతుము. ఇంద్రా ! నీవు మహామహుడవు.

7. ఇంద్రా ! రాక్షసుల బలము నీముందు నిలిచి ఉన్నది. ప్రాదుర్భూతమగు ఆ మహాబలము ముందు స్థిరముగా నిలువుము. స్థిరముగా నిలిచి, నీ వజ్రమున, ఆ బలమును ఓడింపుము. నీ వజ్రము పురాతనము, యజనీయము. నిత్య సహాయకము.

8. ఇంద్రా ! నీవు వీరుడవు. స్తోతలను పోషించువాడవు. మా స్తోత్రములను త్వరగా వినుము. మేము ఆధునికులము నిన్ను స్తుతించు కోరిక గలవారము. యజ్ఞమున శోభన ఆహ్వానవంతుడవై అంగిరులకై చిరకాల బంధువవు అయినావు. కావున ఇప్పుడు మా స్తుతులను ఆలకింపుము.

9. భరద్వాజా ! నీవు ఇప్పుడే మా తృప్తికొఱకును, రక్షణల కొఱకును రాజ్యాభిమాని వరుణుని, దానాభిమానులు మిత్ర, ఇంద్ర, మరుద్గణ, పూష, సర్వవ్యాపి విష్ణు, బహుకర్మకారి అగ్నిని, ఓషధుల దేవతను, పర్వతములను స్తుతించుము. వారిని అభిముఖులను చేయుము.

10. ఇంద్రా ! నీవు బహుశక్తిమంతుడవు. అతిశయ యజనీయుడవు. స్తోతలు అర్చనీయ స్తోత్రములతో నిన్ను స్తుతింతురు. అమర ఇంద్రా ! స్తూయమానుడవగుము. స్తుతించువారి, నా స్తుతులను వినుము. నీకు సమానుడయిన మరొక దేవత లేడు "అనయో అమృత త్వదస్తి".

11. బలపుత్ర ఇంద్రా ! నీవు సర్వజ్ఞుడవు. నీవు సమస్త యజనీయ దేవతల సహితుడవై నా స్తుతిరూప వచనములకు అభిముఖుడవై విచ్చేయుము. ఎవరు అగ్ని జిహ్వగలవారో ఎవరు యజ్ఞభోజనులో ఎవరు రాజర్షి మనువును శత్రువులను నష్టపరచుటకు దస్యులపైకి పంపినారో వారి సహితముగా విచ్చేయుము.

## ఇరువది రెండవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రుడు ప్రజల ఆపదలందు ఏకమాత్ర ఆహవనీయుడు. స్తోతల వద్దకు వచ్చువాడు. అభీష్టవర్షి. బలశాలి. సత్యవాది. శత్రుహింసకుడు. బహుప్రజ్ఞావంతుడు. అట్టి ఇంద్రుని స్తోత్రములతో స్తుతింతుము.

2. పురాతనులు, నవగ్వులు, సప్తవిప్రులు, మా పితరులు అంగిరాదులు ఇంద్రుని బలవంతుని అన్నవంతునిచేసి స్తుతులద్వారా అతనిని స్తుతించినారు. ఇంద్రుడు గమనశీలుడు, శత్రుహింసకుడు, పర్వతములందు ఉండువాడు, అనుల్లంఘనీయ శాసకుడు.

3. బహుపుత్రయుక్తులమై, పరిచారకుల సహితులమై, పశువులతోకూడ ఇంద్రునివద్ద కేగి అవిచ్ఛిన్న, అక్షయ, సుఖదాయకధనమునకై ప్రార్థింతుము. అశ్వాధిపతి ఇంద్రా ! మమ్ము సుఖవంతులను చేయుటకు అట్టి ధనము ప్రసాదించుము.

4. ఇంద్రా ! పూర్వకాలమున నీ స్తోతలు సుఖలాభము పొందినారు. మాకు సహితము ఆ సుఖములను చూపుము. నీవు దుర్ధర్షుడవు. శత్రువిజయవి. ఐశ్వర్యశాలివి. బహుజన ఆహూతుడవు. అసురహంతవు. నీ కొఱకు యజ్ఞమున ఏ భాగము ఏ హవ్యము సమర్పితమగును?

5. ఇంద్రుడు వజ్రధారి. రథారూఢుడు. ఆశ్రయదాత. బహుకర్మకర్త. బలదాత. యుగాది లక్షణకర్మయుక్తులు. సద్గుణస్తుతులు చేయు యజమానులు అట్టి ఇంద్రుని అర్చింతురు. ఆ యజమానికి సుఖప్రాప్తి కలుగును. శత్రువునకు అభిముఖుడగును.

6. నిజబలమున బలవానుడవగు ఇంద్రా ! నీ వజ్రము మనోవేగవంతము. వేయి గణుపులు కలది. వజ్రాయుధమున

మాయతో పెరిగిన వృత్రుని పరిమార్చినావు. శోభన తేజోవంతుడవగు మహా ఇంద్రా ! నీవు ఘర్షకములు, వజ్రముద్వారా నాశరహితములు, కూలనట్టివి, ధృడములగు అసురపురములను భగ్నము చేసినావు.

7. ఇంద్రా ! పూర్వకాలపు ఋషులవలె నవీన స్తుతుల ద్వారా నీ కీర్తిని పెంపొందింతుము. నీవు అత్యంత బలశాలివి. ప్రాచీనుడవు. అపరిమిత శుభములు వహించు ఇంద్రుడవైన నీవు మమ్ము సమస్త విఘ్నములనుండి కాపాడవలెను.

8. ఇంద్రా ! సాధుద్రోహులైన రాక్షసులను పరిమార్చుటకుగాను ద్యావాపృథ్వులను, అంతరిక్షమును సంతప్తింప చేతువు. కోరికలు తీర్చు ఇంద్రా ! నీ దీప్తితో సర్వత్ర వర్తమానులగు రాక్షసులను భస్మీభూతులను చేయుము. బ్రాహ్మణ ద్వేషి రాక్షసులను కాల్చుటకుగను పృథ్వి, అంతరిక్షములను ప్రదీప్తములు చేయుము.

9. దీప్యదర్శన ఇంద్రా ! నీవు స్వర్గజనులకు, భూలోకవాసులకు ఈశ్వరుడవు. అతిశయ స్తవనీయ ఇంద్రా ! నీవు కుడిచేత వజ్రము ధరించి అసురమాయలను విచ్ఛిన్నము చేసెదవు.

10. ఇంద్రా ! మాకు మహంతము, ఆహింసితము, సంగచ్ఛమనము, కళ్యాణయుక్తమగు సంపద ప్రసాదించుము. అందువలన శత్రువులను బాధింపనలవికాకుండును. నీ కళ్యాణ గుణములతో కర్మహీనులగు మానవులను కర్మ యుక్తులను చేసినావు. మానవశత్రువులను హింసా సంబంధులను చేసినావు.

11. ఇంద్రా ! నీవు బహుజనా హూతుడవు. విధాతవు. అత్యంత పూజనీయుడవు. నీ అశ్వములు అందరిచే పూజింపబడునవి. వాటిమీద మా వద్దకు విచ్చేయుము. నీ అశ్వములను దేవ, మానవులలో ఎవరును నివారింపజాలరు. ఆ అశ్వములపై త్వరత్వరగా మాకు ఎదురేగి రమ్ము.

## ఇరువది మూడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! సోమము అభిషుతమైనప్పుడు స్తోత్రము ఉచ్చరించబడినప్పుడు శాస్త్రము విహితమైనప్పుడు అప్పుడు నీవు రథమున గుఱ్ఱములను పూన్చెదవు. రెండు చేతులందు వజ్రము ధరించి రెండు అశ్వములు లాగు రథమున వచ్చెదవు.

2. ఇంద్రా ! స్వర్గమున శూరులు. తెగించు సంగ్రామమున చేరుదువు. అభిషవకారి యజమానిని రక్షించెదవు. నిర్భీకుడవయి ధార్మికుడు మఱియు సంత్రస్తుడగు యజమానికి విఘ్నములు కలిగించు దస్యులను వశపరచుకొందువు.

3. ఇంద్రుడు అభిషుత సోమపానకర్త. భీషణ ఇంద్రుడు స్తుతి కర్తలకు ఆపదలులేని మార్గమున నడిపించును. యజ్ఞములు చేయుటయందు దక్షుడు, సోమభిషవముచేయు యజమానికి స్థానము కల్పించును. స్తుతించువారికి ధనము ప్రదానము చేయును.

4. ఇంద్రుడు వజ్రధారి, సోమపాయి, గోదాత. మానవులకు హితము కూర్చువాడు. పుత్ర ప్రదాత. స్తోతస్తోత్రములు వినువాడు స్వీకరించువాడు.

ఇంద్రుడు తన అశ్వద్వయముతో హృదయ స్థానీయ మూడు సవనములకు విచ్చేయును.

5. ఇంద్రుడు పురాతనుడు. మా విషయమున పోషణాది కార్యములు నిర్వహించువాడు. ఇంద్రుడు అభిలషించిన స్తోత్రములను ఉచ్ఛరింతుము. సోమము అభిషవించబడినపుడు ఇంద్రుని స్తుతింతుము. ఉక్థము ఉచ్చరించుచు ఇంద్రుని వర్ధిల్లచేయు హవిర్లక్షణ అన్నము సమర్పింతుము.

6. ఇంద్రా ! మా స్తోత్రములను వర్ధిల్ల చేసినావు. సోమాభిషవము అయినపుడు నీ కొరకుగాను నిరతిశయ సుఖదాయకములు, కమనీయములు, హవియుక్తములగు స్తోత్రములను ఉచ్ఛరించుము.

7. ఇంద్రా ! సోమపానము చేయుటకు యజమాని పరచిన కుశలమీద కూర్చుండుము. మోదమునంది మేము అందించు పురోడాశమును స్వీకరించుము. పెరుగు మున్నగునవిగల సోమరసమును వెంటనే త్రాగుము. తరువాత నమ్మిన యజమాని తావరమును పెంపొందించుము.

8. ఉద్యతాయుధ ఇంద్రా ! నీ ఇచ్ఛవచ్చినరీతి మోదించుము. ఈ సోమరసము నీకు అందవలెను. మా స్తోత్రములు మీకు అందవలెను. మమ్ము రక్షించుటకుగాను ఈ స్తుతి నీకు అందవలెను.

9. స్తోతలారా ! సోమము అభిషవింపుడు. ఇంద్రునకు సోమరసము. అతని కోరికతీరునంత అర్పించుడు. ఇంద్రుడు మనసు పోషించునంతటి సోమము స్వీకరించవలెను. ఇంద్రుడు అభిషణశీల యజమాని సుఖములకు ఆటంకము కలిగించడు.

10. సోమాభిషవము జరిగినంత హవిరూప ధనవంతుడు. యజమానికి ఈశ్వరుడగు ఇంద్రుడు స్తోతలకు సన్మార్గము చూపవలెను. ఆశించిన ధనము ప్రసాదించవలెను. అది గ్రహించియే భరద్వాజుడు స్తుతించినాడు.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగువ అష్టకము ఆరవ మండలమున నాలుగువ అధ్యాయమున రెండవ అనువాకము సమాప్తము)

**మూడవ అనువాకము          ఇరువది నాలుగవ సూక్తము**

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. సోమవంతమగు యజ్ఞమున ఇంద్రుడు సోమపానము చేయవలెను. హర్షించవలెను. ఆ హర్షమును యజమాని కోరికలు తీర్చవలెను. వైదికోపాసన సహితస్తోత్రము ఫలప్రదాత కావలెను. అభిషుత సోమపానము చేయు ఇంద్రుడు రసము తగ్గిన సోమమును త్యజించడు. ఇంద్రుడు ధనశాలి. అతడు స్తుతికారుల స్తుతులతో అర్చనీయుడు. ద్యులోకవాసి, స్తుతులకు అధిపతి, ఇంద్రుడు రక్షకుడగును.

2. ఇంద్రుడు శత్రుహింసకుడు. పరాక్రమశాలి. మానవహితకర్త. వివేకశాలి, మా స్తోత్రములు వినువాడు. మమ్ము రక్షించువాడు. గృహ ప్రదాత. స్తోతలచేప్రశంసనీయుడు. స్తోతలను భరించువాడు. అట్టి ఇంద్రుడు యజ్ఞమున స్తుతులు వినును. మాకు న్నప్రదానము చేయును.

3. విక్రాంతుడవగు ఇంద్రా ! చక్రద్వయమునకు అక్షమువలె నీ అపారమహిమ ద్యావాపృథ్వులను అతిక్రమించును. చెట్టు కొమ్మలవలె నీ రక్షణకార్యము వర్ధిల్లును.

("అక్షో యథాచక్రాభ్యాం బహిర్గతః" అని శాయణుడు. చక్రమును దాటి ఉండు అక్షము ఇరుసు చక్రము తిరుగుటకు ఉపకరించును. అట్లే ఇంద్రుడు ద్యావాపృథ్వుల నడకకు కారణమై వాటిని దాటును)

4. ఇంద్రా ! నీవు బహు కర్మివి. ప్రజ్ఞావంతుడవు. గోవుల మార్గములు సర్వత్రకాననగునట్లు నీ శక్తియుక్తులు సర్వత్ర కనిపించును. దూడలకు పలుపులవంటి అనిరుద్ధమగు నీ శక్తులు అనేకమంది శత్రువులను కట్టివేయును.

5. ఇంద్రుడు నేడు ఒకపని చేయును. మరుసటి రోజు అంతకన్న విలక్షణ కార్యము చేయును. మరల మరలు సత్, అసత్ కార్యములను అనుష్ఠించును. ఇంద్ర, మిత్ర, వరుణ, పూష, సవితలు ఈ యజ్ఞమున మా కోర్కెలు తీర్చవలెను.

6. పర్వత శిఖరములనుండి నీరు లభించినట్లు ఇంద్రా ! నీవద్దనుండి శస్త్రములు, హవిద్వారా యజమానులు తమ కోరికలను పండించుకుందురు. స్తుతులతో వందనీయుడవగు ఇంద్రా ! యుద్ధమున గుఱ్ఱములు వడివడిగా పరిగెత్తినట్లు నిన్ను స్తుతించు, అన్నాభిలాషులగు భరద్వాజాదులు స్తుతులతో నీవద్దకు వడివడిగా చేరుదురు.

7. "న యం జరన్తి శరదో న మాసా న ద్యావ ఇంద్ర మవ కర్శయంతి" సంవత్సరములు, మాసములు ఇంద్రుని వృద్ధుని చేయజాలవు. దినములు ఇంద్రుని దుర్బలుని చేయజాలవు. అట్టి ప్రవర్ధమానమగు ఇంద్రుని దేహము మా స్తుతులు, స్తోత్రములచే స్తూయమానమై వర్ధిల్లవలెను.

8. మా స్తోత్రములతో స్తుతించబడిన ఇంద్రుడు దృఢగాత్రుడు. సంగ్రామమున చలించనివాడు. యజమాని ఎంతటి గుణవంతుడయినను దస్యుసహితుడు అయినపుడు ఇంద్రుడు మెచ్చడు. మహాపర్వతములు సహితము ఇంద్రునకు సుగమములు, అగాధములు సహితము అతనికి అవలీలలు. "గంభీరోచిద్భవతి గాధమస్మై"

9. బలశాలివి, సోమపానకర్తవగు ఇంద్రా ! ఎవరి ద్వారాగాని మాకు ఉదార చిత్తమున అన్నము, బలము ప్రదానము చేయుము. రాత్రింబవళ్లు మా రక్షాతత్పరుడవగుము.

10. ఇంద్రా ! సంగ్రామమున స్తుతికర్తను రక్షించుటకుగాను అతనిని అనుగ్రహింపుము. దూరపు దగ్గరి శత్రువులనుండి అతనిని రక్షింపుము. ఇంటిలోకాని అడవులందుగాని శత్రువులనుండి రక్షింపుము. మేము శోభన పుత్రవంతులమై నూరు సంవత్సరములు మోదించవలెను. "మదేమ శతహిమాః సువీరాః"

## ఇరవది అయిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. బలవంతుడవగు ఇంద్రా ! సంగ్రామమున మమ్ము అధమ, మధ్యమ, ఉత్తమ భేదములేక అందరిని నీ రక్షణలతో పాలింపుము. భీషణ ఇంద్రా ! నీవు మహానుడవు. మాకు భోజ్యసాధన అన్నములు అందించుము.

2. ఇంద్రా ! మా స్తుతులను వినుము. మా సైన్యము శత్రుసేనను నష్టపరచగలది. నీవు దానిని రక్షింపుము. యుద్ధమునకు వచ్చిన శత్రువు కోపమును పోగొట్టుము. యజ్ఞాదికార్యములు నిర్వహించు యజమానులకుగాను వారి కార్యములు చెరచు సమస్త జనులకు నష్టపరచుము.

3. ఇంద్రా ! శత్రువులు జ్ఞాతిరూపులగుదురు. దగ్గరి వారు దూరపువారగుదురు. వారు మాముందుకురారు. మమ్ము బాధించుటకు ఉపక్రమింతురు. అట్టి శత్రువుల బలమును నష్టపరచుము. వారి వీర్యమును నష్టపరచుము. వారిని పరాంగ్ముఖులను చేయుము.

4. ఇద్దరు విరోధులు సంగ్రామమున ఎదురు పడినప్పుడు పుత్ర, పౌత్ర, ధేను, జల, భూమి కొరకు కల్లోలము సృష్టించి వివాదమునకు దిగినప్పుడు అప్పుడు ఇంద్రుడు అనుగ్రహించినవాడు శత్రువీరులను నష్టపరచును.

(సుమారుగా వివాదకారణములనన్నింటిని పేర్కొన్నాడు)

5. ఇంద్రా ! విక్రాంతులు, శత్రునిహంతలు, విజేతలు, యుద్ధమున ప్రకుపిత యోద్ధలు ఎంతటి వారయినను నీతో

యుద్ధముచేయ సమర్థులుకారు. వారిలో ఎవరును నీకు సాటివచ్చువారు కారు. వీరందరని మించిన శ్రేష్ఠతముడవు.

6. మహా శత్రువును నిరోధించుటకు పరిచారక సహితగృహముకొఱకో ఇద్దరు వ్యక్తులు ఘర్షణ పడినప్పుడు యజ్ఞమున ఋత్విక్కులు ఇంద్రునకు హవి సమర్పించినవానికే జన, ధన లాభము కలుగును.

7. ఇంద్రా ! నిన్ను స్తుతించినవాడు బెదిరినపుడు వానిని రక్షింపుము పాలింపుము. మా నేతృతమ పురుషులలో నిన్ను అందుకొనగలవారికి త్రాతవగుము. మమ్ము ముందు నిలిపిన స్తోతలను కాపాడుము.

8. ఇంద్రా ! నీవు మహామహుడవు. శత్రువధకుగాను నీకు సమస్త శక్తులు అర్పించబడినవి. యుద్ధమున దేవతలందరు నీకు శత్రువును పరాభవించునదియు లోకములను భరించునట్టిదియునగు బలమును ప్రదానము చేసినారు.

9. ఇంద్రా ! ఈ రీతిన స్తుతించబడిన నీవు యుద్ధమున మమ్ము శత్రువు పైబడుటకు ప్రోత్సహించుము. ప్రేరేపింపుము. మా కొఱకుగాను హింసించు అసురసేనను వశపరచుకొనుము. మేము భరద్వాజులము. నిన్ను స్తుతించువారలము. మాకు అన్నముతోసహా అవశ్యము నివాసము లభించవలెను.

## ఇరువది ఆరవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! మేము స్తోతలము. అన్న లాభము కొఱకు సోమరసమున నిన్ను ఆర్ద్రుని చేతుము. ఆహ్వానింతుము. మా పిలుపు వినుము. మానవులు యుద్ధమునకు సాగినపుడు నీవు మమ్ము భద్రతరముగ రక్షింపుము.

2. ఇంద్రా ! నీవు అందరకు ప్రాపణీయుడవు. మహా అన్న లాభమునకుగాను వాజినీపుత్రుడు భరద్వాజుడు అన్నవంతుడై నిన్ను స్తుతించుచున్నాడు. నీవు సాధుజనుల పరిత్రాతవు. దుర్జన వినాశకుడవు. ఉపద్రవము కలిగినపుడు భరద్వాజులు నిన్ను ఆహ్వానింతురు. వారు ముష్టి ఘాతముల శత్రువును నష్టపరచగలవారు. గోవుల కొఱకు యుద్ధము కలిగినప్పుడు నీ మీద నిర్భరులగుదురు.

3. ఇంద్రా ! అన్న లాభమునకుగాను భార్గవ ఋషిని ప్రోత్సహించుము. హవ్యదాత 'కుత్సుని' కొఱకు అసుర శుష్ణుని వధించినావు. దివోదాసుని సుఖవంతుని చేయుటకు శంబరుని తల త్రుంచినావు. వాడు తనను దుర్భేద్యుడనుకున్నాడు.

4. ఇంద్రా ! 'వృషభ' రాజునకు యుద్ధసాధన మహారథమును ఇచ్చినావు. అతడు శత్రువులతో పది రోజులు యుద్ధము

చేసినపుడు అతనిని రక్షించినావు. 'వేతసు' నకు సాయము చేసి 'తుగ్రా' సురుని వధించినావు. స్తవకర్త తుజిరాజు సమృద్ధిని మరింత పెంపు చేసినావు.

5. ఇంద్రా ! నీవు శత్రునిహంతవు. అనెక్ ప్రశంసనీయ కార్యములు చేసినావు. వందల-వందల, వేల వేల శంబరుని సేనలను చెదరగొట్టినావు. పర్వతము నుండి వెడలినవాడును యజ్ఞాదికార్య విఘాతకుడగు శంబరాసురుని వధించినావు. విచిత్రముగా దివోదాసును రక్షించినావు.

6. ఇంద్రా ! నీవు శ్రద్ధా పూర్వక అనుష్ఠానమునను సోమపానమునను ముదితుడవయి 'దభీతి' కొఱకు చుమురాసురుని వధించినావు. 'పిఠీనసు' నకు రజినామక కన్యను ప్రదానము చేసినావు. బుద్ధి బలమున అరువదివేల యోద్ధలను ఏకకాలమున కూల్చినావు.

(పిఠినసుడు ఇంద్రుని మిత్రునిగా చెప్పబడినాడు)

7. వీరులతోటివాడవు, బలవత్తముడవగు ఇంద్రా ! నీవు త్రిభువన రక్షనుడవు. శత్రువిజేతవు. స్తోతలు నీవు ప్రసాదించిన సుఖమును, బలమును కీర్తింతురు. మేము భరద్వాజులము, నీవు ప్రసాదించిన ఉత్కృష్ట సుఖమును, బలమును సాటి స్తోతలతో కలిసి అనుభవింతుము.

8. పూజనీయ ఇంద్రా ! మేము నీ మిత్రభూతులము. స్తోతలము. ఈ స్తోత్రములు ధనలాభము కొఱకు చేయబడినవి. వీటిద్వారా మేము నీకు నిరతిశయ ప్రీతిపాత్రులము కావలెను. ప్రాతర్దన పుత్రుడు మాకు రాజగు క్షత్రశ్రీ శత్రువులను వధించి ధనలాభము పొంది అందరిలో ఉత్కృష్టుడు కావలెను.

## ఇరువది ఏడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. సోమరసమున ప్రసన్నుడై ఇంద్రుడు ఏమి చేసినాడు? ఈ సోమరసమును త్రావి ఏమి చేసినాడు? ఈ సోమరసముతో మైత్రిచేసి ఏమి చేసినాడు? పురాతనులు, ఆధునాతనులగు స్తోతలు సోమగృహమున నీ వలన ఏమి పొందినారు?

("భరద్వాజృషిః ఫలవిలంబనాసహిష్ణుఃసన్ అనయేంద్ర మాక్షిపతి" అని శాయణుడు. భరద్వాజునకు ఫలప్రాప్తిలో జాగు జరిగినందున ఇంద్రుని ఆక్షేపించుచున్నాడు. "ఎవడబ్బసొమ్మని" రామదాసు రాముని సరిగ్గా ఈ కారణముననే ఆక్షేపించినాడు)

2. సోమపానమున ప్రముదితుడయిన ఇంద్రుడు శుభ సుందర కార్యములు చేసినాడు. సోమరసపానముచేసి సుందరకర్మలు చేసినాడు. దానితో అతడు శుభకార్యములు చేసినాడు. పురాతన, అధునాత స్తోతలకు యజ్ఞగృహమున శుభకర్మలు ప్రసాదించినాడు.

("ఏవమాక్షిప్త ఇంద్రః తస్మై ఋషయే ఈప్సితం ధనం ప్రదదౌ తదనంతరం ఋషిః" శాయణుడు. ఆవిధముగ ఆక్షేపించగా ఇంద్రుడు ఆ ఋషికి కోరిన ధనము ఇచ్చినాడు. తరువాత ఋషి అన్నమాటలివి)

3. ధనవంతుడవగు ఇంద్రా ! నీ సమాన మహిమగల వాడు మాకు కనిపించడు. నీ సమాన ధనవంతుడు మాకు కనిపించడు. నీకు సరివచ్చు సమర్థుడు మాకు కనిపించడు.

4. ఇంద్రా ! నీవు 'వరశిఖాసురు' ని పుత్రులను వధించినతీరు మాకు అవగతము కాలేదు. బలపూర్వక నిక్షిప్తమగు నీ వజ్రధ్వని మాత్రమునకే బలిష్టతములగు వరశిఖ పుత్రులు అసువులు బాసినారు.

5. ఇంద్రుడు చయమానరాజుయొక్క అభ్యవర్తినామక పుత్రునకు ధనప్రదానము చేయుచు వరశిఖాసురుని పుత్రులను వధించినాడు. 'హరియూప' నది లేక నగరపు పూర్వ భాగమున వసించిన వరశిఖగోద్రజుడగు 'వృచీవాన్' పుత్రులను ఇంద్రుడు పరిమార్చినాడు. అప్పుడు ఉపరిభాగమున ఉండి వరశిఖుని శ్రేష్ఠపుత్రులు ఆ భయమున చచ్చినారు.

6. బహుజన ఆహూత ఇంద్రా ! యుద్ధమున నిన్ను గెలిచి అన్నము, యశము సాధించదలచినవారు, యజ్ఞపాత్రలను భగ్నము చేసినవారు, కవచములు ధరించినవారగు వరశిఖుని నూటముప్పది మంది పుత్రులు యవ్యావతి హరియూపియ వద్దకు వచ్చి ఏకకాలమున నిహతులయినారు.

7. ఇంద్రుని అశ్వములు రోచమానములు. శుభంకరులు. తృణాభిలాషులు. తేపతేప గడ్డి రుచి చూచునవి. అవి ద్యావాపృథ్వుల మధ్య సంచరించును. ఇంద్రుడు సృంజయరాజువద్దకు తుర్వశరాజును చేర్చినాడు. దేవవాక్ వంశజుడు 'అభ్యవర్తి' రాజు వద్ద వరశిఖ పుత్రులను వశీభూతులను చేసికున్నాడు.

8. అగ్నీ ! మరింత ధనము ఇచ్చువాడు. రాజసూయము చేసినవాడు. చయమాన పుత్రుడు. అభ్యవర్తి మాకు భరద్వాజునకు స్త్రీల సహితముగా రథములు ఇరువది ఆవులు ఇచ్చియున్నారు. వృధువంశధరుడు రాజు అభ్యవర్తియొక్క ఈ దక్షిణ అవినాశ్యము.

## ఇరవది ఎనిమిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు 2,3 జగతి, మిగిలినవి అనుష్టుప్.

1. గోవులు మా ఇంటికి రావలెను. మాకు శుభములు కూర్చవలెను. అవి మా కొట్టమున విశ్రమింపవలెను. మా విషయమున ప్రసన్నులు కావలెను. ఈ కొట్టమున వివిధ వర్ణములు గోసంతతి కూడినది. ఆ గోవులు ఉషఃకాలమున ఇంద్రునకు పాలు ప్రదానము చేయవలెను.

2. ఇంద్రుడు యజ్ఞము చేయువారలకు, స్తోత్రములు చేయువారలకు కోరినంత ధనము ఇచ్చును. అతడు వారికి సర్వదా ధనము ఇచ్చును. అతడు వారి స్వంత ధనమును తీసికొనడు. ఇంద్రుడు నిరంతరము వారి ధనమును పెంచును. వారిని ఆ ఇంద్రాభిలాషులను శత్రువులకు దుర్భేద్యమగు స్థానమున నిలుపును.

3. గోవులు మా వద్ద నష్టపడరాదు. దొంగలు మా గోవులను దొంగిలించరాదు. శత్రువుల ఆయుధములు మా గోవులమీద పడరాదు. గోవులుగల యజమాని ఇంద్రాది దేవతలకు యజనముచేసిన గోవులు ఇంద్రునకు ఇచ్చిన గోవులతో చిరకాలము సంబంధము కలిగి ఉండవలెను.

4. దుమ్ము రేపుచు, యుద్ధమునకుసాగు అశ్వములు గోవులను చేరరాదు. అవి విశ్వసనాది సంస్కారములు పొందరాదు. యాగశీల నరుని గోవులు నిర్భయముగా స్వేచ్ఛగా సంచరించును.

5. గోవులు మాకు ధనము కావలెను. ఇంద్రుడు మాకు గోవులను ఇవ్వవలెను. గోవులు హవ్య శ్రేష్ఠసోమరస భక్షణ ప్రదానము చేయవలెను. నరులారా !! గోవులే ఇంద్రుడగును శ్రద్ధగల మనమున గోవులను కోరండి.

6. గోవులారా! మాకు పుష్టిని ఇవ్వండి. మీ క్షీణము, అమంగళ అవయములను సుందరముగా మలచండి. శుభవచన గోవులారా ! మా ఇంటికి శుభములు సమకూర్చండి. యాగసభలో మీ మహా అన్నమే కీర్తించబడును.

7. గోవులారా ! మీరు సంతానయుక్తులుకండు. చక్కని గడ్డి మేయండి. నిర్మల తటాకజలము త్రాగండి. హింసించు జంతువులు మీమీద పడరాదు. కాల కుఠారము మీకు దూరముగా ఉండవలెను.

8. ఇంద్రా ! నీకు బలము కలుగుటకు గోవులకు పుష్టి కలుగవలెనని ప్రార్థింతుము. గోవులకు గర్భాదానము చేయు వృషభములు బలము కలవి కావలెనని ప్రార్థింతుము. అందువలన గోవులక్షీరాదికములతో ఇంద్రుడు సంతుష్టుడగును.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగవ అష్టకము ఆరవ మండలమున నాలుగువ అధ్యాయమున ఆరవ అధ్యాయము సమాప్తము)

*ఓం నతామినన్తిమాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రవాణి*
*నరోదసీ అద్రుహా వేద్యాభిర్న పర్వతావి నమే తస్థివాంసః*

**ఏడవ అధ్యాయము ఇరువది తొమ్మిదవ సూక్తము**

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. యజమానులారా ! మీ నేతృస్వరూప ఋత్విక్కులు స్నేహభావమున ఇంద్రుని సేవింతురు. వారు మహాస్తుతులు ఉచ్ఛరింతురు. వారి బుద్ధి శుభంకరము. అనుగ్రహాత్మకము. ఇంద్రుడు మహాధనప్రదాత. అందుకే రక్షణలకుగాను రమణీయుడగు మహా ఇంద్రుని పూజింతురు.

2. ఇంద్రుని చేత మానవహితకర ధనము సంచితమై ఉన్నది. ఇంద్రుడు రథారూఢుడు. అతడు బంగారు రథము ఎక్కును. అతని విశాల బాహువులందు కిరణములు నిలిచి ఉన్నవి. ఇంద్రుని అశ్వములు బలిష్ఠములు అవి రథమునకూడి ఇంద్రుని వహించును. అట్టి ఇంద్రుని మేము స్తుతింతుము.

3. ఇంద్రా ! ఐశ్వర్యలాభమునకుగాను భరద్వాజుడు నీ పాదసేవ చేయుచున్నాడు. నీవు నీ బలమున శత్రువులను పరాజితులను చేయుదువు. వజ్రము ధరింతువు. స్తోతలకు ధనము ప్రదానము చేసెదవు.నేతవగు ఇంద్రా ! అందరి దర్శనార్థము నీవు ప్రశస్తము, సతత గమనశీల రూపము ధరించుము. సూర్యునివలె పరిభ్రమణశాలిని అగుము.

4. సోమము అభిషుతముకాగా చక్కని మిశ్రమము అగును. సోమము అభిషుతముకాగా పాకయోగ్యములగు పురోడాశాదులు వండబడును. వేపిన యవలు పేలాలుకావచ్చును. సంస్కరింపబడును. హవిర్లక్షణ అన్నకర్తలగు ఋత్విక్కులు స్తోత్రములతో ఇంద్రుని స్తుతింతురు. వారు శాస్త్రములను ఉచ్ఛరించుచు దేవతల వద్దకు వెళ్లుదురు.

5. ఇంద్రా ! నీ బలము అపారము. ద్యావాపృథ్వులు నీ మహాబలమునకు బెదురుదురు. గోపాలుడు నీరు త్రాగించి గోవులను తృప్తిచెందించినట్లు స్తోతలు వెంటనే తృప్తినిచ్చు హవ్యముతో యజ్ఞముచేసి నిన్ను తృప్తుని చేస్తారు.

6. అందమగు ముక్కు, దవడలుగల ఇంద్రుడు ఈవిధముగా ఆహ్వానించ యోగ్యుడు. ఇంద్రుడు స్వయముగా వచ్చినను, రాకున్నను స్తోతలకు ధనము ప్రదానము చేయును. ఉత్కృష్టతర బలశాలి ఇంద్రుడు వృత్రాది అనేక రాక్షసులను, శత్రువులను పరిమార్చును.

**ముప్పదవ సూక్తము**

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వృత్రవధాది వీరకార్యములు చేయుటకుగాను ఇంద్రుడు మరల ప్రవృద్ధుడయినాడు. ఇంద్రుడు ప్రధానుడు. జరారహితుడు. అతడు స్తోతలకు ధనము అందించవలెను. అతడు ద్యావాపృథ్వులను అతిక్రమించును. ద్యావాపృథ్వులు రెండు ఇంద్రునకు సగము భాగమే అగును !

2. ఇంద్రుని బలము అసురులను హతమార్చగలది. మేము ఇప్పుడు ఇంద్రుని బలమును స్తుతించుచున్నాము. ఇంద్రుని మహాకార్యములను ఎంతటివాడును బాధింపజాలడు. అతడు నిత్యము తిరిగు సూర్యుని దర్శనీయుని చేసినాడు. శుభకర్మలు చేయు ఇంద్రుడు భువనములను విస్తీర్ణము చేసినాడు.

3. ఇంద్రా ! తొలినాటివలె నేడును నదులకు సంబంధించిన నీ కార్యము కొనసాగుచున్నది. నదులు పారుటకు నీవే బాటలు వేసినావు. భోజనమునకు స్థిరముగా కూర్చున్న మానవులవలె నీ ఆ దేశమున పర్వతములు నిశ్చలములై నిలిచినవి. శుభ కర్మలు చేయు ఇంద్రా ! సమస్త లోకములు నీవలననే స్థిరములు అయినవి.

4. ఇంద్రా ! నీ సదృశుడు మరొకడు లేడు. నీ సదృశుడగు దేవతలేదు. నరుడు లేడు. ఈ మాటలు వాస్తవ సత్యములు. జలరాశి ఆక్రమించి పడుకున్న మేఘమును నీవు వధించినావు. సముద్రమున చేరుటకు జలమును నీవు విముక్తము చేసినావు.

5. ఇంద్రా ! వృత్రుడు ఆక్రమించి పెట్టుకున్న జలరాశిని ప్రవహించుటకుగాను విడిపించినావు. మేఘపు దృఢబంధనమును తెంపినావు. సూర్యుడు, ద్యులోకము, ఉష మూడింటిని ఏకకాలమున ప్రకాశితము చేయుము. సర్వజగత్తుల ప్రజలకు ప్రభవవు అగుము.

## ముప్పది ఒకటవ సూక్తము

ఋషి - భరద్వాజ సహోత్రుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్. చివరిది శక్వరి.

1. ఇంద్రా ! నీవు ధనపాలకుడవు. ధనముల ప్రధాన స్వామివి. ఈ సమస్త లోకములు నీ ఆజ్ఞను వర్తనులయి ఉన్నవి. మానవులు పుత్రుని కొఱకు, శత్రువిజేతయగు పౌత్రునికొఱకు, వర్షము కొఱకు నిన్ను వివిధ రీతుల స్తుతించెదరు.

2. ఆకాశమున పుట్టిన మేఘము పతన యోగ్యముకాదు. అయినా ఇంద్రా ! నీ భయమున మేఘములు వర్షించుచున్నవి. నిన్ను చూచినంత ద్యావాపృథ్వులు, పర్వతములు, వృక్షములు, సంపూర్ణ స్థావర ప్రాణిజాలము గడగడలాడును.

3. ఇంద్రా ! కుత్సునకు సాయము చేయుటకుగాను నీవు 'శిష్ణ' నితో యుద్ధము చేసినావు. యుద్ధమున 'కువయు' ని వధించినావు. సంగ్రామమున సూర్యుని రథచక్రమును హరించినావు. అప్పటినుంచి సూర్యుని రథము ఏకచక్రము అయినది. పాపకారి రాక్షసులను వధించినావు.

4. ఇంద్రా ! నీవు దస్యు శంబరాసురుని నూరు నగరములను ఛిన్నాభిన్నము చేసినావు. ప్రజ్ఞావంత, అభిషుత సోమక్షేత్ర ఇంద్రా ! అప్పుడు సోమాభిషవకారి దివోదాసునకు ప్రజ్ఞా పూర్వక ధనము ప్రదానము చేసినావు. స్తుతించు భరద్వాజునకు ధనము ప్రసాదించినావు.

5. అదధ్యభటులు, విపుల ధనముగల ఇంద్రా ! మహా సంగ్రామమునకుగాను నీ భయంకర రథమును అధిరోహింపుము. ప్రకృష్ట మార్గములుగల ఇంద్రా ! నీ రక్షణలతో మావద్దకు విచ్చేయుము. విఖ్యాత ఇంద్రా ! ప్రజలందు మమ్ము ప్రఖ్యాతులను చేయుము.

## ముప్పది రెండవ సూక్తము

ఋషి - భరద్వాజ సహోత్రుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రుడు మహామహుడు. వివిధ శత్రువులను వధించువాడు. బలవంతుడు. వేగవంతుడు. విశేష స్తుతియోగ్యుడు. వజ్రధారి. ప్రవృద్ధుడు. అట్టి ఇంద్రుని కొఱకు అపూర్వములు, సువిస్తీర్ణములు, సుఖదాయకములగు స్తోత్రములను చదివినాము.

2. ఇంద్రుడు మేధావులగు అంగిరులకొఱకు జననీ స్వరూప స్వర్గమును, పృథ్విని సూర్యుని ద్వారా ప్రకాశితము చేసినాడు. అంగరులు స్తుతించగా ఇంద్రుడు పర్వతములను చూర్ణము చేసినాడు. ధ్యానశీల స్తోతలగు అంగిరులు తేపతేపకు ప్రార్థించగా ఇంద్రుడు గోవులను బంధన విముక్తుల చేసినాడు.

3. అంగిరులు హవనము చేయువారు. స్తుతించువారు. సంకుచితజానువులు బహుకర్మకారి అగు ఇంద్రుడు అంగిరులతో కలిసి గోవులకొఱకు శత్రువులను పరాజితులను చేసినాడు. మిత్రభూతులు, మేధావులగు అంగిరులతో కలిసి మిత్రాభిలాషి, దూరదర్శి అగు ఇంద్రుడు అసురపురములను భగ్నము చేసినాడు.

4. కోరికలు తీర్చువాడవును, భజనీయుడవగు ఇంద్రా ! మహా అన్నము, మహాబలము కలిగి, బహువత్సవతి వడవతో కలిసి నీ స్తుతికర్తకు మానవులందు సుఖములు ప్రసాదించుటకు అభిముఖముగా విచ్చేయవలెను.

5. ఇంద్రుడు హింసకుల పరాభవకారి. ఉద్యతబలుడు. సతత గమనశీలుడు. అతడు తన తేజస్సుతో కలిసి సూర్యుని దక్షిణాయనమైనంత మేఘములకు విముక్తము చేయును. ఈవిధముగా విశేష జలరాశి నిత్యము క్షోభశూన్య సముద్రమున పడును. అందువలన జలరాశికి పునరావర్తనము ఉండదు.

## ముప్పదిమూడవ సూక్తము

ఋషి - శునహోత్రుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! నీవు అభీష్టవర్షివి. మాకు పుత్రుని ప్రసాదించుము. ఆ పుత్రుడు బలవత్తముడు, స్తుతికర్త, యజ్ఞకర్త హవ్యప్రదాత కావలెను. అతడు ఉత్తమ అశ్వారూఢుడై, సంగ్రామమున అశ్వసమూహాలను వశపరచుకొని ప్రతికూల ఆచార శత్రువులను పరాభవించువాడు కావలెను.

2. ఇంద్రా ! మానవులు వివిధ స్తుతిరూప వచనములుగలవారు. వారందరును యుద్ధమున రక్షణకుగాను నిన్ను ఆహ్వానింతురు. నీవు మేధావులగు అంగిరులతో కలిసినావు. పణులను సంహరించినావు. నిన్ను భజించువారిని నీవు రక్షింతువు. అన్నలాభము కలిగింతువు.

3. ఇంద్రా ! నీవు వీరుడవు. శూరుడవు. దస్యులు ఆర్యులు ఉభయ శత్రువులను సంహరించినావు. గొడ్డలిపట్టినవాడు చెట్లను కొట్టినట్లు యుద్ధమున అస్త్ర, శస్త్రములతో శత్రువులను నరుకుదువు.

4. ఇంద్రా ! నీవు సర్వత్ర సంచరించువాడవు. మాకు శ్రేష్ఠములగు రక్షణలు కలిగించుము. సమృద్ధిని వృద్ధిపరచుము. మిత్రుడవగుము. మేము కొందరితో యుద్ధము చేయువారము. ధనలాభమునకు నిన్ను ఆహ్వానింతుము.

5. ఇంద్రా ! ఇప్పుడు మరొకప్పుడు ఎప్పుడు నిశ్చయముగా నీవు మావాడవు కావలెను. మాదశను అనుసరించి సుఖములు ప్రసాదించుము. మేము స్తుతించువారము. గోవులను భజించుచు, ద్యుతిమంతములగు నీ సుఖముల చేరుదుము.

(సుఖములు అందరకు ఒక తీరువికావు. వ్యక్తినిబట్టి మారుచుండును. వ్యక్తికి సహితము దశనుబట్టి సుఖము మారును. ఆకలిలేనపుడు ఆకలి, అన్నములేనపుడు అన్నము, ఆరోగ్యములేనప్పుడు ఆరోగ్యము సుఖములగును)

## ముప్పది నాలుగవ సూక్తము

ఋషి - శూనహోత్రుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! అసంఖ్యాకములగు స్తోత్రములు నిన్ను చేరుచున్నవి. నీవు స్తోతలను తగినంత ప్రశంసింతువు. పూర్వకాలముననూ, ఇప్పుడును నిన్ను పూజించు విషయమున ఋషులలో స్తోత్రము ఉపాసన మంత్రము అను అభిప్రాయ భేదములు ఉన్నవి.

2. ఇంద్రుడు బహుజన ఆహూతుడు. ప్రశంసితుడు. మహామహుడు. అద్వితీయుడు. యాజమానస్తుతుడు. మేము సర్వదా ఇంద్రుని ప్రసన్నుని చేయుదుము. మహాలాభమునకుగాను రథమువలె ఇంద్రునకు అనురక్తులము కావలెను. ఇంద్రుని స్తుతించవలెను.

3. సమృద్ధి కలిగించు స్తోత్రములు ఇంద్రుని చేరవలెను. కర్మలు స్తుతులు ఇంద్రుని బాధించరాదు. లక్షల స్తవకారి. స్తుతి భాజనుడగు ఇంద్రుని స్తుతించి ప్రీతుని చేతుము.

4. ఈ యజ్ఞ దినమున స్తోత్రమువంటి పూజ సహితముగా సమర్పించుటకు మిశ్రిత సోమము ఉన్నది. ఊషర క్షేత్రమునకు సాగు నీరు ప్రాణులను పోషించినట్లు హవ్య సహిత స్తోత్రము ఇంద్రుని ముదావహుని చేయును.

5. సర్వత్ర సంచరించు ఇంద్రుడు యుద్ధమున మాకు రక్షకుడు, సమృద్ధిదాయకుడు కావలెను. స్తోతల స్తోత్రములు వారి కోరికలు సహితముగా ఇంద్రునకు అందవలెను.

## ముప్పది అయిదవ సూక్తము

ఋషి - నరస్యుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! రథారూఢుడవగు నీవద్దకు మా స్తోత్రము ఎప్పుడు చేరును? స్తోత్రముచేయు నాకు వేయి పురుషుల గోసమూహము లేక పుత్రులను ఎప్పుడు ప్రసాదింతువు? నా స్తోత్రములకు ఎప్పుడు ధనపురస్కారము ప్రదానము చేతువు? అగ్నిహోత్రాది కార్యములను ఎప్పుడు అన్నమును రమణీయము చేయుదువు?

2. ఇంద్రా ! మా పురుషులతో శత్రు పురుషులను - మా పుత్రులతో శత్రుపుత్రులను ఎప్పుడు కలిపెదవు? యుద్ధమున మాకు ఎప్పుడు జయము కలిగింతువు? శత్రువులనుండి పాలు, పెరుగు, నేయి, ధరించిన గోవులను ఎప్పుడు జయింతువు? మాకు వ్యాప్త ధనమును ఎప్పుడు ప్రసాదింతువు?

3. బలవత్తను ఇంద్రా ! స్తోతలకు వివిధ అన్నములను ఎప్పుడు ప్రదానము చేస్తావు? నీలో స్తోత్రమును, యజ్ఞమును ఎప్పుడు యుక్తము చేస్తావు? స్తోత్రములను ఎప్పుడు గోదాయకములను చేస్తావు?

4. ఇంద్రా ! మేము భరద్వాజ పుత్రులము. నిన్ను స్తుతించువారలము. మాకు గోదాయకము, అశ్వదాయకము, బలదాయకమగు అన్నమును ప్రసాదించుము. అన్నములను, సులభముగా పితుకదగు ఆవులను పరిపుష్టము చేయుము. ఆ గోవులు శోభన దీప్తివంతములగునట్లు చేయుము.

5. ఇంద్రా ! మా శత్రువులకు ఏదోవిధముగా యమపథము చూపుము. నీవు శక్తివంతుడవు. వీరుడవు. శత్రుహంతవని నిన్ను మేము నుతింతుము. నీవు విశుద్ధ వస్తుప్రదాతవు. మేము స్తోత్రములు చదువుటలో నిమగ్నులము.

6. ప్రాజ్ఞుడవగు ఇంద్రా ! అంగిరులను అన్నముద్వారా ప్రసన్నులను చేయుము.

## ముప్పది ఆరవ సూక్తము

ఋషి - నరస్యుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! నీయొక్క సోమపానజనిత హర్షము సమస్త జనులకు హితకరమగును. ఇది నిశ్చయము. దేవతలందు నీవే బలవంతుడవు. ఇది నిశ్చయము.

2. యజమానులు విశేషముగా ఇంద్రుని బలమును అర్పింతురు. వీర కర్మలు చేయుటకుగాను వారు ఇంద్రుని తమముందు ఉంచుకొందురు.

అవిచ్ఛిన్న శత్రుశ్రేణి నిరోధకర్త. హింసాకారుడు ఆక్రమణకారి ఇంద్రుడు వృత్రుని సంహరిస్తాడు. కావున యజమానులు ఇంద్రుని సేవింతురు.

3. మరుద్గణములు కలిసిమెలిసి ఇంద్రుని సేవింతురు. వీర్యము, బలము కలిగిన రథాశ్వములు ఇంద్రుని సేవించును. నదులు సముద్రమున కలసినట్లు ఉపాసనా బలముగల స్తోత్రములు విశ్వవ్యాపి ఇంద్రునిలో విలీనములగును.

4. ఇంద్రా ! స్తూయమానుడవు అనేకులకు అన్నదాయకుడవు. గృహదాయకుడవగుము. వారికొఱకు ధనధారను ప్రవహింప చేయుము. నీవు సమస్త ప్రాణిజాలమునకు ఉత్కృష్ట అధిపతివి. సమస్త భూతజాతములకు అసాధారణ అధీశ్వరుడువు.

5. ఇంద్రా ! శ్రోతవ్య స్తోత్రములను జాగుచేయక వినుము. మా సేవలను కోరుకొనుము. సూర్యునివలె శత్రుధనమును గెలువుము. నీవు బలసంపన్నుడవు. స్తోత్రములు హవ్యముల ద్వారా తెలియబడువాడవు. మా వద్దకు ఇదివరకటి వలెనే విచ్చేయుము.

## ముప్పది ఏడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉద్యతాయుధ ఇంద్రా ! నీ రథాశ్వములు మాముందునకు విశ్వవందనీయమగు నీ రథమును తేవలెను. భరద్వాజుడు గుణవంతుడగు స్తోత. అతడు నిన్ను ఆహ్వానించుచున్నాడు. నీతోబాటు హృష్టులమై మేము వర్ధిల్లుదుము.

2. మా యజ్ఞమునందు హరితవర్ణ సోమరసము ప్రవహించును. అది పవిత్రమై ఋజుభావమున సాగును. పురాతనము, దీప్తిసంపన్నము, మాదకమగు సోమరసమునకు ఇంద్రుడు అధిపతి. ఇంద్రుడు మా సోమరసమును పానము చేయవలెను.

3. నలుదిశల పయనించు రథమున కూడిన సరళశమనములుగల అశ్వములు గట్టి చక్రములుగల రథముమీద బలశాలి అగు ఇంద్రుని మాముందుకు తేవలెను. అమృతమయి సోమలక్షణ హవి గాలికి చెడిపోకుండవలెను.

4. ఇంద్రుడు నిరతిశయ బలశాలి. బహుకార్యరతుడు. హవిరూపధనము సమర్పించు వ్యక్తులతో యజమానికి దక్షిణ ప్రదానము చేయును. వజ్రధర ఇంద్రా ! నీవు దక్షిణలతో పాపములను నశింప చేయుము. శత్రువిజయ ఇంద్రా! మాకు ధనరాశియు, స్తుతికర్తయగు పుత్రుడు లభించునట్టి దక్షిణను ప్రోత్సహించుము.

5. ఇంద్రుడు శ్రేష్ఠ అన్నము, బలముల ప్రదాత. అత్యదిక తేజోవంతుడగు ఇంద్రుడు, మా స్తుతుల ద్వారా మరింత వృద్ధి చెందవలెను. శత్రువులను బాధించు ఇంద్రుడు ఆక్రమణచేసిన శత్రువును సంహరించవలెను. ఇంద్రుడు వేగవంతుడై మాకు సమస్త ధనములు ప్రసాదించవలెను.

## ముప్పది ఎనిమిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఆశ్చర్యతమ ఇంద్రా ! మా పానపాత్రలో సోమరసము త్రాగుము. దీప్తిమంతమగు మా మహా ఆహ్వానమును స్వీకరించుము. దానశీల ఇంద్రుడు ధార్మికుడగు యజమాని యజ్ఞమున అతిశయ స్తుతులు, సేవలు, హవ్యము గ్రహించవలెను.

2. ఇంద్రుని చెవులు దూరదేశపు స్తుతులను సహితము వినగలవు. స్తోతలు ఉచ్చస్వరమున స్తోత్రపాఠము చేస్తారు. ఇది ఇంద్రుని ఆహ్వానించు స్తుతి. ఇది స్వయం ప్రేరితము కావలెను. ఇంద్రుని మా ముందునకు తేవలెను.

3. ఇంద్రా ! నీవు ప్రాచీనుడవు. క్షయరహితుడవు. ఇంద్రునిలో హవ్యరూప అన్నము, స్తోత్రము ఇమిడి ఉన్నవి. ఉత్కృష్టతమ స్తుతి హవ్యములతో ఇంద్రుని అర్చిస్తాము. మహా స్తోత్రము అధిక వర్ధమానమగును.

4. ఇంద్రుని యజ్ఞము సోమరసము వర్ధిల్లచేయును. హవ్యము, స్తుతి, ఉపాసన, పూజ వర్ధిల్ల చేయును. దివారాత్రుల నడకలు వర్ధిల్ల చేయును. మాస, సంవత్సర దినములు వర్ధిల్ల చేయును.

5. మేధావివి అగు ఇంద్రా ! నీవు అట్లు ఆవిర్భవించి సమృద్ధుడవు, బలశాలివి, ప్రచండుడవయినావు. మేము నేడు ధనము, కీర్తి, రక్ష, శత్రునాశములకు నిన్ను సేవింతుము.

## ముప్పది తొమ్మిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. మా సోమము మాదకరము, పరాక్రమకారి, స్వర్గీయము, విజ్ఞసమ్మతము, ఫలదాత, సేవనీయము. ఇంద్రా ! అట్టి సోమమును సేవింపుము. మాకు గోప్రముఖ అన్నము ప్రసాదింపుము.

2. ఈ ఇంద్రుడే పర్వతములలో దాచినట్లు ఉంచబడిన గోవులను ఉద్ధరించదలచినాడు. అంగిరులను వెంట పెట్టుకున్నాడు. అంగిరుల సత్యరూప స్తోత్రములకు ఉత్తేజితుడు అయినాడు. దుర్భేద్య పర్వతమును బద్దలు కొట్టినాడు. ఫణులను పరాభవించినాడు.

3. ఇంద్రా ! ఈ సోమము దీప్తిశూన్య దివారాత్రులు. వర్షము అన్నింటిని ప్రదీప్తము చేసినది. ప్రాచీన కాలమున దేవతలు ఈ సోమమును దినమునకు కేతన స్వరూపను చేసినారు. ఈ సోమమే తన దీప్తితో ఉషలను ప్రకాశితము చేసినది.

4. ఈ ఇంద్రుడే సూర్య రూపమున ప్రకాశితమైనాడు. వెలుగులేని భువనములకు వెలుగులు కలిగించినాడు. అతడే

సర్వత్ర గతిశీలక దీప్తిద్వారా ఉషల అంధకారమును నష్టపరచినాడు.

ఇంద్రుడు మానవుల కోరికలు తీర్చువాడు. అతని అశ్వములు స్తోత్రము ద్వారా నియోజితములు. అట్టి అశ్వములులాగిన ధనపూర్ణమగు రథమును ఎక్కి ఇంద్రుడు వెళ్లినాడు.

5. ఇంద్రా ! నీవు పురాతనుడవు. ప్రకాశమానుడవు. నిన్ను స్తుతించువాడు. ధనదానయోగ్యుడు అయినచో అతనికి బోలెడు ధనమును ఇమ్ము. స్తోతలకు జలము, విషరహిత ఓషధులు, గోవులు, అశ్వములు, మానవులను దానము చేయుము.

## నలుబదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! ఇది నీ మదవర్ధనమునకు సిద్ధమయిన సోమము - పానము చేయుము. నీకు మిత్రులవంటి అశ్వద్వయమును రథమున పూన్చుము. ఇచటికి వచ్చి అశ్వములను విడువుము. స్తోతలమధ్య కూర్చొనుము. స్తోత్రములు ఉచ్చరించుటలో మాతో కలుపుము. స్తోత అగు యజమానికి అన్నము ప్రదానము చేయుము.

2. ఇంద్రా ! నీవు ఉల్లాసము వీరత్వము వెల్లడించదలచినావు. పుట్టగానే సోమపానము చేసినావు. అట్లే సోమపానము చేయుము. నీ కొఱకు సోమము సిద్ధము చేయుటకుగాను గోవులు, ఋత్విక్కులు, జలము, శిలలుకూడినవి - నారు.

3. ఇంద్రా ! నిప్పు మండుచున్నది. సోమము అభిషుతమయినది. శక్తిశాలులగు నీ అశ్వములు నిన్ను తీసికొనిరావలెను. నీమీద లగ్నముచేసి ఆహ్వానించుచున్నాము. మా విశాలసమృద్ధికొఱకు విచ్చేయుము.

4. ఇంద్రా ! సోమపానమునకుగాను అనేకమారులు యజ్ఞములకు వెళ్లినావు. కావున ఇప్పుడు సోమపానము చేయు కోరికతో, మహా అంతఃకరణముతో ఈ యజ్ఞమునకు విచ్చేయుము. మా స్తోత్రములను ఆలకింపుము. నీ దేహపుష్టికిగాను యజమాని నీకు సోమరూప అన్నము సమర్పించును.

5. ఇంద్రా ! నీవు స్తుతిపాత్రుడవు. అశ్వముల అధిపతివి. నీవు దూరపు స్వర్గమున మరేచోటున నీ ఇంట ఉన్నను, లేకున్నను మరుత్తుల సహితముగా ప్రసన్నుడవై మమ్ము రక్షించుటకుగాను మా యజ్ఞమును రక్షింపుడు.

## నలుబది ఒకటవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! నీ కొఱకు పవిత్ర సోమరసము. అభిషుతము అయినది. క్రోధరహితుడవై మా యజ్ఞమునకు విచ్చేయుము. వజ్రధరా ! గోవులు కొట్టములోనికి వెళ్లినట్లు సోమరసము కలశమున చేరినది. కావున ఇంద్రా నీవు రమ్ము. నీవు యజ్ఞయోగ్య దేవతలందు ప్రధానుడవు.

2. ఇంద్రా ! నీ నాలుక సుంధానిర్మితము. సువిస్తృతము. నీవు దానితోనే సోమపానము చేయుదువు. అట్లే మా సోమరసమును ఆ నాలుకతోనే పానము చేయుము. ఋత్విక్కు సోమరసముతో నీ ముందు నిలిచి ఉన్నాడు. ఇంద్రా ! శత్రువుల గోవులను పట్టుటకు అభిలషించు నీ వజ్రము శత్రు సంహారము చేయవలెను.

3. సోమము ద్రవరూపము. అభీష్టవర్షి. వివిధరూపము. అట్టి సోమము కోరికలు తీర్చు ఇంద్రుని కొఱకు సంస్కరింపబడినది. ఇంద్రా ! నీవు అశ్వాధిపతివి. శాసకుడవు. బలశాలివి. నీవు ఎంతోకాలముగా సోమముపై ప్రభుత్వము చేసినావు. అది నీకు అన్నరూపమని చెప్పబడినది. ఆ సోమరసమునే త్రాగుము.

4. ఇంద్రా ! అభిషుత సోమము అనభిషుత సోమముకన్న శ్రేష్ఠతరము. మేధావిని అగు నీ కొఱకు అధిక ప్రసన్నకారకము. శత్రువిజయ ఇంద్రా ! యజ్ఞ సాధన సోమము వద్దకు విచ్చేయుము. సోమముతో నీ సర్వశక్తులను పూరింపుము.

5. ఇంద్రా ! మేము నిన్ను ఆహ్వానించుచున్నాము. మా ముందుకు రమ్ము. మేము అందించు ఈ సోమము నీ దేహమునకు పర్యాప్తము కావలెను. శతక్రతు ఇంద్రా ! అభిషుత సోమపానమున ఉల్లాసవంతుడవగుము. యుద్ధమున అందరి నుండి నలుదిశలనుండి మమ్ము రక్షింపుము.

## నలుబది రెండవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - 4 బృహతి, మిగిలినవి అనుష్టుప్.

1. ఇంద్రుడు పిపాసువు, సర్వజ్ఞుడు, సర్వగామి. యజ్ఞ అధిష్ఠాత. యజ్ఞనాయకుడు. అందరకు అగ్రగామి. ఋత్విక్కులారా ! అట్టి ఇంద్రునకు సోమరసము సమర్పించండి.

2. ఇంద్రుడు అతిశయ సోమరసపాయి. ఋత్విక్కులారా ! మీరు సోమరస సహితులయి ఇంద్రునివద్దకు చేరండి. అభిషుత సోమరసము నిండిన పాత్రతో బలశాలి ఇంద్రుని ముందుకురండి.

3. ఋత్విక్కులారా ! అభిషుతము, దీప్తమగు సోమరసముతో ఇంద్రుని వద్దకు చేరండి. ఇంద్రుడు మేధావి. అతడు మీ మనసులు గుర్తించగలడు. శత్రుసంహార సహితముగా అతడు మీ కోరికలు తీర్చగలడు.

4. ఋత్విక్కులారా ! సోమరూప అన్నపు అభిషుత రసము ఏకమాత్ర ఇంద్రునకే ఇవ్వండి. ఇంద్రుడే ఉత్సాహవంతులయి మనను గెలుతుమన్న శత్రువుల ద్వేషము నుండి మనను రక్షించగలడు.

## నలుబది మూడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - ఉష్ణిక్.

1. ఇంద్రా ! సోమరసపానమున ఉత్సాహవంతుడవయినావు. దివోదాసునకుగాను శంబరుని వశపరచుకున్నావు. అదిగో అటువంటి సోమమే అభిషుతమైనది. నీవు దానిని పానము చేయుము.

2. ఇంద్రా ! సోమరసము మాదకము. ప్రాతః, మధ్యాహ్న సాయం పూజలందు అభిషుతమగును. అప్పుడు నీవు దానిని స్వీకరింతువు. ఈ సోమరసము నీ కొఱకు అభిషుత మయినది - పానము చేయుము.

3. ఇంద్రా ! మాదక సోమరస పానముచేసి పర్వత మధ్యమున కనిపించకుండ, కట్టివేయబడిన గోవులను విడిపించినావు. అదే సోమరసము నీకొఱకు అభిషుతమైనది. పానము చేయుము. "సుతఃపిబ"

4. ఇంద్రా ! సోమరూప అన్నపు రసపానముచేసి ఉత్సాహవంతుడవయినావు. బలములు పొందినావు. అదే సోమము నీ కొఱకు అభిషుతమైనది. పానము చేయుము "సుతఃపిబ"

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగవ అష్టకము ఆరవ మండలమున మూడవ అనువాకము సమాప్తము)

## నాలుగవ అనువాకము నలుబది నాలుగవ సూక్తము

ఋషి - బృహస్పతి పుత్రుడు, శంయుడు దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్
7, 8, 9 విరాజము, 18 విరాట్.

1. ఇంద్రా ! నీవు ధనశాలివి. సోమరూప అన్న రక్షకుడవు. సోమము ధనశాలి దీప్తయశమున సముజ్జ్వలము. అదే అభిషుత. సోమము నిన్ను ఉల్లాసవంతుని చేయును.

2. ఇంద్రా ! నీవు విస్తృత సుఖకారివి. సోమరూప అన్న రక్షకుడవు. సోమము నిన్ను ప్రసన్నుని చేయును. నీ స్తోతలను ఐశ్వర్యవంతులను చేయును. అదే అభిషుత సోమము నిన్ను ఉల్లాసవంతుని చేయును.

3. ఇంద్రా ! నీవు సోమరూప అన్న రక్షకుడవు. సోమపానముచేసి బలము పెంచుకున్నావు. నిన్ను రక్షించు మరుత్తుల సహితుడవై రిపునాశనము చేసినావు. అదే అభిషుత సోమము నిన్ను ఉల్లాసవంతుని చేయును.

4. ఇంద్రుడు భక్తవత్సలుడు. బలస్వామి. విశ్వవిజేత. యుగాదిక్రియల నాయకుడు. శ్రేష్ఠదాత. సర్వదర్శకుడు. యజమానులారా ! మేము మీ కొఱకు అట్టి ఇంద్రుని స్తుతింతుము.

5. మా స్తుతులతో ఇంద్రుని శత్రుధనహరణబలము వృద్ధిచెందును. స్వర్గదేవతలు, పృథ్వీదేవతలు ఆ బలమును సేవింతురు.

6. స్తోతలారా ! ఇంద్రుని కొఱకు మీ స్తోత్రములు విస్తృతపరచండి. మేధావి వ్యక్తివలె మీ రక్షణ ఇంద్రుని వెంట ఉన్నది.

7. యజ్ఞాది కార్యములందు దక్షుడగు యజమాని మాటలు ఇంద్రునకు తెలియును. ఇంద్రుడు మిత్రము, నవీనతను సోమము త్రాగువాడు. అతడు స్తోతలకు శ్రేష్ఠ ధనము ప్రదానము చేయును. హవ్యరూప అన్న భోజనుడగు ఇంద్రుడు ప్రవృద్ధములు, పృథ్వివిని వడకించు అశ్వములపై స్తోతలను రక్షించవలెనని వచ్చి వారిని రక్షించవలెను.

8. యజ్ఞ మార్గమున సర్వదర్శి సోమము పానము చేయబడును. ఋత్విక్కులు ఆ సోమమునే ఇంద్రుని మనసును ఆకర్షించుటకు ఉపయోగింతురు. ఇంద్రుడు శత్రువిజేత. విపుల శరీరి. ఆ ఇంద్రుడే మా స్తవములకు ప్రసన్నుడు కావలెను. మాముందుకు వేంచేయవలెను.

9. ఇంద్రా ! మాకు అతిదీప్తవంతమగు బలమును ఇమ్ము. నీ ఉపాసకుల అసంఖ్యాక శత్రువులను దూరము చేయుము. నీ బుద్ధితో మాకు కోరిన అన్నము ప్రసాదించుము. ధనమును అనుభవించుటకు మమ్ము రక్షింపుము.

(ధనము ఉన్నంత మాత్రమున సరిపోదు. అభద్రత దానిని అనుభవించనీయదు. అనుభవించుటకు భద్రత అత్యవసరము)

10. ధనశాలి ఇంద్రా ! నీ కొఱకే మేము హవ్యములు ఇచ్చుచున్నాము. నీవు అశ్వముల స్వామివి. మాకు ప్రతికూలుడవు కారాదు. మానవులలో నీవుకాక మరొక మిత్రుడు కనిపించడు. ఇంద్రా ! నీలో ఈ గుణము లేకుండినచో ప్రాచీనులు నిన్ను ధనిదుడని ఎందుకు అందురు?

11. ఇంద్రా ! నీవు అభీష్టవర్షివి. మమ్ము కార్యవినాశక రాక్షసులవద్ద విడువకుము. నీవు ధనయుక్తుడవు. నీ బంధుత్వమున ఆరాధపడినాము. మాకు ఎట్టి విఘ్నములు కలుగరాదు. మానవులు నీకు అనేక విఘ్నములు కల్పింతురు. అభిషవకర్త కానివానిని సంహరింపుము. నీకు హవ్యము ఇవ్వని వానిని నాశము చేయుము.

12. గర్జించు పర్జన్యుడు మేఘములు సృష్టించును. ఇంద్రుడు స్తోతలకు ఇచ్చుటకు అశ్వములను, గోవులను సృష్టించును. ఇంద్రా ! నీవు స్తోతల ప్రాచీన రక్షకుడవు. నీకు హవ్యము ఇవ్వక ధనికులు నీ విషయమున అన్యదా ఆచరించరాదు.

13. ఇంద్రుడు సోమమునకు స్వామి. ఋత్విక్కులారా ! మీరు ఇంద్రునకే అభిషుత సోమము అర్పించండి. ఈ ఇంద్రుడే ఋషుల ప్రాచీన, నవీన స్తోత్రములతో పరివర్ధితుడైనాడు.

14. ఇంద్రుడు జ్ఞాని. బాధించనివాడు. అతడు ఈ సోమమునే పానము చేసినాడు. ఉల్లాసవంతుడయినాడు. అసంఖ్యాకులగు ప్రతికూల ఆచరణపర శత్రువులను నాశము చేసినాడు.

15. ఇంద్రుడు అభిషుత సోమపానము చేయవలెను. ఉల్లసితుడు కావలెను. వృత్రుని సంహరించవలెను. ఇంద్రుడు గృహదాత. స్తోత్రరక్షకుడు. యజమాని పాలకుడు. అతడు దూరదేశమున ఉన్నను యజ్ఞమునకు రావలెను.

16. ఇంద్రునకు పానయోగ్యము, ప్రియము, సోమరూప అమృతమును ఇంద్రుడు సేవించవలెను. అందువలన అతనికి ఉల్లాసము కలుగవలెను. ఉల్లాసమున అతడు మమ్ము అనుగ్రహించవలెను. మా శత్రువులను పాపములను దూరము చేయవలెను.

17. శౌర్యశాలి ఇంద్రా ! ఈ సోమరసము సేవింపుము. ప్రసన్నుడవగుము. మాకు ఆత్మీయులయినను అనాత్మీయులైనను ప్రతికూలాచరణ శత్రువులను నాశము చేయుము. మా ముందునకు వచ్చి అస్త్రములు అర్పించు శత్రు సైన్యములను పరాఙ్ముఖముచేసి తరలింపుము.

18. ఇంద్రా ! మా ఈ సమస్త సంగ్రామమున మాకు అతులధనము సులభము చేయుము. మమ్ము జయప్రాప్తికి సమర్థులను చేయుము వర్షము, పుత్ర, పౌత్రుల నిచ్చి మమ్ము సమృద్ధులను చేయుము.

19. ఇంద్రా ! నీ అశ్వములు అభీష్ట వర్షులు. స్వేచ్ఛగా రథమున నియుక్తములు. అభీష్ట దాత రథమును లాగునవి.

వారివర్షకములు. కిరణ సంయుక్తములు. ద్రుతగాములు. నిత్యతరుణులు, వజ్రవాహకములు. ఆ అశ్వములు నిన్ను బాగా మత్తుకలిగించు సోమపానమునకు తీసికొని రావలెను.

20. అభీష్టవర్షి ఇంద్రా ! నీ అశ్వములు జలవర్షకములు. తరుణులు. అవి సముద్ర తరంగములవలె ఉల్లసితములు కావలెను. నీ రథమునకు చేరవలెను. నీవు తరుణుడవు. అభీష్టవరుదుడవు. ఋత్విక్కులు నీకు రాతితో అభిషవించిన సోమరసము అర్పింతురు.

21. ఇంద్రా ! నీవు స్వర్గపు సేవనకర్తవు. పృథ్వికి వర్షకర్తవు. స్థావర జంగమ విశ్వమునకు అభీష్టకర్తవు. అభీష్టప్రదాయక ఇంద్రా ! నీవు శ్రేష్ఠ సేచనకారివి. నీ కొఱకు తేనెవంటి తీయని పానయోగ్యమగు సోమరసము పెరుగుచున్నది.

22. దీప్తిమంతమగు ఈ సోమము, మిత్రుడు ఇంద్రునితోసహ, జలముగ్రహించి బలాసురుని, నిరోధించినది. ఈ సోమమే గోరూప ధనమును దొంగిలించిన ద్వేషుల మాయను, అస్త్రములను వ్యర్థము చేసినది.

23. ఈ సోమమే ఉషాపతి సూర్యుని శోభాసంపన్నము చేసినది. ఈ సోమమే సూర్యమండలమున దీప్తి స్థాపించినది. ఈ సోమమే దీప్తిసంయుక్త త్రిభువన మధ్యమందలి స్వర్గమున రహస్యముగా నిలిచిన త్రివిధ అమృతములను అందుకున్నది.

24. ఈ సోమమే స్వర్గమును భూమిని తమ తమ స్థానములందు నిలిపినది. ఈ సోమమే సప్త రశ్మి రథమును యోజితము చేసినది. ఈ సోమమే స్వేచ్ఛానుసారముగా గోవులలో దుగ్ధధారలు ఏర్పరచినది.

## నలుబది అయిదవ సూక్తము

ఋషి - బృహస్పతి పుత్రుడు శంయుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - అనుష్టుప్, గాయత్రి.

1. ఉత్కృష్ట నీతితో తుర్వశుని యదువును దూరదేశము నుంచి తెచ్చిన ఇంద్రుడు మాకు మిత్రుడు కావలెను.

2. తనను స్తుతించని వానికి సహితము ఇంద్రుడు అన్నము ప్రసాదించును. ఇంద్రుడు తీవ్రగతిగల అశ్వమున అధిరోహించి శత్రువు మధ్యనున్న సంపదను గెలుచును.

3. ఇంద్రుని నీతులు ఉత్కృష్టములు. గొప్పవి. అతని స్తుతులు నానావిధములవి. అతని రక్షణల కథలు ఏనాటికి తరగవు.

4. ఇంద్రుడు మనకు మరింత బుద్ధిని కలిగించువాడు. అందువలన బంధువులారా ! మంత్రములద్వారా ఆహ్వానయోగ్యుడగు ఇంద్రుని పూజించండి. స్తుతించండి.

5. వృత్రహంత ఇంద్రా ! నీవు ఒకరిద్దరు స్తోతలకు రక్షకుడవు. మావంటి వారి రక్షకుడవగుము.

6. ఇంద్రా ! మా వద్దనుండి విద్వేషులను దూరము చేయుము. స్తోతలకు సమృద్ధి ప్రసాదించుము. నీవు శోభన పుత్ర పౌత్రులను ఇచ్చువాడవు. అందుకే జనులు నిన్ను స్తుతింతురు.

7. ఇంద్రుడు ఆహ్వానయోగ్యుడు. స్తుతిపాత్రుడు. మిత్రుడు. నేను స్తోత్రబలమున, మహామంత్రములతో ఆవునువలె కోరికలు పితుకుకొనుటకు ఇంద్రుని పిలుచుచున్నారు.

8. వీర్యవంతుడై, శత్రు సేనను పరాజితము చేయు ఇంద్రుని రెండు చేతులందు దివ్య పార్థివ ధనములు ఉన్నవని ఋషులు ఎన్నోమారులు చెప్పినారు.

9. వజ్రధారి ఇంద్రా ! నీవు శత్రువుల దుర్భేద్య నగరములను నిర్మూలించినావు. యజ్ఞపతి, సర్వోన్నతడవగు ఇంద్రా ! నీవు శత్రువుల మాయలను నష్టపరుతువు.

10. ఇంద్రుడు సత్యస్వభావుడు. సోమపాయి. అన్నరక్షకుడు. అన్నాభిలాషులమగు మేము సద్గుణసంపన్నుడగు ఇంద్రుని ఆహ్వానింతుము.

11. ఇంద్రా ! నీవు తొలుత ఆహ్వాన యోగ్యుడవు. ఇప్పుడు శత్రుమధ్యమున ఉన్న ధనసాధనకుగాను నిన్ను ఆహ్వానించుచున్నాము. మేము నిన్ను పిలుచుచున్నాము. నీవు మా పిలుపులను ఆలకించుము.

12. ఇంద్రా ! నీవు మా స్తోత్రములు వినుము. ప్రసన్నుడవగుము. మమ్ము అనుగ్రహింపుము. అందువలన మేము అశ్వములతో శత్రువుల అశ్వములను ఉత్కృష్ట అన్నమును నిగూఢ ధనము గెలుచుటకు సమర్థులము కావలెను.

13. వీరుడవు, స్తుతిపాత్రుడవగు ఇంద్రా ! నీవు శత్రు మధ్యమున దాచిన ధనమును సాధించుటకు శత్రువులను గెలుచుటకు సమర్థుడవు.

14. శత్రుంజయ ఇంద్రా ! నీ నడక అతిశయ వేగయుక్తము. ఆ నడకలతోనే శత్రువును జయించుటకుగాను మా రథమును తోలుము.

15. ఇంద్రుడు జయశీలుడు రథశ్రేష్ఠుడు. ఇంద్రా ! నీవు మా శత్రువిజయ రథముమీద శత్రువులు దాచిన ధనమును గెలువుము.

16. ఇంద్రుడు సర్వదర్శి. వర్షణశీలి. పుట్టుకతోనే మానవుల అధిపతి అయినాడు. అట్టి ఇంద్రుని స్తుతించండి.

17. ఇంద్రా ! రక్షణల కారణముగా నీవు మాకు సుఖధాతవు. మిత్రుడవు. మా స్తుతులకు ప్రాచీన కాలమునుండి నీవు బంధుత్వము ప్రకటించినావు. ఇప్పుడు మమ్ము సుఖవంతులను చేయుము.

18. వజ్రధర ఇంద్రా ! నీవు రాక్షసనాశమునకుగాను వజ్రము ధరించినావు. నీతో స్పర్థగల వారిని పరాజితులను చేతువు.

19. ఇంద్రుడు ధనదుడు. మిత్రుడు. స్తోతలకు ఉత్సాహదాత. మంత్రములతో ఆహ్వానయోగ్యుడు. ప్రాచీనుడు. ఆ ఇంద్రుడినే ఆహ్వానించుచున్నాను.

20. స్తుతిద్వారా వందనీయుడు. అప్రతిహతగతి గల ఇంద్రుడు ఒక్కడే సమస్త పార్థివ ధనములకు అధిపతి.

21. గోవుల అధిపతీ ! నీవు 'వడవ' లతో కలిసివచ్చి మాకు అన్నము, అసంఖ్యాక అశ్వములు, ధేనువులు ఇచ్చి మా కోరిక తీర్చుము.

22. స్తోతలారా ! గడ్డి గోవుకు సుఖావహమగును. అట్లే సోమరసము సిద్ధముకాగా ఇంద్రునకు సుఖదాయకమగును. ఇంద్రుని స్తోత్రము చాలమందికి వందనీయమగును. రిపుంజయ ఇంద్రునివద్ద ఏకత్రితులై గానము చేయండి.

23. ఇంద్రుడు గృహప్రదాత. అతడు మా స్తోత్రములు విన్నపుడు ధేనువుల సహితముగా అన్నము ప్రదానము చేయుటకు విసుగుచెందడు.

24. దస్యులను వధించు ఇంద్రుడు 'కువత్సు' ని అసంఖ్యాక గోవులున్న గోష్ఠమున ప్రవేశించినాడు. అతడు తన బుద్ధిబలమున మా కొఱకుగాను ఆ గోసమూహములను ప్రకటించినాడు.

25. బహువిధ కర్మలు అనుష్ఠించు ఇంద్రా ! ఆవులు మాటిమాటికి దూడలవద్దకు పోయినట్లు మా స్తుతులన్నియు మాటిమాటికి నీవైపునకు మరలును.

26. ఇంద్రా ! నీ బంధుత్వము నశించునదికాదు. నీవు గోవులు కోరువారలకు గోవులు, అశ్వములు కోరువారలకు

అశ్వములు ప్రసాదింతువు.

27. ఇంద్రా ! మహాధనమునకుగాను ప్రదత్తమయిన సోమరసమును త్రాగుము. తృప్తుడవగుము. నీ ఉపాసకులను నిందకులకు అప్పగించవు.

28. స్తుతులతో వందనీయుడవగు ఇంద్రా ! పాడి ఆవులు దూడలవద్దకు చేరినట్లు తేప తేప సోమరసము అభిషుతమైనపుడు మా స్తుతులు వేగముగా నీవైపు సాగును.

29. అసంఖ్య శత్రునాశక ఇంద్రా ! యజ్ఞ మండపమున హవిరూప అన్నముతో అర్పించబడిన స్తోతల స్తోత్రములు నిన్ను బలశాలిని చేయవలెను.

30. ఇంద్రా ! అత్యున్నతములగు మా స్తోత్రములు నీ వద్దకు చేరవలెను. మమ్ము మహాధనప్రాప్తికి ప్రోత్సహించుము.

31. గంగయొక్క ఉన్నత తటములవలె ప్రాణుల మధ్య ఉన్నత స్థానమందు బ్రుబునామక అసురుడు లేక వణిజుడు నిలిచి ఉన్నాడు.

32. నేను ధనార్థిని. బ్రుబుడు వదాన్యతతో నాకు వాయువేగముగల వేయి ఆవులను వెంటనే ఇచ్చినాడు. మేమందరము వేయిగోవులు ఇచ్చిన విద్వాంసుడు, వేల స్తోత్రముల పాత్రుడు బ్రుబుని ప్రశంసింతుము.

## నలుబది ఆరవ సూక్తము

ఋషి - బృహస్పతి పుత్రుడు శంయుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - బృహతి.

1. మేము స్తోతలము. అన్నప్రాప్తికొఱకు నిన్ను పిలిచెదము. నీవు సాధుజన రక్షకుడవు. అందువలన అశ్వములతో కూడిన యుద్ధమున శత్రువులను గెలుచుటకు నిన్ను ఆహ్వానింతుము.

2. విచిత్ర వజ్రపాణి వజ్రీ ! యుద్ధమున గెలిచినవానికి నీవు అడిగినంత అన్నము ప్రదానము చేస్తావు. అట్లే నీవు మా స్తుతులకు ప్రసన్నుడవయి అడిగినన్ని గోవులను, రథములాగగల పుష్టికరమగు అశ్వములను ప్రసాదించుము. నీవు శత్రునాశకుడవు. ప్రతాపవంతుడవు.

3. ఇంద్రుడు ప్రబల శత్రునిహంత. సర్వదర్శి. ఆ ఇంద్రుని ఆహ్వానించుచున్నాము. సహస్రశేఫ, అతులధన సంపన్న, సత్పాలక ఇంద్రుడు రణభూమిలో మాకు సమృద్ధి కలిగించవలెను.

(శేఫ శిశ్నము స్త్రీలోలుడయిన ఇంద్రుడు పర్వదినములందు వేయి శిశ్నములు కలవాడగునని కథనము)

4. ఇంద్రా ! ఋుక్కులలో వర్ణించినట్లే నీ రూపము ఉన్నది. తుముల యుద్ధమున వృషభమువలె అత్యంత క్రోధమున మా శత్రువులను ఆక్రమించుము. అందువలన మాకు సంతతిగలిగి చాలకాలము సుఖములు అనుభవించవలెను. నీవు రణభూమిలో మాకు రక్షకుడవగుము.

5. సుందర హనువులు. దవడలు కలవాడా ! అద్భుత వజ్రపాణి ఇంద్రా ! నీవు అన్నముతో స్వర్గమును, భూమిని పోషించుచున్నావు. అటువంటి ప్రకృష్టతమము, అత్యంత బలవర్ధకము, పుష్టిసాధకమగు అన్నముతో మావద్దకు విచ్చేయుము.

6. దీప్తిశాలి ఇంద్రా ! నీవు మమ్ము రక్షింతువు. అందుకే మేము ఆహ్వానిస్తాము. దేవతలందరిలో బలవంతుడవు. శత్రుంజయుడవు. గృహదాత ఇంద్రా ! సమస్త రాక్షసులను వేరు చేయము. మమ్ము శత్రువులను జయించువారిని చేయుము.

7. ఇంద్రా ! మానవులందున్న బలము, ధనము, అయిదులోకముల అన్నమును అన్నింటిని మహాబల సహితముగా మాకు అందించుము.

("యద్వా పఞ్చక్షితీనాం" అని మంత్రము. పంచ క్షితీనాం నిషాదపంచమాశ్చత్వా రోవర్ణః అని శాయణుని వ్యాఖ్య. నిషాదులతో అయిదుగురయిన చతుర్వర్ణములు అని అర్థము. క్షితి అనగా భూమి లోకములను అర్థము వాడినాను)

8. ఐశ్వర్యశాలివగు ఇంద్రా ! శత్రువుతో యుద్ధము మొదలయినంత మేము వారిని గెలువవలెను. అందుకొఱకు నీవు మాకు త్రక్షు, ద్రాహ్యు, పురు వీరుల సమస్త బలము ప్రసాదించుము.

9. ఇంద్రా ! హవ్యరూప ధనముగల వారికి మఱియు నాకు ఒక గృహమును ప్రసాదించుము. అది కలప, ఇటుకరాతితో కట్టబడి ఉండవలెను. అందులో చలి, వేది బాధించరాదు. అది సమృద్ధము, ఆచ్ఛాదితము కావలెను. శత్రువుల సమస్త దీప్తియుక్త ఆయుధములను దూరముగా ఉంచుము.

(గృహనిర్మాణ సామాగ్రిలో నాటికి నేటికి చెప్పుకొనతగిన మార్పు వచ్చినట్లు కనిపించదు. అదే ఇటుక అదే రాయి, అదే కలప ! శీతాతపములు సోకని ఇల్లు బహుశః నేటి AIR CONIDITION వంటివి కావచ్చును. ప్రేలుడు పదార్థములు ఇంటికి దగ్గరలో ఉండరాదనుట నాటి నిశిత పరిశీలనకు నిదర్శనము)

10. ఐశ్వర్యశాలి ఇంద్రా ! మా గోవులను అపహరించుటకు శత్రువువలె మామీద ఆక్రమణ చేసినవారినుండి

రక్షించుటకు తరలిరమ్ము.

11. ఇంద్రా ! ఇప్పుడు ఇప్పుడే మాకు ధనము నిమ్ము. పక్షయుక్తములు, తీక్ష్ణా గ్రములు. దీప్తములగు శత్రువుల బాణములు ఆకాశము నుండి రాలినప్పుడు మమ్ము రక్షించిన వారున్నారు. నీవు వారిని యుద్ధభూమిలో రక్షింపుము.

("యదన్తరిక్షే పతయన్తి పర్ణివో" అని మంత్రము రెక్కలు కలిగి ఆకాశము నుండి పడునట్టి అని అర్థము. ఇవి క్షిపణుల వంటివికావచ్చును !

నన్ను రక్షించిన వారిని రక్షించుమనుట ఎంత కృతజ్ఞత ! ఎంత ఉదారత !! ఎంతటి సదాశయము !!!)

12. శత్రువులముందు వీరపురుషులు తమ పరాక్రమము ప్రదర్శింతురు. పైతృక స్థానమును విడుతురు. అప్పుడు నీవు మమ్ము మా సంతానపు దేహములను రక్షించుటకు గుప్త రూపమున కవచములు అందించుము. శత్రువులను దూరము చేయుము.

(పైతృక స్థానమును విడుచుట అనగా విస్తృత పరచుట. దానికి మరింత చేర్చుట)

13. మహా యుద్ధ సమారోహము. ఉత్సవము జరుగవలెను. కాని మా గుఱ్ఱములను దగ్గరి దారిన కుటిల ప్రాంతములనుండి సాగునదియు, మాంసము కొఱకు మహావేగమున ఎగురు శ్యేనమువంటి వేగమున పంపుము.

14. అశ్వములు భయమున సకిలించును. అయినను పల్లమునకు దూకు నదులవలె అశ్వములు వేగవంతములు, దృఢవంతములై మాంసము కొఱకు ఉదుకు పక్షులవలె గోవులను సాధించుటకు జరుగు సంగ్రామమున మాటి మాటికి పరుగులు పెట్టును.

## నలుబది ఏడవ సూక్తము

ఋషి - భరద్వాజపుత్రుడు గర్గుడు దేవత - వేరు వేరు, ఛందస్సు వేరు వేరు.

1. ఇది అభిషుత సోమము. రుచికరము, మధురము, తీవ్రము, రసవంతము, దీనిని ఇంద్రుడు స్వీకరించును. అప్పుడు యుద్ధమున ఇంద్రునిముందు ఎంతటివాడును నిలువజాలడు.

2. ఈ యజ్ఞమున త్రావిన సోమము ఎంతో హర్షము కలిగించినది. వృత్రవధ సమయమున ఇంద్రుడు దీనిని త్రావి ప్రసన్నుడయినాడు. అతడు శంబరుని తొంబది తొమ్మిది పురములను ధ్వంసము చేసినాడు.

3. త్రావినంత ఈ సోమము నా మాటల స్ఫూర్తిని పెంచును. ఇది కోరిన వృద్ధిని ప్రసాదించును. ఈ సుబుద్ధి సోమమే స్వర్గము, పృథ్వి, దివారాత్రులు, జలము, ఓషధులు మున్నగు ఆరింటిని సృష్టించినది. ప్రాణులందు ఎవడును సోమము నుండి దూరముగా ఉండజాలడు. (రాత్రింబవళ్లు రెంటితో ఆరు అగును)

4. ఫలితముగా ఈ సోమరసమే పృథ్విని విస్తరింప చేసినది. స్వర్గమును గట్టిపరచినది. ఈ సోమమే ఓషధులు, జలము, ధేనువులను ఉత్కృష్టములగు మూడు ఆధారములను రసవంతములను చేసినది. ఈ సోమమే విస్తృత అంతరిక్షమును భరించి ఉన్నది.

5. నిర్మల ఆకాశమున నిలిచిన ఉషకన్న ముందే ఈ సోమరసము సూర్యుని జ్యోతిని ప్రకటించును. జలవర్షి, బలశాలి అగు ఈ సోమరసమే మరుత్తులతో కలిసి గట్టి స్తంభమున స్వర్గమును నిలిపి ఉంచినది.

6. ఇంద్రా ! నీవు వీరుడవు. ధనము కొఱకు మొదలైన సంగరమున నీవు శత్రుసంహారము చేయుము. సాహసముగా కలశమందున్న సోమరసము త్రాగుము. మధ్యాహ్న యజ్ఞమును నీవు మరింత సోమపానము చేయుము. ధనపుత్రా ! మాకు ధనము నిమ్ము.

7. ఇంద్రా ! మార్గదర్శివలె ముందునడిచి మమ్ము కనిపెట్టి ఉండుము. మాముందుకు శ్రేష్ఠ ధనము తెమ్ము. మమ్ము దుఃఖమునుండియు, శత్రువులనుండియు రక్షింపుము. ఉత్కృష్ట చేతనై మమ్ము కోరుకున్న ధనమువైపు నడిపించుము.

8. ఇంద్రా ! నీవు జ్ఞానివి. మమ్ము విస్తీర్ణ లోకమునకు సుఖమయి, భయరహితమైన ఆలోకములకు నిర్విఘ్నముగ నడిపింపుము. నీవు ప్రాచీనుడవు. మేము నీ మనోజ్ఞ, బృహత్ బాహువులను రక్షణకొఱకు ఆశ్రయించినాము.

9. ధనాఢ్య ఇంద్రా ! నీవు నీ పరాక్రమ అశ్వముల వెనుక విస్తృత రథమున నన్ను ఎక్కించుము. వివిధ అన్నములలో మా కొఱకు విశిష్ట అన్నమును తెమ్ము మఘవా ! ఎంతటి ధనవంతుడయినను, ధనమున మమ్ము మించరాదు.

10. ఇంద్రా ! నీవు నన్ను సుఖవంతుని చేయుము. నా జీవనమును వృద్ధిపరచుటలో ప్రసన్నుడవగుము. నిన్ను ప్రసన్నుని చేయుటకు ఇప్పుడు నేను వచించినది అందరు గ్రహించవలెను. దేవగణములు నన్ను రక్షించుగాక.

11. ఇంద్రుడు శత్రువుల నుంచి రక్షించువాడు. కోర్కెలు తీర్చువాడు. ఆహ్వానయోగ్యుడు. శౌర్యశాలి. సర్వసమర్థుడు. బహులోకవందనీయుడు. అట్టి ఇంద్రుని ప్రత్యేక యజ్ఞమునకు ఆహ్వానించుచున్నాను. ధనవంతుడగు ఇంద్రుడు మాకు సమృద్ధిని ఇవ్వవలెను.

12. ఇంద్రుడు రక్షకుడు. ధనశాలి. అతడు రక్షణలతో మాకు సుఖమును ఇవ్వవలెను. అతడే మా శత్రువులను

వధించును. భయరహితులను చేయును. అతని ప్రసన్నత వలన మేము శౌర్యవంతులమగుదుము.

13. యాగార్హ్వా ఇంద్రుని అనుగ్రహము, వృద్ధి, మంగళ ప్రియత్వమునకు మేము పాత్రులము కావలెను. రక్షకుడు, ధనవంతుడగు ఇంద్రుడు విద్వేషల నుంచి మమ్మ దూరము తీసికొని వెళ్లవలెను.

14. ఇంద్రా ! స్తోతల స్తుతి, ఉపాసన, విశాలధనము, అభిషుత సోమరసము పల్లమునకు పారు నీటివలె నీ వద్దకే చేరును. వజ్రధర ఇంద్రా ! నీవు నీరు, పాలు, సోమరసములు చక్కగా మిశ్రమము చేస్తావు.

15. ఇంద్రుని స్తుతించుటకు ప్రసన్నుని చేయుటకు యజ్ఞము చేయుటకు ఎవడు సమర్థుడగును? ధనశాలి ఇంద్రుడు నిత్యము. అతని శక్తిని గ్రహించును. బాటసారి నడకలో అడుగులు ముందుకు, వెనుకకు వేసినట్లు ఇంద్రుడు బుద్ధిబలమున స్తోతలను ఒకప్పుడు ముందుకు మరొకప్పుడు వెనుకకు నడిపించును.

(కేవలము ముందునడక సాధ్యపడదు. ముందుకు సాగునపుడు సహితము వెనకడగు తప్పనిసరి అగును. ఇది వ్యక్తికి, కుటుంబమునకు, సమాజమునకు సర్వమునకు వర్తించునది.)

16. ప్రబల శత్రువును అణగద్రొక్కియు స్తోతల స్థానములను సదా పరివర్తనము చేసియు ఇంద్రుడు తన శక్తిని ప్రదర్శించును. గర్వపోతులను ద్వేషించువాడు పార్థివ, దివ్య ధనముల అధిపతి ఇంద్రుడు తన సేవకులను రక్షించుటకుగాను అప్పుడప్పుడు వారిని పిలుచును.

17. ఇంద్రుడు తనను ఉపాసించని వ్యక్తులను విడుచును. తనను సేవించువారితో అనేక వత్సరములు ఉండును.

18. ఇంద్రుడు సకల దేవతల ప్రతినిధి. ఇంద్రుడు మూడు విధముల "ఇయమగ్నిరయం విష్ణురయం రుద్రో ఇత్యేవ" రూపములు ధరించును. ఈ రూపములు ధరించిన ఇంద్రుడు వేరువేరుగా వ్యక్తుడవగును. అతడు తన మాయతో అనేక రూపములు ధరించి యజమానుల వద్దకు వచ్చును. ఇంద్రుని రథమునకు వేయి గుఱ్ఱములు ఉండును.

(ఇంద్రుడు తన మాయతో అనేక రూపములు దాల్చగలవాడయినందున రథమునకు బహుసంఖ్యాక అశ్వములు)

19. ఇంద్రుడు రథమున గుఱ్ఱములు పూన్చి ముల్లోకములందు అనేక స్థానముల విదితుడగును. ప్రతిదినము స్తోతలలోనికివెళ్లి వారిని శత్రువులనుండి రక్షించగలవాడు ఇంద్రుడు కాక మరెవ్వడగును?

20. దేవతలారా ! మీరు తిరిగి తిరిగి గోవులు లేనట్టియు, దస్యులకు నిలయమైనట్టియు ప్రదేశమునకు వచ్చినారు !

బృహస్పతీ ! గోవుల అను సంధానమున మమ్ము చేర్చుము.

ఇంద్రా ! ఇట్టి దారితప్పిన ఉపాసకులకు దారి చూపుము.

21. ఇంద్రుడు అంతరిక్ష గృహమునుండి సూర్యరూపమున వెడలును. దినమునందలి అపరార్థమును ప్రకాశితము చేయును. ఆవిధముగా ప్రతిదినము ఒకేరీతిగా రాత్రిని దూరము చేయును. "ఉదవజ్ర" దేశమున శంబర, వర్చోనామములుగల ధనార్థులయిన ఇద్దరు దస్యులను వర్షకారి ఇంద్రుడు సంహరించినాడు.

22. ఇంద్రా ! 'ప్రస్తోతుడు' నీ స్తోతలమగు మాకు బంగారమునిండిన పదికోశములు, పది గుఱ్ఱములు దానము చేసినాడు. అతిథిగ్వుడు శంబరుని గెలిచి సాధించిన ధనమును మేము దివోదాసునిద్వారా పొందినాము.

23. నేను దివోదాసునుండి పది అశ్వములు, పది స్వర్ణకోశములు, బట్టలు, కోరినంత అన్నము, "దశో హిరణ్యపిండాన్" పది హిరణ్య పిండములను అందుకున్నాము.

24. ప్రస్తోకుని సోదరుడు అశ్వబుద్ధుడు 'పాయు'నకు పది గుఱ్ఱములు, రథము అథర్వగోత్ర ఋషులకు వంద గోవులు దానము చేసినాడు.

25. భరద్వాజ పుత్రుడు, అందరి మేలుకోరి ఈ ఐశ్వర్యమును గ్రహించినాడు. సృంజయపుత్రుడు ప్రస్తోకుడు. అతనిని పూజించినాడు.

26. కలపతో నిర్మించిన రథమా ! నీ అవయవములన్నియు గట్టివి కావలెను. నీవు మాకు రక్షకుడవు. మిత్రుడవగుము. నిన్ను గోచర్మముతో కప్పినారు. మమ్ము దృఢగాత్రులను చేయుము. నీ మీద ఎక్కిన రథి రణరంగమున శత్రువులను అనాయాసముగా గెలుచుటకు సమర్థుడు కావలెను.

27. ఈ రథము భూమి. స్వర్గముల సారముతో నిర్మించబడినది. వనస్పతుల గట్టి ధనముతో ఏర్పడినది. నీటి వేగమువంటి వేగము కలది. గోచర్మమున కప్పబడినది. వజ్రమువంటిది. ఋత్విక్కులారా ! హవ్యముతో రథపు యజ్ఞము చేయండి.

28. దివ్యరథమా ! నీవు ఇంద్రుని వజ్రస్వరూపవు. మరుత్తుల అగ్రవర్తివి. మిత్రుని గర్భమవు. వరుణుని నాభివి. మా యజ్ఞమున ప్రసన్నవై హవ్యము గ్రహింపుము.

29. హే యుద్ధ దుందుభీ ! నీ ధ్వనితో స్వర్గమర్త్యలోకములను పూరింపుము. స్థావర జంగమములు నీ ధ్వనిని గుర్తించవలెను. నీవు ఇంద్రుడు మఱియు ఇతర దేవతలతో వచ్చి మా శత్రువులను దూరము చేయుము.

30. దుందుభీ ! మా శత్రువులను ఏడిపించుమము. మాకు బలము నిమ్ము. నీ ధ్వని శత్రువులకు దుఃఖము కలిగించవలెను. మాకు అరిష్టముచేసి ఆనందించువారిని దూరము చేయుము. నీవు ఇంద్రుని ముష్టివి. అందువలన మాకు దృఢత్వము ఇమ్ము.

31. ఇంద్రా ! ఓ ఇంద్రా ! మా గోవులన్నింటిని నిలుపుము. మావద్దకు తెమ్ము. అందరివద్దకు చాటింపు చేరునట్లుగా దుందుభి భీషణరవము చేయుచున్నది. మా సేనలు అశ్వారూఢులయి ఒకచోట కూడినారు.

ఇంద్రా ! మా రథారూఢసేనలు, ఇతర సేనలు యుద్ధమున విజయవంతములు కావలెను.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగువ అష్టకము ఆరవ మండలమున ఏడవ అధ్యాయము సమాప్తము)

***ఓం వతామినన్తిమాయివో వధీరాప్రతాదేవానాం ప్రథమాధ్రువాణి***
***నరోదసే అద్రుహో వేద్యాభిర్న పర్వతావి యే తస్థివాంసః***

**ఎనిమిదవ అధ్యాయము నలుబది ఎనిమిదవ సూక్తము**

ఋషి - బృహస్పతి పుత్రుడు శంయుడు దేవత - వేరు వేరు, ఛందస్సు - వేరు వేరు

1. స్తోతలారా ! మీరు విశేష యజ్ఞమున స్తోత్రములతో శక్తివంతుడగు అగ్నిని స్తుతించండి. అమరుడు, సర్వద్రష్ట, మిత్రునివలె అనుకూలుడగు అగ్నిని ప్రశంసింతుము.

2. శక్తిపుత్రుడు, అగ్నిని మేము ప్రశంసింతుము. అతడు వస్తుతః మా విషయమున ప్రసన్నుడు. హవ్యము వహించు అగ్నికి మేము హవ్యము సమర్పింతుము. అగ్ని యుద్ధమున మమ్ము రక్షించవలెను. సమృద్ధి కలిగించవలెను. అతడు మా పుత్రులను రక్షించవలెను.

3. అగ్నీ ! నీవు కోరిన ఫలములు ఇచ్చువాడవు. జరారహితుడవు. మహాదీప్తి విభాసితుడవు. దీప్తాగ్నీ ! అవిచ్ఛిన్న తేజమున దీప్తమానుడవై నీ దీప్తితో మమ్ము ప్రకాశింప చేయుము.

4. అగ్నీ ! నీవు మహాదేవతల యజ్ఞములు చేయువాడవు. అందువలన మా యజ్ఞమునకు దేవతలను పిలువుము. మమ్ము రక్షించుటకుగాను నీ బుద్ధికాయము రెండింటితో దేవతలను మా ముందుకు తెమ్ము. నీవు మాకు హవ్యరూప అన్నము ఇమ్ము. నీవే మరల దానిని స్వీకరింపుము.

5. అగ్నీ ! నీవు యజ్ఞమునకు గర్భమవు. నిన్ను సోమమున కలుపుటకు అభిషవశిల అరణి కాష్ఠము పుష్టివంతము కావలెను. ఋత్విక్కులు బలముగా మధించగా పృథ్వియొక్క అత్యున్నత స్థానమున ఆవిర్భవించినావు.

6. అగ్ని తన దీప్తితో స్వర్గ, పృథ్వులను నింపుము. తన పొగతో ఆకాశమునకు ఎగురును. దీప్తిమంతము, అభీష్టవర్షియగు అగ్ని రాత్రి చీకటిని దూరము చేయును. అగ్నియే రాత్రులకు అధిపతి అగును.

7. అగ్నీ ! నీవు దేవతలలో కనిష్ఠుడవు. ప్రదీప్తుడవు. నీవు మా సోదరుడు భరద్వాజుని ద్వారా సమిద్ధుడవు అయినావు. మాకు ధనమును ఇమ్ము. నిర్మల, ప్రబలదీప్తితో ప్రజ్వలుడవగుము.

8. అగ్నీ ! నీవు మానవులందరకు గృహపతివి. నేను నిన్ను నూరు హేమంతముల వరకు ప్రజ్వలితుని చేయుదుము. నాకు వందల రక్షణలు కలుగచేయుము. పాపములనుండి రక్షింపుము. నీ స్తోతలకు నీవు అన్నము ఇస్తావు. వారిని కూడ రక్షింపుము.

9. గృహదాతవగు విచిత్ర అగ్నీ ! నీవు సకల సంపదల ప్రేరకుడవు. మా వద్దకు రక్షణలతో కూడిన ధనమును పంపుము. త్వరగా మా సంతానములను ప్రతిష్ఠించుము.

10. అగ్నీ ! సమవేతము మఱియు హింసారహిత రక్షణలతో మా పుత్ర పౌత్రులను పాలింపుము. మా విషయమున దేవతల్ క్రోధమున, మానవుల ద్వేషము తొలగింపుము.

11. బంధువులారా ! స్తోత్రములతో మీరు పాలిచ్చు ఆవువద్దకు రండి. దానికి ఎటువంటి హాని కలుగనిరీతి దానిని విడిపించుడు.

12. సహిష్ణువు, స్వాధీన తేజము కలది. మరుత్తుల అమరహేతువు. పాలరూపమగు అన్నము ఇచ్చునది. వేగవంతులగు మానవుల సుఖసాధనమున తత్పరురాలు, వర్షజలముతో పాటు సుఖవర్షము కలిగించు అంతరిక్ష మార్గమున విహరించు ధేనువు వద్దకు రారండి.

13. మరుత్తులారా ! భరద్వాజుని కొఱకు చక్కని పాలిచ్చు ఆవు, అందరికి కోరినంత అన్నము ఈ రెంటిని ప్రదానము చేయండి.

14. మరుత్తులారా ! మీరు ఇంద్రుని మహాకర్మల అనుష్ఠాతలు. వరుణునివంటి బుద్ధిమంతులు. ఆర్యమ వంటి స్తుతి పాత్రులు. విష్ణువు వంటి దానశీలురు. ధనము కొఱకు నేను నిన్ను స్తుతింతును.

15. మరుద్గణములు వందల, వేలవిధముల ధనమును మాకు ఒకేమారు ఇవ్వవలెను. అందుకొరకు అప్రతిహత

ప్రభావులు, పుష్టి కారకులగు మరుత్తుల బలమును స్తుతించుచు బిగ్గరగా చదువుదును. వారు మాకు గూఢ ధనమును ప్రకటించవలెను. సమస్త ధనములను సులభ సాధ్యము చేయవలెను.

16. పూషా ! నీవు త్వరగా మావద్దకు రమ్ము. దీప్తిమంతా ! భీషణ ఆక్రమణచేయు శత్రువులను బాధింపుము. నేను నీ చెవి వద్ద నీ గుణగానము చేసెదను.

17. పూషా ! కాకులకు ఆశ్రయభూతమగు వృక్షమును నష్టపరచకుము. నన్ను నిందించువారిని పూర్తిగా నష్టపరచుము. వేటగాడు పక్షులను పట్టుటకు వలపన్నినట్లు శత్రువులు నన్ను చిక్కించరాదు.

18. దధిపూర్ణమగు రంధ్రములేని తిత్తివలె నీ స్నేహము అవిచ్ఛిన్నము కావలెను.

19. పూషా ! నీవు మానవులను అతిక్రమించి నిలిచినావు. ధనమున దేవతలకు సముడవు. యుద్ధమున మా మీద అనుకూల దృష్టికలవాడవగుము. ప్రాచీన కాలమున మానవులను రక్షించినట్లు నేడు మమ్ము రక్షింపుము.

20. మరుత్తులారా ! మీరు కంపనకారులు. స్తుతియోగ్యులు. మీ ప్రశస్తమగు వాణి దేవతలకు యజమానులకు కోరిన ధనము ఇచ్చును. అదే కరుణా భరితము మఱియు సూనృతవాణి మాకు మార్గదర్శకము కావలెను.

21. మరుత్తుల సకల కార్యములు దీప్తిమంతుడగు సూర్యునివలె ఆకాశమంతటను వ్యాపించును. ఆ మరుద్గణములు దీప్త, శత్రువిజయ, పూజనీయ, శత్రునాశక బలము కలవారు. శత్రునాశకబలము అన్ని బలములను మించినది.

ఒకేసారి స్వర్గము ఉత్పన్నమయినది. ఒకేసారి భూమి. మరుత్తులమాత పృశ్నిగోవుపాలు అప్పుడే పితుకుట జరిగింది. అప్పటికి ఇంకేమియు పుట్టలేదు.

## నలుబది తొమ్మిదవ సూక్తము

ఋషి - భరద్వాజ ఋజిశ్వనుడు దేవత - వైశ్వదేవులు, ఛందస్సు - త్రిష్టుప్, చివరిది శక్వరి.

1. మిత్రావరుణులు స్తోతల సుఖాభిలాషులు. నేను కొత్త స్తోత్రములతో వారిని స్తుతింతును. అతి బలవంతులగు మిత్రుడు, వరుణుడు, అగ్ని ఈ యజ్ఞమునకు రావలెను. మా స్తుతులు వినవలెను.

2. అగ్ని ఒక్కొక్క వ్యక్తి యజ్ఞమున అర్చనీయుడు. పనులు చేసియు అహంకరించనివాడు. స్వర్గ, పృథ్వి కన్యలకు స్వామి స్తోతల పుత్రవంతుడగు శక్తిపుత్రుడు, యజ్ఞమున ప్రదీప్త కేతురూపుడు. అట్టి అగ్నిని యజించుటకుగాను యజమానులను ప్రోత్సహింతును.

3. సూర్యుడు దీప్తిమంతుడు. అతనికి విభిన్నరూపలగు ఇద్దరు కన్యలు రాత్రింబవళ్లు ఉన్నారు. వాటిలో ఒకటి నక్షత్రయుక్తము. రెండవది సూర్య సముజ్వలితము. అవి పరస్పర విరోధనులు. భిన్నరూప సంచారిణులు. పవిత్రతా విధాయకలు. మా స్తుతిభాజనలు. ఆ రాత్రింబవళ్లు మా స్తుతులు వినవలెను. ప్రసన్నలు కావలెను.

4. వాయువు మహాధనసంపన్నుడు. అఖిల లోకనందనీయుడు. రథపూరకుడు. సమ్యక్ యజ్ఞపాత్రుడు. సముజ్జ్వల రథారూఢుడు. జోడించిన అశ్వముల అధిపతి. దూరదర్శి. మా స్తుతులు మరుత్తులను చేరవలెను. మరుత్తులారా ! మీరు మేధావులు స్తోతలను ధనమున సమృద్ధులను చేయండి.

5. అశ్వినులు రథము సేచనము చేయును. అశ్వయుక్తమగును. ఆ సముజ్జ్వల రథము తన దీప్తితో నన్ను ఆచ్ఛాదితుని చేయవలెను. నేతలగు అశ్వినులారా ! రథము ఎక్కండి. మీ స్తోతల మనోరథము పూరించుటకు వారి ఇండ్లకు వెళ్లండి

6. వర్షించు పర్జన్య వాయువులారా ! అంతరిక్షమున మీకు అందిన జలమును పంపించండి. జ్ఞానసంపన్నులు, స్తోత్రములు వినువారలు, జగత్ స్తాపకులగు మరుత్తులారా ! ఎవరి స్తోత్రములతో మీరు ప్రసన్నులగుదురో, అట్టివాని సకల ప్రాణులను సమృద్ధము చేయండి.

7. సరస్వతి పవిత్రతాకారిణి. మనోహర విచిత్రగమన. వీరపత్ని. ఆమె మా యాగాది కర్మలను నిర్వహించవలెను. ఆమె దేవత పత్నుల సహితమయి ప్రసన్నకావలెను. స్తోతలకు కన్నములు లేని శీతాతపములకు దుర్ధర్షమగు గృహమును ప్రసాదించవలెను.

8. పూష మార్గములకు అధిపతి. పూజనీయుడు. స్తోతలు వాంఛిత ఫలములకొఱకు స్తోత్ర సహితులయి అతనిని చేరండి. అతడు మనకు బంగారు కొమ్ముల ఆవులు ఇవ్వవలెను. సర్వకార్యములు పూర్తి చేయవలెను.

9. దేవతలను పిలుచువాడును, వెలుగులుగల అగ్ని త్వష్టను యజించవలెను. త్వష్ట అందరకు ఆదివిభాజకుడు. ప్రసిద్ధ అన్నదాత. శోభనపాణి. దానశీలుడు. గృహస్థుల యజనీయుడు. అనాయాస ఆహ్వాన యోగ్యుడు.

10. స్తోతలారా ! పగలు ఈ స్తోత్రములన్నింటితో భువనపాలక రుద్రుని వర్ధిల్ల చేయుడు. రాత్రి రుద్రుని సంవర్ధితుని చేయండి.

11. నిత్యతరుణులు, జ్ఞానసంపన్నులు, పూజనీయులగు మరుద్గణములారా ! యజమాని మిమ్ము స్తుతించు చోటునకు రారండి. నేతలారా ! మీరు ఇట్లే సమృద్ధులయి, నడకలు నేర్చిన కరిణములవలె వ్యాప్తులై, వర్షము కలిగించి విశాల వృక్షారణ్యములను తృప్తులను చేయండి.

12. పశుపాలకుడు గోయూథములను శీఘ్రముగ నడిపించినట్లే పరాక్రాంతులు, బలవంతులు, వేగగాములగు మరుత్తులవద్దకు శీఘ్రముగ స్తోత్రములు చేరవలెను. అంతరిక్షము నక్షత్రమండలముతో నిండి ఉన్నట్లు మేధావి స్తోతల సుశ్రావ్య స్తోత్రములతో మరుద్గణముల శరీరములు నిండవలెను.

13. విష్ణువు ఉపద్రుత మనువుకొఱకు త్రిపాద పరాక్రమముతో పార్థివలోకపు కొలతలు వేసినాడు. అతడు మాకు తాను ఇచ్చిన గృహమున నివసించవలెను. మాకు ధన, దేహ, పుత్రుల అనుభవము కలిగించవలెను.

14. మా మంత్రములతో స్తూయమానులగు అహిర్బుధ్న, పర్వత, సవితలు మాకు జలసహిత అన్నము ప్రసాదించవలెను. దానశీల విశ్వదేవగణములు ఓషధులతో మాకు అదే అన్నమును ప్రసాదించవలెను. సుబుద్ధి భగుడు మమ్ము ధనములకు ప్రోత్సహించవలెను.

15. విశ్వదేవగణములారా ! మీరు మాకు రథయుక్తము, అసంఖ్యాక పరిచార సహితము, అనేక పుత్రులతో కూడిన యజ్ఞ, సాధన గృహమును ప్రసాదించండి. అందుకే మేము స్పర్థించి శత్రువులను, దేవశూన్య సైన్యములను పరాజితులను చేయగలము. దేవభక్తులకు ఆశ్రయము కలిగించగలము.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత నాలుగవ అష్టకము ఆరవ మండలమున నాలుగవ అనువాకము సమాప్తము)

**అయిదవ అనువాకము ఏబదవ సూక్తము**

ఋషి - ఋజశ్వనుడు, దేవత - బహుదేవతాకం, ఛందస్సు - త్రిష్టుప్.

1. దేవతలారా ! సుఖమునకుగాను స్తోత్రసహితుడనై అదితి, వరుణ, మిత్ర, అగ్ని, శత్రుహంత సేవ్య ఆర్యమ, సవిత, భగ; మున్నగు సమస్త రక్షక దేవతలను ఆహ్వానించుచున్నాను.

2. దీప్తి సంపన్న సూర్యా ! దక్ష సంభూతులయి, శోభన, దీప్తివంతులగు దేవతలను మాకు అనుకూలురను చేయండి. ద్విజన్మ-స్వర్గ, భూములకు ఉత్పన్నులయిన దేవగణములు యజ్ఞప్రియులు, సత్యవాదులు, ధనసంపన్నులు, యాగార్హులు, అగ్ని జహ్వులు అగుదురు. (దక్ష శబ్దము తండ్రియని శాయణుడు)

3. స్వర్గ పృథ్వులారా ! మాకు అధిక బలము ఇవ్వండి. మా స్వతంత్రతకొఱకు విశాల గృహము ఇవ్వండి. మావద్ద అతుల ఐశ్వర్యము ఉండు ఉపాయము చేయండి. దయాళువులగు దేవద్వయమా! మా ఇంటి నుండి పాపమును తొలగించండి.

4. గృహదాతలు, అజేయులు, రుద్రపుత్రులను ఆహ్వానించుచున్నాము. వారు మా వద్దకు రావలెను. మాకు మహాక్షుద్ర క్లేశములందు వారు మాకు సాయపడవలెను. అందుకు మేము మరుత్తులను పిలుచుచున్నాము.

5. మరుత్తులతో దీప్తమాన స్వర్గము భూమి లగ్నమై ఉన్నది. స్తోతలను సమృద్ధులను చేయు పూష ధనముతో మరుత్తులను సేవించును. అట్టి మరుత్తులారా ! మా ఆహ్వానములు విని మీరు విచ్చేయునపుడు విభిన్న మార్గములందున్న ప్రాణులు కంపించును.

6. స్తోతలారా ! అభినవ స్తుతులతో స్తుతిపాత్రుడు, వీరుడగు ఇంద్రుని స్తుతించండి. ఇంద్రుడు మన పిలుపులు వినవలెను. మనకు బోలెడు అన్నము ఇవ్వవలెను.

7. జలరాశీ ! నీవుమానవ హితైషివి. మాపుత్ర, పౌత్రులకు అనిష్టనివారకము. రక్షకమగు అన్నమునిమ్ము. సమస్త ఉపద్రవములను శాంతింపచేసి దూరము చేయుము. నీవు తల్లులవంటి శ్రేష్ఠ చికిత్సకుడవు. నీవు స్థావర జంగమ రూప జగత్ స్రష్టవు.

("భిషజో మాతృతమా" నీరు తల్లులవంటి వైద్యుడు అన్నాడు. మరొకచోట "ఆపత్సుసర్వేభేషజీః" నీటిలో అన్ని ఔషధములు ఉన్నవి అన్నాడు. ఔషధముగా నీటి ప్రాముఖ్యతను ఆనాడు గుర్తించుట జరిగినది.)

8. ఉష - ముఖమువంటి యజమానికి కోఱిన ధనమును వెల్లడించును. ఆమె - రక్షకుడు, హిరణ్యపాణి, పూజనీయుడగు సవితతో మావద్దకు రావలెను.

9. శక్తిపుత్ర అగ్నీ ! మా యజ్ఞమునకు నేడు దేవతలను తీసికొనిరమ్ము. నేను సదా నీ ఉదారత అనుభవించవలెను. నీ రక్షణల వలన నేను శోభన పుత్ర, పౌత్రాదియుక్తుడను కావలెను.

10. ప్రాజ్ఞులగు అశ్వినీ కుమారులారా ! నేను మీ పరిచర్యలు చేయువాడను. మీరు అంధకారమునుండి అత్రిని విడిపించినారు. అట్లే మమ్ము విడిపించుడు. నేతృద్వయమా! మీరు మమ్ము యుద్ధ దుఃఖమునుండి రక్షించండి. "దురితాదభీకే"

11. దేవతలారా ! మీరు మాకు దీప్తియుక్తము. బలకారి, పుత్రాదిసంపన్న, సుప్రసిద్ధ ధనము ప్రదానము చేయుడు. స్వర్గీయ-సూర్యసంబంధ, పార్థివ భూసంబంధ, గోజాత గోసంబంధ, జలజాత జలసంబంధులారా ! మా

మనోరథములు పూరించుడు. మమ్ము సుఖవంతులను చేయండి.

12. రుద్రుడు, సరస్వతి, విష్ణువు, వాయువు, ఋభుక్షి, వాజ, విధాత సమానముగా ప్రసన్నులు కావలెను. పర్జన్యుడు, వాయువు మా అన్నమును పెంపొందించవలెను.

13. ప్రసిద్ధ దేవత సవిత, భగుడు, జలరాశి పుత్రుడు, దానశీల అగ్ని, మమ్ము రక్షించవలెను. దేవపురుషులు, దేవతా స్త్రీలతో సమానప్రసన్నుడగు త్వష్ట దేవతలలో సమాన ప్రసన్నమగు స్వర్గము, సముద్రముతో సమాన ప్రసన్నమగు భూమి మమ్ము రక్షించవలెను.

14. అహిర్బుధ్న, అజ, ఏకపాద, పృథ్వి, సముద్రము మా స్తోత్రము వినవలెను. యజ్ఞసమృద్ధికర్తలు, మాచేత ఆహూతులు-స్తుతులు, మంత్ర ప్రతిపాద్యమానులు, ఋషుల ద్వారా యజమానులగు దేవగణములు మమ్ము రక్షించవలెను.

(అజో జన్మరహితః, అసహాయపివ గఛ్ఛతీత్యేకపాత అనిశాయణుడు. అజుడు జన్మరహితుడు. ఇతరుల సాయములేక నడుచువాడు ఏకపాదుడు)

15. భరద్వాజ గోత్రజులు, నా పుత్రులు ఈవిధముగనే పూజసాధక స్తోత్రములతో దేవతలను స్తుతింతురు. యజ్ఞార్హా దేవతలారా ! మీరు హవ్యహుతులు, గృహదాతలు, అజేయులు. మీరు దేవపత్నుల సహితముగ పూజింపబడుదురు.

## ఏబది ఒకటవ సూక్తము

ఋషి - ఋజిశ్వనుడు, దేవత - వైశ్వదేవులు ఛందస్సు 13-15 ఉష్ణిక్, 16 అనుష్టుప్, మిగిలినవి త్రిష్టుప్.

1. సూర్యుని యొక్క ప్రసిద్ధము, ప్రకాశకము, విస్తృతము మఱియు మిత్రావరుణలకు ప్రియము, అప్రతిహతము, నిర్మలము, మనోహరమగు దీప్తి ప్రకాశితమై అంతరిక్షమును భూషణమువలె అలంకరించుచున్నది.

2. సూర్యుడు జ్ఞాతవ్య త్రిభువనములు తెలిసినవాడు. జ్ఞానశీలుడు. తెలియరాని దేవతల జన్మలు తెలిసినవాడు. మానవుల సదసత్ కర్మల పరిదర్శనము చేయువాడు. ఆ సూర్యుడు స్వామియై మానవుల అనుకూల మనోరథములను తీర్చును.

3. నేను, యజ్ఞరక్షకులు, శోభన జన్ములగు అదితి, మిత్ర, వరుణ, ఆర్యమ, భగుని, స్తుతింతును. ఎవరి కార్యములు అప్రతిహతములో ఎవరు ధనశాలురో, ఎవరు జగములను పావనము చేయువారో అట్టివారి యశస్సును నేను

కీర్తింతును.

"అబ్ధిధీ తీవచ్ఛావో చేసధన్యః పావకాన్" స్తుష.

4. అదితి పుత్రులు హింసకులను విసరివేయువారు. సాధురక్షకులు. శక్తిమంతులగు అధీశ్వరులు. శోభనగృహదాతలు. నిత్యతరుణులు. ఎంతో ధనమున్నవారు. స్వర్గ నేతలు. అట్టి అదితి పుత్రులారా ! నేను అదితిని శరణు వేడుచున్నాను. ఆమె నా పరిచర్యలు కోరుచున్నది.

5. పితా స్వర్గమా ! మాతాపృథ్వి ! భ్రాతా అగ్నీ ! వసువులారా ! మీరు మమ్ము సుఖవంతులను చేయండి. అదితి పుత్రులారా ! అదితీ ! మీరందరు కలిసి మాకు అధిక సుఖములను అందించండి.

6. యాగయోగ్య దేవతలారా ! మీరు మమ్ము వృక మఱియు వృకీల చేత పడనీయకండి. మీరు మా దేహము, బలము, వాక్యమును నిర్వహించండి. (వృక వృకీ ఆడ మగ తోడేళ్లు లేక దస్యులు)

7. దేవతలారా ! మేము మీ వారలము. మేము ఇతరుల పాపబాధలు అనుభవించరాదు. వసువులారా ! మీరు నిషేధించిన వారిని మేము పూజించరాదు. విశ్వదేవతలారా ! మీరు లోకములకు అధిపతులు. అందువలన శత్రువు తన దేహమునకు తానే నష్టము కలిగించుకొను ఉపాయము చేయండి.

8. నమస్కారము అన్నింటిని మించినది. అందువలన నేను నమస్కరింతును. నమస్కారమే స్వర్గ, భూములను ధరించును. అందువలన నేను దేవతలకు నమస్కరింతును. దేవతలు నమస్కారమునకు వశీభూతులు. అందువలన నమస్కారముతో పాపములకు ప్రాయశ్చిత్తము చేసికొందును.

9. యజ్ఞపాలకులగు దేవతలారా ! మీరు యజ్ఞ నేతలు. విశుద్ధ బలసంపన్నులు. దేవయజన గృహ నివాసులు. అజేయులు. బహుదర్శకులు. అధినాయకులు. మహామహులు. నేను మీవద్ద నమస్కార సహితుడనయి ప్రణమిల్లుచున్నాను.

10. మిత్రావరుణులు అగ్నిదీప్తి సంపన్నులు. వారు మా సకల పాపములను నాశనము చేయవలెను. వారు శోభన బలవంతులు, సత్యకర్ములు, స్తోత్ర నిరతుల విషయమున పక్షపాతులు.

11. ఇంద్ర, పృథివి, పూష, భగ, అదితి, పంచజనులు మా నివాస భూమిని పెంపొందించుడు. వారు మాకు సుఖదాతలు, అన్నదాతలు, సత్పథ ప్రదర్శకులు, రక్షించువారు, ఆశ్రయదాతలు.

(పంచజనులు 1. దేవతలు 2. మానవులు 3. గంధర్వులు 4. అప్సరసలు 5. పితరులు)

12. దేవతలారా ! భరద్వాజ గోత్రజుడగు ఈ స్తోత మీ అనుగ్రహము కోరుచున్నాడు. అతనికి వెంటనే ఒక స్వర్గమువంటి నివాసము దీప్తిమంతమగు గృహమును ఏర్పరచండి. హవ్యదాతగు ఋషి-అన్య యజమానులతో కలిసి ధనార్థియై దేవతలను స్తుతించును.

13. అగ్నీ ! నీవు కుటిలుడు, పాపి, దుష్టుడు, శత్రువును దూరము చేయుము. సాధుజన రక్షకా ! మాకు సుఖములను ప్రసాదించుము.

14. సోమమా ! అభిషవ పోషకులమగు మేము నీ మిత్రుత్వము కోరుచున్నాము. నీవు తిండిబోతు పణిని సంహరించుము. అతడు నిజమైన దస్యుడు.

15. ఇంద్రాది దేవతలారా ! మీరు దానశీలురు దీప్తిశాలురు. మార్గములందు మమ్ము రక్షించండి. సుఖదాతలు కండి.

16. శత్రు పరిహారములు, ధనలాభము కలుగు సరళ, పవిత్ర మార్గమున మేము ప్రవేశించినాము.

## ఏబది రెండవ సూక్తము

ఋషి - ఋజశ్వనుడు, దేవత - విశ్వదేవులు ఛందస్సు
1-6, 13, 15-17 త్రిష్టుప్, 7-12 గాయత్రి, 14 జగతి.

1. నేను ఈ యజ్ఞము దేవతలకు ఉపయుక్తమని భావింతును. ఇది నేను చేసిన యజ్ఞము లేక ఇతరులు చేసిన యజ్ఞముతో సరితూగ గలదోలేదో చెప్పవలెను. కావున మహాపర్వతములన్నియు వానిని అతియాజ ఋషిని బాధించవలెను. అతియాజుని ఋత్విక్కులు సహితము దీనులు కావలెను.

(అతియాజుడను ఒక ఋషి తాను మహిమలు కలవాడనని చెప్పి ఋజుశ్వడను రాజుతో యజ్ఞము చేయించినాడు. ఋషులు ఆ యజ్ఞమును నిరాకరించినారు.

ఋజుశ్వుడు ఒక గొఱ్ఱెకు బదులు వంద గొఱ్ఱెలను తోడేలుకు అర్పించినాడు. ఋజశ్వుని తండ్రి అతనిని గుడ్డివానిని చేసినాడు. అప్పుడు అశ్వినులు ఋజశ్వునకు దృష్టి ప్రసాదించినారు.)

2. మరుత్తులారా ! తనను మీకన్న శ్రేష్ఠుడనుకున్నవ్యక్తికి నా స్తుతులను నిందించువానికి సమస్త శక్తులు అనిష్టకారులు కావలెను. స్వర్గము ఆ బ్రహ్మద్వేషిని దగ్ధము చేయవలెను.

3. సోమా ! జనులు నిన్ను మంత్ర రక్షకుడని ఎందుకు అందురు? నిన్ను నిందించి మమ్ము ఉద్ధరించినా మనువారు ఎవరు? శత్రువులు మమ్ము నిందించుచున్నను ఎందుకు ఉపేక్షించుచున్నావు? బ్రహ్మద్వేషిమీద సంతాపక ఆయుధము విసరుము.

4. ఆవిర్భూతములగు ఉషలు నన్ను రక్షించవలెను. నదులన్నియు నన్ను రక్షించవలెను. నిశ్చల పర్వతములు నన్న రక్షించవలెను. దేవ యజనమునకు విచ్చేసిన పితరులు దేవతలు నన్ను రక్షించవలెను.

5. మేము సదా స్వతంత్ర చిత్తులము కావలెను. మేము సదా ఉదయ సూర్యుని దర్శించవలెను. హవ్యవాహకుడు, యజ్ఞ అధిష్ఠాత, మహైశ్వర్యశాలి అగ్ని మమ్ము అతని ఇష్టప్రకారము తీర్చవలెను.

6. ఇంద్రుడు మరియు జలరాశితో పొంగు సరస్వతీనది రక్షణలతో మా వద్దకు రావలెను. ఓషధులు సహితముగా పర్జన్యుడు మాకు సుఖదాత కావలెను. తండ్రివంటి అగ్ని అనాయాసముగా స్తుత్యుడై ఆహ్వానయోగ్యుడు కావలెను.

7. విశ్వదేవగణములారా ! మా ఆహ్వానములు వినండి. రండి. పరచిన కుశలపై కూర్చొండి.

8. దేవతలారా ! ఘృతయుక్త హవ్యము. మిమ్ము సేవించు వ్యక్తివద్దకు మీరందరు రండి.

9. అమరపుత్రులగు విశ్వదేవగణము మాత్రమే మా స్తుతులను వినవలెను. మాకు సుఖములు అందించవలెను.

10. యజ్ఞ సమృద్ధికారకులు, సమయమునకు స్తోత్రములు వినువారగు విశ్వదేవగణములు చక్కగా తమకు ఉపయుక్తమగు దుగ్ధము స్వీకరించవలెను.

11. మరుత్తులతో ఇంద్రుడు, త్వష్టతో మిత్రుడు, ఆర్యమ మా సమస్త స్తోత్రములను, సమస్త హవ్యములను స్వీకరించవలెను.

12. దేవతలను పిలుచు అగ్ని దేవతలలో మహాయోగ్యుని తెలిసి మర్యాదపూర్వకముగా ఈ యజ్ఞక్రియను నెరవేర్చవలెను.

13. విశ్వదేవగణములారా ! మీరు అంతరిక్షమున, భూలోకమున లేక స్వర్గమున ఉందురు. మా ఆహ్వానములు వినండి. అగ్ని రూప జిహ్వాతోగాని మరెట్లయినగాని మా ఈ యజ్ఞమును స్వీకరించండి. మీరందరు మేము పరచిన కుశలమీద ఆసీనులు కండి. సోమరసము త్రాగండి. ఉల్లాసవంతులు కండి.

14. యజ్ఞార్హ దేవగణము, స్వర్గము, పృథ్వి, జలరాశిపుత్రుడు అగ్ని మా స్తోత్రములను వినవలెను. దేవతలారా!

మీరు ఇష్టపడని స్తుతిని మేము ఉచ్చరించరాదు. మేము మీకు దగ్గరివారము కావలెను. సుఖములు పొందవలెను. సంతోషించవలెను.

15. పృథ్వి, స్వర్గము లేక అంతరిక్షమున అవిర్భవించిన మహామహులు, సంహారక శక్తియుక్తులగు దేవగణములు రాత్రింబవళ్లు మాకు, మా సంతతికి అన్నము ప్రసాదించవలెను.

16. అగ్ని, పర్జన్యులారా ! మా యజ్ఞకార్యమును రక్షించండి, మీరు సులభ ఆహ్వానయోగ్యులు. కావున ఈ యజ్ఞమున స్తుతులు వినండి. మీలో ఒకడు అన్నము ఇచ్చును. మరొకడు గర్భోత్పత్తి చేయును. కావున మీరు మాకు అన్నమును సంతానమును ఇవ్వండి.

17. పూజ్యులగు విశ్వదేవగణములారా ! నేడు మా ఈ యజ్ఞమున కుశలు పరచినంత, అగ్ని ప్రజ్వలితమైనంత, నా స్తోత్రోచ్చారణము జరిగినంత. నమస్కారయుతముగా నీ సేవ చేసినంత హవ్యములు స్వీకరించి తృప్తులగుడు.

## ఏబది మూడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - పూష, ఛందస్సు - 7 అనుష్టుప్, మిగిలినవి గాయత్రి.

1. మార్గపతి పూషా ! కర్మానుష్ఠానము. అన్నలాభము కొఱకు యుద్ధరంగమున రథమువలె నిన్ను అభిముఖుని చేసెదము.

2. పూషా ! మా వద్దకు మానవహితైషి, ధనదానమున ఉదారుడు, విశుద్ధ దానవంతుడగు ఒక గృహస్థుని పంపుము.

3. దీప్తిసంపన్నుడవగు పూషా ! పిసినారిని దానము చేయుటకు ప్రోత్సహించుము. అతని హృదయమును కోమలము చేయుము.

4. ప్రచండ బలశాలి పూషా ! ధనలాభమునకు సకల మార్గములను వెల్లడించుము. విఘ్నకారులగు దొంగలు మున్నగు వారిని సంహరింపుము. మా పూజలను సఫలము చేయుము.

5. జ్ఞానివగు పూషా ! రంపమువంటి దానితో పణులు లేక లుబ్ధులు హృదయములను విచ్చును. వారిని మాకు అప్పగించుము.

6. పూషా ! సూక్ష్మమగు రంపము వంటి దానితో ఫణిలేక దొంగ గుండె చీరుము అతని హృదయమున సద్భావన నింపుము. నాకు అప్పగించుము.

7. జ్ఞానివగు పూషా ! దొంగల గుండెలమీద వ్రాయుము. వారిలోని కఠోరతను తగ్గించుము. వారిని మాకు అప్పగించుము.

8. దీప్తిసంపన్న పూషా ! అన్న ప్రేరకమగు ఉలిని పట్టుము. దానితో లోభుల హృదయముల మీద వ్రాయుము. వారి కఠోరతను మెత్తపరచుము.

(అనంత కాలమున బుద్ధుడు, క్రీస్తు, మహాత్ముడు ఈ భావనలనే ప్రవచించినారు. శిక్షించుటకుకాక సంస్కరించుటకు ప్రాధాన్యత ఇచ్చినారు)

9. దీప్తిశాలి పుషా ! నీవు గోవులను, పశువులను నడిపించు అస్త్రమునే మాకు ఉపకారము చేయుమని ప్రార్థింతుము.

10. పూషా ! మా అనుభవమునకుగాను మాయాగకర్మకు గోవులను, అశ్వములను, అన్నమును పరిచారకులను పుట్టించుము.

## ఏబది నాలుగవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - పూష, ఛందస్సు - గాయత్రి.

1. పూషా ! మాకు వస్తుతః మార్గదర్శకము చేయువాడు దొంగిలించిన సొమ్ము దొరికించునట్టి విలక్షణ వ్యక్తిని పరిచయము చేయుము.

2. పూష అనుగ్రహమున మాకు సమస్త గృహములను చూపి, 'ఇవిగో ఇవి నీ తప్పిపోయిన పశువులు' అని చూపించగల వ్యక్తి లభించవలెను.

3. పూష ఆయుధమగు చక్రమునకు హాని జరుగదు. ఈ చక్రపు తొడుగు సడలదు. దీని వాడి మొక్కవోదు.

4. పూషకు హవ్యము ఇచ్చి సేవించు వ్యక్తికి పూష కొంచమైనను ఉపకారముచేయడు. అయినను ప్రధానముగా ఆ వ్యక్తియే ధనము పొందును.

5. మా గోవులను రక్షించుటకుగాను పూష వాటిని అనుసరించవలెను. అతడు మా అశ్వములను రక్షించవలెను. మాకు అన్నము ఇవ్వవలెను.

6. పూషా ! రక్షణకుగాను సోమాభిషవము చేయు యజమాని గోవులను అనుసరించుము. అట్లే స్తోత్రములు ఉచ్చరించు మా గోవులను కూడ అనుసరించుము.

7. పూషా ! మా గోవులకు నష్టము కలుగరాదు. అవి పులులు మున్నగువాని వాత పడరాదు. బావిలో పడరాదు. కావున నీవు అహింసిత గోవులవెంట సాయంత్రము రమ్ము.

8. మా స్తోత్రములను వినువాడు దారిద్ర్యనాశకుడు. తరగని ధనమునకు, సకల జగములకు అధిపతి పూషవద్ద మేము ధనము ప్రార్థింతుము.

9. పూషా ! మేము మే ఉపాసన చేసినంతకాలము మేము ఎన్నడును హతులముకారాదు. ఇప్పుడు మేము స్తుతించుచున్నాము. హతులముకారాదు.

10. పూష తన కుడిచేతితో మా గోధనము తప్పిపోకుండ చూడవలెను. తప్పిపోయిన వాటిని తిరిగి రప్పించవలెను.

## ఏబది అయిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - పూష, ఛందస్సు - గాయత్రి.

1. పూషా ! నీవు దీప్తి సంపన్నుడవు. ప్రజాపతి పుత్రుడవు. నీ స్తోతలు నావద్దకు రావలెను. మేము ఇద్దరము కలసెదము. నీవు మా యజ్ఞమునకు నేతవగుము.

2. పూష మాకు మంచి రథి, కపర్ది. అతుల ఐశ్వర్యములకు అధిపతి. మాకు మిత్రుడు. అతనిని ధనము కొరకు ప్రార్థింతుము.

3. పూషా ! నీవు దీప్తిశాలివి. ధనప్రవాహమవు. ధనరాశివి. మేకలే నీకు అశ్వములు. నీవు విశేష స్తోతకు మిత్రుడవు.

4. నేడు మేము మేక వాహనుడు, అన్నయుక్తుడగు పూష లేక సూర్యుని స్తుతింతుము. జనులు అతనిని ఉషకు

ప్రియుడు అందురు.

5. రాత్రిరూపమాతకు పూషభర్త. అతనిని మేము స్తుతింతుము. మా సోదరి ఉషకు ప్రియుడు మా స్తోత్రములు వినవలెను.

6. రథమునకు కట్టిన అజములు శ్రోతల ఆశ్రయదాత పూష రథమును గుంజూచు ఇచటికి రావలెను.

## ఏబది ఆరవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - పూష, ఛందస్సు - గాయత్రి, చివరిది అనుష్టుప్.

1. పూషకు నేయి కలిపిన సత్తుపిండి భోగముచేసి స్తుతించువాడు అన్యదేవతలను స్తుతించనవసరములేదు.

2. రథిశ్రేష్ఠుడు, సాధురక్షకుడు, సుప్రసిద్ధ దేవత ఇంద్రుడు తన మిత్రుడు పూష సాయమున శత్రు సంహారము చేయును.

3. చాలకుడు, రథిశ్రేష్ఠుడగు పూష సూర్యుని హిరణ్మయ రథ చక్రమమును కదిలించును.

4. పూష బహులోక వందనీయుడు. మనోహరుడు. జ్ఞాని. మేము నిత్యము ఏ ధనము లక్ష్యముగా నిన్ను స్తుతింతుమో, అట్టి వాంఛిత ధనమును మాకు ప్రసాదించుము.

5. గోకామియగు పూషా ! నీవు సమస్త మానవులకు గోలాభము కలిగించుము. పూషా ! దూరదేశములందు కూడ కీర్తివంతుడవయినావు.

6. పూషా ! ఈనాటి రేపటి యజ్ఞములు నెరవేరుటకు నీ రక్షణలు అభ్యర్థించుచున్నాము. ఆ రక్షణలు పాపములకు దూరపువి. ధనములకు దగ్గరివి.

## ఏబది ఏడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - పూష, ఇంద్రుడు, ఛందస్సు - గాయత్రి.

1. ఇంద్రపూషలారా ! మా శుభముల కొఱకు నేడు మేము నీ స్నేహము కోఱుచున్నాము. అన్నప్రాప్తి కొఱకు మిమ్ము ఆహ్వానించుచున్నాము.

2. మీలో ఒకరు ఇంద్రుడు పాత్రలోనున్న అభిషుత సోమపానమునకు వెళ్లును. మరొకరు పూష యవల సత్తు తినగోరును.

3. ఒకరి వాహనము మేక మరొకరిది స్థూలకాయులగు రెండు అశ్వములు. ఇంద్రుడు ఆ అశ్వములతోనే వృత్రుని సంహరించినాడు.

4. ఇంద్రుడు అతిశయమగు మహా వృష్టి కురిపించినపుడు పూష అతనికి సహాయకుడగును.

5. వృక్షపు గట్టి కొమ్మను పట్టుకున్నట్లు మేము ఇంద్రుడు, పూషల కృపావృద్ధిమీద ఆధారపడుదుము.

6. సారథి కళ్లెమును లాగినట్లు మేము మా ప్రవృష్ట కళ్యాణమునకుగాను ఇంద్రుని, పూషను ఆకర్షింతుము.

## ఏబది ఎనిమిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - పూష, ఛందస్సు - 2 జగతి, మిగిలినవి త్రిష్టుప్.

1. పూషా ! నీ ఈ పగటి రూపము తెల్లనిది. మరొక రాత్రి రూపము యజనీయము. నీయొక్క దిన-రాత్రి రూపములు విభిన్నములు. నీవు సూర్యునివలె ప్రకాశమానుడవు. నీవు దాతవు. జ్ఞానివి. ఇప్పుడు నీ శుభప్రద దానము వెల్లడి కావలెను.

2. పూష ఛాగ వాహనుడు. పశుపాలకుడు. అతని గృహము అన్నపూర్ణము. అతడు స్తోతలదాత. అఖిల భువనములమీద స్థాపించబడినవాడు. అతడు సూర్యరూపమున సకల ప్రాణులను ప్రకాశింప చేయును. తనచేత రంపము. పట్టుకొని నభోమండలము లోనికి పోవును.

3. పూషా ! నీవి హిరణ్మయ నౌకలు. అవి సముద్ర మధ్యస్థిత ఆకాశమున నడచును. వాటి ద్వారా నీవు సూర్యుని దూత కార్యము నిర్వహింతువు. నీవు హవ్యరూప అన్నము కోఱువాడవు. స్తోతలు నీకు పశువులు మున్నగునవి సమర్పించి నిన్ను వశపరచుకొందురు.

4. పూష స్వర్గము, భూమికి శోభన బంధువు. అన్నములకు అధిపతి. ఐశ్వర్యశాలి. మనోహరమూర్తి. బలశాలి. స్వచ్ఛందముగా సమర్పించిన పశువులు మున్నగువానితో ప్రసన్నుడగువాడు. శుభగమనుడు. అతనిని దేవతలు

సూర్యుని స్త్రీ వద్దకు పంపినారు.

(సూర్యుని కూతురును అశ్వినుల కొఱకు అడుగుటకుగాను దేవతలు పూషను సూర్యునివద్దకు పంపినారని శాయణుడు)

## ఏబది తొమ్మిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - సూర్యుడు, అగ్ని, ఛందస్సు - 1-7 అనుష్టుప్. మిగిలినవి జగతి.

1. ఇంద్రాగ్నులారా ! మీరు శౌర్యమును ప్రకటించినారు. మేము దానిని గురించే ముచ్చటింతుము. అప్పుడు సోమరసము అభిషుతమగును. మీరు అసురులను హతమార్చినారు. మీరు అక్షయులు.

2. ఇంద్రాగ్నులారా ! ప్రతిపాదితమైన మీ జన్మమాహాత్మ్యము యదార్థము. ప్రశంసనీయము. మీ ఇద్దరి తండ్రి ఒక్కడే. మీరు కవలలు. మీ తల్లి సర్వత్ర విద్యామాన్యురాలు.

3. ఇంద్రాగ్నులారా ! వడిగల రెండు అశ్వములు ఎట్లు గడ్డివైపు పరిగెత్తునో, అట్లే మీరు సోమరసము అభిషుతముకాగా కలిసి వెళ్లుదురు. మా రక్షణకుగాను నేడు మేము వజ్రధరుడు, దానాది గుణయుక్తుడగు ఇంద్రుని, అగ్నిని యజ్ఞమునకు పిలుచుచున్నాము.

4. ఇంద్రాగ్నులారా ! మీరు యజ్ఞసమృద్ధి ప్రదాతలు. మీ స్తోత్రములు ప్రసిద్ధములు.సోమరసము అభిషుతముకాగా ప్రేమరహిత స్తోతద్వారా కుత్సితముగా మిమ్ము స్తుతించువాని సోమమును మీరు ముట్టరు.

5. దీప్తి సంపన్నులగు ఇంద్రాగ్నులారా ! మీలో ఇంద్రుడు సూర్యాత్మకుడు. అతడు నానా ప్రకార గమనములుగల అశ్వములను రథమున కూర్చి అగ్ని సహితముగా ఆ రథమును ఎక్కి సాగును. అప్పుడు మానవులలో ఎవడు మీ కార్యమును గమనమును ఎరుగు సమర్థుడగును.

6. ఇంద్రాగ్నులారా ! పాదరహిత ఉష ప్రాణుల శిరోదేశములను ఉత్తేజపరచి, వాని నాలుకలతో బిగ్గర శబ్దములు పలికించి, పాదసంపన్నయ నిద్రిత ప్రాణులకు అభిముఖమగుచున్నది. ఆమె అట్లే ముప్పది అడుగులు ముహూర్తములు సాగును.

7. ఇంద్రాగ్నులారా ! మీరు యోద్ధలు. రెండు చేతులతో ధనుస్సు లాగుదురు. ఈ మహా సంగ్రామమున గోవులను అనుసంధానము చేయునపుడు మమ్ము వదలకండి.

8. ఇంద్రాగ్నులారా ! హంతకులు, ఆక్రమించువారగు శత్రువులు మమ్ము బాధించుచున్నారు. వారిని దూరము చేయండి. వారికి సూర్యదర్శనము లేకుండ చేయండి.

9. ఇంద్రాగ్నులారా ! మీరు దివ్య పార్థివ ఉభయ ధనములకు అధిపతులు. కావున ఈ యజ్ఞమున జీవన పోషణకుమగు సమస్త ధనములను ప్రసాదించండి.

10. ఇంద్రాగ్నులారా ! మీరు స్తోత్రములు. ఉపాసనలతో కూడి ఆహ్వానములను ఆలకింతురు. మేము సమర్పించు సోమరస పానమునకు విచ్చేయండి.

## అరువదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రాగ్నులు.
ఛందస్సు 1-3, 13 త్రిష్టుప్, 4-12 గాయత్రి, 14 బృహతి, 15 అనుష్టుప్.

1. ఇంద్రాగ్నులు బృహత్ ధనస్వాములు. బలవంతులగు శత్రువులను పరిమార్చువారు. అన్నాభిలాషియై వారిని సేవించు వారి శత్రువులను సంహరింతురు. అన్నము ప్రసాదింతురు.

2. ఇంద్రాగ్నులారా ! మీరు దొంగిలించిన గోవులను, జలరాశిని, సూర్యుని, ఉషల కొఱకు యుద్ధములు చేసినారు.

ఇంద్రా ! నీవు దిశలు, సూర్యుని, ఉషలను, విచిత్ర, జలమును, గోవులను లోకమునకు కూర్చినారు. అశ్వాధిపతీ ! అగ్నీ ! నీవు కూడ అట్టి పనులు చేసినావు.

3. వృత్రహంత ఇంద్రా ! అగ్నీ ! మా హవ్యాన్నమున పరిపుష్టులగుటకుగాను మీ శత్రునాశక బలముతో మా ముందుకు విచ్చేయండి. మీరు అనింద్యము, అత్యుత్కృష్టమగు ధనమును వెంట పెట్టుకొని మా వద్ద ఆవిర్భూతులు కండి.

4. ప్రాచీన కాలమున ఋషులచే వీరకార్యములు కీర్తించబడిన ఇంద్రాగ్నులను పిలుచుచున్నాను. వారు స్తోతలను హింసించరు.

5. ఇంద్రాగ్నులు ప్రచండ బలశాలులు. శత్రుహంతలు. మేము వారిని ఆహ్వానించుచున్నాము. వారు మమ్ము ఈ యుద్ధమున కృతకృత్యులను చేసి సుఖవంతులను చేయవలెను.

6. సాధుజన రక్షకులు ఇంద్రాగ్నులు. వారు ధార్మికులు. ఆధార్మికులు చేసిన సమస్త, ఉపద్రవములను నివారింతురు. వారు సకల విద్వేషులను సంహరించినారు.

7. ఇంద్రాగ్నులారా ! ఈ స్తోతలు మిమ్ము స్తుతించుచున్నారు. సుఖదాతలారా ! మీరు ఈ సోమమును స్వీకరించండి.

8. నేతలగు ఇంద్రాగ్నులారా ! మీ అశ్వములు బహుజన వాంఛనీయలు. హవ్యదాతల కొఱకు పుట్టినవి. మీరు ఆ గుఱ్ఱములన్నింటిమీద స్వారిచేయుచు రండి.

9. నేతలగు ఇంద్రాగ్నులారా ! అభిషుత సోమపానము చేయుటకు ఈ యజ్ఞమునకు వేంచేయండి.

10. అగ్ని తన శిఖల జ్వాలలతో సమస్త అరణ్యములందు వ్యాపించును. జ్వాలారూప జిహ్వతో వానిని మసిచేయును. స్తోతలారా ! అట్టి అగ్నిని స్తుతించండి.

11. ప్రజ్వలితమగు అగ్నిలో ఇంద్రునికొఱకు సుఖకరమగు హవ్యము సమర్పించువారికి ఇంద్రుడు దీప్తి సంపన్న అన్నము కలిగించి జల వర్షము కురిపించును.

12. ఇంద్రాగ్నులారా ! మాకు బలము కలిగించు అన్నము అందించండి. మా హవ్యమును బలిష్ఠము చేయుటకు మాకు వేగముగల అశ్వములను ఇవ్వండి.

13. ఇంద్రాగ్నులారా ! హోమము ద్వారా మీ ఇద్దరిని అనుకూలురును చేసి కొనుటకు నేను మిమ్ము పిలుచుచున్నాను. హవ్యము ద్వారా త్వరగా తృప్తులను చేయుటకు మీ ఇద్దరిని పిలుచుచున్నాను. మీరిద్దరు అన్నము, ధనము ఇచ్చువారు. అందుకే అన్నలాభము కొఱకు మీ ఇద్దరిని పిలుచుచున్నాను.

14. ఇంద్రాగ్నులారా ! గోవులు, అశ్వములు, విపుల ధనముతో మీరు మా వద్దకు రాగలరు. మిత్రవంతులు, దానాదిగుణభూషితులు, సుఖప్రదాతలగు ఇంద్రాగ్నులను మాతో మైత్రికిగాను ఆహ్వానించుచున్నాము.

15. ఇంద్రాగ్నులారా ! మీరు సోమాభిషవము చేయు యజమాని పిలుపు వినండి. హవ్యము కోరండి. రారండి. మధుర సోమరస పానము చేయండి.

## అరువది ఒకటవ సూక్తము

ఋషి భరద్వాజుడు, దేవత సరస్వతి, ఛందస్సు 1-3, 13 జగతి, 14 త్రిష్టుప్, మిగిలినవి గాయత్రి.

1. ఈ సరస్వతియే హవ్యదూత బధ్న్యశ్వునకు వేగవంతుడు. ఋణమోచకుడగు దివోదాసు అను పుత్రుని ప్రసాదించినది. దివోదాసు బహుజనులను బాధించు, దానవిముఖ, పణులను సంస్కరించినాడు.

సరస్వతీ ! నీవు చేసిన ఈ దానము ఎంతో గొప్పది.

2. ఈ సరస్వతీనది గడ్డలు త్రవ్వువానివలె వేగవంతములగు తరంగములతో పర్వత తటములను భగ్నము చేయును. మా రక్షణ కొఱకుగాను స్తుతులు యజ్ఞములతో రెండు దరులను కూల్చు సరస్వతిని సేవింతుము.

3. సరస్వతీ ! నీవు దేవనిందకులను వధించినావు. సర్వ వ్యాపి వృసయ, త్వష్ట పుత్రుని సంహరించినావు. అన్నసంపన్న సరస్వతీ ! నీవు మానవులకు భూమి ఇచ్చినావు. వారికొఱకు వర్షము కలిగించినావు.

4. దానశీల, అన్నయుక్త, స్తోతల రక్షించు, సరస్వతి మాకు అన్నము అందించి తృప్తులను చేయవలెను.

5. సరస్వతీ ! ఇంద్రునివలె నిన్ను స్తుతించు వ్యక్తి ధనప్రాప్తికిగాను యుద్ధమున దిగినపుడు అతనిని రక్షింపుము.

6. అన్నపూర్ణా ! సరస్వతీ ! యుద్ధమున మమ్ము రక్షింపుము. పూషవలె, మా అనుభవమునకు ధనము ప్రసాదించుము.

7. భీషణ, హిరణ్మయ రథమున ఎక్కిన శత్రుఘాతిని సరస్వతి మా మనోహర స్తోత్రములను కోరవలెను.

8. సరస్వతి యొక్క అపరిమిత, అకుటిల, దీప్త, అప్రతిహతగతి జలవర్షక వేగము ప్రచండ ధ్వని చేసి సాగును.

9. నియత భ్రమణకారి సరస్వతి సూర్యునివలె పగళ్ళను తెచ్చును. అట్లే మా సకల శత్రువులను పరాజితులను చేయును. ఆమె తన జలమయ భగిమలతో మావద్దకు రావలెను.

10. సప్తనది స్వరూప, సప్తభగినీయుక్త, ప్రాచీన ఋషి సేవిత, మా ప్రియతమ సరస్వతి మా స్తుతి పాత్రురాలు కావలెను.

11. సరస్వతి పృథివి, స్వర్గముల విస్తీర్ణ ప్రదేశములను తన దీప్తితో నింపినది. ఆ సరస్వతియే నిందకుల నుండి

మమ్ము రక్షించవలెను.

12. త్రిలోక వ్యాపిని, గంగాది సప్తనదియుక్త, పంచవర్ణుల సమృద్ధిదాయిని సరస్వతి ప్రతి యుద్ధమునందును ఆహ్వాన యోగ్య అగును.

13. మాహాత్మ్యము, కీర్తివలన దేవతలందు ప్రసిద్ధమైనదియు, నదులన్నింటిలో వేగవతియు, శ్రేష్ఠతవలన అత్యంత గుణశాలినియు అగు సరస్వతి జ్ఞానులగు స్తోతల స్తుతియోగ్య అగును.

14. సరస్వతీ ! మమ్ము ప్రశస్త ధనము వైపు నడిపించుము. మమ్ము హీనులను చేయకుము. ఎక్కువ నీటితో మమ్ము బాధించకుము. మా బంధుత్వమును, గృహమును స్వీకరించుము. మేము నీ వద్ద నుండి నికృష్ట స్థానమునకు పోరాదు.

*దాశరథి లక్ష్మణాచార్య బుచ్చమాంబల పౌత్రుండును, విద్వాన్ వేంకటాచార్య వేంకటాంబల పుత్రుండును ఆంధ్ర ఆస్థానకవి దాశరథి కృష్ణమాచార్య అనుజుండును కమలానామ్ని ధర్మపత్నీ సహితుండును చిల్లరదేవుళ్లు, మోదుగుపూలు, జనపదం, మాయజలతారు, మానవత, శరతల్పం, పావని, రానున్నది ఏది నిజం? ఇత్యాది నవలా రచయితయునగు శ్రీ దాశరథి రంగాచార్య విరచిత ఆంధ్ర వచన ఋగ్వేద సంహితమున నాలుగవ అష్టకము సమాప్తము.*

**కాలేవర్షతు పర్జన్యః**

**శ్రీ మదాంధ్ర వచన ఋగ్వేద సంహిత**

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోపశాంతయే**

## అయిదవ అష్టకము

### ఆరవ మండలము

**మొదటి అధ్యాయము** **ఆరవ అనువాకము**

### ఆరువది రెండవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. అశ్వినులు క్షణమాత్రమున శత్రువును ఓడించగలవారు. ప్రభాత కాలమున పృథివి పర్యంతమగు అంధకారమును దూరము చేయువారు. ద్యులోక నేతలు, భువనములకు ఈశ్వరులు. అట్టి వారిని నేను స్తుతింతును. మంత్రములతో ఆహ్వానింతును.

2. అశ్వినులు యజ్ఞమువైపు తరలినారు. నిర్మల తేజోబలమున తరలినారు. రథపు దీప్తిని ప్రకటించుచు తరలినారు. ఎల్లలు ఎరుగని వెలుగులు కల్పించుచు తరలినారు. జలము కొఱకు అశ్వములతో మరుదేశము లంఘించి తరలినారు.

3. అశ్వినులారా ! మీరు ఉగ్రులు. సమృద్ధముకాని గృహమును సమృద్ధము చేయుటకు వెళ్లుదురు. మీరు వాంఛనీయులు. మనోవేగవంతులు. అశ్వములమీద స్తోతలను స్వర్గమునకు చేర్చండి. హవ్యదాతను బాధించువారికి దీర్ఘనిద్ర కలిగించండి.

4. అశ్వినులు యువకులు. హోతలు. ద్రోహరహితులు. వారు గుఱ్ఱములను పూన్చవలెను. అన్నము, పుష్టి, రసము వహించవలెను. అభినవ స్తోతల మనోజ్ఞస్తుతులవద్దకు చేరవలెను. ప్రాచీన అగ్ని వారి యాగము చేయవలెను.

5. అశ్వినులు స్తుతికారుని, స్తుతికర్తలను సుఖింపచేయుదురు. స్తుతికర్తకు బహువిధ దానములు ఇచ్చెదరు. వారు రుచిరులు. బహుకర్ములు. ప్రాచీనులు. దర్శనీయులు. నేను కొత్త స్తుతితో వారిని సేవింతును.

6. తుగ్రపుత్రుడు భుజ్యుడు సముద్రమధ్యమున నావలేని వాడయినాడు. అప్పుడు మీరు ధూళిరహిత మార్గమున రథయుక్తులై బయలుదేరినారు. అశ్వములతో జల ఉత్పత్తి స్థానమగు సముద్రము నుండి భుజ్యుని బయటికి తెచ్చినారు.

(ధూళిరహిత మార్గము ఆకాశ మార్గము)

7. అశ్వినులారా ! మీరు రథారూఢులు. మీ రథము విజయవంతము. దానిమీద సాగుడు. మార్గమధ్యమున ఉన్న పర్వతములను బద్దలుకొట్టండి. మీరు కోరికలు తీర్చువారు. సంతానము కోరువారి పిలుపు వినండి. స్తోతల కోరికలు తీర్చండి. స్తోతయొక్క ప్రసవము ఉడిగిన గోవును పాలిచ్చుదానిని చేయండి. ఈవిధముగా మీరు సుబుద్ధిశాలులు కండి. సర్వత్ర సంచరించండి.

8. ప్రాచీన ద్యావాపృథ్వులారా ! ఆదిత్యులారా ! వసువులారా ! రుద్రపుత్రులారా ! మానవులు అశ్విద్వయ సేవకులు. వారి విషయమున దేవతలకు మహా క్రోధమున్నది. దానిని తాపకరమగు రాక్షసపతిని వధించుటకు ఉపయోగించండి.

9. అశ్వినులు రాజులు. వారిని సమయానుసారము సేవించువారున్నారు. వారిని గురించి మిత్రావరుణులకు తెలియును. ఆ వ్యక్తి మహాబలి రాక్షసుని మీదకు అస్త్రము విసరును. అభిద్రోహాత్ములగు మానవుల వచనానుసారము అస్త్రము విడుచును.

10. అశ్విద్వయమా ! ఉత్తమ చక్రములు కలిగి, దీప్తివంతమై, సారథియుక్తమగు రథమున ఎక్కండి. సంతానము ప్రసాదించుటకు మా ఇంటికి రండి. క్రోధము విడువండి. మానవులకు విఘ్నములు కలిగించువారి తలలు త్రుంచండి.

11. అశ్వినులారా ! ఉత్తమ, మధ్యమ, సాధారణ అశ్వములతో మా వద్దకు రండి. బలిష్టములయిన గోవులునిండిన గోశాల తలుపులు తెరవండి. నేను స్తుతి కర్తను. నాకు విచిత్ర ధనము ఇవ్వండి.

## అరువది మూడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. అశ్వినులు అనేకుల ఆహూతులు. మనోహరులు. వారు నిలిచినచోట హవ్యయుక్తమగు పంచదశాది స్తోమము దూతవలె వారిని ఆహ్వానించవలెను. ఈ స్తోమమే అశ్విద్వయమును నావైపు మరలించినది. అశ్విద్వయమా ! స్తోత స్తుతికి మీరు ప్రసన్నులుకండి.

2. అశ్విద్వయమా ! మా ఆహ్వానములను మన్నించండి. చక్కగా వెడలండి. స్తుతించినవారి సోమపానము చేయండి. మా ఇంటిని శత్రువులనుండి రక్షించండి. దగ్గరి దూరపు శత్రువు మా ఇంటిని నష్టపరచరాదు.

3. అశ్వినులారా ! చక్కగా అభిషవించిన సోమము మీ కొఱకు నిలిచి ఉన్నది. మెత్తని కుశలు పరచి ఉన్నవి. మిమ్ము వరించిన స్తోతలు చేతులు జోడించి మిమ్ము స్తుతించుచున్నారు. శిలలు మీకొఱకు సోమరసము వెల్లడించినవి.

4. అశ్వినులారా ! మీ యజ్ఞమున అగ్నిపైకి లేచును. యజ్ఞమునకు చేరును. హవ్యవంతుడు, ఘృతవంతుడు అగును. అశ్వద్వయమును స్తుతియుక్తుని చేయు స్తోతయే బహుకర్మి ఉద్యుక్తుడు అనబడును.

5. అశ్వినులారా ! సూర్యపుత్రి మీ బహురక్షక రథము ఎక్కినది. దాని వన్నె పెంచినది. మీరు దేవతల ఈ జన్మలోనే ప్రాజ్ఞుల నుండి ప్రాజ్ఞ నేతలయి నృత్యశాలురగుడు.

6. ఇదే దర్శనీయ కాంతితో సూర్యశోభ పెంచుటకు పుష్టివంతులుకండి. శోభకొఱకు మీ గుఱ్ఱములు అందముగా సాగును. స్తవనీయ అశ్వద్వయమా ! విందువంటి స్తుతులు మిమ్ము వ్యాపింప చేయవలెను.

7. అశ్వినులారా ! మీ గుఱ్ఱములు నడకలు నేర్చినవి. మోయుటలో ఎంతో చతురలు. అవి మిమ్ము అన్నమువైపు తేవలెను. మనోవేగముగల మీ రథము అభిలషణీయ, అనంత అన్నమువైపు సాగవలెను.

8. బహుపాలక అశ్వినులారా ! మీవద్ద బోలెడు ధనము ఉన్నది. మాకు ఆవులు, అన్నము ప్రసాదించండి. అవి మాకు ప్రియము కలిగించవలెను. ఇతరుల వద్దకు తరలిపోరాదు. మా దయతలగు అశ్వద్వయమా ! మీకు స్తోతలు ఉన్నారు. స్తుతులు ఉన్నవి. నీ అనుగ్రహము కోరువారి సోమము సహితము ఉన్నది.

9. పురయుని యొక్క సరళగతులు, శీఘ్రగామినులు, అగు రెండు పడవలు నావద్ద ఉన్నవి. సమీధరాణి ఇచ్చిన వంద ఆవులు నావద్ద ఉన్నవి. పేరుకరాణి వండిన అన్నము నావద్ద ఉన్నది. శాంతుడను రాజు అశ్విద్వయ స్తోతలకు హిరణ్యమయములు, చక్కనివి పది రథములు ఇచ్చినాడు. అందుకు తగినట్లుగ శత్రునాశకులు, సుందరులగు పురుషులను ఇచ్చినాడు.

10. నా సత్యద్వయమా ! మీ స్తోతలకు పురుపాంథుడను రాజు వందల, వేల అశ్వములు ఇచ్చినాడు. వీర అశ్విద్వయమా ! ఆ స్తోత భరద్వాజునకు సహితము ఇవ్వవలెను.

11. అశ్వినులారా ! నేను విద్వాంసుల సహితముగా మీరు అందించు, సుఖములు కలిగించు, ధనములచే చుట్టబడవలెను.

## అరువది నాలుగవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఉష, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉషలు దీప్తిమంతులు. శుక్లవర్ణలు. సౌందర్యమునకుగాను జలతరంగములవలె లేచును. ఉష సమస్త ప్రదేశములను సుపథములను, సుగమములను చేయును. ఉష ధనవతి సమృద్ధవతి అగును.

2. ఉషాదేవీ ! నీవు పెండ్లి కూతురువలె ఉన్నావు. పెరిగి అందముల సంతరించుకొనుచున్నావు. వెలుగులు నీ కిరణముల సొగసులు పంచుచున్నవి. దీప్తిమతులగు నీ కిరణములు ఆకసమున అలరారుచున్నవి. తేజస్సుతోనిండిన నీ రూపము వెలుగులు పరచుచున్నది.

3. లోహితవర్ణ, దీప్తిమంత కిరణములు సుభాగ, విస్తీర్ణ, ప్రథమ ఉషను వహించును. శీఘ్రగామి సేనాపతివలె చీకట్లను నిలుపును. ఆయుధ ప్రయోగమున నిపుణుడగు వీరుడు శత్రువును పారదోలినట్లు చీకట్లను పారదోలును.

4. పర్వతములు, వాయువులేని ప్రదేశము నీకు సుపథము సుగమము అగును. స్వప్రకాశయుక్తా ! నీవు అంతరిక్షమును అధిగమింతువు. విశాలరథవతి, సౌందర్యవతి, ద్యులోక దుహితా ! మాకు కోరిన ధనము ఇమ్ము.

5. ఉషా ! నీది అప్రతిహతగతి. ప్రీతిపూరక అశ్వములతో నీవు ధనము మోయింతువు. మాకు ధనము అందించుము. ద్యులోక పుత్రీ ! నీవు వెలుగులరాణివి. ప్రథమ ఆహ్వానమున పూజనీయవు. అందువలన నీవు దర్శనీయవు.

6. ఉషా ! నీవు వెలువడగనే పిట్టలు గూళ్లు వదలును. అన్నము ఆర్జించుటకు మనుష్యులు నిద్ర వదులుదురు. నీవు దగ్గరనున్న హవ్యదాతకు కోరిన ధనము ఇమ్ము.

## అరువది అయిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఉష, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉష వెలుగుల కిరణములు కలది. రాత్రి చుక్కల వెలుగుతో చీకట్లను తరుముచు కనిపించును. ఆ ద్యులోక పుత్రియే మాకు చీకట్లను దూరము చేయును. జనులను వెల్లడించును.

2. ఉషాదేవి, కాంతుల రథము కలది. అప్పుడే మహాయజ్ఞపు ప్రథమ పాదము నిర్వర్తించి అరుణవర్ణ అశ్వములతో విస్తృత రూపమున పయనించుము. ఆమెలో చిత్ర, విచిత్ర సొగసుల చొరబడును. ఆమె రేయి చీకట్లను తరిమికొట్టును.

3. ఉషాదేవీ ! నీవు మానవ హవ్యదాతలకు కీర్తి, బలము, అన్నము, రసము ప్రసాదింతువు. నీవు ధనశాలినివి. గమనశీలవు. నిన్ను సేవించువారికి నేడు పుత్ర, పుత్రికాయుక్తమగు అన్నధనము ప్రసాదించుము.

4. ఉషాదేవులారా ! మిమ్ము సేవించువారి కొఱకు మీ వద్ద ధనము ఉన్నది. వీరుడగు హవ్యదాతకొఱకు మీ వద్ద ధనము ఉన్నది. ప్రాజ్ఞుడగు స్తోత కొరకు మీ వద్ద ధనము ఉన్నది. 'ఉక్థ' మంత్రములున్న నా సమాన వ్యక్తికి, పూర్వమువలెనే ధనము ఇమ్ము.

5. గిరితట ప్రియ ఉషాదేవి ! అంగిరులు నీ అనుగ్రహమున గోవులను సృజించినారు. పూజనీయ స్తోత్రములతో అంధకారమును నశింపచేసినారు. నేతలగు అంగిరుల స్తుతులు ఫలవంతములు అయినవి.

6. ద్యులోకదుహితా ఉషా ! ప్రాచీనులకువలెనే మా కొఱకునను అంధకారము దూరము చేయును. ధనశాలిని ఉషా

! భరద్వాజునివలె స్తుతించు నాకు పుత్ర, పౌత్రాదియుక్త ధనము ఇమ్ము. అనేకులకు సరిపడ అన్నము నిమ్ము.

## అరువది ఆరవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. మరుత్తుల రూపము సమానము. స్థిర పదార్థములందు స్థిరము. ప్రీతికరము. గతిపరాయణము. ఆ రూపము విద్వాంసులగు స్తోతలవద్ద వెల్లడికావలెను. అది అంతరిక్షమున ఒకసారి శుక్లవర్ణ జలమును తరిగించును. మర్త్యలోకమున అన్య పదార్థములు పితుకుటకు పెరుగును.

2. మరుత్తులు, ధనికులు. అగ్ని సమాన దీప్తులు. వారి ఇష్టప్రకారము ఇమ్మడి, ముమ్మడి పెరుగువారు. వారి రథము ధూళి రహితము. సువర్ణ అలంకారయుతము. ఆ మరుత్తులే ధనము, బలములతో ఆవిర్భూతులయినారు.

3. మరుత్తులు సేచనకారి రుద్రుని పుత్రులు. భరించగలవారు. అంతరిక్షమును భరించుటకు సమర్థులు. ఆ మరుత్తుల తల్లి పృశ్ని బహుగొప్పది. ఆమె మానవ జీవనము కొఱకు గర్భము లేక జలము ధరించినది.

4. మరుత్తులు స్తోతలవద్దకు పయనించరు. వారి మనసులందు నిలుతురు. వారి పాపములను రూపుమాపుదురు. మరుత్తులు దీప్తిమంతులు. స్తోతల కోరిక ప్రకారము నీరు అందింతురు. కాంతిమంతులయి తమను ప్రకాశితము చేయుదురు. నేలను తడుపుదురు.

5. మరుత్తులు అపహరణకర్తలు. గమనశీలురు. మహత్వయుక్తులు, ఉగ్రులు. స్తోతలు వారిని ఉద్దేశించి మరుత్ సంజ్ఞక మంత్రమును ఉచ్చరింతురు. కోరికలు తీర్చుకొందురు. దానకర్తయగు యజమాని మరుత్తులను క్రోధశూన్యులను చేయును.

6. మరుత్తులు ఉగ్రులు. బలశాలురు. ఘర్షించు సేనలను ద్యావాపృథ్వులతో కలుపుదురు. భూమిని తృప్తిపరతురు. రుద్రపత్ని సంబంధమగు మాధ్యమికీవాక్కు స్వదీప్తితోకూడియు మరుత్తుల దీప్తికి అడ్డురాదు.

7. మరుత్తులారా ! మీ రథము పాపరహితము. దానికి సారథిలేడు. స్తోత నడిపించును. అది అశ్వవ, భోజన, పాశ రహితమయ్యు, జలప్రేరకము, అభీష్టప్రదమై ద్యావాపృథ్వులు అంతరిక్షమున సంచరించును.

8. మరుత్తులారా ! మీరు యుద్ధమున రక్షించువానిని ప్రోత్సహించువాడు ఉండడు. హింసించువాడు ఉండడు. మీరు పుత్ర, పౌత్ర, గో, జల సంచయమున రక్షించువాడు యుద్ధమందు శత్రువుల గోసమూహములను

చెదరగొట్టును.

9. అగ్నీ ! బలమున శత్రువులను అణచివేయువారును. భూమిని వడకించువారును. ధ్వనికారులు. బలశాలురగు మరుత్తులకు దర్శనీయ అన్నము ప్రసాదించుము.

10. మరుత్తులు యజ్ఞమువలె ప్రకాశమానులు. శీఘ్రగామి అగ్నిశిఖవలె దీప్తిమంతులు. పూజనీయులు. వారు శత్రువుల గడగడలాడించువారివలె వీరులు. దీప్తిశరీరయుక్తులు. అనభిభూతులు.

11. మరుత్తులు దీప్తిమంతులు. ఖడ్గయుక్తులు. రుద్రపుత్రులు. ఆ వర్ధమాన మరుత్తులనే నేను స్తోత్రములతో సేవింతును. స్తోతయొక్క నిర్మల స్తుతులు ఉగ్రములై మేఘమువలె మరుత్తుల బలమునకు సమానములు అగును.

## అరువది ఏడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - మైత్రావరుణులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. మిత్రావరుణులారా ! మీరు సకల విశ్వమున శ్రేష్ఠులు. మిమ్ము స్తుతిద్వారా వర్ధిల్ల చేయుచున్నాను. మీరు అసములు. చతుర శ్రేష్ఠులు. తాటితోవలె మీ భుజములతో మానవులను వెంటనడిపింతురు.

2. మిత్రావరుణులారా ! మా ఈ స్తుతి మిమ్ము ప్రచ్ఛాదితులను చేయును. హవ్య సహితముగా మీవద్దకు ఈ స్తుతియే చేరును. ఇదే మీ యజ్ఞమునకు చేరును. మాకు శీతాతప నివారకము అనభిభూతమగు గృహమును ఇవ్వండి.

3. ప్రియులగు మిత్రావరుణులారా ! అన్నము, స్తోత్రముతో ఆహూతులైరండి. పనిచేయ నియమించబడినవాడు, పనితో అన్నార్థులగు వారిని కూర్చినట్లు మీరు మీ మహిమ ద్వారా కూర్చుడు.

4. మిత్రావరుణులు అశ్వమువంటి బలశాలురు. పవిత్ర స్తోత్రయుక్తులు. సత్యస్వరూపులు. వారిని అదితి గర్భమున దాల్చినది. జన్మించినంతనే మహానుల కన్న మహానులయినవారు. మానవహింసకులగు ఘాతకులు. మిత్రావరుణులను అదితి భరించినది.

5. పరస్పర ప్రీతియుక్తులై సమస్త దేవతలు మీ మహిమను కీర్తించినారు. బలవంతులయినారు. మీరు విశాల ద్యావాపృథ్వులను పరాభవించగలరు. మీ వెలుగు అహింసితము బహిరంగము.

6. మీరు నిత్యము బలవర్ధకులు అగుదురు. అంతరిక్షపు అత్యున్నత ప్రదేశము మేఘములేక సూర్యుని కొయ్యవలె

గట్టిగా పట్టుకొనండి. మీరు బలపర్చిన మేఘము అంతరిక్షమున వ్యాపించును. విశ్వదేవతలు. సూర్యుడు మానవులు సమర్పించిన హవ్యమున తృప్తులై భూలోక ద్యులోకములందు వ్యాపిస్తారు.

7. సోమముతో కడుపునింపుకొనుటకు మీరు ప్రాజ్ఞవ్యక్తిని ఎంచుకుందురు. విశ్వజిత్తులగు మిత్రావరుణులారా ! ఋత్విక్కు యజ్ఞగృహము పూరించినపుడు మీరు జలము పంపుదురు. అప్పుడు నదులు, దిశలు దుమ్ముతో నిండవు, ఎండిపోకుండ, గాలిలేకుండ సంపన్నములగును.

8. ఘృతాన్నయుక్తులగు మిత్రావరుణులారా ! మేధావియగువాడు సదా తనవాక్కులతో మిమ్ము జలము కోఱును. యజ్ఞమునకు మీతో వచ్చువాడు మాయావికానట్లు మీ మహిమ సహితము కావలెను. హవ్యదాత పాపములను పోగొట్టండి.

9. మిత్రావరుణులారా ! మీరు నియమించిన మీకు ప్రియమైన కార్యములకు విఘ్నము కలిగించి వానిని మానవులు లేక దేవతలు స్తోతరహితుడైనవానిని కర్మ శీలుడయ్యు యజ్ఞరహితుడైన పుత్రవంతులు కాని వారిని నష్టపరచుడు.

10. మేధావులు స్తుతులు ఉచ్చరించునపుడు కొందఱు, కొందఱు స్తుతించి సూక్తపాఠము చేయునపుడు మేము మిమ్ము గూర్చి మంత్రములు పఠించినపుడు అప్పుడు మీరు మహిమాన్వితులై దేవతల వెంట వెళ్లకండి.

11. మిత్రావరుణులారా ! మీరు రక్షకులు. స్తుతులు ఉచ్చరించబడినప్పుడు సరళగామి, ఘర్షక, అభీష్టవర్షి సోమము యజ్ఞమునకు జత అయినపుడు మీరు గృహదానము చేయుటుకు వచ్చినపుడు మీరు దానముచేయు గృహము అవిచ్ఛినమగును. ఇది సత్యము.

## అరువది ఎనిమిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రావిరణులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. మహా ఇంద్రవరుణులారా ! యజమాని మనువువలె కుశలు పరచినాడు. అన్నము, సుఖము కొఱకు యజ్ఞము ప్రారంభించినాడు. నేడు మీ కొఱకు ఆ యజ్ఞమే ఋత్విక్కులచే సమర్పించబడుచున్నది.

2. మీరు శ్రేష్ఠులు. యజ్ఞమందు ధనదాతలు. వీరులలో అతిబలవంతులు. దాతలలో శ్రేష్ఠదాతలు. శూరులు. సత్యమున శత్రువును హింసించువారు. సకల ప్రకార సేవలు కలవారు.

3. ఇంద్రావరుణులు స్తుతి, బలము, సుఖములతో స్తుతించబడువారు. వారిలో ఒకరు ఇంద్రుడు వృత్రహంత.

మరొకరు వరుణుడు ప్రజలను ఉపద్రవములనుంచి రక్షించుటకు బలశాలి అగువాడు.

4. ఇంద్రావరుణులారా ! మానవులలో స్త్రీ, పురుషులు, సమస్త దేవతలు స్వయముగా ఉద్యతులై మిమ్ము స్తుతులతో వర్ధిల్ల చేసినపుడు మహిమాన్వితులు కండు. వారికి ప్రభువులు కండు. విస్తీర్ణ ద్యావాపృథ్వులారా ! మీరు వారికి ప్రభువులు కండు.

5. ఇంద్రావరుణులారా ! మీకు స్వయముగా హవి ఇచ్చు యజమాని దానశీలి, ధనవంతుడు, యజ్ఞశాలి అవుతాడు. అతడే దాత. జయమున సాధించిన అన్నముతో పాటు శత్రువు చేతనే గౌరవించబడును. అతనికి సంపన్నుడగు పుత్రుడు కలుగును.

6. ఇంద్రావరుణులారా ! మీరు హవ్యదాతకు ధనమును అనుగమించునదియు, అన్నశాలియునగు ధనము ప్రసాదింతురు. అది శత్రువుల దురాశయమును దూరము చేయును. అట్టి ధనమే మాకు లభించవలెను.

7. ఇంద్రావరుణులారా ! మేము మీ స్తోతలము. సురక్షితమగు ధనమును మాకు అందించండి. మా బలము యుద్ధమున శత్రువును అణచునట్టిది హింసకమై వెంటనే వారిని కీర్తిని తిరస్కరించునది కావలెను.

8. ఇంద్రావరుణులారా ! మీరు స్తుతులై మాకు మంచి అన్నమునకుగాను వెంటనే ధనము ఇవ్వండి. దేవతలారా ! మహామహులని మీ బలమును కీర్తించెదము. పడవతో ఏరు దాటినట్లు పాపములను దాటవలెను.

9. వరుణుడు మహిమాన్వితుడు. మహాకర్మి. ప్రజ్ఞాయుక్తుడు. కాంతి సంపన్నుడు. అజరుడు. విశాల ద్యావా పృథ్వులను భాసింప చేయువాడు. ఆ సామ్రాట్టు, విరాట్టు వరుణునిగూర్చి నేడు మనోహరములు, సర్వప్రకార బృహత్ స్తోత్రములను ఉచ్చరించండి.

10. ఇంద్రావరుణులారా ! మీరు సోమపానము చేయువారు. కావున ఇదిగో ఈ మాదక, అభిషుత సోమపానము చేయండి. దేవతల సోమపానమునకుగాను మీ రథము యజ్ఞమునకు నడిపించండి.

11. కోటికలు తీర్చు ఇంద్రావరుణులారా ! మీరు మిక్కిలి తీయనిది, మనోరథపూరకమగు సోమమును పానము చేయండి. మీ కొఱకు మేము సోమరూప అన్నము ఏర్పరచినాము. కావున ఈ యజ్ఞమున ఆసీనులయి సోమము సేవించండి.

## అరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్ర విష్ణువులు ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రవిష్ణువులారా ! మిమ్ము స్తుతి, హవిద్వారా ప్రేరేపింతుము. ఈ కర్మ సమాప్తమైనంత మీరు యజ్ఞమును సేవించండి. ఉపద్రవశూన్య మార్గమున మమ్ము దాటించండి. మాకు ధనము ఇవ్వండి.

2. ఇంద్రవిష్ణువులారా ! మీరు స్తోత్ర జనకులు. కలశస్వరూపులు. సోమవిధాన విభూతులని స్తుతించు స్తోతలు మీకు లభించవలెను. స్తోతలగానము చేయు కీర్తనలు మీకు లభించునుగాత.

3. ఇంద్రవిష్ణువులారా ! మీరు సోమములకు అధిపతులు. ధనము ఇచ్చుచు సోమము ముందుకు విచ్చేయండి. స్తోతల స్తోత్రములు, ఉక్థలు మిమ్ము తేజస్సుతో వృద్ధిపరచవలెను.

4. ఇంద్రవిష్ణువులారా ! హింసాకారులను ఓడించునవి, మత్త అశ్వగణము మిమ్ము వహించవలెను. స్తోతల సకల స్తోత్రములను మీరు స్వీకరించండి. నా స్తోత్రములను, వచనములను కూడ వినండి.

5. ఇంద్రవిష్ణువులారా ! సోమమువలన కలిగిన మదము ఉత్సాహమున మీరు విస్తృతముగా పర్యటింతురు. మీరు అంతరిక్షమును విస్తృతపరచినారు. జగములను మేము జీవించుటకు ప్రసిద్ధము చేసినారు. మీ ఈ ఘనకార్యములన్నియు ప్రశంసనీయములు.

6. ఘృతాన్నయుక్తులగు ఇంద్రవిష్ణువులారా ! మీరు సోమమున వర్ధిల్లుదురు. సోమపు అగ్రభాగమును సేవింతురు. నమస్కరించి యజమానులు మీకు హవ్యము ఇస్తారు. మీరు మాకు ధనము ఇవ్వండి. మీరు సముద్రసములు. మీరు సోమపుగనులు. కలశరూపులు.

7. దర్శనీయ ఇంద్రవిష్ణువులారా ! మత్తు కలిగించు ఈ సోమము త్రాగండి. కడుపునింపండి. మీ వద్దకు మదకర సోమరూప అన్నము చేరవలెను. నా స్తోత్రమును, ఆహ్వానమును వినండి.

8. ఇంద్రవిష్ణువులారా ! దిగ్విజయీభవ. మీరు పరాజయము ఎరుగనివారు. మీకు అసురులతో జరిగిన స్పర్ధత్రివిధము, లౌకికము, వేదము, వచనము. అవికాక అసంఖ్యాకములు. అట్లయ్యు మీరు పరాక్రమమున వారిని సాధించినారు.

## డెబ్బదవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ద్యావాపృథ్వులు ఛందస్సు - జగతి.

1. ద్యావాపృథ్వులారా ! మీరు జలవతులు. ప్రాణులకు ఆశ్రయభూతలు. విస్తీర్ణలు. ప్రసిద్ధలు. జలదోహనము చేయువారు. సురూపలు. వరుణుని ధారణతో పృథక్ రూపలు. నిత్యలు. బహుకర్ములు.

2.అసంగతలు, బహుధారావతులు, జలవతులు శుచికర్మలగు ద్యావాపృథ్వులు సుకృతము చేయువారికి జలము ఇస్తారు. ద్యావాపృథ్వులారా ! మీరు భువనములకు రాణులు. మాకు మనుష్యులకు హితము కలిగించు బలము ప్రసాదించండి.

3. సర్వ భువన నివాస భూతలగు ద్యావాపృథ్వులారా ! మీకు సరళ గమనమునకుగాను హవిస్సులు అందించు వ్యక్తి సిద్ధమనోరథుడగును. సంతానముతో వృద్ధిచెందును. కర్మల మీద మీరు చల్లని రేతస్సు నానారూపమగును. అది సమాన కర్మల ఉత్పత్తి కారకమగును.

4. ద్యావాపృథ్వులు జలముచే కప్పబడినవి. జలమును ఆశ్రయించునవి. అవి నీటిలో మునిగి తేలునవి. జలవర్ష విదాయినులు. విస్తృతలు. ప్రసిద్ధలు. యజ్ఞపురస్కృతలు. యజ్ఞమునందు విద్వాంసులు ద్యావాపృథ్వులను సుఖములు యాచింతురు.

5. ద్యావాపృథ్వులు జలాక్షరణలు. జలదోహలు. జలకర్మలు. వారు మాకు యజ్ఞము, ధనము, యశము, అన్నము, బలము ఇచ్చువారు. మమ్ము మేఘముతో తడుపవలెను.

6. పితా ద్యులోకమా ! మాతా పృథ్వీ ! మాకు అన్నము అందించండి. లోకములను ఎరుగువారు. సుకర్మలు, పరస్పర రమమాణలు, అందరికి సుఖములనిచ్చు ద్యావాపృథ్వులు మాకు పుత్రాదిబలము, అన్నము ఇవ్వవలెను.

## డెబ్బది ఒకటవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - సవిత ఛందస్సు 1-3 జగతి, మిగిలినవి త్రిష్టుప్.

1. సుకృత సవిత దానము చేయుటకుగాను తన బంగారు చేతులను పైకిలేపును. సవిత విశాలుడు. తరుణుడు. విద్వాంసుడు. జగద్రక్షణకుగాను తన రెండు జలబావులను ప్రేరేపించును.

2. ఆ సవిత ఉత్పత్తి కార్యము, ప్రశస్త ధనదానము విషయమునను మేము సమర్థులము కావలెను. సవితా ! జగములందలి సమస్త ద్విపద చతుష్పాత్తుల స్థితి, ఉత్పత్తి విషయమున సమర్థుడవు.

3. సవితా ! నీ తేజము అహింసితము సుఖావహము. ఆ తేజమున మా గృహములను రక్షించును. నీ వాక్కు హిరణ్యము. మాకు నవసుఖములను ఇమ్ము. మమ్ము రక్షింపుము. మాకు కీడు చేయువారు ప్రభుత్వము చేయరాదు.

4. సవిత శాంత మనస్కుడు. హిరణ్యహస్తుడు. హిరణ్యహనువు. (దవడలు కలవాడు.) కీర్తిశాలి. మనోహరుడు. మధురవాక్కు. అతడు రాత్రి చివరను మేల్కొనవలెను. అతడు హవ్యదాతకు కోటినంత అన్నము అందించవలెను.

5. సవిత వక్తవలె హిరణ్మయ, శుభంకర బాహువులను ఎత్తవలెను. అతడు భూమి నుండి ద్యులోకపు ఉన్నత ప్రదేశమునకు ప్రాకును. గతిశీలములగు మహా పదార్థములన్నింటిని సవిత ప్రసన్నములను చేయును.

6. సవితా ! మాకు నేడు ధనము ఇమ్ము. రేపు ఇమ్ము. నిత్యము ఇమ్ము. నీవు నివాసభూతమగు విశేష ధనదాతవు. కావున ఈ స్తుతితోనే మేము ధనము పొందెదము.

## డెబ్బది రెండవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత - ఇంద్రసోములు ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రసోములారా ! మీ మహిమ అపారము. గొప్పది మీరు గొప్పవారు, ముఖ్యములగు భూతములను సృష్టించినారు. మీరు సూర్యుని, జలమును సాధించినారు. సకల అంధకారములను, నిందకులను వధించినారు.

2. ఇంద్ర సోములారా ! ఉషను ప్రకాశింప చేయండి. సూర్యుని జ్యోతిని లేవనెత్తండి. అంతరిక్షము ద్వారా ద్యులోకమును స్తంభింప చేయండి. మాత పృథ్విని ప్రసిద్ధుని చేయండి.

3. ఇంద్రసోములారా ! జలములను కట్టిపెట్టిన వృత్రుని వధించండి. ద్యులోకము మిమ్ము సంవర్ధితులను చేసినది. నదుల జలములను ప్రోత్సహించండి. సాగరములను జలముతో నింపండి.

4. ఇంద్రసోములారా ! అపక్వమగు గోవుల చన్నులందు పక్వమగు దుగ్ధమును ప్రవేశపెట్టినారు. నానా వర్ణ గోవులందు తెల్లని పాలనే కల్పించినారు.

5. ఇంద్రసోములారా ! మాకు తరింపచేయగలది. సంతానయుక్తమైనది, శ్రవణయోగ్యమగు ధనమును వెంటే ప్రసాదించండి. మానవులకు హితకరము. శత్రు సేనను ఓడించగల బలమును వర్ధిల్ల చేయండి.

## డెబ్బది మూడవ సూక్తము

ఋషి - భరద్వాజుడు, దేవత బృహస్పతి ఛందస్సు - త్రిష్టుప్.

1. బృహస్పతి పర్వతములను పగులకొట్టినాడు. సర్వప్రథముడుగా జన్మించినాడు. సత్యస్వరూపుడు. అంగిరుడు. యజ్ఞపాత్రుడు. ఉభయలోకములకు సులభముగా వెళ్లగలవాడు. ప్రదీప్త స్థానమున ఉండువాడు. అందరి పాలకుడు. అట్టి బృహస్పతి వర్షించువాడై ద్యావాపృథ్వులందు గర్జించును.

2. బృహస్పతి యజ్ఞమున స్తోతకు స్థానము కల్పించును. వృత్రాది అనివార్య అంధకారములను అంతము చేయును. యుద్ధమున శత్రువును గెలుచును. విద్వేషులను పరాభవించును. అసుర పురములను ఛిన్నాభిన్నము చేయును.

3. ఈ బృహస్పతియే అసురుల ధనము, గోవుల సహితముగా గోచరులను గెలిచినాడు. అప్రతిహతుడై యజ్ఞకర్మలను అనుభవించ కోరినాడు. స్వర్గ శత్రువులను అర్చన మంత్రములతో వధించినాడు.

## డెబ్బది నాలుగవ సూక్తము

ఋషి - భరద్వాజుడు - దేవత - సోమ - రుద్రులు ఛందస్సు - త్రిష్టుప్.

1. సోమరుద్రులారా ! మాకు అసురబలము ప్రసాదించండి. సమస్త యజ్ఞములు మిమ్ము ప్రతిగృహమున వ్యాపింప చేయవలెను. మీ వద్ద సప్త రత్నములు ఉన్నవి. అందువలన మాకు మీరు సుఖకరులు కండి. ద్విపద, చతుష్పాత్తులకు కూడ కళ్యాణకరులు కండు.

2. సోమరుద్రులారా ! మా ఇంట ఉన్న అంటువ్యాధిని పారద్రోలండి. దారిద్ర్యమును అది పారిపోవునట్లు బాధించండి. మా వద్ద సుఖప్రదమగు అన్నము ఉండవలెను.

3. సోమరుద్రులారా ! మాకు ఆరోగ్యము కలుగుటకు ప్రసిద్ధ ఔషధములను మీ వద్ద ఉంచండి. మేము చేసిన పాపములు మమ్ము అంటిపెట్టుకొని ఉన్నవానిని దూరము చేయండి.

4. సోమరుద్రులారా ! మీవద్ద దీప్తమగు ధనుస్సు తీక్ష మగు శరములు ఉన్నవి. మీరు శాంతమగు సుఖమును ఇవ్వగలవారు. మాస్తోత్రములను ఆశించండి. మాకు అనేక ఇహసుఖములను ప్రసాదించండి. వరుణపాశముల నుండి విడిపించండి. మమ్ము రక్షించండి.

## డెబ్బది అయిదవ సూక్తము

ఋషి - భరద్వాజ పాయుడు, దేవతలు - వేరు వేరు ఛందస్సు - వివిధము

1. యుద్ధము రగిలినది. రాజు లోహకవచము ధరించినాడు. సాగినాడు. అప్పుడతను సాక్షాత్తు మేఘమువలె కనిపించినాడు. రాజా ! గాయపడని దేహముతో విజయము సాధించుము. మహిమ కవచమువలె నిన్ను రక్షించవలెను.

2. మేము ధనుర్ధారులము. ధనుస్సుతో గోవులను యుద్ధమున జయింతుము. శత్రు సేనలను వధింతుము. శత్రువు కోటికలను ధనుస్సును భగ్నము చేయవలెను. ఈ ధనుస్సుతో సమస్త దిశలందుగల శత్రువులను జయింతుము.

3. ధనుస్సుయొక్క జ్యా (నారి) యుద్ధ వేళలందు యుద్ధమును దాటింపకోరును. ఆకర్ణాంతము లాగినపుడు అది ప్రియవచనము చెప్పవచ్చినట్లనిపించును. భార్యభర్తను ఆలింగము చేసికొని మాట్లాడినట్లు ఈ జ్యా ధనుస్సును ఆలింగనము చేసికొని ధ్వనిచేయును.

4. రెండు తూణీరములు (అమ్ములపొదులు) అన్య మనస్క యువతివలె శత్రువును ఆక్రమించును. తల్లివలె పుత్రుని వంటి రాజును రక్షించును. అవి తమ విధులను చక్కగా ఎరుగును. వెళ్లునపుడు రాజును ద్వేషించు వారిని వధించును. శత్రువులను నరికివేయును.

5. ఈ తూణీరము అనేక శరములకు తండ్రి. ఇతనికి అనేక శరపుత్రులున్నారు. బాణము వెడలునపుడు తూణీరము 'త్రిశ్వ' ధ్వని చేయును. ఇది యోద్ధవీపుకు తగిలి ఉండును. యుద్ధకాలమున బాణములు ప్రసవించును. సమస్త సేనలను గెలుచును.

6. సారథి రథమున కూర్చుండును. 'తనముందరి గుఱ్ఱములను అదిలించును. కోరిన చోటికి రథమును చేర్చును. కళ్లెములు గుఱ్ఱముల మెడలకు తగిలి పృష్టము వరకు వ్యాపించి సారథికి అనుకూలముగా ఏర్పరచబడును. కళ్లెముల మహిమను స్తుతించండి.

7. గుఱ్ఱపు డెక్కల నుండి దుమ్ము లేచును. రథమునులాగును గుఱ్ఱము సకిలించును. అది పారిపోదు. శత్రువును డెక్కలతో తన్నును.

8. హవ్యము అగ్నిని పెంచును. అట్లే ఈ రాజు రథము మోయు ధనము అతనిని పెంపొందించవలెను. రథము మీద

ఈ రాజు కవచము, అస్త్రములు మున్నగునవి ఉండును. మేము ఎల్లప్పుడు ప్రసన్న చిత్రమును సుఖదాయకమగు ఆ రథము వద్దకు వెళ్లుదుము.

9. రథరక్షకులు శక్తిమంతులు. గంభీరులు. విచిత్ర సేనాయుక్తులు. బాణబల సంపన్నులు. అహింసకులు. వీరులు. మహానులు. అనేకమంది శత్రువులను జయించ సమర్థులు; వారు శత్రువునకు సంబంధించిన రుచికరమగు అన్నమును నష్టపరతురు. స్వపక్షీయులకు అన్నదానము చేయుదురు. విపత్కాలమున వీరిని ఆశ్రయించవలసి వచ్చును.

10. బ్రాహ్మణులారా ! పితరులారా ! యాజ్ఞక సోమ సమార్జకులారా ! మమ్ము రక్షించండి. పాపరహితమగు ద్యావా పృథ్వులు మాకు సుఖకరములు కావలెను. పూష మమ్ము పాపము నుండి రక్షించవలెను. పాపియగు మా శత్రువు ప్రభుత్వము చేయరాదు.

11. బాణములకు ఈకలుండును. మృగ శృంగము దీని దంతములగును. ఇది గోచర్మ బద్ధము. ఇది ప్రేరణపొంది వాలును. నేతలు ఒక్కరుగాగాని, ఒక్కటిగాగాని సంచరించిన చోట బాణము మమ్ము రక్షించవలెను.

12. బాణమా ! మమ్ము వర్థిల్లచేయుము. మా శరీరము రాతివంటిది కావలెను. సోముడు మా పక్షమున వాదించవలెను. అదితి సుఖములను ఇవ్వవలెను.

13. కశా-(కొరడా)! మరింత జ్ఞానియైన సారథి నీతో గుఱ్ఱపు తొడలమీద పిరుదులమీద కొట్టును. సంగ్రామమందు నీవు అశ్వములను ప్రోత్సహింతువు.

14. హస్తఘ్నము వింటినారి బాధను నివారించును. సర్పమువలె చేతిమణికట్టుకు చుట్టుకొనును. తెలియవలసిన వానిని తెలిసికొనును. పౌరుషశాలి అయి నలుదిశలను రక్షించును.

(వింటినారి బాధ కలుగకుండ చేతికి కట్టుకొను చర్మ విశేషము హస్తఘ్నము)

15. విషసిక్తమయినది, అగ్రభాగము హింసకమైనది, సుఖము లోహమయమైనది, పర్జన్యుని నుండి ఉత్పన్నమైనట్టి విశాల బాణ దేవతకు నమస్కారము.

16. బాణమా ! నీవు మంత్రమున పదునైనావు. హింసానిపుణవు. నిన్ను లాగి విడువగనే శత్రువుమీద పడుము. ఒక్క శత్రువును సహితము ప్రాణములతో విడువకుము.

17. ముండిత కుమారులవలె ఏ యుద్ధమున బాణములుపడునో అందు బ్రహ్మస్పతి మాకు సుఖములను

ఇవ్వవలెను. అతిథి సుఖములు అందించవలెను.

18. రాజా ! నీ శరీర మర్మ స్థానములను కవచముతో కప్పుచున్నావు. సోమప్రభువు నిన్ను అమృతమున ఆచ్ఛాదించవలెను. వరుణుడు నీకు శ్రేష్ఠ తమ సుఖము నీయవలెను. నీవు గెలిచినపుడు దేవతలు సంతోషించవలెను.

19. మా విషయమున ప్రసన్నుడు కానట్టి వేరుగా ఉండి మమ్ము వధించ గోరునట్టి కుటుంబినిని సకలదేవగణములు వధించవలెను. మాకు మంత్రమే బాణనివారక కవచము.

***(దాశరథి రంగాచార్యవిరచిత ఆంధ్ర వచన ఋగ్వేద సంహితమున ఆరవ మండలము సమాప్తము)***

జ్ఞానాందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిం
ఆధాంసర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే

ఆంధ్రవచన ఋగ్వేద సంహిత
## ఏడవ మండలము

మొదటి అనువాకము మొదటి సూక్తము మండల ద్రష్ట వసిష్ఠునకు నమస్కారము.
ఋషి - వసిష్ఠుడు, దేవత - అగ్ని, ఛందస్సు 1-18 విరాజి, మిగిలినవి త్రిష్టుప్.

1. అగ్ని ప్రశస్తుడు. దూరస్థితుడు. గృహపతి. గతిశీలుడు. ఋత్విక్కులు అట్టి అగ్నిని రెండు చేతులలో కట్టెలు పట్టుకొని అంగుళులతో చేసిన రాపిడి ద్వారా ఉత్పన్నము చేస్తారు.

2. అగ్ని గృహమున నిత్యపూజనీయుడు. అన్నివిధముల భయముల నుండి రక్షించుటకుగాను అటువంటి అగ్నిని వసిష్ఠ గణములు గృహమునందు స్థాపించుకున్నారు.

3. అగ్ని యువతముడు. అత్యంత సమృద్ధుడు. సంతత జ్వాలా సుందరుడు. అట్టి అగ్ని మాముందు ప్రదీప్తుడు కావలెను. అగ్నీ ! నీవద్ద అనంత అన్నము ఉన్నది.

4. సుజన్ములగు ఋత్విక్కులు అగ్ని వద్ద కూర్చున్నారు. ఆ అగ్ని లౌకిక అగ్నులకన్న విశిష్ఠమైనది. అతడు అధిక దీప్తిమంతుడు. కళ్యాణవాహి. పుత్ర పౌత్రప్రదుడు. విశేష రూపమున దీపించువాడు.

5. అగ్నీ ! నీవు శత్రుపరాభవ నిపుణుడవు. హింసక శత్రువు బాధింపలేనట్టి, కళ్యాణకరము, పుత్రపౌత్రాది సుందర సంతతియుక్త ధనమును స్తోత్రములు విని-మాకు ప్రసాదించుము.

6. హవ్యయుక్త జుహువు, యువతి, రాత్రింబవళ్లు అగ్ని వద్దనే ఉంటుంది. తన దీప్తితో స్తోతలకు ధనము అభిలషించును. అగ్నివద్ద నిలుస్తుంది.

(జుహువు అగ్నికి ఆజ్యాదులు అర్పించు చెక్కతో చేసిన గరిటివంటి చమసము)

7. అగ్నీ ! నీవు నీ తేజమున కఠోరశబ్దముచేసి రాక్షసులను దహింతువు. అట్టి తేజముననే సకల శత్రువుల కాల్చివేయుము. దేహతాపము దూరము చేయుము. వ్యాధిని నష్టపరచుము.

8. అగ్నీ ! నీవు శ్రేష్ఠుడవు. శుభ్రుడవు. దీప్తుడవు. పావకుడవు. నిన్ను సమిద్ధుని చేయువానితో సమముగానే మా స్తోత్రములకు ప్రసన్నుడవగుము. ఈ యజ్ఞమున నిలువుము.

9. అగ్నీ ! పితృ హితైషులు, మానవులు నిన్ను అనేక దేశములకు పంచినారు. వారితో సమముగనే మా స్తోత్రములకు ప్రసన్నుడవగుము. ఈ యజ్ఞమున నిలువుము.

10. నా యొక్క శ్రేష్ఠ కర్మను స్తుతించువారు వీరులు, నేతలు అగుదురు. యుద్ధమున ఆసురీమాయను అణచి వేతురు.

11. అగ్నీ ! మేము శూన్య గృహమున ఉండము. ఇతరుల ఇండ్లలో కూడ ఉండము. గృహహితైషి అగ్నీ ! మేము పుత్రశూన్యలము. గృహ రహితులము. నీ సేవచేయుచు మేము సంతాన సంపన్న గృహమున ఉండవలెను.

12. ఏ యజ్ఞాశ్రయ గృహమునకు అగ్ని నిత్యము వేంచేయునో అట్టి పరిచారక యుక్తము సుందర సంతాన సహితము, ఔరస పుత్రులతో వర్థిల్లు గృహమును మాకు ప్రసాదించుము.

13. మమ్ము అప్రీతికర రాక్షసులనుండి రక్షింపుము. అదాత, పాపి, హింసకుని నుండి రక్షించుము. మేము నీసాయమున సేనలను అభిలషించు వ్యక్తిని పరాజితుని చేయగలము.

14. మా పుత్రుడు బలవంతుడు. ధృడహస్తుడు. అనంత అన్నవంతుడు. అతడు అక్షయస్తోత్రమున అగ్నిని సేవించును. ఆ అగ్నియే ఇతర అగ్నులను ఆవిర్భూతము చేయవలెను.

15. యజ్ఞకర్తలయి ప్రబోధకులను హింసకులనుండి రక్షించువాడు. కులీన వీరగణములు సేవించువాడే అగ్ని అగును.

16. అగ్నిని సమృద్ధులు, హవిష్మంతులు దీపింప చేస్తారు. యజ్ఞమున దేవతలను ఆహ్వానిస్తారు. అట్టి అగ్నిని అనేక దేశములవారు ఆహ్వానింతురు.

17. అగ్నీ ! మేము ధనపతులమై నిన్ను నిత్యము నుతింతుము. ఉక్థలతో యజింతుము. విశేష హవ్యము సమర్పింతుము.

18. అగ్నీ ! దేవతలందరు మా శుభప్రదమగు హవ్యము కోరుదురు. నీవు ఈ అత్యంత కమనీయ హవ్యమును సర్వదా దేవతలకు చేర్చుము.

19. అగ్నీ ! మమ్ము సంతానహీనులను చేయకుము. మాకు చెడిన బట్టలు ఇవ్వకుము. కుబుద్ధి ఇవ్వకుము. రాక్షసులచేత పడనీయకుము. సత్యవంత అగ్నీ ! మమ్ము గృహమునగాని అరణ్యమునగాని బాధించకుము.

20. అగ్నీ ! మా అన్నమును చక్కగా సంస్కరింపుము. యాజకులకు అన్నము అందించుము. మేము ఇరువురము స్తోత, యజమానులను నీ దానమందు ఉండవలెను. నీవు అన్నివేళల మమ్ము స్వస్తి ద్వారా పాలింపుము "యూయం పాత స్వస్తిభిః సదానః"

21. అగ్నీ ! నీవు శుభ ఆహ్వానవంతుడవు. రమణీయదర్శనుడవు. శుభంకర దీప్తితో ప్రజ్వరిల్లుము. మాకు సహాయకుడవగుము. ఔరస పుత్రుని దహించకుము. మానవహితైషులగు మా పుత్రులకు హాని కలుగరాదు.

22. అగ్నీ ! మాకు సహాయకుడువు అగుము. ఋత్విక్కులచే సమిద్ధులయిన అగ్నిగణములతో మమ్ము సుఖములందు ఉంచి భరించుమని చెప్పుము.

23. అగ్నీ ! నీవు చక్కని తేజోవంతుడవు. దేవతాత్మవు. నీకు హవ్యము సమర్పించువాడు మాత్రమే ధనవంతుడగును. ధనాభిలాషియగు స్తోత జ్ఞానార్థియై ఎవరి వద్దకు వెళ్లునో ఆ అగ్ని యజమానిని రక్షించును.

24. అగ్నీ ! మేము చేయు మహా సంక్షేమ కార్యములు నీకు తెలియును. బలపుత్రా ! మేము నీ స్తోతలము. మాకు అక్షయము, పూర్ణాయుష్మంతము, పుత్ర పౌత్రాది సంపన్నయుతము, ప్రసన్నతమ అగు ధనమును ప్రసాదించుము.

25. అగ్నీ మా అన్నమును చక్కగా సంస్కరింపుము. యాజకులకు అన్నము అందించుము. మేము ఇరువురము స్తోత యజమానులము నీ దానమునందు ఉండవలెను. నీవు అన్నివేళల మమ్ము స్వస్తి ద్వారా పాలింపుము.

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఐదవ అష్టకము ఏడవ మండలము మొదటి అధ్యాయము సమాప్తము)

*ఓం వతామినన్తిమాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రవాణి*
*వరోదసీ అద్రుహా వేద్యాభిర్న పర్వతావి నమే తస్థివాంసః*

## రెండవ అధ్యాయము   రెండవ సూక్తము

ఋషి - వసిష్టుడు, దేవత - తనూనపాదుడు అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్నీ ! నేడు మా సమిధలు స్వీకరించుము. యజ్ఞమునకు యోగ్యమగు పొగతో అత్యంత ప్రజ్వలితుడవగుము. తప్త జ్వావామాలతో అంతరిక్ష తటమును అంటుము. అక్కడ సూర్యకిరణములతో కలసిపొమ్ము.

2. సుకర్ములు, శుచిమంతులు, కర్మలను భరించు దేవగణములు సోమసంబంధము, హవిసంబంధమును సేవింతురు. వారిలో అగ్ని యజనీయుడు. మానవులకు కీర్తనీయుడు. అట్టి అగ్ని మహిమలను మేము స్తోత్రములతో స్తుతింతుము.

3. అగ్ని బలశాలి. స్తుతియోగ్యుడు. దక్షుడు. ద్యావాపృథ్వుల మధ్య దూత. సత్యవాది. మానవులవలె మనువు ద్వారా సమిద్ధుడు. యజమానులారా ! అట్టి అగ్నిని సర్వదా పూజించండి.

4. సేవాభిలాషులు మోకరిల్లి పాత్రను పూరించి అగ్నికి నమస్కారయుక్త హవి సమర్పిస్తారు. అధ్వర్యులారా ! ఘృత పుష్పము, స్థూలబిందు యుక్త హవిస్సును అగ్నికి అందించండి.

5. సుకర్ములు, దేవాభిలాషులు, రథములను కోరువారు యజ్ఞద్వారమును ఆశ్రయించినారు. ఆవులు దూడలను నాకినట్లు - నాకు నట్టి జుహువును అధ్వర్యులు నదివంటి యజ్ఞమున తడిపెదరు.

6. దివారాత్రులు యువతులు. దివ్యలు మహిమాన్వితలు. కుశలపై ఆసీనులగునవి. బహుస్తుతులు, ధనవతులు, యజ్ఞార్హ్వాలు. కామధేనువువలె శుభములకుగాను మాకు ఆశ్రయము కలిగించవలెను.

7. విప్రులు, జాత ఘనులు, మానవుల యజ్ఞకర్తలగు యజ్ఞకర్తలగు హోతలారా ! యజ్ఞము చేయించవలసినదని మిమ్ము స్తుతింతును. స్తుతులు పూర్తి అయినంత కుటిలము ఎరుగని మా యజ్ఞమును దేవాభిముఖము చేయండి. దేవతలవద్ద ఉన్న వరణీయధమును విభజించండి.

8. భారతీయగణముల సూర్యసంబంధుల సహితముగ భారతి రావలెను. దేవ, మానవ సహితమై "ఇళ" రావలెను.

సారస్వతుల సహితముగా సరస్వతి రావలెను. ఈ ముగ్గురు దేవేరులు వచ్చి కుశలపై కూర్చుండవలెను.

9. అగ్నిరూప త్వష్టా ! వీరుడు , కర్మకుశలుడు, బలశాలి, సోమాభిషవకర్త, దేవాభిలాషి అగు పుత్రుని పుట్టించగలవు. నీవు సంతుష్టుడవై మాకు రక్షాకుశలము, పుష్టికరమగు శౌర్యమును ప్రదానము చేయుము.

10. అగ్నిరూప వనస్పతీ ! దేవతలను మావద్దకు తెమ్ము. పశువులను సంస్కరించు అగ్ని వనస్పతి. అతడు దేవతలకు హవ్యము అందించవలెను. యజ్ఞరూప దేవత జనులను పిలుచు అగ్ని మాత్రమే దేవతల జన్మము ఎరుగును. అందువలన ఆ అగ్నియే యజ్ఞము చేయవలెను.

11. అగ్నీ ! నీవు దీప్తివంతుడవగుము. ఇంద్రుడు మున్నగు త్వర చేయు దేవతల సహితుడవై ఒకే రథమున మా ముందుకు విచ్చేయుము. సుపత్రయుక్త అదితి మా కుశలై కూర్చుండవలెను. నిత్యదేవగణములు. అగ్నిరూప స్వాహాకారులపై తృప్తులుకావలెను.

## మూడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్ని మానవులందు స్థిరముగ ఉండువాడు. యజ్ఞవంతుడు. తాపకుడు. తేజోవంతుడు. ఘృతాన్న సంపన్నుడు. శోధకుడు. యాజ్ఞికులందు శ్రేష్ఠుడు. అన్య అగ్ని సమూహములతో కలసినవాడు.

దేవతలారా ! అట్టి అగ్ని నే యజ్ఞములందు దూతను చేయండి.

2. గుఱ్ఱము గడ్డిని మేసినట్లు అగ్ని గడ్డిని కాల్చుచు, ధ్వనిచేయుచు, వృక్షములందు దారురూప అగ్ని నిలిచిఉండును. అప్పుడు అగ్నియొక్క దీప్తి ప్రవహించును. అనంతరము అగ్నిదేవుని మార్గము నలుపు మసిగా మారును.

3. అగ్నీ ! నీవు నవజాతవు. వర్షకుడవు. నీజ్వాల ఆజరము. సమిధలు చేర్చుకొని పైకి ఎగయుదువు. ఆ జ్వాల యొక్క సుందరధూమము ద్యులోకమునకు చేరును. నీవు దూతవై దేవతలను చేరుదువు.

4. అగ్నీ ! నీవు దంతముల జ్వాలలతో కట్టెలు భక్షించునపుడు నీ తేజస్సు భూమిలో కలిసిపోతుంది. భూమి నల్లపడుతుందని అర్థము. విముక్తమగు సేనవలె నీ జ్వాలలు పరుగులిడును. నీ జ్వాలలతో భువనములవలె కలపమున్నగు వానిని కాల్చితిందువు.

5. అగ్ని యువ అతిథి వంటి పూజ్యుడు. మానవులు అగ్ని స్థానమును ఎల్లపుడు పరుగులిడు గుఱ్ఱమువలె రాత్రింబవళ్లు సేవింతురు. ఆహూతుడు, అభీష్టవర్షి అగ్ని శిఖ జ్వాల ప్రదీప్తమగును.

6. అగ్నీ ! నీవు సుందర తేజోవంతుడవు. సూర్యుడు కిరణములవలె దీప్తితో వెలుగొందినపుడు అత్యంత దర్శనీయుడవగుదువు. అంతరిక్షమునుండి నీ వెలుగు మెరుపు వలె వెడలును. దర్శనీయ సూర్యుని వలెనే నీవు సహితము స్వయం ప్రకాశకుడవు.

7. అగ్నీ ! మేము గవ్యము, ఘృతయుక్త హవ్యముతో నీకు స్వాహాదానము సమర్పింతుము. నీవు సహితము అట్లే అపరిమిత లోహమయ లేక స్వర్ణమయ నగరములతో మమ్ము రక్షింపుము.

8. అగ్నీ ! నీవు బల పుత్రుడవు. జాతధనుడవు. దానశీలుడవు. నీవు నీ శిఖలు, మాటలు ధ్వనులతో పుత్రవంతులను ప్రజలను రక్షింతువు. అట్లే మమ్ము రక్షింపుము. ప్రశస్తులగు హవ్యదాతలను స్తోత్రములను రక్షింపుము.

9. విశుద్ధ అగ్ని తన దేహముతో కృపాపరవశము సుభగసుందరమగు జ్వాలలు కఱ్ఱలనుండి వెలువరించినపుడు యజ్ఞ యోగ్యుడగును. సుందర, సుకృత, శోధకమగు అగ్ని మాతృరూపములగు రెండు చెక్కలనుండి ఆవిర్భవించును.

10. అగ్నీ ! మాకు సుభగ సుందరమగు ధనము ప్రసాదించుము. మాకు యాజ్ఞీకుడు, విశుద్ధాంత కరణుడగు పుత్రుడు కలుగవలెను. మాధనము సొంతము ఉద్గాతలది, స్తోతలది కావలెను. నీవు సదా శుభకార్యములతో మమ్ము పాలింపుము.

## నాలుగవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అగ్ని ఛందస్సు - త్రిష్టుప్.

1. హవివంతులారా ! మీరు శుద్ధుడు, దీప్తివంతుడగు అగ్నికి పరిశుద్ధ హవ్యము స్తోత్రము సమర్పించండి. అగ్ని, దేవతలలోను, మానవులలోను సమస్త పదార్థములందును తన ప్రజ్ఞతో ప్రవేశించును.

2. అరణిద్వయమునుండి తరుణతముడై అగ్ని ఉత్పన్నుడయినాడు. అగ్ని మేధావి. అతడు యువకుడు కావలెను. దీప్తజ్వాలల అగ్ని అరణ్యములను ఆరగించును కాల్చి మసి చేయును.

3. విశుద్ధమగు అగ్ని పరిగ్రహించువారికిని అట్లు పరిగ్రహించిన అగ్నిని సేవించువారికిని అగ్ని వారి శత్రువులకు దుస్సహరూపము జాజ్వలన మానుడగును.

4. కవి ప్రకాశకుడు, అమృతమూర్తి అగు అగ్ని కవులగు మానవులలో నిలుచును. అగ్నీ ! మేము నీ విషయమున సదా సుబుద్ధిగలవారమగుదుము. నీవు మమ్ము హింసించకుము.

5. అగ్ని తన ప్రజ్ఞలతో దేవతలకు అమృతము అందించినాడు. అందువలన అగ్ని దేవతల స్థానమున ఆసీనులు అయినాడు. వనములు, వృక్షములు గర్భమున అగ్నిని దాల్చును. భూమి సహితము అగ్నిని ధరించును.

6. అగ్ని అధిక అమృతము అందించ సమర్థుడు అందమగు అమృతము ప్రసాదించ సమర్థుడు బలశాలివగు అగ్నీ ! మేము పుత్రరహితులము కారాదు. రూపరహితులముకారాదు. సేనా శూన్యలముకారాదు.

7. *"పరిషద్యహ్యారస్య రేక్ణో"* అప్పులేని వాని వద్ద వలసినంత ధనములుండును. మేము నిత్యము ధనపతులము కావలెను. అగ్నీ ! మా సంతానము అన్యజాతము అనౌరసము కారాదు. అవిదుష, మార్గమును అనుసరించరాదు.

(*"అన్యజాతమ్"* అన్నాడు. ఇతరులకు పుట్టినవాడు. సంతానము కలుగనపుడు తన భార్యకు ఇతర పురుషులతో సంతానము కలిగించుట ఆచారమైనట్లున్నది. మహాభారతమున కౌరవ, పాండవులు అట్టి సంతానము. అది దేవర న్యాయమైనది. అట్టి సంతానముకాక స్వసంతానము కావలెనని కోటిక)

8. *"అన్య ఉదర్యః"* ఇతరుల ఉదరమున పుట్టినవాడు దత్తపుత్రుడు సుఖీవహుడుఐనను అతనిని పుత్రునిగా భావింపరాదు. అతడు మరల తనస్థానమునకేచేరును. అందువలన అన్నవంతా ! శత్రుహంతా ! మాకు నవజాత శిశువును ప్రసాదించుము.

(దత్తత నేటికిని శాసనబద్ధము)

9. అగ్నీ ! మమ్ము హింసకులనుండి రక్షింపుడు. పాపములనుండి రక్షింపుము. నిర్దోషము అన్నము నిన్ను చేరవలెను. అభిలషణీయము వేల ధనములు మాకు అందవలెను.

10. *"ఏతానో అగ్నే ఏ సౌభగాది దీదృపి క్రతుంసుచేతసంవతేమ*
*విశ్వాస్తోత్రుభ్యో గృణతే చ సన్తు యూయం పాత స్వస్తిభిః సదానః"*

మూడవ సూక్తమున పదవ మంత్రము పునరావృతము.

## అయిదవ సూక్తము

ఋషి వసిష్ఠుడు దేవత - వైశ్వానరాగ్ని - ఛందస్సు - త్రిష్టుప్.

1. వైశ్వానరాగ్ని - యజ్ఞమందు జాగృతులైన సకల దేవతలతో ప్రవృద్ధుడగును. అతడు పృథివ్యంతరిక్షముల సంచరించును. అట్టి అగ్నిని స్తుతించండి.

2. నదులచేత జలవర్షకుడు, పూజ్యుడు అగు అగ్ని భూమి, అంతరిక్షము నుండి వెడలినాడు. ఆ వైశ్వానరాగ్ని హవ్యముతో వర్ధిల్ల మానవ ప్రజముందు శోభిల్లును.

3. వైశ్వానరాగ్నీ ! నీవు పురుని వద్ద దీప్తుడవయినావు. అతని శత్రుపురములను చెదరగొట్టినావు. అట్లు ప్రజ్వలితుడవయినపుడు నీ భయమున నలుపు ప్రజ బెదిరి అన్నములు వదిలి పారినారు.

4. వైశ్వానరాగ్నీ ! అంతరిక్షము, పృథ్వి ద్యులోకము నీకు ప్రీతి కలిగించు పనులు చేయును. నీవు సంతత ప్రకాశమున శోభితుడువు. నీ దీప్తితో ద్యావాపృథ్వులను విశాల పరతువు.

5. వైశ్వానరాగ్నీ ! నీవు మానవులకు స్వామివి. ధనములకు నేతవు. ఉషకు దినమునకు కేతన స్వరూపుడవు. మేము అశ్వగణములు కోరి నిన్ను సేవింతుము. పాపహరములు, ఘృత యుక్తములగు వచనములు నిన్ను సేవించును.

6. మిత్రుల పూజయుత అగ్నీ ! వసువులు నీకు బలము ప్రసాదించినారు. నీ కర్మలను సేవించినారు. ఆర్యులకు అధిక తేజము ఉత్పన్నము చేసినావు. దస్యుల అనార్యులను వారి స్థానములనుండి పెకిలించినావు.

7. నీవు దూరస్థ అంతరిక్షమున సూర్యరూపమున భాసింతువు. వాయురూపుడవై సర్వ ప్రథమ సోమపానము చేసెదవు. జాతధనుడవగు అగ్నీ ! జలమును కలిగింతువు. సంతానమువలె పాలనీయ వ్యక్తి కోరికలు తీరుస్తావు. విద్యుద్రూపమున గర్జిస్తావు.

8. అందరు వరించదగిన అగ్నీ ! నీవు అన్నముతో ధనమును రక్షింతువు. అన్నముతో హవ్యదాత యశస్సును రక్షింతువు. మాకు దీప్తమంతమగు అట్టి అన్నమును అందించుము.

(ధనము, కీర్తికన్న అన్నము ఆహారమునకు ప్రాధాన్యత ఇచ్చుచున్నాడు. ఆహారము లేని ప్రాణము నిలువదు. ప్రాణమున్నకదా ధనము, యశము ! అందుకే అన్నం బ్రహ్మేతి వ్యజనాత్) అని వేదము ఘోషించినది. అన్నమే బ్రహ్మమని తెలిసికొనుము అనుచున్నాడు. అన్నము ఆహార పదార్థములు ధనమును సృష్టించును. కేవలము ధనము దేనిని సృష్టించజాలదు. కనీసము తనను సృష్టించుకొనజాలదు. డబ్బు మాత్రము ధనము ఎన్నిటికిని రాజాలదు.

అన్నపానాదులు యశస్సు ధన ఉత్పత్తికి కారణములగును.

కావున ప్రాణికి అన్నమే ప్రధానమగును. అందుకే అన్నం బ్రహ్మేతి వ్యజానాత్

9. అగ్నీ ! హవిర్దాతలకు అనంత అన్నము, ధనము జనులకు వినిపించు బలము ప్రసాదించుము. వైశ్వానరాగ్నీ ! నీవు రుద్ర వసువులతో కలిసి మాకు సుఖములనిమ్ము.

## ఆరవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - వైశ్వానరుడు ఛందస్సు త్రిష్టుప్

1. నేను పురభేదకులకు ప్రణమిల్లుదును. సామ్రాట్టు బలశాలి, స్తుతియోగ్యుడు, ఇంద్రునివంటి వైశ్వానరుని స్తుతింతును. అతని కార్యములను కీర్తింతును.

2. అగ్ని ప్రాజ్ఞుడు ప్రజ్ఞాపకుడు. పర్వతధారి. దీప్తిశాలి, సుఖదాత, ద్యావాపృథ్వులకు ప్రభువు. దేవతలు అట్టి అగ్నినే ప్రసన్ననిచేయుదురు. అగ్ని పురవిదారకుడు నేను అతని ప్రాచీనములును, మహాకార్యములను స్తుతించుచు కీర్తనలు గానము చేస్తాను.

3. దస్యులు యజ్ఞశూన్యలు హింసావాక్కులు. శ్రద్ధా రహితులు. బుద్ధిశూన్యులు. యజ్ఞరహితులు, పమిమ్ నామకులు; అగ్నీ ! వారిని దూరము చేయుము. నీవు ప్రధానుడవై అన్య యజ్ఞశూన్యులను నీచులను చేయుము.

4. నేతృత్వవంతుడగు అగ్ని అంధకారమున మునిగిన ప్రజను ప్రసన్నులను చేసినాడు. తన ప్రజ్ఞతో ప్రజలకు సరళ మార్గము చూపినాడు. నేను ధనాధిపతి, అనవనతుడు, యోద్ధులను అణచువాడగు అగ్నిని స్తుతింతును.

5. ఆసురీ విద్యను ఆయుధముతో హీనపరచిన వాడు సూర్యపత్ని ఉషను సృష్టించినవాడు. అదిగో ఆ అగ్నియే ప్రజలను తన బలమున నిర్బంధించినాడు. నహుషరాజుకు పన్నులు ఇచ్చునట్లు చేసినాడు.

6. సకల మానవులు తమ సుఖముకొఱకు ఎవని అనుగ్రహము పొందుటకు హవ్యసహితులై అరుదెంతురో ఆ వైశ్వానరాగ్ని పితృ, మాతృ తుల్యములగు ద్యావాపృథ్వుల మధ్యకు చేరినాడు.

7. సూర్యుడు ఉదయించగనే వైశ్వానరాగ్ని అంతరిక్షపు అంధకారమును గ్రహించును. అగ్ని అంతరిక్షపు క్రింది అంధకారమును గ్రహించును. వారు సముద్రము, ద్యులోకము భూమినుండి అంధకారము గ్రహింతురు.

## ఏడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్నీ ! నీవు రాక్షసుల పరాభవకర్తవు. అశ్వము వంటి వేగవంతుడవు. విద్వాంసుడవు. మా యజ్ఞమునకు దూతవగుము. దేవతలలో నీవు దగ్ధద్రుముడవని విఖ్యాతుడవు.

2. అగ్నీ ! నీవు స్తుతియోగ్యుడవు. దేవతల మిత్రుడవు. నీ తేజోబలమున నేలమీద చెట్టు చేమను ధ్వనింపచేతువు. నీ జ్వాలలతో అరణ్యములను కాల్చి, బాటచేసికొని విచ్చేయుము.

3.తరుణతమ అగ్నీ ! నీవు సుందర సుఖవంతుడవై ఆవిర్భవించినపుడు యజ్ఞము చేయబడును. కుశలు పరచబడును. స్తుతియోగ్యుడగు అగ్నియు, హోతయు తృప్తి చెందుదురు. అందరకు స్వీకరణీయమగు తల్లివంటి ద్యావాపృథ్వులు ఆహ్వానించబడుదురు.

4. విద్వజ్జనులు యజ్ఞమున నేత అగ్నిని వెంటనే ఆవిర్భవింపచేతురు. అగ్నికి హవ్యము అర్పించువారి గృహములందు విశ్వపతి, మాదకుడు, మధువచనుడు, యజ్ఞవంతుడగు అగ్ని నివసించును.

5. అగ్ని ద్యులోక, భూలోకములను వర్ధిల్లచేయును. విశ్వస్వీకరణీయ అగ్నిని హోతలు యజ్ఞము చేయుదురు. హవ్యవాహకుడు, బ్రహ్మ, అందరిని భరించు అగ్ని ద్యులోకము నుండి వచ్చి మానవ గృహములందు తిష్ఠ వేసినాడు.

6. ఇష్టముగా మంత్రములను సంస్కరించినవారు వాటిని వినదలచి వర్ధిల్లినవారు సత్యభూత అగ్నిని ప్రదీప్తము చేసిన మానవులు అన్నముతో ప్రాణులను వర్ధిల్ల చేయుదురు.

7. బలపుత్రా ! అగ్నీ ! నీవు వసువులకు పతివి. వసిష్ఠ గణములు నీ స్తోతలు. హవిష్మంతులను అన్నముతో శీఘ్రముగా వ్యాపింపచేయుము. మమ్ము ఎల్లప్పుడు స్వస్తి ద్వారా పాలింపుము. "పాతస్వస్తిభిః సదా నః"

## ఎనిమిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్

1. అగ్ని రూపమును ఘృతముచే ఆహ్వానించబడును. నేతలు హవియుక్తులై, నమస్కరించి అగ్నిని స్తుతింతురు. అతడే రాజు-స్వామి అగ్ని స్తుతులతో సమిద్ధుడగును. ఉషకన్నముందు అగ్ని ప్రదీప్తుడగును.

2. ఇతడే హోత మాదకుడు విశాలుడు అగ్ని. మానవులు అగ్నిని మహామహుడుగా గణింతురు. అగ్ని వెలుగులు పరచును. కృష్ణ మార్గ (మసిదారి) అగ్ని భూమిమీద పుట్టి చెట్లలో పెరుగును.

3. అగ్నీ ! నీవు ఏ హవిద్వారా మా స్తుతులను వ్యాపింప చేతువు స్తూయమానుడవై స్వధను పొందుదువు శోభన దానశీలి, అగ్నీ ! మేము ఎప్పుడు దుస్తర ధనములకు స్వాములము అగుదుము - భాగస్వాములమగుదుము.

4. అగ్ని, సూర్యునివలె మహాప్రతాపశాలియై ప్రకాశము పొందినపుడు భరతుని ద్వారా ప్రఖ్యాతిగాంచును. యుద్ధమున పురు అసురుని పరాభవించిన దీప్యమాన, దేవతల అతిథి అగ్ని ప్రజ్వలితుడైనాడు.

5. అగ్నీ ! నీకు నీవు కోటిన హవి లభించినది. సమస్త తేజస్సులతో ప్రసన్నుడవగుము. స్తోతల స్తోత్రములు వినుము. స్తుతించబడి స్వయముగా నీ శరీరమును వర్ధిల్లచేసి కొనుము.

6.నూరు గోవుల విభాగకారి, వేయిగోవుల సంయుక్తకర్త, విద్యావంతుడు, కర్మిష్ఠి మహా వసిష్ఠుడు అగ్ని కొఱకని ఈ స్తోత్రమును సృష్టించినాడు.

7. సూత్వామగ్నే ఈ మహే వశిష్ఠా ఈశానాం సూనోసహ సోవసూనాం!
ఇష స్తోత్రుభ్యోమఘవద్భ్యనే అనాంగూనయంపాత స్వస్తిభిస్సదానః||

ఏడవ సూక్తపు ఏడవ మంత్రము పునరావృతము

## తొమ్మిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్ని సకల ప్రాణులకు ఆధారభూతుడు. హోత, హర్షదుడు. ప్రజ్ఞాతముడు శోధకుడు, అగ్ని ఉషస్సు నడుమ జాగృతుడైనాడు. అతడు దేవతల, మానవుల ప్రజ్ఞాకారకుడు దేవతలకు హవ్యము. పుణ్యాత్ములకు ద్రవ్యము అందించువాడు.

2. అగ్ని పణుల ద్వారములు బద్దలుకొట్టినాడు. అందుకే సుకృతాత్ముడయినాడు. మా కొఱకు బహుక్షీరయుక్తములు,

అర్చనీయములగు గోవులను హరించినాడు. అతడు దేవతలను పిలుచువాడు. హర్షదుడు శాంతమనస్కుడు. అగ్ని రాత్రి చీకట్లను యజమానుని చీకట్లను పారద్రోలుచు కనిపించును.

3. అగ్ని అమూఢుడు కవి, అదీనుడు దీప్తిమనంతుడు. శోభన గృహవంతుడు. మిత్రుడు, అతిథి, మాకు శుభప్రదుడు. అతడు దీప్తియుక్తుడయి ఉషస్సు ముఖమున శోభిల్లును. జలగర్భమున పుట్టును. ఓషధులందు ప్రవేశించును.

4. అగ్నీ ! నీవు మానవుల యజ్ఞములందు స్తుతి యోగ్యుడవు. జాతధనుడగు అగ్ని యుద్ధములందు దీప్తుడై ప్రకాశించును. అతడు దర్శనీయ తేజమున శోభిల్లును. స్తుతులు సమిద్ధ అగ్నిని ప్రబోధితునిచేయును.

5. అగ్నీ ! నీవు దేవతలముందుకు దేవకార్యమునకు వెళ్లుము. ప్రజా సంఘములనువలె మా స్తోతలను హింసించకుము. మాకు రత్నములు ప్రసాదించుటకుగాను నీవు సరస్వతి, మరుద్గణములు, అశ్వినులు, జలము మున్నగు సకల దేవతల యజ్ఞములు చేస్తావు.

6. అగ్నీ ! వసిష్ఠుడు నిన్ను సమిద్ధుని చేస్తాడు. నీవు కరకుమాటల రాక్షసులను వధించుము. జాతవేద అగ్నీ ! అనేక స్తోత్రములతో దేవతలను స్తుతించండి. "పాతయ స్వస్తిభిః సదానః"

## పదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు - దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉషాప్రియుడగు సూర్యునివలె అగ్ని విస్తృత తేజమును ఆశ్రయించును. అత్యంత దీప్తిమంతుడు, కోరికలు తీర్చువాడు, హవ్యప్రేరకుడు, పరిశుద్ధుడగు అగ్ని కర్మలను ప్రేరేపించును. దీప్తితో ప్రకాశమునొందును. అగ్ని అభిలషులను జాగృతము చేస్తాడు.

2. అగ్ని పగటిపూటనే, ఉషముందే, సూర్యునివలె శోభిల్లును. ఋత్విక్కులు యజ్ఞము విస్తరించుచునే మానవీయ స్తోత్రములు ఉచ్చరింతురు. విద్వాంసుడు, దూత, దేవతల వద్దకు వెళ్లువాడు, దూత శ్రేష్ఠుడగు అగ్ని ప్రాణులను ఆర్ద్రులను చేయును.

3. అగ్ని దర్శనీయుడు. సుందరుడు. చక్కని నడకలవాడు. హవ్యవాహకుడు. మానవులకు స్వామి. దేవాభిలాషి, ధన యాచక, గతిశీల స్తుతిరూప వచనము అగ్నిముందు నిలుచును.

4. అగ్నీ ! మా కొఱకుగాను నీవు వసువులతో కలిసి ఇంద్రుని ఆహ్వానించుము. రుద్రులతో కలిసి మహారుద్రులను

ఆహ్వానించుము. ఆదిత్యులతో కలిసి విశ్వహితైషి అదితిని ఆహ్వానించుము. అంగిరులతో కలిసి బృహస్పతిని ఆహ్వానించుము.

5. కోరికల మానవులు స్తుత్యుడు, హోత, యువతముడు అగ్నిని యజ్ఞములందు స్తుతిస్తారు. అగ్ని రేయివాడు. అతడు దేవతల యజ్ఞము కొరకు హవ్యదాతకు ఆరాటములేని దూత అగును.

## పదకొండవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - అగ్ని ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్నీ ! నీవు యజ్ఞప్రజ్ఞాపకుడవు. మహామహుడవు. నీవు లేకున్న దేవతలు ఉన్మత్తులు కాలేరు. నీవు దేవతలందరితో రథయుక్తుడవై విచ్చేయుము. ముఖ్యహోతవై కుశలమీద కూర్చుండుము.

2. అగ్నీ నీవు గమనశీలుడవు. మనవులగు హవిర్దాతలు దౌత్య కార్యమునకుగాను ప్రార్థింతురు. ఒక యజమాని కుశలపై దేవతల సహితుడవై నీవు కూర్చున్నచో అతని రోజులు వెలుగును.

3. అగ్నీ ! ఋత్విక్కులు మానవ హవ్యదాతలకొఱకు రోజుకుమూడుసార్లు నీలో హవ్యము అర్పింతురు. ఈ యజ్ఞమునకు దూతవైరమ్ము. మనువువలె యజ్ఞము చేయుము. మమ్ము శత్రువుల బారినుండి రక్షింపుము.

4. అగ్ని మహాయజ్ఞములకు స్వామి. సకల సంస్కృత హవ్యములకు భర్త. వసువులు అగ్నియొక్క కార్యములను సేవింతురు. దేవతలు అగ్నిని హవ్యవాహకుని చేసినారు.

5. అగ్నీ ! హవ్యభక్షణకుగాను దేవతలను పిలువుము. ఈ యజ్ఞమున ఇంద్రాని దేవతలను ఉన్మత్తులను చేయుము. దీనిని ద్యులోకమునందలి దేవతల వద్దకు తీసికొనిపొమ్ము *"పాతస్వస్తిభిః సదా నః"*

## పన్నెండవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అగ్ని, ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్ని తన గృహమున సమిద్ధుడగను. ప్రదీప్తినొందును. అతడు తరుంతముడు. విస్తీర్ణుడు. ద్యావాపృథ్వుల మధ్యనిలిచినవాడు. విచిత్ర జ్వాలావంతుడు. సుందరుడు. ఆహూతుడు. సర్వత్ర సంచరించువాడు. అట్టి అగ్నివద్దకు

మేము నమస్కరించి చేరుదుము.

2. జాతధనుడగు అగ్ని తమ మహిమతో సకల పాపములను తుడిచివేయును. అగ్ని యజ్ఞగృహమున స్తుతించబడును. అతడు మమ్ము పాపములనుండి, నిందాకార్యములనుండి రక్షించవలెను. మేము అగ్నిని స్తుతింతుము. అతని యజ్ఞము చేస్తాము.

3. అగ్నీ ! నీవే మిత్రుడవు. నీవే వరుణుడవు. వసిష్ఠ వంశీయులు తమ స్తుతులతో నిన్ను వర్ధిల్ల చేయుదురు. నీయందన్న ధనము సులభసాధ్యము కావలెను. *"పాతస్వస్తిభిః సదా నః"*

## పదమూడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - వైశ్వానరాగ్ని - ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్ని అందరి ఉద్దీపకుడు. కర్మధారకుడు. అసురనిహంత. అట్టి అగ్నిని స్తుతించండి. కర్మచేయండి. నేను ప్రసన్నుడను అయినాను. మనోరథదాత వైశ్వానరాగ్నిని యజ్ఞమున హవ్యసహితముగా స్తుతింతును.

2. అగ్నీ ! నీవు కాంతులతో కాంతిమంతుడవైనావు. నీవు పుట్టి ద్యావాపృథ్వులను పూరించినావు. జాతధనవైశ్వానరా ! నీ మహిమతో దేవతలను శత్రువులనుండి విముక్తులను చేసినావు.

3. అగ్నీ ! నీవు సూర్యరూపమున ఉత్పన్నుడవగుము. స్వామివగుము. సర్వత్ర గమనశీలుడవగుము. గోపాలుడు పశువులను చూచుకున్నట్లు నీవు సమస్త ప్రాణులను చూచుకొందువు. అప్పుడు నీకు స్తోత్రరూపమగు ఫలము లభించును. *"పాతస్వస్తిభిః సదా నః"*

## పదునాలుగవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు దేవత - అగ్ని, ఛందస్సు మొదటిది బృహత్, తక్కినవి త్రిష్టుప్.

1. మేము హవివంతులము. సమిధలతో అగ్నిని సేవింతుము. దేవస్తులతో అగ్నిని సేవింతుము. హవ్యము అర్పించి శుభ్రదీప్తాగ్ని సేవింతుము.

2. అగ్నీ ! మేము సమిధలతో నిన్ను సేవింతుము. యజనీయా ! మేము స్తుతులతో నిన్ను సేవింతుము. కళ్యాణమయ జ్వాలామయ అగ్నీ ! హవి అర్పించి నిన్ను సేవింతుము.

3. అగ్నీ ! నీవు హవ్యము సేవించుచు దేవతల వెంట మావద్దకు విచ్చేయుము. నీవు ప్రకాశవంతుడవు. మేము నిన్ను సేవిస్తాము. "పాతస్వస్తిభిః సదానః"

## పదిహేనవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - అగ్ని - ఛందస్సు - గాయత్రి.

1. అగ్ని మాకు సమీపతమ బంధువు. ఋత్విక్కులు అగ్నివద్ద కూర్చుండువారు. వారు మనోరథపూరకుడగు అగ్ని నోట హవ్యము అర్పించవలెను.

2. ప్రాజ్ఞుడు, గృహపాలకుడు, నిత్య తరుణుడగు అగ్ని పంచజనుల పరితి ఇంటిముందు కూర్చుండును.

(పంచజనులనగా నాలుగు వర్ణములవారు నిషాదుడు అని శాయణుని వ్యాఖ్య. ఐదుగురి ఇళ్లముందు అగ్ని సమానముగా కూర్చున్నట్లు చెప్పబడినది. నిషాదుడు అసముడుకాడు)

3. ఆ అగ్నియే మాకు మంత్రి. సకల ధనములకు బాధకలుగనట్లు రక్షింపవలెను. మమ్ము పాపములనుండి రక్షించవలెను.

4. మేము ద్యులోకమునందలి శ్యేనపక్షివంటి వేగగమనముగల అగ్ని కొఱకు కొత్త మంత్రములను కల్పింతుము. అతడు మాకు కావలసినంత ధనము ఇవ్వవలెను.

5. యజ్ఞపు అగ్రభాగమున వెలుగొందు అగ్గి వెలుగులు పుత్రవంతుడు మానవుని ధనమువలె కనులకు విందు చేయును.

6. యాజ్ఞికుల ఉత్తమ హవ్యవాహక అగ్ని ఈ హవ్యమును కోఱవలెను. మా స్తుతులను స్వీకరించవలెను.

7. దరికి చేరదగినవాడు, విశ్వపతి, యజమానులు పిలిచిన అగ్నీ ! నీవు ప్రకాశమానుడవు. సువీరుడవు. మేము నిన్ను స్థాపించినాము.

8. నీవు రాత్రింబవళ్లు వెలుగుము. అందువలన మేము శుభంకర అగ్నివంతులము కాగలము. నీవు మమ్ము ఇష్టపడుము. నీవు సుందర స్తుతివంతుడవగుదువు.

9. అగ్నీ ! ప్రతాపశాలి యజమాని ధనలాభమునకు నీ వద్దకు చేరును.

10. శుభ్రశిఖావంత, అమర, స్వయం శుద్ధ, శోధక, స్తుతియోగ్య అగ్నీ ! రాక్షసులను హింసించుము.

11. బలపుత్రా ! నీవు జగదీశ్వరుడవై మాకు ధనము ఇమ్ము. భగుడు సహితము మాకు వరణీయ ధనము ఇవ్వవలెను.

12. అగ్నీ ! నీవు పుత్ర, పౌత్రాదియుక్త అన్నము ఇమ్ము. సవిత సహితము వరణీయ ధనము ఇవ్వవలెను. భగుడు అదితి కూడ ఇవ్వవలెను.

13. అగ్నీ ! మమ్ము పాపములనుండి రక్షింపుము. జర ఎరుగని దేవా ! హింసకులను అత్యంత తాపకర తేజమును దహించును.

14. నీవు దుర్ధర్షుడవు. ఇప్పుడు మా మానవుల రక్షణకుగాను లోహ నిర్మిత శతభుజపురము ఏర్పరచుము.

15. అహింసనీయ అంధకారమును తొలగించు అగ్నీ ! మమ్ము పాపములనుండి, పాపకర్మములనుండి రక్షింపుము.

## పదహారవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - అగ్ని - ఛందస్సు - బృహతి.

1. బలపుత్రుడు, ప్రియుడు, విద్వత్ శ్రేష్ఠుడు, గతిశీలుడు, సుందర యజ్ఞవంతుడు, అందరిదూత ఆనిత్యాగ్నిని స్తోత్రములతో పిలుచుచున్నాను.

2. అగ్ని రోచకుడు. అందరిపాలకుడు. అతడు రెండు గుఱ్ఱములను రథమున పూన్చును. దేవతలవద్దకు ఎంతో వేగముగా చేరును. అతడు సుందర రూపమున ఆహూతుడు. సుందర స్తుతివంతుడు. సుందర యజ్ఞవంతుడు. సుందరకర్ముడు. వసిష్ఠ వంశజుల హవిరూప ధనము అగ్నిని చేరవలెను.

3. అభీష్టవర్షి, ఆహూతుడగు అగ్ని తేజము పైకి పైకి పోవుచున్నది. రోచకమగు ఆకాశమంటుచు పొగలు లేచుచున్నవి. మానవుడు నిప్పును మండించుచున్నాడు.

4. బలపుత్ర అగ్నీ ! నీవు కీర్తిశాలివి. మేము నిన్ను దూతను చేస్తాము. హవ్యము ఆరగించుటకు దేవతలను పిలువుము. మేము నిన్ను యాచించినప్పుడు మానవులకు భోగయోగ్యమగు ధనము అందించుము.

5. లోకములు మన్నించు అగ్నీ ! మా యజ్ఞమున గృహపతివి, పోతవగుము. వర్ధిల్లుము. వరణీయ హవ్యమును యజింపుము, ఆరగింపుము.

6. సుందర కర్ముడవగు అగ్నీ ! నీవు రత్నదాతవు. యజమానికి రత్నములిమ్ము. మా యజ్ఞమున అందరిని చురకువారిని చేయుము. వృద్ధిచెందు హోతను మరింత వర్ధిల్లచేయుము.

7. సుందరరూప ఆహూత అగ్నీ ! నీకు స్తోతలు ప్రియులు కావలెను. జలసముదాయమునకు, గోసముదాయమునకు దానములిచ్చు ధనవంతులు సహితము నీకు ప్రియులుకావలెను.

8. ఏ గృహములందు ఘృతహస్త, అన్నరూప, హవిర్లక్షణ దేవి పూర్ణ రూపమున ఆసీనురాలగునో, అగ్నీ ! ఆ ఇంటివారిని ద్రోహులనుండియు నిందకులనుండియు కాపాడుము. మాకు కలకాలము నిలుచునట్టి స్తుతియోగ్యమగు సుఖములను ప్రసాదించుము.

9. అగ్నీ ! నీవు హవ్యవాహకుడవు. విద్వాంసుడవు. ముదము కలిగించునదియు, ముఖమునందున్న జిహ్వా-జ్వాల-తోమాకు ధనము ఇమ్ము హవ్యదాతను కర్మకు ప్రోత్సహించుము.

10. యువతమ అగ్నీ ! యశముకోరి సాధకరూపము, అశ్వాత్మకమగు హవ్యము అర్పించు యజమానిని పాపముల నుండి రక్షింపుము. నూరు నగరములతో పాలింపుము.

11. అగ్ని ధనదాత. అతడు మీ హవిపూర్ణ స్రుక్కును వాంఛించును. సోమపాత్ర సిద్ధము చేయుము. సోమదానము చేయుము. అనంతరము అగ్ని నిన్ను భరించును.

12. దేవతలారా ! మీరు ఉత్తమ బుద్ధి అగ్నిని యజ్ఞవాహకుని హోతను చేసినారు. అట్టి అగ్ని పరిచర్యకారులగు హవ్యదాతలకు శుభంకరము, పౌరుషవంతము, రమణీయమగు ధనమును ప్రసాదించవలెను.

## పదిహేడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - అగ్ని - ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్నీ ! శోభన సమిధలతో సమృద్ధుడవగుము. అధ్వర్యలు అందముగా కుశలు పరచవలెను.

2. దేవాభిలాషులకుగాను యజ్ఞద్వారములు దేవద్వారములు, తెరువుము, యజ్ఞాభిలాషులగు దేవతలను ఈ యజ్ఞమునకు పిలువుము.

3. జాతధన అగ్నీ ! దేవతలముందుకు వెళ్లుము. హవ్యముతో దేవతల యజ్ఞము చేయుము. దేవతలను శోభన యజ్ఞవంతులను చేయుము.

4. జాతధన అగ్నీ ! అమర దేవతలను సుందర యజ్ఞ యుక్తులను చేయుము. హవ్యముతో యజ్ఞము చేయుము. స్తోత్రములతో ప్రసన్నులను చేయుము.

5. సుబుద్ధి అగ్నీ ! మాకు వరణీయ సమస్త ధనములను దానము చేయుము. నేడు మా ఆశీస్సులు నిజము కావలెను. "సత్యాభవన్త్వాశిషోనో అద్య"

6. అగ్నీ ! నీవు బలపుత్రుడవు. ఈ దేవతలే నిన్ను హవ్యవాహకుని చేసినారు.

7. నీవు ప్రకాశమానుడవు. మేము నీకు హవి సమర్పింతుము. నీవు మహామహుండవు. దగ్గరకు చేర యోగ్యుడవు. మాకు రత్నములు ధనము దానము చేయుము.

*(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత అయిదవ అష్టకము ఏడవ మండలమున మొదటి అనువాకము సమాప్తము)*

## రెండవ అనువాకము పద్దెనిమిదవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు దేవత - ఇంద్రుడు - ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! మా పితరులు నిన్ను స్తుతించినారు. నీ నుండి సకల మనోహర ధనములను పొందినారు. నీ వలననే గోవులు సులభముగా పాలుపితుకుటకు యోగ్యములు అగును. నీలోనే అశ్వములు ఉన్నవి. దేవాభిలాషులకు నీవు తగినంత ధనము ప్రదానము చేతువు.

2. ఇంద్రా ! నీవు భార్యలతో కూడి రాజువలె వెలుగొందుదువు. నీవు విద్వాంసుడవు. కవివి. స్తోతలకు హిరణ్యాదులు దానము చేయుము. గోవులు, అశ్వములిచ్చి కాపాడుము. మేము నిన్ను కోఱుకుందుము. ధనము కొఱకుగాను మమ్ము సంస్కారవంతులను చేయుము.

("రాయె శిశిషి" మంత్రభాగము. "ధనార్థంచ సంస్కురు" శాయణుని వ్యాఖ్య. సంస్కారవంతులవద్ద ఉన్న ధనమునకు మాత్రమే సార్థకత ! ధనము కలుగుటకు సంస్కారము అవసరము !! సంస్కారములేనివాని ధనము పిచ్చివాని చేతిరాయి !!! అది సమాజమునకు హానికారకమగును. నేడు ధనము సంస్కారహీనుల పరమైనది. దాని దుష్ట పరిణామములు నగ్న నేత్రమునకు అగుపించుచున్నవి)

3. ఇంద్రా ! ఈ యజ్ఞపు స్పర్ధమాన, రమణీయ స్తుతులు నీవద్దకు చేరవలెను. నీ ధనము మావద్దకు చేరవలెను. మేము నీ కృపాపాత్రులము కావలెను. మేము సుఖించవలెను.

4. ఉత్తమ తృణవంతమగు గోశాలలోని గోవులవలె, ఇంద్రా ! నిన్ను పితుకుకోరికగలవాడై. వసిష్ఠుడు స్తోత్రరూపవత్సమును చేయును. సమస్త లోకములు నిన్నే గోవులకు స్వామి అనును.

ఇంద్రా ! సుందరములగు మా స్తుతులవద్దకు విచ్చేయుము.

5. స్తవనీయ ఇంద్రా ! పురుష్ణి నది పొంగిపొరలుచున్నపుడు సహితము నీవు సుదాసుడను రాజును నీరు అంటకుండ నదిని దాటు యోగ్యుని చేసినావు. స్తోతల కొఱకుగాను నదులు జనులను అడ్డగించు శాపమును తొలగించినావు.

6. యాజ్ఞికుడు, పురోదాత తుర్వశుడను రాజు ఉండెను. అతడు చేపవలె నీటకట్టబడినాడు. అయినను భృగువులు, ద్రుహ్యులు, ధనాశచే సుదాసు, తుర్వశులను విడిపించినారు. వారిద్దరిలో ఇంద్రుడు, తుర్వశుని వధించినాడు. సుదాసుని రక్షించినాడు.

7. హవ్యపాచకులు, కళ్యాణముఖులు, దీక్షితులు, శుభప్రదులు ఇంద్రుని స్తుతింతురు. సోమపానమున మత్తుడగు ఇంద్రుడు ఆర్యుని గోవులను హింసకులనుండి విడిపించినాడు. యుద్ధముచేసి గోతస్కర శత్రువులను వధించినాడు.

8. దుష్టమానసులు, మందమతులగు శత్రువులు పురుష్ణి నదిని త్రవ్వుచు దాని దరులను కూల్చినారు. ఇంద్రుని కృపవలన సుదాసుడు విశ్వవిఖ్యాతుడు అయినాడు. చయమాన పుత్రుడు కవిని పశువును పడేసినట్లు పడవేసి చంపినాడు.

9. ఇంద్రుడు పురుష్ణి తటములను బాగుచేసినాడు. అప్పుడు ఆ జలము పోవలసిన చోటునకు నదిలోనికి వెళ్లిపోయినది. ఇటునటు పోలేదు. సుదాసుని అశ్వము సహితము గంతవ్యస్థలము చేరినది. ఇంద్రుడు సుదాసుని కొఱకుగాను మానవులలో సంతానవంతులు, వాగుడు శత్రువులను వారి సంతానముల సహితముగా వశపరచుకున్నాడు.

10. కాపరిలేని గోవులు చేలమీదికి పోయినట్లు తల్లిపంపిన మరుద్గణములు తమ పూర్వ ప్రతిజ్ఞననుసరించి మిత్రుడగు ఇంద్రునివైపు వెళ్లినారు. మరుత్తుల నియుక్తులు సహితము సంతోషించినవి.

11. కీర్తి ఆర్జించుటకుగాను సుదాసుడను రాజు రెండుచోట్ల ఇరువది ఒక్క మందిని వధించినాడు. యువ అధ్వర్యుడు యజ్ఞగృహమున కుశలు కోసినట్లు, ఆ రాజు శత్రువులను కోతకోయును, వీరుడగు ఇంద్రుడు సుదాసుని సహాయమునకు మరుత్తులను సృష్టించినాడు.

12. అదికాక ఇంద్రుడు శ్రుత, కవష, వృద్ధ, ద్రుహ్యు, నామకులను నీళ్లలో ముంచినాడు. అప్పుడు ఇంద్రుని కోఱుకొని ఇంద్రుని స్తుతించినవారు సహచరులయినారు మిత్రులయినారు.

13. ఇంద్రుడు స్వశక్తితో ఉక్త శ్రుత, మున్నగు సుదృఢ నగరములను ఏడు విధముల రక్షా సాధనములను అతిత్వరగా ధ్వంసము చేసినాడు. అను పుత్రుడు గృహుని తుత్సునకు ఇచ్చినాడు ఇంద్రా ! మేము దుష్టవచనులను గెలువవలెను అట్లని అనుగ్రహింపుము.

14. అను మరియు ద్రుహ్యుల గోవులను పొందగోరిన 66వేల 66మందిని సేవాభిలాషి సుదాసునికొఱకు హతమార్చినాడు. ఇవన్నియు ఇంద్రుని ప్రతాప సూచికలు.

15. దుష్టమిత్రులుగల మూర్ఖులు తుత్సు జనులు ఇంద్రునితో యుద్ధమునకు దిగినారు. తాళజాలక పలాయనమునకు సిద్ధపడినారు. పల్లమునకు పారునీటివలె పారినారు. కాని వత్తిడికి తట్టుకొనలేక సకల భోగ్య పదార్థములను సుదాసునకు వప్పగించినారు.

16. శూరుడగు సుదాసుని హింసించు వారిని ఇంద్రశూన్యలగు హవ్యదాతలను ఉత్సాహవంతులను ఇంద్రుడు నేలకరిపించినాడు. అతడు క్రోధుల క్రోధమును తలక్రిందులు చేసినాడు. దారినపోవు సుదాసుని శత్రువులు పలాయనం చిత్తగించినారు.

17. అప్పుడు ఇంద్రుడు దరిద్రుడగు సుదాసునితో ఒక కార్యము చేయించినాడు. అతడు సింహమును మేకతో చంపించినాడు. సూదితో యూపపుకొన కోయించినాడు. ధనమంతయు సుదాసునకు ప్రదానము చేసినాడు.

("తాన్యేతాని త్రీణి కర్మాణి" అసంభావితానితి నా శంకనీయాని ఇంద్రస్య మహివెన్నాధికత్వాదితి శాయణవ్యాఖ్య)

18. ఇంద్రా ! నీశత్రువులలో అధికాంశులు నీకు వశులైనారు. భేదుని నాస్తికుని వశపరచుకొనుము. నిన్ను స్తుతించువారికి నాస్తికుడు ఇష్టము కలిగించును. వారికి వ్యతిరేకముగా శూరులగు యోద్ధలను ప్రోత్సాహపరచుము.

వారిని వజ్రమున పరిమార్చుము.

19. ఈ యుద్ధమున ఇంద్రుడు భేదుని వధించినాడు. యమున ఇంద్రుని సంతుష్టుని చేసినది. తత్సువులు, సహితము ఇంద్రుని సంతుష్టుని చేసినారు. అజ, శిప్రు, యక్షునామక జనపదములవారు ఇంద్రునకు గుఱ్ఱపు తలలు బహూకరించినారు.

20. ఇంద్రా ! నీ ప్రాచీన అనుగ్రహములు, ధనమును ఉషతో ఉపమించలేము. నీ నూతన అనుగ్రహములు, ధనము సహితము వర్ణనాతీతము. నీవు మన్యమానుని, పుత్రుడగు దేవకుని వధించినావు. కొండ చరియతో శంబరుని వధించినావు.

21. పరాశర, వసిష్ఠాది ఋషులను అనేకమంది రాక్షసులు వధించదలచినారు. ఇంద్రా ! ఆ ఋషులు నిన్ను కోరుకున్నారు. వారు తన ఇండ్లవైపు పోవుచు నిన్ను స్తుతింతురు. వారు నీ సఖ్యతను మరువలేదు. ఎందుకనగా నీవు వారి పాలనను మరువలేదు. అందువలన వారికి కాలము సర్వదా సుందరముగా ఉండును.

22. దేవశ్రేష్ఠ ఇంద్రా ! దేవవాన్ రాజు పౌత్రుడు, పిజవన పుత్రుడు సుదాసుడు మాకు రెండువందల ఆవులు, రెండు రథములు ఇంద్రుని స్తుతించి నందుకుగాను ఇచ్చినాడు రాజహోతయజ్ఞ గృహమున ప్రవేశించినట్లు నేను గృహమున ప్రవేశింతును.

23. పిజవనపుత్రుడు సుదాసుడు వసిష్ఠునకు నాలుగు గుఱ్ఱములు ఇచ్చినాడు. అవిశ్రద్ధ దానాది యుక్తములు, స్వర్ణాలంకార సంపన్నలు. దుర్గమ ప్రదేశములందు సరళగాములు, అవి పుత్రునివలె పోషించదగు వసిష్ఠ పుత్రుని అన్నము, యశమును మోయును.

24. సుదాసుని కీర్తి ద్యావాపృథ్వుల మధ్య నిలిచి ఉన్నది. అతడు దాతలందు శ్రేష్ఠుడు. శ్రేష్ఠవ్యక్తులకు ధనదానము చేయును. ఇంద్రుని స్తుతించినట్లు ఏడు లోకములు సుదాసుని స్తుతించును. యుద్ధమునందు నదులు "యుధ్యామధి" నామక శత్రువును నాశనము చేసినవి.

25. నేతలగు మరుత్తులారా ! ఇతడు సుదాసుని తండ్రి పిజవనుడు లేక దివోదాసుడు దివోదాసును సేవించినట్లే సుదాసుని సేవించండి. సుదాసుని ఇంటిని రక్షించండి, సుదాసుబలము అవినాశ్యము అక్షయము కావలెను.

## పందొమ్మిద సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రుడు వాడికొమ్ము ఎద్దువలె వంటరిగనే శత్రువును స్థానభ్రష్టుని చేయును. హవ్యశూన్య వ్యక్తుల ఇండ్లు తీసికొనును. ఆ ఇంద్రుడే సోమాభిషవ కర్తకు ధన దానము చేయవలెను.

2. ఇంద్రా ! అర్జుని పుత్రుడు కుత్సునకు ధనదనము చేసినావు. దాసులు "కువయ" "శుష్ణ" లను వశపరచుకున్నావు. మానవుల మధ్య యుద్ధమున కుత్సుని రక్షించినావు.

3. ఘర్షక ఇంద్రా ! హవ్యదాత సుదాసును వజ్రము మున్నగు సకల రక్షణలతో రక్షింపుము. భూమికొఱకు జరిగిన యుద్ధము పురుకుత్స పుత్రుడు త్రసదస్యు మరియు పురుని రక్షింపుము.

4. నేతల స్తుతియోగ్యుడవగు ఇంద్రా ! మరుత్తుల సహితుడవై చేసిన యుద్ధములందు అనేకమంది వైరులను హతమార్చినావు. హర్యశ్వయుక్త ఇంద్రా ! దభీతి, కొఱకుగాను నీవు దస్యు, చుమురి, ధుని నామకులను వధించినావు.

5. వజ్రహస్త ఇంద్రా ! నీ బలము అపారము. శంబరాసురుని తొంబది తొమ్మిది పురములను ధ్వంసము చేసినావు. నీ నివాసమునకుగాను నూరవ పురమును వశపరచుకున్నావు. వృత్రుని నముచిని వధించినావు.

6. ఇంద్రా ! హవ్యదాత యజమాని సుదాసుని కొఱకు నీ సంపదలు సనాతనములయినవి. బహుకర్మ ఇంద్రా ! నీవు కోటికలు తీర్చువాడవు. నీ కొఱకు నేను రెండు కోటికలు తీర్చు గుఱ్ఱములను రథమున కట్టెదను. నీవు బలిష్ఠుడవు. నిన్ను స్తోత్రములు చేరవలెను.

7. బలము, అశ్వములుగల ఇంద్రా ! ఈ యజ్ఞమున పరదానము, పాపమున భాగస్వాములము కారాదు. మమ్ము బాధారహిత రక్షలతో కాపాడుము. మేము స్తోతలకు ప్రియులము కావలెను.

8. ధనపతి ఇంద్రా ! నీ యజ్ఞమున మేముసఖులమై, ప్రియులమై గృహమున ప్రసన్నులను కావలెను. అతిథివత్సలుడగు సుదాసునకు సుఖములు కల్పించుచు తుర్వశ, యాద్వులను వశపరచుకొనుము.

9. ధనవంతుడవగు ఇంద్రా ! నీ యజ్ఞమున మేము నేతలము. ఉక్థలు - మంత్రములు - ఉచ్ఛరించువారము. నేడు మేము మంత్రములు ఉచ్ఛరింతుము. నీకు అర్పించిన హవ్యముతో దాతలుకాని వణిజులకు సహితము ధనము ఇచ్చెదము.

10. నేతృశ్రేష్ఠి ఇంద్రా ! నేతల స్తుతులు నిన్ను పూజనీయుని చేసినవి. వారి హవ్యదానము నిన్ను మావైపు మరల్చినది. యుద్ధమున ఈ నేతలకే నీవు శుభములు కలిగించుము. వారికి మిత్రుడవు, శూరుడవు, రక్షకుడవగుము.

11. వీరుడవగు ఇంద్రా ! నేడు నీవు స్తుతించబడి, స్తోత్రవంతుడవై దేహమున వర్ధిల్లుము. మాకు అన్నము ఇల్లు ఇమ్ము "పాత స్వస్తిభిః సదా నః"

(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత అయిదవ అష్టకము ఏడవ మండలమున రెండవ అధ్యాయము సమాప్తము)

***ఓం నతామినన్తిమాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రువాణి***
***నరోదసీ అద్రుహా వేద్యాభిర్న పర్వతాని నమే తస్థివాంసః***

**మూడవ అధ్యాయము          ఇరువదవ సూక్తము**

ఋషి - వసిష్ఠుడు దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రుడు బలశాలి. ఓజస్వి, అతడు వీరకృత్యముల కొఱకే జన్మించినాడు. ఇంద్రుడు ఒక మానవ హితకర కార్యము చేయదల్చుకున్నప్పుడు తప్పక చేయును. ఇంద్రుడు యువతముడు. అతడు యజ్ఞమున రక్షించుటకుగాను యజ్ఞ గృహమునకు వెళ్లును. అతడు మమ్ము మహాపాపములనుండి రక్షించవలెను.

2. ఇంద్రుడు వర్ధిల్లును. వృత్రుని వధించును. అతడు స్తోతకు శరణు ఇచ్చును రక్షించును. అతడు సుదాసుని కొఱకు ఒక ప్రదేశమును ఏర్పరచినాడు. యజమానికి మరల మరల ధనము ఇచ్చును.

3. ఇంద్రుడు యోద్ధ, పక్షపాతరహితుడు, యుద్ధములు చేయువాడు యుద్ధతత్పరుడు. శూరుడు. అనేకుల పరాభవ కర్త. శత్రువుల అజేయుడు. తనతో పగపెట్టుకొన్న వారిని అతడు హతమార్చును.

4. ఇంద్రా ! నీవు బహు ధనశాలివి. నీ బలము మహిమలతో ద్యావాపృథ్వులను పరిపూర్ణము చేసినావు. అశ్వవంత ఇంద్రుడు శత్రువు మీదకు వజ్రము విసరుచు, యజ్ఞమున సోమరసముతో సేవితుడు అగును.

5. యుద్ధము కొఱకే తండ్రి కశ్యపుడు ఇంద్రుని పుట్టించినాడు. ఇంద్రుడు అభీష్టవర్ణి స్త్రీ - అదితి మానవ హితైషి ఇంద్రుని కన్నది. ఇంద్రుడు మానవుల సేనాపతిమయి వారికి స్వామి అగును. ఇంద్రుడు ఈశ్వరుడు శత్రుహంత. గోవుల అన్వేషకుడు. శత్రుపరాభవకారి.

6. ఇంద్రుడు శత్రునాశక మనమువాడు. అట్టి ఇంద్రుని సేవించువానికి ఏనాటికిని స్థానభ్రష్టముకాదు. అతనికి క్షయములేదు. యజ్ఞోత్పన్నుడు, యజ్ఞరక్షకుడగు ఇంద్రుని స్తుతించువారికి అతడు ధనము ఇవ్వవలెను.

7. పూర్వపు తండ్రి లేక చిన్నవారికి దానముచేసినది ఒక ధనము; చిన్నవాని నుంచి పెద్దవానికి లభించినది ఒక ధనము. అమృతము వంటి పితృ ధనము పుత్రుడు అందుకొని దూరదేశము వెళ్లినది ఒక ధనము.

ఇంద్రా ! ఆ మూడు విధముల ధనములను మా కొఱకు తెమ్ము.

(పూర్వపు తండ్రి అనగా అనౌరసుడు, దత్తత ఇచ్చిన తండ్రి పితృధనము అమృత్నుత్ అమృత ప్రాయము అనుచున్నాడు.)

8. వజ్రధర ఇంద్రా ! నీకు హవ్యము సమర్పించిన ప్రియమిత్రుడు నీ దానములందే నిలిచి ఉండును. మేము అహింసితులమై నీ దయకు ప్రాప్తులము కావలెను. మేము అందరిని మించిన అన్నవంతులమై మానవులకు రక్షణ ఇవ్వగల గృహమున నివసించవలెను.

9. ధనశాలివగు ఇంద్రా ! నీ కొఱకు కురిసిన సోమము కన్నీరు రాల్చుచున్నది. స్తోతలు నిన్ను స్తుతించుచున్నారు. నేను నీ స్తోతను ధనాభిలాషిని. కావున నీవు నాకు వెంటనే నివాసయోగ్య ధనము ప్రసాదించుము.

10. ఇంద్రా ! నీవు అందించిన అన్నము అనుభవించుటకు మమ్ము భరించుము. స్వయముగా హవ్యము అందించు హవ్యధాతను భరింపుము. నిన్ను ఎంతో ప్రశంసించుటకు మాకు శక్తి కలుగవలెను. నేను నీ స్తోతను "పాత స్వస్తిభిః సదానః"

## ఇరువది ఒకటవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. దీప్తము, గవ్యమిశ్రితమగు సోమము అభిషుతమైనది. ఇంద్రుడు స్వభావతః సోమమున సంగతుడు హర్యశ్వా! యజ్ఞము ద్వారా నిన్ను ప్రబోధింతుము. సోమము వలన కలిగిన మత్తులో మా స్తోత్రములను అర్థము చేసికొనుము.

2. యజమాని యజ్ఞమున కుశలు పరచును. యజ్ఞస్థానమున శిలలు దుర్ధర్ష ధ్వనిచేయును. అన్నవంత ఇంద్రా ! ఋత్విక్కులచే అభిషవించబడు ధ్వని గృహ మధ్యము నుండి దూరము వరకు వినిపించును.

3. శూర ఇంద్రా ! వృత్రుడు ఆక్రమించిన అనంత జలమును విడిపించినావు. నీవలననే నదులు రథికులవలె సాగినవి. నీ భయమున విశ్వము గడగడలాడును.

4. ఇంద్రుడు మానవులకు హితకరములగు సమస్త కార్యములు తెలిసికొనును. ఆయుధములతో భయంకరుడై వ్యాపించును. అసురుల సమస్త నగరములను వడకించును.

ఇంద్రుడు ప్రసన్నుడు, మహిమాన్వితుడు వజ్రహస్తుడై అసురులను వధించినాడు.

5. ఇంద్రా ! రాక్షసులు నన్ను బాధించరాదు. బలశ్రేష్ఠ ఇంద్రా ! రాక్షసులు ప్రజలనుండి మమ్ము విడగొట్టరాదు. ఇంద్రస్వామి భయంకర జంతువులను వధించుటకు ఉత్సాహపడును. ఆ బ్రహ్మచారులు మా యజ్ఞమునకు విఘ్నము కలిగించరాదు.

6. ఇంద్రా ! నీవు నీ కర్మ ద్వారా సకల ప్రాణులను అదుపులో ఉంచగలవు. నీ మహిమ వ్యాప్తిని జగములందు ఎవరును నిలువరించజాలరు. నీ బాహుబలమున వృత్రుని వధించినావు. యుద్ధమున శత్రువు నీపారమును అందుకొనలేకపోయినాడు.

7. ఇంద్రా ! ప్రాచీన దేవగణములు సహితము బలము మఱియు శత్రువధ విషయమున తమను నీకన్న తక్కువగానే భావించినారు. శత్రువులను పరాజితులను చేయు ఇంద్రుడు స్తోతలకు ధనము ప్రసాదించును. స్తోతలు అన్నప్రాప్తికిగాను ఇంద్రుని ఆహ్వానింతురు.

8. ఇంద్రా ! నీవు ఈశానుడవు. ఈశ్వరుడవు. తమను రక్షించుమని స్తోతలు నిన్ను ఆహ్వానింతురు. బహుత్రాత ఇంద్రా ! నీవు మా ధనమునకు రక్షకుడవయినావు. నీకు సముడై మమ్ము హింసించువాడున్నచో వానిని నివారింపుము.

9. ఇంద్రా ! మేము స్తుతులతో నిన్ను వర్ధిల్లచేసి నీకు మిత్రులము కావలెను. నీ మహిమతో నీవు ఇందరి రక్షకుడని అయినావు. నీ రక్షణలందు ఆర్య స్తోతలు యుద్ధమునకు వచ్చిన అనార్యుల బలమును అణచవలెను.

10. ఇంద్రా ! నీవు అందించిన అన్నము అనుభవించుటకు మమ్ము భరించుము. స్వయముగా హవ్యము సమర్పించు హవ్యదాతను భరించుము. నిన్ను ఎంతో ప్రశంసించుటకు మాకు శక్తి కలుగవలెను. ***"పాత స్వస్తిభిః సదానః"***

(ఋత్విక్కుల ద్వారా కాక స్వయముగా హవి సమర్పించు విధానము వచ్చినట్లున్నది)

**ఇరువది రెండవ సూక్తము**

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు 1-8 విరాజితము, 9 త్రిష్టుప్.

1. ఇంద్రా ! సోమపానము చేయుము. అదినీకు మత్తు కలిగించవలెను. అశ్వవంత ఇంద్రా ! త్రాటితో కట్టిన గుఱ్ఱమువలె అభిషవకర్త రెండు చేతులతో పట్టిన రాయి సోమమును అభిషవించినది.

2. ఇంద్రా ! నీవు హర్యశ్వవంతుడవు. అనంతధనవంతుడవు. సోమము నీకు ఉపయుక్తమైనది. చక్కగా సమర్పించబడినది. ఆ సోమబలముననే నీవు వృత్రాదులను వధించినావు. అదిగో అటువంటి సోమము నీకు మత్తుకలిగించవలెను.

3. ఇంద్రా ! వసిష్ఠుడు నీ స్తుతిరూప వచనములు చెప్పుచున్నాడు. ఆ వసిష్ఠుని వచనములను గుర్తింపుము. యజ్ఞమున ఈ స్తుతులను స్వీకరింపుము.

4. ఇంద్రా ! నేను సోమపానము చేసినాను. నా శిలాక్రందన వినుము. స్తోతల స్థితిని తెలిసికొనుము. నేను నిన్ను సేవించుచున్నాను అది సహాయకమై మనసులో నిలిచిపోవలెను.

5. ఇంద్రా ! నీవు శత్రుంజయుడవు. నేను నీ బలమును ఎరుగుదును. నిన్ను స్తుతించుట విడువజాలను. నేను ఎల్లప్పుడు నీ యశస్వినామమును ఉచ్చరింతును.

6. ఇంద్రా ! మానవులలో నీకు సంబంధించిన అనేక సవనములు ఉన్నవి. మనీషులగు స్తోతలు నిన్నే ఆహ్వానింతురు. మమ్ము నీ నుంచి దూరము ఉంచకుము.

7. శూర ఇంద్రా ! ఈ సవనములన్నియు, వర్ధక స్తోత్రములన్నియు నీకొఱకే ఏర్పడినవి. నీవు అన్నివిధముల మానవులకు ఆహ్వానయోగ్యుడవు.

8. దర్శనీయ ఇంద్రా ! స్తుతించి నీ మహిమను వెంటనే పొందనివాడెవ్వడు? నీ ధనమును పొందని వాడెవ్వడు?

9. జరిగిపోయిన ప్రాచీన ఋషులందరు నవీనులందరు నీకొఱకే స్తుతులు రచించినారు. మాకు నీ సఖ్యత మంగళప్రదము కావలెను. ***"పాత స్వస్తిభిః సదానః"***

## ఇరువది మూడవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. సకల స్తోత్రములు అన్నముకోరి వెళ్లినవి. వసిష్ఠా ! నీవు కూడ ఇంద్రుని స్తుతించుము. తన బలమున ఇంద్రుడు సకల లోకములందు వ్యాపించినాడు. నేను అతని వద్దకు వెళ్లదలచినాను. అతడు మా స్తుతివచనములను ఆలకించవలెను.

2. ఓషధులు పెరిగినపుడు దేవతలు ప్రియవచనములు వినగలరు. మానవులలో ఎంతటివాడయినను నీ ఆయువు తెలియజాలడు. మమ్ము సకల పాపములనుండి దాటింపుము.

3. ఇంద్రునివి హర్యశ్వములు. అతని రథము గోప్రాపకము. నేను ఇంద్రుని రథమునకు అశ్వములు పూన్తును. ఇంద్రుడు స్తోత్రములను సేవించును. స్వీకరించును. సకల జనులు అతనిని ఉపాసింతురు. అతడు తన మహిమతో ద్యావాపృథ్వులను బాధించినాడు. శత్రుబలములను నాశము చేసినాడు.

4. ఇంద్రా ! ఇంకను ప్రసవించని గోవువలె జలము వర్ధిల్లవలెను. నీ స్తోతలు జలమును వ్యాపింప చేయవలెను. వాయు నియుత్తుల అశ్వినులు అశ్వముల వద్దకు వచ్చినట్లు నీవు మావద్దకు విచ్చేయుము. కర్మతో నీవు అన్నము ప్రదానము చేయుము.

5. ఇంద్రా ! సోమము మాదకము. అది నిన్ను ఉన్మత్తము చేయవలెను. స్తోతకు బలవంతుడు, బహుధన వంతుడగు పుత్రుని ప్రసాదించుము.

6. వశిష్ఠ జనులు ఈవిధముగనే అర్చనీయ స్తోత్రములద్వారా వజ్రబాహు, అభీష్టవర్షి ఇంద్రుని పూజింతురు. స్తుతుడైన ఇంద్రుడు మాకు వీరత్వము, గోయుక్త ధనము ఇవ్వవలెను. ***"పాత స్వస్తిభిః సదా వః"***

## ఇరువది నాలుగవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. పురుహూతఇంద్రా ! నీ నివాసమునకు స్థానము ఏర్పరచబడినది. మరుత్తుల సహితుడవై విచ్చేయుము. నీవు మాకు రక్షకుడవయినావు. మాకు అభ్యుదయకారివి అయినావు. మాకు అట్టి ధనమును ప్రసాదించుము. మా సోమపానమున మత్తుడవగుము.

2. ఇంద్రా ! నీవు ఉభయస్థానములందు పూజ్యుడవు. మేము నీ మనసు తెలిసికున్నాము. సోమము అభిషవించినాము. మధువును పాత్రలో నింపినాము. మధ్యమ స్వరమున పాడదగు ఈ సుసమాప్తస్తుతి ఇంద్రుని

ఆహ్వానమునకు ఉచ్చరించబడును.

3. ఇంద్రా ! ఈ యజ్ఞమున సోమపానమునకుగాను స్వర్గమునుండి, అంతరిక్షమునుండి విచ్చేయుము. అశ్వములు ఇంద్రుని ఆనందమునకుగాను మావద్దకు స్తోత్రముల వద్దకు చేర్చవలెను.

4. ఇంద్రా ! నీవు హర్యశ్వవంతుడవు. మంచి దవడలు కలవాడవు. నీవు అన్నిరకముల రక్షణలతో రమ్ము. వృద్ధిగల మరుత్తుల సహితుడవై రమ్ము. శత్రువులను జయించటకు రమ్ము. అభీష్టవర్షి. బలవంతుడగు పుత్రుని ఇచ్చుచు రమ్ము. స్తోత్రమును స్వీకరించుచురమ్ము మా వద్దకు రమ్ము.

5. రథపు గుబ్బపువంటి బలము నిచ్చు మంత్రము మహామహుడు ఓజస్వి ఇంద్రుని కొరకు ప్రతిష్ఠితమైనది. ఇంద్రా ! స్తోత నిన్ను ధనము అడుగుచున్నాడు. నీవు మాకు ఆకాశమందలి స్వర్గమువంటి శ్రీమంతుడగు పుత్రుని ప్రసాదింపుము.

6. ఇంద్రా ! ఆవిధముగా నీవు వరణీయ ధనముతో పరిపూర్ణులను చేయుము. మేము నీ మహా అనుగ్రహమునకు పాత్రులము అగుదుము. మేము హవ్యవంతులము. మాకు వీర్యపుత్రవంత అన్నము అందింపుము.

## ఇరువది ఐదవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఓజస్వి ఇంద్రా ! నీవు గొప్పవాడవు. మనుషుల మంచి కోఱువాడవు. నీ సేనలు సమానమాన్యలు. అవి యుద్ధము చేయునపుడు నీచేతి వజ్రము మమ్ము కాపాడవలెను. సర్వత్ర సంచరించు నీ మనస్సు విచలితము కారాదు.

2. ఇంద్రా యుద్ధమున మాముందుకు వచ్చి మమ్ము అవమానించు శత్రువును నాశము చేయుము. మమ్ము నిందించ కోఱువారి కథను అంతము చేయుము. మా కొఱకు సంపదల తెమ్ము.

3. ఉష్ణీ షముగల ఇంద్రా ! నేను సుదాసుడను. నా కొఱకు నీ రక్షలు వందలు కావలెను. నీవందల అభిలాషలు, ధనము నావికావలెను. హింసకుని హింసాసాధనములగు ఆయుధములను నష్టపరచుము. మా కొఱకు వెలుగొందు కీర్తి, రత్నములను తెమ్ము.

4. ఇంద్రా ! నేను నీసమాన వ్యక్తి కార్యమున నియుక్తుడను. నీ సమాన వ్యక్తి దానమున నియుక్తుడను. బలవాన్, ఓజస్వి ఇంద్రా ! రోజంతయు మాకు స్థానము కల్పించుటలో నిమగ్నుడవగుము. హర్యశ్వా! మమ్ము బాధించరాదు.

5. మేము హర్యశ్వ ఇంద్రుని కొఱకు సుఖకరములగు స్తోత్రము పాడుదుము. ఇంద్రుని, దేవప్రేరిత బలము యాచింతుము. సకల దుర్గములను లంఘించు బలము పొందుదుము.

6. ఇంద్రా ! మాకు సంరక్షణ యోగ్యమగు సంపూర్ణ ధనము ప్రసాదించుము. నీ ఆశీర్వాద యుక్తులమై మేము ముందడుగు వేతుము. ఉత్తమ వీరులతో ఉన్న ధనము మాకు అందవలెను. నీవు కాక దేవతలందరు తమ సంరక్షణ సాధన యుక్తులై రక్షించుచుండవలెను. ***"పాత స్వస్తిభిః సదా నః"***

## ఇరువది ఆరవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ధనాధిపతి ఇంద్రుని కొఱకు అభిషుతము కాని సోమము తృప్తిచెందదు. అభిషుతమయ్యు స్తోత్రహీన స్తోమము తృప్తిచెందదు. మేము ఇంద్రుని సేవలో ఉక్థ చదువుదుము. ఇంద్రుడు వినును. ఇంద్రుని కొఱకు ఆ నవీన ఉక్థనే నేను చదువుదును. ఉచ్చరింతును.

2. విశేష ఉక్థ స్తుతి పాఠకాలమున సోమము ధనదుడగు ఇంద్రునకు తృప్తినిచ్చును. విశేష ఉక్థ స్తుతి పాఠకాలమున అభిషుత సోమము ఇంద్రుని తృప్తిపరచును. ఋత్విక్కులు పరస్పరము కలుసుకొనువారు సమాన ఉత్సాహవంతులు. వారు - కొడుకు తండ్రిని పిలిచినట్లు తమ రక్షణకుగాను ఇంద్రుని ఆహ్వానిస్తారు.

3. సోమాభిషవ కాలమున స్తోతలు ఘనకార్యములను గురించి ముచ్చటించకొందురు ఇంద్రుడు అట్టి సకల ఘనకార్యములను ప్రాచీన కాలముననే చేసినాడు. అతడు ఇప్పుడు అన్యకార్యములు సహితము చేయును. భర్త భార్యను దువ్వినట్లు ఇంద్రుడు శత్రునగరములను దువ్వినాడు.

4. పరస్పరము కలిసిన ఇంద్రునిని అనేక రక్షలు ఉన్నవి. అట్లని ఇంద్రుని గురించి ఋత్విక్కులను చెప్పినారు. ఇంకను చెప్పుకొనునదేమనగా ఇంద్రుడు పూజనీయ ధనముల నిచ్చువాడు ఆపదోద్ధారకుడని.

5. రక్షణకొఱకు ప్రజల అభీష్టపూర్తికొఱకు వసిష్ఠుడు సోమాభిషవమున ఇంద్రుని ఇట్లు స్తుతించినాడు. ఇంద్రా ! మాకు వివిధ ప్రకారముల అన్నములను ప్రసాదించుము. "పాత స్వస్తిభిః సదానః"

## ఇరువది ఏడవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. జనులు యుద్ధకార్య సన్నద్ధులైనపుడు యుద్ధమునకు ఇంద్రుని ఆహ్వానింతురు. ఇంద్రా ! నీవు మానవుల కొఱకు ధనదాతవగుము. బలాభిలాషివి అగుము. మమ్ము గోపూర్ణ గోష్ఠమున ప్రవేశపెట్టుము. "గోమతి వ్రజే భజత్వంనః"

2. పురుహోత ఇంద్రా ! నీవద్ద జలమున్నది. దానిని స్తోతలకు అందించుము. నీవు ఎంతోగట్టి పురములను చిందరవందర చేసినావు. అందువలన నీ ప్రజ్ఞను వెల్లడించుము. దాచిన ధనమును బయట పెట్టుము.

3. ఇంద్రుడు జంగమ జగములకును, మానవులకును మహారాజు. నేలమీద ఉన్న ధనములన్నింటికి ఇంద్రుడే రాజు. ఇంద్రుడు ద్రవ్యదాతకు ధనము ఇస్తాడు. ఆ ఇంద్రుడే మా స్తుతులు ఆలకించవలెను. మాకు ధనము పంపవలెను.

4. మేము ధనికుడు, దానకర్త ఇంద్రుని మరుత్తుల సహితునిగా ఆహ్వానించినాము. అందువలన అతడు మమ్ము రక్షించుటకుగాను వెంటనే అన్నము పంపవలెను. ఇంద్రుడే తన మిత్రులకు సంపూర్ణము, సర్వవ్యాపకమగు దానము చేయును. అతడే మానవుల కొరకు ధనము పితుకును.

5. ఇంద్రా ! ధనప్రాప్తికిగాను మాకు వెంటనే వేద ధనము అందించుము. మేము పూజ్యములగు స్తోత్రములతో నీ మనసును ఆకర్షింతుము. నీవు గోవులు, అశ్వములుగల ధనవంతుడవు. "యూయం పాతస్వస్తిభిః సదానః"

## ఇరువది ఎనిమిదవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! నీవు మా స్తోత్రములను గ్రహించుము. ఆ స్తోత్రములవైపు నడక సాగించుము. నీ గుఱ్ఱములు మాముందే పూన్చబడవలెను. ఇంద్రా ! నీవు అందరకు ఆనందకరుడవు. నిన్ను వేరువేరుగా సకల జనులు పిలుస్తారు. కాని నీవు మా ఆహ్వానమును మాత్రమే వింటావు.

2. బలీ ఇంద్రా ! నీవు ఋషుల స్తోత్రములను రక్షిస్తావు. అప్పుడు నీ మహిమ వలన స్తోత్రములు వ్యాప్తిచెందవలెను. నీవు ధరించినపుడు భయంకరుడవు అవుతావు. శత్రువులకు దుర్ధర్షుడవు అగుదువు.

3. ఇంద్రా ! నీ ఉపదేశము ప్రకారము జనులు నిన్ను మరల మరల స్తుతింతురు. అట్టివారిని నీవు ద్యులోక, భూలోకములందు కీర్తివంతులను చేయుదువు. నీవు మహాబలము మహాధనముకొఱకు పుట్టినావు. కావున నిన్ను

గూర్చి యజ్ఞము చేయువాడు ఆయాజ్ఞికులను పడవేయు సమర్ధుడగును.

4. ఇంద్రా ! మిత్రునివలె కనిపించు దుష్టులవద్ద నుండి ధనము గుంజుకొనుము. దానినంతటిని మాకు దానము చేయుము. వరుణుడు పాపఘాతకుడు. బుద్ధిమంతుడు. వరుణుడు మావద్ద చూచిన పాపములను రెండు విధములుగా విడిపించుము.

(ద్విదీ అనగా రెండు విధముల అని అర్థము వరుణునకు చెప్పిగాని నీ అంతట నీవుగాని విడిపింపుము అని తాత్పర్యము వరుణుని విషయమున పాపఘాతకుడు అను విశేషణము వాడినాడని గమనించవలెను.)

5. ఇంద్రుడు మాకు చక్కని ఆరాధ్యమగు మహాధనము ప్రసాదించినాడు. అతడు స్తోతను స్తోత్రకార్యమును రక్షించినాడు. ధనవంతుడగు ఆ ఇంద్రునే మేము స్తుతింతుము. "యూయంపాత స్వస్తిభిః సదావః"

## ఇరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! నీ కొఱకు సోమము అభిషుతమైనది. దానిని స్వీకరించుటకు నీవు త్వరగా రావలెను చక్కగా అభిషుతమైన సోమము పానము చేయుము.

ఇంద్రా ! మేము నిన్ను యాచించుచున్నాము. మాకు ధనము అందించుము.

2. ఇంద్రా ! నీవు బ్రహ్మావు. వీరుడవు. స్తోత్ర కార్యమును సేవింపుము. గుఱ్ఱములను ఎక్కుము. వెంటనే మా వైపునకు రమ్ము. నీవు ఈ యజ్ఞముననే ప్రసన్నుడవు కావలెను. మా స్తోత్రములను వినుము.

3. ఇంద్రా ! మేము నిన్ను సూక్తముతో స్తుతింతుము కదా వాటి అలంకారము, వాటిశోభ, వాటి చక్కదనము ఎటువంటిది? మేము నిన్ను ఎన్నడు ఎప్పుడు ప్రసన్నుని చేయగలము? నిన్ను అభిలషించియే సకల స్తుతులు చేస్తాను. కావున నా స్తుతులను వినుము.

4. ఇంద్రా ! నీవు అందరి ఋషుల స్తోత్రములు విన్నావు. వారందరు ప్రాచీన ఋషులు మానవహితము కోటినవారు. అందువలన నేను నిన్ను మాటిమాటికి ఆహ్వానిస్తాను. ఇంద్రా ! నీవు తండ్రివంటివాడవు. మా హితము కోఱువాడవు.

5. ఇంద్రుడు మాకు చక్కని ఆరాధ్యమగు మహాధనము ప్రసాదించినాడు. అతడు స్తోతను, స్తోతకార్యమును

రక్షించినాడు. ధనవంతుడగు ఆ ఇంద్రునే మేము స్తుతింతుము. ***"యూయం పాత స్వస్తిభిః సదానః"***

**ముప్పదవ సూక్తము**

ఋషి - వశిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రుడు బలవంతుడు. జ్యోతిష్మంతుడు అతడు బలముతో మావద్దకు రావలెను. మాకు ధనవర్ధకుడు కావలెను. సువజ్రి, నృపతి ఇంద్రా ! మహా బలివి. అగుము. శత్రుంజయుడవగుము. పురుషార్థివగుము.

2. ఇంద్రా ! నీవు ఆహ్వానయోగ్యుడవు. మహా కల్లోల సమయములందు మా దేహరక్షణకును, సూర్యప్రాప్తికిని నిన్ను ఆహ్వానిస్తాము. మానవులందరిలో నీవే సేనాయోగ్యుడవు. సుహంత నామక వజ్రముతో శత్రువును మాకు అప్పగించుము.

3. ఇంద్రా కాలము కలిసివచ్చినపుడు యుద్ధమున నీవు మాకు సమీపవర్తివి అయినపుడు, అప్పుడు హోతాగ్ని మాకు ఉత్తమ ధనములు ఇచ్చుటకు దేవతలకు పిలుచుచు ఈ యజ్ఞమున ఆసీనుడగును.

4. ఇంద్రా ! మేము మీవారలము. నీకు పూజనీయ స్తుతి అందించుచు స్తుతించు వారు కూడ నీవారలే. వారికి మంచి ఇల్లు ఇమ్ము. వారు సమృద్ధులై వృద్ధులు కావలెను. "స్వాభువో జరణ మశ్నునన్త"

(వార్ధక్యము శాపము కారాదు సమృద్ధము కావలెనను సదాశయము)

**ముప్పది ఒకటవ సూక్తము**

ఋషి - వశిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - 10-12 విరాజము.

1. మిత్రులారా ! హర్యశ్వుడు, సోమపాయి ఇంద్రుని కొఱకు మదకర స్తోత్రములు గానము చేయండి.

2. ఇంద్రుడు శుభముల దానకర్త. సత్యధనుడు. స్తోతలు అతనిని దీప్తి స్తోత్రములతో స్తుతింతురు. అట్లే మీరు స్తుతించండి. మేమును స్తుతింతుము.

3. ఇంద్రా ! నీవు మా కొఱకు అన్నాభిలాషివగుము. శతక్రతూ ! మా కొఱకు గో అభిలాషివి అగుము. వాసదాతో !

నీవు హిరణ్యదాతవగుము.

4. అభీష్టవర్షి ఇంద్రా ! నిన్నుకోటి మేము విశేషరూపమున స్తుతిస్తాము. వాసప్రదా ! వెంటనే మా స్తుతిని అవధరింపుము.

5. ఆర్య ఇంద్రా ! కఠోరవాక్కులవానికి నిద్రించువానికి దానము చేయనివానికి మమ్ము అప్పగించకుము. నా స్తోత్రము నిన్ను చేరవలెను.

6. వృత్రహంత ఇంద్రా ! నీవు మా కవచమవు. నీవు సర్వత్ర ప్రసిద్ధుడవు. నీవు ఎదురునిలిచి యుద్ధము చేయువాడవు. నీ సాయమున నేను వృత్ర వధ చేయగలను.

7. ద్యావాపృథ్వులు అన్నవతులు. అవి ఇంద్రుని వశవర్తినులు. అట్టి ఇంద్రా ! నీవు చాలా గొప్పవాడవు.

8. ఇంద్రా ! నీకు సహచరి, తేజోయుక్త స్తోత్రసంపన్న స్తుతి నిన్ను నలుదిశల గ్రహించును.

9. ఇంద్రా ! నీవు స్వర్గపువాడవు. దర్శనీయుడవు. సకల సోమములు నీ కొఱకు ఉద్యతలు. సకల ప్రజనీకు నమస్కరించును.

10. నా వారలారా ! మీరు మహాధన వర్ధకులు. మహా ఇంద్రుని కొరకు సోమము చేయండి. అభ్యుదయము ఆశించి ప్రహృష్ట స్తుతి చేయుడు.

ఇంద్రా ! నీవు ప్రజల కోరికలు తీర్చువాడవు. నీకు హవ్యము అర్పించి పూజించువాని సముఖమునకు వెళ్లుము.

11. ఇంద్రుడు అత్యంత వ్యాపకుడు. మహానుభావుడు. విప్రులు మేధావి అతనిని గూర్చి స్తోత్రములు రచింతురు. హవ్యము కల్పింతురు. ఇంద్రుని వృత్రాది కర్మలను ఎంతటి ధీరుడైనను బాధింపజాలడు.

12. ఇంద్రుడు అన్నివిధముల అన్ని జగములకు ఈశ్వరుడు. అతని క్రోధము బాధించునదికాదు. అతనిని గురించిన సకల స్తుతులు శత్రువులను అణచునవి. అందువలన స్తోతలారా ! ఇంద్రుని స్తుతించుటకు మీ బంధువులను ప్రోత్సహించండి.

## ముప్పది రెండవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - 3 ద్విపద విరాట్.

1. ఇంద్రా ! మాకు దూరముగా యజమానులు సహితము నీతోకూడి ఆనందించరాదు. నీవు దూరమునందున్న వాడనైనను మాయజ్ఞముకు విచ్చేయుము వినుము.

2. ఇంద్రా ! తేనెమీద తేనెటీగలు కూర్చున్నట్లు స్తోతలు నీ కొఱకు సోమము సిద్ధము చేసి కూర్చుందురు. రథముమీద అడుగు పెట్టినట్లు ధనాభిలాషులగుస్తోతలు నీకు స్తుతులు సమర్పింతురు.

3. కొడుకు తండ్రిని పిలిచినరీతి ధనాభిలాషివగు నేను దానశీలుడగు ఇంద్రుని పిలుస్తాను.

4. పెరుగు కలిపిన సోమము ఇంద్రుని కొఱకు సిద్ధమైనది. వజ్రహస్త ఇంద్రా ! ఆ సోమపానమునకు అశ్వసహితుడవై యజ్ఞ మంటపము వైపు విచ్చేయుము.

5. ఇంద్రుడు యాచన విను చెవులవాడు ఇంద్రుని వద్ద మేము ధనము యాచిస్తాము. అతడు మా విన్నపము వినవలెను. అది నిష్ఫలము కారాదు. యాచన వినగానే వందల, వేల మందికి దానములు చేయు ఇంద్రుని దానాభిలాషను ఎవడును వారించరాదు.

6. వృత్రహంత ఇంద్రా ! నీ కొఱకు గంభీర సోమమును అభిషవించు వాడు నిను అనుసరించువాడు వీరాధివీరుడగును. వాని విరుద్ధముగా ఎంతటివాడును మాట్లాడలేడు. అతనిని పరిచారకులు పరివేష్ఠించి ఉందురు.

7. ధనవాన్ ఇంద్రా ! హవ్యదాతల ఉపద్రవ నివారకుడవు. అగుము. ఉత్సాహవంతులగు శత్రువుల నాశము చేయుము. నీవు నశింపచేసిన శత్రువు ధనమును మేము పంచుకొందుముగాత. నీకు ఎంతటివాడును హానికలిగింపజాలడు. నీవు మా కొఱకు ధనము పట్టుకొని రమ్ము.

8. జనులారా ! వజ్రధరుడు, సోమపాయి ఇంద్రుని కొఱకు సోమము అభిషవించండి. తృప్తునిచేయగల పురోడాశాదులు వంపండి. నిర్వహించవలసిన కార్యములు నిర్వహించండి. ఇంద్రుడు యజమానికి సుఖములనిచ్చును. హవ్యము పూర్తి చేయును.

9. సోమముగల యజ్ఞమును నాశనము చేయరాదు. ఉత్సాహవంతుడగు ధనప్రాప్తి కొఱకు శత్రుసంహారక ఇంద్రుని యజించండి. శీఘ్రకారియే విజయుడగును. నివాసకర్త అగును. పుష్టినొందును. కుత్సిత కర్మునకు దేవతలుండబు.

**"తరణిరిజ్జయతి క్షేతి పుష్యతి నదేవాసః కువత్నవే"**

10. మంచిదానము చేయువాని రథమును త్రోసి వేయగలవాడు ఉండడు. అతనిని ఎవడును ఆటంకపరచజాలడు. ఇంద్రుడు మరుత్తులు రక్షగా గలవారు గోపూర్ణ గోష్టమునకు చేరుదురు.

11. ఇంద్రా ! నీవు రక్షకుడుగా ఉన్న వ్యక్తి స్తోత్రములతో నిన్ను బలవంతునిచేయును అన్నము అందుకొనును. శూరా ! మా రథమును రక్షింపుము. మా పుత్రాదులను రక్షింపుము.

12. హర్యశ్వ ఇంద్రుడు సోమవంత యజమానికి బలము కలిగిస్తాడు. అతనిని పగవారు పరిమార్చజాలరు. గెలిచినవాని వలె ఇంద్రుని భాగము దేవతలందరిని మించినది.

13. దేవతలలో ఇంద్రునకే అనల్పములు, సువిహితములు, శుభంకరములగు స్తోత్రములను అర్పించండి. కర్మానుష్ఠానమున ఇంద్రుని మనసును ఆకర్షించగల వానివద్దకు అనేకానేక బంధములు చేరవు.

14. ఇంద్రా ! నీవు కరుణించిన వానిని ఎవడు అణచగలడు? ధనశాలి ఇంద్రా ! నీ విషయమున శ్రద్ధగలవాడై, హవిష్మంతుడైనవాడు ద్యులోకమునను, ఈ లోకమునను ధనము బలము పొందును.

15. ఇంద్రా ! నీవు ధనికుడవు. నీకు ప్రియమగు ధనము సమర్పించువానిని వృత్ర సంగ్రామాదులకు పంపుము. వారి కీర్తి పెంచుము. హర్యశ్వ ఇంద్రా ! నీ ఉపదేశానుసారము సకల స్తోతలతో సర్వపాపములను దాటగలము.

16. ఇంద్రా ! నేలమీద ఉన్న దిగువ ధనము నీదే. అంతరిక్షమున ఉన్న నడిమి ధనము నీదే. అంతకుపైన ఉన్న ఉత్తమ ధనమునకు నీవే కర్తవు. ఇది సత్యము. సుత్రా మా ! గోవు సంబంధమున నిన్ను తొలగించువాడు లేడు.

17. ఇంద్రా ! నీవు సమస్త లోకములకు ధనదాతవు. ఈ జరుగు యుద్ధములన్నిట నీవే ధనదుడవని ప్రసిద్ధి. పురుహోత ఇంద్రా ! సకల పార్థివజనులు రక్షణకుగాను నిన్ను అన్నభిక్షకోరుదురు.

18. ఇంద్రా ! నీవు ఎన్నిధనములకు ఈశ్వరుడవో, మేము అన్ని ధనములకు స్వాములము కావలెను. ఇంద్రా ! నేను స్తోతలను రక్షిస్తాను. పాపికి ధనదానము చేయును.

19. ఎచ్చట ఉన్నవాడయినను పూజించదగిన పురుషునకు నిత్యము దానము చేస్తాను. ఇంద్రా ! నీవు వినా నాకు బంధువుగాని ప్రశంసనీయ పితరుడుగానిలేడు.

20. క్షిప్రకర్మకారి మాత్రమే మహాకార్యముల బలమున అనుభవించగలడు. వడ్రంగి పాత చక్రమునుచెక్కి నవీకరించినట్లు నేను స్తుతులతో పురుహూత ఇంద్రుని నవీకరిస్తాను.

21. మానవుడు దుష్ట స్తుతివలన ధనము పొందజాలడు. హింసకుని వద్ద ధనము నిలువదు. ధనవాన్ ఇంద్రా! ద్యులోకమందును, దివసమందును నాతో సమానుడయిన వానికి నేవు ఇవ్వదలచినది సత్కర్మలు చేయువానికి సహితము లభించును.

22. వీర ఇంద్రా ! నీవు ఈ సమస్త జంగమ పదార్థములకు స్వామివి. స్థావర పదార్థములకు ఈశ్వరుడవు. సర్వదర్శకుడవు. ఇంతవరకు పాలు పితుకని గోవు వంటి నిన్ను స్తుతింతును.

23. ధనికుడవగు ఇంద్రా ! నీ సమానుడు లోకమున ఇంతవరకు పుట్టలేదు. ఇకముందు పుట్టడు. మేము అశ్వములు.గోవులు, అన్నములు కోరుచున్నాము. నిన్ను పిలుచుచున్నాము.

24. ఇంద్రా ! నీవు జ్యేష్ఠుడవు. నేను కనిష్ఠుడను. నా కొఱకు ప్రసిద్ధ ధనము తెచ్చి ఇమ్ము. కలకాలముగా నీవు అత్యంత ధనవంతుడవు. ప్రత్యేక యుద్ధములందు హవ్యలాభ యోగ్యుడవు.

25. మఘవా ! శత్రువులను పరాఙ్ముఖులను చేయుము. తొలగింపుము. మా కొఱకు ధనమును సులభము చేయుము. యుద్ధమున మమ్ము రక్షింపుము. మేము నీ మిత్రులము మావర్ధకుడవగుము.

26. ఇంద్రా ! మాకు ప్రజ్ఞానము తెమ్ము. తండ్రి కొడుకునకు ఇచ్చినట్లు మాకు ధనము ఇమ్ము. మేము యజ్ఞ జీవులము. మేము నిత్యము సూర్యుని పొందవలెను.

27. ఇంద్రా ! తెలియని నడకలవారు, హింసకులు, దురారాధ్యులు, అశుభ శత్రువులు మమ్ము ఆక్రమించరాదు. మేము నీ వద్ద వినమ్రులమగుదుము. అనేక కార్యములందు ఉత్తీర్ణలమగుదుము.

## ముప్పది మూడవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, వసిష్ఠ పుత్రులు దేవత - వశిష్ఠుడు, వసిష్ఠ పుత్రులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వసిష్ఠపుత్రులు శ్వేతవర్ణులు. కర్మపూరకులు తలకుడివైపు ముడివేయువారు. నేను యజ్ఞమునుండి లేవగానే వసిష్ఠపుత్రులు నాకు దూరము కారాదని అందును. అందువలన వారు నన్ను ప్రసన్నుని చేయుదురు.

2. పాశాద్యుమ్నుడు వయతి పుత్రుడు అతని యజ్ఞమున ఇంద్రుడు సోమపానము చేయుచుండెను. అది వసిష్ఠపుత్రులు దూరము నుండి గమనించినారు. యజ్ఞమును తిరస్కరించినారు. ఇంద్రుని అక్కడినుండి

తొలగించినారు. ఇంద్రుడు సహితము వయత పుత్రుడు పాశద్యుమ్నుని వదలినాడు. వాసిష్ఠులను వరించినాడు.

(వసిష్ఠిపుత్రులు సుదాసుని మన్నించినారు. సుదాసునితో యజ్ఞము చేయించినారు. పాశద్యుమ్నుడనురాజు సహితము యజ్ఞము చేసినాడు. ఇంద్రుని రప్పించినాడు. ఇంద్రుడు సోమపానము చేయు సమయమున వసిష్ఠపుత్రులు ఆ యజ్ఞమును తిరస్కరించినాడు. మంత్రబలమున ఇంద్రుని సోమపానము మాన్పించినారు. ఇంద్రుని సుదాసుని యజ్ఞమునకు తీసికొని వెళ్లినారను వృత్తాంతమును శాయణాచార్యులు చెప్పినారు.)

3. ఆవిధముగనే వశిష్ఠపుత్రులు సింధునదిని అనాయాసముగ దాటినారు. భేద, నామక శత్రువును హతమార్చినారు. వసిష్ఠపుత్రులారా ! ప్రసిద్ధ దాశరాజ్ఞ యుద్ధమున మీ మంత్రబలముననే ఇంద్రుడు సుదాసుని రక్షించినాడు.

4. మానవులారా ! మీ స్తోత్రములు పితరులకు తృప్తి కలిగించును. నేను రథమును నడిపింతును. మీరు అలసట చెందరాదు. వశిష్ఠగణములారా ! మీరు శక్వరీ రుక్కులు, శ్రేష్ఠ వచనములతో ఇంద్రుని బలము ఆర్జించినారు.

(పితరులకు తృప్తి అనగా స్వయముగా వసిష్ఠుని తృప్తియే)

5. జ్ఞాన తృష్ణగల రాజులు చుట్టుకూడినవారును వర్షయాచకులగు వశిష్ఠపుత్రులు పదిమందిరాజులతో యుద్ధమున సూర్యునివలె ఇంద్రుని పైకి లేపినారు. స్తోత వసిష్ఠుని స్తోత్రమును ఇంద్రుడు విన్నాడు. తృత్సు రాజులకొఱకు విస్తృత దేశమును ఇచ్చినాడు.

6. గోవులను పాలించు దండులవలె భారత గణము తృత్సులు శత్రువుల మధ్య అల్పసంఖ్యాకులై ఉండిరి. తదనంతరము వశిష్ఠుడు వారి పురోహితుడయినాడు. అప్పటి నుంచి తృత్సు ప్రజ పెరుగసాగినది.

7. అగ్ని, వాయువు, సూర్యుడు జగములకు జలమునిచ్చువారు. వారిలో ఆదిత్యాది ముప్వురు ఆర్యులు. వారు ముగ్గురు ఉషను సేవింతురు. వసిష్ఠులకు అవి అన్నియు తెలియును.

(ఆదిత్యాదులు - ఆదిత్యులు, వసువులు, రుద్రులను ముగ్గురు)

8. వశిష్ఠ పుత్రులారా ! మీ మహిమ సూర్యుని జ్యోతివలె ప్రకాశించును. మీ మహిమ సముద్రమువలె గంభీరము. వాయువేగమువంటి మీ స్తోత్రములను ఇతరులు అనుసరించజాలరు.

9. వశిష్ఠగణములు జ్ఞానమున తిరోహితమయిన సహస్రశాఖలుగల లోకమున సంచరించినారు. వారు సర్వనియంత ద్వారా పరచబడిన విశాల నూలును నేయుచున్న మాతృ స్వరూపలగు అప్సరల వద్దకు వెళ్లినారు.

(సర్వ నియంత యముడు. అతడు పరచినది పరిధిలేని జననమరణ ప్రవాహము. అప్సరలు తల్లులు. వారుచేసిన వస్త్రము జీవితము. వాసిష్ఠులు జననమరణ నియంత యముని జీవితము ఏర్పరచు మాతృమూర్తుల ఎరిగిన వారని తాత్పర్యము)

10. వశిష్ఠా ! విద్యుత్తువంటి నీ జ్యోతిని నీవు పరిత్యజించుటను మిత్రావరుణులు చూచినారు. అప్పుడు నీకు ఒక జన్మ అయినది. అదికాక అంతకుముందు వాస స్థానమునుండి అగస్త్యుడు తెచ్చినాడు.

("ఏతాశ్చేంద్ర స్యవాక్యమిత్యేకే వర్ణంతి అపరే వసిష్ఠ పుత్రాణమితి" దీనిని ఇంద్రుడే చెప్పినాడని కొందరు - వసిష్ఠ పుత్రులని కొందరు అని శాయణుడు)

11. వశిష్ఠా ! నీవు మిత్రావరుణులు పుత్రుడవు. బ్రహ్మ ! నీవు ఉర్వశి మనసున ఆవిర్భవించినావు. అప్పుడు మిత్రావరుణుల వీర్యము స్ఖలమైనది. విశ్వదేవగణములు దివ్యస్తోత్రములతో పుష్కర మధ్యమున నిన్ను దాల్చినారు.

(ఆదిత్య సవనమునకు మిత్రావరుణులు వచ్చినారు. వారు అక్కడ ఉన్న ఊర్వశిని చూచినారు. వారికి వీర్యస్కలనమైనది. దానిని ఒక కుండలో ఉంచినారు. తేవైవతు ముహూర్తేన వీర్యవంతౌ తపస్వినౌ అగస్త్య వశిష్ఠశ్చ తత్రర్షీ సంబభూవతుః అప్పుడే ఆ వీర్యము నుండి తపస్వినులగు అగస్త్య వసిష్ఠులు జన్మించినారని శాయణుడు)

12. అనంత జ్ఞానవంతుడగు వసిష్ఠుడు భూలోక స్వర్గలోకములను తెలుసుకున్నాడు. సహస్రదానవంతుడయినాడు. సర్వనియంత యముని ద్వారా విస్తీర్ణ వస్త్రము జనన మరణ ప్రవాహమును వేయగోరి వశిష్ఠుడు ఊర్వశికి జన్మించినాడు.

13. యజ్ఞదీక్షవహించిన మిత్రావరుణులు స్తుతులతో ప్రార్థితులై కలశమున ఒకేసారి రేతః స్ఖలనము చేసినారు. అనంతరము మాన్య అగస్త్యుడు జన్మించినాడు. వసిష్ఠ ఋషి సహితము అదే కుంభమునుంచి జన్మించినాడని జనులు చెప్పుకొందురు.

(కుంభము టెస్ట్ ట్యూబ్ కావచ్చును. వారిది కృత్రిమ జన్మ కావచ్చును. ఆలోచించవలెను)

14. తృత్సువులారా ! మీ వద్దకు వసిష్ఠుడు వచ్చుచున్నాడు. మీరు అతనిని ప్రసన్న చిత్తమున పూజించండి. వశిష్ఠుడు అగ్రగామి అయి ఉక్థ, సోమములు ధరించును.ప్రస్తరముతో అభిషవకర్త అగును. అతడు కర్తవ్యమును బోధించును.

(ఇది తండ్రి కొడుకుల పరస్పర ప్రశంసవలె ఉన్నది.)

*(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత అయిదవ అష్టకము ఏడవ మండలమున రెండవ అనువాకము సమాప్తము)*

మూడవ అనువాకము          ముప్పది నాలుగవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - విశ్వేదేవతలు,
ఛందస్సు-1-21 ద్విపద, 20,21 విరాజ, 22-25 త్రిష్టుప్.

1. దీప్తము, అభీష్టప్రదమగు స్తుతీ ! వేగవంతము, అలంకృతములగు రథమువలె నీవు మానుండి దేవతలవద్దకు చేరుము.

2. క్షయమగు జలము భూమి, స్వర్గపు సృష్టి ఎరుగును. జలము స్తుతి వినును.

(జలము, భూమి, స్వర్గముకన్న ముందు పుట్టినదని)

3. విస్తీర్ణ జలము ఇంద్రుని ఆనంద పరచును. ఉపద్రవము వచ్చినపుడు వీరులు, శూరులు ఇంద్రుని స్తుతింతురు.

4. ఇంద్రుడు రావలసి ఉన్నది. గుఱ్ఱములను రథముముందు కట్టండి. ఇంద్రుడు వజ్రధరుడు. స్వర్ణహస్తములవాడు.

5. మానవులారా ! యజ్ఞమునకు సాగండి. గంతవలె స్వయముననే యజ్ఞమార్గమున సాగండి.

6. మనుజులారా ! యుద్ధమునకు స్వయముగానే వెళ్లండి జనుల కొఱకు ప్రజ్ఞాపకము పాపనాశకమగు యజ్ఞము చేయండి.

7. ఈ యజ్ఞ బలముననే సూర్యుడు ఉదయించును. భూమి ప్రాణులను మోయును. అట్లే యజ్ఞము సహితము భారము వహించును.

8. అగ్నీ ! అహింసాదియుక్త యజ్ఞము చేయుదును. కోరికలు తీర్చుకుందును. పిలిచెదను. వారికొఱకు కర్మ చేయుదును.

9. మానవులారా ! దేవతల లక్ష్యముగా దీప్త కర్మ చేయండి. దేవతలను స్తుతించండి.

10. ఓజసి, బహునేత్రుడు, వరుణుడు నదుల జలమును పరిశీలించును.

11. వరుణుడు దేశములకు రాజు. నదులకు రూపము. అతని బలము అప్రతిహతము. సర్వత్రగామి.

12. దేవతలారా ! సకల ప్రజలలో మమ్ము రక్షించండి. నిందించ గోరు శత్రువును దీప్తిరహితును చేయండి.

13. శత్రువులు అశుభంకర ఆయుధముల నలువైపుల తొలగిపోవలెను. దేవతలారా ! మాలోని పాపము తొలగి పోవలెను.

14. హవ్యభోజి అగ్నీ ! మా నమస్కారములకు ప్రీతుడవగుము. మమ్ము రక్షింపుము. మేము అగ్నిని సుతింతుము.

15. అగ్ని దేవతల సహచరుడు. అతనితో స్నేహము చేయండి. అతడు మనకు శుభంకరుడు కావలెను.

16. మేఘహంతా ! నదీ స్థానమున కూర్చున్నవాడును జలమున ఉత్పన్నుడగు అగ్నిని స్తోత్రములతో స్తుతింతురు.

(**"బుద్నే నదీరాం"** అని మంత్రం బుధ్నమనగా అంతరిక్షము ధృతా ఆప ఇతి ఉత్పత్తిః)

17. అహిర్బుధ్న్యా ! మమ్ము హింసకునకు వప్పగించకుము. యాజ్ఞికుని యజ్ఞము క్షీణింప చేయకుము.

(అహిర్బుధ్న్య గార్హపత్య అగ్ని గృహములందలి అగ్ని)

18. దేవతలు మాజనుల కొఱకు అన్నము ధరింతురు. ధనముకొఱకు ఉత్సాహులగు శత్రువు చావవలెను.

19. సూర్యుడు సమస్త భువనములను తపింప చేయును. అట్లే దేవతల బలమువలన మహాసేనగల రాజు శత్రువులను తపింప చేయును.

20. మా వద్దకు దేవతా స్త్రీలు వచ్చినపుడు ఉత్తమ హస్త నిపుణుడు త్వష్ట మాకు వీరపుత్రులను ప్రదానము చేయవలెను.

21. త్వష్ట మా స్తోత్రములను స్వీకరించును. పర్యాప్త బుద్ధిగల త్వష్ట మా కొఱకు ధనాభిలాషి కావలెను.

22. దాననిపుణులగు దేవపత్నులు మా మనోరథములను ప్రదానము చేయవలెను. ద్యావాపృథ్వులు, వరుణ పత్ని సహితము వినవలెను. శుభంకరుడు, దానశీలుడగు త్వష్ట ఉపద్రవ నివారణులగు దేవపత్నుల సహితుడై మాకు అభయము ఇవ్వవలెను.

23. అవ్యయములగు మా ధనములను పర్వతములు పోషించవలెను. సమస్త జలములు ఆ ధనమును పోషించవలెను. దాన పరాయణులగు దేవపత్నులు దానిని పోషించవలెను. ఓషధులు ద్యులోకము సహితము పాలన పోషణ చేయవలెను. వనస్పతులు సహితమయి అంతరిక్షము సహితము పాలించవలెను. ద్యావాపృథ్వులు మమ్ము రక్షించవలెను.

(అవ్యయ ధనములు ప్రకృతి సంపదలు. వాటికి స్వయముగా పునరుత్పత్తి ఉన్నందున అవ్యయములయినవి. ఆధునికమను పేరుగల రాక్షస నాగరకతలో పునరుత్పత్తిగల ప్రకృతి సంపదల ఉత్పత్తిని నాశనము చేయు ప్రయత్నము నిరంతరము జరుగుచున్నది.)

24. మేము భరించ తగిన ధనమునే ఆశ్రయింతుము. విస్తృత ద్యావాపృథ్వులు దానిని ఆమోదించవలెను. దీప్తికి ఆధారభూతుడవగు ఇంద్రుడు మిత్రుడగు వరుణుడు ఆమోదించవలెను. పరాజయకర్తలు మరుద్గణములు సహితము ఆమోదించవలెను.

(ధియధ్యైః భరించ కలిగినంత ధనము మాత్రమే ఉండవలెను. అది ప్రకృతి శక్తుల అనుమతి గలది కావలెను.ఈ యంత్ర నాగరికతకు పట్టిన రోగము ప్రకృతి అనుమతిలేని భరించలేని ధనము! ఇది పులిని ఎక్కినది. స్వారి చేయలేదు. దిగలేదు. ఆశ్చర్యమేమనగా ఆనాటి ఋషులు నేటి మానవుని హెచ్చరించినాడు.)

25. ఇంద్ర, వరుణ, మిత్ర, అగ్ని, జల, ఓషధ, వృక్షములు మా స్తుతులను స్వీకరించవలెను. మరుత్తుల వద్ద నివసించి మేము సుఖింతుము. యూయం పాత స్వస్తిభిః సదానః

(గాలి వద్ద కన్న సుఖము మరెక్కడ లభించును?)

## ముప్పది ఐదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - విశ్వేదేవతలు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రాగ్నులారా ! మాకు రక్షణలు కల్పించండి. శాంతి ప్రసాదించండి. ఇంద్రావరుణులారా ! యజమాని హవ్యము సమర్పించినాడు. మీరు మాకు శాంతి ప్రసాదించండి. ఇంద్రసోములు మాకు శాంతి, శుభములు ప్రసాదించువారు కావలెను. ఇంద్ర, పూషలు మాకు శాంతి, సుఖములు ప్రసాదించవలెను.

2. భగుడు మాకు శాంతిని ఇవ్వవలెను. నరశంసాగ్ని మాకు శాంతి ప్రదుడు కావలెను. మాకు పురంధ్రి శాంతి ప్రద కావలెను. సకల ధనములు మాకు శాంతి ప్రదములు కావలెను. ఉత్తమము. నియమయుక్త సత్యవచనము మాకు

శాంతి ప్రసాదించవలెను. బహుమారులు అవిర్భూత ఆర్యమ మాకు శాంతి దాత కావలెను.

3. ధాత మాకు శాంతిని ఇవ్వవలెను. ధర్త వరుణుడు మాకు శాంతిని ఇవ్వవలెను. పృథ్వి అన్న సహితముగా శాంతి ఇవ్వవలెను. మహోంతములగు ద్యావాపృథ్వులు మాకు శాంతి ఇవ్వవలెను. పర్వతము శాంతి ఇవ్వవలెను. దేవతల సకల ఉన్నత స్తుతులు శాంతి ఇవ్వవలెను.

4. జ్వాలాముఖాగ్ని మాకు శాంతి ప్రసాదించవలెను. మిత్రావరుణులు శాంతి ప్రసాదించవలెను. అశ్వినులు శాంతి ప్రసాదించవలెను. పుణ్యాత్ముల పుణ్యకర్మలు శాంతి ప్రసాదించవలెను. గతిశీలమగు వాయువు సహితము శాంతముగా వీచవలెను.

5. ప్రథమ ఆహ్వానముననే ద్యావాపృథ్వులు మాకు శాంతికలిగించవలెను. దర్శనీయ అంతరిక్షము మాకు శాంతి కలిగించవలెను. ఓషధులు, వృక్షములు మాకు శాంతి కలిగించవలెను. విజయ పరాయణుడగు లోకపతి ఇంద్రుడు సహితము మాకు శాంతి కలిగించవలెను.

6. వసువులతో కలిసి ఇంద్రుడు మాకు శాంతి అనుగ్రహించవలెను. ఆదిత్యులతో కలిసి శోభనస్తుతుల వరుణుడు మాకు శాంతి అనుగ్రహించవలెను. రుద్రగణముల కొరకు రుద్రుడు మాకు శాంతిని అనుగ్రహించవలెను. దేవతా స్త్రీలతో త్వష్ట మాకు శాంతిని అనుగ్రహించవలెను. యజ్ఞము మా స్తోత్రము వినవలెను.

7. సోముడు మాకు శాంతి అందించవలెను. స్తోత్రము మాకు శాంతి అందించవలెను. శిలలు మాకు శాంతి అందించవలెను. యూపముల కొలతలు మాకు శాంతి అందించవలెను. ఓషధులు మాకు శాంతి అందించవలెను. వేదము మాకు శాంతి ప్రసాదించవలెను.

8. విశాల తేజోవంతుడగు సూర్యుడు మా శాంతి కొఱకు ఉదయించవలెను. నాలుగు మహాదిశలు మాకు శాంతి ప్రసాదించవలెను. స్థిర పర్వతములు మాకు శాంతి ప్రసాదించవలెను. నదులు మాకు శాంతి ప్రసాదించవలెను. జలములు మాకు శాంతి ప్రసాదించవలెను.

9. కర్మద్వారా అదితి మాకు శాంతినీయవలెను. శోభన స్తుతులు గల మరుత్తులు మాకు శాంతి నీయవలెను. విష్ణువు మాకు శాంతినీయవలెను. పూష మాకు శాంతినీయవలెను. అంతరిక్షము మాకు శాంతినీయవలెను. వాయువు మాకు శాంతి నీయవలెను.

10. రక్షించుచు సవిత మాకు శాంతి అనుగ్రహించవలెను. చీకట్లను దూరము చేయు ఉషస్సులు మాకు శాంతి అనుగ్రహించవలెను. మా ప్రజకు పర్జన్యుడు శాంతి అనుగ్రహించవలెను. క్షేత్రపతి శంభుడు మాకు శాంతి అనుగ్రహించవలెను.

11. ప్రకాశమానులగు విశ్వేదేవతలు మాకు శాంతి అందించవలెను. కర్మతో పాటు సరస్వతి మాకు యజ్ఞ సేవక శాంతి నందించవలెను. దాననిపుణులు మాకు శాంతి నందించవలెను. భూలోక, ద్యులోక, అంతరిక్షములందు పుట్టిన జీవములన్నీయు మాకు శాంతి నందించవలెను.

12. సత్యపాలక దేవతలు మాకు శాంతిని ప్రసాదించవలెను. అశ్వగణములు మాకు శాంతి ప్రసాదించవలెను. గోవులు మాకు సుఖములనిచ్చునవి కావలెను. సుకర్మ కర్తలు, సుందరహస్తులు ఋభువులు మాకు శాంతిని ప్రసాదించవలెను. స్తుతించినపుడు మా పితరులు సహితము మాకు శాంతిని ప్రసాదించవలెను.

13. అజ ఏకపాదదేవా ! మాకు శాంతినిమ్ము. అహిర్బుధ్న్య దేవా ! మాకు శాంతినిమ్ము. ఉపద్రవ శాంతి కారక అపాం నపాత, దేవా ! మాకు శాంతినిమ్ము. దేవపాలిక పృశ్నీ ! మాకు శాంతినిమ్ము.

14. మేము ఈ కొత్త స్తోత్రము రచించినాము. ఆదిత్య గణ, రుద్రగణ, వసుగణములు దీనిని స్వీకరించవలెను. ద్యులోక, భూలోక, వృశ్ని జాతములన్నియు మిగిలిన యజ్ఞీయములన్నియు మా ఆహ్వానము వినవలెను.

15. యజ్ఞ, యోగ్య దేవతలు, యజనీయమను ప్రజాపతి, యజనీయ, అమర సత్యజ్ఞ దేవగణములు నేడు మాకు బహు కీర్తనీయ పుత్రుని ప్రదానము చేయవలెను. నీవు మమ్ము ఎల్లపుడు శుభములు కలిగించి పాలింపుము.

**ఆలోచనామృతము**

ఆదిత్యా రుద్రా వసవో జుషంతేదం బ్రహ్మ క్రియమాణంనవీనం|
శ్రుణ్వంతునో దివ్యాః పార్ధివాసోగోజాతా ఉతయే యజ్ఞియాసః||

ఇది ఈ సూక్తము పదునాలువ మంత్రము "ఇదం బ్రహ్మక్రియమాణం నవీనం" ఇది కొత్తగా రచించిన సూక్తము అనుచున్నాడు.

ఈ సూక్తము అందమయినది. సుందరమైనది. సురుచిరము. మనసున పులకింపచేయునది. ఆనందకరము. హర్షదము. స్పందింప చేయునది. కొన్ని పదములు, మనసును కదిలించును. కొన్ని ఏడిపించును.

కొన్ని బాధించును. కొన్ని నవ్వించును. పదములకు ప్రాణము లేక పోవచ్చు. శక్తి ఉన్నది. అని మనిషిమీద మనసుమీద అనంతమగు ప్రభావము వేయగలవు.

శాంతి, ఇది ఆప్యాయమగు పదము ఉచ్ఛారణ మాత్రమున మనసున మల్లెలు మొలుచును. ఏదో చెప్పలేని అవ్యక్త,

అనుభూతి చోటుచేసుకొనును. పచ్చని పంట చేలు, నల్లనికారు మబ్బు, మెల్లగాపారు ఏరు, మెల్లని పిల్లగాలిని తలపించును.

కొన్ని పదములు మాత్రమే ఉండును. వాస్తవమున ఉండవు. శాంతి. అటువంటి పదము. అది మానవాళికి ఈ నాటికి అందలేదు. ముందు అందగలదని నమ్మకము లేదు. ఏలననగా మనిషి, మనసు ప్రకృతి అలజడిగలవి. వాటికి నిలకడలేదు. అందుకే శాంతికి నిలకడలేదు.

శాంతి అందదు. అందుకని అందమయినదికాదు. అందనిప్రతిది అందముకాదు.

మానవ జీవితము మరీచిక. దానికి అన్నీ కనిపిస్తాయి. వాటివెంట పరుగే జీవితము. మనిషికి నిశ్చితముగా అందునది మృత్యువు మాత్రమే. జీవితము అనిశ్చితము మృత్యువు నిశ్చితము.

మానవుని జీవితము వాస్తవము సత్యము, ఋతము మీద ఆధారపడినదికాదు. అది ఆదర్శము లక్ష్యము గమ్యము మీద ఆధారపడినది. మానవుడు ఏనాటికయినా ఆదర్శమును అందుకొనగలడా? అదొక ప్రశ్న, మానవ జీవితము ప్రశ్నల తోరణము. అన్నింటికి సమాధానము ఉండదు.

ఇంతకుముందటిసూక్తములు సుఖములను కోరినవి. ధనమును కోరినవి. అన్నమును కోఱినవి. బలమును కోఱినవి. శాంతిని ఆశించలేదు.

మానవ జీవిత ప్రయాణమున ఇదొక మరువరాని మజిలీ ! అన్నము, బలము మున్నగునవి సుఖమును ఇవ్వలేకపోయినవి. అందుకే అన్వేషణ. ఆ నిరంతర అన్వేషణలో వశిష్ఠుని ఊహా పథమున శాంతి గోచరించినది. అతడు ఆ ఉత్సాహమున, ఆవేశమున, ఆనందమున వచించిన సూక్తమిది. అందుకే "ఇదం బ్రహ్మాక్రియమాణం నవీనం" అన్నాడు. బ్రహ్మ అనగా మంత్రము సూక్తము

శాంతము లేదా సౌఖ్యము లేదన్న మన త్యాగయ్య వశిష్ఠున కన్న తక్కువాడుకాదు.

శాంతి పదము చిన్నది. అర్థము అనంతము. శాంతి స్వతంత్రంకాదు పరాధీన. శాంతి ఒకచోటిది కాదు. పెక్కుచోట్లది. శాంతి బాహిరము మాత్రమేకాదు అధికముగా ఆంతరంగికము.

శాంతి అందదు. ఎందుకు? అది ప్రకృతి మీద ఆధారపడినది. పరిసరములు మీద ఆధారపడినది. పరిస్థితుల మీద ఆధారపడినది. రాజకీయముమీద ఆధారపడినది. మనిషిమీద ఆధారపడినది. మనసు మీద ఆధారపడినది. ఇవి భిన్నములు పొంతనలేనివి. అందని శాంతిని అందదని మిన్నకుండ జాలము ! నిరంతర యత్నములు కొనసాగుచూనే ఉన్నవి-ఉండును.

శాంతికొఱకని సాగిన యుద్ధములెన్ని? శాంతి కొరకని చెలరేగిన అశాంతి ఎంత?

ఈ హింస, ఈ అశాంతి ఎవరికొరకు? ఒక నియంత కొరకా? ఒక రాచరికము కొరకా? ఒక మతము కొరకా? ఒక విధానము కొరకా? ప్రజలను శాంతిగా బ్రతకనీయకుండుట కొరకా?

ఎవని నిర్వచనము వానిది? ఒకనికి అశాంతి మరొకరిశాంతి ఇదికూడా సాపేక్షమే. మానవజాతిని ఉద్ధరించుటకని పుట్టిన సిద్ధాంతములలో చాల వరకు ఆదర్శముగనే నిలిచిపోయినవి. శాంతి సహితము అటువంటిదే.

అటువంటి శాంతి ఎన్నింటిమీద ఆధారపడినది. ఈ సూక్తము చెప్పినది. శాంతి కొఱకు తపించినది. ఈ సూక్తపు ఉచ్ఛారణలో శాంతి ఉన్నది. "మహానామ్నివర్తే ఏతత్సూత్రం జప్యం" అన్నాడు శాయణుడు.

వాస్తవ జీవితముకన్న పదములు వాటి స్వరములు ఉచ్ఛారణలు ప్రభావము ఎక్కువ. అందుకే ఈ సూక్తపు మొదటి మంత్రము ఉచ్ఛరింతము.

"శంన ఇంద్రాగ్నీ భవతామవోభిః || శం" ఇంద్రావరుణా రాతహవ్యా
శమింద్రాసోమా సువిత యసంమోః శంన ఇంద్రాపూషాణా వాజాసాతౌ

*(ఆంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ మండలము ఐదవ అష్టకమున మూడవ అధ్యాయము సమాప్తము.)*

**నాలుగవ అధ్యాయము ముప్పది ఆరవ సూక్తము**

ఋషి - వసిష్ఠుడు, దేవత - విశ్వేదేవతలు ఛందస్సు - త్రిష్టుప్.

1. యజ్ఞస్థానము నుండి స్తోత్రములు శ్రేష్ఠముగా సూర్యాదులవద్దకు చేరవలెను. తన కిరణములతో సూర్యుడు వర్షజలమును ఏర్పరచినాడు. భూమి తన సానువులమీద విస్తృతమై వ్యాపించి ఉన్నది. పృథ్వి యొక్క విస్తృత అవయవములమీద అగ్ని జ్వలించును.

2. బలవంతుగు మిత్రావరుణులారా ! హవ్యరూప అన్నమువంటి కొత్త స్తుతిని మీ కొఱకు రచిస్తాను. మీ ఇద్దరిలో వరుణుడు స్వామి స్థానము కల్పించువాడు. మిత్రుడు స్తుతించగా ప్రాణులను ప్రవర్తింపచేయువాడు.

3. కదలికగల వాయువు నడక నలువైపుల శోభిల్లును. పాడి ఆవు వర్ధిల్లును. ప్రకాశమానుడగు ఆదిత్యుని

అంతరిక్షమున మేఘము ఉత్పన్నమగును. ఆ మేఘము జలవర్షకమై అంతరిక్షమున గర్జించును.

4. శూర ఇంద్రా ! నీ అశ్వములు హరినామకములు. సుందరగమనములు కలవి. భారము వహించగలవి. వానిని స్తుతలతో రథమున పూన్చువాని యజ్ఞమునకు విచ్చేయుము. ఆర్యమ హింసించగోరు శత్రువు కోపమును నష్టపరచును. శోభన కర్మలుగల ఆర్యమను స్తుతితో ఆవర్తితము చేయుదును.

5. యజమానులు అన్నవంతులయి, యజ్ఞ స్థలమున నిలిచి రుద్రుని సఖ్యత కోరుచున్నారు. నేతల స్తుతులు విని రుద్రుడు అన్నము అందించవలెను. నేను రుద్రునకు ప్రియ నమస్కారము చేయుదును.

6. నదులకు సింధునదిమాత సరస్వతి సప్తమ. ఆ నదులు కోటికలు తీర్చునవి సుందర ధారలు కలవి ప్రవహించునవి. తమ జలములతో పొంగునవి, అన్నవంతములు కోరికలుగల నదులులన్నియు ఒకేసారి రావలెను.

7. మరుత్తులు ప్రసన్నులు వేగవంతులు. వారు మా యజ్ఞకర్మను పుత్రులను రక్షించవలెను. అక్షర వ్యాప్తమయి, సంచరించు వాగ్దేవి మమ్ము విడువరాదు. ఇతరులను చూడరాదు. మాధనము నియతము. అయినను మరుత్తులు వాగ్దేవి దానిని పెంచవలెను.

8. మహతి, ఆసీమ భూమిని పిలువుము. యజ్ఞయోగ్య వీరపూషను పిలువుము. మా కర్మలను రక్షించు భగుని పిలువుము. దాన నిపుణుడు, ప్రాచీనుడు ఋభువులలో ఒకడు వాజీదేవుని యజ్ఞమునకు పిల్వుము.

9. మరుత్తులారా ! ఈ శ్లోకము మీ ముందునకు చేరవలెను. ఆశ్రమదాత, గర్భపాలక విష్ణువు వద్దకు కూడ చేరవలెను. వారు స్తోతకు, పుత్రులు, అన్నము ప్రసాదించవలెను. "యూయం పాత స్వస్తిభిః సదానః"

## ముప్పది ఏడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - విశ్వేదేవతలు ఛందస్సు - త్రిష్టుప్.

1. విస్తృత తేజము ఆధారముగా గల ఋభువులారా ! వాహకము, కీర్తనీయము, అహింసరథము మిమ్ము మోయవలెను. సుందర హనువులుగల ఋభువులారా ! యజ్ఞమందు ఆనందమునకుగాను పాలు, పెరుగు, సత్తు కలిసిన సోమముతో కడుపునింపండి.

2. స్వర్గ దర్శులగు ఋభువులారా ! మీరు హవిష్మంతుల కొఱకు అహింసక రత్నములను ఉంచండి. అనంతరము బలము కలుగు యజ్ఞమున సోమపానము చేయండి. దయదలచి మాకు విశేష రూప ధనమును అందించండి.

3. ధనికుడవగు ఇంద్రా ! నీవు అధిక, అల్పధన దాన సమయములందు ధనమును సేవింతువు. నీ రెండు చేతులనిండ ధనము ఉన్నది. ధనప్రాప్తియందు నీ మాట కటువుకాదు.

4. ఇంద్రా ! నీవు అసాధారణ యశోవంతుడవు. ఋభువులకు ఈశ్వరుడు. సాధకుడవు. ఇతరులవలె నీవు స్తోత ఇంటికి రమ్ము. హర్యశ్వ ఇంద్రా ! నేడు మేము హవ్యము అర్పించి మిమ్ము స్తుతించుచున్నాము.

5. హర్యశ్వా ! నీవు మా స్తుతివలన వ్యాప్తిచెందుదువు. హవ్యము అర్పించు యజమానికి ప్రవహించు ధనము ఇమ్ము. ఇంద్రా ! నీవు మాకు ధనము ఎప్పుడు ఇచ్చెదవు? నేడు నీకు యోగ్యముల రక్షణలతో మేము పాలితులమగుదుము.

6. మా స్తోత్రరూపవాక్యమును ఎప్పుడు అర్థము చేసికొందువు? ఇప్పుడు నీకు మాకు నివాసము ఇచ్చుచున్నావు. బలము కలిగి వేగవంతములగు నీ అశ్వములు మా స్తుతులు విని వీరపుత్ర సహిత ధనమును అన్నమును మా ఇంటికి తేవలెను.

7. ప్రకాశమానమగు భూమి ఇంద్రుని అధిపతిని చేయుటకు వ్యాపించును. విశిష్ట అన్నముగల వర్షము ఇంద్రుని వ్యాపించచేయును. మానవులు ఇంద్రుని స్తుతించి తమ ఇంటికి తీసికొని వెళ్లుదురు. అట్టి త్రిలోకధారి ఇంద్రుడు జఠరాగ్ని కలిగి ఉండును.

8. సవితా ! నీ వద్దనుంచి ప్రశంసనీయ ధనము మావద్దకు చేరవలెను. పర్వతములు అందించిన ధనము మావద్దకు చేరవలెను. సర్వరక్షకుడు, స్వర్గవాసి ఇంద్రుడు మాకు రక్షకుడు కావలెను. "యూయం పాత స్వస్తిభిః సదానః"

## ముప్పది ఎనిమిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - సవిత ఛందస్సు - త్రిష్టుప్.

1. ప్రభ స్వర్ణ మయము. సవిత దానిని ఆశ్రయించును. దానినే ఉదయింపచేయును. సవిత మానవులకు స్తుతింపతగినవాడు. అతడు అనేక ధనములు కలవాడు. స్తోతలకు మనోహర ధనము ఇచ్చును.

2. సవితా ! ఉదయింపుము నీవు హిరణ్య బాహువవు. విస్తృతము, ప్రసిద్ధమగు వెలుగు ఇచ్చుచున్నావు. మానవుల భోగ యోగ్యమగు ధనము నేతలకు ఇచ్చునట్టి యజ్ఞము ప్రారంభమైనది. నీవు మా స్తోత్రము వినుము.

3. సవితను మేము స్తుతించవలె, సవితను సమస్త దేవతలు స్తుతింతురు. ఆ పూజనీయ సవిత మా స్తోత్రమును అన్నమును స్వీకరించవలెను. సర్వ రక్షణలతో స్తోతలను పాలించవలెను.

4. సవిత అనుమతి ప్రకారము అదితి సవితను స్తుతించును. వరుణాది దేవతలు సవితను స్తుతింతురు. మిత్రాదులు, సమాన ప్రీతిగల ఆర్యమ సవితను స్తుతింతురు.

5. దాననిపుణులు, భక్తులగు యజమానులు పరస్పరము కలసి ద్యులోక భూలోక మిత్రుడగు సవితను సేవింతురు. అహిర్బుధ్న మా స్తుతిని వినవలెను. ముఖ్యధేనువులద్వారా వాగ్దేవి మమ్ము పాలించవలెను.

6. ప్రజారక్షక సవిత మా ప్రార్థన మన్నించవలెను. మాకు తన మనోహరధనము అందించవలెను. ఓజస్వి స్తోతలు మారక్షణకు భగుని మరలమరల పిలుస్తారు. అసమర్థుడు రత్నములు అడుగును. అనుగ్రహో అధయాతి రత్నమ్.

7. వాజీగణము మితద్రవులు మిత్రమార్గులు శుభంకర అన్నవంతులు. యజ్ఞసమయమున వారు మా స్తోత్రములు వినవలెను. మాకు సుఖములు ప్రసాదించవలెను. వాజీదేవగణా! దాత కాని వానిని హంతకులను, రాక్షసులను హతమార్చండి. మాకున్న సకల పాతరోగములను దూరము చేయండి.

8. వాజీగణమా ! మీరు మేధావులు. అమరులు. సత్యజ్ఞానులు. ధననిమిత్తము జరుగు సకల యుద్ధములందు మీరు మమ్ము పాలించవలెను. ఈ సోమమును పానము చేయుడు. ఉన్మత్తులుకండి. తృప్తులయి దేవయాన మార్గమున సాగండి.

## ముప్పది తొమ్మిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - విశ్వేదేవతలు ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్నిపైకి ఎగిసి స్తోతల శోభన స్తుతులను ఆశ్రయించవలెను. అందరకు వార్ధక్యము కలిగించు ఉష పూర్వాభిముఖియై యజ్ఞమునకు రావలెను. ఆదరయుక్తులగు యజమాని అతని భార్య రథికులవలె యజ్ఞమార్గమును ఆశ్రయిస్తారు. మేమంపిన హోత యజ్ఞము చేయిస్తాడు.

2. ఈ యజమానులు అన్నయుక్తులు కుశయుక్తులగుదురు. వాయువు, పూష ప్రజాపాలకులు. పడవలు గలవారు. వారు ప్రజాహితులయి. ఉషోదయముకన్న ముందటి ఆహ్వానమువిని, అంతరిక్షమునుండి రావలెను.

3. ఈ యజ్ఞమున వసుగణములు భూమిమీద ఆనందించవలెను. విశాల అంతరిక్షమునుండి, దీప్యమానులగు

మరుద్గణములు పూజింపబడుదురు. వేగగాములగు మరుత్తులు, వసువులారా ! మీ గమ్యము మావైపు కావలెను. మా దూత మీ కొఱకు వెళ్లినాడు. అతని ఆహ్వానము మన్నించండి.

4. ప్రఖ్యాతులు, యజనీయులు, రక్షకులు విశ్వ దేవగణము యజ్ఞస్థానమునకు వస్తారు. అగ్నీ ! మా యజ్ఞమున మేము కోరిన దేవతలను యజ్ఞము చేయుము. భగునకు అశ్వినులకు ఇంద్రునకు వెంటనే పూజచేయుము.

5. అగ్నీ ! ద్యులోకమునుండి స్తుతియోగ్యులగు మిత్ర, వరుణ, ఇంద్ర, ఆర్యమ, అదితి విష్ణువులను మా యజ్ఞముకు పిలువుము. భూమి నుంచి కూడ పిలువుము. సరస్వతి, మరుద్గణములు హృష్టులు కావలెను.

6. మేము యజనీయులగు దేవతలకు, స్తుతులతోకూడ హవ్యము సమర్పింతుము. అగ్ని మా అభిలాషలకు ఆటంకముగా కాకుండ మా యజ్ఞమును వ్యాప్తము చేయును. దేవతలారా ! గ్రహించదగి, అనుభవించదగిన ధనము ప్రసాదించండి. నేడు మేము సహాయక దేవతలను కలుసుకొందుము.

7. నేడు వశిష్ఠులు ద్యావాపృథ్వులను చక్కగా స్తుతించినారు. యజ్ఞయుక్తలయి వరుణ, ఇంద్ర, అగ్నులను కూడ స్తుతించినారు. ఆహ్లాదకారులగు దేవగణములు మాకు పూజనీయము, సర్వోత్తమమగు అన్నము అందించవలెను. **"యూయం పాత స్వస్తిభిః సదానః"**

## నలుబదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - విశ్వేదేవతలు ఛందస్సు - త్రిష్టుప్.

1. దేవతలారా ! మీరు మనసుతో ఆర్జించిన సుఖములు మా వద్దకు చేరవలెను. మేము వేగవంతులగు దేవతలను స్తుతిస్తాము. ఇప్పుడు సవిత పంపిన రత్నవంతమగు ధనమును మేము స్వీకరింతుము.

2. మిత్రావరుణులు, ద్యావాపృథ్వులు మాకు అదేప్రసిద్ధమగు ధనము ఇవ్వవలెను. ఇంద్రుడు, ఆర్యమ మాకు ప్రకాశవంతులగు స్తోతలు సేవించిన ధనము ఇవ్వవలెను. వాయువు, భగుడు మాకు ఇవ్వతల పెట్టినట్టి ధనముచే అదితి మాకు అందించవలెను.

3. పృషత్, అశ్వములుగల మరుత్తులారా ! మీరు రక్షించిన మానవుడు ఓజస్వి బలవంతుడు అగును. అగ్ని సరస్వతి మున్నగు దేవగణములు యజమానిని వర్థిల్లచేయవలెను. ఈ యజమాని ధనమునకు విఘాతుకులు ఉండరాదు.

4. యజ్ఞప్రాపకుడగు వరుణుడు, మిత్రుడు ఆర్యమ అందరు శక్తియుతులు వీరందరు మా యజ్ఞకర్మను భరింతురు.

ఆటంకపరచరానిదియు, ప్రకాశమానయు అగు అదితి శోభన ఆహ్వానవంతురాలు. మాకు బాధకలుగని రీతిగా సకల దేవతలు మమ్ము పాపములనుండి కాపాడవలెను.

5. విష్ణువు హవ్యము ద్వారా ప్రాపణీయుడు అభీష్టవరదుడు. దేవతలందరు విష్ణువు అంశపు వారే. రుద్రుడు తన మహిమను మాకు ప్రదానము చేయవలెను. అశ్వినులు హవ్యముగల గృహమునకు రావలెను.

6. అందరి వరణీయ సరస్వతి. దాన నిపుణలగు దేవపత్నులు మాకు ధనము ఇస్తారు. దీప్తివంతపూషా ! ఆ ధనమును ఆటంక పరచకుము. సుఖప్రదులు, గతిశీలురగు దేవగణములు మమ్ము చక్కగా పాలించవలెను. సర్వత్ర సంచరించువాయువు మాకు జలము ప్రదానము చేయవలెను.

7. నేడు వసిష్ఠులు ద్యావాపృథ్వులను చక్కగా స్తుతించినారు. యజ్ఞయుక్తులగు వరుణ, ఇంద్ర, అగ్నులను కూడ స్తుతించినారు. ఆహ్లాదకరులగు దేవగణములు మాకు పూజనీయము, సర్వోత్తమమగు అన్నము అందించవలెను. "యూయం పాత స్వస్తిభిః సదానః"

## నలుబది ఒకటవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - వేరు వేరు ఛందస్సు- మొదటిది జగతి, తక్కినవి త్రిష్టుప్.

1. మేము ప్రాతఃకాలమున ఇంద్రాగ్ని మిత్రావరుణులను ఆహ్వానింతుము. ప్రాతఃకాలమున అశ్వినులను స్తుతింతుము. ప్రాతఃకాలమున భగ, పూష, బ్రహ్మణస్పతి సోమ, రుద్రులను స్తుతింతుము.

2. లోకములను భరించువారు, జయశీలురు, ఉగ్రులు, అదితి పుత్రులు. వారిలో భగుని మేము ప్రాతఃకాలమున ఆహ్వానింతుము. దరిద్ర స్తోతయు, ధనికుడగు రాజును భగదేవతను తమకు భోగభాగ్యములిమ్మని అర్థింతురు.

3. భగుడా ! నీవు ఉత్తమనేతవు. సత్యధనుడవు. మాకు మేము కోరినవి ఇమ్ము. మా స్తోత్రము సఫలము చేయుము. మమ్ము గోవులు, అశ్వముతో వర్ధిల్ల చేయుము. మేము పుత్రాదులతో మనుష్యవంతులము అగుదుము.

4. మేము ఇప్పుడు మీవారము కావలెను. దినపు మొదటి మధ్యన కూడా ఆవారము కావలెను. ధనికుడవగు భగదేవా ! సూర్యోదయమున మేము ఇంద్రాదుల అనుగ్రహము పొందవలెను.

5. దేవతలారా ! భగుడే భగవానుడు ధనవంతుడు కావలెను. మేము భగుని అనుగ్రహమున భగవంతులము ధనవంతులము కావలెను. భగదేవా ! నిన్ను అందరు తేప తేపకు పిలుస్తారు. నీవు ఈ యజ్ఞమున మాకు

అగ్రగామివగుము.

6. శుద్ధస్థానము కొఱకు దధిక్రవలె ఉషా దేవత మా యజ్ఞమునకు రావలెను. వేగవంతమగు అశ్వరథమువలె ఉష, ధనదాత భగుని మాముందుకు తేవలెను.

7. ఉష సకలగుణోపేత, ప్రవృద్ధ, పూజనీయ ఆమె గోవులు, వీరపురుషుల యుక్తముగను, జలసేచనము చేయుచును ఎల్లప్పుడు మాకు రాత్రివేళ చీకట్లను పార ద్రోలవలెను, **"యూయం పాత స్వస్తిభిః సదానః"**

## నలుబది రెండవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - విశ్వేదేవతలు ఛందస్సు - త్రిష్టుప్.

1. స్తోతలగు అంగిరులు అంతట వ్యాపించవలెను. పర్జన్యుడు మా స్తోత్రమును విశేషరూపమున అభిలషించవలెను. హర్షద నదులు జలసేచనము చేయుచు సాగవలెను. ఆదర సంపన్న పత్ని, యజమాని యజ్ఞరూపమున యజించవలెను.

2. అగ్నీ ! నీవు చిరకాలము నడిచిన మార్గము సుగమము కావలెను. నల్లనివి, రాగిరంగు అశ్వములు. యజ్ఞగృహమునకు నీ సమ వీరులను తెచ్చి శోభనందును. ఆ అశ్వములనే నీ రథమునకు కట్టుము. నేను యజ్ఞగృహమున కూర్చుండి దేవతలను ఆహ్వానింతును.

3. దేవతలారా ! నమస్కరించువారలగు స్తోతలు మీ యజ్ఞమును విధి పూర్వకముగా పూజింతురు. మాకు దగ్గరలో ఉన్న హోతీ సర్వోత్తముడు. యజమానులారా ! దేవతల యజ్ఞమును చక్కగా నిర్వహించండి.

బహుతేజోవంతులగు దేవతలారా ! మీరు భూమిని ఆవర్తితముచేయండి.

4. అగ్ని సకల జనులకు అతిథి. అతడు వీరుడు, ధనవంతుడగువాని వాని గృహమున శయనించి కనిపించినప్పుడు గృహమందు నిలిచి ప్రసన్నుడైనపుడు అప్పుడు అగ్ని ఆ చుట్టుపట్ల జనులకు వరణీయ ధనము ఇచ్చును.

5. అగ్నీ ! మా ఈ యజ్ఞమును స్వీకరింపుము. ఇంద్ర మరుత్తుల ముందు మమ్ము యశస్వులను చేయుము. రాత్రియు ఉషఃకాలమందును కుశలపై ఆసీనుడవగుము. యజ్ఞాభిలాషులు మిత్రావరుణులను ఈ యజ్ఞమున పూజింపుము.

6. ధనము కోటిన వసిష్ఠుడు ఈవిధముగనే బలపుత్రుడగు అగ్నిని బహురూపధన ప్రాప్తికని స్తుతించినాడు. అగ్నిమాకు అన్నము, బలము, ధనము ఇవ్వవలెను. "యూయంపాత స్వస్తిభిః సదానః"

## నలుబది మూడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - విశ్వదేవతలు ఛందస్సు - త్రిష్టుప్.

1. వృక్షశాఖలవలె మేధావుల స్తోత్రములు అన్నివైపుల వ్యాపించును. వారే దేవకామి యజ్ఞమున నమస్కరించి నిన్నుపొందుటకు విశేషముగా స్తుతింతురు. వారు ద్యావాపృథ్వులను కూడ నుతింతురు.

2. వేగవంతమగు అశ్వమువలె ఈ యజ్ఞమునకు చేరుము. ఘృతము స్రవించు సృక్కును ఎత్తుము. యజ్ఞము కొఱకు మంచి కుశలను పరచుము.

అగ్నీ ! నీ దేవకామి కిరణములు ఊర్ధ్వముఖులు కావలెను.

3. గారాబముచేయబడు కొడుకు తల్లివడిలో కూర్చున్నట్లు దేవతలు యజ్ఞపు ఉన్నతాసనములందు విరాజిల్లవలెను.

అగ్నీ ! నీ యజనీయ జ్వాలలు జుహువును చక్కగా కాపవలెను. యుద్ధమున నీవు మా శత్రువుకు సాయము చేయరాదు.

4. యజనీయ దేవగణములు పితుక దగిన జలధారలను కురిపించుచు, ఇష్టము వచ్చిన రూపమున మా సేవలను స్వీకరించవలెను. దేవతలారా ! ధనములందు పూజ్యుధనము నేడు ఇచటకి రావలెను. ఏక మనస్కులై మీరు విచ్చేయండి.

5. అగ్నీ ! ఈవిధముగా ప్రజలనుంచి మాకుధనము ఇమ్ము. నీవు మమ్ము విడువరాదు. మేము నిత్యయుక్త ధనములతో మత్తులమై అహింసితులము కావలెను. "యూయం పాత స్వస్తిభిః సదానః"

## నలుబది నాలుగవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - దధిక్రుడు ఛందస్సు - మొదటిది జగతి తక్కినవి త్రిష్టుప్.

1. నీ రక్షణ కొఱకు ముందు నేను దధిక్రదేవుని ఆహ్వానింతును. తదుపరి అశ్వినులు, ఉష, సమిద్ధ అగ్ని, భగదేవతలను ఆహ్వానింతును. ఇంద్ర, విష్ణు, పూష, బ్రహ్మణస్పతి, ఆదిత్యగణ, ద్యావాపృథ్వి, జల, సూర్యులను ఆహ్వానింతును.

2. యజ్ఞప్రారంభమున మేము స్తోత్రముతో దధిక్రుని ప్రబోధితుని చేసి ప్రవర్తితుని చేయుదుము. ఇళన స్థాపింతురు. శోభన ఆహ్వాన సంపన్నులగు మేధావి అశ్వినులను ఆహ్వానింతుము.

3. దధిక్రుని ప్రబోధితుని చేసిన నేను అగ్ని, ఉష, సూర్య, వాగ్దేవిని స్తుతింతును. దురభిమానుల వినాశకారి వరుణుని మహాపింగళ వర్ణ. అశ్వమును స్తుతింతును. సకల దేవగణములు సకల పాపములను నానుండి వేరు చేయవలెను.

4. అశ్వములందు ముఖ్యుడు, శీఘ్రగామి, గతిశీలుడగు దధిక్ర జ్ఞాతవ్యమును ఎరుగును. ఉష, సూర్య, ఆదిత్యగణ, వసుగణ, అంగిరులతో కలిసి దధిక్ర స్వయముగా రథపు అగ్రభాగమున తగులును.

5. దధిక్రా ! అందఱు యజ్ఞము చేయవలెను. అందఱు చక్కని మార్గమున నడువవలెను. అందఱకు దివ్యజలము లభించవలెను. అందఱకు జ్ఞానము కలుగవలెను. సామర్థ్యము కలుగవలెను. అందఱు దేవతల గుణములు దానము చేయవలెను. అందఱు స్వయముగా దేవతల వంటివారు కావలెను.

## నలుబది ఐదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - సవిత ఛందస్సు - త్రిష్టుప్.

1. సవిత రత్నయుక్తమగు తన తేజస్సుతో అంతరిక్షమును పూరించును. అతడు అశ్వమును అధిరోహించును. మానవులకు హితకరమగు అనంత ధనమును రెండు చేతులందు దాల్చును. అతడు ప్రాణులను వారి స్థానములందు భరించి వారిని వారివారి కర్మలకు ప్రోత్సహించుచు విచ్చేయవలెను.

2. దానము కొఱకు ప్రసరించిన విశాల హిరణ్మయ బాహువులతో సవిత అంతరిక్షపు అంచులవరకు వ్యాపించవలెను. నేడు మేము సవితయొక్క ఆ మహిమనే కీర్తింతుము. సూర్యుడు సహితము సవితకు కర్మ స్వేచ్ఛ నివ్వవలెను.

3. తేజస్వి, ధనాధిపతి సవితయే మా కొఱకు ధనము పంపవలెను. అతడు బహువిశాల రూపము ధరించును. మాకు మానవభోగ యోగ్యమగు ధనము ఇవ్వవలెను.

4. సవిత్ర స్తోత్ర రూపవచనుడు. ఉత్తమ జిహ్వాజలవాడు. సుందరహస్తములు కలవాడు. ఆ సవితను మేము స్తుతింతుము. అతడు మాకు విచిత్రము విశాలమగు అన్నము ప్రదానము చేయవలెను. **"యూయం పాత స్వస్తిభిః సదానః"**

## నలుబది ఆరవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - రుద్రుడు, ఛందస్సు - జగతి, చివరిది త్రిష్టుప్.

1. రుద్రుడు దృఢ ధనుష్టుడు. వేగవంతములను అమ్ములవాడు. అన్నవంతుడు. అజేయుడు. విజేత. సుతీక్ష్ణ అస్త్ర కర్త. అటువంటి రుద్రుని స్తుతించండి. అతడు వినవలెను.

2. భూమిమీద, స్వర్గమందు ఉన్న వారిని ఐశ్వర్యమునుబట్టి తెలుసుకొనవచ్చును. నిన్ను స్తుతించువారిని పాలింపుము. మా ఇంటికి విచ్చేయుము. మమ్ము రోగస్థులను చేయకుము.

3. రుద్రా ! నీవు అంతరిక్షమున పిడుగును విడుతువు. అది నేలను అంటునపుడు మమ్ము తాకరాదు. "స్వసివాత" రుద్రా ! నీ వద్ద వేల ఓషధులు ఉన్నవి. మా పుత్ర, పౌత్రులను హింసించకుము.

4. రుద్రా ! నీవు మమ్ము కొట్టరాదు. మమ్ము విడువరాదు. నీ కోపమున పడిన ఉచ్చులలో మమ్ము పడనీయకుము. ప్రాణులచే ప్రశంసించబడు యజ్ఞమున మమ్ము భాగస్వాములను చేయుము. **"యూయం పాత స్వస్తిభిః సదానః"**

## నలుబది ఏడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అప్, ఛందస్సు - త్రిష్టుప్.

1. అప్ దేవతా ! నీవు సంస్కరించిన సోమరసము దేవతలు ఇష్టపడునది. అధ్వర్యులు ఇంద్రునకు పానయోగ్యముగా చేసినది. అట్టి శుద్ధము, నిష్పాపము, వృష్టిజల సేచనకారి అగు రసవంత సోమరసమును మేముకూడ సేవింతుము.

2. శీఘ్రగతిగల అపాంనిపాత, అగ్నీ ! దేవతలు నీ రసవత్తమ సోమమును రక్షించవలెను. అందు వసువులు రుద్రులు ఉన్మత్తులు అగుదురు. మేము దేవాభిలాషులము. నేడు ఆ సోమరసమును అందుకొందుము.

3. అప్ దేవత జలదేవత అనేక పావన రూపములవాడు. హర్షోత్పాదకుడు. ప్రకాశమానుడు. దేవతల స్థానములందు ప్రవేశము కలవాడు. అతడు ఇంద్రుని యజ్ఞాది కర్మములకు ఆటంకము కలిగించడు. అధ్వర్యులారా ! మీరు సింధు మున్నగు జలస్థానమునలకు ఘృతయుక్త హవ్యముతో హోమము చేయండి.

4. సూర్యుడు తన కిరణములతో జలములను విస్తరింపచేయును. ఇంద్రుడు జలగమన మార్గమును ఏర్పరచినాడు. సింధుగణములారా ! మీరు మా కొఱకు ధనము దాల్చుడు. **"యూయం పాత స్వస్తిభిః సదానః"**

## నలుబది ఎనిమిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఋభువులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఋభువులారా ! మీరు నేతలు, ధనవంతులు. మా సోమము పానము చేయుడు. మత్తులగుడు. మీరు వెళ్లుచున్నారు. మా అశ్వములు మీ కార్యములు నిర్వర్తించునవి. సమర్థలు. అవి మా కొఱకని మానవహితకర రథమును ఆవర్తితము చేయవలెను.

2. ఋభువులారా ! మేము మీ వలన ప్రసిద్ధులము అగుదుము. మేము సమర్థులము కావలెను. మీ సాయమున మీ బలముతో మేము శత్రువులను అణచివేసెదము. వాజనామక ఋభువు యుద్ధములందు మమ్ము రక్షించవలెను. ఇంద్రుని సహాయమున మేము వృత్రుని బారినుండి తప్పించుకొన గలము.

3. ఇంద్రుడు ఋభుగణములు తమ ఆయుధములతో మా శత్రుసేనలను అనేకములను ఓడింతురు. యుద్ధము జరిగినప్పుడువారు సమస్త శత్రువులను హతమార్చెదరు. విభ్వ, ఋభుక్ష, వాజలను ముగ్గురు ఋభువులను, ఆర్య ఇంద్రుడు మథించి శత్రుబలములను నష్టపర్చెదరు.

4. ప్రకాశక ఋభువులారా ! మాకు నేడు ధనము ఇవ్వండి.

సమస్త ఋభువులారా ! ప్రసన్నులై మీరు మమ్ము రక్షించండి.

ప్రశస్త ఋభువులారా ! మీరు మాకు అన్నము ప్రదానము చేయండి. **"యూయంపాత స్వస్తిభిః సదానః"**

## నలుబది తొమ్మిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అప్, ఛందస్సు - త్రిష్టుప్.

1. జలములందు సముద్రుడు జ్యేష్ఠుడు. అప్ దేవత గమనశీలుడు. శోధకుడు. అతడు అంతరిక్ష మధ్యమునుండి సాగును. వజ్రధరుడు, అభీష్ట వర్షియగు ఇంద్రుడు జలములను విడిచినాడు. ఆ అప్ దేవత ఇక్కడ మమ్ము రక్షించవలెను.

2. అంతరిక్షమున పుట్టిన జలములు. నదులలో ప్రవహించు జలములు. నేల అడుగునుండి త్రవ్వితీసిన జలము స్వయముగా పుట్టి సముద్రమువైపు సాగుజలములు అట్టిదీప్తములగు పవిత్ర జలములన్నియు మమ్ము రక్షించవలెను.

3. జలసమూహముల స్వామి వరుణుడు. అతడు సత్యాసత్యములకు సాక్షీభూతుడై మధ్యలోకమునకు తరులును. అట్టి రసమును వర్షించు ప్రకాశయుక్తములగు, శోధక జలదేవతలు మమ్ము రక్షించవలెను.

4. రాజావరుణుడు నివసించునదియు, సోమము నిలుచునదియు అన్నములుపొంది విశ్వదేవతలు ప్రసన్నలగునదియు, వైశ్వానరుడు ఆసీనమగునదియు ప్రకాశక అప్ దేవత మమ్ము రక్షించవలెను.

## ఏబదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - వేరు వేరు, ఛందస్సు - జగతి.

1. మిత్రావరుణులారా ! ఈ లోకమున మీరు మమ్ము రక్షింపుడు. నిలిచి ఉండునదియు పాకునదియు అగు విషము మమ్ము చేరరాదు. అజక అను వ్యాధివలె దుర్ధర్శన విషము సమసి పోవలెను. కనిపించక సాగు సర్పము మా పదధ్వనులను గుర్తించరాదు. "మాం పద్యే నిరపపరసా విదత్సరుః"

2. వందననామక విషము నానాజన్మములందు వృక్షాది గ్రంథిస్థానములందు ఉత్పన్నమగును. జాను గుల్మాదులకు వాపు కలిగించు విషమును దీప్తిమాన్ అగ్నిదేవా ! మా మానవులకు దూరముగా ఉంచుము. "మాం పద్యే నిరపపరసా విదత్సరుః"

3. వృక్షఃస్థానమున (రొమ్మున) ఉండు విషమును నదుల జలములందు ఓషధులతో కలుగు విషమును విశ్వదేవగణములారా ! మా నుండి దూరము చేయండి. "మాం పద్యే నిరపపరసా విదత్సరుః"

4. ప్రబల దేశమునకు పోవు నదులు దిగువదేశమునకు పోవు నదులు ఉన్నత దేశమునకు పోవు నదులు జలయుక్తములు, జలశూన్యములై లోకమును తృప్తిచెందించు నదులు మాకు వచ్చు "శిపాద" రోగమును నయము

చేయవలెను. మాకు శుభములు కలిగించవలెను. నదులు బాధించరాదు.

### ఏబది ఒకటవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఆదిత్యుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఆదిత్యుల రక్షణలతో మాకు నూతనము. సుఖకరమగు గృహము లభించవలెను. క్షిప్రకారి ఆదిత్యగణములు మాస్తోత్రములు వినవలెను. ఈ యజ్ఞకర్తను నిరపరాధిని అవిరుద్ధుని చేయవలెను.

2. ఆదిత్యగణము అదితి అత్యంత సరళ స్వభావ మిత్ర, వరుణ, ఆర్యమ ఉన్మత్తులు కావలెను. లోక రక్షక దేవగణములు మమ్ము రక్షించవలెను. వారు మమ్ము రక్షించుటకు సోమపానము చేయవలెను.

3. మేము సమస్త ఆదిత్య గణములను సమస్త మరుద్గణములను సమస్త దేవగణములను సమస్త ఋభువులను ఇంద్రుని, అగ్నిని, అశ్వినులను స్తుతించుచున్నాము. "యూయంపాత స్వస్తిభిః సదానః"

(ఆదిత్యులు 12మంది మరుత్తులు 49మంది దేవగణము 3333 ఋభువులు ముగ్గురు.)

### ఏబది రెండవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఆదిత్యులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. మేము ఆదిత్యులకు ఆత్మీయులము. అవిభాజ్యులము వసువులారా ! మానవులను రక్షించండి. మిత్రావరుణులను భజించుచు మేము ధనములు అనుభవింతుము. ద్యావాపృథ్వులారా మేము శక్తివంతులముకావలెను.

2. మిత్రావరుణాది ఆదిత్యగణములు మా పుత్ర పౌత్రాదులకు సుఖములు కలిగించవలెను. ఇతరుల పాపము మేము అనుభవించకుండవలెను. వసువులారా ! ఏ కర్మము చేయుట వలన మీరు నాశము చేసెదరో అట్టి కర్మను మేము చేయకుండవలెను.

3. క్షిప్రకారులగు అంగిరులు సవితను యాచించి అతని ధనమును పొందినారు. వ్యాపింపచేసినారు. యజ్ఞశీలుడు. మహాపిత, ప్రజాపతి మఱియు దేవగణములు సుమనస్కులై ఆ ధనమును మాకు అందించవలెను.

## ఏబది మూడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ద్యావాపృథ్వులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ద్యావాపృథ్వులు విశాలలు. దేవతలకు జననులు. స్తోతలు వారిని స్తుతులతో స్తుతించుచు స్థాపించినారు. అట్టి యజనీయులు. మహిమాన్వితలగు ద్యావాపృథ్వులను ఋత్విక్కుల బాధాసహితుడనై యజ్ఞమున నమస్కారములతో స్తుతింతును.

2. స్తోతలారా ! కొత్త స్తుతులు రచించండి. మాతా పితృరూపులయిన ద్యావాపృథ్వులను యజ్ఞమునందు అగ్రభాగమున స్థాపించండి. ద్యావాపృథ్వులు తమ వద్దగల వరణీయ ధనము మాకు ఇచ్చుటకు దేవతల సహితులై మా వద్దకు రావలెను.

3. వాస్తోష్పతీ ! మేము నీ యొక్క సుఖకరము. రమణీయము. ధనవంత స్థానమును పొందవలెను. నీవు మాకు లభించనిది. లభించిన ధనములను రక్షింపుము. "యూయం పాత స్వస్తిభిః సదానః"

## ఏబది నాల్గువ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - వాస్తోష్పతి, ఛందస్సు - వివిధములు.

1. వాస్తోష్పతీ ! నీవు రోగ నాశకుడవు. సర్వ ప్రకార రూపముల ప్రతిష్ఠుడవయి మాకు మిత్రుడవు, సుఖకరుడవగుము.

2. శ్వేతర్ణము ఒక్కొక్క అంశమున పింగళ వర్ణ సరమ వంశోద్భవుడే వాస్తోష్పతి. అతడు దంతములు వెళ్లపెట్టినపుడు తినునపుడును, పెదవి కదలినపుడును అవి ఆదంతములు ఆయుధమువలవలె శోభిల్లును. ఇప్పుడు మాత్రము. నీవు సుఖముగా నిద్రింపుము. "షుస్వప".

3. సారమేయా ! నీవు బయలుదేరిన చోటికే తిరిగి చేరుదువు "పునఃసరః సారమేయః" నీవు దొంగలు బందిపోటుల దగ్గరికి వెళ్లుము. ఇంద్రుని స్తుతించువాని వద్ద కేగి ఏమిచేతువు? మమ్ము ఎందుకు బాధింతువు. సుఖముగా నిద్రింపుము. "షుస్వప"

4. నీవు పందిని చీల్చుము. పంది నిన్ను చీల్చును. ఇంద్రుని స్తుతించువాని దగ్గరకేగి ఏమి చేతువు? మమ్ము ఎందుకు

బాధింతువు? సుఖముగా నిద్రింపుము "షుస్వప".

5. నీ తండ్రి నిద్రించవలెను. తల్లినిద్రించవలెను. నీవు నిద్రించవలెను. గృహస్వామి నిద్రించవలెను. బంధువులు నిద్రించవలెను. నలువైపుల జనులు నిద్రించవలెను.

6. ఇచట ఉన్నవాని సంచరించువాని మమ్ము చూచువాని కనులు పొడిచివేయుదుము. ఈ మేర ఎంత నిశ్చలముగా ఉన్నదో వారును అట్లే అయిపోవుదురు.

7. వేయి కిరణముల వృషభము. సూర్యుడు సముద్రము నుండి లేచువాడు. ఆ విజేత సాయమున సకల మానవులను పండపెట్టెదము నిద్రింప చేయుదుము. "స్వాపయామసి"

8. అంగణమున పడుకున్న అంగనలు. వాహనములపై పండినవారు, పరుపులపై పన్నవారు, పుణ్యగంధులు అట్టి అంగనలందరిని నిద్రింప చేయుదుము.

(వశిష్ఠుడు ఒకరాత్రి వరుణుని ఇంటి ప్రవేశించినాడు. అక్కడి కుక్క మొరుగుచు వశిష్ఠుని వెంబడించినది. ఈ మంత్రములతో దానిని శాంతింపచేసి నిద్రపుచ్చినాడు.)

**మరొక కథనము**

1. వశిష్ఠునకు మూడు రాత్రులు అన్నముదొరకలేదు. నాలుగవ రాత్రి వరుణుని ఇంటికి చేరదలచినాడు. ద్వారము వద్ద కుక్క బెదిరించినది. దానిని నిద్ర పుచ్చినాడని శాయణుడు.

*(ఆంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ మండలము ఐదవ అష్టకమున మూడవ అనువాకము సమాప్తము.)*

**నాలుగవ అనువాకము ఏబది ఆరవ సూక్తము**

ఋషి - వసిష్ఠుడు, దేవత - మరుత్తులు ఛందస్సు 1-11 ద్విపద, 12-20 విరాజ, మిగిలినవి త్రిష్టుప్.

1. కాంతిమంతనేతలు, సమాన గృహనివాసులు, మహదేవపుత్రులు, మానవహితైషులు, అశ్వవంతులు ఎవరు? వీరెవరు?

2. వీరు పుట్టుక ఎరిగినవారులేరు. వీరిలో వీరికే తమ జన్మకథ తెలియును.

3. స్వయం చాలకులు. పరస్పరము కలిసికొనువారు. వాయువేగముగల శ్యేనముతో స్పర్థింతురు.

4. శాస్త్రము లెరిగిన మనుజులు ఈ శ్వేతవర్ణ జీవులను ఎరుగుదురు. మహతి పృశ్ని వీరిని అంతరిక్షమున మోసినది.

5. ఆమె బుద్ధిజీవులగు మరుత్తుల అనుగ్రహమున సదాశత్రువులను ఓడించునదియు, ధనమునకు పుష్టిని ఇచ్చునదియు వీరపుత్రవతియు అయినది.

6. మరుత్తులు తాము వెళ్లు స్థలములకు అందరికన్న ఎక్కువగా వెళ్లుదురు. అలంకారములతో అందరికన్న ఎక్కువ శోభింతురు. వారు కాంతిపూర్ణులు. ఓజస్వులు.

7. మీ తేజస్సు ఉగ్రము బలము స్థిరము. మరుద్గణములు బుద్ధిమంతులు కావలెను.

8. మీ బలము సర్వత్ర శోభిల్లునది. మా చిత్తము క్రోధశీలము. పరాభవించగల మీవేగము స్తోతవలె బహువిధ ధ్వనికలది.

9. మరుత్తులారా ! మీ పురాతన అస్త్రములు మాకు దూరము కానీయండి. మీ క్రూర ప్రవృత్తి మమ్ము తాకరాదు.

10. మీరు క్షిప్రకారులు. మిమ్ము మీకు ప్రియములగు నామములతో పిలుతుము. మీరు అందుకు సంతుష్టులగుదురు.

11. మరుద్గణములు సుందర ఆయుధధారులు. గతిశీలురు. సుందర అలంకారములవారు. వారు మా దేహములను అలంకరింతురు.

12. మరుత్తులారా ! మీరు శుచిమంతులు. శుచిమంత హవ్యము మీది కావలెను. మీరు శుచిమంతులు. మీ కొఱకు మేము శుచిగల యజ్ఞము చేతుము. జలస్పర్శ మరుద్గణము ఋతమునుండి సత్యమును పొందినారు. మరుద్గణములు శుచిమంతులు, వారి జన్మము శుచిమంతము వారు ఇతరులను శుచిమంతులను చేయుదురు.

13. మరుత్తులారా ! మీ దండములకు కడియములు ఉన్నవి. మీ ఉదరమున ఉత్తమ హారములున్నవి. వర్షముతో మెరుపుతో శోభించినట్లు జలమును ఇచ్చునపుడు మీరు ఆయుధములతో శోభిల్లుదురు.

14. మరుత్తులారా ! అంతరిక్షమున ఆవిర్భవించిన మీ తేజస్సు విశేషరూపమున గమనము చేయును. మీరు విశేష రూపమున యజనీయులు. జలములను వర్థిల్లచేయండి. మీరు సహస్ర సంఖ్యాకము, గృహోత్పన్నము, గృహమేధి

సమర్పించు ఈ భాగములను ఆశ్రయించండి.

15. మరుత్తులారా ! అన్నవంతుడగు మేధావియొక్క హవ్యయుక్తి స్తోత్రమును మీరు ఎరుంగుదురు. శోభన పుత్రవంతునకు వెంటనే ధనము నివ్వండి. ఆ ధనమును శత్రువులు నష్టపరచరాదు.

16. మరుద్గణములు నిరంతరము నడచు అశ్వమువంటి చక్కని నడకకలవారు ఉత్సవమును చూచుజనులవంటివి శోభస్కరులు. ఇంట ఉన్న పసిపాపవంటి సుందరులు. ఆటలలో ఉన్న పిల్లవంటివారు. వారు జలములను దాల్తురు.

17. మరుత్తులారా ! మాకు ధనము ఇవ్వండి. మీ మహిమ సుందరము. ద్యావాపృథ్వులను పూరించండి. మాకు సుఖములు ప్రసాదించండి. మీ మానవ నాశక ఆయుధము మా నుంచి దూరముగ ఉంచండి. సుఖములు అందుకొని మాముందు అవతరించండి.

18. మరుత్తులారా ! తన గృహమున కూర్చున్న హోత మీ దానకార్యములను ప్రశంసించును. మిమ్ము మాటిమాటికి ఆహ్వానించును. కార్యనిష్ఠగల యజమానిని కాపాడు హోత కపటశూన్యుడై మిమ్ము స్తోత్రములతో స్తుతించును.

19. ఈ మరుత్తులు యజ్ఞమున క్షిప్రకారి యజమానిని ప్రసన్నుని చేయుదురు. వీరు తమ బలమున బలవంతులను క్రుంగదీయుదురు. వంగపెట్టుదురు. ఆర్గురు స్తోతలను హింసకులనుండి రక్షింతురు. కాని హవ్యము అందించని వారికి గొప్ప హాని కలిగింతురు.

20. వీరు ధనికులను, దరిద్రులను ఉభయులను ఉత్తేజ పరతురు. దేవతలు, బంధువులు కోరినరీతి మీరు చీకట్లను దూరము చేయండి. మాకు మేము కోరినట్టి పుత్రపౌత్రులను ప్రసాదించండి.

21. కోటికలు నీడేర్చు మరుత్తులారా ! మేము మీ దానములకు ఆవల ఉండరాదు. మీరు ధనమును దానము చేయునపుడు మమ్ము వెనుక పడనీయరాదు. అభిలషణీయ ధనములందు మమ్ము భాగస్వాములను చేయవలెను. మీ ధనము మంచి జన్మగలది. దానిలో కూడ మమ్ము భాగస్వాములను చేయవలెను.

22. పరాక్రమశాలురు ఓషధులను జనులను జయించుటకు కుపితులైనప్పుడు అప్పుడు రుద్రపుత్ర మరుత్తులు యుద్ధమునందు శత్రువుముందు మాకు రక్షకులు కావలెను.

23. మరుత్తులారా ! మా పూర్వీకులు కొఱకు మీరు అనేక కార్యములు చేసినారు. అతడు ముందటి ప్రశంసనీయ కార్యములను కూడ మీరే చేసినారు. యుద్ధమున మీ సహాయము వీరుడైనవాడు శత్రువును పరాజితును చేయును. మీ సాయముననేస్తోత అన్నము అనుభవించుచున్నాడు.

24. మరుత్తులారా ! మా పుత్రుడు బలశాలి కావలెను. అతడు అసుర శత్రువులను వధించవలెను. ఆ పుత్రుని కూడి అందమగు నివాసమునకుగాను శత్రువును నాశనము చేయుదుము. మీ ఆత్మీయస్థానమున మేము నివసింతుము **"స్వమోకో అభివఃస్యామ"**

25. ఇంద్ర, వరుణ, మిత్ర, అగ్ని, జల, ఓషధి, వృక్షములు మాస్తోత్రమును ఆశ్రయించవలెను. మరుత్తుల వడిలో మేము సుఖించవలెను.

**"శర్మం న్స్యామ మరుతాముపస్థోయూయం పరాతస్వస్తిభిః సదానః".**

**ఏబది ఏడవ సూక్తము**

ఋషి - వసిష్ఠుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. యజనీయ మరుత్తులారా యజ్ఞకాలమున స్తోతలు ఉన్మత్తులగుదురు. అప్పుడు మీ బలముతో పాటు మీ నామమును కీర్తింతురు. వారు విశాల ద్యావాపృథ్వులను గడగడలాడింతురు. మేఘములనుండి జలము వర్షింతురు. ఓజస్వులై సర్వత్ర సంచరింతురు.

2. మరుద్గణములు స్తోతలకొఱకు వెదుకుదురు. వారు యజమాని మనోరథము పూరింతురు. మరుద్గణములారా ! మీరు ప్రసన్నులుకండు. సోమపానమునకు మా యజ్ఞమునకు విచ్చేయుడు. కుశలపై ఆసీనులుకండు.

3. మరుద్గణములు చేసినంత దానము మరెవ్వడు చేయజాలరు. వారు హారములు, ఆయుధములతో తమ దేహములను అలంకరించు కొందురు. ద్యావాపృథ్వులు వెలిగించు వెలుగులుగల గాలిదేవరలు అందమునకుగాను సమాన రూప ఆభరణములను వ్యక్తపరతురు.

4. మరుత్తులారా ! ప్రసిద్ధముగా మీ ఆయుధము మాకు దూరముగా ఉండవలెను. మేము మానవులము. మా విషయమున అపరాధము చేయగలవారలము. అయినను మీ ఆయుధము మామీద పడరాదు.

5. మా యజ్ఞమున మరుత్తులు రమింతురుగాత *"కృతోచిదత్రమరుతః"* అనువారు ఆనందమయులు దీప్తివంతులు. శుభంకరులు. మరుత్తులారా ! మీరు దయతలచండి. లేదా మా స్తుతులకు ప్రసన్నులకండు. మమ్ము తగురీతిన పాలించండి. అన్నమూలమున పోషించండి. మమ్ము అభివృద్ధిపరచండి.

6. మరుద్గణములారా ! మీరు స్తుతులయి హవిని ఆరగించండి. మీరు నేతలు. సకల జలసహితులై విరాజిల్లినారు. మా సంతానమునకు జలము అందించండి. హవ్యదాతకు సత్యము ప్రియమగు ధనము ఇవ్వండి *"జిగృత రాయః సూనృతా మఘాని"*

7. మరుద్గణములు స్తుతులయి, సకల రక్షణ సహితులై, యజ్ఞమున స్తోత్రముందు అవతరించవలెను. వారు స్వయముగా స్తోతలను పుత్ర, మిత్ర, పరిచారణాదులతో శత సంఖ్యాకులను చేయుదురు. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## ఏబది ఎనిమిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. స్తోతలారా ! వర్షము నిచ్చు మరుద్గణములను సర్వదా పూజించండి. వారు స్వర్గమునందు అందరిని మించిన బుద్ధికుశలురు. తమ మహిమతో వారు ద్యావాపృథ్వులను భగ్నము చేయుదురు. భూమి, అంతరిక్షమునుండి స్వర్గమును వ్యాపించ చేయుదురు.

2. మరుత్తులారా ! మీరు భయంకరులు. ప్రవృద్ధ బుద్ధులు. గమనశీలురు. మీకు దీప్తుడగు రుద్రుడు జన్మనిచ్చినాడు. మీరు తేజము, బలమును ప్రభావ శాలురయినారు. మీ గమనమునకు సూర్యుని చూడగల సమస్తప్రాణిజాలము భయపడును.

3. మరుత్తులారా ! మీరు హవ్యయుక్తునకు చాల అన్నము ఇవ్వండి. అందములగు మా స్తోత్రములను స్వీకరించండి. మీరు పయనించిన మార్గమున ప్రాణిజాలమునకు హానికలుగదు. మీరు మమ్ము అభిలషణీయ రక్షణలతో పెంపొందించండి.

4. మరుత్తులారా ! మీరు రక్షించిన స్తోత శత సంఖ్యాక ధనవంతుడగును. మీరు రక్షించిన స్తోత ఆక్రమణకారి శత్రువును అణచి సహస్ర ధనవంతుడగును. మీరు రక్షించినవాడు సామ్రాట్టు శత్రునాశకుడగును. మీరు ఇచ్చిన ధనము మరింత పెరగవలెను.

5. కోటికలు తీర్చుమరుత్తులను నేను సేవింతును. వారు మరల మరల ఎన్నోమార్లు మాముందుకు రావలెను. ఏ ప్రకటిత, అప్రకటిత పాపమున మరుద్గణములకు కోపము కలుగునో, అట్టి పాపములను మరుత్తులను స్తుతించి కడిగి వేతుము.

6. ధనవంతులగు మరుత్తుల శోభన స్తుతిని ఈ సూక్తమున చేసినాము. మరుద్గణములు ఈ సూక్తమును స్వీకరించవలెను. అభీష్ట వర్షక మరుత్తులు దూరమునుండియే శత్రువును వేరు చేయవలెను. *"యూయంపాత స్వస్తిభిః సదా నః"*

## ఏబది తొమ్మిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - రుద్ర - మరుత్తులు, ఛందస్సు - 1-6 బృహతి, 7,8 త్రిష్టుప్, 11 గాయత్రి, 12 అనుష్టుప్.

1. దేవతలారా ! స్తోతలను భయమునుండి రక్షించండి. అగ్ని, వరుణ, మిత్ర, ఆర్యమ, మరుత్తులారా ! మీరు సన్మార్గము నడిపించిన వానికి సుఖముల నివ్వండి.

2. దేవతలారా ! మీ రక్షణలో మీకు ప్రియదినమున యజ్ఞము చేయువాడును శత్రువును ఆక్రమించువాడును మిమ్ము అన్యస్థానములకు పోనీక హవ్యము ఇచ్చువాడును తన నివాసమును పెంచుకొనును.

3. నేను వసిష్ఠుడను. మీలో మందులను వదిలి స్తుతించను. అందరిని స్తుతింతును. మరుత్తులారా ! మీరు సోమాభిలాషులై, అందరు కలిసి మా సోమము అభిషుతముకాగా సోమపానము చేయండి.

4. నేతలారా ! మీరు, కోటిన కోర్కెలు తీర్చినవారిని మీ రక్షణలు యుద్ధమున కాపాడును. మీ అనుగ్రహ వృద్ధులు నవీనములై మా వద్దకు ఏతెంచవలెను. సోమపానాభిలాషులారా ! మీరు త్వరగారండి.

5. మరుత్తులారా ! మీ ధనములు పరస్పరము కలిసి ఉన్నవి. సోమరూప హవి భక్షణకుగాను చక్కగా విచ్చేయుడు. మీకు నేను హవి అందించుచున్నాము. మీరు వేరు చోటునకు వెళ్లవద్దు.

6. మరుత్తులారా ! మీరు మా కుశలపై ఆసీనులు కండు. కోరిన ధనములు ఇచ్చుటకు మావద్దకు విచ్చేయుడు. మీరు బాధించనివారై ఈ యజ్ఞమున మదకరసోమ రూప హవ్యమునుస్వాహా అని ఉన్మత్తులగుడు.

7. అంతర్హిత మరుత్తులారా ! మీ అవయవములను అలంకరించుకొని నీలవర్ణ హంసలవలె విచ్చేయండి. నా యజ్ఞమున ఆనందించి, సంతసించిన మానవులవలె విశ్వవ్యాప్త మరుద్గణములు నాచుట్టు చేరవలెను.

8. ప్రశంసనీయ మరుత్తులారా ! వికార క్రోధమున తిరస్కృతులైన మానవుడు మా మనసును నాశనము చేయగోరును. వాడు పాపి-ద్రోహి. వరుణదేవు పాశములతో మమ్ము బంధించతలచినాడు. వాడిని మీరు అత్యంత తాపకరమగు ఆయుధములతో నష్టపరచండి.

9. శత్రుతాపకులారా ! ఇదే మీ హవ్యము. మీరు శత్రుభక్షకులు. మీ రక్షణలతో హవిని స్వీకరించండి.

10. మరుత్తులారా ! మీరు గృహమునందును శుభప్రదాతలగుదురు. రక్షణలతో విచ్చేయండి. వెళ్లవద్దు.

11. మరుత్తులారా ! మీరు స్వయం ప్రవృత్తులు. క్రాంతదర్శులు. నేను యజ్ఞమును గురించి ఆలోచించుచున్నాను.

12. త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్ |
ఉర్వారుకమివ బంధనాన్మృత్యోర్ముక్షీయమామృతాత్ ||

మేము సుగంధియు, పుష్టివర్ధకుడగు త్ర్యంబకుని పూజింతుము. ఉర్వాక ఫలమువలె మృత్యుబంధనము నుండి విడిపించుము. అమృతము నుండి విడిపించకుము.

(సుగంధి ప్రసారితమగు పుణ్యకీర్తి. పుష్టి వర్ధనమ్ జగములకు బీజప్రాయము లేదా అణిమాది శక్తి వర్ధనము. త్ర్యంబకమ్ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల ఆదిస్థానము ఉర్వాకమ్ బదరీ ఫలము)

*(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఏడవ మండలము ఐదవ అష్టకమున నాల్గువ అధ్యాయము సమాప్తము.)*

**ఓం నతామినన్తిమాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదసీ అద్రుహా వేద్యాభిర్న పర్వతావి సమేత స్థివాంసః**

**అయిదవ అధ్యాయము ఆరువదవ సూక్తము**

ఋషి - వసిష్ఠుడు, దైవత - మైత్రావరుణులు ఛందస్సు - త్రిష్టుప్.

ఓం యదద్య సూర్యబ్రవో వాగా ఉద్యన్మిత్రాయవరుణాయ సత్యం
వయందేవతాది తేస్యామ తవ ప్రియావో ఆర్యవన్గృణాంతః

1. సూర్యా ! ఉదయించుము. నేడు అనుష్ఠాన కాలమున మమ్ము పాపరహితులను చేయుము. అదితీ ! దీనుడు కానట్టి నీవు మా దేవతలలలో మిత్రావరుణులవద్ద సత్యము వగుము. అర్యమన్! దాతా నిన్ను స్తుతించి మేము నీకు

ప్రీతిపాత్రులము అగుదుము.

2. మిత్రావరుణులారా ! ఇతడు మానవ దర్శనీయుడు సూర్యుడు. అతడు అంతరిక్షమున సాగును. ద్యావాపృథ్వుల కొఱకు ఉదయించును. అతడు సమస్త స్థావర జంగమాత్మక జగములకు పోషకుడు. మానవుల పుణ్యపాపములను వీక్షించును.

3. మిత్రావరుణులారా ! సూర్యుడు అంతరిక్షమున ఏడు హరితవర్ణ అశ్వములను తన రథమున కట్టినాడు. ఆ ఏడు జలదాతలయి సూర్యుని తీసికొని సాగును. గోపాలుడు గోసమూహములను కాపాడినట్లు సూర్యుడు ఉదయించి లోకమునందలి ప్రదేశములను ప్రాణులను కాపాడును.

4. మిత్రావరుణులారా ! మీ కొఱకు అన్నము, మధుర పురోడాశము ఉన్నవి. సూర్యుడు దీప్తమగు అంతరిక్షమునకు ఎక్కును. సమాన ప్రీతిగల మిత్ర, ఆర్యమ, వరుణాదులు సూర్యునకు మార్గము కలిగింతురు.

5. మిత్రావరుణులు ఆర్యమ పాపనాశకులు. వారు అహింసక, సుఖకర అదితికి పుత్రులు వారు యజ్ఞ గృహమున పెంపొందుదురు.

6. ఆదిత్యుడు. మిత్రుడు, వరుణుడు ఈ ముప్వునిరిని లొంగదీయగలవాడు లేడు. వారు ఆజ్ఞానులను జ్ఞానవంతులను చేయుదురు. వారు ఉత్తమ జ్ఞానవంతుల కర్మానుష్ఠానవంతులవద్దకు వెళ్లి వారి దుష్కృతములను తుడిచివేసి మమ్ము మంచి దారిన తీసికొని వెళ్లుదురు.

7. వీరు అనిమిషులై ద్యులోక భూలోకములందలి ఆజ్ఞానులను కర్మపరులను చేయుదురు. సామర్థ్యమున దిగువ దేశములందు సహితము నదుల జలము లభించును. వారు మమ్ము వ్యాపక కర్మమును దాటించవలెను.

8. ఆర్యమ, మిత్రావరుణులు రక్షణలు కలిగించిన హవ్యదాతకు సుఖములు కలిగింతురు. హవ్యదాత పుత్రపౌత్రులకు సహితము సుఖములు కలిగింతురు. మేము శీఘ్రకారి దేవతలకు కోపము కలిగించు పనులు చేయకుండవలెను.

9. మా యజ్ఞవేదిమీద మమ్ము ద్వేషించువారు దేవతలను స్తుతించనివారు ఉందురు. వరుణుడు వారిని నష్టపరచవలెను. ఆర్యమ మమ్ము రాక్షసాదులనుంచి వేరుచేయవలెను. కోఱికలు తీర్చు మిత్రావరుణులు హవ్యదాతలగు నాకు విశాల ప్రదేశము నివ్వవలెను.

10. ఈ మిత్రాదుల స్నేహము గుప్తము, దీప్తము. వీరు గుప్తబలమున మమ్ము ద్వేషించువారిని ఓడింతురు. మిత్రాది దేవతలారా ! మీ భయమున మా విరోధులు గడగడలాడుదురు. మీ బలమహిమతో మమ్ము సుఖవంతులను

చేయండి.

11. అన్నము ఉత్తమ ధనము దానము చేయునట్టి యజమాని మిమ్ము స్తుతించు స్తోత్రములకు తన బుద్ధిని జోడించినపుడు మఘవాదులు ఆ స్తోత స్తుతులను ఆశ్రయిస్తారు. అట్టివాని కొరకు సుందరగృహము ఏర్పరుస్తారు.

12. మిత్రావరుణులారా ! మీ ఉభయుల యజ్ఞమున ఈ స్తుతి ఉచ్చరించబడినది. దీనిని స్వీకరించండి. త్వరత్వరగా మా విపత్తులను దూరము చేయండి. మమ్ము దరికి చేర్చండి.

## అరువది ఒకటవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దైవత - మిత్రావరుణులు ఛందస్సు - త్రిష్టుప్.

1. మిత్రావరుణులారా ! మీరు ప్రకాశవంతులు. సూర్యుడు మీ నేత్ర స్వరూపుడు. శోభన రూపములవాడు. అతడు తన వెలుగులు పెంచుచు. ఆకసమున ఎగబాకును. సూర్యుడు సమస్త భువనములను వీక్షించును. అతడు మానవులందు ఉండు స్తోత్రములను తెలియును.

2. వశిష్ఠుడు యాజ్ఞికుడు విప్రుడు చిరశ్రోత. మిత్రవరుణులారా ! అట్టి వసిష్ఠుడు మీ కొఱకు పూజనీయ స్తుతులు రచించినాడు. మీరు శోభన కర్ములు. వసిష్ఠుని స్తోత్రములను రక్షింతురు. మీరు కలకాలమగా వసిష్ఠుని కర్మములను పూరించుచున్నారు.

3. మిత్రావరుణులారా ! మీరు విశాలభూమిని పరిక్రమించినారు. గుణ, రూపములందు విశాలమగు ద్యులోకమును చుట్టివచ్చినారు. ఓషధులు ప్రజలకొఱకు విభిన్న రూపములు దాల్తురు. నిర్నిమేష భావమున సన్మార్గగామిని పాలింతురు.

4. ఋషీ ! నీవు మిత్రావరుణులను స్తుతించుము. తమ మహిమతోను మిత్రావరుణులను స్తుతించుము. తమ మహిమతోను మిత్రావరుణుల బలమువలనను ద్యావాపృథ్వులు విడివిడిగా ఉన్నవి. యజ్ఞము చేయనివారి మానములు పుత్రరహితములై గడువవలెను. యజ్ఞవృద్ధి మానవ వృద్ధికి కావలెను.

5. మిత్రావరుణులు వ్యాపకులు. కోటికలు తీర్చువారు. ప్రాజ్ఞుడా ! నీవు వారిని స్తుతించినావు. ఆశ్చర్యకరమగు నీ స్తుతికి చకితులైన మిత్రావరుణులు వారి యజ్ఞమును, పూజను ఎరుగలేకున్నారు. ద్రోహులగు జనులు మిథ్యాస్తుతులను సేవింతురు. మీ ఉభయులకొఱకు చేయబడిన స్తుతులు అజ్ఞానకారకములుకారాదు.

6. మిత్రావరుణులారా ! మీ ఉభయుల యజ్ఞమున ఈ స్తుతి ఉచ్చరించబడినది. దీనిని స్వీకరించండి. త్వరత్వరగా మా విపత్తులను దూరము చేయండి. మమ్ము దరికి చేర్చండి.

## అరువది రెండవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - సూర్యుడు - మిత్రావరుణులు ఛందస్సు - త్రిష్టుప్.

1. సూర్యుడు, అత్యధికమగు తేజమున ఊర్ధ్వముఖుడై వెలుగవలెను. మానవులందరకు ఆశ్రయము ఇవ్వవలెను. అతడు పగలు అందకాడై ఒకేరూపమున దర్శనమిచ్చును. సర్వకర్త, కృతప్రజాపతినుండి సూర్యుడు వెలుగులు అందుకొనును.

2. సూర్యా ! నీవు స్తుతుడవై, హరితవర్ణ, గమనశీల అశ్వములపై ఊర్ధ్వముఖుడవగుము. మాముందునకు విచ్చేయుము. మిత్ర, వరుణ, ఆర్యమ, అగ్నిముందు మమ్ము నిరపరాధులనుగా చెప్పుము.

3. వరుణ, మిత్రాగ్నులు దుఃఖనివారకులు సత్యవంతులు ప్రసన్నతా దాయకులు. వారు మాకు వేలకొలది ధనములను ఇవ్వవలెను. స్తుతింపదగినవియు పూజనీయములగు పదార్థలీయవలెను. మా స్తుతులను అందుకొని మా కోటికలు తీర్చవలెను.

4. మహా ద్యావాపృథ్వులారా ! మమ్ము రక్షించండి. మేము మంచి జన్మలవారలము. మిమ్ము ఎరుంగుదుము. మేము వరుణుని వాయువుయొక్క మానవుల ప్రియతముడగు మిత్రుని క్రోధమున పడరాదు.

5. మిత్రావరుణులారా ! మీ బాహువులు చాచండి, మేము బ్రతుకుటగాను గోమార్గ భూమిని నీటితో తడపండి. మానవులందు మమ్ము విఖ్యాతులను చేయండి. మీరు సత్య తరుణులు. మా పిలుపు వినండి.

6. మిత్రావరుణ ఆర్యయలారా ! మా కొఱకును, మా పుత్రులకును ధనము ప్రదానము చేయండి. మేము చేరవలసిన దారులన్నియు సుగమములు కావలెను. *"యూయంపాతస్వస్తిభిః సదానః"*

## అరువది మూడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - సూర్యుడు - మిత్రావరుణులు ఛందస్సు - త్రిష్టుప్.

1. మిత్రావరుణులు శోభన భాగ్యులు. సర్వదర్శకులు. సమస్త మానవులకు సాధారణులు. వారికి నేత్రరూపుడు, ప్రకాశమానుడగు సూర్యుడు ఉదయించుచున్నాడు. సూర్యుని చర్మమువంటి అంధకారమును సంవేష్టించును.

2. సూర్యుడు మానవులకు ఉత్పాదకుడు. మహామహుడు. సర్వసూచకుడు. అతడు ఒకే ఒక చక్రమును త్రిప్పుటకు ఉదయించును. రథమునకు కట్టిన హరిత అశ్వములు అతనిని మోయును.

3. అత్యంత ప్రకాశమానుడగు సూర్యుడు స్తోతల స్తోత్రముల వినుటలో ఉన్మత్తుడై ఉషలమధ్య ఉదయించును. అతడు మాకు కోటిన పదార్థములు ఇచ్చును. అతడు సర్వసముడు. తన తేజమును సంకుచితము చేయడు.

4. దూరగామి, త్రాత, దీప్తిమంతుడగు సూర్యుడు శుభంకరుడై, బహుతేజవంతుడై అంతరిక్షమున ఉదయించును. జీవులన్నియు సూర్యునినుండియే ఉత్పన్నములగును. కర్తవ్య కర్మలు నిర్వహించును.

5. అమరులగు దేవతలు సూర్యుని కొరకు మార్గముపరచినారు. అది గతిపారాయణమగు గ్రద్దవలె అంతరిక్షమున సాగును. మిత్రావరుణులారా ! సూర్యోదయమైనది. ప్రాతస్సవనమున మీకు నమస్కరించి, హవ్యములందించి మిమ్ము సేవింతుము.

6. మిత్రావరుణ ఆర్యములారా ! మాకు, మా పుత్రులకు ధనము ప్రదానము చేయండి. మేము సాగవలసిన మార్గములను సుగమములు చేయండి. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## అరువది నాలుగవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - మిత్రావరుణులు ఛందస్సు - త్రిష్టుప్.

1. మిత్రావరుణులారా ! మీరు ద్యులోక భూలోకములందు జలములకు స్వాములు. మీరే మేఘములకు జలరూపము కలిగింతురు. మిత్రుడు, సుజన్మ ఆర్యమ రాజు, బలివరుణుడు మా హవ్యమును స్వీకరించవలెను.

2. మీరు రాజులు. మహా యజ్ఞరక్షకులు. సింధుపతులు. వీరులు. మావద్దకు విచ్చేయండి. శీఘ్రదాతలగు మిత్రావరుణులారా ! అంతరిక్షమునుండి మాకు అన్నము వర్షము పంపండి.

3. మిత్రావరుణులు, ఆర్యమ ఉత్తమ మార్గమున మమ్ము నడిపించవలెను. ఆర్యమ మంచిదాతకు మా కథ వినిపించవలెను. మీ రక్షణలందు మేము అన్నవంతులమై, పుత్రపౌత్రాదుల సహితులమై ప్రమత్తులముకావలెను.

4. మిత్రావరుణులారా ! మీరు రాజులు. మనసు లగ్నముచేసి మీకొఱకు ఈ రథము నిర్మించినవారికి, ఉత్తమ కర్మలు చేసినవానికి, యజ్ఞమున మిమ్ము స్మరించువానికి జలమును, అందమగు నివాసమున ఇచ్చి సంతృప్తుని చేయండి.

5. మిత్రావరుణులారా ! మీ కొఱకుగాను వాయువు కొఱకును దీప్తమగు సోమమువంటి సోమము సిద్ధమైనది. మీరు మా కర్మములందు ప్రవేశించండి. మా స్తుతులకు గమనించండి. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## అరువది ఐదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - మిత్రావరుణులు ఛందస్సు - త్రిష్టుప్.

1. మిత్ర, శుద్ధ బల వరుణులారా ! సూర్యోదయముకాగా మీ ఉభయులను నేను స్తుతులతో ఆహ్వానింతును. మీ బలము అక్షయము ప్రరము. యుద్ధము జరిగినపుడు మీరు విజయ వంతులగుదురు.

2. వారిద్దరు దేవతలలో అసురులు బలవంతులు. ఆర్యులు అందరకు ప్రభువులు.

మిత్రావరుణులారా ! మేము మిమ్ము వాపింప చేయుదుము. మీ వ్యాపకతలో ద్యావాపృథ్వులు, రాత్రింబవళ్ళు మమ్ము ఆప్యాయితులను చేయును.

3. మిత్రావరుణుల వద్ద అనేక పాశములు ఉన్నవి యజ్ఞము చేయనివారిని అబద్ధములాడు వారిని వారు ఆ పాశములతో బంధింతురు. వారు శత్రువులకు దురతిక్రములు. వారు మమ్ము పడవతో నదిని దాటించినట్లు యజ్ఞమార్గమున పాపములనుండి దాటింతురు.

4. మిత్రావరుణులారా ! మా హవ్యము స్వీకరించుటకు విచ్చేయండి. అన్న సహితముగా మా గోచర భూమిని జలసిక్తము చేయండి. ఈ జగములందు మీకు ఉత్కృష్ట హవ్యము ఇవ్వగలవాడు ఉన్నాడా? మీరు లోకములకు స్వర్గీయము, రమణీయమగు జలమును ప్రసాదించండి.

5. మిత్రావరుణులారా ! మీకొఱకును, వాయువు కొఱకును దీప్తమగు సోమమువంటి సోమము సిద్ధమైనది. మీరు మా కర్మములందు ప్రవేశించండి. మా స్తుతులను గమనించండి. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## అరువది ఆరవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - మిత్రావరుణులు - సూర్యుడు ఛందస్సు - వివిధము.

1. మరల మరల ఆవిర్భవించు మిత్రావరుణుల సుఖకర, అన్నవంత సూక్తము సాగుచుండవలెను.

2. శోభనబలవంతులు, బలముల రక్షకుల, విశిష్ట తేజోవంతులగు మిత్రావరుణుల బలములకొఱకు దేవతలు నిలిచినారు.

3. మిత్రావరుణులారా ! మీరు గృహములను, దేహములను పాలించువారు. మీరు స్తోతల కర్మరూప స్తోత్రములను సఫలము చేయండి.

4. మిత్ర, సవిత, ఆర్యమ, భగులారా ! మీరు పాప నాశకులు. సూర్యోదయమైనంతమీరు, నేడు, మాకొఱకు, అపేక్షిత ధనమునుపంపండి.

5. శోభన దాన పారాయణులారా ! మా పాపములను దూరము చేయండి. మీరు చేరిన ఇల్లు సురక్షితము అగుగాత.

6. మిత్రాదులు అదితి అహింసక వ్రతములకు ఈశ్వరులు. వారు మహాధనములకు కూడ ఈశ్వరులు.

7. సూర్యోదయమైనంత మిత్రావరుణులను శత్రుభక్షక ఆర్యమను నేను నుతింతును.

8. ఈ స్తుతి హితకరము. రమణీయమగు ధనముతో పాటు మాకు అహింసనీయబలము నీయవలెను.

9. మిత్రావరుణులారా ! ఋత్విక్కులతో కలిసి మేము మీ స్తోతల మగుదుము. మేము ధనము, బలము సహితము దాల్చెదము.

10. మిత్రాదులు మహాసూర్యునివలె దీప్తులు అగ్ని జిహ్వలు యజ్ఞవర్ధకులు వీరులయి విశాలప్రదేశములను ప్రదానము చేస్తారు.

11. మిత్రావరుణ ఆర్యములు సంవత్సరములు, మాసములు, దినములు, రాత్రులు, మంత్రములను ఏర్పరచినారు. ఆరు శోభాయమానులై ఏ ఇతరులకు లేనంతటి బలము కలవారైనారు.

12. మిత్రావరుణ ఆర్యములారా ! నేడు సూర్యోదయమైనంత సూక్తములతో మిమ్ము స్తుతింతుము. నీ వద్ద ఉన్న

ధనమును యాచింతుము.

13. నేతలారా ! మీరు ఋతవంతులు ఋతజాతలు ఋతవర్ధకులు. భయానకులు ఋతహీనుల ద్వేషులు మీవద్ద సుఖములనిచ్చు ధనము ఉన్నది. దానికి ఇతర ఋత్విక్కుల సహితముగా మేము హక్కుదారులము అగుదుము.

14. అది దర్శనీయ మండలము. అది అంతరిక్ష సమీపమున ఉదయించుము. హరితవర్ణ, శీఘ్రగామి అశ్వములు ఆ మండలమును వహించును. అందరకు దర్శనము చేయించును.

15. సూర్యుడు శీర్షములకు శీర్షము. సకల స్థావరజంగమా భర్త. రథారోహి, పిడు శీఘ్రగామి, హరితవర్ణలు లోక కళ్యాణమునకుగాను సమస్త జగములముందుకు సూర్యుని తెచ్చును.

16. అతడు నేత్రము వంటివాడు. దేవతల హితముకోరువాడు. నిర్మలుడు. సూర్యమండలమున ఉదయించుచున్నాడు. మేము నూరేళ్లు చూడవలెను. నూరేళ్లు జీవించవలెను. *"పశ్యేమ శరదః శతం జీవేమ శరదః శతమ్".*

(నూరేళ్లు జీవించటం మాత్రంచాలదు. నూరేళ్లు కన్నులుండి జీవించవలె అవయములన్నియు చక్కగా ఉండి జీవించవలెనను ఆశయము)

17. మిత్రావరుణులారా ! మీరు అహింసనీయులు. ద్యుతిమంతులు. మా స్తోత్రములు వినుడు.సోమపానమునకు విచ్చేయుడు.

18. మిత్రావరుణులారా ! మీరు ద్రోహరహితులు. మీరు ద్యులోకము నుండి రారండి. శత్రువును హింసించండి. సోమపానము చేయండి.

19. మిత్రావరుణులారా ! మీరు యజ్ఞ నేతలు. ఆహుతులు సేవించండి. యజ్ఞవర్ధకులు కండి, సోమపానము చేయండి.

## అరువది ఏడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అశ్వినులు ఛందస్సు - త్రిష్టుప్.

1. అశ్వినులారా ! మేము హవ్యయుక్త స్తోత్రములతో మీ రథమును స్తుతించుచున్నాము కొడుకు తండ్రిని లేపినట్లు

మీ రథము దూతవలె జగములను లేపును. ఆ రథమే మా ముందుకు రావలెనని పిలుచుచున్నాను.

2. మేము సమిధలు అర్పింతుము. అగ్ని ప్రజ్వరిల్లును. అప్పుడు చీకటిచోట్లనుకూడ జనులు చూడగలరు. సూర్యుడు ప్రజ్ఞాపకుడు. అతడు ద్యులోకదుహిత ఉషయొక్క పూర్వదిశన అందములు సంతరించుకొని ఉదయించును. అప్పుడు అందరు అతనిని తెలిసికొందురు.

3. నా సత్యద్వయమా ! సుందరహోత, స్తుతివక్త, స్తోమముతో మేము మిమ్ము సేవింతుము. స్తోత్ర ఫల స్వరూపులై మీరు పూర్వ మార్గమున జలజ్ఞాత ధనయుక్త రథమున మాముందు అవతరించండి.

4. అశ్విద్వయమా ! మీరు రక్షకులు, మధుర సోమయోగ్యులు. సోమాభిషవమైనంత, మిమ్ము కోటి, ధనాభిలాషినై, నేను మిమ్ము స్తుతింతుము. మీ ప్రవృద్ధ అశ్వము నిన్ను తీసికొనిరావలెను. మీరు మధురసోమము ఆరగించవలెను.

5. అశ్వినులారా ! మాబుద్ధి, ధనాభిలాషిణి సరళ హింస ఎరుగనిది. దానిని లాభయోగ్యము చేయండి. యుద్ధమునందును మా బుద్ధిని రక్షించండి. మాకు కర్మ మూలమగు ధనమును ప్రసాదించండి.

6. అశ్వినులారా ! మా కార్యములందు మీరు మమ్ము రక్షించండి. మా వీర్యము క్షీణించరాదు. పుత్రోత్పాదక సమర్థముకావలెను. మాపుత్ర, పౌత్రులను అనుగ్రహించండి. వారు కోటిన ధనము ప్రసాదించండి. మేము ధనవంతులమై యజ్ఞములు దర్శించుచుందుము.

7. మధుప్రియ అశ్వినీకుమారులారా ! మిత్రుని కొఱకుగాను దూత ముందుగా వెళ్లినట్లు మేము సంకల్పించిన సోమము నిధిస్వరూపమున మీముందు సమర్పించబడినది. కావున క్రోధశూన్య చిత్తమున మాముందుకు ఏతెంచండి. మానవరూప ప్రజల హవిని ఆరగించండి.

8. అందరిని పోషించు అశ్వినీ ద్వయమా ! మీరు ఇద్దరు కలిసినంత మీ రథము ఏడు ఏరులు దాటివచ్చును. మీ అశ్వములు సుజన్మలు దేవసంపన్నులు. అవి మిమ్ము మోయును. మీ రథములాగును. కాని అలసట ఎరుగవు.

9. మీరు ఆసక్తి రహితులు. ఏ ధనవంతుడు. ధనము కొఱకు, దాతవ్య హవ్యము అర్పించునో, ఎవడు మిత్రుని సత్యవచనములతో వర్థిల్లచేయునో, ఎవడు గోవులు, అశ్వములు, ధనము దానము చేయునో అట్టివారి కొఱకే మీరు కలిగినారు.

10. మీరు నేడు మా పిలుపు ఆలకించండి, నిత్యతరుణ అశ్విద్వయమా ! మీరు హవ్యవంత గృహమునకు విచ్చేయండి. రత్నములిచ్చి స్తోతలను వర్థిల్ల చేయండి. *"యూయంపాత స్వస్తిభిః సదానః"*

## అరువది ఎనిమిదవ సూక్తము

ఋషి - వశిష్ఠుడు, దేవత - అశ్వినులు ఛందస్సు - 1-7 విరాజము, 8,9 త్రిష్టుప్.

1. దీప్తివంతులు, అశ్వవంతులగు అశ్వినులారా ! రండి. మీరు శత్రుహంతలు. మీ భక్తుల స్తుతులను స్వీకరించండి. మేము అర్పించు హవ్యమును ఆరగించండి.

2. అశ్వినులారా ! మీ కొఱకు మాదక సోమము సిద్ధముగా ఉన్నది. మా హవ్యము అందుకొనుటకు త్వరత్వరగారండి. మా శత్రువు పిలుపును వినిపించుకోక మా పిలుపు వినండి.

3. అశ్వినులారా ! మీరు రథమున సూర్యపుత్రి సహితులై ఉందురు. మీ రథము మనోవేగము గలది. అపార రక్షణలున్నది. మేము మీ రథమును ప్రార్థింతుము. అది సకల లోకములను వదిలి మా యజ్ఞమునకే వచ్చును.

4. నేను మిమ్ము దేవతలుగా ప్రతిష్ఠించదలచినప్పుడు సోమాభిషవమునకు అభిషవ శిలలు గంభీర ధ్వనిచేయునప్పుడు అప్పుడు విప్రులు మిమ్ము హవ్యములిచ్చి ఆహ్వానింతురు.

5. మీవద్ద చిత్రవిచిత్రమగు ధనమున్నది. అది మాకు అందించండి. మీకు ప్రియులై, మీరు అందించిన సుఖములు అనుభవించువారిని విపత్తులనుండి విడదీయండి.

6. అశ్వినులారా ! చ్యవనుడు వృద్ధుడు. మీకు హవి సమర్పించువాడు. అతనికొఱకు మీరు మృత్యువువద్ద నుండి ఒక రూపము తెచ్చి ఇచ్చినారు. ఆ రూపమే అతనిని దాల్చినది.

(వృద్ధుడగు చ్యవనుని అశ్వినులు యువకుని చేసినారనునది ప్రసిద్ధగాథ చ్యవన ప్రాశ మను ఔషధమును ఈ చ్యవనుని పేరిటిదే)

7. దుష్టులగు మిత్రులు భుజ్యుని సముద్ర మధ్యమున వదలినారు. మీరు అతనిని దరికి చేర్చినారు. భుజ్యుడు మిమ్ము ప్రార్థించినాడు. ఎన్నడు విరుద్ధా చరణము చేయలేరు.

(భుజ్యుడు లాహానయన వంశజుడు యాజ్ఞ వల్క్యుని సమకాలికుడని బృహదారణ్యక ఉపనిషత్తులో చెప్పబడింది.)

8. అశ్వినులారా ! వృకమహర్షి క్షీణించినపుడు మీరు మీ సామర్థ్యమున అతనికి ధనము ఇచ్చినారు. శయు మహర్షి మిమ్ము పిలువగా మీరు అతని పిలుపు విన్నారు. నదులను జలములు నింపినట్లు అతని ముసలి ఆవును పాడి ఆవును

చేసినారు.

(వృకుడు వృక విధ్వంసుకుడు కావచ్చును. వృకనామక ఋషికావచ్చును. వృకధ్వరస్ వ్యతిరేకముగ యుద్ధము జరిగినది. ఇతడు ఇరాన్ దేశపువాడని హిలెబ్రాంట్ అభిప్రాయము.

శయునకు చెందిన ముసలి ఆవును అశ్వినులు పాలిచ్చు ఆవును చేసినారని వృత్తాంతము.)

9. స్తోత వసిష్ఠుడు నిర్మల మనస్కుడై ఉష కన్న ముందు మేల్కొని సూక్తములతో స్తుతించును. అతని అన్నమును వర్ధిల్లచేయండి. అతని పాడిని వర్ధిల్ల చేయండి. అతని గోవులను వర్ధిల్ల చేయండి. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## అరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అశ్వినులు ఛందస్సు - త్రిష్టుప్.

1. తరుణ అశ్వినులతో రథము రావలెను. ఆ రథము హిరణ్మయము. ద్యావాపృథ్వులందు రక్షించునది. దాని చక్రములందు జలమున్నది. ఇరుసున వెలుగున్నది. అది అన్నవాహకము - యజమానులకు స్వామి.

2. ఆ రథము పంచభూతములను ప్రసిద్ధముచేయు మూడు బంధురములు ఆసనములు కలది. అది స్తుతి యుక్తము. అశ్విద్వయమా ! మీరు ఈ రథముపై మీరు కోటినచోటికి దేవాభిలాష యజ్ఞమునకు వెళ్లండి.

3. సుందర అశ్వములను విశేష అన్నమును తీసికొని మా వద్దకు రండి. మీరు మధుమంతనిధి సోమమును పానము చేయండి. మీ రథము సూర్యగమనము కలది. దాని చక్రములు వేగమునకు ద్యులోకము అణగిపోవును.

4. రాత్రిళ్లు సూర్యపుత్రి మీ రథమును అలముకొనును. మీరు దేవాభిలాషిని కర్మద్వారా రక్షించినపుడు రక్షణకు అవసరమైన దీప్తివంతమగు అన్నము మీవద్దకు చేరును.

5. రథవంతులగు అశ్విద్వయమా ! మీ రథము వెలుగులు కప్పుకొనును. అశ్వములకూడి పయనించును. ఉషోదయమున ఆ రథమున మావద్దకు రండి. పాపములను వదిలించండి. సుఖములను కలిగించండి.

6. అశ్విద్వయమా ! గౌరామృగివలె విశేష దీప్యమాన సోమము సేవించగోరి మా యజ్ఞమునకు రావలసినది. అనేక యజ్ఞములందు యజమానులు మిమ్ము ఆహ్వానింతురు. కావున అన్యదేవాభిలాషులు మిమ్ము కోరరాదు.

7. అశ్వినులారా ! సముద్రమున మునిగిన భుజ్యుని అక్షత అశ్రాంత, శీఘ్రగామి, అశ్వములు మఱియు మీ కార్యనైపుణ్యమున జలములు దాటించి రక్షించినారు.

8. సదాతరుణ అశ్వినులారా ! నేడు మా ఆహ్వానములు వినండి. హవ్యవంత గృహమునకు విచ్చేయండి. రత్నములందించి స్తోతను వర్ధిల్ల చేయండి. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## డెబ్బదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అశ్వినులు ఛందస్సు - త్రిష్టుప్.

1. అశ్వినులారా ! మీరు అందరి వరణీయులు. మా యజ్ఞ వేదికపైకి రండి. భూమి మీద ఇదే మీస్థానమని చెప్పుదురు. మీరు ఆసీనులగు అశ్వపు వీపు సుఖప్రదము కావలెను. మీ గుఱ్ఱము ఎల్లప్పుడు మీ వద్దనే ఉండవలెను.

2. ఈ స్తుతి అత్యంత అన్నవంతము. సుందరము. ఇది మిమ్ము సేవించును. మానవ యజ్ఞగృహమున ధూపము నిండి ఉన్నది. అది మీకు లభించును. అది ఒక ధామము. అది జలము, సముద్రములతో నిండును. రథమున అశ్వములను పూన్చినట్లు యజ్ఞమున మిమ్ము పూన్చబడును.

3. అశ్వినులారా ! మీరు ద్యులోకమునుండి వచ్చెదరు. ఓషధులు, జనులమధ్య స్థానము ఏర్పరచుకొందురు. పర్వత శిఖరమున కూర్చుందురు. అన్నదాతకు ఆచోటు ఇవ్వండి.

4. దేవద్వయమా ! ఋషులు ఏర్పరచిన ఓషధులు, జలములను మీరు వ్యాపింప చేయుదురు. అందువలన మీరు ఓషధులను చరుపురోడాశాదులను, జలమును సోమరసమును కోరండి. మాకు బహురత్న దానము చేయండి. మీరు పూర్వదంపతులను అట్లే ఆకర్షించినారు.

5. అశ్వినులారా ! మీరు శ్రుతిమంతులు. అనేకములు విన్నవారు. ఋషులు అనేక కర్మములను దర్శించినారు. మీరు యజమాని యజ్ఞమునకు విచ్చేయండి. మాకు మీ అత్యంత అన్నపూర్ణ అనుగ్రహము కావలెను.

6. నా సత్యద్వయమా ! హవ్యయుక్తుడు, కృతస్తోత్రుడు, మానవులతో కలిసి ఉండు వసిష్ఠుని వద్దకు విచ్చేయండి. ఆ స్తోత్రములన్నియు మిమ్ములనే స్తుతించును.

7. అశ్వినిద్వయమా ! ఈ స్తుతియు ఈ వచనమును మావియే. ఈ శోభన స్తుతులను స్వీకరించండి. సకల కర్మలు

మిమ్ము కోఅవలెను. *"యూయంపాతస్వస్తిభిః సదానః"*

(ఆంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ మండలము ఐదవ అష్టకమున నాలుగవ అనువాకము సమాప్తము.)

**అయిదవ అనువాకము డెబ్బది ఒకటవ సూక్తము**

ఋషి - వసిష్ఠుడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. రాత్రి తన సోదరి ఉషనుండి స్వయముగనే తొలగిపోవును. నల్లనిరేయి ఎర్రని సూర్యునకు దారి ఇచ్చును. అందువలన అశ్వధన, గోధన అశ్వినులారా ! మిమ్ము మేము పిలుచుచున్నాము. రాత్రింబవళ్లు మావద్దనుండి హింసకులను దూరము చేయండి.

2. అశ్వినిద్వయమా ! హవ్యదాతకు రథమున రమణీయ పదార్థములు తీసికొనిరండు. అన్న దారిద్ర్యమును, వ్యాధులను దూరము చేయండి. మమ్ము రాత్రింబవళ్లు రక్షించండి.

3. మీ రథము అనాయాసముగ జోడించబడిన కోర్కెలు తీర్చు అశ్వములు మిమ్ము తీసికొని రావలెను. రశ్మివంతము, ధనవంతమగు రథమును జలదాతలగు అశ్వములతో లాగించండి.

4. యజమానుల పాలకులారా ! మీరు ఎక్కు రథము మూడు ఆసనములు గలది. ధనవతి, దినమును పట్టిసాగునది. వ్యాపించి అరుగునది. అట్టి రథము మీదనే మీరు మావద్దకు రావలెను.

5. మీరు చ్యవనుని ముసలితనము వదిలించినారు. పేరునామక రాజు కొఅకు యుద్ధమున వడిగల గుఱ్ఱమునంపినారు. అత్రి, అంధకారమును పాపమును దూరము చేసినారు. భ్రష్ట రాజ్యుడయిన జాహుషునకు తిరిగి రాజ్యము ఇప్పించినారు.

6. అశ్వనిద్వయమా ! ఈ స్తుతియు ఈ వచనమును మీదియే. ఈ శోభన స్తుతులను స్వీకరించండి. సకల కర్మలు మిమ్ము కోఅవలెను. మీతో సంగతము కావలెను. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

**డెబ్బది రెండవ సూక్తము**

ఋషి - వసిష్ఠుడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. నా సత్యద్వయమా ! మీరు గోవులు, అశ్వములు, ధనముతోకూడిన రథముపై రాగలరు. అనేక స్తుతులు మిమ్ము సేవించును. మీరు అభిలషణీయ శోభ మఱియు దేహముతో దీపించండి.

2. నా సత్యద్వయమా ! మీరు దేవతలలో సమానప్రీతి యుక్తులయి రథమునెక్కి విచ్చేయండి. మీతో మా బంధుత్వము పూర్వజులనుండి కొనసాగుచున్నది. మీకు మాకు ఒకరే బంధువులు పితామహులు. వారి ధనము సహితము ఒక్కటే.

(వివస్వతుని నుంచి వరుణుడు, అశ్వినులు కలిగినారు. వసిష్ఠుడు వరుణ సంబంధి. అందువలన బంధుత్వము వివస్వతుడు ఉభయులకు పితామహుడు)

3. అశ్వినులకు స్తుతులు జాగృతులను చేయును. బంధుస్థానీయములగు సకల కర్మలు ప్రకాశమాన ఉషను జాగృతము చేయును. మేధావి వసిష్ఠుడు స్తుతులతో ద్యావాపృథ్వులను సేవించును. అశ్వినుల ముందు స్తుతులు చదువును.

4. అశ్విద్వయమా ! ఉషస్సు అంధకారమును తొలగించగా స్తోతలు విశేషరూపమున నిన్ను స్తుతింతురు. సవిత ఊర్ధ్వతేజమును ఆశ్రయించును. సమిధలతో అగ్ని స్తుతించబడును.

5. నా సత్యద్వయమా ! తూర్పు, పడమర, దక్షిణ, ఉత్తర దిశలనుండి రండి. రారండి. పంచజనులకు హితవు కలిగించు సంపద తీసికొని రండి రారండి. *"యూయంపాత స్వస్తిభిః సదానః"*

## డెబ్బది మూడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. మేము దేవాభిలాషులమగుదుము. స్తుతింతుము. అజ్ఞానమును దాటిపోవుదుము. బహుకర్మ, ప్రభూత తమ పూర్వజాత, అమర్త్య అశ్విద్వయమా ! మిమ్ము స్తోతలు పిలుచుచున్నారు.

2. అశ్వినులారా ! మీరు ప్రియుడగు మానవ స్తోత ఇక్కడ ఉన్నాడు. అతడు మీ యజ్ఞము చేయును. మాకు వందనము చేయును. అతనివద్ద నిలిచి అతడు అందించిన సోమరసము సేవించండి. అన్నవంతుడనై యజ్ఞమునకు మిమ్ము ఆహ్వానింతును.

3. మేము స్తోతలము. మేము ఆగమనశీల దేవతల కొఱకు యజ్ఞమును పెంపొందింతుము. అశ్వినులారా ! ఈ స్తుతిని స్వీకరించండి. ఏను వశిష్ఠుడ. శీఘ్రగామి దూతవలె మీ వద్దకు చేరి, మిమ్ము స్తుతించి ప్రబోధితుడవగుదును.

4. వీరిద్దరు హవ్యవాహకులు. రాక్షస నాశకులు. పరిపుష్టాంగులు. దృఢపాణులు.

వారు మా ప్రజవద్ద విరాజిల్లవలెను. మీరు మదకర అన్నముతో కూడి ఉండండి. మమ్ము బాధించకండి *"ఆగతమ్ శివేన"* శుభములతో విచ్చేయండి.

5. నా సత్యద్వయమా ! తూర్పు, పడమర, దక్షిణ, ఉత్తర దిశలనుండి రారండి. పంచజనులకు హితవు కలిగించి సంపద తీసికొనిరండి-రారండి. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## డెబ్బది నాలుగవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - అశ్విను‌లు, ఛందస్సు - బృహతి.

1. నివాప్రదులగు అశ్వినులారా ! స్వర్గముకోరు జనులు మిమ్ము ఆహ్వానింతురు. మీరు విశేష వ్యక్తుల వద్దకే వెళ్లుదురు. అందువలన వసిష్ఠుడను - రక్షణకొఱకు మిమ్ము పిలుచుచున్నాను కేకవేయుచున్నాను.

2. అశ్వినులారా ! మీ వద్ద విచిత్ర భోజ్య ధనము ఉన్నది. దానిని స్తోతవద్దకు పంపండి. సమాన మనసుగలవారై మీ రథమును మా వద్దకు పంపండి. సోమ సంబంధమగు మధుర రసము సేవించండి.

3. అశ్వినులారా ! రండి మావద్ద నిలువండి. మధుర సోమరసము పానము చేయండి. అభీష్టవర్షకులు. ధనంజయులగు మీరు జలములను ఇవ్వండి. మమ్ము బాధించవద్దు.

4. అశ్వినులారా ! మీ అశ్వములు మిమ్ము హవ్యదాత గృహమునకు కొనిపోవును. అట్టి శీఘ్రగామి అశ్వములపై మమ్ము చేరగోరి విచ్చేయండి.

5. అశ్విద్వయమా ! స్తోతలు మరింత అన్నమును ఆశ్రయింతురు. మీరు మాకు చలించని కీర్తిని గృహమును ప్రసాదించండి. మేము ధనికులము.

6. ఇతరుల ధనము గ్రహించనివారు. మానవులలో ఉండి మానవులను రక్షించువారు. రథమువలె మీవద్దకు

చేరువారు స్వబలమున వర్ధిల్లుదురు. నివసించుటకు మంచి ప్రదేశమునకు చేరుకొందురు.

## డెబ్బది ఐదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఉష, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉష అంతరిక్షమున ఆవిర్భవించినది. వెలుగులు తెచ్చినది. ఆమె తన తేజోబలమున తన మహిమను ప్రకటించుచు వచ్చినది. అప్రియ అంధకారమును దూరము చేయుచు వచ్చినది. ప్రాణికోటి తమ కార్యనిర్వహణకుగాను గంతవ్య మార్గమును ప్రకాశింప చేయుచు వచ్చినది.

2. ఉషా ! నేడు మాకు సుఖములిచ్చుటకు మేల్కొనుము. మహా సౌభాగ్యమును అందించుము. విచిత్ర కీర్తియుక్త ధనమును మా కొఱకు అందుకొనుము. మానవ హితకారిణీ ! మానవులకు అన్నవంతులగు పుత్రులనిమ్ము.

3. ఉషఃకిరణములు దర్శనీయములు. ప్రవృద్ధములు. అవి నాశ్యములు. దేవతల వ్రతముల ఉత్పాదకములు. అవి అంతరిక్షమును నింపును. అనేక ప్రకారముల వ్యాపించును.

4. ఆమె ద్యులోకదుహిత. భువన పాలిక. అట్టి ఉష ప్రాణులందరి ప్రజ్ఞానులను దర్శించుచు ఇతర వ్యవహారములను వీక్షించుచు పంచజనుల వద్దకు త్వరత్వరగా చేరును.

5. ఉష అన్నవతి. సూర్యపత్ని. విచిత్ర ధనవతి. ఆమె ఇప్పుడు ధనములకు, దేవధనములకు స్వామిని అయినది. ఋషులతో స్తుతించబడినదియు, వార్ధక్యము కలిగించునదియు, ధనవతియు అగు ఉష యజమానిచే స్తుతించబడి ప్రభాతము కలిగించును.

6. దీప్తివంత ఉషను వహించు విచిత్రములు, శుభప్రదములగు అశ్వములు గోచరించుచున్నవి. ఉష దీప్తిమతి అయి అనేక రూపముల రథమున సర్వత్ర పయనించును. ఆమె తన సేవకులకు రత్నములిచ్చును. "రత్నంవిధతే జనాయ."

7. ఉషోదేవి సత్యరూప, మహతి. యజనీయ ఆమె మహామహులు, యజనీయులగు దేవతలతో కలిసి అత్యంత స్థిర అంధకారమును చెదరగొట్టును. ఆమె గోవులు మేయుటకు వెలుగునిచ్చును. గోవులు ఉషస్సును కోరుకొనును.

8. ఉషా ! మాకు గోవులు, వీరులు, అశ్వసహిత ధనమునిమ్ము. మానవులలో మా యజ్ఞమును నిందింపకుము. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## డెబ్బది ఆరవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఉష, ఛందస్సు - త్రిష్టుప్.

1. సవిత అందరినేత అంతరిక్షమున అవినాశ్యము, సర్వహితైషి అయిన జ్యోతిని ఆశ్రయించును. అతడు దేవకర్మల కొఱకు వెలువడినాడు. ఉష దేవతల నేత్ర స్వరూపిణి. ఆమె సమస్త భువనములను వెలువరించినది.

2. నేను హింసారహితుడను. తేజోవంతుడను, సంస్కారవంతునయి దేవయాన పథమును చూచినాను. ఉషోకేతనము తూర్పుదిశన ఎగురును. మా ముందుకు ఉష ఉన్నత ప్రదేశము నుండి వచ్చును.

3. ఉషా ! నీ తేజస్సు సూర్యునికన్న ముందు ఉదయించును. అట్టి నీ తేజస్సు కులటవంటిది కాదు. పతిసాన్నిధ్యమున ఉన్న పత్నివంటిది. అట్టి నిష్కళంకమగు నీ తేజము అపారము - అనంతము.

4. అంగిరోగణములు సత్యవంతులు. విద్వాంసులు. ప్రాచీన పాలకులు. వారు నిగూఢ తేజమును సాధించినారు. సత్యస్తుతులయినారు. అట్టి అంగిరులు మంత్రబలమున ఉషస్సును ఆవిర్భవింపచేసినారు. అప్పుడు వారు దేవతలకూడి ఉన్మత్తులైనారు.

5. వారు సాధారణ గోవులకొఱకు కలుసుకున్నారు. ఏకబుద్ధులు అయినారు. పరస్పర ప్రయత్నము కొనసాగించినారు. వారు దేవకర్మలను బాధించరు. హింసాశూన్యము వాసప్రదమగు తేజమున సాగుదురు.

6. సుభగా ! ఉషా ! వశిష్ఠ గణములు తెల్లవారుజామున లేచినారు. స్తోత్రములతో నిన్ను స్తుతించుచున్నారు. నీవు గోప్రాపికవు. అన్నపాలికవు. మాకు తెల్లవారింపుము. సుజన్మ ఉషా ! నీవు ప్రథమ స్తుతవు.

7. ఈ ఉష స్తోతల స్తోత్రములకు నేతృత్వము వహించును. వసిష్ఠులు ఆమెను స్తుతింతురు. ఆ తల్లి చీకట్లను చీల్చును. సర్వత్ర ప్రసిద్ధమగు ధనమును మాకు ఇచ్చును. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## డెబ్బది ఏడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఉష, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉష సమస్త జీవులకు కదలిక కలిగించును. ఆమె ప్రాయపు పత్నివలె సూర్యుని నుండియే వెలుగులు పొందును.

అగ్ని మానవుల సమింధన యోగ్యుడయినాడు. అగ్ని అంధకారనాశక తేజమును ప్రకటించును.

2. ఉష ఉదయించినది - ఉదయించినది - ఉష జగముల ముందుకు వచ్చినది - వచ్చినది. ఉష సర్వత్రవ్యక్తమైనది - అయినది. ఆమేతేజోమయవనములు ధరించినది - ధరించినది. వాటితో వర్ధిల్లినది - వర్ధిల్లినది.

ఉష హిరణ్యవర్ణ దర్శనీయ తేజోయుక్త. వాక్యమాత. దినములనేత. ఉష అందములు సంతరించు కొనుచున్నది.

3. ఉష దేవతలకు నేత్రస్వరూప. తేజోవతి. సుభగ. స్వకిరణ ప్రకాశిత. విచిత్ర ధనవతి. జగముల కొఱకు ప్రవృద్ధ. ఆమె దర్శించదగిన అశ్వమును తెలుపుచేయుచున్నది.

(అశ్వము సూర్యుడగును)

4. ఉషా ! మా వద్దకు విచిత్ర ధనముతో రమ్ము. మా శత్రువులను దూరము చేయుచురమ్ము. మా విశాలగోచర భూమిని భయరహితము చేయుచురమ్ము. ద్వేషులను వేరుచేయుచు రమ్ము. శత్రువుల ధనము తీసికొని రమ్ము. స్తోతవద్దకు ధనము అందుకొని రమ్ము.

5. ఉషా ! మా ఆయువులను పెంచుము. మా కొఱకు శ్రేష్ఠ కిరణములతో ప్రకాశింపుము. నీవు అందరకు వరణీయవు. మా కొఱకు గో, అశ్వధనమను దాల్చివెలుగొందుము.

6. ద్యులోకదుహితా, సుజన్మా, ఉషా ! వసిష్ఠులు స్తుతులతో నిన్ను వర్ధిల్ల చేయుదురు. నీవు మాకు రమణీయమగు మహాధనము నిమ్ము. *"యూయం పాత స్వస్తిభిః సదా నః"*

## డెబ్బది ఎనిమిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఉష, ఛందస్సు త్రిష్టుప్.

1. తొలుత వెలసిన కేతనమును చూడనగును అది కిరణపుంజములతో ఊర్ధ్వముఖియై వ్యాపించినది. మా ముందు నిలిచినది. ఉషోదేవి రథము అది విశాలము. జ్యోతిష్మంతము. ఉష ఆ రథమును మా కొఱకు రమణీయ ధనము తేవలెను.

2. సమిధలు కలిగిన అగ్గి అంతట ఎదుగును. విప్రులు స్తుతులతో ఉషను కీర్తించి ఎదుగుదురు. ఉషోదేవి తన వెలుగులతో చీకట్లను పాపములను పారద్రోలి ఎదుగును.

3. ఈ సమస్త ప్రభాత కిరణములు, వెలుగులనిచ్చు ఉషలను తూర్పుదిక్కున చూడనగును. ఈ కిరణములే సూర్యుని అగ్నిని, యజ్ఞమును ఆవిర్భవింపచేసినవి. వాటివలననే నీచనము అప్రియమయిన అంధకారము దూరమైనది.

4. ద్యులోకపుత్రి, ధనవతి ఉషను ఎరిగినాము. సర్వప్రాణులు ప్రభాతకారిణి ఉషను దర్శించుచున్నారు. ఆమె అన్నముగల రథమున ఎక్కినది. అలంకృత అశ్వములు ఆ రథమును లాగును.

5. ఉషా ! మేము సుమనస్కులు, ధనవంతులగు జనులు నేడు నిన్ను మేల్కొల్పుచున్నాము. ఉషలారా ! మీరు తెల్లవార్చండి. జగముల వెలుగులు నింపండి.

## డెబ్బది తొమ్మిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - ఉష ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉష మానవుల హితము కోరునది. అంధకారమును నాశనము చేయునది. పంచశ్రేణి జనులను మేల్కొల్పునది. ఉత్తమ తేజస్సుగల కిరణములతో సూర్యునకు ఆశ్రయము ఇచ్చును. సూర్యుడు ఆ తేజస్సుతో ద్యావాపృథ్వులను ఆవరించును.

2. ఉషస్సులు అంతరిక్షమున తేజస్సును వ్యక్తపరచుదురు. మానవులవలె పరస్పరము కలిసి చీకట్లను తుడిచివేయు చర్యలు చేపట్టుదురు.

ఉషా ! నీ కిరణములు అంధకారమును నాశము చేయును. సూర్యుని భుజములవె జ్యోతులు ప్రసాదించును.

3. అందరిని మించిన స్వామిని, ధనవతి ఉష ఉదయించినది. ఆమె సకల ప్రాణి కళ్యాణమునకుగాను అన్నము కల్పించినది. స్వర్గపుత్రి సర్వోత్తమ అంగిర ఉష సుకృతములకొరకు ధనముదాల్చును.

4. ఉషా ! నీవు ప్రాచీన స్తోతలకు ఇచ్చినంత ధనమును మాకును ప్రసాదించుము. ప్రాణులు నిన్ను వృషభ శబ్దమున ఎరుగుదురు. పణులు గోవులను దొంగిలించినప్పుడు నీవు దృఢపర్వత ద్వారమును తెరచినావు.

5. ధనము కొఱకు స్తోతలను మా కొఱకు సూనృత వాక్యమును ప్రేరేపించుచు, తమోవినాశినివగుచు, మాకు దానము చేయుటకు నీ వృద్ధిని స్థిరపరచుకొనుము. *"యూయంపాతస్వస్తిభిః సదానః"*

## ఎనుబదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - ఉష ఛందస్సు - త్రిష్టుప్.

1. ఉష సమానప్రాంత ద్యావాపృథ్వులను ఆవరించునది. ప్రాణులను ప్రకాశమునిచ్చునది. విప్రులగు వసిష్ఠులు అట్టి ఉషను అందరికన్నముందు మేల్కొలిపినారు.

2. ఆమెయే నవయవ్వన ఉష. ఈమెయే కటిక చీకట్లను కూలద్రోసిన ఉష, ఈమెయే జనులను మేల్కొల్పిన ఉష.

ఉష సిగ్గువిడిచిన పడుచువలె. సూర్యునిముందుకు పోవును. సూర్యునకు, అగ్నికి, యజ్ఞమునకు తనను సూచించును.

3. ఉషస్సులు అనేక అశ్వములుగలవి గోవులు కలవి. అవి స్తుతించ తగినది.

ఉషస్సులు సదా అంధకారమును దూరము చేయును. "యూయం పాత స్వస్తిభిః సదానః"

*(ఆంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ మండలము ఐదవ అష్టకమున అయిదవ అధ్యాయము సమాప్తము.)*

ఓం నతామినన్తిమాయివో నధీరావ్రతా దేవానాం ప్రథమాద్రవాణి.
నరోదసీ అద్రుహా వేద్యాభిర్నపర్వతాని నమేత స్థివాంసః

## ఆరవ అధ్యాయము ఎనుబది ఒకటవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - ఉష, ఛందస్సు - బృహతి.

**ఓం ప్రత్యు ఆదర్శ్యాయత్యు్చ్ఛన్తీ దుహితాదివః**
**ఆపో మహివ్యాయతి చక్షసే తమో జ్యోతిష్కృణోతిసూ్యరి**

1. ద్యులోకపుత్రి అంధకారినాశిని ఉష వస్తున్నది కనిపిస్తున్నది. అందరు చూచుటకు ఆమె రాత్రియొక్క ఘోర అంధకారమును దూరము చేయును. మానవులకు నేతృత్వము వహించును. వెలుగులను వికసింపచేయును.

2. సూర్యుడు కిరణములను ఒకేసారి విసరును. సూర్యుడు వెలుగొంది గ్రహనక్షత్రాదులను వెలిగించును.

ఉషా ! నీవి సూర్యుని వెలుగులు వచ్చిన తరువాతనే మాకు అన్నము కలుగును.

3. ద్యులోకపుత్రి ఉషా ! మేము శీఘ్రకర్ములమగుదుము. నిన్ను మేల్కొలుపుదుము. నీవు కోరదగిన అనంతధనము కలదానవు. యజమానికొరకు రత్నములు, సుఖములు అందుకొనుము.

4. మహతీదేవీ ! నీవు అంధకార నాశినివి. మహిమలు కలదానవు. సకల జగములను ప్రబోధితము చేయుదువు. వానిని దర్శన యోగ్యము చేయుదువు. నీవు రత్నవతివి. మేము నిన్ను యాచించుచున్నాము. తల్లికి కొడుకువలె మేము నీకు ప్రియతములము కావలెను.

5. ద్యులోకదుహితా ! ఉషా ! అత్యంత దూర ప్రదేశమున ప్రఖ్యాతమయిన ధనము తెమ్ము. నీ వద్ద మానవులకు భోజ్యమగు అన్నము ఉన్నదికదా అది మాకు ఇమ్ము. మేము సహితము అనుభవింతుము.

6. ఉషా ! స్తోతలకు అమరము, నివాసప్రదము మరియు ప్రసిద్ధమగు కీర్తిని ప్రసాదించుము. మాకు అనేక గోవులతో కూడిన అన్నము ప్రసాదించుము. యజమానికి ప్రేరణ కలిగించునదియు, సత్యవచన ఉష శత్రువులను దూరము చేయవలెను.

## ఎనుబది రెండవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - ఇంద్రావరుణులు, ఛందస్సు - జగతి.

1. ఇంద్రావరుణులారా ! మేము మీ సేవకులము. యజ్ఞ కర్మమునకుగాను మాకు మహాగృహము ప్రసాదించుము అట్లయిన యజ్ఞకర్తను అదేపనిగ పీడించు దుర్బుద్ధిని యుద్ధమున జయించగలము.

2. ఇంద్రావరుణులారా ! మీరు మహామహులు. మహా ధనవంతులు. మీలో ఒకరు. వరుణుడు సామ్రాట్టు. మరొకరు ఇంద్రుడు. స్వయం విరాజమానుడు. ఉత్తమ ఆకాశమునందలి విశ్వదేవతలు మీకు తేజస్సును ప్రదానము చేసినారు. బలమును ఇచ్చినారు.

3. ఇంద్రావరుణులారా ! మీరు బలమున జలవృష్టిని ఆవిష్కరించినారు. సర్వప్రేరకుడగు సూర్యుని ఆకసమున నడిపించినారు. మాయసోమమున ఆనందించినారు. ఇప్పుడు మీరు నదులను జలపూర్ణములుచేసి కర్మలను పూరించండి.

4. ఇంద్రావరుణులారా ! స్తోతలు యుద్ధమందు, శత్రు సేనా మధ్యమున మిమ్మే పిలుతురు. సంకుచితజానువులుగల అంగిరులు రక్షణకొఱకు మిమ్మే పిలుతురు. మీరు దివ్య పార్థివ ఉభయ ధనములకు ఈశ్వరులు. మీరు అనాయాసముగా ఆహ్వానయోగ్యులు. మిమ్ము ఆహ్వానించుటకు ఆయాసము అక్కరలేదు సులభులు. మేము స్తోతలము. మేము పిలుచుచున్నాము.

5. ఇంద్రావరుణులారా ! మీరు లోకములందలి సమస్తప్రాణులను సృష్టించినారు. మీలో ఒకరిని వరుణుని శుభములకుగాను మిత్రుడు సేవించును. మరొకరు ఇంద్రుడు మరుత్తులతో కలిసి తేజస్వియు శోభన అలంకృతుడను అగును.

6. మహాధన ప్రాప్తికని, ఇంద్రావరుణులు వెలుగొందుటకును, శీఘ్రముగా బలము ప్రాప్తించును. వీరి బలము నిత్యము అసాధారణము. వీరిలో ఒకడు వరుణుడు హింసించువారిని పరిమార్చును. మరొకరు ఇంద్రుడు స్వల్ప ప్రయత్నముననే శత్రువును వధించును.

7. ఇంద్రావరుణులారా ! వీరు ఏనరుని యజ్ఞమున విరాజిల్లుదురులో, ఏ వ్యక్తిని అనుగ్రహింతురో వానిని బాధలు చేరలేవు. పాపము చేరలేదు. దుష్కర్మలు చేరలేదు. ఏకారణమునైనను సంతాపము చేరలేరు.

8. నేతలగు ఇంద్రావరుణులారా ! మీరు మా విషయమున ప్రసన్నులైనచో దివ్యరక్షణ సహితులై మాముందు అవతరించండి. స్తోత్రములు వినండి. మీ స్నేహము, బంధుత్వము సుఖదాయకములగును. మాకు ఆ రెంటిని ప్రసాదించండి.

9. శత్రుమర్దన తేజోవంతులగు ఇంద్రావరుణులారా ! విశేష సంగ్రామములందు మాకు అగ్రశ్రేణి యోద్ధలుకండి. మిమ్ము ప్రాచీన, అధునాతన ఉభయనేతలు యుద్ధమునకును పుత్ర పౌత్రాదుల ప్రాప్తికిని ఆహ్వానింతురు.

10. ఇంద్ర, వరుణ, ఆర్యమలు, మాకు ప్రకాశమాన ధనమును, మహా విస్తీర్ణ గృహమును ప్రసాదించవలెను. యజ్ఞవర్ధిక అదితి తేజము మమ్ము బాధించరాదు. మేము సవిత్ర దేవుని స్తుతింతుము.

## ఎనుబది మూడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - ఇంద్రావరుణులు, ఛందస్సు - జగతి.

1. నేతలగు మిత్రావరుణులారా ! యజమానులు మీ సఖ్యత చూచినారు. తమకు గోప్రాప్తి కలుగుటకు కొడవలిచేతబట్టి తూర్పుదిక్కునుసాగినారు. మీరు దాసులను, సుదాస శత్రువులైన ఆర్యులను వధించండి. సుదాసునకు రక్షణ కల్పించుటకు విచ్చేయండి.

2. మానవులు ధ్వజములెత్తి యుద్ధమునకు కలిసినచోట యుద్ధమున ఏ మాత్రము అనుకూలించనప్పుడు ప్రాణులు స్వర్గము చేరునప్పుడు అదిగో అట్టి యుద్ధమున ఇంద్రావరుణులారా ! మా పక్షము వహించండి.

3. ఇంద్రావరుణులారా ! విపత్తు విరుచుకుపడినది. భూమిమీది అన్నములన్నింటిని సైనికులు నష్టపరచినట్లున్నారు. సైనికుల కోలాహలము స్వర్గమునంటుచున్నది. నా సేనల శత్రువులందరు నన్ను సమీపించినారు. హనన శ్రవణకారి ఇంద్రావరుణులారా! రక్షణలు వెంటబెట్టుకొని మావద్దకు విచ్చేయండి.

4. ఇంద్రావరుణులారా ! ఆయుధమునకు అందని భేదనామక శత్రువును వధించినారు. సుదారాజును రక్షించినారు. తృత్సుల స్తోత్రములను విన్నారు. యుద్ధకాలమున తృత్సుల పౌరో హిత్యమును ఫలింప చేసినారు.

5. ఇంద్రావరుణులారా ! శత్రువులు ఆయుధ సహితులై నన్ను చుట్టుముట్టినారు. హింసకుల నడుమ శత్రువులు నన్ను హింసించుచున్నారు. మీరు ఉభయ ధనములకు అధిపతులు. కావున యుద్ధమున వీరిద్దరు మమ్ము రక్షించండి.

6. ఇంద్రావరుణులారా ! యుద్ధ సమయమున ఉభయులు సుదాస తృత్సులు - ధనప్రాప్తికిగాను మిమ్ము పిలుస్తారు. ఈ యుద్ధమున పదిమంది రాజులతో పీడింపబడిన సుదాసుని తృత్సుల సహితముగా మీరు రక్షించినారు.

7. ఇంద్రావరుణులారా ! యజ్ఞ హీనులగు పదిమంది రాజులు ఏకమైనారు. అయినను సుదాసుని దెబ్బకొట్టలేక పోయినారు. హవ్యయుక్త యజ్ఞమున నేతల స్తోత్రములు ఫలించినవి. ఈ యజ్ఞమున సమస్త దేవతలు అవతరించినారు.

8. తృత్సులు వసిష్ఠశిష్యులు. వారు నిర్మలులు. జటీవంతులు. కర్మదులు. వారు ఏ దేశమున స్తుతులతో సేవించినారో, ఆ దేశముననే పదిమంది రాజులు చుట్టుముట్టిన సుదాసునకు మిత్రావరుణు లారా ! మీరు బలము ప్రసాదించినారు.

9. ఇంద్రావరుణులారా ! మీలో ఒకరు ఇంద్రుడు వృత్రులను నాశము చేయును. మరొకరు వ్రతములు కర్మలను రక్షించును. అందమైన స్తుతులో పిలచెదము. మాకు సుఖములు ప్రసాదించండి. *"శర్మం యచ్ఛతమ్"*

10. ఇంద్ర, వరుణ, ఆర్యమలు మాకు ప్రకాశవంతమగు ధనమును మహా విస్తీర్ణ గృహమును ప్రసాదించవలెను. యజ్ఞవర్ధక అదితి తేజము మమ్ము బాధించరాదు. మేము సవితృ దేవుని స్తుతింతుము.

## ఎనుబది నాలుగవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - ఇంద్రావరుణులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రావరుణులారా ! మీరు సామ్రాట్టులు. నేను ఈ యజ్ఞమునుకు మిమ్ము హవ్యము, స్తోత్రములతో ఆహ్వానించుచున్నాను. చేతులందు గల నానారూపముల జుహువులు స్వయముగా మీవైపే చూచుచున్నది.

2. ఇంద్రావరుణులారా ! మీది స్వర్గరూపము. విశాల దేశము. మీరు వర్షము కలిగింతురు. హర్షము కలిగింతురు. పాశము లేకుండనే బాధించు ఉపాయములతో పాపిని బిగించండి. వరుణుని క్రోధము మమ్ము రక్షించి దాటవలెను. ఇంద్రుడు స్థానమును విస్తరించవలెను.

3. ఇంద్రావరుణులారా ! మా గృహమందలి యజ్ఞమును రమణీయము చేయండి. స్తోతల స్తోత్రములు ఉత్తమములు చేయండి. దేవతలంపిన ధనము మమ్ము చేరవలెను. అభిలషణీయ రక్షణలతో మమ్ము వర్ధిల్లచేయండి.

4. ఇంద్రావరుణులారా ! అందరు కోరుకొను నివాస స్థానమును అన్నవంత ధనమును అందించండి. ఆదిత్యుడు వరుణుడు అసత్యమును నాశనము చేయువాడు. అతడే వీరులకు అపరిమిత ధనము ఇచ్చును.

5. ఇది నా స్తుతి. ఇది ఇంద్రుని, వరుణుని వ్యాప్తము చేయవలెను. నేను ఉచ్చరించు ఈ స్తుతి పుత్రపౌత్రాదులను ఇవ్వవలెను. రక్షించవలెను. మేము సుందర రత్నవంతులమై యజ్ఞమును అందుకొందుము.

## ఎనుబది ఐదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - ఇంద్రావరుణులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రావరుణులారా ! మీ కొఱకు సోమమును అగ్నికి ఆహుతి ఇచ్చుచున్నాను. దీప్తవతి ఉషవలె దీప్తాంకము, రాక్షస శూన్యమగు స్తుతి రచించుచున్నాను. యుద్ధము సంభవించినప్పుడు మీరు ప్రయాణము చేయుచు మమ్ము రక్షించండి.

2. పరస్పర స్పర్ధగల యుద్ధమున శత్రువు మాతో స్పర్థించును. యుద్ధములందు ధ్వజముమీద ఆయుధములు పడును. అట్టి తరి మిత్రావరుణులారా ! మీ ఆయుధములతో వివిధ గతులుగల శత్రువును నాశము చేయండి.

3. సోమములన్నియు స్వాయత్త యశోవంతములు ద్యుతిమంతములు. అవి గ్రహములందు ఇంద్రావరుణులకొరకు నిలుచును. వారిలో వరుణుడు ప్రజాగణములను వేరువేరుగా పాలించును. ఇంద్రుడు ఇతరులు గెలువరాని శత్రువును నాశము చేయును.

4. అదితి పుత్రులారా ! మీరు బలశాలురు. మీకు నమస్కరించి మిమ్ము సేవించువాడే శోభన కర్మవంతుడు, యజ్ఞజ్ఞాత అగును. ఏ హవ్యవంతుడు మిమ్ము తృప్తులను చేయుటకు ఆహ్వానించునో వాడు అన్నవంతుడగును. అందవలసిన ఫలమును అందుకొనును.

5. ఇది నా స్తుతి. ఇది ఇంద్రుని వరుణుని వ్యాప్తము చేయవలెను. నేను ఉచ్చరించు ఈ స్తుతి పుత్ర, పౌత్రాదులను ఇవ్వవలెను. రక్షించవలెను. మేము సుందర రత్నవంతులమై యజ్ఞమును అందుకుందుము.

## ఎనుబది ఆరవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - వరుణుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వరుణుని జన్మ ధీరము స్థిరము మహిమాన్వితము. అతడు విశాల ద్యావాపృథ్వులను స్థాపించి నిలిపినాడు. అతడు ఆకాశమున సూర్యుని, దర్శనీయ నక్షత్రములను ద్విధా కల్పించినాడు. అతడు భూమిని విస్తరింపచేసినాడు.

(పగలు సూర్యుని, రాత్రి నక్షత్రములను కల్పించినందున *"ద్వితా ద్విధా"* అయినది)

2. వరుణుని దర్శించుటకు ఆతురుడైన ఋషి అనుచున్నాడు. నేను ఈ దేహముండగా వరుణునితో ఉండగలవా? వరుణుని వద్ద ఎప్పుడు నిలువగలను? వరుణుడు క్రోధరహితుడై నా హవ్యము స్వీకరించగలడా? నేను సుమనస్కుడనై ఎన్నడు వరుణుని దర్శించగలను?

(ఉండుట నిలుచుట హవ్యస్వీకారము కనీస దర్శనము అవరోహణక్రమము ఆదర్శము నుండి వాస్తవమునకు)

3. వరుణా ! నిన్ను చూడదలచినాను. ఒక పాపపుమాట అడగదలచినాను. నేను అనేక ప్రశ్నలతో విద్వాంసులను దర్శించినాను. వారందరు ముక్తకంఠమున వరుణుడు *"నీ విషయమున కోపము వహించినాడు"* అన్నారు.

(వరుణుని వినా జ్ఞానము కలుగదని భావము కోపము విడిచి ఉపదేశించుమని ప్రార్థన)

4. వరుణా ! నేను చేసిన అపరాధమేమి? ఎందుకు స్తోత అగు మా మిత్రుని కొట్ట దలిచినావు? వరుణా ! నీ తేజస్సు దుర్ధర్షము. నీవు ఏల పలుకవు? నీవు పలికిన నేను త్వరపడి, నమస్కరించి, ప్రాయశ్చిత్తము చేసికొని నీవద్దకు వత్తునుకదా !

5. వరుణా ! మమ్ము పితృ క్రమాగత ద్రోహమునుండి విడిపించుము. మా జీవిత కాలమున మేము చేసినదానినుండి విడిపించుము. దొంగ పశువును దొంగిలించును. అందుకు ప్రాయశ్చిత్తముగా దానికి గడ్డి మేపును. ఆ దొంగనువలెను పలుపుకట్టిన దూడవలెను నన్ను వసిష్ఠుని విడిపించుము.

(వసిష్ఠుని పూర్వులు ద్రోహము చేసినారనికాదు. ఆతురతలలో అతడు అన్నింటినుంచి విముక్తుని చేయమని ప్రార్థించినాడు)

పాపమును వివరించుచున్నాడు :-

6. వరుణా ! పాపము మానవ దోషమున కలుగదు. అది సుర, భ్రమ, క్రోధము, జూదము, అజ్ఞానము మున్నగు దైవగతి కారణముగ జరుగును. చిన్నవానిని పెద్దవాడు తప్పుదారి పట్టించును. స్వప్నమందును దైవగతిలో పాపము కలుగును.

7. వరుణుడు కామవర్షి. పాలకుడు. నేను పాపశూన్యుడనగుదును. దాసునివలె వరుణుని అతడుకోరినరీతి పూజింతును. మేము అజ్ఞానులము. వరుణస్వామి మాకు జ్ఞానము ప్రసాదించవలెను, జ్ఞానివరుణుడు స్తోతకు ధన విషయక ప్రేరణ కలిగించవలెను.

8. అన్నవంతవరుణా ! ఈ సూక్తరూప స్తోత్రము నీ కొఱకు రచించినాను. దీనిని నీవు హృదయమున పదిలపరుచుకొనుము. మాకు లాభము మంగళమయము కావలెను. క్షేమము మంగళమయము కావలెను. "యూయం పాత స్వస్తిభిః సదానః"

**ఆలోచనామృతము**

ఈ సూక్తము పాపము జ్ఞానమును గురించి చెప్పబడినది. అతడు వసిష్ఠుడే కావచ్చును. వేరెవ్వరయిన కావచ్చును. పాపములనుండి విముక్తికి తపించినాడు. మొర పెట్టుకున్నాడు. ప్రార్థించినాడు. అర్థించినాడు. తుదకు పాపము తన దోషము కాదని తేల్చిచెప్పినాడు. ఇందలి ఆరవ మంత్రమును పరిశీలించవలసి ఉన్నది.

**నసస్వోదక్షో వరుణధృతిః సాసురా మన్యుర్విభీదకో అచిత్తః**

**అస్తిజ్యాయాన్కనీయః ఉపారేస్వప్నే దనృతస్య ప్రయోతా!**

పాపము మానవ దోషముకాదు అనుచున్నాడు. అది అతని అధీనములేదు అనుచు స్వప్నపు ఉదాహరణ ఇచ్చినాడు. స్వప్నము మానవుని అధీనమునలేదుకదా ! అది పాపమేల కావలెను అని ప్రశ్న?

**"నసో దక్షో"** పురుష బలము పాపవృత్తికి కారణముకాదు. కాకున్న ఎవరు కారణము?

**"ధృతిః"** కాలము దైవగతి కారణములు. అదెట్లనగా

సుర, భ్రమ, క్రోధము, జూదము, అజ్ఞానము పాపమునకు కారణములు. ఇది నిత్య సత్యము. నిశ్చితము. ఈ దుర్గుణము దైవకృతములగునా?

మనిషి స్వాధీనమున లేనిదానిని దైవ కృతము అందుము. కామక్రోధాది అరిషడ్వర్గములను మానవుడు తన ఆధీనము ఉంచుకొనవలెనని అనంతరకాలమున గీతాకారుడగు కృష్ణపరమాత్మ ప్రబోధించినాడు. అది ఆదర్శము. అసాధ్యముకాదు. కాని దుస్సాధ్యము. అందరకు సాధ్యమనగునదికాదు.

కావున తాను చేసిన పనికి దైవమును బాధ్యుని చేయుట సమంజసమగునా? కాకపోవచ్చును. కాని ఒక్కొక్కసారి తన పరిధిని దాటిపోయినపుడు దైవ కృతములు కావచ్చును.

రామాయణమున రాముని **"విగ్రహవాన్ ధర్మం"** అన్నాడు. అతడు ధర్మస్వరూపుడని అర్థము. అరణ్యమున సీత మాయలేడిని కోరినది. అది ఆమె భ్రమ. ఆభ్రమ రామునకు ఉండరాదు. పైగా లక్ష్మణుడు హెచ్చరించినాడు. అతడు మారీచుడు మాయలేడికాదని. అయినను రాముడు మాయలేడిని వెన్నాడినాడు ఫలితము అనుభవించినాడు.

ఇది దైవ కృతముకాదా? మానవుడు నివారించగలడా?

మహాభారతమున ధర్మరాజు ధర్మస్వరూపుడు. అతనికి జూదము పాపమని తెలియదా? విదురాదులు వివరింపలేదా? మిన్నకున్నాడా? ఆడినాడు. ఓడినాడు. తొలి జూదమున ద్రౌపది అతనికి రాజ్యము ఇప్పించినది. మరల జూదమునకు పిలిచిన ఊరకున్నాడా? ఓడినాడు. అడవుల పాలయినాడు.

ఇది దైవకృతముకాదా? మానవుడు నివారించగలడా?

ఈ మధ్య జరిగిన రెండు ప్రపంచ సంగ్రామములు ఎవరుకోరి తెచ్చుకున్నార

ఆధునిక నాగరకత పేర సాగుతున్న అణ్వాధ్యాయుధములు మానవ వినాశకారకమగు కాలుష్యాదులు ఎవరుకోరి తెచ్చుకొనుచున్నారు? ఎవరు మానవజాతి ఆత్మహత్యకు కారణమగుచున్నారు?

ఇది దైవ కృతముకాదా? మానవుడు నివారించగలడా?

అట్లని వ్యక్తిని బాధ్యతా రహితుని చేయలేము. అతని పనులకు అతడే ఇహపరములందు బాధ్యత వహించవలసి ఉన్నది. స్వప్రయత్నమునకు మీరి, అలవికానప్పుడు మాత్రమే దైవకృతమగును.

స్వప్నమున చేసినది పాపమగునా? ఇది వాదనకు బాగున్నది. తెలిసి చేసినది మాత్రమే పాపము, దోషము నేరము అగుచున్నది.

## ఎనుబది ఏడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - వరుణుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వరుణుడు అంతరిక్షమున సూర్యునికొఱకు మార్గము ఏర్పరచినాడు. నదులకు అంతరిక్షమును పుట్టిన జలము అందించినాడు. మగ గుర్రములు ఆడగుర్రము కొరకు ఉరికినట్లు వరుణుడు వేగముగా పోదలచి రాత్రులనుండి పగళ్లను వేరుచేసినాడు.

2. వరుణా ! నీగాలి లోకమునకు ప్రాణము. నలువైపుల ఉన్న నీరు కూడ నీవు ఇచ్చినదే. గ్రాసము పశువును అన్నవంతము చేయును. అట్లే జగములను, భరించు వాయువు అన్నవంతుడగును. గొప్పవి, పెద్దవి అగు ద్యావాపృథ్వులమధ్య ఉన్న నీ సమస్త స్థానములు జనప్రియములు.

3. వరుణుని అనుచర వర్గమంతయు ప్రశంసనీయము. వారు చక్కని రూపము గలవారు. ద్యావాపృథ్వులను వీక్షింతురు. వారు కర్మవంతులు, యజ్ఞధీరులయిన కవుల స్తోత్రములను నలువైపులనుండి వీక్షింతురు.

4. నేను మేధావి ఋత్విక్కును. పృథ్విలేక వాక్కునకు ఇరువది ఒక్క పేర్లున్నవని వరుణుడు నాతో చెప్పినాడు. వరుణుడు మేధావి. విద్వాంసుడు అతడు యోగ్యుడగు శిష్యునకు ఉత్తమ స్థానమునందు ఈ రహస్యములను అన్నింటిని ఉపదేశించినాడు.

5. ఈ వరుణునితో ఉత్తమ, మధ్యమ, అధమ మూడు విధముల ద్యులోకములు ఉన్నవి. ఇతనిలో ఉత్తమ, మధ్యమ,

అధమ భూములు ఋతువులనుబట్టి ఆరు దశలు ఉన్నవి. రాజావరుణుడు బంగారు ఊయలవంటి సూర్యుని వెలుగు కొఱకు ఏర్పరచినారు.

6. వరుణుడు సూర్యునివంటి వెలుగు కలవాడు. అతడు సముద్రములను స్థాపించినాడు. వరుణుడు జలబిందువు వంటి నిర్మలుడు. గౌరమృగము వంటి బలవంతుడు. గంభీరస్తోత్రమువంటి జలముల నిర్మాత. దుఃఖములను దాటగల బలవంతుడు. లోకములందలి సమస్త పదార్థములకును రాజు.

7. వరుణుడు అపరాధిని సహితము అనుగ్రహించును. దీనత్వము ఎరుగని వరుణుని కార్యములను మేము యదావిధిగా సమృద్ధము చేయుదుము. అతనిముందు నిరపరాధులమై నిలుతుము. *"యూయంపాత స్వస్తిభః సదానః"*

## ఎనుబది ఎనిమిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - వరుణుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వసిష్ఠా ! కోటికలు తీర్చు వరుణుని గూర్చి స్వయంశుద్ధము, ప్రియతమమగు స్తుతి రచింపుము. వరుణుడు యజనీయుడు. బహుధనవంతుడు. అభీష్టవర్షి. విశాలుడు. వరుణుడు సూర్యుని మనకు అభిముఖుని చేయును.

2. ఇప్పుడు వెంటనే నేను వరుణుని దర్శనముచేసి కొందును. అగ్ని జ్వాలలను స్తుతింతును. వరుణుడు పాషాణమునందలి సుఖకర సోమమును తనివి తీర సేవించినప్పుడు అప్పుడు అతడు ప్రశస్తరూపమున దర్శనమిచ్చును.

3. నేను వరుణుడు నావపై ఎక్కినపుడు నావను సముద్ర మధ్యమున నడిపినపుడు నీటిమీద తేలియాడు నావపై మేమున్నపుడు. అప్పుడు నావరూపపు ఊయలలో ఊగుచు ఆనందముగ ఆటలాడినాము.

4. మేధావి వరుణుడు సూరాత్మరూపమున రాత్రింబవళ్లను పెంపొందించినాడు. దినములలో సుదినమున వసిష్ఠుని నావమీద ఎక్కించినాడు. వరుణుడు తన రక్షణలతో వసిష్ఠుని సుకర్మను చేసినాడు.

5. వరుణా ! మనకు పురాతన స్నేహము ఎచట ఏర్పడినది? పూర్వము మనకు హింసారహిత మైత్రి ఏర్పడినది. దానినే నిలుపుకొనుచున్నాము. అన్నవంత వరుణా ! గొప్పది, ప్రాణులకు విడదీయునది, వేయిద్వారములుగల నీ గృహమున నేను ప్రవేశింతును.

6. వరుణా ! వసిష్ఠుడు నీకు నిత్యబంధువు. ఔరసపుత్రుడు. అతడు పూర్వము ప్రియుడయి నీ విషయమును అపరాధము చేసినాడు. అతడు ఇప్పుడు నీకు మిత్రుడు కావలెను.

యజనీయ వరుణా ! మేము నీకు ఆత్మీయులము. కావున పాపయుక్తులమై భోగములు అనుభవించకుండరాదు. నీవు మేధావివి. స్తోతలకు కోటిన గృహము ప్రదానము చేయుము.

7. వరుణా ! మేమందరము నిత్యములగు భూములందు నివసింతుము. నిన్ను స్తుతింతుము. నీవు మాకట్లు విప్పవలెను. మేము అఖండభూతలము నుండి వరుణుని రక్షణలు అనుభవించవలెను. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## ఎనుబది తొమ్మిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు దేవత - వరుణుడు, ఛందస్సు - గాయత్రి, చివరిది జగతి.

1. రాజా ! వరుణా ! నీమట్టి ఇల్లు నాకు వద్దు బంగారపుది కావలెనని అర్థము. శోభన ధనవంత వరుణా ! అనుగ్రహించుము. మమ్ము సుఖింప చేయుము, "మృళాసుక్షత్ర మృళయ"

2. ఆయుధములుగల వరుణా ! నేను వడకుచు గాలితోలిన మబ్బువలె సాగుదును. "మృళాసుక్షత్రమృళయ"

3. ధనవంతుడు, నిర్మలుడవగు వరుణా ! దీనత, అసమర్థత వలన శ్రౌత, స్మార్తాదికర్మానుష్ఠానములకు ప్రతికూలుడనైనాను. "మృళా సుక్షత్ర మృళయ"

4. నేను స్తోతను సముద్రమున ఉన్నాను. అయినను దాహమగుచున్నది. *"మృళా సుక్షత్ర మృళయ"*

5. వరుణా ! మేము మానవులము. దేవతల విషయమున అపకారము చేసి ఉండవచ్చును. అజ్ఞానము వలన చేయవలసిన కర్మలందు ప్రమత్తులము కావచ్చును. అట్టి అపరాధములను ఎంచి మమ్ము కొట్టకుము.

(ఆంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ మండలము ఐదవ అష్టకమున అయిదవ అనువాకము సమాప్తము.)

## ఆరవ అనువాకము తొంబదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - వాయువు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వాయువా ! నీవు వీరుడవు. శుద్ధము, మధురము అభిషుత సోమమును అధ్వర్యులు నీకు అందింతురు. నీవు నియుత్ గణములను అశ్వములను రథమునకు జోడించుము. విచ్చేయుము. ఆనందమునకు అభిషుత సోమభాగమును ఆరగింపుము.

2. వాయువా ! నీవే ఈశ్వరుడవు. నీకు ఉత్తమ ఆహుతి ఇచ్చిన యజమానివి. పవిత్ర సోమము సమర్పించిన వానిని మానవులందు ప్రధానుని చేయుము. అతడు సర్వత్ర ప్రఖ్యాతుడగును. అందవలసిన ధనమును అందుకొనును.

3. ద్యావాపృథ్వులు ధనముకొఱకు ఈ వాయువును సృష్టించినవి. ప్రకాశమానమగు స్తుతి ధనము కొఱకు ఈ వాయువును ధరించినది. అట్టి వాయువును ఇప్పుడు అశ్వములు సేవించుచున్నవి.

4. పాపశూన్యులగు ఉషస్సులు సుదినములకు కారణభూతులగుటకు అంధకారమును నశింప చేసినారు. దీప్యమానులై విస్తీర్ణజ్యోతిని అందుకున్నవి. అంగిరులు గోరూపధనమును పొందినారు. ప్రాచీన జలములు అంగిరులను అనుసరించినవి.

5. ఇంద్రవాయువులారా ! యజమానులు సుమనస్కులై మననీయ స్తోత్రములతో వెలుగొందుదురు. వారివారి కర్మలు వీరకృత్యములతో రథములు సాధింతురు. ఆ రథములపై మిమ్ము ఆసీనులను చేయుదురు. మీరు ఈశ్వరులు. సమస్త అన్నములు మిమ్ము సేవించును.

6. ఇంద్రవాయువులారా ! మాకు గోవులు, అశ్వములు, గృహములు, బంగారములతో సుఖింప జేయునట్టి క్షమతాశీలదాతలు యుద్ధమున అశ్వములు, వీరుల సాయమున సుదీర్ఘ జీవనమును గెలుచుకొందురు.

(జీవనము యుద్ధరంగమని దానిని గెలుచుటకు దానము కారణమని చెప్పినాడు)

7. అశ్వమువంటి హవివాహకులు, అన్నమును ప్రార్థించువారు, బలమును కోరువారగు వసిష్ఠగణములు ఉత్తమ స్తుతులతో ఇంద్రవాయువులను ఆహ్వానింతురు. *"యూయంపాత స్వస్తిభిః సదానః"*

## తొంబది ఒకటవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - వాయువు, ఛందస్సు - త్రిష్టుప్.

1. ప్రాచీన కాలమున ప్రవృద్ధులైన స్తోతలు వాయువునకు అనేక స్తోత్రములు వచించినారు. ప్రశస్తులయినారు. వారు ఆపదలందున్న మానవులను తరింపచేయుటకు వాయువునకు హవి అర్పించుటకుగాను సూర్యునితో ఉషను ఒకేచోట నిలిపినారు.

2. ఇంద్రవాయువులారా ! మీరు కామాయమానదూతలు రక్షకులు మీరు బాధించవలదు. నెలలు, ఏండ్ల పర్యంతము కాపాడవలెను. మా సుందర స్తుతి మిమ్ము చేరి సుఖప్రదము, ప్రశంసనీయము, సులభ్యమగు ధనమును యాచించును.

3. వాయువు - మంచి బుద్ధిగలవాడు. తన గుఱ్ఱముల కొఱకు తెలుపును. ఎన్నుకున్నవాడు. అతడు ప్రాచుర అన్నవంతులు, ధనవృద్ధిగలవారిని ఆశ్రయించును. వారు సహితము మంచి మనసుగలవారై, వాయువుకొఱకు యజ్ఞము చేయుటకు వివిధ రీతుల చేరినారు. వారు సుందర సంతతికి కారణభూతములగు కార్యములను చేసినారు. యజ్ఞమువద్దకు విచ్చేయుము. ఈ యజ్ఞమున సోమపానము చేయుము. ఉన్మత్తుడవగుము. "యూయం పాత స్తస్తిభిః సదానః"

4. మీ దేహమున వేగము ఉన్నంతవరకు బలము ఉన్నంతవరకు నేతలు జ్ఞానబలమున ప్రకాశమానులయినంతవరకు - అప్పటివరకు విశుద్ధ సోమపానము చేయు ఇంద్రావరుణులారా ! ఈ కుశలపై ఆసీనులుకండి. విశుద్ధ సోమపానము చేయండి.

5. ఇంద్రవాయువులారా ! మీరు కోఱదగిన స్తోత్రములుగలవారు. మీ అశ్వములను ఒకే రథమున పూన్చండి. మా వద్దకు విచ్చేయండి. ఈ సోమమునందలి అగ్రభాగము మీ కొఱకు తెచ్చినాము. సోమము సేవించుడు. ప్రసన్నులగుడు. మమ్ము పాపములనుంచి విడిపించుడు.

6. ఇంద్రవాయువులారా ! మీ అశ్వములు శత సంఖ్యాకములు. అవి మిమ్ము సేవించును. అందరిని ఆకర్షించు అశ్వములు శత సంఖ్యాకములు. అవియు మిమ్ము సేవించును. శోభన ధనములు ఇచ్చునట్టి ఆ అశ్వములతో మావద్దకు విచ్చేయండి.

7. అశ్వమువంటి హవివాహకులు, అన్నమును ప్రార్థించువారు, బలమును కోరువారును వసిష్ఠగణములు ఉత్తమ స్తుతులతో ఇంద్రవాయువులను ఆహ్వానింతురు. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## తొంబది రెండవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - వాయువు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వాయువా ! నీవు పవిత్ర సోమము అందుకొనువాడవు. మావద్దకు విచ్చేయుము. నిన్ను అందఱు అభిలషింతురు. నీకు వేయి గుఱ్ఱములున్నవి. నీవు ప్రథమ సోమమునకు అధికారివి. అట్టి మాదకమగు సోమమే నీ కొఱకు పాత్రలో ఉన్నది.

2. క్షిప్రకారులు, సోమమును అభిషవించు అధ్వర్యులు ఇంద్రవాయువుల కొఱకు యజ్ఞమున సోమము ఏర్పరచినారు. ఇంద్రవాయువులారా ! దేవాభిలషగులవారు అధ్వర్యులు కర్మద్వారా మీకొఱకు ఈ యజ్ఞమున సోమపు అగ్రభాగము అర్పించినారు.

3. వాయువా ! గృహమునందున్న హవ్యదాత వద్దకు యజ్ఞమునకు ఏ అశ్వములతో ఏగుదువో వానితోనే విచ్చేయుము. మాకు అన్నవంత, ధనము, వీరపుత్రులు, గోవులు అశ్వములతో కూడిన వైభవము ఇమ్ము.

4. ఇంద్రవాయువులను తృప్తులను చేయు స్తోతలు దేవయుక్తులు. అందువలన వారు శత్రునాశకులు. వారిసాయమున మేము శత్రునాశము చేయు సమర్థులము అగుదుము. ఆ స్తోతల సహితులమై మేము శత్రువును పరాభవించగలము.

5. వాయువా ! శతసంఖ్యాక, సహస్రసంఖ్యాకములగు నీ అశ్వములతో హింసాశూన్యమగు మా యజ్ఞమువద్దకు విచ్చేయుము. ఈ యజ్ఞమున సోమపానము చేయుము. ఉన్మత్తుడవగుము. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## తొంబది మూడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఇంద్రాగ్నులు, ఛందస్సు - త్రిష్టుప్.

1. వృత్రఘ్న ఇంద్రా ! అగ్నీ ! ఈనాటి నాస్తోత్రము పరిశుద్ధము నవోత్పన్నము. దీనిని మీరు స్వీకరించండి. మీరు సుఖముగ పిలువ తగినవారు. నేను మిమ్ము మరల మరల పిలుస్తాను. యజమాని మిమ్ము అభిలషించును. అతనికి వెంటనే అన్నము ప్రదానము చేయండి.

2. ఇంద్రాగ్నులారా ! మీరు విధిపూర్వకముగ పూజనీయులు. మీరు బలిభూతము వంటి శత్రుభంజకులుకండి. మీరు ఒకేసారి పెంపొందువారు. విశేష ధనవంతులు. అన్నములకు ఈశ్వరులు. మీరు దృఢమును శత్రువినాశకమగు అన్నము మాకు ప్రసాదించండి.

3. హవివంతులు, కృపాభిలాషులగు విప్రులు అనుష్ఠానముతో యజ్ఞలబ్ది పొందుదురు, అట్టి నేతలగు జనులు అశ్వము యుద్ధభూమిని వ్యాప్తము చేసినట్లు ఇంద్రావరుణుల కర్మములకు వ్యాప్తికలిగింతురు. వారిని మాటిమాటికి

పిలుతురు.

4. ఇంద్రాగ్నులారా ! విప్రులు మీ కృపార్థులు. యశోవంతులు. తొలుత అనుభవించదగిన ధనము కొఱకు స్తోత్రములతో మిమ్ము స్తుతిస్తారు. నూతనము, దానయోగ్యమగు ధనముతో మమ్ము వర్ధిల్లచేయండి.

5. విశాలములు, పరస్పర యుద్ధము చేయునవి, యుద్ధమందు ప్రయత్నశీలములగు ఉభయ సేనలను మీ తేజస్సుతో ఎల్లప్పుడు నష్ట పరుస్తుండండి. సోమాభిషవకర్త, దేవాభిలాషి యజమాని సాయమున దేవాభిలాష లేనివారిని నాశనముచేయండి.

6. ఇంద్రావరుణులారా ! మంచి మనసునకుగాను మీరు మా సోమాభిషవ కర్మకు విచ్చేయండి. మీరు మమ్ము గాక ఇతరులను ఎరుగరు. అందువలన చాల అన్నముతో మిమ్ము ఆహ్వానించుచున్నాము.

7. అగ్నీ ! నీకు ఈ అన్నమున సమిద్ధుడవగుము. ఇంద్రుడు, మిత్రుడు, వరుణునకు ఇది రక్షణీయమని చెప్పుము. మేము చేసిన అపరాధములనుండి మమ్ము రక్షింపుము. ఆర్యమ, అదితి సహితము అట్టి మా అపరాధమును తొలగించవలెను.

8. అగ్నీ ! శీఘ్రముగ ఈ యజ్ఞమును ఆశ్రయింపుము. మా అందరకు ఒకేసారి నీ అన్నము లభించవలెను. ఇంద్ర, విష్ణు, మరుద్గణములు మమ్ముకాక ఇతరులను చూడరాదు. *"యూయంపాత స్వస్తిభిః సదానః"*

## తొంబది నాలుగవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఇంద్రాగ్నులు, ఛందస్సు - జగతి, చివరిది అనుష్టుప్.

1. ఇంద్రాగ్నులారా ! మేఘము నుండి వర్షమగునకదా, అట్లే ఈ స్తోతనుండి ప్రధానమగు స్తుతి కలిగినది.

2. ఇంద్రాగ్నులారా ! మీరు ఈశ్వరులు. స్తోత పిలుపు వినండి. అతని స్తుతిని భోగించండి. అనుష్ఠిత కర్మను పూర్తిచేయండి.

3. నేతలగు ఇంద్రాగ్నులారా ! మమ్ము హీనభావము, పరాభవము అను నిందలలోనికి త్రోయకండి.

4. రక్షణలు కోఱిన మేము విశిష్ఠహవ్యము, సుందర స్తుతి, కర్మయుక్త వచనములను ఇంద్రాగ్నులవద్దకు పంపుదుము.

5. రక్షణల కొఱకు విప్రులు ఇంద్రాగ్నులను స్తుతింతురు. బాధలందు ఉన్నవారుకూడ అన్నప్రాప్తి కొఱకు స్తుతింతురు.

6. మేము స్తోత్రాభిమానులము. అన్నవంతులము. ధనాభిలాషులము. యజ్ఞప్రాప్తికొఱకు మిమ్ము స్తుతింతుము. ఆహ్వానింతుము.

7. ఇంద్రాగ్నులారా ! మీరు మానవులను సృష్టించువారు. మావద్దకు మీరు అన్నసహితులైరండి. కఠినవాక్కులాడువాడు మాకు ప్రభువుకారాదు.

8. ఇంద్రాగ్నులారా ! మాకు ఎటువంటి శత్రువుయొక్క హింస కలుగరాదు. మాకు సుఖములను ఇవ్వండి.

9. ఇంద్రాగ్నులారా ! మీవద్ద గోవులు, అశ్వములు, హిరణ్యయుక్త్ ధనమున్నది. మేము దానిని యాచించుచున్నాము. అది మా అనుభవమునకు రావలెను.

10. కర్మ నేతలు సోమము అభిషవింతురు. సేవాభిలాషులు అగుదురు. అశ్వములుగల ఇంద్రుని అగ్నిని తేప తేప పిలిచెదరు.

11. అందరిని మించిన వృత్రహంత, ఆనందమగ్నుడు ఇంద్రుని, అగ్నిని మేము ఉక్థము స్తోత్రము, అన్నస్తవములతో సేవింతుము.

12. ఇంద్రాగ్నులారా ! దురాలోచనపరులను దుష్టజ్ఞానవంతులను, దుష్టబలవంతులను చోరులను కుండలను బ్రద్దలు కొట్టినట్లు కొట్టండి.

## తొంబది ఐదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - సరస్వతి, ఛందస్సు - త్రిష్టుప్.

1. సరస్వతి లోహనిర్మిత పురివలె ధారయిత్రి అగును. ఆమె జీవనదారక జలముతో ప్రవహించును. ఆమె తన మహిమతో సారథివలె ఇతర నదులను బాధించుచు సాగును.

2. ఒకే సరస్వతి నదులలో పవిత్ర. పర్వమునుండి సాగరమువరకు సాగునది. ఆమె నహుషుని ప్రార్థన విన్నది. నహుషునకు ఎంతో ధనము ఇచ్చినది. అతని కొఱకు ఘృత, దుగ్ధధారలు పారించినది.

3. సరస్వతి మానవ శ్రేయస్సు కొఱకు వర్షము కలిగించు సమర్థురాలు. ఆమె పుట్టుకతో శిశువు. యజ్ఞములందు యోషిత. జలముల మధ్య పెరిగినది. ఆమె హవిష్మంత యజమానికి బలశాలి అగు పుత్రుని ఇచ్చును. లాభము కలిగించి అనేకుల సంస్కరించును.

4. సరస్వతి శోభన ధనములు కలది. ఆమె ప్రసన్నురాలు కావలెను. యజ్ఞమునకు రావలెను. స్తుతులు వినవలెను. పూజనీయులగు దేవతలు తలలువంచి ఆమె దగ్గరకు వెళ్లుదురు. సరస్వతి నిత్యధనవంతురాలు. తన సఖుల విషయమున దయామయి.

5. దేవీ సరస్వతీ ! మేము ఈ హవ్యమును హవనము చేసి నమస్కరించి నీవద్దనుండి ధనము అందుకుందుము. మా స్తుతిని స్వీకరించుము. మేము నీకు అత్యంత ప్రియమగు గృహమున ఉందుము. ఆశ్రయించిన వృక్షమువలె నీవద్దనే నిలుతుము.

6. సుధన సరస్వతీ ! ఈ వసిష్ఠుడు యజ్ఞద్వారములు తెరుస్తాడు. శుభ్రవర్ణదేవీ ! సాగుము. స్తోతకు అన్నము అందించుము. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

**తొంబది ఆరవ సూక్తము**

ఋషి వసిష్ఠుడు, దేవత - సరస్వతి, ఛందస్సు - 1,2 బృహతి, 3 ప్రస్తారపంక్తి, మిగిలినవి గాయత్రి.

1. వసిష్ఠా ! సరస్వతి నదులలో బలవతి. ఆమె కొఱకు బృహత్ స్తోత్రములు పాడుము. ద్యావాపృథ్వులందు వర్తించు సరస్వతినే నిర్దోష స్తోత్రములతో పూజింపుము.

2. శుభ్రవర్ణ సరస్వతీ ! నీ మహిమ వలననే మానవుడు దివ్య పార్థివ అన్నములను పొందుచున్నాడు. నీవు మమ్ము గ్రహింపుము. రక్షింపుము. మరుత్తుల సఖివై హవిర్దాతలకు ధనమంపుము.

3. శుభంకరీ సరస్వతీ ! నీవు శుభములు మాత్రమే సమకూర్చుము. సుందర గమనవగుము. అన్నవతిని అగుము. మాకు ప్రజ్ఞ కలిగించుము. నేను జమదగ్నివలె నిన్ను స్తుతించుచున్నాను. నీవు వసిష్ఠ స్తూయమానవగుము.

4. మేము స్త్రీలను పుత్రులను కోరుకొను దాతలము స్తోతలము. మేము సరస్వతిని స్తుతించుచున్నాము.

5. సరస్వాన్ ! నీవద్ద రసవంతములగు జలసమూహములు వర్షజలములు ఉన్నవి. వానితో మమ్ము రక్షింపుము.

6. ప్రవృద్ధ సరస్వతి స్తవమువంటి మధుధారలు మాకు అందవలెను. ఆమె సర్వదర్శనీయ మేము ప్రజ్ఞయు అన్నమును పొందవలెను.

## తొంబది ఏడవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - బ్రహ్మణస్పతి, బృహస్పతి, ఛందస్సు - త్రిష్టుప్.

1. సేవాభిలాషి నేతలు ఉన్మత్తులయిన యజ్ఞమున భూలోకనేతలు సమస్త సోమము ఇంద్రుని కొఱకు అభిషవించు యజ్ఞమున ఆ యజ్ఞమునకే హృష్టుడగుటకుగాను ఇంద్రుడు తొలుతరావలెను. నడకలుగల అశ్వములుకూడ రావలెను.

2. మిత్రులారా ! మేము దేవతల రక్షకుగాను ప్రార్థించుచున్నాము. బృహస్పతి మా హవ్యములు స్వీకరించవలెను. దూరదేశమునుండి ధనముతెచ్చి తండ్రికొడుకుకు ఇచ్చును. అట్లే బృహస్పతి మాకు దానము చేయును. కోరికలు తీర్చు బృహస్పతివద్ద మేము అపరాధులము కారాదు. ఆరీతి చేయకుము.

3. బ్రహ్మణస్పతి జ్యేష్ఠుడు. సుందరుడు. సుఖవంతుడు. మేము అతనికి నమస్కరింతుము. హవ్యములిత్తుము. స్తుతింతుము. దేవకృత మంత్రములకు ప్రభువగు ఇంద్రుని బ్రహ్మణస్పతిని శ్లోకములతో స్తుతించండి.

4. ఈ ప్రియతమ బ్రహ్మణస్పతి మా ఈ వేదిమీద ఆసీనుడు కావలెను. అతడు అందఱకు వరణీయుడు. మేము ధనము శోభన వీర్యము కోరియున్నాము. బ్రహ్మణస్పతి వానిని తీర్చవలెను. మేము చిక్కులలో చిక్కుకున్నాము. అతడు మమ్ము అహింసితుడయి దాటించవలెను.

5. అమర దేవగణములు తొలుత ఆవిర్భవించినారు. వారికి ఇష్టమైనదియు పూజాసాధనమగు అన్నము మాకు అందవలెను. శుద్ధ స్తోత్రవంతుడు, గృహస్థుల యజ్ఞయోగ్యుడు, అప్రతిగత బృహస్పతిని మేము పిలుచుచున్నాము.

6. సుఖకర, రుచికర, వహనశీల, జ్యోతిష్మంత అశ్వగణములు బృహస్పతిని వహించవలెను. బృహస్పతికి బలము నివాసమునకు గృహము ఉన్నవి.

7. బృహస్పతి పవిత్రుడు. అతని వాహనములు అనేకములు. అతడు అందరిని శోధించువాడు. హితకరము. రమణీయమగు విద్యావంతుడు. అతడు గమనశీలుడు. స్వర్గభోక్త, దర్శనీయుడు. ఉత్తమ నివాసవంతుడు అతడు స్తోతలకు అందరికన్న మిన్నగా అన్నము ఇచ్చును.

8. బృహస్పతి జనని దేవి ద్యావాపృథ్వి తన మహిమల బలముతో బృహస్పతిని వర్థిల్లచేయవలెను. మిత్రులారా ! వర్ధనీయ బృహస్పతిని వర్థిల్లచేయండి. అతడు మరింత అన్నమునకుగాను జలరాశిని సులభముగా దాటునట్లును సుఖముగ స్నానము చేయునట్లు చేయగలడు.

9. బ్రహ్మణస్పతీ ! నీ కొఱకును వజ్రధారి ఇంద్రుని కొఱకును నేను మంత్రరూప సుందర స్తుతులు రచించినాను. మీరిద్దరు మా అనుష్ఠానములను రక్షించండి. అనేక స్తుతులు వినండి. మేము మీ భక్తులము. మమ్ము ఆక్రమించదలచిన శత్రు సేనను నష్టపరచండి.

10. బృహస్పతీ ! నీవు, ఇంద్రుడు దివ్య, పార్థివ ఉభయ ధనములకు ప్రభువులు, అందుకే స్తోతలకు ధనము ఇచ్చెదరు. *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## తొంబది ఎనిమిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - త్రిష్టుప్.

1. అధ్వర్యులారా ! ఇంద్రుడు మానవశ్రేష్ఠుడు. అతని కొఱకు రుచికరమగు అభిషుత సోమపు హవనము చేయండి. ఇంద్రుడు సోమము దూరముగా ఉన్నదని, అది పానయోగ్యమని తెలియును. గౌరమృగము కన్న వేగముగా అభిషవము చేయు యజమానిని వెదకుచు మరల మరల వచ్చును.

2. ఇంద్రా ! పూర్వకాలము నీవు శోభన సోమమును సేవించినావు. ఇప్పుడు కూడ ప్రతినిత్యము అట్టి సోమమునే సేవించవలెననుకొనుము. హృదయమునందును, మనమునను మమ్మే నిలిపి నీముందట సమర్పించిన సోమమును సేవించుము.

3. ఇంద్రా ! నీవు పుట్టుకతోనే బలము కలుగుటకుగాను సోమపానము చేసినావు. నీ తల్లి అదితి నీ మహిమలు తెలియపరచినది. నీవు విస్తృత అంతరిక్షమును నీ తేజస్సుతో నింపినావు. యుద్ధము చేసి దేవతల కొఱకు ధనము పుట్టించినావు.

4. ఇంద్రా ! నీవు మాననీయులు, అభిమానధనులగు శత్రువుతో యుద్ధము చేయించినపుడు మేము బాహుబలమున వారిని పరాజితులను చేసెదము. అట్లుకాక మరుత్తులతో కూడి నీవు స్వయముగా యుద్ధమున దిగినచో అన్నముకొఱకగు ఆ యుద్ధమున మేము గెలువగలము.

(*"సాక్షామ జయేమ"* అను రెండు పదములు ప్రయోగించినాడు. సాక్షామ అనగా సహించగలము. ఓడించగలమని అర్థము, ఎదుటివారి ఓటమి మాత్రము తనజయముకాదు. కావున జయేమ జయింతుము అన్నాడు.)

5. నేను ఇంద్రుని పూర్వకర్మలను వక్కాణింతును. అతని నవీన కర్మములున్నవి. వానిని కూడ వివరింతును. ఇంద్రుడు ఆసురీమాయను ఓడించినాడు. కావున సోమము ఇంద్రునిది మాత్రమే అగును. *"భవత్కేవలః సోమో అస్య"*.

6. ఇంద్రా ! ప్రాణుల ఉనికికి నలుదిశల సమస్త విశ్వము నిలిచి ఉన్నది. దానిని నీవు సూర్యతేజమున వీక్షింతువు. అవన్నియు నీవే. నీవు ఒక్కడవే సమస్త గోవులకు స్వామివి. నీవు ఇచ్చిన ధనమునే మేము అనుభవింతుము.

*"ప్రయతస్యవస్వః"*

7. బృహస్పతీ ! నీవు, ఇంద్రుడు దివ్య, పార్థివ ఉభయ ధనములకు అధిపతులు. మీరిద్దరు స్తోత్రకర్త స్తోతలకు ధనము ఇచ్చువారు *"యూాయం పాత స్వస్తిభిః సదానః"*

## తొంబది తొమ్మిదవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - ఇంద్రుడు - విష్ణువు, ఛందస్సు - త్రిష్టుప్.

1. విష్ణూ ! నీవు శబ్దస్పర్శాది పంచతన్మాత్రలకు అతీతుడవై నీ దేహమును పెంచినావు. ఆ నీ మహిమను ఎరుగువారులేరు. మేము నీ ఉభయ పృథివ్యంతరిక్షలోకములను ఎరుగుదుము. కాని నీవు మాత్రమే పరమలోకమును ఎరుగుదువు. *"త్వం పరమస్య విత్సి"*

(విష్ణువు వామనుడై ముల్లోకములను వ్యాపించినాడు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు పంచతన్మాత్రలు. సృష్టి సాంతము ఈ అయిదింటిమీదనే ఆధారపడి ఉన్నది. విష్ణువు వీనికి అతీతుడు)

2. విష్ణూ ! భూమిమీద పుట్టినవాడు కాని పుట్టబోవువాడు కాని నీ మహిమల పారమును అందజాలడు. దర్శనీయము. విశాలమగు ద్యులోకమును ఎత్తిపట్టినావు. భూలోకపు తూర్పుదిశను ధరించి ఉన్నావు.

(తూర్పు దిశను ధరించుట అనగా సూర్యుడగుట)

3. ద్యావాపృథ్వులారా ! మీరు స్తోతలగు మానవులకు దానము చేయగోరి అన్నవంతులు, ధేనువంతులు

యువతులు అయినారు.

విష్ణువా ! నీవు వివిధ రీతుల ద్యావాపృథ్వులను క్రిందుమీదుగా నిలిపి ఉంచినావు. అంతట ఉన్న పర్వతములతో పృథ్విని నిలిపి ఉంచినావు.

4. ఇంద్ర, విష్ణువులారా ! మీరు సూర్యుని, అగ్నిని, ఉషను సృష్టించినారు. యజమాని కొఱకు విశాల స్వర్గమును నిర్మించినారు. మీరు *"వృహిశిప్ర"* నామక దస్యుని యుద్ధమున నష్టపరచినారు.

5. ఇంద్ర విష్ణువులారా ! మీరు శంబరుని తొంబది తొమ్మిది దృఢపురములను ధ్వంసము చేసినారు. వర్చినామక అసురుని నూరుగురు, వేయిమంది వీరులను హతమార్చినారు.

6. ఈ స్తుతి బృహత్, విస్తీర్ణ, విక్రమయుక్తము. ఇది బలశాలురగు ఇంద్ర విష్ణువులను వర్ధిల్లచేయును. యజ్ఞ స్థలమున వారికి ఈ స్తోత్రము సమర్పించబడినది. యుద్ధమున మీరు మా అన్నమును పెంచవలెను.

7. విష్ణూ ! యజ్ఞమున నీ కొఱకు నీటితో వహట్కారము చేసినాను. తేజోవంత విష్ణూ ! నీవు ఈ హవ్యమును స్వీకరింపుము. శోభనములగు మా స్తుతియు, వాక్కును నిన్ను వర్ధిల్ల చేయునుగాత, *"యూయం పాత స్వస్తిభిః సదానః"*

## నూరవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - విష్ణువు, ఛందస్సు - త్రిష్టుప్.

1. విష్ణువు బహుజన కీర్తనీయుడు. విష్ణువునకు హవ్యప్రదానము చేయవాడును ముక్తకంఠమున మంత్రములతో అతనిని పూజించువాడును మానవ హితైషి విష్ణువును సేవించువాడును ధనముకోరి దానిని పొందును.

2. కోరికలు తీర్చు విష్ణువా ! అందరికి హితకరమును, ద్వేషరహితమగు నీ అనుగ్రహమునకు మమ్ము పాత్రులను చేయుము. అందువలన మాకు పొందదగిన అనేక అశ్వములుగల బహుజ్ఞాన ఆనందకర ధనము లభించును. అదిలభించునట్లు చేయుము.

3. ఈ విష్ణు దేవుడు నూర్ల కిరణములు కలిగి ఈ భూమిని తన మహిమతో మూడుసార్లు చరణములు అంటించినాడు. ముల్లోకములను ఆక్రమించినాడు. పెద్దలకన్న పెద్ద విష్ణువు మాకు స్వామి. ప్రవృద్ధ విష్ణు రూపము ప్రదీప్తము.

4. ఈ భూమిని మానవనివాస యోగ్యము చేయగోరి ఈ విష్ణువు భూమిమీద అడుగు పెట్టినాడు. ఈ విష్ణువు స్తోతలు నిశ్చలులగుదురు. సుజన్మ విష్ణువు విశాల నివాస ప్రదేశమును ఏర్పరచినాడు.

5. తేజోవంత విష్ణూ ! నీవు స్తుతులకు స్వామివి. జ్ఞాతవ్యుడవు. నిన్ను తెలిసికొని నీ ప్రసిద్ధ నామమును కీర్తించుచున్నాము. నీవు మహత్తువు. నేను అణువును అయినను నిన్ను స్తుతింతును. ఏలననగా నీవు రజోలోకపు ఆవలివాడవు.

(అల్పానల్పములు రజోలోకమునకే పరిమితములు)

6. ఒకానొకప్పుడు విష్ణువు తనరూపము విడిచినాడు. కృత్రిమ రూపము దాల్చినాడు. యుద్ధమున వసిష్ఠునకు సాయము చేసినాడు. ఇది ఆ సందర్భము

విష్ణూ ! నేను నిన్ను శిపివిష్ణ, నామమున పిలిచినాను. దానిని స్వీకరించకుండుట బదులు పలుకకుండుట నీకు న్యాయమా? యుద్ధమున నీవు వేరు రూపము దాల్చినావు. మాముందు నీరూపమును దాచకుము.

7. విష్ణూ ! నీ కొఱకు నీటితో నేను వషట్కామము చేయుదును. కావున శిపివిష్ణూ ! మా హవ్యము స్వీకరింపుము. నా యొక్క అందమగు స్తుతి మఱియు వాక్యము నిన్ను వర్ధిల్ల చేయునుగాత *"యూయంపాత స్వస్తిభిః సదానః"*

(ఆంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ మండలము ఐదవ అష్టకమున ఆరవ అధ్యాయము సమాప్తము.)

**ఓం నతామినన్తిమాయివో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రువాణి.**
**నరోదసీ అద్రుహా వేద్యాభిర్నపర్వతానినమే తస్థివాంసః**

**ఏడవ అధ్యాయము నూట ఒకటవ సూక్తము**

ఋషి - వసిష్ఠుడు, దేవత - పర్జన్యుడు, ఛందస్సు - త్రిష్టుప్.

**ఓం త్రిపోవాచః ప్రవదజ్యోతిరగ్రాయా పితద్దు హేమధు దోఘమూధః**
**వత్సం కృణ్వన్వర్గ మోష ధీనాం పద్యోజాతో వృషభోరోరవతి**

1. అగ్రభాగమున విద్యుత్తు ఓంకారము గల ఋక్, యజుస్సామ త్రివిధవాక్యములు జలములను పితుకును. ఆ వాక్యములనే పలుకుము. పర్జన్యుడే సహవాసి అయి విద్యుదగ్నిని ఉత్పన్నము చేయును. ఓషధులకు గర్భము కలిగించును. వెంటనేపుట్టి వృషభమువలె గర్జించును.

(తిస్రోవాచః అనగా ద్రుత, విలంబిత, మధ్యమములు కూడ కావచ్చును)

2. పర్జన్యుడు ఓషధుల వర్ధకుడు. జలవర్ధకుడు. సకల లోకములకు ఈశ్వరుడు. అతడు మాకు త్రిధాతుయుక్త గృహము, సుఖములు ప్రదానము చేయవలెను. మూడు ఋతువులందు ఉండు సుందరగమనముగల జ్యోతిని మాకు ఇవ్వవలెను.

(త్రీణివా ఆదిత్యస్య తేజాంసి వసంతప్రాతర్గ్రీష్మే మధ్యన్దినే శరదపరాహ్ణఇతి. సూర్యునకు మూడు తేజస్సులు ఉన్నవి. ఉదయము వసంతము-పగలు గ్రీష్మము అపరాహ్ణమున శరత్తు)

3. పర్జన్యుని ఒక రూపము. ఈత ఉడిగిన గోవు వంటిది. మరొకటి జల వర్షకము. అతడు తానుకోరుకున్నట్లు రూపములు ధరించును. అతడు మాత పృథ్వి, పిత ద్యులోకము నుండి పాట స్వీకరించును. అందువలన తండ్రి ద్యులోకము, పుత్రులగు ప్రాణి వర్గము వర్ధిల్లును.

4. పర్జన్యుడు సకల భువనములందు ప్రాణులందు ఉన్నాడు. అతడు ద్యులోకాది మూడు లోకములందు ఉన్నాడు. అతని నుంచి మూడు ప్రకారముల తూర్పు, పడమర - దిగువ జలములు కలుగును. అతడు నాలుగు దిక్కులను తడుపునట్టి మూడు తూర్పు, పడమర పైభాగపు మేఘములు వర్షించును.

5. పర్జన్యుడు స్వయం ప్రకాశమానుడు. ఈ స్తోత్రము అతని కొఱకే రచించబడినది. అతడు దీనిని స్వీకరించవలెను. మాకు సుఖము కలిగించు వర్షము కలుగవలెను. పర్జన్యుడు అనుగ్రహించినవాని ఓషధులు పంటలు ఫలించును.

6. వృషభమువలె పర్జన్యుడు సకల ఓషధులకు రేతస్సు జలము ఇచ్చును. సమస్త స్థావర జంగమములు పర్జన్యునిలోనే ఉండును. పర్జన్యుడు ప్రదానము చేసిన జలము నాకు నూరేళ్ళ ఆయువునిచ్చి రక్షించవలెను. *"యూాయంపాతస్వస్తిభిః సదానః"*

**నూట రెండవ సూక్తము**

ఋషి - వసిష్ఠుడు, దేవత - పర్జన్యుడు, ఛందస్సు - గాయత్రి.

1. స్తోతలారా ! అంతరిక్షపుత్రుడు, సేచకుడు పర్జన్యుని కొఱకు స్తుతులు గానము చేయండి.

2. పర్జన్యుడు ఓషధులకు, గోవులకు, అశ్వములకు స్త్రీలకు గర్భాదానము చేయును.

3. పర్జన్యుని కొఱకు దేవతల ముఖమగు అగ్నిలో రసవంత హవ్యమును హవనము చేయండి. అతడు మనకు అమిత అన్నము ఇవ్వవలెను.

## నూట మూడవ సూక్తము

ఋషి వసిష్ఠుడు, దేవత - మండూకము, ఛందస్సు - మొదటిది అనుష్టుప్, మిగిలినవి త్రిష్టుప్.

1. బ్రాహ్మణుడు ఒక సంవత్సర పర్యంతము వ్రతము చేయును. అట్లే మండూకము సంవత్సర పర్యంతము శయనించును. అప్పుడు పర్జన్యుని ప్రసన్నుని చేయుటకు పలుకును.

(కప్పలు బెకబెలాడిన వర్షము వచ్చునని ప్రతీతి)

2. మండూకము ఎండిన చర్మమువలె సరోవరములందు పడుకొని ఉండును. వాటి వద్దకు వర్షజలము వచ్చినపుడు లేగదూడవలె కలకలారావము చేయును.

3. వర్షకాలము వచ్చును. పర్జన్యుడు ఎదిరిచూచిన, దప్పిగొన్న కప్పలను నీటముంచును. బూడిబడి పలుకులతో తండ్రివద్దకు పోవు కొడుకువలె ఒక కప్ప మరొక కప్ప వద్దకు చేరును.

4. వర్షము పడినపుడు రెండు జాతుల కప్పలు సంతోషపడును. పర్జన్యుడు కురిపించిన వర్షమును పొడవగు గంతులు వేయును. బూడిదరంగువి ఆకుపచ్చవానితో కలిసి ధ్వనులు చేయును. ఆ సమయమున ఒక కప్ప మరొకదానిని అనుగ్రహించును.

5. శిష్యుడు గురువును అనుకరించినట్లు మండూకములు ఒకదాని ధ్వనిని మరొకటి అనుకరించును. మండూకములారా ! మీరు సుస్వర శబ్దములు చేయుచు నీటిమీద దూకునపుడు మీ శరీరపు కీళ్లు సరి అగును.

6. కప్పలలో ఒకటి ఆవువలె, మరొకట మేకవలె అరచును. ఒకదానిది పొగరంగు. మరొకదానిది పచ్చరంగు. పేరు అన్నింటిది ఒకటే కాని రూపములు అనేకములు. అవి నానాదేశములందు ధ్వనులు చేయుచు కనిపించును.

7. మండూకములారా ! అతిరాత్రి సోమయజ్ఞమున బ్రాహ్మణమువలె నిండిన కొలనులో బెకబెకలాడుచు నలువైపుల విహరించండి.

8. సోమయుక్తము మరియు వార్షిక స్తుతులు చేయు విప్రులవలె మండూకములు శబ్దము చేయును. స్వేదము నిండిన ఋత్విక్కులవలె తడిసినట్లున్న కప్పలు వేడికాలమున కన్నములందుదాగి వర్షకాలమున బయటపడును.

9. మండూకనేతలు ప్రకృతినియమములను కాపాడును. అవి పన్నెండు నెలలు ఋతువులను వృధాకానివ్వవు. ఏడాది పూర్తికాగా వానకాలమురాగా ఎండవేడికి మ్రగ్గిన కప్పలు గుంతల బంధనములు విడిపించుకొనును.

10. ఆవువలె అరుచు మండూకము మాకు ధనము ఇవ్వవలెను. మేకలవలె అరుచు మండూకములు మాకు ధనము ఇవ్వవలెను. బూడిద రంగువి మాకు ధనము ఇవ్వవలెను. పసుపురంగువి ధనము ఇవ్వవలెను. వేల పంటలు పండించు వర్షకాలమున మండూకములు మాకు అసంఖ్యాక గోవులను ఇచ్చి మా ఆయువును పెంచవలెను.

(ఇది పరిహాసమా? కప్పనుకూడ కీర్తించ వచ్చునని చెప్పుటయా? వినోదమా?)

## నూట నాలుగవ సూక్తము

ఋషి - వసిష్ఠుడు, దేవత - వేరు వేరు, ఛందస్సు - వేరు వేరు.

1. ఇంద్రసోములారా ! మీరు రాక్షసులకు దుఃఖము కలిగించండి. చావగొట్టండి. అంధకారమున వృద్ధిచెందు రాక్షసులను నేలకరిపించండి. అజ్ఞాని రాక్షసులను విముఖులను చేసి హింసించండి. కాల్చండి. కొట్టిపారేయంది. దూరమునకు విసరండి - భక్షక రాక్షసులను జర్జరముచేసి విసరివేయండి.

2. ఇంద్రసోములారా ! అనర్థ ప్రశంసకులు. ఆక్రమకులగు రాక్షసులను వెంటనే అణచివేయండి. మీ తేజస్సున మాడిన రాక్షసులను అగ్నిలోనికి విసరిన చరువలె విలుప్తము చేయండి. బ్రాహ్మణద్వేషులు, మాంసభక్షకులు, ఘోరనేత్రులు, కఠినవాక్కుగల రాక్షసులను సర్వదా ద్వేషించునట్లు చేయండి.

3. ఇంద్రసోములారా ! దుష్కర్మలగు రాక్షసులను అంతర్మధ్యమున ఆలంబనములేని అంధకారమున పడేసి చంపండి. మరల వారిలో ఒక్కండును బయటికి రానట్లు పరిమార్చండి. మీకుగల క్రోధవంతమగు ప్రసిద్ధబలము రాక్షసులను అణచుటకు సమర్థవంతము కావలెను.

4. ఇంద్రసోములారా ! అంతరిక్షమునుండి ఘాతక ఆయుధములు నిర్మించండి. ఈ నేలనుండి ఘాతక ఆయుధములు నిర్మించండి. మీరు రాక్షసులను ధ్వంసము చేసిన వజ్రమును మేఘమునుండి సృష్టించండి.

5. ఇంద్రసోములారా ! అంతరిక్షమున నలువైపులకు ఆయుధములు పంపండి. అగ్నివలె కాల్చునవి, తపింప చేయునవి, దృఢములు, రాళ్లతో చేసిన అస్త్రములతో రక్కసుల పక్కలు పగులకొట్టండి. ఆ రాక్షసుల నోరుమూసుకొని పారిపోవలెను.

6. ఇంద్రసోములారా ! చంకకు తగిలించుకొను త్రాడువంటిదానితో గుఱ్ఱములను కట్టుదురు. మా ఈ మనోహర స్తుతి మాకు ఆవిధముగా చెందవలెను. మీరు బలవంతులు. బుద్ధిబలమున ఈ స్తోత్రమును పంపుచున్నాము. రాజులు ధనముతో నింపినట్లు మీరు ఈ స్తోత్రములను ఫలవంతము చేయండి.

7. ఇంద్రసోములారా ! వేగవంతమగు గుఱ్ఱముపై రారండి. ద్రోహులు, భంజకులగు రాక్షసులను మట్టు పెట్టండి. పాపి రాక్షసుడు ద్రోహము తలచి ఎప్పుడో ఒకప్పుడు మనను కొట్టవచ్చును. కావున వాడికి సుఖము కలిగించకండి.

8. నేను పరిశుద్ధ మనస్కుడను. నన్ను అసత్యభాషిని చేసిన రాక్షసులు ఉన్నారు. ఇంద్రసోములారా ! అట్టి అసత్యవాది రాక్షసుని మట్టిలోపడిననీటివలె అస్తిత్వ రహితుని చేయండి.

9. సత్యవాదినగు నన్ను తన స్వార్థము కొఱకు లజ్జితుని చేయువానిని, కళ్యాణవృత్తిగలనన్ను బలవంతుడై దోషిని చేయువానిని పాములమీద పడేయండి లేదా పాపదేవత వడిలోకి విసరండి.

(ఇచట రాక్షసులు, అని చెప్పలేదు, మనిషిని తప్పుదారి పట్టించువారు రాక్షసులు మాత్రమేకారు)

10. అగ్నీ ! మా అన్నపుసారమును నష్టపరచ తలచువాడును, మా అశ్వముల గోవుల వాటి సంతానముల సారమును నష్టపరచ దలచినవాడును అగు శత్రువు, దొంగ, ధనాపహర్త రాక్షసులు హింసలుపాలు కావలెను. వాడు తన దేహము, సంతాన సహితముగా నాశనము కావలెను.

11. మమ్ము రాత్రింబవళ్లు బాధల పాలుచేయగోరు రాక్షసుడు దేహరహితుడు, సంతానరహితుడు కావలెను. వాడు మూడు లోకముల అడుగునకు పోవలెను. దేవతలారా ! అతని కీర్తిని ఎండగొట్టండి.

12. సత్యాసత్యవచనముల పరస్పర ప్రతిస్పర్థ విద్వాంసునకు తెలియును. వానిలో సత్యము సరళతమము అయిన దానిని సోముడు పాలించును అసత్యమును హింసించును.

13. సోమదేవత పాపిని, బలయుక్తిని, మిథ్యా వాదిని విడువడు. చంపును. అతడు రాక్షసులను చంపును. అసత్యవాదిని కూడ చంపును. అట్లు చచ్చిన వారు ఇంద్రుని ఉచ్చునపడి ఉందురు.

14. నేను అసత్య దేవతలవాడనే అయినను. వృథాగా దేవతలవద్దకు వెళ్లువాడనే అయినను ధనీ అగ్నీ ! నా విషయమున క్రోధమెందుకు వహింతువు? మిథ్యావాదులు నీ హింసకు గురికావలెను.

15. నేను వసిష్ఠుడను రాక్షసుడనైనచో, ఏ వ్యక్తి ఆయువునైన నష్టపరచినచో ఇప్పుడే చచ్చిపోవలెను. అట్లుకాక నన్ను వృధాగా రాక్షసుడన్నవాడు భార్యా, బిడ్డలు బంధువులు సహితముగా నాశనముకావలెను.

16. అరాక్షసుడనగు నన్ను రాక్షసుడన్న రాక్షసుని తనను తాను పరిశుద్ధుడనుకున్న రాక్షసుని ఇంద్రుడు తన మహాయుధముతో బాధవలెను. వాడు సకల ప్రాణులలో అధముడై పతితుడు కావలెను.

17. రాత్రిళ్లు ద్రోహబుద్ధితో గుడ్లగూబ రూపము దాల్చి చరించు రాక్షసి తలపండు పగిలి బొందలో పడవలెను. అభిషవ శబ్దములు శిలలు సహితము రాక్షసుడు నష్టపరచవలెను.

18. మరుత్తులారా ! మీరు ప్రజల వివిధ రీతులందు వసించండి. రాత్రులు పక్షి రూపమున వచ్చు రాక్షసులను ప్రదీప యజ్ఞమును బాధించువారిని పట్టి, కొట్టి పిండి చేయండి.

19. ఇంద్రా ! అంతరిక్షమునుండి వజ్రమును పంపుము. సోమపు వడిగల యజమానిని సంస్కరింపుము. గ్రంథులుగల వజ్రమున తూర్పు, పడమర, దక్షిణ, ఉత్తర దిశలందున్న రాక్షసులను నాశము చేయుము.

20. ఈ రాక్షసులు కుక్కల సహితులై పట్టుచు వస్తారు. బాధించరాని ఇంద్రుని హింసించ దలచిన రాక్షసులను వధించుటకు ఇంద్రుడు వజ్రమును పదును పెట్టుచున్నాడు, ఇంద్రుడు త్వరగా రాక్షసుల మీద వజ్రాయుధము ప్రయోగించవలెను.

21. ఇంద్రుడు హింసకులకు హింసకుడు. రంపము చెట్లను కోసినట్లు స్తుతి గిన్నెలను బద్దలకొట్టినట్లు ఇంద్రుడు హవ్యమంథన కర్త, అభిముఖ ఆగమనకర్త కొరకు రాక్షసులను తెగనరకుచు వచ్చుచున్నాడు.

22. ఇంద్రా ! ఉలూకములతో హింసించు రాక్షసులను వధించుము. క్షుద్ర ఉలూక రూపమున హింసించువారిని వధించుము. కుక్క, చక్రవాకము డేగ, గ్రద్ద రూపమున హింసించు వారిని రాతివంటి వజ్రముతో చంపుము.

23. మమ్ము రాక్షసులు చుట్టుముట్టరాదు. దుఃఖము కలిగించు రాక్షస జంటలు దూరము కావలెను. రాక్షసులు ఇదేమిటి? ఇదేమిటి? అని అరచుచు తిరుగుదురు. పృథ్వి మమ్ము అంతరిక్ష పాపము నుండి రక్షించవలెను.

అంతరిక్షము స్వర్గీయ పాపమునుండి రక్షించవలెను.

24. ఇంద్రా ! మగ రాక్షసులను నాశము చేయుము. మాయలతో హింసించిన ఆడ రక్కసిని నాశము చేయుము. చంపుటయే పనిగల రాక్షసుల తలలు తెంపి చంపుము. వారు ఉదయ సూర్యుని చూడరాదు.

25. సోముడా ! నీవు ఇంద్రుడు ఒకరిని ఒకరుక చూచుకొనండి. వివిధ రీతుల వీక్షించండి. జాగృతులుకండి మేల్కనండి ఉత్తిష్ఠ ! రాక్షసుల మీద వజ్రము ప్రయోగించండి.

**ఆలోచనామృతము**

ఈ నేలమీద మానవుడు పుట్టి లక్షల సంవత్సరములు దాటినవి. అయినను మనిషి అంతరంగము మనిషి స్వభావము మనిషి గుణము ఏ మాత్రము మారినట్లు కనిపించదు. సాహిత్యాదులు నేటికిని వర్తించుటకు ఇదే కారణము కావచ్చును.

మానవునిలో కామ, క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యములు సుఖదుఃఖములు, రాగద్వేషములు మున్నగు లక్షణములు మనిషిని అన్నికాలములందును పట్టుకొని ఉన్నవి. అవి ప్రాణముతో వచ్చును. కాని ప్రాణముతో పోవు.

మనకు పూర్వ, పరజన్మల మీద విశ్వాసమున్నది. విశ్వాసము మాత్రమేకాదు. అది సత్యము. వాస్తవము. తథ్యము ఏలనన ప్రకృతిలో పదార్థములన్నిటికి పరిణామము మార్పు మాత్రమున్నది. నాశనము లేదు. కర్ర కాలి బొగ్గగును బొగ్గు బూడిద బూడిదమట్టి మట్టిమండి చెట్టు పునరావృతమగును.

ప్రకృతి వలయము వంటిది. పదార్థములన్నియు ఒక బిందువు వద్ద ఆరోహణ క్రమమున పెరుగును. మరొక బిందువు వద్ద ఆపరోహణ క్రమమునదిగును. దీనికి అంతము మనకు తెలియదు. నిరంతరపరిణామమేప్రకృతి ధర్మము.

మృత్యువు అనంతజీవితమున ఒక దశ మాత్రమే. అంతము దేహమునకే. ఆత్మకుకాదు. ఆత్మను తెలియుట అందరికి సాధ్యపడదు.

ఆత్మకు నాశము లేదు **"నైనం ఛ్చిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః"** అన్నాడు కృష్ణపరమాత్మ గీతలో

ఇది జన్మాంతర చర్చకు స్థానముకాదు. అయినను కామ క్రోధాదులు చావుతో చావవు. అంతస్తును బట్టి కుటుంబము, సమూహము, సమాజమును పట్టి పీడించుచుండును.

రాగద్వేషాదులు మృత్యువుకన్న బలవత్తమములు అవి మహాత్ములను తప్ప మానవులను విడువవు.

వసిష్ఠుడు ఋషి, ఋషిని అతీంద్రియ దర్శకుడు అని వ్యాఖ్యానించినాడు శాయనాచార్యులు. వసిష్ఠుని గురించి వాఖ్యానించు శక్తి మాకు లేదు. కాని వసిష్ఠుడు అతి సామాన్యుని వలె ప్రవర్తించినాడు అని చెప్పుట తప్పుట లేదు. అతడు ద్వేషము కక్కినాడు. సూక్తమునంతను తిట్లతో నింపినాడు. మండూక సూక్తమున సూక్తమునే పరిహసించినాడు.

ఇది మానవ స్వభావము. నాటి నుంచి నేటికి మారలేదు. ముందు మారబోదు. **"స్వభావో దురతిక్రమః"** అన్నాడు వాల్మీకి.

మానవుడు తన అభివృద్ధికి గోత్రములు, సమూహములు, తెగలు ఏర్పరచుకున్నాడు. అవియే అనంతర కాలమున మానవ వికాసమునకు అవరోధములయినవి. తనకు హానిచేసిన వ్యక్తినికాక ఆ వ్యక్తికి చెందిన సమూహమునే ద్వేషించసాగినాడు. అవి యుద్ధమందు వినాశములకు కారణములైనవి. ఇది మానవునకు చెరుపు మానవతకు చేటు.

జాతిద్వేషము మానవతకు మసిపూత. ఇది మాన్పించుటకు మానవునకు జ్ఞానము కలిగించుటకు వర్తించుటకు నిదే కారణము కావచ్చును మహాభారతమున సర్పయాగ, వృత్తాంతము చెప్పబడినది.

తన తండ్రిని సర్పము చంపినదని సర్పజాతిమీద ద్వేషము పూనివాడు జనమేజయుడు. ఒకజాతిని ద్వేషించి నాశము చేయరాదను అస్తీకుని బోధన విని జనమే జయుడు నిజము తెలిసికొన్నాడు.

రాక్షసులందరు చెడ్డవారుకారు. తెలిసి తన పతనము ఎరిగి, వామనునకు మూడడుగులు దానము చేసిన వదాన్యుడు బలి. ప్రహ్లాదుడు భాగవతోత్తముడు. విభీషణుడు లేకున్న రామునకు విజయము కలుగునదికాదు.

వశిష్ఠునకు ఇవి తెలియవా? అతడు రాక్షస జాతిని ద్వేషించినాడు. తిట్టినాడు. శపించినాడు. అయినను వసిష్ఠుడు విచక్షణ చూపినాడు. అన్నిచోట్ల కాకున్నను, కొన్ని విశేషణములు చూపి అట్టి రాక్షసులను మట్టు పెట్టుమన్నాడు. దుష్టులను, అసత్యవాదులను తిట్టినాడు.

స్త్రీల విషయమున వివక్షత కనపరచినాడు. **"ఇంద్రజహి పుమాంసంయాతు ధానము తస్త్రియం మాయయాశాశదానమ్"**

మగరాక్షసులను నాశము చేయుము. అన్నవాడు ఆడరాక్షసులు మాయలు చేసిననే వధించమన్నాడు.

వసిష్ఠుడు మహాత్ముడు. ఎంతటివాడును అన్ని సందర్భముల మహాత్ముడుకాడు.

*విద్వాంసుడు, బహుభాషావేత్త, కవి, కథకుడు, నవలాకారుడు, నాటక కర్త, బాలసాహిత్యకారుడు, చలన చిత్రరచయిత, విమర్శకుడు, వ్యాసకర్త, అనువాదకుడు, వక్త, స్వాతంత్ర్య సమరయోధుడు, వినయవంతుడు ప్రపన్నుడగు దాశరథి రంగాచార్య రచించిన ఆంధ్ర వచన ఋగ్వేద సంహితమున ఏడవ మండలము సమాప్తము.*

**తంచక్షుర్దేవాహితం శుక్రముచ్చరత్**
**పశ్యేమ శరదశ్శతం జీవేమ శరదశ్శతమ్**

**శ్రీః**
**శ్రీహయగ్రీవాయనమః**

**జ్ఞానానందమయం దేవం | నిర్మల స్ఫటక్కాకృతిం**
**ఆధారం సర్వ విద్యానాం | హయగ్రీవముపాస్మహే||**

## ఎనిమిదవ మండలము

**ఏడవ అధ్యాయము మొదటి అనువాకము**

### మొదటి సూక్తము

ఋషి - మేధాతిథి - మేధ్యాతిథి, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - బృహతి, చివరి రెండు త్రిష్టుప్.

**మాచిదన్యాద్విశంసత సఖాయో మారిషణ్యత**
**ఇంద్రమిత్స్తోతా వృషణం సచాసుతే ముహురుక్థాచశంసత**

1. మిత్రులగు స్తోతలారా ! ఇంద్రుని తప్ప ఇతరులను స్తుతించకండి. హింసితులు కావలదు. సోమాభిషవము అయినంత ఒకచోటకూడి కోరికలు తీర్చు ఇంద్రుని స్తుతించండి.

2. ఇంద్రుడు వృషభమువలె శత్రుహింసకుడు. బాధించని వృషభమువలె మానవ విజేత. శత్రువులను ద్వేషించువాడు. స్తోతలకు పూజనీయుడు. దివ్య, పార్థివ ధనవంతుడు. దాతలలో శ్రేష్ఠుడు. అట్టి ఇంద్రుని స్తుతించండి.

3. ఇంద్రా ! తన రక్షణకొఱకు మానవులు నిన్ను వేరు వేరుగా స్తుతింతురు. అయినను మా ఈ స్తోత్రము సదా నిన్ను వర్ధిల్ల చేయవలెను.

4. ధనవంత ఇంద్రా ! నీ స్తోతలు విద్వాంసులు. శత్రువులను గడగడలాడించగలవారు సదా ఆపదలనుంచి ఉత్తీర్ణులు కాగలవారు. నీవు మావద్దకు రమ్ము. మా తృప్తికొరకు బహురూపములు కాగలిగి, దగ్గర ఉన్న ధనమును ప్రదానము చేయుము.

5. వజ్రధర ఇంద్రా ! నిన్ను ఎంత ఎక్కువ ధరకైనను అమ్మబోను. వేయి, పదివేలకైనను అమ్మబోను. అనంత ధనమునకైనను అమ్మబోను.

6. ఇంద్రా ! నీవు మాతండ్రికన్న ధనికుడవు. పారిపోని నా సోదరునికన్న ధనవంతుడవు. నాతల్లి, నీవు సమానులు. మీరు ఉభయులు నాకు ధనము కలుగుటకు పూజించండి.

7. ఇంద్రా ! నీవు ఎచటకి వెళ్లినావు? ఎక్కడ ఉన్నావు? నీ మనసు అనేక దిశలందుండును. యుద్ధ కుశలుడవు, యుద్ధకారివగు పురందరా ! విచ్చేయుము. గాయకులు నీ స్తుతులు పాడుచున్నారు.

8. ఈ ఇంద్రునకు గానయోగ్యమగు పాటలు పాడండి. ఇతడు అందరకు పూజనీయుడు. ఏ ఋక్కులతో ఇంద్రుడు కణ్వపుత్రుల యజ్ఞమునకు వెళ్లినాడో, ఏ ఋక్కులతో శత్రుపురములను ధ్వంసము చేసినాడో ఆ ఋక్కులనే గానము చేయండి.

9. ఇంద్రా ! నీకు పదియోజనములు నడువగల వంద, వేయి గుఱ్ఱములు ఉన్నవి. అవి శీఘ్రగాములు. సేచన సమర్థములు. ఆ అశ్వములమీద వెంటనే రమ్ము.

10. గోవు పాలిచ్చునది. మంచివేగము గలది. సులువుగా పితుకనిచ్చునది. అట్టి గోరూపు ఇంద్రుని స్తుతింతును. అంతేకాక అనేక ధారలు కల వర్షస్వరూప ఇంద్రుని స్తుతింతును.

11. సూర్యుడు ఏతశ, నామక రాజర్షిని కష్టములపాలు చేసినాడు. అప్పుడు వంకర నడకలు కలిగి వాయువేగమున సాగు రెండు అశ్వములు అర్జున పుత్రుడు కుత్స, ఋషిని మోసినవి. అనేక కర్మలు కలవాడు ఇంద్రుడు. అతడు అహింసితుడు, కిరణవంతుడగు సూర్యుని మారువేషమున ఆక్రమించుటకు వెడలినాడు.

12. ఇంద్రుడు అతుకుల పదార్థము వాడడు. మెడనుండి రక్తము రానీయడు. కాని కీళ్లను అతుకును. అట్టి ధని - బహుధని ఇంద్రుడు విడివిడిన వాటిని తిరిగి చేర్చగలడు.

(సూర్యుడు ఏతశుని గాయపరచగా ఇంద్రుడు బాగుచేసినాడని)

13. ఇంద్రా ! నీ దయవలన మేము అధములను కాకుండవలెను దుఃఖితులము కాకుండవలెను. తరిగిపోవు ధనవంతులవలె పుత్ర, పౌత్రాది శూన్యులము కాకుండవలెను. మమ్ము ఇతరులు కాల్చరాదు. ఇంట ఉండి మేము నిన్ను స్తుతించుచుందుము.

14. ఇంద్రా ! తొందరపడక, క్రోధములేక, మెల్లగా మేము నిన్ను స్తుతింతుము. ఒకేసారి మేము కోరినది ధనవంతులమై నీ కొఱకు సుందర స్తుతులు చెప్పెదము.

15. ఇంద్రుడు మా స్తోత్రములు విన్నంతనే మా సోమము అతనిని సంతోషపెట్టును, ఆసోమము వక్రభావముగల దశాపవిత్రముతో పావనమైనది. ఏకధనము మున్నగు తీర్థములతో వర్థిల్లినది. అందువలననే సోమములన్నియు మదకారకములయినవి.

16. ఇంద్రా ! స్తోతలు నీ సేవకులు. వారు ఇతరులతో కలిసి స్తుతించుచున్నారు. వారివద్దకు విచ్చేయుము. ఇతర హవివంతుల స్తుతులు మావద్దకు చేరవలెను. ఇప్పుడు కూడ నేను నిన్ను అందముగా స్తుతించ కోరుచున్నాను.

17. అధ్వర్యులారా ! శిలలో సోమము అభిషవించండి. దానిని నీటితో కడగండి.

గోచర్మము వంటి మేఘములను కప్పుకున్న మరుత్తులు నదులకొఱకు నీటిని పితుకదురు.

18. ఇంద్రా ! పృథివి, అంతరిక్షము లేక ఇతర ప్రకాశవంత ప్రదేశములనుండి రమ్ము. విస్తృతమగు నా స్తుతులతో వర్థిల్లుము. మావద్ద పుట్టిన మనుష్యులకు వారు కోరిన ఫలములు ప్రసాదించుము.

19. అధ్వర్యులారా ! ఇంద్రుని కొఱకు అన్నింటిని మించిన మదకర సోమమును సమర్పించుడు.

యజమానులు. కర్మవంతులు. అన్నాభిలాషులు. ఇంద్రా ! వారిని పెంపొందించుము.

20. ఇంద్రా ! నేను యజ్ఞమున నీకు సోమము అర్పింతును. స్తుతింతును. ప్రార్థింతును. నీకు కోపము రానీయము. నీవు పోషించువాడవు. సింహమువలె భయంకరుడవు. నిన్ను యాచించనివాడు లోకములందున్నాడా?

21. ఇంద్రుడు ఉగ్రబలవంతుడు. స్తోతలు అతనికి మాదక సోమము సమర్పింతురు. సోమపానమున ఆనందించిన ఇంద్రుడు మాకు శత్రువిజేత గర్వ విధ్వంసక పుత్రుని ప్రసాదించును.

22. ఇంద్రుడు సుఖదమగు యజ్ఞము హవి అందించు యజమానికి అతివరణీయ ధనము ఇచ్చును. అతడే సోమాభిషవకర్తకు స్తోతకు ధనము ఇచ్చును. ఇంద్రుని సర్వకార్య ఉద్యత స్తోతలు ప్రశంసింతును.

23. ఇంద్రా ! రారమ్ము. నీవు దర్శనీయ ధనముతో సంతుష్టుడవగుము. ఒకేచోట పానము చేయు సోమముతో విస్తీర్ణము, వర్ధకమగు నీ ఉదరమును సరస్సునువలె నింపుము.

24. ఇంద్రునకు శత సంఖ్యాక, సహస్ర సంఖ్యాక అశ్వములు ఉన్నవి. అవి బంగారు రథమున ఇంద్రుని వహించవలెను. ఇంద్రయుక్త అశ్వములు కేశవంతములయినవి.

(కేశములుగల అశ్వములు ఉత్తమములు)

25. తెల్లనితోకలు, నెమలిరంగుగల గుఱ్ఱములు - మధుర స్తుతియోగ్య సోమపానమునకు ఇంద్రుని, బంగారు రథముమీద తేవలెను.

26. స్తుతియోగ్య ఇంద్రా ! ఈ సోమము సుసంస్కృతము. రసవంతము. ఇది మాదకము - శోభస్కరము. ఇది మత్తు కలిగించుటకు సుసంపన్నమైనది. దీనిని ప్రథమ సోమపాయిగా పానము చేయుము.

27. ఇంద్రుడు తన కర్మములతో ఒంటరిగానే సమస్త శత్రువులను పరాజితులను చేయును. అతను తన కర్మలవలన విశాలుడు ఉగ్రుడు శిరప్రాణము కలవాడు. అట్టి ఇంద్రుడే రావలెను. వేరుగా రాకూడదు. మా స్తోత్రములముందుకు రావలెను. ఇంద్రుడు మమ్ము విడువరాదు.

28. ఇంద్రా ! శుష్ణ అసురుని కదలికగల సదనమును నీ వజ్రమున చూర్ణము చేసినావు. నీవు స్తోతల యజ్ఞకర్తల ఆహ్వానయోగ్యుడవు. దీప్తిమంతునివై నీవు శుష్ణుని వెన్నాడినావు.

29. సూర్యోదయముకాగా నా సకల స్తోత్రములను ఆవర్తితము చేయుము. మధ్యాహ్నమున నా స్తుతులను ఆవర్తితము చేయుము. దివసాంతమున నా స్తుతులను ఆవర్తితము చేయుము. రాత్రికూడ నా స్తుతులను ఆవర్తితము చేయుము.

30. అసంగుడను రాజు మేధ్యాతిథికి చాల ధనము దానము చేసినాడు. ఇది తనను స్తుతించమని కోరుట:- మేధ్యాతిథీ ! తేపతేప మరలమరల నన్ను స్తుతించుము. నన్ను ప్రశంసించుము. ధనవంతులలో మేము అందరిని మించిన ధనవంతులము. మా శక్తితోనే ఇతరుల అశ్వములు సిద్ధమైనవి. మా మార్గము ఉత్కృష్టము. మా ఆయుధము ఉత్కృష్టము.

31. భోజనము ముగించి నేను శ్రద్ధగా మీ రథమును జోడించినాను. నాకు మనోహరమగు దానము చేయుట తెలియును. నేను యదువంశపువాడను. పశువంతుడను.

32. తనను స్తుతించమన్న అసంగునితో మేధ్యాతిథి అనుచున్నాడు.

అతడు బంగారు చర్మస్తరణముతో పాటు నాకు గతిశీల ధనమును దానము చేసినాడు. అది చప్పుడు చేయు రథముతోకూడి శత్రువుల సకల ధనమునలను గెలువ వలెను.

33. అగ్నీ ! ప్లషోగ పుత్రుడు అసంగుడు పదివేల ఆవులను దానము చేసినాడు. సమస్త దాతలను దాటిపోయినాడు. తదుపరి సేచన సమర్థములు, దీప్యమానములగు సమస్త పశువులు సరోవరము నుంచి నళమువలె అసంగుని వీడిపోయినవి.

(నళము చెరువున పుట్టినట్టి ఒక రకపు గడ్డి)

34. గుహ్యదేశమున అసంగునిముందు "స్థూలము" కనిపించును. అది అస్థిరహితము. విశాలము. దిగువకు వ్రేలాడునది. అసంగుని భార్య శశ్వతి, దానిని చూచి భర్తతో ఆర్యా ! చక్కని భోగసాధక వస్తువును సాధించినావు అన్నది.

(అసంగ రాజునకు దైవశాపమున నపుంసకత్వము కలిగినది. ఆ శాపము విడిపించుటకు అతని భార్య శశ్వతి తపస్సు చేసినది. అందువలన అసంగునకు మగతనము మరలి వచ్చినది. అందుకు గుర్తుగా గుహ్య దేశమున స్థూలము ఏర్పాటు చేయబడినది)

## రెండవ సూక్తము

ఋషి - కణ్వపుత్రుడు మేధ్యాతిథి - అంగిరస ప్రియమేధ, దేవత -
ఇంద్రుడు, ఛందస్సు 27 అనుష్టుప్, మిగిలినవి గాయత్రి.

1.వాసాయిత ఇంద్రా ! ఇది అభిషుత సోమము పానము చేయుము. ఉదరమునింపుము. అకుతోభయ ఇంద్రా ! మేము నీకు సోమము సర్పింతుము.

2. నేతలు కడిగినది, బట్టతో అభిషుతము చేసినది, మేష లోమమున పరిపూతమైన నదిలో తానమాడిన గుఱ్ఱమువలె సోమము శోభిల్లుచున్నది.

3. ఇంద్రా ! మేము నీకొఱకు యవలు కలిసినది. క్షీరాది యుక్తమగు సోమమును రుచికరముగా సిద్ధము చేసినాము.

ఈ యజ్ఞమున అట్టి సోమము సేవించుటకు నిన్ను పిలుచుచున్నాము.

4. మానవులందును, దేవతలందును సమస్త సోమపానమునకు ఇంద్రునకు మాత్రమే అధికారము ఉన్నది. అభిషుత సోమము అందుకొను ఇంద్రుడే అన్నివిధముల అన్నముగలవాడు.

5. విస్తృతవ్యాపక ఇంద్రుని ప్రదీప్త, సోమము అప్రసన్నుని చేయదు. దుర్లభద్రవ్యమిశ్రసోమము అప్రసన్నుని చేయదు. తృప్తినిచ్చు అన్య పురోడాశాదులు అప్రసన్నుని చేయవు. అట్టి ఇంద్రుని మేము స్తుతింతుము.

6. వలలో చిక్కిన మృగములకొఱకు వేటకాడు వెదకును. మేముకాక అన్య ఋత్విక్కులు స్తోతలు ఉన్నారు. వారు సంస్కరించబడినసోమముతో ఇంద్రునికొఱకు అన్వేషింతురు. కుత్సితులై స్తుతించుచు ఇంద్రునివద్దకు పోయిన వారికి ఇంద్రుడు అందడు.

7. ఇంద్రుడు అభిషుత సోమము సేవించువాడు. అతనికి త్రివిధసోమము సవనత్రయమున యజ్ఞగృహమున సిద్ధము చేయవలెను.

8. ఋత్విక్కులను భరించునది ఏకమాత్ర యజ్ఞము. అందు మూడు విధముల కోశములందు సోమము క్షరణమగును. మూడు చమసములు సోమపూర్ణములైనవి.

9. సోమమా ! నీవు పవిత్రువు. అనేక పాత్రలలో ఉన్నావు. మధ్యనపాలు, పెరుగు కలుపుకొని ఉన్నావు. నీవు వీరుడగు ఇంద్రునకు ఎక్కువమత్తు కలిగించుము.

10. ఇంద్రా ! నీకొఱకగు సోమము ఘాటైనది. మేము అభిషవించిన దీప్త మిశ్రమ సోమము నిన్ను వాంఛించుచున్నది.

11. ఇంద్రా ! ఇదిగో సోమము. ఇందుమిశ్రమ ద్రవ్యములు కలుపుము. సోమమున పురోడాశాదులను కలుపుము. అందువలన నీవు ధనవంతుడవు అగుదువు.

12. సుర త్రాగువానికి పిచ్చిమత్తు కలుగును. మరింత మత్తు కలిగించుటకు వానిలో యుద్ధము చెలరేగును. అట్లే ఇంద్రా ! త్రావిన సోమము హృదయమున యుద్ధము కలిగించును.

ఇంద్రా ! నీవు సోమ పూర్ణుడవు. జనులు పాడి ఆవును కాపాడుకునన్నట్లు నిన్ను కాపాడుకుందురు.

13. హర్యశ్వా ! నీవు ధనికుడవు కావలెను. నీ స్తోత ధనికుడు కావలెను. నీవంటి ధనికుడు, కీర్తివంతునకు స్తోత

ప్రభువు అగును.

14. ఇంద్రుడు స్తుతిరహితునకు శత్రువు. అతడు ఉక్థ గానమును తెలియును. ఇప్పుడు గానయోగ్యగానము, గానము చేయపడుచున్నది.

15. ఇంద్రా ! నీవు మమ్ము వధించు శత్రువునకు వప్పగించకుము. పరాభవించువాని వద్ద మమ్ము విడువవద్దు. శక్తివంత ఇంద్రా ! నీ కర్మబలమున మాకు ధనమును అందించుము.

16. ఇంద్రా ! మేము నీకు మిత్రులము. నిన్ను అభిలషించువారము. నిన్ను స్తుతించుటయే మాకు ప్రయోజనము. కణ్వగోత్రీయులు ఉక్థలతో నిన్ను నుతింతురు.

17. వజ్రధర ఇంద్రా ! నీవు కర్మవంతుడవు. నేను నీ స్తుతి మాత్రమే ఎరుగుదును. నీ అభినవ యజ్ఞమున నేను వేరు స్తుతులు ఉచ్చరించను.

18. దేవతలు సోమాభిషవము చేయు యజమానిని అభిలషింతురు. నిద్రించు మానవుని అభిలషించరు. దేవతలు ఆరాటములేనివారై మదకర సోమమును సేవింతురు.

("ఇచ్ఛంతి దేవాః సున్వన్తమ్ నస్వప్నాయ" దేవతలు పనిచేయువారినే ఇచ్ఛగింతురు. సోమరులనుకాదు. వేదము పనిని కర్మను ప్రోత్సహించును. సోమరులను గుర్తించదు)

19. ఇంద్రా ! మావద్దకు ధనముతో రమ్ము. ఉత్తమ రీతిగా రమ్ము. వయసు భార్యను పొందిన గుణవంతుడు ఆమెను కోపించడు. ఇంద్రా ! నీవు మమ్ము కోపించకుము.

20. దుస్సహ ఇంద్రా ! కుత్సితుడగు అల్లునివలె పిలిచినంత సాయంకాలము కానివ్వడు.

21. ఇంద్రుని అనుగ్రహము ధనవంతము. కళ్యాణకరము. అది మాకు తెలియును. ముల్లోకములందు ఆవిర్భూత ఇంద్రుడు మాకు తెలియును.

22. అధ్వర్యులారా ! కణ్వగోత్రీయులు ఇంద్రుని కొఱకు త్వరగా సోమ హవనము చేయవలెను. అతిబలవంతుడు అనంత రక్షణల ఇంద్రుని కన్న అధిక యశశ్విని మేము ఎరుగము.

23. ఇంద్రుడు శక్తిశాలి. వీరుడు. మానవహితైషి. అభిషవకర్తలగు అధ్వర్యులారా ! ఇంద్రునకు ప్రధానముగా సోమము సమర్పించండి. ఇంద్రుడు సోమపానము చేయవలెను.

24. ఇంద్రుడు సుఖకర స్తోతలను బాగుగా ఎరుగును. ఆ ఇంద్రుడే హోతలకు, స్తోతలకు అనేక అశ్వములు, గోవులు కల అన్నము అందించవలెను.

25. అభిషవ కర్తలారా ! మత్తు కలిగించు, స్తుతియోగ్యమగు సోమమును వీర, శూర ఇంద్రునకు సమర్పించండి.

26. సోమపాన పారాయణుడు, వృత్రహంత ఇంద్రుడు విచ్చేయవలెను. మేము దూరము వెళ్లనవసరము ఉండరాదు. అనేక రక్షణలుకల ఇంద్రుడు శత్రువును తిరస్కరించవలెను.

27. ఇంద్రుని రెండు అశ్వములు స్తోత్రవంతనములు. సుఖావహములు. అవి స్తుతులద్వారా వినదగినవాడును ఆశ్రయము యోగ్యుడను, మిత్రుడగు ఇంద్రుని ఈ యజ్ఞమునకు తేవలెను.

28. ఇంద్రుడు శిరస్త్రాణము కలవాడు. ఋషి, శక్తివంతుడు. అట్టి ఇంద్రా ! ఇది స్వాదిష్ట సోమము. క్షీరాది ద్రవ్యములు కలిసినది. నీవు విచ్చేయుము. నీవు ప్రసన్నతా ప్రియుడవు. స్తోతలు నిన్ను స్తుతించుచున్నారు.

29. ఇంద్రా ! వర్ధిల్లగోరు స్తోతలు, సకల స్తోత్రములు బహుధన, బలప్రాప్తికొరకు నిన్ను వర్ధిల్ల చేయుదురు.

30. ఇంద్రా ! నీవు స్తుతులచే మహనీయుడవు. స్తోత్రములు, ఉక్థలు అన్ని కలిసి నీ బలమును పెంచును.

31. ఇంద్రుడు బహుకర్మి. వజ్రపాణి. అతడు సదా శత్రువులకు అజేయుడు. అతడు స్తోతలకు బలము కలిగించును.

32. ఇంద్రుడు ఎడమచేత వృత్రుని వధించినాడు. అతడు అనేక స్థానములకు పిలువబడువాడు. అతడు అనేక కార్యములవలన ఘనుడు.

33. సకల ప్రజ ఇంద్రుని అధీనులు. ఇంద్రుడు అచ్యుతుడు. బలవంతుడు. అభినవుడు. అతడే యజమానులను అనుగ్రహించును.

34. ఇంద్రుడు ఈ సకల కార్యములు చేసినాడు. అతడు సర్వత్ర విఖ్యాతుడు. హవివంతులకు అన్నదాత.

35. ఇంద్రుడు ప్రహరణశీలుడు. గమనశీలుడు, గవాభిలాషులగు స్తోతలను అపక్వబుద్ధిగల శత్రువుల నుండి రక్షించును. ఇంద్రుడు రక్షించిన స్తోత స్వామి అగును. ధనవాహకుడు అగును.

36. ఇంద్రుడు ధనికుడు. అతడు అశ్వసాయమున చేరదలచిన చోటుకు చేరును. అతడు శూరుడు. మరుత్తుల

సాయమున వృత్రుని వధిస్తాడు. అతడు తన సేవకుడగు యజమానిని రక్షించును. ఇంద్రుడు సత్యస్వరూపుడు "సత్యోవితా"

37. ఇంద్రుడు ప్రియమేధ - ఋషి. అతనిమీద మనసుంచి యజ్ఞము చేయండి. సోమపానమున ఇంద్రుడు ప్రసన్నుడగును. అతని హర్షము నిష్ఫలము కాదు.

38. ఇంద్రుడు సాధురక్షకుడు. అన్నాభిలాషి. నానాదేశగామి. వేగవంతుడు. యశోవంతుడు. కణ్వపుత్రులారా ! అటువంటి ఇంద్రుని స్తుతించండి.

39. ఇంద్రుడు సుకర్మ, సఖుడు. అడుగుల గుర్తులు లేకున్నను నేతలగు గోవులను తిరిగి ఇచ్చినాడు. దేవతలు తాము కోరిన వాటిని ఇంద్రుని నుండియే పొందినాడు.

(యజమానుల గోవులను గుర్తించుటకు వాటి అడుగుల గుర్తులు కారణములయినట్లున్నవి. ఇంటిని గుర్తించుటకు చేతిగుర్తులు వేయుట గృహప్రదేశమున ఆచారము.)

పణులు అపహరించిన గోవులను ఇంద్రుడు తిరిగి ఇచ్చినాడు.

40. వజ్రీ ఇంద్రా ! నీవు మేక రూపమున పోవుచు ఇట్లు స్తుతించు కణ్వపుత్రుడు మేధ్యాతిథిని స్వీకరించినావు.

41. విభిందు రాజా ! నీవు దాతవు. నాకు నలుబది వేల ధనమును ఇచ్చినావు. తదుపరి ఎనిమిదివేలు దానము చేసినావు.

42. ద్యావాపృథ్వి ప్రఖ్యాత. జలవర్ధక. ప్రాణుల స్రష్ట. స్తోతల విషయమున అనుగ్రహశీల. ధనోత్పత్తికిగాను నేను ద్యావాపృథ్వులను స్తుతించినాను.

## మూడవ సూక్తము

ఋషి -కణ్వపుత్రుడు మేధాతిథి, దేవత - ఇంద్రుడు ఛందస్సు బృహతి, 21
అనుష్టుప్, 22-23 గాయత్రి.

1. ఇంద్రా ! మా సోమము అభిషుతము రసవంతము దుగ్ధయుక్తము. దీనిని సేవించుము. తృప్తుడవగుము. నీవు మాతో కూడి మత్తుడవు కాదగిన వాడవు. బంధువవై మమ్ము వర్ధిల్ల చేయుటకు ప్రవృద్ధుడవగుము. నీ అభివృద్ధియే

మాకు పరమరక్ష.

2. మా మీద నీ అనుగ్రహము కలుగవలెను. మేము హవిగల వారము కావలెను. శత్రువు కొఱకు మమ్ము కొట్టవద్దు. అనేక రక్షణలు కలిగించి మమ్ము రక్షించుము. మమ్ము ఎల్లప్పుడు సుఖముగా ఉంచుము.

3. ఇంద్రా ! నీవు బహుధనవంతుడవు. ఇవి మా స్తుతిరూప వచనములు. ఇవి నిన్ను వర్ధిల్లచేయును. విద్వాంసులు అగ్ని సమాన తేజస్కులు. విశుద్ధులు. వారు నిన్ను స్తుతింతురు.

4. ఇంద్రుడు వేయిమంది ఋషులనుండి బలము పొందినాడు. విస్తీర్ణుడు అయినాడు. అతని వాస్తవ మహిమ, ప్రఖ్యాతి గొప్పవి. వారిని యజ్ఞములందును, విప్రరాజ్యములందును స్తుతించుట జరుగును.

5. మేము యజ్ఞప్రారంభమున ఇంద్రుని పిలుతుము. యజ్ఞపు చివరన కూడ ఇంద్రుని పిలిచెదము. మేము మరుత్తులము అగుదుము. ధనప్రాప్తి కొఱకు ఇంద్రుని పిలుతుము.

6. తన బలపు మహిమతో ఇంద్రుడు ద్యావాపృథ్వులను విస్తరింపచేసినాడు. సూర్యుని వెలిగించినాడు. సకల భువనములను ఇంద్రుడి నియమించినాడు. సోమమును సహితము ఇంద్రుడే నియమించినాడు.

7. ఇంద్రా ! స్తోతలు అందరు దేవతలకన్నముందు సోమపానమునకు నిన్నే ఆహ్వానింతురు. నిన్నే స్తుతింతురు. ఋభుగణములు సహితము. విధివిహితముగ నిన్నే స్తుతింతురు.

ఇంద్రా ! నీవు ప్రాచీనుడవు. రుద్రులు సహితము నిన్నే స్తుతింతురు. "రుద్రాగృణంత పూర్వమ్"

8. ఇంద్రుడు అభిషుత సోమ పానము చేయును. అతనికి మత్తు ఎక్కును. ఎప్పుడు అతడు యజమాని బలమును, వీర్యమును పెంచును. ప్రాచీనులు ఇంద్రుని స్తుతించినారు. నేటివారు సహితము ఇంద్రుని గుణగణములను స్తుతించుచున్నారు.

9. ఇంద్రా ! నీవు శోభన వీర్యవంతుడవు. ప్రథమ లాభముగా నిన్ను నేను ఉత్తమ అన్నము యాచిస్తాను. నీవు నీ బలముతో కర్మ రహిత జనులనుండి హితకర ధనము గుంజుకున్నావు. దానిని భృగువునకు ఇచ్చినావు. ప్రస్కణ్వుని నీవు రక్షించినావు. నిన్ను నేను అట్టి బలము అన్నమునే యాచింతును.

10. ఇంద్రా ! నీ బలము మహత్తరము. ఆ బలమున నీవు సముద్రమునకు కోరిన జలము ఇచ్చినావు. ఆ జలమే మాకు అభీష్ట ఫలదము కావలెను. నీ మహిమ స్వయముగా వ్యాపించదు. పృథ్వి నీ మహిమను వ్యాపింపచేయును.

(ఇంద్రుడు తన మహిమను తాను చెప్పుకొనడు. ఇతరులు వ్యాపింప చేయుదురు అని తాత్పర్యము.)

11. ఇంద్రా ! నీ వీరత్వము శోభన బలోపేతము. దానినే నేను కోరుచున్నారు. అటువంటి ధనమును ఇమ్ము. నిన్ను పూజించువానికి, హవినిచ్చు యజమానికి తొలుత ధనము ఇమ్ము. తదుపరి స్తోతలకు ఇమ్ము.

12. ఇంద్రా ! నీ ధనము స్తుతించదగినది. పూజింపదగినది. దానితో నీవు పురురాజు పుత్రుని రక్షించినావు. ఆ ధనమునే యజమానికి ఇమ్ము, నీవు రుశ్మ, శ్యావక, కృప, నామక రాజులను రక్షించినావు. అట్లే హవి వంత యజమానులను రక్షింపుము.

13. స్తుతులు సంతతగమన శీలములు. వాటికి ప్రేరణ కలిగించు ఏ అభినవ మానవునకు ఇంద్రుని స్తుతించు శక్తి కలదు? ఇంద్రుడు సుఖలభ్యుడు. అతనిని స్తుతించువారు ఇంద్రుని మహిమలు పొంద శక్తులగుదురా?

14. రథము శత్రువిజయి. ధనవతి. అక్షయము. అన్నాభిలాషి. ప్రసిద్ధము, అత్యంత మధురమగు వాక్యము, స్తుతి ఆ రథమువలె ఉచ్చరించబడును.

15. కణ్వులవలె, భృగువులును, సూర్యకిరణసమానధ్యాత, వ్యాప్తుడగు ఇంద్రునకు పరివ్యాప్తి కలిగించినారు. ప్రియమేధ నామక మానవులు ఇంద్రుని పూజించినారు. స్తోత్రములతో స్తుతించినారు.

16. ఇంద్రా ! నీవు వృత్రుని వధించినావు. నీ హర్యశ్వద్వయమును రథమును పూన్చుము. నీవు ధనికుడవు. ఉగ్రుడవు. మరుత్తులు దర్శనీయులు. వారి వెంటరమ్ము. దూరదేశము నుండి రమ్ము. సోమపానమునకు రమ్ము. మావద్దకు రమ్ము.

17. ఇంద్రా ! యజమానులు కర్మకర్తలు. ధీరులు. మేధావులు. యజ్ఞసేవకుగాను వారు నిన్ను స్తుతింతురు.

ఇంద్రా ! నీవు ధనికుడవు. స్తుతిపాత్రుడవు. కాముకునివలె ఏకాగ్రముగ మా పిలుపువినుము.

18. ఇంద్రా ! మహాధనువున నీవు వృత్రుని వధించినావు. మాయావులగు అర్బుద, మృగములను నీవు నాశము చేసినావు. పర్వతము నుండి గోవులను వెలికి తీసినావు.

19. ఇంద్రా ! వృత్రుడు మహనీయుడు. హసన శీలుడు. వానిని నీవు అంతరిక్షమున తొలగించినావు. అప్పుడు నీ బలము వెల్లడి అయినది. అప్పుడు అగ్ని, సూర్య, ఇంద్రులు సేవించు సోమరసములు సహితము ప్రదీప్తములయినవి.

20. ఇంద్ర మరుత్తులు నాకు ఇచ్చినారు. కురుయాన, పుత్రుడు పాకస్థాముడు, నాకు అదియే ఇచ్చినాడు. ఆ ధనము అన్ని ధనములవంటిదికాదు. అది స్వర్గమున కేగుచు ప్రభాయుక్త సూర్యునివంటి తేజస్సు పొందును.

21. పాకస్థాముడు నాకు అశ్వములను ఇచ్చినాడు. అవి లోహిత వర్ణములు. సుందర వహన ప్రదేశములు. బంధన రజ్జుపూర్కములు. నానావిధ ధనములను సాధించునవి.

22. ఆ అశ్వపు పది ప్రతినిధి అశ్వములు నన్ను వహించును. ఇట్లే అశ్వములు తుగ్రపుత్రుడు భుజ్యుని వహించినవి.

23. పాకస్థాముడు తండ్రికి తగిన పుత్రుడు. అతడు నివాసదాత. స్పష్టరూపమున బలములనిచ్చువాడు. అతడు శత్రుహింసకుడు. రిపు భోజనుడు.

పాకస్థాముడు మాకు లోహిత అశ్వములను ఇచ్చినాడు. నేను అతనిని స్తుతింతును.

## నాలుగవ సూక్తము

ఋషి - కణ్వగోత్ర దేవాతిథి, దేవత - ఇంద్ర - పూషలు, ఛందస్సు - బృహతి ఉష్ణిక్

1. ఇంద్రా ! నిన్ను తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ నాలుగు దిక్కులందుండువారు ఆహ్వానింతురు. అయినను ఆమక్, రాజు పుత్రుని కొఱకు స్తోతలు నిన్ను పిలిచినపుడు ప్రేరణపొందుదువు. తుర్జశుని కొఱకు స్తోతలు పిలిచినపుడు పలికెదవు.

2. ఇంద్రా ! నీవు రుమ, రుమశ, శ్యావక, కృపనామక రాజులతో మత్తుడవగుదువు. అయినను స్తోత్రవాహక కణ్వులు నీకు స్తోత్రములు అందింతురు. రమ్ము. రారమ్ము.

3. గౌర మృగము దప్పిగొన్నపుడు గడ్డిలేని నీరున్న చోటికి చేరదలచును. అట్లే ఇంద్రా ! మైత్రి కలుగగా వెంటనే మా వద్దకు విచ్చేయుము. మేము కణ్వపుత్రులము. మాతో కలిసి సోమపానము చేయుము.

4. ఇంద్రా ! నీవు ధనవంతుడవు. సోమపానము చేసినావు. ఇది నిన్ను అభిషవకర్తకు ధనము ఇచ్చుటకు ఉన్మత్తుని చేయవలెను. ఈ సోమము అభిషవ ఫలకమున అభిషుతమైనది. ఆతి ప్రశంశనీయము. దీనివల్లనేనీవు ఇంత బలము కలిగినావు.

5. ఇంద్రుడు తన వీరకృత్యములతో శత్రువులను అణచినాడు. తన బలమున ఇతరుల క్రోధమును నష్టపరచినాడు. సకల శత్రువులను చెట్లనువలె నరికినాడు.

6. ఇంద్రా ! నిన్ను స్తుతించిన వారికి సహస్రసంఖ్యాక వజ్రమంతటి బలము కలుగును. నీకు నమస్కరించి హవ్యము సమర్పించువాడు శోభన శూరుడుగను. శత్రుఘాతక పుత్రుని పొందును.

7. ఇంద్రా ! నీవు ఉగ్రుడవు. మాకు నీ మైత్రి లభించినది. ఇక మాకు భయములేదు. అలసటలేదు. నీకు అభీష్ట వర్షకుడవు. నీ మహాకార్యములను వెల్లడించవలసి ఉన్నది. మేము తుర్వశుని, యదువును చూచినాము.

8. ఇంద్రుడు కోరికలు తీర్చువాడు. అతడు తన ఎడమ రొంటిన సకల ప్రాణులను కప్పి ఉంచినాడు. హవిర్దాత ఇంద్రునకు కోపము కలిగించడు. ఇది జుంటి తేనె కలిసినది. హర్షము కలిగించు సోమము ఇంద్రా ! దాని ముందుకు చేరుము. స్వీకరించుము.

9. ఇంద్రా ! నీకు మిత్రుడయినవాడు అశ్వవంతుడు, రథవంతుడు, రూపవంతుడు, గోవులు కలవాడగును. అతనికి త్వరత్వరగా ధనము లభించును. అతడు ఆహ్లాదకారియై సభలకు వెళ్లును.

10. రుశ్యనామక మృగమువలె పాత్రలో ఉన్న సోమము ముందునకు రమ్ము. ఇచ్ఛవచ్చినంత త్రావుము. నీవు నిత్యము నిన్ను ముఖ వర్షము కురిపింతువు. తేజస్వివి, బలవంతుడవు అగుము.

11. అధ్వర్యు ! ఇంద్రుడు సోమపానము చేయగోరుచున్నాడు. సోమము అభిషవింపుము. రెండు తరుణాశ్వములు కట్టబడినవి. అదిగో ! వృత్రహంత వచ్చినాడు !!

12. ఇంద్రా ! నీవు ఎవని సోమమున సంతుష్టుడవైనావో, ఆ విషయమున ఆ హవ్యదాత ఎరుంగును. నీకు తగిన సోమపాత్ర నిండియున్నది. రమ్ము. దానివద్దకు చేరుము. పానము చేయుము.

13. సోమాభిషవమునకు చర్మము పరచబడినది. రాతిమీద రాయి ఉంచబడినది. యజమాని పక్షమున యజ్ఞనిష్పాదక సోమము అభిషవించబడి నలుదిశల శుభములనందుచున్నది.

అధ్వర్యులారా ! ఇంద్రుని రథము వచ్చినది. ఇంద్రుడు దానిపై ఉన్నాడు. అతనికి ఆ సోమము అందించండి.

14. హర్యశ్వములు అంతరిక్షమున సంచరించునవి. సేచన సమర్థములు. అవి ఇంద్రుని మాకర్మువద్దకు తేవలెను. ఇంద్రా ! యజ్ఞ సేవి, గతిశీలములగు నీ అశ్వములు సవనముల వద్దకు చేర్చవలెను.

15. పూష బహుధనవంతుడు. మేము అతని మైత్రికోరిక అతనిని వరించినాము. పూషను అనేకులు ఆహ్వానింతురు. అతడు పాపవిమోచాకుడు. అతడు తన బుద్ధితో మాకు ధనప్రాప్తి కలిగించవలెను. మమ్ము శత్రువినాశక సమర్థులను చేయవలెను.

16. మా బుద్ధికి మంగలి కత్తివంటి పదను కలిగించుము. పాపవిమోచకా ! మాకు ధనము నిమ్ము. నీ గోధనము మాకు సులభ సాధ్యము కావలెను. నీవు మానవులకు ఇటువంటి ధనము నంపుచుందుము.

17. పూషా ! నిన్ను అలంకరించవలెనను కోరిక కలిగినది. నిన్ను స్తుతించవలెనను కోరిక కలిగినది. నాకు ఇతర దేవతలను స్తుతించు కోరికలేదు. వారు సుఖములను ఇవ్వగల వారుకారు. స్తోతయు, సామమంత్రయుక్త పజ్రునకు కోరిన ధనము ప్రసాదించుము.

18. పూషా ! నీవు అమరుడవు. దీప్తిమంతుడవు. మా గోవులు మేయుటకు తరలును. అట్టి మా గోధనమును నిత్యము చేయుము. నీవు మాకు రక్షకుడవు. మంగళ ప్రదుడవు. అన్నదానమునకు ఉదారుడవగుము.

19. కరంగనామక రాజు దీప్తుడు. సౌభాగ్యవంతుడు. అతడు స్వర్గప్రాప్తి కొఱకు యజ్ఞము చేసినాడు. మానవులకు ధనము దానము చేసినాడు. అతడు మాకు వంద అశ్వములతో కూడిన ధనము దానము చేసినాడు.

20. కణ్వపుత్రుడు, హవింతుడు మేధాతిథి - ఇంకను అతని అనేకమంది స్తోతలు కీర్తించినట్టివియు, ప్రియమేధనామక ఋషులచే సేవితమైనట్టియు, అతి పవిత్రమైనట్టియు అరువది వేల గోవులను నేను చివరన పొందినాను.

21. నాకు ధనము లభించినంత ఇతనికి ప్రశంసనీయ గోధనము, అశ్వధనము లభించినదని, వృక్షములు సహితము హర్షధ్వనులు చేసినవి.

*(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఎనిమిదవ మండలము అయిదవ అష్టకమున పదవ అధ్యాయము సమాప్తము)*

శ్రీః

**ఓం నతామినన్తిమాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రువాణి.**
**నరోదసీ అద్రుహా వేద్యాభిర్నపర్వతావి నమే తస్థివాంసః**

**ఎనిమిదవ అధ్యాయము** **అయిదవ సూక్తము**

ఋషి - కణ్వగోత్రజ బ్రహ్మాతిథి దేవత - అశ్వినులు. ఛందస్సు -

తొలి 36 గాయత్రి, 37,38 బృహతి, 39 అనుష్టుప్.

**ఓమ్ దూరాదిహే వయత్సృత్యరుణాప్పురశశ్వితత్ విభామం విశ్వధాతమమ్.**

1. ఉష దూరమునుండియే దగ్గర విరాజిల్లి దర్శనమిచ్చునది దీప్తరూప. ఆమె సకలపదార్థములను శ్వేతవర్ణము చేసినపుడు దీప్తిని అనేక ప్రకారములు విస్తరించును.

2. అశ్వినులారా ! మీరు దర్శనీయులు. నేతలతో సమానులు. మీరు కోరగనే గుఱ్ఱములు రథమున తగులును. ఆ రథము అన్నయుక్తము. మీరు ఆ రథమును ఉషస్సును కలపండి.

3. అశ్వినులారా ! మీరు అన్నయుక్తులు. ధనసంపన్నులు. మీ కొఱకు చేసిన స్తోత్రములను చూడండి. దూతస్వామి వచనమునకు ప్రార్థించును. అట్లే మీ మాట కొఱకు ప్రార్థింతుము.

4. అశ్విద్వయమా ! మీరు ప్రియులు. ఆనంద దాతలు. బహుధనవంతులు. మేము కణ్వగోత్రజులము. మా రక్షణ కోరి ఉన్నాము. మిమ్ము అందుకు ప్రార్థించుచున్నాము.

5. మీరు పూజ్యులు. అందరిని మించిన అన్నదాతలు. శోభన ధనములకు స్వాములు. మంగళ ప్రదుడగు హవ్యదాత గృహములకు వెళ్లుచుందురు.

6. దేవతావంతుడగు హవ్యదాతకు ఉత్తమ యజ్ఞయుక్తము, అవినాశ్యమగు గోచరభూమి సేద్యమునకు నీరు ఇవ్వండి.

7. అశ్విద్వయమా ! అశ్వములమీద ఎక్కండి. అతి వేగముగా సాగండి. మా స్తోత్రముల వైపునకు రండి. ఈ అశ్వముల వేగము ప్రశంసనీయము.

8. అశ్వినులారా ! మూడు పగళ్లు, మూడు రాత్రులు అశ్వముల సాయమున దూర యానము చేయండి.

9. మీరు ప్రభాతమున స్తుతియోగ్యులు. మాకు గోయుక్త అన్నము, అనుభవించదగిన ధనము ఇవ్వండి. వాటిని అనుభవించు మార్గము చూపండి.

10. అశ్విద్వయమా ! మా కొఱకు గోవులు, పుత్రులు, సుందర రథము, పుత్రులతో కూడిన ధనము తెండి.

11. మీరు శోభన పదార్థములకు స్వాములు. దర్శనీయులు. హిరణ్మయులు. మార్గయుక్తులు. అశ్వినులారా !

ప్రవృద్ధులుకండి. సోమమయ మధుపానము చేయండి.

12. అశ్వినులారా ! మీరు అన్నయుక్తులు. ధనయుక్తులు. మేము ధనికులము మాకు నలువైపుల విస్తరించిన అహింసనీయ గృహమును ప్రసాదించండి.

13. మీరు మానవ స్తోతను రక్షించండి. రండి. త్వరగరండి. ఇతరుల వద్దకు వెళ్లవద్దు.

14. అశ్విద్వయమా ! మీరు స్తుతియోగ్యులు, మేము అందించు సోమ భాగమును సేవించండి. అది మదకము, మనోహరము మధురము.

15. మాకొఅకు వందలది, వేలది అనేక నివాసయుక్తము అందరిని భరించగలగు ధనమును తెండి.

16. నేతృద్వయమా ! మనీషులు మిమ్ము అనేక దేశములకు ఆహ్వానింతురు. స్వారిచేయు అశ్వములమీద విచ్చేయండి.

17. హవ్యసంపన్నులు, తగినంతపని చేయు మానవులు కుశలను బాదుచు మిమ్ము ఆహ్వానింతురు.

18. అశ్విద్వయమా ! ఇది మా స్తోత్రము. అందరిని మించి మిమ్మే వహించవలెను. మాకు దగ్గరకావలెను.

19. అశ్వినీ ద్వయమా ! మధుపూర్ణ చర్మ పాత్ర మధ్యన ఉన్నది. అందలి మధువును పానము చేయండి.

20. అశ్వినులారా ! మీరు అన్నయుక్తులు. ధనవంతులు. మా పశు, పుత్ర, గోవులకొరకు ఆ రథమున అన్నము తెండి. అనాయాసమున తెండి.

21. అశ్వినులారా ! మీరు ప్రభాతమున ఎరుగదగినవారు. స్వర్గీయ వాంఛనీయ జలములను మా ద్వారము వరకు తెండు.

(నదుల ద్వారానో, కాలువల ద్వారానో తెమ్మనుట)

22. నేతలగు అశ్వినులారా ! తుగ్రపుత్రుడు భుజ్యుడు సముద్రమున తోయబడినాడు. అతడు ఎప్పుడు మిమ్ము స్తుతించి సేవించినాడు? మీ రథము అశ్వములకూడి ఎప్పుడు పోయినది?

23. నాసత్యద్వయమా ! అసురులు కణ్వుని మేడకింద కట్టి పెట్టినారు. మీరు అప్పుడు అతనికి నానావిధ రక్షణలు

కలిగించినారు.

(నా సత్యులు ఎన్నడు అబద్ధమాడనివారు. అశ్వినులు వైద్యులు, వైద్యులు అబద్ధమాడరాదని సూచన)

అసురులు కణ్వుని కనులు పెరికినారు. అశ్వినులు మరల కనులు కలిగించినారని వృత్తాంతము.

24. అశ్వినులారా ! మీరు వర్ష పరాయణులు ధనయుక్తులు. నేను పిలిచినపుడెల్ల అభినవములు, ప్రశస్తములగు రక్షణలతో విచ్చేయండి.

25. అశ్విద్వయమా ! మీరు కణ్వుని, ప్రియమేధను, ఉపస్తుతిని, స్తోత అత్రిని రక్షించినారు. అట్లే మమ్ము రక్షించండి.

26. ధనముల కొఱకు అంశుని, గోవుల కొరకు అగస్త్యుని, అన్నము కొరకు సౌభారుని రక్షించినారు. అట్లే మమ్ము రక్షించండి.

27. అశ్విద్వయమా ! మీరు వర్షకారులు. ధనసంపన్నులు. మిమ్ము స్తుతించు మేము ఇంత. ఇంతకన్న ఎక్కువ ధనము యాచింతుము.

28. అశ్వినులారా ! సువర్ణ నిర్మితము. సారథిస్థానముగలది, బంగారు కళ్లెముగల రథమున ఆసీనులు కండి.

29. అశ్వినులారా ! మీరథపు దండము బంగారపుది. ఇరుసు బంగారపుది. రెండు చక్రములు బంగారపువి.

30. అన్నము, ధనముగల అశ్వినులారా ! ఈ రథమున ఎంత దూరము నుంచి అయినను రండి. మా శోభన స్తుతుల వద్దకు విచ్చేయండి.

31. అమర అశ్వినులారా ! అసురుల పురములు భగ్నము చేయుచు మీరు దూరదేశము నుండి అన్నములు తెండి.

32. అశ్వినులారా ! మీరు అనేకులకు మిత్రులు సత్యస్వభావులు. మావద్దకు అన్నముతో రండి. కీర్తితో రండి. ధనముతో రండి.

33. అశ్వినులారా ! మీ అశ్వములు స్నిగ్ధరూపములు. పక్షులవంటి శీఘ్ర గమనము కలవి. అవి మిమ్ము సుందర యజ్ఞ మానవులవద్దకు చేర్చవలెను.

34. మీ రథము అశ్వయుక్తము. స్తోతలు ప్రశంసించునది. ఈ రథము సైన్యములను బాధించదు.

35. మనోవేగముగల అశ్వద్వయమా ! వడిగల అడుగులుగల గుర్రములు లాగు రథముపై ఎక్కి విచ్చేయండి.

36. వర్షకారులు, ధనయుక్తులగు అశ్విద్వయమా ! మీకు ఎల్లవేళ జాగృతమును, అన్వేషణీయ సోమ పానము లభించును.

37. అశ్వినులారా ! మీరు అభినవము. కీర్తనీయమగు ధనమును తెలిసికొనుడు. చేది వంశీయుడు కశుడను రాజు వంద ఒంటెలను, వేయి ఆవులను దానము చేసినాడు. అదికూడ తెలిసికొనండి.

38. కశురాజు నా సేవకొరకు బంగారమువలె మెరయునట్టి పదిమంది రాజులను ఇచ్చినాడు. సకల ప్రజ ఆ కశురాజు అడుగులక్రిందనే అణచి ఉండును.

(యుద్ధమున గెలిచిన రాజులను ఇచ్చినాడు. ఇది అతను శూరుడని చెప్పుట. సకల ప్రజల అడుగులక్రింద ఉండుట పాలనా సామర్థ్యమును చెప్పుట)

39. చేది వంశస్థులు దారిన మరొకడు సాగలేడు కశుని మించి ఏ విద్వాంసుడుగాని, ఏదాన పరాయణుడుకాని స్తోతకు దానము ఇవ్వలేడు.

*(ఆంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ మండలము ఐదవ అష్టకమున ఎనమిదవ అధ్యాయమున మొదటి అనువాకము సమాప్తము.)*

**రెండవ అనువాకము ఆరవ సూక్తము**

ఋషి - కాణ్వవత్సుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - గాయత్రి.

1. ఇంద్రుడు పర్జన్య సమాన బలవంతుడు. గొప్పవాడు. అతడు పుత్రుతుల్య స్తోతవలన వర్ధిల్లును.

2. ఇంద్రుని అశ్వములు ఆకాశమును నింపునవి. అవి యజ్ఞప్రజ అయిన ఇంద్రుని వహించును. అప్పుడు విద్వాంసులు యజ్ఞప్రాపక స్తోత్రము ద్వారా ఇంద్రుని స్తుతింతురు.

3. కణ్వులు ఇంద్రుని స్తుతించినారు. యజ్ఞసాధకుని చేసినారు. అందుకే జనులు ఇంద్రుని భ్రాత అందురు.

4. నదులు సముద్రునకు ప్రణమిల్లును. సమస్త మానవ జాతికి ఇంద్రుని క్రోధమన్న భయము. వారు స్వచ్ఛందముగా

ఇంద్రునకు ప్రణమిల్లుదురు.

5. ఇంద్రుని బలము గొప్పది. అతడు ఆ బలమున ద్యావాపృథ్వులను చర్మమువలె భద్రపరచును.

6. వృత్రుడు వడుకుచున్నాడు. ఇంద్రుడు వందధారల పరాక్రమశాలి, వజ్రము అందుకున్నాడు. వాని తల నరికినాడు.

7. మేము స్తోతలముందు నిలుతుము. వారి స్తోత్రములు అగ్ని సమాన దీప్తములు. వానిని మేము మరల మరల చదువుదుము.

8. స్తుతుల గుహయందున్నవి. అవి స్వయముగా ఇంద్రుని చేరును. దీపించును. వాటిని కణ్వులు సోమధారాయుక్తము చేసెదరు.

9. ఇంద్రా ! మేము గోవులు, అశ్వములతో కూడిన ధనము పొందవలెను. జ్ఞానప్రాప్తికిగాను ఇతరుల కన్నముందు అన్నము పొందవలెను.

10. ఇంద్రుడు పితా - సత్యస్వరూపుడు. నేను అతని అనుగ్రహమునకు పాత్రుడను అయినాను. నేను సూర్యునివలె వెలిగినాను.

11. కణ్వునివలె నేను నిత్యస్తోత్రములతో వాక్కులను అలంకరింతును. ఆ స్తోత్రములతో ఇంద్రుడు బలవంతుడగును.

12. ఇంద్రా ! నిన్ను స్తుతించని వారున్నారు. నిన్ను స్తుతించు ఋషులు ఉన్నారు. ఆ ఇద్దరి నడుమ నా స్తుతి స్తుతించబడవలెను. వృద్ధిపొందవలెను.

13. ఇంద్రుని క్రోధము వృత్రుని ముక్కలు ముక్కలు చేసి ధ్వనించినది. అప్పుడు ఇంద్రుడు వర్షజలమును సముద్రమున కంపినాడు.

14. ఇంద్రా ! శుష్ణుడు దస్యుడు. నీ వజ్రము ధారణయోగ్యము. దానిని వానిమీద ప్రయోగించినావు. ఉగ్ర ఇంద్రా ! నీవు అభీష్టవర్షివి.

15. ఇంద్రుని ద్యులోకము. తన బలమున వ్యాప్తిచెందించ లేదు. అంతరిక్షము వజ్రధర ఇంద్రుని వ్యాప్తిచెందించలేదు. భూమి సహితము ఇంద్రుని వ్యాప్తి చెందించలేదు.

16. ఇంద్రా ! వృత్రుడు నీజలమును అంతరిక్షమున వ్యాపింప చేసినాడు. కట్టి పెట్టినాడు. ఆవృత్రుని నీవు పారు నట్టి నీటి మధ్యహతమార్చినావు.

17. ఇంద్రా ! వృత్రుడు గొప్పవి కలిసి ఉన్నవి అగు ద్యావాపృథ్వులను కప్పిపెట్టినాడు. ఇంద్రా ! నీవు వృత్రుని అనాది అనంత అంధకారమున త్రోసినావు.

18. ఓజస్వి ఇంద్రా ! యతులగు అంగిరులు నిన్ను స్తుతింతురు. భృగువులు నిన్ను స్తుతింతురు. వారిలో నీవు నా స్తుతులను వినుము.

19. ఆవులు ఇంద్రుని యజ్ఞమున వర్థిల్ల చేయును. పాలు, నేయి ఇచ్చును.

20. ఇంద్రా ! ప్రసవించగల ఆవులు నీవు ప్రసాదించిన అన్నము తిన్నవి. సూర్యుని నలువైపున గల జలమువలె గర్భములు దాల్చినవి.

21. బలశాలివగు ఇంద్రా ! కణ్వులు ఉక్థలతో నిన్ను వర్థిల్ల చేయుదురు. అభిషుత సోమము నిన్ను వర్థిల్ల చేయును.

22. వజ్రహంత ఇంద్రా ! నీవు మార్గదర్శివి ఆయనపుడు ఉత్తమ స్తుతి, ప్రవృద్ధ యజ్ఞము కలుగును.

23. ఇంద్రా ! మాకు మహంతము, గోయుక్తమగు అన్నమును రక్షించుటకు వీర్యవంతుడగు పుత్రుని ప్రసాదించుటకు ఇచ్చగించుము.

24. ఇంద్రా ! నీవు నహుషునకు, ప్రజలముందు, వేగముగల అశ్వయుక్త బలమును ప్రదానము చేసినావు. అట్టి దానినే మాకు ప్రసాదించుము.

25. ఇంద్రా ! నీవు ప్రాజ్ఞుడవు. అదిగో దగ్గరలో దర్శనీయమగు గోశాల కనిపించుచున్నది. దానిని నింపుము. మమ్ము సుఖపెట్టుము.

26. ఇంద్రా ! నీ బలమునకు తగినట్లు ఆచరింపుము. మానవులకు రాజువగును. నీ బలమున మహానుడవగుము. అపరాజయుడవగుము.

27. ఇంద్రా ! నీవు బహు వ్యాపకుడవు. హవివంతులు సోమముతో నిన్ను తృప్తుని చేయదలతురు. నీ వద్దకు వత్తురు. స్తుతింతురు.

28. పర్వత ప్రాంతములందును, నదుల సంగమ స్థానములందును, యజ్ఞములందును, మేధావి ఇంద్రుడు ఆవిర్భవించును.

29. ఇంద్రుడు సర్వవ్యాపకుడు. అతడు లోకములందు విహరించును. పైలోకమునుండి దిగువకు సముద్రమును చూచును.

30. ద్యులోకమున ఇంద్రుడు వెలుగులు పొందును. అప్పుడు ప్రాచీన జలదాత ఇంద్రుని నివాసప్రదజ్యోతిని జనులు దర్శింతురు.

31. ఇంద్రా ! సమస్త కణ్వగణములు నీ బుద్ధిని, బలమును పెంచును. వారు నీ శ్రేష్ఠకార్యములనుకూడ వృద్ధిచెందింతురు.

32. ఇంద్రా ! ఇది మాసుందర స్తుతి. దీనిని స్వీకరింపుము. మమ్ము తగు రీతిగా రక్షింపుము. మా బుద్ధిని పెంచుము.

33. ఇంద్రా నీవు ప్రవృద్ధుడవు. వజ్రధరుడవు. మా జీవనము కొఱకు నిన్ను స్తుతించుచున్నాము.

34. కణ్వులు స్తుతింతురు. నీరు పల్లమునకు పారును. అట్లే రమణీయమగు స్తుతి ఇంద్రుని చేరును.

35. నదులు సముద్రమును పెంచును. అట్లే మంత్రములు ఇంద్రుని పెంచును. ఇంద్రుడు అజరుడు. అతని కోపమును ఎవ్వడు నివారించలేడు.

36. ఇంద్రా ! సుందర రథమున ఎక్కుము. దూరదేశము నుండి మావద్దకు రమ్ము. అభిషుత సోమము సేవింపుము.

37. ఇంద్రుడు అందరినిమించిన శత్రు సంహారకుడు. కుశలు కోయువారు. అన్నప్రాప్తికొఱకు ఇంద్రుని పిలిచెదరు.

38. ఇంద్రా ! రథచక్రము గుఱ్ఱమును అనుసరించును. ద్యావాపృథ్వులు నిన్ను అనుసరించును. అభిషుత సోమము సహితము నిన్నే అనుసరించును.

39. ఇంద్రా ! శర్యణ దేశమున తటాకము వద్ద ఋత్విక్కులు ప్రారంభించిన యజ్ఞమున తృప్తుడవగుము. సేవకుల స్తుతులు వినుము. ఆనందించుము.

40. ఇంద్రుడు ప్రవృద్ధుడు. కోరికలు తీర్చువాడు. వజ్రవంతుడు. సోమపాయి. వృత్రహంత. అతడు ద్యులోకమునుండి పలుకును.

41. ఇంద్రా ! నీవు పూర్వము పుట్టిన ఋషివి. నీ బలము అసమానము. నీ బలమున నీవు దేవతలకు ప్రభువువు అయినావు. నీవు మరల మరల ధనమును ఇచ్చుచుండుము.

42. మేము అందించు అభిషుత సోమము. అన్నముకొరకు మంచి వీపులుగల అశ్వములు నిన్ను తేవలెను.

43. కణ్వులు ఉక్థలు ఉచ్చరించవలెను. పూర్వజులు కృతము, మధురమగు జలమును పెంచు యాగక్రియను వర్ధిల్ల చేయవలెను.

44. దేవగణములు విశిష్ఠరూపమున గొప్పవారు. వారిలో ఇంద్రుడు మరింత గొప్పవాడు మానవులు ఇంద్రునే వరింతురు. అతనినే ధనము, రక్షణ ఆర్థింతురు.

45. ఇంద్రా ! నిన్ను అనేకులు స్తుతింతురు. నీ అశ్వములను యజ్ఞప్రియ ఋషులు స్తుతింతురు. అవి నిన్ను సోమపానమునకు మా వద్దకు గొనిరావలెను.

46. యదువులలో పరశుపుత్రుడు తిరందరుడు. నాకు నూరు, వేల ధనములు ఇచ్చినాడు.

47. తిరందరరాజులు పజ్రునకు సామునకు మూడు వందల గుఱ్ఱములు వేయి ఆవులు ఇచ్చియున్నారు.

48. తిరందరుడు ఎంతో ఎదిగినాడు. నాలుగు స్వర్ణభండార యుక్తములగు ఒంటెలను దానము చేసినాడు. యదువులను దాసులనుగా దానము చేసినాడు. అతని కీర్తి స్వర్గద్వారముల వరకు వ్యాపించినది.

## ఏడవ సూక్తము

ఋషి - కణ్వగోత్రజ పునర్వత్సస్యుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు - గాయత్రి.

1. మరుత్తులారా ! విప్రులు మూడు సవనములు చేతురు. వానిలో అగ్నియందు సోమ అన్నము ఆహుతి చేయుదురు. అప్పుడు మీరు పర్వతములందు దీప్తినొందుదురు.

2. మరుత్తులారా ! మీరు శుభంకరులు. బలాభిలాషులు. మీరు రథమున అశ్వములు పూన్చినపుడు పర్వతములు సహితము నడక సాగించును.

(భయపడును - గడగడలాడునని భావము)

3. మరుత్తులు శబ్దకర్తలు, పృశ్నిపుత్రులు, వారు మబ్బులను పైకి లేపుదురు. వృద్ధికరమగు అన్నమును దానము చేయుదురు.

4. మరుద్గణములు వాయువుతో కలిసినపుడు వర్షము కురిపింతురు. పర్వతములను వడకింతురు.

5. మీ రథముల నడకను పర్వతములు నిలిచి ఉన్నవి. నదులు సముద్రములు తమ రక్షణ, బలములకు నిలిచి ఉన్నది.

6. మేము మిమ్ము రాత్రులందు రక్షణలకు పిలుస్తాము. పగలు పిలుస్తాము. యజ్ఞారంభమున పిలుస్తాము.

7. మరుద్గణములు అరుణవర్ణులు, ఆశ్చర్యభూతులు. శబ్దకర్తలు. వారు రథముపై ద్యులోకపు అగ్రభాగమున సంచరింతురు.

8. మరుద్గణములు సూర్యగమనమునకు కిరణయుక్త మార్గమును కల్పింతురు. వారు సూర్య తేజమున ప్రకాశింతురు.

9. మరుత్తులారా ! నా వచనమును స్వీకరించండి. ఈ స్తోత్రమును స్వీకరించండి. ఈ ఆహ్వానమును అందుకొనండి.

10. పృశ్నులు వజ్రధరుడగు ఇంద్రుని కొఱకు మధుర సోమరసమును ఉత్స, కబంధ, అద్రి, అను మూడు స్థానములందు ఏర్పరచినవి.

11. మరుత్తులారా ! మేము సుఖాభిలాషులము. స్వర్గము నుండి మిమ్ము పిలిచెదము. అప్పుడు మీరు త్వరగా మా వద్దకు రావలెను.

12. రుద్రపుత్రులారా ! మీరు దానపరాయణులు. మహాతేజస్వులు. మీరు యజ్ఞగృహమున మాదక సోమము సేవింతురు. ఉత్తమ జ్ఞానవంతులగుదురు.

13. మరుత్తులారా ! స్వర్గము నుండి మా కొఱకు ధనము తెండు. ఆ ధనము మదస్రావి. బహునివాసదాత. అందరిని పోషించు శక్తిగలది కావలెను.

14. శుభ్రమరుత్తులారా ! మీరు పర్వతములమీద ప్రయాణము సాగింతురు. అభిషుత సోమబలమున ప్రమత్తులు

అగుదురు.

15. మరుత్తులు అహింసనీయులు. స్తోతలు స్తోత్రములతో వారిని స్తుతింతురు. సుఖములు యాచింతురు.

16. మరుత్తులు అక్షయ మేఘమును పితుకుదురు. వర్షము కలిగింతురు. జలబిందువులవలె ద్యావాపృథ్వులందు వ్యాపింతురు.

17. మరుత్తులు పృశ్నిపుత్రులు, వారు శబ్దము చేయుచు పైకి పోవుదురు. రథముమీద పైకి పోవుదురు. వాయువుద్వారా పైకి పోవుదురు. మంత్రములద్వారా పైకి పోవుదురు.

18. మీరు యదు తుర్వశులను రక్షించినారు. ధనాభిలాషియగు కణ్వుని రక్షించినారు. ధనము కొఱకు మేము వారిని తలచుచుందుము.

19. మరుత్తులారా ! మీరు ఉత్తమ దాతలు. ఘృతము శరీరమునకు పుష్టినిచ్చును. ఈ అన్నము అటువంటిదే దీనిని కణ్వగోత్రజులు కల్పించిన స్తోత్రముతో సమానముగా వర్ధిల్లచేయండి.

20. మరుత్తులారా ! మీరు దాన పరాయణులు. మీ కొఱకు కుశలు త్రెంచ బడినవి. మీరు ఇప్పుడు ఎక్కడ మత్తులో ఉన్నారు? ఏ స్తోత మిమ్ము సేవించు చున్నాడు?

21. మరుత్తులారా ! ఎంతో పూర్వమే మిమ్ము ఇతరులు స్తుతించి ఉన్నారు. ఆ యజ్ఞ సంబంధ స్తోత్రములతో మీ బలములను ప్రసన్నము చేసి ఉన్నారు. అదిసరికాదు.

(పాత స్తోత్రములకు మాత్రమే ప్రసన్నులగుట అంత మంచిదికాదని కొత్త స్తోత్రములకు గూడ ప్రసన్నులు కావలెనని)

22. మరుత్తులు ఓషధులను జలములతో కలిపినారు. ద్యావాపృథ్వులను వాటి స్థానములందు నిలిపినారు. సూర్యుని స్థాపించినారు. వృత్రుని ప్రత్యేక అవయమును ఖండించుటకు వజ్రము ధరించినారు.

23. మరుత్తులు ఏ రాచరికపు క్రిందివారుకారు స్వతంత్రులు. వీరుల సమమగా బలము పెంచుకొనువారు. వారు పర్వతమునువలె వృత్రుని ముక్కలు ముక్కలు చేసినారు.

24. మరుద్గణములు యోద్ధ త్రితుని బలములను రక్షించినారు. త్రిత కార్యములను రక్షించినారు. వృత్ర వధ సమయమున ఇంద్రుని రక్షించినారు.

25. మరుత్తులు ఆయుధపాణులు దీప్తిమంతులు. శుభంకరులు. తమ తలలకు బంగారు కిరీటములు ధరింతురు.

26. మరుత్తులారా ! మీరు స్తోతలను కోరినారు. అభీష్టవర్షి రథము ఎక్కినారు. దూరదేశము నుండి విచ్చేసినారు.

అప్పుడు ద్యులోకవాసులవలె భూలోకవాసులు సహితము కంపించినారు.

27. దేవతలు యజ్ఞదానమునకుగాను బంగారుకాళ్ల గుఱ్ఱములపై రావలెను.

28. మరుత్తుల రథముమీద తెల్లచుక్కల మృగియు, వడిగల రోహిత మృగము చేరినపుడు మరుద్గణములు దిగిపోవుదురు. జలము ప్రవహించసాగును.

29. మరుత్తులు శోభన సోమవంతులు, యజ్ఞగృహ సంయుక్తులు, వారు ఋజి, దేశమునగల శర్యణ, సరోవరమున రథచక్రమును వంచి సాగిపోవుదురు.

30. మరుత్తులారా ! విప్రులు మిమ్ము ఆహ్వానించుచున్నారు. యాచించుచున్నారు. సుఖ హేతువగు ధనముతో ఎప్పుడు వారివద్దకు వచ్చెదరు?

31. మీరు స్తుతికి ప్రసన్నులగుదురు. మీరు ఇంద్రుని ఎప్పుడు త్యజించినారు. మీ మైత్రికొఱకు ఎవరు ప్రార్థించినారు.

32. కణ్వగణమా ! మరుత్తులు వజ్రహస్తులు. ఆయుధములను పదునుపెట్టు బంగారు యంత్రముగలవారు. అట్టి మరుత్తుల సహితముగా అగ్నిని స్తుతించండి.

33. మరుత్తుల వర్షకులు. యజనీయులు. విచిత్ర బలవంతులు. నేను సుఖలభ్యధనము కొఱకు వారిని అర్థింతును.

34. మరుత్తుల వేగమునకు రాతిగుట్టలు పీడింపబడును. బాధింపబడును. అయినను అవి తమ స్థానముల నుండి కదలవు. పర్వతములు సహితము నిలిచియే ఉండును.

35. బహుదూరము వ్యాపించి గమనము సాగించు అశ్వములు ఆకాశమార్గమున వెళ్లుచు మరుత్తులను తీసికొని వచ్చును. అవి స్తోతలకు అన్నము కలుగుచేయును.

36. అగ్ని తన తేజోబలమున స్తవనీయ సూర్యునివలె అందరికి ముఖ్యుడై జన్మించినాడు. మరుద్గణములు దీప్తిబలమున అనేకచోట్ల ఉందురు.

## ఎనిమిదవ సూక్తము

ఋషి - కాణ్వసధ్వంసుడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - అనుష్టుప్.

1. అశ్విద్వయమా ! మీరు దర్శనీయులు. మీ రథము బంగారపుది. సకల రక్షణలతో విచ్చేయండి. సోమపానము చేయండి.

2. అశ్వినులారా ! మీరు భోక్తలు. హిరణ్మయ శరీరము గలవారు. క్రాంతకర్మలు. ప్రశస్త జ్ఞానవంతులు. మీరు సూర్యునివలె వెలుగు రథముమీద తప్పక మావద్దకు రావలెను.

3. అశ్వినులారా ! నహుషుని అంతరిక్షము నుండి మానవ లోకమునకు రండి. కణ్వవంశీయుల యజ్ఞమున సోమపానము చేయండి.

4. అశ్వినులారా ! కణ్వ ఋషి పుత్రులు యజ్ఞము చేయుచున్నారు. మీ కొఱకు సోమమయ మధువు అభిషవించుచున్నారు. ద్యులోక, అంతరిక్షముల నుండి విచ్చేయండి.

5. అశ్వినులారా ! మీరు వర్ధకులు. కవులు. నేతలు. ఈ యజ్ఞమున మీ స్తుతి జరుగుచున్నది. సోమపానమునకు విచ్చేయండి. మీ బుద్ధి కర్మతో స్తోతలకు సుబుద్ధి ప్రసాదించండి.

6. అశ్వినులారా ! మీరు నేతలు. ప్రాచీన కాలపు ఋషులు రక్ష కోరి మిమ్ము పిలిచినారు. మీరు వచ్చినారు. ఇప్పుడు నా సుందర స్తుతి వినుటకు నావద్దకు రండి.

7. అశ్విద్వయమా ! మీరు సూర్యజ్ఞానము కలవారు. ద్యులోక అంతరిక్షములనుండి మావద్దకు రండి. స్తోతలపై అనుగ్రహించి బుద్ధి సహితులై రండి. ఆహ్వానము వినండి. స్తోతలతో రండి.

8. నేను కాక మరెవ్వడు స్తోత్రములతో అశ్వినులను ఉపాసించగలడు? కణ్వపుత్రుడు వత్స ఋషి. అతడు స్తుతుల ద్వారా మిమ్ము వర్ధిల్ల చేయును.

9. అశ్వినులారా ! మీరు పాపరహితులు. శత్రుఘాతుకులలో శ్రేష్ఠులు. ఇక్కడ యజ్ఞము జరుగుచున్నది. విప్రులు స్తుతించుచున్నారు. రక్షణలకొరకు ఆహ్వానించుచున్నారు. మీరు మాకు సుఖములు కలిగించండి.

10. అశ్వినులారా ! మీరు అన్న, ధన సంపన్నులు. సూర్యపుత్రి మీ రథము ఎక్కినది. మీరు సమస్త అభిలషిత పదార్థములు కలిగియుండండి.

11. అశ్వినులారా ! మీరు ఏలోకముల ఉన్నారో ! అక్కడి నుంచి బహురూప రథముమీద విచ్చేయండి. కవిపుత్రుడు, కవి వత్స ఋషి మధుమయ వాక్యములు ఉచ్చరించును.

12. అశ్విద్వయమా ! మీరు ధనదాతలు. లోకములు వహించువారు. బహుమదయుక్తులు. ఈ నా స్తోత్రమును ప్రశంసించండి.

13. అశ్వినులారా ! లజ్జ కలిగించని ధనమునంతను మాకు ఇవ్వండి. మమ్ము ప్రజోత్పాదక కర్మ వంతులను చేయండి. మమ్ము నిందకులకు వశపరచకండి.

14. సత్య స్వభావ అశ్వినులారా ! మీరు దూరమున ఉన్నను, దగ్గర ఉన్నను, ఎచట ఉన్నను సహస్రరూపరథముపై విచ్చేయండి.

15. నా సత్యద్వయమా ! వత్స ఋషి స్తుతులతో మిమ్ము వర్ధిల్లచేయును. అతనికి సహస్రరూపుయు, ఘృతయుక్తమగు అన్నము ప్రసాదించండి.

16. అశ్వినులారా ! ఆ స్తోతలకు నేతిధారలతోకూడిన బలిష్ఠ అన్నము నివ్వండి. వీరు మీ సుఖమునకు స్తుతించినారు. వారు తమ కొఱకు ధనము కోరుచున్నారు.

17. అశ్వినులారా ! మీరు రిపు భక్షకులు. అధిక హవిని ఆరగించువారు. మీరు మా స్తుతివైపునకు రండి. మాకు శుభసంపదను, పార్థివ ధనమును అందించండి.

18. ప్రియమేధనామక ఋషులు దేవతలను ఆహ్వానించినారు. అప్పుడు మిమ్ము సకల సంరక్షణలతో ఆహ్వానించినారు. మీరు యజ్ఞశోభ పొందండి.

19. అశ్విద్వయమా ! మీరు సుఖదాతలు. ఆరోగ్యప్రదులు. స్తుతియోగ్యులు. వత్స ఋషి స్తుతులతో మిమ్ము వర్ధిల్ల చేసినాడు. అతనివద్దకు రండి.

20. నేతలగు అశ్వినులారా ! మీరు కణ్వుని, మేధాతిథిని వశ్యుని, దశవ్రతుని, గోశర్యుని రక్షించినారు. వారివలెనే మమ్ము రక్షించండి.

21. నేతలగు అశ్విద్వయమా ! ఏ రక్షణలతో లభించగల ధనము కొరకు త్రసదస్యుని రక్షించినారో, అట్లే అన్నలాభము కొఱకు మమ్ము రక్షించండి.

22. అశ్వినులారా ! మీరు బహురక్షణలవారు శత్రునాశకులందు శ్రేష్ఠులు. మంచి స్తుతియు, వాక్యమును మిమ్ము వర్ధిల్లచేయవలెను. మా కొఱకు మీరు బహువిధ అభిలషణీయులు కండి.

23. అశ్విద్వయపు మూడు చక్రముల రథము అదృశ్యముగా ఉండి తదుపరి వెల్లడి అగును. క్రాంతదర్శి అశ్విదయమా ! యజ్ఞ, కారణభూత రథమున మావద్దకు రండి.

## తొమ్మిదవ సూక్తము

ఋషి - శశకర్ణుడు దేవత - అశ్వినులు, ఛందస్సు - వేరు వేరు

1. అశ్విద్వయమా ! వత్స ఋషిని రక్షించుటకు మీరు వాస్తవముగా వెళ్లినారు. ఈ ఋషికి బాధలులేని, విశాల గృహమును ప్రదానము చేయండి. అతని శత్రువులను దూరము చేయండి.

2. అశ్విద్వయమా ! అంతరిక్షమునందు, స్వర్గమునందున్నదియు పంచశ్రేణులవద్ద ఉన్నటువంటి ధనమును ప్రసాదించండి.

3. అశ్విద్వయమా ! మీరు చేసిన ఘనకార్యములను విప్రులు అనేకమార్లు స్తుతించినారు. అది గ్రహించండి. కణ్వపుత్రుల కార్యములను కూడ గ్రహించండి.

4. అశ్వినులారా ! మీ అలసటను స్తోత్రములద్వారా తీర్చబడును. అన్నధనశాలులారా ! మీరు ఏ సోమము వలన వృత్రుని కనుగొన్నారో, ఇది అదే మధుమంత సోమము !

5. బహుకర్మ అశ్విద్వయమా ! జలములు, వనస్పతులు, లతలకు మీరు చికిత్స చేసినారు. వాటిద్వారానే మమ్ము రక్షించండి.

(చికిత్స మానవులకు మాత్రమే కాక ఇతరులకు ఉండెను. జలచికిత్స వాటర్ ట్రీట్ మెంట్ నీరు బాగుచేయు పద్ధతి ఆనాడు ఉన్నట్లున్నది.)

6. సత్యభావ అశ్వినులారా ! మీరు జగములను పోషించినారు. అందరిని రోగరహితులను చేసినారు. స్తుతుల వలన మాత్రమే వత్స ఋషి మిమ్ము పొందలేదు. మీరు హవివంతుల వద్దకు వెళ్లుదురు.

7. ఋషి ఉత్తమ బుద్ధితో అశ్విద్వయపు స్తోత్రమును తెలిసికున్నాడు. నేను అత్యంత మధురసోమము మరియు ఘర్మమను హవివిశేషమును అధర్వమును మథించి అగ్నికి సమర్పించినాను.

8. అశ్విద్వయమా ! మీరు వేగముగల రథమున ఎక్కండి. ఈ నా స్తోత్రములు సూర్యునివలె తేజస్వులై మీముందుకు వచ్చును.

9. నా సత్యద్వయమా ! మేము ఉక్థలతో మిమ్ము తోడ్కొని వత్తుము. మంత్రములతో మేము మిమ్ము పిలుచుకొని వచ్చినరీతి కణ్వపుత్రుల స్తోత్రము వినుటకు విచ్చేయుము.

10. అశ్విద్వయమా ! కక్షీవంత ఋషి మిమ్ము పిలిచినాడు. వ్యశ్య దీర్ఘ తమ ఋషులు, వేనరాజు పుత్రుడు పృథి మిమ్ము యజ్ఞ గృహములకు పిలిచినారు. వారివలెనే నేను స్తుతించుచున్నాను. నా స్తోత్రములను గ్రహించుము.

11. అశ్విద్వయమా ! మీరు గృహపాలకులై విచ్చేయండి. మీరు గొప్ప పోషకులు. మీరులోకములను దేహములను పాలించువారు. పుత్ర, పౌత్రులున్న గృహమునకు విచ్చేయండి.

12. అశ్వినులారా ! మీరు ఇంద్రునితో ఒకే రథమున వెళ్లినవారయిన వాయువుతో ఒకేచోటు ఉన్నవారయిన అదితిపుత్రులు మిత్రాదులు, ఋతువుల సహితులయి ప్రసన్నులయిన విష్ణువు అడుగుల ముల్లోకములు తిరిగినవారయిన రండి రారండి. విచ్చేయండి.

13. నేను యుద్ధసమయమున అశ్వినులను ఆహ్వానింతును. అప్పుడు వారు రావలెను. శత్రువును దెబ్బతీయుటలో అశ్వినుల రక్షణ విజయ రక్షణ. అదే శ్రేష్ఠ రక్షణ.

14. అశ్వినులారా ! ఈ హవ్యములు మీ కొఱకు చేయబడినవి. మీరు తప్పక రావలెను. ఇవి యదు తుర్వశులందు నిలిచినవి. ఇప్పుడు మీ కొఱకు సంస్కరించబడినవి. కణ్వపుత్రులు మీకు అర్పించుచున్నారు.

15. నా సత్యద్వయమా ! మీరు ప్రకృష్ట జ్ఞానవంతులు. దూరముననో, దగ్గరనో ఔషధములుండును. వాటితో విచ్చేయండి. విమదునకు సమానముగా వత్సునకు గృహము ప్రదానము చేయండి.

16. నేను అశ్వద్వయ సంబంధిని. ప్రకాశమాన స్తోత్రసహితుడనై జాగృతుడనైనాను. ద్యుతిమతి ఉషా ! నా స్తుతి వినుము. అంధకారము దూరము చేయుము. మానవులకు ధనము ప్రసాదించుము.

17. దేవీ సుందర నేత్రీ ! మహతీ ఉషా ! అశ్విద్వయమును మేల్కొల్పుము. వారికి అభ్యుదయము కలిగించుము. దేవహోతా ! అశ్విద్వయమును ప్రబోధితులను చేయుము. వారి ఆనందమునకు బృహత్ సోమము వేచి ఉన్నది.

18. ఉషా ! నీవు వెలుగు వెంట సాగుదువు. అప్పుడు నీకు సూర్యసమాన కాంతి కలుగును. అప్పుడు అశ్వినుల రథము మానవులను పోషించు యజ్ఞగృహమునకు చేరును.

19. పసుపురంగు సోమలతను ఆవు చన్నువలె పితికినప్పుడు దేవాభిలాషులు స్తుతించినప్పుడు అప్పుడు అశ్వినులారా ! మీరు రక్షించండి.

20. ప్రకృష్ట జ్ఞానవంత అశ్విద్వయమా ! మీరు ధనమునకుగాను మమ్ము రక్షించండి. బలమునకుగాను మమ్ము రక్షించండి. మానవులు అనుభవించు సుఖములకుగాను మమ్ము రక్షించండి. సమృద్ధికిగాను మమ్ము రక్షించండి.

21. అశ్విద్వయమా ! మీరు పితృతుల్య ద్యులోకపు వడిలో కార్యతత్పరులై ఉన్నను ప్రశంసనీయులై సుఖించుచున్నను మావద్దకు విచ్చేయండి.

## పదవ సూక్తము

ఋషి - కణ్వపుత్రుడు ప్రగాధుడు, దేవతలు - అశ్వినులు, ఛందస్సు - బృహతి, పంక్తి, త్రిష్టుప్.

1. అశ్విద్వయమా ! మీరు యజ్ఞగృహములు ఉన్న లోకమున ఉన్నారా ? ద్యులోకపు దీప్తమాన ప్రదేశమున ఉన్నారా ? అంతరిక్షమున నిర్మించుకున్న గృహమున ఉన్నారా? ఎక్కడ ఉన్నను ఇక్కడికి విచ్చేయండి.

2. అశ్విద్వయమా ! మీరు మనువు ప్రజాపతి యజమాని యజ్ఞమును సంసిక్తము చేసి ఉన్నారు. కణ్వపుత్రుల యజ్ఞము అట్టిదేయని తెలియండి. నేను బృహస్పతిని, సకల దేవతలను ఇంద్రుని విష్ణువును శీఘ్రగామి అశ్వములుగల అశ్వినులను ఆహ్వానించుచున్నాను.

3. అశ్వినులు శుభకర్ములు. వారు మా హవిని స్వీకరించుటకు అవతరించినారు. నేను వారిని ఆహ్వానించుచున్నాను. వారి స్నేహము దేవతలలో ఉత్కృష్టము సహజము.

4. అశ్వినీ కుమారులు జ్యోతిష్టోమాదులకు ప్రభువులు. వారికి స్తోత్రశూన్య దేశమున కూడ స్తోతలుందురు. వారు హింసారహిత యజ్ఞపు ప్రకృష్ట జ్ఞాతలు. వారు స్వధ - బలకారక స్తుతి. సహితులై సోమమయ మధుపానము చేయవలెను.

5. అశ్వినులారా ! మీరు అన్నవంతులు. ధనవంతులు. ఇప్పుడు మీరు పూర్వదిశ, పశ్చిమదిశ లేక ద్రుహ్యు, అను,

తుర్వశ, యదువుల వద్ద ఉన్నను నా పిలుపు వినండి. నావద్దకు రారండి.

6. బృహత్ హావిభక్షకులగు అశ్విద్వయమా ! మీరు అంతరిక్షమును కేగుచున్నను ద్యావాపృథ్వులకు అభిముఖముగా వెళ్లుచున్నను తేజోబలమున రథముపై కూర్చుండి, ఉన్నను, ఎక్కడినుంచైనను ఇక్కడికి విచ్చేయండి.

## పదకొండవ సూక్తము

ఋషి - కణ్వపుత్రుడు వత్సస్యుడు దేవత - అగ్ని, ఛందస్సు - గాయత్రి చివరిది త్రిష్టుప్.

1. అగ్నీ ! నీవు మానవుల కర్మ రక్షకుడవు. అందువలననే యజ్ఞములందు నిన్ను స్తుతింతురు.

2. శత్రుపరాజయకారి అగ్నీ ! నీవు యజ్ఞములందు కీర్తినీయుడవు. యజ్ఞములనేతవు.

3. జాతవేద అగ్నీ ! మా శత్రువులను వేరుచేయుము. దేవద్వేషులను శత్రువులను వేరు చేయుము.

4. జాతవేద అగ్నీ ! శత్రువు సమీపమున యజ్ఞము చేయుచున్నాను అటుతొక్కవు.

5. మేము విప్రులము. నీవు అమరజాతవేదవు. మేము నిన్ను విస్తృతముగా స్తుతింతుము.

6. మేము మానవ విప్రులము. అగ్నికి హవ్యము సమర్పింతుము. ప్రసన్నుని చేతుము. మా రక్ష కొఅకు అగ్నిని స్తుతింతుము. పిలుతుము.

7. అగ్నీ ! ఉత్తమ గృహము కన్నను వత్స ఋషి మమ్ము ఎక్కువగా ఆకర్షించును. అతని స్తుతి నిన్ను కోరును.

8. నీవు అనేక దేశములందు సమానముగా దర్శనమిస్తావు. అందుకే నీవు సకల ప్రజలకు స్వామివి. యుద్ధములందు మేము నిన్ను పిలుచుచుందుము.

9. మేము అన్నాభిలాషులము. మమ్ము రక్షించుమని యుద్ధమున అగ్నిని ఆహ్వానిస్తాము. యుద్ధములందు అగ్ని విచిత్ర ధనయుక్తడగును.

10. అగ్నీ ! నీవు యజ్ఞమున పూజ్యుడవు. ప్రాచీనుడవు. నీవు చిరకాలముగా హోతవు. స్తుతింపదగినవాడవు. యజ్ఞములందు ఆసీనుడవగుదువు. నిన్ను హవితో తృప్తిపరచుకుందువు.

11. అగ్నీ ! మాకు సౌభాగ్యము ప్రదానము చేయుము.

**-: ఇయ్యది :-**

*శ్రీవత్సవ గోత్రోద్భవుండను, దాశరథి లక్ష్మణాచార్య బుచ్చమాంబల పౌత్రుండను, విద్వాన్ వెంకటాచార్య వెంకటాంబల పుత్రుండను, ఆంధ్రదేశ ఆస్థానకవి దాశరథి కృష్ణమాచార్య అనుజుండను శ్రీ|| ల|| సౌ|| కమలానామ్ని ధర్మపత్నీ సమేతుండను. "చిల్లర దేవుళ్లు - మోదుగుపూలు - పావని - చలనచిత్ర రచయితయు - శరతల్పం - కొత్తకాపురం - వింత సంసారం - తూరుపు తెల్లవారింది - రంతిదేవుడు - అఖండదీపం - దొంగసొమ్ము" దూరదర్శన సీరియల్ రచయితయు అగు దాశరథి రంగాచార్య రచించిన ఆంధ్రవచన ఋగ్వేద సంహిత యందలి అయిదవ అష్టకము సమాప్తము.*

*"యదింద్రత్యాతస్త్వమేతా దహమవేయ స్తోతారామిద్ది థిషే యరదావసోన పాపత్వారాసయ"*

**-: ఇతిశమ్ :-**

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వ విఘ్నోప శాంతయే**

**ఆంధ్ర వచన ఋగ్వేద సహింత**
**ఆరవ అష్టకము**
**ఎనిమిదవ మండలము**
**మొదటి అధ్యాము రెండవ అనువాకము**

**పన్నెండవ సూక్తము**

ఋషి - కణ్వగోత్రజుడు పర్వతు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు ఉష్ణిక్.

**ఓం యింద్ర సోమపాత మోమదః శవిష్ఠ చేతతి**
**యేనాహంసిన్యశీ త్రిణంతమీమహే**

1. ఇంద్రా నీవు మరింత సోమపానము చేయువాడవు. బలవంతులలో బలవంతుడవు. సోమపానమున నీకు మత్తు

కలుగును. ప్రసన్నుడవగుదువు. నీ కార్యములను చక్కగా తెలిసికొందువు. సోమపానమున కలిగన మదమున రాక్షసులను సంహరింతువు. నీవు అట్టి మదయుక్తుడయినపుడే నిన్ను మేము యాచింతుము.

2. ఇంద్రా! నీవు సోమపానము చేసినావు. మదయుక్తుడవయినావు. అంగిరగోత్రజ అధ్రిగుని రక్షించినావు. చీకట్లను పారద్రోలువాడును. అందరికి నేతయగు సూర్యుని రక్షించినావు. సముద్రుని రక్షించినావు. నీవు అట్టి మదయుక్తుడవయినపుడే నిన్ను యాచింతుము.

3. ఇంద్రా !సోమపాన జనితమదమున నీవు వర్షజలమును రథము వలె సంద్రమువైపు పంపుదువు. నీవు అట్టి మదయుక్తుడవైనపుడే మేము నిన్ను యగాధుల ప్రాప్తిని యాచింతుము.

4. ఇంద్రా! ఎస్తోత్రమున స్తుతజవై వెంటనే బలము పొంది మా కోరికలు తీర్చెదవో, అట్టి అభీష్టప్రదాయక, ఘృత సమాన పవిత్ర స్తోత్రమును గ్రహింపుము.

5. ఇంద్రా! నీవు స్తుతులతో ఆరాధనీయుడవు. ఈస్తుతిని స్వీకరింపుము. ఈ స్తోత్రము సంద్రము పగిది పరిధవిల్లును. ఆ స్తోత్రమును గ్రహించిన నీవు మాకు సకల రక్షణలుగల శుభములను కలిగించుము.

6. ఇంద్రుడు సుదూర ప్రాంతమునుండి వచ్చినాడు మామైత్రి కోరినాడు. మాకు ధనమొసంగినాడు. ఇంద్రా! ద్యులోకమునుండి కలుగు వృష్ఠివలె మాధనమును పెంపొందించుము. మాకు శ్రేయస్సు కలిగింపుము.

7. ఇంద్రుడు అందరకు ప్రేరకుడగు ఆదిత్యునితో సమానుడు. అతడు వర్షదులు కలిగించిద్యావా పృథ్వులను వర్థిల్ల చేయును. అప్పుడు ఇంద్రుని పతాకలు, ఇంద్రుని చేతి వజ్రము మాకు శుభములనొసంగును.

8. ఇంద్రుడు ప్రవృద్ధుడు భక్తులను పాలించువాడు అతడు వేలమంది వృత్రాది అసురులను వధించినాడు. తదనంతరమే అతని బలము ఇంతింతై పెరిగినది.

9. దావానలము అరణ్యములను కాల్చును. ఇంద్రుడు సూర్యకిరణములతో బాధించు శత్రువును దహించును. శత్రుదమనుడగు ఇంద్రుడు ప్రవృద్ధుడగును.

10. ఇది నేను చేయుస్తుతి నీవద్దకు చేరును. ఈ స్తుతి వసంతాది ఋతువులలో యజ్ఞకర్మము వంటిది. అతిఅభినవము పూజనీయము. అత్యంత ప్రసన్నదాయకము.

11. స్తోత ఇంద్రుని యజ్ఞము చేయును. అతడు ఇంద్రుని పానమునకు అనుషంగిసోమమును దశాపవిత్రమున ఇంద్రుని గుణగణములను కీర్తించును.

12. స్తోత ఇంద్రునకు మిత్రుడు. గుణకీర్తనము చేయు అభిషకర్త వాక్యమువలె దాతయగు ఇంద్రుడు తనను ప్రవృద్ధుని చేసుకున్నాడు. ఈ స్తుతి ఇంద్రుని గుణ గణములను కీర్తించును.

13. విప్రుడు, స్తోత్రవాహకుడగు మానవుడు ఇంద్రుని ఉన్మత్తుని చేయును. ఆ ఇంద్రుని నోట ఘృతసమాన హవ్యమును అర్పింతును.

14. అదితి స్వయముగా శోభిల్లు ఇంద్రుని కొరకు అతని రక్షణకు ఇంద్రుని ప్రశంసించు సత్యసంబంధి స్తోత్రములను కల్పించినది.

15. ఋత్విక్కులు యజ్ఞవాహకులు. వారు తమ రక్షణ కొరకు ఇంద్రుని ప్రశంసింతురు స్తుతింతురు. వారి నామకములగు రెండు అశ్వములు వివిధకర్మలు గలవి ప్రస్తుతము యజ్ఞమందున్నవి. ఇంద్రా! అవి నిన్ను వహించును.

16. ఇంద్రా ! నీవు విష్ణు సహితుడవై 'ఆప్తత్రిత' రాజర్షి యజ్ఞమునకుగాని మరుత్తులతో మరొక యజ్ఞమునకుగాని వెళ్లి సోమపానము చేయుచున్నవాడవైనను మాసోమము సేవింపుము, ప్రమత్తుడవగుము.

17. ఇంద్రా! నీవు సుదూర దేశమున ద్రవరూప సోమపుమత్తులో మునిగి ఉండవచ్చును. అతినాను మేము సోమము సమర్పించినపుడు దానితో ఆనందించుము.

18. ఇంద్రా నీవు సత్యపాలకుడవు. నీవు సోమాభిషవ కర్త యజమానిని వర్ధిల్ల చేయువాడవు. నీవు ఏయజమాని ఉక్థమంత్రమున ప్రసన్నుడవు అగుదువో ఆయజమాని సోమమున ప్రసన్నుడవగుము.

19. ఋత్విక్కులారా! మీ రక్షణలకుగాను నేను ఇంద్రుని స్తుతించుచున్నాను. ఇంద్రుడు నాస్తుతులను గ్రహించవలెను వానిని యజ్ఞము కొరకు పరివ్యాప్తము చేయవలెను.

20. ఇంద్రుడు యజ్ఞయోగ్యుడు. అందరిని తలతన్నిన సోమపాయి. స్తోతులు హవ్యము, స్తుతి, సోమములతో ఇంద్రుని వర్ధిల్ల చేయుదురు వ్యాపింప చేయుదురు.

21. ఇంద్రుని ధనము ప్రధానము ప్రచురము. ఇంద్రుని కీర్తి బహుళము. అతడు హవ్యదాత యజమానికొరకు సమస్త సంపదలను పరివ్యాప్తము చేయును.

22. వృత్రవధ ఇంద్రుని దేవతలు తమస్వామిగా అంగీకరించినారు. అతని బలము కొరకు స్తుతివచనములతో స్తుతించినారు.

23. ఇంద్రుడు మహామహిమాన్వితుడు. ఆహ్వానములు ఆలకించువాడు. స్తోతలు ఇంద్రుని స్తుతించియు, పూజించియు అతని బలవర్ధనమునకుగాను. తేప తేప స్తుతించుచుందురు.

24. ఇంద్రుడు వజ్రధరుడు. ద్యావాపృథ్వులు, అంతరిక్షము అతనిని తమనుండి వీడదీయజాలవు. అట్టి ఇంద్రుని జలమునుండి బలము గ్రహించుటకుగాను. లోకములు ప్రదీప్తములగును.

25. ఇంద్రా! యుద్ధములందు దేవతలు నిన్ను పురోగామిని చేసినారు. అదిగో అప్పుడే అందమయిన హర్యశ్వములు నిన్ను వహించినవి.

26. వజ్రధరింద్రా! నీటిని నిలిపిపెట్టిన  వృత్రుని నీబలమున వధించినపుడు రమణీయ హర్యశ్వేములు నిన్ను తెచ్చినవి.

27. నీవు విష్ణువు తనమూడు అడుగులతో ముల్లోకములను కొలిచినపుడు కమనీయములను నీ హర్యశ్వములు నిన్ను తోడ్కొని వచ్చినవి.

28. ఇంద్రా! రమణీయములగు నీ హర్యశ్వములు నిత్యము ఎదిగినపుడు. అప్పుడే నీవు సకలలోకములను నియమించినావు.

29. ఇంద్రా! మరుద్రూపులగు నీప్రజ సకల భూతములను నియమించినపుడు అప్పుడే నీవు సకల లోకములను నియమించినావు.

30. ఇంద్రా! నిర్మల జ్యోతిర్మూర్తి సూర్యుని నీవు ద్యులోకమున స్థాపించినపుడు అప్పుడే నీవు సకల లోకములను నియమించినావు.

31. ఇంద్రా ! లోకమున జనులు తమ బంధువులను ఉచ్ఛస్థానములకు చేర్చెదరు. అట్లే విప్రస్తోతలు అనందకరము, అందముగు ఈస్తోత్రమును భక్తి పూర్వకముగా నీ వద్దకు పంపుదురు.

32. యజ్ఞమున ఇంద్రుని తేజస్సు ప్రీతినొందును అప్పుడు స్తోతలు ఒక చోట చేరి  ఉత్తమరీతినిస్తుతింతురు. అట్టి తరి ఇంద్రా! నాభిస్వరూప యభిషవస్థాన వేదిన మాకు ధనములను ప్రసాదించుము.

33. ఇంద్రా! నేను తొలుతనే జ్ఞానార్జన హోతవలె యజ్ఞమున స్తుతించినాను. నాకు ఉత్తమ వీర్యము ఉత్తమగోవులు, ఉత్తమ అశ్వయుక్త ధనమును ప్రసాదించుము.

*(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఆరవ అష్టకము, ఎనిమిదవ మండలమున రెండవ అనువాకము సమాప్తము.)*

**మూడవ అనువాకము పదమూడవ సూక్తము**

ఋషి - 'కాణ్వనారదుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - ఉష్ణిక్

1. సోమము సమర్పించిన యజ్ఞకర్తను, స్తోత ఇంద్రుడు పవిత్రుని చేయును. ఇంద్రుడు తాను వర్ధిల్లు బలముననే మహామహుడయనాడు.

2. తొలుత వర్ధిల్లిన వ్యోమమును, స్వర్గమును ఇంద్రుడు యజమానుల కొరకని వర్ధిల్ల చేసినాడు. ఇంద్రుడు కార్యములకు ప్రారంభకుడు సమాపకుడగును. ఇంద్రుడు అత్యంత యశోయుక్తి జలములకుగాను వృత్రుని గెలుచును.

3. ఇంద్రుడు బలవంతుడు. అతని బలమును మరింత పెంచుదును. యుద్ధములందు ఆహ్వానింతును. ఇంద్రా! నీవు ధనాభిలాషివయనపుడు వర్ధిల్లుటకుగాను మాకు మిత్రుడవగుము.

4. ఇంద్రా! నీవు స్తుతులలో పూజింపదగిన వాడవు. సోమాభిషవ కర్త యజమాని అహుతి నిన్నుచేరును. మత్తుడవగుము. ఈ యజ్ఞమునకు విచ్చేయుము.

5. ఇంద్రా! సోమాభిషవకర్తలు నీ నుంచి ఆశించునట్టి ధనమును నీవు మాకు తప్పక అందించుము. విచిత్రము, స్వర్గప్రాపకధనమును సహితము తీసికొనిరమ్ము.

6. ఇంద్రా ! విశేష దర్శి స్తోత నీ కొరకు శత్రు పరాజయస్తుతి చేసినపుడు సకల వాక్యములు నిన్ను ప్రసన్నుని చేసినపుడు అప్పుడు కొమ్మను ఎక్కునట్లు సకల గుణములు నిన్ను ఆరోహించును.

7. ఇంద్రా ! పూర్వస్తుతులకు సమానములగు స్తుతులను కల్పింపుము. స్తోతల పిలుపు వినుము. నీవు సోమపానమున ముత్తుడనైనపుడే శుభకార్యములు చేయు యజమానికి ఫలము ప్రసాదింతువు.

8. ఇంద్రుని సత్యవాక్కు పల్లపునీరువలె పారును. స్వర్గపతి ఇంద్రుని ఈస్తోత్రము కీర్తించును.

9. వశవంతుడగు ఇంద్రుడు ఒక్కడే మానవ పాలకుడని చెప్పినారు. ఇంద్రా! నిన్ను స్తోత్రములతో వర్ధిల్ల చేయువారితోను, తమ రక్షణలు కోరుకొను సోమాభిషహవ కర్తలతోను రమింపుము.

10. స్తోతా! విద్వాంసుడు, విఖ్యాతుడగు ఇంద్రుని స్తుతింపుము. శత్రువిజేతలు ఇంద్రుని అశ్వములు. అవి ఇంద్రుని నమస్కరించి హవి అర్పించువాని ఇంటికి చేర్చును.

11. ఇంద్రా! నీ బుద్ధి మహాఫలదాయకము నీవు స్నిద్ధుడవు. ఈ యజ్ఞమునవే నీకు సుఖమున్నది కావున వడిగల గుఱ్ఱములతో ఈ జన్నమున కేతెంచుము.

12. ఇంద్రా ! నీవు ఉత్తముడవు. బలవంతుడవు. సాధురక్షకుడవు. మేము నిన్ను స్తుతించు చున్నాము. మాకు ధనములనిమ్ము. స్తోతలకు అవివాశ్యము, వ్యాపకమగు అన్నమును, యశమును ఇమ్ము.

13. ఇంద్రా! సూర్యోదయమైనపుడు నిన్ను నేను ఆహ్వానింతును. మధ్యాహ్నము ఆహ్వానింతును. నీవు ప్రసన్నుడవగుము. నీ అశ్వములు గతివేలములు. వానిపై ఇక్కడికి రమ్ము.

14. ఇంద్రా ! లెమ్ము త్వరగా సాగుము. సోమముగల చోటికి త్వర త్వరగా చేరుము. పాలు కలిపినా అభిషుత సోమమున ఆనందించుము. అనంతరము నాకు తెలిసినంత పూర్వము చేసిన యజ్ఞములను ఫలప్రదము చేయుము.

15. శుక్రా! వృత్రఘ్నా! ఇంద్రా! నీవు దూరదేశమున ఉన్నను, దగ్గరలో ఉన్నను. అంతరిక్షమున ఉన్నాను అన్నిచోట్ల నుంచి ఇచ్చటికి రమ్ము. సోమపానము చేయుము మమ్ము రక్షింపుము.

16. హవిష్మంతులగు మనుష్యులు ఇంద్రుని మాత్రమే తృప్తుని చేయుదురు. అతనికి ఆహుతులు అర్పింతురు. వర్ధిల్ల చేయవలెను. అభిషుత సోమము ఇంద్రుని వర్ధిల్ల చేయవలెను.

17. విప్రులు, రక్షణాభిలాషులు ఇంద్రుని మాత్రమే తృప్తుని చేయుదురు. అతనికి ఆహుతులు అర్పింతురు. వర్ధిల్ల చేయుదురు. భూమి మీది సమస్త ప్రాణులు చెట్టు కొమ్మనువలె ఇంద్రుని పెంపొందింతురు.

18. త్రికద్రుక్, నామక యజ్ఞమున చైతన్య ప్రదాత ఇంద్రుని దేవతలు సమ్మానించినారు. మా స్తుతులు నిత్యము వర్ధిల్లు అట్టి ఇంద్రుని వర్ధిల్ల చేయవలెను.

19. ఇంద్రా! నీ స్తోతలు అనుకూల కర్ములగుదురు అప్పుడప్పుడు ఉక్థులు ఉచ్చరింతురు. నీవు అద్భుతుడవు. పరిశుద్ధడవు. పావకుడవు. అందువలన నే స్తుతించ బడుదువు.

20. విశిష్ఠ జ్ఞానవంతులు. ఎవరి స్తోత్రములు ఉచ్చరింతురు అట్టి రుద్రపుత్ర మరుద్గణములు వారి స్థానములందు ఉన్నారు.

21. ఇంద్రా ! నీవు నాకు నీ మైత్రిని అందించినట్లయిన. ఈ సోమరూప అన్నమును పానము చేసినట్లయిన మనము సకల శత్రువులను అతిక్రమించగలము.

22. స్తుతిస్తోత్ర ఇంద్రా! నీ స్తోతలు ఎన్నడు అత్యంత సుఖవంతులగుదురు? నీవు ఎప్పుడు మాకు గోవులు, అశ్వములు, నివాసయోగ్య ధనము ఇచ్చెదవు.

23. ఇంద్రా! నీవు వార్ధక్యము నెరుగవు నీ హరినామక అశ్వములు స్తోతవ్యయములు కోరికలు తీర్చునవి. అవి నిన్ను రథమున నా వద్దకు కొనితేవలెను. నీవు మంచి మత్తు పొందుము. మేము నిన్ను యాచించుచున్నాము.

24. ఇంద్రుడు ఎంతో గొప్పవాడు. ఎందరి చేతనో స్తుతించబడువాడు. అట్టి ఇంద్రుని తృప్తికరములగు ఆహుతులతో మేము యాచించుచున్నాము. అతడు సుఖదాయకి కుశలమీద కూర్చుండవలెను. తరువాత సోమ, పురో శవ్వివిధ హవ్యమును స్వీకరించవలెను.

25. ఇంద్రా! నిన్ను అనేకులు స్తుతింతురు ఋషులు స్తుతింతురు. నీవు మాకు రక్షణ నొసంగుము. మమ్ము వర్ధిల్ల చేయుము. మాకు వృద్ధినొందు అన్నమును దానము చేయుము.

26. వజ్రధర ఇంద్రా! ఆ విధముగా స్తోతల రక్షకుడవు. సత్యభూతా! నేను నిన్ను స్తుతింతును. నీకు సంతసము కలిగించు పనులను చేసెదను.

27. ఇంద్రా! నీరెండు అశ్వములు ప్రసిద్ధములు. విశాల ధనవంతములు. వాటిని రథమునకు కట్టుము. సోమపానమునకు ఈ యజ్ఞమునకు విచ్చేయుము.

28. నీ మరుద్గణములున్నారే ఆరుద్రత్రులు ఆశ్రయ యోగ్యమగు ఈ యజ్ఞమునకు రావలెను. మరుద్యుక్త ప్రజలు కూడ ఈ హవ్యయమును చేరవలెను.

29. ఇంద్రుని యొక్క ఈ మరుత్తులు మున్నగు ప్రజలు వారు నిలిచినా స్థానములను ఆశ్రయింతురు సేవింతురు మాకు ధనము లభించునట్లుగా వారు ఉత్తరవేదిక వసింతురు.

30. ఇది ప్రాచీన యజ్ఞగృహము. ఇచట యజ్ఞము ఆరంభమైనది. ఇంద్రుడు దానిని చూచినాడు ఇది క్రమబద్ధ యజ్ఞమని గ్రహించినాడు. మారపు చూపును ప్రసాదించినాడు.

31. ఇంద్రా! నీ రథము మనోరథపూరకము నీ ఉభయ అశ్వములు కోరికలు తీర్చునవి. నీవు అభీపూవర్షివి. నిన్ను ఆహ్వానించుట ఈప్సిత ఫలప్రదాయకమగును.

32. అభిషవశిల అభీష్టవర్షి మత్త, మనోరథదాయని. ఈ అభిషుత సోమము కూడ కోరికలు తీర్చునది. నీవు అందుకున్న యజ్ఞము సహితము వరప్రదాయని నిన్ను ఆహ్వానించుట ఈప్సిత ఫలప్రదాయకము అగును.

33. వజ్రధరా! నీవు అభీష్టవర్షకుడవు. నేను హవి సేవన కర్తను నిన్ను అనేకస్తుతులతో ఆహ్వానింతును. నిన్ను గురించి నేను చేసిన స్తుతులను స్వీకరింతువు. అందువలన నిన్ను ఆహ్వానించుటయే అభీష్టదాయకమగును.

## పదునాలుగవ సూక్తము

ఋషి - కణ్వగోత్రజులు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - గాయత్రి

1. ఇంద్రా ! నీవు మాత్రమే ధనాధిపతివి. నేను సహితము నీవలె ఐశ్వర్యవంతుడనైనచో నిన్ను స్తుతించువాడు సహితము గోయుక్తుడు కావలెను.

2. శక్తిమంతుడవగు ఇంద్రా! నీ కృపవలన నేను గోపతిని కావలెను.అట్లయినచో ఆస్తోతకు దానము చేయవలెను కొందును. అతనికి కోరిన ధనము ఇచ్చెదను.

3. ఇంద్రా! సత్యప్రియము, వర్ధకమగు నీయొక్క స్తుతిరూపధేనువు సోమాభిషక కర్తకు గోవులను, అశ్వములను ప్రదానము చేయును.

4. ఇంద్రా ! నీవు స్తుతుడవగుదువు. స్తోతకు ధనము దానము చేయ తలతువు. అప్పుడు నీ ధనమును నివారించగల దేవతగాని, మానవుడు కాని లేడు.

5. ఇంద్రుడు ద్యులోకమందలి మేఘమును మేల్కొల్పినాడు. భూమండలమునకు వృష్టిదానము చేసినాడు స్థిరపరచినాడు. అందుకే యజ్ఞము ఇంద్రుని వర్ధిల్ల చేసినది.

6. ఇంద్రా! నీవు ప్రవర్ధమానవుడవు. శత్రువుల సమస్త ధనముల విజేతవు. మేము నీరక్షణ పొందగలము.

7. సోమము వలన కలిగిన మత్తుతో ఇంద్రుడు దీప్తిమంతమగు అంతరిక్షమును వృద్ధిచెందినాడు. ఏలననగా అతడు బలముగు మేఘమును భిన్నముచేసినాడు.

8. ఇంద్రుడు గుహలో దాచిన గోవులను విడిపించినాడు. వానిని అంగిరులకు ప్రదానము చేసినాడు. గోవులను దొంగిలించిన పణుల నేత బలాసురుని తలవంచినాడు.

9. ఇంద్రుడు ద్యులోకమునందలి నక్షత్రములకు బలము కల్పించినాడు. వాటిని దృఢముచేసినాడు. ఇప్పుడు ఆ నక్షత్రములను వాటిస్థానమునునుండి పడవేయగలవాడు లేడు.

10. ఇంద్రా ! నీ స్తుతులు సముద్రతరంగసమాన వేగము కలవగును. నీమత్తు విశేషరూపమగు దీప్తిపొందును.

11. ఇంద్రా ! నీవు స్తోత్రముల వలన వర్ధిల్లుదువు ఉక్థల వలన కూడ వర్ధిల్లుదువు. నీవు స్తోతలకు శుభంకరుడవు.

12. హర్యశ్వద్వయము కేశవంతము. అవి శోభన దానవంతుడగు ఇంద్రుని సోమపానమునకు గాను యజ్ఞమునకు తీసికొని వచ్చును.

13. ఇంద్రా! నీవు సకల అసురశత్రువులను గెలిచినావు. అప్పుడు నీటిమరుగుతో నముచి, తల నరికినావు.

(పాప్మావైనముచిః అని శాస్త్రము పాపమే నముచి యని అశ్వినులు, సరస్వతి నముచి పగలుగాని, రాత్రిగాని, దండమునగాని, ధనుస్సునగాని, మట్టితోగాని, ముష్టితోగాని, తడిదానితోగాని, ఎండినదానితోగాని చంపబడుకుండునట్లు వరము ఇచ్చినాడు. అందువలన ఇంద్రుడు నీటినురగతో వధించినాడు. ఇంద్రుడు నీటి నురుగుతో సహితము వధించగల శక్తివంతుడు)

14. నీవు మాయతో సర్వత్ర వ్యాపించుగలవాడవు. నీవు ద్యులోకమునకు ఎక్కదలచిన దస్యశత్రువుల ముఖములనునేలకు వాల్చినావు.

15. ఇంద్రా! నీవు సోమపానము చేయువారిలో ఉత్కృష్టుడవు సోమాభిషవహీన సముదాయమును పరస్పరము విరోధులను చేసి నష్టపరచినావు.

## పదిహేనవ సూక్తము

ఋషి - కాణ్వహరింభిలి, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - గాయత్రి

1. ఇంద్రుడు మానవుల సామ్రాట్టు. స్తోత్రవ్యుడు నేత, శత్రుపరాభకర్త. అందరిని మించిన దాత. అట్టి ఇంద్రుని స్తుతించండి.

2. అలలు సంద్రమున శోభిల్లును. అట్లే శ్రావ్యములగు ఉక్థలు, హవిష్మంతమగు అన్నము ఇంద్రునిలో శోభిల్లును.

3. నేను శోభిల్లు స్తుతులతో ధనప్రాప్తి కొరకు. అట్టి ఇంద్రుని స్తుతింతును. ఇంద్రుడు ప్రశంసనీయ దేవతల శోభను

గ్రహించును. అతడు సంగ్రామమున మహాకార్యములు చేయును. అతడు బలశాలి.

4. ఇంద్రుని శౌర్యము గొప్పది. గంభీరము. విస్తీర్ణము శత్రుతారకము. శూరుల యుద్ధమున ప్రసన్నతాయుక్తమగును.

5. ఇంద్రుని వలన స్తోతలకు ధనలాభము కలుగును. అప్పుడు తమ పక్షము వహించవలెనని వారు ఇంద్రుని స్తుతింతురు. ఇంద్రుని వారు గెలుచువారగుదురు.

6. బలకరమగు స్తోత్రములతో ఇంద్రుని ఈశ్వరుని చేయబడును. కర్మలతో మానవులు ఇంద్రుని ఈశ్వరుని చేయుదురు. ఇంద్రుడే ధనములకు కర్త అగును.

7. ఇంద్రుడు అందరికన్న ఎక్కువగా ఋషులచే ఆహ్వానించ బడువాడు. అతడు మహాకార్యములు చేసి మహాఘనుడు అయినాడు.

8. ఇంద్రుడు స్తోత్రయోగ్యుడు. ఆహ్వానయోగ్యుడు. అతడు సాధువులకు సాత్వికుడు. శత్రువులకు భయంకరుడు అతడు అనేక కార్యములు చేసినవాడు. సహాయము లేకున్నను వంటరిగా శత్రువును గెలువగలవాడు.

9. ద్రష్టలగు మానవులు ఇంద్రుని యజుర్వేద మంత్రములతో వర్ధిల్ల చేయుదురు. సమావేద మంత్రములతో వర్ధిల్ల చేయుదురు. గాయత్రిమున్నగు ఛందేబుద్ధ ఋగ్వేద మంత్రములతో వర్ధిల్ల చేయుదురు.

10. ఇంద్రుడు ప్రశంసనీయ ధనశాలి యద్ధమున జ్యోతివలె వెలుగొందువాడు. ఆయుధము పత్తి శత్రువును మట్టి కరిపించువాడు.

11. ఇంద్రుడు పూరయత బహుజన ఆహ్వాత. అతడు మమ్ము శత్రు సముద్రము నుండి నావమీద పదిలముగా దాటించవలెను.

12. ఇంద్రా ! నీవు బలము ద్వారా మాకు ధనము ప్రదానము చేయము దారిచూపుము. సుఖముల నందించుము.

## పదిహేడవ సూక్తము

ఋషి - కాణ్వహరింభిరి, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - గాయత్రి చివరి రెండు బృహతి

1. ఇంద్రా! రారమ్ము. నీకొరకు సోమము అభిషవమై ఉన్నది. ఈ కుశసనమున కూర్చుండుము. సోమమును సేవించుము.

2. ఇంద్రా! నీ హర్యశ్వములు మంత్రములచే జోడించే బడునవి. కేశవంతములు అవి నిన్ను యజ్ఞమునకు తీసికోని రావలెను. నీవు ఈ యజ్ఞమునకు రమ్ము మా స్తోత్రములు వినుము.

3. ఇంద్రా! మేము బ్రహ్మణులము. నిన్ను యోగ్యములగు స్తోత్రముల ద్వారా పిలుచువారము. మేము సోమయుక్త ఇంద్రుని పిలుచు చున్నాము.

4. ఇంద్రా! మేము అభిషుత సోమవంతులము. మా ముందుకు రమ్ము. మాస్తుతులను వినుము. శోభన శిరస్త్రాణము గల ఇంద్రా ! సోమపానము చేయుము.

5. ఇంద్రా ! నీ కుడి, ఎడమల కలుపులను నేను సోమముతో నింపుదుము. అది నీ గాత్రములందు వ్యాపించవలెను. మధుర సోమమును నాలుకతో చప్పరించుము.

6. ఇంద్రా! నీవు మంచిదాతవు. ఈ మధురసోమము నీకు రుచికరము కావలెను. ఇది నీ చిత్తమునకు సుఖప్రదము కావలెను.

7. ఇంద్రా ! నీవు విశేష ద్రష్టవు. ఈ సోమము యువత వలె ముసుగువేసికొని నీ వద్దకు వచ్చును.

8. ఇంద్రుడు విస్తృతస్కందములవాడు. స్థూల ఉదరుడు. సుందరభుజములవాడు. అతనికి అన్నరూప సోమపు మత్తు కలిగినపుడు వృత్రాది శత్రువులను నాశము చేయును.

9. ఇంద్రా! నీ బలము మూలమున ఈ జగములకు స్వామిని అయినావు. నీవు మావద్దకు విచ్చేయుము. వృత్రఘ్న ఇంద్రా! నీవు శత్రువులను వధించుము.

10. నీ కొరకు సోమమును అభిషవించు యజమానికి ధనము నిచ్చునట్టి శూలము సుదీర్ఘము కావలెను.

11. ఇంద్రా! నీ కొరకు సోమము వేచి ఉన్నది.... వేదిక మీద కుశాసనము పరచి ఉన్నది. నీవు సోమము కొరకు రమ్ము. దానిని చేరుము. త్రావుము.

12. ఇంద్రా! నీవు శక్తిశాలివి. గోపతివి. ప్రసిద్ధ పూజావంతుడవు నీ సుఖమునకే సోమము అభిషుతమైనది ఉత్కృష్ట స్తుతులచే నీవు ఆహ్వానించ బడుదువు.

13. ఇంద్రా! నీవు శృంగవృషపుత్రుడవు 'కుండపాయ' యజ్ఞము నీ ఉత్తమ రక్షకము. ఋషులు దానిమీద మనసులు

లగ్నము చేసినారు. ("శృంగవృషోనామ కశ్చిదృహిః" అన్నాడు శాయణుడు శృంగవృషుడు ఋషిపేరు అన్నాడు. శృంగములనగా కిరణములు. కిరణములతో వర్షించువాడు ఆదిత్యుడనియు శాయణుడే. "కుండైః పీయతే అస్మాక సోమితి కుండ పామ్యాః" కుండముతో కుండలతో కూడ కావచ్చునేమో ! సోమము త్రావునది కుండపామ యజ్ఞము )

14. ఇంద్రా !నీవు గృహపతివి గృహమునకు ఆధారమగు స్తంభము గట్టిది కావలెను. మేము సోమ సంపాదకులము. మాశుజములకు రక్షణ సామర్ధ్యముగల బలము కలుగవలెను. తరిగిపోవు సోమము కలవాడును, శత్రుపుర ధ్వంసకుడగు ఇంద్రుడు ఋషులకు మిత్రుడు కావలెను.

15.ఇంద్రుడు పాము పడగ వంటి ఉన్నత పిరమువాడు.యాగయోగ్యడు.గోవులు గలవాడు.అతడు వంటరిగనే శత్రువులను పరాజితులను చేయును.వేగవంతములగు ఆశ్వములు సోమపానమునకుగాను ఇంద్రుని మీ వద్దకు చేర్చును.

## పద్దెనిమిదవ సూక్తము

ఋషి -కాణ్వ హరింబిరి, దేవత -వేరు వేరు,ఛందస్సు ఉష్టిక్

1.ఇప్పుడు మానవులు ఆదిత్యులను అపూర్వసుఖములు యాచింతురు.

2.ఈ ఆదిత్యుల మార్గములు ఇతరులు ఏర్పరచినవాకావు.అవి అహింసితములు.కావున వారు పాలించు మార్గములు శుభప్రదములు.

3.మేము అనేక సుఖములను యాచించు చున్నాము.వాటిని సవిత,మిత్ర,వరుణ,ఆర్యమ మాకు కలిగించ వలెను.

4.బాధించని పోషకురాలు, అనేకులకు ప్రీతి పాత్రురాలగు అతిథి సుఖములు కలిగించు దేవతల సహితమై సుందరరూపమున విచ్చేయవలెను.

5.అదితిపుత్రులు మిత్రాదులు విద్వేషులను వేరు చేయుట ఎరుగుదురు. బహుకర్మకర్తలు,రక్షకులగువారు మమ్ము పాపములనుండి వేరు చేయుట ఎరుంగుదురు.

6.అదితి పగలు మా పశువులను కాపాడవలెను. మార్పుఎరుగని అదితి రాత్రిళ్లు సహితము మా పశువులను రక్షించవలెను. నిత్యము వర్ధిల్లు రక్షణలతో మమ్ము పాపముల నుండి కాపాడవలెను.

7. స్తుతియోగ్య అదితి మమ్ము రక్షంచుటకు పగలు మా వద్దకు రావలెను. శాంతిమయ సుఖమును ప్రసాదించవలెను. బాధించువారిని దూరము చేయవలెను.

8. అశ్వినుల ప్రఖ్యాత దేవవైద్యులు వారు మాకు సుఖములు కలిగించవలెను. మా పాపములు తొలగించవలెను శత్రువులను దూరము చేయవలెను.

9. గర్హ్యపత్యాది రూపములతో అగ్ని మా వ్యాధులను శాంతింప చేయవలెను. సూర్యుడు సుఖదాతయై వెలుగవలెను. పాపతాప శూన్యమై వాయువు వీచవలెను. శత్రువులను దూరము చేయవలెను.

10. ఆదిత్య గణములారా! మా వ్యాధులను దూరము చేయండి. శత్రువులను దూరము చేయండి దుర్గతిని దూరము చేయండి. పాపములను దూరము చేయండి.

11. అదిత్యులారా! మా నుండి హింసకులను వేరు చేయండి దుర్బుద్ధిని వేరు చేయండి. శత్రువులను వేరు చేయండి.

12. శుభప్రదాతలగు ఆదిత్యులారా! మీరు ప్రదానము చేసిన సంభమువలన పాపియగు స్తోత సహితము పాపమునుండి విముక్తుడు అగును. అట్టి సుఖమును మాకు ప్రసాదించండి.

13. మమ్ము రాక్షసభావమును బాధించదలచినవాడు తన కార్యములచే తానే బాధితుడు కావలెను. అతడు దూరము కావలెను.

14. దుష్కీర్తికలిగి మమ్ము బాధించ దలచిన కపతిని పాపములు దాహించవలెను.

15. ఆదిత్యులారా ! మీరు నివాసదాతలు. పరిపక్వజ్ఞానవంతులు. అందువలన మానవులందలి కపటిని కపటములేని వారిని కనిపెట్టగలరు.

16. మేము పర్వత, జలసంబంధ సుఖములను కోరుచున్నాము. ద్యావా పృధ్వులు పాపములను దూరదేశములకు పంపవలెను.

17. నివాసదాతలగు ఆదిత్యులారా! సుందరము, సుఖకరమగు మీ నావలో మమ్ము సకల పాపములనుండి దాటించవలెను.

18. ఆదిత్యులారా ! మీరు శోభన తేజోవంతులు మాకు, మా పుత్ర, పౌత్రులకు దీర్ఘాయువు ప్రసాదించండి.

19. ఆదిత్యులారా ! మా యజ్ఞము మీవలన చేరును. మీరు మమ్ము సుఖవంతులను చేయండి. మాకు మీ బాంధవ్యము లభించవలెను. మేము సదామీవారమై ఉందుము.

20. మరుత్తుల పాలకుడు ఇంద్రుని, అశ్వినులను, మిత్రావరుణులను బలిష్ఠము, శీతాతప నివారకమగు గృహమును వేడుచున్నాము.

21. మిత్ర, ఆర్యమ, వరుణ, మరుద్గమలారా! మీరు హింసాశూన్యులు. పుత్రాదియుక్తులు. స్తోత్రవ్యులు. శీతాతప వర్షనివారకమగు గృహమును ప్రసాదించండి.

22.ఆదిత్యులారా! మృత్యువు దరి చేరిన మానవునకు జీవించుటకుగాను ఆయువును పెంచండి.

## పందొమ్మిదవ సూక్తము

ఋషి - కాణ్వసౌభరి, దేవత - అగ్ని, చందస్సు -వివిధములు

1. స్తోతలారా! అగ్ని ప్రఖ్యాతుడు. అతనిని స్తుతించండి. అగ్ని స్వర్గమునకు హవిచేర్చువాడు. ఋత్విక్కులు అగ్ని వద్దకు వెళ్ళుదురు. దేవతలకు పురోడాశాదులు సమర్పింతురు.

2. అగ్ని అనంతదాత. విచిత్ర తేజస్వి. సోమసాధ్యుడు. ఈ యజ్ఞపు నియంత పురాతనుడు విప్రసౌభరీ ! యజ్ఞము కొరకు అగ్నిని స్తుతించుము.

3. అగ్నీ! నీవు యాజ్ఞకులందు శ్రేష్ఠుడవు. దేవతలందు అత్యంత దానగుణయుక్తుడవు. హోతవు. అమరుడవు. ఈ యజ్ఞమునకు కర్తవు. మేము నిన్ను ఆరాధింతుము.

4. అగ్ని అన్నప్రదాత సుధనుడు ప్రకాశకుడు ప్రశస్త తేజోవంతుడు. అట్టి అగ్నిని స్తుతింతును. అగ్నిని స్తుతింతును. అగ్ని మేము చేయు దేవయజ్ఞమున, మిత్ర వరుణల సుఖము కొరకును, జలదేవత సుఖము కొరకును యజ్ఞము చేయవలెను.

5. సమిధలతో అగ్నిని సేవించువారున్నారు. అహుతులతో అగ్నికి పరిచర్యలు చేయువారున్నారు. వేదాధ్యయనమున ఆరాధించు వారున్నారు. జ్యోతిష్టోమాది యజ్ఞయుక్తులై నమస్కరించి యాచించువారున్నారు.

6. అట్టివారల అశ్వములు వృద్ధిచెందును. అవివేగవంతములగును. వారి కీర్తి అందరిని మించినదగును. దేవకృత, మానవవిహిత పాపములు వారిని తాకవు.

7. అగ్నీ ! నీవు బలపుత్రుడవు. హవిష్పతివి. నీయొక్క గార్హ్వపత్యాదుల ద్వారా మేము చక్కని

అగ్నివంతులమగుదుము. మంచి వీరుల యుక్తడవై నీవు మమ్ము గుర్తుంచుకొనుము.

8. అగ్ని ఉత్తమ అతిథిసముడు, స్తోతల హితము కోరువాడు. రథము వంటి ఫలప్రదాత. అగ్నీ! నీలో అనేక రక్షణలు ఉన్నవి. నీవు ధనములకు రాజువు.

9. సుభగ అగ్నీ! యజ్ఞవంతుడు సత్యఫలవంతుడు కావలెను. శ్లాఘనీయుడు కావలెను. స్తోత్రములతో ఆరాధించువాడు కావలెను.

10. అగ్నీ! ఏ యజమాని యజ్ఞముకొరకు నీవు పైకితెచ్చెదవో అతడు పుత్రాదియుక్తుడగును. సమస్త కార్యములను సాధించును. అశ్వములు సాధించిన విజయమును అనుభవించును అతనిని మేధావులు, శూరులు, పరిచారకులు సేవింతురు.

11. విశ్వములు వరించువాడును అందగాడయన అగ్ని స్తోత్రములు, అన్నము స్వీకరించిన ఇంటి యజమాని హవ్యములు దేవతలు అందుకుందురు.

12. అగ్నీ! నీవు బలపుత్రుడవు. నివాసప్రదుడవు. విప్రుడగు స్తోతహవిర్దానమునకు తొందరపడును. అట్టి అభిజ్ఞుని వచనము దేవతలకిందను, మనుష్యుల మీదను ఉండవలెను.

13. హవ్యదానము, నమస్కారములతో అగ్నిని సేవించు యజమాని సమృద్ధుడగును.

14. గార్హ్వపత్యీది అఖండ అగ్నికి సమిధలర్పించి సేవించువాడు తన పనులవలన సౌభాగ్యవంతుడగును. ద్యుతిమంతుడగును కీర్తిలో నీటివలె మానవులందరిని దాటిపోవును.

15. అగ్నీ! ఇంటిలోని రక్కసులను పరాభవించుధనము పాపవృద్ధినిమ్ మానవక్రోధమును అణచివేయుధనము అట్టి ధనమును మాకు అందించుము.

16. వరుణుడు, మిత్రుడు, అర్యమ, అగ్నితేజముననే జ్యోతిని ప్రదానము చేయుదురు, భగ, అశ్వినులు అగ్ని తేజముననే ప్రకాశము అందింతురు మేము బలముతో అందరిని మించిన స్తోత్రజ్ఞులమై ఇంద్రుని రక్షణలు పొంది అగ్ని యొక్క ఆతేజస్సునే ఆరాధింతుము.

17. అగ్నీ! నీవు విప్రుడవు. ద్యుతిమంతుడవు. మానవులకు స్వరూపుడవు. సుకర్ముడవు. నిన్ను అర్థించు ఋత్విక్కు ఉత్తమ ధ్యానవంతుడగును.

18. సుధన అగ్నీ! అట్టి యజమానియె నీకు వేడి ఏర్పరచును. ఆహుతులు అర్పించును, ద్యుతిమంతదినమున సోమాభిషవమునకు ఉద్యమించును. అతడు తన బలములతో కోరినధనము సాధించును. అతడే నిన్ను అభిలషించును ఆరాధించును.

19. ఆహుతాగ్ని మాకు శుభములు కలిగించ వలెను. సుధన అగ్నీ! నీవు ఇచ్చుదానము మాకు శుభావహము కావలెను. శుభప్రదము కావలెను. స్తుతలు కళ్యాణమయములు కావలెను.

20. సంగ్రామమున నీ మనసు భద్రము కావలెను. ఆ మనసుతోనే శత్రువులను పరాజితులను చేయుము. సమర్థలైన శత్రువుల స్థిరము, ప్రభూతమగు బలమును చిత్తుచేయుము. మేము అభిగమన సాధన స్తోత్రములతో నిన్ను భజింతుము.

21. ప్రజాపతి స్థాపించిన అగ్నిని నేను పూజింతును. ఆ అగ్ని అందరినిమించి యజ్ఞము చేయువాడు. హవ్యవాహకుడు ఈశ్వరుడు. దేవతలచే దూతను చేసి పంపబడినవాడు దేవతలు అగ్నిని తమ దూతను చేసినారు.

22. అగ్ని ప్రజ్వలిజ్వాలలవాడు. నిత్య తరుణుడు. శోభిల్లువాడు. అట్టి అగ్నిని గురించి హవిరూప అన్నపు పాటపాడండి. అగ్ని ప్రియ సత్యవచనములచే స్తుతుడై, ఘృతములతో ఆహూతుడై, స్తోతకు మంచి బలమును ప్రసాదించును.

23. అగ్ని ఘృతములతో ఆహూతడై పైనను, దిగువను ధ్వనులు చేయును. అప్పుడు అగ్ని సూర్యసమాన తేజస్కుడై ప్రకాశించును.

24. అగ్నిని మనుప్రజాపతి స్థాపించినాడు. ప్రకాశకుడగు అగ్ని తన సుగంధి ముఖముతో దేవతలకు హవ్యములంపును. అగ్ని సుయజ్ఞవంతుడు. దేవతల ఆహ్వాత దీప్తిమంతుడు అమరుడు. అగ్ని వరణేయ ధనమును సేవించును.

25. అగ్నీ ! నీవు బలపుత్రుడవు ఘృతహుతుడవు. అనుకూల దీప్త వంతుడవు. నేను మర్త్యుడను. నిన్ను ఉపాసింతును. నీవలె మరణశూన్యుడను అగుదును.

26. పసిడి అగ్నీ! అపవాదములు విని నిన్ను తిరస్కరించను. పాపము కొరకు నిన్ను తిరస్కరించను నా స్తోతలు అనరాని మాటలని నిన్ను అవమానించరు. ఆరాధనీయ అగ్నీ! నా దుర్బద్ధి నాకు శత్రువుకారాదు. అది పాపము పెంచి నన్ను బాధించరాదు.

27. కొడుకు తండ్రికి అందించినట్లు పోషణకర్త అగ్ని యజ్ఞగృహమున మా హవ్యములు దేవతలకు అందించును.

28. ధనవంత అగ్నీ! నేను మానవుడను. నీరక్షణ పొందినవాడను. సదా నీ ప్రసన్నతను సేవింతును.

29. అగ్నీ! నేను నీకు పరిచర్యలు చేయుదును. భజింతును. హవ్యదానముచేతును. ప్రశంసింతును. భజింతును. నీవు ధనశాలివి. నీ బుద్ధివాచాలము జనులు నిన్ను నారక్షకుడు అనుచున్నారు. నాకు ప్రదానము చేయుటకు ప్రసన్నుడవగుము.

30. అగ్నీ! నీవు స్నేహము చేసిన యజమాని - నీ యొక్క బలపూర్ణము, అన్నపూర్ణమగు రక్షణలతో ప్రవృద్ధుడగును.

31. అగ్నీ ! నీవు సోమమున తడిసినవాడవు. ద్రవశీలివి. ధ్వనించువాడవు వసంతాది ఋతువులతో పుట్టినవాడవు. దీప్తిశాలివి. నీకొరకు సోమము సిద్ధమైనది. నీవు విశాల ఉషస్సుల మిత్రుడవు. రాత్రులందు సకల వస్తువులను కనిపింపచేతువు.

32. అగ్ని బహుతేజస్వి అందగాడు సామ్రాట్టు 'త్రసదస్సు' ద్వారా స్తుతించ బడినవాడు. మేము సోభరులము రక్షణ కొరకు అగ్నిని ఆశ్రయించినాము.

33. అగ్నీ! ఇతర అగ్నులు చెట్టుకొమ్మల వలె నిన్ను అంటుకొని ఉండును. మానవులందు నేను నీబలమును స్తుతులద్వారా పెంచువాడను. నేను సైతము ఇతరస్తోతలతో సమానముగా కీర్తిని పొందుదును.

34. ద్రోపరహితి, ఉత్తమ దాతలగు ఆదిత్యులారా! హవివంతులందరిలో - మీరు దరి చేర్చిన వాడే ఫలవంతుడగును.

35. ఆదిత్యులారా! మీరు విరాజమానులు. శత్రుపరాభవ కర్తలు. మీరు మానవ హూతుక శత్రువులను పరాజితులను చేయండి వరుణ, మిత్ర ఆర్యమ వీరే మీ యజ్ఞములకు సారథులగుదురు.

36. పురుకుత్స్యపుత్రుడు త్రసదస్యుడు మాకు ఏబదిమంది వధువులను ఇచ్చినాడు. అతడు గొప్పదాత స్వామీ స్తోతల పోషకుడు.

37. అందమగు 'సువాస్తు' నదీ తీరమున ఉన్నవాడును నల్లని ఎద్దుల నాయకుడును. పూజ్యధనవంతుడును దానయోగ్యములగు రెండు వందల పది గోవుల స్వామియు అగు త్రసదస్యుడు ధనము వస్త్రములు మున్నగువానిని ఇచ్చినాడు.

## ఇరువదవ సూక్తము

ఋషి - కాణ్వసొభరి, దేవత - మరుత్తులు, ఛందస్సు - మొదటి దికికిభ - మిగిలినవి బృహతి

1. ప్రస్థానముగల మరుద్గణములారా! విచ్చేయండి మమ్ము బాధించ వద్దు మీరు సమాన తేజస్కులు. పర్వతములను సహితము వదకించగలరు. మమ్ము విడువకండి వేరుచోటుకు వెళ్లకండి.

2. మరుత్తులారా! మీరు రుద్రపుత్రులు మీనివాసములు ప్రకాశమానములు. మీరు అందరి అభిలషణీయులు. చక్కని ఇరుసుగల రథమున విచ్చేయండి. ఈ సోభరిని గుర్తుంచుకోండి అన్న సహితులై నేడు మా యజ్ఞమునకు రండి.

3. విష్ణువు కర్మవంతుడు మరుత్తులు రుద్రపుత్రులు. అందరికి అవసరమగు జలములను ఇచ్చువారు. మేము ఆ ఉభయుల ఉగ్రబలమును ఎరుగుదుము.

4. మరుత్తులారా! మీరుమంచి ఆయుధములు గలవారు. దీప్తివంతులు మీరు కోపించినపుడు సమస్త ద్వీపములు కూలును. స్థావరములు దుఃఖంచును. ద్యావాపృథ్వులు గడగడలాడును గమనశీల జలము పొంగి పోర్లును.

5. మరుత్తులారా! మీరు యుద్ధమునకు వెడలినపుడు వాలనిమబ్బులు , రాలనిచెట్లు రొపెట్టును భూమి గ్రక్కదలుసు.

6. మరత్తులారా! మీరు విశేషబలవంతులు నాయకులు మీకు దారి ఇచ్చుటకు ద్యులోకము విశాల అంతరిక్షమువీడి పారిపోయినది. మీరు మీదేహములందు వెలుగుల చిమ్ము ఆభరణములు ధరింతురు.

7. మరుత్తులు ప్రదీప్తులు బలవంతులు అకుటులులు నేతలు హవిరూప అన్నమునకుగాను వారు శోభిల్లుదురు.

8. సోభరి మున్నగు ఋషుల సుస్వరముల మధ్య రథమధ్యమందలి మరుత్తుల వీణమ్రోగగును. మరుత్తులు గోమాతృకలు శోభన జన్ములు మహానుభావులు వారు మా అన్నము భోగము, ప్రీతి కొరకు అవతరించ వలెను.

9. సోమమునుచేయు అధ్వర్యులారా! వర్షదాతలగు మరుత్తుల కొరకు హవ్యము తెండి. వారు హవ్యబలమున నీరు అందించువారు ఉత్తమ నడకకలవారలగుదురు.

10. మరుద్గణములు నేతలు సేచనసమర్థులు అశ్వయుక్తులు వారు వర్షరూపముదాల్చి, వర్షకనాభిగల రథముమీద హవ్యము వద్దకు శ్యేనమువలె వేగముగ విచ్చేయ వలెను.

11. మరుత్తులను అలంకరించు ఆభరణములు ఒకేతీరువి. వెలుగుచిమ్ము బంగారు నగలు వారి రొమ్ములందు విరాజిల్లును వారి చేతులందు గల ఆయుధములు తళ తళ మెరయును.

12. మరుత్తులు ఉగ్రవర్ధకులు భయంకర బాహువులు గలవారు. వారికి తమదేహములను రక్షించు కొనవలసిన పని ఉండదు. మరుత్తులారా! మీ రథమునందలి ఆయుధములు, ధనస్సులు సుదృఢములు. అందువలననే రణరంగమున, సేనాముఖమున మీకే విజయము కలుగును.

13. మరుత్తులు జలమువలె సర్వత్ర వ్యాపించినవారు. వారు అనేకులు అయినను ఒకే పేరుగలవారు. అట్లయు వారి పేర్లు పైతృకములు సుదీర్ఘములు అన్నమువలె స్థిరములు భోగయోగ్యములు.

14. మరుత్తులకు ప్రణమిల్లండి వారిని స్తుతించండి ఆర్యస్వామి యొక్క హీన సేవకునివలె మేము గడగడలాడించు మరుత్తులు హీన సేవకులమగుదుము. వారి దానము మహిమాన్వితము.

15. మరుత్తులారా! మీ రక్షణ పొందిన గతమందు కూడా సుధనుడైనాడు. మిమ్ము స్తుతించువాడు మీవాడగుట తథ్యము.

16. మరుత్తులారా! మీరునేతలు కంపకులు మీరు హవ్యము కొరకు హవిష్మంతుడగు యజమాని ఇంటికి వెళ్లుదురు. అట్లు మీరు వెళ్లిన యజమాని మీరు అందించిన ద్యుతిమంతమగు అన్నమును అనుభవించును. శుభములను నలువైపుల వ్యాపింపచేయును.

17. మరుద్గణములు రుద్రపుత్రులు వర్షకర్తలు నిత్యతరుణులు. ఈ స్తోత్రము మరుద్గణము అంతరిక్షము నుండి వచ్చి మమ్ము గురించి యోచించునట్లు చేయవలెను.

18. కొందరు భూరిదాతలు అగు యజమానులు మరుత్తులను పూజింతురు. కొందరు హవి అర్పించి అర్చింతురు. మేము వారిద్దరికి సమానులము కావలెను. మరుత్తులారా! మీరు అత్యంత ధనప్రద చిత్తమున విచ్చేయండి.

19. మరుత్తులు నిత్యతరుణులు మిక్కిలి వర్షదాతలు పాపకులు సోభరి! నీవు వారిని అతి అభినవ వాక్యముతో రైతు తన ఎద్దులను స్తుతించినట్లు స్తుతించుము.

20. సకల యుద్ధములందు జనులు మరుత్తులను ఆహ్వానింతురు. అప్పుడు వారు పరాభవకర్తలగుదురు మరుత్తులు ఆహ్వానించెదరు మల్లుల వంటివారు వర్షకులు యశస్వులు వారిని మధుర వాక్యములతో స్తుతించండి.

21. సమాన తేజస్కులగు మరుత్తులారా! ఒకే జాతివి అగుట వలన గోవులు నలుదిశలందు తమలో తాము కలుసుకొనును. మురిపించును.

22. మరుత్తులారా! మీరు నర్తకులు రొమ్మున ఆభరణములు కలవారు మానవులు మా బంధుత్వము ఆశింతురు. అందువలన మీరు మా పక్షము వహించండి నిత్యము చేయు యజ్ఞము వలన మీ బంధుత్వము నిలిచి ఉండును.

23. మంచి దానవంతులు, గమనశీలురు, మిత్రులగు మరుత్తులారా! మారుత్సంబంధి ఓషదులను తీసికొనిరండి.

24. మరుత్తులారా! మీరు సుఖములు కలిగించువారు. శత్రురహితులు. మీరు సముద్రమును రక్షించువారు. యజమాని శత్రువులను హింసించువారు. దప్పి గొన్న గోతమునకు బావినిచ్చినవారు. అట్టి అన్ని శుభంకర రక్షణలతో మా కొరకు సుఖములు కలిగించండి.

25. చక్కని యజ్ఞవంతులగు మరుత్తులారా! సింధునది. చినావు, సముద్రపు, పర్వతముల మీదా ఓషధులను.

26. గుర్తించి మా దేహచికిత్స కొరకు తీసికొని రండి మరుత్తులారా ! మా రోగములను ఉపశమింప చేయండి విరిగిన అవయవములను జోడించండి అతకండి.

*(ఆంధ్రవచన ఋగ్వేదసంహిత ఎనిమిదవ మండలము ఆరవ అష్టకమున మొదటిఆధ్యాయము మూడవ అనువాకము సమాప్తము.)*

**ఓం నతామినన్తిమాయనో నధీరావ్రతాదేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదసే అద్రుహావేద్యా భిర్న పర్వతానినమే స్థినాణసః**

**రెండవ అధ్యాయము నాలుగవ అనువాకము**

**ఇరువది ఒకటవ సూక్తము**

ఋషి - కాణ్వసోభరి, దేవత - ఇంద్రుడు, చంధస్సు - బృహతి

1. అపూర్వ ఇంద్రా ! నీవు బహురూపధారివి. మేము నీకు గుణవంతుడగు మానవునితో సమానముగా సోమము అందింతుము. పోషింతుము నీ నుండి రక్షణ కోరికతో నిన్ను యుద్ధములకు ఆహ్వానింతుము.

2. ఇంద్రా! నీవు శుత్రువులను పరాజితులను చేయువాడవు తరుణుడవు. ఉగ్రుడవు అగ్ని స్తోమాది యజ్ఞములను రక్షించుటకు మేము నిన్ను అర్థింతుము మేము నీసుఖము మా వద్దకుదెమ్ము నీవు కీర్తనీయుడవు రక్షకుడవు మేము నిన్ను కోరుచున్నాము.

3.అశ్వపతి, గోపతి, భూపతి, సోమపతి ఇంద్రా ! విచ్చేయుము. సోమపానము చేయుము.

4. మేము విపులము, బంధుహీనులము ఇంద్రా! నీవు బంధువంతుడవు. మేము నీతో బంధుత్వము ఏర్పరచు కొందుము నీవు కోరికలు తీర్చువాడవు. నీ దేహమున తేజస్సు ఉన్నది ఆ తేజస్సుతో సోమపానముకు విచ్చేయుము.

5. ఇంద్రా ! ఇది సోమము పాలు మున్నగునవి కలసినది మత్తు కలిగించునది స్వర్గకారకము. మేము పక్షులవలె కూడి నిన్ను స్తుతింతుము.

6. ఇంద్రా ! అప్పుడప్పుడు నీవు చింతించెదవేల? మేము నీముందు ఈ స్తోత్రముతోను మరిన్నిటితోనును నిన్ను స్తుతింతుము. ఇంద్రా! మాకు పుత్ర, పశ్వాదుల కోరిక కలిగినది. నీవు ధానాది దాతవు మా కర్మలు నీ వద్ద ఉన్నవి.

7. ఇంద్రా ! నీవు మమ్ము రక్షింపుడు మేము ఎల్లప్పుడు కొత్త వారలమగుదుము. నీవు సర్వత్రద్వ్యాప్తుడవు అదిమాకు ఇంతకు ముందు తెలియలేదు ఇప్పుడు తెలిసినది.

8. ఇంద్రా! నీవు బలవంతుడవు మేము నీ స్నేహము ఎరుగుదుము భోజ్యము ఎరుగుదుము మేము నిన్ను నీ ఎల్లరకు నివాసప్రదుడవు శిర స్త్రాణము కలవాడవు గోవులు మున్నగు వానితో కూడిన ధనములందు మమ్ము మొనగాళ్లను చేయుము.

9. మిత్రులగు ఋత్విక్కులారా! యజమానులారా ! ఇంద్రుడు పూర్వము సమస్తధనములను మా కొరకే తేచ్చినాడు ఆ ఇంద్రుని మీ రక్షణల కొరకు నేను స్తుతింతుము.

10. ఇంద్రుడు పరితవర్ణ అశ్వవంతుడు సజ్జనుల స్వామి. శత్రుదమనుడు అతనిని తృప్తులైన మానవులు సుతింతురు. ఆ ఇంద్రుడు మాస్తోతల కొరకు నూరు ఆవులను, నూరు గుఱ్ఱములను తెచ్చినాడు.

11. కోరిన ఫలములిచ్చు ఇంద్రా! నీవు మాకు సాయముగా నిలువుము మేము గోయుక్త మానవులతో యుద్ధము చేయుదుము ఎంతటి మొనగాడయినను వాని తలవంచగలము.

12. అనేకులచే పిలువబడు ఇంద్రా! యుద్ధమున మేము హింసకులను గెలుతుము. పాపబుద్ధులను గెలుతుము. మరుత్తుల సాయమున వృత్రుని వధింతుము. మేము మా కార్యములను విస్తరింతుము. ఇంద్రా ! మా సకల కర్మలను రక్షింపుము.

(మానవుడగు తాను ఇంద్రుడు చేసిన పనులన్నియు చేయగలననుచున్నాడు! తాను ఇంద్రుడను కాగలనను చున్నాడు !! అన్నింటిని తాను సాధించగలననుచున్నాడు !!! కాని ఇంద్రుని దేవుని అనుగ్రహము కావలెనను చున్నాడు)

13.ఇంద్రా ! పట్టుకతోనే నీవు శత్రురహితుడవు చిరకాలము నుండి బంధు రహితుడవు. నీవు కోరిన మైత్రిని కేవలము యుద్ధముతోనే సాధింతువు.

14. ఇంద్రా! బంధుత్వము కొరకు అయాజ్ఞికుని ఎందుకు ఎన్నుకొనవు? అతడు సురత్రాగుననియా? ప్రమత్తుడగుననియా? నిన్ను బాధించుననియా? ఇంద్రా ! నీవు స్తోతమ నీవాడనుకున్నప్పుడు అతనికి ధనాదులు అందించినపుడు అప్పుడు స్తోతనిన్ను తండ్రిగా భావించి పిలుచును.

15. ఇంద్రా ! మేము నీ సమాన దేవత బంధుత్వరహితులముకారాదు. సోమాభిషవ శూన్యులము కారాదు. సోమాభిషవమికాగా మేము గుమికూడుదుము.

16. ఇంద్రా! నీవు గోదాతవు మేము మీవారలము మేము ధనశూన్యులము కాకుండవలెను. మేము ఇతరులనుండి ధనము అర్థించకుండవలెను నీవు ప్రభువవు మాకు దృఢమగు ధనమునిమ్ము నీదానమును ఆటంకపరచగలవాడు లేడు.

17. నేను హవ్యదాతను సోభరిని ఇంద్రుడు నాకు ఈ ధనము దానము చేసినాడా? ధనవతి సరస్వతి దానము చేసినదా? చిత్రుడను రాజు చేసినాడా? లేక నీవే చేసినావా?

18. మేఘము వర్షించును భువిని ప్రసన్నము చేయును అట్లే 'చిత్తరరాజు' సరస్వతినదీ తీరపు అన్న రాజులకు వేల, పదివేల ధనములిచ్చి ప్రసన్నులను చేసినాడు.

## ఇరువదిరెండవ సూక్తము

ఋషి - కాణ్వసోభరి, దేవత - ఇంద్రుడు - అశ్వనులు, ఛందస్సు -వివిధములు

1. అవినులారా! మీరు మేలైన ఆహ్వానవంతులు మీ మార్గములు ప్రశంసనీయములు. మీరు సూర్యపుత్రికను వరించుటకు ఏరథము మీద వెళ్లినారో ఆదర్శనీయ రథము మీదనే విచ్చేయవలసినదని అర్థించుచున్నాను.

2.సోభరీ ! శుభంకర స్తుతులతో ఈ రథమును కీర్తించుము. ఈ రథము ప్రాచీన స్తోతలను పోషించినట్టిది. యుద్ధములకు ఆహ్వానించబడునది. అనేకులు కోరునది అందరిని రక్షించునది యుద్ధమందు అగ్రవించబడునది. అనేకులు కోరునది. అందరిని రక్షించునది. యుద్ధమందు అగ్రగామి అందరు భజించతగినది శత్రువులను ద్వేషించునది పాపరహితమైనది.

3. అస్విద్వయమా ! మీరు శత్రువిజేతలు ప్రకాశమనుడు, హవ్యదాతయగు యజమానికి గృహపతులు ఈ కర్మను రక్షించండి అందుకు నమస్కరించి మిమ్ము ఆహ్వానించుచున్నాము.

4. అశ్వినులారా! మీరు సకల కార్య ప్రేరకులు జలపతులు మీ రథపు ఒక చక్రము పైకిపోవును. ఒకటి మీ వెంట సాగును మీ బుద్ధి మంగళమయము ధేనుసమము అది మా వద్దకు చేరవలెను.

5. అశ్వినులారా ! మీ రథమునకు మూడు విధముల సారథిస్థానములున్నవి. దాని పగ్గములు బంగారపువి అవి ప్రఖ్యాతమైనవి. తన వెలుగుతో ద్యావాపృథ్వులను అలంకరించును మీరు ఆరథముననే విచ్చేయండి.

6. అశ్విద్వయమా ! ద్యులోకమున ఉండిన ప్రాచీన జలమును మారు మనువునకు అందించినారు నాగలితో దున్ని. పొలము పండించినారు. జలపాలకులారా! నేడు మేము మిమ్ము మధుర స్తుతులతో స్తుతింతుము.

7. నాసత్యయద్వయమా !మీరు ధనవంతులు దాతలు మీరు యజ్ఞమార్గమున మా వద్దకు విచ్చేయండి మీరు ఈ మార్గముననే 'త్రసదస్యు' ని పుత్రుడు 'త్రుక్షి' కి విశేషధనము ఇచ్చినారు. అతనిని తృప్తిపరచినారు.

8. అవినులారా! మీరు నేతలు విప్ప్రప్రదాతలు. ధనవంతులు మీ కొరకు శిలలతో సోమము అభిషుతైనది సోమపానమునకు విచ్చేయుము. హవ్యదాత గృహమున సేవించుము.

9. వర్షధనముగల అశ్వినులారా! బంగారు కళ్లెములు గలదియు, ఆయుధకోశములు ఉన్నదియు, రమణీయమగు రథమును ఎక్కండి.

10. మీరు 'పృథిక్' రాజును రక్షించినారు 'అధ్రిగ్' రాజును రక్షించినారు 'వభ్రు' రాజును సోమపానము చేసిప్రసన్నుని చేసిప్రసన్నుని చేసినారు ఆరక్షణలతోనే అతి త్వరగా మా వద్దకు రండి మా వ్యాధులకు చికిత్సచేయండి.

11. మేము విప్రులము స్వకర్మలందు త్వరపడువారము అశ్విద్వయమా! మీరు శత్రువధకు త్వరపడువారు ఈ ప్రాతఃకాలమున స్తుతించి మిమ్ము ఆహ్వానించుచున్నాము.

12. అశ్వినులారా! మీరు వర్షశీలురు నానారూపులు దేవతలకు వరణీయులు మా ఆహ్వానములు ఆలకించండి సకల రక్షణలతో మా వద్దకు విచ్చేయండి మీరు హవిని అభిలషించువారు. అత్యంత ధనవంతులు యుద్ధములందు శత్రువును పరాభవించువారు ఏ రక్షణలతో మీరు 'క్రివి' ని రక్షించినారో ఆరక్షణలతో విచ్చేయండి.

13. నేటి ఉదయమున అశ్వినులకు అభివాదనము చేయుదును వారిని స్తుతింతును వారినే ధనాదులు యాచింతుము.

14. అశ్వినులు  జలపాలకులు యుద్ధములందు కీర్తనీయ మార్గము కలవారు వారిని ఉదయము పగలు రాత్రి ఆహ్వానింతుము. అన్న, ధనవంత అశ్వినులారా! మమ్ము  శత్రువులకు వప్పగించకండి.

15. అశ్విద్వయమా! మీరు సేచన శీలురు నేను సుఖయోగ్యుడను, ప్రాతఃకాలమున నా కొరకు రథము మీద సుఖములను తెండు నేను సోభరిని మా తండ్రి వలెనె మిమ్ము ఆహ్వానింతుము.

16. అశ్వినులారా! మీరు  మనోవేగముగలవారు. ధనవర్షకులు శత్రునాశకులు అనేకులకు రక్షకులు త్వరగా చేరువయగు వివిధములగు రక్షణలతో మా వద్దకు విచ్చేయండి.

17. అశ్వినులారా ! మీరు మరింత సోమపానము చేయువారు నాయకులు దర్శనీయులు మా యజ్ఞమార్గమును గొ, అశ్వ, సువర్ణ భరితము చేయుచు విచ్చేయండి.

18. ఎవని దానము సుందరమగునో, ఎవని శౌర్యము సుందరమగునో, ఎవని రూపము సుందరమగునో, ఎవడు వరణీయుడో, ఎవనిని బలవంతులకు బలవంతుడు సహితము ఓడించజాలడో అటువంటి వాని ధనము మాకు లభించవలెను. అశ్వినులారా! మీరు వచ్చినంత మాకు సకల ధనములు లభించును.

## ఇరువది మూడవ సూక్తము

ఋషి - వ్యశ్వపుత్రుడు వివమానుడు, దేవత - అగ్ని, ఛందస్సు - ఉష్ణిక్

1. అగ్ని శుత్రువు మీదికి దూకువాడు అతని పొగలు నలువైపుల వ్యాపించును అతని దీప్తి ఎవడును పట్టజాలడు అతడు పుట్టుకతోనే ప్రజ్ఞావంతుడు అట్టి అగ్నిని స్తుతించండి పూజించండి.

2. విశ్వమన ఋషీ! మాత్సర్యరహితుడగు యజమాని కొరకు రథాదుల కొరకు సర్వార్శకుడుగు అగ్నిని వచనములతో స్తుతించును.

3. అగ్ని శత్రుబాధకుడు కిరణముల అర్చనీయుడు అతడు ఏయజమాని అన్నము సోమరసము స్వీకరించునో అట్టి యజమాని అనంత ధనమును పొందును.

4. అగ్ని తేజము అత్యంత దీప్తిమంతము తాపము కలిగించునది దండ సంపన్నము. యజమానులు ఆశ్రయించునది జరాశూన్యము అభినవము అదిపైకి ఎగయుచున్నది.

5. శోభన యజ్ఞ అగ్నీ! నీవు అనంతదీప్తిగలవాడవు. వెలుగొందువాడవు స్తవనీయుడవు దీప్తిమంతమగు జ్వాలలతో ఎగయుము.

6.అగ్నీ ! నీవు హవ్యవాహకదూతవు కావున దేవతలకు హవ్యములందించుచు చక్కని స్తుతులతో వెళ్ళుము.

7. అగ్ని మానవుల హోమసంపాదకుడు పురాతనుడు ఆ అగ్నిని నేను పిలుచుచున్నాను ఈ సూక్తిరూపవచనమున అగ్నిని ప్రశంసించుచున్నాను. మన మంచి కొరకు అగ్నిని స్తుతించు చున్నాను.

8. అగ్ని బహువిధ ప్రజ్ఞావంతుడు మిత్రుడు తృప్తుడు అగ్ని కృప, యజ్ఞకృప మరియు అతని సామర్థ్యమున యజమాని మనోకామన పూర్తిఅగును.

9. యజ్ఞాభిలాషులారా ! యజ్ఞసాధనము, యజ్ఞవంతమగు అగ్నిని యజ్ఞమందు స్తుతులతో సేవించండి.

10. మా యజ్ఞము అంగిరవంతమగు అగ్ని ముందుకు చేరవలెను అగ్ని మానవులలో హోమ నిష్పారకుడు అత్యంతయశస్వి.

11. అగ్నీ ! నీవు జరారహితుడవు నీ దేదీప్యమాన కిరణములు కోరికలు తీర్చునవి అశ్వము వలె బలము ప్రకటించునవి.

12. అన్నపతీ ! అగ్నీ! మాకు నీవు శుభంకరము, బల ప్రదమగు ధనమునిమ్ము. మా పుత్ర, పౌత్రుల ధనమును యుద్ధకాలమున రక్షించుము.

13. అగ్ని మానవ రక్షకుడు తీక్ష్ణుడు అతడు ప్రసన్నుడై మానవ గృహమున ప్రవేశించినపుడు సకల రాక్షసులు నశింతురు.

14. అగ్నీ! నీవు వీరుడవు మానవ స్తోత్రములను వినుము మాయావి రాక్షసులను నీమంటలలో కాల్చుము.

15. మానవ హవ్యదాత ఋత్విక్కులద్వారా అగ్నికి హవ్యము సమర్పించిన వానిని మానవ శత్రువులు తమ మాయతో సహితము వశపరచుకొన జాలరు.

16. వ్యయయశ్వృషి తాను ధనవర్షకుడు కావలెననుకున్నాడు అగ్ని ధనదుడని ఎరిగినాడు అగ్నిని ప్రసన్నుని చేసినాడు మేము సహితము మహాదనము కొరకు అగ్నిని జ్వలింప చేయుదుము.

17. అగ్నీ! కావ్య పుత్రుడు ఉశన ఋషి అతడు యజ్ఞశీలి జాత ప్రజ్ఞుడు అతడు నిన్ను హోత రూపమున మనువు ఇంట ఆసీనుని చేసినాడు.

18. అగ్నీ ! సమస్తదేవతలు కలిసి నిన్ను దేవదూతగా నియమించినారు నీవు దేవతలందు ముఖ్యుడవు అప్పుడే నీవు యజ్ఞయోగ్యుడవు అయినావు.

19. అగ్ని అమరుడు పవిత్రుడు ధూమ్రమార్గుడు తేజస్వి సమర్థులగు మానవులు అగ్నిని దూతను చేసినారు.

20. చక్కని దీప్తివంతుడు, శుభ్రవర్ణుడు తేజస్వి, మానవులకు స్తవనీయుడు, అజరుడు అగు అగ్నిని మేము పిలుచుచున్నాము.

21. ఒక మనుష్యుడు హవ్యదాత అగును ఋత్విక్కులతో అగ్నికి ఆహుతులు ఇప్పించును అట్టివాడు విశేష పోషకుడు వీరపుత్ర పాత్రీదియుక్తుడు అగును.

22. దేవతాముఖ్యుడు, జాతప్రజ్ఞుడు, ప్రాచీనుడు అగ్ని అతని వద్దకు హవ్యయుక్త స్రుక్కు నమస్కార యుక్తముగ చేరును.

23. వ్యయశ్వ ఋషితో సమాన స్తుతితో స్తోతవ్యుడు, పూజతనముడు, శుభ్రదీప్తుడు అగ్నిని మేము సేవింతుము.

24. 'వ్యశ్వ' పుత్రుడు 'విశ్వమనుడు' 'స్థూలయూపు' డను ఋషితో సమముగా యజమాని గృహమున పుట్టిన అగ్నిని స్తుతులతో పూజింపుము.

25. అగ్ని మానవులకు అతిథి వనస్పతులకు వృక్షములకు - పుత్రుడు ప్రాచీనుడు విర్పయజమానులు - తమ రక్షణ కొరకు - అగ్నిని స్తుతిస్తారు.

26. అగ్నీ! సమస్త ప్రధాన స్తోతల ముందు నీవు కుశాసనము మీద కూర్చుండుము. నీవు స్తుతియోగ్యుడవు మానవుడు అర్పించు హవ్యము స్వీకరించుము.

27. అగ్నీ! అందరు ఆశించు ధనము మాకు ప్రసాదించుము అందరు అభిలషించువారును. చక్కని పౌరుషముగల పుత్రులను ఇమ్ము కీర్తియుక్తమగు ధనమును అందించుము.

28. అగ్నీ! నీవు వరణీయుడవు నివాసప్రదుడవు నిత్యయువకుడవు. నిన్ను చక్కని సోమగానముతో

స్తుతించువానికి సదా ధనమునంపుము.

29. అగ్నీ! నీవు భూరిదాతవు పశుయుక్త అన్నము మహాధనములలో దానయోగ్య ధనమును మాకు ప్రసాదించుము.

30. అగ్నీ! నీవు దేవతలందు యశస్వివి. కావున సత్యవంతులు చక్కని వరాజితులు, పవిత్ర బలయుక్తలగు మిత్రా వరుణులను ఈ యజ్ఞమునకు తోడ్కొనిరమ్ము.

## ఇరువది నాలుగవ సూక్తము

ఋషి - వ్యశ్వపుత్రుడు వైయశ్వుడు, దేవత - ఇంద్రుడు,
ఛందస్సు - ఉష్ణిక్ - అంత్యా అనుష్టుప్

1. మిత్ర ఋత్విక్కులారా ! వజ్రధర ఇంద్రుని కొరకు మేము ఈ స్తోత్రము చేయుదుము. ఇంద్రుడు యుద్ధములందు ఆయుధముల నేత శత్రు సంహారకుడు మీ కొరకు నేను ఇంద్రుని స్తుతింతును.

2. ఇంద్రా ! నీవు నీబలము వలన ప్రఖ్యాతుడవు వృత్రుని వధించినావు. వృత్రహంతవైనావు. నీవు శూరుడవు ధనవంతునకు సహితము అధికధనము ఇచ్చెదవు.

3. ఇంద్రా ! మేము నిన్ను స్తుతింతుము నీవు మాకు నానా విధ అన్నయుక్తధనమును ప్రసాదింతువు. నీనిర్గమనమునందు సహితము శత్రువులు పలాయనము చిత్తగింతురు కాని హవిర్ధనులకు దాతవగుదువు.

4. ఇంద్రా! మా కొరకు నీవు ధనమును వెల్లడించుము శత్రునాశకుడవు, స్తూయమానుడవై, ఉదారహృదయమున ఆధనము మాకు అందించుము.

5. అశ్వవంత ఇంద్రా ! నీవు గోవులను వెతుకునపుడు యోద్ధలగువారు నీ కుడిచేతినిగాని ఎడమ చేతినిగాని కదిలించలేక పోయినారు. ప్రతిరోధకులగు వృత్రాదులు సహితము నీ చేతిని కదిలించలేదు నిన్ను బాధించువాడులేడు.

6. వజ్రధరా! స్తుతివచనములతో నిన్ను నేను పొందగలను. అట్లే గోవులుగలవారు గోష్ఠములను పొందుదురు.

7. ఇంద్రా ! నీవు ఉగ్రుడవు నివాస ప్రదుడవు నాయకుడవు వృత్రాదుల సర్వశ్రేష్ఠ వినాశకుడవు 'విశ్వమన' ఋషి సకల స్తోత్రములందు నీవు నిలువుము.

8. వృత్రఘ్న, శూర, బహుజన ఆహ్వాత ఇంద్రా! నవీనము, స్పృహణీయము, సుఖసాధకమగు ధనము మాకు అందవలెను.

9. అందరిని ఆటలాడించగల ఇంద్రా ! నీ బలమున శత్రువులు నిలువజాలరు. నీవు అనేకుల చేత ఆహ్వానించ బడువాడవు. నీవు హవ్యదాతకు చేయుదానమును ఎంతటి వాడును నష్టపరచ జాలడు.

10. అత్యంత పూజనీయడవు, నేతలలో శ్రేష్ఠుడవగు ఇంద్రా! మహా ధనలాభమునకు నీ కడుపు సోమముతో నింపుము ధనము సాధించుటకుగాను సుదృఢ శత్రుపురములను విధ్వంసము చేయుము.

11. ఇంద్రా! నీవు వజ్రిని ధనికుడవు, నీ కన్నా ముందు అన్యదేవతలకు మా ఆశలు నివేదించినాము. ఇప్పుడు నీవు మాకు ధనము, రక్షణలు ప్రసాదించుము.

12. ఇంద్రా! నీవు ఆడించువాడవు స్తోత్రపాత్రుడవు అన్న ప్రకాశయశము, బలము కొరకు నిన్ను వినా అన్యుని ఎరుగమ.

13. ఇంద్రుని కొరకే నీవు సోమము ఏర్పరచుము ఇంద్రుడు సోమమయ మధువును పానము చేయవలెను అతడు తన మహత్వమున అన్నముతో ధనాదులను ఉంచును.

14. అశ్వాధిపుడు ఇంద్రుని నేను స్తుతించుచున్నాను. అతడు తాను అభివృద్ధిచేసిన ఆయుధములను ఇతరులకు ఇచ్చును, స్తోతయగు 'వ్యశ్వపుత్రు' ని స్తుతులు వినును.

15. ఇంద్రా ! ప్రాచీన కాలమున నిన్ను మించిన ధనికుడు సమర్థుడు ఆశ్రయదాత, స్తుతియుక్తుడు పుట్టలేదు.

16. ఋత్విక్కులారా ! మదకరమగు సోమరూప అన్నమునందలి అత్యంతమదకర అంశమును ఇంద్రుని కొరకు సిద్ధపరచుడు. ఇంద్రుడు వీరుడు సదా వృద్ధిశీలుడు అందుకే జనులు ఇంద్రుని స్తుతింతురు.

17. హర్యశ్వస్వామీ! ఇంద్రా ! పూర్వము నిన్ను గురించి చేసిన స్తుతులను ఎంతటి బలముగాని ధనముగాని అతిక్రమించ జాలవు.

18. మేము అన్నభిలాషులము ఋత్విక్కులు ప్రసుత్తులు కాని యజ్ఞములకే దర్శనీయుడు, అన్నపతి - ఇంద్రుని ఆహ్వానింతుము.

19. మిత్రులగు ఋత్విక్కులారా! రండి త్వరత్వరగా రండి మనము స్తుతియోగ్యనేత ఇంద్రుని స్తుతింతము ఈ ఇంద్రుడు ఒక్కడే సమస్త శత్రుసేనను పరాజితము చేయును.

20. ఋత్విక్కులారా ! ఇంద్రుడు స్తుతులను ఆపడు - అభిలషించును అతని కొరకు నేతి కన్నను, తేనె కన్నను రుచికరమగు పలుకులు పలుకుడు.

21. ఇంద్రుని వీరకృత్యములు హద్దులు ఎరుగవు అతని ధనమును శత్రువులు సాధించలేరు అతని దానము ఆకాశమంతటిది అది సమస్త స్తోతలకు అందునట్టిది.

22. ఆ ఇంద్రుడే అవధ్యుడు బలవంతుడు భక్తి పరాధీనుడు అతనిని వ్యశ్వ్యషితో సమముగా స్తుతించండి ఇంద్రస్వామి హవ్యదాతకు ప్రశస్తమగు గృహము ఇచ్చెను.

23. వ్యశ్వపుత్ర విశ్వమానా ! ఇంద్రుడు నరుల పదవప్రాణము. క్ష్వన అభినవ్యుడు విద్వాంసుడు, సదానమస్కారయోగ్యుడగు ఇంద్రుని స్తుతించండి.

(నవవైపురు షేప్రాణాః నరునకు తొమ్మిది ప్రాణములు కాగా ఇంద్రుడు పదవప్రాణము ఇప్పుడు ప్రాణములు అయిదు అనుచున్నాడు అత్యంతప్రియుడు ఆరవ ప్రాణమన బడుచున్నాడు లేక చున్నది.)

24. ఆదిత్యుడు నిత్యము పక్షుల ఎగురుటను గమనించును. అట్లే వజ్రపాణి ఇంద్రుడు రాక్షసుల కదలికలను గమనించును.

25. అత్యంత దర్శనీయుడవగు ఇంద్రా! కర్మనిష్ఠయజమానికి ఆశ్రయము ప్రసాదించుము 'కుత్స' రాజు విషయమున నీవు రెండు విధముల శత్రువులను వధించినావు మమ్ము కూడ అట్లే రక్షింపుము.

26. అత్యంత దర్శనీయ ఇంద్రా ! నీవు స్తుతియోగ్యుడవు ఇచ్చుటకుగాను మేము నీనుండి ధనము యాచించున్నాము నీవు మా సకల శత్రుసేనలను పరాజితము చేసినావు.

27. ఇంద్రుడు రాక్షసవిహిత పాపములనుండి విముక్తి ప్రసాదించువాడు ఏడు సింధునదుల వద్దున అను యజమానులనుదనుపువాడు అట్టివాడవగు ఇంద్రా! అసుర శత్రువులను వధించుటకు ఆయుధమునెత్తును.

28. 'వరు'రాజా ! నీ తండ్రి 'సుషామ' రాజు కొరకు పూర్వకాలమున యాచకులకు ధనము దానము చేసినావు.

అదే విధముగా ఇప్పుడు 'వ్యశ్యులమగు' మాకు ఇమ్ము శోభన ధనవతి అన్నవతివగు ఉషా ! నీవును ధనమ్ము ఇమ్ము.

29. మానవ హితైషి, సోమవంతుడగు 'వరు' ని దక్షిణ - సోమయుక్త వ్యశ్వపుత్రుల వద్దకు - చేరవలెను వందల వేల 'స్థూల' ధనము మా వద్దకు రావలెను.

30. ఉషోదేవి ! నిన్ను ఎవరయిన 'వర' రాజు ఎక్కడ ఉండును? అని అడిగిన జిజ్ఞాసువుల వద్ద అని చెప్పుము. అది ఎక్కడ? అని అడిగినచో ఆశ్రయస్థలమనియు శత్రువారక 'వరడు' గోమతి తీరమున ఉండుననియు చెప్పుము.

## ఇరువది అయిదవ సూక్తము

ఋషి - వ్యశ్వపుత్రుడు, వైయశ్వుడు, దేవత - మిత్రావరుణులు - విశ్వదేవతలు, ఛందస్సు - ఉష్ణిక్

1. మిత్రావరుణులారా ! మీరు జగద్రక్షకులు దేవతలకు పూజనీయులు హవిఅర్పించుటకు యజమానులు మిమ్ము అరపింతురు వ్యశ్వా ! విశుద్ధులు, బలవంతులగు మిత్రావరుణుల యజ్ఞము చేయండి.

2. మిత్రావరుణులు సుకృతులు ధనవంతులు రథవంతులు సుజన్ములు అదితి పుత్రులు ధృతవ్రలులు.

3. అదితి మహతి సత్యవతి ఆమె సర్వధనశాలురు, తేజస్వులగు మిత్రావరుణులను అసురబలముగల వారిని కన్నది.

4. మహానులు, సామ్రాట్టులు, బలవంతులు, సత్యవంతులగు మిత్రావరుణులు మహాయజ్ఞమును ప్రకాశింప చేయుదురు.

5. మిత్రావరుణులు మహాబలపుత్రులు, వేగపుత్రులుమ్ సుకర్ములు విశేషధనదాతలు. వారు అన్నపు నివాసస్థానమున వసింతురు.

6. మిత్రావరుణులారా ! మీరు ధనదాతలు నేలలోపండు నట్టి దివ్య అన్నప్రదాతలు, జలవతి వర్షము మీ వద్ద ఉండవలెను.

7. మిత్రా వరణులారా! మీరు సత్యవంతులు, సామ్రాట్టులు హవిప్రియులు. మీరు దేవతలను ప్రసన్నము చేయదలచి గోయూధములను వృషభమువలె - వారిని చూచెదరు.

8. సత్యవంతులు, సుకర్ములగు మిత్రావరుణులు సామ్రాజ్యము కొరకు నిలువవలెను. ధృతవ్రతులు, బలశాలురు మిత్రా వరుణులు బలము కొరకు నిలువ వలెను.

9. కంటి కన్నముందు ప్రాణిజాలమును కనగలవారు, సకలజన ప్రేరకులు, చిరంతనులగు మిత్రావరుణులు దుస్సహ తేజోబలమున శోభిల్లుదురు.

10. అదితి మమ్ము రక్షించ వలెను అశ్వినులు మమ్ము రక్షించవలెను. అతివేగవంతులు మరుత్తులు మమ్ము రక్షించవలెను.

11. మరుత్తులారా ! మీరు శుభప్రదాతలు అహింసితులు. మీరు రాత్రింబవళ్లు మానావను రక్షించండి. మీపాలనలో మేము ఏకత్రితులము కాగలము.

12. మేము వ్యధితులముకాక - హింసాశూన్యుడు, సుదాత అగు విష్టువుణు స్తుతింతుము. వంటరిగానే యుద్ధము చేయగల విష్ణువు స్తోతలకు ధనము ప్రదానము చేయవలెను. కర్మప్రారంభకుడగు యజమాని స్తుతిని విష్ణువు వినవలెను.

13. మేము - శ్రేష్ఠము, సర్వరక్షకము, వరణే యధనమును ఆశ్రయింతుము. మిత్రావరుణులు, ఆర్యమ ఆ ధనమును రక్షింతురు.

14. మాధనమును పర్జన్యుడు రక్షించవలెను మరుత్తులు, అశ్వినులు రక్షించవలెను ఇంద్రుడు, విష్ణువు, కోరికలు తీర్చు సమస్తదేవతలు రక్షించవలెను.

15. ఆ దేవతలు పూజ్యులు, నాయకులు వరదవచ్చి చెట్లను పెకిలించినట్లు వారు శత్రువులను కూల్చగలరు.

16. మిత్రుడు లోకపతి ప్రధాన పదార్థములందు అనేకములను అతడు తన తేజస్సుణు చూడగలడు మేము మిత్రా వరుణులతో మిత్రుని వ్రతము ఆచరింతుము.

17. మేము సామ్రాజ్య సంపన్నుడగు వరుణుని గృహమునకు చేరుదుము. ప్రసిద్ధమిత్రుని వ్రతము సహితము చేయుదుము.

18. మిత్రుడు స్వర్గమును, భూలోకపు అంచులను తనకిరణములతో వెలిగించును. తన మహిమతో ఆ రెండు లోకములను నింపును.

19. మిత్రావరుణులు మంచి శౌర్యవంతులు. ఆదిత్యుని ఆకాశమును వెలుగులతో విస్తరింపచేయుదురు తదుపరి అగ్నివలె శుభ్రవర్ణులై, అందరిచేత ఆహ్వానించబడి, అవతరింతురు.

20. స్తోతలారా ! విశాల గృహముగల యజ్ఞమున మిత్రా వరుణులను స్తుతించండి. వరుణుడు పశుయుక్త అన్నములకు ప్రభువు ప్రసన్న కారకమగు అన్నము అందించు సమర్థుడు.

21. నేను మిత్రావరుణుల తేజస్సును, ద్యావాపృథ్వులను స్తుతింతును. వరుణుడు ఎల్లప్పుడు దాతగా మాముందు నిలువ వలెను.

22. ఉక్షగోత్రజుడు 'సుషామ' పుత్రుడు 'వరు' రాజు దానము వలన నాకు సరళగామి, రజతసమము, అశ్వయుక్తమగు రథము లభించినది. సుషామ్ పుత్రుని రథము శుత్రువుల జీవనమును, ఐశ్వర్యమును హరించగలది.

23. వరురాజు మాకు రెండు అశ్వములు ఇచ్చినాడు. అవి హరిత వర్షలు, శత్రు బాధకములు మంచి మనుష్యులను మోయునవి.

24. అభినవస్తుతులతో స్తుతించినపుడు మాకు చక్కని త్రాళ్లు, కొరడా కలిగి, సంతోష ప్రదములై, శీఘ్ర గాములగు రెండు అశ్వములు లభించినవి.

## ఇరువది ఆరవ సూక్తము

ఋషి - అంగిరసులగు ఇద్దరు వ్యశ్వులు లేక వైయశ్వులు లేక వైయశ్వుడు
లేక విశ్వమనువు. దేవత - అశవినులు - వాయువు ఛందస్సు - గాయత్రి - ఉష్ణిక్

1. అశ్వినులారా ! మీరు వర్షకులు ధనదాతలు మీ బలమును బాధించగలవాడు లేడు మిమ్ము స్తోతల మధ్యకు చేర్చుటకు శిఘ్రగమనముగల రథమును పిలుస్తాను.

2. అశ్వినులారా ! మీరు సత్యస్వరూపులు, వరప్రదులు ధనశాలురు సుషామ పుత్రుడు వరురాజుకు ధనము ఇచ్చుటకు ఏతెంచినట్లే సకల రక్షణలతో విచ్చేయుడు. వరు రాజా! వారికి ఒకమాట చెప్పుము.

3. అన్నము, ధనము, బృహదన్నముగల అశ్వినులారా! నేడు ప్రాతఃకాలమే మిమ్ము హవ్యముతో ఆహ్వానింతుము.

4. నేతలగు అశ్వినులారా ! మీ రథము అన్నింటిని మించి బరువు మోయగలది ఆ ప్రసిద్ధరథమున విచ్చేయండి స్తోతకు సంపదలిచ్చుటకు అతని స్తోత్రములను గ్రహించండి.

5. వరప్రదులు, ధనవంతులగు అశ్వినులారా! కుటిల కార్య శత్రువులు మీ ముందే ఉన్నారనుకోండి మీరు రుద్రులు

ద్వేషించు శత్రువును కష్టాల పాలుచేయండి.

6. అశ్వినులారా ! మీరు సర్వదర్శనీయులు కర్మప్రియులు మదకర కాంతివంతులు జల పోషకులు మీరు వడిగల గుఱ్ఱముల మీద రెండు సమస్త యజ్ఞములకు విచ్చేయండి.

7. అశ్వినులారా! మీరు ధనికులు శూరులు అజేయులు లోకపాలక ధనముతో మా యజ్ఞమునకు విచ్చేయండి.

8. ఇంద్ర, అశ్వినులారా ! మీరు ఎంతో సేవింపదగినవారు, నేడు నాయజ్ఞమునకు దేవతల సహితులై విచ్చేయండి.

9. అశ్వినులారా! మీరు 'వృశ్వ' సములు ధనదాన ప్రాప్తి కలుగవలెనని మిమ్ము ఆహ్వానించు చున్నాము. మేధావులారా! దయచేసి మా వద్దకు విచ్చేయండి.

10. ఋషీ ! నీవు అశ్వినులను స్తుతించుము మాటిమాటికి మీ పిలుపు విన్న అశ్వినులు దగ్గరలోనున్న శత్రువులను, పణులను వధించెదరు.

11. నేతలారా ! వైయవును ఆహ్వానము ఆలకించండి. నా ఆహ్వానమును గ్రహించండి వరుణ, మిత్ర, ఆర్యము ఎల్లప్పుడు కలసియే ఉందురు.

12. స్తవనీయులు, వరదులగు అశ్వినులారా ! మీరు స్తోతలకు ఇచ్చునట్టిదియు - వారి కొరకు తెచ్చునదియు నిత్యము నాకు అందించుము.

13. వధువు వస్త్రము చుట్టుకున్నట్లు - యజ్ఞములు చుట్టుకున్నవాని మంచి చెడ్డలు అశ్వినులుచూచుచు అతనికి శుభములు కలిగింతురు.

14. అశ్వినులారా ! మీరు అత్యంత వ్యాపకులు నేతలు పానయోగ్యమగు సోమము సమర్పించువారున్నారు. ఆవిషయము ఎరిగిన నన్ను అనుగ్రహించుటకు మా ఇంటికి విచ్చేయండి.

15. వరదులు, ధనికులగు అశ్వినులారా! నేతలకు పానయోగ్యమగు సోమమునకుగాను మా ఇంటికి విచ్చేయండి శత్రువును వధించు శరసమమగు స్తుతివాక్యములతో యజ్ఞమును చేయండి.

16. అందరినేతలగు అశ్వినులారా! స్తోత్రములందలి స్తుతి విశేషము మిమ్ము చేరవలెను పిలువవలెను - ప్రసన్నులను చేయవలెను.

17. అశ్విద్వయమా ! ద్యులోకపు దిగువనున్న సముద్రమునందు మీరు మత్తులై ఉన్నచో మా ఈ స్తోత్రమును వినండి.

18. 'శ్వేతయావరి' నదులలో స్పందనశీల - హిరణ్యమార్గ ఆమె మిమ్ము స్తుతించుచు మీ వద్దకు చేరును.

19. సుందర గమనులగు అవిద్వయమా! కీర్తివంతము, శ్వేతవర్ణము, పుష్టి కారకమగు 'శ్వేతయావరి' నదిని ప్రవహింప చేయండి.

20. వాయువా! రథమును లాగు రెండు అశ్వములను జోడించుము. పోషించగల అవినులను యుద్ధమున తెమ్ము తదుపరి మేము సమర్పించు సోమమును పానము చేయుము మూడు సవనములకు విచ్చేయుము.

21. యజ్ఞపతియగు త్వషకు అల్లుడవు, విచిత్రకర్మలుగల వాయువా ! నీ పాలన్ పోషణ మాకు లభించవలెను.

22. త్వష్ణకు జామాత, సర్వసమర్థుడగు వాయువు కొరకు మేము సోమము అభిహవింతుము. ధనము యాచింతుము. అతని ధనదనమున మేము ధనవంతులమగుదుము.

23. వాయువా ! ద్యులోకమునకు శుభములు చేర్చుము. నీవు మహానుభావుడవు మంచి కొక్కలుగల గుఱ్ఱములను రథమునకు పూన్చుము. రథమును నడిపించుము.

24. వాయువా ! నీవు అత్యంత సుందరరూపుడవు నీ సమస్త అవయవములందు మహిమలు ఉన్నవి సోమాభిషన శిలలను పోలిన యజ్ఞమునకు నిన్ను ఆహ్వానించుచున్నాము.

25. వాయుదేవా ! నీవు దేవతలందు ముఖ్యుడవు మనసా ప్రసన్నుడవగుము. మాకు అన్నము, నీరు, కర్మము ప్రదానము చేయుము.

## ఇరువది ఏడవ సూక్తము

ఋషి - వైవస్వత మనువు, దేవత - విశ్వదేవతలు, ఛందస్సు - బృహతి

1. ఇది స్తోత్రాత్మక యజ్ఞము సోమాభిషవమునకు ప్రస్తరములు మరియు కుశల అగ్రభాగమున అగ్నిస్థాపించ బడినాడు మరుద్గణములు, బ్రాహ్మణస్పతియు ఇతరదేవతలను స్తుతింతుము. రక్షణలకొరకు ప్రార్థింతుము.

2. అగ్నీ! మా యజ్ఞమున పశువు వద్దకు చేరుదువు భూమి, వనస్పతుల వద్దకు చేరుదువు. ఉదయములందును

రాత్రులందును సోమాభిషన ప్రస్తరము వద్దకు చేరుదువు సర్వజ్ఞాతలగు విశ్వదేవతలారా! మా కర్మములకు రక్షణ కల్పించండి.

3. ఇది ప్రాచీన యజ్ఞము. ఇందు అగ్ని ఉత్తమగతితో దేవతల వద్దకు చేరవలెను. ఆదిత్యులు, ధృతవ్రత వరుణుడు, తేజస్వులగు మరుత్తుల వద్దకు చేరవలెను.

4. బహుధన శాలురు, శత్రునాశకులగు వివిధ దేవతలు మనువును వర్థిల్ల చేయవలెను సర్వజ్ఞాతలగు దేవతలారా ! మమ్ము బాధలు లేకుండునట్లు పాలించండి దుఃఖములు ఎరుగని గృహము ప్రసాదించండి.

5. విశ్వదేవతలారా ! మాస్తోత్రములందు సమానమనస్కులు కండి పరస్పరము కలిసి ఉండండి. ఈ యజ్ఞదినము వచనము, ఋక్కులతో సాగుచున్నది. ఇక్కడికి విచ్చేయండి మరుత్తులారా! మహత్తుగల అదితిదేవీ! మాగృహమునకు విచ్చేయండి.

6. మరుత్తులారా ! మీ ప్రియ అశ్వయుక్తులై యజ్ఞమునకు విచ్చేయండి మిత్రా ! హవ్యము కొరకు రమ్ము ఇంద్ర, వరుణులు, యుద్ధమందు శత్రువధకు తొందరపడు ఆదిత్య గణములు మా కుశల మీద ఆసీనులు కావలెను.

7. వరుణా! మేము మను సములము - మను వంశీయులము. సోమాభిషవము చేసినాము. అగ్నికి సమిధలందించినాము హవిని స్థాపించినాము కుశలు విరిచినాము మిమ్ము పిలుచుచున్నాము.

8.మరుద్గణములు, విష్ణువు, అశ్వినులు, పూష నా స్తుతులు వినవలెను. యజ్ఞమునకు విచ్చేయవలెను. దేవతలతో ప్రథముడు ఇంద్రుడు రావలెను ఇంద్రాభిలాషులగు స్తోతలు ఇంద్రుని వృత్రహంత అందురు.

9. దేవతలారా ! మీరు ద్రోహము ఎరుగనివారు మాకు బాధలు కలుగని గృహమును ప్రసాదించండి నివాస దాతలగు దేవతలారా ! దూరదేశమునుండి వచ్చినవాడుగాని దగ్గరలో ఉన్నవాడుగాని వరించదిగిన ఇంటిని బాధించడు.

10. శత్రుహంత దేవతలారా! మీకు స్వజాతి భావము, బంధుభావము ఉన్నవి తొలి అభ్యుదయము, నవీన ధనమును గురించి మాకు త్వరగా చెప్పండి.

11.సర్వధనవంతులగు దేవతలారా! నేను మిమ్ము అన్నము అడుగుచున్నాను. మీనుండి రమణీయ ధనము పొందుటకుగాను ఎవ్వడు ఎరుగని స్తుతులతో స్తుతింతును.

12. చక్కని స్తుతి మరుత్తులారా ! మీలో ఊర్ధ్వగామము సర్వసేవనీయుడు సవిత అతడు పొడిచినప్పుడు

మనుష్యులు, పశువులు, పక్షులు తమతమ పనులలో లగ్నమగుదురు.

13. మేము మిమ్ము వెలుగుల స్తుతుల స్తుతులతో స్తుతింతుము. మీలో దివ్యదేవతలను మా క్రమ రక్షణకు ఆహ్వానించుచున్నాము. కోరికలు తీర్చమని దీప్తిమంతులగు దేవతను పిలుచుచున్నాము. అన్నలాభమునకు దివ్యదేవతను పిలుచుచున్నాము.

14. సమాన మనస్కులగు విశ్వదేవతలారా ! 'మనువు'నకు ధనాదులు ఇచ్చుటకు అందరు కూడ విచ్చేయండి. నేడు, రేపు అన్నిరోజులలో నాకు, నాపుత్రులకు వరించదగిన ధనమును ప్రసాదించండి.

15. బాధింపరాని దేవతలారా ! స్తోత్ర ఆధారమగు యజ్ఞమున మిమ్ము ఎంతో స్తుతింతును. మిత్రా వరుణులారా ! మీకు సమర్పించు హవి - శత్రువును బాధించుటకు ఆటంకముకాదు.

16. దేవతలారా! తమకు వరదేయ ధనము కలుగుటకు మీకు హవ్యము సమర్పించువాని అన్నము వర్ధిల్లును గృహము వర్ధిల్లును. యజ్ఞము వలన సంతానము వర్ధిల్లును అతనిని ఎవరును బాధించజాలరు అతడు సమృద్ధుడగును.

17. అతనికి యుద్ధములేకనే ధనము లభించును అతడు నడకలుగల గుఱ్ఱములతో దారులు దాటును. మిత్ర వరుణులు, ఆర్య కలసి అతనిని సమాన దానయుక్తుని చేయుదురు రక్షింతురు.

18. దేవతలారా! అగమ్య, దరిమ మార్గములను సుగమములు చేయండి. ఈ ఆయుధము దేనిని హింసించకుండనే నశించవలెను.

19. బలప్రియ దేవతలారా! సూర్యోదయమైనంత నేడు శుభావహమగు గృహమున ప్రవేశించండి సాయంత్రము ప్రవేశించండి మధ్యాహ్నము మనువు కొరకు ధనము గ్రహించండి.

20. ప్రాజ్ఞులగు దేవతలారా! యజ్ఞము మీకు లభించుటకు గాను హవి సమర్పించువాడును, యజ్ఞగామియగు యజమానికి మీరు ప్రదానము చేసిన మంగళమయ గృహమునందే మిమ్ము పూజింతుము.

21. సర్వధన సంపన్నులగు దేవతలారా! నేడు సూర్యోదయమున, మధ్యాహ్నము, సాయంకాలము హవ్యదాత, ప్రకృష్టజ్ఞాని, ఋషియగు మనువునకు రమణీయ ధనము ప్రసాదించండి.

22. దీప్తిమంతులగు దేవతలారా! మేము మీ పుత్రసములము బహుజన భోగయోగ్యమగు ధనము మాకు లభించవలెను. ఆదిత్యులారా ! యజ్ఞము చేయుచు ఈ ధనము వలన మేము ఎంతో ధనవంతులమగుదుము.

## ఇరువది ఎనిమిదవ సూక్తము

ఋషి - మనువు, దేవత - మినదేవతలు, ఛందస్సు - గాయత్రి

1. ముప్పదిమూడు మంది దేవతలు కుశలమీద అసీనులయినారు. వారు మమ్ము గ్రహించవలెను. మరల మరల ధనము ప్రసాదించవలెను.

2. మంచి హవ్యములిచ్చు యజమానులు - మిత్ర, వరుణ, ఆర్యమలను, దేవపత్నుల సహితముగా - నానా విధ వషట్కారములతో ఆహ్వానింతురు.

3. వరుణాది దేవతలు - తమ సకల అనుచరుల సహితులై - మమ్ము ముందు, వెనుక, క్రింద, మీద రక్షించ వలెను.

4. అన్నియు దేవతలు అనుకున్నట్లే జరుగును. దేవతలు కోరిన దానిని నష్టపరచగలవారు లేరు, దేవతలు అనుగ్రహించిన దాతకాని వానిని సహితము ఎవరును హింసించజాలరు.

5. ఏడుగురు మరుత్తులకు ఏడువిధముల ఆయుధములు, ఏడు రకముల ఆభరణములు, ఏడు తీరుల దీప్తులు కలవు.

## ఇరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - మరీచపుత్రుడు కశ్యపుడు లేక వైవస్వతమనువు,
దేవత - వివదేవతలు, ఛందస్సు - ద్విపద విరాజము.

1. సోముడు బలవర్ణుడు, సవర్ణుడు రాత్రులనేత, యువకుడు. ఒక్కడే సోముడు బంగారు ఆభరణములను ప్రకాశింప చేయును.

2. దేవతలందు దీప్యమానుడు, మేధావియగు అగ్ని ఒక్కడే తన స్థానమును నిలుపుకొనును.

3. దేవతలందు నిశ్చల స్థానమున ఉన్న త్వష్ట చేతులందు ఇనుప గొడ్డలి ధరించును.

4. ఇంద్రుడు ఒక్కడే చేత వజ్రము ధరించును వృత్రాదులను నశింపచేయును.

5. సుఖములనందించువాడును పవిత్రుడును అగు ఉగ్రరుద్రునాకు తీక్ష్ణమగు ఆయుధము కలదు.

6. పూష ఒక్కడే మార్గములను కాపాడును అతడు చోరుని వలె సకల ధనములు ఎరుగును.

7. విష్ణువు ఒక్కడే అనేకుల స్తుతియోగ్యుడు అతడు తన మూడు అడుగులతో ముల్లోకములను ఆక్రమించినాడు.

8. ఇద్దరు అశ్వినులు ఒకేసూర్యతో - ఇద్దరు బాటసారులవలె - కలసి ఉందురు. గుఱ్ఱముల మీద సంచరింతురు.

9. తమ కాంతులచే పరస్పర ఉపమేయములగు మిత్రావరుణులు అత్యంత దీప్తివంతులు ఘృతరూప హవివంతులు.

10. వారు ద్యులోక స్థానమును నిర్మింతురు. స్తోతలు మహా సామమంత్రములను ఉచ్చరించి సూర్యుని వెలిగింతురు.

**ముప్పదవ సూక్తము**

ఋషి - వైవస్వతమనువు, దేవత - విశ్వదేవతలు, ఛందస్సు - 1. గాయత్రి
2. ఉష్ణక్, 3. బృహతి 4. అనుష్టుప్

1. దేవతలారా ! మీలో ఎవరును బాలురుకారు - కుమారులు కారు మీరందరు మహామహులు.

2. శత్రుభక్షకులు, మనువునకు యజ్ఞార్హులగు దేవతలారా! మీరు ముప్పది ముగ్గురు మీరు ఆవిధముగనే స్తుతించబడినారు.

3.మీరు  మమ్ము రాక్షసుల నుండి రక్షించండి. ధనాదులు ఇచ్చి మమ్ము పాలించండి. ధనాదులు ఇచ్చి మమ్ము పాలించండి. మాతో చక్కగా మాట్లాడండి. పితరుడగు మనువునుంచి వచ్చిన దారినుండి మమ్ము తప్పించవద్దు దూరమార్గము నుండి సహితము మమ్ము తప్పించవద్దు.

4. దేవతలారా ! యజ్ఞమునుండి పుట్టిన అగ్నీ ! మీరు కర్మలకు నేతలు మీరందరు ఇచ్చట నిలువండి మాకు సర్వత్ర ప్రఖ్యాతమగు సుఖమును, గోవులను, అశ్వములను ప్రసాదించండి.

*(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఆరవ అష్టకము ఎనిమిదవ మండలమున నాలుగవ అనువాకము సమాప్తము.)*

**అయిదవ అనువాకము        ముప్పది ఒకటవ సూక్తము**

ఋషి - వైవస్వతమనువు, దేవత - యజమాని, ఛందస్సు - వివిధము

1. యజమాని యజ్ఞము చేయును. పునఃయజ్ఞము చేయును. సోమమును అభిషవించును. పురోడాశము వండును మరల ఇంద్రుని స్తుతించగోరును.

2. ఇంద్రునకు పురోడాశము, పాలు కలిపిన సోమము సమర్పించు యజమానిని ఇంద్రుడు నిశ్చయముగా పాపముల నుండి రక్షించును.

3. దేవప్రేరితము, ప్రకాశవంతమగు రథము అట్టి యజమానిదే అగును. అతడు దానితో శత్రుబాధలను అంతమొందించును సమృద్ధుడగును.

4. అతడు పుత్రాదియుక్తుడు, నాశపరహతుడు, ధేనుసహితుడు అగును. అతని ఇంటనిత్యము అన్నము లభించును.

5. దేవతలారా ! ఏకమనస్కులై అభిషవించిన దంపతులు - దశాపవిత్రమున సోమమును శోభించు దంపతులు - మిశ్రణద్రవ్యములతో సోమమును కలుపునట్టి దంపతులు.

6. అట్టివారికి భోజనయోగ్యమగు అన్నము లభించును కలవారు యజ్ఞములకువత్తురు వారు అన్నము కొరకు ఎక్కడికిని వెడలరు.

7. వారు ఇంద్రాది దేవతలను ఆలాపించరు వారు దేవతల శుభంకర బుద్ధికి ఆటంకము కలిగించరు మహా అన్నమున దేవతలను సేవించెదరు.

8. వారు పుత్రవంతులు, కుమారవంతులు అగుదురు వారు బంగారు ఆభరణములు కలవారగుదురు. పరిపూర్ణ ఆయుష్కులగుదురు.

9. ప్రియ యజ్ఞవంతులగు అట్టిదంపతుల స్తుతులు దేవతలను కోరును వారు దేవతలకు సుఖప్రద అన్నము సమర్పింతురు. వారి వద్ద ఉపయుక్త ధనముండును. వారు అమరత్వము సంతాన ప్రాప్తికొరకు స్త్రీపురుష సంగమము చేయదురు. వారు దేవతలను సేవింతురు.

10. మేము పర్వతముల సుఖము కొరకును, నదుల సుఖము కొరకును ప్రార్ధింతుము దేవతలతో పాటు విష్ణువు సుఖము కొరకును ప్రార్ధింతుము.

11. ధనములదాత, పూజనేయుడు, అందరిని పోషించా పూష రక్షణలతో రావలెను. వారి రాకతో మార్గములు విస్తరిల్లి మంగళప్రదములు కావలెను.

12. శత్రువులు అణచలేని ప్రకాశకుడగు పూషస్తోతలు శ్రద్ధగల పర్యాప్తస్తుతులు గలవారగుదురు. ఆదిత్యుల దానము పాపరహితమగును.

13. మిత్రవరుణులు, ఆర్యమ మాకు రక్షకులు అట్లేవారు యజ్ఞమార్గములను సంగమములు చేయవలెను.

14. దేవతలారా! అగ్ని మీలో ముఖ్యుడు ప్రకాశవంతుడు. ధనలాభమునకుగాను మేము అగ్నిని స్తుతివచనములతో స్తుతించెదము మిమ్ము సేవించు మానవుడు ఎల్లరకు ప్రీతిపాత్రుడగును. యజ్ఞసాధకుడగు మిత్రునితో సమముగా అగ్నిని స్తుతింతుము.

15. శూరుడు సేనామధ్యమునాకు చొచ్చుకొని పోయినట్లు దేవవంతుని రథము వెంటనే దుర్గమున ప్రవేశించును దేవతల మనసులను స్తుతులతో పూజించి కోరు యజమాని యజ్ఞశూన్యుని ఓడించగలడు.

16. యజమానీ! నీకు లోపము కలుగదు. సోమాభిపవ కర్తా! నీకు లోపము కలుగదు. దేవాభిలాషీ ! నీకు లోపము కలుగదు. దేవతల మనసులను స్తుతులతో పూజించగోరు యజమాని యజ్ఞశూన్యుని ఓడించగలడు.

17. దేవతల మనసులను స్తుతులతో పూజించ గోరు యజమానిని కర్మము ద్వారా ఎవరును అధిగమింప జాలరు. అతడు ఎన్నటికిని తన స్థానము నుండి కదలడు. అతడు పుత్రాదులనుంచి విడిపోడు దేవతల మనసులను స్తుతులతో పూజించా గోరు యజమాని యజ్ఞశూన్యుని పరాభవించగలడు.

18. దేవతల మనసులను స్తుతులతో పూజించగోరు యజమానికి వీరులగు పుత్రులు కలుగుదురు. అతనికి అశ్వయుక్త ధనము లభించును. యజ్ఞశూన్యులను పరాభవించగలడు.

*(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఎనిమిదవ మండలము ఆరవ అష్టకమున రెండవ అధ్యాయము సమాప్తము)*

**ఓం నతామినన్తిమయనో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రవాణీ**
**నరోదసే అద్రుహో వేద్యాభిర్న పర్వతాణి నమే స్థివాంసః**

**మూడవ అధ్యాయము ముప్పది రెండవ సూక్తము**

ఋషి - కాణ్వమేధాతిథి, దేవత - ఇంద్రుడు, ఛందస్సు -గాయత్రి

***ఓం ప్రకృతాన్యంజీషిణః కణ్వా ఇంద్రస్య గాథయామదే సోమస్య వోచత***

1. కణ్వగణములారా! ఇంద్రుని గాథలు పాడండి ఇంద్రుడు మత్తుడగును అప్పుడు ఋజీహి సోమపు కర్మలను

కీర్తించండి.

2. ఇంద్రుడు ఉగ్రుడు అయినాడు. జలమును ప్రేరేపించినాడు 'సృవింద' 'అనర్శన' 'పిప్రు' 'దాస' 'అహీశువ' లను వధించినాడు.

3. ఇంద్రా ! మేఘము ఆవరించిన స్థానమును భేదించుము. ఈ వీరక్రమమును చేయుము.

4. స్తోతలారా ! మేఘమును జలము కొరకు ప్రార్థిస్తాము అట్లే - శత్రుదమనుడు, సుందర హనువులు గల - ఇంద్రుని మీ స్తుతులు వినవలసినదనియు, మిమ్ము రక్షించ వలసినదనియు ప్రార్థింతును.

5. శూర ఇంద్రా! నీవు ప్రసన్నుడవగుము సోమయోగ్యమును, స్తోతల గోవులు, అశ్వములు ఉండుటకు శత్రునగరితో సమానమైన దానిని వెలువరింపుము.

6. ఇంద్రా ! మేము సమర్పించు అభిషుతసోమము లేక స్తోత్రములందు అనురక్తుడవైనచో - నాకు అన్నము అందించువాడవైనచో - దూరదేశమునుండి అన్నముతో నా వద్దకు విచ్చేయుము.

7. ఇంద్రా ! నీవు స్తుతియోగ్యుడవు. మేము నీ స్తోతలము నీవు మమ్ము సంతోషపెట్టుదువు.

8. ధనవంత ఇంద్రా ! నీ వద్ద విశేషధనము ఉన్నది ప్రసన్నుడవగుము. మాకు తరగని అన్నము ప్రసాదించుము.

9. నీవు మమ్ము గోవులు, అశ్వములు, హిరణ్యముతో సంపన్నులను చేయుము మేము అన్నవంతులమగుదుము.

10. లోకరక్షణకు ఇంద్రుడు భుజములు చాచునుమ్ పాలించుటకు సాధు కార్యములు చేయును. అతడు మహాఉక్థవంతుడు మేము ఇంద్రుని ఆహ్వానించుచున్నాము.

11. ఇంద్రుడు యుద్ధమున బహుకర్మలు చేయును శత్రువును, వృత్రుని వదించును స్తోతల కొరకు బహుధాన వంతుడగును.

12. అతడే ఆశక్రుడే - మమ్ము శక్తిశాలురను చేయవలెను. ఇంద్రుడుదాత అతడు సకల రక్షణలతో మా లోపములను పూరించును.

13. ఇంద్రుడు ధనరక్షకుడు సర్వోత్తముడు శోభన పారణవంతుడు సోమాభిషవకారికి మిత్రుడు అట్టి ఇంద్రుని స్తుతించండి.

14. ఇంద్రుడు రానున్న యుద్ధక్షేత్రములందు నిశ్చలుడు అన్న వాజేత బలవంతుడు విశేష ధనములకు ఈశ్వరుడు.

15. ఇంద్రునితో మహాకార్యములు చేయంచువాడులేడు. ఇంద్రుడు దాతకాదు అనువాడు లేడు.

16. సోమాభిషవకారులు, సోమపాయలగు బ్రహ్మణులకు రుణములేదు విశేషధనవంతుడు మాత్రమే సోమపానము చేయగలడు.

17. స్తుత్యుడగు ఇంద్రునకు పాటలు పాడండి. స్తుత్యిందరునలు స్తోత్రములు ఉచ్చరించండి స్తుత్య ఇంద్రునకు స్తుతులు రచించండి.

18. ఇంద్రుడు స్తుత్యుడు బలశాలి అతడు వందల, వేల శత్రువులను వధించినాడు శత్రువులు ఇంద్రుని పట్టజాలరు అతడు యజ్ఞకర్తలను వర్థిల్లచేయును.

19. ఆహ్వానయోగ్య ఇంద్రా! మానవులందించు హవ్యము వద్ద సంచరించుము. అభిషుతసొమ్ము ఆస్వాదించుము.

20. ఇంద్రా! ఈ సోమము గోవులిచ్చి కొన్నది జలముతో కలసినది దీనిని స్వీకరించుము.

21. ఇంద్రా ! క్రోధమున అభిషవించు వానిని దాటిరమ్ము ఉపయుక్తము కాని చోట అభిషవించు వానిని దాటి రమ్ము ఉపయుక్తము కాని చోట అభిషవించువానిని దాటిరమ్ము. మేము అభిషుత సొమము సమర్పించినాము ఆరగింపుము.

22. ఇంద్రా ! మా స్తుతిని గ్రహించుము. నీవు దూరదేశమునుండి రమ్ము. మా ముందునకు, వెనకకు, పక్కలకు విచ్చేయుము. పంచజనులను దాటి విచ్చేయుము.

(పంచజనులు గంధర్వులు, పితరులు. దేవతలు, అసురులు, రాక్షసులు అని యాస్కుడు నిషాదయుక్తమగు చతుర్వర్ణములు అని శాయణుడు.)

23. సూర్య ! నీవు కిరణములు ప్రసాదించినట్లు ధనమును ప్రసాదించుము పల్లపు భూమిలో నీకు లభించునట్లు మాస్తుతులు నీకు లభించవలెను.

24. అధ్వర్యులారా ! సుందర కిరీటముగల ఇంద్రుని కొరకు త్వరగా సొమము సిద్ధము చేయండి సోమపానమునకు ఇంద్రుని ఆహ్వానించండి.

25. నీటి కొరకు మబ్బును పెకలించినవాడు అంతరిక్ష జలమును నేలకు పంపినవాడు గోవులకు పక్వమగు పాలు ప్రదానము చేసినవాడు - అతడే ఇంద్రుడు.

26. దీప్తివంటి ఇంద్రుడు 'ఔర్ణనాభుని' 'అహీశువు' ని వృత్రుని వధించినాడు. ఇంద్రుడు తుషార జలమున మేఘమున బ్రద్దలు కొట్టినాడు.

27. ఇంద్రుడు ఉగ్రుడు నిష్ఠురుడు పరాభవకర్త బలముతో హరించువాడు. ఉద్గాతలారా! దేవతలు మెచ్చిన స్తుతులతో ఇంద్రుని గుణగానము చేయండి.

28. ఇంద్రునకు సోమపు మత్తు కలిగినపుడు అతడు దేవతలకు సకల కర్మములను సూచించును.

29. హర్యశ్వములు హిరణ్య కేశములుగలవి. ఒకేసారి మత్తునందునవి. అవి ఈ యజ్ఞమునందలి సోమరూప అన్నమునకుగాను ఇంద్రుని ఇచటికి చేర్చవలెను.

30. అనేకులు స్తుతించు ఇంద్రుని. ప్రియమేధుడు స్తుతించు అవద్వయము మాముందుకు చేర్చవలెను.

**ముప్పది మూడవ సూక్తము**

ఋషి - కాణ్వమేధాతిథి, దేవత - ఇంద్రుడు, ఛందస్సు -
1-16 బృహతి 17 - 19 గాయత్రి

1.వృత్రఘ్న ఇంద్రా! మేము సోమము అభిషవించినాము జలము వంటి మేము మీ ముందుకు చేరుదుము. పవిత్ర సోమము ప్రస్రుతముకాగా కుశలపై ఉంచిన స్తోతలు నిన్ను ఉపాసింతురు.

2. నివాసదాతయగు ఇంద్రా! అభిషుత సోమము నిర్గతమైనంత, ఉక్థవంతనేతలు నిన్ను స్తుతింతురు. నీవు సోమపిపాసుడవై వృషభమువలె ఝ్విచేయుచు, యజ్ఞస్థానమునకు ఎప్పుడు అరుదెంతువు?

3. శత్రుదమనకారి ఇంద్రా ! కణ్వులకు వేల కొలది అన్నములు ప్రసాదించుము. ధనవంత, విశేషద్రష్ట ఇంద్రా! మాకు దృష్టము, పిశంగ రూపముగల గోరంత ధనము ఇమ్మని యాచించు చున్నాము.

4. మేధ్యతిథే ! సోమపానము చేయుము హర్యశ్వములను రథమునకు కట్టువాడును, సోమసహాయకుడును, వజ్రధరుడును, బంగారు రథము కలవాడును అగు ఇంద్రుని అతనికి సోమము వలన మత్తు కలిగినపుడు స్తుతించండి.

5. ఇంద్రుని కుడి భుజము సుందరము. అతడు ఈశ్వరుడు ప్రాజ్ఞుడు, వేల కర్మలవాడు బహుధనశాలి. పురభంజనుడు ప్రాజ్ఞమున స్థిరుడు అట్టి ఇంద్రుని స్తుతించండి.

6. ఇంద్రుడు శత్రుదమనుడు. శత్రువులు పట్టజాలనివాడు. యుద్ధమున ఆశ్రయించ దగినవాడు. విశేషధనవంతుడు సోమపాయి. అనేకులు స్తుతించువాడు ఆ ఇంద్రుడు సర్వకర్మ సమర్థుడగు యజమానికి పాడియావు వంటివాడు. అట్టి ఇంద్రుని స్తుతించండి.

7. ఇంద్రుడు సుందర హనుమంతుడు సోమముతో తృప్తుడగువాడు. పురచ్ఛేదకుడు. సోమాభిషవము కాగా ఋత్విక్కులతో సోమపానము చేయువాడు ఆ ఇంద్రుని ఎవడు తెలిసికొనగలడు? అతనికి ఎవడు అన్నము సమర్పించగలడు?

8. శత్రువును వేదకుడు పోవు గజము మదజలమురాల్చును. అట్లే ఇంద్రుడు యజ్ఞమునందుమైకము దాల్చును. ఇంద్రుని శాసించువాడులేడు. ఇంద్రా ! నీవు సోమాభిషవమువైపు విచ్చేయుము. మహాబలమున సర్వత్ర సంచరించుము.

9. ఇంద్రుడు రుద్రుడైనపుడు శత్రువు అతనిని చూడ జాలడు. ఇంద్రుడు అచలుడు ఇంద్రుడు యుద్ధము కొరకు ఆయుద్ధములను అలంకరించుకొనును ఇంద్రుడు స్తోత ఆహ్వానము ఆలకించినచో వేరుచోటునకు వెళ్ళడు. అక్కడికే వచ్చును.

10. ఉగ్ర ఇంద్రా! నీవు వాస్తవముగా కోరికలు తీర్చువాడవు అందరిని ఆకర్షించువాడవు మా శత్రువులకు అందని వాడవు అభీష్టవరదుడవని ప్రఖ్యాతుడవు. దూరప్రాంతములందును దగ్గరి చోట్లను నీవు అభీష్టవరదుడవని ప్రసిద్ధుడవు.

11. ధనిక ఇంద్రా ! నీ గుఱ్ఱముల కళ్లెములు అభీష్టవర్ధకములు బంగారు నీ కొరడా అభీష్ట వర్ధకము. నీ రెండు అశ్వములు అభీష్ట వర్ధకములు ఇంకను శతుక్రతు ఇంద్రా! నీవు అభీష్ట వర్ధకుడవు.

12. అభీష్ట వర్ధక ఇంద్రా! నీ కొరకు సోమాభాషవాము చేయువాడు, అభీష్టవర్ధమై, సోమము అభిషవించవలెను సరళగామి ఇంద్రా! ధనము ప్రసాదించుము నీవు అశ్వముల ముందు నిలిచినవాడవు వర్ధము కలిగించువాడవు నీకొరకు జలమున సోమమును అభిషవించువాడు సోమముతో నిలిచి ఉన్నాడు.

13. శ్రేష్ఠబలవంత ఇంద్రా ! సోమరూప మధు పానమునకు విచ్చేయుము. ఇంద్రుడు ఇక్కడికి రాకుండా స్తుతి, స్తోత్రము, ఉక్థ వినడు.

14. ఇంద్రా ! నీవు వృత్రఘ్నుడవు బహుప్రజ్ఞావంతుడవు నీవు రథమునందున్నవాడవు ప్రభువు రథమున కట్టిన అశ్వములు ఇతర యజ్ఞములను తిరస్కరించి నిన్ను మా యజ్ఞమునకు చేర్చవలెను.

15. మహామహుడవగు ఇంద్రా ! నేడు మావద్ద ఉన్న సోమమును స్వీకరించుము దీప్తసోమమును పానము చేయుము నీకు కలిగిన మత్తు మా యజ్ఞమునకు కళ్యాణవహము కావలెను.

16. ఇంద్రుడు వీరుడు అతడు మాకు నేత అతడు నీయొక్క, నా యొక్క, ఇతరుల శాసనమున ప్రసన్నుడుకాడు.

17. ఇంద్రుడు అన్నమాట :- "స్త్రీమనసును శాసించుట అసంభవము స్త్రీబుద్ధి కొంచెముది.

18. సోమాభిముఖముగా సాగు అశ్వద్వయము ఇంద్రుని రథమునులాగును. ఈ విధముగా అభీష్టవర్ధక ఇంద్రుని రథము అశ్వముల దృష్ట్యా - శ్రేష్ఠము.

19. ఇంద్రుడు అన్నమాట :- "నీవు మహిళవు క్రిందకు చూడుము - పైకికాదు పాదములను కలిపి ఉంచుము కటిప్రదేశము - దానిక్రింది భాగము కనిపించకుండునట్లు బట్ట కట్టుము. నీవు స్తోతవయ్యస్త్రీని అయినందున ఇవన్నియు చేయవలెను."

## ముప్పది నాలుగవ సూక్తము

ఋషి - కాణ్వనీపాతిథి, దేవత - ఇంద్రుడు, ఛందస్సు

- 1 - 15 అనుష్టుప్ 16 - 18 గాయత్రి

1. ఇంద్రా ! అశ్వములతో రమ్ము. కణ్వుల వద్దకు రమ్ము వారి స్తుతులు వినుటకు రమ్ము ఇంద్రుడు ద్యులోకశాసకుడు దీప్తివంత ఇంద్రా ! నీవు ద్యులోకమునకు చేరుకొనుము.

2. ఇంద్రా ! ఈ యజ్ఞమున సోమవంతుడు అభిషవ ప్సరశబ్దముతో నీకు సమర్పించవలెను "ద్యులోకశాపకుడు దీప్తివంతుడగు ఇంద్రుడు ద్యులోకము చేరవలెను" దివో అముష్యశాసతో దివంయమదివావసో"

"ద్యులోకశాపకుడు దీప్తివంతుడగు ఇంద్రుడు ద్యులోకము చేరవలెను" "దివో అముష్యశాసతో దివంయమదివావసో"

3. పొట్టెలు గొర్రెను వడికించినట్లు - ఈ యజ్ఞమున అభిషవశిల సోమలతను వడకించును "దివో అముష్య శాసతో దివంయయది దావావసో."

4. తమరక్షణ కొరకును, అన్నప్రాప్తికిని కణ్వలు ఇంద్రుని ఆహ్వానిస్తారు. "దివో అముష్యశాసతో దివం యమదివావసో"

5. అభీష్టవరదుడగు వాయువునకు ప్రథమ సోమరసము సమర్పించబడును. అట్లే నేను నీకు అభిషుత సోమము సమర్పిస్తాను. "దివో అముష్యశాసతో దివంయయ దివావసో"

6. స్వర్గకుటుంబ ఇంద్రా ! మా వద్దకు విచ్చేయుము. సకల లోకరక్షక ఇంద్రా! మమ్ము రక్షించుటకు విచ్చేయుము. "దివో అముష్యశాసతో దివం యమదివావసో"

7.మహామతి, వేల రక్షణలవాడు, విశేష ధనవంతుడవగు ఇంద్రా ! మా వద్దకు విచ్చేయుము. "దివో అముష్యశాసతో దివం యమదివావసో"

8. ఇంద్రా ! దేవతలచేస్తుతించబడువాడును, మానవులచే గృహమున ప్రతిష్ఠించబడు అగ్ని నన్ను వహించవలెను. "దివో అముష్యశాసతో దివం యమదివావసో"

9. డేగ తన రెండు రెక్కలను మోసినట్లు - మదస్రావి అశ్వములు నిన్నుమోయవలెను. "దివో అముష్యశాసతో దివం యమదివావసో"

10. స్వామి ఇంద్రా! నీవు నలువైపులనుండి ఏతెంచుము. నీవు స్వీకరించుటకుగాను సోమమును "స్వాహా, అందును." "దివో అముష్యశాసతో దివం యమదివావసో"

11. మేము ఉక్థలు పఠింతుము. నీవు యజ్ఞమున  మా వద్దకు రమ్ము. మమ్ము సంతోష పరచుము. "దివో అముష్యశాసతో దివం యమదివావసో"

12. పుష్టిగల అశ్వములు గల ఇంద్రా ! సమానరూపముగల అశ్వములపై విచ్చేయుము. "దివో అముష్యశాసతో దివం యమదివావసో"

13. నీవు పర్వతములనుంచి రమ్ము అంతరిక్షమునుండి రమ్ము "దివో అముష్యశాసతో దివం యమదివావసో"

14.శూర ఇంద్రా ! నీవు మీకువేల ఆవులు, వేల అశ్వములు ప్రసాదించుము. "దివో అముష్యశాసతో దివం యమదివావసో"

15. ఇంద్రా ! మాకు వేల, పదివేల, వంద ఆయుతముల అభీష్టములను ప్రదానము చేయుము. "దివో అముష్య

శాసతో దివం యమదివావసో"

16.ధనవంతులమై శోభించునట్టి వేలమందిమి - నేత ఇంద్రునితోకూడ -బలిష్టములగు పశువులను, అవములను సాధింతుము.

17. సరళగామి ఇంద్రుడు - వాయుసమానవేగవంతుడై - చక్కని గఱ్ఱములతో - సూర్యునివలె విరాజిల్లును.

18. "పారానతుడు" రథచక్రములను పరిగెత్తించు అశ్వములను ప్రదానము చేసినపుడు నేను అరణ్యమధ్యమున ఉన్నాను.

## ముప్పది అయిదవ సూక్తము

ఋషి - శ్యావాశ్వ ఆత్రేయుడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - పంక్తి, జ్యోతి - బృహతి - జగతి.

1. అశ్వినులారా! మీరు అగ్ని, ఇంద్ర, వరుణ, విష్ణు, ఆదిత్యగణ, రుద్రగణ, ఉష, సూర్యులతో కలిసి సోమపానము చేయండి.

2. బలశాలురగు అశ్వినులారా ! మీరు సకల ప్రజ, ప్రాణిసముదాయము, ద్యులోకము, పృథ్వి, పర్వతముల కూడియు, ఉష, సూర్యులతో కూడియు సోమపానము చేయండి.

3. అశ్వినులారా ! మీరు ఈ యజ్ఞమున భోక్తలగు ముప్పది ముగ్గురు దేవతలు, మరుత్తులు, భృగువులతో కూడియు ఉష, సూర్యులతో కూడియు సోమపానము చేయండి.

4. అశ్వినులారా! మీరు యజ్ఞమును స్వీకరించండి. నా ఆజ్యమును గ్రహించండి. ఈ యజ్ఞమందలి అన్ని హవానములను అందుకొనండి. ఉష, సూర్యులతో కూడి మా అన్నమును గ్రహించండి.

5. అశ్విద్వయమా! యువకుడు కన్యపిలుపుకు ఆకర్షితుడైనట్లు మీరు ఈయజ్ఞపు స్తోత్రములకు ఆకర్షితులు కండు. ఈ యజ్ఞపు సోమమును స్వీకరించండి. ఈ యజ్ఞమునందలి అన్ని హవనములను అందుకొనండి. ఉష, సూర్యులతో కూడి మా సోమరూప అన్నమును అందుకొనండి. ఉష, సూర్యులతో కూడి మా సోమరూప అన్నమును అందుకొనండి. ఉష, సూర్యులతో కూడి మా సోమరూప అన్నమును అందుకొనండి.

6. అశ్విద్వయమా ! మా స్తుతులను స్వీకరించండి. మా యజ్ఞమును స్వీకరించండి. ఈ యజ్ఞమునందలి అన్ని హవనములను అందుకొనండి. ఉష, సూర్యులతో కూడి మా అన్నము స్వీకరంచండి.

7. రెండు చలకలు పడవ మీద పడినట్లు - మీరు అభిషుతసోమము మీదపడండి, రెండు దప్పిగొన్న బట్టలు నీటిని కనుగొన్నట్లు మీరు సోమమును కనుగొనండి. ఉష, సూర్యులతో కూడి త్రిమార్గములందు పయనించండి.

8. రెండు హంసలు మార్గము వైపు, ఇద్దరుబాటసారులు జలము వైపు నకు వలె అశ్వినులారా! అభిషుత సోమాభిముఖులు కండు. రెండు మహిషములు వలె సోమమును తెలిసి కొనండి. ఉష, సూర్యులతో కూడి త్రిమార్గమున సాగండి.

9.అశ్వినులారా ! డేగలవలె వేగముగా అభిషుత సోమము వైపు సాగండి. మహిషములవలె సోమమును తీసి కొనండి. ఉష, సూర్యులతో కూడ త్రిమార్గమున పయనించండి.

10. అశ్వద్వయమా! సోమపానము చేయండి తృప్తులుకండి. మాకు ధనమును, సంతానమును ప్రసాదించండి. ఉష, సూర్యులతో కూడి మాకు బలమునొసగండి.

11.అశ్వినులారా! మీరు శత్రువులను జయించండి. స్తోతలను ప్రశంసించండి రక్షించండి. మాకు ధనము, సంతానము ప్రసాదించండి. ఉష, సూర్యులతో కూడా మాకు బలమునొసగండి.

12. అశ్వినులారా! మీరు శత్రువునునాశము చేయండి. మంత్రి యుక్తముగా సంచరించండి. మాకు ధనము, సంతానము ప్రసాదించండి. ఉష, సూర్యులతో కూడి మాకు బలమునొసగండి.

13. అశ్వినులారా! మీరు మిత్ర, వరుణ, ధర్మవంతులగు మరుత్తులతో కూడిన వారు మీరు స్తోతల ఆహ్వానమువైపు సాగండి. ఉష, సూర్య, ఆదిత్యులతో కలిసి సాగండి.

14. అశ్విద్వయమా ! మీరు అంగిర, విష్ణు, మరుత్తులతో కూడినవారు. మీరు స్తోతల పిలుపువైపు సాగండి. ఉష, సూర్య, ఆదిత్యులతో కలిసి నడవండి.

15. అశ్విద్వయమా ! మీరు ఋభు, అభీష్టవర్ధి, వాజ, మరుత్తులతో కూడినవారు. స్తోతల పిలుపు వైపుసాగండి. ఉష, సూర్య, ఆదిత్యులతో కలసి కదలండి.

16. అశ్వినులారా ! మీరు శత్రువును గెలవండి. కర్మను గెలవండి. రాక్షసులను శాసించండి -వధించండి. ఉష, సూర్యులతో కలసి అభిషవ కర్త సోమమును ఆస్వాదించండి.

17. అశ్వినులారా ! మీరు బలములను గెలవండి, యోద్ధలను గెలవండి. రాక్షసులను శాసించండి - వధించండి.

ఉష, సూర్యులతో కలసి అభిషవకర్త సోమమును ఆస్వాదించండి.

18. అశ్వినులారా ! గోవులను గెలవండి. వర్తకులను గెలవండి. రాక్షసులను శాసించండి వధించండి. ఉష, సూర్యులతో కలిసి అభిషవకర్త సోమమును ఆస్వాసించండి.

19. అశ్విద్వయమా ! మీరు శత్రువుల గర్వమును విరుచువారు మీరు 'అత్రి' స్తుతులను విన్నట్లే శ్యావాశ్వుని ప్రధానస్తుతులు వినండి. ఉష, సూర్యులతో కూడి ప్రాతఃకాల యజ్ఞమున సోమపానము చేయండి.

20. అశ్విద్వయమా! శ్యావాశ్వుని చక్కని స్తుతిని - ఆభరణమువలె - స్వీకరించండి. ఉష, సూర్యులతో కూడి ప్రాతఃకాల యజ్ఞమున సోమపానము చేయండి.

21.అశ్వినులారా! గుఱ్ఱమును కళ్లెము లాగినట్లు - శ్యావాశ్వుని యజ్ఞమువైపు తరలండి. ఉష, సూర్యులతో కూడి ప్రాతఃకాల యజ్ఞమున సోమపానము చేయండి.

22. అశ్వినులారా ! మీ రథము మాముందుకు తెండు సోమరూప మధువును సేవించండి. ఉష, సూర్యులతో కూడి ప్రాతఃకాల యజ్ఞమున సోమపానము చేయండి.

23. అశ్విద్వయమా ! మీరు నేతలు. నేను హవిసమర్పించువాడను. నమస్కరించి ప్రార్థించుచున్నాను. మా యజ్ఞమునకు సోమపానము చేయ రండి. రక్షణాభిలాషికై మిమ్ము పిలుచుచున్నాను. హవ్యదాతనగునాకు రత్నములు ప్రసాదించండి.

24. అశ్వినీ దేవతలారా ! మీరు అభిషుత, స్వాహాకృత సోమమును సేవించండి. తృప్తినొందండి, యజ్ఞమునకు సోమపానము చేయరండి. రక్షణాభిలాషివై మిమ్ము పిలుచుచున్నాను. హవ్యదాతనగునాకు రత్నములు ప్రసాదించండి.

## ముప్పది ఆరవ సూక్తము

ఋషి - శ్యావాశ్వ, ఆత్రేయుడు దేవత - ఇంద్రుడు, ఛందస్సు -శక్వరి.

1. శక్రతు ఇంద్రా! సోమము అభిషవించు వానికి కుశల విస్తరించువాడగు యజమానికి నీవు రక్షకుడవు. నీవు సజ్జనులకు స్వామివి. మరుత్తుల యుక్తుడవు. దేవతలు నీకొరకు సోమభాగమును నిశ్చయించినారు. నీవు శత్రుసేనను దాని విశేషవేగమును విరిచినప్పుడు జలమధ్యమున విజేతవైనపుడు ఉన్నతుడవగుటకుగాను - అట్టిసోమభాగమును సేవింపుము.

2. ధనిక ఇంద్రా! స్తోతలను రక్షింపుము. సోమపానము చేసి నిన్ను నీవు రక్షించుకొనుము. సజ్జనస్వామి, మరుద్యుక్త ఇంద్రా! దేవతలు నీ కొరకు సోమభాగమును నిశ్చయించినారు. నీవు సకల శత్రుసేనను, దానివేగమును విరిచిప్పుడు - జలమధ్యమున విజేతవై నపుడు ఉన్మత్తుడవగుటకుగాను - అట్టి సోమభాగమును సేవింపుము.

3. అన్నమున దేవతలను రక్షింతువు - నీబలమున నీవే నిన్ను రక్షించు కుందువు. సజ్జనస్వామి, మరుద్యుక్త ఇంద్రా! దేవతలు నీ కొరకు సోమభాగమును నిశ్చయించినారు. నీరు సకల శత్రుసేనను, దానివేగమును విరిచినప్పుడు - జలమధ్యమున విజేతవైనపుడు ఉన్మత్తుడవగుటకుగాను - అట్టి సోమభాగమును సేవింపుము.

4. నీవు ద్యులోకము మరియు భూలోకములకు జనకుడవు. సజ్జనస్వామి, మరుద్యుక్త ఇంద్రా దేవతలు నీ కొరకు సోమభాగమును నిశ్చయించినారు. నీవు సకల శత్రుసేనను, దానివేగమును విరిచినప్పుడు - జలమధ్యమున విజేతవై నపుడు ఉన్మత్తుడవగుటకుగాను అట్టి సోమభాగమును సేవింపుము.

5. నీవు అశ్వములకు, గోవులకు సజ్జన స్వామి, మరుద్యుక్త నీవు సకల శత్రుసేనను, దానివేగమును విరిచినప్పుడు - జలమధ్యమున విజేతవై నపుడు ఉన్మత్తుడవగుటకుగాను - అట్టి సోమభాగమును సేవింపుము.

6. పర్వతవంత ఇంద్రా! అత్రిజనులమగు మా యజ్ఞమును పూజితము చేయుము. సజ్జనస్వామి, మరుద్వంతుడవగు ఇంద్రా! దేవతలు నీ కొరకు సోమభాగమును నిశ్చయించినారు. నీవు సమస్త శత్రుసేనలను, వాటివేగమును విరిచినప్పుడు, జల మధ్యమున విజేతవైనపుడు ఉన్మత్తుడవగుటకుగాను - అట్టి సోమభాగమును సేవింపుము.

7. ఇంద్రా ! నీవు యజ్ఞకర్త అత్రిఋషి స్తుతిని విని ఉన్నావు. అట్లే సోమాభిషవకర్త శ్యావాశ్వుని స్తుతులు వినుము. నీవు ఒక్కడవే నిలిచి యుద్ధమున స్తోత్రములను వర్తిల్ల చేసినావు. ఒక్కడవే త్రసదస్యుని రక్షించినావు.

## ముప్పది ఏడవ సూక్తము

ఋషి - శ్యావాశ్వ ఆత్రేయుడు, దేవత - ఇంద్రుడు ,
ఛందస్సు - మొదటిది అతిజగతి - మిగిలినవి మహాపంక్తి.

1. యజ్ఞపతి ఇంద్రా ! యుద్ధమున సకల రక్షణలతో ఈ బ్రాహ్మణమును - స్తోత్రమును రక్షింపుము- సోమాభిషవమును కూడ రక్షింపుమును కూడ రక్షింపుము. "అనింధ్యుడు, వజ్ర, వృత్రఘ్న ఇంద్రుడు మధ్యందిన సవనపు సోమమును పానము చేయవలెను" "మధ్యం దినస్ప సవనస్య వృత్రహన్ననేధ్య పిబసోమస్య వజ్రవః"

2. కర్మపతియు, ఉగ్రుడవగు ఇంద్రా ! శత్రునేనలను పరాభవించి సకల రక్షణలతో బ్రహ్మణమును - స్తోత్రమును - రక్షింపుము. " మధ్యందినస్స సవనస్స వృత్రహన్న నేధ్య పిబసోమస్య వజ్రవః"

3.యజ్ఞపతి ఇంద్రా ! ఈ భువనములకు ఏకమాత్ర ప్రభువవు. సకల రక్షణలయుక్తుడవై శోభిల్లుదువు. " మధ్యందినస్స సవనస్స వృత్రహన్న నేద్య పిబసోమస్య వజ్రవః"

4. యజ్ఞపతి ఇంద్రా ! ఈ ఉభయలోకములు సమాన రూపముగలవి వానిని నీవే వేరుచేసినావు. " మధ్యందినస్స సవనస్స వృత్రహన్న నేద్య పిబసోమస్య వజ్రవః"

5. యజ్ఞపతి ఇంద్రా! సకల రక్షణల. ఉక్తుడవగు నీవు సమస్తలోకములకు, శుభములకు, యోగక్షేమములకు ఈశ్వరుడవు. " మధ్యందినస్స సవనస్స వృత్రహన్న నేద్య పిబసోమస్య వజ్రవః"

6. యజ్ఞపతి ఇంద్రా! సమస్త రక్షణయుక్తడవై లోకములకు బలమవగుము. ఆశ్రితులకు రక్షకుడవగుము. "మధ్యందినస్సవస్స వృతరహన్ననేద్య పిబసోమస్స వజ్రవః"

7. ఇంద్రా ! నీవు యజ్ఞకర్త అత్రిఋషి స్తుతులు విని ఉన్నావు. అట్లే సోమాభిషవకర్త శ్యావాశ్వుని స్తుతులు వినుము. నీవు ఒక్కడవే నిలిచి యుద్ధమున స్తోత్రములను వర్ధిల్ల చేసినావు ఒక్కడవే త్రసదస్సు రక్షించినావు.

## ముప్పది ఎనిమిదవ సూక్తము

ఋషి - శ్యావాశ్వుడు దేవత - ఇంద్రాగ్నులు ఛందస్సు - గాయత్రి

1. ఇంద్రాగ్నులారా! మీరు పరిశుద్ధలు. ఋత్విక్కులు. "యుద్ధములందున, కార్యములందును యజమానినగు ణా స్తుతిని గ్రహించుము...." వాజేషు కర్మసు! ఇంద్రాగ్నే తస్య బోధితమ్.

2. ఇంద్రాగ్నులారా! మీరు శత్రుహింసకులు రథములందు సంచరించువారు. వృత్రఘ్నులు. అజేయులు ఇంద్రాగ్నే తస్య బోధితమ్, మీరు నన్ను గుర్తించండి.

3.యజ్ఞనేతలు మీ కొరకు శిలలతో ఈ మదకర సోమమును సిద్ధము చేసినారు. "ఇంద్రాగ్నేతస్యబోధితమ్" ఇంద్రాగ్నులారా నన్ను గుర్తించండి.

4. ఒకేసారిస్తుత్యులు, నేతలగు ఇంద్రాగ్నులు యజ్ఞమును సేవించవలెను. యజ్ఞముకొరకు అభిషుత సొమ్ము వైపు విచ్చేయండి. "ఆగతంనరా"

5. ఇంద్రాగ్నులారా ! మీరు నేతలు. మీరు దేనిద్వారా హవ్యము సేవింతురో ఆసవనమును స్వీకరించండి. రండి "ఆగతంనరా"

6. నేతలగు ఇంద్రాగ్నులారా ! గాయత్రిమార్గపు సుందర స్తుతినిస్వీకరించండి. రండి. "ఆగతంనరా"

7. ధనవిజేతలగు ఇంద్రాగ్నులారా ! ప్రాతఃకాలమున దేవతల సహితులై సోమపానమునకు విచ్చేయండి.

8. ఇంద్రాగ్నులారా ! సోమపానమునకుగాను - సోమాభిషవ కర్త శ్వావాశ్వుని ఋత్విజుల ఆహ్వానము వినండి.

9. ఇంద్రాగ్నులారా ! ప్రాజ్ఞులు మిమ్ముపిలిచినారు. వారి వలెనే నేను రక్షణ, సోమపానమునకు మిమ్ము పిలుచుచున్నాను.

10. సామగానములు చేయబడునట్టి స్తుతివంతులగు ఇంద్రాగ్నులను రక్షణల కొరకు ప్రార్ధించుచున్నాను.

## ముప్పది తొమ్మిదవ సూక్తము

ఋషి - కాణ్వనాభాకుడు, దేవత - అగ్ని , ఛందస్సు - మహాపంక్తి.

1. అగ్ని ఋక్మంత్రయోగ్యుడు నేను అతనిని స్తుతింతును. యజ్ఞమునకుగాను స్తుతులతో అగ్నిని స్తుతింతును. అగ్ని మా యజ్ఞమందు హవ్యములందించి, దేవతలను పూజించవలెను. కవియగు అగ్ని స్వర్గ - భూములమధ్య దౌత్యము నిర్వహించును. అగ్ని సకల శత్రువులను వధించవలెను.

2. అగ్నీ! నవీన స్తోత్రములతో మా శత్రువులను వధించుము హవ్యదాత శత్రువులను దహించుము. ఎదురుగా ఏతెంచు మూఢశత్రువు లందరు వెళ్లపోవలెను. అగ్ని సకల శత్రువులను వధించవలెను.

3. అగ్నీ! ఇది ఘృతసమాన సూక్తము. దీనితో నీ నోటిలో హౌమము చేయుదురు. దేవతలందు నీవు మా స్తోత్రము వినుము. నీవు ప్రాచీనుడవు. సుభదుడవు దేవదూతవు. నీవు సకల శత్రువులను వధించుము.

4. స్తోతలు వివిధమగు అన్నము అర్థిందురో అగ్ని ఆవిధముగా అన్నమును అందించును యజమానులు అగ్ని అన్నద్వారమున ఆహ్వానింతురు. అగ్ని వారికి శాంతియుత సుఖమును ప్రసాదించును. అగ్ని దేవతల ఆహ్వానములందు ఉండును. అగ్ని సకల శత్రువులను వధించవలెను.

5. అగ్ని అభిషవ కారకములగు అనేక కార్యములు చేసినాడు. అతనిని జనులు ఆకర్మముల వలననే తెలిసి కొందురు. అతడు సమస్త దేవతలకు హౌత. అతనిని పశువులు చుట్టుముట్టినవి. అతడు శత్రువులకు ఎదురుగా ఏనుగు. అగ్ని సకల శత్రువులను వధించవలెను.

6. అగ్నికి దేవతల జన్మలు తెలియును. మనుష్యుల రహస్యములు తెలియును. అగ్ని ధనప్రదాత. అగ్ని అభివన

హవ్యములతో ఆహ్వానించ బడును. ధనముద్వారా ప్రకటితుడు అగ్ని సకల శత్రువులను వధించవలెను.

7. అగ్ని దేవతలలో ఉండును. యజ్ఞార్హ ప్రజాగణమున ఉండును. భూమి సమస్తజగత్తులను పోషించును అట్లే అగ్ని సంతోషముగా సమస్త కార్య దేవతలందు యజ్ఞయోగ్యుడు. అతడు సకల శత్రువులను వధించవలెను.

8. అగ్ని ఏడుగురు మానవులవాడు. సకల నదులందు ఉన్నవాడు. మూడుస్థానములందు వసించువాడు. యవ్వనాశ్వ పుత్రుడు మాంధాతకొరకు అగ్ని ఎక్కువమంది దస్యులను వధించినాడు. అగ్ని యజ్ఞములందు ముఖ్యుడు. అగ్ని సకల శత్రువులను వధించవలెను.

(ఏడుగురు మానవులు సప్తసింధుప్రాంతమున వశించువాడు మూడు స్థానములు భూమి, ద్యులోకము, అంతరిక్షము)

9. అగ్ని పండితుడు అతడు మూడు స్థానములందుండును. అగ్నిదూత అగ్ని ప్రాజ్ఞుడు అగ్ని అలంకరించుకొని ఈ యజ్ఞమున ముప్పదిముగ్గురు దేవతల యజ్ఞము చేయవలెను మా కోరికలు తీర్చవలెను. అగ్ని సకల శత్రువులను వధించవలెను.

10. ప్రాచీన అగ్నీ! నీవు వంటరివి అయినను మానవులకు దేవతలకు ఈశ్వరుడవు. నీవు సేతు స్వరూపుడవు నీనలువైపుల జలము ప్రవహించును. అగ్ని సకల శత్రువులను వధించవలెను.

## నలుబదవ సూక్తము

ఋషి - నాభాకుడు, దేవత - ఇంద్రాగ్నులు , ఛందస్సు - మహాపంక్తి - 2 శక్వరి - 12 త్రిష్టుప్.

1. ఇంద్రాగ్నులారా ! శత్రువులను పరాజితులను చేయండి వారి ధనము మాకు అందించండి వాయుసహాయమున అగ్ని అరణ్యములను ధ్వంసము చేయుము అట్లే మీరు అందించిన ధన సహాయమున శత్రుబలమును ధ్వంసము చేయుదుము. "సకల శత్రువులను వధించండి - నభంతామన్యకేసమే"

2. ఇంద్రాగ్నులారా ! మేము మిమ్ము ధనము యాచించము అందరిని మించిన బలవంతుడు, నేతలకునేత ఇంద్రుని యజ్ఞము చేయుదుము. ఇంద్రుడు ఇప్పుడు ఆశ్వారూఢడై యజ్ఞప్రాప్తికి వచ్చును ఒకప్పుడు అన్న ప్రాప్తికి వచ్చును "నభంతామన్యకేసమే"

3. ఇంద్రాగ్నులు ప్రసిద్ధులు. వారు యుద్ధమధ్యమున నివసింతురు. పండితులు కోరినపుడు మీమైత్రికోరు యజమానుల సకర్మములను వ్యాపింపచేయుదురు "నభంతామన్యకేసమే"

4. నాభాకులారా ! ఇంద్రాగ్నులను యజించండి - స్తుతించండి - పూజించండి. వారు సమస్తలోకములందు ఉన్నారు వారి వడిలోనే మహతి, మహి, ద్యులోకము ధనమును పొందును. "నభంతామన్యకేసమే"

5. నాభకునితో సములగు ఋషులు ఇంద్రాగ్నులకు స్తుతులతో ప్రేరణ కలిగింతురు. ఇంద్రాగ్నులు సవిబందువులు. వారు మూసినా తలుపుల సంద్రమును వెలుగులతో కప్పుదురు. ఇంద్రుడు బలమువలన ఈశ్వరుడు. "నభంతామన్యకేసమే"

6. ఇంద్రా ! ప్రాచీన మానవుడు తీగలను తెగనరికినట్లు - నీవు శత్రువులను తెగనరకుము. 'దాస' నామక శత్రుబలమును నాశము చేయము. ఇంద్రుని అనుగ్రహమున దాసుని ధనమును మేము పంచుకొందుము. "నభంతామన్యకేసమే"

7. మానవులు ధనము కొరకు, స్తుతులతో ఇంద్రాగ్నులను ఆహ్వానింతురు. వారిలో బలమును వారి సాయమున శత్రువులను ఓడింతుము. స్తుతిమంతులగు శత్రువులను చేర్చుకొందుము. "నభంతామన్యకేసమే"

8. శ్వేతవర్ష ఇంద్రాగ్నులు దిగువనుండి దీప్తితో ద్యులోకముపైకి చేరుదురు. వారి కోరికే యజమాని హవిని వహించును - కర్మానుష్ఠానము చేయును. ఆ ఇంద్రాగ్నులే సింధుమున్నగు నదులను విముక్తముచేసినాడు. "నభంతామన్యకేసమే"

9. ఇంద్రా ! నీవు హర్యశ్వవంతుడవు - వజ్రదరుడవు. ప్రేఅరకుడవు. ప్రీతీకరుడవు. వీరుడవు. ధనికుడవు నిన్ను ఉపమించు వస్తువులు అనేకములు నీకు సంబంధించిన ప్రాచీన ప్రశస్తులు అనేకములు. ఆప్రశస్తులు మాబుద్ధికి సిద్ధి కలిగించ వలెను. "నభంతామన్యకేసమే"

10. స్తోతలారా! దీప్తుడు - ధనప్రాతుడు - ఋగ్మంత్ర యోగ్యుడగు ఇంద్రుని ఉత్తమ స్తుతులతో అర్చించండి. ఇంద్రుడు 'శుష్క' నామక అసురుని సంతానమును సంహరించినాడు. ఆ ఇంద్రుడే స్వర్ణజలములను గెలిచినాడు. "నభంతామన్యకేసమే"

11. స్తోతలారా ! సుందర యజ్ఞవంతుడు, అవినాశ్యుడు, ధనవంతుడు, మహాయోగ్యుడగు ఇంద్రుని స్తుతులతో అర్చించండి. యజ్ఞాభిముఖముగా సాగు ఇంద్రుడే శుష్కని సంతానమును సంహరించినాడు - స్వర్గజలములను గెలిచినాడు. "నభంతామన్యకేసమే"

12. పిత మాంధాత మరియు అంగిరులతో సమానముగా నేను ఇంద్రాగ్నులకు నవీన స్తుతులు రచించినాను. వారు మూడు అంతరముల గృహమునుండి మమ్ము పాలించవలెను. మేము ధనాదిపతులము అగుదుము.

## నలుబది ఒకటవ సూక్తము

ఋషి - నాభాకుడు, దేవత - వరుణుడు, ఛందస్సు - మహాపంక్తి.

1. స్తోతా! విశేషధనప్రాప్తికిగాను -వరుణుని, అతిశయ విద్వాంసులగు మరుత్తులను యజించండి. వరుణుడు తన కర్మతో - మానవుల పశువులను గోవులవలె రక్షించును. "నభంతామన్యకేసమే"

2.యోగ్యస్తుతులతో వరుణుని స్తుతింతును. పితరులను స్తుతింతును. వారిని నాభాకృషి స్తుతులతో స్తుతింతును. వరుణుడు నదులవద్ద నిలుచును. ఆ నదులకు ఏడుగురు అక్కచెల్లెళ్లు ఉన్నారు. వారు మధ్యములు. "నభంతామన్యకేసమే"

3. రాత్రులు వరుణుడు కౌగిట గడుపును. వరుణుడు దర్శనీయుడు. ఆతడు ఉపరిదిశకు సాగును తన మాయతో సకల భవనములను దాల్చును. అతని కర్మాభిలాషులగు మానవులు ఉదయ, మధ్యాహ్న, సాయంసంధ్యలను వర్ధిల్ల చేయుదురు. "నభంతామన్యకేసమే"

4. వరుణుడు భూమి మీది దిశలను ధరించును. అతడు దర్శనీయుడు నిర్మల స్వర్గమునకు, భూమికి ప్రభువు అతడే ఈశ్వరుడై మాగోవులను కాపాడును. "నభంతామన్యకేసమే"

5. వరుణుడు సకల భువనముల ధర్త కాంతులందు అంతర్నిహితుడు. గుహ్యానామములు తెలిసినవాడు. అతడు ప్రాజ్ఞుడు అనేక కావ్యములవాడు వాటిని ద్యులోకసమముగా పోషించువాడు. "నభంతామన్యకేసమే"

6. సకలకవికర్మలు - చక్రమునందలి ఇరుసువలె - వరుణుని ఆశ్రయించి ఉన్నవి. వరుణుడు స్థానత్రయ. అతనిని అర్చించండి కొట్టములోనికి ఆవుపోయినట్లు - శత్రువుమనను ఓడించుటకుగాను - యుద్ధముకొరకు - గుఱ్ఱములను సిద్ధముచేయును. "నభంతామన్యకేసమే"

7.వరుణుడు సకల దిశలందు నిండి ఉన్నాడు. పలువైపుల వ్యాపించి ఉన్న శత్రునగరములను ధ్వంసము చేయును వరుణుని రథము ముందు సమస్తదేవతలు కర్మానుష్ఠానము చేతురు "నభంతామన్యకేసమే"

8. వరుణుడు సముద్ర స్వరూపుడు. అతడు అంతర్నిహితుడై, ఆదిత్యసమునిగా స్వర్గారోహణము చేయును నలుదిశల ప్రజలకు దానములిచ్చును. అతడు ద్యుతిమంతమగు పదమున నిలుచును. ఘాతను నశింపచేయును స్వర్గమునకు సాగును "నభంతామన్యకేసమే"

9. వరుణుడు అంతరిక్షవాసి శుభ్రవర్ణుడు మూడు తేజస్సులతో త్రిభువనముల ప్రసిద్ధుడు అతని స్థానము

అవిచలము. అతడు సప్తసింధులకు అధీశ్వరుడు. "నభంతామన్యకేసమే"

10. వరుణుడు పగలు శుభ్రవర్ణుడు - రాత్రి కృష్ణవర్ణుడగును. అతడు తనకర్మలకుగాను ద్యులోక, అంతరిక్షములను నిర్మించినాడు. ఆదిత్యుడు ద్యులోకమును ధరించినట్లు వరుణుడు అంతరిక్షము ద్వారా ద్యావా, పృథ్వులను ధరించినాడు. "నభంతామన్యకేసమే"

**నలుబది రెండవ సూక్తము**

ఋషి - అర్చనానుడు లేక నాభాకుడు, దేవత - వరుణుడు,

ఛందస్సు - అనుష్టుప్ - త్రిష్టుప్.

1. వరుణుడు సర్వజ్ఞుడు బలవంతుడు అతడు ద్యులోకమును నిలిపి ఉంచినాడు పృథ్విని విస్తరపరచినాడు సకల భువనములకు సామ్రాట్టు అయినాడు వరుణుడు ఇట్టి పనులు అనేకము చేసినాడు.

2. స్తోతా ! బృహత్ వరుణునకు ప్రణమిల్లుము అమృత రక్షకుడు, ప్రాజ్ఞుడగు వరుణునకు నత మనస్కుడవగుము. వరుణుడు మాకు మూడంతస్తుల మేడ ఇవ్వవలెను. మేము అతని వడిలో ఆడుదుము, ద్యానా పృథ్వులు మమ్ము రక్షించవలెను.

3. దివ్యవరుణా ! నేను కర్మాను ష్ఠాతను. నా కర్మమును, ప్రజ్ఞానమును, బలమును తీక్షము చేయుము. మేము సకల దుష్కర్మలను దాటించగల నావను ఎక్కెదము.

4. అశ్వినులారా! మీరు సత్యస్వరూపులు ప్రాజ్ఞులగు విప్రులు, సమస్త అభిషవశిలలు మీ సోమపానమునకుగాను తమ తమ కార్యములతో మీ ముందుకు వచ్చుచున్నారు. "నభంతామన్యకేసమే"

5. నాసత్య అశ్విద్వయమా ! ప్రాజ్ఞుడగు అత్రి తన స్తుతుల ద్వారా మిమ్ము సోమపానమునకు ఆహ్వానించినట్లు నేను మిమ్ము ఆహ్వానించుచున్నాను. "నభంతామన్యకేసమే"

6. నాసత్యద్వయమా ! మేధావులు మిమ్ము సోమపానమునకు పిలిచినట్లు - నేను రక్షణల కొరకు మిమ్ము పిలుతును. "నభంతామన్యకేసమే"

*(ఆధ్రవచన ఋగ్వేద సంహిత ఆరవ అష్టకము ఎనిమిదవ మండలమున అయిదవ అనువాకము సమాప్తము.)*

**ఆరవ అనువాకము** **నలుబది మూడవ సూక్తము**

ఋషి - అంగిరస విరూపుడు, దేవత - అగ్ని, ఛందస్సు - గాయత్రి

1. మాస్తోతలు అగ్నిని స్తుతింతును. అగ్ని మేధావి విధాత అతడు యజమానులను బాధించడు.

2. అగ్నీ ! నీవు జాతధనివి దర్శనీయుడవు. దాతవు కావున నీ కొరకు చక్కని స్తుతులు రచింతును.

3. అగ్నీ ! నీవు వంకరజ్వాలలు. అవి పశువువలె దంతములతో అడవులను తినును.

4. హరణశీల, వాయుప్రేరిత, ధూమధ్వజ అగ్నులన్నియు వేరువేరుగా అంతరిక్షమునకు చేరును.

5. హౌతులచే వేరు వేరుగా సమిద్ధమైన అగ్ని ఉషస్సు కేతనము వలె కనిపించును.

6. అగ్ని జాతప్రజ్ఞుడు అతడు భూమి మీద ఎండిన కట్టెలను ఆశ్రయించినపుడు, పైకిఎగసి దుమ్మును సహితము నలుపు చేయును.

7. అగ్ని ఓషధులను అన్నముగా భావించును భక్షించును అయినను శాంతించడు లేతోషధులవైపు సాగును.

8. అగ్ని తన నాలుకతో వనస్పతులను భక్షించును తేజస్సుతో ప్రజ్వలితుడగును. అరణ్యమును శోభిల్ల చేయును.

9. అగ్నీ !జలమధ్యము నీ ప్రవేశస్థానము. నీవు ఓషధులను నిలుపుదువు మరల వాటి గర్భముననే జన్మింతువు.

10. అగ్నీ ! ఘృతమున ఆహూతుడవైన నీవు స్రుక్కు అగ్రమును నాకుదువు. అందువలన నీ జ్వాల శోభిల్లును.

11. అగ్ని హవ్య భక్షకుడు అతని అన్నము అభిలషనీయము అతడు సోమపృష్ఠుడు అభీష్టప్రదాత అట్టి అగ్నిని స్తోత్రములతో అర్చింతుము.

12. అగ్ని దేవతల ఆహ్వాత ప్రజ్ఞావంతుడు అగ్నికి నమస్కరించియు, సమిధలు సమర్పించియు, యాచింతుము.

13. శుద్ధుడవు, ఆహూతడవగు అగ్నీ !మేము నిన్ను భృగు, మనువుతో సమానముగా ఆహ్వానింతుము.

14. అగ్నీ! నీవు విప్రులలో విప్రుడవు. సాధువులలో సాధువవు. మిత్రులలో మిత్రుడవు. విప్రుల సమిధలలో కూడి ప్రజ్వరిల్లుదువు.

15. అగ్నీ! నీవు హవ్యదాత విప్రులకు సహస్ర సంఖ్యాకధనమును వీరపుత్రాదియుక్త అన్నమును ప్రసాదించుము.

16. అగ్నీ ! నీవు యజమానులకు భ్రాతృరూపుడవు. బలముతో పుట్టినవాడు రోహితనామక అశ్వవంతుడవు పరిశుద్ధ కర్మవి. నీవు మా స్తోత్రములను ఆశ్రయింపుము.

17. అగ్నీ! ఆవులు ఉత్సాహమున అంబారాములు చేయుచు దూడల కొరకు గోశాలకు సాగినట్లు - మా స్తుతులు నీ వద్దకు సాగుచున్నవి.

18. అగ్నీ! నీవు అంగిరులలో శ్రేష్టుడవు సమస్తప్రజతమ కోరికలు తీర్చుకొనుటకు నిన్ను అశ్రయింతురు.

19. మునీషులు, ప్రాజ్ఞులు, అన్నప్రాప్తికి అగ్నిని ప్రసన్నుని చేయుదురు.

20. అగ్నీ! నీవు బలవంతుడవు హవ్యవాహకుడవు. హేతవు ప్రసిద్ధుడవు గృహమందు యజ్ఞమును విస్తరింప చేయు స్తోతలు నిన్ను స్తుతింతురు.

21. అగ్నీ! నీవు ప్రభువవు, సర్వత్ర సకల ప్రజకు సమదర్శివి. అందువలనేమేము నిన్ను యుద్ధములందు ఆహ్వానింతుము.

22. అగ్ని ఘృతము ద్వారా ఆహూతుడగును శోభిల్లును మా పిలుపును ఆలకించిన అగ్నిని మేము స్తుతింతుము.

23. అగ్నీ ! నీవు జాతధనవి శత్రుహింసకుడవు మా ఆహ్వానము ఆలకించువాడవు అందుకే నిన్ను మేము పిలుస్తాము.

24. అగ్నిమానవులకు ప్రభువు మహామహుడు కార్యములకు అధ్యక్షుడు నేను అగ్నిని స్తుతిస్తాను. అగ్ని వినవలెను.

25. అగ్ని సర్వత్రగామి బలశాలి శక్తిశాలి మానవులకు సమానహితకరుడు అశ్వమువలె అగ్నిని బలిఇస్తాము.

26. అగ్నీ !నీవు హింసకులను వధించుము. రాక్షసులను దహించుము. తీక్ష తేజమున దీప్తిచెందుము.

27. అంగిరులలో శ్రేష్ఠుడవగు అగ్నీ! మానవులు నిన్ను మనువుతోసమముగా అర్చింతురు నీవు మానవుని వలె నాస్తుతిని అర్థము చేసికొనుము.

28. అగ్నీ! నీవు స్వర్గము, అంతరిక్షమునందలి బలములమూలమున జన్మించినావు. నిన్ను స్తుతించి

ఆహ్వానించుటకు వేరు వేరు హవిరూప అన్నములను సమర్పింతురు.

29. వీరందరు, ఈ సమస్తప్రజ నీవు ఆరగించుటకు వేరు వేరు హవిరూప అన్నములను సమర్పింతురు.

30. అగ్నీ! నీ కొరకే మేము సుకృతులము అగుదుము సర్వదర్శనములము అగుదుము. అన్ని దుర్గమస్థానములను దాటుదుము.

31. అగ్ని ప్రసన్నుడు బహుప్రియుడు యజ్ఞశాయి పవిత్ర దీప్తియుక్తుడు. మేము హర్షయుక్త స్తోత్రమున అగ్నిని యాచింతుము.

32. అగ్నీ ! నీవు వెలుగులు పరచెదవు సూర్యునివలె - కిరణములతో బలమును విస్తరింతువు అంధకారమును నాశము చేయుదువు.

33. బలశాలి అగ్నీ! దానయోగ్యము, వరణేయమగు నీ ధనము క్షీణించునదికాదు. దానిని ప్రసాదించుమని నిన్ను మేము ప్రార్థించుచున్నాము.

### నలుబది నాలుగవ సూక్తము.

ఋషి - అంగర విరూపుడు దేవత - అగ్ని ఛందస్సు - గాయత్రి

1. ఋత్విక్కులారా ! అగ్ని అతిథిసముడు అతనిని హవ్యముతో సేవించండి హవ్యముతో మేల్కొల్పండి. అగ్నికి ఆహుతులు అర్పించండి.

2. అగ్నీ! మా స్తోత్రములను స్వీకరించుము. ఈ మనోహర స్తోత్రమున వర్ధిల్లుము. మా స్తోత్రములను అభిలషించుము.

3. దేవదూత, హవ్యవాహకుడు అగ్ని. అగ్నిని నాముందు స్థాపిస్తాను. స్తుతిస్తాను. అగ్ని దేవతలను పిలువవలెను.

4. అగ్నీ! నీవు ప్రజ్వలితుడవైనపుడు - మహత్తరములు, ఉజ్వలములగు - నీ జ్వాలలు పైపైకి పాకును.

5. అభిలాషగల అగ్నీ! ఘృతమునందించు మాస్రుక్కు నీ వద్దకు చేరవలెను. నీవు మా హవ్యమును అందుకొనుము.

6. నేను ప్రసన్నహౌతను ఋత్విక్కును. విలక్షణ దీప్తి, దీప్తిధనుడగు అగ్నిని స్తుతింతును అగ్ని నాస్తుతులు వినవలెను.

7. అగ్ని ప్రాచీనుడు హౌత స్తుతియోగ్యుడు. ప్రీతీపాత్రుడు కవి, కార్యకర్త యజ్ఞమున ఆశ్రితుడు. నేను అగ్నిని స్తుతింతును.

8. అంగిరశేష్ఠ అగ్నీ ! క్రమముగా ఈ హవ్యములను అందుకొనుము. అప్పుడప్పుడు యజ్ఞమును సుసంపన్నము చేయుము.

9. పూజ్యుడవు, ఉజ్వలదీప్తవంతుడవగు అగ్నీ ! నీవు సమిధలతో ప్రజ్వలుడవైనంతనే దేవతలను గుర్తించి ఈ యజ్ఞమునకు తీసికొనిరమ్ము.

10. అగ్ని మేధావి హౌత ద్రోహరహిరతుడు ధూమధ్వజుడు విభానసుడు. యజ్ఞపతాకస్వరూపుడు మేము అగ్నిని అభీష్టములు అడుగుదుము.

11. బలములనుండి పుట్టిన అగ్నీ ! మమ్ము హింసకులనుండి కాపాడుము. శత్రువును చీల్చుము.

12. అగ్ని కాంతికర్ముడు. అతడు ప్రాచీనములు, మనోహోర స్తోత్రములతో తన దేహమున వెలిగించుకొనును. విప్రులతో వర్ధిల్లును.

13. అగ్ని అన్నపుత్రుడు పవిత్రదీప్తవంతుడు. అతనిని హింసలేని యజ్ఞమునకు ఆహ్వానిస్తాను.

14. అగ్ని మిత్రులకు పూజనీయుడు. అతడు దేవతల సహితుడై, ఉజ్వల తేజమున యజ్ఞమున ఆసీనుడు కావలెను.

15. ధనప్రాప్తికొరకు తనగృహమున అగ్నిని అర్చించు వానికి - అగ్ని ధనము ప్రసాదించును.

16. అగ్ని దేవతల మస్తకుడు ద్యులోకపునూపురము పృథ్వికి భర్త జలములకు వీర్య రూపుడు అగ్ని ప్రాణులను ప్రసన్నులను చేయును.

17. అగ్నీ ! నీ ప్రభలు దీప్తములు నిర్మలములు శుభ్రవరదులు అవి నీ తేజస్సులకు ప్రేరణ కలిగించును.

18. అగ్నీ! నీవు స్వర్గమునకు స్వామివి. వరణేయము, దాన యోగ్యమగు ధనమునకు ఈశ్వరుడవు శుభముల కొరకు నేను నీస్తోతను అయినాను.

19. అగ్నీ ! విద్వాంసులు నిన్ను స్తుతిస్తారు. నిన్నేతను పనులతో ప్రసన్నుని చేయుదురు. మాస్తుతులు నిన్ను వర్ధిల్లుచేయునుగాత.

20. అగ్నీ ! నీవు హింసలేనివాడవు బలశాలివి దేవదూతవు స్తోతవు. మేము నిరంతరము నీ మైత్రికోరి ప్రార్థింతుము.

21. అగ్నీ అత్యంత పరిశుద్ధ కర్మలవాడు పవిత్రుడు విప్రుడు కవి, అతడు ఆహ్వానితుడై శోభిల్లును.

22. అగ్నీ! నా పనులు, స్తుతులు నిన్ను సదా వర్థిల్లు చేయవలెను. మన బంధుత్వమును నీవు సదాగ్రహించుము.

23. అగ్నీ! నేను బహు ధనవంతుడనైనను నీవు నీవుగను నేను నేనుగనే ఉందుము. నీ ఆశీస్సులు సత్యములగును "సత్యాఇహాశిషః"

24. అగ్నీ ! నీవు నివాసప్రదుడవు ధనపతివి దీప్త ధనశాలివి మేము నీ అనుగ్రహము అడుగుచున్నాము.

25. అగ్నీ ! నీవు ఘృతకర్మవు నదులు సాగరమువైపు సాగినట్లు - శబ్దవంతములగు నా స్తుతులు నీవైపుసాగును.

26. అగ్ని యువకుడు జగత్పతి కవి సర్వభక్షకుడు బహుకర్మ అతనిని స్తుతులతో నేను శోభిల్లచేయుదును.

27. అగ్ని యజ్ఞనేత వంకరజ్వాలలవాడు బలవంతుడు మేము అగ్నిని స్తోత్రములతో స్తుతించ కోరుదుము.

28. అగ్ని శోధకుడు భజనీయుడు మాస్తోతలు అగ్ని విషయమున ఆసక్తులు కావలెను అగ్ని వారిని సుఖవంతులను చేయవలెను.

29. అగ్నీ! నీవు ధీరుడవు హవ్యములిచ్చు విప్రుడు జాగృతుడై కూర్చొని ఉండును. అట్లే నీవు నిరంతర జాగరూకుడవై అంతరిక్షమున వెలుగొందుదువు.

30. వాసదాత. కవి అగ్నీ ! పాపులు, హింసకులనుండి మమ్ము రక్షింపుము మా ఆయువు పెంచుము.

## నలుబది అయిదవ సూక్తము

ఋషి - కాణ్వత్రి శోకుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - గాయత్రి.

1. ఋషులు - అగ్నిని ప్రదీప్తము చేయువారు, ఇంద్రుడు మిత్రుడుగాగలవారు - వారు పరస్పరము కలసి కుశలు పరుస్తారు.

2. ఈ ఋషుల సమిధ మహిమగలది వీరి స్తోత్రము విశేషము విశేషము వీరిస్వరూపము మహంతము. తరుణ ఇంద్రుడు వీరికి మిత్రుడు.

3. అయోద్ధుడై - శత్రువులు చుట్టు ముట్టినవాడై - స్వబలమున బలశాలియై శత్రువును గెలువగల వాడెవ్వడు?

4. ఇంద్రుడు జన్మించినాడు బాణము పట్టినాడు. తన తల్లిని అడిగినాడు "ఈలోకమున ఉగ్రబలశాలురు ఎవరు?" అని.

5. బలవతియగు తల్లి బదులు పలికినది "నీతో శత్రుత్వము కోరువాడును, పర్వతమందలి దర్శనీయగజమువలె పోరుసల్పువాడును." అని.

6. ధనిక ఇంద్రా ! మా స్తుతులు వినుము - స్తోత అడిగిన దానిని ఇచ్చువాడవు. నీవు బలవంతుని చేయదలచినవాడె బలవంతుడగును.

7. యుద్ధకర్త ఇంద్రుడు చక్కని అశ్వమును కోరి యుద్ధమునకు వెడలినపుడు రథికులలో ప్రధాన రథికుడగును.

8. వజ్రధర ఇంద్రా! ఆకాంక్షలుగల సమస్తజనులు బుద్ధిగలవారగునట్లుగా ప్రవర్థిల్లుము మా కొరకు మిక్కిలి అన్నము కలవాడవగుము.

9. ఇంద్రుని హింసకులు సహితము బాధించలేరు. ఆ ఇంద్రుడు మాకు అభీష్టములు ప్రసాదించవలెను అతడు రథముపై మాముందుకు రావలెను.

10. ఇంద్రా! మేము నీ శత్రువుల ముందు నిలువరాదు నీవు అనేక గోవులు కలవాడవు కావలెను. అప్పుడు మా కోరికలు తీర్చుమని మీ ముందు నిలుస్తాము.

11. వజ్రధర ఇంద్రా ! క్రమముగా మేము అశ్వవంతులము, బహుధనవంతులము, ఉప్రవరహితులము అగుదుము.

12. ఇంద్రా ! యజమాని నీస్తోతలకు ప్రతి దినము వందల, వేల, ప్రియ వస్తువులు ఇచ్చును.

13. ఇంద్రా !నీవు ధనంజయుడవు పరాక్రమశాలివి శత్రుమంథనుడవు ధనాపహారివి గృహమువలె ఉపద్రవ రక్షకుడవు అట్లని మాకు తెలియును.

14. ఇంద్రా! నీవు కవివి దర్శకుడవు వణిక్కువు. మేము నిన్ను అభీష్టములు అడిగినపుడు నీవు సోమమత్తున

ఉండవలెను.

15. ఇంద్రా ! ఒకడు ధనికుడై దానము చేయడు ఒక ధనదాత నిన్ను చూచి ఈర్ష్యపడును అటువంటివారి ధనమును మా కొరకు కొనితెమ్ము.

16. ఇంద్రా! జనులు గిడ్డంగి అందుకొన్ని పశువులను చూచెదరు. అట్లె మా మిత్రులు సోమాభిషవము చేసి నిన్ను దర్శింతురు.

17. ఇంద్రా ! మేము బధిరులము కారాదు. నీ చెవి వినగలది కావున రక్షణ కొరకు ఈ యజ్ఞమునకు - నిన్ను దూరము నుండి పిలుస్తాము.

18. ఇంద్రా ! ఇంద్రా ! నీవు మాపిలుపులు వినుము. నీబలము శత్రు దుస్సహము కావలెను నీవు మాకు దగ్గర చుట్టమగుము.

19. ఇంద్రా ! మేము దారిద్ర్యపీడితులమైనపుడు నీ వద్దకు చేరుదుము. నిన్ను స్తుతింతుము. అప్పుడు మాకు గోదానము చేయుటకు మేల్కొల్పుము.

20. బలపతీ ! మేము క్షీణించినాము. నీ చేతి కర్రవంటి వారమైనాము యజ్ఞమును నిన్ను తలుస్తాము.

21. విశేష ధనవంతుడు, దానవంతుడగు ఇంద్రుని స్తుతించండి. యుద్ధమున ఇంద్రుని ఎంతటివాడును ఓడించజాలడు.

22. బలశాలి ఇంద్రా! సోమము అభిషుతమైనది దానినే నీపోనమునకు అందింతును. నీవు తృప్తుడవగుము. మదకర సోమము సేవించుము.

23. ఇంద్రా ! మూర్ఖులు, రక్షణాభిలాషులై, నిన్ను కొట్టరాదు. వారు నిన్ను హింసించరాదు నీవు బ్రాహ్మణద్వేషులను ఆశ్రయించరాదు.

24. ఇంద్రా ! మహాధనప్రాప్తి కొరకు ఈ యజ్ఞమున మానవులు దుగ్ధాది మిశ్రిత సోమపానము చేసి ఆనందించవలెను. గౌరమృగము సరోవరమున నీరు త్రావినట్లు నీవు సోమపానము చేయుము.

26. ఇంద్రా ! నీవు రుద్రర్ది అందించిన సోమమును సేవించినావు. "సహస్రబాహు" నామక శత్రువును సంహరించినావు అప్పుడు నీ పౌరుషము పరివ్యాప్తమైనది.

27. ఇంద్రా! 'తుర్వాశ' 'యదు' నామక రాజుల కర్మములు సత్యములని భావించినావు. వారికొరకు 'అన్వావాయ్య' ని వధించినావు.

28. స్తోతలారా ! మాపుత్రాదుల రక్షకుడు, శత్రుదమనుడు, గోవిశుష్టు, అన్నదాత, సాధరణుడగు ఇంద్రుని నేను స్తుతిస్తాను.

29. ఇంద్రుడు జలవర్ధకుడు మహానుభావుడు సోమాభిషవము అయనంత ఉక్థలు ఇచ్చరించనపుడు -ధనము కొరకు - ఇంద్రుని స్తుతిస్తాను.

30. ఇంద్రుడు జలనిర్గమన మునకుగాను - ద్వారరూపము, విశాలమగు మేఘమును త్రిశోక ఋషి కొరకు - బద్దలు కొట్టినాడు అతడే జలము సాగుమార్గము కల్పించినాడు.

31. ఇంద్రా ! నీవు ప్రసన్నుడవైనపుడు మంచి వస్తువులు ధరింతువు - పూజింతువు - దానము చేతువు, అవన్నియు మా కొరకు ఏలచేయవు? మమ్ము సుఖవంతులను చేయుము.

32. ఇంద్రా !నీవు చేసిన దానిలో ఏ కొంత చేసినను మానవులు భూమి మీద ప్రసిద్ధులగుదురు. నీ మనసునావైపు మరలవలెను.

33. ఇంద్రా ! నీవు మమ్ము దేనితో సుఖవంతులను చేయుదువో ఆఖ్యాతి, ఆస్తుతినీకు చెందవలెను.

34. ఇంద్రా ! మేము ఒక్క అపరాధము చేసినప్పుడు మమ్ము శిక్షించవద్దు రెండు, మూడు, అనేక అపరాధములు చేసినప్పుడు కూడ శిక్షించవద్దు.

35. ఇంద్రా! నీ వంటి ఉగ్రుడు, శత్రుదమనుడు, పాపుల వినాశకుడు, శత్రుహింసణు భరించు మరొక దేవతతో నాకు ఎటువంటి భయములేదు.

36. విశేష ధనవంత ఇంద్రా ! నీమిత్రుల సమృద్ధిగురించి విన్నవిస్తాను. వారి పుత్రుల విషయము విన్నవిస్తాను. నీ మానసుమాత్రము నానుండి మరల కుండ వలెను.

37. మానవులారా ! ఇంద్రుడు కాక ద్వేషములేని మిత్రుడు ఎవడు? అడగకముందే నేను ఎవరిని బాధించను, అని అడుగు వాడెవ్వడు? మమ్ముచూచి భయపడి పోరువాడెవ్వడు?

38. అభీష్టప్రద ఇంద్రా ! సోమము అభిషుతము అయినపుడు 'ఎవార' నామకవ్యక్తి వద్దకు వెళ్లదు. వానికి బహుధనము లొసంగదు ధూర్త వలె నీ వద్దకే చేరును. తలలు వంచుకొని దేవతలు తప్పుకున్నారు.

39. ఇంద్రా ! సుందర రథమున మంత్రములతో పూన్చబడు హర్యశ్వములను నేను ఆకర్షింతును. "యదీంబ్రహ్మభ్య ఇద్దదః" నీవు బ్రాహ్మణులకే ధనమిచ్చువాడవు.

40. ఇంద్రా ! నీవు సకల శత్రువులను చీల్చుము. హింసించుము. యుద్ధము నిలుపుము. మాకొరకు అభిలషణీయధనము తెమ్ము.

41. ఇంద్రా ! నీవు గట్టిచోట ధనము ఉంచినావు స్థిరప్రదేశమున ధనము ఉంచినావు సందిగ్ధస్థానమున ధనము తీసికొనిరమ్ము.

42. ఇంద్రా ! నీవు జలనుకు ధనము ఇచ్చినావు. నీకు గుర్తున్నంతలో అట్టి అభిలషణీయ ధనమును తెమ్ము.

*(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఎనిమిదవ మండలము ఆరవ అష్టకమున మూడవ అధ్యాము సమాప్తము.)*

**ఓం నతామినన్తి మాయనో నధీరావ్రదేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదసే అద్రుహా వేద్యాభిర్న పర్వతాన్ని నమే స్థివాంసః**

**నాలుగవ అధ్యాయము నలుబది ఆరవ సూక్తము**

ఋషి - అశ్వపుత్ర వశాఖ్యుడు దేవత - ఇంద్ర - వాయువులు ఛందస్సు - వివిధములు

***ఓం త్వావతః పురూవసో వయమన్ద్ర ప్రణేతః స్మసిస్థాతర్హ రీణామ్***

1. ఇంద్రా! నీవు బహు ధనవంతుడవు కర్మ ప్రాపకుడవు. నీ వంటి వానికే మేము ఆత్మీయులము. మేము హర్యశ్వములకు అధిష్ఠాతలము కావలెను.

2. వజ్రధారి ఇంద్రా ! నీవు అన్నదాతవు - ధనదాతవు ఇదిమాకు తెలియును.

3. ఇంద్రా ! నీ రక్షణలు అవధులు లేనివి. నీవు బహుకర్మ వంతుడవు. నీ మహిమను స్తోతలు స్తుతులతో పాడుదురు.

4. ద్రోహశూన్యులగు మరుత్తుల రక్షణ పొందిన వారును, ఆర్యమ, మిత్రుల రక్షణ పొందినవారును సుందర యజ్ఞవంతులు.

5. ఆదిత్యుని అనుగ్రహము పొందిన యజమాని గోవులు, అశ్వములు గలవాడగును. వీర్యయుక్తుడగును. వర్థిల్లును. బహుసంఖ్యక, అభిలషనీయ ధనముతో పెంపొందును.

6. ఇంద్రుడు ప్రఖ్యాతుడు బలప్రయోగముచేయువాడు. నిర్భయుడు ఎల్లరకు దొర అతనిని ధనమునకు యాచించుచున్నాము.

7. సర్వత్రగామి, నిర్భయ, సహాయక మరుద్గణసేన ఇంద్రునిది మాత్రమే అగును. గతిశీలములగు హర్యశ్వములు - బహుధనదాత ఇంద్రుని - హర్షమ కొరకు అభిషుత సోమము వద్దకు చేర్చవలెను.

8. ఇంద్రుని ముదము - వరణేయము. దానితోనే ఇంద్రుడు ఎందరో శత్రువులను వధించును. శత్రువుల ధనము గుంజుకొనును - యుద్ధమున దాటిపోవును.

9. ఇంద్రా ! నీవు సర్వరేణ్యుడవు. యుద్ధమున దుర్ధమున దుర్ధర్షుడవు. శత్రువును పరాభావించువాడవు. సర్వత్ర విఖ్యాతుడవు. అందరిని మించిన బలవంతుడవు నివాస ప్రదాతవు ఇంద్రా! ఆమదముతోనే యజ్ఞమునకు విచ్చేయుము.

10. మహాధని ఇంద్రా ! మాకు గోవులు, అశ్వములు, రథముల మీద ఆశ కలుగును అట్టితరి - పూర్వమువలెనే - వాటిని మా కొసంగుము.

11. శూరింద్రా ! వాస్తవముగా నీధనపు అంతు ఎరుగము. ధనవంత వజ్రధర ఇంద్రా మాకు తొందరగా ధనమును ఇమ్ము అన్నమున మా కర్మలను కాపాడుము.

12. ఇంద్రుడు దర్శనీయుడు ఋత్విక్కుల మిత్రుడు అనేకులు స్తుతించువాడు లోకములందలి సకల ప్రాణులను తెలిసినవాడు సమస్త జనులు హవ్యములు చేబూని బలవంతుడగు ఇంద్రుని పిలుస్తారు.

13. అట్టి విశేషధనవంతుడు, మఘువ, వృత్రహంత యుద్ధక్షేత్రమున మమ్ము రక్షించవలెను, అగ్రగామి కావలెను.

14. ఇంద్రుడు శత్రుహంత. విశిష్టప్రజ్ఞావంతుడు సర్వత్ర ప్రసిద్ధుడు శక్తిశాలి. స్తోతలారా! మీ హితమునకుగాను - ఇంద్రునకు సోమమువలన కలిగిన మత్తునాకు - మీ వాక్యము స్ఫూర్తి కావలెను. ఇంద్రుని - అతనికి అనుకూలము, మహత్తమ మగు స్తుతితో అర్పించండి.

15. ఇంద్రా ! నా దేహపోషణకుగాను ఇప్పుడే ధనదాత వగుము. యుద్ధములందు అన్నవంత ధనదాత వగుము.

అనేకులు ఆహ్వానించు ఇంద్రా ! మా పుత్రులకు ధనము ప్రసాదించుము.

16. సకల ధనాధిపతి, యుద్ధములందు వడకించువాడు, శత్రుంజయుడగు ఇంద్రుని స్తుతించండి. అతడు వెంటనే ధనము దానము చేయువాడు.

17. ఇంద్రా ! నీవు మహా మహుడవు. నేను నీ రాకను ఆపేక్షించుచున్నాను. నీవు గమనశీలుడవు సంపూర్ణగామివి. సేచకుడవు. యజ్ఞము, స్తుతులతో నిన్ను స్తుతింతుము. నీవు మరుత్తులనేతవు, సకల జనుల ఈశ్వరుడవు. నమస్కరించియు, స్తుతించియు నీ గుణ కీర్తనము చేయుదుము.

18. మరుత్తులు - మేఘముల ప్రాచీనము, బలకరమగు - జలము వెంట సాగుదురు. అట్టి ధనికులగు మరుత్తుల కొరకు మేము యజ్ఞము చేస్తాము. ఆ యజ్ఞమున మహాధ్వని కలిగిన మరుద్గణము లందించు సుఖములను పొందగలము.

19. ఇంద్రా! నీవు దుర్బుద్ధి వినాశకుడవు మేము నిన్ను యాచించుచున్నాము. మా కొరకు యోగ్యధనము తీసుకొని రమ్ము. నీ బుద్ధి నిరంతరము ధనప్రేరణ తత్పరము. దేవా! మా కొరకు ఉత్తమ ధనము తెమ్ము.

20. దాత. ఉగ్రుడు, విచిత్రుడు, సత్యభాషి, శత్రు పరాభవకర్త, అందరి ప్రభువగు ఇంద్రా! యుద్ధమునందు మాకు ఓడించగల, భోగయోగ్యమను, ప్రవృద్ధమగు ధనమును ప్రసాదించుము.

21. అశ్వపుత్రుడు 'వశుడు' కన్యాపుత్రుడు "వృథుశ్రవరాజు" ధనమును ప్రాతఃకాలమున తిసికొన్నాడు దేవశూన్యుల ధనమునంతను తీసికొన్నందున 'వశుడు' ఇచ్చటికి రావలెను.

22. వశుడు అన్నమాట :-

"నేను ఆరువేల మరియి పదివేల గుఱ్ఱములను పొందినాను. ఇరువది వందల ఒంటెలను అందుకున్నాను. నలుపురంగువి పదివందల ఆడగుఱ్ఱములు నాకు లభించినవి. మూడు స్థానములందు శుభ్రవర్ణముగల పదివేల గోవులు లభించినవి"

23. "పది నలుపురంగు గుఱ్ఱములు రథచక్రములను లాగును. అవి వేగవంతములు, బలవంతములు, మంథన కర్తలు."

24. "ఉత్కృష్టధనవంతుడు, కన్యాపుత్రుడు పృథుశ్రవుడు చేసిన దానమిది అతడు బంగారు రథము ఇచ్చినాడు. అతడు దాత. ప్రాజ్ఞుడు అత్యంత ప్రవృద్ధకీర్తిని పొందినాడు."

25. వాయువా ! మహాధనము, పూజనీయబలము ప్రసాదించుటకు మా వద్దకు రమ్ము నీవు విశేష ధనదాతవు మేము నిన్ను స్తుతింతుము. నీవు వచ్చినంతనే మేము నిన్ను స్తుతిస్తాము.

26. వాయువు దీప్తుడు పవిత్ర సోమపాయ అతడు పృథుశ్వా, అవములతో వచ్చును. గృహమున నివసించును. త్రిగుణితసప్త సప్తతి గోవులతో వచ్చును. అభిషవకర్తలను కలుసుకొనును.

(త్రిగుణిత సప్తసప్తతి అనగా త్రిఃసప్తేతి 70 x 3 = 210. సప్తతీనాం త్రిసప్త 70 x 21 =1470 అని శాయణుడు. 77 x 77 x 77 4,65, 533 కూడ కావచ్చును.)

27.పృథుశ్రవుడు నాకు ఈ గోవులు, అశ్వములు ఇవ్వదలచి ప్రసన్నుడై కర్మాధ్యక్షలగు "అరటుడు" "అక్షుడు" "నహుషుడు" "సుకృత్వుడు" అను వారికి ఆజ్ఞాపించినాడు.

28. వాయువా! "ఉచథ్య" "వపు" నామక రాజులు సహితము అధిక సామాజ్యవంతులు. వారు ఘృతము వంటి ఆరువది వేల ప్రియములను గోవులు కూడ నాకు లభించినవి.

30. ఆవులు తమ మందలోనికి పోయినట్లు - పృథుశ్రవుడునాకు దానము చేసిన ఎద్దులు నావద్దకు వచ్చును.

31. ఒంటెలను మేపుటకు ఆడవికి పంపునప్పుడు వంద ఒంటెలను నా కొరకు తెచ్చినాడు. శ్వేతవర్ణ గోవులమధ్య ఇరువది వందల గోవులను తెచ్చినాడు.

32. నేను విప్రుడను నేను గోవుల, అశ్వములరక్షకుడను. 'ఒల్బాథ' నామక దుస్యువలన నాకు వందగోవులు, అశ్వములు లభించినవి వాయువా ! వీరందరు నీ వారే. వీనిని ఇంద్రుడు, ఇతర దేవతలు రక్షింతురు. అవి అనిందితములగును.

33. ఇప్పుడు పృథుశ్రవరాజు దానము చేసిన స్వర్ణా భరణ భూషితలు, పూజనీయలగు కన్యలు 'ఆశ్వ' పుత్రుడగు 'వశుని' ముందుకు తెచ్చుచున్నారు.

### నలుబది ఏడవ సూక్తము

ఋషి - ఆస్త్య త్రితుడు, దేవత - ఆదిత్యుడు - ఉష, ఛందస్సు - పంక్తి.

1. మిత్రావరుణులారా ! మీకు హవి సమర్పించు యజమానులకు మీరు కలిగించు రక్షణ అమోఘము. మీరు శత్రువునుండి రక్షించిన యజమానిని పాపములు అంటజాలవు. ఉపద్రవములు చేరవు మీ రక్షణ శోభాయమానము.

2. ఆదిత్యులారా! మీరు దుఃఖనివారణము ఎరుగుదురు. పక్షులు తమ పిల్లను రెక్కల కింద దాచిన రీతి మాకు సుఖములు కల్పించండి. "అనేహసోవుతయఃసు ఉతయో ఊతయః" "మీ రక్షణలు ఉపద్రరహితములు. మీ రక్షణలు శోభాయమానములు"

3. ఆదిత్యులారా! మీ వద్ద ఉన్న సుఖములు పక్షుల రెక్కల వంటివి. వానిని మాకు ప్రసాదించండి. గృహమునకు ఉపయుక్తములగు సమస్త ధనములను అర్థించుచున్నాము. "అనేహసోవ ఉతయః సుఊతయో ఊతయః"

4. మంచి మనసులుగల ఆదిత్యగణములు - ఎవనికి గృహమునకు, జీవనమునాకు పనికి వచ్చు ధనము ఇచ్చెదరో - అట్టివానికి వారు సకల మానవధనములకు స్వాములు అగుదురు. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

5. రథమును లాగు అశ్వములు దుర్గమ మార్గమును త్యజించును. అట్లే పాపములను పరిత్యజింతుము. మాకు ఇంద్రుని సుఖము, ఆదిత్యుల రక్షణ లభించవలెను. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

6. కష్టపడినవానికే మీధనము లభించును. దేవతలారా ! మీ గమనము వేగవంతము. మీరు అనుగ్రహించిన యజమానికి అధిక ధనము లభించును. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

7. ఆదిత్యులారా ! మీరు మరిన్ని సుఖములు కలుగ చేసినవారు - కుటిలుడయ్యు క్రోధమున నిర్విఘ్నుడగును. అతనిని అపరిహార్య దుఃఖముసహితము చేరదు. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

8. ఆదిత్యులారా ! యోధులు కవచమును ఆశ్రయించినట్లు మేము నిన్ను ఆశ్రయించుచున్నాము. మమ్ము మహా అనిష్టములనుండియు. అల్ప అనిష్టములనుండియు రక్షించండి. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

9. అదితి మమ్ము రక్షించవలెను. అదితి మాకు సుఖములు ప్రదానము చేయవలెను. ఆమె ధనవతి - మిత్ర, వరుణ, ఆర్యమలతల్లి. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

10. ఆదిత్యులారా ! మీరు మాకు శరణ్యము, అనుభవయోగ్యము, రోగశరాన్యము, త్రిగుణయుక్తము, గృహయోగ్యమగు సుఖములను ప్రసాదించండి. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

11. మనిషి పైన ఉండి పదార్థమును చూచును. అట్లె పైన ఉన్నమీరు క్రింద ఉన్న మమ్ము చూడండి. గుఱ్ఱమును మంచి రేవునకు తీసికొని వెళ్లినట్లు మమ్ము సన్మార్గములనడిపించండి. "అనేహసోవ ఊతయః సుఊతయో

ఊతయః"

12. ఆదిత్యులారా ! బలవంతులై మమ్ము హింసించువానికి సుఖము కలుగరాదు. గోవులు, అశ్వములు అన్నభిలాషియైన బలవంతునకు సుఖములు కలుగవలెను. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

13. ఆదిత్య దేవుళ్లారా! బయట పడిన పాపము, దాగిన పాపము ఆరోంటిలో ఏదియు "ఆప్త్యత్రితుడ, నమనాకు తగులురాదు పాపములను దూరముగా ఉంచండి. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

14. స్వర్గపుత్రి ఉషా! ఆప్యత్రితుని ఆవులకు కలుగు పీడను, అతని దుస్స్వప్నమ్మునలను దూరము చేయుము. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

15. స్వరపుత్రి ఉషా! స్వర్ణ కారుడు ఆభరణము చేయునప్పుడు లేదా మాలకారుడు మాల అల్లునప్పుడు వచ్చునటువంటి పీడకలను ఆప్యత్రివి నుండి దూరము చేయుము. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

**లేక**

*"త్రితునకు వచ్చిన పీడకలను స్వర్ణ కారునకు, మాలాకారునకు మరల్చుము, కావచ్చును."*

(ఈ పీడకల - దుస్స్వప్నమును - గురించి వివరము లేదు బహుశః స్వర్గకారుడు మాలా కారులమీద వానిని రక్షించవలసిన బాధ్యత ఉండగా అవి దొంగిలించ బడినట్లు కలరావచ్చును.)

16. స్వప్నమునందు మధుపాయసాది అన్నము లభించినప్పుడు ఆస్త్యత్రితుని దుస్సప్న పీడనుదూరము చేయుము. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

17. యజ్ఞమునందు దానమిచ్చు పశువునకు గుండె, గిట్టలు, కొమ్ములు క్రమముగా తొలగించినట్లు - అప్పు దశలవారిగా తీర్చినట్లు - ఆస్త్యత్రితుని దుస్వప్నములను క్రమముగా తొలగింతుము. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

18. నేడు మేము జయింతుము. నేడు మేము సుఖింతుము. నేడు మేము పాపరహితుల మగుదుము. ఉషాదేవీ! మేము పీడకలతో భయపడినాము. ఆభయమును తొలగించుము. "అనేహసోవ ఊతయః సుఊతయో ఊతయః"

(కలకు కార్యముతో నిమిత్తములేదు కాని మనసుతో నిమిత్తమున్నది. కల దాడిపంచగలదు దడపుట్టించ గలదు. ముదము కలిగించగలదు మురిపింపగలదు. కలలందు సహితము చెడు కలుగరాదను సత్యకల్పము !

సదాశయము!!)

## నలుబది ఎనిమిదవ సూక్తము

ఋషి - ఆస్త్య త్రితుడు దేవత - ఆదిత్యుడు - ఉష ఛందస్సు - పంక్తి

1. నేను ప్రాజ్ఞుడను. అధ్యయన యుక్తడను కర్మ యుక్తుడను అత్యంత పూజితుడను. నేను స్వాదు అన్నమును ఆస్వాదించ కలుగ వలెను. విశ్వదేవతలు, మానవులు ఈ అన్నమును మనోహరము అనుకొందురు దానిని అందు కొందురు.

2. సోమమా ! నీవు హృదయ మధ్యమము నుండి పయనింతువు. నీవు అధీనుడవు. దేవతల కోపమును వేరుచేయ గలవాడవు. నీవు ఇంద్రుని స్నేహము చేయుము. ఇచ్చటకి ఏతెంచి - గుఱ్ఱము బరువు మోసినట్లు - మా ధనము మోయుము.

3. అమరసోమమా ! మేము నిన్ను ఆస్వాదింతుము. అమరులమగుదుము. తదుపరి ద్యుతిమంత స్వర్గము చేరుదుము. దేవతలను కనుగొందుము. అప్పుడూ మేము మానవులమే. అయినను మమ్ము శత్రువు ఏమిచేయగలడు? హింసకుడు ఏమి చేయగలడు?

(దేవతల జ్ఞానము కలిగినంత మానవుడయ్యు శత్రువులకు, హింసకులకు అతీతుడగును అని)

4. సోమమా! తండ్రి, కొడుకు సుఖములకే అగును. అట్లే. నిన్ను సేవించినంత - నీవు మాసుఖములకే నిలుపుము. అనేకుల బ్రతుకులందు ఆయువు పెంచుము.

5. సోమమా! నిన్ను స్వీకరించినంత కీర్తి కలుగును. రక్షణ ఇచ్చుట పెరుగును. నీవు నా అవయవములన్నింటిని - పశువును కొయ్యకువలె - కర్మకు కట్టు కట్టుము. నన్ను చరిత్రహీనుని చేయకుము. వ్యాదులను దూరము ఉంచుము.

6. సోమమా ! నిన్ను సేవించినంత - రగిలిన అగ్గివలె - నన్ను వెలిగించుము. నన్ను నీ వానిగా చూచు కొనుము. నన్ను మరింత ధనవంతుని చేయుము. నేను నీకు ఆనందముకలిగించా దలచినాను. స్తతించు చున్నాను. నీవు ధనికుడవు బలశాలివి అగుము.

7. కోరికల కోర్కెలతో - తండ్రి సొమ్ము వంటి - అభిషుత సోమమును సేవింతుము. సోమమా ! మా ఆయువు - సూర్యుడు దినములను పెంచినట్లు - పెంచుము.

8. రాజా ! సోమమా ! మమ్ము అవినాశ్యులను చేయుము. సుఖవంతులను చేయుము. మేము వ్రతధారులము. నీ

వారలము. మమ్ము తెలిసికొనుము. మా శత్రువు వర్ధిల్లు చున్నాడు. కోపము పెరుగుచున్నది. ఆరెండింటిని దండించుము. మమ్ము ఉద్ధరింపుము.

9. సోమమా! నీవు మా దేహమును రక్షింతువు. నీవు కర్మనేతల ద్రష్టవు. కావుననే నీవు అన్ని అవయవములందు వ్యాపింతువు. మేము నీ పనులకు ఆటంకము కలిగింతుము. ఆయనను నీవు అన్నవంతుడవు, ఉత్తమ మిత్రుడవై సుఖపెట్టుము.

10. సోమమా ! ఉదరమున బాధ కలిగించకుము. నీవు మిత్రుడవు. నీతో కలసి మసిలెదము. నిన్ను సేవించినంత నన్ను బాధించకుము. హర్యశ్వ ఇంద్రా ! ఈ సోమము నాలో చేరినది. అది చిరకాలము నా జఠరమున ఉండవలెనని ప్రార్థింతును.

11. బాధలు బలవంతములగును. మమ్ము బాధించును. ఏడిపించును. అసాధ్యములు, అనివార్యములగు బాధలు దూరము కావలెను. సోమము. మా వద్ద చేరినది దానిని సేవించినంత ఆయువు పెరుగును. మేము మానవులము. సోమము వద్దకు చేరుదుము.

12. పితరులారా ! సేవించినంత సోమము అమరమైనది. మర్త్యులమగు మా హృదయములందు నిలిచినది. హవ్యములిచ్చి ఆసోమముతోనే మిమ్ము సేవింతుము. ఈ సోమపు సుబుద్ధియు, కృపయు మాపై ఉండవలెను.

13. సోమమా ! నీవు పితరులతో కలసి ద్యావా పృథ్వులను విస్తరింపు చేస్తావు. హవితో నిన్ను సేవిస్తాము. మేము ద్యుపతులమ్ అవుతాము.

14. త్రీతలగు దేవతలారా ! మాతో తీయగా మాట్లాడండి స్వప్నములు మమ్ము వశపరచు కొనరాదు. నిందకులు మమ్ము నిందించకుండ వలెను. మేము సదాసోమప్రియులము కావలెను. అందువలన సుందర స్తోత్రవంతులమై స్తోత్రము ఉచ్చరించగలము.

15. సోమా ! నీవు మాకు నలుదిశల అన్నదాతవు. స్వర్గప్రదాతవు. సర్వదర్శివి, మాలో ప్రవేశించుము. ప్రసన్నుడవగుము. రక్షణల సహితుడవై మమ్ము వెనుకనుంచియు ముందునించియు రక్షింపుము.

*(ఆంధ్ర వచన ఋగ్వేద సంహిత ఆరవ అష్టకము ఎనిమిదవ మండలమున ఆరవ అనువాకము సమాప్తము)*

**ఏడవ అనువాకము నలుబది తొమ్మిదవ సూక్తము**

ఋషి - ప్రగాథపుడు భర్గుడు, దేవత - అగ్ని, ఛందస్సు - జగతి.

1. అగ్నీ ! నీవు అన్య అగ్నుల సహితముగా విచ్చేయుము. మేము నిన్ను హోతగా ఎరుగుదుము. వరింతుము. నీవు నియతుండవు. హవివంతుడవు. యజనీయుడవు. శ్రేష్ఠుడవు. నిన్ను అధ్వరలు కుశలపై ఆసీనుని చేయుదురు - అలంకరించెదరు.

2. హలపుత్ర, అంగిరులలో అన్యతను అగ్నీ! యజ్ఞమున ప్రాప్తికొరకు స్రుక్కుసాగును. అగ్నీ ! నీవు అన్నరక్షకుడవు. ప్రదీప్తజ్వాలవంతుడవు. ప్రాచీనుడవు. యజ్ఞమందు నిన్ను మేము స్తుతింతుము.

3. అగ్నీ ! నీవు విద్వాంసుడవు. ఫలదాతవు. పానకుడవు. హోతవు. హోమ సంపాదకుడవు. దీప్తుడవు. ఆమోదనీయుడవు, సర్వోచ్చ యజనీయుడవు. యజ్ఞమున విప్రుల మనమంత్రములతో నిన్ను స్తుతింతురు.

4. యువతమ, నిత్య అగ్నీ! నేను ద్రోహశూన్యుడను. దేవతలవాడను. హవిభక్షణకు దేవతలను తీసికొని రమ్ము. వాసదాత అగ్నీ! అందముగా అమర్చిన అన్నము వద్దకు రమ్ము. స్తుతులతో పూజింతుడవగుము. ప్రసన్నుడవగుము.

5. అగ్నీ! నీవు రక్షకుడవు. సత్యస్వరూపుడవు. కవివి సర్వత్ర వ్యాపించిన వాడవు. సమిధులవాడవు. దీప్తుడవు. విప్రస్తోతలు నిన్ను భజిస్తారు.

6. అతి పవిత్ర అగ్నీ ! దీప్తుడవగుము ప్రదీప్తము చేయుము. నీవు మహామహుడవు. ప్రజలకు, స్తోతలకు సుఖములు ప్రదానము చేయుము. వారు - శత్రు విజేత, సుందర అగ్ని యుక్తులు కావలెను.

7. అగ్నీ ! నేలమీది ఎండు కట్టెను కాల్చినట్టు - మాకు ద్రోహము తలపెట్టు వానిని, మా విషయమున దుర్బుద్ధిగలవారిని దహించుము.

8. అగ్నీ! మమ్ము బలవంతులగు హింసకులకు అప్పగించకుము. మాకు అరిష్టము కోరువారికి వప్పగించకుము. అహింసక. ఉద్ధారక, సుఖ కర రక్షణలతో మమ్ము కాపాడుము.

9. అగ్నీ ! మమ్ము ఒక్క ఋక్కులతో రక్షింపుము. నాలుగు వాక్యములతో రక్షింపుము ఎట్లయినను రక్షింపుము.

10. సకల రాక్షసులనుండి, దాతలు కానివారినుండి రక్షింపుము. యుద్ధమున మమ్ము రక్షింపుము. నీకు మాకు దగ్గరివాడవు. బంధువవు. యజ్ఞము, సమృద్ధికొరకు నిన్ను ప్రార్థింతుము.

11. అగ్నీ ! నీవు శోధకుడవు. సమీపవర్తిని. ధనదాతవు. మాకు అన్న వర్ధకము, ప్రశంసనీయమగు ధనమును అందించుము. నీతిగలదియు, అనేకులు తలచునదియు, అత్యంత కీర్తికరమగు ధనమును ప్రసాదించుము.

12. క్షిప్రకారిశత్రువును, వారి శాస్త్రపాతములనుండి రక్షించినట్టియును, వారిని వధించగలట్టియు ధనమును మాకు ప్రసాదించుము. నీవు ప్రజ్ఞద్వారా కర్మధనికుడవు. మమ్ము అన్నముతో వర్ధిల్లచేయుము. మమ్ము ధనమునిచ్చు కర్మలతో సుసంపన్నము చేయుము.

13. వృషభసమమగు తన శృంగము - జ్వాలతో - వర్ధిల్లి అగ్ని శిరః కంపనము చేయుచున్నాడు. అగ్ని జ్వాలలు తీక్షతమములు. వానిని ఎంతటివాడును ఆర్పజాలడు. అగ్ని దంతములు వాడియైనవి. అవి బలపుత్రులు.

14. వర్షదాత అగ్నీ! నీవు వర్ధిల్లువాడవు. నీదంతములు - జ్వాలలు - ఆర్పరానివి. నీవు హోతవు. మ హవిని చక్కగా వహించుము. మాకు వరణీయమగు విశేషధనము ప్రసాదించుము.

15. అగ్నీ ! అడవి నీకు తల్లివంటిది. నీవు అరణిద్వయమున వసింతువు. మానవులు నిన్ను వర్ధిల్ల చేయుదురు. నీవు ఆలస్యముచేయక హవ్యదాతహవిని దేవతలకు చేర్చుము. తదనంతరము దేవతల శోభలు అందుకొనుము.

16. అగ్నీ! నిన్ను సప్తహోతులు స్తుతింతురు. నీవు అభిలాష ప్రదుడవు. ప్రవృద్దుడవు. తాపక తేజమున మేఘమును త్రుంచెదవు. అగ్నీ ! మమ్ము అతిక్రమించి విచ్చేయుము.

17. స్తోతలారా ! మీ కొరకే మేము అగ్నిని ఆహ్వానిస్తున్నాము. మేము కుశలను తెంపినాము. హవినిసిద్ధము చేసినాము. అగ్ని కర్మధారకమగు అనేక లోకములందున్నవాడు. సమస్త యజమానులకు హోత.

18. అగ్నీ ! ఉత్తమ సామమున, సుఖవంతమగు యజ్ఞపు యజమాని - ప్రాజ్ఞులగు మానవులతో కూడి - నిన్ను స్తుతించును. అగ్నీ ! మమ్ము రక్షించుటకుగాను - స్వచ్ఛందముగా - దగ్గర ఉండునదియు, నానా రూపధారియగు దినమును తీసికొనిరమ్ము.

19. అగ్నీ! నీవు దేవతవు. స్తుత్యుడవు నీవు ప్రజల పాలకుడవు. రాక్షసుల సంతాపకుడవు. యజమాని గృహమున నిరంతరము నివసించువాడవు. రక్షకుడవు. నీవు యజమాని ఇంటిని వీడవు. నీవు మహామహుడవు. ద్యులోక పాలకుడవు.

20. దీప్తవంత అగ్నీ ! మాలోనికి రాక్షసులు ప్రవేశించరాదు. బాధకులు ప్రవేశించరాదు. దారిద్ర్యము, హింస, బలశాలి రాక్షసులను దూరమున ఉంచుము.

## ఏబదవ సూక్తము

ఋషి - ప్రాగాధ భర్గడు, దేవత - ఇంద్రుడు, చంధస్సు - బృహతి.

1. ఇంద్రా ! మా స్తోత్రరూపమును శాస్త్రాత్మక వాక్యమును వినుము. మా సహగామి కర్మయుక్తుడవై, సోమపానమునకు విచ్చేయుము.

2. ద్యావాపృథ్వులు - విరాజమానుడునగు, వృష, దాతయగు ఇంద్రుని సంస్కరించినవి. ఆ ఇంద్రుని బలమును సంస్కరించినవి. అందువలన ఇంద్రదేవా! ఉపమాన భూతులగు దేవతలలో ముఖ్యుడవై వేదిక మీద ఆసీనుడవగుము. "సోమకామంహితేమనః" నీమనసు సోమాభిలాషియగును కదా!

3. ఇంద్రా! నీవు విశేష ధనవంతుడవు. హవ్యవంతుడవు. శత్రుంజయుడవు అణచబడలేనివాడవు. ఇతరులను అణచగలవాడవు. అట్లని మాకు తెలియును. ఇంద్రా! నీ ఉదరమును అభిషుత సోమముతో తడుపుము.

4. ఇంద్రా ! నీవు ధనికుడవు కిరీటివి, వజ్రధరుడవు, అహింస నీ స్వభావమగును. మేము కర్మమొనరించి ఫలితము కోరువారలము కావలెను. నీవు ఆ ప్రకారము చేయుము. నీ రక్షణలందే మేము అన్నము పొందుదుము. శత్రువులను జయింతుము.

5. యజ్ఞపతి ఇంద్రా ! సకల రక్షణల యుక్తముగా మాకు అభిషుత ఫలప్రదానము చేయుము. నీవు శూరుడవు యశస్వివి యజ్ఞప్రాపకుడవు. భాగ్యమును సేవించినట్లు మేము నిన్ను సేవిస్తాము.

6. ఇంద్రా ! నీవు అశ్వపోషకుడవు. గోవుల సంఖ్యను పెంచువాడవు. స్వర్ణ శారీరివి. నిర్ఝరస్వరూపుడవు. నీవు మాకు ఇవ్వదలచిన దానిని ఎవడును హింసించజాలడు. అందువలన నేను యచించినది తెచ్చి ఇమ్ము. "యద్యద్యామితదాభర"

7. ఇంద్రా! రారమ్ము -ధనము దానము చేయుటకుగాను - నీ సేవకునకు అనుభవించదగిన ధనమునిమ్ము. నేను గోవులను కోరుదును. గోవులనిమ్ము అశ్వములను కోరుదును. అశ్వములిమ్ము.

8. ఇంద్రా ! నీవు దాతయగు యజమానికి అనేక వందల, అనేక వేల గోవులు ఇచ్చెదవు. మేము పురభేదివగు నిన్ను రక్షణ కోరినాము. వివిధవచములతో స్తుతించినాము. నీవు మా వద్దకు విచ్చేయుము.

9. ఇంద్రా ! నీవు శతక్రతువవు.యుద్ధమందు గర్వివి. నిన్ను స్తుతించువాడు బుద్ధిమంతుడైనను, బుద్ధిహీనుడైనను - నీ కృపవలన - ఆనందించగలడు.

10. ఉగ్రబాహువు, వధించువాడు, పురభేదకుడగు ఇంద్రుడు మా ఆహ్వానమును విన్నచో ధనాభిలాషగల మేము - ధనపతి, బహుకర్మ ఇంద్రుని - స్తుతులు చదివి - పిలుస్తాము.

11. మేము పాపులము - ఇంద్రుని గుర్తించము. మేము ధనశూన్యులము, అగ్ని రహితులము- ఇంద్రుని గుర్తించము. మేము సోమాభిషవమయనంత చేసికొందుము.

(ఇంద్రుని మిత్రుని చేసికున్నందున మేము పాపులము, ధనశూన్యులము, అగ్నిరహితులము కాము అని భావము.)

12. మేము - ఉగ్రుడు, యుద్ధవిజేత - ఇంద్రుని తోటివారమగుదుము. ఇంద్రుని స్తుతించుట రుణమువంటిది - అవశ్యము ఫలమునిచ్చునది. అహింసనీయ, రథపతి ఇంద్రుడు అశ్వములందు వేగవంతమగు అశ్వమును గుర్తించగలడు అతడుదాత. అనేకమంది యజమానులందు మాకు లభించినాడు.

13. మఘవా ! నీవు సమర్థుడవు. మాకు హింసకుల నుండి భయము కలిగినది. మమ్ము భయ రహితులను చేయుము. మాకు అభయ ప్రదానము చేయుటకుగాను - రక్షకులగు పురుషునితో - శత్రువులను, హింసకులను నష్టపరచుము.

14. ఇంద్రా ! నీవు ధనస్వామివి, సేవకుని గృహము వర్ధిల్లచేయువాడవు, మఘవుడవు స్తుతి పాత్రుడవని మేము ఎరుగుదుము. సోమాభిషవము చేసి నిన్ను పిలుచుచున్నాము.

15. ఈ ఇంద్రుడు సర్వము తెలిసినవాడు. వృత్రహంత. పాలకుడు వరణేయుడు. అతడు మా పుత్రుని రక్షించవలెను. కనిష్ఠపుత్రుని రక్షించవలెను. మధ్యమ పుత్రుని రక్షించవలెను. అతడు మమ్ము - వెనుక, ముందు - రెండుదిక్కులందు రక్షించవలెను.

16. ఇంద్రా! నీవు మమ్ము- క్రింద, మీద, ముందు, వెనుక - నాలుగు వైపుల రక్షించుము. మానుంచి దైవ, అసుర, ఆయుధ భయము దూరము చేయుము.

17. ఇంద్రా ! నేడు రేపు, ఎల్లుండి మమ్ము రక్షింపుము మేము నీ స్తోతలము రోజంతయు మమ్ము రక్షింపుము.

18. ధనిక, అధిక ధనిక ఇంద్రుడు పౌరుషమునకు అందరితో కలియును. శతక్రతు ఇంద్రా! అభిలాషప్రదములగు నీ ఉభయ భుజములు వజ్రము ధరించవలెను.

### ఏబది ఒకటవ సూక్తము

ఋషి - కాణ్వ ప్రాగధుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు -
పంచపాజ పంక్తి - 7,8,9 బృహతి.

1.ఋత్విక్కులారా ! ఇంద్రుడు భరించువాడు కావున ఇంద్రుని స్తుతించండి. జనులు - సోమప్రియ ఇంద్రుని విశేషమును ఉక్థమంత్రములతో వర్థిల్లచేయుదురు. "భద్రాఇంద్రస్య రాతయః" ఇంద్రుని దానములు కళ్యాణవహములు.

2. సహాయము అక్కరలేని, అనుపమాన దేవతలలో ముఖ్యుడు ఇంద్రుడు. అతడు అవినాశ్యుడు. పురాతనప్రజను అతిక్రమించిసాగును "భద్రాఇంద్రస్య రాతయః"

3. వెంటనే వరము అచ్చు ఇంద్రుడు - ప్రేరణలేకనే పయనించు - గుఱ్ఱపుస్వారి చేయగోరును. ఇంద్రా ! నీవు సమర్థుడవగు దాతవు. నీ మహత్యము స్తుతించ దగినది "భద్రాఇంద్రస్య రాతయః"

4. ఇంద్రా! రమ్ము నిన్ను - ఉత్సాహవర్ధకము, ఉత్కృష్టమగు స్తుతితోస్తుతింతుము. ఈ స్తుతినివినుము. అన్నమును కోరుస్తోతకు శుభములు కలిగించుము. "భద్రాఇంద్రస్య రాతయః"

5. ఇంద్రా ! నీ మనసు అత్యంతనిర్మలము. యజమానులు కొందరు నీకు సోమము సమర్పింతురు. కొందరు నమస్కరించి పూజింతురు. అట్టివారికి నీవు అపార ఫలములు అందింతువు. "భద్రాఇంద్రస్య రాతయః"

6. ఇంద్రా ! స్తుతులలో పరివేష్టతుడవైన నీవు - మానవుడు కూపము చూచినట్లు - మమ్ము చూచి సంతసించుము. ఇంద్రుడు ప్రసన్నుడై సోమవంతుడగు యజమానికి యోగ్యుడగు బంధువగును "భద్రాఇంద్రస్య రాతయః"

7. ఇంద్రా ! నీ పౌరుషము, ప్రజ్ఞవెంటపడిన దేవగణములు పౌరుషము, ప్రజ్ఞకలవారలగుదురు. అనేకులు స్తుతించు ఇంద్రుడు ప్రసిద్ధములగు గోవులకు స్వామి. "భద్రాఇంద్రస్య రాతయః"

8. ఇంద్రా ! నీ నిరుపమానబలమును యజ్ఞమునందు స్తుతింతును. యజ్ఞపతీ ! నీ బలమున వృత్రుని వధించినావు. "భద్రాఇంద్రస్య రాతయః"

9. ప్రేమగల యువతి రూపాభిలాషి పురుషుని వశపరచు కొనును. అట్లే ఇంద్రుడు మానవులను వశపరచు కొనును. మానవులకు సంవత్సరము మున్నగు కాలపరిమాణమును ఇంద్రుడే తెలియపరచును "భద్రాఇంద్రస్య రాతయః"

10. ఇంద్రా ! యజమానులకు నీవు అనేక పశువులను ఇచ్చినావు. వారు వాటివలన సుఖములు అనుభవించినారు. వారు నీ విశేషబలమును వర్థిల్లచేయుదురు. నిన్ను వర్థిల్లచేయుదురు నీ ప్రజ్ఞను వర్థిల్ల చేయుదురు. "భద్రాఇంద్రస్య రాతయః"

11. ఇంద్రా ! ధనము లభించునంతవరకు మనము కలసి ఉందుము. వృత్రఘ్న, వజ్ర, శూర ఇంద్రా! దాతకాని వాడు సహితము నీ దానమును ప్రశంసించును. "భద్రాఇంద్రస్య రాతయః"

12. మేము నిశ్చయముగా ఇంద్రుని సత్యస్తుతి చేయుదుము. అసత్యస్తుతి చేయము. ఇంద్రుడు పెద్దసంఖ్యలో యజ్ఞవిరోధులను హతమార్చును. అతడు అభిషవించు వారికి మహాజ్యోతిని ప్రసాదించును. "భద్రాఇంద్రస్య రాతయః"

## ఏబది రెండవ సూక్తము

ఋషి - కాణ్వ ప్రాగధుడు దేవత - ఇంద్రుడు ఛందస్సు - వివిధము

1. ఇంద్రుడు ముఖ్యుడు అతడు పూజనీయుల కర్మములను వాంఛించును. దేవతల మధ్యమనువు - ఇంద్రుని పొందు మార్గమును - కనుగొన్నాడు.

2. సోమాభిషమున నిమగ్నములైన శిలలు స్వర్గనిర్మాత ఇంద్రుని విడువవు. ఇంద్రునాకు ఉక్థలు, స్తోత్రములు ఉచ్చరించవలెను.

3. విద్వాంసుడగు ఇంద్రుడు అంగిరులకు గోవులను వెలువరించినాడు. ఇంద్రుని ఆ వీరకృత్యమును స్తుతిస్తాను.

4. మునుపటివలె ఇంద్రుడు ఇప్పుడు కూడ కవులను వర్ధిల్లచేయును. అతడు హోతకు కార్యనిర్వాహకుడు. మేము పూజినీయమగు సోమమును హవనము చేయుదుము. అప్పుడు ఇంద్రుడు మా రక్షణకు రావలెను.

5. ఇంద్రా ! స్వాహాదేవిపతి అగ్నికొరకు యజ్ఞకర్తలు ఇంద్రుని గుణకీర్తనము చేయుదురు. త్వరగా ధనములభించుటకుగాను స్తోతలు ఇంద్రుని యజింతురు.

6. సకల వీరకృత్యములు, సకల కర్తవ్య కర్మలు ఇంద్రునిలో ఉన్నవి. స్తోతలు ఇంద్రుని అధ్వరుడు - ఆహింసకుడు - అందురు.

7. పంచజనులు ఇంద్రుని స్తుతించినప్పుడు - ఇంద్రుడు తన మహిమతో శత్రువులను వధించును. ఇంద్రుడు స్తోతయొక్క పూజకు నివాసస్థానమగును.

8. ఇంద్రా ! నీవు సకల పౌరుష కార్యములను నిర్వర్తించినావు. అందువలనే నీవు స్తుతించబడుచున్నావు. రథచక్రమార్గమును రక్షింపుము. "పావశ్చక్రస్య వర్తనిమ్"

9. వర్షక ఇంద్రుడు అందించు నానావిధ అన్నములు అందుకున్న జనులు నానావిధ కర్మలు చేయుదురు. పశువులవలె జనులు యదలు కొందురు.

10. మేముస్తోతలము రక్షణాభిలాషులము ఋత్విక్కులారా! మీతో పాటు మేము మరుద్యుక్త ఇంద్రుని వర్ధిల్లచేయుటకు అన్నస్వాములము అగుదుము.

11. ఇంద్రా ! నీవు యజ్ఞసమయమున ఆవిర్భవించినావు. నీవు తేజస్వివి. శూర ఇంద్రా! మంత్రములతో నిన్ను నిశ్చయముగ స్తుతింతుము.

12. ఇంద్రుడు భయంకర మేఘమును పట్టువాడు. వర్షము కలిగించువాడు. యుద్ధములకు పిలిచినంత ఆనందించువాడు. వృత్రుని వధించినవాడు, స్తోత్ర, శస్త్రపాఠకుల వద్దకు ఇంద్రుడు వేగముగా వచ్చును. దేవజ్యేష్ఠుడగు ఇంద్రుడు మమ్ము రక్షించవలెను.

## ఏబది మూడవ సూక్తము

ఋషి - ప్రాగధుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు -గాయత్రి.

1. ఇంద్రా! స్తుతులు నిన్ను ఉన్నత్తుని చేయవలెను. వజ్రి ఇంద్రా! ధనము ప్రదానము చేయుము. స్తుతి విద్వేషులను నాశనము చేయుము.

2. లోభిని, యజ్ఞశూన్యుని, ధనదానశూన్యుల పాదముల క్రింద నలిపివేయుము. నీవు మహామహుడవు నీకు ఎదురులేదు.

3. నీవు అభిషుత సోమమునకు ఈశ్వరుడవు. అనభిషుత సోమమునకు ఈశ్వరుడవు జనుల రాజువు.

4. ఇంద్రా ! విచ్చేయుము. స్వర్గమునుంచి విచ్చేయుము. మానవుల యజ్ఞగృహమును ధ్వనులతో నింపుచు విచ్చేయుము. నీవు వర్షముతో ద్యావాపృథ్వులను పరిపూర్ణము చేయుదువు.

5. నీవు స్తోతల కొరకుగాను పర్వతములు, వంద విధముల జలముల అపారమేఘములను విజీర్ణము చేసినావు.

6. సోమము అభిషుతమైనంత రాత్రింబవళ్లు నిన్నే ఆహ్వానిస్తాము. "అస్మాకం కామమాపృణ" మా కోరికలు తీర్చుము.

7. ఇంద్రుడు వర్షదాత నిత్యతరుణుడు. విశాలస్కందుడు, ఎంతటివానికిని లొంగని ఇంద్రుడు ఎక్కడ ఉన్నాడు? అతని స్తుతించగలవాడెవ్వడు?

8. వృష్టికర ఇంద్రుడు ప్రసన్నుడైవచ్చును. ఏ యజమానికి ఇంద్రుని స్తుతించుట తెలియును?

9. వృత్రఘ్న ఇంద్రా ! యజమాని ఇచ్చిన దానము నిన్నుసేవించును. శస్త్ర -మంత్ర ఉచ్చారణ సమయమున సుందరములు, వీర్యవంతములగు స్తుతులు నిన్ను సేవించును. నీవు ఎట్లున్నావు? యుద్ధమున నిన్ను దరిచేరగలవాడేడి?

10. మానవుల మధ్య ఉన్న నేను నీ కోరకు సోమాభిషవము చేయుదును. సోమము వద్దకు రమ్ము. త్వరగారమ్ము. పానము చేయుము.

11. ఇది ప్రియమగు సొమము. ఇదినిన్ను తృణవంత పుష్కర క్షేత్రమునను, 'సుషోమ' 'ఆర్ధీ' నదీ తీరములందును మరింత ఉన్మత్తుని చేయును.

12. మాధము, మరియు శత్రునాశ బలముకుగాను నేడునీవు ఆ మనోహర సోమమును సేవింపుము. త్వరగా సోమపాత్రవైపు తరలుము.

## ఏబది నాలుగవ సూక్తము

ఋషి - ప్రాగధుడు దేవత - ఇంద్రుడు ఛందస్సు - గాయత్రి

1. ఇంద్రా! జనులు నిన్ను తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణములనుండి పిలుస్తారు. కావున అశ్వసాయమున త్వరగా విచ్చేయుము.

2. నీవు ద్యులోకమున అమృతస్పందన స్థానమున మత్తుడవగుదువు. భూలోకమున మత్తుడవగుదువు. అన్న అపాదానా అంతరిక్షమున మత్తుడవగుదువు.

3. ఇంద్రా ! నీవు మహా మహుడవు. స్వేచ్ఛార్తివి. నిన్ను నేను స్తుతులతో పిలుతును. సోమపానమునకును, భోగానుభవముణకును నిన్ను - ఆవువలె - పిలుస్తాను.

4. రథమునకు కట్టిన అశ్వములు నీ తేజస్సును, మహిమను తేవలెను.

5. ఇంద్రా ! నీవు మహా ఉగ్రుడవు ఐశ్వర్యకర్తవు. నీవు వాక్యములు, స్తుతుల ద్వారా స్తుతించ బడుదువు రమ్ము వచ్చి సోమము సేవించుము.

6. మేము అభిషుత సోమవంతులము, అన్నవంతులము అయినాము. మా కుశల మీద ఆసీనుడవగుటకు ఆహ్వానించుచున్నాము.

7. ఇంద్రా ! నీవు అనేకమంది యజమానులకు సాధారణుడవు అందుకే మేము నిన్ను ఆహ్వానించుచున్నాము.

8. అధ్వర్యులు రాళ్లతో సోమమధువును అభిషుతము చేయుచున్నారు. ప్రసన్నుడవై సేవించుము.

9. ఇంద్రా ! నీవు స్వామివి. సకల స్తోత్రలను దాటిరమ్ము. త్వరగారమ్ము. మాకు మహాఅన్నమును ప్రసాదించుము.

10. ఇంద్రుడు హిరణ్య వర్ధ గోవులకు ప్రభువు. అతడు మాకు ప్రభువు. దేవతలారా ! ఇంద్రుని బాధించకండి.

11. వేలగోవుల మీద ఉన్నదియు, విశాలము, విస్తృతము, ఆహ్లాదకరము, నిర్మలమగు హిరణ్యమును స్వీకరింతును.

12. నాకు రక్షణలేకున్నది. దుఃఖమున ఉన్నాను. నా సంబంధులు ఇంద్రుని అనుగ్రహమున అపార ధనవంతులైనారు. దేవతలు ప్రసన్నులైనంత యశము లభించును. "శ్రవోదేవేష్వక్రత"

### ఏబది అయిదవ సూక్తము

ఋషి - ప్రాగథపుత్రుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు -.
బృహతి, చివరిది అనుష్టుప్

1. ఋత్విక్కులారా! ఇంద్రుడు వేగవంతములగు అశ్వములమీద ధనదానము చేయుటకు వచ్చును. మీరు బాధావిముక్తులై ఆ ఇంద్రుని సోమగానముతో సేవించండి. జనులు హితముకోరువానిని, కుటుంబ పోషకుని ఆహ్వానిస్తారు. అట్లే అభిషుత సోమముగల యజ్ఞమునకు ఇంద్రుని ఆహ్వానిస్తాను.

2. దుర్ధర్ష శత్రువులు సహితము సుందరహనువుల ఇంద్రుని బాధింపజాలరు. స్థిరులగు దేవగణములు సహితము ఇంద్రుని నివారించజాలరు. మానవులు సహితము ఇంద్రుని నివారింపజాలరు. ఇంద్రునకు సోమము వలన కలిగిన ఆనందము కావలెను. అందుకు అతడు ప్రశంసకులు, సోమాభిషవకర్తలకు దానములు చేయును.

3.ఇంద్రుడు పరిచర్యయోగ్యుడు. అశ్వవిద్యాకుశలుడు. అద్భుతడు. హిరణ్మయుడు. ఆశ్చర్యకరుడు. వృత్రఘ్నుడు అతడు గోసమూహములను అడ్డుకున్నవారిని గడగడలాడించును.

4. ఇంద్రుడు - భూమి మీదియు, సంగృహీత ధనమును యజమానికొరకు - పైకి తెచ్చును. అతడు వజ్రధరుడు ఉత్తమ

హనువులు గలవాడు. హరిత వర్ణ అశ్వవంతుడు. ఇంద్రుడు అనుకున్నదానికి కర్మతోసిద్ధి కలిగించును.

5. వీరపురుష ఇంద్రా ! నిన్ను అనేకులు స్తుతింతురు. నీవు పూర్వము వలెనే స్తోతలనుండి స్తుతులు ఆశించినావు. ఇదిగో అవి నీకు సమర్పించుచున్నాము. అది యజ్ఞమైనను, ఉక్థయనను, వాక్యమైనను - దానిని నీకు సమర్పించుచున్నాము.

6. ఇంద్రా ! నీవు బహుస్తుతుడవు. వజ్రధరుడవు. స్వర్గ సంపన్నడవు. సోమపాయివి. సోమాభిషవము కాగా మదయుక్తుడవగుము. నీదే - సోమాభిషవకర్తకు - అందరినిమించి ధనము ఇచ్చువాడవు.

7. మేము నేడు, రేపు ఇంద్రుని సోమమున ప్రసన్నుని చేయుదుము. ఇంద్రుని కొరకే ఈ యుద్ధమునకు అభిషుత సోమము తేవలెను, స్తోత్రములు విన్నంత ఇంద్రుడు రావలెను.

8. దొంగ అందరిని అడ్డగించువాడు - బాటసారులను నాశనము చేయువాడు కావచ్చును. ఆయనను ఇంద్రుని కార్యమునకు విఘ్నము కలిగించజాలడు. ఇంద్రా! నీవు ప్రసన్నుడవై రమ్ము. విచిత్ర కర్మబలమున. విశేషరూపమున విచ్చేయుము.

9. ఇంద్రుడు చేయని వీరకృత్యమేది? వినబడని ఇంద్రుని పౌరుషమేది? ఇంద్రుడు చేసిన వృత్రవధ అతని చిన్ననాటి నుండియే వినిపించుచున్నది.

10. ఇంద్రుని బహుబలమునకు ఎదురు ఏది? ఇంద్రుడు వృత్రఘ్నుడని తెలియని దెవ్వనికి? ఇంద్రుడు వధించదలచగా బ్రతికినవాడెవ్వడు? వడ్డీలుగుంజువారిని, పరలోకరహితులను, వర్తకులను ఇంద్రుడు శిక్షంచి అణచి ఉంచును.

11. ఇంద్రుడు వజ్రధరుడు - వృత్రఘ్నుడు. బహుస్తుత్యుడు ఇంద్రుడు ఇచ్చిన భృతికి సమముగా మేము అతనికి అభినవ స్తుతులు సమర్పించుచున్నాము.

12. బహుకర్మ ఇంద్రా ! నీలోనే అనేక ఆశలు నిహితములు - రక్షణలు నిహితములు. కావున స్తోతలు నిన్ను ఆహ్వానింతురు. నీవు సకల శత్రు సవనములను దాటి మా సవనమునకు విచ్చేయుము. మహాబలి ఇంద్రా ! మా ఆహ్వానములు వినుము.

13. ఇంద్రా ! మేము నీవారలము. మేము నీ స్తోతలము. నీవు వినా మరెవ్వడును సుఖప్రదుడు కాలేదు.

14. ఇంద్రా ! నీవు మమ్ము ఈ దరిద్రము, ఈ ఆకలి, ఈ నిందలనుంచి విముక్తులను చేయుము. రక్షణలు, విచిత్ర

కర్మములతో మాకు కోరిన పదార్థములను ప్రసాదించుము.

15. నీ కొరకే సోమము అభిషుతమైనది. కలిఋషి పుత్రులారా! భయపడకండి. ఈ రాక్షసాదులు దూరమగు చున్నారు. వారు పారిపోవుచున్నారు.

## ఏబది ఆరవ సూక్తము

ఋషి - మిత్రావరుణ పుత్రుడు మాన్యుడు లేదా మహా మీనా పుత్రుడు మత్స్యుడు

లేదా

బమూఋషులు. దేవత - ఆదిత్యులు ఛందస్సు - గాయత్రి

1. అభిమతఫల ప్రాప్తికిగాను - సుఖప్రదాతలు, క్షత్రియులగు ఆదిత్యులను - రక్షణ ప్రసాదించ వలసినదని ప్రార్థించుచున్నాము.

2. మిత్ర, వరుణ, ఆర్యమ, ఆదిత్యులు దుస్సహ కార్యములను ఎరుగుదురు. వారు మమ్ము పాపములు - రోగములనుండి దాటించ వలెను.

3. ఆదిత్యుల వద్ద విచిత్రము, స్తుతియోగ్యమగు ధనమున్నది. అది హవ్యదాతలగు యజమానులు కొరకు అగును.

4. వరుణాది దేవతలారా ! మీరు గొప్పవారు. హవ్యదాతలకు మీరు కల్పించిన రక్షణ గొప్పది. కావున మేము మిమ్ము రక్షణల కొరకు ప్రార్థింతుము.

5. ఆదిత్యులారా ! మేము ఇంకను జీవించి ఉన్నాము. మా వద్దకు రండు మా ఆహ్వానము వినుడు. మృత్యువు కన్న ముందురండు.

6. శ్రమించిన అభిషవకర్త యజమాని కొరకు మీ వద్ద వరణీయధనము, గృహము ఉన్నవి. మమ్ము ప్రసన్నులను చేయండి మంచి మాటలు పలకండి.

7. దేవతలారా ! పాపివద్ద మహాపాపమున్నది. పాపశూన్యులవద్ద శుభములున్నవి. పాపశూన్య ఆదిత్యులారా! మా కోర్కెలు ఫలింప చేయండి.

8. ఈ ఇంద్రజాలమున మమ్ము బంధించరాదు మహాకర్మలకుగాను మమ్ము ఈ జాలమునుండి విడువండి. ఇంద్రుడు విఖ్యాతుడు. అందరిని వశపరచుకొనువాడు.

9. దేవతలారా ! మమ్ము విడువండి. మమ్ము తప్పించదలచి శత్రువుల వలలో మమ్ము బాధించకండి.

10. దేవా అదితీ ! నీవు మహిమాన్వితవు. సుఖదాత్రివి. అఖిలహిత ఫలప్రాప్తి కొరకు నేను నిన్ను స్తుతించుచున్నాను.

11. అదితీ! నలువైపులనుండి మమ్ము రక్షింపుము. గంభీరము, ఉగ్రపుత్రవంతమగు జలమునందలి హింసకజాలమున మా పుత్రులను పడనీయకుము.

12. అదితీ! నీ గమనము విశాలము నీవు గంభీరవు. మా పుత్రులు జీవించుటకుగాను పాపరహితులమగు మమ్ము బ్రతికించుము.

13. ఆదిత్యులు అందరకు శిరోమణులు. మానవులను బాధించని వారు చక్కని కీర్తిశాలురు ద్రోహశూన్యులు. వారు మమ్ము రక్షించువారు.

14. మీరు హింసకులనుండి పట్టుకున్న దొంగనువలె - మమ్ము రక్షించండి.

15. ఆదిత్యులారా ! ఈ జాలము మమ్ము హింసించరాదు. మానుండి జాలము దూరము కావలెను దుర్బుద్ధి దూరము కావలెను.

16. చక్కని దాతలగు ఆదిత్యులారా ! మీ రక్షణల క్రింద పూర్వపురీతి ఇప్పుడు సహితము మేము నానా విధ భోగములు అనుభవించవలెను.

17. విశాల జ్ఞానవంతులగు దేవతలారా ! ఒక పాపియగు శత్రువు మావెంట పడినాడు. మేము జీవించుటకు, వానిని దూరము చేయండి.

18. ఆదిత్యులారా !ముడివీడిన నాకు బంధవిముక్తుడయినట్లు - మీ అనుగ్రహమున మమ్ము జాలము విడుచును మీ అనుగ్రహము స్తుత్యము - భజనీయము.

19. ఆదిత్యులారా! మీ వేగమును మేము అందుకొన జాలము. మీ వేగము మమ్ము విముక్తము చేయగలది "యూయమస్మాభ్యమ్మృళయత" మీరు మమ్ము సుఖింప చేయండి.

20. ఆదిత్యులారా ! యముని ఆయుధమువంటి కృత్రిమ జాలము - జీర్ణవ్యక్తులమైన మమ్ము బాధించరాదు.

21. ఆదిత్యులారా ! ద్వేషించువారిని నాశము చేయండి పాపులను నాశము చేయండి. జాలమును నాశము చేయండి. సర్వవ్యాపక పాపమును నాశము చేయండి.

*(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఎనిమిదవ మండలము ఆరవ అష్టకామున నాలుగవ అధ్యాయము సమాప్తము.)*

**ఓం నతామినన్తిమాయనో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదసీ అద్రుహా వేద్యాభిర్న పర్వతాని నమే స్థివాంసః**

**అయిదవ అధ్యాయము ఏబది ఏడవ సూక్తము**

ఋషి - అంగిరస ప్రియమేధ దేవత - ఇంద్రుడు ఛందస్సు - గాయత్రి 1, 4,7 అనుష్టుప్

**ఓమ్ ఆత్వారథం యథోతమే సువమ్నాయ వర్తయామసి**
**తువి కూర్మమృతీషహ మిన్ద్రశనిష్ఠ సత్పతే**

1. అత్యంతబలవంతుడవు, సత్పతివగు ఇంద్రా ! నీవు బహుకర్మవు. హింసకుల పరాభవకారివి మేము రథము వంటివారము. రక్షణ మరియు సుఖముల కొరకు నిన్ను ఆహ్వానించుచున్నాము.

2. ఇంద్రా ! నీవు విశేష బలశాలివి. అత్యంత ప్రాజ్ఞుడవు బహుకర్మవు. పూజనీయుడవు. నీయొక్క విశ్వ వ్యాపక మహత్వమున జగములను పూరించినావు.

3. ఇంద్రా ! నీవు మహానుడవు. నీ మహిమ వలన పృథ్విమీద వ్యాపించిన హిరణ్మయ వజ్రమును రెండు చేతులతో పట్టినావు.

4. ఇంద్రుడు సమస్త శత్రువుల మీదకు ఉరుకువాడు. దుర్దమనీయుడు బలపతి మరుత్తుల సేనలతోను, రథగమనముతోను విచ్చేయమని ఇంద్రుని ఆహ్వానిస్తున్నాను.

5. నేతలగుజనులు - తమ రక్షణకుగాను - యుద్ధములకు నానా విధములుగా ఇంద్రుని ఆహ్వానింతురు. అట్టి సర్వదా వర్షమానుడగు ఇంద్రుని, సాయమునకు రావలసినదని ఆహ్వానింతును.

6. ఇంద్రుడు అపారశరీరవంతుడు. స్తుతులకు పరిమితుడు సుందరుడు. ధనసంపన్నుడు. ధనస్వామి. ఉగ్రుడు. నేను అట్టి ఇంద్రుని ఆహ్వానిస్తాను.

7. ఇంద్రుడు నాయకుడు. యజ్ఞముఖస్థితుడు. క్రమబద్ధుడు. స్తుతిశ్రవణ సమర్థుడు. ఆ ఇంద్రునే - మహాధన ప్రాప్తికిగాను - సోమపానమునకు ఆహ్వానిస్తాను.

8. బలశాలి ఇంద్రా ! మానవుడు నీ సఖ్యతను వ్యాప్తము చేయజాలడు. నీ బలమును అధిగమించజాలడు.

9. వజ్రధరా ! మేము నీ రక్షణలు పొందుదుము. జాలమున స్నానము చేతుము. సూర్యుని దర్శింతుము. నీ సాయమున. యుద్ధమున మహాధనము పొందుదుము.

10. స్తుతులద్వారా అత్యంత ప్రసిద్ధ ఇంద్రా ! నేను నిన్ను ఎంతగానో స్తుతించువాడను. నీవి మమ్ము యుద్ధమందు రక్షించవలెనని యజ్ఞమందు నిన్ను యాచింతుము.

11. వజ్రధర ఇంద్రా !నీ సాహచర్యము స్వాదిష్టము. నీవు ధనాదులను కల్పించుట సహితము స్వాదిష్టము. నీ యజ్ఞము విస్తార యోగ్యము.

12. మా పుత్రునకు స్వేచ్ఛగా ధనమునిమ్ము. మా పౌత్రులకు స్వేచ్ఛగా ధనమునిమ్ము. మా నివాసమునకు విశేష ధనమునిమ్ము. మా జీవనమునకుగాను కోరిన పదార్థములనిమ్ము.

13. ఇంద్రా ! మేము నిన్ను మానవుల మేలుకొరకు ప్రార్థించుచున్నాము. గోవుల మేలు కొరకు ప్రార్థించుచున్నాము. రథమునకు మంచి మార్గము కొరకు ప్రార్థించుచున్నాము. యజ్ఞమునకు నమస్కరించుచున్నాము.

14. సోమపానమున కలిగిన హర్షమున చక్కని అనుభవయోగ్య ధనయుక్తులగు నరనాథులు ఆరుగురిలో ఇద్దరిద్దరు మా వద్దకు వచ్చెదరు.

(ఇద్దరిద్దరు అనగా పితృపుత్రరూపులు. ఆరుగురు నరనాథులు షట్చక్రవర్తులు కావచ్చును)

15. ఇంద్రోతి నామక రాజపుత్రునినుండి నాకు రెండు సగామి అశ్వములు లభించినవి. ఋక్షపుత్రుని నుండి రెండు హరిత వర్ణ అశ్వములు పొందినాను. అశ్వమేధ పుత్రుడు నాకు రెండు రోహితవర్ణ అశ్వములు ఇచ్చినాడు.

16. అతిథిగ్వ పుత్రుని నుండి చక్కని రథపు అశ్వములు లభించినవి. ఋక్షపుత్రుని నుండి కళ్లెములుగల అశ్వములను పొందినాను. అశ్వమేధపుత్రుడు నాకు సుందర అశ్వములను ఇచ్చినాడు.

17. అతిథిగ్వపుత్రుడు - పరిశుద్ధకర్ముడు - ఇంద్రోతి నుండి ఆడగుఱ్ఱములను ఋక్షపుత్రుడు, అశ్వమేధపుత్రుడు ఇచ్చిన అశ్వములసహితముగా అందుకున్నాను.

18. ఈ అశ్వములందు - దీప్తివంతములు, వర్షక అశ్వముల యుక్తముగా - కళ్లెములుగల ఆరు గుఱ్ఱములున్నవి.

19. అన్నదాతలగు ఆరుగురురాజులారా ! నిందకుడు సహితము మీపై నిందలు ఆరోపింపలేదు.

## ఏబది ఎనిమిదవ సూక్తము

ఋషి - అంగిరస ప్రియమేధ దేవత - మిత్రావరుణ ఇంద్రులు చంధస్సు - వివిధము

1. అధ్వర్యులారా ! వీరులకు హర్షము కలిగించు ఇంద్రుని కొరకు త్రిస్తోమ యుక్త అన్నము సమకూర్చుండి. యజ్ఞభోగమునకుగాను ప్రజ్ఞాయుక్త కర్మలతో ఇంద్రుడు మిమ్ము సత్కరించగలడు.

2. ఉషస్సుల ఉత్పాదకుడు ధ్వనిజనకుడు, అవధ్యగోవుల పతి ఇంద్రుని ఆహ్వానించండి. యజమాని పాడియావు కలిగిన అన్నమును కోరుచున్నాడు.

3. గోవులు దేవతల జన్మస్థానమునకు -ఆదిత్యుల అందమైన చోటునకు పోగలవు. వాటి పాలతో నూతులు నిండును. అవి మూడు వనములందు ఇంద్రునకు సోమము మిశ్రమము చేయును.

4. ఇంద్రుడు గోవులకు స్వామి. యజ్ఞపుత్రుడు.సాధుజనుల పాలకుడు. యజ్ఞపు లక్ష్యమును ఎరిగినవాడు స్తుతిబంధనములతో ఇంద్రుని పూజించండి.

5. హర్యశ్వములు దీప్తయుక్తములై ఇంద్రుని కుశలమీద విడువవలెను, మేము కుశస్థిత ఇంద్రుని స్తుతించెదము.

6. ఇంద్రుడు - దగ్గర ఉన్న సోమమును - నలువైపులనుండి అందుకొని చూచినప్పుడు గోవులు సోమమున కలుపవలసిన పాడిపదార్థములను సమకూర్చును.

7. ఇంద్రుడు, నేను సూర్యుని స్థానమునకు చేరినాము. అప్పుడు మిత్రుడగు ఆదిత్యుని ఇరువది ఒక్క స్థానములందు మధుర సోమరసపానము చేసినాము. కలుసుకున్నాము.

(12మాసములు + 6రుతువులు + 3లోకములు = 21

8. అధ్వర్యులారా ! మీరు ఇంద్రుని పూజించండి. విశేషరూపమున పూజించండి. ప్రియమేధవంశస్థులారా ! పురభంజనుని పుత్రులు పూజించురీతి ఇంద్రుని పూజించండి.

9. రణభేరి భయంకరముగ నినదించుచున్నది. 'గోధ' వాద్యము మ్రోగుచున్నది. పింగళవర్ణపు వింటి నారి ధ్వనించుచున్నది. అందువలన ఇంద్రుని స్తుతించండి.

10. శుభ్రములు, సుందరప్రవాహనదులు ప్రవృద్ధములైనపుడు - అప్పుడు ఇంద్రుని పానమునకుగాను ప్రవృద్ధ సోమము అందించండి.

11. ఇంద్రుడు సోమపానము చేసినాడు. అగ్నిసహితము సోమము సేవించినాడు. విశ్వదేవతలెల్లరు తృప్తులైనారు.

ఈ గృహమున వరుణుడు నివసించవలెను. తల్లి ఆవు తన బిడ్డకొరకు కేకవేసినట్లు ఉక్థలతో వరుణుని సేవింతుము.

12. వరుణా !నీవు మంచి దేవతవు - కిరణములు సూర్యుని ముందు పరుగులిడినట్లు నీ తాలువులందు గంగమున్నగు సప్తనదులు పరుగులిడును.

13. ఇంద్రుడు - వివిధగామి, రథసంయుక్త - అశ్వములను హవిర్దాత యజమాని వైపు నడిపించును. ఇంద్రుడు యజ్ఞసందర్భమున అందరకునేత అగును.

14. ఇంద్రుడు యుద్ధనిరోధక శత్రువును లంఘించిసాగును. తనను ద్వేషించు సకల శత్రువులను దాటసాగును. కమనీయుడు, ఉత్కృష్టుడగు ఇంద్రుడు మాటతోకొట్టి మేఘమును బ్రద్దలు చేయును.

15. చంటిబిడ్డ తండ్రివడిలో వలె - ఇంద్రుడు క్రొత్త రథమును అధిష్ఠించును. తల్లిదండ్రుల ముందు ఇంద్రుడు అటునిటు తిరుగు మహామృగము వంటివాడగును. బహుకర్మ ఇంద్రుడు మేఘమును వర్షింప చేయును.

16. ఇంద్రుడు సుందర హనువులవాడు. రథస్వామి. అతడు - స్వచ్ఛందగామి అతడు దీప్త, బహుపాద, హిరణ్మయ, నిష్పప, రథమును అధిరోహించవలెను. తదుపరి మనము ఇరువురము కలుసుకుందము.

17. ఈ విధముగా దీప్తుడు, విరాజమానుడగు ఇంద్రుని అనవంతులు సేవింతురు. తదుపరి స్తుతులు సాగును - హవ్యదానము కొరకు ఇంద్రుని చేరును. అట్టితరి సుస్థాపిత ధనము లభించును.

18. ప్రియమేధ గోత్రజులకు ఇంద్రాదుల ప్రాచీన స్థానములు ప్రాప్తించినవి. ప్రియమేధులు ప్రధాన ప్రదానమునకుగాను కుశలు పరచినారు. హవ్యములు అమర్చినారు.

*(ఆంధ్రవచన ఋగ్వేదసంహిత ఆరవ అష్టకము పదవ మండలమున పదవ అనువాకము సమాప్తము)*

**ఎనిమిదవ అనువాకము ఏబదితొమ్మిదవ సూక్తము**

ఋషి - అంగిరస పురుహన్మడు దేవత - ఇంద్రుడు ఛందస్సు -

బృహతి 13, 14, 16 ఉష్ణిక్

1. ఎవడు మనుష్యులకురాజగునో, ఎవడు రథముపై పయనించునో, ఎవని గమనమును బాధింపరాదో, ఎవడు సకల సేనల ఉద్ధారకుడో అట్టి జ్యేష్ఠుడు, వృత్రఘ్నుడగు ఇంద్రుని స్తుతిస్తాను.

2. పురుహన్మృషీ ! నీ రక్షణకుగాను ఇంద్రుని పూజింపుము. నిన్ను పాలించువాడు ఇంద్రుడు. అతని స్వభావము రెండు విధములది - ఉగ్రము, అనుగ్రము. ఇంద్రుడు తన చేత దర్శనీయ వజ్రము ధరించును. ఆ వజ్రము ఆకాశమున వెలుగు సూర్యసమానము.

3. ఇంద్రుడు సర్వదా వృద్ధిశీలుడు. అందరకు స్తుతియోగ్యుడు. మహామహుడు. ఇతరులను పరిభవించువాడు. అట్టి ఇంద్రుని యజ్ఞముద్వారా అనుకూలము చేసికొన్నవ్యక్తియే కర్మలతో ప్రఖ్యాతుడగును. అన్యుడు కాలేడు.

4. అన్యులకు అసహనీయుడు, ఉగ్రుడు, శత్రుసేనల విజేత ఇంద్రుని నేను స్తుతిస్తాను. ఇంద్రుడు జన్మించినంత - విశాలములు, అత్యంత వేగవంతములగు గోవులు అతనిని స్తుతించినవి. ద్యులోకము స్తుతించినది పృథ్వి స్తుతించినది.

5. ఇంద్రా! వంద ద్యులోకములు ఒక్కటైనను నీకు సరితూగవు. వంద భూలోకములయనను నీకు సరిరావు. వంద మంది సూర్యులైనను నిన్ను ప్రకాశింపచేయజాలరు. ఈ లోకమునందలి సృష్టిసాంతము, ద్యావాపృథ్వులు నీకు హద్దులు కాలేవు.

6. ఇంద్రుడు అభీష్టవరదుడు. అతిబలశాలి ధనికుడు వజ్ర, ఇంద్రా! నీవు నీ మహాజలమును సర్వత్ర వ్యాపింప చేసినావు. మాగోవుల నిమిత్తము మమ్ము వివిధరక్షణలతో కాపాడుము.

7. శ్వేతవర్ణ అశ్వద్వయమున రథమునకు కట్టిన వాని కొరకే ఇంద్రుడు హర్యశ్వములను రథమున పూన్చును. దేవశూన్యునకు పూర్తి అన్నము లభించదు.

8. ఋత్విక్కులారా ! మీరు గొప్పవారు. దానము కొరకని పూజ్య ఇంద్రుని - అందరు కలసి - పూజించండి. జలప్రాప్తికి ఇంద్రుని ఆహ్వానించ వలెను. నిన్ను స్థల ప్రాప్తికి సహితము ఇంద్రుని ఆహ్వానించ వలెను. నిన్ను స్థల ప్రాప్తికి సహితము ఇంద్రుని ఆహ్వానించ వలెను. యుద్ధమునందును ఇంద్రుని ఆహ్వానించ వలెను.

9. వాసదాత, శూర ఇంద్రా ! నీవు మాకు మహాధనము లభించునట్లు జాగృతులను చేయుము. శూర, ధనిక ఇంద్రా!

మహాధనము, మహత్తర కీర్తి కలిగించుటకు ఉద్యమించుము.

10. ఇంద్రా ! నీవు యజ్ఞాభిలాషివి. నిన్ను నిందించు వాని ధనమును అపహరించి, ప్రసన్నుడవగుదువు. రక్షించుటకుగాను మమ్ము తొడల మధ్యదాచుకొనుము. శత్రువులను వధించుము. అస్త్రములతో దస్యులను హతమార్చుము.

11. ఇంద్రా ! పర్వతములు నీకు మిత్రులు. అవి - అన్య రూపధారులను. అమానుషులను, యజ్ఞశూన్యులను, దేవ ద్వేషులను స్వర్గమునుంచి క్రిందకు త్రోయును. అవి దస్యులను మృత్యువు చేతికి పట్టించును.

12.ఓ ఇంద్రా ! మాకు ఇచ్చుటకు లాజలతో సమానములగు గోవులను అందుకొనుము. నీవు మమ్ము అభిలషింతువు. మరింత అభిలషించుము. మరింతగ్రహించుము.

13. మిత్రులారా ! ఇంద్ర సంబంధ కార్యములను తలపెట్టండి. శత్రుహింసక ఇంద్రుని మేమెట్టు స్తుతించగలము? ఇంద్రుడు ప్రేరకుడు. శత్రుభక్షకుడు. అతడు ఎన్నటికి తలవంచడు.

14. అందరకు పూజనీయుడవగు ఇంద్రా! అనేకమంది ఋషులు, హవ్యదాతలు నిన్ను స్తుతింతురు. నీవు ఒక్కక్కరికి, ఒక్కొక్కరీతిగా, స్తోతలకు దూడలుగల అనేక ఆవులను ఇస్తావు.

15. ఆ ఇంద్రుడు హింసకయుద్ధమున గెలచిన ఆవులను, దూడలను చెవులు పట్టుకొని, నీరు త్రాపుటకు గొర్రెల కాపరి గొర్రెలనువలె - మా వద్దకు తేవలెను.

**అరువదవ సూక్తము**

ఋషి - సుదీతి పురుమీహుడు దేవత - అగ్ని ఛందస్సు -

1-9 గాయత్రి 10-16 బృహతి

1. దానశూన్యులనుండి లభించిన మహాధనమున మమ్ము పాలింపుము. శత్రువు బారినుండి రక్షింపుము.

2. ప్రియజన్మ అగ్నీ ! పురుష సంబంధ క్రోధము నిన్ను బాధింపజాలదు నీవు రేయవాడవు కదా ! (దివాచరాఃఖలు పురుషాః అతోదివా తన హానిర్నా స్త్రీతిభావః మానవులు దివాచరులు. అగ్ని రాత్రించరుడు - రేయిలో మరింతవెలుగువాడు. కావున మానవులు అగ్నికి హాని కలిగించజాలరని తాత్పర్యము.)

3. అగ్నీ! నీవు బలపుత్రుడవు ప్రశస్త తేజోవంతుడవు. సకల దేవతలతో కలసి అందరికి వరణీయధనము ప్రసాదించుము.

4.అగ్నీ ! నీవు పాలించునట్టి హవిర్దాతను - దాతలు కానవారలును, ధనికులును వేరు చేయజాలరు.

5. అగ్నీ !నీవు విప్రుడవు. ధనలాభమునకుగాను. నీవు యజ్ఞప్రేరణ కలిగించిన వ్యక్తి నీ రక్షణలవలన గోవులు గలవాడగును.

6. అగ్నీ! నీవు హవ్యదాత వ్యక్తి కొరకు బహువీర్య యుక్తధనమును ప్రసాదించుము. మమ్ము వాసయోగ్యధనము ముందుకు పంపుము.

7. జాతధన అగ్నీ! మమ్ము రక్షింపుము. అనిష్టము కోరువారు. హింసాప్రవృత్తిగల మానవులకు మమ్ము వప్పగించకుము.

8. అగ్నీ! నీవు ద్యుతుమంతుడువు. దేవశూన్య వ్యక్తులెవ్వరును నిన్ను ధనదానము నుండి నిలుపజాలరు.

9.బలపత్ర, మిత్ర, నివాసప్రద అగ్నీ! మేము నీ స్తోతలము. నీవు మాకు మహాధనమును ప్రసాదించుము.

10. మాస్తుతులు - దహించు జ్వాలలు కలవాడును - దర్శనీయుడగు -అగ్నిని చేరవలెను. సకల యజ్ఞములు హవిద్యుక్తములై, విశేషధనవంతుడు, అనేకులు స్తుతించు అగ్నివైపు మరల వలెను.

11. అగ్ని బలపుత్రుడు జాతధని వరణేయుడు సమస్త స్తుతులు అగ్నివైపు సాగవలెను. అగ్ని అమరుడు. మానవులందు ఉండువాడు అగ్ని - మానవులకు హోమసంపాదకుడు, జాలాకారకుడు - ఉభయప్రకారముల వాడగును.

12. యజమానులారా !మీ దేవయజ్ఞము కొరకు అగ్నిని నేనుస్తుతిస్తాను. యజ్ఞప్రారంభామున అగ్నిని స్తుతిస్తాను. కర్మకాలమున అగ్నిని ప్రథముగా స్తుతిస్తాను. బంధుత్వము కలిగినపుడు అగ్నిని స్తుతిస్తాను. క్షేత్ర ప్రాప్తి కలిగినంత అగ్నిని స్తుతిస్తాను.

13. మేము అగ్నికి మిత్రులము. అగ్ని స్వీకరణీయ ధనములకు ప్రభువు. అగ్ని మాకు అన్నము ప్రసాదించ వలెను. నివాసదాత, అంగపాలక అగ్నిని - మా పుత్ర, హోత్రులకు విశేష ధనము నిమ్మని ప్రార్థించుచున్నాము.

14. పురుమీహ్లో ! రక్షణ కొరకు మంత్రములతో అగ్నిని స్తుతించుము. అగ్ని జ్వాలలు దాహకములు. ధనము కొరకు అగ్నిని స్తుతించుము. ఇతర యజమానులుకూడ అగ్నిని స్తుతింతురు. "సందీతి" కొరకు గృహము యాచించుము.

(ఇవి సుదీతి పురుమీహ్లునితో అన్నమాటలు)

15. శత్రువులను వేరు చేయుముని మేము అగ్నిని స్తుతిస్తాము. సుఖము, అభయము కొరకు అగ్నిని స్తుతిస్తాము. అగ్ని సకల ప్రజావళికి రాజువంటివాడు. అతడు ఋషులకు వాసదాతయు, ఆహ్వానయోగ్యుడగును.

## అరువది ఒకటవసూక్తము

ఋషి - ప్రాగథపుత్ర హర్యతుడు దేవత - అగ్ని ఛందస్సు - గాయత్రి

1. అధ్వర్యులారా ! త్వరగా హవ్యము సమర్పించండి. అగ్ని విచ్చేసినాడు. అధ్వర్యులు మరల యజ్ఞమును సేవింతురు. వారికి హవ్యము అర్పించుట తెలియును.

2. అగ్నితో యజమానికి స్నేహమున్నది. అతడు - సంస్థాపాకహోత, వంకరజ్వాలల అగ్ని వద్ద కూర్చుంటాడు.

3. యజమాని మనోరథ సిద్ధికొరకు - అతడు తన ప్రజ్ఞా బలమున రుద్రాగనిని తనముందు స్థాపించుకొన దలచును. అతడు స్తుతులతో అగ్నిని గ్రహించును.

4. అన్నదాత అగ్ని ధనుస్సుతో అంతరిక్షమును తపింప చేయును. అరణ్యములను కాల్చును. ఉదకమును దాహించును. పాషాణములను పేల్చుము. మేఘమును వధించును.

5. అగ్ని దూడవలె చపలుడు. శ్వేతవర్ణుడు. అగ్నిని జగములందు నిరోధించువారులేరు. అగ్ని స్తోతలను కోరును.

6. ఈ అగ్ని మహిమలు కలవాడు. అశ్వసంపన్నుడు ప్రకాండ యోజనపరుడు. అగ్ని రథపు రజ్జువగును.

(అంతరిక్షరథమును అదుపులో ఉంచునని అర్థము)

7. ధ్వనించు సింధునదీ తీరమున ఏడుగురు ఋత్విక్కులు జలసేకరణ చేయుచున్నారు. వీరిలో ఇద్దరు పరస్తాత అధ్వర్యులు, పోగ మిగతా అయిదుగురిని ఆదేశించుచున్నారు.

(అయదుగురు 1. యజమాని 2. బ్రహ్మ 3. హోత 4. అగ్నీధ్ర 5.స్తోతలు)

8. సేవకుడగుయజమాని దోసిల్లొగ్గి ఇంద్రుని యాచించినాడు. అప్పుడు ఇంద్రుడు ఆకాశమందలి మేఘముచే - మూడు ప్రకారముల కిరణమూలమున - వర్షము కురిపించినాడు.

9. అగ్ని లోహిత, శుక్ల, కృష్ణ మూడురంగులవాడు. అతడు వేగవంతుడై శిఖలతో యజ్ఞములకు వెళ్లును. హోమసంపాదక అధ్వర్యులు అతనిని ఆజ్యానదులతో పూజింతురు.

10. అగ్ని మహావీరుడు ఉపరిచక్రయుక్తుడు. దీప్తిసంపన్నుడు. నిమ్నముఖ ద్వారవంతుడు. అక్షయుడు. రక్షకుడు. అధ్వర్యుల అవనతులై అగ్నిని సిక్తము చేయుదురు.

11. అధ్వర్యులు ఆదరణీయులు. వారు రక్షకుడగు అగ్ని దరికి చేరుదురు. విసర్జన సమయమున అగ్నిని విశాల పాత్రమున మధువుతో సిక్తము చేయుదురు.

12. గోవులారా ! పాలు ఎక్కువ అవసరమైనపుడు - మంత్రము ద్వారా పితుకవలసి వచ్చినపుడు - అప్పుడు మహావీరుడుగా అగ్ని వద్దకు వెళ్లండి. అగ్ని చెవులురెండింటిలో ఒకటి బంగారపుది. మరొకటి వెండిది.

13. అధ్వర్యులారా! పాలుపిండినంత - ద్యావాపృథ్వులను ఆశ్రయించినవియు, మిశ్రణయోగ్యములగు పాలను సేవనచేయండి. తదుపరి మేకపాలతో అగ్నిని స్థాపించండి.

14. గోవులు తమకు నివాసదాతయిన అగ్నిని తెలుసుకున్నవి. పిల్లలు తల్లిని కలిసినట్లు గోవులు తమ బంధువగు అగ్నిని కలుసుకొనును.

15. జ్వాలలతో భక్షించు అగ్ని యొక్క అన్నము - అగ్నిని ఇంద్రుని పోషించును. అంతరిక్షమునకు ఉపకారము చేయును. ఇంద్రాగ్నులకు అన్నము సమర్పించండి.

16. గమనశీలవాయువు. చంచలచరణయుక్త వచనము, సూర్యుని ఏడు కిరణముల ద్వారా వర్థిల్లిన అన్నమును, రసమును అధ్వర్యులు గ్రహింతురు.

17. మిత్రావరుణులారా ! సూర్యోదయ సమయమున సూర్యుడు సామము స్వీకరించును అతడు మాకు హితకరుడు - వైద్యుడు.

18. హర్యతృషి హవ్యస్థాపనకు స్థానము ఏర్పరచినాడు. అగ్ని అక్కడి నుండియే తన శిఖలతో ద్యులోకమున వ్యాపించును.

## అరువది రెండవ సూక్తము

ఋషి - ఆత్రేయసప్తవధ్రి దేవత - అశ్వినులు ఛందస్సు -గాయత్రి

1. అశ్వినులారా ! నేను యజ్ఞాభిలాషిని. నా కొరకు. ఉదయించండి. మీ రక్షణ మా దరికి చేరవలెను.

2. అశ్వినులారా ! నిమేషము కన్న వేగవంతమగు రథమున విచ్చేయండి. "అన్తిషధ్భూతువామవః" మీ రక్షణ మా దరికి చేరవలెను.

3. అశ్వినులారా ! అత్రిని అగ్నిలో పడత్రోసినాడు. మీరు జలముతో అతని మంటలను ఆర్పండి. "అన్తిషధ్భూతువామవః"

4. మీరు ఎచట ఉన్నారు? ఎచటికి ఏగుదురు? శ్యేనపక్షివలె ఎచట వాలుదురు? "అన్తిషధ్భూతువామవః"

5. మీరు ఎప్పుడు, ఏచోట మా ఆహ్వానమును ఆలకింతురో మేము ఎరుగము. "అన్తిషధ్భూతువామవః"

6. అశ్వినులు అత్యంత ఆహ్వానయోగ్యులు. నేను వారివద్దకు, వారి దగ్గరి బంధువుల వద్దకు వెళ్లెదను. "అన్తిషధ్భూతువామవః"

7. అశ్వినులారా! అత్రిని మంటలనుండి రక్షించుటకు మీరు రక్షక గృహము నిర్మించినారు. "అన్తిషధ్భూతువామవః"

8. అశ్వినులారా ! అత్రిమమనోహరస్తోత. అతనిని అగ్గి మంటలనుండి తప్పించండి. "అన్తిషధ్భూతువామవః"

9. మహర్షి సప్తవధ్రి నిన్ను స్తుతించినాడు. అగ్నిజ్వాలను మంజూషనుండి బయటికి తీసినాడు. మరల అందులోనే పరుండ పెట్టినాడు. "అన్తిషధ్భూతువామవః"

10. వృష్టిప్రదులు, ధనికులగు అశ్వినులారా ! మా ఆహ్వానము వినండి. విచ్చేయండి. "అన్తిషధ్భూతువామవః"

11. అశ్వినులారా ! మీరు ఎంతో ప్రాచీనులు. మిమ్ము మాటిమాటికి పిలువా వలెనా? "అన్తిషధ్భూతువామవః"

12. అశ్వినులారా ! మీ ఉభయుల ఉత్పత్తి స్థానము ఒకటే. బంధువులుకూడా సమానులె. "అన్తిషధ్భూతువామవః"

13. అశ్వినులారా! మీ రథము ద్యావాపృథ్విలందును, సమస్తలోకములందును సంచరించును. "అన్తిషధ్భూతువామవః"

14. అశ్వినులారా ! అపరిమిత గోవులు అశ్వములతో మా వద్దకు విచ్చేయండి. "అన్తిషధ్భాతువామవః"

15. అశ్వినులారా ! వేలగోవుల, అశ్వములతో మాత్రమే. మమ్ము సరిపెట్టవద్దు "అన్తిషధ్భాతువామవః"

16. అశ్వినులారా ! వేలగోవులు, అశ్వములతో మాత్రమే మమ్ము సరిపెట్ట వద్దు "అన్తిషధ్భాతువామవః"

17. రంపపువాడు చెట్టును కోసినట్లు - అత్యంత దీప్తినంత సూర్యుడు చీకట్లను నివారించును. నేను అశ్వినులను ఆహ్వానించుచున్నాను. "అన్తిషధ్భాతువామవః"

18. ధర్షక సప్తవధ్రీ ! నీవు పెట్టెలో బంధింపబడి ఉంటివి. తదుపరి దానిని నగరమును వలె కాల్చివేసినావు. "అన్తిషధ్భాతువామవః"

(నల్లపేటిక అంధకారమునకు వ్యాధులకు సంకేతము. అశ్వినుల అనుగ్రహమున ఋషిదానినుండి బయట పడినాడు. అవి మరల తలెత్తకుండునట్లు తగులపెట్టినాడు. నగరమును కాల్చినపుడు దానిగుర్తులు సహితము మిగులవు అట్లు భస్మము చేసినాడని)

## అరువది మూడవ సూక్తము

ఋషి - గోపవనుడు దేవత - అగ్ని ఛందస్సు - అనుష్టుప్ - గాయత్రి

1. ఋత్విక్కులు, యజమానులారా ! మీరు అన్నభిలాషులు. సకల జనుల అతిథి, బహుజన ప్రియుడు అగ్నిని స్తుతులతో సేవించండి. నేను మీ సుఖములకుగాను మన నీయ స్తోత్రములతో గూఢవచనములను ఉచ్చరిస్తాను.

2. అగ్ని కొరకు నేతితో హోమము చేయబడును ఆద్రవ్యము దానము చేయునపుడు అగ్నిని స్తుతించి ప్రశంసింతురు.

3. అగ్నిని స్తోతలు ప్రశంసింతురు. అగ్ని జాతధని యజ్ఞమునందు సమర్పించిన హవిని ద్యులోకమునకు చేర్చువాడు.

4. అగ్ని తనజ్వాలలతో ఋక్షపుత్రుని, మహశృతర్వుని వర్ధిల్ల చేసినాడు. అతడు పాపులనాశకుడు. మానవులకు హితకరుడు. అగ్నిగుణముల అగ్ని వద్ద నేను ఉపస్థితుడనైనాను.

5. అగ్ని అమరుడు జాతధని స్తవనీయుడు అంధకారమును దూరము చేయువాడు. అగ్నికొరకు ఘృతముతో హవనము చేయుదురు.

6. బాధలుగలవారు యజ్ఞము చేస్తారు. స్రుక్సం యతముచేసి హవ్యముతో అగ్నిని స్తుతిస్తారు.

7. దృష్టుడు, శోభనజన్ముడు, బుద్ధిమంతుడు, దర్శనీయుడగు అగ్నిని మేముస్తుతించుచున్నాము.

8. అగ్నీ! మేము చేసిన స్తుతి సుఖావహము. అధిక అన్నవంతము. నీకు ప్రియమైనది. ఆస్తుతితో నీవు చక్కగా స్తుతుడవగుము - వర్ధిల్లుము.

9. ఆస్తుతి అన్నవంతము. యుద్ధము నందు ఆ అన్నము వలసినంత అన్నము వర్ధిల్లవలెను.

10. అగ్ని స్వబలమున శత్రువు అన్నమును మరియు స్తుత్యధనమును హింసించును అట్టి రథపూరకుడగు అగ్నిని - గతిపరాయణ అశ్వమును వలెను, సత్ప్రీతి ఇంద్రునివలెను మానవులు పూజింతురు.

11. అగ్నీ ! గోరవన ఋషి స్తుతివలన నీవు అన్దాతవు అయినావు. నీవు సర్వత్ర సంచరించువాడవు. శోధకుడవు. నీవు గోరోవముని ఆహ్వానమును ఆలకించుము.

12. భాదలపాలయినప్పటికి జనులు - అన్నప్రాప్తికొరకు - నిన్నేస్తుతిస్తారు. నీవు యుద్ధమున జాగృతుడ వగుము. "సబోధివృత్ర తూర్యే"

13. శ్రుతర్వప్రభువు శత్రుగర్వధ్వంసకుడు. ఋక్షపుత్రుడు. అతడు ఋషినగు నన్ను పిలిచినాడు. అతడు నాకు ఇచ్చిన రోమవంతములగు నాలుగు అశ్వముల రోమ వంతమస్తకములను నా చేతులతో కడుగుచున్నాను.

14. శ్రుతర్వరాజు ఎంతో అన్నవంతుడు. అతడునాకు ఇచ్చిన అశ్వములు వేగవంతములై, రథమునతగిలి - అశ్వనులు పంపిన నాలుగు నావలు 'తుగ్ర' పుత్ర 'భుజ్యు' ని మోసినరీతి - అన్నమును మోయును.

15. గొప్పదానవగు పురుష్ణీనదీ ! సత్యము పలుకు చున్నాను:-

*"శ్రుతర్వుడు అత్యంత బలవంతుడు. అతను చేసినన్ని అశ్వదానములు మరొకడు చేయజాలడు"*

## అరువది నాలుగవ సూక్తము

ఋషి - అంగిరస విరూపుడు దేవత - అగ్ని ఛందస్సు - గాయత్రి

1. అగ్నీ! నీవు సారథి వంటివాడవు. రథమునకు చురుకైన గుఱ్ఱములను కట్టుము. మేము హోతలము. నీవు ప్రధానుడవై కూర్చుండుము.

2. దేవా! నీవు దేవతల మమ్ము "విద్వత్ శ్రేష్టులను" అని పరిచయము చేయుము. వరణీయములగు మా ధనములను నిజము చేయుము.

3. అగ్నీ! నీవు తరుణ తముడవు. బలపుత్రుడవు. ఆమాతుడవు సత్యవంతుడవు. యజ్ఞయోగ్యుడవు.

4. ఈ అగ్ని నూర్ల, వేల విధముల అన్నములకు స్వామి శిరోమణి, కవి, ధనపతి.

5. గమనశీల అగ్నీ! ఋభువులు రథనేమిని తెచ్చినట్లు - నీవు ఒకేచోటకి పిలిచినా దేవతలకూడి - దగ్గరలోనున్న యజ్ఞమునకు విచ్చేయుము.

6. విశిష్టరూపముగల ఋషీ ! నిత్యవాక్యములతో తృప్తుడును, అభీష్టవరదుడగు అగ్నిని స్తుతించుము.

7. గోవుల కొరకు మేము విశాలనేత్రలగు అగ్ని జ్వాలలతో - ఏ పణిని వధింతుము?

8. మేము దేవతల పరిచారకులము. పాలిచ్చు గోవులను విడువరు. గోవులు దూడలను విడువవు. అట్లే అగ్ని మమ్ము విడువరాదు.

9. సముద్ర తరంగములు నౌకను బాధించవు. అట్లే శత్రువు దుష్ట బుద్ధి మమ్ము బాధించరాదు.

10. అగ్నీ ! మానవులు బలప్రాప్తికిగాను నీకు నమస్కరింతురు. నీవు నీ బలమున శత్రుసంహారము చేయుము.

11. అగ్నీ ! గోవులను అన్వేషించుటకు మాకు శేషాధనమును ప్రసాదించుము. నీవు వృద్ధిచేయువాడవు మమ్ము వర్ధిల్లచేయుము.

12. బరువులు మోయువానివలె నీవు యుద్ధమున మమ్ము వదలకుము. శత్రవులు ఈ ధనమును భిన్నా భిన్నము చేయచున్నారు. ఆధనమును మా కొరకు జయించుము.

13. అగ్నీ! బాధలుస్తుతిహీనులను భయపెట్టవలెను. మా బలమును పెంచుము. వేగమును పెంచుము.

14. నమస్కరించి కర్మద్వారా సేవించువారి వద్దకు విశేషముగా అగ్ని వెల్లుచుండును.

15. శత్రుసేనలకు దూరముగా మాసేనకు అభిముఖముగా నిలుపుము. మా సేనామధ్యమున నేను ఉన్నాను. సేనలను రక్షింపుము.

16. అగ్నీ ! నీవు  పాలకుడవు నీ రక్షణలు పూర్వమువలెనే భద్రములు. అడిమాకు తెలియును. ఇప్పుడు నీ సుఖమునకు మేము ప్రార్థించుచున్నాము.

## అరువది అయిదవ సూక్తము

ఋషి - కాణ్వాకురుసుతి దేవత - ఇంద్రుడు ఛందస్సు - గాయత్రి

1. శత్రుచ్ఛేదనమునాకుగాను నేను ఇంద్రుని పిలుచుచున్నాను. అతడు బలవంతుడు. అందరికిస్వామి మరుత్తులవాడు.

2. ఈ ఇంద్రుడే మరుత్తులసాయమున వృత్రుని శిరమును శతపర్వ వజ్రమున ఖండించినాడు.

3. ఇంద్రుడు ఎదిగినాడు మరుత్తులతో కలసినాడు. వృత్రుని హతమార్చినాడు. సముద్రమున జలమును కలిగించినాడు.

4. మరుత్తులతో కలసినాడు. సోమపానము కొరకు స్వర్గమును గెలిచినాడు. అదిగో అతడే ఇంద్రుడు.

5. ఇంద్రుడు మరుద్యుక్తుడు ఋజీషవంతుడు. సోమస్మయుక్తుడు. ఓజస్వి మహానుడు మేము ఇంద్రుని స్తుతిస్తాము - పిలుస్తాము.

6. మరుద్యుక్త ఇంద్రుని - సోమపానమునకు - ప్రాచిన స్తోత్రములతో ఆహ్వానిస్తాము.

7. ఇంద్రా ! నీవు ఫలప్రదుడవు. అనేకులచే పిలువబడు వాడవు. శతక్రతువవు. మరుత్తులతో కూడి ఈ యజ్ఞమున సోమపానము చేయుము.

8. వజ్రధర ఇంద్రా ! నీ కొరకును మరుత్తుల కొరకును సోమము అభిషుతమై ఉన్నది. ఉక్థమంత్ర పాఠకులు మిమ్ము భక్తియుక్తులై ఆహ్వానించుచున్నారు.

9. ఇంద్రుడా ! నీవు  మరుత్తుల మిత్రుడవు ఈ యజ్ఞము మాకు స్వర్గము ప్రసాదించునది. ఈ యజ్ఞమున

అభిషుతసోమ పానము చేయుము. బలయుతుడవై వజ్రమునకు పదును పెట్టుము.

10. అభిషవణ ఫలకముల మీది సొమము అభిషుతమైనది. సోమము త్రావుము. బలము కలుగును. నిలువుము దవడలు ఆడించుము.

11. వీవు శత్రువినాశకుడవు. నీవు దస్యులను హతమార్చినపుడు, ద్యావాపృథ్వులు నిన్ను తలుచుకొందురు.

12.ఎనిమిది, తొమ్మిది దిశలందు యజ్ఞమును స్పృశించు స్తుతిసహితము ఇంద్రుని కన్నా తక్కువదే! నేను ఆస్తుతితోనే స్తుతిస్తాను.

(ఎనిమిది దిశలు + ఒక ఆదిత్యుడు = తొమ్మిది)

## అరువది ఆరవ సూక్తము

ఋషి - కాణ్వకురుసుతి, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - గాయత్రి - 10, 11 బృహతి

1. ఇంద్రుడు పుట్టగానే బహుకర్మశాలి అయినాడు. తల్లిని అడిగినాడు :-

"ఉగ్రుడెవడు ప్రసిద్ధుడెవడు?" అని

2. శవిసి అప్పుడు చెప్పినది :- "పుత్రా! ఊర్ణనాభ, అహీశునాదులు అనేకులు ఉన్నారు. వారిని అణచుట మంచిది" అని

3. వృత్రఘ్న ఇంద్రుడు రథ చక్రమునకు ఇరుసు వంటి దస్యులను త్రాటితో గుంజినాడు. వారిని వధించినాడు తాను ప్రవృద్ధుడైనాడు.

4. ఇంద్రుడు ఒకేసారి ముప్పది కమనీయపాత్రల నిండిన సోమమును పానము చేసినాడు.

5. మూలశూన్య అంతరిక్షమందలి మేఘమును - బ్రహ్మాణలను అభివృద్ధిపరచుటకు నలుదిశలనుండి కొట్టినాడు.

6. ఇంద్రుడు మానవుల కొరకు పరిపక్వ అన్నము కల్పించ దలచినాడు. మహాశరము అందుకున్నాడు. మేఘమును చేదించినాడు.

7. ఇంద్రా ! నీ బాణము నూరు అగ్రములు, వేయి పత్రములుగలది. నీవు ఆబాణమునే వాడెదవు.

8. స్తోతలు, పుత్రులు, భృత్యులు, స్త్రీల కొరకు ఆ బాణమున వలసినంత ధనము తెమ్ము. ఇంద్రా ! నీవు జన్మతోనే విరాట్టువు - స్థిరుడవు.

9. ఇంద్రా ! ఈ పర్వతములుఎంతో పెరిగినవి. అంతట వ్యాపించినవి. వీనిని నీవే కల్పించినావు. వానిలో నీమనసు స్థిరముగా నిలుపుము.

10. ఇంద్రా ! నీ వద్ద ఉన్న జలమంతయు విష్ణువు ప్రదానము చేసినదే. విష్ణువు ఆకాశమున పరిభ్రమించువాడు. నీ చేత ప్రేరణపొందిన వాడగును. ఇంద్రుడు నూరు మహిషములను, క్షీరాన్నమును, జలమును హరించు మేఘమును ఇచ్చినాడు.

11. నీ ధనుస్సు అనేక బాణములు విడుచునది, సునిర్మితము, సుఖావహము అగును. నీ బాణము బంగారపుది. నీ భుజములు రమణీయములు, సుర్మభేదకములు, సుసంస్కృతములు, యజ్ఞవర్ధకములు.

### అరువది ఏడవ సూక్తము

ఋషి - కాణ్వకురుసుతుడు, దేవత - ఇంద్రుడు , ఛందస్సు - గాయత్రి - 10 బృహతి.

1. శూర ఇంద్రా ! పురోడాశము స్వీకరింపుము. వందల, వేల గోవులను మాకు ప్రసాదించుము.

2. ఇంద్రా ! నీవు మాకు గోవులు, అశ్వములు, తైలము ప్రసాదించుము. వానితో మనోహరము, హిరణ్మయమగు అలంకారము అందించుము.

3. శత్రువులను రాచిపెట్టువాడవు, వాసదాతవాగు ఇంద్రా ! నీవు చెప్పినదే అందరు విందురు. నీవు మాకు అనేక కర్ణాభరణములు ఇమ్ము.

4. ఇంద్రా ! నీవు కాక అన్యులు వర్ధకులుకారు. యుద్ధమున నిన్ను మించినశూరుడు లేడు. నిన్ను మించిన దాతలేడు. నీవు కాక ఋత్విక్కులను నేతలేడు.

5. ఇంద్రుడు ఎవరిని తిరస్కరించడు. ఇంద్రుడు ఎవరితోను ఓటమి ఎరుగడు. అతడు లోకములను చూచును వినును.

6. ఇంద్రుని మానవులు వధింపజాలరు. అతని మనసున క్రోధమునకు స్థానము లేడు. నింద కన్నా ముందే నిందకు చోటివ్వడు.

7. క్షిప్రకారి, వృత్రఘ్న, సోమపాయ ఇంద్రుని ఉదరము - సేవకుల కర్మలతో నిండును.

8. ఇంద్రా ! నీలో నీకు ధనములు ఇమిడి ఉన్నవి. సమస్త సౌభాగ్యములు ఉన్నవి. నీదానము కౌటిల్యములేనిది.

9. నామనసు యవలు, గోవులు, సువర్ణము, ఆభరణములు కోరి నీ వద్దకు వచ్చును.

10. ఇంద్రా! నీ ఆశతోనే నేను కొడవలి పట్టినాను. ఇంతకు ముందు నూర్చిన యవల ------ఆశలు నేరవేర్చును.

## అరువది ఎనిమిదివ సూక్తము

ఋషి - భార్గవ కృత్నుడు దేవత - సోమదేవత ఛందస్సు - గాయత్రి 9. అనుష్టుప్

1. ఇతడు సోమకర్త. ఇతనిని గ్రహించువారు లేరు. ఇతడు విశ్వజిత్, ఉద్భుత సోమ యజ్ఞనిపృకుడు. అతడు ఋషి మేధావి కావ్యమున స్తుత్యుడు.

2.సోముడు దిగంబరివి ఆచ్చాదించును. రోగికి ఆరోగ్యము కలిగించును. గ్రుడ్డివానికి కాళ్లు ఇచ్చును.

3. సోమా ! శరీరమును కృశింపచేయు అన్యకృతుల అప్రియ కార్యముల నుండి రక్షింపుము.

4. ఋజీషసోమవంత సోమమా! నీవు ప్రజ్ఞమరియు బలముతో ద్యులోక, భూలోకములందలి మా శత్రువుల కార్యములను నిష్ఫలము చేయము.

5. ధనము కోరిన జనులు ధనికుని వద్దకు పోయిన దాతయొక్క దానము లభించును. భక్షుకుని కోరిక తీరును.

6. పురాతన ధనము లభించినపుడు యజ్ఞాభిలాషికి ప్రేరణ కలుగును అప్పుడే దీర్ఘాయువు లభించును.

7. సోమా ! నీవు హృదయమందు సుందర, సుఖకర, యజ్ఞసంపాదక, నిశ్చల మంగల కరుడవు.

8. సోమా ! నీవు మమ్ము చంచలులను చేయకుము. మమ్ము భయపెట్టకుము. మా హృదయమందలి ప్రకాశమును మాపకుము.

9. స్వకీయస్థానమున దుర్బుద్ధి ప్రవేశించవద్దు. శత్రువులను దూరము చేయుము. సోమరస సేవనము చేయువారి హింసకులను వధించుము.

## అరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - నోధాస పుత్రుడు ఏకద్యునుడు దేవత - ఇంద్రుడు ఛందస్సు
- గాయత్రి 10 అనుష్టుప్

1. ఇంద్రా ! నిన్ను వినా అన్యులను అభిమానించను. కావున సుఖము ప్రసాదించుము.

2. అహింసక ఇంద్రుడు నన్ను తన ప్రాప్తికొరకు కాపాడినడో, అతడు మాకు సదా సుఖములను అందించవలెను.

3. ఇంద్రా ! నీవు ఆరాధకుని కాపాడుము. అభిషవ కర్తను రక్షింపుము. మాకు బహుధానములను ఇమ్ము.

4. ఇంద్రా ! నీవు మా వెనుక ఉండి మారథమును రక్షింపుము. దానిని ముందుకు సాగనిమ్ము.

5. శత్రుహంత ఇంద్రా ! ఇప్పుడు నీ వెందుకు మిన్నకున్నావు. రథములలో మా రథమును ప్రధానము చేయుము. మేము కోరిన అన్నము నీ వద్ద ఉన్నది.

6. ఇంద్రా ! మా అన్నాభిలాషి రథమును రక్షింపుము. మమ్ము యుద్ధమున అన్ని విధముల విజయవంతులను చేయుట నీ కర్తవ్యమగును.

7. ఇంద్రా ! నీవు బలపడుము. నీవు నగర సముడవు. మంగళమయ స్తుతి సమయము ననుసరించి నీ వద్దకు చేరును. నీవు యజ్ఞసంపాదకుడవు.

8. నిందల పాలగు వ్యక్తి మావద్దకు రావద్దు. విశాల దిశలందున్న ధనము మాది కావలెను. శత్రువు నష్టపోవలెను.

9. అమర దేవతలారా ! ఏకద్యుఋషి మిమ్ములను మీ భార్యలను వర్ధిల్లచేయును. సంతృప్తిచెందించును. మాకు విశేష ధనమును ఇమ్ము. కర్మధన ఇంద్రుడు ప్రాతఃకాలమే విచ్చేయవలెను.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత ఆరవ అష్టకము ఎనిమిదివ మండలమున ఎనిమిదవ అనువాకము సమాప్తము)*

## తొమ్మిదవ అనువాకము అరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - కణ్వపుత్ర కుసేదనుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - గాయత్రి.

1. ఇంద్రా ! నీ చేతులు గొప్పవి. నీవు మాకిచ్చుటకు - స్తుత్యము, విచిత్రము, గ్రహణయోగ్యమగు ధనమును కుడిచేత పట్టుకొనుము.

2. ఇంద్రా ! నీవు బహుకర్మ, బాహుదాత, బహుధని, బహు రక్షణల వాడనని మాకు తెలియును.

3. శూర ఇంద్రా ! నీవు ధనము కోరినంత - భయంకర వృషభ సములైన దేవతలుగాని మానవులుగాని నిన్ను బాధించలేరు.

4. మానవులారా ! రండి. ఇంద్రుని స్తుతించండి. అతడు స్వయం ప్రకాశకధనములకు అధిపతి. ఇతర ధనికుల వలె అతడు ధనముద్వారా బాధించరాదు.

5. ఇంద్రా ! నీ స్తుతిని ప్రశంసింపుము. మేము దానిని గానము చేతుము. నీవు సామవేదస్తుతులను వినుము. ధన యుక్తడవై మమ్ము అనుగ్రహించుము.

6. ఇంద్రా ! మా కొరకు విచ్చేయుము. రెండు చేతులతో దానము చేయుము. మమ్ము ధనమునుంచి విడదీయకుము.

7. ఇంద్రా ! నీవు ధనము వద్దకు వెళ్లుము. శత్రు విజేత ఇంద్రా ! మానవులలో దానశూన్యులగువారి ధనమును కొనిరమ్ము.

8. ఇంద్రా ! విప్రులు భజించు ధనము, నీ వద్దనున్న ధనమును - మ్మెఉ కోరినపుడు మాకు ఇమ్ము.

9. ఇంద్రా! నీ అన్నము త్వరగా మా వద్దకు రావలెను. అది అందరికి ప్రసన్నదాయకము. అనేక ఆశలు పెట్టుకున్న మా స్తోతలు నిన్ను వెంటనే స్తుతింతురు.

*(శ్రీమదాంధ్రవచన ఋగ్వేదసంహిత ఎనిమిదవ మండలము ఆరవ అష్టకము అయిదవ అధ్యాయము సమాప్తము)*

**ఓం నతామినన్తిమాయనో నధీరావ్రతా దేవానాం ప్రథమా ధ్రవాణి**
**నరోదసీ అద్రుహ వేద్యాభర్న పర్వతానినమే స్థివాంసః**

**ఆరవ అధ్యాయము దెబ్బది ఒకటవ సూక్తము**

ఋషి - కాణ్వకుసేదుడు దేవత - ఇంద్రుడు ఛందస్సు గాయత్రి

***ఓం ఆప్రదవపరానతో ద్వావతశ్చ వృత్రహన్ మధ్వః ప్రతి ప్రభర్మణి***

1. వృత్రఘ్న ఇంద్రా! యజ్ఞపు మదకర సోమము కొరకు దూరస్థానమునుండియు, సమీపస్థానము నుండియు విచ్చేయుము.

2. త్వరగా మత్తు కలిగించు సోమము అభిషుతమైనది. రమ్ము స్వీకరింపుము. మత్తుడవగుము. సేవింపుము.

3. సోమరూప అన్నముద్వారా మత్తుడవగుము. వృత్రుణి వధించిన కోపము శమించవలెను. నీ హృదయమునకు సోమము సుఖము కలిగించవలెను.

4. శత్రుశూన్య ఇంద్రా! నీవు ద్యులోకస్థ దేవతల సహితుడవై ప్రకాశించువాడవు. దగ్గర ఉన్న యజ్ఞమునకు ఉక్థమంత్రముల ద్వారా పిలువ బడినావు. కావున త్వరగా విచ్చేయుము.

5. ఇంద్రా ! ఈ సోమము శిలలతో సిద్ధమైనది. వాలు, మున్నగునవి కలుపుబడినవి. నీ ఆనందమునకుగాను అగ్నిలో హుతము చేయబడుచున్నవి.

6. ఇంద్రా !నా ఆహ్వానము వినుము. మేము అభిషవించిన నవ్యమిత సోమపానము చేయుము. వివిధరీతుల తృప్తినందుము.

7. ఇంద్రా ! నీవు ఈశ్వరుడవు. అభిషుత సోమము చమసచ పాత్రలందున్నది సేవించుము.

8. నీటిలో చంద్రునివలె చములో సోమము కనిపించుచున్నది. నీవు ఈశ్వరుడవు దీనిని సేవింపుము.

9. గాయత్రి శ్యేనపక్షిరూపము ధరించినది. అంతరిక్షమున సోమరక్షక గంధర్వులను ఓడించినది. ఆ సోమమును ఈ రెండు ఫవనములకు తెచ్చినది నీవు ఈశ్వరుడవు. ఆసోమమును సేవించుము.

## డెబ్బది రెండవ సూక్తము

ఋషి - కాణ్వకుసేదునుడు, దేవత - విశ్వదేవతలు, ఛందస్సు -గాయత్రి.

1. దేవతలారా ! మీరు కోరికలు తీర్చువారు. మమ్ము పాలించండి. మీ మహా రక్షణలు కలుగ చేయమని ప్రార్థించుచున్నాము.

2. మిత్ర, వరుణ, ఆర్యమ దేవతలు సదా మాకు సహాయకులు కావలెను. వారు శోభన స్తుతివంతులు. మమ్ము వర్ధిల్లచేయువారు.

3. సత్యనేత దేవతలారా !నావలో నీటిని దాటించినట్లు విశాలము, అనంతమగు శత్రుసేననుండి మమ్ము దాటించండి.

4. మేము పూజనీయ, ధనము కొరకు ప్రార్థించుచున్నాము. వరుణ, ఆర్యమలారా! మాకు పూజనీయ ధనము కలిగించండి.

5. దేవతలారా ! మీరు మిక్కిలి జ్ఞానవంతులు. శత్రుసంహారకులు పూజ్యధనమునకు ప్రభువులు. ఆదిత్యులారా ! పాపసంబంధ ధనము మావద్దకు చేరరాదు.

6. దేవతలారా !మీరు ఉదారదాతలు. మీరు ఇంట ఉన్నను, మార్గమందున్నను - హవ్యవర్ధనమునకు - మిమ్మే ఆహ్వానిస్తాము.

7. ఇంద్ర, విష్ణు, మరుత, అశ్వినులారా! ఒకేజాతి వారిలో మా వద్దకు మాత్రమేరండి.

8. ఆవిధముగా మీరు వచ్చినంత మేము మిమ్ము ఎల్లరకు ప్రకటింతుము. అనంతరము మీరు మాతృగర్భము నుండి ఇద్దరిద్దరు జన్మించిన విధము, మీ బంధుత్వము ప్రకటించెదము.

9. మీరు దానశీలురు. మీలో ఇంద్రుడు శ్రేష్టుడు. మీరు దీప్తియుక్తులు. మీరు యజ్ఞమున నిలువండి. మిమ్ము నేను స్తుతిస్తాను.

## డెబ్బది మూడవ సూక్తము

ఋషి - కవిపుత్ర ఉశసుడు దేవత - అగ్ని ఛందస్సు - గాయత్రి

1. అగ్ని ప్రియతమ అతిథి మిత్రుని వలె ప్రియుడు. రథమువలె ధనము దహించువాడు. మీ కొరకు అగ్నిని నేను స్తుతిస్తాను.

2. దేవతలు అగ్నిని - విశేష జ్ఞానవంతునివలె - రెండు ప్రకారములుగా స్థాపించినారు. అట్టి అగ్నిని నేను స్తుతిస్తాను.

(జ్ఞానవంతునకు గృహకర్మము యజ్ఞకర్మము ఉభయములు విహితము. అగ్ని రెండు విధములుగా భూమియందును అంతరిక్షమునందు స్థాపించబడినాడు.)

3. తరుణ తమ అగ్నీ హవ్యదాతకు సంబంధించి మనుష్యులను పాలింపుము. స్తుతులు వినుము. మా

సంతానమును స్వయముగా రక్షించుము.

4. బలపుత్ర , అగ్నీ !నీవు అందరు కోరువాడవు. శత్రువులముందునకు చేరువాడవు. నిన్నునేను ఏస్తుతులతో, ఎట్లు స్తుతించగలను?

5. బలపుత్ర అగ్నీ ! యజమానుల మనసులకు అనుకూలముగా మేమునీకు హవ్యము ఎట్లు ఇవ్వగలము? ఈ నమస్కృతిని నేను ఎప్పుడు ఉచ్చరించగలను?

6. నీవే - మా కొరకు - మాస్తుతులను అన్నింటిని ఉత్తమ గృహవంతము, ధనవంతము, అన్నవంతము చేయుము.

7. గార్హపత్య అగ్నీ! నీవు ఇప్పుడు ఎవని కర్మను సఫలీకృతము హేయుచున్నావు? నీ స్తుతులు ధనప్రదములు.

8. యజమానులు తమ గృహములందు - చక్కని బుద్ధిమంతుడు, సుకృతి, యుద్ధమందు అగ్రగామి - అగ్నిని పూజింతురు.

9. అగ్నీ! పటిష్ట రక్షణలతో తన గృహమున ఉండువాడు, శత్రువులు ఓడించలేనివాడు, శత్రువులను ఓడించువాడు పుత్ర, పౌత్రసహితుడై వర్ధిల్లును.

## డెబ్బది నాలుగవ సూక్తము

ఋషి - అంగిరస కృష్ణుడు , దేవత - అశ్వినులు, ఛందస్సు - గాయత్రి.

1. నాసత్య అశ్విద్వయమా ! మా ఆహ్వానము వినండి. మాదక సోమపానమునకు మా యజ్ఞమునకు విచ్చేయండి.

2. అశ్విద్వయమా ! మదకర సోమపానమునకు నా ఆహ్వానము వినండి. నా స్తోత్రమును ఆలకించండి.

3. అన్నవంతులు, ధనవంతులగు అశ్వినులారా ! మదకర సోమపానమునకు ఈ కృష్ణ ఋషి - మిమ్ము పిలుచుచున్నాడు.

4. నేతలారా ! స్తోత్రపారాయణపరుడు, స్తోత కృష్ణుని ఆహ్వానమునకు ఈ కృష్ణుని ఆహ్వానమును సోమపానము కొరకు వినండి.

5. నేతలారా! మాదక సోమపానము కొరకు - విప్రస్తోత కృష్ణునకు గృహప్రదానము చేయండి.

6. అశ్విద్వయమా! ఈ విధముగనే స్తోత మరియు హవ్యదాత గృహమునకు సోమపానమునకు విచ్చేయండి.

7. వర్షించు ధనిక అశ్విద్వయమా ! సోమపానమునకు గట్టిరథమున అశ్వములను పూన్చండి.

8. అశ్విద్వయమా ! మూడు బంధురములు, మూడు మూలాల రథమున - మాదక సామము సేవించుటకు విచ్చేయండి.

9. నాసత్యద్వయమా ! మాదక సోమపానమునకు గాను నా స్తుతివచనములవైపు వేగముగా విచ్చేయండి.

## డెబ్బది అయిదవ సూక్తము

ఋషి - కృష్ణపుత్రుడు విశ్వకుడు, దేవత - అశ్వినులు, ఛందస్సు - బృహతి.

1. అశ్వినులారా! మీరు దర్శనీయులు, వైద్యులు. సుఖవంతులు. మీరు దక్షుని స్తుతిసమయమున ఉన్నారు. విశ్వకుడనను నేను మిమ్ము సంతానము కొరకు ఆహ్వానిస్తున్నాను. మన బంధుత్వమును వేరు చేయకండి. గుఱ్ఱముల కళ్లెము సడలించండి.

2. అశ్వీద్వయమా ! విమాన ఋషి పూర్వకాలమున మిమ్ము ఎట్లు ప్రార్థించినాడోగాని అతనిని ధనవంతుని చేయుటకు మనసులందు నిశ్చయించినారు. విశ్వకుడు మిమ్ము అట్లే ఆహ్వానించుచున్నాడు. మన బంధుత్వము విడువకండి. గుఱ్ఱములు కళ్లెములు సడలించండి.

3. అనేకులను పాలించు అశ్విద్వయమా ! నా పుత్రుడగు విష్ణువాపుని ధనాభిలాషను తీర్చుటకుగాను అతనికి ధన వృద్ధిని ప్రసాదించినారు. అట్టి మిమ్ము - సంతానము కొరకు విశ్వకుడు ఆహ్వానించుచున్నాడు. మన బంధుత్వము విడువకండి, గుఱ్ఱముల కళ్లెములు సడలించండి.

4. అశ్విద్వయమా ! మీరు వీరులు. ధన భోజ్యులు. అభిషుత సోమయుక్తులు. దూరమున ఉన్న విష్ణువువంటి మిమ్ము ఆహ్వానించుచున్నాము. తండ్రివి వలె విష్ణువాపుని స్తుతులు సహితము అత్యంత పూర్ణములు. మనబంధుత్వము విడవకండి.

5. అశ్విద్వయమా! సత్యమూలముననే సూర్యుడు తన కిరణములను - సాయంత్రము ఉపసంహరించును. సత్యపుశృంగము పైననే సూర్యుడు తన కిరణములను - సాయంత్రము ఉపసంహరించును. సత్యపుశృంగము పైననే సూర్యుడు తనకిరణములను - ఉదయమున. విస్తరించును. సత్యముగా సూర్యుడు సేనలు గల శత్రువులను

ఓడించును. మన బంధుత్వము విడవకండి.

## డెబ్బది ఆరవ సూక్తము

ఋషి - అంగిరస కృష్ణుడు లేక వాపిష్ఠద్యుమ్నీకుడు దేవత - అశ్వినులు ఛందస్సు - బృహతి

1. అశ్విద్వయమా! ద్యుమ్నీక ఋషి మీ స్తోత. వానకాలమున బావుల నీరువలె మీరు విచ్చేయండి. ఈ స్తోత ద్యుతిమంతమగు యజ్ఞమున మదకర అభిషుత సోమమును అభిలషించువాడు. గౌరమృగము జలాశయములందు నీరు త్రావినట్లు - అభిషుత సోమపానము చేయండి.

2. అశ్వినులారా ! చషకమందున్న రసవంతసోమమును ఆస్వాదించండి. యజ్ఞమందు ఆసేనులు కండి. మానవ గృహేములందు ఉన్మత్తులై, హవ్యము సహితముగ సోమము స్వీకరించండి.

3. అశ్విద్వయమా ! యజమాని మిమ్ము సకల రక్షణలతో ఆహ్వానించుచున్నాడు. కుశలు పరచి, సదా హవిని సేవించు యజమాని ఇంటికి ప్రాతఃకాలముననే చేరుకొనండి.

4. అశ్విద్వయమా ! రసవంతసోమపానము చేయండి. తదుపరి సుందర కుశలమీద ఆసీనులుకండి. అనంతరము ప్రవృద్ధులై మా స్తుతులవైపు జలాశయమునకు గౌరమృగములవలె విచ్చేయండి.

5. అశ్వినులారా ! మీరు వెంటనే స్నిగ్ధరూప అశ్వములతో విచ్చేయండి. దర్శనీయులు, సువర్ణ రథవంతులు, జలపాలకులు, యజ్ఞవర్ధకులగు అశ్వినులారా ! సోమపానము చేయండి.

6. అశ్వినులారా! మీరు సుగమనులు, వివిధ కర్మలవారు. మేము స్తోతలము, విప్రులము. అన్నలాభము కొరకు మిమ్ము ఆహ్వానించుచున్నాము. మా స్తుతిరూప ఆహ్వానము వినండి త్వరత్వరగా విచ్చేయండి.

## డెబ్బది ఏడవ సూక్తము

ఋషి - గౌతమనోధసుడు దేవత - ఇంద్రుడు ఛందస్సు - ప్రగాథ

1. ఇంద్రుడు దర్శనీయుడు. దుఃఖనివారకుడు. సోమపాన ఉన్మత్తుడు. పగటిపూట గోశాలలో గోవులు తమదూడలను పిలిచినట్లు - మేము ఇంద్రుని స్తుతించి ఆహ్వానించుచున్నాము.

2. ఇంద్రుడు దీప్తికి నివాసస్థానము. స్వర్గవాసి. ఉత్తమదాత. పర్వతమంతటి బలవంతుడు. అనేకుల పాలకుడు.

మాకు బలిష్టులగు పుత్రాదులను, వందల, వేల ధన గోయుక్త అన్నము ప్రసాదించుమని ఇంద్రుని యాచించుచున్నాము.

3. ఇంద్రా ! ఉన్నత, సుదృఢ పర్వతములు సహితము నిన్ను బాధింపజాలవు. నీవు నావంటి స్తోతకు ధనమునివ్వదలతువు. దానిని ఎంతటి వాడను నష్టపరుపజాలడు.

4. ఇంద్రా! నీ స్వబలము, కర్మలతో నీవు శత్రువులను నాశము చేతువు. ఈ స్తోతదేవతలను పూజించువాడు. నీవు నీ కర్మబలమున సకల వస్తువులను జయించగలవు. ఈ స్తోత తన రక్షణ కొరకు - నిన్ను పూజించుచున్నాడు. ఇంద్రా! గౌతములు నిన్ను ఆవిర్భవింపచేసినారు.

5. ఇంద్రా ! ద్యులోక పర్యంతమునకు నీవే ప్రధానుడవు. నీ బలమున పార్థివలోకమును పాలించగలవు. నీవు మాకు అన్నము ప్రసాదించుము.

6. ధనద ఇంద్రా ! నీవు హవ్యదాతకు ఇచ్చు ధనమును బాధించగలవాడు లేడు. నీవు ధనప్రేరకుడవు, దానశీలుడవు అగుము. ధనప్రాప్తికొరకు మేము చేయు స్తుతులను వినుము.

## డెబ్బది ఎనిమిదవ సూక్తము

ఋషి - అంగిరస నృమేధ, పురుమేధులు దేవత - ఇంద్రుడు ఛందస్సు - 1, 2, ప్రగాథ - 5,6, అనుష్టుప్ -7 బృహతి.

1. యజ్ఞవర్ధక విశ్వేదేవరలు ఈ గానమున - దీప్తుడు నిరంతర జాగృతుడగు -జ్యోతి సూర్యుని - కల్పించినారు. మరుత్తులారా ! ఇంద్రుని కొరకు పాపవినాశకము విశాలమగు గానములు పాడండి.

2. స్తోత్రశూన్యుల వినాశకుడగు ఇంద్రుడు శత్రుహింసను దూరము చేసినాడు. అప్పుడు ఇంద్రుడు యశస్వియు, తేజస్వియు అయినాడు. విశాల దీప్తివంత, మరుద్యుక్త ఇంద్రా! దేవతలు నీ స్నేహము కోరినారు. నిన్ను స్వీకరించినారు.

3. ఇంద్రుడు మహామహుడు. మరుత్తులారా ! ఇంద్రుని స్తోత్రములు ఉచ్చరించండి. వృత్రఘ్న, శతక్రతు ఇంద్రుడు నూరు గణుపుల వజ్రమున వృత్రుని హతమార్చినాడు.

4. ఇంద్రా! నీవు శత్రువధకు ప్రసిద్ధుడవు. నీ వద్ద చాలా అన్నము ఉన్నది. నీవు సుదృఢ మనస్కుడవై మాకు అన్నము ప్రసాదించుము. జలము మాకు మాతృస్వరూపము. ఆ జలము అనేక ప్రదేశములందు ప్రవహించవలెను. జలములను

నిరోధించు వృత్రుని నాశము. సర్వభూతజాలములను జయించుము.

5. ఇంద్రా ! నీ ధనము అపూర్వము. వృత్రవధ కొరకు నీవు అవతరించినపుడు పృథ్విని స్థిరపరచినావు - ద్యులోకమును నిలిపినావు.

6. అప్పుడు నీ కొరకు యజ్ఞము ఉత్పన్నమైనది. ఆనంద దాయకములగు మంత్రములు ఆవిర్భవించినవి అప్పుడునీవు పుట్టిన, పుట్టనున్న లోకములను వశపరచుకున్నావు.

7. అప్పుడు అపక్వదుగ్ధములుగల గోవులకు పక్వదుగ్ధములు కల్పించినావు. ద్యులోకమునకు సూర్యుని ఎక్కించినావు.

స్తోతలారా ! సామమంత్రములద్వారా - ప్రవర్గ్య సోమసమశోభాయమాన స్తుతులతో ఇంద్రుని వర్ధిల్లచేయండి. స్తుతప్రియుడగు ఇంద్రుని కొరకు - హర్షదము, విశాలమగు సోమగానము చేయండి.

## డెబ్బది తొమ్మిదవ సూక్తము

ఋషి - అంగిర నృమేధ, పురుమేధులు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - బృహతి

1. ఇంద్రుడు సకల యుద్ధములకు ఆహ్వానయోగ్యుడు. అతడు మా స్తోత్రములను మన్నించవలెను. మూడు సవనములకు విచ్చేయవలెను.

ఇంద్రుడు వృత్రఘ్నుడు. అతని ఆయుధము అవినాశ్యము అతడు స్తుతియోగ్యుడు. అభిముఖ అర్హుడు.

2. ఇంద్రా !నీవు సత్యమవు. అందరకు ప్రధానధన ప్రదుడవగుము. స్తుతులను ఐశ్వర్యవంతములు చేయుము. నీవు ఎంతో ధనవంతుడవు. బలపుత్రుడవు. మహామహుడవు. నీకు యోగ్యమగు ధనమును మేము ఆశ్రయింతుము.

3. ఇంద్రా ! నీవు స్తుతింపదగినవాడవు. నీ కొరకు మేము యదార్ధసోత్రములు రచిస్తాము. నీవు ఆ స్తుతులందు చేరుము. వానిని స్వీకరించుము. నీ కొరకు మేము ఉచ్చరించు స్తోత్రముల నన్నింటిని స్వీకరింపుము.

4. మఘవా ! నీవు సత్యమవు - "త్వంహిసత్యోమఘవన్" నీవు ఎవ్వనికిని లొంగలేదు. రాక్షసులను నశింప చేసినావు. హవ్యదాతకు ధనము అందునట్లు చేయుము.

5. బలాధిపతి ఇంద్రా! నీవు అభిషుత సోమవంతుడవై యశస్విని అయినావు. ఎవరును ఎరుగజాలని, గెలువ జాలని రక్కసులను - నీవు ఒక్కడవే - మానవులను రక్షించు వజ్రముతో హతమార్చినావు.

6. బలశాలి ఇంద్రా ! నీవు విశిష్టజ్ఞానవంతుడవు మేము - పితృధనభాగమువంటి ధనమునిమ్మని నిన్ను యాచించుచున్నాము. నీ కీర్తి, ఎంత విశాలమో నీ గృహము అంత విశాలము, అది ద్యులోకమున ఉన్నది, నీ సుఖములన్నింటిని మా వరకు చేరనిమ్ము.

**ఎనుబదవ సూక్తము**

ఋషి - అత్రి పుత్రి ఆపాల, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - 1,2. పంక్తి
మిగిలిని అనుష్టుప్.

1. జలములకు స్నానమునకు వెళ్లునపుడు అపాల కన్యనగు నేను ఇంద్రుని ప్రసన్నుని చేయ దలచినాను. నా కున్న చర్మరోగనివారణకు - నాకు మార్గమున - సోమము లభించినది. ఆ సోమముతో నేను అన్నాను.

***"ఇంద్రాయసునవై త్వాశక్రాయ సునదైత్వా"*** నిన్ను ఇంద్రుని కొరకు అభిషవించుచున్నాను. శక్రుని కొరకు అభిషవించుచున్నాను.

2. ఇంద్రా! నీవు వీరుడవు అత్యంత దీప్తిమంతుడవు. విశేషగృహమునకు వెళ్లువాడవు. ఇది అభిషుత సోమము. దీనిని దంతములతో నమిలి సిద్ధము చేసినాను. యవలసత్తు పురోడాశాదులను, ఉక్థను సమర్పించినాను. వానిని స్వీకరింపుము. అపాలకు చర్మరోగము. ఆమెను భర్త విడిచినాడు. ఆ రోగ నివారణకు ఇంద్రుని ప్రార్థించదలచ నవి ఆమెకు అభిషవశిలలు లభించలేదు. దంతములతో నమిలి సోమము సిద్ధము చేసినది.

(ఇది భక్తి ఆవేశము. ఆవేశమున విధినిషేధములు ఉండవు. భక్త కన్నప్ప పుక్కిటి నీటితో కాళహస్తీశ్వరుని అభిషేకము చేసినాడు ! ఇది వేదమున తొలి ఉదాహరణ)

3. ఇంద్రా ! నిన్ను తెలుసికొన గోరినాను. తెలియలేకున్నాను.

సోమమా! ఇంద్రుని కొరకు తొలుతమెలమెల్లగగా తదుపరి వేగముగా ప్రవహింపుము.

4. ఆ ఇంద్రుడు నన్ను - అపాలను - బహువాక్కుల సమర్థము చేయవలెను. బహు సంఖ్యను చేయవలెను. అనేక మారులు ధనికురాలీని చేయవలెను. నన్ను నా భర్త విడిచినాడు. నేను ఇటకు వచ్చినాను నేను ఇంద్రుని కలిసికొందును.

5. ఇంద్రా ! నా తండ్రి తలను, పొలమును, నాగర్భమును ఉత్పాదక స్థానములను చేయుము.

(అపాల తండ్రి తలమీద వెంట్రుకలులెవు. మొలిపించవలెను. పొలము ఊసరమైనది. పండించవలెను. అపాలకు

సంతానములేదు కలిగించవలెను.)

6. నా తండ్రిది ఊసరక్షేత్రము. చర్మవ్యాధివలన నా వంటి మీద వెంట్రుకలు లేవు. నా తండ్రి తలమీద వెంట్రుకలేదు. "సర్వాతారోమశాకృధి" అన్నింటికి వెంట్రుకలు మొలిపింపుము.

(పొలమునకు సంబంధించి పంటపండించుము.)

7. శతక్రతు ఇంద్రుడు తనరథపు పెద్దరంధ్రములు, శకటపు చిన్న రంధ్రములు, సంధుల చిన్నరంధ్రములను శోధించి అపాలను సూర్యసమాన తేజస్విని - చర్మయుతను చేసినాడు.

(ఇది చర్మరోగము -కుష్ఠువంటివానికి - చికిత్సవలెఉన్నది. సూర్యరశ్మిని కొన్నిరంధ్రముల ద్వారా ప్రసరింపచేయు చికిత్సవలె ఉన్నది.)

## ఎనుబది ఒకటవ సూక్తము

ఋషి - అంగిరస శ్రుతకక్షుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు - మొదటిది అనుష్టుప్ - మిగిలినవి గాయత్రి.

1. ఋత్విక్కులారా ! ఇంద్రుడు అందరిని భరించువాడు. శతయాజ్ఞకుడు. మానవులందరిలో అధిక ధనదాత. అట్టి సోమపాయ ఇంద్రుని విశేషమున స్తుతించండి.

2. మీరు ఇంద్రుని - బహుజన ఆహూథునిగ, అనేకులచే స్తుతించ బడువాడగ, గానయోగ్యునిగ, సనాతనునిగా స్తుతించండి.

3. ఇంద్రుడే మాకు మహాధనదాత. మహా అన్న ప్రదాత. అందరిని ఆటలాడించువాడు. మహా ఇంద్రుడు మా వద్దకు రావలెను. మాకు ధనమందించవలెను.

4. సుందర కిరీట ఇంద్రుడు - హోతమరియు నిపుణుడగు సుదక్ష ఋషి సమర్పించిన యవలు కలసి, పాత్రయందున్న సోమమును - పానము చేసినాడు.

5. సోమ పానమునకు గాను మీరు ఇంద్రుని విశేషముగ పూజించండి. సోమమే ఇంద్రుని వర్ధిల్లచేయును.

6. ఇంద్రుడు ప్రకాశమానుడు. అతడు సుదకర సోమపానము చేయును. దాని బలమున సకల భువనములను

అణిచిఉంచును.

7. సర్వదమనుడు, మీ సకల స్తోత్రములందున్న ఇంద్రునే - మీ రక్షణ కొరకు ఆహ్వానించండి.

8. ఇంద్రుడు శత్రునాశకుడు. రాక్షసులకు అగమ్యుడు. ఆహింసితుడు. సోమపాత. సర్వజననేత. ఇంద్రుని కార్యములకు అంతరాయము కలిగించువాడులేడు.

9. ఇంద్రా! నీవు స్తుతుల ద్వారా సంభోదన యోగ్యుడవు. విద్వాంసుడవు. శత్రువుల వద్ద హరించిన ధనమును మాకు అనేక సార్లు అందించుము. శత్రుధనముతో మమ్ము రక్షింపుము.

10. ఇంద్రా ! ఈ ద్యులోకము నుండియే వందలు, వేల బలములు, ఆననములు అందుకొని మా వద్దకు రమ్ము.

11. సమర్థ ఇంద్రా ! మేము కర్మవంతులము. యుద్ధమున జయంచుటకు కర్మలు చేసెదము. పర్వతభంజక, వజ్రధర ఇంద్రా ! మేము యుద్ధములందు అశ్వములతో విజయులమగుదుము.

12. గోపాలుడు గడ్డి అందించి గోవులను సంతుష్టలను చేయును. అట్లే బహుకర్మ ఇంద్రా ! నీ నలువైపులా ఉక్థలు చదివి నిన్ను సంతుష్టుని చేసెదము.

13. శతక్రతు ఇంద్రా ! సకల జగములు కోరికలుగలవి. మేము సహితము ధనాది కోరికల పారలము. వాటిని ఫలింప చేయుము.

14. బలపుత్ర ఇంద్రా ! నరులు కోరికలవారు. కాతరశబ్దములవారు. వారునిన్నే ఆశ్రయింతురు. అందువలన విదేవత కూడ నిన్ను మించజాలడు.

15. కోరికలు తీర్చగల ఇంద్రా ! నీవు అందరిని మించిన ధనదాతవు. భయంకర శత్రువును దూరము తరుమువాడవు. అనేకులను భరించగలవాడవు. కర్మలద్వారా మమ్ము పాలించుము.

16. బహువిధ కర్మ ఇంద్రా! సొమము అన్నింటిని మించిన యశస్వి. పూర్వకాలమున నీకొరకు మేము అభిషవించినాము. దానితో ఉన్మత్తుడవగుము. మమ్ము మత్తులను చేయుము.

17. ఇంద్రా! నీ ఉన్మత్తత వివిధ కీర్తియుక్త. మేము అభిషవించిన సొమము అన్నిటి కన్న ఎక్కువ పాపనాశకము - బలప్రదాత.

18. ఇంద్రా! నీవు వజ్రధరుడవు. యదార్ధకర్మివి. సోమపాయివి. దర్శనీయుడవు. నీవు సకల మానవులకు ఇచ్చిన ధనమును మాత్రమే ఎరుగుదుము.

19. ఇంద్రుడు ఉన్మత్తుడు. మేము స్తుతులు వచింతుము. అవి అభిషుత సోమమును స్తుతించవలెను. స్తోతలు సోమమును పూజించవలెను.

20. ఇంద్రునిలో సకల కాంతులు నిలిచి ఉన్నవి. అతనిలో ఏడుగురు హోతులు ఉన్నారు. అతడు సోమము సమర్పించి నంత ప్రసన్నుడగును. అట్టి ఇంద్రునే సోమాభిషవమైనంత - ఆహ్వానిస్తాను.

21. దేవతలారా ! మీరు త్రికద్రుకము కొరకు జ్ఞానసాధక యజ్ఞము చేసినారు. మా స్తుతివాక్యము ఆ యజ్ఞమును వర్ధిల్ల చేయునుగాత.

(జ్యోతిర్గౌరాయంతి త్రికద్రుకాః అని శాయణుడు. జ్యోతి - గోవులు - ఆయువు ఈ మూడు త్రికద్రుకము. "చేతనం యజ్ఞమ్" అని మంత్రము. చేతనఃజ్ఞానసాధనం యజ్ఞం అని శాయణుడు.)

22. ఇంద్రా! నదులు సముద్రమునకు చేరినట్లు - స్కల్ సోమములు నీలో ప్రవేశించును.

23. మనోరధపూరక , జగృత ఇంద్రా ! నీవు నీ మహిమతో సోమపానమున వ్యాపించినావు. పాత్రయందలి సోమము యధేచ్ఛగా నీ దేహమున చేరవలెను.

24. వృత్రఘ్న ఇంద్రా! నీ ఉదరమునకు సోమము పర్యాప్తము కావలెను. మా సోమమే నీకు సరిపోవలెను.

25. నేను శ్రుతకక్షుడను. అశ్వప్రాప్తికొరకు మరింతగానము చేయుదును. గృహమునకుగాను ఇంద్రుని ఎంతో కీర్తింతును.

26. ఇంద్రా! అభిషవమైనంత సోమము నీకు పర్యప్తము కావలెను. నీవు సమర్ధుడవు ధనదుడవు. సోమము కొరకు నీవు పర్యాప్తుడవు.

27. వజ్రధర ఇంద్రా! నీవు దూరముగా ఉన్నను మాస్తుతి నిన్ను చేరవలెను. నీ నుంచి మాకు విశేషధనము లభించవలెను.

28. ఇంద్రా ! నీవు శూరుడవు. ధైర్యశాలివి, నీవు వీరులనే కోరుకుందువు. అందరు నిన్ను ఆరాధించవలెను.

29. బహుధని ఇంద్రా ! సకల యజమానులు నీ దానమునే ఆశిస్తారు. మాకు సహాయకుడవు అగుము.

30. అన్నపతి ఇంద్రా! నీవు సాంద్రతగల నాస్తిక బ్రాహ్మణుని వంటివాడవుకాకుము. అభిషుతము, క్షీరాది యుక్తమగు సోమపానము చేయుము.

31. ఆయుధపాణులగు రాక్షసులు రాత్రిళ్లు మమ్ము నియంత్రించరాదు. ఇంద్రా !నీ సాయమున మేము వారిని నాశనము చేయుదుము.

32. ఇంద్రా! నీ సాయము అందుకొని మేము శత్రువులను దూరము చేయుదుము. ***"త్వమస్మాకం తవస్మసి"*** నీవు మా వాడవు మేము నీ వారలము.

33. ఇంద్రా! స్తోతలు నిన్ను అభిలషింతురు. మాటమాటకు నిన్ను స్తుతింతురు. స్తోతలు నీకు బంధుస్వరూపులు. వారు నిన్ను సేవింతురు.

## ఎనుబది రెండవ సూక్తము

ఋషి - సుకక్షుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు -గాయత్రి.

1. సూర్యాత్మక ఇంద్రుడు ప్రసిద్ధధనవంతుడు. మనోరథపూరకుడు. మానవహితైషి కర్మవంతుడు ఉదారుడు. అతడు యజమానికి నలువైపుల ఉదయించును.

2. ఇంద్రుడు తన బాహుబలమున తొంబది తొమ్మది పురములను ధ్వంసము చేసినాడు. వృత్రుని హతమార్చినాడు. మేఘుని వధించినాడు.

3. అతడే - ఆ కళ్యాణకారి, బంధువగు ఇంద్రుడు -పాలిచ్చుపాడియావువలె - మాకు అశ్వములు, గోవులు, యవల యుక్తధనమును అందించవలెను.

4. వృత్రఘ్న, సూర్య ఇంద్రా ! నేటి పదార్థములన్నింటిలో తొలుత నీవే వెలువడినావు ఆ విధముగా సకల లోకములు నీవశవర్తులైనవి.

5. ప్రవృద్ధ, సత్పతి ఇంద్రా ! నీవు అమరుడనమ కొనుచున్నావా? అది నిజమే కదా! **"అతో తత్సత్యమిత్తవ"**

6. దూరము కానీ దగ్గర కానీ సొమము అభిషవించు ప్రదేశమునాకు చేరుదువు.

7. ఇంద్రుడు ధనవర్షకుడు. వరప్రదుడు. వృత్రుని వధించుటకు ఆ ఇంద్రునే మేము బలశాలిని చేయుదుము.

8. ప్రజాపతి ఇంద్రుని ధనదానమునకే సృష్టించినాడు. ఇంద్రుడు అందరికన్న ఓజస్వి సోమపానమునకు ఏర్పడినవాడు. అత్యంత కీర్తిమంతుడు. స్తుతిమంతుడు. సోమయోగ్యుడు.

9. స్తుతులతో వజ్రమువంటి తేజస్వి, బలశాలి, అపరాజితుడు, మహామహుడు, ఆహింసిత ఇంద్రుడు ధనాదులు వహించ ఇచ్ఛగించును.

10. స్థితియోగ్య, ధనిక ఇంద్రా! నీవు మమ్ము కోరుకున్నచో - స్తుతుడవై, దుర్గమ స్థానమందును మాకు సుగమ మార్గము కల్పించుము.

11. ఇంద్రా ! నేటికిని నీ బలమునుగాని, రాజ్యమును గాని బాధించగలవాడులేడు. దేవతలు హింసించరు. సంగ్రామ మందలి వీరులు బాధింపరు.

12. అందమగు దవడల ఇంద్రా ! నీ అప్రతిహత బలమును ద్వావా పృథ్వులు పూజింతురు.

13. నీవు ఎర్రని, నల్లని ఆవులకు తెల్లని పాలనే ఇచ్చినావు.

14.సకల దేవతలు వృత్రుని తేజము చూసి పారి పోయినప్పుడు - మృగరూపవృత్రుని చూచి గడగడలాడినపుడు.

15. అప్పుడు మా ఇంద్రుడు వృత్రహంత అయినాడు అజాతశత్రువు, వృత్రఘ్న ఇంద్రుడు తన శౌర్యమును ప్రకటించినాడు.

16. ఋత్విక్కులారా ! ప్రఖ్యాత, వృత్రఘ్న, బల ఇంద్రుని స్తుతించి మాకు మరిన్ని దానములు చేసెదరు.

17. ఇంద్రునకు అనేక పేర్లున్నవి. అతనిని అనేకులు స్తుతింతురు. అతడు విశేషసోమపానమునకు విచ్చేసినపుడు మేము గోవంతులము, బుద్ధిశాలురము అగుదుము.

18. వృత్రహంతయు, అనేక అభిషవములుకల ఇంద్రుడు గ్రహించవలెను మాస్తుతులు వినవలెను.

19. అభీష్టవర్షక ఇంద్రా! నీవు ఎట్లు మమ్ము ఉన్నత్తులను చేయుదువు? స్తోతలు చేయు ఎట్టి సేవలకు ధనము దానము చేతువు?

20. నీవు మత్తునందుము. మాకు వేల ధనములనిమ్ము. నీవు హవ్యదాత నియంతవు అది తెలిసికొనుము.

21. ఇదంతయు జలసిక్త సోమము - అభిషుతమైనది దీనిని ఇంద్రుడు స్వీకరించవలెను. సోమములన్నియు అది కోరియే ఇంద్రుని వద్దకు చేరును. త్రావినంత సోమము ఆనందము కలిగించును. సోమము జలము వద్దకు చేరును.

22. యజ్ఞమునందు వర్ధకులు, యజ్ఞకర్తలగు ఏడుగురు హోతులు యజ్ఞదినాంతమున తేజస్వులై ఇంద్రుని విసర్జింతురు.

(అవభృతస్నానమైనంత హోతలు తేజస్వులు అగుదురు. యజ్ఞాంతమున అవభృతస్నానము ఇంద్ర విసర్జన జరుగును.)

23. ప్రఖ్యాత ఇంద్రుని హర్యశ్వములు ఉన్నత్తలు - స్వర్ణకేశలు. అవి ఇంద్రుని హితకర అన్నము వైపు సాగించవలెను.

24. ప్రకాశవంత ధనపతి అగ్నీ !నీ కొరకు ఈ సోమము అభిషుతమైనది. కుశలు పరచబడినవి. స్తోతల సోమపానము కొరకు ఇంద్రుని పిలువుము.

25. ఋత్విక్కులారా ! యజమానులారా ! ఇంద్రునకు హవిసమర్పించు మీ కొరకు ఇంద్రుడు బలమును పంపవలెను - రత్నములను పంపవలెను. స్తోతల కొరకు సహితము ఇంద్రుడు బల, రత్నాదులవంపవలెను. మీరు ఇంద్రుని పూజించండి.

26. శతక్రతు ఇంద్రా! నీ కొరకు వీర్యవంతమగు సోమమును, సమస్త స్తోత్రములను సమకూర్చినాను. నీవు స్తోతలను సుఖవంతులను చేయుము.

27. ఇంద్రా ! నీవు మమ్ము సుఖపెట్టదలచిన మాకు శుభములనిమ్ము. అన్నమునిమ్ము బలమునిమ్ము.

28. ఇంద్రా ! నీవు మమ్ము సుఖపెట్టదలచిన మాకొరకు సమస్త మంగళములు తెమ్ము.

29. "యదింద్ర మృళయసినః" ఇంద్రా ! నీవు మమ్ము సుఖపెట్టదలచిన మేము అభిషుత సోమవంతులమై నిన్ను ఆహ్వానింతుము.

30. సోమపతి ఇంద్రా! హర్యశ్వములమీద స్వారి చేయుచు మా అభిషుత సోమము వద్దకురమ్ము - అభిషుత సోమము వద్దకు రమ్ము. *"హరిభిః సుతమ్ యాహిహరిభిః సుతమ్"*

31. ఇంద్రుడు శ్రేష్ఠుడు. వృత్రఘ్నుడు. శతక్రతువు. అతడు రెండు ప్రకారములుగా శత్రువధకు ఉగ్రుడుగా, జగద్రక్షణకు శాంతుడుగా - తెలియబడును. కావున అతడు హర్యశ్వములనెక్కి మా అభిషుత సోమము వద్దకు రావలెను.

32. వృత్రఘ్న ఇంద్రా ! నీవు ఈ సోమపు పానకర్తవు. కావున హరులతో అభిషుత సోమము వద్దకు విచ్చేయుము. *"ఉపనోహరిభిః సుతమ్"*

33. ఇంద్రుడు - అన్నదాతయు, అమరుడగు ఋభువును మాకీయవలెను. వాజనామకుడగు అతని సోదరుని మాకీయవలెను. *"వాజీదదాతు వాజనమ్"*

*(ఆంధ్రవచన ఋగ్వేదసంహిత ఆరవ అష్టకము ఎనిమిదవ మండలమున తొమ్మిదవ అనువాకము సమాప్తము)*

**పదవ అనువాకము ఎనుబది మూడవ సూక్తము**

ఋషి - అంగిరస బిందులేదా పూతదక్షుడు, దేవత - మరుత్తులు, ఛందస్సు - గాయత్రి.

1. గోవు ధనికులగు మరుత్తులకు మాత. అది తన పుత్రులకు సోమపానము చేయించును. గోవు అన్నభిలాషి మరుత్తుల రథమునులాగునది పూజినీయ.

2. సకల దేవగణములు గోవు వడిలో ఉండి తమతమ వ్రతములను ఆచరింతురు. సూర్య చంద్రులు సహితము సకల లోకములను ప్రకాశవంతము చేయుటకు గోవు వద్దనే నిలుతురు.

3. మాస్తోతలు సర్వత్రగాములు సోమపానమునకు మరుత్తులను స్తుతింతురు.

4. ఈ సోమము ఆభిషుతమైనది స్వయం ప్రకాశకులగు మరుత్తులు అశ్విద్వయము దీని అంశమును పానము చేయవలెను.

5. మిత్ర, ఆర్యమ, వరుణులు - దశాపవిత్రమున శోధితమైనదియు, మూడు స్థానములందు స్థాపించబడినదియు, జనస్తుత్వమును అగు సోమమును పానము చేయవలెను.

(ద్రోణ, కలశధావని, పూత భృదాఖ్యాని త్రీణిస్థానాని)

6. ఇంద్రుడు ప్రాతఃకాలమున - హోతతో సమముగా - అభిషుతి, గవ్యయుక్త సోమమును సేవించును - ప్రశంసించును.

7. మరుత్తులు ప్రాజ్ఞులు నీటివలె వంకర నడకలవారు. వారు ఎప్పుడు ప్రదీప్తులగుదురు? శత్రుహంతలగు మరుత్తులు బలవంతులై ఎప్పుడు మాయజ్ఞమునకు వచ్చెదరు?

8. మరుత్తులారా ! మీరు మహామహులు. దర్శనీయులు. తేజోవంతులు. ద్యులోమంతులు. మీరు మమ్ము ఎప్పుడు పాలింతురు?

9. మరుత్తులు సకల పార్థివ పదార్థములను, ద్యులోకపు జ్యోతులు విస్తరింపచేసినారు. అట్టివారినే సోమపానమునకు ఆహ్వానించుచున్నాము.

10. మరుత్తులారా ! మీ బలము పవిత్రము. మీరు అత్యంత ద్యుతిమంతులు. సోమ పానమునుకుగాను మిమ్ము త్వరగా ఆహ్వానిస్తాను.

11. ద్యావాపృథ్వులను నిలిపి ఉంచిన వారినే ఈ సోమపానమునకు *"ఆహ్వానిస్తాను."*

12. నలువైపుల విస్తరించిన వారు, పర్వతములపైస్థిరపడినవారు, జలవర్ణకులగు మరుత్తులను సోమ పానమునకు ఆహ్వానిస్తాను. *"హువే అస్య సోమస్య పీతాయే'*

**ఎనుబది నాలుగవ సూక్తము**

ఋషి - అంగిరస తిరశ్చి దేవత - ఇంద్రుడు ఛందస్సు - అనుష్టుప్

1. స్తుతిపాత్ర ఇంద్రా ! సోమాభిషవమైనంత మా స్తుతులు - రథవంత వీరునితో సమముగా -నీ వైపు తరలును. ఆవులు దూడలను చూచి అంబారావములు చేసినరీతి. మా స్తోత్రములు నిన్ను కీర్తించును.

2. ఇంద్రా ! నీవు స్తుతించబడు వాడవు - పాత్రలలో గల అభిషుత సోమము నిన్ను చేరవలెను. ఈ సోమభాగమును త్వరత్వరగా సేవింపుము. నీకు నలువైపుల చరుపురోడాశాదులు పెట్టి ఉన్నవి చూడుము.

3.ఇంద్రా ! గాయత్రి శ్యేనరూపము దాల్చినది. సోమమును ద్యులోకమునుండి తెచ్చినది. అట్టి అభిషుత సోమమును - నీ ఆనందము కొరకు - మెలమెల్లగా స్వీకరింపుము. నీవు మరుత్తులకు, దేవతలకు స్వామివి కదా!

4. "తిగశ్చి" హవిద్వారా నిన్ను పూజించును. అతని ఆహ్వానమును ఆలకింపుము. నీవు సుపుత్రులు, గో ధనాదులు అందించి అతనిని పరిపూర్ణుని చేయుము. నీవు దేవతలందు శ్రేష్ఠుడవు.

5. నవీనము, మదకర వాక్యమును నీ కొరకు కల్పించిన యజమానికొరకు ప్రాచీనము, సత్యయుక్తము, ప్రవృద్ధము, హృదయంగమగు రక్షణలు కలిగింతుము.

6. మా స్తుతులను, ఉక్థలను వర్ధిల్ల చేసిన ఇంద్రునే మేము స్తుతింతుము. ఆ ఇంద్రుని అనేక పౌరుషములను మేము కీర్తింతుము భజింతుము.

7. ఋషులారా ! త్వరత్వరగా రండి. ఇంద్రుడు వృత్రుని వధించినాడు. పరిశుద్ధుడు అయినాడు. అతనిని సోమగానములు ఉక్థమంత్రములతో స్తుతించండి. దశాపవిత్రము ద్వారా శోధిత సోమము ఇంద్రుని హృష్టుని చేయవలెను.

8. ఇంద్రా ! నీవు పరిశుద్ధుడవు. విచ్చేయుము. పరిశుద్ధ రక్షణలు, మరుద్యుక్తుడవై విచ్చేయుము. నీవు పరిశుద్ధుడవు. మాలో ధనమును స్థాపించుము నీవు పరిశుద్ధుడవు. సోమయోగ్యుడవు. ఉన్మత్తుడవగుము.

9. ఇంద్రా ! నీవు పరిశుద్ధుడవు. మాకు  ధనమునిమ్ము. హవ్యదాతకు రత్నములిమ్ము. నీవు పరిశుద్ధుడవు. వృత్రాది శత్రువులను వధించినవాడవు. నీవు పరిశుద్ధుడవు మాకు అన్నము అందించ తలచుము.

(ఇంద్రుడు రాక్షసులను వధించినాడు అపవిత్రుడు అయినాడు. అతడు తనను పరిశుద్ధుని చేయుమని ఋషులను ప్రార్థించినాడు. ఋషుల సామమంత్రములు మున్నగువానితో ఇంద్రుని పరిశుద్ధుని చేసినప్పటదీ ఈ మాట)

### ఎనుబది అయిదవ సూక్తము

ఋషి - మరుత్పుత్రుడు ద్యుతుడు లేక తిరశ్చి, దేవత - ఇంద్రుడు,

ఛందస్సు - త్రిష్టుప్ - 4 విరాట్.

1. ఇంద్రుని భయమున ఉషస్సులు తమ గమనములను వర్ధిల్ల చేయును. ఇంద్రుని కొరకే రాత్రులు రానున్న జామును సుందర వదనవంతము చేయును. ఇంద్రుని కొరకే గంగమున్నగు సప్తనదులు మానవులు దాటుటకు వీలుగా ప్రవహించును.

(రాత్రిముగియు జామున వేదాధ్యయనాదులు జరుగును. అందువలన అవి సుందర వచన వంతములు.)

2. ఇంద్రుడు ఎట్టిసహాయము లేకనే తన అస్త్రములతో, ఒకచోటకూడిన ఇరువదియొక్క పర్వతశిఖములను భగ్నము చేసినాడు. ఇంద్రుడు వరప్రదుడు. ప్రవృద్ధుడు. అతడు సాధించిన కార్యములను మానవులుకాని దేవతలుకాని సాధించలేరు.

3. ఇంద్రుని వజ్రము ఇనుముతో చేయబడినది. దానిని అతడు తనేచేతిలో పట్టగలడు. అందువలన ఇంద్రుని చేతులందు ఎంతో బలమున్నది. ఇంద్రుడు యుద్ధమునకు బయలుదేరును. అప్పుడు అతడు శిరస్త్రాణము ధరించును, ఇంద్రుని ఆజ్ఞలు అందుకొనుటకు అందరు అతని వద్దకు వచ్చెదరు.

4. ఇంద్రా ! నిన్ను యజ్ఞార్ఘ్యాలందు సహితము యజ్ఞయోగ్యునిగా పరిగణిస్తాను. పర్వత్ భేదకునిగా భావింతును. సైన్యముల పతాకగా తలతును, మానవులకు అభిమత ఫలదాతగా ఎరుగుదును.

5. ఇంద్రా ! నీవు నీ ఉభయ బాహువులతో గర్వమును విరిచినప్పుడు వృత్రవధకు వజ్రమును ఎత్తినప్పుడు - వృత్రవధకు వజ్రమును ఎత్తినప్పుడు - మేఘమునందలి జలములు గర్జించినప్పుడు - అప్పుడు నలుదిశలనుండి ఇంద్రుని వద్దకేగు స్తోతలు ఇంద్రుని సేవింతురు.

6. ప్రాణులన్నింటిని ఇంద్రుడు సృష్టించినాడు. తదుపరి అనేకములు పుట్టినవి. అట్టి ఇంద్రునితోనే మేము స్నేహము చేయుదుము. **"నమోభిర్వృఇషభంవిశేమ"** నమస్కరించి కోరికలు తీర్చి ఇంద్రుని అభిముఖుని చేయుదుము.

7. ఇంద్రా !నీవు విశ్వదేవతలతో స్నేహము చేసినావు. వారు వృత్రునిశ్వాసకు భయపడినారు. పారిపోయినారు. నిన్నువదలినారు. అప్పుడు నీకు మరుత్తులతో స్నేహముకలిగినది. తదుపరి నీవు సమస్త వృత్రసేనను జయించినావు.

8. ఇంద్రా! అరువదిముగ్గురు మరుత్తులు - ఒకచోటకూడిన గోయూధమువలె - నిన్ను వర్ధిల్ల చేసినారు. అందువలననే వారు యజనీయులు అయినారు. మేము ఆ ఇంద్రుని వద్దకు వెళ్లుదుము. ఇంద్రా ! మాకు భజనీయ అన్నమునిమ్ము. మేమునీకు శత్రుఘాతుక బలము నిచ్చెదము. **"శుష్మంతప్ నాహవిషావిధేయ"**

(**"నవసుగణేషు సప్తసప్తనిపాదితాః"** అని తైత్తరీయము 7 మరుత్తులు x 9 గణములు = 63)

9. ఇంద్రా ! నీ ఆయుధములు పదునుగలవి. నీ సేనమరుత్తులు. మరి నీ వజ్రమును ఎవడు ఎదిరించగలడు? సోమవంతులు. మరి నీ వజ్రమును ఎవడు ఎదిరించగలడు? సోమవంత ఇంద్రా ! చక్రము వంటి వజ్రమున. ఆయుధ శూన్యులు, దేవరహితులగు అసురులను పారద్రోలుము.

10. ఇంద్రుడు మహామహుడు ఉగ్రుడు. కళ్యాణమయుడు. స్తోతలారా ! పశుప్రాప్తికి ఇంద్రుని స్తుతించండి. స్తుతిపాత్ర ఇంద్రుని కొరకు అనేక స్తుతులు చేయండి. ఇంద్రుడు పుత్రుల కొరకు ధనమంపవలెను.

11. మంత్రములకు లభించువాడును, మహామహుడగు ఇంద్రుని - నది దాటించునావవలె స్తుతించండి. బహుప్రసిద్ధుడు, ప్రసన్నదాయకుడగు ఇంద్రుడు ధనమివ్వవలెను పుత్రులకు మరింత ధనమీయవలెను.

12. ఇంద్రా ! నీవు అనుకున్నది ఆచరించుము. నీకు ఆటంకములు ఉండవు. ఋత్విక్కులారా ! ఇంద్రునకు చక్కని స్తుతివాచకములు చదవండి. స్తుతించి ఇంద్రుని సేవించండి. స్తోతలు అలంకృతులు కావలెను. వారు దారిద్య్రకారణముగ ఏడ్వరాదు. ఇంద్రునకు మీస్తుతులు వినిపించండి. ఇంద్రుడు మీకు మరింత ధనము ఇవ్వగలడు.

13. కృష్ణుడను అసురునకు పదివేల సేనలు కలవు. అతడు అంశుమతి నదీ తీరమున నివసించువాడు. ఇంద్రుడు తన బుద్ధిబలమున వానిని లోంగదీసినాడు తదుపరి మానవహితమునకుగాను - కృష్ణాసురిని హింసక సేనను హతమార్చినాడు.

14. ఇంద్రుడు అన్నాడు:- "కృష్ణుడు వేగవంతుడు. అతనిని నేను చూచినాను. అతడు అంశుమతి నదీతీరమున - నిగూఢస్థానమున, విశాల ప్రదేశమున సంచరించువాడు. అతడు సూర్యునివలె కనిపించును. అభిలాషప్రదాతలగు మరుత్తులారా ! మీరు కృష్ణాసురునితో యుద్ధము చేయండి. వానిని సంహరించండి"

15. ద్రుతగామి కృష్ణుడు అంశుమతి నదీ సమీపమున దీప్తిమంతమగు దేహము కలిగి ఉండును. ఇంద్రుడు - బృహస్పతి సహాయమున - దేవశూన్యుడు, మీదికి వచ్చుచున్న కృష్ణుని సేనాసహితముగ హతమార్చినాడు.

16. ఇంద్రా ! నీవే ఆఘనకార్యము నిర్వహించినావు. నీవు పుట్టుకతోనే - అప్పటికి శత్రువులులేని కృష్ణ, వృత్ర, నముచి, శంబర, శుష్ణ, పణిమున్నగు ఏడుగురికి శత్రువవు అయనావు. నీవు అంధకారమయ ద్యావాపృథ్వులను వశపరచుకున్నావు. మరుత్తుల యుక్తుడవై జగములకు ఆనందము కలిగించినావు.

17. ఇంద్రా ! నీవే ఆఘనకార్యము సాధించినావు. నీవు యుద్ధకుశలుడవు. వజ్రము పట్టినావు. **"శుష్ణ"**ని అనుపమ బలమును నష్టపరచినావు. నీవే **"కుత్సరాజర్షి"** కొరకు శుష్ణుని తలవంచి ఆయుధముతో వధించినావు. నీ కర్మములతో నీవు గోవులను సాధించినావు.

18. ఇంద్రా ! నీవే ఆఘన కార్యమును సాధించినావు. మనోరథప్రద ఇంద్రా ! నీవు మానవుల ఉపద్రవ నివారకుడవు. అందువలన నీవు ప్రవృద్ధుడవైనావు. నిలిచిపోయిన సింధుమున్నగు నదులను ప్రవహింప చేసినావు. తదుపరి దస్యులు ఆక్రమించిన జలములను గెలిచినావు.

19. ఇంద్రుడు శోభన ప్రజ్ఞావంతుడు. అభిషుత సోమము సేవించి ఆనందించువాడు. ఇంద్రుని క్రోధమును సహించగలవాడులేడు. పగటివంటి వెలుగుగల ఇంద్రుడు ధనవంతుడు. అతడు ఎట్టిసాయము లేకుండ మానవులను రక్షించును. అతడు వృత్రఘ్నుడు సకల శత్రుసేన వినాశకుడు.

20. ఇంద్రుడు వృత్రఘ్నుడు మానవుల పోషకుడు. ఆహ్వానయోగ్యుడు. మేము ఇంద్రుని స్తుతింతుము. యజ్ఞమునకు ఆహ్వానింతుము. అతడు మాకు విశేశరక్షకుడు. ధనదాత ఆదరముగా పలుకువాడు అన్నదాత కీర్తిప్రదాత.

21. వృత్రఘ్న ఇంద్రుడు మహామహుడు జన్మతోనే అతడు అందరకు ఆహ్వాన యోగ్యుడైనాడు. మానవులకు అనేక హితకర కార్యములు చేసినాడు. సోమపానమువంటి మిత్రుల ఆహ్వానయోగ్యుడు అయినాడు.

## ఎనుబది ఆరవ సూక్తము

ఋషి - కాశ్యప రేభుడు, దేవత - ఇంద్రుడు , ఛందస్సు - 10, 13, 15,

త్రిష్టుప్ - 14 మిగిలినవి బృహతి

1. ఇంద్రా ! నీవు సుఖవంతుడవు. నీవు అసురులనుండి భోగయోగ్యఘనము తెచ్చినావు దానితో స్తోతలను వర్ధిల్లచేయుము. సోత్తలు కుశలు పరచి ఉంచినారు.

2. ఇంద్రా ! నీవు గోవులు, అశ్వములు మున్నగు అవినాశ్య ధనమును సాధించినావు. దానిని సోమభిషము చేయునట్టి, రక్షిణలు ఇచ్చునట్టి యజమానులకు అందించుము. యజ్ఞహీన పణులకు ఇవ్వకుము.

3. వ్యక్తులందు దేవశూన్యులు, వ్రతరహితులు ఉందురు. వారు స్వప్నవశులు, నిద్రితులు అగుదురు. అట్టివారు తమ కర్మలతోనే తమను పోషించు శనమును నాశనము చేసికొనవలెను. లేదా కర్మశూన్య ప్రదేశమున ఉంచవలెను.

4. ఇంద్రా! నీవు శత్రుహంతవు. వృత్రఘ్నుడవు. నీవు దూరదేశమందుండుము లేదా దగ్గరి దేశమందుండుము. భూలోకమునుండి ద్యులోకమునకేగు హర్యశ్వములతో సమానమగు అభిషుత సోమవంత యజమాని - ఈ స్తోత్రముతో నిన్ను యజ్ఞమునకు తీసికొని వచ్చును.

5.వృత్రఘ్న ఇంద్రా ! నీవు స్వర్గపు దీప్తి స్థానమున ఉన్నను, సముద్ర మధ్యమందు ఎక్కడనో ఉన్నాను భూలోకమున ఎచట ఉన్నను, అంతరిక్షమున ఉన్నను విచ్చేయుము.

6. ఇంద్రా !నీవు సోమపాయివి, బలపతివి. సోమము అభిషవమైనది. మాకు చాలా ధనమును, మంచి వాక్కును, బలసాధక అన్నమును ప్రసాదించుము. ఆనందింప చేయుము.

7. ఇంద్రా ! నీవు మమ్ము విడవకుము. నీవు మాతో పాటు పానము చేయుము. మత్తుడవగుము. మమ్ము నీ రక్షణలందు ఉంచుము. నీవు మాకు బంధువవు. మమ్ము విడవకుము "ఇంద్ర పరావృణక్"

8. ఇంద్రా ! మాతోపాటు కూర్చుండుము సోమాభిషవమైనది. సోమపానము చేయుదము. ధనిక ఇంద్రా! స్తోతకు మహత్వ రక్షణ ప్రదానము చేయుము. సోమాభిషవమైనంత మా చెంత కూర్చుండుము.

9. వజ్రధర ఇంద్రా! దేవతలు నిన్ను అతిక్రమించలేరు. మానవులు నిన్ను అడ్డుకొన జాలరు. నీవు నీస్వంత బలమున సమస్త భూతములను వశపరచుకున్నావు. దేవతలు నిన్ను అతిక్రమించజాలరు. 'దేవాశత'

10. సమస్తసేన - పరస్పరము కలసి - శత్రువిజేత, నేత ఇంద్రుని ఆయుధాదులతో తేజోవంతుని చేయుము. స్తోతలు - తమ ప్రకాశమునకుగాను - సూర్యరూపింద్రుని యజ్ఞమందు ప్రతిష్ఠింతురు. ఇంద్రుడు బలిష్ఠుడు. శత్రువినాశకుడు. ఉగ్రుడు. ఓజస్వి. ప్రవృద్ధుడు. వేగవంతుడు. స్తోతలు కర్మలతో - ధనము కొరకు - ఇంద్రుని స్తుతిస్తారు.

11. రేభనామక ఋషులు - సోమపానము చేయుమని - ఇంద్రుని స్తుతించినారు. స్వర్గపాలక ఇంద్రుని వర్ధిల్ల చేయుటకు జనులు స్తుతించినప్పుడు ఇంద్రుడు బలము, పాలనలతో వారిని కలసి కొనును.

12. కశ్యపగోత్రజులగు రేభలు, నేమిసమముగా - చూచుటయేకాక ఇంద్రుడు స్తుతించినారు. విప్రులు మేకవలె ఉపకరించు ఇంద్రుని స్తుతులతో నమస్కరింతురు. స్తోతలారా! మేఉ శోభన దీప్తివంతులు. ద్రోహశూన్యులు. మీరు ఇంద్రుని చెవుల వద్ద పూజాయుక్తములగు మంత్రములు చదివి స్తుతించండి.

13. ఇంద్రుడు ఉగ్రుడు ధనికుడు. వాస్తవముగా బలసంపన్నుడు. శత్రువులు అడ్డులేనివాడు యోగ్యుడు అట్టి ఇంద్రుని నేను ఆహ్వానిస్తాను. పూజ్యతమ, యజ్ఞయోగ్య ఇంద్రుడు మా సుతులకు యజ్ఞాభిముఖుడు కావలెను. వజ్రధర ఇంద్రుడు మా ధనమునకు గాను సకల మార్గములు సుగమములు చేయవలెను.

14. ఇంద్రా ! నీవు బలశాలివి. శత్రుహంతవు. శంబరుని సమస్త పురములను స్వబలమున నష్టపరచు మార్గము గ్రహించినావు. ఇంద్రా !నీ భయమున సమస్త భూతములు, ద్యావాపృథ్వులు గడగడలాడును.

15. బలి, విభిన్న రూప ఇంద్రా! ప్రశంసనీయమగు నీ సత్యము నన్ను రక్షించవలెను. వజ్రధర ఇంద్రా! నావికుడు జలములు దాటించినట్లు - పాపములనుండి మమ్ముదాటింపుము. రాజా ఇంద్రా! వివిధరూపములు కలిగి అభిలాషణీయ ధనమును మాకు ఎప్పుడు ప్రసాదింతువు?

*(ఆంధ్రవచన ఋగ్వేద సంహిత ఎనిమిదవ మండలము ఆరవ అష్టకమున ఆరవ అధ్యాయము సమాప్తము.)*

**ఓం నతామినన్తిమాయినో నధీరావ్రతాదేవానాం ప్రథమద్ర వాణి**
**నరోదసీ అద్రుహ వేదద్యాభిర్న పర్వతాని నమే స్థివాంసః**

**ఏడవ అధ్యాయము ఎనుబది ఏడవ సూక్తము**

ఋషి - అంగిరస నృమేధుడు, దేవత - ఇంద్రుడు,

ఛందస్సు - 10, 11, కకుభ, - 9, 12 పురుష్టిక్ - మిగిలినవి ఉష్టిక్

***ఓం ఇంద్రాయ సామగాయత విప్రాయ బృహతే బృహత్ |***
***ధర్మకృతే విపశ్చితే పనస్యవే||***

1. ఉద్గాతలారా ! ఇంద్రుడు మేధావి. విశాలుడు. కర్మకర్త. విద్వాంసుడు. స్తోత్రాభిలాషి అతని కొరకు బృహత్ స్తోత్రములు గానము చేయండి.

2. ఇంద్రా! నీవు శత్రువులను అణచువాడవు. ఆదిత్యుని తేజస్సుతో ప్రదీప్తుని చేసినావు. దివాకర్తవు, సర్వదేవుడవు సర్వధికుడవు.

3. ఇంద్రా ! జ్యోతిద్వారా నీవు ఆదిత్యుని ప్రకాశకుడవు. స్వర్గమును ప్రకాశింప చేయువాడవు. దేవతలు నీమైత్రికి ప్రయత్నించినారు.

4. ఇంద్రా! నీవు ప్రియతముడవు. మహావ్యక్తులను జయించినవాడవు. నిన్ను మరుగుపరచగలవాడు లేడు. నీవు పర్వతము వలె నలువైపుల వ్యాపించిన వాడవు. స్వర్గమునకు స్వామివి. మా వద్దకు విచ్చేయుము.

5. సత్యస్వరూప, సోమపాయ ఇంద్రా! నీవు ద్యావా పృథ్వులను వశపరచుకున్నావు. అందువలన నీవు స్వర్గాధిపతివి. అభిషకర్తల వర్షకుడవు.

6. ఇంద్రా! నీవు అనేక శత్రుపుర భేదకుడవు. దస్యు ఘాతుకుడవు. మనుష్య వర్ధకుడవు స్వర్గపతివి.

7. జలకాలాడు వారు ప్రక్కవారి మీద నీరు చిమ్మినట్లు - స్తుత్య ఇంద్రా! నేడు మేము నీ కొరకు మహానీయ కమనీయ మంత్రములు పఠింతుము.

8. ఇంద్రా ! నీవు వజ్రధరుడవు. శూరుడవు. నదులు నీటితాపరములను పెంచినట్లు స్తోత్రములతో పెరిగిన నిన్ను స్తోతలు దినదినము మరింత పెంపొందింతురు.

9. ఇంద్రుడు గతిపరాయణుడు. అతని రథము విశాలము - సంధియుక్తము. దానిని లాగు హర్యశ్వములు మాట మాత్రమున రథమునకు చేరును. స్తోతలు అశ్వములను స్తోత్రములతో రథమునకు జతచేయుదురు.

10. ఇంద్రా ! నీవు బజుకర్మవు. ప్రవీణుడవు. వీర్యశాలివి. సేనలను గెల్చువాడవు. మాకు ధనమును, బలమును ప్రసాదించుము.

11. నివాసదాత, బహుకర్మవు. ప్రవీణుడవు. వీర్యశాలివి. సేనలను గెల్చువాడవు. మాకు ధనమును, బలమును ప్రసాదించుము.

12. ఇంద్రా! నీవు బలశాలివి. అనేకుల ఆహ్వాతావు. బలమును కోరువాడవు. అట్టి నిన్ను స్తుతింతును. మాకు చక్కని వీర్యయుక్త ధనమును అందించుము.

## ఎనుబది ఎనిమిదవ సూక్తము

ఋషి - నృమేధుడు దేవత - ఇంద్రుడు ఛందస్సు - బృహతి

1. వజ్రధర ఇంద్రా! హవివంతులగు నేతలు నీకు నిన్న నేడు సోమపానము చేయించినారు. నీవు ఈ యజ్ఞమున స్తోత్రవాహకములమగు మా స్తుతులు వినుము. మా ఇంటికి వేంచేయుము.

2. ఇంద్రా ! నీవు చక్కని తలపోగ వాడవు. అశ్వవంతుడవు. స్తుతివంతుడవు. పరిచారకులు నే కొరకు సోమాభిషవము చేయుదురు. నీవు సేవించుము. మత్తున మునుగుము. సోమాభిషవమైనంత నీ అన్నము ఉపమేయము, ప్రశస్తము కావలెనని ప్రార్థించుచున్నాము.

3.ఆశ్రితకిరణముల సూర్యుని భజించుము. అట్లే మీరు ఇంద్రుని సకల ధనములను కీర్తించండి. ఇంద్రుడు బలములందు జన్మించినవాడు. జన్మించనున్న ధనములకు జనకుడు. మేము ఆ ధనములను - తండ్రి సొమ్ములో భాగమువలె - అందుకొందుము.

4. ఇంద్రుడు పాపరహితలకు దానశీలుడు - ధనదుడు అతని దానము శుభావహము. అట్టి ఇంద్రుని స్తుతించండి. ఇంద్రుడు ఉదారుడు. అభీష్టప్రదానమునకు ఆరాటపడును. అతడు సేవకుల కోరికలను తిరస్కరించడు.

5. ఇంద్రా ! నీవు యుద్ధమున సకల సేనలను అణచి వేసేదవు. శత్రుబాధక ఇంద్రా ! నీవు దైత్య నాశకుడవు. వారి శత్రువులకు జనకుడవు. సకల శత్రువుల హింసకుడవు. బాధించువానికి బాధుకుడవు.

6. ఇంద్రా ! తల్లి బిడ్డను అనుగమించును. అట్లే నీ బలమును హింసించు వారిని ద్యావాపృథ్వులు వెన్నాడును. నీవు వృత్రుని వధించువాడవు. కావున యుద్ధముచేయు సకల సేనలు నీ క్రోధమును చూచి నిలిచిపోవును.

7. ఇంద్రుడు అజరుడు. శత్రుప్రేరకుడు. ఇతరులకు పంపనలవికానివాడు. వేగవంతుడు. విజేత, గంత. రథ శ్రేష్ఠుడు అహింసకుడు జలవర్ధకుడు. అతడు మమ్ము రక్షించుటకు ముందుకు రావలెను.

8. ఇంద్రుడు శత్రుసంస్కర్త అన్యులచే సంస్కరింప జాలనివాడు. బలవంతుడు. బహురక్షణలవాడు. శతక్రతు. సాధారణ ధనాచ్ఛాదకుడు, ధన ప్రేరకుడు. అట్టి ఇంద్రుని మా రక్షణలకు ఆహ్వానించుచున్నాము.

## ఎనుబది తొమ్మిదవ సూక్తము

ఋషి - భృగుగోత్ర 'నేమృషి', దేవత - ఇంద్రుడు, ఛందస్సు - 6 జగతి -
7,8,9 అనుష్టప్ - మిగిలినవి త్రిష్టుప్.

1. ఇంద్రా! పుత్రయుక్తుడవై శత్రువును జయించుటకు వెడలినాను. నీ ముందు సాగుదును. సకల దేవతలు నావెనుక నడచెదరు. నీవు శత్రుధనపు భాగము నాకు ఇచ్చెదవు. అందుకని నా వెంట పురుషార్థము జరుపుము.

2. ముందు నీ కొరకు నేను మదకర అన్నరూప సోమము అందిస్తాను. నీ మనసున అభిషుత సోమము నిలువవలెను. నీవు నాకు కుడిభాగమున మిత్రరూపమున నిలువుము. తదుపరి ఉభయులము దస్యులను వధింతము.

3.యుద్ధాభిలాషులారా ! ఇంద్రుని బలము సత్యమైనచో. అతని కొరకు సత్యస్తోత్రము ఉచ్చరించండి. నేమృషి దృష్టిలో ఇంద్రుడనువాడులేడు. ఇంద్రుని ఎవడు చూచినాడు? మీరు ఎవరిని స్తుతింతురు?

4. స్తోతా! నేమా! నేను నీ వద్దకు వచ్చినాను. నన్ను చూడుము. నేను సకలలోకములను నామహిమచే అణచి వేయుదురు. సత్యయజ్ఞ ద్రుధులు నన్ను వర్ధిల్ల చేయుదురు. నేను విచారణ పరాయణుడను. సకల శత్రుభూత భువనములను విదీర్ణము చేయుదును.

5. అందమగు అంతరిక్షపు వీపున వంటరిగా కూర్చున్న నన్ను యజ్ఞాభిలాషులు మీదకు ఎక్కించినారు. అప్పుడు వారి మనసే నా హృదయమున ప్రత్యుత్తరమై - పుత్రయుక్తులు నా కొరకు రోదించుచున్నారు. - అని వినిపించింది.

(మూడవ మంత్రమున నేమృషి లేవనెత్తిన ప్రశ్నలకు ఇంద్రుడు నాలుగు, అయిదు మంత్రములందు సమాధానములిచ్చినాడు. తదుపరి ఋషి వాక్యము:-)

6. ఇంద్రా! నీవు ధనికుడవు. సోమాభిషవము చేయువారికి ఎంతో చేసినావు. అవన్నియు చెప్పుకొనవలసినవి. పారావత నామక శత్రువుధనము గుంజినావు. దానిని ఋషిపుత్ర శరభునికి అడిగినంత ఇచ్చినావు.

7. పారిపోవు శత్రువును, వేరుగా నిలిచి నిన్ను రక్షించనివాని మర్మావయములందు ఇంద్రుడు వజ్రపాతము

చేసినాడు.

8. మనోవేగవంతుడు, గమనశీలుడగు గరుడుడు లోహమయ నగరములకు వెళ్లినాడు, స్వర్గముచేరినాడు ఇంద్రునకు అమృతము తెచ్చినాడు.

9. వజ్రము సంద్రమున నిద్రించును. జలములందు మునిగి యుండును. యుద్ధమందు ఆ వజ్రము సాధించుటకు - ముందుకు ఉరుకువానికే బహుమానము లభించును.

10. వక్యాము - వెలుగునిచ్చి, దేవతలను ఆనందపరచునది - అజ్ఞానులకు జ్ఞానము కలిగించుచు యజ్ఞమున కూర్చున్నపుడు - నలుదిశలందు అన్నము, జలము వ్యాపించును. అట్టి వాక్కులలో శ్రేష్ఠవాక్కు ఎచటికి ఏగును?

11. దేవతలు దీప్తిమంతయగు వాగ్దేవిని సృష్టించినారు. ఆ వాక్కునే సకల పశువులు పలుకును. ఆనందకరమగు ఆవాక్కు అన్నము, సరము అందించు ధేనువు వంటిది. ఆ వాక్కును మేము స్తుతించుచున్నాము. వాక్కు మా వద్దకు విచ్చేయవలెను.

12. మిత్రమా విష్ణూ ! నీ అత్యంత పరాక్రమమును ప్రదర్శింపుము. ద్యులోకమా ! నీవు వజ్రము సాగుటకు అవకాశము కలిగింపుము. వజ్రమా! నీవు నేను వృత్రుని వధింతము నదులను సముద్రము వైపు పారింతము.

*"ఇంద్రస్యయంతు ప్రసవే విసృష్టాః"* నదులు ఇంద్రుని ఆజ్ఞానుసారము సాగునుగాక.

**ఆలోచనామృతము:-**

1. జీవితము అన్వేషణము మాత్రమే వ్యక్తిజీవితము, వృష్టిజీవితము, సమష్టిజీవితము, సమాజ జీవితము, రాష్ట్ర జీవితము, లోకజీవితము సమస్తము అన్వేషణమే ! అన్వేషణమే జీవితము. అందు లభించునది కొంత అందనిది మరింత - మరింత - మరింత. ఎంతో తెలియదు. అందువలన మరింత.

పార్థివ ప్రయాణమునకు ఒక గమ్యము - ఒక లక్ష్యము ఉండవచ్చును. ప్రార్థివ ప్రయాణమనగా నెల మీది నడక. నడక కావచ్చును. గమ్యము పార్థివము అయినపుడు చేరుకొను అవకాశమున్నది. తప్పక చేరగలము అని మాత్రము చెప్పాలేము.

జీవితము పార్థివము - పదార్థము - అర్థము - ఆర్థికము మాత్రము కాదు. ఆర్థిక లక్ష్యములను సహితము సాధించిన నిదర్శనములు మానవజాతి చరిత్రలో అరుదాతిఅరుదు. లేవని చెప్పిన అతిశయోక్తి మాత్రము కాదు.

మానవుడు, సకల ప్రాణిజాలము - పంచభూతాత్మకమగు ప్రకృతి వట్టి ప్రాణముతోనూ, పిడికెడు అన్నముతో మాత్రము జీవించుట లేదనుటకు ఉదాహరణలు, ఉపమానములు చెప్పపనిలేదు! అట్లయన వాల్మీకి ముందు, నిషాదుని బాణపు దెబ్బకు కూలిన మగక్రౌంచమును చూచి ఆడక్రౌంచము విలపింప నక్కరలేదు! క్రౌంచపు విలపింపే జీవితము అనలేము. కాని ఆ వ్యధ - అర్ధమును - అన్నమును మించినది. అది పరమార్ధము కాకపోవచ్చును. కాని అర్ధమునకు అందనిది! అర్ధము కానిది!!! ప్రాణము కన్న మిన్నది !!!

అదిమనసా ! కావచ్చును. మనసునకు అవయవ నిర్మాణమున చోటులేదు. అది అగుపించనిది అగుపించక పోవుట వాస్తవము కావచ్చును. కాని మనసే జీవితమును నడిపించుచున్నది అనునది అనుభవైక సత్యము ! మనసు నడుపకున్న క్రౌంచమునకు ఏడ్వవలసిన పనిలేదు! ధీరోదాత్తుడగు రాముడు సీతనుబాసి చెట్టుకు పుట్టకు చెప్పుకొని ఏడువనక్కర లేదు! ఏడ్చినంత మాత్రమున సీతరాదని ధర్మమునకు విగ్రహరూపుడు రామునకు తెలియదు అనుకుందమా ! తప్పు. అట్లనుకొనరాదు. ఏడ్చినది రాముడు కాదు! ఏడ్పించినది మనసు!! మనసు రాముని కన్న మిన్నయా? కావచ్చును ! కాకున్న అదెట్లు ఏడిపించును?

కాళిదాసు మేఘసందేశమను కావ్యము సృషించినాడు. అందు యక్షుడు మేఘునితో ప్రియురాలికి సందేశము పంపును. మేఘము సందేశము కొనిపోవునా? ఈ సందేహము కాళిదాసునకే వచ్చినది. **"కామార్తాహి ప్రకృతి కృపణాశ్చేతనా చేతనేషు"** అన్నాడు. కామార్తుని ప్రకృతిలోని చేతనాచేతన జ్ఞానముండదు అంటాడు.

యక్షుని నడిపించినది - తలపించినది ఏది? మనసే!

**"మనయేవమనుప్యాణాం కారణం బంధమోక్షమోః"** అన్నాడు కృష్ణపరమాత్మ. పార్థివమునకన్న - అర్ధమున కన్న - వినిపించి, కనిపించు ప్రకృతి కన్న కనిపించని మనసే మనసును నడిపించుచున్నదనుట కొంతవరకు మాత్రమే వాస్తవము. సత్యము మాత్రముకాదు. అట్లయిన ఈ మనిషిని - సమస్త సృష్టిని నడిపించునది ఏది? ఎవడు? అనేషణసాంత్ ఈ అగమ్యగోచరమగు ఋతము లేక సత్యం అనేది ఏదియో తెలియని నిరంతర అన్వేషణము మాత్రమే ! ఈ అన్వేషణలోని భాగము లేక ఈ అన్వేషణకు ఆదిలేక ఈ అన్వేషణకు మార్గదర్శ మహత్తర వేదము.

ఈ జీవితము సాగుటకు అచ్చపు మానవ ప్రయత్నము మాత్రము చాలదను మూలసత్యమును వేదము ఎలుగెత్తి చాటినది. అయిన మానవప్రయత్నమునకు అతీతమగు శక్తి ఏది మనిషిని నడిపించుచున్నది?

ఇది ఒక మహాప్రశ్న ! దీనికి సత్యమగు సమాధానము మానవునకు లభించుట అసాధ్యము. అసంభవము. అట్లని అన్వేషణ ఆగదు. అది ఎందుకు? ఎందుకనగా జీవితమే అన్వేషణము! అన్వేషణము ఆగిన జీవితము నిలుచును.

జీవితము నిలువదు. అన్వేషణ ఆగదు.

నేమ ఋషి ఈ అన్వేషణలో నాటికి ఒక కొత్త అధ్యాయము ప్రారంభించినాడు. ప్రతి ప్రారంభము కొనసాగవలసిన అక్కరలేదు.

**"నేంద్రో అస్తీతీనేమ ఉత్వ ఆహా"**

ఇంద్రుడు లేడని నేమ మతము. ఇంద్రుడు ఎంతో కాలముగా ఉన్నవాడు. తాను ఉన్నానని నెమకు నిరూపించ దలచినాడు చెప్పినాడు.

నేమ విన్నాడు. కాలగతిననుసరించి కొంత అంగీకరించినాడు. పూర్తిగా నమ్మలేదు. లేదనుట అతిసులభము. కాని ఆలోచనమున - అవలోకమున - తాత్వికమున అది చాలదు. ఇది లేదు.

అట్లయన ఏది ఉన్నది? అను ప్రశ్న ఉదయించును.

**"యద్వాగ్వవదన్త్యవిచేతనాని"**

జ్ఞానము కలిగించు వాక్యము అన్నింటికి కారణమని నేమ ప్రతిపాదించినాడు.

**"దేవీం వాచమజనతా దేవాస్తాం విశ్వరూపా పశవోవదంతి"**

"దేవతలు సృష్టించిన వాక్కునే సకల ప్రాణులు పలుకును" అన్నాడు. ఆవిధముగా వాక్కు ఇంద్రుని కన్న గొప్పది అన్నాడు. అంతేకాదు మనిషి సహితము ఇంద్రుని వంటివాడు అన్నాడు. వజ్రమున్న వృత్రుని వధింతును. నదులను పారింతును. అన్నాడు. ఇంద్రుని కన్న ఇంద్రుని ఆయుధము గొప్పది అన్నాడు.

ఇది అన్వేషణలో నూతనాధ్యాయము మాత్రమే ! అన్వేషణకు అంతము లేదు!!

**తొంబదవ సూక్తము.**

ఋషి - భృగుగోత్రజ జమదగ్ని, దేవతలు - వేరువేరు,

ఛందస్సు -3 గాయత్రి- 14-16 త్రిష్టుప్ - మిగలినవి బృహతి

1. ఏ మానవుడు హవిదాత యజమాని కొరకును, తన అభీష్ట సిద్ధికొరకును మిత్రావరుణులను సంబోధించునో అతడు విధివిహితముగా యజ్ఞమున హవిసమర్పించినవాడు అగుచున్నాడు.

2. మిత్రావరుణులు అత్యంత వర్ధితబలులు. మహాదర్శనులు. దీప్తిమంతులు. విద్వాంసులు. వారు రెండు బాహువుల

వంటి సూర్య కిరణములతో కర్మలు చేయుదురు.

3. మిత్రావరుణులారా! ఒక గమనశీల యజమాని మీవద్దకు వచ్చును. వచ్చినవాడు దేవదూత అగును. అతని బాహువుల వంటి సూర్య కిరణములతో కర్మలు చేయుదురు.

4. ఎన్నిమారులు పలకరించినను పలకని - ఎంత పిలిచినను బదులివ్వని, సంభాషణలకు పిలిచినను స్పందించని శత్రువు బాహుబలము నుండి యుద్ధమున మమ్ము రక్షించండి.

5. యజ్ఞధనులారా ! భజనీయము, యజ్ఞగృహమున ఉత్పన్నమగు స్తోత్రములతో మిత్రునికొరకు పాడండి. ఆర్యమ కొరకు పాడండి. వరుణుని ప్రసన్నుని చేయుటకు పాడండి. మిత్రాది ముగ్గురు రాజుల కొరకు పాడండి.

6. అరుణవర్ణ జయసాధన, వాసప్రదపృథివి, అంతరిక్షము ఆకాశమును మూడింటి కొరకు దేవతలు ఒక పుత్రుని - సూర్యుని - కలిగించినారు. అహింసిత, అమర దేవగణములు మానవ స్థానములను వీక్షింతురు.

7.సత్యప్రణేతలగు అశ్విద్వయమా ! నేను ఉచ్చరించు దీప్తివాక్యముల కొరకును, కర్మల కొరకును విచ్చేయండి. హవ్యమును ఆరగించుటకు విచ్చేయండి.

8. అశ్వినులారా ! మీరు అన్నవంతులు. ధనవంతులు. మీదానము రాక్షసశూన్యము. దానిని మేము అడిగినపుడు-అప్పుడు మీరు జమదగ్నిచే స్తుతులై, పూర్వముఖులు, స్తుతివర్ధక నేతలై విచ్చేయండి.

9. వాయువా ! మా సుందర స్తుతులు వినుము. స్వర్గమునంటు యజ్ఞమునకు రమ్ము. పవిత్ర ఘృత, వేదమంత్ర, కుశాదుల మధ్య శుభ్రసోమము నీకొరకు వేచి ఉన్నది.

10. నియుత అశ్వవంతవాయువా ! అధ్వర్యుడు సరళ మార్గమున సాగును. అతడు మీ కొరకు హవిని వహించును. మా కొరకని, నీవు శుద్ధసోమమునకు, దుగ్ధమిశ్రిత సోమమును సేవించుము.

11. సూర్య ! నీవు గొప్పవాడవు. ఆదిత్యా! నీవు గొప్పవాడవు. ఇది నిజము. నీవు మహామహుడవు. నీ మహిమ స్తుతించబడును. **"దేవ మహాఅసి" దేవా!** నీవు మహానుడవు ఇది నిజము.

12. నీవు వినుట యందు గొప్పవాడవు. ఇది నిజాము నీ మహిమవలన నీవు దేవతలందు గొప్పవాడవు. ఇది నిజము. నీవు శత్రునాశకుడవు. దేవతలకు హితోపదేశికుడవు. నీ తేజస్సు గొప్పది - అహింసనీయము.

13. ఈ ఉష నిమ్నముఖి. స్తుతిమతి. రూపవతి. ప్రకాశవతి. ఆమె సూర్యుని ప్రభావమున ఉదయించినది. ఈ

బ్రహ్మాండపు దశదిశల వ్యాపించును. చిత్రగోవు వలె - దర్శనమిచ్చుచున్నది.

14. ముగ్గురు ప్రజలు అతిక్రమించి వెళ్ళిపోయినారు. మిగిలినవారు అగ్ని యొక్క నలుదిశలను ఆశ్రయించినారు. జగములందు ఆదిత్యుడు మహామహుడై నిలిచినాడు. వాయువు దిశలందు చొరబడినది.

15. గోవు రుద్రులకు మాత. వసువులకు పుత్రి. ఆదిత్యులకు భగిని, దుగ్ధములకు నివాసస్థానము. మానవా! గోవు నిరపరాధి. అదీన. దానిని వధించరాదు. నేను ఈ విషయము బుద్ధిమంతులగు మానవులకు చెప్పినాను.

16. గోదేవి వాక్యదాత్రి. వచనవిద. సకలవాక్య ఉపస్థిత. ప్రకాశమాన. దేవతలకు నన్ను తెలియపరచునది. మానవుడు కొంచెపు బుద్ధివాడు. గోదేవిని వర్ణించుచున్నాడు.

**ఆలోచనామృతము:-**

వేదము సకల ప్రాణులను సమానముగ పరిగణించినది. మానవులు, పశువులు, పక్షులు, వృక్షములు, పర్వతములు సమానములని దర్శించినది. వీనిలో అన్నింటిని కాకున్నను కొన్నింటిని దేవతలలో చేర్చినది.

దేవతలలో చేర్చుట అనగా అవి మానవ జాతి జీవనమునకు అత్యవసరములు అని గుర్తించుట. అంతేకాదు. వానికి హాని కలిగించరాదని పూజించా వలెనని నిర్ణయించుట.

మానవుడు పంచభూతములను - తనపిశాచదాహమునాకు - విషపూరితము చేయుచున్న అత్యంత ఆధునికమనుకున్న ఈ రాక్షసయుగమునకు వేదము ఇచ్చిన సందేశము అమృతప్రాయము. కాని ఆశ రక్కసి. అది అమృతమును హరించును.

ఈ సూక్తమున గోవును దేవతను చేసినాడు. ఇది ఎంతయు ఉపయుక్తము సమంజసము - మానవుడు నాడు కాదు నేడు కూడ గోవులవలననే అభివృద్ధి చెందినాడనుట వట్టిభ్రమ మాత్రమే! మనిషిని యంత్రముగా మార్చినది మనిషికి విషమిచ్చి ఆత్మహత్యకు పురికొల్పునది పురోగతి అనిపించు కొనదు!

కృతజ్ఞత, దయ, కరుణ, ప్రేమ, అభిమానము, ఆత్మీయత, అనురాగము, అనుబంధము ఇవి మానవత లక్షణములు. ఇవి మచ్చునకన్న కనిపించని యంత్ర నాగరకతను పురోగతి అనుట రాక్షసలక్షణము!

గోవు పశువు. దానికి ప్రాణమున్నది. అది మనకు పాలిచ్చుచున్నది. తల్లులు రక్కసులయి - తమ చనుమొనల అందమును నిరాకరించినప్పుడు గోవు శిశువులకు మాత అయినది. తనపాలను పాలరూపమునగాని, పాడిరూపమునగాని, ఇచ్చి బ్రతికించినది. అట్లు తల్లి అయిన గోవును నాగరకులమని భ్రమించు పాశ్చాత్యులు నిత్యము

వధించి తినుచున్నారు! ఇదియేనా నాగరకత!

నాటి వేదకాలమున జమదగ్ని గోవును దేవతను చేసినాడు. దానికి అత్యున్నత స్థానము కల్పించినాడు.

గోవు నిరపరాధి. అదీన. అదితి అని ఆమె ఔన్నత్యమును చాటినాడు. గోవును "మావధిష్ట" - వధించరాదని హెచ్చరించినాడు!

**"ప్రమవోచంచికితుషేజనాయ"** బుద్ధిమంతులకు - ఆలోచించువారికి ఈ మాట చెప్పుచున్నాను అన్నాడు. ఆలోచించువారికి పని కల్పించినాడు. వారిలో దయ, కరుణ, కృతజ్ఞతలను ప్రేరేపించదలచినాడు.

కరుణించుటయే మానవత !
పశుపక్ష్యాదులను ప్రేమించుట మానవత !!
కృతజ్ఞత తెలియజేయుట మానవత !!!
ప్రాణులను నొప్పించకుండుట మానవత !

## తొంబది ఒకటవ సూక్తము

ఋషి - భృగుగోత్రజ ప్రయోగుడు లేదా బార్హస్పత్య పావకుడు.
దేవత - అగ్ని ఛందస్సు - గాయత్రి.

1. అగ్నీ! నీవు ప్రకాశమానుడవు. కవివి. గృహపాలకుడవు. నిత్య తరుణుడవు. హవ్యదాత యజమానికి అన్నము అందించువాడవు.

2. అగ్నీ! నీవు విశిష్ట దీప్తివంతుడవు. జ్ఞాతవగుము. మా మాటలు చెప్పి దేవతలను తీసికొనిరమ్ము. మేము వారిని స్తుతింతుము, సేవింతుము.

3. యువతమ అగ్నీ! నీవు ధనప్రేరకుడవు. మాకు సాయపడుము. మేము అన్నము కొరకు శత్రువును అణచివేతుము.

4. సముద్రమధ్యమున వ్యవస్థితమగు పవిత్ర అగ్నిని ఔర్వమృగము, అప్నవానమువలె ఆహ్వానిస్తాను.

5. వాయువువలె ధ్వనించు, మేఘమువలె గర్జించు, విద్వాంసుడు, బలవంతుడు, సముద్రమందు శయనించిన అగ్నిని ఆహ్వానిస్తాను.

6. సూర్యుని ఉదయమురీతి, భగుని భోగమురీతి సముద్రమందు శయనించిన అగ్నిని ఆహ్వానిస్తాను.

7. ఋత్విక్కులారా ! అహింసనీయ, ఆధ్వరబంధు, బలి వర్ధమాన, బహుతన అగ్నివైపు మీరు సాగండి.

8. ఈ అగ్నియే మమ్ము కర్తవ్యోన్ముఖులను చేయును. అగ్ని ప్రజ్ఞానమున మేము యశస్వులమగుదుము.

9. దేవతలందు అగ్నియే మానవుల సకల సంపదల కారకుడగును. అగ్నీ! అన్నమందుకొని మాముందుకు రమ్ము.

10. అగ్ని హోతలందరిలో అధిక యశస్వి. యజ్ఞమున ప్రధానుడు. స్తోతలారా ! ఈ యజ్ఞమందు అగ్నిని స్తుతించండి.

11. అగ్ని దేవతలందు ముఖ్యుడు. మహా విద్వాంసుడు. అతడు యాజ్ఞికుల గృహమున ప్రదాప్తుడగును. పవిత్ర దీప్తివంతుడును, శయనించు అగ్నిని స్తుతించండి.

12. విప్రస్తోతలారా! అశ్వము వంటి భోగయోగ్యుడు, బలశాలి, మిత్రునివలె శత్రుహంత అగ్నిని స్తుతించండి.

13. అగ్నీ ! యజమానులు చేయు స్తుతులు భగినులవలె నీ గుణగానము చేయును. నిన్ను సేవించును. నిన్ను వాయు సమీపమున స్థాపించును.

14. అగ్నియందు మూడు దాగినవియు, కట్లులేని కుశలున్నవి. అగ్నియందు జలమునకు సహితము స్థానము ఉన్నది.

15. అగ్ని అభీష్టప్రదుడు. ప్రకాశమానుడు. అతని స్థానము సురక్షితము - భోగ్యము అతని దృష్టి సూర్యునివలె శుభప్రదము.

16. అగ్నీ ! ఘృతము నీకు దీప్తిసాధకము. ఘృతమున ప్రజ్వరిల్లుము. జ్వాలలతో దేవతలను పిలువుము. యజ్ఞము చేయుము.

17. అంగిర అగ్ని విద్వాంసుడు అమరుడు. హవ్యదాత. ప్రసిద్ధుడు. దేవతలు తల్లులవలె - అగ్నిని సృష్టించినారు.

18. అగ్నీ! ఋషినగు నావద్ద గోవులేదు. కట్టెలు కొట్టు గొడ్డలిలేదు. వాటిని అన్నింటిని నీకే అర్పించినాను.

19. యువతమ అగ్నీ! నీ కొరకు నేను కొన్ని, కొన్ని కర్మలు చేయునప్పుడు గొడ్డలితో చీల్చని కర్రలనే స్వీకరింతువు.

20. నీ జ్వాలలు దహించు కర్రలును, నీ జ్వాలారూప జిహ్వాలు దాటిపోవు కర్రలును ఘృతసమములు కావలెను.

21. మానవుడు అగ్నికి కర్రపుల్లలు అందించి మండించును. మనసుతో కర్మలు ఆచరించును. ఋత్విక్కులద్వారా సమిధలు సమర్పించును.

(ఇది ప్రపత్తికి దగ్గరిది. అన్నియు నీకే అర్పించినామ. ఉన్నవానినే ఉత్తమములను కొనుము. స్వీకరించుము అని ప్రార్థించుట)

## తొంబది రెండవ సూక్తము

ఋషి - కాణ్వసోభరుడు, దేవత - అగ్ని - మరుత్తులు , ఛందస్సు - వివిధము

1. సకల కర్మములు - యజమానులద్వారా - అగ్నికి ప్రదత్తములగును. అప్పుడు అతిశయ మార్గజ్ఞాత అగ్ని ప్రత్యక్షమగును. ఆర్యుల వర్ధకుడగు అగ్ని తగురీతిని ప్రాదుర్భూతుడైనంత మాస్తుతులన్నియు అగ్నినిచేరును.

2. దివోదాసు అగ్నిని ఆహ్వానించినాడు. భూమాత ముందు - దేవతలకు హవ్యము వహించుతాకు అగ్ని సిద్ధపడలేదు. ఏలననగా దివోదాసు బలప్రయోగమున అగ్నిని ఆహ్వానించినాడు అందువలన అగ్ని స్వర్గమందే ఉండినాడు.

(ఆహ్వానమునకు బలవంతముకాదు ఆర్ద్రత అవసరమని చెప్పుట)

3. కర్తవ్యపరాయణులను చూచి అన్యులు కంపింతురు. కావున మానవులారా! మీరు ఇప్పుడే సహస్రఫలదాత అగ్నిని యజ్ఞమందు మీ కర్మలతో సేవించండి.

4. నివాసదాత అగ్నీ ! ధనదానము కొరకు నీవు శిక్షణ నిచ్చువాడును - నీకు హవ్యము సమర్పించువాడును - మంత్ర ప్రశంసక, స్వయం సహస్ర పోషక పుత్రుని పొందును.

5. ఎంతో ధనమున్న అగ్నీ! నీకు హవ్యము సమర్పించువాడు - వాని దృఢశత్రు పురమున జొచ్చి అశ్వసాయమున - అక్కడి అన్నమును నష్టపరచును. వర్ధిల్లు అన్నమును అందుకొనును. మేము సహితము దేవస్వరూపుడవగు నీకు హవ్యము సమర్పింతుము. నీలో సకల విధ ధనములను అందు కొందుము.

6. దేవతలను ఆహ్వానించువాడును, ఆనందమయుడును, మానవులకు ధనదాతయునగు అగ్ని వద్దకే మదకర సోమపుతొలి పాత్ర చేరును.

7. అగ్నీ! నీవు దర్శనీయుడవు. లోకపాలకుడవు. యజమాని దేవాభిలాషి. చక్కని దాత. అతడు - రథవాహకునివలె నీకు పరిచర్యలు చేయును. నీవు మా పుత్ర పౌత్రులకు ధనవంతుల ధనము దానము చేయుము.

8. అగ్ని సర్వశ్రేష్ఠదాత. యజ్ఞవంతుడు. సత్యశీలి. విశాలుడు. ప్రదీప్తి. తేజోవంతుడు. స్తోతలారా అగ్నికి స్తోత్రములు ఉచ్చరించండి.

9. అగ్ని ధనికుడు. అన్నవంతుడు. సందీప్తుడు. వీరుని వంటి ప్రతాపవంతుడు. అతడు పిలిచినంత యశస్కర ధనమును ఇచ్చును. అతని అభినవ బుద్ధి, అన్న సహితమై అనేక సార్లు మా వద్దకు రావలెను.

10. స్తోతలారా !ప్రియులలో ప్రియతముడు, అతిథి, రథనియంత అగ్నిని స్తుతించండి.

11. అగ్ని జ్ఞాని. యజ్ఞయోగ్యుడు. ఉదయించునదియు వినసొంపగు ధనమునకు ప్రవర్తకుడు. కర్మద్వారా స్వేచ్ఛగా వెలుగు అగ్నిజ్వాల నిమ్నగామి సముద్ర తరంగమువలె దుస్తరము. అటువంటి అగ్నిని స్తుతించండి.

12. అగ్ని వాసప్రదాత. అతిథి. బహుస్తుతుడు. దేవతల ఉత్తమ ఆహ్వానకర్త. సుందర యజ్ఞవంతుడు. ఆ అగ్నిని మా కొరకు ఎవరును ఆటంక పరచరాదు.

13. వాసప్రద అగ్నీ! నిన్ను స్తుతులు, అభిగమనములతో సేవించువానిని హింసలు చేరరాదు. చక్కని యజ్ఞవంతులు, హవ్యదాతలగు స్తోతలు - దూత కార్యమునకు నిన్నే స్తుతింతురు.

14. అగ్నీ! నీవు మరుత్తులకు ప్రియుడవు. మా యజ్ఞకర్మమునకు మరుత్తుల సహితుడవై విచ్చేయుము. సోభరి యొక్క శుభంకర స్తుతుల వద్దకు విచ్చేయుము. సోమపానము చేయుము. మత్తున తేలిపొమ్ము.

*విద్వాంసుడు, బహుభాషావేత్త, కవి, కథకుడు, నవలాకారుడు, నాటకకర్త, బాలసాహిత్యరచయిత, విమర్శకుడు, చలనచిత్ర రచయిత, వ్యాపకర్త, అనువాదకుడు, వక్త, కార్మికోద్యమ కార్యకర్త, స్వాతంత్ర్యసమరయోధుడు, ప్రగతి పథగామి, ప్రసన్నుడగు దశారథి రంగాచార్య విరచిత ఆంధ్రవచన ఋగ్వేద సంహితమున ఎనిమిదవ మండలము సమాప్తము.*

**"మాసీమవద్య ఆభాగుర్వీకాష్ఠాహితం ధనమ్ అపావృక్తా అరత్నయః"**

**జ్ఞానానందమయం దేవం నిర్మల స్పటికాకృతిం**
**ఆధారస్సర్వనాం హయగ్రీవముపాస్మహే**

**తొమ్మిదవ మండలము ఏడవ అధ్యాయము**

**మొదటి అనువాకము మొదటి సూక్తము**

ఋషి - వైశ్వామిత్ర మధుచ్ఛందుడు, దేవత - సోమము, ఛందస్సు గాయత్రి.

***స్వాదిష్ఠయా మాదిష్ఠయా పావస్వసోమధారయా***
***ఇంద్రాయ పాతవేసుతః***

1. సోమమా! అభిషుతమగుము స్వాదిష్ఠమగుము. అత్యంత మదుకర ధారచేక్షరితమగుము. ఇంద్రునకు పాన యోగ్యమగుము.

2. సోమము రాక్షస వినాశకము. విశ్వదర్శనీయము. అది ఇనుముతో నూరబడును. కలశమున చేర్చబడును. తదుపరి అభిషవస్థానమున కూర్చుండును.

3. సోమమా! నీవు విశేష దానములు చేయుము. అన్ని పదార్థములను దానము చేయుము. వృత్రుని వధింపుము. ధనికులగు శత్రువుల ధనము మాకు అందించుము.

4. నీవు గొప్పవు. దేవతల యజ్ఞములకు అన్నసహితముగ వెళ్లుము. అన్నము ప్రసాదించుము.

5. ఇందూ ! మేము నిత్యము నిన్ను సేవింతుము. అదే మా నిత్యకృత్యము.

6. సూర్యపుత్రి శ్రద్ధ. ఆమె నీక్షరణశీల రసమును విస్తరింప చేయును. నిత్యము "దశాపవిత్రము" న పవిత్రము చేయును.

7. అభిషవసమయమున యజ్ఞభగినులవంటి దశాంగుళి రూపములగు స్త్రీలు ఆసోమమును అందరి కన్నా ముందు సేవింతురు.

8. ఈ సోమమును అంగుళులు గ్రహించును. ఈ సోమాత్మక మధువు మూడు స్థానములందు ఉండును. అది శత్రువులకు ప్రతిబంధకమగును.

(ద్రోణకలశము, ఆధవనీయము, పూతభూతము అను మూడు స్థానములు.)

9. సోమము బాలకుడు. గోవులు అవధ్యలు. అవి సోమ బాలుని పాలతో సంస్కరించును. ఇంద్రునకు పానమునకు అందించును.

10. శూరుడగు ఇంద్రుడు ఈ సోమము సేవించును. ఉన్మత్తుడగును. సకల శత్రువులను నాశము చేయును. యజమానులకు ధనము ప్రసాదించును.

## రెండవ సూక్తము

ఋషి - కాణ్వమేధాతిథి, దేవత - సోమదేవత, ఛందస్సు - గాయత్రి

1. సోమమా! నీవు దేవకామివగుము. వేగము వహింపుము. పవిత్రభావమున రాలుము. అభీష్ట వర్ధక ఇంద్రా! నీవు సోమము మధ్యమున ఆసీనుడవగుము.

2. సోమమా ! నీవు మహానుడవు. అభీష్టవర్ధివి. ఎంతో యశ్వస్వివి. భరించువాడవు. జలములకు ప్రేరణ కలిగించుము. నీ స్థానమున ఉండుము.

3. అభిషుత, అభిలాషదాత సోమము ప్రియ మధువును పిండును. శోభన కర్మసోమము జలమును ఆచ్ఛాదించును.

4. నీవు గవ్యముతో కప్పబడినప్పుడు నీవద్దకు క్షరణ శీలమగు మహాజలము వచ్చిచేరును.

5. సోమమున రసము ఉత్పన్నమగును. సోమము స్వర్గమును వహించును. సోమము లోకములను నిలిపి ఉంచును. మమ్ము అభిలషించును. జలములలో సంస్కరింపబడును.

6. సోముడు అభీష్టప్రదుడు. హరితవర్ణుడు. మిత్రుడు. సమాన దర్శనీయుడు. అతడు శబ్దించును. సూర్యునివలె ప్రదీప్తుడగును.

7. ఇందూ! నీవు స్తుతుల మత్తుకొరకు అలంకృతవగుదువు. కోరికల కొనలుగల స్తుతులు నీ బలపు ప్రతాపమున సంశోధితములగును.

8. నీ ప్రశంసలు మహత్తమములు రాక్షసులను నలిపివేయు యజమానుల కొరకు ఉత్తమ లోకములు సృష్టించినావు. మేము నిన్ను మత్తు కొరకు యాచిస్తాము.

9. ఇందూ !ఇంద్రుని అభిలషించుము. వర్షించు మేఘమువలె మధుధారవై మాముందు రాలుము.

10. ఇందూ! నీవు యజ్ఞపు సనాతన ఆత్మవు. మాకు గోవులు, పుత్రులు, అన్నము, అశ్వములు ప్రసాదించుము.

## మూడవ సూక్తము

ఋషి - అజీగర్త శునశ్శేపుడు, దేవత - సోమము, ఛందస్సు - గాయత్రి.

1. ఈ సోమము అమరము. ద్రోణకలశము వద్దకు పక్షివలెసాగును.

2. అంగుళులతో అభిషుతమైన ఈ సోమము క్షరితమై, అభిషుతమై వర్ధిల్లును.

3. యజ్ఞాభిలాషి స్తోతలు క్షరణశీలుడగు ఈ సోమదేవుని అశ్వమువలె - యుద్ధము కొరకు అలంకరింతురు.

4. సోముడు క్షరణశీలుడు. వీరుడు. తన బలమున గమనకర్తకు సమముగా ధనములను పంచిపెట్టతలచును.

5. క్షరణశీలుడగు సోమునకు రథము కావలెను. అతడు కోరికలు తీర్చును. పలుకును.

6. విప్రులు ఈ సోమమును స్తుతింతురు. అప్పుడు సోమము హవ్యదాతకు రత్నదానము చేయును. జలముల మధ్య కూర్చుండును.

7. క్షరణశీల సోమము ధ్వని చేయును. సమస్త లోకములను ఓడించును. స్వర్గమునకు చేరును.

8. క్షరణశీల సోమము సుందరుడు. యాజ్ఞికుడు. అహింసితుడు. సమస్తలోకములను ఓడించును. స్వర్గమునకు చేరును.

9. సోమదేవుడు హరిత వర్ణుడు. ప్రాచీనుడు. జన్మతోనే దేవతల కొరకు అభిషుతుడు అయినాడు. దశాపవిత్రమున నిలుచుటకు సాగినాడు.

10. సోమము బహుకర్ముడు. పుట్టుకతోనే అన్నమును పుట్టించినాడు. అభిషుతుడయినాడు. ధారారూపమున క్షరితుడైనాడు.

## నాలుగవ సూక్తము

ఋషి - అంగిర హిరణ్యస్తూపుడు, దేవత - సోమము, ఛందస్సు - గాయత్రి.

1. మహదన్న పవమాన సోమా! దేవతలను భజించుము, రాక్షసులను జయించుము. "తదుపరి మాకు శ్రేయములు కలిగించుము." **"అథానోవస్య సస్కృధి"**

2. సోమా! జ్యోతినిమ్ము. స్వర్గదానము చేయుము. సకల సౌభాగ్యదానము చేయుము. "అథానోవస్య సస్కృధి"

3. సోమా! బలమునిమ్ము. కర్మమునిమ్ము. హింసకులను వధించుము. "అథానోవస్య సస్కృధి"

4. సోమము అభిషవము చేయువారలారా! ఇంద్రుని పానమునకు సోమమును అభిషవించండి. "అథానోవస్య సస్కృధి"

5. సోమా! నీ కార్యములు, రక్షణలతో మాకు సూర్యప్రాప్తి కలిగించుము. "అథానోవస్య సస్కృధి"

6. నీ కార్యములు, రక్షణలతో మేము చిరకాలము, సూర్యుని దర్శించగలము. "అథానోవస్య సస్కృధి"

7. శోభన అన్నవంతసోమా ! స్వర్గమందును, భూమిమీదను వర్థిల్లు ధనమును మాకిమ్ము. "అథానోవస్య సస్కృధి"

8. యుద్ధములందునిన్ను ప్రత్యక్షముగా ఆహ్వానించరు. నీవు శత్రువులను జయింతువు. ధనము దానము చేతువు "అథానోవస్య సస్కృధి"

9. క్షరణశీల సోమా! యజమానులు తమ రక్షణకుగాను నిన్ను యజ్ఞమున వర్తిల్ల చేయుదురు. "అథానోవస్య సస్కృధి"

10. ఇంద్రా! మాకు వివిధ అన్నవంత స్వర్గగామి ధనము నిమ్ము. "అథానోవస్య సస్కృధి"

## అయిదవ సూక్తము

ఋషి - కాశ్యప అసిత దేవలుడు, దేవత - సోమము, ఛందస్సు - 1-7
గాయత్రి 8-11 అనుష్టుప్.

1. పవమాన సోముడు చక్కని దీప్తుడు. విశ్వపతి కామవర్ధకుడు. అతడు శబ్దము చేయును. దేవతలను ప్రసన్నులను చేయును. విరాజిల్లును.

2. స్తుత్య, అభీష్టదాత, దీప్తిమంత పవమాన సోముడు మధుధారతో కలసి, తేజోబలమున విరాజిల్లును.

3. పవమాన సోముడు జలములకు పాత్రుడు. ఉన్నత ప్రదేశమున తీక్ష్ణుడగును. అంతరిక్షమున ప్రదీప్తుడగును సాగును.

4. హరిత వర్ణ సోమదేవుడు యజ్ఞపు పూర్వమున కుశలు పరచుచు తేజోగమనమున పయనించును.

5.హిరణ్మయద్వార దేవేరులు - పవమాన సోమముచే స్తుతులై విశాల దిశలను ఆరోహింతురు.

6. ఇప్పుడు పవమాన సోముడు - సుందర రూపలు, మహిమాన్వితలు, దర్శనీయలగు దివారాత్రులను చూడగోరు చున్నాడు.

7. మానవుల ద్రష్టలు, దేవతల హోతలగు ఉభయ దేవేరులను - రాత్రింబవళ్లును ఆహ్వానిస్తున్నాను. పవమాన్ సోముడు దీప్తుడు. అభీష్టవర్ధకుడు.

8. భారతి, సరస్వతి, మహతి ఇళనామక ముగ్గురు సుందర దేవేరుల మా యజ్ఞమునకు విచ్చేయవలెను.

9. అగ్రజాత, ప్రజాపాలక, అగ్రగామి త్వష్టను ఆహ్వానిస్తాను. హరితవర్ణ పవమానసోమ దేవేంద్రుడు కోరికలు తీర్చువాడు - ప్రజాపతి.

10. పవమానసోమా ! హరితవర్ణ హిరణ్యవర్ణ, దీప్తిమంత, సహస్రశాఖాయుత వనస్పతులను నీ మధురధారలతో సంస్కరింపుము.

11. విశ్వదేవగణమా ! వాయు, బృహస్పతి, సూర్య, అగ్ని, ఇంద్రాదులారా ! మీరందరు కలసి - సోమపు స్వాహ శబ్దము వద్దకు విచ్చేయండి.

### ఆరవ సూక్తము

ఋషి - కాశ్యప అసిత దేవలుడు, దేవత - పమానసోముడు, ఛందస్సు -గాయత్రి.

1. సోమా! నీవు అభీష్టవర్ధివి. దేవాభిలాషివి. మమ్ము అదుకొను చందువు. రక్షింపుము. దశాపవిత్రమున మధుధారగా పడుము.

2. సోమా! నీవు స్వామివి మదకర సోమము వర్షించుము. బలిష్ఠ అశ్వములను ప్రదానము చేయుము.

3. అభిషితుడవగుము. చేరుము. అన్నము, బలమునకు ప్రేరణ కలిగించుము.

4. నీరు పల్లమునకు సాగును. అట్లే ద్రుతగామి, క్షరణశీలసోమము ఇంద్రుని అనుసరించును. అతనికి వ్యాప్తి కలిగించును.

5. దశాంగుళిరూపలగు స్త్రీలు దశాపవిత్రమును దాటి - అరణ్యమున విహరించు బలిష్ఠ అశ్వమువలె - సోమమును సేవింతురు.

6. సేవించినంత దేవతలకు మత్తు కలుగునట్లు అభిషుత, అభీష్టవర్దక సోమరసమున్ యుద్ధము కొరకు - గవ్యము కలపండి.

7. ఇంద్రుని కొరకు అభిషుత సోమదేవుడు ధారగా క్షరితుడగును. ఎందుకనగా ఇంద్రునకు ఈ రసము ఆహ్లాదకరమగును.

8. అభిషుత సోమము యజ్ఞపు ఆత్మ. అతడు యజమానులకు కోరినది ఇచ్చును. వేగమగు ధారగా రాలుచు తన పురాతన కావ్యమున సహితము రక్షించును.

9. మదకర సోమమా! ఇంద్రుడు నిన్ను కోరినాడు అతని పానము కొరకు క్షరితమగుము. యజ్ఞశాలలో ధ్వనించుము.

## ఏడవ సూక్తము

ఋషి - అసిత దేవలుడు, దేవత - పవమానసోమము, ఛందస్సు - గాయత్రి.

1. సోముడు శోభనశ్రీమంతుడు. ఇంద్రుని సంబంధము తెలిసినవాడు. అతడు కర్మమందును, యజ్ఞమందును ప్రతిష్టించ బడును.

2. సోమము హవ్యములందు స్తుత్యహవ్యము. మహాజలమున నిమజ్జతమగును. ఆ సోమపు ఉత్తమధారలు పడుచుండును.

3. అభీష్టవర్దక, సత్య, హింసాశూన్య, ప్రధాన సోమము యజ్ఞగృహము వైపున జలసహితమై నినదించును.

4. కవులు సోమధనము కావ్యములు రచించినపుడు స్వర్గమున ఇంద్రుని బలము ప్రకాశించును.

5. కర్త ఈ సోమమును ప్రేరేపించినపుడు పవమాన సోముడు - రాజువలె యజ్ఞవిఘ్నకారకుల మీదకు పోవును.

6. హరిత వర్ణము ప్రియ సోమము నీట కలిసి అభిషవ సమయమున ధ్వనించుచు స్తుతిని సేవించును.

7. సోమపు ఈ కర్మకు ప్రసన్నుడైనవానికి వాయు, ఇంద్ర, అశ్వినులు మదసహితులై లభింతురు.

8. ఏ యజమాని యొక్క సోమతరంగములు మిత్ర, వరుణ, భగుల వైపు సాగునో అతనికి సోమజ్ఞానము కలుగును - సుఖములు ప్రాప్తించును.

9. ద్యావాపృథ్వులారా ! మదకర సోమరూప అన్న ప్రాప్తికిగాను మాకు అన్నము, ధనము, పశువులు మున్నగునవి ప్రసాదించండి.

## ఎనిమిదవ సూక్తము

ఋషి - అపిత దేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి.

1. ఈ సోమము ఇంద్రుని శౌర్యమును పెంచును. ఇది అతడు కోరినదియు అతనికి ప్రీతికర రసమును వర్షించును.

2. సోమము అభిషుతమగును. చమసమున నిలుచును. వాయువు, అశ్వద్వయము వద్దకు వెళ్లును. వాయువు మున్నగు దేవతలు మాకు మంచి బలమును ప్రసాదించవలెను.

3. సోమమా ! నీవు అభిషుతవగుము. మనిజ్ఞవమగుము. ఇంద్రుని ఆరాధించుటకు యజ్ఞస్థానమున ఉండుము. ఇంద్రునకు ప్రేరణ కలిగించుము.

4. సోమమా! పది అంగుళులు నిన్ను సేవించును. ఏడుగురు హోతలు నిన్ను ప్రసన్నుని చేయుదురు. విప్రులు నిన్ను ఉన్మత్తుని చేయుదురు.

5. నిన్ను మేక వెంట్రుకలు, నీటితో చేయుదురు. దేవతలకు మత్తు కలుగుటకుగాను అందు పెరుగుమున్నగునవి కలుపుదుము.

6. అభిషుత, కలశమున తడిసిన హరితవర్ణసోమము - వస్త్రమువలె పెరుగు మున్నగువానిని ఆచ్ఛాదించును.

7. సోమమా! మేము ధనికులము. నీవు మాముందు క్షరితవగుము. సకల శత్రువులను నాశము చేయుము. మిత్రుడగు ఇంద్రుని అందుకొనుము.

8. సోమమా! ద్యులోకమునుండి నేలమీద వర్షము కురిపించుము. ధనమును కలిగించుము. యుద్ధమున మాకు స్థానము కలిగించుము.

9. సోమమా! నీవు నేతల దర్శకుడవు. సర్వజ్ఞుడవు. ఇంద్రుడు నిన్ను పానము చేసిన తదుపరి మేము పానము చేయుదుము. మాకు అన్నము, సంతానము కలుగవలెను.

## తొమ్మిదవ సూక్తము

ఋషి - అసిత దేవలుడు, దేవత - పవమాన సోముడు, ఛందస్సు -గాయత్రి.

1. సోమము మేధావి. క్రాంతదర్శి. అభిషవప్రస్తరమున ఉండి, అభిషుతమై ద్యులోకపు అత్యంత ప్రియ పక్షులవద్దకు చేరును.

2. నీవు నివాసభూతుడవు. ద్రోహము ఎరుగని వాడవు. స్తోతలగు మానవులకు పర్యాప్తుడవు. అన్నవంతమగు ధారతో విచ్చేయుము.

3. ఉత్పన్న, పవిత్ర మహాసోమరూప పుత్రుడు యజ్ఞవర్ధమిత్ర, జనమిత్రి, మాత ద్యావాపృథ్వులను ప్రదీప్తము చేయును.

4. అక్షయము, ముఖ్యమగు సోమమును నదులు వర్ధిల్ల చేసినవి. అవి హస్తములందు పెరిగినవి. ద్రోహశూన్యలగు ఏడు నదులను ప్రసన్నములను చేసినవి.

5. ఇంద్రా! నీ కర్మములందు ఆ అంగుళులు హస్తములు అహింసిత, వర్తమానసోమమును కర్మకొరకు దాల్చినవి.

6. హవ్యులును, అమరులగు దేవతలకు తృప్తినిచ్చు సోమము సప్తనదులను దర్శించును. అది కూపరూపమున పూర్ణమై నదులకు తృప్తి కలిగించును.

7.సోమపురుషా ! కల్పనీయ దినములందు మమ్ము. రక్షింపుము. పవమాన సోమా! మేము యుద్ధము చేయవలసిన రాక్షసులను హతమార్చుము.

8. సోమమా! నవీనము, స్తుత్యమగు స్తోత్రము కొరకు యజ్ఞపథమున విచ్చేయుము. ముందటవలెనే దీప్తిని ప్రకాశింప చేయుము.

9. పవమానసోమమా ! మాకు పుత్రవంతమగు అన్నమును, గోవులను, అశ్వములను దానము చేయుము. మేము కోరినవన్నియు. మాకు అందించుము.

## పదవ సూక్తము

ఋషి - అసిత దేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి

1. సోమము రథము, అశ్వమువలె శబ్దము చేయును. అతడు అన్నము కోరి యజమాని ధనము కొరకు వచ్చినాడు.

2. సోమము - రథమువలె - యజ్ఞమువైపు సాగును. బరువులు మోయువాడు భుజముల మీద మోసినట్లు ఋత్విక్కులు సోమమును బుజముల మీద మోయుదురు.

3.స్తోత్రమునకు రాజు సంతుష్టడగును. ఏడుగురు హోతలు యజ్ఞమును సంస్కరింతురు. గవ్యముతో సోమము సంస్కరింపబడును.

4. అభిషుత సోమము మహాస్తుతులతో అభిషుతమగును. మత్తు కలిగించుటకు ధారగాపడును.

5. సోమము ఇంద్రుని మదగోష్ఠిరూపము. ఉషస్సునకు భాగ్య ఉత్పాదకము. సోమము పడునప్పుడు ధ్వనించును.

6. స్తోతలు, ప్రాచీనులు అభీష్టవర్ధక సోమమును సేవించు మానవులు - యజ్ఞద్వారములను తెరిచెదరు.

7. ఉత్తములగు ఏడుగురు బంధువులవంటివారు. సోమస్థానమును పూరించువారగు ఏడుగురు హోతలు యజ్ఞమున ఆసీనులు అగుదురు.

8. సోమము యజ్ఞమునకు నాభి. నేను దానిని నా నాభిప్రదేశమున దాల్చెదను. నా చక్షువులు సూర్యుని కలియును. నేను కవిని. సోమ ప్రభావమున పూరింతును.

9. ఇంద్రుడు గమన పరాయణుడు. దీప్తుడు. సోమము అతని హృదయమున నిహితము. అది అతనికి ప్రియతమము. హృదయస్థానమును ఇంద్రుడు తన కంటితో చూడగలడు.

## పదకొండవ సూక్తము

ఋషి - అసిత దేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి.

1. నేతలారా ! ఇది క్షరణశీల సోమము. ఇది దేవయజ్ఞము చేయదలచినది. అందుకు పాటలు పాడండి.

2. సోమమా! అథర్వఋషులు నీదు దీప్తము, దేవాభి లాహిరసమున - ఇంద్రుని కొరకు పాలు కలిపి సంస్కరించినారు.

3. సోమారాజా! మా గోవులకు సుఖములు కురిపించుము. మా పుత్రాదులకు సుఖము కురిపించుము. అశ్వములకు సుఖములు కురిపించుము. ఓషధులకు సుఖములు కలిగించుము.

4. సోమము పింగళవర్ణము. బలస్వరూపము. అరుణ వర్ణము స్వర్గమును తాకునది స్తోతలారా ! అట్టి సోమము కొరకు వెంటనే గాథలు ఉచ్చరించండి.

5. ఋత్వికులారా ! అభిషవశిలలందు అభిషుత సోమమును చేతులతో పవిత్రము చేయండి. మదకర సోమమున పాలు కలపండి.

6. నమస్కరించండి. సోమము వద్దకు వెళ్లండి. అందులో పెరుగు కలపండి. ఇంద్రునకు అందించండి.

7. సోమమా! నీవు శత్రువినాశకుడవు. విచక్షణపరుడవు. దేవతల కోరికలు తీర్చువాడవు మా గోవు కొరకు సరళముగా క్షరితుడవగుము.

8. సోమా! నీవు మనసు ఎరిగినవాడవు. మనసునకు ప్రభువవు. ఇంద్రుడు ఉన్మత్తుడగుటకుగాను నిన్ను పాత్రలలో నింపుదురు.

9. తడిసి రాలుచున్న సోమమా! ఇంద్రుని సహితునివై నీవు మాకు వీర్యయుక్త ధనమును ప్రసాదించుము.

## పన్నెండవ సూక్తము

ఋషి - అసితదేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి.

1. అభిషుతము, అత్యంతమధుర సోమము ఇంద్రుని కొరకు యజ్ఞగృహమునకు తరలుచున్నది.

2. ఆవు దూడను తన ముందుకు పిలుచును. అట్లే విప్రులు శబ్దములతో ఇంద్రుని సోమపానమునకు పిలుతురు.

3. మదస్రాని సోమము నదీతరంగములందు ఉండును. విద్వాంసుడగు సోముడు వాక్కును ఆశ్రయించును.

4. సోముడు సుందర ప్రజ్ఞ, క్రాంతి కర్మ, సూక్ష్మదర్శకుడు. అతడు అంతరిక్షపు నాభిస్వరూప మేషలోమమున పూజితుడగును.

5. సోమము కుండలో ఉన్నది. దశాపవిత్ర మధ్యమున ఉన్నది. సోమదేవుడు వానిలో తన అంశమున ప్రవేశించును.

6. సోమము మదస్రావి మేఘమును ప్రసన్నము చేయును. అంతరిక్షమును నిలిపి ఉంచుచోట శబ్దము చేయును.

7. నిత్యము స్తోత్రవంతము, అమృతమును పిదుకు వనస్పతి - సోమము - మానవుల కొరకు ఏకదినకర్మ మధ్యమున ప్రసన్నుడై విరాజిల్లును.

8. కవియగు సోముడు అంతరిక్షమునుండి పంపబడినాడు. విప్రుల కొరకు ధారగా ప్రియస్థానమున చేరినాడు.

9. పవమాన - క్షరణశీల - సోమమా ! మాకు బహుదీప్తివంత, సుందర గృహయుక్త ధనమును ప్రసాదించుము.

(ఇప్పటికి గడిచిన ఎనిమిది మండలములలో ఏడు అగ్నిసూక్తముతోనూ, ఎనిమిదవది ఇంద్ర సూక్తముతోనూ ప్రారంభమైనవి. ప్రస్తుతపు తొమ్మిదవ మండలము ఇంద్రాగ్నుల సూక్తముతోకాక **"స్వాదిష్ఠయామదిష్ఠయా పవస్వ సోమధారయా - ఇంద్రాయ పాతవేసుతః"** అను సోమసూక్తముతో ప్రారంభమైనది. ఇది గమనించ తగినది)

*(ఆంధ్ర వచన ఋగ్వేద సంహిత తొమ్మిదవ మండలము ఆరవ అష్టకమున ఏడవ అధ్యాయము సమాప్తము.)*

**ఓం సతామినన్తిమాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమాద్ధ్రువాణి**
**నరోదసీ అద్రుహా వేద్యాభిర్న పర్వతానినమేస్థివాంసః**

**ఎనిమిదవ అధ్యాయము పదమూడవ సూక్తము**

ఋషి - అసిత దేవలుడు, దేవత - పవమానసోమము, ఛందస్సు - గాయత్రి.

***ఓమ్ సోమః పునానో అర్షతి సహస్ర ధారో అత్యవిః***
***వాయోరిన్ద్రస్య నిష్కృతమ్***

1.అనంతధారల పవిత్ర సోమము దశాపవిత్రమును లంఘించి ఇంద్ర, వాయువుల పానమునకు సంస్కృతమై పాత్రలో ప్రవేశించును.

2. రక్షణాభిలాషులారా ! విప్రులవలె పవిత్రమై, దేవతల పానము కొరకు అభిషుతమైన సోమము వైపు సాగండి.

3. బహుబలదాత, స్తూయమానుడగు సోముడు యజ్ఞసిద్ధియు, అన్నలాభము కొరకు క్షరితుడగును.

4. సోమమా! మా అన్నలాభమునకుగాను, దీప్తిమతి, సుందర వీర్యవతి, మహతి, రసధారను వర్షింపుము.

5. ఆ అభిషుత సోమదేవుడు సహస్ర సంఖ్యక ధనమును చక్కని బలమును ఇవ్వవలెను.

6. సంగ్రామమున కంపిన అశ్వము పగిది ప్రేరకులచే ప్రేరితుడైన సోముడు - అన్న ప్రాప్తికిగాను - దశాపవిత్రమును లంఘించి పోవుచున్నాడు.

7. ఆవులు అంబారావములతో దూడలవైపు వెళ్లినట్లు సోమము సహితము ధ్వని చేయుచు పాత్రవైపు సాగును. ఋత్విక్కులు సోమమును చేతులందు ధరింతురు.

8. సోమము ఇంద్రునకు ప్రియకరము - మదకరము. పవమాన సోమమా! నీవు నినదించి సకల శత్రువులను నాశము చేయుము.

9. పవమాన సోమా! నీవు దానము చేయని వారికి హింసకుడవు. సర్వదర్శకుడవు. యజ్ఞస్థలమున ఆసీనుడవగుము.

## పదునాలుగవ సూక్తము

ఋషి - అసితదేవలుడు, దేవత పవమానసోమము, ఛందస్సు - గాయత్రి.

1. నదీ తరంగములను ఆశ్రయించిన కవిసోముడు అనేకుల అభిలషణీయ శబ్దము చేయుచు రాలుచున్నాడు.

2. అయిదు దేశముల పరస్పర మిత్రులగు మానవులు కర్మాభిలాషచే ధీరక సోమమును స్తుతులతో అలంకరించినప్పుడు.

3. అప్పుడు సోమమును ఆవుపాలలో కలిపినపుడు - అప్పుడు సమస్త దేవగణములు సోమరసపు మత్తులో పడిపోవుదురు.

4. దశాపవిత్రపు యజ్ఞద్వారము విడిచిన సోముడు నిన్ను ప్రదేశమునకు పరుగులిడును. మిత్రుడగు ఇంద్రుని కలసికొనును.

5. వయసు గుఱ్ఱమును చేతితో రుద్దుదురు. అట్లే సోమము గవ్యము కలుపుకోని పరిచర్యచేయు పాత్రులగు అంగుళులతో మార్జించబడును.

6. అంగుళులతో అభిషుతమైన సోమము గవ్యముతో కలియుటకు శబ్దము చేయుచు సాగును. నేను సోమమును

పొందగలను.

7. పరిమార్జనము చేయు అంగుళులు - అన్నపతి సోమునితో కలియును. అది బలిష్ఠసోముని వీపుపైన ఎక్కినవి.

8. సోమమా ! నీవు స్వర్గీయ, పార్థివ ధనములను అందుకొనుము. మమ్ము కోరి మా వైపురమ్ము.

## పదునైదవ సూక్తము

ఋషి - అసిత దేవలుడు, దేవత - పవమానసోమము, ఛందస్సు - గాయత్రి.

1. ఈ సోముడు విక్రాంతుడు. అంగుళులచే అభిషుతుడు. కర్మబలమున వేగవంత రథమును ఎక్కినాడు. ఇంద్రుడు నిర్మించిన స్వర్గమునకు సాగినాడు.

2. ఏ విశాల యజ్ఞమున దేవతలుందురో ఆ యజ్ఞమున సోముడు అనేక కర్మములు ఆశించును.

3. ఈ సోమము హవిర్ధానమున స్థాపించబడును. తదుపరి ఆహవనీయ ప్రదేశమున హవ్యవర్తి సోమవంత మార్గమున అర్పించ బడినపుడు అధ్వర్యులకు సహితము ప్రాప్తించును.

4. ఈ సోమపు శృంగము - పైభాగము కంపించును. అతని శృంగము ఆబోతు శృంగము వంటిది. అతడు స్వబలమున మా కొరకు ధనము తెచ్చును.

5. ఈ సోమము వేగవంతము. శుభ్రఅంశ యుక్తము. అతడు ప్రవహించు సకల రసములకు స్వామియై సాగును.

6. కప్పివేయు వారును, పీడించు రాక్షసులను ఈ సోముడు తన అంశమున లంఘించి వారిని తెలిసి కొనును.

7. మానవులు మార్జనీయమగు సోమమును ద్రోణకలశమున వడకట్టు చున్నారు. సోమము ఎన్నోరసములను ఇచ్చునది.

8. పది అంగుళాలును, ఏడుగురు ఋత్విక్కులును శోభన ఆయుధమునువలె మాదక సోమమును పరిమార్జింతురు.

## పదునారవ సూక్తము.

ఋషి - అసితదేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి.

1. సోమమా! ద్యావాపృథ్వులు నిన్ను అభిషవించువారు. ఆరెంటిమధ్య నున్న శత్రువును ఓడించవలసి ఉన్నది. అందుకు నీవు ఉత్సాహము కలిగింతువు. అశ్వము వలె సాగుదువు.

2. సోమము బలములనేత, జలముల ఆచ్ఛాదకుడు. అన్న సహిత వర్తమానుడు. గోరక్షకుడు. మేము కర్మము ద్వారా వ్రేళ్ళతో సోమమును కలుపుదుము.

3. సోమము శత్రువులకు అందనిది. అంతరిక్షమున ఉండునది. అపరాజితము. సోమమును దశాపవిత్రమున ఉంచండి. ఇంద్రుని పానము కొరకు సిద్ధము చేయండి.

4. స్తుతులతో పవిత్రమగు పదార్థము సోమము. అతడు దశాపవిత్రమునకు వెళ్లును. పిదప కర్మబలమున ద్రోణ కలశమున ఆసీనుడగును.

5. ఇంద్రా! నమస్కారయుత స్తుతులకు సోమము బలము పెంచుకొనును. పిదప మహాయుద్ధము చేయ నీవద్దకు చేరును.

6. అవ్యయ రూపవస్త్రమున శోధితమై, సకల శోభాయుతమై సోమము గోప్రాప్తికొరకు వీరుడగును.

7. అంతరిక్షమందలి జలము క్రిందకు రాలినట్లు బలకారకము, అభిషుత సోమము ఆనందపరచు ధారతో దశాపవిత్రమున పడును.

8. సోమమా! మనుష్యులందు నీవు స్తోతలను రక్షింతువు. వస్త్రమున శోధితమై మేషలోమమువైపు సాగుదువు.

## పదిహేడవ సూక్తము

ఋషి - అసితదేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి.

1. నదులు పల్లపు నేలకు సాగును. శత్రువిఘాతక, శీఘ్రగామి, వ్యాప్తసోమము ద్రోణకలశము వైపుసాగును.

2. వర్షము నేలపై రాలును. అభిషుత సోమము ఇంద్ర ప్రాప్తికి రాలును.

3. సోమము అత్యంతప్రవృద్ధము. మదకరము. రాక్షసులను నాశము చేయును. దేవాభిలాషి అగును. దశాపవిత్రమునకు చేరును.

4. సోమము కలశమున చేరును. దశాపవిత్రమున సిక్తమగును. ఉక్థమంత్రములతో వర్ధిల్లును.

5. సోమమా! నీవు మూడు లోకములను లంఘింతువు. పైకి ఆరోహింతువు. స్వర్గమును ప్రకాశవంతము చేయుదువు. సూర్యునకు ప్రేరణ కలిగింతువు.

6. విప్రస్తోతలు అభిషవదివసమున సేవకులు అగుదురు. సోమమును ప్రేమింతురు - స్తుతింతురు.

7. సోమమా! విప్రులు అన్నాభిలాషులు అగుదురు. కర్మద్వారా యజ్ఞము కొరకు అన్నవంతుడవగు నిన్ను సంస్కరిస్తారు.

8. సోమమా! నీవు మధురధారవై ప్రవహింపుము. తీవ్రత చెందుము. అభిషవస్థానమున కూర్చుండుము. యజ్ఞమందు పానయోగ్యుడవై నిలువుము.

### పద్దెనిమిదవ సూక్తము

ఋషి - అసితదేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి.

1. సోమమా! నీవు దశాపవిత్రమున పడుదువు. సవనమందు ప్రస్తరమున నిలుతువు. *"మదేషు స్వధాఅసి"* మాదకములందు సర్వశ్రేష్ఠుడవగుదువు.

2. సోమమా! నీవు విప్రుడవు. కవివి. అన్నమున పుట్టిన మధుర రసమవు. "మదేషు స్వధాఅసి"

3. దేవతలందరు నిన్ను ఒకే తీరుగ ప్రేమింతురు. నిన్ను పానము చేయుదురు. "మదేషు స్వధాఅసి"

4. సోమము - సకలవరణీయ ధనములను స్తోతల చేతికి అందించును. "మదేషు స్వధాఅసి"

5. ఒక బిడ్డకు ఇద్దరు తల్లులవలె - నీవు ద్యావాపృథ్వుల దోహనము చేతువు. "మదేషు స్వధాఅసి"

6. ఈసోమము అన్నముతో ద్యావా పృథ్వులను వ్యాప్తము చేయును. "మదేషు స్వధాఅసి"

7. సోమము బలవంతము. శోధించునపుడు - చిలుకునపుడు - కలశమున ధ్వనిచేయును. "మదేషు స్వధాఅసి"

### పందొమ్మిదవ సూక్తము

ఋషి - అసితదేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి.

1. స్తుత్యము, పార్థివము, స్వర్గీయము, విచిత్రమగు ధనమును ణీ శోధన సమయమున మాకు తెచ్చి ఇమ్ము.

2. సోమమా! నీవు, ఇంద్రుడు అందరకు స్వాములు. గోవులు పాలకులు - ఈశ్వరులు. మీరు మా కర్మలను వర్థిల్ల చేయండి.

3. సోమము అభిలాషప్రదాత. అతడు శోధించబడును. మానవులతో పలుకును. హరిత వర్ణుడగును. కుశలపై - తన స్థానమున - కూర్చుండును.

4. సోమము పుత్రుడు. తల్లి వసతీవరి జమము. బిడ్డ తల్లి పాలుత్రాగును. బిడ్డ వర్థిల్లుటకుగాను తల్లి తన పాలు మరిమరి త్రాగవలెనని ఆశించును.

5. మిశ్రమము చేయునపుడు - సోమపు శ్రేయోభిలాషి - జలము గర్భము ధరించును. సోమము ఈ మాతృరూప జలముల పాలు త్రావును.

(జలము గర్భము దాల్చుట సోమము వలన కాదు - సోమము కొరకు తల్లి మరిన్ని పాలు త్రావించదలచి మరల గర్భవతి అయినది)

6. పవమాన సోమమా ! మా అభిమత ఫలము దూరమునందున్నచో - దగ్గర చేయుము. శత్రువులతో బుగులు పుట్టించుము. వారి ధనమును తెలిసి కొనుము.

7. సోమమా !నీవు దూరమందున్నను దగ్గరలో ఉన్నను శత్రువుయొక్క వర్షణ బలమును నాశము చేయుము. శోషింప చేయగల శత్రువు తేజమును నాశము చేయుము.

### ఇరువదవ సూక్తము

ఋషి - అసితదేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి.

1. కవిసోముడు దేవతల పానమునకు మేషలోమము ద్వారా వెళ్లును. శత్రువులను పరాభవించు సోముడు హింసకులను వధించును.

2. పవమాన సోముడే స్తోతలకు గోయుక్తమగు సహస్ర సంఖ్యాల్ అన్నమును ప్రదానము చేయును.

3. సోముడా! నీవు మనసా సకల ధనములను దానము చేసెదవు. అట్టి నీవే మాకు అన్నమును అందించుము.

4. సోముడా! నీవు మహత్తర కీర్తి వైపుసాగుము. హవ్యదాతకు నిశ్చిత ధనము నిమ్ము. స్తోతలకు అన్నము ప్రసాదించుము.

5. సోముడా! నీవు సుకర్ముడవు. పవిత్రుడవగుము. మహారాజువలె మా స్తుతులను స్వీకరించుము. నీవు అద్భుతుడవు. మహామహుడవు.

6. అతడు సోమవాహకుడు. అంతరిక్షమున ఉన్నవాడు. అతనిని గట్టిగా చేతులతో రుద్దగా పాత్రలందు చేరును.

7. సోమా! నీవు క్రీడా పరాయణుడవు. ధనేచ్ఛ గలవాడవు. స్తోతకు మంచి బలమునిచ్చి దానసమయమగు దశాపవిత్రమునకు సాగుదువు.

## ఇరువది ఒకటవ సూక్తము

ఋషి - అసితదేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి.

1. దీప్తము, అభిభవ కారకము, మదకరము, లోకపాలకమగు సోమము ఇంద్రుని వైపు సాగును.

2. సోమము విశేషముగా అభిషమును ఆశ్రయించును. అందరితో కలియును. అభిభవకారులకు ధనము నిచ్చును. స్తోతలకు అన్నము ప్రసాదించును.

3. సరళముగా క్రీడించు సోమము నీటిలో పడి ఏకమాత్ర కలశమున క్షరితమగును.

4. సోమము సంశోధితమై - రథమునకు కట్టిన అశ్వములవలె సకల వరణీయ ధనములకు వ్యాప్తి కలిగించును.

5. ఈ యజమాని ఋత్విక్కులమగు మాకు పెదవి కదపక దానము చేయును. ఇతనికిగల వివిధకోరికలు తీరు నట్లు సోమమా! అతనికి ధనమునిమ్ము.

6. ఋభువు రథవాహకునకును, ప్రశస్య సారధికిని ప్రజ్ఞాదానము చేయును. సోమా! అట్లే ఈ యజమానికి ప్రజ్ఞాదానము చేయుము. జలములందు దీప్తుడవగుము.

7. ఈ సోమలు యజ్ఞము చేయవలెనను కొనుచున్నారు. అన్నవంత సోములు నివాస స్థానములు ఏర్పరచినారు. బలశాలులగు సోములు యజమాని బుద్ధిని చురుకు చేసినారు.

## ఇరువది రెండవ సూక్తము

ఋషి - అసిత దేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి

1. యుద్ధమున కంపు రథము, అశ్వమువలె అధ్వర్యులు సోమమును అమర్చి దశాపవిత్రమునకు చేర్చెదరు.

2. మహావాయువు, మేఘము, అగ్నిశిఖవలె సోమము సర్వత్ర వ్యాపించును.

3. ఈ సోమము శుద్ధము, దధియుక్తమై ప్రాజ్ఞబలమున మాకు వ్యాప్తి కలిగించును.

4. ఈ సోమములన్నియు శోధితములు. అమరములు. ఇవి పయనించునపుడును, లోకములందు సంచరించునపుడును అలసట ఎరుగవు.

5. ఈ సోమములన్నియు ద్యావాపృథ్వుల వీపుల మీద స్వారిచేసి వ్యాపించును. ఇవి ఉత్తమద్యులోకమందును వ్యాపించును.

6. జలము యజ్ఞవిస్తారకము, ఉత్తమ సోమమును వ్యాపింప చేయునది. సోమముననే ఈ కార్యములన్నియు ఉత్తమములగును.

7. సోమమా ! నీవు పణుల వద్ద ఉన్న గోహితకర ధనమును సాధింతువు. ఎట్లు యజ్ఞము విస్తృతమగునో అట్లు ధ్వనించుము.

## ఇరువది మూడవ సూక్తము

ఋషి - అసిత దేవలుడు. దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి.

1. మధుర మదధారల శీఘ్రగామి సోమము స్తోత్ర సమయమున ఉద్భవించును.

2. వేగవంతములగు అశ్వములు -కొత్త అడుగులను అనుసరించును. కొత్తసోమము పురాతన సూర్యునకు దీప్తి కలిగించును.

3. శోధితసోమమా! హవ్యదాత కానివాని గృహమున మాకు ఇమ్ము. మాకు సంతానయుక్త ధనము ప్రసాదించుము.

4. గతిశీల సోమము మదకర రసమును క్షరితము చేయును. మధుశ్రాని రసమును క్షరితము చేయును.

5. సోమము లోకములను భరించును. ఇంద్రియ వర్ధక రసమును ధరించును. ఉత్తమ వీర యుక్తమగును హింసకుల నుండి రక్షించును.

6. సోమమా! నీవు యజ్ఞయోగ్యుడవు. ఇంద్రుడు ఇతర దేవతల కొరకు అగుదువు. మాకు అన్న దానము చేయదలచుము.

7. మాదక పదార్థములందు శ్రేష్ఠమగు సోమమును సేవించి అపరాజిత ఇంద్రుడు శత్రువులను వధించినాడు. ఇంకను వధించుచున్నాడు. 'జఘాన జఘనచ్చను'

## ఇరువది నాలుగవ సూక్తము

ఋషి - అసిత దేవలుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి.

1. శోధితము, దీప్తమగు సోమము సాగును. మిశ్రితమై జలమున మార్జితమగును.

2. నిమ్నాభిముఖగామి జలమువలె గమనశీల సోమము సాగును. తదుపరి ఇంద్రునకు వ్యాప్తి కలిగించును.

3. శోధితసోమమా! మానవులు నిన్ను చేర్చిన చోటునుండి ఇంద్రునకు పానమగుటకు వెళ్లుదువు.

4. సోమమా! నీవు మానవులకు మదకరుడవు. శత్రుదమన ఇంద్రుని కొరకు క్షరితమగును.

5. సోమమా! నీవు శిలలపై అభిషుతమగుదువు. దశాపవిత్రము వైపు సాగుదువు. అప్పుడు నీవు ఇంద్రుని ఉదరమునకు పర్యాప్తమగుదువు.

(దశాపవిత్రమనగా 1.పది అంగుళులు లేదా రెండు చేతులతో శుభ్రము చేయబడినది.
2. అక్కచెల్లెండ్లయిన పదిమంది కన్యలచే శుభ్రము చేయబడినది. 3. వివస్వతుని పదిమంది కూతుళ్లుచే పరిశుద్ధము చేయబడినది.)

6. సోమమా! శత్రుహంతక ఇంద్రుని కొరకు క్షరితమగుము. నీవు ఉక్థమంత్రముచే స్తుతించ బడువాడవు. పరిశుద్ధడవు. శోధకుడవు. అద్భుతుడవు.

7. అభిషుత మదకర సోమము పరిశుద్ధము, శోధకము అనబడును. అతడు దేవతలను ప్రసన్నులను చేయును. శత్రువులను నాశనము చేయును.

*(ఆంధ్ర వచన ఋగ్వేద సంహిత ఆరవ అష్టకము తొమ్మిదవ మండలము ఎనిమిదవ అధ్యాయమున మొదటి అనువాకము సమాప్తము.)*

**రెండవ అనువాకము ఇరువది అయిదవ సూక్తము**

ఋషి - అగస్త్యపుత్ర, దృహ్లచ్యుతుడు. దేవత -
పవమాన సోమము ఛందస్సు - గాయత్రి

1. పాప రహిత సోమమా ! నీవు బలసాధకుడవు. మదకరుడవు. దేవతలు, మరుత్తులు, వాయువు పానమునకు క్షరితమగుము.

2. మత్తు కలిగించు సోమమా! మా కర్మమును భరింపుము. శబ్దము చేయుము. నీ స్థానమున ప్రవేశింపుము కర్మవలన వాయువున ప్రవేశింపుము.

3. సోమము తన స్థానమున స్థాపితమగును. అతడు కోరికలు తీర్చువాడు. క్రాంతదర్శి. ప్రాజ్ఞుడు. ప్రియుడు. శత్రుఘ్నుడు. దేవాభిలాషి. శోధింపబడువాడు.

4. శోధితము, కమనీయమగు సోమము సకల రూపములందు ప్రవేశించుచు దేవతలున్న చోటునకు వెళ్లును.

5. శోభన సోముడు శబ్దము చేయుచు క్షరితుడగును. దగ్గర ఉన్న ఇంద్రుని వద్దకు వెళ్లును. ప్రజ్ఞాయుక్తుడగును.

6. సోమము అన్నింటిని మించిన మత్తు కలిగించువాడు. విద్వాంసుడు. పూజనీయుడగు ఇంద్రుని స్థానమును అందుకొనుటకు దశాపవిత్రమును లంఘించి ధారారూపమున ప్రవహించును.

**ఇరువది ఆరవ సూక్తము**

ఋషి - దృహ్లచ్యుపుత్రుడు ఇధ్మవాహనుడు, దేవత -
పవమాన సోముడు, ఛందస్సు - గాయత్రి.

1.వేగవంత సోమమును, భూమివడిలో , విప్రులు అంగుళులతోనూ స్తుతులతోను, మార్జితము చేయుదురు.

2. సహస్రధారల, అక్షీణ, దీప్త, స్వర్గధారక సోమమును స్తుతులు స్తుతించును.

3. సర్వధారి, బహుకర్మకారి, సర్వవిధాత, శుద్ధసోమమును ప్రజలు ప్రజ్ఞద్వారా స్వర్గమువైపు ప్రేరేపింతురు.

4. సోమము పాత్రయందున్నవాడు స్తుతిపతి. అహింసనీయుడు పరిచారకులగు ఋత్వికులు రెండు చేతుల వేళ్లతో సోమమునకు ప్రేరణ కలిగించును.

5. హరితవర్ణ సోమమా! ఋత్విక్కులు నిన్ను ఇంద్రుని వద్దకు పంపుదురు. నీవు స్తుతులతో వర్ధిల్లువాడవు. దీప్తుడవు, మదకరుడవు.

## ఇరువది ఏడవ సూక్తము

ఋషి - అంగిసనృమేధుడు, దేవత - సోమము, ఛందస్సు - గాయత్రి.

1. సోమము విద్వాంసుడు. నలువైపుల స్తుతులు కలవాడు, అతడు దశాపవిత్రమును లంఘించిపోవును. శోధితుడగును. శత్రువినాశము చేయును.

2. సోమము అందలి విజేత బలకారకుడు. ఇంద్ర వాయువుల కొరకు సోమమును దశాపవిత్రమున సిక్తము చేయబడును.

3. ఈ సోమమును ఋత్విక్కులు నానా ప్రకారములుగ ఉంచుదురు. సోమము ద్యులోకశిరము, మనోహర పాత్రయందు ఉండును. అభిషుతుడగును సర్వజ్ఞుడగును.

4. సోమము శోధితమై ధ్వనించును. అతడు మాగోవులను, హిరణ్యమును కోరును. సోమము దీప్తుడు. మహాశత్రువిజేత. స్వయం అహింసనీయుడు.

5. శోధక సోమము సూర్యుని ద్వారా పవిత్రుడై, ద్యులోకమున పరిత్యక్తుడగును. సోమము అత్యంత మాదకము.

6. బలవంత సోమము అంతరిక్షమునకు వెళ్లును. సోమము కామవర్షక, హరిత వర్ణ, పవిత్ర కర్తయగు దీప్తుడు. అతడు ఇంద్రునివైపు సాగును.

## ఇరువది ఎనిమిదివ సూక్తము.

ఋషి - ప్రియమేధ దేవత - సోమము ఛందస్సు - గాయత్రి

1. ఈ సోమము గమన శీలుడు, పాత్రయందు అవస్థితుడు, సర్వజ్ఞుడు. అందరకు స్వామి. అతడు మేషలోమము మీద పరుగులిడును.

2. సోమము దేవతల కొరకు అభిషుతమగును. వారి సకల శరీరములందు ప్రవేశించుటకు దశాపవిత్రమున

చేరును.

3. అమర, వృత్రఘ్న, దేవాభిలాషి సోమము తన స్థానమున శోభిల్లును.

4. అభిలాషప్రదాత, ధ్వనికర్త, అంగుళలందు నలిగిన సోమము ద్రోణమువైపు సాగును.

5. సర్వద్రష్ట, సర్వజ్ఞ సోమము సూర్యుని, సమస్త తేజో పదార్థములను ప్రకాశవంతము చేయును.

6. శోధన కాలపు సోమము బలవంతుడు అహింసనీయుడు. ఇతడు దేవతల రక్షకుడు. పాపుల వినాశకుడు.

### ఇరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - అంగిరస నృమేధ, దేవత - పవమాన సోమము.

1. వర్షక, అభిషుత, దేవతలపై ప్రభావము వేయదలచు సోమము ధారగా క్షరితమగును.

2. స్తోతలు, విధాతలు, కర్మకర్త అధ్వర్యులు - దీప్తిమంత, ప్రవృద్ధ, స్తుత్య, సర్వాణస్వభావ - సోమమును మార్జితము చేయుదురు.

3. ప్రభూత ధనవంత సోమమా! శోధన సమయమున నీ తేజస్సులన్నియు శోభించును. నీవు సముద్రము వంటి ద్రోణమున నిండుము.

4. సోమమా! సకల ధనములు గెలిచి ధారగా - ప్రవాహముగా - రమ్ము. సకల శత్రువులను ఒకేసారి దూర దేశములకు పంపుము.

5. సోమా! దానము చేయని వారినుండియు, నిందకుల నుండియు మమ్ము రక్షింపుము. మేము విముక్తులము కావలెను.

6. సోమా ! నీవు ధారగా క్షరితుడవగుము. స్వర్గమునందలి, భూమి మీద ధనమును మరియు దీప్తివంత బలమును తీసికోని రమ్ము.

### ముప్పదవ సూక్తము

ఋషి - అంగిరసబిందు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి.

1. బలవంత సోమపుధార అనాయాసముగా దశాపవిత్రమున పడుచున్నది. శోధన సమయమున సోమము ధ్వని చేయును.

2. సోమము అభిషవకారులచే ప్రేరితమై, శోధన మప్పుడు, ధ్వనించుచు. ఇంద్ర సంబంధ ధ్వనిని కలుగ చేయును.

3. సోమమా! నీవు ధారగా క్షరితమగుము. అందువలన మానవులకు అభిభవకర, వర్యవంత, అనేకుల అభిలషణీయ బలము కలుగును.

4. శోధన కాలమున సోమము ధారగా ద్రోణమున చేరుటకు - దశాపవిత్ర్రమును దాటి క్షరితమగును.

5. సోమమా! నీవు జలములందు మధురతమవు, హరిత వర్ధవు అగుదువు. ఇంద్రుని పానమునకుగాను నిన్ను రాతిపై నూరుదురు.

6. ఋత్విక్కులారా! సోమము అత్యంత మధురము. మనోహరము. మాదకము. మాకు బలము కలుగునట్లు ఇంద్రుని పానము కొరకు - సోమము అభిషవించండి.

## ముప్పది ఒకటవ సూక్తము

ఋషి - రాహూగణ గోతముడు, దేవత - సోమము, ఛందస్సు -గాయత్రి.

1. ఉత్తమ కర్మవంత, శోధన సమయ సోమము అదిగో వెళ్లుచున్నాడు. అతడు మాకు ప్రజ్ఞాపకధనము ప్రసాదించినాడు.

2. సోమమా! నీవు అన్నముల స్వామివి. ద్వావ్యాపృథ్వుల ప్రకాశక ధన వర్ధకుడవు అగుము.

3. సకల వాయువులు నీకు ఆనందకరములగును. సకల నదులు నీ కొరకు ప్రవహించును. వారు నీ మహిమను పెంచవలెను.

4. సోమమా! నీవు వాయువు, జలములతో వర్ధిల్లుము. నలుదిశలనుండి నీకు వర్షక బలము అందవలెను. యుద్ధమందు అన్నములు కలిగించుము.

5. పింగళ వర్ణసోమమా! గోసమూహములు నీ కొరకు ఘృతము, అక్షయదుగ్ధములు ఇచ్చును. నీవు ఉన్నత స్ధానమున ఉన్నవాడవు.

6. భువనపతి సోమమా! నీవు ఉత్తమ ఆయుధవంతుడవు. మేము నీ బంధుత్వము ఆశించుచున్నాము.

## ముప్పది రెండవ సూక్తము

ఋషి - ఆత్రేయశ్యావాశ్వుడు, దేవత - సోమము, ఛందస్సు -గాయత్రి.

1. సోమము మదస్రావియై, అభిషుతమై యజ్ఞమున హవ్యదాతకు అన్నము అందించుటకు అరుదెంచును.

2. ఇంద్రుని పానముకొరకు. హరిత సోమమును త్రితఋషి అంగుళులు రాతిమీద రాపిడి చేయును.

3. హంసలు జలమున ప్రవేశించినట్లు సోమము సకల స్తోతల మనములందు ప్రవేశించును. సోమము గవ్యముతో కలసి స్నిగ్ధమగును.

4. సోమమా! నీవు యజ్ఞస్థానమును ఆశ్రయింతువు కలగలతువు. మృగమువలె ద్యావాపృథ్వులను చూతువు.

5. రమణి జారుని స్తుతించినట్లు - శబ్దము సోముని స్తుతించును. సోమము గమ్యమునెరిగిన మిత్రుని పగిది స్వహితార్ధము గమ్యస్ధానమునకు చేరును.

6. సోమమా! మేము హవివంతులము. స్తోతలము. మాకు దీప్తిశాలి అన్నము ప్రసాదించుము. ధనము బుద్ధి, కీర్తి కలిగించుము.

## ముప్పది మూడవ సూక్తము

ఋషి - త్రితుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి.

1. మేధావి సోమము - నీటి అలలవలె - పాత్రవైపు సాగును. వృద్ధమృగము అరణ్యమున ప్రవేశించినరీతి పాత్రవైపు సాగును.

2. పింగళవర్ణ, దీప్తసోమము -గోమంత అన్నప్రదానము చేయుచు ధారగా ద్రోణకలశమునకు ప్రవహించును.

3. అభిషుత సోమము ఇంద్ర వాయు, మరుద్గణ, విష్ణువులవైపవు సాగును.

4. త్రివాక్య ఉచ్చారణ జరుగు చున్నది. గోవులు పాలిచ్చుటకు శబ్దించుచున్నవి హరిత సోమము నినదించుచు తరలుచున్నది.

5. స్తోతలు - యజ్ఞపు మాతృస్వరూపలగు - మహాస్తుతులను ఉచ్చరించుచున్నారు. ద్యులోకమునకు శిశువు వంటి సోమము మార్జితమగుచున్నది.

6. సోమమా! ధనసముద్రములను నలువైపులనుండి మాకు చేర్చుము. అంతములేని కోరికలను తీర్చుము.

## ముప్పది నాలుగవ సూక్తము

ఋష్యాదులు పూర్వము వలెనే

1. అభిషుత సోమము ప్రేరితమగును. దశాపవిత్రమున చేరును. సుదృఢ శత్రుపురములను విరుచును.

2. అభిషుత సోమము ఇంద్ర, వాయు, మరుద్గణ, విష్ణువుల వద్దకు సాగును.

3. అధ్వర్యులు రససేచక, నియతసోమమును వర్ధక ప్రస్తరములతో అభిషవింతురు. వారు కర్మబలమున సోమరూప దుగ్ధములను పితుకుదురు.

4. త్రితృషయొక్క మదకరసోమము అతని కొరకును, ఇంద్రుని పానము కొరకును పరిశుద్ధమగుచున్నది. హరిత సోమము తనరూపము దాల్చినది.

5. పృశ్నిపుత్రులు మరుత్తులు - యజ్ఞాశ్రమ, హోమసాధక, రమణీయ సోమమును దూషించుచున్నారు.

6. కుటిలము తెలియని స్తుతులు ఉచ్చరితములై సోమముతో కలియుచున్నవి. సోమము సహితము శబ్దము చేయుచు ప్రీతికర స్తోత్రములను అభిలషించుచున్నాడు.

## ముప్పది అయిదవ సూక్తము

ఋషి - అంగిరస ప్రభూవసుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి.

1. ప్రవాహశీల సోమమా! ధారగా మాకు నలువైపుల క్షరితుడవగుము. విస్తీర్ణ ధనమును, ప్రకాశమాన యజ్ఞమును మాకు ప్రసాదించుము.

2. జలప్రేరకి, శత్రుకంపన సోమమా ! నీ బలమున మాకొరకు ధనము అందుకొనుము.

3. వీరసోమమా! నీ బలమున మేము సంగ్రామాభిలాషి శత్రువులను ఓడించెదము. మాకు స్వీకారయోగ్యమగు

ధనమును ప్రసాదించుము.

4. సోమము అన్నదాత, సర్వదర్శి. కరం మరియు ఆయుధములు తెలిసినవాడు యజమానులకు ఆశ్రయము కలిగించగోరి వారికి అన్నము అందించును.

5. నేను స్తుతివచనములతో గోపాలకుడగు సోముని స్తుతిస్తాను. మేము స్తుతిప్రేరక, పవిత్ర సోమము వద్ద వసింతుము.

6. కర్మపతి, పవిత్ర ప్రభూతధనవంతుడగు సోమమును సకల జనులు మనసా భజింతురు.

## ముప్పది ఆరవ సూక్తము

ఋష్యాదులు పూర్వమువలె

1.రథమునకు కట్టిన గుఱ్ఱములవలె - రెండు 'చమువు' లందు సోమము అభిషుతమైనది. దశాపవిత్రమున సిద్ధమైన వేగవంత సోమము యుద్ధమున సంచరించును.

2. సోమమా! నీవు వాహకుడవు. జాగృతుడవు, దేవాభిలాషివి. మధుస్రానివై దశాపవిత్రమును లంఘించి క్షరితుడవగుము.

3. ప్రాచీనక్షరణశీల సోమమా ! నీవు మా దివ్య స్థానములను ప్రకాశింపచేయుము. మమ్ము యజ్ఞము, బలమునకు ప్రోత్సహించుము.

4. సోమము యజ్ఞాభిలాషి ఋత్వికులచే అలంకృతము. వారి చేతులందు పరిమార్జికాము సోమము మేషలోమమయ దశాపవిత్రమును శోధితమగును.

5. అట్టి అభిషుత సోమము హవి సమర్పించువారికి ద్యులోక, భూలోక, అంతరిక్షపు, సకల ధనములను ప్రసాదించవలెను.

6. బలాధిపతి సోమమా !నీవు స్తోతల కొరకు అశ్వములు, గోవులు, వీరపుత్రులను అభిలషించి స్వర్గపు వీపుపై ఎక్కుము.

## ముప్పది ఏడవ సూక్తము

ఋషి - రమాగణుడు దేవత - సోమము ఛందస్సు -గాయత్రి

1. ఇంద్రాదుల పానము కొరకు అభిషుతమగు సోమము కామవర్ధక, రాక్షసనాశక, దేవకామి అయి దశాపవిత్రమునకు సాగును.

2. సోమము సర్వదర్శక, హరితవర్ణ, సర్వధారకమై దశాపవిత్రము వైపు సాగును. తదుపరి ధ్వనించుచు ద్రోణకలశమున పడును.

3. వేగవంత, స్వర్గిప్రదీప్త, క్షరణశీల సోమము రాక్షస వినాశకమై మేషలోమమయ దశాపవిత్రమును లంఘించి పోవుచున్నది.

4. ఈ సోమము త్రితర్షి యజ్ఞమున పవిత్రమైనది - తన ప్రవృద్ధ తేజస్సుతో సూర్యుని ప్రకాశింప చేయును.

5. అశ్వము యుద్ధభూమి కేగినట్లు - వృత్రఘ్న అభిలాష ప్రదాత, అభిషుత, అహింసనీయ సోమము - కలశమునకు చేరును.

6. ఈ మహాసోమము కవిద్వారా ప్రేరితం మై ఇంద్రుని కొరకు ద్రోణకలశమున ప్రవేశించును.

**ముప్పది ఎనిమిదివ సూక్తము**

ఋష్యాదులు పూర్వమువలె

1. సోమము అభిలాషప్రదము. గతి పరాయణము. యజమానికి మరింత అన్నము ఇవ్వదలచి మేషలోమము, దశాపవిత్రము ద్వారా ద్రోణకలశమున ప్రవేశించును.

2. ఇంద్రుని పానమునకుగాను త్రితర్ది అంగుళులు హరితవర్ణ సోమమును రాతిమీద మారుచున్నవి.

3. పదిహరిత వర్ణ అంగుళులు, కోరికల గూడి, సోమమున మార్జించును. వీని సాయమున ఇంద్రుని బలమునకు గాను సోమము శోధితమగును.

4. సోమము - శ్యేనపక్షివలె మానవ ప్రజమధ్య ఆసీనుడు అగును. జారుడు ఉపపత్ని వద్దకు వెళ్లినట్లు సోమము సాగును.

5. ఈ సోమపు మాదక రసము సకల పదార్థములను వీక్షించును. ఈ సోమము స్వర్గ పుత్రుడు. దీప్త సోమము దశాపవిత్రమున ప్రవేశించును.

6. పానము కొరకు అభిషుత, హరిత వర్ణ, సర్వవధారక సోమము శబ్దించుచు తన ప్రియస్థానమగు కలశమున ప్రవేశించును.

### ముప్పది తొమ్మిదవ సూక్తము

ఋషి - అంగిరస బృహన్మతి, దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి.

1. మహామతి సోమమా! దేవతల ప్రియతమ శరీరయుక్తుడవై త్వరత్వరగా 'దేవతలున్న దిశకు సాగుదును' అని తరలుము.

2. సోమమా! యజమానిని సంస్కరించుచు, యాజ్ఞికునకు అన్నము ఇచ్చుచు, అంతరిక్షమునుండి వర్షము కలిగించుము.

3. అభిషుత సోమము - దీప్తిని దాల్చి, సకల పదార్ధములను వీక్షించి, వానిని దీప్తముచేసి తన బలమున దశాపవిత్రము వైపు సాగును.

4. ఈ సోమము దశాపవిత్రమున తడిసి, జలతరంగములచే క్షరితమై స్వర్గమునకు శీఘ్రముగా సాగును.

5. దూరమునందున్న, దగ్గరలో ఉన్న దేవతల కొరకును - ఇంద్రుని కొరకును అభిషుతమైన సోమము మధువువలె సిద్ధమగును.

6. కలిసిమెలిసిన స్తోతలు స్తుతించుచు, హరిత వర్ణ సోమమును శిలలసాయమున సిద్ధము చేయుదురు. కావున దేవతలారా ! యజ్ఞస్థానమున ఆసీనులు కండి.

### నలుబదవ సూక్తము

ఋష్యాదులు పూర్వమువలె

1. క్షరణశీల, సర్వదర్శక సోమము సకల హింసకులను లంఘించినది. మేధావి సోమమును అందరు స్తుతింతురు. అలంకరితురు.

2. అరుణ వర్ణసోమము ద్రోణకలశమున ప్రవేశించుచున్నది. తదుపరి అభిషుతమైన అభిలాషదాత సోమము ఇంద్రుని వద్దకేగును. నిశ్చిత స్థానమున ఆసీనమగును.

3. దీప్తసోమమా! నీవు అభిషుతమై మా కొరకు గొప్ప, మరింత ధనమును నలువైపులనుంచి అందించుము.

4. క్షరణశీల సోమమా! నీవు బహువిధ అన్నములను తెమ్ము, సహస్రసంఖ్యక అన్నములను ప్రసాదించుము.

5. సోమమా! మా స్తోతలకొరకు పవిత్రుడవు, అభిషుతుడవు అగుము. సుపుత్రవంత ధనము తెమ్ము. స్తుతులను వర్ధిల్లచేయుము.

6. సోమమా! శోధన సమయమున - మాకొరకు - ద్యావాపృథ్వులందు వర్ధిల్లు ధనమును తెమ్ము. మాకు స్తుతించ దగిన ధనము నిమ్ము.

## నలుబది ఒకటవ సూక్తము

ఋషి - కాణ్వమేధ్యాతిథి, దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి.

1. ఏ అభిషుత సోమము జలసమమైమ్ శీఘ్రదీప్తియుక్తమై, నలుపుచర్మమువారిని వధించుచు సంచరించునో ఆసోమమును స్తుతించండి.

2. వ్రతశూన్యులను, దుష్టమతులను అణచిన సోమపు రక్షక, రాక్షసవినాశ కాంక్షను స్తుతింతుము.

3. అభిషుత సమయమున బలశాలియగు సోమపు దీప్తులు అంతరిక్షమున సంచరించును. సోమపు ధ్వని వర్షధ్వని వలె వినిపించును.

4. సోమమా! అభిషుతమగుము. గో, అశ్వ, బలయుక్త మహన్నమును మా ముందుకు పంపుము.

5. సర్వ దర్శక సోమమా! నీవు ప్రవహింపుము. సూర్యుడు తన కిరణములచే పగళ్లను నింపినట్లు నీవు ద్యావాపృథ్వులను నింపుము.

6. సోమమా! నీ ధారలు మాకు సుఖకరములు. వానిని - నదులు భూమండలమును నింపినట్లు మాకు నలుదిశల నింపుము.

## నలుబది రెండవ సూక్తము

ఋష్యాదులు పూర్వమువలె

1. ఈ హరిత వర్ణ సోమము ద్యులోక సంబంధమగు నక్షత్రాదులను, అంతరిక్షమున సూర్యుని సృజించి, దిగువకు

పారు జలమును కప్పుకొనిసాగును.

2. ఈ సోమము ప్రాచీన స్తోత్రయుక్తము, అభిషుతమై దేవతల కొరకు ధారగా పడును.

3. వర్ధమాన అన్నమును చప్పున అందుకొనుటకు పరిమిత వేగమున సోమము క్షరితమగును.

4. పురాతన రసవంత సోమము దశాపవిత్రమున ఉండును. శబ్దము చేయును. దేవతలను ఆవిర్భవింప చేయును.

5. ఈ సోమము అభిషవ సమయమున సకల స్వీకరణీయ ధనముల యజ్ఞవర్ధక దేవతల వద్ద కేగును.

6. సోమమా! అభిషుతమగుము. మాకు గోవులు, అశ్వములు, వీరులు. సంగ్రామ ధనము మరియు అనంత అన్నమును ప్రసాదించుము.

## నలుబది మూడవ సూక్తము

ఋష్యాదులు పూర్వమువలె

1. ఏ సోమము నిరంతర గమనవంత అశ్వమువలె దేవతల మత్తుకొరకు పాడితో కలియునో, ఏది కమనీయనుగునో ఆ సోమమును స్తుతులతో ప్రసన్నుని చేయుదుము.

2. రక్షణాభిలాషగల స్తుతులు - పూర్వమువలెనే - ఇంద్రుని పానము కొరకు ఈ సోమమును దీప్తము చేయును.

3. విప్రమేధ్యాతిథి కొరకు, శోధన సమయమందు, కమనీయ స్తోమము స్తుతులతో అలంకృతమై, కలశమువైపు మరలును.

4. క్షరణశీల, అభిషసమయ సోమమా! మాకు ఉత్తమ దీప్తిమంతము, అతిశ్రీమంతమగు ధనమును ప్రసాదించుము.

5. యుద్ధముకేగు అశ్వమువంటి సోమము దశాపవిత్రమున శబ్దించును. దేవాభిలాషి అగును. అప్పుడు ఎంతో ధ్వనించును.

6. సోమమా! మాకు అన్నము కలిగించుటకు, మేధ్యాతిథిని వర్ధిల్లచేయుటకు ప్రవహించుము. వీర్యవంతులగు సుపుత్రులను ప్రసాదించుము.

**దాశరథి లక్ష్మణాచార్య బుచ్చమాంబల పౌత్రుండును, వేంకటాచార్య వేంకటాంబల పుత్రుండును, ఆంధ్ర ప్రదేశ**

**ఆస్థాన కవి దాశరథి కృష్ణమాచార్య అనుజుండును, కమలానామ్ని ధర్మపత్నిసమేతుండును, "రణభేరి" సమరకవితాసంకలన కర్తయు, "రణరంగం" వివిధభారతీయ భాషా కథాసంకలన కర్తయు అగు దాశరథిరంగాచార్య విరచిత శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహితమున ఆరవ అష్టకము సమాప్తము "సర్వేపిసుఖినస్సంతు"**

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వ విఘ్నోప శాంతయే**

## ఆంధ్ర వచన ఋగ్వేద సహింత

## ఏడవ అష్టకము

### తొమ్మిదవ మండలము

### మొదటి అధ్యాయము

### రెండవ అనువాకము నలుబది నాలుగవ సూక్తము

ఋషి - అంగిరస ఆయాస్యుడు, దేవత - పవమాన సోమము, చందస్సు - గాయత్రి.

**ఓం ప్రణఇందో మహేతన ఊర్మినబిభ్ర దర్లసి |**
**అభిదేవాఁఅయాస్య**

1. సోమమా! మాకు మహా ధనము ఇచ్చుటకు వచ్చెదవు. అయాస్య ఋషి నీ తరంగములను వహించును. దేవతలను పూజించుటకు సాగును.

2. క్రాంతికర్మ సోమమును స్తుతించుటకుగాను విప్రస్తోతలు యజ్ఞమున నియమించబడినారు. సోమధార దూరదేశము వరకు వ్యాపించును.

3. జాగరణశీల విచక్షణ సోమము అభిషుతమగును. దేవతలవైపు సాగును. దశాపవిత్రమునకు చేరును.

4. సోమమా! కుశలుగల ఋత్విక్కులు నీకు పరిచర్యలు చేయుదురు. మా కొరకు అన్నము కోరుము. హింసారహిత యజ్ఞమును చక్కగా నిర్వహించుము. తదుపరి క్షరితమగుము.

5. విప్రులు సోమమును వాయువు భగుని వద్దకు పంపుదురు. సోమము నిత్యవర్ధకము. సోమము మాకు దేవతల వద్దగల ధనమును అందించవలెను.

6. సోమమా! నీవు కర్మప్రాపకుడవు. పుణ్యలోకముల మార్గము తెలిసినవాడవు. మాకు ధనలాభము కలుగుటకు

మహాబలమును అన్నము జయించుము.

## నలుబది అయిదవ సూక్తము

ఋష్యాదులు పూర్వమువలె

1. సోమమా! నీవు నేతలకు దర్శకుడవు. దేవయజ్ఞమందు ఇంద్రుని ఉన్మత్తు పానమునకును, సుఖము కొరకును క్షరితమగుము.

2. సోమమా! నీవు మాకు దూతకార్యము నిర్వర్తించుము. ఇంద్రుని కొరకు త్రాగబడుదువు. మా కొరకు దేవతల వద్దనుంచి శ్రేష్ఠధనము తెమ్ము.

3. సోమమా! మత్తునకుగాను రక్తవర్ణముగల నీయందు పాలు మున్నగునవి కలుపుదుము. మా కొరకు ధనముల ద్వారములు తెరువుము.

4. పయనసమయమున అశ్వము రథమున చేరినట్లు సోమము దశాపవిత్రమున చేరి దేవతల మధ్యకు చేరును.

5. దశాపవిత్రము దాటి సోమము జలక్రీడలాడునపుడు ప్రియబంధు స్తోతలు ముక్త కంఠమున స్తుతింతురు. వచనములతో గుణకీర్తనము చేయుదురు.

6. సోమమా! పానము చేసినంత విచక్షణస్తోతకు శోభనబలము ప్రసాదించురీతి ధారగా పడుము.

## నలుబది ఆరవ సూక్తము

ఋష్యాదయః పూర్వవత్

1. అభిషవ ప్రస్తరముల మీద ప్రవృద్ధమైన సోమము కార్యపరాయణ అశ్వమువలె క్షరితమగును.

2. తండ్రి చేత  అలంకరించబడిన కన్య తన స్వామి వద్దకు చేరినట్లు - సోమము వాయువు వద్దకు చేరును.

3. ఉజ్వలములను అన్నవంతములగు సోమములన్నియు ప్రస్తర ఫలక ద్వయమున అభిషుతమై యజ్ఞమూలమున ఇంద్రుని ప్రసన్నము చేయును.

4. కళ్యాణహస్తములుగల ఋత్విక్కులారా ! శుక్లవర్ణ సోమమును అందుకొనండి. సోమమును దుగ్ధాదులతో సంస్కరించండి.

5. శత్రుధనమును జయించు సోమమా! నీవు కోరికల దారులు తెలిసినవాడవు. మాకు మహా ధనమును ప్రసాదించువాడవు. క్షరితుడవగుము.

6. పది అంగుళులు - శోధనీయ క్షరణశీల మదకర సోమమును - ఇంద్రుని కొరకు దశాపవిత్రమున శోధించును.

## నలుబది ఏడవ సూక్తము

ఋషి - భృగుపుత్ర కవి, దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి.

1. శోభన అభిషవాది క్రియల ద్వారా ఈ సోమము దేవతల కొరకు వృద్ధిచెందినది. ఆనందమున ఆబోతువలె అరుచును.

2. ఈ సోమపు అసురనాశక కర్మలకు మేమే కారకులము. బలశాలి సోమము ఋణవిమోచన కార్యము కూడ చేయును.

3. ఇంద్రుని మంత్రము ఆవిర్భవించినపుడు - ఇంద్రునకు ప్రియతమ రసము బలశాలి వజ్రమువలె అవధ్య - సోమము మాకు అపారధనదాత అగును.

4. క్రాంతకర్మ సోమము అంగుళులతో శుద్ధము చేయబడి స్వయముగా విప్రుల కొరకు ఇంద్రుని రమణీయ ధనము అందుకొనును.

5. సోమమా ! యుద్ధభూమికి వెళ్లు అశ్వములకు గడ్డి అందించినట్లు యుద్ధమున శత్రువును గెలిచినవారికి ధనము అందింతువు.

## నలుబది ఎనిమిదవ సూక్తము

ఋష్యాదయః పూర్వవత్

1. సోమమా! నీవు ద్యులోక వాసివి. ధనమునకు, శుభములకు కారకుడవు. మేము నిన్ను పూజింతుము. ధనము యాచింతుము.

2. సోమమా! నీవు పరాక్రమ శత్రువినాశకుడవు. ప్రశంసనీయుడవు. ఆనందకరుడవు. అనేక శత్రుపుర ధ్వంసకుడవు. మేము నిన్ను యచింతుము.

3. శోభన కర్మల సోమమా! నీవు ధనములకు సామ్రాట్టువు. అందువలననే శ్యేనము నిన్ను సులభముగా స్వర్గము నుండి చేర్చినది.

4. జలవర్షకులు, యజ్ఞసంరక్షకులు, స్వర్గస్థసమస్త దేవతలకు సమముగా శ్యేనపక్షి స్వర్గము నుండి సోమము తెచ్చినది.

5. కర్మముల సూక్ష్మదర్శకుడు, యజమానుల అభీష్టప్రదాత, స్వబల ప్రయోగకారి సోమము ప్రశంసనీయమగు తన మహత్వమును చేరుకొనును.

## నలుబది తొమ్మిదవ సూక్తము

ఋష్యాదయః పూర్వవత్

1. సోమమా! మా కొరకు అంతరిక్షమునుండి నలుదిశల వర్షము కలిగించుము. ద్యులోకమునుండి జలతరంగములు పంపుము. అక్షయ అన్నమహా భండారములను అవతరింప చేయుము.

2. సోమమా! శత్రుదేశమున పుట్టిన ఆవులు ఈలోకమునకు - మా ఇంటికి చేరురీతి ధారగా క్షరింపుము.

3. సోమమా! యజ్ఞములందు నీవు అత్యంత దేవాభిలాషివి. మా కొరకు ఘృతధారతో క్షరితుడవగుము.

4. సోమమా! నీవు మా అన్నము కొరకు కుశమయ దశాపవిత్రమును ధారగా అందుకొనుము. నీ నడకల సవ్వడిని దేవతలు వినవలెను.

5. రాక్షసులను వధించుచు, తన దీప్తమును పూర్వమువలె ప్రదీప్తము చేయుచు క్షరణశీల సోమము ప్రవహించును.

## ఏబదవ సూక్తము

ఋషి - అంగిరస ఉచథ్యుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి.

1. సోమమా! నీ వేగము సముద్ర తరంగ వేగమువలె ఉన్నది. నీ శబ్దము విల్లువిడిచిన బాణమువలె ఉన్నది.

2. నీవు ఉన్నత కుశమయ దశాపవిత్రమునకు వెళ్లుదువు. అప్పుడు నీ ఉత్పత్తి జరుగును. ఆసమయమున యజ్ఞాభిలాషి యజమాని నోటినుండి - ఋక్, యజు , సామ మూడు వచనములు వెలువడును.

3. దేవతలకు ప్రియము, హరిత వర్ణము, ప్రస్తర అభిషుతము. మధుర రసనిష్యందమగు సోమమును ఋత్విక్కులు మేషలోమము పై ఉంచుదురు.

4. మిక్కిలి మత్తు కలిగించు క్రాంతి కర్మ సోమమా! పూజ్య ఇంద్రుని ఉదరమున చేరుటకు దశాపవిత్రమును దాటి ఇంద్రుని ముందు క్షరితమగుము.

5. సోమమా! నీవు ఎంతో మత్తు కలిగింతువు. రుచికరమగు పాలతో కలియుము. ఇంద్రుని కొరకు క్షరితమవగుము.

## ఏబది ఒకటవ సూక్తము

ఋష్యాదయః పూర్వవత్

1. పురోహితులారా! సోమమును రాళ్లతో అభిషవించండి. దశాపవిత్రమున ప్రవేశపెట్టండి. ఇంద్రుని పానము కొరకు పరిశుద్ధము చేయండి.

2. అధ్వర్యులారా! అత్యంత మధురము, ద్యులోక అమృతము, శ్రేష్ఠసోమమును వజ్రధర ఇంద్రునకు అర్పించండి.

3. మదకర, క్షరణశీల సోమమా! నీ అన్నమును ఇంద్రాది దేవతలు, మరుద్గణములు వ్యాపింపచేయుదురు.

4. సోమమా! అభిషుతమావై, దేవతలను వర్ధిల్లచేసి, కోరికలు తీర్చి, వెంటనే మత్తు, రక్షణలు కలిగించి స్తోత వద్దకు చేరుదువు.

5. విచక్షణ సోమమా! అభిషుతమగుము. దశాపవిత్రము వైపుసాగుము. మా అన్నమును, కీర్తిని రక్షించుము.

## ఏబది రెండవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. దీప్త, ధనదాత సోమమా! అన్నసహితముగా మా బలమును పెంచుము. అభిషుతమై దశాపవిత్రమున పడుము.

2. సోమమా! నీ ధారలు దేవతలను ప్రసన్నులను చేయును. అవి విస్తృతమగును. పాతభాగము, మేషలోమమునుండి దశాపవిత్రమునకు సాగును.

3. సోమమా! చరు, వంటి ఖాద్యమును మాకిమ్ము. ఇవ్వ దగిన వానిని ఇమ్ము. నీవు దంపుడుకు పారుదువు. కావున

శిలాప్రహారము నుండి బయట పడుము.

4. అనేకులు ఆహ్వానించు సోమమా! మమ్ము యుద్ధమునకు పిలుచు శత్రువు బలమును దూరము చేయుము.

5. సోమమా ! నీవు ధనదాతవు. మమ్ము రక్షించుటకు నీ ధారలను ప్రవహింప చేయుము.

## ఏబది మూడవ సూక్తము

ఋషి - కాశ్యప ఆవత్సారుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి.

1. రాళ్లనుండి పుట్టిన సోమమా! రాక్షసులను చంపు నీ వడి పెరిగినది. స్పర్ధించు శత్రుసేనలు మమ్ము బాధించుచున్నవి. వానిని నిలుపుము.

2. నీవు స్వబలమున శత్రువులను నాశము చేయ సమర్థుడవు. శత్రువు రథమున ధనము దాచినాడు. నేను నిర్భయముగా - ఆ ధనము కొరకు నిన్ను స్తుతింతును.

3. సోమమా! క్షరణ శీలమగు నీ తేజమగు దుర్బుద్ధులగు రాక్షసులు తాళజాలరు. నీతో యుద్ధము చేయవలెననుకున్న వానిని ధ్వంసము చేయుము.

4. మత్తు కలిగించు, హరితవర్ణ, బలశాలి సోమమును ఋత్విక్కులు ఇంద్రుని కొరకు వసతీవరజలమున చేర్చుదురు.

## ఏబది నాలుగవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. ఈ సోమరసము ప్రాచీనము. ప్రకాశమానము. దీప్తము అపారము. ఇది కర్మఫలదాత కవులు ఈ రసమును పిండుదురు.

2. ఈ సోమము సూర్యుని వలె సమస్త లోకములను వీక్షించును. ముప్పది రాత్రింబవళ్లవైపు సాగును. ఇది స్వర్గము సప్తసింధులను చుట్టిఉన్నది.

3. శుద్ధిచేయబడు సోమము సూర్యునివలె సమస్త భువనముల మీద నిలుచును.

4. సోమమా ! నీవు ఇంద్రాభిలాషివి - శోధితుడవు. మా కొరకు గోయుక్త అన్నమును నలువైపుల వర్షించుము.

## ఏబది అయిదవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. సోమమా! మాకు కావలసినన్ని యవలు, అన్నము ఇమ్ము. సకల సౌభాగ్యశాలి సంపదలు ఇమ్ము.

2. సోమమా! అన్నరూపమగు నీ స్తోత్రమును. నీ ప్రాదుర్భావమును పాడినాము. ఇప్పుడు నీవు ప్రసన్నదాయకములగు మా కుశలమీద ఆసీనుడ వగుము.

3. సోమమా! నీవు నాకు గోదాతవు - అశ్వదాతవు. కొరత రాజులందు అన్నముతో విచ్చేయుము.

4. సోమమా! నీవు అపరిమిత శత్రువిజేతవు. నిన్ను ఓడించగలవాడు లేడు. నీవు స్వయముగా శత్రువులను వధింతువు. క్షరితమగుము.

## ఏబది ఆరవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వగత్

1. క్షిప్రకారి, దేవాభిలాషి సోమము దశాపవిత్రమున చేరి, రాక్షసులను నష్టపరిచి మాకు మరింత అన్నము ఇచ్చును.

2. సోమపు కర్మాభిలాషులను వందధారలకు ఇంద్రుని బంధుత్వము లభించినపుడు సోమము మాకు అన్నప్రదానము చేయును.

3. కన్య జారుని పిలిచినట్లు - పది అంగుళులు శబ్దము చేయుచు శోధించును. అది మా ధనలాభమునకును, ఇంద్రుని కొరకును అగును.

4. సోమమా! నీ ప్రియరసమును ఇంద్రుని కొరకును, విష్ణువు కొరకును క్షరితమొనర్చుము. కర్మనేతలను స్తుతికర్తలను పాపవిముక్తులను చేయుము.

## ఏబది ఏడవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. ద్యులోకపు వర్షధార ప్రజకు అపార అన్నము కలిగించును. సోమమా! అట్లే నీధారలు అపార అన్నము

కలిగించును.

2. హరితవర్ణసోమము దేవతల సకల ప్రియకార్యములను వీక్షించును. తన ఆయుధములతో రాక్షసులను హతమార్చును. యజ్ఞమునకు వచ్చును.

3. సుకృత సోమము మానవులచే శోధితమై, రాజువలెను, శ్యేనపక్షివలెను నిర్భయముగా వసతీవరజలమున కూర్చుండును.

4. సోమమా! నీవు క్షరితమగుచునే భూమి మీది సకల ధనములను మావద్దకు తెమ్ము.

## ఏబది ఎనిమిదవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. దేవతలకు హర్షము కలిగించు సోమము స్తోతలను ఉద్ధరించుచు క్షరితమగును. అభిషుత, దేవాన్నరూపసోమము కురియును. హర్షదాతి సోమము క్షరితమగును.

2. సోమపు ధనప్రసవణ, ప్రకాశమాన ధార మానవులను రక్షించుట ఎరుగును. హర్షదాత సోమము స్తోతలను రక్షించుచు పరుగులిడును.

3.ధ్వస్ర, పురుసన్తి రాజులనుండి మాకు వేయి, వేయి ధనములు లభించినవి. హర్షదాత సోమము స్తోతలను తరింప చేయుచు పరుగులిడును.

4. ధ్వస్ర, పురుసన్తి రాజులనుండి మేము మూడువందలవేల వస్త్రములు పొందినాము. హర్షదాత సోమము స్తోతలను తరింప చేయుచు పరుగులిడును.

## ఏబది తొమ్మిదవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. సోమమా! నీవు గోవులు, అశ్వములు, లోకములు, రమణీయ ధనమును జయించుచు క్షరితమగుము. పుత్రాది యుక్త రమణీయ ధనమును మా కొరకు తెమ్ము.

2. సోమమా! నీవు వసతీ వరజలమునుండి ప్రవహింపుము. కిరణములందు ప్రవహింపుము. ఓషధులమీద ప్రవహింపుము. శిలల మీద ప్రవహింపుము.

3. క్షరణశీల, క్రాంతి కర్మ సోమమా! రాక్షసులు కలిగించిన ఉపద్రవములను దూరము చేయుము. ఈ దర్భల మీద కూర్చుండుము.

4. పవమాన సోమమా! యజమానులకు సమస్తము సమకూర్చుము. నీవు పుట్టుకతోనే పూజనీయుడవు. సకల శత్రువులను నీ తేజమున అణచివేసెదవు.

**అరువదవ సూక్తము**

ఋషి - కాశ్యపవత్సారస్యుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు - 3
ఉష్ణిక్ మిగిలినవి గాయత్రి.

1. స్తోతలారా! సూక్ష్మదర్శక, సహస్రచక్షు, సంస్కర్త సోమమును గాయత్రీసామమున స్తుతించండి.

2. సోమమా ! నీవు బహుదర్శన, బహుభరణ, అభంగు తమవు. ఋత్విక్కులు నిన్ను మేషలోమమున జల్లింతురు.

3. క్షరణశీల సోమము మేష లోమము నుండి సాగి, ద్రోణ కలశమున పడి ఇంద్రుని హృదయమున ఆసీనుడగును.

4. బహుదర్శిసోమమా! ఇంద్రుని ఆరాధనకుగాను నీవు చక్కగా క్షరితమగుము. మాకు పుత్రాది యుక్త ధనము ప్రసాదించుము.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేదసంహిత ఏడవ అష్టకము తొమ్మిదవ మండలమున రెండవ అనువాకము సమాప్తము.)*

**మూడవ అనువాకము        అరువది ఒకటవ సూక్తము**

ఋషి - అంగిరస అమహీయుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు గాయత్రి.

1. యుద్ధమున తొంబది తొమ్మిది శత్రుపురములను ధ్వంసము చేసినట్టి రసముతో ఇంద్రుని పానమునకు ప్రవహింపుము.

2. ఆ సోమరసము ఒకేఒక్కరోజున శంబరుని శత్రుపురముల ప్రభువును - సత్యకర్ముడగు దివోదాసునాకు వశపరచినది. తదుపరి అదే సోమరసము దివోదాసు శత్రువులు తుర్వస, యదువులను వశపరచుకున్నది.

3. సోమమా! నీవు అశ్వదాతవు. బహు గో, అశ్వ, హిరణ్యయక్త ధనమును పంచిపెట్టుము.

4. సోమమా! క్షరణ శీలము, దశాపవిత్రమును ఆర్ద్రము చేయు నీ స్నేహము కొరకు ప్రార్థించుచున్నాము.

5. సోమమా! నీ తరంగములు దశాపవిత్రపు నలుదిశలందు పడుచున్నవి. అవి మాకు సుఖములను ప్రసాదించవలెను.

6. సోమమా! నీవు సమస్త విశ్వమునకు ఈశ్వరుడవు. "ఈశానః సోమ విశ్వతః" అభిషుత, శోధిత సోమమా! మాకు ధనమును, పుత్రాదియుక్త అన్నమును కొనితెమ్ము.

7. సోమమునకు మాతలు నదులు - "సిన్ధుమాతారమ్." ఈ సోమమును పది అంగుళులు మార్జించును. ఆ సోమము అదితి పుత్రులతో కలసి ఉండును.

8. అభిషుత సోమము దశాపవిత్రమును ఇంద్రునితోను, వాయువుతోను, సూర్యకిరణములతోను కలసి ఉండును.

9. సోమమా! నీవు మధుర రసమవు. కళ్యాణరూపుడవు. అభిషుతడవు. నీవు భగ, వాయు, పూష, మిత్ర. వరుణుల కొరకు క్షరితమగుము.

10. నీ అన్నము ద్యులోకమున పుట్టినది. నీవగు ప్రవృద్ధ సుఖములు, ప్రచుర అన్నము భూమి మీద ఉన్నవి- "ఉగ్రం శర్మామహిశ్రవః"

11. ఈ సోమపుసాయమున మేము సకల మానవుల అన్నములను ఉపార్జింతుము. భాగస్వాములము కాదలచినపుడు భాగములు చేయుదుము.

12. పవమాన సోమమా! నీవు అభిషుతమై మాకు పూజనీయులగు ఇంద్ర, వరుణ, మరుత్తుల కొరకు క్షరితమగుము.

13. సోమము సమ్యక్ ప్రాదుర్భూతము. వసతీవరిద్వారా ప్రేరితము. శత్రుభంజకము. దుగ్ధాదులచే సంస్కృతము. అట్టి సోమము వద్దకు ఇంద్రాది దేవతలు వచ్చెదరు.

14. ఇంద్రునకు హృదయంగమమగు సోమమునే మా స్తుతులు వర్ధిల్లచేయును. పాలిచ్చు తల్లులు పిల్లలనువలె - ఈ స్తుతులు సోమమును కోరును.

15. సోమమా! మా గోవులకు సుఖము కలిగించుము. మాకు విశేష అన్నము ప్రసాదించుము. శుభ్రజలములను పెంచుము. "వర్ధాసముద్రము ముక్థ్యమ్."

16. క్షరితమగుచునే సోమము వైశ్వానరజ్యోతిని ద్యులోక చిత్రమును విస్తరింప చేయుటకు వజ్రసమమగా సృష్టించినది.

17. దీప్యమాన సోమమా! క్షరణశీలమగు నీ రాక్షస శూన్య, మాదక రసము మేషలోమమువైపు సాగును.

18. పవమాన సోమమా! ప్రవృద్ధము, దీప్తశాలియగు నీ రసము క్షరితమై, బ్రహ్మాండమంతటా వ్యాపించి దృష్టిగోచరమగును.

19. సోమమా! నీ యొక్క రసము దేవకామి -రాక్షస హంత - ప్రార్థనీయ మదకర అట్టి రసము అన్నముతో క్షరితమగుము.

20. సోమమా! నీవు శత్రువగు వృత్రుని వధించినావు - "జఘ్నిర్వృత్రమ మత్రమం." నీవు నిత్యము యుద్ధమును ఆశ్రయింతువు. నీవు గోదాతవు. అశ్వదాతవు.

21. సోమమా! నీవు రుచికరములగు పాలతో కలియుము. గరుడ పక్షివలె వేగముగ సాగుము. నీ స్థానమును అలంకరించుము. శోభిల్లుము.

22. వృత్రుడు జలసమూహములను నిరోధించినపుడు, వృత్ర వధవిషయమున ఇంద్రుని రక్షించినావు. అట్టి నీవే ఇప్పుడు క్షరితుడవగుము.

23. సేచక, క్షరణశీల సోమమా! కళ్యాణ పుత్రులము, అంగిరస అమహీయులము శత్రువు ధనమును జయించవలెను. మా స్తుతులను వర్ధిల్లచేయుము.

24. నీ రక్షణలతో మేము శత్రువులను నాశము చేయుదుము. మా పనుల విషయమున నీవు అప్రమత్తుడవగుము.

25. హింసక శత్రువులను, అదాతలను వధించుచు ఇంద్ర స్థానమును చేరి క్షరితమగుము.

26. పవమానసోమమా! మా కొరకు మహాధనము తెమ్ము. శత్రువులను హతమార్చుము. పుత్రాదియుక్త కీర్తి నొసంగుము.

27. సోమమా! నీ శోధన సమయమున మాకు ధనము నివ్వ దలచినను, ఖాద్యము నివ్వదలచినను అప్పుడు నిన్ను వందల మంది శత్రువులు కూడ నివారించజాలరు.

28. సోమమా! అభిషుత, సేవకుడవగు నీవు లోకములందు మమ్ము యశస్వులను చేయుము. సకల శత్రువులను చంపుము.

29. సోమమా ! ఇది యజ్ఞము. ఇందు మాకు నీ బంధుత్వము లభించవలెను. అందువలన శ్రేష్ఠ అన్నమున మేము పుష్టికలవారలమగుదుము. అప్పుడు శత్రువులను యధేష్టముగా సంహరించెదము.

30. సోమమా! నీ ఆయుధములు అతి భయంకరములు. తీక్షములు. శత్రుసంహారకములు. వాటి నీడన మమ్ము శత్రుపరాజయ అవమానము నుండి రక్షింపుము.

**అరువది రెండవ సూక్తము**

ఋషి - భార్గవ జమదగ్ని, దేవత - పవమానసోమము, ఛందస్సు -గాయత్రి.

1. సోమము సకల సౌభాగ్యములను మా కొసంగును. అందుకే దశాపవిత్రమున త్వరత్వరగా ఆవిర్భవింపచేయబడును.

2. బలవంత సోమము పాపములను నష్టపరచుచు మా పుత్రులను, అశ్వములను సుఖవంతులను చేయుచు దశాపవిత్రమున ఆవిర్భవించును.

3. మాకు గోవులనిచ్చుచు - ధనములు ప్రసాదించుచు - అన్నములు అందించుచు సోమము మాస్తుతుల దిశగా వచ్చును.

4. సోమము పర్వతములందు పుట్టును. మత్తు కలిగించుటకు అభిషుతమగును. జలమున ప్రవృద్ధమగును. శ్యేనము వడిగా వచ్చి తన స్థానమును ఆక్రమించును. అట్లే సోమము తన స్థానమును అధిష్టించును.

5. దేవతలచే ప్రార్థించబడిన, శుభ్రఅన్నమును ఆవుపాడి రుచికరము చేయును. అట్లే సోమము ఋత్విక్కులచే అభిషవింపబడి వసతీవరజలమున పరిశుద్ధమగును.

6. తదుపరి అనుష్ఠాతలగు ఋత్విక్కులు యజ్ఞమందు ఈ మాదక సోమరసమును అమరత్వము కొరకు - అశ్వమునువలె అలంకరింతురు.

7. సోమమా! నీ మధుర రసధారలు రక్షణల కొరకు ఏర్పడినవి. వాటి సహితముగా దశాపవిత్రమున కూర్చుండుము.

8. సోమమా ! అభిషుతమైన నీవు మేషలోమము నుండి వెడలి, ఇంద్రుని పానపాత్ర నుండి సాగి నీ స్థానమున క్షరితమగుము.

9. సోమమా! నీ వద్ద స్వాదిష్టమును, మేము కోరిన ధనము ఉన్నది. నీవు అంగిరుల సంతానముకు ఘృత, దుగ్ధములను వర్షించుము.

10. సూక్ష్మదర్శక, పాత్రస్థిత, క్షరణశీల సోమము జలములందు పుట్టిన అన్నములను పెంచును. అందుకే అందరు ఎరుగుదురు.

11. ఈ సోమము ధనవర్షి. కామవర్షి, రాక్షస హంత. క్షరణశీల. సోమము హవిర్ధాత యజమానికి ధనము లిచ్చును.

12. సోమమా! అపారము, అశ్వ, గోయుక్తము, హర్షద, అభిలషణీయ ధనమును వర్షించుము.

13. అనేక స్తుతులు కలిగి, కార్యక్షమతగల సోమము మానవులచే శోధితమై సించితమగును.

14. సోమము. అపారరక్షావంతుడు, బహుధని. లోకనిర్మాత. క్రాంతకర్మ. మదకరుడు. అతడు ఇంద్రుని కొరకు క్షరితుడగును.

15. పక్షితన గూటికి చేరినట్లు - పాదుర్భూత, స్తుతసోమము ఈ యజ్ఞమున ఇంద్రుని కొరకు - తన స్థానమునకు చేరును.

16. ఋత్విక్కులచే అభిషవించబడిన క్షరణశీల సోమము తనస్థానమగు చమసములందు యుద్ధమునందువలె నిలుచును.

17. ఋషుల యజ్ఞరూప రథమునకు మూడు పృష్టములు మూడు బంధురములు ఏడు ఛందోరూప పగ్గములు కలవు. దేవతల వద్దకు చేరుటకు. ఋత్విక్కులు ఆ యజ్ఞరథమునకు సోమాశ్వములను పూన్చెదరు.

18. సోమరూప అశ్వము అభిషవించబడునది. ధనస్రష్ట. బలశాలి. వేగవంతము. అట్టి అశ్వమును యజ్ఞరూప సంగ్రామము కొరకు అలంకరించండి.

19.అభిషుత సోమము కలశమువైపు సాగుచు, సకల సంపదలను మా కొసంగుచు శత్రువులందలి శూరునివలె -

నిర్భయముగా నిలుచును.

20. సోమమా! ఇంద్రాదులకు మత్తు కలిగించుటకు స్తోతలు నీ మధుర రసమును పిండుదురు.

21. ఋత్విక్కులారా! పేరుమాత్రమున దేవతలకు ప్రియమైనదియు - అత్యంత మధురమైన సోమరసమును ఇంద్రాదుల కొరకు దశాపవిత్రమున ఉంచండి.

22. ఋత్విక్కులు - మహా అన్నము కొరకు - ఎంతో మత్తునిచ్చు సోమపు రసధారను సిద్ధము చేయుదురు.

23. సోమమా! శోధితమవైన నీవు ఆరగించుటకుగాను ఆవు పాడిపదార్ధములను అందుకొందువు. అన్నదానము చేయుచు క్షరితమగుము.

24. సోమమా! నేను జమదగ్నిని. నిన్ను స్తుతించుచున్నాను. మాకు గోయుక్త, సర్వత్ర ప్రశంసనీయ ధనమును ప్రసాదించుము.

25. సోమమా! నీవు అతిముఖ్యుడవు. పూజ్యరక్షణలతో మా సుతుల మీద వర్షించుము. సకల స్తుతిరూప వచనముల మీద సహితము వర్షించుము.

26. సోమమా! నీవు లోక కంపకుడవు. మా వచనములను గ్రహించుము. ఆకాశమునుండి జలవర్షము కురించుము.

27. కవిసోమమా ! నీ మహిమ వలన లోకములు నిలిచి ఉన్నవి. సకల నదులు నీ ఆజ్ఞను పాలించుచున్నవి.

28. సోమమా! ఆకాశమునందలి జల ధారవలె - నీ శుక్లవర్ణధార విరిసిన దశాపవిత్రమువైపు నడుచును.

29. ఋత్విక్కులారా ! ఉగ్ర, బలకారక, ధనపతి, ధనదాత సోమమును ఇంద్రునకు సమర్పించండి.

30. సత్య, క్రాంతకర్మ, రక్షణశీల సోమము మా స్తోత్రములకు శక్తి నిచ్చుచు దశాపవిత్రమునకు చేరును.

## అరువది మూడవ సూక్తము

ఋషి - కాశ్యప నిధ్రువుడు,దేవత - పవమాన , ఛందస్సు - గాయత్రి

1. సోమమా! మాకు బహుసంఖ్యక, శోభన బల ద్రవ్యము నంపుము. అన్నము ప్రసాదించుము.

2. సోమమా! నీవు ఎంతో మత్తునిత్తువు. నీవు ఇంద్రునకు అన్నమును, బలమును సమకూర్తువు. చమసములందు చేరుదువు.

3. ఇంద్ర, విష్ణు, వాయువుల కొరకు అభిషుతమై ద్రోణకలశమునకు వెళ్లు సోమము అత్యంత మధురము.

4. పింగళవర్ణ, క్షిప్రకారి సోమము జలధారలతో చేయబడును. సోమము రాక్షసుల వైపు సాగును.

5. ఇంద్రుని వర్ధిల్ల చేయుచు, జలమును తెచ్చుచు. సర్వమంగళములు కలిగించుచు, కృపణులను నాశము చేయుచు సోమము సాగును.

6. పింగళవర్ణ, అభిషుత సోమము ఇంద్రునివైపు నుండి తన స్థానమునకు చేరును.

7. సోమమా! మానవులకు ఉపయుక్తమగు జలమును కురిపించినావు. నీ తేజస్సుతో సూర్యుని వెలిగించినావు. అట్లే మాకొరకు ప్రవహింపుము.

8. సోమము మానవుల కొరకును, అంతరిక్షమున సూర్యుని నడకకును, అశ్వములను పూన్చును.

9. సోమము ఇంద్రుని పేరు పలుకుచు, దశదిశలకు సాగుటకు సూర్యునకు అశ్వములను పూన్చుము.

10. స్తోతలారా! వాయువు, ఇంద్రుని  కొరకు అభిషుతమయిన మదకర సోమమును అభిషవస్థలము నుండి మేషలోమముపై పరిషించితము చేయండి.

11. క్షరణశీల సోమమా! హింసక శత్రువులు నాశము చేయలేనిదియు, శత్రువునకు దుర్లభమగు ధనమును మాకు ప్రసాదించుము.

(ఈ ధనము జ్ఞానము కావచ్చును)

12. నీవు మాకు అనేక అశ్వ, గోయుక్త ధనమును అందించుము. బలమును, అన్నమును ప్రసాదించుము.

13. సూర్యుని వంటి తేజస్సు గలిగి, శిలలచే అభిషుత సోమము ద్రోణకలశమున చేరి క్షరితమగును.

14. అభిషుత దీప్త సోమము శ్రేష్ఠయజమానుల గృహములందు గోయుక్త అన్నమును జలధారల రూపమున

వర్షించును.

15. వజ్రధర ఇంద్రుని కొరకు సోమము పిండబడి. పెరుగుతో కలసి దశాపవిత్రమున చేరి క్షరితమగును.

16.సోమమా! నీ రసము అత్యంత మధురము. దేవతలు కోరునట్టిది. దానిని - మా ధనము కొరకు దశాపవిత్రమునకు ప్రవహింప చేయుము.

17. హరితవర్ణ, బలశాలి, మదకర, క్షరణశీల సోమమును - ఋత్విక్కులు ఇంద్రుని కొరకు - వసతీవరి జలమున పరిశుద్ధము చేయుదురు.

18. సోమమా! సువర్ణ, అశ్వ, పుత్రాదియుక్త ధనమును మాకు పంచి పెట్టుము. పశుయుక్త అన్నమును మా కొరకు తెమ్ము.

19. ఋత్విక్కులారా ! ఇది యద్ధమువంటి కాలము. యుద్ధకామి. అత్యంతమధుర సోమమును దశాపవిత్రమున, మేషలోమముపై సించితము చేయండి.

20. ఋత్విక్కులు రక్షణాభిలాషులు. విప్రులు. వారు తమ అంగుళులతో మార్జనీయ, క్రాంతకర్మ సోమమును శోధింతురు. సోమము శబ్దించుచు పడును.

21. సోమదేవా ! విప్రులగు ఋత్విక్కులు - కోరికలు తీర్చునదియు, ప్రేరణ కలిగించు సోమమును అంగుళులతోను. బుద్ధితోను - జలధార ద్వారా పంపుదురు.

22. దీప్తిమంత సోమమా! క్షరితమగుము. నీ మదకర రసము - ఆసక్తుడగు ఇంద్రుని వద్దకు - చేరవలెను. ధారక రసముతో వాయువును అందుకొనుము.

23. క్షరణశీల సోమమా! నీవు శత్రుధనమును పూర్తిగా నష్టపరతువు. స్నేహశీలివై కలశమున ప్రవేశించుము.

24. సోమమా ! నీవు మదకరమవు. శత్రుహంతవు. మాకు బుద్ధి ప్రసాదించుచు సాగుదువు. దేవతలు లేరనువారిని, దేవద్వేషులను హతమార్చుము.

25. ఉజ్వల, దీప్త, క్షరణశీల సోమము సకల స్తుతులను ఆకర్షించుచు, ఋత్విక్కులచే కల్పించ బడును.

26. క్షిప్రగామ, శోభన, పవమాన, దీప్త, సకల శత్రుహరణ సోమము ఉత్పన్నమగును.

27. క్షరణశీల సోమమును ద్యులోకమున, పృథ్వియొక్క ఉన్నత స్థానమున, యజ్ఞప్రదేశము లందు ఉత్పత్తిచేయుదురు.

28. సుకర్మ సోమమా! ధారారూపమున ప్రవహింపుము. సకల శత్రువులను, రాక్షసులను హతమార్పుము.

29. సోమమా! రాక్షసులను హతమార్చుచు, వివదించుచు మాకు దీప్తివంతమును, శ్రేష్ఠమునగు ధనము నిమ్ము.

30. దీప్తసోమమా! ఆకాశము, భూమియందు ఉత్పన్నమై, స్వీకరణీయములైన ధనములను మాకు ప్రసాదించుము.

## అరువది నాలుగవ సూక్తము

ఋషి - మారీచ కాశ్యపుడు, దేవత - పవమాన సోమము, ఛందస్సు -గాయత్రి

1. సోమమా! నీవు వర్షకుడవు. దీప్తిమంతుడవు. వర్షించుటయే నీ పని. మానవులకు, దేవతలకు ఉపయోగపడు కార్యములు చేయువాడవు.

2. కోరికలు తీర్చు సోమమా! నీ బలము వర్షశీలము. నీ పని వర్షశీలము. నీ యొక్క రసము వర్షశీలము. *"సత్యంవృషన్వృషేదసి, సత్యముగా అన్ని విధముల వర్షించువాడవు".*

3. సోమమా! నీవుఅశ్వమువలె ధ్వనింతువు. మాకు పశువులను, అశ్వములను ప్రదానము చేయుము. మా కొరకు ధనపు ద్వారములు తెరువుము *"దురోవృధి"*

4. బలశాలి, ఉజ్వల, వేగవంత సోమము సృష్టి కలిగించినది. అది గోవులు, అశ్వములు పుత్రులను ఇచ్చుటకు చేయబడినది.

5. యాజ్ఞికులు సోమమును సుశోభితము చేయుదురు. రెండు చేతులతో పరిమార్జింతురు. సోమము మేషలోమమున క్షరితమగును.

7. విశ్వదర్శక, క్షరణశీల సోమమా! సూర్యకిరణములవలె వెలుగొందు నీ ధారల నిర్మాణము జరుగుచున్నది.

8. రసశాలిసోమమా! నిన్ను ధ్యానించు మాకు అంతరిక్షమునందలి సకల రూపములను, నానా విధ ధనములను ప్రసాదించుము.

9. సోమమా! నీ యొక్క రసము సూర్యసమానమై దశాపవిత్రమును అధిరోహించునపుడు అదేమార్గమున సాగు నీవు నినదింతువు.

10. ప్రజ్ఞాపక, దేవప్రియ సోమము క్రాంతకర్మలగు స్తోతల స్తుతులతో క్షరితమగును. రథికుడు అశ్వమును నడిపిన రీతి సోమము తరంగములను కదిలించును.

11. సోమమా! నీ తరంగములు దేవాభిలాషిణులై యజ్ఞతరంగములవలె క్షరితములగును.

12. సోమమా! నీవు దేవాభిలాషివి. అత్యంత మాదకుడవు ఇంద్రుని పానము కొరకు దశాపవిత్రమున క్షరితమగుము.

13. సోమమా! ఋత్విక్కులచే శోధితుడవగుము. మాకు అన్నము కలిగించుటకు క్షరితమగుము. రుచికర అన్నములతో పాటు గోవులవైపు సాగుము.

14. స్తుత్య, హరితవర్ణసోమమా! నీవు పాలతో చేయబడుదువు. శోధితుడవై యజమానికి ధనము, అన్నము అందించుము.

15. సోమమా! నీవు దీప్తివంతుడవు. నిన్ను యజమానులు తెచ్చినారు. యజ్ఞము కొరకు సంశోధితుడవైనావు. ఇంద్రుని వద్దకు చేరుము.

16. సోమము వేగశాలి. అంతరిక్షమునకు ప్రేరితుడగును. వ్రేళ్లచే మథించబడి ఉత్పన్నుడగును.

17. శోధిత, గతిపరాయణ సోమము సులభముగా ఆకసము వైపు సాగును. ఉడకస్థానమునకు చేరును.

18. సోమమా! నీవు మమ్ము అభిలషింతువు. నీ బలమున మా ధనమును రక్షింపుము. **"పాహినః శర్మం వీరవత్ పుత్రుని వలె మా ఇంటిని కాపాడుము."**

19. వహనశీల అశ్వము ధ్వని చేయునపుడు స్తోతలు దానిని యజ్ఞస్థలమునకు చేర్చినపుడు అశ్వరూప సోమము జలమున నిలుచును.

20. వేగవంత సోమము హిరణ్మయమగు యజ్ఞస్థానము ఆసీనుడైనపుడు స్తోత్రశూన్యుల యజ్ఞముల జాడకానదు.

21. మంచి స్తోతలు సోమమును స్తుతింతురు. బుద్ధిమంతులు సోమమును యజింతురు. దుర్బుద్ధులు నరకమున

పడుదురు.

22. సోమమా! నీవు అత్యంత మధురమవు. యజ్ఞస్థానము పొందుటకు ఇంద్రుడు, మరుత్తుల కొరకు క్షరితమగుము.

23. క్షరణశీల సోమమా! నిన్ను ప్రాజ్ఞులు, కర్తలగు స్తోతలు అలంకరింతురు. మానవులు చక్కగా శోధింతురు.

24. పవమాన సోమమా! క్షరణశీలమగు నీ యొక్క రసమును మిత్ర, ఆర్యమ, వరుణులందరు సేవింతురు.

25. ప్రదీప్త, క్షరణశీల సోమమా! జ్ఞానపూతము. సహస్రభరం వాక్యమునకు ప్రేరణ కలిగింతువు.

26. ప్రదీప్త, క్షరణశీల సోమమా! యజ్ఞాభిలాషి, సహస్రభరణ వాక్యము మా చెంతకంపుము.

27. సోమమా! నీవు పురుహూతుడవు - అనేకమందిచే ఆహ్వానించబడువాడవు. క్షరణశీలుడవు. ఈ యజ్ఞమున స్తోతలకు ఇష్టుడవగుము. ద్రోణకలశమున ప్రవేశింపుము.

28. ఉజ్వలము, ప్రకాశమానము, దీప్తము, నలుదిశల ధ్వనించు ధారాయుక్త సోమమందు పాలు చేర్చబడును.

29. యోద్ధలు యుద్ధభూమిలో ప్రవేశించగనే ఆక్రమింతురు. అట్లే బలి, స్తోతలు ప్రేరేపించిన సోమము యజ్ఞరూప యుద్ధమును ఆక్రమించును.

30. సోమమా! జ్ఞానము, బలము కలగలసిన నీవు దర్శనమిచ్చుటకు ద్యులోకమునుండి దిగిరమ్ము.

*(శ్రీమదాంధ్రవచన ఋగ్వేదసంహిత తొమ్మిదవ మండలము ఏడవ అష్టకమున మొదటి అధ్యాయము సమాప్తము)*

**ఓం నతామనన్తి మాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదసీ అద్రుహా వేద్యాభిర్నపర్వతాని నమే స్థివాంసః**

**రెండవ అధ్యాయము అరువది అయిదవ సూక్తము**

ఋషి - వరుణపుత్ర భృగువు, దేవత - పవమాన సోమము, ఛందస్సు - గాయత్రి

***ఓం హిన్వన్తిసూరముస్రయః స్వసారోజామాయస్పతిమ్ః***
***మహామిన్దు మహీయువః***

1. అంగుళులు పరస్పర బంధు భూతములు. అవి కార్యకుశలలగు స్త్రీలవంటివి. అవి నిన్ను అభిషవించ కోరుచున్నవి. చక్కని బలము కలిగి, సకలలోకములకు ప్రభువై, మహామహుడగు తమ పతి సోమము క్షరణశీలము కావలెననుకొనుచున్నవి - అంగుళులు.

2. దశాపవిత్రమున శుద్ధమై, తేజస్సు ద్వారా దీప్తమైన సోమమా! దేవతల వద్దగల నిఖిలధనమును మా కిమ్ము.

3. పవమాన సోమమా! దేవతలను సేవించవలసి ఉన్నది. శోభన స్తుతివంతమగు వర్షము కల్గించుము. మా అన్నము కొరకు వర్షించుము.

4. సోమమా! నీవు అభీష్ట ఫలప్రదుడవు. తేజోవంతములగు కిరణములవాడవు. మేము శుభకర్ములము. నిన్ను యజ్ఞమునకు హవామహే, ఆహ్వానించుచున్నాము.

5. నీ యొక్క ధనురాద్యాయుధములు శోభనములు. దేవతలను ఉన్మత్తులను చేయుము. మాకు వీరుడగు పుత్రుని ప్రసాదించుము. చమసములందున్న సోమమా! మా యజ్ఞమునకు **"ఆగాహి"** విచ్చేయుము.

6. సోమమా! నీవు బహువులచే సంశోదితుడవగుదువు. వసతీవరీ జలముతో సించితుడవగుదువు. అప్పుడు నీవు కర్రగిన్నెలో నిలిచి స్వస్థానము స్వీకరింతువు.

7. సోమము వృశ్వఋషివంటి దశాపవిత్రమున సంస్కరించబడినది. మహిమాన్వితము. అనేక స్తోత్రయుక్తము. స్తోతలారా! సోమమును గూర్చి "గాయత, పాడండి."

8. సోమము శత్రునివారకము. మధుర రసదాయి. హరితవర్ణ. దీప్తమంతుము. అధ్వర్యులారా! **"ఇంద్రాయ పేతాయే - ఇంద్రుని పానము కొరకు - సోమమును అభిషవించండి."**

9. సోమమా! నీవు బలశాలివి. సకల శత్రుధనములకు నేతవు. నీ సంఖ్యతను **"వృణీమహె"** - భజింతము.

10. అభీష్టఫల ప్రదాత సోమమా! ధారారూపమున ద్రోణపాతుకు విచ్చేయుము. ఇంద్రమరుత్తులకు మదకరుడవగుము.

11. పవమాన సోమమా! నీవు ద్యావా పృధ్వులు భరించువాడవు. స్వర్గద్రష్టవు. దేవతలకు దర్శనీయుడవు. బలశాలివి. నేను నిన్ను యుద్ధభూమి కంపుచున్నాను.

12. సోమమా! నీవు అంగుళులచే పుట్టినవాడవు. అభిషుతుడవు. హరితవర్ణుడవు. ద్రోణ కలశముకు విచ్చేయుము. ఇంద్రుడు నీకు మిత్రుడు. అతనిని యుద్ధమున కంపుము.

13. సోమమా! నీవు దీపకుడవు. విశ్వప్రకాశకుడవు. మాకు విశేష అన్నమును అందింపుము **"అస్మాభ్యం సోమగాతు విత్"** మాకు స్వర్గమార్గము చూపుము.

14. క్షరణశీల సోమమా! అభిషవ కాలమున బలయుతుడవగుము. ధారల ద్రోణ కలశమున ప్రవేశింపుము. స్తోతలచే స్తుతించబడుము. ఇంద్రుని పానము కొరకు చషకమున చేరుము.

15. సోమమా! ణీ యొక్క రసము మాదకము. వెంటనే మత్తు కలిగించునది. అధ్వర్యాదులు రాళ్లతో రసమును తీయుదురు. పాపులపాలిటి ఘాతుకుడవై క్షరితుడవగుము.

16. మానవులు యజ్ఞము చేయుచున్నారు. సోమసామ్రాట్టును ఆకాశమార్గమున ద్రోణకలశముకు విచ్చేయుమని స్తుతించుచున్నారు.

17. క్షరణ శీల సోమమా! మమ్ము రక్షింపుము. మాకు వందల, వేల గోవులనిమ్ము. పుష్టిగల అశ్వములనిమ్ము. స్తుతించదగు ధనమునిమ్ము.

18. సోమమా! దేవతల పానము కొరకు అభిషుతడవగుము. శత్రువును కూల్చదగిన బలమును, సర్వత్ర ప్రకాశించుటకు రూపమును ప్రసాదించుము.

19. శ్యేనపక్షి శబ్దము చేయుచు గూటికి చేరును. క్షరణశీల, దీప్తమంత సోమము శబ్ధము చేయుచు దశాపవిత్రము నుండి ద్రోణకలశమునకు చేరును.

20. వసతీవరీ నామక జలమున పుట్టిన సోమము ఇంద్ర, వాయు, విష్ణు, అన్యదేవతల కొరకు ప్రవహించును.

21. సోమమా! మా పుత్రునకు అన్నము ఇమ్ము. మాకు వేనకు వేలధనము నిమ్ము.

22. దూరమందుగాని దగ్గరలోగాని ఇంద్రుని కొరకు అభిషుతమైన సోమము కురుక్షేత్రమునందలి శర్యణావతమున అభిషుత సోమము మాకు కోరిన ఫలము ప్రసాదించవలెను.

23. ఆర్జికమున, కృత్వదేశమున, సరస్వతినదీ తీరమున, పంచజనమున ప్రతిష్ఠిత సోమము మాకు కోరిన వరములు ప్రసాదించవలెను.

(ఆర్జిక, కృత్వ దేశములు. పంచజనులు నిషాదసహితముగా నాలుగు వర్ణములు. అయిదు వర్ణముల వారును సోమాషవమునకు అర్హులు)

24. ఆవిధముగా సకల జనులచే అభిషుతము. దీప్త చమసమునందలి క్షరణశీల సోమము ఆకసమునుండి వాన కురిపించవలెను. మాకు శోభన వీర్యవంతులగు పుత్రులను ధానాదులను ఇవ్వవలెను.

25. సోమము దేవాభిలాషి హరితవర్ణ. గోచర్మము పై ఉంచబడినది. జమదగ్ని స్తుతించినది. అట్టిసోమము పాత్రలో ప్రవేశించు చున్నది.

26. నీటిలోనికి తీసికొనిపోయి అశ్వములను రుద్దినట్లు - దీప్త, అన్నప్రేరక, క్షీరదియుక్త సోమమును వసతీవరిలో పురోహితులు మర్జింతురు.

27. సోమమా! అభివమైనంత ఋత్విక్కులు ఇంద్రాది దేవతల కొరకు నిన్ను రాతితో ప్రేరణ కలిగింతురు. నీవు అభిషుతమై దీప్త ధారతో ద్రోణకలశమున పడుము.

28. సోమమా! ణీ బలము సుఖావహము. అరణ్యాదులు అందు కొనునది. శత్రువులనుండి రక్షించునది అనేకమంది అభిలషించునది. యాజ్ఞికులమగు మేము నేటి యజ్ఞమున ణీ బలమును భజింతుము.

29. సోమమా! నీవు మదకరుడవు. సేవ్యుడవు. విప్రుడవు. స్తుతియుకుడవు. సర్వరక్షకుడవు. అనేకులచే తలచుకొనువాడవు. నిన్నుమేము కీర్తింతుము.

30. శోభన యజ్ఞసోమమా! మేము ణీ ధనమును ఆశ్రయింతుము. నీవు సర్వరక్షకుడవు. ఎంతో మంది అభిలషించువాడవు. నిన్ను ఆశ్రయింతుము. మా పుత్రులకు మంచి ధనమును, చక్కని జ్ఞానమును ప్రసాదించుము.

## అరువది ఆరవ సూక్తము

ఋషి - శతవైభావసులు, దేవత - పవమాన సోమము, ఛందస్సు - 18
అనుష్టుప్ - మిగిలినవి గాయత్రి

1. సోమమా! నీవు సూక్ష్మదర్శకుడవు. సఖుడవు. స్తోతవ్యుడవు. మేము నీకు మిత్రులము. మా కొరకు - సకల కర్మ స్తోత్ర లక్ష్యముగా క్షరితుడవగుము.

2. పవమాన సోమమా! నీకు గల రెండు వంకర కిరణములతో నీవు సకల లోకములకు స్వామివి అయినావు -

తాభ్యాం విశ్వస్య రాజసి.

3. శోధిత, క్రాంతకర్మ సోమమా! నీ కిరణములు నలువైపుల వ్యాపించి ఉన్నవి. దానితో వసంతాది రుతువులందు నీవు సర్వత్ర శోభిల్లుదువు.

4. సోమమా! నీవు మా మిత్రుడవు. మా సకల స్తోత్రములను ధ్యానముగ వినుము. మిత్రులమగు మమ్ము రక్షించుటకును, మాకు అన్నము కలిగించుటకును విచ్చేయుము.

5. నీ కిరణములు తేజోవంతములు. సర్వత్ర జ్వలన శీలములు. పూజనీయములు. అవి భూమి మీద జలములను విస్తరింప చేయును.

6. సోమమా ! సప్తసింధువులు నీ ఆజ్ఞనే అనుసరించును. నీ కొరకే గోవులు పరుగులిడును. **"తుభ్యంధావన్తి ధేనవః"**

7. సోమమా! నీవు ఇంద్రునకు మదకరుడవు. మాచే అభిషుతుడవు. దశాపవిత్రము నుండి వెడలుము. ద్రోణ కలశమున ప్రవేశింపుము. "దధానో అక్షితిశ్రవః" మాకు అక్షయ ధనము అందించుము.

8. సోమమా! సప్తహోతలు స్తుతించుచు, దేవతల సేవకుడగు యజమాని యజ్ఞమున విప్రుడవు, క్షరణ శీలుడవగు నిన్ను - కీర్తించినారు.

9. సోమమా! అంగుళులు త్వరపడును. త్వరపడును. శబ్దించును. మేషలోమముతో చేసిన దశాపవిత్రమున నిన్ను పడవేయును. అప్పుడు నీవు ధ్వని చేయుచు వసతీవరీ జలములందు సించిత మగుదువు.

10. క్రాంతప్రజ్ఞ, అన్నవంతసోమమా! అన్నము తెచ్చుటకు అశ్వములు ఉరుకునట్లు యజమానులకు అన్నము కోరునట్టి నీ ధారలు ఉరుకును.

11. ద్రోణకలశము మధురరసము కురిపించునది. దానిని లక్ష్యముగా చేసి మేషలోమమయ దశాపవిత్రమున పురోహితులు సోమమును చేయుదురు. మా అంగుళులు సోమమును శుద్ధిచేయ కోరుచున్నవి.

12. పాలిచ్చి మానవులను ఆనందపరచు ఆవులు కొట్టమునకు పోయినట్లు క్షరణశీలసోమము సంగమ స్థానమగు ద్రోణకలశమువైపు పోవును. **"అగ్మన్నృతస్యయోనిమా"** సోమము యజ్ఞస్థానమునకు పోవును.

13. సోమమా! నిన్ను దుగ్ధాదులందు కలుపునపుడు - మా యజ్ఞమునకుగాను క్షరణశీల జలము వైపు సాగుదువు.

14. మేము నీ పూజాభిలాషులము. నీ బంధుత్వమున, నీ రక్షణలందున్న వారలము. నీ బంధుత్వమును ఆకాంక్షించుచున్నాను.

15. సోమమా ! అంగిరుల గోవులను వెతుకువాడును. మహామహుడును, మానవదర్శకుడగు ఇంద్రుని కొరకు ప్రవహించుము. **"ఇంద్రస్య జఠరేవిశ"** ఇంద్రుని ఉదరమున వసింపుము.

16. సోమమా ! నీవు మహామహుడవు. దేవతలకు ఆనందదాతవు. ప్రశంసనీయుడవు. ఎంతో బలవంతులందు తేజస్వివి. శత్రువులతో యుద్ధము చేసినావు. వారి ధనమును గెలిచినావు.

17. సోమము బలవంతులందు మహాబలవంతుడు, శూరులందు, మహాశూరుడు, దాతలందు మహాదాత.

18. సోమమా! నీవు మహాబలవంతుడవు. యజ్ఞముల ప్రేరకుడవు. మాకు అన్నమునిమ్ము. పుత్రులనిమ్ము. వృణీమహే సఖ్యాయ వృణీమహే యాజ్యాయ. మైత్రి కొరకు నిన్ను వరింతుము. శత్రువులనుండి రక్షణ కొరకు నిన్ను వరింతుము.

19. పవమాన సోమమా! నీవు మా బ్రతుకులను రక్షింతువు. మాకు అన్నమునిమ్ము. అన్నరసము నిమ్ము. రాక్షసులను మాకు దూరమున నష్టపరచుము.

20. పంచజన హితైషి, ఋషి, పవిత్రుడు, పురోహితుడు, మహాయశస్వి అగ్నిని ధనాదులకు యాచింతుము.

21. అగ్నీ! నీవు శుభకర్ముడవు. మాకు మంచి బలోపేత తేజస్సునిమ్ము. పుత్రులనిమ్ము. గోవులు మున్నగు వానినిమ్ము.

22. పవమాన సోమము శత్రువులను ఆక్రమించును. స్తోతల శోభన స్తుతులను అందుకొనును. **"సూరోన విశ్వదర్శతః"** సూర్యునివలె విశ్వదర్శనీయుడు కూడ అగును.

23. మానవులచే మాటి మాటికి శుద్ధి చేయబడిన సోమము నిరంతరము దేవతల వద్దకేగును. సోమము ఆనందప్రదుడు. అన్నవంతుడు, హవికి హితైషి. అందరకు ద్రష్ట.

24. క్షరణశీల సోమము అంధకారమును అంతము చేసినాడు. విశేషమ్ సర్వత్రవ్యాప్తి, దీప్తిమంత, శ్వేతవర్ణ తేజస్సును కలిగించినాడు.

25. సోమము తేపతేప అంధకారమును అంతమెందించును. అతడు వ్యాపక తేజోవంతుడు. క్షరణశీలుడు. అతని

ధారలు ఆనందదాయినులు. శీఘ్రకారిణులు వహనశీలలు. అవి దశాపవిత్రము నుండి వెడలుచున్నవి.

26. పవమాన సోమము అతిరథవంతుడు. నిర్మలతమ యశశ్వి హరితధారావంతుడు మరుత్తుల సహాయ యుక్తుడు. తన కిరణములచే సకల విశ్వమున వ్యాపించును.

27. పవమనాసోమము అన్నదాత. స్తోతలను బలయుతులను చేయువాడు. పుత్రులనిచ్చువాడు. అతడు తన కిరణములచే సకల విశ్వములందు వ్యాపించును.

28. క్షరణశీల సోమము మేషలోమమయ పవిత్రమును దాటి క్షరితమైనది. పవిత్రమున శుద్ధమై. ఇంద్రుని ఉదరమున వసించినది.

29. కిరణరూప సోమము గోచర్మము మీద రాళ్లతో ఆటలాడుచు, **"ఇంద్రం మదాయ జోహువత్"** ఇంద్రుని మదమునకు ఆహ్వానించినాడు.

30. క్షరణశీల సోమమును శ్యేనరూపగాయత్రి ద్యులోకమునుండి తెచ్చినది. రసరూప అన్నము యశోయుక్త సోమము వద్ద ఉన్నది. **"తేననో మృళయ జీవసే"** దానితో మా జీవితమును ఆనందమయము చేయుము.

**అరువది ఏడవ సూక్తము**

ఋషులు - వేరువేరు, దేవతలు - వేరు వేరు, ఛందస్సు - గాయత్రి.

1. క్షరణశీల సోమమా! నీవు అత్యంతమదకరుడవు, అత్యంత ఓజస్వివి. హింసాశూన్యుడవు. యజ్ఞములందు అభిషవధారము కోరువాడవు. స్తోతలకు ధనమిచ్చువాడవు. ద్రోణ కలశమున ధారారూపముగా పడుము.

2. కర్మనిష్ఠపురోహితులకు మత్తుకలిగింతువు, వారికి ధనములనిత్తువు. ప్రాజ్ఞుడవు. యజ్ఞమును ధరించువాడవు అన్నసహితుడవై ఇంద్రునకు మరింత మత్తు కలిగింపుము.

3. పవమాన సోమమా! రాతితో దంచబడుము. శబ్దము చేయుము. కలశమున చేరుము. దీప్తియుక్త, శత్రుశోషక బలము పొందుము.

4. సోమము రాతితో దంచబడును. మేషలోమమయ పవిత్రమునుండి వెడలును. అప్పుడు హరిత సోమము అన్నముతో **"నిన్ను కూడి ఇంద్రుని పిలుతును"** అనును.

5. సోమమా! మేషలోమమయ పవిత్రమునుండి వెడలినపుడు హవిరూప అన్నము, సౌభాగ్యము, గోయుక్త

బలమును పొందెదవు.

6. పాత్రలందు పడుసోమము వందగోవులు, వేయి అశ్వములు, ధనమును ప్రసాదించవలెను.

7. పవిత్రమునుండి వెడలి, అనేక ధారలుగా కలశమందు పడునట్టి మాదక సోమము చమసాదులందు వ్యాపించును. తన చలనమున ఇంద్రుని పరివ్యాప్తము చేయును.

8. సోమము అన్నింటికన్న ఉన్నతము. పూర్వజులు అభిషవించిన సోమము ఇంద్రుని కొరకు కలశమున చేరును. ఇంద్రుని కొరకు క్షరితమగును.

9. పనులు చేయుటకు ఇటునటు కదులు అంగుళులు మాదక రసమును రాల్చును. యాగాది కర్మలను ప్రేరేపించును. క్షరణశీల సోమమునకు ప్రేరణ కలిగించును. స్తోతలు స్తోత్రములచే సోమమును స్తుతింతురు.

10. పూష అజవాహనుడు. అతడు మా సమస్త యానములకు రక్షకుడు. అతడు మాకు అందవతులగు కన్యలను ఈయవలెను - **"ఆభక్షత్కన్యాసునః"**

11. కళ్యాణముకుటవంత పూష కొరకు మా సోమము మాదక ఘృతము వలె క్షరితమగును. అతడు మాకు సుందర కన్యలను ప్రసాదించవలెను - **"ఆభక్షత్కన్యాసునః"**

12. సర్వత్ర దీప్తమంతుడవగు పూషా ! నీ కొరకు అభిషుత సోమము పరిశుద్ధఘృతమువలె - క్షరితగును.

13. సోమమా! నీవు స్తోతల స్తోత్రముల జనకుడవు. ద్రోణకలశమున చేరుము. నీవు దేవతలకు రత్నాదుల దాతవు.

14. శ్యేనపక్షి గూటికి వెళ్లునప్పటివంటి ధ్వనిచేయుచు సోమము ద్రోణకలశమున చేరును.

15. అభిషంతసోమము - శ్యేనమువలె - సర్వత్ర చేరగలది - చమసములందు చేరునది.

16. సోమమా! నీవు ఎంతో మధుర రసవంతుడవు. మాదకుడవు. **"ఇంద్రాయ మధుమత్తమః"** ఇంద్రుని ప్రసన్నుని చేయుము.

17. సోమము అభిషుతము. అన్నవంతము. ఋత్విక్కులు సోమమును దేవతలకు అర్పింతురు. సోమము - రథమువలె - శత్రుసంపదను హరించును.

18. సోమము అత్యంత మాదకము. అభిషుతము. దీప్తము. అతడు సోమరసపానము కొరకు వాయువును సృష్టించినాడు.

19. సోమమా! నీవు శిలలచే అభిషుతమగుదువు. స్తోతలకు శోభన శక్తివంత ధనాదుల నిచ్చెదవు. దశాపవిత్రమునకు సాగుదువు.

20. శిలలచే అభిషుతమై, అందరిచే స్తుతించబడిన సోమము రాక్షసుల వదించును. **"పవిత్రమతిగాహతే"** అవిత్రమును దాటి సాగును.

21. సోమమా! దూరమున ఉన్న , దగ్గరున్న, ఇక్కడ ఉన్న భయమును భంగపరచుము.

22. సర్వద్రష్ట, క్షరణశీల, దశాపవిత్ర శోధిత సోమము మమ్ము పావనులను చేయవలెను.

23.శ్రేష్ఠఅగ్నీ! నీ తేజస్సునడుమ ఉన్న పరిశుద్ధము చేయు సామర్ధ్యమున - పుత్రాది వర్ధకమగు మాదేహమును **"పునీహి"** పవిత్రము చేయుము.

24. అగ్నీ! నీ తేజస్సు శోధకము - సూర్యాదుల తేజోయుక్తము. దానితో మమ్ము పావనము చేయుము. సోమాభిషమును పవిత్రము చేయుము.

25. సర్వప్రేరక, ప్రకాశమాన సోమమా! నీ అభిషవమున, పాపపరిహారక తేజమున నలుదిశల నుండి మమ్ము పావనులను చేయుము - **"మాం పునీహి విశ్వతః"**

26. శ్రేష్ఠఅగ్నీ! దక్ష, సమర్ధవంత అగ్ని, వాయు, సూర్య తేజస్సులతో మా దేహములను పావనము చేయుము.

27. పునన్తుమాం దేవజనాః పునన్తువసవోధియా విశ్వేదేవాః పునీతమా జాతవేదః పునీహిమాం దేవతలు నన్ను పవిత్రుని చేయవలెను. దసువులు నన్ను మా కర్మలచే పవిత్రుని చేయవలెను. దేవతలందరు నన్ను పవిత్రుని చేయవలెను. జాతబుద్ధి అగ్ని నన్ను పవిత్రుని చేయవలెను.

28. సోమమా! మమ్ము చక్కగా వర్ధిల్లచేయుము. నీ కిరణములన్నింటితో దేవతలకు ఉత్తమ హవి రూపరసము అర్పించుము.

29. సోమమా! నీవు అందరను ప్రసన్నులను చేయువాడవు. శబ్దించువాడవు. వయస్కుడవు ఆహుతులచే వర్ధనీయుడవు. క్షయణశీలుడవు. నమస్కరించుచు సాగుదుము. **"ఆగన్మబిభ్రతోనమః"**

30. దీప్యమాన సోమమా! ఆక్రమించు శత్రువు ఆయుధమును ననాశ, నాశము చేయుము. మాకొరకు క్షరితుడవగుము. సర్వహరిత శత్రువును వధించుము.

31. పవమానసోమదేవత కొరకు ఋషులచే సంపాదించ బడిన వేదరసరూపసారమును పఠించిన వరునకు - వాయుదేవత పవిత్రము చేసిన - పాపశూన్య అన్నము లభించును.

32. పవమానసోమదేవత కొరకు ఋషులచే సంపాదించ బడిన వేదరసరూపసారమును పఠించునరునకు సరస్వతి స్వయముగా ఘృత, క్షీర, మదకర సోమములను అందించును.

(31,32 మంత్రములు ఫలశ్రుతి వంటివి వేదాధ్యయన ఫలమును సూచించుచున్నవి. ఇట్టివి ఇంతకు ముందు కనిపించిన జాడలేదు.)

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ అష్టకము తొమ్మిదవ మండలమున మూడవ అనువాకము సమాప్తము.)*

**నాలుగవ అనువాకము     అరువది ఎనిమిదవ సూక్తము**

ఋషి - భలందన పుత్ర వత్సప్రేరుడు. దేవత - పవమాన సోమము. ఛందస్సు - జగతి - 10 త్రిష్టుప్

1. గోవులు ఆనందదాయనులు. సోమము గోవులవంటిదే. ఇది ఇంద్రుని కొరకు క్షరితమగును. అంబారావములు చేయుచు కుశలపై కూర్చున్న పాడియావులు ఇంద్రుని కొరకు - ప్రవహించునదియు, పరిశుద్ధమగు - సోమరసమును వహించును.

2. హరితవర్ణసోమము ధ్వనిచేయును. స్తోతల ముఖ్యస్తుతులను ఆలకించును. పైకి పాకు తీవలకు రసవంతములగు ఫలములు కలిగించును. మేషలోమమయ దశాపవిత్రమున చేరును. వేగముగా ప్రవహించును.

3. సోమము తనతో ఉండు ద్యావాపృథ్వులను సృష్టించినది. వానిని వర్ధిల్లచేసి, సమర్థులను చేయుటకు సోమము తన రసమును అందించినది. భువి, అపారద్యావా పృథ్వులను ఎరక పరచిన సోమము నలుగడల తిరుగుచు అవినాశ్య బలమును సాధించినది.

4. ప్రాజ్ఞసోమము ద్యావా పృథ్వులందు సంచరించును. అంతరిక్షపు జలమును పంపును. అన్నసహితమై తన స్థానము ఆప్యాయతము చేయును. సోమము ఋత్విక్కులచే యవలసత్తులో కలుపుబడును. సోమము అంగుళుల

సాంగత్యము పొంది సకల ప్రాణులను రక్షించును.

5. సోమము ప్రవృద్ధమనస్కుడు. కార్యకుశలుడు. అతడు భువిమీద తన జన్మను గ్రహించును. యజ్ఞములందు స్తుతించబడును. దేవతలచే నియమ ప్రకారము నిలుపబడును. యువసోమము మరియు సూర్యుడు తమ ఉత్పత్తి సమయమున విశేషముగ అవతరింతురు ఒకరు గుహయందుండగా ఒకరు ప్రకాశింతురు.

6. మాదక సోమరస స్వరూపమును విద్వాంసులు ఎరుగుదురు. సోమరూప అన్నమును గాయత్రి రూప పక్షి ద్యులోకమునుండి తెచ్చినది. సోమము వర్ధమానము, కిరణస్వరూపము. దేవాభిలాషి, నలుదిశల సంచరించునది - స్తుతించబడునది. ఋత్విక్కులు అట్టి సోమమును వసతీవరీ జలములందు పరిమార్జితము చేయుదురు.

7. సోమమా! నీవు రెండు చేతులందు పుట్టినావు. ఋషులు నిన్ను పాత్రలందుంచినారు. పది అంగుళులు నిన్ను అభిషవించి, స్తుతించి, కర్మలచే మేషలోమ పవిత్రమున పరిమార్జించును. దేవతలను ఆహ్వానించు. కర్మనిష్ఠులగు ఋత్విక్కులు నిన్ను గృహములందు స్థాపింతురు. నీవు స్తోతలకు అన్నము ప్రసాదింతువు.

8. సోమము పాత్రలందుండి నలువైపుల సంచరించును. సోమమును దేవతలు ఆకాంక్షింతురు. శోభనస్థానముగల సోమపుమనోగతమును స్తోత్రములు స్తుతించును. ఉన్మత్త, రసవంత సోమము వసతీవరీ జలసహితమై - ఆకసమునుండి - ద్రోణకలశమున చేరును. శత్రుధనవిజేత, అమరసోమము వాక్యమునకు ప్రేరణ కలిగించును.

9. సోమము ద్యులోకమునుండి సమస్తజలమును కురిపించును. దశాపవిత్రమున పరిశుద్ధమై కలశమున చేరును. సోమము శిలలు, వసతీవరీజలము, దుగ్ధాదులతో అలంకృతుడగును. అభిషుత. శోధిత సోమము స్తోతలకు ప్రియమును, శ్రేష్ఠమును అగు ధనమును ప్రసాదించును.

10. సోమమా !నీవు దాతవు. పరిషిక్తుడవగుము. మాకు నానావిధ అన్నములను ప్రసాదించుము. ద్వేషశూన్యద్యావా పృథ్వులను పిలుచుచున్నాము. దేవతలారా! మాకు వీరపుత్రయుక్త ధనము అందించండి.

### అరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - అంగిరస హిరణ్య స్తూపుడు, దేవత - పవమాన సోమము,

ఛందస్సు - జగతి -9,10 త్రిష్టుప్

1. ధనుస్సున బాణము ఉంచినట్లు - మేము పవమాన రూప ఇంద్రునందు మాననీయ స్తుతులను ఉంచుదుము. దూడ గోమాత స్తనముల కొరకు పుట్టినట్లు - మేము ఇంద్రుని మత్తు కొరకు సోమము కల్పింతుము. పాడియావు

పాలిచ్చుటకు దూడముందు నడిచినట్లు ఇంద్రుడు స్తోతలముందు నడచును. **"ప్రతేష్వపిసోమ ఇష్యతే"** ఇంద్రుని కర్మములందు సోమము అర్పించబడును.

2. ఇంద్రుని స్తోతలు స్తుతింతురు. ఇంద్రుని కొరకు మాదక సోమము సిద్ధము చేయబడును. ఉన్మత్త రసవంత సోమము ఇంద్రుని నోట పోయబడును. సోమము గృహాదులందు సువిస్తృతము. మదకర రసవంతము. క్షరణశీలము. గతి పరాయణము చతుర యోద్ధబాణము లక్ష్యము చేరినట్లు సోమము మేషలోమ పవిత్రమున చేరును.

3. వసతీనరీ జలము సోమమునకు స్త్రీవంటిది. ఆ జలములందు సోమము శోధితము మిశ్రితము చేయబడును. ఆ వధువును కలసికొనుటకే సోమము మేషచర్మముపై క్షరితుడగును. సోమము సత్యరూప యజ్ఞమునకు వెళ్లును. అచట దైన్యము ఎరుగని పృథ్విమీద పుట్టిన ఓషధుల అగ్ర భాగమున నిలుచును. యజమాని ఫలసంపన్నుని చేయును. హరితవర్ణ సర్వయజనీయ, గృహస్థిత సోమము శత్రువులను లంఘించిసాగును. సర్వత్ర వ్యాపక సోమము శత్రుబలమును న్యూనపరచి తన తేజస్సున శోభిల్లును.

4. వర్షక సోమము చప్పుడు చేయును. దేవత కొరకు అలంకరించిన స్థానమునకు దేవి వెళ్లినట్లు - సోమము వెనుక గోవులు సాగును. సోమము - శ్వేతవర్ణ, మేషలో మమయ పవిత్రమును దాటును. ఉజ్వల కవచమువలె సోమము దుగ్ధాదులను కప్పుకొనును.

5. హరితవర్ణ, అమరసోమము జలములందు శుద్ధిఅగునప్పుడు పాలవంటి తెల్లని శుభ్రవస్త్రమును నలువైపుల చుట్టుకొనును పాపనాశక కార్యమునకుగాను సోమము ద్యులోకపు వీపున - సూర్యని స్థాపించినాడు. అందరి మేలు కొరకు ద్యావాపృథ్వుల మీద ఆదిత్య తేజమును నిలిపినాడు.

6. సోమము - సువీర్య ఆదిత్యుని సర్వవ్యాపి కిరణముల భాతి-సర్వత్ర వ్యాపించును. మదకర, శత్రుఘాతుక, చమసవ్యాప్త, పరిష్కృత సోమము నూలు బట్టలతో కూడా నలుదిశల సంచరించును. సోమము ఇంద్రునకు తప్ప ఇతరులు కొరకు క్షరితుడు కాడు.

7. ఋత్విక్కులు అభిషవించిన మదకర సోమము - నదులు సముద్రమునకు చేరినట్లు స్తుత్యఇంద్రుని చేరును. సోమమా! మా ఇంట బిడ్డలకు, ఆవులకు, సుఖము కలిగించుము. మాకు అన్నము, అన్నము, పుత్రులను ప్రసాదించుము.

8. సోమమా! మాకు వస్తు, హిరణ్య, అశ్వ, గో, యవ, శోభన వీర్యయుక్త ధనమునిమ్ము. నీవు మా పితరులకు పితవు. కావున స్వర్గాదులందున్న కర్మ నిష్ఠ, హనిరూప అన్న కర్తవు. మాకు పితరుడవు.

9. ఇంద్రుని రథము యుద్ధములకు పోవును. మేము శుద్ధిచేసిన సోమము ఇంద్రుని జాడకు పోవును. రాళ్లతో అభిషవించిన సోమము మేషలోమ పవిత్రమును దాటును. హరిత వర్ణసోమము వార్ధక్యమును అణచును. వర్షమునంపుటకు సాగును.

10. సోమమా! నీవు మహా ఇంద్రుని కొరకు క్షరితుడవగుము. నీవు ఇంద్రునకు సుఖప్రదాతవు. అనింద్యుడవు. శత్రుంజయుడవు. స్తోతనగునాకు ఆహ్లాదకర ధనము ప్రసాదించుము. ద్యావాపృథ్వులు ఉత్తమ ధనములిచ్చి మమ్ము రక్షించవలెను.

## డెబ్బదవ సూక్తము

ఋషి - వైశ్వామిత్ర రేణువు, దేవత - పవమాన సోమము

ఛందస్సు - జగతి - 10 త్రిష్టుప్

1. ప్రాచీన యజ్ఞమునందలి సోమము కొరకు ఇరువది ఒక్క ఆవులు పాలిచ్చినవి. యజ్ఞమున పెరిగిన సోమము శుద్ధికిగాను వసతీవరాది నాలుగు జలములను కల్పించినాడు.

2. యజ్ఞకర్తలగు యజమానులు సోమమును జలము అర్థింతురు. సోమమ ద్యావాపృథ్వులను జలముతో నింపును. సోమము తన మహిమచే దీప్తివంతమగు జలమును ఆచ్ఛాదించును. హవియుక్తులగు యజమానులు ప్రకాశమానమగు సోమస్థానమును ఎరుగుదురు.

3. సోమపు కిరణములు ప్రజ్ఞాపకములు -అమరములు - అహింసనీయములు. అవి స్థావర జంగములను రక్షించును. ఆ కిరణములతోనే సోమము జలమును. దేవయోగ్య అన్నమును ప్రసాదించును. అభిషవమైన తరువాతనే సోమము ఆదరణీయములగు స్తుతులను స్వీకరించును.

4. శుభకర్మలు చేయు పది అంగుళులచే పరిశుద్ధమైన సోమము లోకములను వీక్షించుటకు అంతరిక్షమందలి మధ్యమ వాక్కులో వసించును. మానవ దర్శక, క్షరణశీలా సోమము జలమును వర్షించుటకు యజ్ఞములను రక్షించుచు అంతరిక్షమునుండి మానవులను, దేవతలను అవలోకించును.

5. సోమము ఇంద్రుని బలము కొరకు పవిత్రమున శుద్ధమగును. ద్యావాపృథ్వుల మధ్య నిలుచును. నలుదిశల సంచరించును. వీరుడు శత్రువును బాణమున కొట్టినట్లు సోమము దుఃఖద అసురులను మాటి మాటికి హెచ్చరించుచు, దుర్బుద్ధి అసురులను హతమార్చును.

6. మాతృభూత ద్యావాపృథ్వులను మాటిమాటికి చూచుచు, నినదించుచు సోమము అవును చూచి అరచుచు పోవు దూడవలెను, నినదించుచుసాగు మరుద్గణముల వలెను, సర్వత్ర సంచరించును. మానవులకు శుభముల

నిచ్చు జలములు తెలిసిన శుభకర్మ, క్షరణషీలా సోమము తన స్తుతులు కోరుచు - నన్నువిడిచి మరెవరిని వరించును?

7. అరిభయంకర, జలవర్ధక, సర్వదర్శక, క్షరణశీల సోమము తనకు బలము కలుగునట్లు తన రెండు శృంగములకు ధారలకు - పదునుపెట్టుచు నినదించును. తదుపరి స్వస్థానమగు ద్రోణకలశమున చేరును. మేకచర్మము, గోవుచర్మము సోమమును శుద్ధిచేయున వగును.

8. పాత్రస్థిత , స్వశరీర పరిశుద్ధ, పవిత్ర, హరితవర్ణ సోమము మహోన్నతుడయి, మేహలోమ పవిత్రమున ప్రతిష్ఠితుడవగును. మిత్ర, వరుణ, వాయువుల కొరకు తగినన్ని జలములు, పాలు, పెరుగుతో కలసిన మదకర సోమము శభుకర్మల ఋత్విక్కులచే ప్రదానము చేయబడును.

9. సోమమా! నీవు జలవర్షకుడవు. దేవతల పానము కొరకు క్షరితుడవగుము. ఇంద్రునకు ప్రీతికరమగు పాత్రలో ఉండుము. మమ్ము బాధించక ముందే దుర్గమ రక్కసుల నుండి మమ్ము రక్షింపుము. దారితెలిసినవాడు - తెలిసికొనగోరు వానికి - దారి చూపినరీతి యజ్ఞమార్గము నెరిగిన నీవు మాకు యజ్ఞపథము చూపుము. మమ్ము రక్షింపుము.

10. తోలిన గుఱ్ఱము యుద్ధభూమికి చేరును. సోమమా! ఋత్విక్కుల ప్రేరణలో నీవు ద్రోణకలశమునకు చేరుము - ఇంద్రుని జఠరమున ప్రవేశింపుము. నావికుడు నదిని దాటించును. సర్వజ్ఞుడవగు నీవు మమ్ము పాపముల నుండి దాటించుము. శూరునివలె శత్రువును హతమార్చుము. నిందక శత్రువుల నుండి మమ్ము రక్షింపుము.

## డెబ్బది ఒకటవ సూక్తము

ఋషి - వైశ్వామిత్ర వృషభుడు, దేవత - పవమాన సోమము ఛందస్సు -
జగతి 9 త్రిష్టుప్

1. యజ్ఞమున ఋత్విక్కులకు దక్షిణలు ఇచ్చెదరు. బలశాలి సోమము ద్రోణకలశమునకు చేరును. జాగృత సోమము ద్రోణకలశమునకు చేరును. జాగృత సోమము ద్రోహులగు రాక్షసులనుండి స్తోతలను రక్షించును. సోమము ద్యులోకమందు సూర్యుని సుదృఢము చేసినాడు.

2. శత్రుహంత వీరునివలె బలశాలి సోమము ధ్వనులు చేయుచు సాగును. తన అసురహంత బలమును ప్రకటించును. సోమము వార్ధక్యమును విరుచుచున్నాడు. పానయోగ్య ద్రవమగు సోమము సంస్కరించబడిన ద్రోణకలశమునకు చేరుచున్నాడు. మేషలోమ పవిత్రమున తన గతిపరాయణ రూపమున స్థాపించబడినాడు.

3. సోమము శిలలు, బాహువులచే అభిషుత మగును. పాత్రలందు ప్రవేశించును. వృషము వలె ప్రవర్తించును. స్తోత్రములచే స్తుతుడగును. అంతరిక్షమున సర్వత్ర సంచరించును. ప్రసన్నుడగును. స్తోతలకు ధనము నిచ్చును.

జలమున శోధితుడగును. దేవతలకు హవి సమర్పించు యజ్ఞమున పూజితుడగును.

4. ఇంద్రుడు దీప్తుడు, ద్యులోకవాసి, మేఘవర్ధకుడు. శత్రుపురధ్వంసి. మదకర సోమము అట్టి ఇంద్రుని తృప్తిపరచును. గోవులు హవిని భక్షించును. తమ స్తనముల పాలను నింపును. తమ మహిమతో పాలను ఇంద్రునకు అర్పించును.

5. చేతివ్రేళ్లు పది సోమమును యజ్ఞభూమికి - యుద్ధమునకు రథము నంపినరీతి - పంపును. మాననీయ స్తోతలు సోమము కొరకు స్థానము కల్పింతురు. అప్పుడే ఆవుల పాలు సహితము అచటికి చేరును.

6. శ్యేనము తనగూటికి చేరును - అట్లే ప్రకాశమాన, పవమాన సోమము - తన కర్మమున కట్టుకున్న బంగారు ఇంటికి చేరును. స్తోతలు యజ్ఞమందు ప్రియసోమమును స్తుతింతురు. పూజనీయ సోమము - అశ్వమువలె - దేవతల వద్ద కరుదెంచును.

7. సోమము శుభంకరుడు. క్రాంతప్రజ్ఞుడు, జల శోధితుడు. అతడు పవిత్రుడై కలశమున ప్రవేశించును. సోమము కోరికలు తీర్చువాడు. మూడు సవనములందుండువాడు. అతడు స్తుతిని అనుసరించి స్వరము చేయును. వివిధపాత్రలకు వచ్చి పోవుచుండును. అనేక ఉషస్సులందు స్వరసాంగత్యమున శోభిల్లును.

8. సోమ కిరణములు శత్రునాశకములు. తమరూపములను ప్రదీప్తము చేసికొనునవి. అవి రణరంగమున ఉండును - రణమున శత్రువులను కూల్చును. అవి జలదాతలు. హవిరూప అన్నయుక్తములై దేవకాముల వద్ద కేగును. స్తుతలందు కలియును, స్తోతలు పశువులను ప్రార్థించు వాక్యములందు కూడా సోమకిరణములు కలసి [పోవును.

9. ఆవును చూచి ఆబోతు అరుచును. స్తుతులను చూచి సోమము నినదించును. సోమము సూర్యరూపమున ద్యులోకమున ఉండును. సోమము ద్యులోక ఉత్పన్నుడు. శుభగమనుడు. అతడు పృథ్విని వీక్షించును. ప్రజ్ఞానమున ప్రజలను అవలోకించును.

## డెబ్బది రెండవ సూక్తము

ఋషి - అంగిరస హరిమంతుడు. దేవత - పవమాన సోమము.

ఛందస్సు - జగతి.

1. సోమము హరితవర్ణము. ఋత్విక్కులు దానిని శుద్ధిచేతురు. అశ్వమునువలె సోమమును అర్చింతురు. కలశమందున్న సోమమున పాలు కలుపుదురు. సోమము ధ్వనిచేయునపుడు స్తోతలు స్తుతింతురు. సోమము స్తోతలకు ధనము ప్రసాదించును.

2. సుభుజ కర్మనేతలు పది అంగుళులతో సోమమును అభిషవించునపుడు - ఇంద్రుని జఠరాముున ఋత్విక్కులు సోమము సమర్పించునపుడు - అప్పుడు విద్వాంసులగు స్తోతలు ముక్తస్వరమున మంత్రములు ఉచ్చరింతురు.

3. సోమము దేవతలను ప్రసన్నము చేయ దలచును. కలశమునకు చేరును. దుగ్ధాదులను కలసికొనును. అప్పుడు సూర్యపుత్రి ఉష శ్రేష్ఠస్వరమును సైతము సోమము తిరస్కరించును. స్తోతసోమమును పర్యాప్తముగ స్తుతించును. చేతులకు పుట్టినవి, పరస్పరము కలసినవి అటునిటు కదులు అంగుళులు సోమమును కలియును.

4. సోమము కర్మనేతలచే శుద్ధించ బడినది. శిలలచే అభిషుతము. దేవతల పసన్నకర్త గోపతి ప్రాచీనుడు. పాత్రలందు ప్రవహించువాడు. బహుకర్మవంతుడు. మానవ యజ్ఞసాధకుడు. దశాపవిత్ర పరిశుద్ధుడు. అతడు తన ధారలతో యజ్ఞమందు - ఇంద్రుని కొరకు - పాత్రలందు వాలును.

5. ఇంద్రా ! కర్మ కర్తల భుజములచే ప్రేరిత, అభిషుత సోమము నీ బలము కొరకు విచ్చేయును. నీవు సోమపానము చేయుము. నీ కార్యములు నిర్వర్తించుము. నీవు యజ్ఞమున శత్రువులను జయింతువు. పక్షి కొమ్మమీద కూర్చున్నట్లు హరితవర్ణసోమము అభిషవణ ఫలకమున ఆసీనుడగును.

6. ఋత్విక్కులు క్రాంత కర్మలు మనీషులు. వారు శబ్దించు, క్రాంతదర్శి సోమమును అభిషవింతురు. పునరుత్పన్నమగు గోవులు, మాననీయస్తుతులు ఎకత్రితమై - సత్యరూప యజ్ఞసదనపు ఉత్తరవేదిన - సోమమున కలిసికొనును.

7. ఉత్తరవేది ద్యులోకధారి, పృథ్వికినాభి ఉన్నతపద, ఋత్విక్కులు సోమమును ఉత్తరవేదిపై ఉంచుదురు. సోమము ప్రవహించునది. జలమధ్య స్థితము. ఇంద్రుని వజ్రస్వరూపము. కామ వర్ధకము. వ్యాపక ధనవంతము. సోమము ఇంద్రునకు మత్తు కలిగించును. ఇంద్రుని సుఖము కొరకు క్షరితమగును.

8. సుకర్మసోమమా! పార్థివ శరీరధారి మానవులకొరకు త్వరత్వరగా వాలుము. నీకు మూడు సవనములుచేయు స్తోతలకు ధనాదులనిమ్ము. మా ఇంటిని పుత్ర, ధనాదులనుండి వేరు చేయకుము. మాకు నానావిధ సువర్ణాది సంపదలు కలుగవలెను.

9. క్షరణశీల సోమమా! మాకు అనేకము, అశ్వసహితము, సహస్రదానయుక్తము, పశ్వాది సమన్వితము సువర్ణ సహిత ధనమును ప్రసాదించుము. మాకు ఎక్కువ పాలిచ్చు గోసంపద ప్రసాదించుము. మా స్తుతులు ఆలకించుటకు విచ్చేయుము.

## డెబ్బది మూడవ సూక్తము

ఋషి - అంగిరస పవిత్రుడు. దేవత - పవమానసోమము. ఛందస్సు - జగతి.

1. యజ్ఞపు **"స్రక్వ"** స్థానమున అభిషవ సోమ కిరణములు పైకి లేచును. యజ్ఞపు ఉత్పత్తి స్థానమున సోమము పైకి లేచును. బలశాలి సోమము ముల్లోకముల మానవాదులను సంచరణ యోగ్యులను చేయును. సోమము సత్యభూతుడు. నౌకకు వలె యజ్ఞమునకు నాలుగు స్థాత్యములున్నవి. అవి సుకృతియగు యజమానికి ఇష్టఫలము లిచ్చును. సోమమును పూజించును.

(స్రక్వము = యజ్ఞపు ఓష్ఠస్థానము స్రక్వేఓష్ఠ ప్రాంతేహనురుచ్యతే అనిశాయణుడు. 1. ఆదిత్య 2. అగ్రాయణ 3. ఉక్థ్య 4. ధృవ ఇవి స్థాత్యములు)

2. ప్రధాన ఋత్విక్కులు తమలోతాము కలసికొని సోమమును అభిషుతము చేయుదురు. స్వర్గాది ఫలములు కోరు ఋత్విక్కులు సోమమును జలప్రవాహమున కంపుదురు. స్తోతలు పూజ్య స్తుతులు చదువుచు - ఇంద్రుని ప్రియధామమును - మాదక సోమధారలచే వర్ధిల్ల చేయుదురు.

3. సోమ కిరణములు శోధన శక్తివంతములు. అవి అంతరిక్షమున నిలుచును. కిరణములకు తండ్రి సోమము. అతడు ప్రకాశమాన కర్మమును రక్షించును. తన వెలుగులను పరచుకున్న సోమము తన కిరణముచే అంతరిక్షమున. తన వెలుగులను పరచుకున్న సోమము తన కిరణముచే అంతరిక్షమున వ్యాపించును. ఋత్విక్కులు సకలమును భరించు శక్తిగల - జలములందు సోమమును ఆవిష్కరింతురు.

4. సోమకిరణములు సహస్రధారలు కలవి. అంతరిక్షమున వర్తమానములు. అవి దిగువనున్న భూమికి వర్ణము కలిగించును. ద్యులోకపు ఉన్నత ప్రదేశమున నిలిచినా మధుజహ్వ, పరస్పర సంగరహిత సోమ కిరణములు శీఘ్రగాములగును. కంటి రెప్ప వాల్చవు. **"పదేపదే పాశినః సన్తి సేతవః"** అడుగడుగున నిలిచిన కిరణములు పాపులను బాధించును.

5.సోమ కిరణములు ద్యావా పృథ్వినుండి అధికముగా ప్రాదుర్భవించును. ఋత్విక్కులచే స్తుతించబడను. కర్మశూన్యులను నష్టపరచును. అవి - ఇంద్రుని కొరకు - తమ జ్ఞానముచే నలుపుచర్మపు రాక్షసులను ద్యావాపృథ్వులనుండి దూరము జరుపుము.

6. సోమరశ్మలు స్తుతియుతములు. క్షిప్రకారులు. అవిప్రాచీన అంతరిక్షమున ఒకేసారి పుట్టినవి. చూపులేనివారు, సాధువులు కానివారు, దేవస్తుతిని విడిచినవారగు పాపులు ఈ కిరణములను త్యజింతురు. **"ఋతస్యపన్థాంనతరన్తి దుష్కృతః"** దుష్టులు సత్యమార్గమున తరించజాలరు.

7.ఋత్విక్కులు క్రాంత కర్ములు. మనీషులు వారు బహుధారల, విస్తృత పవిత్రమున వర్తమాన సోమపు మాధ్యమికే - అంతరిక్ష - వాక్కును స్తుతింతురు. ఆవాక్కు మరుత్తుల మాతను స్తుతించును. ఆగమనశీల, ద్రోహశూన్య,

అహింసనీయ, సుదర్శన, కర్మనేతలగు మరుత్తులు ఆవాక్కును ఆశ్రయింతురు.

8. సోమము సత్యయజ్ఞరక్షకుడు. శుభకర్ముడు. అతని ముందు ఎంతటివాడును బీరములు పలుకజాలడు. అగ్ని, వాయు, సూర్య త్రిరూపములను సోమము తనలో దాల్చును. విద్వాంస సోమము సకల భువనములను వీక్షించును. కర్మ భ్రష్టులను తలవంచి నరుకును.

9. సోమము సత్యరూప యజ్ఞరక్షకుడు. మేషలోమ పవిత్రమున విస్తృతుడు. అతడు వరుణుని - జాలపు - జిహ్వాగ్రమున వసించును. కర్మనిష్ఠులకు మాత్రమే సోమము అందును. కర్మశూన్యులకు అందుట అసంభవము. కర్మశూన్యులు నరకమున పడుదురు.

## డెబ్బది నాలుగవ సూక్తము

ఋషి - కక్షీవంతుడు. దేవత - పవమానసోమము. ఛందస్సు - జగతి - 8 త్రిష్టుప్.

1. సోమము వసతీవరీ జలమున పుట్టును. పసిబిడ్డవలె తల వంచి ఏడ్చును. బలముగల అశ్వమువంటి గమనశీల సోమము స్వర్గమును ఆశ్రయించ కోరును. గోవుల, ఓషధుల రస సహితముగా సోమము నెలకు దిగతలచును. అట్టి సోమమును మేము స్తుతింతుము. ధనాదియుక్త గృహము యాచింతుము. "ఈమహేసుమతీ శర్మసప్రథః"

2. యజ్ఞములు కారుదెంచు ఇంద్రునకు - సంస్కరించ బడిన సోమము ఎంతో మధురరస పానమగును. ఇంద్రాదుల పృథివీమార్గము ఎంతో విశాలము. ఇంద్రుడు వర్షమునకు ఈశ్వరుడు. గోవుల హితము కోరువాడు. యజ్ఞనేత ఆ ఇంద్రుడు ఈ యజ్ఞమున స్తుతించబడును.

3. ఆకాశరూప ఆదిత్యునినుంచి సోమము ఘృతదుగ్ధముల పితుకును. సోమమునుండియే అమృతమును, జలములును ఉద్భవించినవి. సోమము యజ్ఞపు నాభియగును. హవిర్దాతలు, స్తోతలు కలసి సోమమును ప్రసన్నుని చేయుదురు. సర్వరక్షక సోమకిరణములు భువిమీద ఉపయుక్త వర్షము కురిపించును.

4. ఋత్విక్కులు జలమున కలిపినపుడు సోమము నాదము చేయును. దేవపాలక సోమము పాత్రలందు ప్రవహించును. పృథ్వియందలి ఓషధులలో - సోమము తన కిరణములచే గర్భము దాల్చును. ఆ గర్భము వలననే మేము దుఃఖవిదారక పుత్ర, పౌత్రులను పొందుదుము.

5. సోమ కిరణములు అనేక ధారలు కలవి. స్వర్గమందు ఉన్నవి. పరస్పరము కలసి ఉండునవి. ఆకిరణములు భూమిమీద పడును. సోమపు నాలుగు కిరణములు ద్యులోకపు దిగువన సోమముచే స్థాపించ బడినవి. అవి జల వర్షకములగును. దేవతలకు హవి అందించును. ఓషధులందు అమృతము చేర్చును.

(సోమపు నాలుగు కిరణములు - సోమస్య సంబంధిన్యశ్చతురసో దీప్తయః కలాః అనిశాయణుడు. సినీవాలి, కూహు, గుంగు, రాకా అను నలుగురు దేవేరులు కావచ్చునని లుడ్విగ్)

6. సోమము శ్వేతరూపము కలిగించును - "శ్వేతంరూపంకృణుతే" బలశాలియు, కోరికలు తీర్చు సోమము స్తోతలకు అధిక ధనము ఇచ్చును. సోమము తన ప్రజ్ఞవలన ప్రకృష్ట కర్మను సాధించును అంతరిక్షమందలి జలపూర్ణ మేఘమును - వర్షము కలిగించుటకు - భేదించును.

7. శ్వేత గో రసయుక్త పాత్రమున సోమము - అశ్వమువలె -దూకును. దేవాభిలాషులగు ఋత్విక్కులు సోమమును స్తుతింతురు. బహుగమనముల కక్షీవంతునకు సోమము పశువులను ప్రదానము చేయును.

8. శోధిత సోమమా! నీయొక్క రసము జలముల కలపి, మేషలోమ దశాపవిత్రమువైపు సాగును. మాదక శ్రేష్ఠ సోమమా! క్రాంత కర్మ ఋత్విక్కులచే సంశోధితుడవై ఇంద్రుని పానము కొరకు ప్రియరసమంతవమగుము.

## డెబ్బది అయిదవ సూక్తము

ఋషి - భార్గవ కవి. దేవత - పవమాన సోమము. ఛందస్సు - జగతి.

1. సోమము అన్నమునకు హితకరము లోకప్రియము. గమనశీలము. నీటి నలుదిశల క్షరితమగును. జలమున ఎదుగును. మహాసోమము మహాసూర్యుని రథమును అధిరో హించినది సోమము సర్వద్రష్ట.

2. సోమము సత్యరూప యజ్ఞమునకు ముఖ్యుడు. అతడు ప్రియకర, మదకర రసమును రాల్చుము. సోమము నినదించువాడు. కర్మపాలకుడు. అవధ్యుడు. ద్యులోక దీపిక సోమమును అభిషవించిన తన పుత్రునకు పెట్టిన పేరు అతనిని కన్న తల్లిదండ్రులు సహితము ఎరుగరు.

(సోమము అభిషవించినందున యజమాని సోమమునకు పుత్రుడగును. పుత్రుడు యజమానికి సోమము పెట్టిన పేరు సోమయాజి. తల్లిదండ్రులు పెట్టినవి నక్షత్రవ్యావహారిక నామములు. కావున మూడవ పేరగు సోమయాజి తల్లిదండ్రులకు తెలియదు.)

3. సోమము దీప్తమంతము ఋత్విక్కులచే సువర్ణమయ అభిషవచర్మమున ప్రతిష్ఠింపబడినాడు. యజ్ఞనిర్వాహకులగు ఋత్విక్కులు సోమమును అభిషవింతురు. సోమము కలశమున శబ్దము చేయును. మూడు సనవములందుండు సోమము యజ్ఞదినమందు ప్రాతః కాలమున శోభించును.

4. శిలలచే అభిషుత, అన్నహితైషి, శుద్ధ సోమము ద్యావాపృథ్వులను ప్రకాశవంతము చేయును. మేషలోను పవిత్రము వైపు సాగును. నీటికలిసి, మత్తునిచ్చు సోమధార నిత్యము మీద ప్రవహించును.

5. సోమమా! శుభములు కలుగుటకు నలువైపుల వ్యాపింపుము. కర్మనిష్ఠులచే సంశోధితుడవై క్షీరాదులందు కలియుము. వచనఎంత, శత్రుహంత, అభిషుత మహా సోమమా! పశస్త ధనములనిచ్చు ఇంద్రుని మా వద్దకంపుము "ఇంద్రంచోదయ దాతవే మఘమ్."

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత తొమ్మిదవ మండలము ఏడవ అష్టకమున రెండవ అధ్యాయము సమాప్తము.)*

***ఓం నతామనన్తి మాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రవాణి***
***నరోదసీ అద్రుహా వేద్యాభిర్న పర్వతాని నమే స్థివాంసః***

**మూడవ అధ్యాయము డెబ్బది ఆరవ సూక్తము**

ఋషి - భార్గవ కవి. దేవత - పవమనా సోమము. ఛందస్సు - జగతి

**ఓం ధర్తాదివఃపవతే కృత్వ్యోరసోదక్షో దేవానామను మాద్యోన్నభిః**
**హరిఃసృజానో అత్యోన సత్వభిర్వృథా పాజాంపి కృణుతే నదీష్వా.**

1. సోమము సర్వధారకము. అంతరిక్షమున క్షరితుడగును. శోధనీయుడు. రసరూపి, దేవతల బలము, ఋత్వికువర్ధకుడు స్తుత్యుడు హరిత వర్ణుడు. ప్రాణులచే చేయబడినవాడు. వసతీ వరిలో అశ్వమువలె తన వేగము పెంచును.

2. సోమము - వీరులవలె - తన ఉభయ హస్తములందు ఆయుధములు ధరించును. గోవులను వెదుకునపుడు స్వర్గము ఇచ్ఛగించును. యజమానులకు రథవంతుడు అగును. ఇంద్రుని బలమునకు ప్రేరణ కలిగించును. సోమమును కర్మలుచేయు విప్రులు పంపుదురు. సోమమునందు దుగ్ధాదులు కలుపబడును.

3. క్షరణశీల సోమమా! వర్ధిష్ణువవు అగుము. ఇంద్రుని ఉదరమున ప్రచుర ధారగా వసింపుము. విద్యుత్తు మేఘములను పితికినట్లు నీవు స్వకర్మములచే ద్యావా పృథ్వులను పితుకుము. మాకు బహు అన్నము ప్రసాదించుము.

4.విశ్వసామ్రాట్టు సోమము క్షరితుడగును. అతడు సర్వదర్శకుడు. సత్యభూతుడు. ఋషి శ్రేష్ఠుడు. సోమము ఇంద్రుని కర్మలు ఇచ్ఛగించినాడు. సోమము సూర్యకిరణములచే శోధించ బడును. సోమపు కర్మమును విప్రులు సహితము వ్యాపింపచేయ జాలరు. సోమము మాస్తుతులకు పాలకుడు.

5. సోమమా! నీవు శబ్దకర్తవు. అంతరిక్షమున ఉన్నవాడవు. ఆబోతు ఆవులమందలో దూరినట్లు నీవు

ద్రోణకలశమున ప్రవేశింతువు. ఎంతో మత్తునిచ్చువాడవై నీవు ఇంద్రుని కొరకు క్షరితుడవు అగుదువు. నీ రక్షణలందు మేము యుద్ధమందు విజేతలమగుదుము.

## డెబ్బది ఏడవసూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. బీజావాపన చేయువాడును, మధురరసవంతుడగు సోమము - వజ్రమువంటి శబ్దము చేయుచు ద్రోణకలశమున చేరును. సోమధారలు సత్యఫల ప్రదాతలు. జలమును కురిపించునవి. శబ్దము చేయునవి. అవి పాడియావులవలె సాగుచున్నవి.

2. ప్రాచీన సోమము క్షరితమగును. తల్లి పంపగా శ్యేనము ద్యులోకమునకు చేరినది. అచటినుండి సోము తెచ్చినది. మధురరసవంతమగు ఆసోమమే మూడవ లోకమును వేరుచేయును. కృశానునామక ధనుర్ధారి బాణపు దెబ్బకు బెదరి సోమము ఉద్విగ్నభావంను మధురరసమున కలియును.

3. చక్కని యువతులవలె రమణీయుడు, హవి సేవించువాడు, ప్రాచీన, ఆధునిక సోమము - మరిన్ని గోవులున్ననాకు - అన్నలాభము కలిగించవలెను.

4. అనేకులచే స్తుతించబడు, ఉత్తర వేదిన నిలిచిన క్షరుణశీలసోమము - మమ్ముబాధించు శత్రువులను మనోయోగమున గుర్తించి వధించవలెను. సోమము ఓషధులకు గర్భము కలిగించును. ఎక్కువ పాలిచ్చుగోవులవైపు వెళ్లును.

5. సోమము సర్వకర్త, కర్మరుడు, రసాత్మకుడు అహింసనీయుడు. వరుణసముడు. అట్టి మహాసోమము అటునిటు సంచరించును. ఆపదలు కలిగినపుడు - సర్వమిత్ర, భజనీయ సోమము క్షరితము చేయబడును. మగగుఱ్ఱము ఆడగుఱ్ఱముల మందలో దూరినట్లు సోమము ధ్వనించుచు క్షరితగును.

## డెబ్బది ఎనిమిదివ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. శోభాయమాన సోమము ధ్వనించుచు, జలములను ఆచ్ఛాదించుచు స్తుతులవైపు సాగును. సోమపు నిస్సారభాగమును మేషలోను దశాపవిత్రము ఉంచుకొనును. శుద్ధిచేయబడిన సోమము సంస్కరించబడిన దేవతల స్థానమునకు చేరును.

2. సోమమా! ఋత్విక్కులు నిన్ను ఇంద్రుని కొరకు అభిషవింతురు. నీవు కావివి. యజమానులు నిన్ను వర్ధిల్ల

చేయుదురు. జలములందు కలుపుదురు. నీవు రాలుటకు మార్గములు- రంధ్రములు - అనేకములు. నీ కిరణములు హరిత వర్ణములు. అసంఖ్యాకములు. అయిప్రస్తర ఫలకముల మీద నిలుచును.

3. అంతరిక్షమునందలి అప్సరలు యజ్ఞమధ్యమున కూర్చుందురు. విద్వాంసుడగు సోముని క్షరితుని చేయుదురు. దుర్గమువంటి యజ్ఞగృహమున అప్సరలు క్షరణ శీల సోమమును పెంచుదురు. స్తోతలు సోముని అక్షయసుఖములు అర్థింతురు.

4. క్షరణశీల సోమము - గోవులను, రథములను, సువర్ణములను, సుఖములను, జలమును, అపరిమిత ధనములను - జయించినాడు. మదకర, రుచికర, రసాత్మక, అరుణవర్ణ, సుఖకర్త సోమమును తమ పానమునకు దేవతలు కల్పించినారు.

5. సోమమా! పూర్వోక్త సమస్త పదార్థములను మాకు కలిగించుము. నీవు శోధితమగుదువు. క్షరితమగుదువు. దూరమందు, దగ్గరలో ఉన్న మా శత్రువులను హతమార్చుము. విస్తీర్ణ మార్గములను మా కొరకు నిర్భయము చేయుము.

## డెబ్బది తొమ్మిదవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. ప్రభూత దీప్తయజ్ఞమందు - సోమము స్వయముగా మా వద్దకు విచ్చేయవలెను. సోమము హరిత వర్ణము. క్షరణశీలము. మా అన్ననాశకులు నశించవలెను. మా శత్రువులు నశించవలెను. మా కర్మములు దేవతలకు చేరవలెను.

2. మదస్రావి సోమము మా వద్దకు రావలెను. ధనము కూడ రావలెను. సోమపు కృపవలన మేము బలవంతులగు శత్రువులను ఎదిరించగలము. ఎంతటి మొనగాని భాధనైన తిరస్కరించ గలము. మాకు ధనము లభించగలదు.

3. సోమము తన శత్రువునకు, మా శత్రువునకు హింసకుడగును. మరుభూమిలో దాహము వెంటపడినట్లు సోమము ఉభయశత్రువుల వెంట పడును. క్షరణశీల సోమమా! ఆ శత్రువులను హతమార్చుము.

4. సోమమా! నీ పరమ అంశము ద్యులోకమున ఉన్నది. అక్కడినుంచి భూమి మీది పర్వతములపై నీ అంశము అవతరించినది. అక్కడ అది వృక్షములైనది. విప్రులు నిన్ను రాతి మీద దంచుదురు. వారు చేతులతో గోచర్మముపైన, నీటిలో శుద్ధిచేయుదురు.

5. సోమమా! ప్రధాన పురోహితులు నీ సుందర, సురుచిర రూపమునకు ప్రేరణ కలిగింతురు. సోమమా! నీ బలకర,

ప్రియకర, మదకర రసమును ప్రకటింపుము. నిందుకలగు మా శత్రువులను నాశము చేయుము.

## ఎనుబదవ సూక్తము

ఋషి - భరద్వాజ వసువు. దేవత - పవమాన సోమము. ఛందస్సు - జగతి.

1. సోమము యజమానుల ద్రష్ట. అభిషుతుడు. అతని ధారలు క్షరితమగును. సోమము యజ్ఞరూపమున దేవతలను అర్చించును. సోమము స్తోతల మంత్రములతో వెలుగును. సముద్రము వంటి భూమిని సవదములు వ్యాపింపచేయును.

2. అన్నవంత సోమమా! నీవు వర్షకుడవు. బలకరుడవు. అనాహత స్తుతివచనములు నిన్ను స్తుతించును. నీవు దీప్తుడవు అగుదువు. స్వర్ణభుజములచే అలంకరించ బడిన స్థానమునకు చేరుదువు. హవివంత యజమానుల ఆయువును, మహత్తర కీర్తిని పెంపొందించుము. ఇంద్రుని కొరకు క్షరితుడ వగుము.

3. యజమానులకు అన్నము కలిగించుటకు సోమము ఇంద్రుని పొట్టలో పడును. అత్యంతమదకర, బలకర, రసవంత, సుమంగళ సోమము సకల ప్రాణులను విస్తరింప చేయును. యజ్ఞవేది మీద క్రీడించు హరితవర్ణ, గతిశీల వర్షక సోమము రాలుచున్నది.

4. సోమము అతిశయ మధురము. బహుధారావంతము. మానవులు, వారి పది అంగళులచే ఇంద్రునికొరకు సోమమును దుహింతురు. సోమమా! నిన్ను మానవులు పిండుదురు. రాళ్లు అభిషవించును. నీవు అపరిమిత ధనముల విజేతవు. దేవతల కొరకుప్రవహింపుము.

5. సోమము మధుర రసవంతము. కోరకలు ఈడేర్చునది. సుందర, సుకుమార హస్తముల దశాంగుళులు సోమమును దుహించును. సోమమా! ఇంద్రునకు మత్తు కలిగించుము. సముద్ర తరంగములవలె క్షరితమగుము. ఇతర దేవతల వద్ద కేగుము.

## ఎనుబది ఒకటవ సూక్తము

ఋషి , దేవతలు పూర్వమువలె. చంధస్సు జగతి. చివరిది త్రిష్టుప్.

1. అభిషుత సోమము ఆవు పెరుగులో కలిసినప్పుడు. యజమాని మనోరథము తీర్చనపుడు శూరుడగు ఇంద్రుని ఉన్మత్తుని చేసినపుడు అప్పుడు శోధిత సోమపు సుందర తరంగములు ఇంద్రుని ఉదరమున చేరును.

2. రథవాహక అశ్వమువలె - సోమము వేగముగా కలశమునకు ఉరుకును. కోరికలు తీర్చునట్టి, స్వర్గ, మర్త్య జనులను ఎరిగినట్టి సోమము దేవతల ప్రసన్న కారకమగును.

3. శోధిత సోమమా! మాకు గవాదిరూప ధనమునిమ్ము. దీప్తసోమమా! నీవు ధనికుడవు. మాకు మహా ధనమునిమ్ము. అన్నధారక సోమమా! నేను నీసేవకుడను. ప్రజ్ఞానమున మాకు సుఖములు కలిగించుము. నీవు మాకీయదలచిన ధనమును మా నుండి దూరము చేయకుము.

4. చక్కని దాతపూష, పవమానసోమ, మిత్ర, వరుణ, బృహస్పతి, మారుతీ, వాయు, అశ్విద్వయ, త్వష్ట, సవిత, సుందరి సరస్వత్యాది దేవతలు - అందరు కూడి - మా యజ్ఞమునాకు విచ్చేయ వలెను.

5. సర్వవ్యాపిని ద్యావాపృథ్వులు, ఆర్యమ, అదితి, విధాత, మానవప్రశస్య భగుడు, విశాల అంతరిక్షము విశ్వదేవతలు మున్నగువారు క్షరణశీల సోమమును ఆశ్రయించవలెను.

## ఎనుబది రెండవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. సోమము శోభనము. వర్షకము హరితవర్ణము. అభిషుతము సామ్రాట్టువలె దర్శనీయము. జలము వైపు వెళ్లుచు రసము పిండునపుడు ధ్వనించును. సోమము శోధితమై శ్యేనము గూటికి వలె దశాపవిత్రమువైపు సాగును. సోమము జలస్థానమున క్షరితమగును.

2. సోమమా! నీవు క్రాంత కర్మవు. నీవు యజ్ఞము చేయ దలచి పూజ్య పవిత్రమునకు చేరు కుందువు. ప్రక్షాళితుడవై - అశ్వము పగిది యుద్ధమునకు వెళ్లదువు. మా పాపములను నశింప చేయుము. మమ్ము సుఖవంతులను చేయుము. నీట కలసిన నీవు పవిత్రము వైపు సాగుదువు.

3. సోమము వెడల్పు ఆకులు గలది. మేఘము సోమమునకు పిత. పృథ్వినాభి యజ్ఞమున - శిలలపై నివసించును. అంగుళులు జలము వద్దకు దుగ్ధాదులను తెచ్చును. రమణీయ యజ్ఞమందు సోమము శిలలను కలుసు కొనును.

4. సోమమా! నీవు పృథ్విపుత్రుడవు. నేను నిన్ను స్తుతించు చున్నాను. వినుము. భార్య భర్తకు సుఖములు కలిగించును. అట్లే నీవు యజమానికి సుఖములు కలిగింతువు. మా స్తుతులందు సంచరించుము. మీ జీవనము కొరకు నీవు జీవించు చున్నావు. సోమమా! నీవు స్తుత్యుడవు. మా శత్రుబలము విషయమున సావధానుడవము.

5. సోమమా! నీవు ప్రాచీన స్తోతలకు వేలకొలది ధనములు ఇచ్చినావు. అభినవ అభ్యుదయ స్తోతలకు సహితము అట్టి ధనములను ప్రసాదించుము. నీ కర్మము నిర్వర్తించుటకే జలము నీతో కలియును.

## ఎనుబది మూడవ సూక్తము.

ఋషి - అంగిరస పవిత్రుడు, దేవత - పవమానసోమము , ఛందస్సు - జగతి

1. సోమమా! నీవు మంత్రములకు స్వామివి. నీ తేజము సర్వత్ర వ్యాపించినది. నిన్ను పానము చేసిన వారి సర్వాంగములకు నీవే ప్రభువువై, విస్తరించెదవు. వ్రతాదులు చేయనివాడు నీ తేజస్సును అందుకొనజాలడు. యజ్ఞ, కర్తయు, పరిపక్వశరీరి యగువాడు మాత్రమే నీ తేజమును గ్రహించగలడు.

2. సోమము శత్రుతాపకము. శోధకము. అతని తేజస్సు ద్యులోకపు ఉన్నత స్థానము వరకు వ్యాపించినవి. సోమపు శీఘ్రగామి సోమరసము, పవిత్రుడగు యజమానిని రక్షించును. తదుపరి దేవతలను చేరదలచి స్వర్గపు ఉనత ప్రాంతమునకు చేరును.

3. సోమము ఆతిత్యుడు. అతడు వెలుగులు చిమ్మును. సోమము జలము కలిగించి ప్రాణిజాలమునకు అన్నము ప్రదానము చేయును. సోమము జ్ఞాని. అతని ప్రజ్ఞవలననే అగ్నిమున్నగువారు లోకములను నిర్మింతురు - మానవద్రష్టలగు దేవతలు ఓషధులకు గర్భము కలిగింతురు.

4. జలముల భర్త ఆదిత్యుడు. అతడు సోమస్థానమును రక్షించును. సోమము దేవతల జన్మములను రక్షించును. మహాసోమము మా శత్రువులను పాశములచే బంధించును. సోమము పశువుల ప్రభువు **"సుకృత్తమా మధునో భక్షమాశత"** సుకృతము చేసినవాడే సోమపు మధుర రసము సేవించగలడు.

5. జలవంత సోమమా! నీవు జలముల కలియుదువు మహానుడవగుదువు. దివ్య యజ్ఞగృహమున రక్షింతువు. సోమమా! నీవు సామ్రాట్టువు - పవిత్ర రథవంతుడవై యుద్ధమున కేగుదువు. **"జయసి శ్రవో బృహత్"** మహాన్నములను గెలుతువు.

## ఎనుబది నాలుగవ సూక్తము

ఋషి - ప్రజాపతి దేవత - పమమాన సోమము ఛందస్సు - జగతి

1. సోమమా! నీవు దేవతలకు మదకరుడవు. సూక్ష్మదర్శివి. జలదాతవు. ఇంద్ర, వరుణ, వాయువుల కొరకు క్షరితుడవగుము. మాకు అవినాశ్య ధనములిమ్ము. విశాలపృథ్వి మీద నన్ను దేవభక్తునిగా పేర్కొనుము.

2. సోమము సకలభువనములందు వ్యాప్తము. అతడు జనులను నలుదిశలందు రక్షించును. అతడు యజ్ఞమును ఫలసమన్వితము చేయును. అసురల నుండి విముక్తము చేయుచు సూర్యుడు లోకముల చీకట్లను తొలగించి వెలుగులతో నింపినట్లు - సోమము యజ్ఞమును ఆశ్రయించును.

3. దేవతల సుఖమునకుగాను - కిరణములచే ఓషధులందు - సోమము ప్రవేశపెట్టబడును. సోమము దేవాభిలాషి శత్రుధనవిజేత. దేవసమూహములకు, ఇంద్రునకు మత్తు కలిగించువాడు. అభిషుత సోమము ప్రదీప్త ధారలుగా ప్రవహించును.

4. సోమము గమనశీల, ప్రతిగామి, ప్రాతఃకాల స్తోత్ర ప్రేరకుడై వేల నాలుకలతో క్షరితుడగును. వాయుప్రేరిత సోమము ద్రవీభూత రసమును పైకి లేపును.

5. సోమము దుగ్ధవర్ధకము. గోవులు తమపాలతో సోమమును సిక్తము చేయుటకు నిలిచి ఉన్నవి. సోమమును స్తుతించినంత సర్వము ప్రదానము చేయును. కర్మఠ, రసరూప, విప్ర, క్రాంత, ప్రజ్ఞ, అన్నవంత, శత్రుధవ విజేత, సోమము స్వకర్మమున ద్రవించును.

**ఎనుబది అయిదవ సూక్తము**

ఋషి - భార్గవ వేనుడు. దేవత - పవమానసోమము. ఛందస్సు - జగతి - 11,12 త్రిష్టుప్

1. సోమమా! చక్కగా అభిషుతమగుము. ఇంద్రుని కొరకు నలువైపుల వ్యాపించుము. రసమును రాల్చుము/ రాక్షసులు, వ్యాధులు దూరమందుండవలెను. నీయొక్క రసపానమున పాపులకు ఆనందము కలుగరాదు. ఈ యజ్ఞమందు నీ యొక్క. రసము ధనయుక్తము కావలెను.

2. క్షరణ శీలసోమమా! నీవు  నిపుణుడవు. దేవతలకు ఇష్టమగు మాదకుడవు. మేము నిన్ను స్తుతింతుము. మమ్ము రణభూమి కంపుము. శత్రువులను పరిమార్చుము. మా  వద్దకు విచ్చేయుము. ఇంద్రా! యుద్ధమున మా శత్రువులను హతమార్చుము.

3. క్షరణశీల సోమమా! నీవు అహింసితుడవు, మాదకతముడవు అయిద్రవించుము. నీవు స్వయముగా సోమవవు. ఇంద్రునకు అన్నమవు - "ఇంద్రస్యభవసిధాసిః" సోమము విశ్వ సామ్రాట్టు. అతనిని స్తోతలు స్తుతింతురు - యశమును పాడుదురు.

4. సోమము సహస్రనేత్రుడు. శతధారావంతుడు. ఆశ్చర్యకరుడు. మహామహుడు. ఇంద్రుని కొరకు అభిషుతమగు మధువును ద్రవీభూతము చేయును.

సోమమా! మాకుగాను క్షేత్రములను, జలమును గెలువుము. పవిత్రమువైపు మరలుము. సేచక సోమమా! మా స్తోత్రమార్గములను విశాలపరచుము.

5. సోమమా! నీవు పలుకుదువు. కలశమున నిలుతువు. గోదుగ్ధమున కలియుదువు. మేషలోమదశాపవిత్రమునకు సాగుదువు. శోధితుడవు. అశ్వమువలె అర్చనీయుడవు. ఇంద్రుని ఉదరమున క్షరితుడవగుదువు.

6. సోమమా! నీవు సురుచివి. దివ్యజన్ములగు దేవతల కొరకును, ఇంద్ర, మిత్ర, వరుణ, వాయు, బృహస్పతిమున్నగు వారి కొరకును - మధుమంతుడవు, అహింసనీయుడవై క్షరితుడవగుము.

7. అధ్వర్యుల దశాంగుళులు - అశ్వసమ గతిశీల - సోమమును కలశమున శుద్ధి చేయును. విప్రుల నడుమ స్తోతలు సోమమును కీర్తింతురు. క్షరణశీల, మదకర సోమము ఇంద్రునిలో ప్రవేశించును.

8. క్షరణశీల సోమమా! మాకు సువీర్యమును, కోశమును, భూఖండమును, విశాల గృహమును ప్రసాదించుము. మా కర్మములను ద్వేషించువారిని ప్రభువులను చేయకుము. "జయేమ త్వయా ధనధనమ్" నీ దయవలన సకల ధనములను జయింతుము.

9. దూర దర్శక, వర్షక సోమము ద్యులోకపువాడు. అతడు ద్యులోకమునందలి నక్షత్రాదులను శోభిల్ల చేసినాడు. కాంతప్రజ్ఞుడును, మహారాజును అగు సోమము దశాపవిత్రమునకు తరలును. వరదర్శక సోమము నినదించుచు ద్యులోకమునుండి అమృతము కురిపించును. "దివఃపీయూషందుహతే".

10. మధుర వచన 'వేనులు, - వేరువేరుగా -దుఃఖరహిత స్థానమున సోమాభిషవము చేయుదురు. వారలు - సేక్త ఉన్నత స్థానస్థిత, జలములందు వర్ధమాన, రసరూప సోమమును - సముద్రమువలె వర్ధమాన ద్రోణకలశమున జలతరంగములందు అభిషేకింతురు. వారు మధురస సోమమున దశాపవిత్రమునకు చేర్చెదరు.'

(వేనులు - ఈ సూక్తపుద్రష్ట వేనుడు. అతని వంశీయులు వేనులు)

11. సోమము ద్యులోక స్థితుడు. శోభన పత్రవంతుడు. జాలువారువాడు. మాస్తుతులు అత్రిసోమున స్తుతించును. శిశువువలె సంరక్షణ యోగ్యుడు, శబ్దకర్త, సువర్ణమయుడు పక్షివంతుడు. హవివర్ధనుడగు సోముని స్తుతులు చేరును.

12. కిరణములు దాల్చిన సోమము సూర్యుని సకల రూపములను వీక్షించుచు ద్యులోకమున వసించును. సోమమందున్న సూర్యుడు శుభ్రతేజమున మెరిసిపోవును. ప్రదీప్త సూర్యుడు ద్యావా పృథ్వులను శోభాయమానము చేయును.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ అష్టకము తొమ్మిదవ మండలమున నాలుగవ అనువాకము సమాప్తము.)*

**అయిదవ అనువాకము ఎనుబది ఆరవ సూక్తము**

ఋషి- తొలిచతుర్ధదశకములకు ఆకృష్ట, మహఋషులు, రెండవ దశకమునకు సికత, నివావరులు. మూడవ దశకమునకు పృశ్న, అజాయులు అయిదవ దశకమునకు గృత్సమదుడు. దేవత - పవమాన సోమము. ఛందస్సు - జగతి.

1. క్షరణశీల సోమము - మనోవేగమున వ్యాపించి ఉన్మత్తు రసము కలిగి గుఱ్ఱపు పిల్లవలె పరువులెత్తుచున్నది. సోమరసము ద్యులోక ఉత్పన్నము. సుందర పత్రములు కలిగి, మధురతాయుక్తమై, అత్యంత మాదకమగు దీప్తరసము ద్రోణకలశమున కేగుచున్నది.

2. సోమమా! నీ యొక్క రసము మాదకము, వ్యాప్తము. దానిని - అశ్వమురీతి చేయుదురు. మధుర, ప్రవృద్ధ, క్షరణశీల సోమము - పాడియావు దూడవద్దకు వెళ్లునట్లు -వజ్ర ఇంద్రుని వద్దకు వెళ్లును.

3. సోమమా! యుద్ధమున కంపిన అశ్వమువలె రణరంగమున దూకుము. ద్యులోకమునుండి మేఘనిర్మాతవద్దకేగుము. వర్ధక, సోమధారక ఇంద్రుని కొరకు మేషలోమ దశాపవిత్రమున పరిశుద్ధడవగుము.

4. సోమమా! నీ ధారలు మనోవేగవంతములు. వ్యాప్తములు. దివ్యములు, ఆకసమునుండి రాలునవి దుగ్ధయుక్తములు అవి ద్రోణకలశమున కరుగుచున్నవి. నిన్ను తయారించు ఋషులు నిన్ను అభిషవింతురు. నీ ధారలను కలశమున చేర్చెదరు.

5. సోమమా! నీవు సర్వదష్టవు. నీవు ప్రభువవు. నీ మహా కిరణములు సమస్త దేవతల దేహములను ప్రకాశింప చేయును. నీవు వ్యాపకుడవు. రసధారలను స్రవింప చేయుదువు. **"పతిర్విశ్వస్య భువనస్య రాజసి"** విశ్వపతివై లోకములను శోభిల్ల చేయుదువు.

6. క్షరణశీల, అవిచలిత, విద్యామాన సోమపు ప్రజ్ఞాపక కిరణములు అటునిటు సంచరించును. హరితవర్ణ సోమము దశాపవిత్రమున శోధితమైనపుడు నివాసశీల సోమము స్వస్థానమగు ద్రోణ కలశముకు చేరును.

7. యజ్ఞప్రజ్ఞాపక, శోభనయజ్ఞ సోమము క్షరితమగును. సోమము - అలంకృతమగు దేవతల స్థానములకు సాగును. అపరి మిత ధారలతో ద్రోణకలశమున ప్రవేశించును. సేక్త సోమము పవిత్రమును దాటి దిగువకు దిగును.

8. నదులు సముద్రము నందువలె సోమమహారాజు జలములందు సంగమించును. జలము నుండి పవిత్రమునకు చేరిన సోమము ఉన్నత దశాపవిత్రమున ఉండును. అతడు పృథ్వికి నాభియగు యజ్ఞన వసించును. సోమము ద్యులోక ధారకుడు అగును.

9. సోమము ద్యులోకపు ఉన్నతస్థానమున ధ్వనులు కలిగించు చున్నది. సోమము తన ధారక శక్తిచే ద్యావాపృథ్వులను ధరించుచున్నది. ఇంద్రునిమైత్రి కొరకు సోమము దశాపవిత్రమున శోధితమై, ద్రోణకలశమున చేరుచున్నది.

10. యజ్ఞప్రకాశక సోమము దేవతలకు ప్రియమగు మధుర రసమును ప్రవహింప జేయును. దేవతల రక్షక , సకల ఉత్పాదక, ప్రచుర ధనవంత సోమము ద్యావా పృథ్వుల నడుమనున్న రమణీయ ధనమును స్తోతలకు అందించును. మాదక సోమము రసరూపము - ఇంద్ర వర్ధకము.

11. సోమము గతిశీలుడు. ద్యులోకప్రభువు. శతధార. దూరదర్శి. హరితవర్ణుడు. రసరూపి, అతడు దేవతలకు మిత్రమగు యజ్ఞమందు శబ్దించుచు కలశమున ప్రవేశించును. సోమము స్రవణశీల దశాపవిత్రపు రంధ్రములందు శోధితుడగును. సోమము 'వృషా' వర్షకుడు.

12. సోమము స్పందనశీల జలముల ముందు నడుచును. మధ్యమిక వాక్కునకు ముందు నడచును కిరణములందు ప్రవేశించును. బలలాభమునకు యుద్ధముల నాశ్రయించును. చక్కని ఆయుధములు కలిగి, వర్షించు సోమమును అభిషవ కర్తలు శుద్ధిచేయుదురు.

13. స్తోత్రవంత, శోధనవంత, ప్రేరితసోమము, రససహితమై - పక్షివలె - వేగముగా దశాపవిత్రమున చేరును. క్రాంతప్రజ్ఞ ఇంద్రా! ఈ కర్మములు మరియు వృద్ధివలన ద్యావాపృథ్వుల మధ్య పవిత్ర సోమము ప్రవహించుచున్నది.

14. స్వర్ణస్పర్శి, తేజోరూప కవచ ధారి సోమము పూజ్య అంతరిక్షపు పూరకుడు. సోమము జలమిశ్రితమగును. నవస్వర్గమును సృష్టించును. జలములతో ప్రవహించును. సోమము జలముల తండ్రియు ప్రాచీనుడగు ఇంద్రుని సేవించును.

15. సోమము ఇంద్రునిలో ప్రవేశించును. మహాసుఖములు కలిగించును. సోమమునకు ఇంద్రుని తేజస్విశరీరము అంతకు ముందే లభించినది. సోమపు స్థానము ఉత్తరవేది అగును. సోమము వలన తృప్తిచెందిన ఇంద్రుడు సకల యుద్ధములందు గెలుపొందినాడు.

16. సోమము ఇంద్రుని ఉదరమున ప్రవేశించును. సోమము ఇంద్రునకు మిత్రుడు. అతడు ఇంద్రునకు ఆధారభూతమగు హృదయమును బాధించడు. యువతులు యువకులను కలసి నట్లు సోము జలములను కలియును. శతరంధ్ర మార్గము నుండి సోమము కలశమందు ప్రవేశించును. (శతరంధ్ర మార్గము జల్లెడ)

17. సోమమా! నిన్ను ధ్యానించువారు, మాదక సోమమును, స్తోత్రములను ఇష్టపడువారలగు స్తోతలు

నివాసయోగ్యయజ్ఞ గృహమున సంచరింతురు. మనీషుల స్తోతలు సోమమును స్తుతింతురు. గోవులు సోమమునకు పాలు ప్రదానము చేయును.

18. దీప్తసోమమా! మాకు సంగృహీతము, ప్రవృద్ధము, అక్షీణమగు అన్నమునిమ్ము. అట్టి అన్నమ్ము మూడు శబ్దించును. ఆశ్రయము కలిగించును. మాధుర్యయుక్తమగును. సమర్థుడగు పుత్రుని ప్రదానము చేయును.

19. సోమము స్తోతల కోర్కెల తీర్చును. అతడు దూరదర్శి. సూర్య వర్ధకుడు. జలకర్త సోమము కలశమున దూరగోరును. సోమము ఇంద్రుని హృదయమున నిలుచును.

20. సోమము ప్రాచీనుడు. మేధావి. పురోహితులచే నియమితుడు. అతనిని అధ్వర్యులు శుద్ధిచేసినంత కలశమున చేరుటకు ధ్వనులు చేయును. ఇంద్ర, వాయువుల మిత్రుత్వము కొరకు పుట్టినవాడును- మూడు స్థానములందు వ్యాపించిన యజమానుల కొరకు జలమును సృష్టించు సోమము మధుర రసనిష్యంది అగును.

21. సోమము ఉదయమునకు వివిధశోభలు కలిగించును - అయం పునాన ఉషసోవిరో చయత్. అతడు జలములందు సమృద్ధుడగును. సోమము లోకకర్త. అతడు ఇరువది ఒక్క మారులు దుహితుడగును. మదకర సోమము హృదయమందు ప్రవేశించుటకు ద్రవించును.

22. సోమమా! దేవతల ఉదరములందు పడుము. దీప్త సోమమా! నీవు కలశమందు సిద్ధమగుదువు. సోమము ఇంద్రుని ఉదరమున ప్రవేశించి పలుకును. అతడు ఋత్విక్కులచే హుతుడగును. 'సూర్యమారోహయోదివి' - సూర్యుని ఆకసమున ఆవిర్భవింప చేసినాడు.

23. సోమమా ! ఇంద్రుని గుండెలో నిలుచుటకు శిలలచే అభిషవించబడి, దశా పవిత్రమున ద్రవింతువు. దూరదర్శి సోమమా! నీవు మానవుల అనుగ్రహముననే ద్రష్టవైనావు. అంగిరుల కొరకు నీవు వారి గోవులను దాచిన కొండను కదిలించినావు.

24. క్షరణశీల సోమమా! సత్కర్ములు, విప్రులగు స్తోతలు రక్షణాభిలాషులై నిన్ను స్తుతింతురు. నీవు సర్వస్తుతులచే అలంకృతుడవు. సుందరపక్షి శ్యేనము నిన్ను ద్యులోకమునుండి తెచ్చినది.

25. గాయత్రి మున్నగు సప్తఛందస్సులు ప్రీతికరములు. అవి హరిత వర్ణ సోమమును మేషలోమ దశపవిత్రమున క్షరితమున చేసి అందు కొనును. క్రాంతకర్మ సోమమా! మహా ఆయుష్మంతులు నిన్ను అంతరిక్షజలములకు ప్రేరేపింతురు.

26.దీప్తసోమము యాజ్ఞిక యజమానుల శత్రువులను దూరము చేయును. చక్కని మార్గమున కలశమున

చేరును. సుందర క్రాంత కర్మ సోమము అశ్వమువలె క్రీడించును. తన రూపమును రసమయము చేసికొనును. దశపవిత్రమున చేరును.

27. పరస్పర సంగతములు, శతధారలు, సోమమునకు ఆశ్రయభూతములగు సూర్యకిరణములు సోమమునందు ప్రవేశించును కిరణముల మధ్య, ద్యులోకమున ఉన్న సోమమును అంగుళులు శుద్ధి చేయును.

28. **"తవేమాః ప్రజాదివ్యస్యరేతః"** నీ దివ్య తేజమునుండియే సకల ప్రాణులు ఉత్పన్నమైనారు. నీవు సకల భువనములకు స్వామివి. ఈ భువనములన్నియు నీ అధీనములు. నీవు ముఖ్యుడవు. సర్వమునకు స్థానమవు.

29. నీవు ద్రవాత్ముడవు లోజ్ఞాతవు. అయిదు దిశల ధారకుడవు. ద్యావా పృథ్వులను ధరించి ఉన్నావు. నీకిరణములను సూర్యుడు ప్రపుల్లతము చేయును.

(అయిదు దిశలు - ఆకాశము + నాలుగు దిక్కులు.)

30. సోమమా! నీవు దేవతల కొరకు - రసమునదాల్చు దశాపవిత్రమున శోధింపబడుదువు. అభిలాషులు, ప్రధాన పురోహితులు నిన్ను గ్రహింతురు. విశ్వాభువనాని యేమిరే - సకల భువనములు నీకు అర్పితములగును.

31. సోమము మేషలోమ దశాపవిత్రమునకు చేరును. హరితవర్ణ, సేచక సోమము జలములందు పలుకును. ధ్యానవంత సోమాభిలాష స్తుతులు - శిశువువంటివాడును, ధ్వనించువాడును అగు సోముని గుణగానము చేయును.

32. సూర్య కిరణములను చుట్టుకున్న సోమము మూడు సవనములచే యజ్ఞమును విస్తరింపచేయును. సర్వజాత, సకల ప్రాణిపతి సోమము సంస్కరించ బడిన పాత్రయందు ప్రవేశించును.

33. సోమము జలపతి, స్వర్గపతి. అతడు సంస్కరించబడును. యజ్ఞపథమున శబ్దించుచుసాగును. అసంఖ్యాక ధారల సోమమును నేతల పాత్రలందు ప్రవేశపెట్టుదురు. సోమము శోధితుడు. శబ్దకర్త దరిచేరువాడు.

34. సోమమా! నీవు బహురస ప్రేషకుడవు. 'సురోనచిత్రో' సూర్యునివంటి పూజనీయుడవు. మేషలోమ పాత్రకు చేరువాడవు. అనేకులచే శోధితుడవు. ఋత్విక్కులు, రాళ్లచే అభిషుతుడవు. నీవు మహాసంగ్రామమునకు ధనపు హితము కొరకు సాగుదువు.

35. క్షరణశీల సోమమా! నీవు అన్నవంతుడవు. బలవంతుడవు శ్యేనముగూటికి చేరినట్లు నీవు పాత్రకు చేరుదువు. ఇంద్రుని కొరకు బలము, మత్తు కలిగించు రసము అభిషుతమైనది. సోమమా! నీవు ద్యులోకమునకు స్తంభమవు.

దూరదర్శివి.

36. సోమము నవీనఉత్పన్నము. విజేత. విద్వాంసుడు. జలములపిత. జలధర్త. స్వర్గోత్పన్నుడు. మానవ ద్రష్ట శిశువు వద్దకువలె - గంగాది సప్తమాతృక నదులు సోమమును చేరును.

37. సోమమా! నీవు హరిత వర్ణుడవు. సకలమునకు స్వామివి. అశ్వముల రథము కలవాడవు. సకల బువన గతి విధాయకుడవు. నీ అశ్వములు మధుర ఘృతము, దీప్త దుగ్ధము, జలమును తేవలెను. 'తవవ్రతే తిష్ఠన్తు కృష్టయః'- మానవులు నీ కర్మములందే ఉండవలెను.

38. సోమమా! నీవు సకల భువనముల మానవులద్రష్టవు. జలవర్షకుడవగు నీవి విభిన్నగతులు. మాకు గోవులు మున్నగు వానితో కూడిన సువర్ణధనము నిమ్ము. '**హిరణ్యవహ్వాయం స్యామ భువనేషు జీవసే**'- హిరణ్యవంతులమగు మేము లోకములందు జీవించ గలము. (లోకములందు జీవించుటకు బంగారమే మూలము అనుచున్నాడు. ఈ ప్రవచనము ఏనాటికైన వర్తించును)

39. సోమమా! నీవు గోవులు, ధనము, సువర్ణము తెచ్చువాడవు. జలములు కలవాడవు. ద్రవించుము. నీవు సువీర్యుడవు. సర్వజ్ఞుడవు. స్తోతలు నిన్ను స్తోత్రముచే ఉపాసింతురు.

40. మధుర సోమరసరము అభిషసమయమున స్తోతలను ఉద్ధరించును. '**మహాసోమము నీటిలో కలసి కలశమున చేరును**' సోమపు రథము దశాపవిత్రము. సోమము యుద్ధములకు సాగును. అపారగతుల సోమము మా కొరకు అన్నమును గెలుచును.

41. సోమమా! నీవు అందరి గమ్యవవు రాత్రింబవళ్లు సకల ప్రజలు, సమస్తస్తుతులు నిన్నే కీర్తించును. దీప్తసోమమా ! ఇంద్రుడు నిన్ను సేవించినంత మా కొరకు సంతానయుక్త అన్నమును, ఇల్లునింపు ధనమును యాచింపుము.

42. సోమము హరితవర్ణము. రమణీయము మాదకము సోమమును ప్రాతఃకాల స్తోతలజ్ఞానము మరియు స్తుతులు తెలిసికొన గలవు. సోమము దేవతలు, మానవులు మెచ్చిన సంపదను యజమానులకు ఇచ్చువాడు. మర్త్య, స్వర్గలోక జీవులను తనకర్మములవైపు ఆకర్షించువాడు. అట్టివాడు ద్యావాపృథ్వుల మధ్యకు సాగును.

43. ఋత్విక్కులు ఆవుపాలలో సోమమును కలుపుదురు. వివిధములుగా కలుపుదురు. చక్కగా కలుపుదురు. దేవతలు బలకారక సోమరసమును ఆస్వాదింతురు - మధురగవ్యమున కలుపుదురు. రసము ఉబికినపుడు సోమము క్రిందకు దిగును. సోమము సేచకము. జనులు పశువులను స్నానమునకు నీటికి తీసికోని వెళ్లినట్లు - బంగారు నగల పురోహితులు సోమమును నీటిలోనికి తీసికొని వెళ్లుదురు.

44. ఋత్విక్కులారా ! విప్రుడు, ద్రవణశీలుడగు సోమపు పాటలు పాడండి - మహావర్షధారవలె సోమము రసరూప అన్నమును దాటిపావును. పాము కుబుసము విడినట్లు - అభిషవ సమయమున సోమము తన త్వచము విడుచును. వర్షక, హరితవర్ణ సోమము ఆటలాడు గుఱ్ఱమువలె - దశాపవిత్రము నుండి కలశమున చేరును.

45. అగ్రగామి, శోభనుడు, జలమున సంస్కరించబడిన సోమము స్తుతించబడును. సోమము దినములను కొలతవేయువాడు. సోమము హరితవర్ణ, జలమిశ్రిత, శుభదర్శన జలవంత, ధనప్రాపకుడు.

జ్యోతీరథః- అతని రథము జ్యోతిర్మయము. అతడు ప్రవహించువాడు.

46. సోమము ద్యులోక భర్త - ద్యులోకస్తంభము. మాదక సోమము అభిషవించబడును. అతడు త్రిధాతువు. సోమము సకల భువనములందు విహరించును ఋత్విక్కులు రూపవంత సోమమును స్తుతించినపుడు అప్పుడు శబ్దాయమాన సోమమును పురోహితులు ఇష్టపడుదురు.

47.శోధన సమయమున నీ చంచల ధారలు సూక్ష్మమేషలోమమును దాటిపోవును. రెండు అభిషవఫలకములమీద జలమందు కలసిన నీవు కలశమున కూర్చుందువు.

48. సోమమా ! నీకు మాస్తుతులు తెలియును. నీవు మా యజ్ఞము కొరకు ద్రవించుము. మేషలోమ దశాపవిత్రమున ప్రియమధువును రాల్చును, దీప్త సోమమా! సకల భక్షక రాక్షసులను నాశము చేయుము. యజ్ఞమందు సుపుత్రులమగు మేము నిన్ను స్తుతింతుము. - మహాధనము యాచింతుము.

## ఎనుబది ఏడవ సూక్తము

ఋషి - ఉశనుడు. దేవత పవమానసోమము. ఛందస్సు - త్రిష్టుప్.

1. సోమమా! శీఘ్రముగ వెడలుము. ద్రోణకలశమున కూర్చుండుము. నేతలచే శోధితుడవగుము. యజమానికి అన్నము అందింపుము. బలముగల అశ్వమును మార్జనము చేసినట్లు అధ్వర్యులు సోమమును మార్జన్నము చేయుదురు.

2. శోభన ఆయుధవంత, క్షరణశీల, దివ్య రాక్షసనాశక, ఉపద్రనములందు రభక, దేవపాలక, ఉత్పాదక, సుబల, స్వర్గస్తంభ, పృథ్విధారక సోమము క్షరితమగుచున్నది.

3. అతీంద్రిద్రష్ట, విప్రుడు, అగ్రగామి, మానసప్రకాశకుడు ధీరుడగు ఉషనృషి కావ్యగత స్తోత్రమున లభించును.

4. వర్ధక ఇంద్రా! నీ కొరకు మధువము, వర్షకమగు సోమము క్షరితమగుచున్నది. ఇంద్రుడు వందలదాత. అపారదాత. అగణితధనదాత. అతడు నిత్యుడు, బలవంతుడు, యజ్ఞములందు ఉండును.

5. అన్నాభిలాషులు, సేవా విజేతలు అశ్వమునువలె, సోమము గోమిశ్రిత అన్నము లక్ష్యముగా అసుర బలము కొరకు మేషలోమము యొక్క జల్లెడనుంచి శోధించబడి సిద్ధము చేయబడును.

6. అనేకులచే ఆహూతము, శోధ్యమాన సోమము మానవులకు సకల భోజ్యధనములను ఇచ్చును. శ్యేనముచే తేబడిన సోమమా! అన్నము ప్రసాదించుము. ధనము ప్రసాదించుము. అన్నరసము వైపుసాగుము.

7. గతిశీలము, అభిషుత సోమము - విడిచిన గుఱ్ఱమువలె పవిత్రమువైపు పరుగు తీయును. తన దారకు పదును బెట్టిమహిషము వలెను గవాభిలాషి శూరునివలె పరిగెత్తును.

8. సోమధార ఉన్నత స్థానమునుండి పాత్రవైపు సాగును. పణుల నివాసమగు పర్వతపు అహస్య స్థానమున ఉండిన గోవులను ఈ సోమధారమే పట్టుకున్నది. ఇంద్రా! ఉరుమువలె నినదించు సోమధార నీ కొరకే క్షరితమగుచున్నది.

9. సోమమా! శోధితమగు తప్పిపోయిన గోసమూహములను కనిపెట్టినావు. శీఘ్రదాత సోమమా! నీవు అన్నవంతుడవు. అన్నము సొంతము నీకు చెందును. మేము నిన్ను స్తుతించుచున్నాము. మాకు మహాధనమును ప్రసాదించుము.

## ఎనుబది ఎనిమిదవ సూక్తము

ఋష్యాద్యాః పుర్వవత్

1. ఇంద్రా! నీ కొరకు సోమము అభిషుతమగును. నీ కొరకు ద్రవించును. నీవే సోమమును చేతువు. నీవే స్వీకరింతువు. నీకు బలము కలుగుటకును సహాయక మగుటకును సోమపానము చేయుము.

2. సోమము రథమువలె మరిన్ని బరువులు మోయును. మహానుడగు సోమమును జనులు రథమువలెనే సిద్ధము చేయుదురు. సోమము ప్రచురధనదాత. యుద్ధార్థులు సోమమును యుద్ధమునకు తీసికోని పోవుదురు.

3. సోమము వాయువు వలె నియుతాశ్వములకు స్వామి. వాయువువలె స్వేచ్ఛాగమనుడు. అశ్వినులవలె పిలుపును ఆలకించువాడు. ధనికుని వలె అందరకు ప్రార్థనీయుడు. సూర్యునివలె వేగవంతుడు.

4. సోమమా! నీవు ఇంద్రునివంటి మహాకార్యము చేసినావు. నీవు శత్రుహంతవు పురధ్వంసివి. నీవు అశ్వసమముగా అహినామ్నులహంతవు. అంతేకాదు సకల శత్రుహంతవు.

5. అగ్ని అరణ్యమున పుట్టును. తన బలము వ్యక్తము చేయును. సోమము జలమున పుట్టును తనబలము వ్యక్తపరచును. యుద్ధమొనరించు వీరునివలె సోమము శత్రువు ముందు భయంకర శబ్దము చేయును - తాను వర్ధిల్లును.

6. ఆకసమునందలి మేఘము వర్షించును. నదులు దిగువకు సముద్రమునకు సాగును. అభిషుతసోమము మేషలోమమును దాటును. కలశమునకు చేరును.

7. సోమమా! నీవు బలశాలిని మరుత్తుల బలముతో సమముగా క్షరితుడవగుము. స్వర్గపు సుందర వాయువువలె వీచుము. జలములె మాకు మంచి బుద్ధిని ప్రసాదించుము. నీ రూపములు అనేకములు. శత్రుంజయ ఇంద్రునివలె నీవు కీర్తనీయుడవు.

8. సోమమా! నీవు వరుణరాజువు. నీ కార్యములను నేను త్వరత్వరగా నిర్వహింతును. నీ తేజస్సు గొప్పది. నీవు గంభీరుడవు. నీవు ప్రియమిత్రునివలె పరిశుద్ధుడవు. ఆర్యమవలె పూజ్యుడవు.

## ఎనుబది తొమ్మిదవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. ఆకాశము నుండి వర్షము కురిసినట్లు యజ్ఞమార్గమున సోమము ప్రవహించుచున్నాది. అనంతధారల సోమము ద్యులోకమున ఆసీనుడగును.

2. పాడి ఆవులకు సోమము మహారాజు. సోమము పాలలో కలియుచున్నాడు. అతడు యజ్ఞపునావను ఎక్కును. శ్యేనము తెచ్చిన సోమము జలములందు పెరుగును. ద్యులోక పుత్రుడగు సోముని పాలకులు దుహింతురు. అధ్వర్యులు సహితము దుహింతురు.

3. సోమము శత్రుహింసకుడు. జల ప్రేరకుడు. హరిత వర్ణుడు. రూపసి, ద్యులోకస్వామి యాజమానల సోమమునకు వ్యాప్తి కలిగింతురు. సోమము యుద్ధములందు శూరుడు. దేవతలందు ముఖ్యుడు. పణులు అపహరించిన గోవులను వెదకుటకు దారి అడుగుచున్నాడు. సోమసహాయమున్నే సేచక ఇంద్రుడు లోకములను రక్షించుచున్నాడు.

4. మధుపృష్ఠము భయానకము, గంత, దర్శనీయ సోమమును బహుచక్ర రథమున అశ్వమునువలె - యజ్ఞమున జతచేయుదురు. అక్క చెల్లెండ్రు, బంధువుల వంటి అంగుళులు సోమమును శుద్ధిచేయును. సమాన బంధమలైన అధ్వర్యులు మున్నగువారు సోమమును బలశాలిని చేయుదురు.

5. ఘృతమునందించు నాలుగు గోవులు సోమమును సేవించును. గోవులు అందరిని భరించు అంతరిక్షమున ఆసీనులగును. అన్నమును పవిత్రము చేయు గోవులు అనేకములు నలువైపుల సోమమును చుట్టి ఉండును.

6. సోమము భువికి నిలయము. ద్యులోకమునాకు స్తంభము సకల ప్రజ అతని అధీనము. అతడు స్తుత్యుడు. మీ కొరకు అశ్వవంతుడు. సోమము మధుర రసవంతము - ఇంద్రుని కొరకు అభిషుతమగును.

7. సోమమా! నీవు బలవంతుడవు. గొప్పవాడవు. వృత్రఘ్నుడవు. దేవతల పానము కొరకు క్షరితుడవగుము. నీదయ వలన మేము **'సువీర్యస్యసతయఃస్యామ'** మంచి బలములకు అధిపతులము కాగలము.

**తొంబదవ సూక్తము**

ఋషి - మైత్రావరుణ వసిష్ఠుడు. దేవత - పవమాన సోమము.

ఛందస్సు - త్రిష్టుప్.

1. సోమము అధ్వర్యులచే ప్రేరితుడు. ద్యావాపృథ్వుల ఉత్పదకుడు. అతడు రథమువలె అన్నప్రదానము చేయువాడు. ఇంద్రునిపొంది, ఆయుధములకు పదునుపెట్టు, సకల ధనములను చేతబట్టి సోమము మాకిచ్చుట నిలిచినాడు.

2. త్రిసవనవంతుడు, వర్షకుడు, అన్నదాత సోమమును స్తోతలవాణి శబ్దాయమానుని చేయుచున్నది. జలమిశ్రిత సోమము - వరుణునివలె - జలాచ్ఛాదకుడు. సోమము రత్నదాత స్తోతలకు ధనములిచ్చును.

3. సోమమా! నీవు శూరులకు శూరుడవు. వీరులకు వీరుడవు. సోమము సమర్థుడు. విజేత, సమనభక్తుడు. తీక్ష ఆయుధవంతుడు. ధనుష్పాణి. యుద్ధమందు అజేయుడు. శత్రుహర్త.

4. సోమమా! నీ మార్గములు విస్తృతములు. స్తోతలకు అభయ ప్రదానమునకును, ద్యావాపృథ్వులను కూర్చుటకును క్షరితుడవగుము. మాకు అధిక అన్నము కలిగించుటకు ఉషస్సు, ఆదిత్య కిరణములను సాధించ దలచి నినదింతువు.

5. క్షరణశీల సోమమా! నీవు వరుణ, మిత్ర, విష్ణు, బలి మరుత్తు, ఇంద్ర మరియు అన్యదేవతలకు మాదకుడవగుము వారికి తృప్తి కలిగించుము.

6. సోమమా! నీవు యజ్ఞవంతుడవు. రాజువలె బలప్రయోగమున సకల పాపములను నష్టపరచి క్షరితుడవగుము. దీప్త సోమమా! మేము సుందర స్తుతుల అర్పించుచున్నాము. మాకు అన్నము కలిగించుము. **"పాతస్వస్తిభిః సదానః"** మాకు సదా మంగళకరుడవగుము పాలించుము.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేదసంహిత తొమ్మిదవ మండలము ఏడవ అష్టకమున మూడవ అధ్యాయము సమాప్తము.)*

**ఓం నతామినన్తిమాయనో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదసే అద్రుహా వేద్యాభిర్న పర్వతానినమేత స్థినాంసః**

**నాలుగవ అధ్యాయము తొంబది ఒకటవ సూక్తము**

ఋషి - మారీచ కశ్యపుడు. దేవత - పవమాన సోమము. ఛందస్సు - త్రిష్టుప్.

***ఓం అసర్జివ క్వారథ్యేయథా జౌధియామనోతా ప్రతామో మనీషీ|***
***దశస్వసారో అధిసానో అవ్యేజన్తి వహ్నింపద వాన్యచ్ఛ ||***

1. యుద్ధభూమిలో అశ్వమును చేతితో పరిమార్జనము చేసినట్లు శబ్దాయమాన, క్షరణశీల సోమమును యజ్ఞమందు పరిమార్జనము చేయబడును. సోమము దేవతల మనసులకు అనుకూలుడు. దేవఃలందు శ్రేష్ఠుడు. సుత్తులకు అధిపతి. భగినీ రూప దశాంగుళులు యజ్ఞగృహమునకు మోయు సోమమును ఉన్నత స్థానమగు - మేషలోను దశాపవిత్రమునాకు పంపును.

2. సాధువులగు సహుష వంశస్తోతలు అభిషవించిన, దేవసమీపవర్తి సోమము యజ్ఞమునకు వెడలును. అమర సోమము కర్మనిష్ఠనరులచే పవిత్ర అభిషవచర్మము, గోరసము, జలములద్వారా అనేకమారులు శోధితుడై యజ్ఞమునకు వెడలును.

3. సోమము కామవర్షకుడు, మాటిమాటికి శబ్దము చేయువాడు అతడు జలవర్షక ఇంద్రుని కొరకు చక్కని తెల్లని ఆవుపాలవద్దకేగును. సోమము స్తోత్రవంతుడు. స్తోత్రజ్ఞుడు. సువీర్యుడు. అతడు హింసారహితమగు అనేక మార్గముల నుండి చిన్నకన్నముల పవిత్రమునుదాటి ద్రోణకలశమునకు వెళ్లును.

4. సోమమా! సుదృఢ రాక్షసనగరములను ధ్వంసము చేయుము. పవిత్రమున శోధితుడవై అన్నము తెమ్ము. దూరమునుండియు దగ్గరనుండియు చేరు రాక్షసులున్నారే - వారినాయకుని నీఘాతుక ఆయుధములచే హతమార్చుము.

5. సర్వ ప్రార్థనీయ సోమమా! నీవు ప్రాచీనుడవు. మావి నవీన సూక్తులు. శుభంకర స్తుతులు. వానిని ప్రాచీనములు చేయుము. సోమమా ! నీవు బహుకర్మవు. శబ్దాయమానుడవు. నీ అంశము రాక్షసులు సహించలేనిది. హింసకము. మహామాహము. అట్టి నీ అంశము యజ్ఞములందు మాకు లభించవలెను.

6. పవమాన సోమమా! మాకు జలము , స్వర్గము, గోధనము, అనేకమంది పుత్రపౌత్రులను ప్రసాదించుము. మా క్షేత్రములకు శుభములు కూర్చుము. అంతరిక్షమున నక్షత్రములను విస్తృతపరచుము. మేము చిరకాలము సూర్యుని దర్శించవలెను.

## తొంబది రెండవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. సోమము శోధ్యమానము. పురోహితలు పంపినది. హరితవర్ణ. యుద్ధమందు శత్రువధకు రథమునుసంచాలితము చేసినట్లు - దేవతలను ఉపాసించుటకుగాను సోమమును మేషలోమ పవిత్రమునసంచాలితము చేయుదురు. సోమమునకు ఇంద్రుని స్తోత్రము ప్రాప్తించును. అతడు ప్రసన్నకర అన్నములచే దేవతలను సేవించును.

2.మానవద్రష్ట, క్రాంతప్రజ్ఞ సోమము జలములందు కలియును. స్వస్థానమగు పవిత్రమున వ్యాపించును. స్తోత్రముల కొరకు హోతలు దేవతల వద్ద కేగునట్లు-సోమము యజ్ఞమునకేగును. తదుపరి చమసాది పాత్రలందు నిలుచును. అప్పుడు విప్రులగు సప్తర్షులు సోమము వద్దకు విచ్చేయుదురు.

(కాశ్యప, భరద్వాజ, గౌతమ, అత్రి, విశ్వామిత్ర జమదగ్ని, వసిష్ఠులు సప్తర్షులు.)

3. శోభన ప్రాజ్ఞుడు , మార్గజ్ఞుడు. దేవసమీపవర్తి, పవమాన సొమము ద్రోణకలశమున ప్రవేశించును. సకలకార్యములందు ప్రాజ్ఞ, రమణీయ సొమము పంచజనులను అనుగమించును.

4. సహోద్యమాన సొమమా! నీ వారలు, ప్రసిద్ధులగు ముప్పదిముగ్గురు దేవతలు అంతర్హితమార్గన నివసింతురు. పది అంగుళులు ఉన్నతము, మేషలోమ పవిత్రమందు - నీటితో నిన్ను శుద్ధి చేయును.

5. పవమాన సోమపు ప్రసిద్ధస్థానమున స్తోతలు స్తుతించుటకు ఏకత్రితులగుదురు. అట్టి సత్యస్థానము మాకు లభించవలెను. దినములను ప్రకాశవంతముచేయు సోమజ్యోతి మను మహర్షిని భద్రముగ రక్షించినది. సొమము తన తేజమును అసురుల కొరకు అభిగమన శీలము చేసినాడు.

6. దేవతలను ఆహ్వానించుటకు ఋత్విక్కులు పశువంత యజ్ఞ, గృహమునకు చేరునట్లు సత్కర్మ ప్రభువు యుద్ధక్షేత్రమునకేగినట్లు - పవమాన సొమము ప్రవాహ జలమున మహిషము వలెనిలిచి- ద్రోణ కలశమునకు చేరును.

## తొంబది మూడవ సూక్తము

ఋషి - గౌతమ నోదస్సు. దేవత - పవమాన సోమము. ఛందస్సు - త్రిష్టుప్.

1.ఒకేసారి కదలునట్టి భగిస్వరూపలగు పది అంగుళులు సోమమును శుద్ధిచేయును. ప్రాజ్ఞులు, దేవత అభిలషించు సోమమునకు ఆపది అంగుళులే ప్రేరకములు హరిత వర్ణసోమము సూర్యపత్నులగు దిశలవైపు మరలును. పరుగుల గుఱ్ఱము నిలిచినట్లు సోమము కలశమున నిలుచును.

2. సోమము దేవకామి. కావవర్ణకము వరణీయము. తల్లులు పిల్లలను శుభ్రము చేసినట్లు సోమము జలమున శుభ్రము చేయబడును. భర్త భార్య వద్ద కేగినట్లు సోమము అలంకరించిన స్థానమునకు చేరును. పిదప దుగ్ధాదులతో ద్రోణ కలశమున చేరును.

3. సోమము ఆవు చన్నులను దువ్వును. శోభన ప్రజ్ఞ సోమము ధారలుగా ద్రవించును. చమస ములందున్న శ్రేష్ఠసోమమును -ఒక వస్తువును చలువచేసిన బట్ట కప్పినట్లు ఆవుపాలు ఆచ్ఛాదించును.

4. పవమానసోమమా ! పాత్రలందు పడునపుడు దేవతలతో చెలిమిచేయునీవు - మాకు అశ్వయుక్త ధనమును అందించుము. రథికులను కోరునట్టి సోమపు అభిలాషగల, బహువిధ బుద్ధి మాకు ధనదానము చేయుటకు మా ముందుకు రావలెను.

5. సోమమా! మాకు వెంటనే పుత్రాదియుక్త ధనములిమ్ము. జలములను అందరకు ఆహ్లాదకరము చేయుము. స్తోతల ఆయువు పెంచుము. మా సదన యజ్ఞములకు త్వరగా విచ్చేయుము.

## తొంబది నాలుగవ సూక్తము

ఋషి - అంగిరస కణ్వుడు. దేవత - పవమాన సోమము. ఛందస్సు -త్రిష్టుప్.

1. సోమము అశ్వసమముగా అలంకరించబడినప్పుడు. సోమకిరణములు సూర్యునివలె ఉదయించినప్పుడు అంగుళులు స్పర్థతో సోమమును శోధించును. పిదప కవి సోమము జలములందు కలసి పశుపోషణకు గోపాలుడు గోష్ఠమునకు పోయినట్లు - సోమము కలశమున క్షరితమగును.

2. జలధర అంతరిక్షమును సోమము స్వతేజమున ద్విధా ఆచ్ఛాదించును. సర్వజ్ఞ సోముని కొరకు సకల భువనములు విస్తృతమగుగాత. స్తోత్రములు ఆనంద కరములు. యజ్ఞావిధాయకములు. అవి సోముని గూర్చి యజ్ఞదినములందు - కొట్టమున పాడియావుల్ అరుపుల వలె చప్పుడు చేయును.

3. బుద్ధిమంతుడగు సోమము స్తుతులవైపు సాగునపుడు - వీరపురుషుని రథము సాగునప్పటివలె మార్గములను నియంత్రించును. సోమము దేవతల ధనము మానవులకు ఇచ్చును. అట్టిధన వృద్ధికి సోమమును స్తుతించవలెను.

4. సోమము సంపదలందు పుట్టినవాడు. సంపదల కొరకే వెడలును. సోమము స్తోతలకు ధనము, ఆయువు ప్రసాదించును. సోముని సంపదలందుకున్న స్తోతలకు అమరత్వము కలుగును. సోముని యుద్ధములు సత్యములగును "భవన్తి సత్యాసమిథా."

5. సోమమా! సంపద, బలము, అశ్వములు, గోవులను ఇమ్ము. మహాజ్యోతిని విస్తరించుము. ఇంద్రాది దేవతలకు తృప్తి కలిగించుము. నీ ముందు రాక్షసులందరు ఓడినవారే. క్షరణశీల సోమమా! శత్రువులందరిని హతమార్చుము.

## తొంబది అయిదవ సూక్తము

ఋషి - కణ్వపుత్ర ప్రస్కణ్వ దేవత - పవమాన సోమము. ఛందస్సు - త్రిష్టుప్.

1. నలువైపుల అభిషుతమగు నట్టి హరిత వర్ణసోమము ధ్వనిచేయుము. శోధితమగుచునే కలశగర్భమున కూర్చుండును. ఋత్విక్కులు కలిగించిన సోమము పాలలో కలిసి తన రూపమును వ్యక్తపరచును. స్తోతలారా! సోమము కొరకు హవి సహితముగా పూజ్యస్తోత్రములను సృష్టించండి.

2. నావికుడు నౌకను నడిపినట్లు - సిద్ధముచేయబడిన సోమము సత్యరూప యజ్ఞమునకు ఉపయుక్త వాక్యమునకు ప్రేరణ కలిగించుచు దీప్తసోమము ఇంద్రాది దేవతల అంతర్వ్యాతస్వ రూపమును యజ్ఞమునందు - ఉత్తమ వ్యక్తి కొరకు -ఆవిష్కరించును.

3. స్తుతుల కొరకు తొందర పడు ఋత్విక్కులు - జలతరంగములవలె - మనసుమెచ్చు స్తుతులను సోమమునకు అర్పింతురు. సోమమును పూజించు స్తుతులు సోముని చేరును. అభిలాషగల స్తుతులు అభిలాషి సోమమున ప్రవేశించును.

4. ఋత్విక్కులు సోమమును శుద్ధిచేయుదురు. ఎత్తున అభిషవ శిలలపై ఉన్న సోమమును - గేదెను వలె పితుకుదురు. కామాయమాన సోమమును మననీయ స్తుతులు సేవించును. మూడు లోకములందు ఉండు ఇంద్రుడు శత్రు నివారక సోమమును అంతరిక్షమున ఉంచినాడు.

5. స్తోత్రప్రేరక ఉపవక్త పురోహిత హోతను ప్రోత్సహించును. సోమమా! నీవును అట్లే స్తోతలను ప్రోత్సహించుటకు ధనాదులు అందించుచు ముందుకు రమ్ము. నీవు యజ్ఞమున ఇంద్రుని వెంట ఉన్నపుడు మేము సౌభాగ్యశాలురము కావలెను. శుభములనిచ్చు ధనస్వాములము కావలెను.

## తొంబది ఆరవ సూక్తము

ఋషి - దివోదాసపుత్రుడు ప్రతర్దనరాజర్షి. దేవత - పవమాన సోమము.
ఛందస్సు - త్రిష్టుప్

1. సోమము శత్రుబాధక సేనాపతి. శత్రువుల గోవులు సాధించు యుద్ధమున సోమము రథాగ్రమునసాగును. సోమపు ఇంద్రుని సేన ప్రసన్నమగును. మిత్రులగు యజమానులు ఇంద్రుని ఆహ్వానింతురు అట్టి ఆహ్వానమును అలంకృతము చేయుటకు సోమము దుగ్ధాదులను గ్రహించును. ఆ సోమము కొరకు ఇంద్రుడు త్వరగా వచ్చును.

2. సోమపు హరితవర్ణ కిరణమును అంగుళులు అభిషవించును. సోమము ఎంతో వ్యాప్తము. అయినను నిలిచినా రథము వంటి దశాపవిత్రమున నిలుచును. ప్రాజ్ఞసోమము ఇంద్రుని మిత్రము. సోమము పవిత్రమున శుద్ధియై శోభన స్తుతులను స్తోతను చేరును.

3. ద్యోతమాన సోమమా! నీవు ఇంద్రుని పానపదార్థమవు. మా యజ్ఞము దేవసేవితము. అందు ఇంద్రుని మహాపానమునకు ద్రవించుము. నీవు జలకర్తవు. ద్యావాపృథ్వుల అభిషేక్తవు. విస్తృంతరిక్షము నుండి వచ్చువాడవు. శోధితుడవగువాడవు. మాకు ధనాదులు ప్రదానము చేయుము.

4. మా యజ్ఞము అపరాజితము. అవినాశ్యము. పవమాన సోమమా! యజ్ఞముకొరకు ముందుకు రమ్ము. మా మిత్రులందరు నీ రక్షణలు కోరుచున్నారు. నాకు సహితము నీ రక్షణ కావలెను.

5. సోమము క్షరితమగును. అతడు స్తుతిజనకుడు ద్యులోక జనకుడు. పృథ్విజనకుడు. అగ్ని జనకుడు. ప్రేరక సూర్యజనకుడు. ఇంద్ర జనకుడు. విష్ణ జనకుడు.

6. సోమము దేవస్తోతలగు పురోహితులందు బ్రహ్మకవులందు శబ్దవిన్యాసకర్త. విప్రులందు ఋషి. వన్యప్రాణులందు మహిషము. పక్షులకు రాజు. ఆయుధములందు స్వధితి. శబ్దము చేయు సోమము పవిత్రమున దాటును.

7. పవమాన సోమము నదీతరంగములవంటి స్తుతివాక్యములను ప్రోత్సహించును. కామవర్ధక, గోజ్ఞాన సోమము అంతరంగములను చూచును. నిరాటంక బలమును అధిష్ఠించును.

8. సోమమా! నీవు మాదకరుడవు. యుద్ధములందు శత్రుహంతవు. అగమ్యుడవు. అపార జలయుక్తుడవు. శత్రుబలమును అధిగమింపుము. గోవులకు ప్రేరణ కలిగించుచు నీ అంశమును ఇంద్రుని వద్దకు పంపుము.

9. సోమము ఆనందదాయకము. రమణీయము. సోమము వద్దకు చేరుదురు. సోమము బహుధారలవాడు. పాత్రలందు నిలుచువాడు. యుద్ధమునకు అశ్వము వెళ్లినట్లు ఇంద్రుని కొరకు ద్రోణకలశమునకు చేరును.

10. సోమము ప్రాచీనుడు. ధనాధిపతి మిత్ర రక్షకుడు జన్మతోనే జలమున శుద్ధియగువాడు. రాతిమీద పిండబడువాడు. ప్రాణులకు ప్రభువు. కర్మల కొరకు కరుగువాడు. అతడు యజమానులకు చక్కని మార్గము చూపును.

11. పవమాన సోమమా! మా పూర్వజులు కర్మకుశలురు. వారు నీ సాయమున అగ్నిష్టోమాది కర్మలు నిర్వహించినారు. వేగవంత అశ్వముల సాయమున నీవు శత్రువులను వధింతువు. రాక్షసులను తొలగింపుము ధనము ప్రసాదించుము **"మఘవాభవానః"** మా ఇంద్రుడవగుము.

12. ప్రాచీనకాలమున నీవు మనువునకు అన్నము కలిగించినావు. శత్రువులను వధించినావు. ధనపురోడాశాదులను అతనికి ఇచ్చుటకు వచ్చినావు. అట్లే మాకు ధనములు అందించుటకు విచ్చేయుము ఇంద్రుని యందు చేరుము. అతనికి ఆయుధములు ఇమ్ము.

13. సోమమా! నీవు బలకరుడవు. రసవంతుడవు. యజ్ఞకుడవు జలముల కలియుము. మేషలోను పవిత్రము ఉన్నతము. అందు ద్రవించుము. నీవు అత్యంత మాదకుడవు. ఇంద్రుని పానయోగ్యుడవు. జలమున్న ద్రోణకలశమున నిలువుము.

14. సోమమా! నీవు యజ్ఞములందు యజమానులకు వివిధ ధనములు ఇచ్చువాడవు. బహుధారలవాడవు. ఆకసమునుండి వాన కురిపించుము. పాలు, నీరు ప్రసాదించి మా జీవనములను వర్ధిల్లచేయుము. ద్రోణకలశమున ద్రవించుము.

15. సోమము స్తోత్రములచే పరిశుద్ధడగును. పరుగులిడు గుఱ్ఱమువలె శత్రువును దాటిపోవును దైన్యమెరుగని ఆవుయొక్క పాలవలె పరిశుద్ధుడు. విశాల మార్గము వలె అందరి ఆశ్రయము. వాహకఅశ్వమువలె సోమము స్తోత్రములచే నియంత్రితుడగును.

16. సోమము శోభన ఆయుధవంతుడు ఋత్విక్కులచే శోధితుడు. సోమమా! నీ మూర్తి గుహ్యము రమణీయము. ఆమూర్తిని వ్యక్తపరచుము. నీవు అశ్వసముడవు. మేము అన్నాభిలాషులము. మాకు అన్నము అందించుము. ఆయువునిమ్ము. పశువులనిమ్ము **"అభిపాయమభిగో దేవసోమ."**

17. సోమము అందరి అభిలషనీయుడు. వ్యక్తమగువాడు అతనిని మరుత్తుల పసిబిడ్డనువలె పోషింతురు సప్తమరుత్తులు వాహక సోమమును అలంకరింతురు. క్రాంతికర్మ, కవిశబ్ద వాచ్య సోమము శబ్దముచేయును. స్తుతులవెంట పవిత్రమును దాటిపోవును.

18. సోమము ఋషి సమమనస్కుడు. సర్వద్రష్ట. సూర్యసంభక్తుడు. బహుస్తుతువంతుడు. కవులందు శబ్దవిన్యాసకర్త. పూజ్యుడు. ద్యులోకమున వసించగోరును. స్తుత్యుడగును. ఇంద్రుని ప్రకాశింప చేయును.

19. సోమము అభిషనఫలక విరాజితుడు. ప్రశంసనీయుడు సమర్థుడు పాత్రస్థితుడు. ఆయుధధారి. జలప్రేరకుడు.

అంతరిక్షవాసి. మహానుడు. నాలుగవదగు చంద్రలోకమును సేవించును.

20. సోమము అలంకరించుకున్న నరునివంటివాడు. స్వదేహమును శుభ్రపరచుకొనువాడు. ధనదానముకు ఆతురపడువాడు. వేగవంత అశ్వమువంటి నడకలవాడు, వృషభమువలె శబ్దము చేయువాడు, పాత్రలకు పయనించువాడు, శబ్దము చేయుచు అభిషవణ ఫలకముల మీద ఆసీనుడగును.

21. సోమమా! ఋత్విక్కులచే శోధితుడవగుము. క్షరింపుము తేపతేప పలుకుము. మేషలోమ పవిత్రమున చేరుము. అభిషవణ ఫలకముల మీద ఆడుము. పాత్రలందు తిష్ఠవేయుము. **"ఇంద్ర తేరసోమదిరో మమత్తు."** నీరసము ఇంద్రునకు మత్తు కలిగించవలెను.

22. సోమపు మహాధారలు సిద్ధమగుచున్నవి. వానిలో గోరసము కలుపు బడుచున్నది. ద్రోణకలశమునకు చేరుచున్నది. సోమముగాన కుశలుడు. విద్వాంసుడగు సోముడు గానము చేయుచు-లంపటుడు మిత్రుని భార్య వద్దకు ఉరికినట్లు - పాత్రలకు పరుగులిడును.

23. సోమమా! నీవు శోధ్యమానుడవు. స్తోతలచే అభిషుతడవు. ద్రవించువాడవు. జారుడు వ్యభిచారిణి వద్దకేగినట్లు - నీవు శత్రువినాశము చేయుచు విచ్చేయుదువు. ఎగురుపక్షి చెట్టు కొమ్మన కూర్చున్నట్లు - శోధితుడవైన నీవు ద్రోణకలశమున కూర్చుందువు.

24. తల్లులు పిల్లలకు పాలిచ్చినట్లు సోమమా! యజమానులకు ధనము దుహించునట్టి శోభనధారలుగల నీ దీప్తులు పాత్రలకు చేరును. సోమమా! నీవు హరితవర్ణుడవు. తేబడినవాడవు. ఋత్విక్కులచే బహుధా వరణీయుడవు వసితీవరి జలములందును. యజమానుల కలశములందును. మాటిమాటికి శబ్దము చేయుదువు.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేదసంహిత ఏడవ అష్టకము తొమ్మిదవ మండలమున అయిదవ అనువాకము సమాప్తము.)*

**ఆరవ అనువాకము తొంబది ఏడవ సూక్తము**

ఋషి - వేరువేరు. దేవత - పవమనా సోమము. ఛందస్సు - త్రిష్టుప్.

1. సోమము సువర్ణమున శోధితము, ప్రదీప్త కిరణవంతము. తనరసమును దేవతల వద్దకు పంపును అభిషుత సోమము నినదించుచు - ఋత్విక్కులు యజమాని యొక్క పశువంత, సునిర్మిత గృహమునకు వెళ్లినట్లు - పవిత్రమునకు వెళ్లును.

2.సోమమా! నీవు యుద్ధయోగ్యుడవు. అచ్ఛాదకుడవు. కళ్యాణకారివి. తేజస్వివి, పూజ్యుడవు, కవివి. ఋత్విక్కుల

వాక్కును ప్రశంసించ గలవాడవు. సర్వద్రష్టవు, నిరంతర జాగృతుడవు. యజ్ఞమునందు అభిషవణ ఫలకముల మీద ఆసీనుడవగుము.

3. సోమమా! నీవు యశోవంతులలో యశస్వివి. నేలమీద పుట్టినవాడవు. ఆనందదాయకుడవు ఉన్నతమగు మేషలోమ పవిత్రమున శోధితుడవగుదువు. శోధితుడవై అంతరిక్షమున ధ్వనించుము. మంగళమయ రక్షణలతో మమ్ము రక్షింపుము.

4. స్తోతలారా! చక్కగా స్తుతించండి. దేవతలను పూజించండి. ప్రచుర ధనప్రాప్తికి సోమమును ప్రోత్సహించండి. రుచికర సోమము మేషలోను పవిత్రమున శోధితమగును. కలశమున నిలుచును.

5. దేవతలమైత్రి కోరిన ధారావంత సోమము కలశమందు కరుగును. కర్మనిష్ఠులచే స్తుతుడగును. అంతరిక్షమునకు తరలును. "అగన్నింద్ర మహతే సౌభగాయ" మహాసౌభాగ్యము కొరకు ఇంద్రుని వద్దకేగును.

6.హరితవర్ణ, శోధిత సోమమా! నిన్ను స్తుతించుచున్నాము. మాకు ధనము ఇచ్చుటకు విచ్చేయుము. యుద్ధమునాకు సాగు ఇంద్రుని కొరకు నీమదకర రసమును పంపుము. దేవతల రధమున ఆసీనుడవై రమ్ము. యూయం సాత్ స్వస్తిభిః సదానః - నీవు ఎల్లవేళల శుభములు కలిగించి మమ్ము రక్షింపుము.

7. ఉశన కవితో సమముగా కావ్యముగా కావ్యములు రచించిన ఈ మంత్రకర్తయగు ఋషి ఇంద్రాది దేవతల జన్మ వివరములు తెలియును. సోమము విశేషకర్మి. సాధుమిత్రుడు పవిత్రతా ఉత్పాదకుడు దినములకు రాజు అతడు శబ్దముచేయును. పాత్రలందు చేరును.

8. వృషగణనామక ఋషులు హంసగమనులు. వారు శత్రుబలమునకు బెదరినారు. క్షిప్రఘాతక, శత్రుహంత సోముని ఆశ్రయించినారు. యజ్ఞగృహమున చేరినారు. మిత్ర రూప స్తోతలు స్తోత్రయోగ్య, దుర్ధర్ష, క్షరణశీలా సోముని గూర్చి వాద్య సహితముగ గానములు చేసినారు.

9. సోమము శీఘ్రగామి. అనేకులచే స్తుతించబడువాడు. అనాయాసముగ ఆటలాడువాడు. అతనిని ఇతరుల అనుసరించజాలరు. సోమము తీక్ష్ణ తేజస్వి. అతడు వివిధ తేజస్సులను వ్యక్తపరుచును. అంతరిక్షమున ఉన్న సోమము పగలు హరిత వర్ణుడుగను, రాత్రి శుభ్ర ప్రకాశ యుక్తుడగను అగుపించును.

(సోమము పగలు సూర్యుడు రాత్రి చంద్రుడు అగునని.)

10. సోమము క్షరణశీలుడు బలవానుడు గమనశీలుడు. అతడు ఇంద్రునకు బలము కలిగించు రసము నంపును ఇంద్రునకు మత్తు కలిగించుటకు ద్రవించును. సోమము రాక్షసకులహంత. వరణీయ ధనదాత బలములకు రాజు

నలుదిశల శత్రువులను సంహరించును.

11. సోమము శిలలచే అభిశుతుడు. మదకర ధారలవాడు. దేవతలను పూజించువాడు పవిత్రముననిలిచి క్షరితగును. ద్యోతమాన, మదకర సోమము ఇంద్రుని స్నేహమును ఆశ్రయించును. ఇంద్రుని బలమునకు ద్రవించును.

12.సోమము కాలమునకనుసరించి ప్రియకార్యములు చేయువాడు. శోధితుడు. క్రీడావంతుడు. తన రసమున ఇంద్రాది దేవతలను పూజించుటకు కరిగిపోవును. పది అంగుళులు అతనిని ఉన్నతము, మేషలోమ పవిత్రమునాకు పంపును.

13. ఆవులను చూచి లోహితవర్ణ వృషభము అరచును. అట్లే నినదించుచు సోమము ద్యావా పృథ్వుల కరుగును. యుద్ధమున సోమము ఇంద్రుని వలె గర్జించును. తనను అందరకు ఎరుక పరచుటకు సోమము పొలికేక పెట్టును.

14. సోమమా! నీవు దుగ్ధయుక్తుడవు. క్షరణశీలుడవు. శబ్దకర్తవు. నీ రసము మధుర రసము నీవు జలపరిషిక్తు డవగుము. శోధితుడవగుము. నీ ధారలను విస్తృత పరచుము. ఇంద్రుని కొరకు సాగుము.

15. మదకర సోమమా! జలధరముచే వర్షింప చేయుటకు నీ ఘాతుక ఆయుధమున మేఘపు తలవంచునట్లు చేతువు - బలము కొరకు క్షరితుడవగుము. శుభంకర, శ్వేతవర్ణ, పవిత్రమున అభిషిక్త, మాగోవులను అభిలషించు సోమమా! క్షరితమగుమా.

16. దీప్తసోమమా! మా స్తుతులకు ప్రసన్నుడవగమును. మా కొరకు వైదిక మార్గములను సుమము చేయుము. ద్రోణ కలశమున ద్రవించును. గట్టి ఇనుప ఆయుధములతో దుష్టరక్కసులను సంహరించుము. ఉన్నత, మేషలోమ పవిత్రమునకు ధారలతో కదలుము.

17. వర్షము ద్యులోక ఉత్పన్నము. గమనశీలము అన్నవంతము. సుఖముల నిచ్చునది. దానములు చేయునది సోమమా! అట్టి వర్షము కురిపించుము. భూమి మీది వాయువులు ప్రేమపాత్ర పుత్రునివంటివి. వాని కొరకు వెదకుచు - వెదకుచు విచ్చేయుము.

18. ముడిని సడలించి విప్పుదురు. సోమమా! అట్లే నన్ను పాపముల నుండి దూరము చేయుము. నాకు చక్కని మార్గము చూపుము. బలము నిమ్ము. నీవు హరిత వర్ణుడవై పాత్రలందు నిలిచి - వేగవంత అశ్వమువలె ధ్వనులు చేయుదువు. దేవా ! నీవు శత్రుహింసకుడవు గృహవంతుడవు నా వద్దకు రమ్ము.

19. నీవు పర్యాప్త బలవంతుడవు. దేవతల యజ్ఞమునకును, మేషలోను పవిత్రమునకును ధారలతో వెడలుము. బహుధారాయుకు డవగుము. సుగంధసంపన్ను డవగుము. మానవులు యుద్ధములు కల్పించుకున్నారు.

అన్నలాభము కొరకు ఆయుద్ధముల నలువైపుల క్రమ్మకొనును.

20. త్రాడులేని, రథములేని, కట్లులేని గుఱ్ఱము అలంకృతమై యుద్ధమున తన లక్ష్యమువైపు ఉరుకులు పెట్టును. అట్లే యజ్ఞమున నిర్మితము, దీప్తమగు సోమము కలశము దిశగా ఉరుకులుపెట్టును.

21. సోమమా! మా యజ్ఞము లక్ష్యముగా నీ యొక్క సారమును ద్యులోకము నుండి మాచమసములందు సోమము మాకు మేము కోరిన వృద్ధిగల, వీరపుత్రుని ప్రసాదించుము. బలిష్ఠ ధనమును అందించుము.

22. అభిలాషులగు స్తోతల వచనములు మనసునుండి వెడలినప్పుడు - విచిత్రములగు యాజ్ఞిక ద్రవ్యములు అనుష్ఠాన స్థానమునకు తెచ్చినప్పుడు - అప్పుడు ఆవుపాలు ఆతురతగా సోమమువైపు పారును. అప్పుడు సోమము కలశమును చేరును. సోమము ఎల్లరకు ప్రేమ పాత్రుడగు యజమాని వంటివాడు.

23. సోమము ద్యులోక ఉత్పన్నుడు. ధనదాతల కోరికలు తీర్చువాడు. సుమేధ సత్యస్వరూపుడగు ఇంద్రుని కొరకు అతడు తనరసమును అర్పించును. సోమము మహారాజు అతడు ధర్మబలుడు. పది అంగుళులు మరింత సోమమును అందించును.

24. సోమము పవిత్రమున శోధితుడు మానవద్రష్ట దేవతలకు, మానవులకు ప్రభువు. ధనస్వామి. కళ్యాణకర జలములు కలవాడు.

25. అశ్వము యుద్ధమునకుపోవును. సోమమా ! అట్లే నీవు యజమానుల అన్నము కొరకు వెడలము. ఇంద్ర వాయువుల పానము కొరకు వెడలుము. మాకు బహువిధ, ప్రవృద్ధ అన్నమును అందించుము. మా కొరకు ధనములు సాధించుము.

26. సోమము దేవతలను తృప్తిపరచువాడు. పాత్రలందు సిక్తుడు సుబుద్ధి యజ్ఞకర్త, స్వరసేకర్త, హోతలవలె ద్యులోకమునందలి దేవతలను స్తుతించువాడు. అత్యంతమాదకుడు అతడు మాకు వీరపుత్రుని, గృహమును ప్రసాదించవలెను.

27. స్తుత్యసోమమా ! నిన్ను దేవతలు పానము చేయుదురు. దేవతల యజ్ఞమున మహాభక్షకుడవగుము దేవతల పానమునకు క్షరితుడవగుము. నీవు మమ్ము యుద్ధములకు పంపుము అప్పుడు మేము మహా బలముల శత్రువును ఓడింతుము. నీవు శోధితుడవగుము. మా కొరకు ద్యావాపృథ్వులను నివాసవంతము చేయుము.

28. సోమమా! నీవు సింహమువలె అరి భయంకరుడవు నీది మనసును మించిన వేగము, సోమాభిషవ కర్తలకు ఋత్విక్కులచే యోజితుడవు. నీవు అశ్వము వలె ధ్వనులు చేయుదువు. దీప్త సోమమా! సులభ మార్గముల

మామనసులను ప్రసన్నము చేయుము.

29. సోమమా! నీవు దేవతల కొరకు పుట్టినావు. నీ ధారలు వందలై వర్థిల్లినవి. క్రాంత దర్శకులు బహువిధమగు నీ ధారలను శుద్ధిచేయుదురు. మా పుత్రుల కొరకు ద్యులోకమునందలి గుప్త ధనమును పంపుము. నీవు మహాధనముల అగ్రగామివి కదా!

30. దినములను కలిగించు సూర్యకిరణములవలె సోమధారలు ఏర్పడును. సోమము ధీరుడగురాజు మంచి మిత్రము కర్మకర్తయగు పుత్రుడు తండ్రిని ఓడించడు - సోమమా! అట్లే నీవు నీ ప్రజను ఓడించకుము.

31. సోమమా! నీవు జలమునుండి మేషలోమ పవిత్రమును దాటుదువు. అప్పుడు మా కొరకు మధురధారలు సిద్ధమగును. నీవు దుగ్ధము లక్ష్యముగా క్షరితమగుదువు. నీవు పుట్టినప్పటి పూజ్యతేజమున ఆదిత్యుని పరిపూర్ణుని చేయుదువు.

32. అభిషుత సోమము సత్యరూప యజ్ఞమార్గమున మరిమరి శబ్దము చేయును. అమర, శుక్లవర్ణ సోమమా! నీవు మరింత శోభిల్లుచున్నావు. కవుల బుద్ధికి వాక్కును అందించు సోమమా! నీవు మరింత శోభిల్లుచున్నావు. కవుల బుద్ధికి వాక్కును అందించు సోమమా! నీవు మదకరుడవగుము. ఇంద్రుని కొరకు ద్రవింపుము.

33. సోమమా! నీవు దివుజుడవు. సుపర్ణుడవు దేవతల యజ్ఞమున కర్మమూలమున ధారలు కలిగింతువు. దిగువకు చూడుము. కలశమువైపు సాగుము. ధ్వనులు చేయుము. సూర్యుని కాంతిని చేర్చుకొనుము.

34. యజమానులు **"తిస్రోవాచ"** మూడు వేదములను స్తుతింతురు వారు - యజ్ఞకారక, సుదృఢ సోమపు శుభస్తుతులను ప్రోత్సహింతురు. ఆబోతు ఆవువైపు ఉరికినట్లు తమ పతిదేవునకు పాలందించుటకు ఆవులు సోమము పరుగులిడును. అభిలాషులగు స్తోతలు స్తుతించుటకు సోమము వద్దకు చేరెదరు.

35. ప్రసన్నకర గోవులు సోమమును అభిలషించును. విప్రస్తోతలు సోమమును స్తుతింతురు పృచ్ఛింతురు. పాలతో కలసి, అభిషుత సోమమును ఋత్విక్కులు పూజింతురు **"త్రిష్టుభః సంనవస్తే"** త్రిష్టుభమంత్రములు సోమమును చేరును.

36. సోమమా! పాత్రలందు పరిషిక్తుడ వగుము. శోధితుడవగుము. మాకు శుభములు కలుగునట్లు క్షరితుడవగుము. మహా ధ్వనులు చేయుచు ఇంద్రుని ఉదరమున చేరుము. స్తుతులను వర్థిల్లచేయుము. స్తవములను విస్తృతపరచుము.

37. జాగృత, సత్యస్తోత్ర జ్ఞాత, శోధిత సోమము చమసములందు ఆసీనుడగుము. పరస్పరము కలిసిఉన్న, ఎన్నో

కోరికలుగల, సుహస్తులగు పురోహితులు పవిత్రమున సోమమును స్పృశింతురు.

38. వర్షము చేరినట్లే ఇంద్రుని వద్దకు శోధితసోమము చేరును. సోమము తన మహిమచే ద్యావా పృథ్వులను పూరించును. స్వతేజమున చీకట్లను తరుమును, సోమపు ప్రియతమ ధారలు రక్షణ కలిగించును. పని చేయించుకున్నవాడు భృతి ఇచ్చినట్లు సోమమా! మాకు త్వరగా ధనమును ప్రసాదించుము.

39. సోమము దేవతల వర్ధకుడు. తాను స్వయం వర్ధకుడు. పవిత్రమున శోధితుడు. మనోరథపూరకుడు. అతడు స్వతేజమున మమ్ము రక్షించవలెను. అంగిరులు సర్వజ్ఞులు సూర్యజ్ఞాతలు. పితరులు వారు సోమపానము చేసినారు. పణులు అపహరించిన గోవు అడుగుల గుర్తులు కనుగొన్నారు. అంధకారమయ పర్వతమున సోమపు వెలుగున గోవులను చూచినారు. తెచ్చినారు.

40. సోమము మహారాజు. జలవర్ణకుడు అతడు సకల భువనముల విస్తృత జలములను తనలో దాల్చినాడు, అంతరిక్షమున ప్రజలను సృష్టించినాడు. అందరిని దాటిపోయినాడు. కామవర్షక, అభిషుత, దీప్తసోమము ఉన్నతము, మేషలోమ పవిత్రమున యధేచ్ఛగా పెరుగును.

41. పూజ్యసోమము మహాకార్యములు చేసినాడు. జలములను గర్భమున దాల్చినాడు. దేవతలను ఆశ్రయించినాడు. శోధితుడైనాడు. ఇంద్రుని కొరకు బలము సాధించినాడు. **"జనయ త్సూర్యేజ్యోతిరిన్దు."** సోమము సూర్యునిలో జ్యోతిని సృష్టించినాడు.

42. సోమమా! మాకు అన్నము, ధనము కలుగుటకు వాయువును ఉన్మత్తుని చేయుము. శోధితుడవగుము. మిత్ర వరుణులను తృప్తిపరచుము. మరుత్తుల బలమును పెంచుము. ఇంద్రాదులను ఆనందపరచుము. ద్యావా పృథ్వులను మిత్రులను చేయుము. మాకు ధనమునిమ్ము.

43. సోమము ఉపద్రవనివారకుడు. వేగవంతుడు రాక్షసహింసకుడు. హింసకుల బాధకుడు. తన రసమున పాలను కలుపు కొనును. పాత్రలందు చేరును. **"ఇంద్రస్యత్వం తవవయం సఖాయః"** నీవు ఇంద్రని మిత్రుడవు మేము నీ మిత్రులము.

44. సోమమా! మధుర భండారమును క్షరింపచేయుము. ధనవర్షక రసమును క్షరింపచేయుము. మాకు వీరపుత్రుల నిమ్ము. పూజ్య అన్నము ప్రసాదించుము. శోధితమగుము. ఇంద్రునకు రుచికరుడవగుము. మాకు అంతరిక్షమునుండి ధనము తెమ్ము.

45. అభిషుత సోమము తనధారలతో - వేగవంత అశ్వమువలె - పరుగులిడును. ప్రవహించు నది పల్లమునకువలె - కలశమునకు పారును. శోధిత సోమము వృక్షోత్పన్న కలశమున ఆసీనుడగును.

46. ఇంద్రా !నీవు సోమాభిలాషివి. ప్రాజ్ఞ, వేగశీల సోమము నీ కొరకు చమసము నందు క్షరితమగును. సోమము సర్వదర్శి రథవంతుడు బలశాలి దేవకామి యజమానుల కొరకు కల్పవృక్షమగును.

47. పూర్వకాలీనము మరియు అన్నరూప ధారలచే రాలుచు, అన్నింటి అందించు పృథ్విరూపమును ఆచ్ఛాదించుచు, శీత, ఆతప, వర్షనివారకమగు యజ్ఞగృహమును నిర్మించుచు, జలములందు నివసించుచు, స్తోత్రస్వరముల స్తోతలవలె ధ్వనించుచు సోమము యజ్ఞములకు పయనించును.

48. దేవా! నీవు అభిలషణీయుడవు రథవంతుడవు. మా యజ్ఞమునందు అభిషవ ఫలకముల మీద క్షరితుడవగుము. వసతీవరీ జలమున త్వరగా, నలువైపుల క్షరితవగుము. స్వాదిష్ట మధుర, యాజ్ఞిక, సర్వప్రేరక సోమమా! నీవు దేవతలవంటి సత్య స్తుతిమంతుడవు - **"సవితా సత్యమన్మా"**

49. స్తుతుడవగుచు వాయువు పానము కొరకు వెళ్లుము. శోధితుడవగుచు మిత్రవరుణుల పానముకొరకు వెళ్లుము. సర్వులనేతలు, వేగశాలురు, రథవాహనులు అశ్విద్వయపు పానము కొరకు వెళ్లుము. కామవర్షకుడు, వజ్రబాహువగు ఇంద్రుని పానము కొరకు వెళ్లుము.

50. స్తుత్యసోమమా! మాకు మంచిమంచి బట్టలు తెచ్చి ఇమ్ము. మధుర దుగ్ధములిచ్చు నవప్రసూత గోవులను ఇమ్ము, మమ్ము పోషించుటకు ఆహ్లాదకరమగు సువర్ణము నిమ్ము రథములాగు అశ్వములను సహితము ఇమ్ము.

51. సోమమా! పవిత్రమున శోధితుడవగుము. మాకు ద్యులోకపు సంపద లిమ్ము. భూలోకపు సంపద లిమ్ము. సంపద సాధించు శక్తినిమ్ము. నీవు ఋషిమంత్రములను, జమదగ్ని మంత్రములను స్వాదుతరము చేసినావు. అట్లే మా మంత్రములను చేయుము.

52. సోమమా! నీ యొక్క శోధితధారలచే మాకు సకల ధనములు కలిగించుము. నిన్ను భజించు యజమానుల వసతీనరీ జలమునకు వెడలుము. అందరి జ్ఞాపకుడు, వాయు వేగవంతుడగు సూర్యుడు, బహుయజ్ఞముల ఇంద్రుడు సోమము వద్దకు వెళ్లుదురు. సోమమా! నాకు కర్మనిష్ఠుడగు పుత్రుని ఇమ్ము. నీవు తృప్తిపరచిన ఇంద్ర సూర్యులు కూడ నాకు పుత్రుని ప్రసాదించవలెను.

53. సోమమా! అందరు నిన్ను ఆశ్రయించువారే! మా యజ్ఞమున తగురీతి క్షరితమగుము. ఫలములు కోరువాడు చెట్టును ఊపినట్లు శత్రుఘాతక సోమము శత్రువులను జయించుటకుగాను. మాకు అరువది వేల ధనములు ఇచ్చినాడు.

54. బాణములు కురిపించుట, పగవారి తలలు వంచుట సోమపురెండు సులభకార్యములు. అవి అశ్వ, ద్వంద్వ

యుద్ధములందు శత్రుసంహారకములు అగును. ఈ ఉభయ కర్మలచే సోమము - బీరములు పలుకు శత్రువును వధించినాడు.

సోమమా! శత్రువును దూరము చేయుము యుద్ధము లేకున్నను శత్రువును దూరము చేయుము. అగ్ని హోత్రము ఆచరించని వారిని దూరము చేయుము.

55. సోమమా! అగ్ని, వాయు, సూర్యనామముల మూడు పవిత్రముల నీకు లభించును. శోధితుడవై మేషలోమ పవిత్రమునకు చేరుదువు. నీవు భజనీయుడవు. దాతవ్య ధనదాతవు. సకల ధనికులకు ధనాధిపతివి.

56. సర్వజ్ఞ, విప్ర, సకల భువనస్వామి సోమము క్షరితమగు చున్నాడు. యజ్ఞములకు రసరేణువులనంపుచున్నాడు. మేషలోమ పవిత్రమునకు ఇరుదిశలనుంచి చేరుచున్నాడు.

57. పూజ్యులు, అహింసితులగుదేవతలు సోమమును ఆస్వాదింతురు. సోమము ఆస్వాదించిన దేవతలు ధ్వనులు చేయుదురు.ధనాభిలాషులగు స్తోతలు మంత్రములు ఉచ్చరింతురు. అట్లే కర్మ కుశలురగు పురోహితులు తమ పది అంగుళులతో సోమమును ప్రేరేపింతురు సోమమును జలమున కలుపుదురు.

58. నీవు పవిత్రమున సంశోధితుడవు. నీ సాయమున మేము యుద్ధములందు అనేక ఘన కార్యములు చేయవలెను. మిత్ర, వరుణ, అదితి, సింధు మ్ పృథ్వి, ద్యులోకము మాకు ధనములిచ్చి సమ్మానింప వలెను.

## తొంబది ఎనిమిదివ సూక్తము

ఋషి - వృషసిరి రాజపుత్రుడు అంబరీషుడు - భరద్వాజ పుత్రుడు ఋజాశ్వుడు.
దేవత - పవమాన సోమము. ఛందస్సు - అనుష్టుప్ - 11 బృహస్పతి.

1. సోమమా! అందరుమెచ్చువాడు, అనేక పోషణలవాడు, యశోవంతుడు, మహామహులను జయించువాడు, మహాబల సంపన్నుడగు పుత్రుని మాకు ప్రసాదించుము.

2. రథమునెక్కు యోధుడు కవచము ధరించుము. అట్లే బాధారహిత సోమము మేషలోమ పవిత్రమున క్షరితుడగును. స్తుతించబడు సోమము చెక్క కలశమునకు చేరును. ధారగా క్షరితమగును.

3. బాధలు ఎరుగని సోమము తమమత్తు కొరకని దేవతలచే ప్రోత్సహించ బడును మేషలోమ పవిత్రమున క్షరితుడగును. దీప్తవంత సోమము అంతరిక్షమునకు వెల్లును. అట్లే అందరు కోరుకొను సోమము దుగ్ధాదులను కోరుచు ధారారూపమున సాగును.

4. సోమమా! నీవు అనేక మందినరులకు, అనేకమంది హవిర్దాతలగు యజమానులకు ధనములు కలుగ చేసెదవు. మాకు అనేక పుత్రపౌత్రయుక్త బహుసంఖ్యాక ధనములిమ్ము.

5. శత్రుఘాతక సోమమా! మేము మీవారలము కావలెను. అనేకులు అభిలషించునదియు. నీవు ఇచ్చునదియు అగుధనములకు మేము సమీపవర్తులము కావలెను. మేము సుఖములకు అత్యంత సమీపవర్తులము కావలెను.

6. సోమము శిలలచే అభిషుతము. ఇంద్రప్రియము. అందరు అభిలషించునది. ధారావంతము. యశస్వి అట్టి సోమమును పనులు చేయుటకు కదలునట్టి, భగినీ స్వరూప అంగుళులు వసతీ వరి ద్వారా సేవించును. యజమానులు శోధింతురు.

7. అందరు కోరునట్టి సోమరసమున సేవించండి. సోమపు రక్షణలు పొందండి సోమము -సూర్యునివలె అందరి అభిలషణీయుడు. అతడు స్తోతలకు ప్రచుర అన్నము అందించును.

8. మీరు బలసాధకమగు సోమరసమును సేవించండి. సోమపు రక్షణలు పొందండి. సోమము - సూర్యునివలె - అందరి అభిలషణీయుడు. అతడు స్తోతలకు ప్రచుర అన్నము అందించును.

9. మనువునందు ద్యోతమాన ద్యావాపృథ్వులారా! పర్వతవాసి సోమము యజ్ఞమున మీ ఉభయులను సృష్టించినాడు. ఉచ్చస్వరముల యజ్ఞమున ఋత్విక్కులు సోమమును అభిషవించినారు.

10. సోమమా! ఇంద్రుడు వృత్రఘ్నుడు. అతని పానము కొరకు నిన్ను పాత్రలందు నింపుదురు. ఋత్విక్కులకు దక్షిణలు, దేవతలకు హవిస్సులు అర్పించగోరి యజ్ఞగృహమున ఉన్న యజమానికి ఫలప్రదానము చేయవలెనని నిన్ను పూజింతురు.

11. నిత్యము ప్రాతఃకాలమున ప్రాచీన సోమము పవిత్రమున క్షరితమగును. మూర్ఖులగు హరిశ్చిత నామక దస్యులు ప్రాతఃకాల సోమమును చూచినారు. నీరైనారు మాయమైనారు.

12. మిత్రులారా ! ప్రాజ్ఞులగుమీరు. మేము శోభితము బలకరము, సుగంధయుక్తమగు సోమమును సేవింతుము. మనము బలిష్ఠసోమమును ఆశ్రయింతము.

## తొంబది తొమ్మిదవ సూక్తము

ఋషి - కాశ్యగోత్ర సుతులు ఇద్దరు. దేవత - పవమాన సోమము.

ఛందస్సు - అనుష్టుప్ - మొదటిది బృహతి.

1.సోమము అందరు కోరువాడు. శత్రువుల రాపెట్టువాడు. అతని కొరకు పౌరుషవంతులు ధనుస్సునకు నారి ఎక్కింతురు. పూజారులగు ఋత్విక్కులు దేవతలముందు - బలశాలియగు సోమము కొరకు - తెల్లని దశాపవిత్రము పరుస్తారు.

2. రేయిగడచును సోమము జలకములాడును. అన్నమువైపు సాగును. యజమాని పనులు చేయు అంగుళులు హరితళులు హరితవర్ణ సోమమును పాత్రలకు పంపును. అప్పుడు సోమము సవనముకు పయనమగును.

3. ఇంద్రుడు పానముచేయు సరమున్ననే - ఆ సోమమును మేము సుశోభితము చేయుదుము ! గమనశీల స్తోతలు పూర్వమును, ఇప్పుడును సోమరసపానము చేయుదురు.

4. అట్టి శోధిత సోమపు ప్రాచీన గాధలను స్తోతలు స్తుతులచే గానము చేయుదురు. అటునిటు కదలు అంగుళులు దేవతలకు సోమరూప హవిని ఇవ్వగలవు.

5.యజమానులు సోమమును జలమున తడుపుదురు. మేషలోమ పవిత్రమున శోభిల్ల చేయుదురు. దూతవంటి సోమమును దేవతలకు విన్నవించుమని ప్రార్థింతురు.

6. అత్యంత మాదక సోమము శోధితమగును. చమసములందు ఆసీనుడగును. ఆబోతు గోవులకు రేతస్సు అందించును. సోమము చమసములకు రసము అందించును. సోమము అభిషుతుడు అగువాడు. కర్మములకు స్వామి.

7. సోమము దేవతల కొరకు అభిషుతము. ప్రకాశమానము, ఋత్విక్కులు సోమమును శోధింతురు. సోమమును ప్రజలు ధనదాతగా గుర్తించినారు. అప్పుడు సోమము జలమున స్నానము చేసినాడు. (తానమాడుచు జనులకు ధనమిచ్చునని.)

8. సోమమా! అభిషుతమగుదువు. సర్వత్ర విస్తరింతువు. ఋత్విక్కులచే పవిత్రమునకు తేబడుదువు. నీవు అత్యంత మాదకుడవు. ఇంద్రుని చమసములందు చేరుదువు.

### నూరవ సూక్తము

ఋషులు. దేవత పూర్వమువలె. ఛందస్సు అనుష్టుప్.

1. గోవు ప్రథమ ఆయువున పుట్టిన గోవును నాకును. అట్లే ద్రోహము ఎరుగని జలము - ఇంద్రునకు ప్రియమై, అందరు కోరునట్టి - సోమమును చేరును.

2. దీప్యసోమమా! శోధితుడవగుము రెండు లోకములందు వర్ధిల్లు ధనమును మాకు అందించుము. నీవు యజమానిఇంట వసింతువు. అతని సకల ధనమును రక్షింతువు.

3. సోమమా! మేఘము వర్షము కురిపించునట్లు మనోవేగముగల నీ ధారలను కురింపించుము. నీవు పార్థివ, ద్యులోక ధనములను ఇచ్చువాడవు.

4. శత్రువును జయించు శూరుని అశ్వము యుద్ధమునకు పరుగులిడును. అట్లే సోమపు భజనీయ, వేగవంత ధారలు మేషలోమ పవిత్రము మీదికి పరుగులిడును.

5. క్రాంత దర్శిసోమమా! నీవు ఇంద్ర, మిత్ర, వరుణుల కొరకు అభిషుతడవగుదువు. మాకు జ్ఞానము , బలము కలుగుటకు ధారగా ప్రవహింపుము.

6. సోమమా! నీవు అత్యంత అన్నదాతావు. అభిషుతుడవు ధారగా పవిత్రమున పడుము. ఇంద్ర, విష్ణ, అన్య దేవతలకు మధురమవమగుమా.

7. సోమమా! ఆవు దూడను నాకినట్లు - హవిర్ధారక యజ్ఞమున - ద్రోహశూన్య మాతృ స్వరూపజలము. హరిత వర్ణుడవగు నిన్ను నాకును.

8. అంతరిక్షము మహంతము. శ్రవరేయము. సోమమా! నీవు వివిధ కిరణసహితుడవై అంతరిక్షమునకేగుదువు. నీవు వేగ వంతుడవు. హవిర్దాత యజమాని గృహమున ఉందువు. సమస్త అంధకారములను తుడిచివేతువు.

9. మహాకర్మవంత సోమమా! నీవు ద్యావాపృథ్వులను భరింతువు - పోషింతువు. క్షరణశీల సోమము ! మహిమాన్వితుడవై నీవు కవచమును ధరింతువు.

*(శ్రీమదాంధ్ర వచన సంహిత తొమ్మిదవ మండలము ఏడవ అంకము నాలుగవ అధ్యాయము సమాప్తము)*

***ఓం నతామినన్తి మాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమా ధ్రువాణి***
***నరోదసే అద్రుహా వేద్యాభిర్న పర్వతాని నమేత స్థివాంసః***

**అయుదవ అధ్యాయము　　నూట ఒకటవ సూక్తము**

ఋషి - వేరు వేరు. దేవత - పవమాన సోమము. ఛందస్సు -
అనుష్టుప్ - 2, 3, గాయత్రి

**ఓం పురోజితీవో అన్ధసః సుతాయ మాదయిత్నవే**
**అపశ్వానం శ్నథిష్టన సఖాయో దీర్ఘజిహ్వ్యమ్**

1.మిత్రులారా! ఎదుట ఆరగించదగిన అన్నరూప సోమము ఉన్నది. అది అభిషుతము. అత్యంతమాదక రసముగలది. పొడుగు నాలుక కుక్కను ఆవలికి పంపించండి అదిముట్టగలదు.

2. సోమము అభిషుతము కర్మనిష్ఠము, వడిగల గుఱ్ఱమువలె - సోమము నలువైపుల వ్యాపించును.

3. సోమము దుర్ధర్షము. భజనీయము ఋత్విక్కులు సమస్త కోరికలు తీర్చుకొనుటకు సోమమును అభిషవింతురు.

4. సోమము అత్యంతమధురము మాదకము అభిషుత సోమము పవిత్రమున నిలుచును. ఇంద్రుని కొరకు పాత్రలందు ద్రవించును. సోమమా! నీ మాదక రసము ఇంద్రుని చేరవలెను.

5. సోమము ఇంద్రుని కొరకు క్షరితమగును. ఇతి దేవసో అబ్రువన్ ఇది దేవతలన్నమాట. సోమము స్తోత్రపాలకుడు. శబ్దకారి. స్వబలమున లోకముల ప్రభువైనాడు. సోమము అతిధుల పూజలను అశించును.

6. సోమము బహుధారలుగ ద్రవించును. సోమమునుండి మధుర రసము ప్రవహించును. సోమము స్తుతిప్రేరకుడు ధనస్వామి. ఇంద్రునకు మిత్రుడు.

7. సోమము పోషకుడు భాజనీయుడు ధనకారకుడు సకల ప్రాణులకు స్వామి. సోమము శోధితుడై రాలును. తన తేజమున ద్యావా పృథ్వులను వెలిగించును.

8. సోమపు బలము కొరకు ప్రియగోవులు శబ్దము చేయును శోధిత సామము రక్షణ కొరకు దారులు పరచుచున్నాడు.

9. సోమమా! నీలోని రసము ఓజస్వి. చమత్కారి దానిని వ్యాపింప చేయుము. అది పంచజనుల వద్దకు చేరును. దానివలన మాకు ధనము లభించవలెను.

10. పథిప్రదర్శక, దేవమిత్ర, అభిషుత, పాపశూన్య, దీప్త శోభన ధ్యాన, సర్వజ్ఞ సోమము మా కొరకు విచ్చేయుచున్నాడు.

11. సోమము గోచర్మ ఉత్పన్నుడు, శిలలందు అభిషుతుడు. ధనసాధకుడు. అతడు నలుదిశల నినదించును.

12. పవిత్ర శోధిత, విప్ర, దధిమిశ్రిత, జలక్రీడ, స్థిరుడగుసోమము సూర్యునివలె పాత్రలందు దర్శనీయడు.

13. అభిషుత, పానయోగ్య సోమపు ప్రసిద్ధ గర్జన కర్మవిఘ్నకారి శునకమును ధ్వంసము చేయవలెను ప్రాచీన కాలమున భృగువులు మఖదామకును వధించినారు. స్తోతలారా! మీరును అట్లే వినయశూన్య శునకుమును వధించండి.

14. తల్లిదండ్రుల బాహువులందు బిడ్డవాలినట్లు దేవమిత్ర సోమము పవిత్రమున వాలును. జారుడు జారిణిని వెదుకుచు పోయినట్లు - సోమము స్వస్థానమగు కలశమునకు పోవును.

15. సోమము బలసాధకుడు శక్తిమంతుడు, అతడు స్వతేజమున ద్యావా పృథ్వులను ఆచ్ఛాదించును. నిర్మాతయగు యజమాని తన గృహమున ప్రవేశించినట్లు - హరిత వర్ణసోమము కలశమున బుద్ధిగా ప్రవేశించును.

16. సోమము మేషలోమ పవిత్రమునుండి కలశమున చేరును. గోచర్మపుపై శబ్దించు కామవర్షక, రిత వర్ణ సోమము ఇంద్రుని కొరకు అలంకరించిన స్థానమునకు చేరును.

## నూట రెండవ సూక్తము.

ఋషి - ఆప్తత్రితుడు. దేవత - పవమాన సోమము. ఛందస్సు - ఉష్టిక్

1. సోమము యజ్ఞకర్త. పూజనీయుడు జలపుత్రుడు. అతడు యజ్ఞధారక రసమును కల్పించును. సమస్త ప్రియహమిని వ్యాప్తము చేయును. సోమము ద్యావాపృథ్వులందు వసించును.

2. మాయజ్ఞమందు, హవిర్ధానమున నిలిపిన రాతివంటి గట్టి అభిశవ ఫలకముల మీదికి సోమము చేరినాడు. ఋత్విక్కులు యజ్ఞధారకములగు గాయత్రి మున్నగు ఏడు ఛందస్సులతో సోమమును స్తుతింతురు.

3. సోమమా! మా యజ్ఞపు మూడు సవనములందు ప్రవహించుము. విచ్చేయునపుడు ఇంద్రుని వెంటతెమ్ము. వర్ధమాన స్తోతలు ఇంద్రుని స్తుతిస్తారు.

4. సోమము ప్రాదుర్భూతమా. కర్మధారకము. అట్టి సోమమును మాతృరూప సప్తనదులు లేక సప్త ఛందస్సులు - యజమానులకు సంపదలు కలిగించుటకు స్తుతించును. **"అయంధ్రువో రయాణాం చికేతమత్."** అతడు ధనజ్ఞాతయగుట యదార్థము.

5. ద్రోహరహితులగు సమస్తదేవతలు సోమపు కార్యములందు కలిసిపోవుదురు. అభిలాషులు అగుదురు. అభిషుత

సోమమును సేవింతురు.

6. వసతీవరీజలము యజ్ఞవర్ధకము. ఆజలము తన గర్భరూపమగు సోమమును యజ్ఞమందు దర్శనార్థము సృష్టించునాడు. సోమము సర్వశుభప్రదాత. క్రాంత ప్రజ్ఞుడు. పూజ్యుడు. అందరకు అభిలషణీయుడు.

7. ద్యావాపృథ్వులు పరస్పరసంగతములు. గొప్పవి. సత్య యజ్ఞపు మాతృరూపలు సోమము స్వయముగా వాని వద్దకేగును. యాజ్ఞిక పురోహితులు సొమమును జలమున కలుపుదురు.

8. సోమము - జ్ఞానము, దీప్తింద్రియములు, స్వతేజమున ద్యులోకపు అంధకారమును అంతము చేయును. సోమమా! హింసాశూన్య యజ్ఞమున నీ యొక్క సత్యరూపరసమున పెంపొందించుము.

## నూటమూడవ సూక్తము

ఋషి - ఆప్తధ్వితుడు. దేవత - పవమాన సోమము. ఛందస్సు - ఉష్టక్.

1. సోమము పవిత్రము శోధితము. కర్మవిధాత. స్తోతలకు ప్రసన్నదాయకుడు. ద్వితా! భృతి పొందు సేవకునివలె నీవు సోమమును ఉద్యతి వచనముల స్తుతించుము.

2. ఆవుపాలలో కలసిన సోమము మేషలోమ పవిత్రమునకు చేరును. హరితవర్ణసోమము శుద్ధియై 1. ద్రోణకలశము 2. ఆధవనీయము 3. పూతభూతమను మూడు తావరములను ఏర్పరచును.

3. సోమము మేషలోమ పవిత్రమునుండి మధురరసము కలిగించు ద్రోణ కలశమునకు తనరసమును పంపుము. ఋషుల సప్త ఛందములు సోమమును నుతించును.

4. సోమము స్తుతుల నాయకుడు. అందరకు దేవత. హరిత వర్ణుడు. శోధిత సోమము అభిషవ ఫలకములపై ఆసీనుడగును. అభిషవమైనంత ఇంద్రాది సమస్త దేవతలు సోమము వద్ద చేరుదురు.

5. సోమమా! నీవు ఇంద్రసమ రథమును అధిరోహింపుము. దేవసేనను చేరుము. ఋషులు శుద్ధి చేసిన అమర సొమము స్తోతలకు ధనాదులు ఇచ్చును.

6. అశ్వమువలె యుద్ధాభిలాష, దీప్యనవాన, దేవతల కొరకు అభిషుత, పాత్రలందుచేరిన, పవిత్రమున శుద్ధిచేసిన సోమము నలువైపుల పరగులిడును.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ అష్టకము తొమ్మిదవ మండలము ఆరవ అనువాకము సమాప్తము.)*

**ఏడవ అనువాకము        నూటనాలుగవ సూక్తము**

ఋషి - కాణ్వ పర్వత, నారదులను ఇదిదరు. లేదా కశ్యప పుత్రికలు శిఖండినులను ఇద్దరు... దేవత - పవమాన సోమము. ఛందస్సు - ఉష్టిక్

1.మిత్రులగు పురోహితులారా! కూర్చొండి పరిశుద్ధ సోమపు పాటలు పాడండి. అభిషుత సోమనకు యజ్ఞపుహవి మున్నగునవి మసర్దించండి. పిల్లలను తల్లిదండ్రులు నగలతో అలంకరించినట్లు - సోమమునకు శోభకూర్చుటకు అలంకరించండి.

2.సోమము  గృహసాధకుడు. దేవతల రక్షకుడు మదకారకుడు ఎంతో బలవంతుడు ఋత్విక్కులారా! సోమము మాతృరూప జలమున - దూడను ఆవుతో కలిపినట్లు కలపండి.

3. బలసాధక సోమమును పవిత్రమున శుద్ధిచేయండి వేగసోమము దేవతలకు పానీయమగును. మిత్ర వరుణులకు సోమము పావమై ఎంతో సుఖము కలిగించును.

4. సోమమా ! మాకు దానము లిప్పించుటకు ధనదాత మా వచనములచే నిన్ను స్తుతించును. మేము నీ యొక్క రసమును వరింతుము. దానిని ఆవుపాలతో కలుపుదుము.

5. మత్తులకు స్వామి సోమమా! నీ రూపము వెలుగులు చిమ్మును. **"పభౌవ సభ్యేగాతువిత్త మోవ"** - మిత్రుడు మిత్రునకు వలె మాకు చక్కని మార్గము చూపుము.

6. సోమమా ! మాతో ప్రాచీనస్నేహము చేయుము. ఉద్దండుడు, లోనబయట మాయలున్నవాడు, పొట్ట పెరిగిన వాడగు రాక్షసుని వధింపుము. మా పాపములను నష్టపరచుము.

**నూట అయిదవ సూక్తము**

ఋషి - పర్వత, నారదులు. దేవత - పవమాన సొమము. ఛందస్సు - ఉష్టిక్

1. మిత్రులగు పురోహితులారా! దేవతలకు మత్తు కలిగించుటకు సోమమును స్తుతించండి. శిశువును అలంకరించినట్లు -గోదుగ్ధము, స్తుతులు మున్నగువానితో సోమమును అలంకరించండి.

2. సోమము సేనారక్షకుడు మాదకుడు స్తుతులచే అలంకృతుడు ప్రోత్సాహితుడు ఆవును దూడతో లిపినట్లు - సోమమును నీటితో కలుపుదురు.

3. సోమము బలసాధకుడు, వేగవంతుడు దేవతల అనుభవమునకు అభిషుతడగువాడు. సోమము అత్యంత మధురము.

4. సుబలశాలి సోమమా! అభిషుతుడవగుము. మాకు యజ్ఞసాధక ధనమును, అశ్వ గోయుక్త ధనమును ప్రసాదించుము.... నేను సోమరసమును పాలతో కలుపుతాను.

5. హరితవర్ణ, పశుస్వామివగు మాసోమమా! నీవు అత్యంత దీప్తరూపుడవు. ఋత్విక్కులచే నియుక్తడవు. మాకు దీప్త కిరణవ్ తుడవగుము - వెలుగులనిమ్ము.

6. సోమమా! మాతో ప్రాచీన స్నేహము చేయుము. దేవ శూన్యులు, పొట్టలుగల రాక్షసులను మానుండి దూరము చేయుము. శత్రువులను ఓడించుము. బధాకలును బాదుము. లోన, బయటమాయలున్న రాక్షసులను మానుంచి దూరముంచుము.

## నూట ఆరవ సూక్తము

ఋషి - వేరువేరు. దేవత - పవమాన సోమము. ఛందస్సు - ఉష్ణిక్.

1.శీఘ్రజ్ఞాత, ద్రవణశీల, సర్వజ్ఞ, హరితవర్ణ, అభిషుత కామ వర్షక సోమము ఇంద్రుని వద్దకు చేరవలెను.

2. సంగ్రామము కొరకు ఆశ్రయనీయుడు, క్షరణశీల అభిషుత సోమము ఇంద్రుని కొరకు ద్రవించుచు ఇంద్రుడు లోకములను ఎరుగును. సోమము ఇంద్రుని ఎరుగును.

3. సోమము పుట్టినంత ఇంద్రుడు పూజనీయ, గ్రహణీయ ధనుస్సు పట్టును. అంతరిక్షమున ఇంద్రుడు **"అహి,నా** మముంచినాడు వర్షము **కలిగించినాడు.** వజ్రము **పట్టినాడు."**

4. సోమమా! నీవు అప్రమత్తుడవు ఇంద్రుని కొరకు పాత్రలందు నీరగుము. దీప్తయుక్త సర్వజ్ఞ శత్రునాశక బలముతో విజయము చేయుము.

5. సోమమా! నీవు ఎల్లరకు దర్శనీయుడవు. బహుమార్గవి యజమాను సన్మార్గకర్తవు. సర్వ ద్రష్టవు ఇంద్రుని కొరకు వర్షక మాదక రసమును కలిగించుము.

6. సోమమా! నీవు మార్గదర్శివి. దేవతలకు మధురిమవు శబ్దించువాడవు. అనేక మార్గముల నుండి కలశమున ప్రవేశించుము.

7.సోమమా ! దేవతలు సేవించుటకు బలవర్ధక ధారలతో కరిగి ఇంద్రాది దేవతలు సుఖకర సోమమును సేవింతురు.

8. సోమరసము ఇంద్రుని వర్థిల్ల చేయును. అమరత్వమునకు గాను ఇంద్రాది దేవతలు సుఖకర సోమమును సేవింతురు.

9. అభిషవించబడు సోమమా! భూమి మీద జలవర్షము కలిగించు సోమమా! వృష్టియుక్త ద్యులోక వంతసోమమా! మా కొరకు ధనము కొనితెమ్ము.

10. పవిత్ర, స్తోత్రపు మొదట శబ్దించు, శుద్ధించబడిన సోమమా! ధారలుగా మేషలోమ పవిత్రమున ప్రవేశింపుము.

11. సోమము బలశాలి. జలక్రీడి, పవిత్రమును దాతువాడు. స్తోతలు అట్టిసోమమును స్తుతులతో వర్థిల్లచేయుదురు. మూడు సవనముల వారును సోమమును స్తుతింతురు.

12. అశ్వమును యుద్ధమునకు సాగనంపుదురు. అన్నభిలాషి సోమమును కలశమునకు పంపుదురు. శుద్ధించిన సోమము ధ్వని చేయుచు పాత్రలలో పడును.

13. శ్లాఘనీయ, హరిత వర్ణసోమము సాధుమార్గమున కుటల పవిత్రమును దాటును. సోమము స్తోతలకు వీరులగు పుత్రులను ఇచ్చుచున్నాడు.

(సాధు మార్గము చక్కనిది. కుటిల పవిత్రము వంకరిది)

14. సోమమా! దేవాభిలాషివగుము. ధారలుగా ప్రవహింపుము. నీ మాదక ధారలు సిద్ధమగును. శబ్దించు సోమము పవిత్రమునకు నలువైపులనుంచి చేరును.

## నూట ఏడవ సూక్తము

ఋషి - భరద్వాజ కాశ్యపాది సప్తర్షులు. దేవత - పవమాన సోమము.
ఛందస్సు - వేరు వేరు.

1. సోమము దేవతలకు ఉత్తమ హవిస్సు. మానవుల హితైషి. అంతరిక్షజ్ఞాత. అట్టి సోమమును పురోహితులు అభిషవింతురు. ఋత్విక్కులారా! కర్మ తరువాత సోమమును జలములందుంచండి.

2. సోమమా! నీవు అహింసనీయుడవు సుగంధివి శోధితుడవు. మేషలోమ పవిత్రమున ప్రవహించుము. అభిషవమైనంత నీలో పాలు, సత్తు కలుపుదుము. జలములందున్న నిన్ను భజింతుము.

3. అభిషుత, దేవతర్పక, కర్త, పాత్రలందు ద్రవించు. సర్వద్రష్ట సోమము అందరకు దర్శన మిచ్చుటకు ప్రవహించును.

4. సోమమా! శుద్ధుడవగుము. వసతీవరి జలముమున కలియుము. ధారగా పడుము. నీవు రత్నదాతవు. సత్యయజ్ఞస్థానమున ఆసీనమగుదువు. స్పందనశీలివి హిరణ్మయుడవు.

5. సోమము మాదకుడు. ప్రసన్నకర్త, దివ్యగోస్తనమును పిదుకువాడు. అతడు ప్రాచీన స్థానమగు అంతరిక్షమున వసించును. కర్మనిష్ఠులగు ఋత్విక్కులు సోమమును గ్రహింతురు. శుద్ధిచేయుదురు సర్వద్రష్ట సోమము పరగు పరుగున - యజ్ఞకర్త యజమానికి అన్నము అందించుటకు సాగును.

6. సోమమా నీవు జాగృతుడవు. ప్రియుడవు పరిశుద్ధుడవు మేషలోమ పవిత్రమున ప్రవహించు వాడవు. విప్రుడవు పితరులనేతవు. మా యజ్ఞమును నీ మధుర రసమున నింపుము.

7. సోమమా! నీవు మార్గదర్శివి. విప్రుడవు సూక్ష్మగ్రాహివి. క్రాంత ప్రజ్ఞుడవు. దేవకామివి. సోమము స్రవించును. ద్యులోకమున సూర్యుని వెల్లడించును.

8. ఋత్విక్కులచే అభిషుత సోమము ఉచ్చ, మేషలోమ పవిత్రమునకు సాగును. హరితవర్ణ, మాదక ధారలచే ద్రోణ కలశమున చేరును.

9. తానుసేవించు దుగ్ధాదులతో కలసిన సోమము దిగువ నున్న కలశమునకు పారును. నీరు సంద్రానకు సాగినట్లు - సంభజనీయ, రసవంత సోమము ద్రోణకలశమునకు సాగును. సోమమును మత్తు - కలిగించుటకు అభిషవింతురు.

10. సోమమా! నీవు రాళ్లచే అభిషుతమగుదువు. **"మేషలోమ"** పవిత్రమును అవలోకించి ద్రవింతువు. అభిషవణ ఫలకము మీద ఉన్న కలశమున - జనులు నరగమున స్థిరపడినట్లు - సోమము స్థిరపడును. చెక్క పాత్రలో స్థానము ఏర్పరచు కొనును.

11. అన్నభిలాషి సోమము సూక్ష్మ మేశాలోమ పవిత్రమును అవలోకించి ద్రవించును. పురోహితులు శద్ధిచేసినదియు, ఆమోద యోగ్యమగునదియు, పురోహితులచే శుద్ధిచేయబడినదియు, విప్రులచే అభిషుతమైన, హరిత వర్ణ సోమమును - యుద్ధమున కంపు అశ్విమునువలె - ఆలంకరింతురు.

12. సోమమా! జలములు సముద్రమునువలె - దేవతల పానము కొరకు నీవు జలములచే పూరించ బడుదువు. మాదక జాగృతుడవగు నీవు తీవల రసయుక్తుడువై మధుశ్చుత కలశమున ప్రవేశింతువు.

13. స్పృహణీయుడు, ప్రసన్నకారకుడు, పుత్రునివలె శుభ్రము చేయదగిన సోమము కృష్ణవర్ణ పవిత్రమును ఆవరించుము. వేగావంతుడగు నరుడు రథమును యుద్ధమునకు పంపినట్లు - పది అంగుళులు సోమమును జలమునకు పంపును.

14. గమనశీల సోమము తన మాదక రసమును నలువైపుల ప్రవహింప చేయును. విద్వాంసుడు, మాదకుడు, అందరు అందుకొన దగిన సోమము అంతరిక్షంలో అత్యున్నత పవిత్రమున ప్రవహించును.

15. శోధిత, దివ్య, సత్యసామ్రాట్టు సోమము కలశమున ధారగా పడుచు. ప్రేరిత, మహాసత్య సోమము మిత్రావరుణులను రక్షించుటకు తరలు చున్నాడు!

16. కర్మనిష్ఠులు ఏర్పరచిన, స్పృహణీయ, సూక్ష్మదర్శక, దివ్య అంతరిక్ష ఉత్పన్న సోమసామ్రాట్టు ఇంద్రుని కొరకు ద్రవించును.

17. సోమమా! నీ స్నేహమున నేను నిత్యము. ఆనంద జీవితము గడుపు చున్నాను. నీ మిత్రుడనగు నన్ను అనేకమంది రాక్షసులు హింసించు చున్నారు. వారిని వధించుము.

18. పింగళసోమమా! నీ మైత్రి కొరకు నేను రాత్రింబవళ్లు తపించు చున్నాను. ఉజ్వలుడవు, పరమస్థానము నందున్న సూర్యుని వంటి నిన్ను చేరుకొనుటకు ప్రయత్నించు చున్నాము. పక్షి సూర్యుని చేరుటకు వలె నేను నిన్ను చేరుటకు తపించుచున్నాను.

19. శుభంకర అంగుళుల సోమమా శుద్ధిచేయదగిన నీవు కలశమును శబ్దమునంపుదువు. పవమనా సోమమా! నీవు స్తోతలకు పింగళవర్ణ, బహుజన అర్థిత ధనమునిమ్ము.

20. సోమమా! నీవు వర్షకుడవు. జలములందు ఆలంకృతుడవు. మేషలోమ పవిత్రమున శుద్ధిచేయబడిన వాడవు. కలశమున ధ్వనులు చేయుదువు. పాలలో కలసిన నీవు అలంకరించబడిన స్థానమునకు చేరుదువు.

21. సోమమా! సకల స్తోత్రములు లక్ష్యముగా అన్నలాభము కొరకు ద్రవించుము. నీవు దేవతలకు మత్తు కలిగించువాడవు దేవతలందు ముఖ్యుడవు కలశరూపము దాల్చుము.

22. సోమమా! మర్త్యలోక, దివ్యలోకములందలి సమస్త ద్రవపదార్థములతో ద్రవించుము. సూక్ష్మ దృష్టిగల

సోమమా ! నీవు శ్వేద వర్ణుడవు విప్రులు స్తుతులు, అంగుళులతో నిన్ను అర్చింతురు.

23. శోదిత, మరుద్యుక్త, గమనశీల, మాదక, ఇంద్రసేవిత, సోమమును స్తుతి, అన్నము కొరకు ధాదారూపమున పవిత్రమున కల్పింతురు.

24. జలములోకలిసి, అభిషవకర్తలచే పంపబడి సోమము కలశమున ప్రవేశించును. సోమము దీప్తిని ప్రకాశింప చేయును. క్షీరాదుల రూపము దాల్చుము. ప్రస్తుతము స్తుతులు కోరుచున్నాడు **"మన్దనా అవీవిశత్."**

**నూట ఎనిమిదవ సూక్తము**

ఋషి - వేరు వేరు. దేవత - పవమాన సోమము. ఛందస్సు -
కకుభ బృహతి - గాయత్రి.

1. సోమమా! నీవు పుత్రదాతవు మహానుడవు. దీప్తుడవు అత్యంత మధిరమవగుము. మాదకుడ వగుము. ఇంద్రుని కొరకు ద్రవింపుము.

2. ఇంద్రుడు కోరకల్ని తీర్చువాడు. అతడు నిన్ను పానము చేయును. వృషభమువలె ప్రవర్తించును - "వృషాయతే" సోమమా! నీవు సర్వద్రష్టవు. నిన్ను పానము చేసి ఇంద్రుడు జ్ఞానిఅగును. యుద్ధములోకి గుఱ్ఱము చొచ్చినట్లు - శత్రువుల అన్నమును ఆక్రమించును.

3. సోమమా! ఎంతో దీప్తమంతులగు దేవతలను  అమరులను చేయుటకుగాను శబ్దము చేయును.

4. అంగిరలు అభినవ మార్గమున యజ్ఞానుష్ఠానము చేసినవారు. వారు సోమము వలననే పణులు అపహరించిన గోవుల ద్వారములు తెరచినారు. సోమము వలననే విప్రులు అపహృత గోవులను విడిపించినారు. ఇంద్రాది దేవతల కొరకు  చేపట్టిన  యజ్ఞములందు సోమము వలననే  యజమానులు అమృతమయ అన్నమును పొందినారు. ఆ సోమమే దేవతలను అమరులను చేయుటకు నినదించును.

5. మాదకతమ జలసంఘాత సమమగు సోమము జలక్రీడలాడును. అభిషుతమగును. మేషలోమ పవిత్ము నుండి ధారగా కలశమున పారును.

6. సోమము గమనశీల మేఘములోనికి దూరి బలవంతముగా వర్షము కలిగించినాడు. ఆ సోమమే అశ్వములను, గోవులను వ్యాపింప చేసినాడు. శత్రుహంత సోమమా! కవచధారి శూరునివలె అసురులను హతమార్చుము.

7. సోమము అశ్వమువలె వేగవంతము. స్తుత్యము, అంతరిక్ష జలప్రేరకము. తేజోప్రేగకము. జలవర్షకము.

ఋత్విక్కులారా! సోమమును జలకములాడించండి అభిషవించండి.

8. జలములందు ఉత్పన్నము, మహారాజు, దివ్యుడు, స్తుత్యుడు, మహానుడగు సోమము జలములందు ఎదుగును. అనేక దారలుగల, కామవర్షక, జలవర్ధక, ప్రియ సోమమును అభిషవించండి.

9. అన్నపతి, స్తుత్య సోమమా! దేవాభిలాషివగు నీవు మాకు దివ్యమును. విశేషమును అగు అన్నము ప్రదానము చేయుము. అంతరిక్షమందలి మేఘమును భేదించుము. వర్షము కలిగించుము.

10. సజల సోమమా! అభిషుత ఫలకరములమీద అభిషుతమగుము. మహారాజువలె సమస్త ప్రజను పాలింపుము. విచ్చేయుము. ద్యులోకమునుండి జలమునంపుము. గవాభిలాషి యజమాని కోరికలు తీర్చుము.

11. సోమము మాదకము బహుధారావంతు. కామవర్షికము సకల కారకము దేవాభిలాషి ఋత్విక్కుల సోమమును దుహింతురు.

12. శబ్దము కలిగించు, అంధకారమును దూరము చేయునట్టి. కామవర్షిక, అమర, సోమమును. జ్ఞానము తెలిసికొనును. విప్రులు సోమమును కలుపుదురు. స్తుతింతురు. మూడు సవనముల యజ్ఞిక కర్మలు సోమము వలెనే పూర్తిఅగును.

13. సోమము ధనములు, గోవులు, అన్నములు, మునుష్యులుగల ఇండ్లు ప్రసాదించువాడు. సోమము ఋత్విక్కులచే అభిషుతమగును.

14. ఇంద్ర, మాదుత, అర్యము భగులు పానము చేయునదియు, మిత్ర, వరుణ, ఇంద్రులను అభిషము చేయు సోమము అభిషవించ బడును.

15. సోమమా! నీవు ఋత్విక్కులచే నియతుడవై, ఆయుధయుక్తుడవై, అత్యంత మధురమవై, మాదకమవై ఇంద్రుని కొరకు ప్రవహింపుము.

16. సోమమా! నీవు మిత్ర, వరుణ, వాయు సేవితుడవు. ద్యులోక స్తంభమవు. స్వట్టముడవు. నదులు సముద్రనందు వలె ఇంద్రుని హృదయకలశమున ఆసీనుడవగుము.

**నూట తొమ్మిదవ సూక్తము**

ఋషి - ఈశ్వరపుత్ర ఆగ్నేయులు. దేవత - పవమాన సోమము.

ఛందస్సు - ద్విపద విరాజి.

1. సోమమా! నీవు స్వాదునవు. ఇంద్ర, మిత్ర, పూష, భగుని కొరకు క్షరితుడవగుము.

2. ప్రజ్ఞానము, బలము కొరకు ఇంద్రుడు అభిషుతమైన నిన్ను పానము చేయవలెను. సకల దేవతలు నిన్ను పానము చేయవలెను.

3. సోమమా! నీవు ప్రదీప్తుడవు దివ్యుడవు దేవతల పానయోగ్యుడవు ఆభరణములు మహాగృహముకొరకు ద్రవించుము.

4. సోమమా! నీవు మహారస ప్రవాహకుడవు సర్వపాలకుడవు దేవతలు లక్ష్యముగా ప్రవహింపుము.

5. సోమమా! దీప్తవగుము. దేవతల కొరకు క్షరింపుము. ద్యావాపృథ్వులు సకల ప్రజకు సుఖములు ప్రసాదించుము.

6. సోమమా! నీవు దీప్తుడవు పానయోగ్యుడవు ద్యులోకమును వహించువాడవు బలవంతుడవగును. ససత్యభూత యజ్ఞమందు ప్రవహించుము.

7. సోమమా! నీవు యశస్వివి. శోభన ధారలు కలవాడవు ప్రాచీనుడవు మేషలోమము దాటి ప్రవహించుము.

8. సోమము కర్మనిష్ఠులచే నియుతుడు జాయమానుడు పవిత్రుడు శోధితుడు ప్రసన్నుడు సర్వజ్ఞుడు అతడు మాకు సకల ధనముల ప్రసాదించవలెను.

9. దేవతలను వర్ధిల్ల చేయు సోమము మాకు సంతానము సకల ధనములు ప్రసాదించవలెను.

10. సోమమా! నిన్ను గుఱ్ఱమును మార్జనము చేయుదురు. జ్ఞానము, బలము, ధనము కొరకు ప్రవహింపుము.

11. అభిషవకర్తలు బలము కొరకు నీయొక్క రసమును శుద్ధిచేయుదురు. వారు మహా అన్నమునకు గాను నిన్ను శుద్ధి చేయుదురు.

12. జలపుత్ర, జాయమాన, హరిత వర్ణ, దీప్త సోమమును ఋత్విక్కులు, దేవతల కొరకు శుద్ధిచేయుదురు.

13. సోమము కళ్యాణరూపి క్రాంత ప్రజ్ఞుడు. అతడు జలముల స్థానము అంతరిక్షమున బలము ధనము కొరకు ద్రవించును.

14. సోమము ఇంద్రుని దేహమును భరించును. ఆ దేహముతోనే ఇంద్రుడు సకల పాపిరాక్షసులను హతమార్చినాడు.

15. ఆవుపాలు కలిపినదియు, పురోహితులు అభిషవించిన సోమమును సకల దేవతలు పానము చేయుదురు

16. అభిషుత, బాహుధారాయుత సోమము మేషలోమ పవిత్రమున ఏర్పరచి నలువైపుల ప్రవహించును.

17. సోమము అనేక తేజోయుక్తము బలశాలి జలమున శోధితము దుగ్ధమిశ్రితమగు సోమము నలు వైపుల ప్రవహించును.

18. ఋత్విక్కులచే అభిషుతమై, పాత్రలలో అభిషుతమైన సోమము కలశమునకు చేరవలెను.

19. పవిత్రమున ఏర్పడి, బలశాలియై, బహుధారల సోమమును ఇంద్రుని కొరకు సిద్ధము చేయుదురు.

20. కామవర్షక ఇంద్రుని మత్తునకుగాను ఋత్విక్కులు సోమమునందు మధురరసము కలుపుదురు.

21. సోమమా! జలముల కలసిన, హరితవర్ణమవగునిన్ను దేవతల పానము, వారి జలము కొరకు త్విక్కులు శుద్ధిచేయు చున్నారు.

22. ఇది ప్రథమ సోమరసము జలమును కదలించునది జలమున కలియునది ఇంద్రునకు అర్పించ బడుచున్నది.

## నూట పదవ సూక్తము

ఋషి - త్ర్యరుణత్ర, సదస్యు రాజద్వులు ఇద్దరు. దేవత - పవమాన సోమము.
ఛందస్సు - అనుష్టుప్ - బృహతి - జగతి.

1. సోమమా! అన లాభము కొరకు యుద్ధమునకు వెళ్లుము నీవు సహనశీలుడవు శత్రువు మీదికి పొమ్ము. నీవు మా ఋణపరిహారకుడవు. శత్రువును వధించుటకు తరలుము.

2. సోమమా ! నీవు అభిషుతడవు మహా మానవ సామ్రాజ్యమున నిన్ను మేము స్తుతింతుము. నీవు నీ రాజ్యమున రక్షించుకొనవలసి ఉన్నది శత్రువు లక్ష్యముగా సాగుము.

3. సోమమా! జలములనిచ్చు అంతరిక్షమందలి దివ్య బలములతో సూర్యుని సృష్టించినావు. నీవు స్తోతలకు

పశుదాతవు. నీ వద్ద నానా విధ జ్ఞానములు ఉన్నవి. నీవు వేగవంతుడవు.

4. అమర సోమమా! నీవు సత్య, కళ్యాణమయ జలములున్న అంతరిక్షమున మానవుల దర్శనమునకు గాను. సూర్యుని సృష్టించినావు. పూజ్యుడవగు నీవు శత్రువు లక్ష్యముగా సాగిపోవుదువు.

5. ఒకడు త్రాగునీటి కొరకు తటాకము నిర్మించును. మరొకడు దోసిలిలో నీరు నింపును. అట్లే నీవు అన్నము కలిగించుటకుగాను పవిత్రమును చీల్చి సాగుదువు.

6. దివ్యుడు అందరిని ప్రోత్సహించు సూర్యుడు ఇంకను చీకట్లను తొలగించనేలలేదు. అప్పుడే ద్రష్టలు దివ్యలోకమున పుట్టిన 'వసురూచి' నామక జనులు తమ బంధువగు సోమమును స్తుతించినాడు.

7. సోమమా! ముఖ్యులు, దర్భలువిరుచు యజమానులు అన్నము, బలమునకుగాను మనసులందు నిన్ను ప్రతిష్ఠించినారు. వీర్య ప్రాప్తికి మమ్ము కూడ యుద్ధమునకు పంపుము.

8. ద్యులోకమునందలి దేవతల పానయోగ్యము. ప్రాచీనము, ప్రశస్తము మహాద్యులోనమందలి సోమమును జనులు తమ ముందుకు రప్పింతురు. ఇంద్రుని కొరకని పుట్టిన సోమమును స్తోతలు స్తుతింతురు.

9. వృషభము గోసమూహముల పెత్తనము చేయును. సోమమా! అట్లేనీవు ద్యులోక,
భూలోకమునందలి సకల ప్రాణి జాలమును పరిపాలింతువు.

10. సోమము బహు ధారావంతుడు అపార సమర్థుడుమ్ దీప్తుడు ద్రవణశీలుడు అతడు పవిత్రమున పసిబిడ్డవలె - ఆటలాడుచు క్షరించును.

11. శోధితము. మాధుర్యయుక్తము, క్షరణ శీలము, రుచికరము, రసవంతము, అన్నదాత, ధనపాపక, ఆయుప్రదాత సోమము ప్రవహించు చున్నది.

12. సోమమా ! ప్రవహింపుము. యుద్ధకామి శత్రువులను ఓడించుచు ప్రవహించుము. దుర్గమ రాక్షసులను హతమార్చుచు ప్రవహింపుము. శోభన ఆయుధవంతుడవై ప్రవహింపుము. శత్రువినాశకుడవై ప్రవహింపుము.

**నూట పదకొండవ సూక్తము**

ఋషి - పురుచ్ఛేపపుత్ర అనానతుడు. దేవత - పవమాన సోమము.
ఛందస్సు - అత్యష్టి

1. సూర్యుడు తనకిరణ పుంజమున చీకట్లను పారద్రోలును. శోధిత, హరితవర్ణ, శుభధారల సోమము రాక్షసులను పారద్రోలును. అభిషుత సోమధార దీప్తవంతమగును. శుద్ధిచేసిన ఆకు పచ్చని సోమము రుచికరమగును. సప్తతేజోవంతము, రసహరణము, స్తుతివంతము, తేజోయుక్త సోమము సమస్త నక్షత్రములను వెలిగించును.

2. సోమమా! నీవు పణులు అపహరించిన గోధనమును సాధించినావు. యజ్ఞగృహమందు యజ్ఞధారకు జలమున శుద్ధుడవగుదువు. దూరమునుంచి సామస్వరము వలె నీధ్వని వినిపించును. సోమపు శబ్దమందు కర్మనిష్ఠ యజమానులు ఆనందితురు. సోమము ముల్లోకములను బ్రతికించుజలమును, రోచక దీప్తిని ధరించును. స్తోతలకు అన్నప్రదానము చేయును.

3. జ్ఞానియగు సోమము పూర్వదిశకు సాగును. సోమపు రథము దివ్యము. సర్వదర్శనీయము. ఆరథము సూర్యకిరణములతో కలసి సాగును. జనులు ఉచ్చరించిన స్తోత్రములు ఇంద్రుని చేరును. అవి ఇంద్రుని ప్రసన్నుని చేసి విజయ కారకములు అగును వజ్రము సహితము ఇంద్రుని చేరును. యుద్ధక్షేత్రమున ఇంద్రుడు, సోమము శత్రువులకు అజేయులైనపుడు వారిని స్తుతింతురు.

## నూట పన్నెండవ సూక్తము

ఋషి - అంగిరస శిశివు. దేవత - పవమాన సోమము. ఛందస్సు - పంచపాద పంక్తి

1. మా కార్యములు అనేక ప్రకారములు. ఇతరులు కార్యములు కూడ అనేక ప్రకారములు, వడ్రంగి కర్రపనిని, వైద్యులు రోగమును, బ్రహ్మణుడు సోమాభిషవ కర్త యజమానిని కోరుదురు. నేను సోమప్రవాహము కోరుదును. "ఇంద్రాయోన్ద్రో పరిస్రవ" సోమమా ఇంద్రుని కొరకు ప్రవహింపుము.

2. పాతకర్ర, పక్షులు ఈకలు, పదునుపెట్టు రాతితో బాణములు చేయబడును. వడ్రంగి బాణము కొనువారిని, బంగారుమున్న వాడు ధనికుని వెదకును. నేను సోమప్రవాహమును వెదకుదును, "ఇంద్రాయేందో పరిస్రవ"

3. నేనుస్తోతను. నా పుత్రుడు యజ్ఞబ్రహ్మ. కూతురు యవలు దంచును. మేము వేరు వేరు పనులు చేయువారలము గోవులు గోష్ఠమున తిరుగును. మేము ధనము కోరుచు సోమము కొరకు తిరుగుదుము. "ఇంద్రాయేందో పరిస్రవ"

4. గుఱ్ఱము మంచిరథమును, మంచి సారథిని కోరును. విదూషకుడు హాస్యము కోరును. పురుషేంద్రియము రోమవంతమగ రెండు భేదములు కోరును - రో మణ్వంతౌ భేదా. నేను సోమపు ప్రవాహము కోరుదును. "ఇంద్రాయేందో పరిస్రవ"

## నూట పదమూడవ సూక్తము

ఋషి - మారీచ కాశ్యపుడు. దేవత - పవమాన సోమము.

ఛందస్సు - పంచపాద పంక్తి

1. కురుక్షేత్రము దగ్గరి శర్యణావత సరస్సున సోమము ఉన్నది. దానిని ఇంద్రుడు సేవించవలెను. అందువలన ఇంద్రుడు ఆత్మబలవంతుడు శౌర్యవంతుడు కావలెను. "ఇంద్రాయేందో పరిస్రవ"

2.సోమము కోరకలు తీర్చువాడు దిశలకు స్వామి. సోమము ఆర్జీక దేశమునుండి రావలెను. ప్రసవించవలెను. పవిత్రము, సత్యస్తుతివాక్యము, శుద్ధ, పుణ్య కార్యములచే సోమమును అభిషవించ బడును."ఇంద్రాయేందో పరిస్రవ"

3. సూర్యపుత్రి. మేఘజలమున పెరిగిన - మహాసోమమును స్వర్గమునుండి తెచ్చినది. గంధర్వులు సోమమును అందుకున్నారు. సోమము రసమును అందించినది. "ఇంద్రాయేందో పరిస్రవ"

4. సత్య కర్మ, అభిషవించ బడిన మహారాజు, యజ్ఞస్వామి, సోమము ఇందు, యజ్ఞ, సత్య, శ్రద్ధలను ఉచ్చరించును, కర్మ ధారక యజమానిచే అలంకృతమై. "ఇంద్రాయేందో పరిస్రవ"

5. యదార్ధ బలశాలి మహాసోమపు ద్రవధార ప్రవహించు చున్నది. రసవంత సోమపు రసము ప్రవహించుచున్నది. హరిత వర్ణ సోమమా! బ్రాహ్మణులచే పరిశుద్ధమవై "ఇంద్రాయేందో పరిస్రవ"

6. శోధ్యనమాన సోమమా! నీ కొరకు సప్త ఛందస్సులు రచించిన స్తుతులను ఉచ్చరించుచు, శిలలచే అభిషవించుచు, దానిచే దేవతలకు ఆనందము కలిగించుచు బ్రాహ్మణులు పూజించుచోట "ఇంద్రాయేందో పరిస్రవ"

7. సోమమా !ఎచట అఖండ తేజమున్నదో, ఎచట స్వర్గమున్నదో, అట్టి అమర, అక్షయలోకములకు నన్ను చేర్చుము. "ఇంద్రాయేందో పరిస్రవ"

8. ఎచట వైవస్వతరాజున్నాడో, ఎచట స్వర్గ ద్వారమున్నదో, ఎచట మందాకిని మున్నగు నదులు ప్రవహించునో

అచట నన్ను అమరుడను చేయుము. "ఇంద్రాయేందో పరిస్రవ"

9. ఏ ఉత్తమలోకమున సూర్యుని కోరిక ననుసరించి కిరణములు కదలునో, ఎచట జ్యోతిర్మంతులగు మనుష్యులు వసింతురో ఆలోకమున నన్ను అమరుడను చేయుము. "ఇంద్రాయేందో పరిస్రవ"

10. ఏలోకమున కామ్యమాన దేవతలు - అవశ్యప్రార్థనీయ ఇంద్రాది దేవతలు ఉందురో ఏది కర్మసాక్షియైన సూర్యుని స్థానమో - ఎచట స్వధసహితముగా ఇవ్వబడిన అన్నము, తృప్తి ఉండునో అచట నన్ను అమరుడను చేయుము. "ఇంద్రాయేందో పరిస్రవ"

11. ఏలోకమున ఆనందము, మోదము ప్రమోదము మున్నగునవి ఉన్నవో - ఎచట సమస్త కోరికలు తీరునో అచట నన్ను అమరుని చేయుము. "ఇంద్రాయేందో పరిస్రవ"

## నూట పదనాలుగవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. శోధ్యమాన తేజమును అనుసరించిన బ్రాహ్మణుని అమరుడనియు, కళ్యాణకర పుత్రాది యుక్తుడనియు అందురు సోమపు మనసును అనుసరించి సేవించువాడు సహితము అంతటి సౌభాగ్యము అనిపించు కొనును. "ఇంద్రాయేందో పరిస్రవ"

2. కశ్యప ఋషీ ! మంత్ర రచయతలు రచించిన స్తుతి వచనములను ఆశ్రయింపుము. నీ వచనములను వృద్ధి చేసి కొనుము, సోమ సామ్రాట్టుకు ప్రణమిల్లుము. సోమము వనస్పతుల పరిరక్షకుడు. "ఇంద్రాయేందో పరిస్రవ"

3. సూర్యుని ఆశ్రయించిన ఏడు దిక్కులును, హోమ కర్తయొక్క ఏడుగురు పురోహితులును, ఏడుగురు సూర్యులను కూడి రక్షింపుము. "ఇంద్రాయేందో పరిస్రవ"

4. సోమ మహారాజా! నీ కొరకు హవనీయ ద్రవ్యము పాకము చేయబడినది. దానితో మమ్ము రక్షింపుము. శత్రువులు మమ్ము కొట్టరాదు మా వస్త్రములు అపహరించరాదు. "ఇంద్రాయేందో పరిస్రవ"

*విద్వాంసుడు, బహుభాషావేత్త, కవి, కథకుడు, నవలాకారుడు, నాటకకర్త, ఆకాశవాణి, ధూరదర్శన, చలనచిత్ర రచయిత, విమర్శకుడు, అనువాదకుడు. ఆంధ్ర ప్రదేశ సాహిత్య అకాడమీ బహుమాన గ్రహీత, వక్త, స్వాతంత్ర్యసమరయోధుడు, కార్మికోద్యమ కార్యకర్త, వినయవంతుడు, ప్రసన్నుడు దాశరథి రంగాచార్య రచించిన శ్రీ*

*మదాంధ్ర వచన ఋగ్వేద సంహితమున తొమ్మిదవ మండలము సమాప్తము.*

**యత్రానన్దాశ్చ మోదాశ్చ ముదః ప్రముద ఆసతే|**
**కామస్తస్య యత్రాప్తాః కామాస్తత్ర మామృత కృధీన్ద్రా మేందో పరిస్రవ ||**

**జ్ఞానానందమయందేవం నిర్మలస్ఫటికా కృతిం |**
**ఆధారస్సర్వ విద్యానాం హయగ్రీవ ముపాస్మహే ||**

## పదవ మండలము

**అయిదవ అధ్యాయము మొదటి సూక్తము**

ఋషి - ఆప్త్య త్రితుడు. దేవత - అగ్ని. ఛందస్సు - త్రిష్టుప్.

***అగ్నే బృహన్ను హసామూర్ధ్వో అస్థాన్ని ర్జగన్వాన్తమసో జ్యోతిషాగాత్ |***
***అగ్ని ర్భాను నారుశతా స్వంశ ఆజాతో విశ్వాసద్మాన్యాప్రాః ||***

1. మహాగ్ని ఉషః కాలమున ప్రజ్వలితుడగును. జ్వాలా రూపియై ఉండును. అగ్ని అంధకారమునుండి. బయల్వెడలును. స్వతేజమున ఆనందరూపమున విచ్చేయును. అగ్ని శోభన జ్వాలావంతుడు. కర్మకొరకు ఉత్పన్నుడు. తన హింసక తేజమున సకల యజ్ఞగృహములను పూరించును.

2. అగ్నీ! నీవు ప్రాదుర్భూతుడవు కళ్యాణరూపుడవు. అరణులందు మథించబడినవాడవు ఓషధులందు ఉన్నవాడవు ద్యావాపృథ్వులకు గర్భమవు. చిత్ర వర్ణుడవు ఓషధుల శిశువవు. నీ తేజమున నలుపు శత్రువులను పరాజితులను చేయుదువు. వనస్పతులు నీకు మాతృరూపములు. వాణి కొరకని ధ్వనించుచు ఉత్పనమగుదువు.

3. అగ్ని ఉత్కృష్టుడు విద్వాంసుడు ప్రాదుర్భూతుడు మహానుడు. వ్యాపకుడు అట్టి అగ్ని త్రితుడనగు నన్ను రక్షించవలెను. యజ్ఞకర్తలు అగ్నిని జలము యాచింతురు సుమనస్కులై అగ్నిని పూజింతురు.

4. అగ్నీ ! నీవు సమస్తలోకములను పోషించువాడవు - అన్నవర్ధకుడవు. ఉత్పాదక వనస్పతులు అన్నము కొరకు నిన్ను సేవించును. శుష్కవనస్పతులందు దావరూపమున ప్రవేశింతువు. మానవులకు, ప్రజలకు హోమ నిష్పాదకుడవు - **"అసిత్వంవిక్షుమాను షీషుహోతా."**

5. అగ్ని దేవతల ఆహ్వాత. వివిధ రథవంతుడు. సమస్త యజ్ఞములకు పతాకస్వరూపుడు. శ్వేతవర్ణుడు దేవతల అధిపది. ఇంద్రుని వద్దకు వెళ్లువాడు. యజమానులకు పూజ్యుడు. అట్టి అగ్నిని సంపద కలుగుటకుగాను స్తుతిస్తాము.

6. అగ్నీ ! నీవు దీప్యమానుడవు. హిరణ్మయ తేజోవంతుడు. శుక్లాది రూపములు ధరించువాడవు. పృథ్వినాభియగు ఉత్తరవేదిన ఉత్పన్నుడవు. ఆదరణీయ స్థానమగు తూర్పుదిక్కున స్థాపించబడినవాడవు. అట్టి అగ్ని ఈ యజ్ఞమున దేవతలను పూజించవలెను.

7. అగ్నీ! పుత్రుడు మాతాపితరులను పోషించినట్లు నీవు ద్యావా పృథ్వులను పోషింతువు. తరుణతమఅగ్నీ! అభిలషించు వ్యక్తులవైపు సాగుము. బలపుత్ర అగ్నీ! మా యజ్ఞమునకు ఇంద్రాది దేవతలను తోడ్కొనిరమ్ము.

## రెండవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. యువతమ అగ్నీ! దేవతలు స్తోత్రాభిలాషులు. వారిని ప్రసన్నులను చేయుము. నీవు దేవయజ్ఞ, కాలములకు స్వామివి. యజ్ఞసమయమును గమనించి ఈ యజ్ఞమున దేవతలను పూజింపుము. దేవపురోహితులతో కలసి పూజింపుము. నీవు హోతలందు జ్యేష్ఠుడవు.

2. అగ్నీ ! నీవు హోతవు, పోతవు, విప్రుడవు, సత్యనిష్ఠుడవు, ధనదుడవు, మాహవిస్సులను దేవతలకు అందించుము. దీప్యమాన ప్రశస్య అగ్నీ ! దేవతలను పూజింపుము.

3. మేము దేవతల మార్గమును అనుసరింతుము. మేము ప్రారంభించిన కర్మ తగురీతి పూర్తికావలెను. జ్ఞాని అగ్ని దేవతలను పూజించావలెను. మానవుల హోమనిష్పాదకుడగు అగ్ని యజ్ఞములను, వాని సమయమును మించవలెను.

4. దేవతలారా ! మేము అజ్ఞానులము. జ్ఞానవంతులు మీ కర్మములను తెలియుదురు. అయినను లోపము చేయుచున్నారు. అగ్నికి ఈ విషయము లన్నియు తెలియును. అగ్నియే సకల కర్మలను పూర్తి చేయవలెను. యగయోగ్య సమయములందు అగ్ని దేవతలను **"కల్పయాతి"** కల్పించును.

(కర్మములు నిర్వహించుట యందు జ్ఞానులు, అజ్ఞానులు సమానము అనుచున్నాడు.)

5. మానవుడు దుర్బలుడు. అతని మనసు జ్ఞానశూన్యము మానవుడు ఎరుగని కర్మమును - హోత యాజ్ఞికుడగు - అగ్ని ఎరుంగును. అగ్ని యజ్ఞములందు సకాలమునకు దేవయజనము చేయవలెను.

6. అగ్ని సకల యజ్ఞములకు ప్రధానకారకుడు. అతడు యజ్ఞపతాక స్వరూపి. అగ్నిని బ్రహ్మ సృష్టించినాడు. అగ్నీ ! దాసులు మున్నగువానితో కూడిన భూమిని మా కొసంగుము. స్పృహణీయ, స్తుతి మంత్రాల యుక్తుడవై దేవతలకు

సర్వహితము కోరు అన్నమును అందించుము.

7. అగ్నీ, నిన్ను భూలోక, ద్యులోక, అంతరిక్షములు మూడు సృష్టించినవి. శోభన జన్మ ప్రజాపతి నిన్ను సృష్టించినాడు. నీవు పితృమార్గమును. ప్రజలను ఎరింగినవాడవు. దీప్తయుక్తుడవై విరాజిల్లుము - **"సమిధానో విభాహి."**

**మూడవ సూక్తము**

ఋష్యాద్యాః పూర్వవత్

1. దీప్త అగ్నీ! నీవు సర్వసామివి. హవ్యవాహనుడవు. అరిభయం కరుడవు వనస్పతులదున్న వాడవు. శుభములు కలిగించువాడవు. యజ్ఞమానులు ధనబుద్ధి కలిగి నిన్ను సర్వదా దర్శింతురు. అగ్ని సర్వజ్ఞుడు, అతడు సాయంత్రము తన మహాతేజమున శ్వేతవర్ణ దీప్తిచే అంధకారమును దూరము చేయును.

2. ఉషస్సు పితృరూపుడగు ఆదిత్యునివలన కలిగినది. అగ్ని ఉషస్సును వెల్లడించుచు తన కాంతిచే అంధకారమును అడుగంటించును. గమనశీల అగ్ని ద్యులోకమునకు నివాసదాత అగ్ని తన తేజస్సుచే సూర్యుని వెలుగును పైన నిలిపి తాను ప్రకాశించును.

3. కళ్యాణరూప భజనీయ ఉష అగ్నినిసేవించును. శత్రుఘాతక అగ్ని తనసోదరి ఉష వద్దకు వెళ్లును. దివ్య జ్ఞానము. దీప్త తేజముగల అగ్ని తన శ్వేతవర్ణ తేజమున కృష్ణ వర్ణ అంధకారమును దూరము చేయును.

4. మహాగ్ని యొక్క ప్రకాశవంత కిరణములు సాగుచున్నవి. అవి స్తోతలను బాధించవు. మిత్ర, కళ్యాణరూప. భక్తుల సుఖంకర, స్తుత్య, కామవర్ధక, శోభాముఖ అగ్ని కిరణములు అంధకారమును ధ్వంసము చేయును. తీక్ష్ణ ములగును. దేవతల వద్దకు చేరును. ప్రసిద్ధములు అగును.

5. దీప్యమాన, శోభనదీప్త మహాగ్ని కిరణములు ధ్వని చేయుచు సాగును. అగ్ని అత్యంత ప్రశస్తుడు తేజస్వితముడు. క్రీడా కారుడు వృద్ధతముడు అతడు తన తేజస్సుచే ద్యులోకమునకు వ్యాప్తి కలిగించును.

6. దృశ్యమాన ఆయుధవంతుడు, దేవతల వద్దకు చేరునట్టి అగ్ని కిరణములు శోషకములు వాయు యుక్తములు. అవిధ్వంచు చున్నవి. దేవతలందు ముఖ్యుడు, గంత, వ్యాపకుడు, మహానుడగు అగ్ని - తన శ్వేతవర్ణ, ప్రాచీన, శబ్దాయమాన - తేజమున ప్రదీప్తుడగును.

7. అగ్నీ! మా యజ్ఞమునకు గొప్ప గొప్ప దేవతలను తోడ్కొనిరమ్ము. నీవు ద్యావాపృథ్వులమధ్యన సూర్యరూపమున ఉన్నవాడవు. మా యజ్ఞమందు ఆసీనుడవగుము. స్తోతలకు సులభసాధ్యుడు, వేగవంతుడగు అగ్ని - అరుచుచు,

పరుగులు పెట్టునట్టి అశ్వసహితుడై మా యజ్ఞమునకు విచ్చేయవలెను.

### నాలుగవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. అగ్నీ! నీవు అందరకు వందనీయుడవు. మేము దేవతలను ఆహ్వానింతుము. అప్పుడు నీవు విచ్చేతువు నేను నీకు హవిసమర్పింతును. నిన్ను స్తుతింతును. ప్రాచీన ప్రభువగు అగ్నీ! సకలలోక స్వామివగు అగ్నీ! నీవు యాజ్ఞభిలాషి మానవులకు - మరుస్థలమున జలాశయమువలె - ధనమునిచ్చువాడవు సుఖములు కలిగించువాడవు.

2. చలికి వాడకు గోవులు వెచ్చని కొట్టమునకు చేరును. తరుణతమ అగ్నీ! అట్లే ఫలప్రాప్తి కొరకు యజమానులు నిన్ను సేవింతురు. నీవు దేవతలకు, మానవులకు దూతవు. మహానుభావా ! నీవు హవిపట్టుకోని ద్యావాపృథ్వుల మధ్య, అంతరిక్షమున సంచరింతువు.

3. పుత్రసమాన జయశీలుడవగు నిన్ను భూమాత పోషించును. నిన్ను చేరగోరును. ధరించును. అభిలాషివగునీవు అంతరిక్షపు ప్రశస్త మార్గమున యజ్ఞములను సాగుదువు. కట్టువీడిన గొడ్డు కొట్టమునకు ఉరికినట్లు - హవి అందుకున్న నీవు దేవతల వద్దకు పరుగు పెట్టుదువు.

4. అగ్నీ! నీవు మూఢుడవు కావు. చైతన్యవంతుడవు. మేము మూర్ఖులము నీ మహిమలు ఎరుగము నీవు మాత్రమే నీ మహిమలను ఎరుంగుదువు. అగ్ని వనస్పతులలో వసించును. తన నాలుకల జ్వాలలతో హవిర్భక్షణ చేయును. అగ్ని ఆయుతులను ఆస్వాదించును.

5. నవ్యాగ్ని ఎచట ఉత్పన్నుడగును? అతడు పాత చెట్లమీద ఉండును. పాలక, ధూమకేతు, శ్వేతవర్ణ అగ్ని అరణ్యములందు నివసించును. స్నానములేకనే పరిశుద్ధుడగు అగ్ని దూపగొన్న ఎద్దువలె - అడవియందలి నీతివద్దకు చేరును. మానవులు సన్మనస్కులై అగ్నిని ప్రసన్నుని చేయుదురు.

6. అడవి దొంగలు ఇద్దరు బాటసారులను త్రాళ్లతో కట్టిగుంజుదురు. అగ్నీ! మా చేతులు అట్లే యజ్ఞకాష్ఠమునుండి నిన్ను మథించును. నేను నీ కొరకు నవస్తుతులను రచింతును నీవు వానిని గ్రహించుము. ప్రకాశవంతమగు నీ తేజస్సుతో రథమునకు అశ్వములవలె యజ్ఞమున చేరుము.

7. జ్ఞానివగు అగ్నీ! మేము నీకు యజ్ఞద్రవ్యములు సమర్పించినాము. నమస్కరించినాము. ఈ స్తుతి సదా వర్థిల్లినుగాత. అగ్నీ! మా పుత్ర, పౌత్రులను రక్షింపుము. సావధానుడవై మా అవయవములను రక్షింపుము.

### అయిదవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. అగ్ని అద్వితీయుడు సముద్రమువంటి ఆధారస్వరూపుడు. ధనములు ధరించినవాడు. బహుజన్మలవాడు అతడు - ఆ అగ్ని మా మనసులను ఎరుంగగను. అగ్ని అంతరిక్షమందుండి మేఘమును సేవించును. అగ్నీ ! మేఘమధ్యమునందలి విద్యుత్తు వద్ద కేగుము.

2. యజమాని ఆహుతులు అర్పించువాడు. అతడు నీల వర్ణ అగ్నిని మంత్రములచే ఆచ్ఛాదించును. అప్పుడు అతడు అశ్వవంతుడగును. విప్రులు - జలము నివాసముగాగల అగ్నిని స్తుతులతో ఆరాధింతురు. వారు హృదయకుహరమున అగ్ని యొక్క ప్రధాన నామములను జపింతురు "గుహానామానిదధిరేపరాణి."

3.సత్యయుక్త, కర్మయుక్త ద్యావాపృథ్వులు అగ్నిని తమలో దాల్చును. తల్లిదండ్రులు పిల్లలను కన్నట్లు - ద్యావా పృథ్వులు ప్రశస్త అగ్నిని కలిగింతురు. అగ్ని సకల స్థావర, జంగమముల నాభివంటివాడు - ప్రధాని - మేధావి. అగ్నికి వ్యాప్తి కలిగించు వైశ్వానరాగ్నిని ఎరిగి మేము యజిస్తాము.

4. యజ్ఞము నిర్వహించు, అభిలాషలుగల, ప్రాచీన యజమాని - విధివిహితమున ఉత్పన్నమైన అగ్నిని తన బలము కొరకు సేవించును. సకల లోకములను ఆవరించిన ద్యావా పృథ్వులు - మూడులోకములందు అగ్ని, విద్యుత్తు, సూర్యరూపమున ఉన్న - అగ్నిని మధు, ఘృత, పురోడాశాదులతో వర్ధిల్ల చేసినారు.

5. అగ్ని స్తోతలచే స్తుతించబడువాడు. సర్వజ్ఞుడు. అతనికి కాళి, కదాళిమున్నగు పేర్లుగల ఏడు జ్వాలలు - జిహ్వాలు ఉన్నవి. అగ్ని యజ్ఞమునుండి ఏడు శిఖలను - సకల పదార్థద్రష్టలను చేయుటకు అవలీలగా పైకి లేపినాడు. ప్రాచీన కాలమున పుట్టిన అగ్ని అట్టి ఏడు శిఖలను ద్యావాపృథ్వుల మధ్య నిలిపినాడు. యజమానులను ఇష్టపడు అగ్ని భూమికి వర్షస్వరూపమగు తనరూపమును ప్రసాదించినాడు.

6. విప్రులు సప్తపాపములను వర్జించినారు. వీనిలో ఏ ఒక్కటి చేసినవాడును పాపి అగును. మానవులను పాపమునుండి ఆపువాడు అగ్ని. అగ్ని మానవులందును - ఆదిత్య కిరణములు సంచరించు మార్గమందును - జలమధ్యమునను వసించును.

(1.చౌర్యము, 2.బ్రహ్మహత్య 3.సురాపానము 4.గురు పత్నీగమనము 5. పునఃపునః పాపాచరణము 6. దుష్కృత్యము 7. అసత్యము అనునవి సప్త పాపములు)

7. అగ్ని సృష్టికి ముందు సృష్టిఅయినంత సత్యము అయినాడు వ్యక్తుడైనాడు. అగ్ని పరంధాముడు. అతడు ఆకసమున సూర్యరూపమున జన్మించినాడు. అగ్ని మాకన్న ముందు ఉన్నవాడు. అగ్ని యజ్ఞమునకు పూర్వము ఉన్నవాడు అగ్ని వృషభమగును, గోవు అగును. స్త్రీ అగును పురుషుడగును.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత పదవ మండలము ఏడవ అష్టకమున అయిదవ అధ్యాయము సమాప్తము.)*

**ఓం నతామినన్తి మాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదసీ అద్రుహా వేద్యాభిర్న పర్వతాని నమేతస్థివాంసః**

**ఆరవ అధ్యాయము ఆరవ సూక్తము**

ఋషి - ఆప్త త్రితుడు. దేవత - అగ్ని. ఛందస్సు - త్రిష్టుప్

***ఓం అయంసయస్య శర్మన్నవోభిరగ్నే రేధతేజరితా భిష్టౌ |***
***జ్యేష్ఠే భిర్యోభాను భిర్రుఘూణాం పర్యేతి పరివీతో విభావా ||***

1. ఇతడే ఆ అగ్ని యజ్ఞసమయమున స్తోతలను రక్షించువాడు. వారి గృహములను పెంపొందించువాడు అగ్ని దీప్తమంతుడు అతడు సూర్యకిరణముల ప్రశస్త తేజోవంతుడగును. సర్వత్ర సంచరించును.

2. అగ్ని దీప్తుడు. అతడు దేవతల తేజమున దీప్తుడగును. అతడు సత్యస్వరూపుడు అహింసితుడు. యజమాని అగ్నికి మిత్రుడు. మిత్రోచిత కార్యము చేయుటకుగాను అవిశ్రాంత అశ్వమువలె అగ్ని యజమాని వద్దకేగును.

3. అగ్ని సకల లోకప్రభువు అతడు సర్వత్రగామి. ఉషః కాలమునుండియే హవనము కొరకు యజమాని ప్రభువు. అగ్ని మనస్సుకు అనుకూలముగా యజమానులు హవి సమర్పింతురు. అతని బలము శత్రుబలములకు అవధ్యము.

4. అగ్ని బలములచే వర్ధితుడు స్తుతులచే సేవితుడు వేగముగా దేవతల వద్దకు చేరువాడు. అగ్ని స్తుత్యుడు దేవతల ఆహ్వాత. ప్రధాన యజ్ఞకర్త దేవతలు నియమించినవాడు. అగ్ని దేవతలకు హవి అర్పించును.

5. అగ్ని దేవతల ఆహ్వాత. జ్ఞాని విప్రులు ఆదరమున స్తుతించువాడు భోగముల నిచ్చువాడు. కదలుచుండువాడు. ఋత్విక్కులారా అగ్నిని ఇంద్రసమముగా - స్తుతించండి హవి అర్పించండి మాకు సమ్ముఖుని చేయండి.

6. యుద్ధమునకు త్వరగా చేరిన అశ్వమునకువలె. అగ్నియందు సమస్తలోకముల ధనములు లభించును **"విశ్వావసూని జగ్ముః"** అగ్నీ! ఇంద్రుని రక్షణలు మాకు అభిముఖము చేయుము.

(సమస్త సంపదలు అగ్నినుండియే కలుగు చున్నవి అనునది నిత్యసత్యము)

7. అగ్నీ! నీవు పుట్టగానే మహత్వము పొందినావు. స్థానము గ్రహించినావు ఆహుతి యోగ్యుడవైనావు నిన్ను చూడగనే దేవతలు నీ వద్దకు చేరినారు. ఉత్తమ ఋత్విక్కులను నీవు రక్షించినావు వారికి ప్రగతి కలిగించినావు.

## ఏడవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1.దివ్యాగ్నీ! ద్యావాపృథ్వులందలి సకల విన్నపములను. శుభములను మా కొరకు అందుకొని రమ్ము. దర్శనీయ అగ్నీ! మేము యాజ్ఞకులము కావలెను. అనేక ప్రశంసనీయ రక్షణలతో మమ్ము కాపాడుము.

2. అగ్నీ! నీ కొరకు స్తుతులు ఉచ్చరించినాము. నీవు మాకు గోవుల, అశ్వముల ధనములు ఇచ్చినావు. కావున నిన్ను ప్రశంసించినాము. నీవు నీ తేజమున సమస్తమును ఆచ్ఛాదింతువు. శుభకర్మల కొరకు పుట్టినవాడవు. మాకు ధనములిచ్చువాడవు. మానవుడు నీవు ఇచ్చిన భోగ్యధనమును అందుకొనును. నిన్ను స్తుతించును.

3. నేను అగ్నినే తండ్రిగా, బంధువుగా, భ్రాతగా, చిరకాల మిత్రునిగా భావింతును. నేను మహాగ్నిముఖమును - ద్యులోకమునందున్న పూజనీయ, ప్రదీప్త - సూర్యమండలమును వలె పూజింతును.

4. అగ్నీ! మేము నిన్ను స్తుతించిన స్తుతులు కృతార్ధములైనవి. నిత్యహోత, దేవతల ఆహ్వాత, మాగృహములందు వసించు నీవు నన్ను రక్షింతువు. నీ సాన్నిధ్యము పొంది నేను యాజ్ఞికుడను కావలెను. నాకు లోహితవర్ణ అశ్వములు, మరింత అన్నము అందవలెను. నాకు లోహితవర్ణ అశ్వములు, మరింత అన్నము అందవలెను. నాకు లోహితవర్ణ అశ్వములు, మరింత అన్నము అందవలెను. అందువలన ప్రదీప్త దినములందు నీకు హోమద్రవ్యములు సమర్పించగలను.

5. అగ్ని దీప్తయుక్త మిత్రసముడు. యజనీయుడు ప్రాచీన ఋత్విక్కు. యాజ్ఞసమాపకుడు అట్టి అగ్నిని యజమానులు తమ బాహువులచే వెలిగించినారు. మానవులు యజ్ఞము, దేవతల ఆహ్వానమునకు అగ్నిని నిరూపించినారు.

6. దివ్యాగ్నీ ! ద్యులోకమందలి దేవతలను నీవు స్వయముగా యజింపుము. మానవులు అపరిపక్వులు. అజ్ఞానులు వారు నీవు లేక ఏమి చేయగలరు? నీవు అప్పుడప్పుడు దేవతలను యజింతువు. అట్లే నిన్ను యజించు కొనుము.

(అగ్నిని యజించలేని మానవుని అశక్తత చెప్పినాడు.)

7. అగ్నీ! మమ్ము దుష్ట, అదుష్ట భయములనుండి రక్షింపుము. మాకు అన్న కర్తవగుము. దాతవగుము. సుందర

పూజనీయ అగ్నీ! మాకు హవన సామగ్రి అందించుము. మా దేహమును పాలింపుము. **"తన్వో ప్రయచ్ఛన్."**

### ఎనిమిదవ సూక్తము

ఋషి - త్వష్టపుత్ర త్రిశిరుడు. దేవత - అగ్ని - ఇంద్రుడు.

ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇప్పుడు అగ్ని మహాపతాకము అందుకొని ద్యావాపృథ్వికి సాగుచున్నాడు. దేవతలను పిలుచునపుడు అగ్ని వృషభధ్వని చేయును. ద్యులోకపు దగ్గరలో ఉండి అగ్ని పరివ్యాప్తుడగును. జలనిధియగు అంతరిక్షమున అగ్ని విద్యుత్ రూపమున వర్ధిల్లును.

2. ద్యావాపృథ్వులమధ్య కామవర్షక, ఉన్నత తేజోవంతుడగు అగ్ని ప్రసన్నుడగు చున్నాడు. రాత్రి మరియు ఉషః కాలపు బిడ్డ, యజ్ఞక కర్మవంత అగ్ని నినదించును. అగ్ని యజ్ఞమున ఉత్సాహ కర్మలు చేయును. ఆహ్వానీయాది స్థలములందు నిలుచును. దేవతలందు ముఖ్యుడు అగును.

3. ద్యావాపృథ్వులు అగ్నికి మాతాపితృరూపులు అగ్ని తన తల్లిదండ్రుల తలమీద తన వెలుగులు పరచును అగ్ని సుబలుడు అతని తేజముగతి పరాయణము. దానిని యాజ్ఞికులు యాజ్ఞములందు ధరింతురు. అగ్ని ఆరును. అప్పుడు శోభాయమాన యజ్ఞస్థానమున వ్యాపించినది, హవ్యాది యుక్తమగు అగ్ని యొక్క దేహమును కవులు ప్రశంసింతురు.

4. అగ్నీ! నీవు ప్రశంసనీయుడువు. ఉషః కాలమునకు ముందే అవతరించువాడవు. పరస్పరము కలిగిన రాత్రింబవళ్లను వెలిగింతువు. నీ దేహమునుండి ఆదిత్యుని సృజించినావు జన్యన్మిత్రంతన్వే స్వాయై. యజ్ఞపు ఏడు స్థానములందు వసించినావు.

5. అగ్నీ! నీవు యాజ్ఞికుడవు చక్షువు వలె ప్రకాశించు వాడవు - భవన చక్షువవు. యజ్ఞరక్షకుడవు. యజ్ఞము కొరకు నీవు జలములకు పౌత్రుడవు. నీవు హవిగ్రహించిన యజమానికి దూతవు అగుచున్నావు.

(జలమునుండి మేఘము కలుగును. అందువలన మేఘము జలములకు పుత్రుడు. మేఘమునుండివిద్యుదగ్ని ఉద్భవించును. కావున అగ్ని జలముల పౌత్రుడు. నీటి వలన చెట్టు, చెట్టునందు నిప్పు పుట్టును. అందువలన నిప్పు నీటికి మునుమడు.)

6. అగ్నీ! నీవు అంతరిక్షమునందలి కళ్యాణకర అశ్వముగల వాయువులతో కలసిపోదువు. అప్పుడు నీవు యజ్ఞములకు, జలములకు నేతవగుదువు. ద్యులోకమందు ప్రధానుడు, సర్వ సేవితుడగు సూర్యుని నీలో ధరింతువు. అగ్నీ! నీ నాలుకను హవ్యవాహికను చేతువు - **"జిహ్వామగ్నే చకృషే హవ్యవాహమ్"**

7. త్రితర్షి యజ్ఞముచేసి ప్రార్థించినాడు కదా :- యజ్ఞమున తండ్రిని ధ్యానించి అనేక విపత్తులనుండి రక్షణ పోందవలెను. అట్లు ప్రార్థించిన త్రితుడు తల్లిదండ్రులకు మంచిమాటలు చెప్పినాడు. యుద్ధపు ఆయుధములు అందుకోని సాగినాడు.

8. ఆప్త పుత్ర త్రితుడు ఇంద్రుని వలన ప్రోత్సాహితుడైనాడు. తండ్రి యుద్ధాస్త్రములు అందుకున్నాడు. యుద్ధము చేసినాడు ఏడుపగ్గముల **"త్రిశిరు"**ని అతడు వధించినాడు త్వష్టపుత్రుని గోవులను అపహరించినాడు.

(ఏడు పగ్గములవాడు అనగా **"సప్తరశ్మిక"** అని మంత్రము. సప్తరశ్మిరాదిత్యః సప్తకిరణములవాడు ఆదిత్యుడు. **"రశ్మి'** కిరణమగును. పగ్గమగును. త్రిశిరుడు ఏడు పగ్గములకు లొంగని వాడనియు సూర్యునివంటి కాంతిమంతుడనియు భావము.)

9. ఇంద్రుడు సాధువులకు ప్రభువు. అతడు స్వాభిమాని. స్వతేజోవిరాజితుడగు త్వష్టపుత్రుని వధించినాడు. ఇంద్రుడు గోవులను కేకవేయుచు, త్వష్టపుత్రుడు విశ్వరూపుని మూడు తలలను త్రుంచినాడు.

(త్రితుడు ఇంద్రుని అంతటివాడని చెప్పుట ఈ మంత్ర ద్రష్ట, త్రితుడే !)

## తొమ్మిదవ సూక్తము

ఋషి - అంబరీష రాజర్షి పుత్రుడు సింధుద్వీపుడు. త్వష్టపుత్రుడు త్రిశిరుడు కూడ కావచ్చును. దేవత - ఆపః జలము. ఛందస్సు - 1,2 అనుష్టుప్, మిగిలినవి గాయత్రి

***అపోహిష్ఠామ యోభువస్తాన ఉర్జే దధావత|***
***మహేరణాయ చక్షసే ||***

1. జలమా! నీవే సుఖములకు ఆధారమవు. అన్నసంచయము చేయుము. మాకు సమ్యక్ జ్ఞానము ప్రసాదించుము.

2. జలమా! తల్లులు పిల్లలకు పాలిచ్చినట్లు - నీవు నీ యొక్క సుఖప్రద రసమును మాకు ప్రసాదించుము.

3. జలమా! ఏ పాపమును నాశము చేయుటకు నీవు మమ్ము ప్రసన్నులను చేయుదువో ఆపాపమునశించవలెనను కోరికగల వారలమై నిన్ను తలకు ఎత్తు కొందుము. జలమా! మా వంశమును వర్ధిల్ల చేయుము.

4. దివ్యజలము మా యజ్ఞములకు సుఖవిధానము కలిగించవలెను. జలములు పాన ఉపయోగ్యములు కావలెను. అని పుట్టిన రోగములను శాంతింప చేయవలెను. పుట్టనున్న వానిని తొలగించవలెను. మా శిరసుల మీద

ద్రవించుము. అభిస్రవన్తువః.

5. కోరిన వస్తువులన్నింటికి స్వామి జలమగును. అతడే మానవులకు ఆవాసము కల్పించును. మేము జలములను వైద్యము ప్రసాదించుమని ప్రార్థించుచున్నాము "ఆపోయాచామి భేషజమ్"

6. సోమము అనుచున్నాడు:-

జలములందే ఇహ సౌఖ్యములు ఉన్నవి. ఔషధములు ఉన్నవి అగ్ని ఉన్నది.

7. జలమా! మా దేహములను రక్షించు ఔషధులకు పుష్టినిమ్ము. అందువలన మేము చిరకాలము సూర్యుని చూడగలము.

8. జలమా! నేను దుష్కృత్యములు చేసి ఉండవచ్చును. హింసాకార్యములకు తలపడి ఉండవచ్చును. అభిసంపాతము చేసి ఉండ వచ్చును అసత్యము పలికి ఉండవచ్చును. వాటిని అన్నింటిని దూరము చేయుము.

9. నేను నేడు జలములందు వసించినాను. జలరసమును పానము చేసినాను. అగ్నీ! నీవు జలయుక్తుడవై విచ్చేయుము. నన్ను తేజస్విని చేయుము. 'సృజవర్చసా.'

**ఆలోచనామృతము:-**

భారతజాతికి ప్రాచీనసంస్కృతి, మహోన్నత నాగరకత, విలక్షణ సంప్రదాయము కాలమునకు అందని చరిత, అపార సాహిత్యము, అనంత కళలు ఉన్నవి. అందుకు భార జాతిహిమదున్నతమై గర్వించవచ్చును.

నేడు తాము అత్యంత నాగరకులమని జబ్బలు చరుచుకొను జాతులకు ఒక్క అజంతా, ఒక్క ఎలోరా, ఒక్కబేలూరు, ఒక్కరామాయణము ఒక్క సంగీత శాస్త్రము, ఒక్క ధన్వంతరిలేడు. వారికి ఉన్నవి కాసులు. అవి ధనమదమునాకు చిహ్నములేగాని మనిషి మనసుకు, సంస్కృతికి చిహ్నములుకావు.

భారత దేశమును పాలించిన పరదేశీయులలో భారత సంప్రదాయ సంస్కృతులకు ఎనలేని ద్రోహము చేసిన వారు ఆంగ్లప్రభువులు - ఆంగ్లప్రజలుకారు. కొంతమంది తెల్లవారు మన సంప్రదాయ సంస్కృతులకు ముగ్ధులైనారు భారత జీవన స్రవంతిలో భాగములైనారు.

ఆంగ్లప్రభువుల పరిపాలనా విధానము తేనెపూసిన కత్తివంటిది. తేనెరుచి చూపి తలనరుకుట వారి పాలనా సంస్కృతి ! తాము పాలించు దేశపు సంస్కృతీ సంప్రదాయములను అడుగంటించి తమనాగరకతయే ఉత్తమమైనదని

పాలకులతో వప్పించుటకు ప్రయత్నించుట వారి కుటిల రాజనీతి !! ఆ నీతినే భారతీయులమీద ప్రయోగించినారు!!!

తమసంస్కృతిని నీచముగా భావించి పాలకుల సంస్కృతిని అందలమెక్కించుట బానిస జాతిలక్షణము. భారతజాతి బానిసజాతి వలెనే ప్రవర్తించినది. స్వాతంత్ర్యము సాధించిన తరువాత ఆంగ్లబానిసత్వమును స్వచ్ఛందముగ తలకెత్తుకున్నది! ఆంగ్లములేక మనకు దిక్కు లేదన్నట్లు ప్రవర్తించుచున్నాము. ఆంగ్లేయులు మానను 'మీరు చరిత్ర హీనులు' అన్నారు 'అవును మేము చరిత్రహీనులమే' అని మనము అంగీకరించినాము. అనంత చరిత్రగల భారతజాతిని చరిత్రహీనులగుఆంగ్లేయులు 'మీకు నీటినిగురించి తెలియదు. నీటి వాడకము తెలియదు' అన్నారు 'అవును మహాప్రభూ తెలియదు. మీరు అదేశించండి ఆచరింతుము.' అన్నామేకాని.

కాలపు సుదీర్ఘహస్తములకు అని వేదములందే నీటిని గురించి వివరించబడి ఉన్నది అని మనము అనలేదు జీవనమునకు నీరే ఆధారము అన్న ఋగ్వేదము 'ఆపత్సు సర్వేభేషజీః' అన్నది. నీటిలోనే సర్వవైద్యములున్నవి అన్నది. మన ఆరోగ్యము నీటివాడకము మీద ఆధారపడి ఉన్నదన్న పాశ్చాత్య వైద్యవిధానము దీనిని కొత్తగా కనుగొన్నదా? ఇది మనమాటలే మనకు చెప్పి మనను వంచించుట కాదా! మనము వంచకులకు స్వచ్ఛందముగా బానిసలము అయినామనుట నిత్యసత్యముకాదా!

ఈ సూక్తము జలమునకు అంకితమైనది జలము విషయమున వివరముగా విలక్షణముగా చెప్పినాడు ఒకరకమగు జలచికిత్సను తొమ్మిదవ మంత్రమున వివరించినాడు.

అప్సుమేసోమో అబ్రవీదన్తర్విశ్వాని, భేషజా!
అగ్నించ విశ్వశమ్భువమ్.
ఇది ఆరవ మంత్రము

**పదవ సూక్తము**

ఋషి - వివస్వతపుత్ర యమి, యముడు. దేవత -
యముడు - యమి. చంధస్సు - త్రిష్టుప్

1. యమి, యమునితో అనుచున్నది:-

ఇది విశాల సముద్రము. సముద్రమధ్యమున ద్వీపము. ఈ ద్వీపము నిర్జనము. ఇచటనీ కొరకు వేచియున్నాను. ఏలననగా నీవు గర్భావస్థనుండియే సహచరుడవు - నీవలన నా గర్భమున కలుగు పుత్రుడు శ్రేష్ఠుడగునని విధాత తలచినాడు.

2. యముడు యమితో అనుచున్నాడు :-

యమీ! యముడు నీ సహచరుడు అగును. కానినీవు కోరినవంటి సంపర్కము చేయజాలడు. ఏలనన నీవు నాసహోదరివి. భగినివి అగంతవ్యవు. అదికాక నీవన్నట్లు ఇది నిర్జర ప్రదేశముకాదు. ప్రజాపతి పుత్రులగు దేవతలందరు చూచు చున్నారు.

3. యమి అనుచున్నది :-

మానవులకు అట్టి సంపర్కము నిషేధమైయున్నది. అయినను దేవతలు ఇష్టపూర్వకముగా అట్టి సంపర్కము చేయుదురు. అందువలననే నాకు అట్టి కోరిక కలిగినది. నీవు సహితము అట్లే చేయుము. పుత్రుని ప్రసాదించు తండ్రివలె నా దేహమున వసించుము. నాతో సంభోగింపుము.

4. యముడు అనుచున్నాడు :-

నేను ఇట్టి కార్యము ఎన్నడును చేయలేదు. నేను సత్యవక్తను. అబద్ధములాడలేదు అంతరిక్షమున ఉన్న గంధర్వ జలధర్త ఆదిత్యుడు మనకు తండ్రి. అంతరిక్షముననే ఉండు సూర్యపత్నిమనకు సహోదర బంధువులము. కావున సంపర్కము ఉచితముకాదు.

5. యమి అనుచున్నది :-

రూపకర్త, శుభాశుభప్రేరకుడు, సర్వాత్మ, దివ్యుడు జనకుడగు ప్రజాపతి మనసు ఈ దశలోనే దంపతులను చేసినాడు. ప్రజాపతి కార్యమున లోపములు ఉండవు. మన ఈ సంబంధము ద్యావా పృథ్వులకు కూడ తెలియును.

6. తొలినాటి సంగతి ఎవడు ఎరుగును? ఎవడు చూచినాడు? ఎవడు వెల్లడించినాడు? మిత్రావరుణుల మహాధామమగు రాత్రింబవళ్లను గురించి నీ అభిప్రాయమేమి?

7. భార్య భర్తలు ఏక శయ్యాగతులై రమింతురు. అట్లే యమా! నీముందు నాదేహము వెల్లడింతును నీవు నన్ను వలచుము. రమ్ము ! ఒకే చోట ఇద్దరము శయనింతము. రథ చక్రములవలె ఏక కార్యరతుల మగుదుము.

8. యముడు అనుచున్నాడు :-

దేవతలకు చారులున్నారు. వారు రాత్రింబవళ్లు తిరుగుచుందురు. వారి కంటి రెప్పవాలదు. దుఃఖదాయినీ యమీ! త్వరగా మరొకని వద్దకు వెళ్లుము. అతనితో రథ చక్రముల వంటి ఏకకార్యము చేయుము.

9. రాత్రింబవళ్లలో యమునకు భాగమున్నది ఆ భాగమును యజమానులు అందించవలెను సూర్యుని తేజము యముని కొరకు ఉదయించ వలెను. పరస్పర సంబంధముగల ద్యావాపృథ్విలు యమునికి బంధువులు. యమీ యములు సహోదరులు కావున ఇతరులను వరించవలెను - "యమీర్యమస్య బిభృయాదజామి."

10. రానున్న కాలమున భగినులు బంధుత్వహీన భ్రాతలను భర్తలుగా పరిగ్రహింతురు. ఇది ఆకాలముకాదు. సుందరీ! నన్ను విడువుము. మరొకరిని పతిగా పరిగ్రహించుము. అతడు నీయందు వీర్యము విడిచిన బాహువులచే ఆలింగనము చేసికొనుము.

11. యమి అనుచున్నది:-

సోదరుడు ఉండగా సోదరిని అనాధను చేయు సోదరుడేమి సోదరుడు! సోదరి దుఃఖమును దూరము చేయనివాడు సోదరుడెట్లు? నేను కామమూర్ఛితనై పలు పలుకులు పలుకుచున్నాను. ఇది తెలిపి నన్ను కౌగిలించు కొనుము -"మేతన్వం సంపిపృగ్ధి"

12. యముడు అనుచున్నాడు:-

యమీ! నేను నీ దేహముతో నా దేహమును సంగమింప నిచ్ఛగించను. సోదరితో సంభోగించిన సోదరుని జనులు పాపిగా చీత్కరింతురు. సుందరీ! నన్ను విడువుము. ఇతర పురుషునితో ఆమోద, ఆహ్లాదముల అనుభవింపుము. నీ సోదరుడు నీతో మైధునము ఇచ్ఛగించడు - "నతేభ్రాతా సుభగేవష్ట్యేతత్"

13. యమి అనుచున్నది :-

యమా! నీవు బలహీనుడవు. మీ మనసు, హృదయము నాకు ఏమాత్రము అర్ధము కాకున్నవి. పగ్గము గుఱ్ఱమును కట్టినట్లు, తీవ చెట్టును అల్లుకున్నట్లు అన్యస్త్రీ, నిన్ను స్వేచ్ఛగా ఆలింగనము చేసికొనును. కాని నీకు నన్ను ఇష్టపడవు!

14. యముడు అనుచున్నాడు :-

యమీ! నీవు సహితము అన్యపురుషుని సుఖముగా ఆలింగనము చేసికొనుము. తీవ చెట్టును చుట్టుకున్నట్లు అన్యపురుషుడు నిన్ను ఆలింగనము చేసికొనుగాత. అతని మనసును నీవు దొంగిలింపుము. నీమనసును అతడు దొంగిలించును - "తస్యవాత్వంమన ఇచ్ఛాసవాతవ". నీవు అతని సాహచర్యము చేయుము.

**ఆలోచనామృతము:-**

ఇది వేదము. మానవ జీవితామృతము. వేదమే నరపశువును మానవునిగా మార్చినది. అతనికి బంధములు, అను బంధములు, సంబంధములు నేర్పినది. మానాయనగారు వేదములోనిదని ఒక శ్లోకమును తరచుగా ఉదాహరించుచుండేడివారు.

"దంతాన్ ధావయేత్ ప్రాతః పలాశవట పిప్పలైః " ఉదయమే దంత ధానము చేయవలెను. అందుకు మోదుగు, మఱ్ఱి, రావిని వాడవలెను అని దాని అర్థము.

వేదమే మానవునకు సకలము నేర్పినది అనిదీని భావము. ఇది వాస్తవమని యే అభిప్రాయము. వేదమును సంహితము చేయునపుడు స్థిరపడిన ఆచార సంబంధ మంత్రములను తొలగించి యుండవచ్చును.

2. మానవ జీవితమునకు సంఘము తప్పనిసరి ఈ విషయమును గుర్తించియే బుద్ధభగవానుడు 'సంఘం శరణం గచ్ఛామి' అన్నాడు.

సంఘము లేక సమాజము మానవ సంబంధములమీద నిలిచి ఉన్నది. ఈ సంబంధములందు లైంగిక సంబంధము ప్రధాన పాత్రవహించును. ఈ సంబంధము వలననే సంతానము, కుటంబము రక్తసంబంధములు ఏర్పడుచున్నవి.

సమాజపు సౌధమునకు కుటుంబము పునాది వంటిది. కుటుంబము ఎంత పటిష్ఠమైన సమాజము అంత బలవత్తరమగును.

కుటుంబమునకు మూలము స్త్రీ, పురుషుల లైంగిక సంబంధము. ఇదియే ప్రేమలు, అభిమానములుఅనుబంధములకు కారణమగుచున్నది. మానవ జీవితము ఈ అనుబంధాలతోనే మధురమై ఉండును.

3. నేటిమన మానవ సంబంధములు అనాదిగా జరుతున్న నిరంతరం సాంఘిక అధ్యయన, ఆచరణ ఫలితములు. ఇంతటి మహత్తమమగు మానవ చరిత్రయందు మానవ లైంగిక సంబంధములు నియంత్రించుటలో మేధావులు చాలవరకు కృతకృత్యులైనారని నా అభిప్రాయము ఎంతటి రాక్షసుడయినను తల్లిని, చెల్లెను, అక్కను ఆశించడు. ఇది రాజకీయ బలప్రయోగమక్కరాలేని స్వచ్ఛంద చెలియకట్ట!

మానవపరిశ్రమ ఈ చెలియలికట్టను. ఆర్థిక, రాజకీయ రంగములందు నిర్మించలేక పోయినది! అది సాధ్యమైన మానవజాతి ఒక నిర్మల మానవతా సామ్రాజ్యము నిర్మించు కొనగలదు. ఇప్పటికి అది మృగ తృష్ణయే !!!

4. స్త్రీ, పురుష లైంగిక సంబంధము సంతానమునకు కారణమగు చున్నది. సంతానమే సమాజపు కొనసాగింపు. శారీరక, మానసిక ఆరోగ్య సంతానమే ఆరోగ్య సమాజమునకు ఆధారము.

అందువలననే స్త్రీ, పురుష సంబంధములను కఠినముగా నియంత్రించవలసి ఉన్నది. ఒకే రక్తమున కలిగిన సంతానమునకు బుద్ధికుశలత లోపించును అను విషయము నిర్దిష్టమైనప్పుడు ఏక గర్భజాతుల లైంగిక సంబంధము నిషేధించబడినది. ఈ యమీ, యమా వృత్తాంతము ఆనాటిది.

5. యమ అనగా కవలలు. ఆదిత్యుడు, ఆదిత్య పత్ని సరణ్యుకు కలిగిన కవలలు యమి, యముడు. వీరి సంవాదము ప్రణయభరితము. మంచి వలపుకథ!

సముద్రము దానిమధ్య ద్వీపము అది నిర్జన ప్రదేశము అక్కడ యమి, "కామమూత"- కామమూర్చిత.

"కామార్తాహిప్రకృతి కృపణాశ్చేతనా చేతనేషు" అన్నాడు కాళిదాసుమేఘ సందేశకావ్యమున. కామార్తులకు చేతనా చేతన జ్ఞానము ఉండదని భావము.

కామార్తురాలయిన యమి తనసోదరుని సంపర్కము కోరినది వారి సంవాదము రమ్యము, రమణీయము నీతిదాయకము.

ఉభయుల వాదములందు బలము కనిపించును. కాని స్వేచ్ఛాకామమునకు కట్ట కట్టవలసి ఉన్నది. ఒక్క ధర్మమును స్థాపించ వలసి ఉన్నది. అది మానవ కళ్యాణ కారి కావలసిన ఉన్నది.

ఈ సంవాదమున నిగ్రహము కనపరిచిన వాడు యముడు. అతడు ధర్మమును నిర్వచించినాడు. ఒకచోట చిరుకోపము కనబరచినాడు. మనసులు కలియుట అను ఒక మంచి న్యాయము ఏర్పరచినాడు "తస్యావాత్వం వచ ఇచ్ఛాసవాతవ" అన్నాడు.

అసలు యమి కోరిన సంబంధము ఎటువంటిది? "రథ్యేవచక్రే" రథచక్రములకు వంటిది రథచక్రములు పరస్పరము కలిసి కొనవు!! గమ్యము చేరుటకు ఉపకరించును !! అయినను ఆమె కామ మూర్చితయే!

అన్నగా యముడు, యమికి మాత్రమే కాదు సకల మానవాళికి మహత్తమ సందేశము అందించినాడు అందుకే అతనిని ఆశీర్వదించినారు:-

రాత్రీ భిరస్మాఅహ భిర్దశస్యేత్సూర్యసచక్షుర్ముహు రున్మిమీయాత్ 9 వ మంత్రము.

## పదకొండవ సూక్తము

ఋషి - హావిర్ధానుడు. దేవత - అగ్ని. ఛందస్సు - జగతి - 7, 8, 9 త్రిష్టుప్

1. అగ్ని మహానుడు. అహింసనీయుడు అతడు కొరకు మహదాకాశమునుండి జలము వర్షించినాడు. ఆదిత్యుని బుద్ధి విశాలము. అతడు సమస్తలోకములను ఎరుగును. యజ్ఞీయ జ్ఞానులు యజ్ఞయోగ్య ఋతువులను యజించవలెను యజ్ఞియోయజతు యజ్ఞియాం ఋతూన్

2. అగ్ని యొక్క గుణములు వివరించగల అప్పరసయు జలములచే సంస్కృతమైన ఆహుతి రూపిణి స్త్రీయు అగ్ని తృప్తి చెందించినారు. నేను ధ్యానమున ఉండి స్తుతింతును. అఖండనీయ అగ్ని మమ్ము యజ్ఞమధ్యమున కూర్చుండ పెట్టవలెను. సకల యజమానులందు పెద్దవాడు మా జ్యేష్ఠ భ్రాత స్తుతించును.

3. ఉషభజనీయ. కీర్తివంత శబ్దవంత ఆమె యజమాని కొరకని ఆదిత్యవతియై తొందరపడి వెలువడినది. అప్పుడే యజ్ఞముకొరకు అగ్నిని కలిగించినారు. యజ్ఞాభిలాషికి మాత్రమే అగ్ని ప్రసన్నుడగును. అగ్ని దేవతల ఆహ్వాత.

4. శ్యేనమును అగ్ని ప్రోత్సహించినది. మహాజనుడు, సూక్ష్మదర్శి, హెచ్చుతచ్చులు లేని సోమమును శ్యేనము తెచ్చినది. అగ్రగామి, దర్శనీయ, దేవతల ఆహ్వానకర్తను ఆర్యులు ప్రార్థించినప్పుడు యజ్ఞక్రియ ఉత్పన్నమగును.

5. అగ్నీ! పశువులకు గడ్డిరుచికరమగును. అట్లే మాకు నీవు సదా రమణీయుడవు. మానవుల హవనముచే నీవు యజ్ఞము కలిగించుము. స్తోతల స్తోత్రములు వినుచు. హవిరూప అన్నము అందుకొనుచు నీవు అనేక దేవతల వద్దకు వెళ్లుదువు.

6. నక్షత్రములను మటుమాయము చేయు ఆదిత్యుడు తన తేజమును ద్యావాపృథ్వులందు వ్యాపించును అగ్నీ ! నీవును అట్లే మాతాపిత్రరూపులగు ద్యావాపృథ్వులను నీ జ్వాలలతో వెలిగించుము. యజ్ఞాభిలాషులగు దేవతల కొరకు యజ్ఞకర్తలు యజ్ఞము చేయసిద్ధముగా ఉన్నారు. వారు హృదయ వ్యగ్రలు. అగ్ని స్తుతులను వర్థిల్ల చేయదలచినాడు. ప్రధాన పురోహితుడగు బ్రహ్మ యజ్ఞము పూర్తి చేయుటకు ఉత్సుకుడై ఉన్నాడు. యజ్ఞమున లోపము జరిగినదేమోనని శంకించుచున్నాడు.

7. అగ్నీ! నీవు బలపుత్రుడవు. అనుగ్రహశీలుడవు. యజమానులు నిన్ను హవిస్సులతోను, స్తోత్రములతోను సేవింతురు. అట్టియజమాని కీర్తివంతుడగును. అన్నదాత అగును. అశ్వవాహనుడగును. దీప్తశాలి, బలశాలి అగును. నిత్యము సుఖించును.

8. యజనీయ అగ్నీ! మేము యజనీయ దేవతల కొరకు స్తుతిసమూహములు రచింతుము. అప్పుడు మాకు రమణీయ వస్తువులను ప్రసాదించుము. యజ్ఞద్రవ్యములను అందుకొను అగ్నీ! మాకుధనభాగము అందవలెను.

9. అగ్నీ! సకల దేవతల యజ్ఞగృహమున నిలువుము. మా మాటలు వినుము. అమృతమయ రథమును సిద్ధము చేయుము. దేవతల మాతాపితరులు - ద్యావాపృథ్వులను మా వద్దకు కొనిరమ్ము. నీవు ఇక్కడే ఉండుము. దేవతలను

వదలి పోకుము.

## పన్నెండవ సూక్తము

ఋషి - హవిర్ధానుడు. దేవత - అగ్ని. ఛందస్సు - త్రిష్టుప్.

1. ప్రధాన భూతులకు ద్యావాపృథ్వులు యజ్ఞములందు అందరికన్న మొదలు అగ్నిని ఆహ్వానించవలెను. అగ్నీ! యజ్ఞము చేయుటకు మానవులను ప్రోత్సహించుము. జ్వాలావంతుడవగుము. దేవతలను ఆహ్వానించుటకు ఆసీనుడవగుము.

2. అగ్ని దివ్యుడు, దేవముఖ్యుడు, సర్వజ్ఞుడు, ధూమధ్వజుడు, ఉద్భిజ్జలనుడు, స్తుత్యుడు, ఆహ్వాత, నిత్యుడు, యజమానుల యజ్ఞకర్త. అగ్ని ఇంద్రాది దేవతల వద్దకేగుచు యజ్ఞసహితమగు హవిని తీసికొని వెళ్లవలెను.

3. అగ్ని స్వయముగా సృష్టించు జలమువలన ఉద్భిజ్జములు ఉత్పన్నమగును. అవి భూమిని రక్షించును. సకల దేవతలు నీ జలదానమును ప్రశంసింతురు. నీ తెల్లనిజ్వాలలు స్వర్గమునందలి జలమును వర్షింప చేయును.

4. అగ్నీ! మా యజ్ఞరూప కర్మలను పెంపొందించుము. వర్షము కలిగించు ద్యావా పృథ్వులారా! నేను మిమ్ము సుత్తింతును. మా స్తుతులు వినండి. యజ్ఞములందు స్తోతలు మిమ్ము స్తుతింతురు. అప్పుడు జలవృష్టి కలిగించుడు. మా మలినములను దూరము చేయుడు.

5. ప్రదీప్త అగ్ని మా స్తుతులు విన్నాడా? మా హవిగ్రహించినాడా? మేము అగ్నిని సరిగా పూజించినామా? ఏమో! ఎవరికి తెలియును? స్నేహితుడు పిలిచినంత వచ్చును. అట్లే అగ్ని సహితము రావచ్చును. మా ఈ స్తుతి దేవతలను చేరవలెను. ఇక్కడ ఉన్న ఖాద్యములు దేవతల వద్దకు చేరవలెను.

6. అమర సూర్యుని అపరాధశూన్య, మధురరసవంత జలము పృథ్విపై నానా విధములై ఉండును. సూర్యుడు యముని అపరాధములు క్షమించును. అగ్నీ! క్షమాశీల సూర్యుని కాపాడుము.

7. యజ్ఞములందు అగ్ని ఉండగా దేవతలు ప్రసన్నులగుదురు. యజమానులు దేవరూప స్థానములందు దేవతలను ప్రతిష్ఠింతురు. దేవతలు సూర్యునిలో వెలుగును, చంద్రునిలో రాత్రిని స్థాపించినారు. సూర్య చంద్రులు వెలుగులు అందుకొందురు.

8. అగ్ని జ్ఞానస్వరూపుడు. అగ్ని ఉన్నప్పుడు దేవతలు తమ తమ కార్యములు నిర్వహింతురు. వారి స్వరూపములు మాకు అర్థము కావు. ఈ యజ్ఞమున మిత్ర, అదితి, సూర్యులున్నారు. వారు పాపశూన్య అగ్నికి మేము పాపరహితులమని చెప్పవలెను.

9. అగ్నీ! సకల దేవతల యజ్ఞగృహమున నిలువుము. మా మాటలు వినుము. అమృతమయ రథమును సిద్ధము చేయుము. దేవతల మాతాపితరులు ద్యావాపృథ్వులు వారిని మా వద్దకు కొనిరమ్ము. నీవు ఇచటనే ఉండుము. దేవతలను వదలి పోకుము.

## పదమూడవ సూక్తము

ఋషి - అదితి పుత్ర వివస్వతుడు. దేవత - శకట ద్వయము.

ఛందస్సు - త్రిష్టుప్ - చివరిది జగతి.

1. శకటద్వయమా! ప్రాచీన కాలమున అవతరించిన మంత్రములు ఉచ్చరించుచు, సోమాదులు నింపిమిమ్ము పత్నీశాల చివరకు తీసికొని వెళ్లుదును. స్తోత ఆహుతివలె నాస్తుతివచనము - దేవతలనుచేరవలెను దివ్య ధామమందున్న దేవతలందరు వినవలెను.

2. మీరు కవలలవలె సాగునపుడు దేవపూజక మానవులు మిమ్ము హోమ ద్రవ్యములతో నింపుదురు. మీరు మీ స్థానములందు నిలువండి. మా సోమము కొరకు శుభస్థానము ఆక్రమించండి.

3. యజ్ఞమునకు 1) ధాన్య, 2) సోమ, 3)పశు, 4) పురోడాశ 5) ఘృతములను అయిదు ఉపకరణములు. వానిని నేను తగినంత కూర్చెదను. నియమప్రకారము త్రిష్టుపాది నాలుగు ఛందస్సులను ఉపయోగింతును. ఓంకారమును ఉచ్చరించి ప్రస్తుత కార్యమును ప్రారంభింతును. యజ్ఞపు నాభి స్వరూప వేదిమీద సోమమును శుద్ధిచేయుదును.

4. దేవతలలో ఎవరిని మృత్యుగృహమునకు పంపవలెను? ప్రజలలో ఎవరిని అమరులను చేయవలెను? మేము యజ్ఞకర్తలము. మంత్రపూత యజ్ఞమును అనుష్ఠింతుము. అందువలన యముడు మమ్ము మత్యుగృహమునకు పంపడు.

5. సోమము పితృస్వరూపము. ప్రశంసనీయము స్తోతలు సోమమును సప్త ఛందముల స్తుతింతురు. పుత్రస్వరూపులగు పురోహితులు స్తుతింతురు. అభయ శకటములు మానవులు దేవతల కొరకు శోభిల్లును. పని చేయును. దేవతలను, మానవులను పోషించును.

(మానవుల, దేవతల సమానత్వము వచించినాడు.)

## పదునాలుగవ సూక్తము

ఋషి - వైవస్వతపుత్ర యముడు. దేవత - యముడు - పితరులు.

ఛందస్సు - వేరు వేరు.

1. అంతఃకరణమా! పితరుల స్వామి యముడు. అతనిని పురోడాశాదులతో అర్చించును. సత్కర్మలు చేసినవారిని యముడు సుఖప్రదేశమునకు చేర్చును. అతడు అనేకుల మార్గములను నిర్ణయించును. సకల మానవ జాతి అతనినే చేరుమ.

2. యముడు అందరకు ముఖ్యుడు. అతడు మా శుభాశుభములన్నింటిని ఎరుంగును. యముని మార్గమును ఎంతటి వాడును అడ్డుకొన జాలడు. మనపూర్వజులు పోయిన మార్గముననే - కర్మానుసారముగ సకల - జీవులు పోవుదురు.

3. ఇంద్రుని సారథి మాతల్లి. అతడు కవ్యవంత పితరుల సాయమున వర్ధిల్లును. యముడు అంగిరనామకపితరుల సాయమున వర్ధిల్లును. దేవతలను సంవర్ధిల్ల చేయువారును. దేవతలు సంవర్ధిల్ల చేయువారును వర్ధిల్లుదురు. కొందరు 'స్వాహ' మున కొందరు 'స్వధ' వలన వర్ధిల్లుదురు - "స్వాహాన్యేస్వధాయాన్యే మదన్తి"

4. యమా! అంగిరనామక పితరుల సహితుడవై విస్తృతమగు ఈ యజ్ఞవిశేషమునకు విచ్చేయుము. ఆసీనుడవగుము. ఋత్విక్కుల మంత్రములు నిన్ను ఆహ్వానించవలెను. రాజా! ఈ హవితో సంతుష్టుడవగుము. యజమానులను ప్రసన్నులను చేయుము "రాజన్హ్వవిషా మాదయస్వ".

5. యమా! అంగిరుల బహురూపులు. వారి సహితుడవై యజ్ఞమునకు విచ్చేయుము. యజమానుని ప్రసన్నుని చేయుము. నీ తండ్రి వివస్వతుని యజ్ఞమునకు ఆహ్వానించుచున్నాను. అతడు యజ్ఞపుకుశల మీద కూర్చుండవలెను "యజ్ఞేబర్హ్విష్యానిషద్య."

6. అంగిర, అధర్వ, భృగు పితృగణములు ఇప్పుడిప్పుడే విచ్చేసినారు. వారందరు సోమ అధికారులు అగుదురు. యజ్ఞయోగ్యులగు ఆపితరుల అనుగ్రహమున మేము ఉండవలెను. అందువలన మేము సుమస్కులము, శుభానహమూలము కావలెను "భద్రే సౌమనస్యేస్యామ."

7. మన ప్రాచీన పితామహాదులు పోయిన మార్గముననే - మృతపితా! నీవును వెళ్లుము. అమృతాన్నమున ప్రహృష్టమనస్కుడగు యముని - వరుణుని దర్శింపుము.

8. పితా! ఉత్కృష్ట స్వర్గమున నీ పితరులను కలసి కొనుము. నీవు చేసిన కర్మఫలమును కలసి కొనుము. పాపములను వర్జించుము. 'అస్త' నామక గ్రహమున నివసించుము. ఉజ్వల దేహము ధరింపుము - "గచ్ఛస్వతన్వా సువర్చాః"

9. శ్మశానమందున్న పిశాచాదులారా! ఈ స్థానము వదలండి, వెళ్లండి. దూరము కండి. ఈస్థలమును పితరులు

మృత యజమానుల కొరకు చేసినారు. ఈ స్థలము పగళ్లు, జలములు, రాత్రులతో శోభిల్లును. యముడు ఈ స్థానమును మృతులకు ఇచ్చినాడు "యమోదదాత్య వసోనమస్మై."

10. మృతపితా! నాలుగు కన్నులు, విచిత్ర వర్ణములుగల రెండు కుక్కల వద్దనుండి వెంటనే సాగి పొమ్ము. విజ్ఞులగు పితరులు యముని వద్ద సుఖముగా ఉండునట్టి ఉత్తమ మార్గమున సాగుము - వారి వద్దకు చేరుము.

11. యమా! నీ గృహమున రక్షించునని - నాలుగు కన్నులుగలవి మానవుల ప్రశంసలందుకొను రెండు కుక్కలనుంచి ఈ మృత జీవిని రక్షింపుము. రాజా ! ఇతనికి శుభములు కలిగించుము. నిరోగిని చేయుము.

12. యమదూతలగు రెండు కుక్కలు పొడవు ముక్కులు గలవి ఇతరుల ప్రాణములు తిని తృప్తి చెందునవి మానవులను వెంబడించునవి. విస్తృత బలవంతములు. అవి మాకు - ఈనాడు - సూర్య దర్శనమునకు - ప్రాణము పోయవలెను.

13. ఋత్విక్కులారా! యమునకు సోమము సమర్పించండి. యముని కొరకు హవిని హవనము చేయండి. ఏ యజ్ఞపు దూత అగ్ని అగునో, ఏయజ్ఞమును వివిధ ద్రవ్యముల చేసమన్వితము చేయబడునో అట్టి యజ్ఞము యముని చేరును - "యమంహయజ్ఞోగచ్ఛతి."

14. ఋత్విక్కులారా! యముని కొరకు ఘృతయుక్త హవిని హవనము చేయండి. దేవతలందు యముడు మేము ప్రజీవించుటకు దీర్ఘాయువును ప్రసాదించ వలెను "సనో దేవేష్వాయ మద్దీర్ఘమాయః ప్రజీనసే."

15. ఋత్విక్కులారా! యముని కొరకు 'మధుమత్తమ' హవిని హవనము చేయండి. మాకన్నముందు శుభప్రద మార్గములు పరచిన ఋత్విక్కులకు నమస్కారము.

16. యమరాజు త్రికద్రుక యజ్ఞమునకు అధికారి. అతడు ఆరు స్థానములందు వసించును. అతడు విరాట్ ప్రపంచమున సంచరించును. త్రిష్టుప్, గాయత్రి మున్నగు ఛందస్సులలో యముని స్తుతించ బడును.

(త్రికద్రుకము - జ్యోతి, గోవు, ఆయువు. ద్యులోక భూలోక, జల, ఉద్బిజ్జ, ఉర్క, సూనృతములు యముని ఆరు స్థానములు)

**ఆలోచనామృతము:-**

**అచ్ఛేద్యోయమ దాహ్యోయం అక్లేద్యో శోష్యేవచ**
**నిత్యం సర్వగతః స్థాణుః అచలో యః సనాతనః**

దీనిని ఛేదించరాదు దహించరాదు బాధించరాదు. శోషింపరాదు ఇది నిత్యము, సర్వగతము, స్థాణువు. అచలము ఇది సనాతనము.

ఇది భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ ఆత్మనుగురించి ప్రవచించినది.

ఆత్మజ్ఞానము భారతీయులు మాత్రమే సాధించినారు. పాశ్చాత్యులు దీనిని తెలిసికొనుటకు యుగములు పట్టును. ఏలనన వారికి ఈ విషయమున ఇంకను అక్షరాభ్యాసము కాలేదు. ఆత్మకు దేహము వస్త్రము వంటిదని గీతాకారుడు ప్రవచించినాడు. వాసాంసి జీర్ణాన్యవ్యాని సంయాతి నవాని గృహ్ణాతి నరోపరాణి తథాశరీరాణి విహాయ జీర్ణాన్యవ్యాన్ని సంయాతి నవాని గృహ్ణాతి నరోపరాణి తథాశారీరారాణి విహాయ జీర్ణన్యవ్యాని సంయాతి నవాని దేహినరుడు పాతబట్టలను వదిలేస్తాడు. కొత్త వానిని కట్టకుంటాడు. ఆత్మకూడా అంతే పాత శరీరాన్ని విడిచేస్తుంది. కొత్త దానిని ధరిస్తుంది. ఇది ఊహాజనితం కాదు జీవితాన్ని కాచివడపోసి కనుగొన్న నిత్యసత్యాలు ! ప్రకృతికి పరిణామమేకాని నశింపులేదు గింజ చెట్టుగా మారుతుంది. చెట్టు కర్రగా మారుతుంది. కర్రకు నిప్పంటుకుని బూడిద అవుతుంది బూడిద మట్టిగా పరిణమిస్తుంది ప్రకృతిసొంతం ఇంతే! ఇది ప్రకృతి ధర్మం! ఈ ప్రకృతి ధర్మాన్ని అనుసరించే ఆత్మపరిణామం అది నశించదు.

జీవితానికి మృత్యువు మార్పుమాత్రమే. అంతంకాదు. భౌతికంగా ఆలోచించినా మనిషి చచ్చినంత అతని ఆస్తి చచ్చుటలేదు. మరణించిన వాని మరణ శాసనమును అమలుపరచవలసి ఉన్నది. అతని సంతానము వారసులు అతని అభీష్టములను తీర్చవలసి ఉన్నది! శాసనమున మరణించిన వానికే హక్కులు ఎక్కువ!!

"**పితావైపుత్రనామాసీత్** " కొడుకు తండ్రి రూపముననే పుట్టుచున్నాడు తల్లిదండ్రులనుంచి వారి సంతానము వట్టి జీవితమునే అందుకొనదు. వారి రూపము, గుణగణములు, బుద్ధి, ఆరోగ్యము, అనారోగ్యము అన్నింటి అందుకొనుచున్నారు. ఇవన్నియు ఏడుతరములనుంచి సంక్రమించునని శాస్త్రము అన్నింటివలెనే ఆస్తియు సంతానమునాకు చెందుచున్నది.

పితా అనగా తండ్రిమాత్రమేకాదు. తల్లిదండ్రులని అర్థము. తల్లిదండ్రులు విగత జీవులైనపుడు సంతానము వారి విషయమున కృతజ్ఞత ప్రేమాభిమానములు ప్రదర్శించవలసి ఉన్నది. అందుకు సంబంధించినవే శ్రాద్ధాది కర్మలు.

విగతాత్మను గురించి సంతానపు ప్రార్థన ఈ సూక్తమున చెప్ప బడినది. ఇది అందముగ, సుందరముగ, రమ్యముగ, రమణీయముగ ఉన్నది.

విగతాత్మకు సుఖములు ప్రసాదించుమని సంతానము చేయు ప్రార్థన ! ఇందు పితరుల విషయమున సంతానపు శ్రద్ధ చూచినపుడు నాకు కనులు చెమ్మగిలినవి.

ఋషులు, మహాత్ములు, విద్వాంసులు, కవులు ఎంత ఉదాత్తముగ ఆలోచించినారు! ఎంత గంభిరముగ చెప్పినారు !! ఎంతటి ఆత్మీయత కనబరచినారు. ఇది సనాతన భారతీయ ఆలోచనమునకు తప్ప సాధ్యపడదు

ప్రేహిప్రేహి పధిభిః పూర్వ్యేభిర్యత్రానః పూర్వేపితరః పరేయుః |
ఉభారాజానస్వధియా మదన్తాయమం పశ్యసి వరుణంచ దేవమ్ ||

మరొకసారి ఈ సూక్తము చూడండి.

**పదిహేనవ సూక్తము**

**ఋషి - యమపుత్ర శంఖుడు. దేవత - అగ్ని - పితరులు.**

**ఛందస్సు - త్రిష్టుప్ - 11 జగతి**

1. పితరులు ఉత్తమ, మధ్యమ, అధమములను మూడు శ్రేణులవారు. వారు మమ్ము అనుగ్రహించ వలెను. మేము సమర్పించిన హోమ ద్రవ్యములను అందుకొనవలెను. ఈ యజ్ఞమునాకు అహింసకులు, మా కర్మానుష్ఠానములకు సంతసించినవారు, మా ప్రాణములు రక్షించదలచిన పితరులు విచ్చేసినారు. వారు మమ్ము రక్షించవలెను.

2.పితరులు పూర్వము గతించిన వారున్నారు. తదుపరి గతించిన వారున్నారు. భూలోకమునకు దిగివచ్చిన వారున్నారు. భాగ్యశాలురమధ్య మసలు వారున్నారు. నేడు వారందరకు నమస్కరించు చున్నాను.

3. నాకు పితరులు ఎంతో పరిచితులు. నాకు వారు లభించినారు. ఈ యజ్ఞసము పార్జన ఉపాయము సహితము లభించినది. పితరులు కుశలమీద కూర్చున్నారు. సోమరసము సేవించుచున్నారు. వారందరు విచ్చేసినవారే!

4. కుశలమీద కూర్చున్న పితరులారా! విచ్చేయండి. మీకు సకల ద్రవ్యములు సమర్పించినాము. స్వీకరించండి. అనుభవించండి. మాకు ఆశ్రయమొసంగండి. మమ్ము రక్షించండి. మాకు శుభములు సమకూర్చండి. అశుభములను, పాపములను దూరము చేయండి.

5. కుశలపై మనోహరద్రవ్యములు ఉంచినాము. వీనిని అనుభవించుటకును సోమమును సేవించుటకును పితరులను ఆహ్వానించినాము. వారు విచ్చేయవలెను. మా స్తుతులను గ్రహించవలెను. ఆనందించవలెను మమ్ము రక్షించవలెను.

6. పితరులారా! మీరు మోకాళ్లమీద దక్షిణదిశగా నేలపై ఆసీనులుకండి. ఈ యజ్ఞమును ప్రశంసించండి. మేము మానవులము. మా వలన అపరాధములు జరగవచ్చును. కాని వాటి కొరకు మమ్ము బాధించకండి.

7. అగ్ని యొక్క లోహిత శిఖవద్ద కూర్చున్న దాతలకు ధనము ప్రసాదించండి. వారి పితరులకు ధనము అందించండి. వారిని ఈ యజ్ఞమున ప్రోత్సహించండి.

8. సోమపాయులగు ప్రాచీన పితరుల ధనవత్తములు వారు యథావిధిగా సోమపానము చేసినారు, వారు సహితము హవిని అభిలషింతురు - యముడు సహితము అభిలషించును. పితరులతో కూడ యముడు సుఖించవలెను హోమద్రవ్యములను స్వేచ్ఛగా భుజించవలెను.

9. పితరులు - హవనము చేయుట ఎరిగివారు -అనేక ఋక్కులు రచించి స్తోత్రములు సమర్పించినవారు. తమ కర్మప్రభావమున దేవత్వము నొందినవారు. వారు ఆకలి దప్పులు కలిగి ఉండవచ్చును. అగ్నీ! వారు నీకు విశేష పరిచితులు. వారిని మా వద్దకు తోడ్కొని రమ్ము. వారు యజ్ఞమున కూర్చుందురు. ఈ ఉత్కృష్ట హవి వారి కొరకే అగును.

10. అగ్నీ! సాధుస్వభావ పితరులు దేవతలతో కూడి హవిని ఆరగింతురు. సేవింతురు. వారు ఇంద్రుని రథమున ఇంద్రునితోబాటు కూర్చుందురు. వారు దేవారాథకులు. యజ్ఞఅనుష్ఠాతలు. వారు ప్రాచీన ఆధునిక పితరులు. వారిని తోడ్కొని నీవు విచ్చేయుము.

11. అగ్ని ష్వాత్త పితరులారా! ఇచ్చటికి విచ్చేయండి. ఒక్కొక్కరు మీమీ ఆసనములలో కూర్చొనండి. అభిపూజిత పితరులారా! కుశలపై శుద్ధహవి వడ్డించి ఉన్నది ఆరగించండి. మాకు పుత్ర, పౌత్రాదియుక్త ధనము ప్రసాదించండి.

12. సమస్తలోక జ్ఞాత అగ్నీ! మేము నిన్ను స్తుతించినాము. నీవు హవిని సుగంధయుతము చేసినావు. పితరులు భుజించవలెను. దేవా! మేము ఎంతో శ్రమించి హవిని సమర్పించినాము భక్షింపుము.

13. జ్ఞాని అగ్నీ! పితరులు ఇచ్చటికి వచ్చినవారున్నారు రానివారున్నారు. పితరులలో మేము ఎరిగిన వారున్నారు. ఎరుగని వారున్నారు. వారినందరిని నీవు ఎరుగుదువు.

14. స్వయంప్రకాశ అగ్నీ! పితరులలో అగ్నికి అర్పితమైన వారున్నారు- కానివారున్నారు. వారందరు స్వర్గమున స్వధసహితులై ఆనందించ వలెను. నీవు వారితో కలసి పొమ్ము. వారి కోరిక ప్రకారము వారి ప్రాణాధార శరీరములను దైవ శరీరములు చేయుము.

**పదహారవ సూక్తము**

ఋషి - యమపుత్ర దమనుడు. దేవత - అగ్ని. ఛందస్సు

1-10 త్రిష్టుప్- మిగిలినవి అనుష్టుప్.

1. అగ్నీ! మృతుని దేహపు సర్వాంశములు భస్మము చేయకుము. ఇతని దేహమును చిన్నా భిన్నము చేయకుము. నీ జ్వాలలకు ఇతని శరీరము పక్వమైనంత ఇతనిని పితరుల వద్దకు పంపుము.

2. అగ్నీ! ఇతని శరీరమును నీవు దహించగానే పితరుల వద్దకు పంపుము. ఇతడు మరల సజీవుడైనపుడు దేవతల అధీనమున ఉండును.

3. మృతవ్యక్తీ! నీనేత్రము సూర్యుని వద్దకు, శ్వాసవాయువును చేరవలెను. నీవు పుణ్యఫలమున ఆకాశము, భూమి మీదకు పొమ్ము. జలములకు వెళ్లదలచిన జలములకే వెళ్లుము. నీ అవయములు వనస్పతులందు ఉండునుగాత.

4. ఈ వ్యక్తిలో జన్మరాహిత్య దశుండును. నిత్యదశ ఉండును. అగ్నీ! నీ ఉజ్వల జ్వాలతో ఆ అంశము తపింపచేయుము. జ్ఞాని అగ్నీ! నీ మంగళమయ మూర్తులున్నవే వాని ద్వారా ఈ వ్యక్తిని పుణ్యవంతులు ఉండు చోటునకు చేర్చుము.

5. అగ్నీ! నీకు ఆహుతిస్వరూపుడై, యజ్ఞద్రవ్యములు భుజించువానిని పితరుల వద్దకు పంపుము. ఇతని మిగలిన భాగమునకు ప్రాణము వచ్చిలేవవలెను. జ్ఞాని అగ్నీ! అతనికి మరల దేహము కలుగుగాత.

6. మృతవ్యక్తీ! నీ శరీరమునందలి ఒక భాగమునుకాకి, మరొక భాగమును, చీమలు, పాములు బాధ పెట్టి ఉండవచ్చును. ఆభాగమున సర్వభోక్త అగ్ని రోగము లేకుండ తీయవలెను. నీ దేహమందు నిలిచినా సోమము సహిత ఆ భాగమును నిరోగిని చేయవలెను.

(వాటి కాటుకు అగ్ని ఔషధమగునట్లున్నది.)

7. మృతుడా! నీవు గోచర్మ సహితముగా అగ్ని శిఖా స్వరూప కవచమును ధరింపుము. అట్లు చేయుటవలన - బలపూర్వకముగను, అహంకారయుతముగను నిన్ను దహించుతాకు సిద్ధమగు అగ్ని నీ సర్వాంశములకు వ్యాపించలేడు.

8. అగ్నీ! ఈ చమసమును అంతకుము. ఇది సోమపాయులను ప్రసన్నులను చేయును. ఈ చమసముదేవతల పానము కొరకైనది. దీనిని చూచి దేవతలు ఉప్పొంగుదురు.

9. మాంస భోజన అగ్ని పాపములను మోయును. నేను అట్టి అగ్నిని దూరమున ఉంచెదను. ఎవరికి యముడు రాజగునో అగ్ని వారి వద్దకే చేరవలెను. ఇదిగో ఇది ఒక అగ్ని అతడు దేవతల వద్దకు హవిని చేర్చవలెను.

10. మాంసభోజి, చితావంత అగ్ని మీ ఇంటచేరినాడు. అతనిని నేను దూరము చేతును. మరొకటి జ్ఞాని అగ్ని. పితరులకు యజ్ఞము వహించుటకు ఆ అగ్నిని గ్రహింతును. ఈ అగ్ని యజ్ఞము అందుకోని పరంధామము చేరవలెను.

11. శ్రద్ధాద్రవ్యములను వహించు అగ్నియు, యజ్ఞమును ఉన్నతము చేయు అగ్నియు దేవతలను, పితరులను ఆరాధించును వారికి హోమ ద్రవ్యములు చేర్చును.

12. అగ్నీ! నేను నిన్ను ప్రయత్నపూర్వకముగ స్థాపింతును. ప్రయత్న పూర్వకముగ ప్రజ్వలింప చేయుదును. యజ్ఞాభిలాషులగు దేవతల, పితరుల భక్షణకుగాను నీవు ప్రయత్న పూర్వకముగ హోమద్రవ్యములను చేర్చుము.

13. అగ్నీ! నీవు దహించిన దానిని ఆర్పుము. ఇక్కడ జలములు ఉండవలెను శాఖ, ప్రశాఖల దుర్వ మొలువవలెను.

14. పృథివీ! నీవు చల్లనిదానవు. నీ మీద ఎన్నో చల్లని చెట్లున్నవి. నీవు ఆనందదాయనివి. నీమీద అనేక ఆనందదాయక వృక్షములున్నవి ఆడ కప్పకు తృప్తి కలుగునంత వర్షింపుము. అగ్నిని సంతోషపరచుము.

*(శ్రీమదాంధ్ర వచన సంహిత పదవ అష్టకము పదవ మండలమున మొదటి అనువాకము సమాప్తము)*

**రెండవ అనువాకము పదిహేడవ సూక్తము**

ఋషి - యమపుత్ర విశ్రవుడు. దేవతలు - ఒక్కరుకారు. ఛందస్సు -

1 - 12 త్రిష్టుప్ -13,14 అనుష్ప్

1. త్వష్ట తనకూతురు 'సరణ్య' వివాహము చేయనున్నాడు. అందుకు సమస్తలోకములు దిగినవి. యముని తల్లి వివాహమైనపుడు వివస్వతుని పత్ని వచ్చినది.

2. అమర 'సరణ్య' ను మానవుల మధ్యదాచినారు. సరణ్యవంటి ఒకస్త్రీని చేసి ఆమెను వివిస్వతునకు ఇచ్చినారు. అప్పుడు అశ్వరూపమున ఉన్న సరణ్య తన గర్భమున అశ్వినులను దాల్చినది. కవల అశ్వినులను కన్నది.

3. జ్ఞాని, లోకరక్షకుడు పశు రక్షకుడగు పూషనన్ను ఉత్తమలోకములకు చేర్చునుగాత. అగ్నిదేవుడు నిన్ను ధనదేవతల పితరులవద్దకు చేర్చునుగాత.

4. పూష సకల జగములకు ప్రాణము. అతడు నీ జీవనమును రక్షించవలెను. అతడు నీ గమ్యస్థానమునకు అగ్రభాగమున ఉండును. అతడు నిన్ను రక్షించవలెను. ఎచట పుణ్యవంతులున్నారో, వారు ఎచటికేతెంచి నారో నిన్ను పూష అచటికి చేర్చవలెను.

5. పూష సకల దిశలను తెలిసినవాడు. అతడు మమ్ము భయములేని మార్గమున నడిపించవలెను. అతడు కళ్యాణ ప్రదుడు. అతని రూపము లోకములందు వ్యాపించి ఉన్నది. సమస్త వీరులు అతని వెంటనే ఉన్నారు. అతడు మమ్ము ఎరుగును అప్రమత్తుడై అతడు మా వద్దకు రావలెను.

6. సకల మార్గమ్ములందు శ్రేష్ఠమార్గమ్మున పూష దర్శనము ఇచ్చినాడు. స్వర్గ, మర్త్యములందలి శ్రేష్ఠ మార్గమున దర్శనము ఇచ్చినాడు. పూషకు ద్యావా పృథ్వులు ఇరువురు ప్రేయసులు. వారు కలిసిమెలిసి ఉందురు. వారిని పూషదేవుడు రంజింప చేయును.

7. దేవతలను గూర్చి యజ్ఞము చేయువారు పూజకొరకు సరస్వతిని ఆహ్వానింతురు. దేవతల యజ్ఞము సవివరముగా ప్రారంభమైనపుడు పుణ్యాత్ములు సరస్వతిని ఆహ్వానించినారు. సరస్వతి దాతల కోర్కెలు తీర్చవలెను.

8. సరస్వతీ! నీవు పితరులతో బాటు ఒకే రథమున సాగుము. వారితోగూడి యజ్ఞద్రవ్యములు స్వీకరింపుము. రారమ్ము. ఈ యజ్ఞమున ఆనందింపుము. మమ్ము రో గరహితులను చేయుము. మాకు అన్నదానము చేయుము.

9. సరస్వతీ! పితరులు విచ్చేసినారు. దక్షిణ భాగమున కూడినారు. నిన్ను ఆహ్వానించినారు. నీవు యజ్ఞకర్తకు బహుమూల్యము, విలక్షణమగు అన్నరాశిని విశేష అన్నమును కలిగింపుము.

10. జలము మాతృస్వరూపము. జలము మమ్ము పరిశుద్ధులను చేయవలెను. ఘృతపూత జలము మా మలినమును తొలగించవలెను. జలరూపదేవీ! సకల పాపములను నీ ప్రవాహమున తీసికొని పొమ్ము. జలమునుండి మేము స్వచ్ఛముగను, పవిత్రముగను బయటపడుదుము.

11. ద్రవరూప సోమము ఎంతో చక్కనిది. దీప్తశీల అంశమున క్షరితమగునది. అది ఈ స్థానమున క్షరితమగును - పూర్వస్థానమున క్షరితమైనది. మేము సప్తసవన కర్తలము. ఆధార మధ్యమున విహరించు ద్రవసోమము కొరకు హవనము చేయుదుము.

12. సోమమా! ద్రవాత్మకుడవాగు నీవు క్షరితుడవగుదువు. నీ అంశము పురోహితుని చేతినుండి ప్రస్తర ఫలకము మీదపడును నీవు పవిత్రము మీద స్థాపించ బడుదువు. అట్టి నీకు నమస్కరింతుము. హవనము చేయుదుము.

13. నీ యొక్క రసము బయల్పడినదియు, స్రుక్ కింద రాలినదియు ఈ రెంటిని బృహస్పతి సేవించవలెను. అందు వలన మాకు ధనము లభించును.

14. వనస్పతులు పాలవలె ప్రవహించవలెను. మాస్తోత్రవాక్కు దివ్య జలము వలె ప్రవహించవలెను. అవన్నియు మమ్ము సంస్కరించవలెను.

## పద్ధెనిమిదివ సూక్తము

ఋషి - యమపుత్ర సంకుసుకుడు. దేవత - వేరువేరు.

ఛందస్సు - ప్రస్తారపంక్తి - జగతి అనుష్టుప్ త్రిష్టుప్

1. మృత్యువా! దేవయానముకాని మార్గమున పయనింపుము. నీవు చూడగలవు వినగలవు నా విన్నపము ఆలకింపుము. మా పుత్రపౌత్రులను, వీరులను హింసించకుము "ప్రజారి రిరిషో మోత వీరన్"

2. మృత వ్యక్తుల సంబంధులారా! పితృయానమగు మృత్యుమార్గమును విసర్జించండి. అందువలన చిరాయువు లభించును. "దీర్ఘాయుః ప్రతరం దధానాః" యజ్ఞానుష్ఠాతలగు యజమానులారా! మీరు పుత్ర, పౌత్ర గోయుక్తులు కండి ఈ జన్మ, పూర్వజన్మ పాపములను పరిహరించండి పవిత్రులు కండి.

3. జీవమానవులారా! మృతమానవుల వద్దకు మరలిరండి నేటి మా పితృమేధ యజ్ఞము శుభావహము కావలెను మేము ఈ నాడు సంబరముగా ఆడుటకు, పాడుటకు సమర్థులము కావలెను. మాకు దీర్ఘాయువు కలుగవలెను.

4. పుత్ర పౌత్రాదులను రక్షించుటకు మృత్యువును అడ్డగించుటకు మృత్యుమార్గమున రాళ్లు వేస్తాను. అందువలన మరణము త్వరపడిరాదు. మృత్యువును రాళ్లతో దూరము చేయండి "మృత్యుం దధతాం పర్వతేన"

(ఇది ఏదో శిలాచికిత్సవలె అనిపించుచున్నది ఇది మృత్యువును దూరము చేయుటకు ఉపకరించునట్లున్నది. వైద్యులు పరిశీలించవలసి ఉన్నది. ఇది రాయివిసరి మృత్యువును పారద్రోలుట మాత్రముకాదు.)

5. రోజు తరువాత రోజు గడచిపోవును. ఋతువుదాటి ఋతువు సాగిపోవును. పూర్వకాలపు పితరులు ఉండగా ఇప్పటి పుత్రులు గతించరు. దాతా! అట్లే మావారికి ఆయువు కల్పించుము. "ధాతారాయూంషి కల్పయైషామ్"

6. మృతుని పుత్రాదులారా! వృద్ధులైనను ఆయువును అధిష్ఠించండి. జ్యేష్ఠుని పిదప కనిష్ఠ క్రమమున కార్యములు నిర్వహించండి. శోభన జన్మత్వష్ట మీతో పాటు ఈ కార్యమున ప్రవృత్తుడై ఉన్నాడు. మీరు జీవించుటకు అతడు మీ ఆయువును పోడిగించును. "జీర్ఘ మాయుః కార్తి జీవసేవః"

(కుటుంబనిర్వహణ నిలువరాదు అందుకు యాజమాన్య క్రమమును ఏర్పరచినాడు.)

7.విధవలు కానివారు, పతులుగల సుమంగళులు కాటుక కన్నీరు లేనివారై స్వగృహములకు చేరవలెను. మనోవ్యథలేక శోభనులయన ఈస్త్రీలు అందరికన్న ముందు ఇళ్లకు చేరవలెను.

(గృహకృత్యములకు గృహిణులు ముందేగవలసి ఉన్నది.)

8. మృతుని పత్నీ! పుత్రాదులను, గృహమున గురించి ఆలోచించుము. ఇచటినుండిలెమ్ము. ఇచట నీపతి గతించినాడు. నీవు వృధాగా అతని వద్ద పడి ఉన్నావు. పాణిగ్రహణ, గర్భధారణాదులు చేయించిన నీ పతి తోడ నీవు స్త్రీకర్తవ్యమును నిర్వాహించినావు. పతి మరణము ధృవపడినది ఇంటికి మరలుము.

9. నా తేజస్సు కొరకును, బలము కొరకును నా ప్రజను రక్షించుటకును మృతుని ధనుస్సు చేతబూని

అనుచున్నాను:-

"మృతుడా! నీవు ఇచటనే ఉండుము. మేము వీరపుత్ర వంతులము గర్వంచిన సకల శత్రువులను జయించగలము" విశ్వాస్పృధో అభిమాతీర్జయేమ."

(ఈ జీవస్రవంతి ఏ ఒక్కడు తొలగుటవలన నిలువదు. ఇది మత్యువును ధిక్కరించి సాగును.)

10. మృతుడా! ఈ భూమి తల్లివంటిది. విశాల సర్వవ్యాపిని. సుఖదాయిని. నీవు నెల తల్లిని చేరుము. ఈమె యువతివలెను, ఉన్నిగొంగళి వలెను. నీకు మెత్తని స్పర్శనిచ్చును. నీవు యజ్ఞ, దానములు చేసి ఉన్నచో ఈ పృథ్వి - మృత్యువాతపడిన నీ అస్థిరూపమును రక్షించును. "పిపాత్వాపాతు నిర్రుతే రుపస్థాత్."

(ఇది ఖననము కావచ్చును.)

11. పృథివీ! ఈ మృతుని పైకి లేపి ఉంచుము. ఇతనిని బాధించకుము. ఆదుకోనుము. సుప్రతిష్ఠ వగుము. తల్లి తన బిడ్డను కప్పినట్లు భూమీ! మృతునీ అస్థిరూపామును కప్పుము "మాతాపుత్రం యథాసిచాభ్యేనం భూమ ఉర్ణుహి."

12. పృథివీ! దీనిమీద స్తూపాకారముగా నిలువుము. వేలదుమ్ములు దీని మీద పడవలెను. మృతుని కొరకు ఇది ఘృత పూర్ణగృహము వంటిది కావలెను. సకలదినములు ఇతనికి ఆశ్రయభూతములగును గాథ "విశ్వాహా స్మై శరణః సన్త్వత్ర"

13. అస్థికలశమా! నిన్ను భూమిని ఎత్తుచేసి ఉంచుదును. మట్టిపది చెడగొట్ట కుండునట్లు నీ మీద మట్టిముద్దా మూత వేయుదును. దీనిని పితరులు స్థిరపరచవలెను. పితృపతి యముడు నీకు చోటు కల్పించవలెను "యమఃసదనాతేమినోతు".

14. ప్రజాపతీ! బాణపు మొదలున పక్షిఈకను పెట్టినట్లు - సంవత్సరరూపుడనగు సంకుసుక ఋషినగు నన్ను సకల

దేవతలు దివసములందు ఉంచినారు. పరుగుపెట్టు గుఱ్ఱమును పగ్గముతో ఆపినట్లు నా పూజ్యస్తుతులను నిలిపిఉంచుము.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేదసంహిత పదవ మండలము ఏడవ అష్టకాముున ఆరవ అధ్యాయము సమాప్తము.)*

**ఓంనతామినన్తి మయినో నధీవ్రతాదేవానాం ప్రథమాధ్రవాణి**
**నరోదసే అద్రుహో వేద్యాభిర్న పర్వతాని నమే స్థివాంసః**

**ఏడవ అధ్యాయము పందొమ్మిదవ సూక్తము**

ఋషి - యమపుత్ర మథితుడు. దేవత - జలము - గోవులు అగ్ని.
ఛందస్సు - అనుష్టుప్ - 6 గాయత్రి

***ఓం నివర్తధ్వంమాను గాతాస్మాన్సి రేవతీః***

1. గోవులారా! మీరుమావద్దకురండి, మరొకరివద్దకు పోవద్దు ధనవతి గోవులారా! మాకు పాలు అందించండి పోషించండి మరల మరల ధనమునిచ్చు అగ్ని, సొమము. మీరు మాకు ధనము ఇవ్వండి.

2. ఈ గోవులు మరల మరల మా వద్దకు రావలెను. అవి మా అధీనమున ఉండవలెను. ఇంద్రుడు సహితము వీనిని మా అధీనమున ఉంచవలెను. అగ్ని వీనిని ఉపయోగ్యము చేయవలెను.

3. ఈ గోవులు మరల మరల నా వద్దకు రావలెను. నా అధీనము పుష్టికలవి కావలెను అగ్నీ! వీనిని మా వద్ద ఉంచుము ఈ గోధనము మా వద్ద ఉండవలెను.

4. గోసహిత గోష్ఠమును ప్రార్థింతును. గోవులు ఇంటికి రావలెనని ప్రార్థింతును. గోసమూహములను కూడ ప్రార్థింతును. గోసంచారమును ప్రార్థింతును. గోవులు మేతమేసి ఇంటికి తిరిగి రావలెనని ప్రార్థింతును. గోపాలుని సహితము ప్రార్థింతును.

5. నలువైపుల గోవులను వెదకు గోపాలుడు గోవులను మేపువాడును, వానిని ఇంటికి తెచ్చువాడునగు గోపాలుడు క్షేమముగా ఇంటికి తిరిగి రావలెను.

6. ఇంద్రా! నీవు మావైపు రమ్ము. గోవులు మావైపు మరల్చుము. మాకు గోవులనిమ్ము. మేము చిరంజీవి గోవుల పాలు సేవించవలెను.

7. దేవతలారా! నేను మీకు విశేష అన్నము, ఘృతము, దుగ్ధము మున్నగువానిని నివేదింతును. యజ్ఞయోగ్యదేవత మాకు గోధనమును ప్రసాదించవలెను.

8. గోపాలా! గోవులను మా వద్దకుతెమ్ము గోవులారా! మీరు మా వద్దకు రండి గోపాలా! గోవులను మళ్లింపుము. గోవులారా ! మరలి రండి.

సూక్తకర్తరుషీ! గోవులను ఎచటికి తిరిగి రావలెను? ఎచటినుండి తిరిగిరావలెను?

ఋషి బదులు పలుకుచున్నాడు:-

నలువైపులనుండి మరలిరండి. గోపాలా! అలుదిశల నుండి మరలింపుము.

## ఇరువదివ సూక్తము

ఋషి - ఇంద్రలేక ప్రజాపతి పుత్ర విమదుడు లేక వసుక్రపుత్రుడు వసుక్రదుడు.
దేవత - అగ్ని. ఛందస్సు - 1-9 విరాట్ -2 అనుష్టుప్ -10 త్రిష్టుప్ మిగిలినవి గాయత్రి

1. అగ్నీ! మా మనసులకు శుభములు కూర్చుము. మా స్తోత్రములను యోగ్యములను చేయుము.

2. హవి అందుకొను దేవతలందు చిన్నవాడు, యువతముడు. అందరి మిత్రుడు, దుర్ధర్షుడగు అగ్నిని - గోస్తనమును ఆశ్రయించి జీవించు వత్సమువలె - స్తుతింతును.

3.కర్మాధార , జ్వాలారూప అగ్నిని స్తోతలు వర్ధిల్ల చేయుదురు. అగ్ని అభీష్ట ఫలప్రదాత.

4. అగ్ని యజమానులకు ఆశ్రయణీయుడు. అగ్ని దీప్తుడగును. జ్వాలగాపైకి ఎగుయును. ద్యులోకము వరకు వ్యాపించును. మేఘమున సహితము చొరబడును.

5. యజమాని యజ్ఞమున హవిని గ్రహించు అగ్ని జ్వాలాయుక్తుడై పైపైకి పోవును. అగ్ని ఉత్తరవేదిని కొలతవేయుచు ముందుకుసాగును.

6. అగ్ని సర్వపాలకుడు అతడే యజ్ఞము. అతడే పురోడాశము. అగ్ని దేవతల ఆహ్వాత.

7. అగ్ని దేవతలను పిలుచువాడు. అతనిని శిలాపుత్రుడు అందురు. అతడు యజ్ఞధారకుడు ఉత్కృష్ట సుఖప్రాప్తికిగాను. అట్టి అగ్నినే భజించ దలచినాను.

8. పురోడాశాదుల ద్వారా అగ్నిని సంవర్ధిల్ల చేయు మా పుత్ర, పౌత్రాదులు అనుభవయోగ్యమగు పశ్వాదుల మధ్య ఆసీనులగుదురని ఆశింతుము.

9. అగ్ని అధిరోహించు బృహత్ రథము కృష్ణవర్ణము, శుభ్రవర్ణము, రక్తవర్ణము కలిగి సుఖువుగా సాగునదియై కీర్తిశాలి యగును. బంగారు జిలుగులనింపి విధాత దానిని నిర్మించినాడు.

10. అగ్నీ! నీవు వృక్షపుత్రుడవు. బలపుత్రుడవు. అమర ధనయుక్తుడవు. తన గొప్ప బుద్ధిమీద ఆధారపడిన విమద ఋషి నీ కొరకు స్తోత్రములు చెప్పినాడు. నీవు ఈ వరిష్ఠస్తుతులను అందుకొనుము. విమదునకు అన్నము, బలము, శుభగేహము మరియు ఇవ్వదగిన ధనములు నన్నింటిని ప్రసాదించుము.

## ఇరువది ఒకటవ సూక్తము.

ఋషి దేవతే పూర్వవత్ .ఛందస్సు - ఆస్తారపంక్తి.

1. మేము స్తుతులు రచించినాము. యజ్ఞము విస్తృతకుశవంతము. దానికొరకు అగ్నిని వరించినామ. అగ్నీ! నీవు మహామహుడవు. వృక్షవాసివి. నీ దీప్తజ్వాలలను విమదుని కొరకు వెలిగించుము.

2. అగ్నీ! దీప్త, విశేష ధనిక యజమానులు నిన్ను శోభిల్ల చేయుదురు. ద్రవించునట్టి సరళగతి ఆహుతి తృప్తికొరకు నీ వద్దకు చేరును. నీవు మహామహుడవు - "త్వంవివక్షసే'.

3. యజ్ఞనిర్వాహకులగు ఋత్విక్కులు హోమ పాత్రములందునిన్ను జలము పృథ్విని తడిపినట్లు సేవింతురు. అగ్నీ! దేవతలకు బలము కొరకు నీవు కృష్ణవర్ణ జ్వాలారూపివై సమస్త శోభలను దాల్తువు. నీవు మహామహుడవు "త్వంవివక్షసే".

4. అగ్నీ! నీవు అమరుడవు. బలవంతుడవు. నీవు శ్రేష్ఠమనుకొను విచిత్ర ధనమును మాకు అన్నలాభము కలుగునట్లు తెచ్చిఇమ్ము.

5. అగ్నిని అథర్వఋషి సృష్టించినాడు. అగ్ని సకల స్తోత్రజ్ఞాత "విదద్విశ్వానికావ్యా" అగ్నీ! నీవు దేవతలను పిలువవలసిన యజమాని దూతవు. నీవు యజమానులకు ఇష్టుడవు కమనీయుడవు మహానుడవు "కామ్యోవివక్షసే".

6. అగ్నీ! యజ్ఞారంభమున యజమానులు, ఋత్విక్కులు నిన్ను స్తుతింతురు. నీవు హవిర్దాత విమదునకు సకల ప్రకార ధనములను ప్రసాదింతువు అందువలన మహామహుడవు. "వివక్షసే".

7. అగ్నీ! యజ్ఞారంభమున యజమానులు, ఋత్విక్కులు నిన్ను స్తుతింతురు. నీవు హవిర్దాత విమదునకు సకల ప్రకార ధనములను ప్రసాదింతువు అందువలన మహామహుడవు. "వివక్షసే".

8. అగ్నీ! నీవు ప్రదీప్త తేజమున ప్రసిద్ధుడవు. అప్పుడపుడు వృషభధ్వని చేయుదువు. సోదరి వంటి ఓషధులందు బీజములు ఏర్పరతువు. సోమాదులందు మాదకము కలిగినంత మహామహుడవగుదువు. "వివక్షసే".

## ఇరువది రెండవ సూక్తము

ఋషి - విమదుడు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు - 1,5 త్రిష్టుప్ 5,7,9
అనుష్టుప్ మిగిలినవి బృహతి

1. ఇంద్రుడు నేడు ఎచట విఖ్యాతుడు? అతడు మిత్రునివలె ఎవరి వద్ద ఉన్నాడు? ఋషుల ఆశ్రమములందో, గహన గుహలందో స్తుతించ బడుచున్నాడా?

2. నేడు ఈ యజ్ఞమందు ఇంద్రుడు విఖ్యాతుడు. మేము అతనిని స్తుతించుచున్నాము. ఇంద్రుడు వజ్రధరుడు. స్తుత్యుడు స్తోతలకు మిత్రుని వంటివాడు. అసాధారణముగా కీర్తించబడువాడు.

3. ఇంద్రుడు బలపతి. అనంతగుణ సంపన్నుడు. స్తోతలకు మహాఅన్నదాత. శత్రువుల రాచిరంపానపెట్టువజ్రము పట్టినవాడు. తండ్రి కొడుకునువలె అతడు మమ్ము ప్రేమించవలెను "పితాపుత్రమివ ప్రియమ్".

4.వజ్రధర ఇంద్రా! నీవు ద్యుతిమంతుడవు. సక్రమ మార్గగామివి హర్యశ్వములను రథమున కూర్చువాడవు. యుద్ధపథమును కల్పించువాడవు. నిరంతరము స్తుతించ బడువాడవు.

5. ఇంద్రా! నీవు మాత్రమే వాయువేగము కలిగి చక్కని నడకలుగల హర్యశ్వములను తోలగలవు. మావద్దకు రాగలవు. నీ హర్యశ్వములను నడుపగలవాడు దేవతలందు మరొకడులేడు. వీటి బలమును తెలియువాడు సహితములేడు.

6. ఇంద్రాగ్నులారా! మీరు మా స్థానములకు చేరునప్పుడు భార్గవ ఉశను, నీతో సంభాషించినారు. మీరు ఏ ప్రయోజనము ఆశించి ఇంత దూరము వచ్చినారు? మీరు ద్యులోక, భూలోకమునుండి నా వద్దకు వచ్చుట మీ అనుగ్రహము మాత్రమే అగును.

7. ఇంద్రా! ఈ యజ్ఞమందు పదార్థములు సమర్పించినాము. నీకు తృప్తికలుగు వరకు ఆరగింపుము. మేము నీ నుంచి అన్నమును, అన్నరక్షణను కోరుచున్నాము. రాక్షసులు నాశనమగునట్టి బలమును కూడ కోరుచున్నాము.

8. మాకు నలుదిక్కుల యజ్ఞశూన్య దస్యుబలములు ఉన్నవి. వారు దేనిని విశ్వసించరు. వారు శృత్యాది కర్మ రహితులు. ఆసురీ ప్రకృతులు. శత్రునాశక ఇంద్రా! ఈ దస్యుజాతిని నాశనము చేయుము.

9. విక్రాంతఇంద్రా! నీవు శూర మరుత్తులతో కూడి మమ్ము రక్షింపుము. నీరక్షణలందు మేము శత్రువినాశక సమర్థులమగుదుము. స్వామిని సేవించుటకు సేవకులు చుట్టు మూగినట్లు నీవు ప్రసాదించిన పదార్థములు స్తోతలచుట్టు చేరును.

10. వజ్రధర ఇంద్రా! నీవు సోత్తలగు కవులు నక్షత్రవాసి దేవతలను గూర్చి రచించిన స్తోత్రములు వినుచున్నప్పుడు వృత్రవధకు ప్రసిద్ధ మరుత్తులను పంపుదువు.

11. శూర, వజ్రధర ఇంద్రా! దానము చేయుటయే నీ గుణము. యుద్ధరంగమున అతిత్వరగా నీ పనిముగియును. నీవు మరుత్తులతో కలసి 'శుష్ణ' ని వంశము సొంతమును నాశనము చేసినావు.

12. శూర ఇంద్రా! మా సదాశయములు వృధాకారాదు. మాసకల ఆశలు ఫలవంతములు, సుఖకరములు కావలెను.

13. నీ అనుగ్రహమున మాకు బాధలు కలుగరాదు. జనులు ఆవుపాలను అనుభవించినట్లు మేము నీ ప్రసాద ఫలములను అనుభవింతుము.

14. దేవతల పనితనము వలన ఈ భూమి - కాళ్లు చేతులు లేకుండ - పెరిగినది. నీవు భూప్రదక్షిణ చేసినావు. నలుదిశల సంచరించినావు 'శుష్ణ' అసురుని హింసించినావు.

15. శూర ఇంద్రా! త్వరగా సోమపానము చేయుము. నీవు ధనికుడవు ప్రశస్తుడవు మమ్ము బాధించకము. స్తోతయగు యజమానిని రక్షింపుము. మాకు విశేషధనములిమ్ము ధనవంతులను చేయుము "మహశ్చరాయో రవేతస్కృధీనః"

## ఇరువదిమూడవ సూక్తము

పూర్వవత్ ఋషి దేవతే ఛందస్సు - 1-7, త్రిష్టుప్.
5 అభిపారిణి మిగిలినవి జగతి.

1. ఇంద్రుడు కర్మకుశలుడు. హర్యశ్వములను రథమున పూన్చువాడు దక్షిణ హస్తమున వజ్రము ధరించినవాడు. మేము అట్టి ఇంద్రుని పూజింతుము. సోమపానము చేసిన ఇంద్రుడు గడ్డము, మీసములను దులుపును. వాశాలసేన, అన్నములతో శత్రువును వధించుటకు సాగును.

2. ఇంద్రుడు విరాటమూర్తి, బలశాలి, దీప్తివంతుడు, ధనాధిపతి. అతని అశ్వములు రెండు హరితవర్ణలు. అవి అడవిలో మంచిగడ్డి మేసినవి ఇంద్రుడు తన అశ్వములను తీసికొని ధనాదిపతియై వృత్రుని వధించినాడు. అతడు దస్యుజాతి పేరుసహితము తుడిచిపెట్ట దలచినాడు.

3. ఇంద్రుడు చిరప్రసిద్ధుడు. ధనికుడు సర్వజన విదితుడు. అన్నరాశికి ప్రభువు. ఇంద్రుడు సువర్ణమయ వజ్రాయుధము ధరించినపుడు హర్యశ్వములు పూన్చిరథము మీద విద్వాంసుల సహితుడై అధిరోహించును.

4. వర్షము పశువులను తడిపినట్లు ఇంద్రుడు హరిత వర్ణసోమమున తన గడ్డము, మీసములను తడుపును. తదుపరి శోభన యజ్ఞగృమున ప్రవేశించును. అక్కడ సమర్పించిన మధుర సోమ రసమును సేవించును. వాయువు అడవిని కదిలించినట్లు ఇంద్రుడు తన గడ్డము మీసములను దులుపును.

5. శత్రువులు ఎంతో వాగినారు. ఇంద్రుడు తన మాటలతో వారినోరు మూయించినాడు. శత్రువులను సంహరించినాడు. తండ్రి కొడుకునకు ఆహారము అందించి బలిష్ఠుని చేసినట్లు ఇంద్రుడు మానవులను బలిష్ఠులను చేయును. మేము అట్టి ఇంద్రుని మహా శక్తులను వర్ధిల్ల చేయుదుము.

6. ఇంద్రా! విమద వంశీయులు నీ మహాప్రతిష్ఠను తెలిసికొన్నారు. నీ కొరకు విలక్షణములు, విశాలములగుస్తుతులు రచించినారు. వారికి ఇంద్ర ప్రభువును తృప్తిచెందించుట తెలియును. పశువులకాపరి చేతమేత చూపి పశువును పిలిచినట్లు - వారు ఇంద్రుని పిలిచెదరు.

7. ఇంద్రా! నీకు విమద ఋషితోగల మైత్రీ బంధము సడలకుండవలెను. సోదరీ సోదరుల ఏకమనస్కతవలె. మనము ఏకమనస్కులము కావలెను. నీ సఖ్యములు శుభప్రదములు కావలెను. "తేసన్తు సఖ్యాశివాని".

## ఇరువది నాలుగవ సూక్తము

ఋషి - విమదుడు. దేవత - అశ్వినులు. ఛందస్సు -
ఆస్తారపంక్తి 4,5,6 అనుష్టుప్

1. ఇంద్రా! ఇది ప్రస్తరఫలముల మీద నలిపిన మధుర సోమరసము. నీ కొరకు సిద్ధముగా ఉన్నది. సేవింపుము. విశేషధనవంత ఇంద్రా! మాకు బహుసంఖ్యక విశేషధనము ప్రసాదించుము. విమదునకు నీవు మహామహుడవు.

2. ఇంద్రా! నిన్ను యజ్ఞసామగ్రితోను. స్తుతులతోను. హోమ ద్రవ్యములతోను యజింతుము నీవు సకల కర్మలకు ప్రభువవు. సమస్త కర్మలను సఫలము చేయువాడవు. మేము కోరిన ఉత్తమ పదార్థములను మాకు అందించుము. వినుదునకు నీవు మహామహు డవు.

3. నీవు వివిధ అభిలషిత వస్తువులకు స్వామివి. ఉపాసకుని ఉపాసనకు ప్రోత్సహింతువు. నీవు స్తోతలకు రక్షకుడవు. మమ్ము పాపముల శత్రువుల నుండి రక్షింపుము.

4. కర్మనిష్ఠ అశ్వద్వయమా! మీపనులు అద్భుతములు మీరు సత్య స్వరూపులు. వినుదుడు. మిమ్ము స్తుతించినాడు అప్పుడు మీరు కలసి కర్రలతో అగ్నిని మధించినారు వేరువేరుగా కాదు.

5. అశ్విద్వయమా! అరణులను మీ చేతులతో కదిలించినప్పుడు అందునుంచి నిప్పురవ్వలు బయటపడినప్పుడు సమస్త దేవతలు మిమ్ము ప్రశంసించినారు. దేవతలందరు మిమ్ము మరల అట్లే చేయమని
అన్నారు. "పునరావహతాదితి".

6. అశ్విద్వయమా! నేను బయటికి వెళ్లుట ప్రీతికరము కావలెను. తిరిగి వచ్చుట ప్రీతికరము కావలెను. నేను వెళ్లిన చోటన ప్రియము ఎదురు పడవలెను. మీరు మీ దివ్యశక్తిచే సమస్త విషయములందు మము సంతుష్టులను చేయండి.

## ఇరువది అయిదవ సూక్తము

ఋషి - విమదుడుగాని వసుక్రుడుగాని. దేవత - సోమము.
ఛందస్సు - అస్తారపంక్తి.

1. సోమమా! మా మనసులు నిపుణములు, నిర్మనిష్ఠులు అగునట్లు చేయుము. గోవులు గడ్డినివలె స్తోతలు అన్నము కోరుదురు. నీవు గొప్పవాడవు.

2. సోమమా! పురోహితులు నీ చుట్టు కూర్చుందురు. నిన్ను స్తుతింతురు. నీ మానదు హరింతురు. ధనప్రాప్తి కొరకు నా మనసున అనేక కోరికలు కలుగు చున్నవి. నీవు గొప్పవాడవు.

3. సోమమా! నాడి పరిణతబుద్ధి. దానితో నీ పనుల పరిమాణము తెలియగలను. తండ్రి కొడుకు విషయమునవలె నీవు మావిషయమువలె నీవు మావిషయమున అనుకూలుడవగుము. నీవు గొప్ప వాడవు.

4. సోమమా! నీరు చేదుటకు కలశము నూతిలోనికి పోవును అట్లే నిన్ను చేరుటకు మాస్తుతులన్నియు సాగును. మా ప్రాణరక్షణకుగాను. ఈ యజ్ఞమును పూర్తిగావింపుము. దప్పిగొన్నవాడు చెంబుపట్టినట్లు నీవు మమ్ము పట్టుము నీవు గొప్పవాడవు.

5. నీవు మహానుడవు. మేధావివి. కావున వివిధ ఫలములు కోరు ధీరులు నిన్ను సంతోషపరచెదరు. మాకు గోవులు, అశ్వములుగల పశుశాల ప్రసాదించుము.

6. సోమమా! మా పశువులను రక్షింపుము వివిధ రూపములుగా ఉన్న  భువనములను రక్షింపుము. మేము జీవించుటకు సకల భువనములను అన్వేషించి మాకు జీవనో పాయము అందించుము. నీవు గొప్పవాడవు. "వివక్షసే"

7. సోమమా! నీవు దుర్ధర్షుడవు. మమ్ము సకల విధముల రక్షింపుము. శత్రువులను దూరము చేయుము. మమ్ము నిందించు వారు మాకు హాని కలిగించకుండవలెను. నీవు గొప్పవాడవు.

8. సోమమా! నీ కృత్యములు అద్భుతములు. మాకు అన్నము కలిగించుటకు అప్రమత్తుడవై ఉందువు. మాకు భూమి అందించుటలో నిన్ను బోలిన వాడు లేడు. హాని లేడు. హాని చేయువారినుండియు పాపముల నుండియు మమ్ము రక్షింపుము. "వివక్షసే".

9. భయంకర యుద్ధము సంభవించినపుడు మా సంతానమును బలి ఇవ్వవలసి వచ్చినపుడు శత్రుయోధులు చుట్టుముట్టి మమ్ము యుద్ధమునకు పిలిచినపుడు నిరుపమాన శత్రుసంహారకుడవైన నీవు ఇంద్రునకు సాయపడుదువు. అతనిని ఆపదలనుండి రక్షింతువు."వివక్షసే".

10. సోమము సకల కార్యములను చప్పున చేయును. అతడు భయంకరుడు. ఇంద్రుని తృప్తిపరచువాడు మహామేధావియగు కక్షివాన్ ఋషి బుద్ధిని సోమము సునిశితము చేసినాడు. "వివక్షసే"

11. సోమము విప్రహవిర్దాత యజమానికి పశుయుక్త ధనము ప్రసాదించును. సోమము సప్తహోతలకు శ్రేష్ఠధనము ఇచ్చును. సోమము అంధుడగు దీర్ఘతమునకు దృష్టి - కుంటి పరావృజునికి నడక ప్రసాదించినాడు. "వివక్షసే"

## ఇరువది ఆరవ  సూక్తము

ఋషి - విమరుడు. దేవత -పూష. ఛందస్సు - 1-4 ఉష్ణిక్ మిగిలినవి అనుష్టుప్.

1. ఎన్నో ఉత్తమ స్తుతులు పూష కొరకు కల్పించ బడినవి పూష దేవతలందు శ్రేష్టుడు సదా రథనియుతుడు అతడు విచ్చేయవలెను. యజమానిని అతని పత్నిని రక్షించ వలెను.

2. విప్రయజమానికి పూష సూర్యమండలమునందలి జలనిధి తెలియును. అతడు యజ్ఞము చేయవలెను. ఆ జలమును నేలకు దించవలెను. పూష యజమాని స్తుతులు ఆలకించును.

3.పూష సోమము వంటివాడు. రసములను అందించును. అతడు ఉత్తమ స్తుతులు వినును. పూష జలమును అందించును. మా గోష్ఠమునకు అతడే జలమునందించును.

4. పూషా! మేము మనసులందు నిన్నే ధ్యానింతుము. నీవు మాస్తోత్రములకు స్ఫూర్తివి. పురోహితులు నీ అర్చనలో

నిమగ్నులై ఉందురు.

5. పూష యజ్ఞములందు అర్ధభాగమువాడు. అతడు రథమునకు గుఱ్ఱములను పూన్చిసాగును. అతడు మానవుల పరమ హితైషి. పూష బుద్ధిమంతుడు. బంధువు. అతడు శత్రువులను దూరము చేయును.

6. పూష ఆడ, మగ మేకలు మున్నగు పశువులకు ప్రభువు. అతడే గొంగళినేయును. బతాలు ఉతుకును.

7. పూష ప్రభువు అన్నములకు అధిపతి. పూష ప్రభువు అందరకు పుష్టి కారకుడు పూష దుర్ధర్వుడు. పూశసౌమ్యమూర్తి. క్రీడాస్థలమున పూష తన గడ్డము మీసములను కదలించినాడు.

8. పూషదేవా! నీ యొక్క రథము కాడిని మేకలు వహించును. నీవు చిరజాతవు పలుమారులు పుట్టినవాడవు. నీవు ఎన్నడును అధికారము కోల్పోలేదు. సకల యాచకుల కోరికలు తీర్చువాడవు.

9. ఈ మహాపూషదేవుడు తనబలమున మారథమును రక్షించవలెను. అన్నవృద్ధి కలిగించవలెను. మా ఆహ్వానమును చెవియొగ్గి వినవలెను.

**ఇరువది ఏడవ సూక్తము**

ఋషి - ఇంద్రపుత్ర వసుక్రుడు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రుడు అనుచున్నాడు:-

భక్త స్తోతలారా! సోమయజ్ఞము అనుష్ఠించు యజమానికి అడిగిన వారములు ఇచ్చుట నా స్వభావము నాకు హోమ ద్రవ్యములు సమర్పించనివాడు సత్యమును బోధించిన వాడగును. నలుదిశల పాపముల చేయుచు తిరుగు వానిని నేను నాశము చేతును.

2. ఋషి అనుచున్నాడు :-

కొందరు దేవానుష్ఠానము చేయని వారున్నారు. కేవలము ఉదర పోషణ నిమిత్తమే జీవించువారున్నారు. నేను అట్టి వారితో యుద్ధము చేయవెడలుదును. అప్పుడు ఇంద్రా! నీ కొరకు బలిష్ఠమైన వృషభయమును వండింతును. పదిహేను తిథులలో ఒక తిథిలో నీకు సోమరసము సమర్పింతును.

3. ఇంద్రుడు అనుచున్నాడు:-

దేవశూన్య, దేవకర్మశూన్యులను యుద్ధమున సంహరించినావని చెప్పువానిని నేను చూడనేలేదు. నేను యుద్ధమునకు పోయిఅటువంటి వారిని వధింతును. అప్పుడు జనులందరు నా వీరకృత్యమును విస్తారముగ వర్ణిస్తారు.

4. నేను అనుకోకుండనే. చప్పున యుద్ధమున దూకుదును. అప్పుడు ఋషులు నా చుట్టు చేరుదురు. ప్రజాక్షేమమునకుగాను నేను సర్వత్ర సంచరింతును. శత్రువును సంహరింతును. వాని కాళ్లుపట్టుకొని విసరి, బండకు బాదుదును.

5. యుద్ధములందు నన్ను ఎదిరించువాడు లేడు. నేను గర్జించినపుడు బధిరుడు సహితము గడగడలాడును. అంతెందుకు కిరణ్మయ సూర్యుడే కంపించును.

(ఇంద్రుని ధ్వని దగ్గర ఉన్న బధిరుని అతిదూరమున ఉన్న సూర్యుని గడగడలాడించునని.)

6. నేను ఇంద్రుడను. నన్ను విశ్వసించనివారిని దేవతలకు అర్పించిన సోమరసమును బలాత్కారముగా త్రాగువారిని చేతులు చాచుకు హింసకు దిగు వారిని చూచుకుంటాను "దర్శం" నేను మహామహుడను. అందరి మిత్రుడను. న్నను నిందించువారి మీద నా వజ్రపాతము జరుగును.

7. ఋషి అనుచున్నాడు:-

ఇంద్రా! నీ దర్శనము కలిగించినావు. వర్షము కలిగించినావు. నీవు చిరంజీవత్వము నొందినావు. పూర్వము శత్రునాశము చేసినావు. తదుపరి కూడ చేసినావు. ఇంద్రుడు సకల విశ్వముల అపరంపారుడు. సర్వవ్యాపకుడు. ద్యావాపుథ్వ్యిలు అతనిపేరువిని కంపించును.

8. ఇంద్రుడు అనుచున్నాడు:-

అనేక గోవులు కూడి యవలు తినుచున్నవి. నేను ఇంద్రుడను స్వామివలె ఈ గోవులను కాపాడుదును. అవి గోపాలుర చూపులో మేతమేయుటను వీక్షించుచున్నాను. పిలిచినా వెంటనే గోవులు తమ యజమాని వద్దకు చేరినవి యజమాని ఆవు పాలను పిండుకున్నాడు.

9. ఋషియొక్క స్వకీయ అనుభూతి.

లోకమందు గడ్డితిను ప్రాణులు మేమే అగుదుము. అన్నము, లేక యవలు తిను మానవులు మేమే అగుదుము. హృదయాకాశామునందలి అంతర్యామి బ్రహ్మ మేమే అగుదుము. హృదయాకాశమున ఉన్న ఇంద్రుడు

తనవారలందరిని ఇష్టపడును. యోగశూన్య, విషయ వాసనల వారని ఇంద్రుని సన్మార్గమునకు చేర్చును.

10. ఇంద్రుడు అనుచున్నాడు:-

నేను ఇచటవచించున దెల్లయు సత్యమనియు, నిశ్చిత మనియు తెలియుడు. నేనే ద్విపద, చతుష్పాత్తులనన్నింటిని సృష్టిస్తాను స్త్రీలమీదకు పురుషుని యుద్ధము చేయుటకు పంపువాని ధనమును హరించి భక్తులకు ఇచ్చెదను.

(మహిళలసైన్యము వేరుగా ఉన్న సూచన)

11. అంధకన్యకు ఆశ్రయమిచ్చు బుద్ధిమంతుడెవడు? నేనే ఆమెను వరింతును! ఆమెను భరింతును!! నన్ను బాధించగల వాడెవ్వడు?

12. కేవలము ద్రవ్యమునకే ప్రసన్నలగు స్త్రీలు ఎందరు? వారు స్త్రీవాంఛాపరులపై ఆసక్తులగుదురు. కళ్యాణి, సభ్య, సుసంఘటితశరీరముగల స్త్రీ తన మనసునకు అనుకూలుడు అయిన వానినే పతిగా స్వీకరించును.

13. సూర్యుడు తన కిరణములచే జలమును గ్రహించును. అట్టి జలమును తనలో దాల్చును. తన శిరస్సున ఉన్నకిరణములను జనుల తలలమీద విడుచును. పైన నిలిచి తనప్రకాశమును వెల్లడించును నేలమీద తన దృష్టిని విస్తరించును.

**"అత్రాదిత్యాత్మనేంద్రః స్తూయతే తదంశత్వాత్ ఆదిత్యరూపుడగు ఇంద్రుడు ఆ అంశమును స్తుతించుచున్నాడు."**

14. ఆకులేనిచెట్టుకు ప్రకాండ విచరణ శీల సూర్యునకు నీడ ఉండదు. ద్యులోక స్వరూపమాత స్థిరమై అన్నది:-

త్రిలోకరూప గర్భమునుండి సూర్యశిశువు విడివడినాడు. పాలు త్రాగుచున్నాడు. ద్యులోకరూప గోవునకు మరొక దూడ ఉన్నది. తల్లిఆవు దూడను ప్రేమగా నాకి స్థిరపరచినది ద్యులోకగోవు తనస్తనమును ఎక్కడ ఉంచును?

(గర్భమునుండి వెలువడినపుడు ఎర్రని రక్తపుముద్ద త్రాగిన పాలు తెల్లనిది. ద్యులోకపు మరొకశిశువు చంద్రుడు గోవుస్తనము కలిగించుమేఘము.)

15. ఇంద్రరూప ప్రజాపతి దేహమునుండి విశ్వామిత్రాది ఏడుగురు ఋషులు పుట్టినారు. అతని శరీరపు ఉత్తర భాగము నుండి వాలఖిల్యాది ఎనిమిది మంది పుట్టినారు. వెనుకనుండి భృగువులు తొమ్మది మంది పుట్టినారు. ముందునుంచి అంగిరాదులు పదిమంది పుట్టినారు. వారు యజ్ఞాంశమును ఆరిగించు ద్యులోకపు ఉత్పన్న ప్రదేశమును వర్ధిల్ల చేసినారు.

(ఉత్పన్నులు ఈ సంఖ్యల మరుత్తులు కూడా కావచ్చును.)

16. పదిమంది అంగిరులలో 'కపిలుడు' ఒకడు అతడు యజ్ఞసాధనకు పూనుకున్నాడు. అందుకు తల్లి సంతోషించినది గర్భము ధరించినది.

17. ప్రజాపతి పుత్రులగు అంగిరులు బలిష్ఠములగు మేకలను కనుగొన్నారు. పాశక్రీడ స్థానమునపాశములు విసరి పోయినారు. వారిలో ఇరువురు ప్రకాండ ధనువును అందుకున్నారు. మంత్రములు ఉచ్చారించినారు. దేహమును పరిశుద్ధపరచుచు జలమధ్యమున సంచరించినారు.

18. కేకలువేయువారును వివిధ నడకల అగు అంగిరులు ప్రజాపతినుండి ఉత్పమ్నలైనారు. వారిలో సగము మంది ప్రజాపతికి హవి పచనము చేయుదురు మిగిలిన సగము చేయరు. ఈ మాటలు నాకు సూర్యుడు చెప్పినాడు. కాష్ఠాన్న అగ్నియు ఘృతోదన అగ్నియు ప్రజాపతిని పూజింతురు.

19. చూచినాను! నేను చూచినాను!! అనేకులు దూరము నుండి వచ్చుచున్నారు. వారుస్వయంసిద్ధ ఆహారమున ప్రాణములు నిలుపు కొందురు. వారి ప్రభువు ఇద్దరిద్దరు వ్యక్తులను జతచేయుచున్నాడు వారిలో కొత్తదనము కనిపించుచున్నది. వారు వెంటనే శత్రుసంహారము చేయుదురు.

20. నా పేరు ప్రమరుడు. నారెండు గోవులు యజ్ఞమునకు సిద్ధమైనవి. వానిని కొట్టకండి గారాబము చేయండి. ఇవి జలములందు లుప్తములగును. సూర్యుని వ్యాపింప చేయును. మేఘములను శోధించుట ఎరిగినవాడు ఎదుగును.

21. ఈ వజ్రము సూర్యమండలమునుంచి ఎంతో వేగముగా క్రిందపడును. పడినంత దానిస్థానములు అనేకములు. స్తోతలగువారు అనాయాసముగ ఆస్థానములను దాటిపోవుదురు.

22. ధనుస్సు నారీటంకారము చేయును. శత్రువును వధించు బాణము వెడలును.సకలలోకములు గడగడలాడును. జనులందరు ఇంద్రునకు సోమము సమర్పింతురు. ఋషులు సహితము శిక్షణ పొందుదురు.

23. దేవతల సృష్టిలో మొట్టమొదలు మేఘము కనిపించినది. ఇంద్రుడు మేఘమును భిన్నము చేసినాడు. మేఘము జలము వర్షించినది. పర్జన్యుడు, వాయువు, సూర్యుడు ఈ ముగ్గురు ఉద్భిజ్జములను పరిపక్వము చేయుదురు. వాయువు, సూర్యుడు జలములను ధరింతురు.

24. సూర్యుడే మీ ప్రాణాధారము. యజ్ఞమున సూర్యుని ఆ ప్రభావమును వర్ణించండి. స్తుతించండి. సూర్యుడు ఎస్వర్గమును ప్రకాశింప చేసినాడు. అతడు శోషించేయును. సూర్యుడు పరిష్కారకుడు. అతడు ఎన్నటికి తననడక

మానదు.

## ఇరువది ఎనిమిదవ సూక్తము

ఋషి - ఇంద్రుడు వసుక్రుడు - వసుక్రపత్ని. దేవత -
ఇంద్రుడు వసుక్రుడు ఛందస్సు - త్రిష్టుప్.

ఇది ఇంద్ర వసుక్ర సంవాదము.

1. వసుక్రి పత్ని అనుచున్నది:-

మా యజ్ఞమునకు ఇంద్రుడు తప్ప తక్కిన దేవతలందరు విచ్చేసినారు. మా మామగారు ఇంద్రుడుగారు మాత్రమేరాలేదు. వారు వచ్చి ఉన్నట్లయిన పేలములు భక్షించి ఉందురు. సోమము పానము చేసి ఉందురు. భోజనము ముగించి ఇంటికి మరలిపోయి ఉందురు.

2. ఇంద్రుడు అనుచున్నాడు:-

తీక్ష్ణశృంగముల వృషభమువలె గర్జించుచు నేను పృథయొక్క ఉన్నత పర్వతప్రదేశమున నివసింతును. నాకు కడుపునిండ సోమము అందించువానిని రక్షింతును.

3. వసుక్రుడు అనుచున్నాడు:-

ఇంద్రా! యజమానులు అన్నమును ఆశించి నీ కొరకు హవనము చేయుదురు. అప్పుడు త్వరత్వరగా యజమాని ప్రస్తర ఫలకముల మీద  మాదక సోమము ఉంచును. నీవు దానిని పానము చేయుము. యజమాని వృషభయమును వండును దానిని ఆరగింపుము.

4. ఇంద్రా! నీవు నాకు ఎంతటి సామర్థ్యము నివ్వవలె ననగా నేను కోరినంత నదులు ఎదురు పారవలెను. గడ్డితిను లేడి సింహమును ఓడించి తరుమవలెను. నక్క వరాహమును తరిమి కొట్టవలెను.

5. నా బుద్ధి అపరిపక్వము. నీవు ప్రాచీనుడవు. బుద్ధిశాలివి. నిన్ను స్తుతించు శక్తి నాకు ఏది అయినను అప్పుడపుడు కొంచెము స్తుతించగలుగుచున్నాను.

6. ఇంద్రుడు అనుచున్నాడు:-

నేను ప్రాచీనుడను నా కార్యభారము స్వర్గమార్గముకన్న భారమైనదని స్తోతలు నన్ను స్తుతింతురు. నేను ఒకే దెబ్బకు అసంఖ్యాక శత్రువులను దుర్బలులను చేయుదును. నా జన్మదాత నన్ను పుట్టుకతో నా ముందు శత్రువన్నవాడు నిలువజాలకుండ చేసినాడు.

7. వసుక్రుడు అనుచున్నాడు:-

ఇంద్రా! దేవతలు నన్ను నీ అంతటి ప్రాచీనుడను, విశిష్టకర్మ శూరుడను. అభీష్ట ఫలప్రదాతను అనుకొందురు. అనాయాసముగా నేను వజ్రమున వృత్రుని వధించినాను. నా మహిమవలన దేవతలకు గోధనమును ప్రసాదించినాను.

8. దేవతలు సాగుదురు. వజ్రము అందుకుందురు. మేఘమును బ్రద్దలు చేయుదురు మానవుల కొరకు వర్షము కలిగింతురు. ఆ జలమును నదులందు ఉంచుదురు. మేఘమున జలము కనిపించినప్పుడల్ల దేవతలు దానిని కాల్చి వర్షము కలిగింతురు.

9. ఇంద్రుడు కోరినంత కుందేలు సింహాదులను ఎదిరించ గలదు - నేను మట్టిపెడ్డతో కొండలను కూల్చగలను. గొప్పవి సహితము చిన్నదాని ముందు పడిపోవును. దూడ ఆబోతు మీదకు కాలుదువ్వును.

10. ఇంద్రుడు అనుకున్నంత బోనులోని సింహము పాదములు రాచినట్లు శ్యేనము తన గోళ్లురాచును. మహిషమునకు దప్పియైనంత ఉడుము నీరు అందించును.

11. యజ్ఞాన్నముతో తమను పోషించుకొను వారికి ఉడుము సులభముగా నీరు అందించును అట్టివారు సర్వరసయుక్త సోమమును సేవింతురు. శత్రువు దేహమును, బలమును ధ్వంసము చేయదురు.

12. సోమ యజ్ఞము చేసి బలము పొందిన వారు ఉత్తమ కర్మకర్తలు సుకర్మయుక్తలు అగుదురు. ఇంద్రా! దివ్యధామమున నీకు దానవీరుడవను పేరున్నది. నీవు మానవులవలె స్పష్టవాక్యములు ఉచ్చరింపుము. మాకు అన్నము అందింపుము.

## ఇరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - వసుక్రదుడు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు - త్రిష్టుప్

1. శీఘ్రగామి అశ్విద్వయమా! ఈ స్తోత్రము అతినిర్మలము. మీ వద్దకు సాగునది. పక్షి భయమున నలువైపుల చూచుచు తన పిల్లను చెట్టుమీది గూటిలో దాచును. అట్లే నేను ఎంతో ప్రయత్నించి ఈ స్తోత్రము రచించినాను. ఎన్నో సార్లు నేను ఈ స్తోత్రమున ఆహ్వానించినాను. అన్నిసార్లు మీరు యజ్ఞమునకు వచ్చినారు. మీరు నేతలకు నేతలు మానవుల హితైషులు. రాత్రిపూట సోమభాగమును గ్రహింతురు.

2. ఇంద్రా! నీవు నేతలకు నేతవు నేటిప్రాతః కాలమునను అన్య ప్రాతః కాలమునందును నిన్ను ప్రార్థింతుము. మేము శిష్యులమగుదుము. నిన్ను 'త్రిశోకి' ఋషి ప్రార్థించినాడు. అనేకమంది మానవ అనుచరులను పొందినాడు కుత్స ఋషి నీతో నీ రథమున కూర్చున్నాడు.

3. ఇంద్రా! ఎటువంటి మత్తు నిన్ను ప్రసన్నతముని చేయును? ఎటువంటి స్తుతి నిన్ను త్వరత్వరగా యజ్ఞగృహమునకు తెచ్చును? నాకు ఎప్పుడు ఉత్తమ వాహనము లభించును? నిన్ను స్తుతించగా అన్నము, అర్థము మా వద్దకు ఎప్పుడు వచ్చును?

4. ఏ స్తోత్రము చదివిన నీవు మానవులను నీతో సమానులను చేయుదువు? ఎప్పుడు వచ్చెదవు? ధనమిచ్చెదవు? ఇంద్రా! నీవు కీర్తిశాలివి. మానవులకు యదార్థ బంధువవు అందరిని పాలింతువు. పోషింతువు. స్తుతించినంతనే నీవు పాలింతువు పోషింతువు.

5. భర్త భార్య కోరినది సమకూర్చును. అట్లే యజ్ఞము చేయువారికి వారు కోరిన ధనము ఇమ్ము. నీవు సూర్యసమాన దాతవు! నీవు బహురూపములు ధరించువాడవు నిన్ను ప్రాచీన స్తుతులచే స్తుతించువారికి అన్నము ధనము ప్రసాదించుము.

6. ఇంద్రా! ప్రాచీన కాలమున ఎంతో అందముగా ద్యావాపృథ్వులను సృష్టించుట జరిగినది. అది నీకు తల్లి వంటిది. నీకు ఘృతయుక్త సోమరసరము సమర్పించినాము దానిని సేవించుము. ప్రసన్నుడవగుమ. నీకు సమర్పించిన అన్నము నీకు రుచికరము కావలెను.

7. ఇంద్రుడు స్వభావతః ఇంద్రునకు పాత్రనిండుగా సోమరసము సమర్పించండి. ఇంద్రుడు భూమి కన్నా పెద్దవాడు! అతడు మానవ హితైషి. అతని పనులు విస్మయ కారకములు.

8. ఇంద్రుడు శోభస బలవంతుడు అతడు శత్రుసేనను చుట్టుముట్టినాడు. బుద్ధి ఉన్న శత్రుసైనికులు ఇంద్రుని శరణు వేడుదురు. లోకకళ్యాణము కొరకు బుద్ధిమంతునివలె యుద్ధము చేయుటకు రథము నధిరోహింతువు. అట్లే ఇప్పుడు రథమును నడుపుము.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేదసంహిత ఏడవ అష్టకము పదవ మండలమున రెండవ అనువాకము సమాప్తము)*

**మూడవ అనువాకము ముప్పదవ సూక్తము**

ఋషి - ఇలూషపుత్ర కవషుడు. దేవత - అప్ - జలము. ఛందస్సు - త్రిష్టుప్.

1. సోమము మనోవేగము కలది. యజ్ఞములందు సోమము దేవతల కొరకు జలమువైపు సాగవలెను. మనసా! మిత్రావరుణుల కొరకు మరింత అన్నము వండుము. తీవ్రవేగముగల ఇంద్రుని కొరకు మంచి స్తుతులు రచించుము.

2. పురోహితులారా! హోమద్రవ్యములు సమకూర్చండి. జలములు మీకు స్నేహయుక్తములు కావలెను. జలములవైపు తత్పరులై సాగండి. లోహితవర్ణ పక్షివలె సోమము వాలుచున్నది దానిని యధాస్థానమున చేర్చండి.

3. పురోహితులారా! జలసముద్రమునకు చేరండి. అపాంనపాత, దేవతను హోమ ద్రవ్యములచే పూజించండి. ఆ దేవత మీకు స్వచ్ఛజలతరంగములను అందించవలెను అతనికి మధుర సోమము సమర్పించండి.

4. మేఘమధ్యమున నుండు నదియు, విప్రులచే ప్రస్తుతించ బడునదియునగు 'అపాంనపాత' దేవత రుచికరములగు జలములను ప్రసాదించవలెను. ఇంద్రుడు ఆజలములను పానము చేసి బలవంతుడు కావలెను. తన శౌర్యమును ప్రకటించవలెను.

5. యువకులు యువతులతో కలసి ఆనందింతురు. స్వచ్ఛజలములందు సోమము ఆనందించును. సంతోషించును. అట్టి జలములు తెచ్చుటకు వెళ్లండి. పురోహితులారా! ఆ జలము తెచ్చి సోమమును శుద్ధిచేయండి.

6. యువకులు యువతులవైపు ప్రేమ పూర్వకముగ కదలినప్పుడు - యువతులు యువకులు విషయము అను కూలముగ ప్రతిస్పందించినట్లు జలము సోమము విషయమున ప్రతిస్పందించును. పురోహితులకు, స్తోతలకు జలస్వరూప దేవతల జ్ఞానము ఉన్నది ఉభయులు తమ కార్యరాతులు అగుదురు.

7. జలగణమా! మిమ్ములను అడ్డినపుడు ఇంద్రుడు అడ్డుతొలగించును మార్గము కలించును. మీరు విషమ దశయందున్నప్పుడు విడిపించును. అట్టి ఇంద్రుని కొరకు మధుపూర్ణము, దేవతలకు మత్తు కలిగించు తరంగములు కలిగించండి.

8. ప్రవాహజలామా! నీ గర్భస్వరూపమును మధురరస యుక్తమును అగు నీ తరంగమును ఇంద్రునివైపు పంపుము. సంపన్న జలమా! మా ఆహ్వానము వినుము. నా ఆహ్వానమందు యజ్ఞపు ఘృతదానము నిన్ను స్తుతించుట ఉండును.

9. జలమా! నీ తరంగములు ఇహ, పరలోకములకు హితకరములగును. అవి బలము కలిగించును. కోరికలు పెంచును. అవి ఆకసమున పుట్టును. త్రిలోకములందు సంచరించును. దేవతల కొరకు పైకి ఎగయును. అట్టి తరంగములను ఇంద్రుని పానము కొరకు పంపుము.

10. ఇంద్రుడు జలముల కొరకు యుద్ధములు చేయును. ఇంద్రుని ఆజ్ఞచొప్పుననే మరల మరల పడుచుండును. సోమములో కలియు చుండును. జలము లోకములకు తల్లివంటిది. రక్షకుని వంటిది జలము సోమముతో

కలియునది ఆత్మీయమైనది ఋషీ! అట్టి జలమునకు నమస్కరించుము. "వందస్వ"

11. జలమా! దేవతలు యజ్ఞమునకుగాను మా యజ్ఞకార్యమునకు సాయపడుము. ధనప్రాప్తికొరకు మాకు పవిత్రత ప్రసాదించుము. యజ్ఞానుష్ఠానకాలమున నీ దుగ్ధద్వారములు తెరువుము. మాకు సుఖ కరమవగుము.

12. జలమా! ఇది ధనములకు ప్రభుస్వరూపము. కళ్యాణ కరమగు యజ్ఞము దీనిని పూర్తి చేయించుము. అమృతము అందించుము. ధనములను, ఉత్తమ సంతానములను రక్షింపుము. స్తోతకు సరస్వతి ధనమును ప్రసాదించుము.

13. జలమా! నేను చూచి ఉన్నాను. నీవు వచ్చునపుడు ఘృతము దుగ్ధము, మధువు తెచ్చి ఉన్నావు. పురోహితులు స్తుతుల ద్వారమున నీతో సంభాషించి ఉన్నారు. ఉత్తమ రూపమున సమర్పిత సోమమును నీవు ఇంద్రునకు అందించి ఉన్నావు.

14. అదిగో! జలము అరుదెంచుచున్నది. జలము ధనమునకు ఆధారము. ప్రాణమునకు హితకరము. పురోహిత బంధువులారా! జలమును స్థాపించండి. వర్ష అధిష్ఠానదేవతకు జలము చిరపరిచితాము. జలము సోమరసమునకు అనుకూలము. జలమును కుశల మీద స్థాపించండి.

15. జలము ఏకాగ్రముగా కుశలవైపు సాగుచున్నది. తిలకించండి! జలము దేవతలను చేరుటకు యజ్ఞస్థానమున ఆసీనమైనది.

పురోహితులారా! ఇంద్రునకు సోమము సమర్పించండి. జలము వచ్చినందున ఈ నాటి మీ దేవ పూజ సాధ్యమైనది "సుశకాదేవయజ్వా".

## ముప్పది ఒకటవ సూక్తము

ఋషి - కవషుడు. దేవత - వైశ్వదేవతలు. ఛందస్సు - త్రిష్టుప్.

1. మా స్తుతులు దేవతలకు చేరవలెను. యజ్ఞదేవతలు మమ్ము సమస్త శత్రువులనుండి రక్షించవలెను. ఆ దేవతలతో మాకు స్నేహము కలుగ వలెను. మమ్ము పాపములన్నియు వదలిపోవలె "తరన్తో విశ్వా దురితాస్యామ."

2. మానవుడు సకల ధనములను కోరవలెను. సత్యమార్గమున, పుణ్యానుష్ఠానమున మగ్నుడు కావలెను. తన కర్మములచే శుభములు పొందవలెను. వనసునకు సుఖములు కలుగవలెను "క్షమం మనసా జగృభ్యాం".

3.యజ్ఞకార్యము ప్రారంభమైనది సమయాను సారముగ అవసరమగు చిన్న - పెద్ద యజ్ఞద్రవ్యములన్నియు

సిద్ధముగ ఉన్నవి. ఇవి దృశ్యమానములు రక్షకములు రక్షకములు మేము అభిషుత సోమమును ఆస్వాదించినాము. దేవతలకు ఇవన్నియు తెలియును.

4. అవినాశ్యప్రజాపతి దాతమనసును తనలో దాల్చి అనుగ్రహించవలెను. సవిత యజ్ఞకర్తకు శుభములు కలిగించవలెను. భగ, ఆర్యములు స్తుతికి ప్రసన్నులై స్నేహ పూర్ణులు కావలెను అన్య దేవతలు యజమానికి అనుకూలురు కావలెను.

5. స్తోతల స్తుతులు అందుకొనగోరిన దేవతలు కోలాహలమున, మహావేగమున అదిగో వచ్చుచున్నారు. అప్పుడు పృథ్వి ప్రాతఃకాలము వంటి అందములు సంతరించుకున్నది. సుఖములనిచ్చు వివిధ అన్నములు మాకు లభించవలెను.

6. ఇప్పుడు మాస్తోత్రము చిరపరిచితమై విశాల భావము ధరించి సమస్త దేవతల వద్దకు చేరుటకు రెక్కలు విప్పుచున్నది. ఈనాటి మాయజ్ఞమునకు సమస్త దేవతలు విచ్చేసి తమతమ స్థానములందు ఆసీనులు కావలెను. సమస్త శుభములు ప్రసాదించవలెను. అందువలన నేను బలశాలినగుదును.

7. ఏ అరణ్యము, ఏవృక్షమునుండి గ్రహించిన పదార్థములతో ఈ ద్యులోక భూలోకములు నిర్మించబడినవో! ప్రాచీన దినములు, ఉషస్సులు జీర్ణములగుచున్నది కాని ద్యావాపృథ్వులు సంయుక్తములు, ఏకభావములై ఉన్నవి పాతపడవు జీర్ణములు కావు.

8. ద్యులోక, భూలోకములు అంతముకావు. వానిపైన మరేదో ఉన్నది. అతడు సృష్టికర్త. ద్యావాపృథ్వులను ధరించువాడు. అతడు అన్నములకు ప్రభువు. సూర్యుడు రథమునకు గుఱ్ఱముల అమర్చకముందే అతడు ఆవిర్భవించినాడు.

9. కిరణధారి సూర్యుడు పృథ్విని అతిక్రమించడు. వాయువు వృష్టిద్వారాఛిన్నాభిన్నము చేయడు. మిత్రావరుణులు ప్రత్యక్షమై అరణ్యమధ్యమున పుట్టిన అగ్నివలె నలుదిశల కాంతులు ప్రసరింతురు.

10. రేతస్సువలన గోవు ప్రసవించినట్లు అరణి వలన అగ్ని ఉత్పన్నమగును. అరణిని రక్షించిన వారి వద్దకు కష్టములు చేరవు. అగ్ని ప్రాచీన కాలము నుండియే అరణి స్వరూప మాతా పితరుల వలన జన్మము గ్రహించినాడు. ఈ అరణి స్వరూపగోవు శమీ వృక్షమగును. అది అచటనే పుట్టును. దాని అన్వేషణ జరుగు చుండును.

11. కణ్వఋషిని నృషదపుత్రునిగా చెప్పబడినది. అన్నయుక్త, శ్యామ వర్ణ కణ్వునకు ధనము లభించినది. ఆశ్యామ వర్ణ కణ్వునకే అగ్ని తనరోచక రూపమును కనబరచినాడు. అగ్నినిగూర్చి కణ్వుడు కాక మరొకడు అంతటి యజ్ఞము చేయలేదు.

## ముప్పది రెండవ సూక్తము

ఋషి - దేవతే పూర్వవత్. ఛందస్సు - 1-5 జగతి 6-9 త్రిష్టుప్

1. యజ్ఞకర్త ఇంద్రుని ధ్యానించుచున్నాడు. అతని సేవలు అందుకొనుతాకు ఇంద్రుడు తన గుఱ్ఱములను యజ్ఞమువైపు తోలుచున్నాడు. హర్యశ్వములు విచిత్రగతులతో వచ్చుచున్నవి. ప్రసన్నమనస్క యజమాని ఉత్తమోత్తమ ద్రవ్యములను సమర్పించుచున్నాడు. ఇంద్రుడు ఉత్తమోత్తమ వరములు తెచ్చుచున్నాడు. ఇంద్రుడు సోమరసమును, ఆహార పదార్థములను ఆస్వాదించినపుడు స్తోత్రములను, హోమద్రవ్యములను సహితము స్వీకరించును.

2. ఇంద్రా! నిన్ను అనేకులు స్తుతింతురు. నీవు వెలుగులు పెంచుచు విభిన్న స్వర్గధామములందు సంచరింతువు. నీవు జ్యోతినందుకొని భూలోకమునకు ఏతెంచెదవు. మేము నిర్ధనులము. నిన్ను యజ్ఞమునకు కొనిపోవు అశ్వములు మాకు ధనమును ఇవ్వవలెను. ధనము కొరకే మేము ఇన్ని ప్రార్థనలు చేయుచున్నాము.

3. పుట్టిన బిడ్డకు లభించుపితృధనమువంటి విచిత్ర ధనమును ఇంద్రుడు మాకు ప్రసాదించవలెను. భార్య మధుర వచనములతో భర్తను పిలిచినట్లు సోమరసము పురుషార్థిని ఆహ్వానించును.

4. స్తుతిరూప కిరణములు కలుసుకొను స్థానమును ఉజ్వల ప్రభామయము చేయుము. స్తోత్రముల ప్రాచీన మాతలగు ఏడుఛందస్సులు ఆస్థానమునందే ఉన్నవి.

5. దేవతల వద్దకేగు అగ్ని మీమేలు కోరి దర్శన మిచ్చును. అగ్ని వంటరిగనే రుద్రుల సహితుడై తనస్థానము చేరును. అమరులగు సమస్త దేవతలకుగాను బంధు సహితులై ఇంద్రునకు సోమము సమర్పించండి. వారు మీకు వరములు ఇవ్వగలరు.

6. దేవతల కొరకు చేయు అనుష్ఠానమును విద్వాంసుడగు ఇంద్రుడు రక్షించును. అగ్ని జలములందునిగూఢ రూపమున ఉన్నాడని ఇంద్రుడు చెప్పి ఉన్నాడు. అగ్నీ! ఆ ఉపదేశమును అనుసరించియే నేను నీ వద్దకు వచ్చినాను.

7. దారి తెలియనివాడు తెలిసినవానిని అడుగును. అట్లు తెలిసికోని గమ్యస్థానము చేరును. అభిజ్ఞులుచెప్పిన చోట జలము కొరకు వెదకిన జలము లభించును.

8.ఇప్పుడిప్పుడే అగ్ని పుట్టినాడు. తల్లిపాలు త్రావివాడు. తెలివి తెచ్చుకున్నాడు. వయసుతోనే వార్ధక్యము అందుకున్నది. అతడు సులభసాధ్యుడు. ధనాఢ్యుడు మనోవికాసపు వాడైనాడు.

9. ఇంద్రా! నీవు సకల కళాపరిపూర్ణుడవు. స్తుతుల శ్రోతవు. ఈ స్తుతులన్నియు నీ కొరకే రచించా బడినవి. పూజనీయులగు స్తోత్రరూపధనవంతులారా! ,మీకు ఇంద్రుడు ధనదాత కావలెను. నా హృదయ మందున్న సోమము సహితము వారికి ధనదాత కావలెను.

*శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత పదవ మండలమున ఏడవ అష్టకము ఏడవ అధ్యాయము సమాప్తము.*

**ఓం నతామినన్తిమాయినో నధీరావ్రతాదేవనాం ప్రథమాధ్రువాణి**
**నరోదసీ అద్రుహావేద్యాభిర్న పర్వతానినమే స్థివాంసః**

**ఎనిమిదవ అధ్యాయము ముప్పది మూడవ సూక్తము**

ఋషి - ఐలూష పుత్ర కవషుడు. దేవత - వైశ్వదేవతలు. ఛందస్సు - 1
త్రిష్టుప్ 2,3, బృహతి 4,9 గాయత్రి

***ఓమ్ ప్రమాయుయుజ్రోజనానాం వహామిస్మపూషణమన్త రేణ |***
***విశ్వేదేవాసో అధమా మరక్షిద్దుః శాసురాగాదితిఘోష ఆసీత్ ||***

1. ఎల్లరిని పనులకు పురమాయించు దేవత నన్ను ప్రోత్సహించినాడు. నేను మార్గమందు పూషను దర్శించినాను. కవషుడనను నన్ను విశ్వేదేవతలు రక్షించినారు. దుర్ధర్షుడను, ఋషివచ్చుచున్నాడని నలుదిశలు ఘోషించినవి.

2. పరిస్థితులు శత్రువులవలె నన్ను బాధించుచున్నవి. దుర్బుద్ధినాకు కంటక ప్రాయమైనది నేను దీన హీన, క్షీణుడనగు చున్నాను. పక్షివలె మనసు చంచలమగుచున్నది.

3. ఇంద్రా! ఎలుకలు త్రాళ్లను కొరికినట్లు నీ భక్తుడనైన నన్ను మనోవ్యధలు కొరకుచున్నవి. ధనికఇంద్రా! ఒక్కసారి నాపై నీ కృపాకటాక్షములు కురిపింపుము. తండ్రివంటి వాడవగుము - "పితేవనోభవ".

4. నేను కవషఋషిని త్రసదస్యు పుత్రుడు కురు శ్రవణుడు గొప్పదాత. అందువలన ఆరాజును యాచించుటకు వెళ్లినాను.

5. నాకు అతడు ఇచ్చిన దక్షిణ వేలలో ఉండినది. సకలజనులు దానిని శ్లాఘించినారు. నేను ఎక్కిన రథమును మూడు హరితవర్ణ అశ్వములులాగినవి.

6. నా తండ్రి కీర్తి శ్లాఘనీయము పితృవచనము సేవకులకు సుక్షేత్రమువలె ప్రసన్నదాయకమగును.

7. ఉపమశ్రవసా! నీవు మిత్రాతిథిపుత్రుడవు. నావద్దకురమ్ము. నేను మిత్రాతిథియొక్క స్తోతను. ఏడవకుము. దాతవ్య ధనము నాకు దానము చేయుము.

8. ఒకవేళనేను అమరులగు దేవతలకు, మర్త్యులగు మానవులకు ప్రభువై యుండిన ధనవంతుడగు మిత్రాతిథి తప్పక బ్రతికి ఉండునది.

9. వందప్రాణములు ఉన్నను దేవతలను ఎదిరించి ఎవడును జీవించజాలడు. అందువలననే మా సహచరులు మమ్ము విడిచి పోయినారు.

(మిత్రాతిథి అను రాణి పరలోకగత అయినది కవషుడు ఆమె పుత్రుడు ఉపశ్రవుని ఓదార్చిన వృత్తాంతము)

## ముప్పది నాలుగవ సూక్తము

ఋషి - క్వషుడు లేక అక్షిస్యుడు. దేవతలు - వేరు వేరు.
ఛందస్సు - త్రిష్టుప్ -7 జగతి.

1. పెద్ద పెద్ద పాచికలు ఫలకము మీద నడచినపుడు నేను వానిని చూచినపుడు నాకు ఎంతో ఆనందము కలుగును. మజవాన పర్వతమున పుట్టిన సోమలత యొక్క రసము మరింత ఆనందము కలిగించును. వీభీరక వృక్షముతో చేసిన పాచికలు నాకు నిత్యము ఆనందకరములగును.

2. నా భార్య అందమైనది. ఆమె నావలన ఎన్నడును ఉదాసీన కాలేదు - లజ్జిత కాలేదు. ఆమె నాకు, నాబంధువులకు ఎన్నో సేవలు చేసినది. అయినను కేవలము పాచికల కారణముగా అనురాగవతి అయిన భార్యను త్యజించినాను.

3. జూదము ఆడు జూదరిని అత్త తిట్టును - భార్య వదిలివేయును. జూదరి అడిగినప్పుడు ఎవ్వడు ఇవ్వడు. ముసలిగుఱ్ఱమును కొనువాడుండడు. జూదరిని అడుగు వాడుండడు.

4. పాచికలు పట్టిన వాడు విడుచుట దుర్లభము. ఒకని ధనము మీద పాచిక పాడు కన్నుపడెనా వాని భార్యవ్యభిచారిణి అగును. జూదరి తల్లిదండ్రులు అన్నదమ్ములు "వీనినిమేమెరుగము. జూదరులారా! పట్టుకొని పొండి. అని పట్టి ఇత్తురు."

5. జూదము ఆడను. అనుకున్నప్పుడు జూదరులకు దూరముగా ఉందును. కాని ఫలకము మీద పసుపురంగు పాచికలు చూచినపుడు మనసు నిలువదు. చెడిన ఆడది మిండని వద్దకు పోయినట్లు మరల జూదగృహమునకు చేరుదును.

6. జూదరి రొమ్ము చరచి జూదమున దూకును. 'గెలుపునాదే' అని విర్రవీగును. ఒక్కొక్కసారి పాచిక జూదరి కోరిక తీర్చును. మరొకసారి పాచిక ఎదుటివాడు అనుకున్నట్లు పడును.

7. కాని ఒక్కొక సారి పాచిక చేతనిలువదు. అది అంకుశమువలె గ్రుచ్చును. బాణమువలె పోడుచును. కత్తి వలె కోయును. కాల్చినట్లు తపింపచేయును.

గెలిచిన వానికి పాచిక కొడుకు పుట్టినంత ఆనందము కలిగించును. మధురముగా ఉండును. మధుర భాషణ వలె ఉండును. కాని ఓడిన వాని ప్రాణములు తీయును.

8. ఏబదిమూడు పాచికలు ఫలకము మీద విహరించునపుడు సత్యస్వరూప సూర్యుడు లోకములందు సంచరించుచున్నట్లుండును. ఎంతటి బలవంతుడైనను పాచికను పట్టి ఉంచజాలడు. రాజులు సహితము పాచికకు నమస్కరింతురు.

9. పాచికలు ఒకపరి ఎక్కును ఒకపరి దిగును పాచికలకు చేతులు లేవు. కాని చేతులున్నవాని చేతబడి ఓటమి చవిచూచును. పాచికలు సంపన్నములు. మండుచున్న నిప్పు కణికలవలె ఫలకము మీద కూర్చుండును చేతికి చల్లగనే తాకును. గుండెను మండించును.

10. జూదరి భార్య దీనురాలై విలపించును - అతని బిడ్డలు వీధులవెంట తిరిగుదురుఅని జూదరి తల్లి మనోవ్యధలో పడిపోవును. జూదరికి అప్పుపెట్టిన వాడు తన డబ్బు తిరిగిరాకను గురించి సందేహించును. పాపం జూదరి మరొకరి ఇళ్లలో రాత్రులు గడుపును.
]

11. తన భార్య దశను చూచి జూదరి గుండెపగులును. ఇతరుల భార్యల సౌభాగ్యములు, వారి మేడలు చూచి జూదరి క్రుంగి పోవును. ఉదయమున జూదరి గుఱ్ఱము మీద అట్టహాసముగా వచ్చును. ఆజూదరియే సాయంత్రము దరిద్రుడై చలికాచు కొనుటకు మంటముందు చేరును. వంటి మీద బట్టకూడ మిగలదు.

12. పాచికా! నీ బలమున ప్రధాని ఉన్నాడు. సేనాని ఉన్నాడు. మహారాజు ఉన్నాడు. వారి అందరకు చేతులు జోడించి నమస్కరింతును. నేను సత్యము పలుకుచున్నాను. నిన్ను మాత్రము ధనము అడుగను.

13. ఓరే! జూదరీ! జూదము ఆడకుము పొలము దున్నుకొనుము. వ్యవసాయమున వచ్చిన దానిచే తృప్తినొందుము. కృతార్ధుడనను కొనుము. అందువలన భార్య లభించును. అనేక గోవులు లభించును. ఈ మాట నాతో సూర్యుడు చెప్పినాడు "తన్మేవిచేష్టేసవితాయ మార్యః"

14. పాచికలారా! మమ్ము మీ బంధువులుగా భావించండి మాకు శుభములు సమకూర్చండి మీ దుర్ధర్ష

ప్రభావమును మా మీద ప్రయోగించకండి. మా శత్రువు మాత్రమే మీ కోపదృష్టిలో పడవలెను.

**ఆలోచనామృతము**

మనిషి ఎంత విచిత్రుడండీ! తన అంతరంగమును మార్చలేడు. బహిరంగమును బ్రహ్మాండముగా మార్చును!! "స్వభావో దురతిక్రమః" అన్నాడు వాల్మీకి మనము వేషము మార్చగలము. మనసు మార్చులేము. మనసు మార్చుటన్న మాటలు కాదురా!" అన్నాను నేను ఒక చోట! నేడు మనిషి గ్రహాంతరాల మీద అడుగులు వేయుచున్నాడు! సంతోషమే! కాని తన ఈర్ష్యాద్వేషాలను అభిమాన దురభిమానాలను సంస్కరించు కొనలేక పోతున్నాడు వదలు కొనుట అసాధ్యము. అసంభవము. సంస్కారమే జరుగలేదా అనిన దిగమ్రింగు చున్నాడు. బయట పడలేక పోవుచున్నాడు. ఇది వదలుటకాదు మరింత ఉడికించుట! వేదము మనిషిని అధ్యయనము చేసినది. మనిషి స్వభావమును చదివినది. మనిషి మనసును చూచినది. మానవ స్వభావపు నిత్యసత్యములను చాటినది! నాటి నుంచి నేటి వరకు ఏనాటికైనా మారునది మనిషి స్వభావము కాదు వేషము మాత్రమే! పయనమునకు నాడురథము నేడు విమానము చక్ర భ్రమణమను మూలసూత్రమున మార్పు లేదు మార్పు ఆకారమునందు మాత్రమే! ఈ సూత్రము అన్నింటికి చెల్లును. అన్వయంచు కొనవలెను అంతే!

2.వ్యసనము మనిషి ఏర్పరచుకున్నది. భగవద్దత్తము కాదు. భగవంతుడు ప్రసాదించిన వన్నియు మానవుని శ్రేయస్సునకే అగును. మానవుడు విచిత్రప్రాణి. తనను తాను ధ్వంసము చేసికొనుటలో నిపుణుడు! ఈనైపుణ్యము ఇతర ప్రాణులకు లేదు!! వ్యసనముగా మనిషి ఏర్పరచుకున్నాడు. ఎంతో నాగరికుల మనిపించు కొను జాతులు సహితము నేటికిని ఈ వ్యసనమునుండి బయట పడలేకున్నవి! సత్యమేమనగా ఈ నాగరకత మనిషికి మత్తునిచ్చి జూదపు సంకెలలందు బంధించినది! నేటి నగరకత ప్రధాన లక్షణమేమనగా ఇది బంధములను తెలియనీదు!! కట్లలో క్రుంగువాడు సహితము తాను స్వతంత్రుడను అనుకొనును!!!

3. ఈ సూక్తము జూదమును గురించి సుందరముగా వివరించింది. నాకు తెలిసినంతవరకు ఇంత కొద్దిలో వేదమును గురించిన ఇంత వివరణ సాహిత్యమున అగుపించలేదు. ఇంత వివరించినను తరువాతి వారగు ధర్మరాజు, నలుడు జూదముననే కదా నలిగినారు! మనిషి వేదము చెప్పినది విననంతవరకు చెడుచున్నాడు!!! అందుకు ఇది నిదర్శనము.

ఒకవ్యసనమును కలిగించుట సులభము. మాన్పించుట సుమారు అసాధ్యము. వ్యసమును వ్యక్తి అధిగమంచ వలసి ఉన్నది! అందుకే వేదము వ్యసనపరునేసంబోధించినది అక్షైర్మాదీవ్యః కృషిమిత్కృష జూడమాడకుము కృషిచేయుము కృషిచేయుము అని!

"త్రిపంచాశః" అన్నాడు పాచికలు ఏబది మూడట! నేటిపేకముక్కలు ఏబదిరెండు! సంఖ్యలో ఒకటి తగ్గించినాము వ్యసనము ఎంత పెంచినామో! కుటుంబమును గురించి వేదమునకు ఎంత ఆవేదన! కుటుంబమే కదా లోకమునకు

మూలము! "శీతాఃసన్తో ద్హృదయం నిర్వహంతి" ఎంత చక్కగా చెప్పినాడు! చల్లగా ఉండి గుండె కాల్చునది! "అపూర్వోద్దృశ్యతేవాహ్నిః కామినీ కుచమండలే దూరతో దహతే గాత్రం హృదిలగ్నస్తుశీతలే." అను భర్తృహరి శ్లోకమునకు పైమంత్రము ప్రేరణవలె ఉన్నది. 'కామినీ కుచమండలంలో అపూర్వం అయిన అగ్ని మండుచున్నది. అది దూరంనుంచి కాలుస్తుంది.' గుండెకు హత్తుకుంటే చల్లగా ఉంటుంది, అని ఆశ్లోకపు తాత్పర్యం.

ఋషి పాచికలకు నమస్కరించిన సొంపు:-

**యోవః సేనానీర్మహతో గణస్యరాజా వ్రాతస్యప్రథమో బభూవ|**
**తస్మైకృణోమినధనారుణధ్మిదశాహం ప్రాచీస్తదృతంవదామి||**

## ముప్పది అయిదవ సూక్తము

ఋషి - ధనాకపుత్ర లుశస్యుడు. దేవత - వైశ్వదేవతలు.
ఛందస్సు - జగతి, 13,14, త్రిష్టప్

1. అగ్నిమేల్కొన్నాడు. అతనితో ఇంద్రుడు మేల్కొన్నాడు. ప్రభాతము అంధకారమును అన్యదేశములకు తరిమినపుడు అగ్ని జ్వాలలను అందుకుని జ్వలించును. విశాలములగు ద్యులోక, భూలోకములు చైతన్యవంతములు కావలెను. దేవతలు మమ్ము రక్షించ వలెనని ప్రార్థించుచున్నాము.

2. మేము ప్రార్థించుచున్నాము. ద్యావాపృథ్వులు మమ్ము రక్షించవలెను. నదులు తల్లులవలె రక్షించవలెను. శర్యావతము వద్దగల పర్వతము రక్షించవలెను. మేము అపరాధులము కారాదని సూర్యుని, ఉషాస్సును ప్రార్థించుచున్నాము. సమర్పించబడిన సోమములు మాకు శుభములు సమకూర్చవలెను.

3. ద్యావాపృథ్వులు మాకు తల్లిదండ్రుల వంటివారు. ఈ ఇద్దరు మహాదేవతల ముందు నిరపరాధులము కావలెను. వారు మమ్ము రక్షించి సుఖములు కలిగించవలెను. ఉషాదేవి అంధకారములను, మాపాపములను దూరము చేయవలెను ప్రదీప్త అగ్నిముందునిలిచి మేము శుభములు యాచిస్తాము.

4. ఉషధనవతి. ముఖ్య పాపపరిహార. ఆమె మాకు ఉత్తమ ధనములు ఫ ఇవ్వవలెను. మేము దానిని పంచుకొందుము. మేము దుష్టుల క్రోధమునకు దూరముగా ఉండవలెను. ప్రజ్వలిత అగ్నిని మేము శుభములు యాచింతుము. "స్వస్త్యగ్నిం సమీధానమీమహే"

5.ఉషస్సులు సూర్యకిరణములతో కలియును. వెలుగులు దాల్చును చీకట్లను నాశము చేయును. "స్వస్త్యగ్నిం సమీధానమీమహే"

6. వ్యాధిరహితలగు ఉషస్సులు మా వద్దకు చేరవలెను. మహా ప్రకాశయుక్త అగ్ని తలెత్తవలెను. అశ్విద్వయము మా వద్దకు వచ్చుటకు వేగవంతములగు అశ్వములను రథమునకు కట్టవలెను. "స్వస్త్యగ్నిం సమీధానమీమహే"

7. సూర్యదేవా! నీవు కోరికలు తీర్చువాడవు. నేడుమాకు అత్యంత ఉత్కృష్ట ధనభాగమును పంచియిమ్ము. "స్వస్త్యగ్నిం సమీధానమీమహే"

8. మానవులు దేవతల కొరకు సంకల్పించు యజ్ఞములందు నా మనసులగ్నము కావలెను. ప్రతి ఉదయం సమస్త వస్తువులను స్పష్టము చేయుటకు సూర్యుడు ఉదయించును "స్వస్త్యగ్నిం సమీధానమీమహే"

9. యజ్ఞముకొరకు నేడు కుశలు పరచబడును. సోమము సమర్పించుటకు శిలలు కూర్చబడును. అభీష్టసిద్ధికి ద్వేషశూన్య దేవతలను శరణు కోరవలెను. యజమానీ! అనుష్ఠానము చేయుచున్న నీకు ఆదిత్యులు సుఖములు ప్రసాదించవలెను. "స్వస్త్యగ్నిం సమీధానమీమహే"

10. అగ్నీ! మేము యజ్ఞానుష్ఠానము చేయుచున్నాము. సకల దేవతలు ఇచట కూడి ప్రమోదించ వలసిఉన్నది. ఈ యజ్ఞమునకు ప్రకాండ ద్యులోకమున ఉన్న దేవతలను, ఏడుగురు హోతలను, ఇంద్ర, మిత్ర, వరుణలను ఆహ్వానింపుము. ధన ప్రాప్తికిగాను నేను అందరిని స్తుతింతును. "స్వస్త్యగ్నిం సమీధానమీమహే"

11. ప్రసిద్ధ ఆదిత్యులారా! మీరు విచ్చేయండి. మీరు వచ్చినంత సకల సమృద్ధి కలుగును. మా సంపదలు పెంపొందుటకు అందరము ఒకచో చేరి యజ్ఞము చేయుదము. బృహస్పతి, పూష, భాగ. "స్వస్త్యగ్నిం సమీధానమీమహే"

12. దేవతలారా! మీ యజ్ఞముల సమగ్రతసమార్జించండి ఆదిత్యులారా! మాకు ధనపూర్ణము, రాజయోగ్యమగు గృహమును ప్రసాదించండి. మేము మా పశు, పుత్ర, పౌత్ర, పరమాయువు మున్నగు వానిబ విషయమున "స్వస్త్యగ్నిం సమీధానమీమహే"

13. మరుత్తులందరు మమ్ము అన్ని విధముల రక్షించవలెను. సమస్త అగ్నులు ప్రజ్వలించవలెను. సకల దేవతలు

మమ్ము రక్షించుటకు విచ్చేయవలెను సకలవిధ అన్నములు, సంపదలు మాకు లభింవలెను.

14. దేవతలారా! మీరు అన్నము అందించి కాపాడువారు ఉన్నారు. మీరలు రక్షించువారున్నారు. మీరు పాపవిముక్తులను చేసినవారును. సంపదలను పెంచి సంపన్నులను చేసినవారును ఉన్నారు. మీ ఆశ్రయమున భయమనుమాట ఎరుగనివారున్నారు. మేము దేవ కార్యములందు వ్యగ్రులమై అటువంటి వారలము కావలెను.

### ముప్పది ఆరవ సూక్తము

ఋషి - ధనాకలుశస్యుడు. దేవత - విశ్వేదేవతలు. ఛందస్సు -
1-12 జగతి 13,14 త్రిష్టుప్

1. ఉష, రాత్రి, మహతి సుసంఘటిత శరీర ద్యావాపృథ్వి, వరుణ, మిత్ర, ఆర్యమ, ఇంద్ర, మరుద్గణ పర్వతగణ, జలగణ, ఆదిత్యగణములను అంతరిక్ష, స్వర్గములను ఈ యజ్ఞమునకు ఆహ్వానించుచున్నాను.

2. ప్రశస్తచిత్తలు, యజ్ఞానుష్ఠాన స్వరూపులగు ద్యావాపృథ్వులు మమ్ము పాపములనుండి కాపాడ వలెను. శత్రువునుండి విడిపించవలెను. దుష్టాశయముల మృత్యువు అధికారము మా మీద ఉండరాదు. మేము దేవతలను విశిష్టరక్షణలకని ప్రార్థించుచున్నాము "దేవానామవో అద్యావృణీమహే".

3. ధనికులగు మిత్రా వరుణులు జనని అదితి మమ్ము పాపములనుండి కాపాడవలెను. మాకు సర్వప్రకారముల అవినాశ్య జ్యోతిలభించవలెను. "దేవానామవో అద్యావృణీమహే".

4. సోమమును పిండు శిలలధ్వని రాక్షసులను దూరముగా పారద్రోల వలెను- దుస్వప్న, మృత్య, సకల శత్రువులను దూరము చేయవలెను. మేము ఆదిత్యులు, మరుత్తులనుండి సుఖములు పోందవలెను. "దేవానామవో అద్యావృణీమహే".

5. ఇంద్రుడు రావలెను. కుశల మీద కూర్చుండవలెను. విశేషస్తుతులను ఉచ్చరించవలెను. ఋక్, సామములతో బృహస్పతి అర్చించవలెను. మాకు ఉత్తమోత్తమ అభిలషణీయ పదార్థములు లభించవలెను. మేము చిరంజీవులము కావలెను. "దేవానామవో అద్యావృణీమహే".

6. అశ్వినులారా! మా యజ్ఞమును స్వర్గమును అంటునట్లు చేయుడు. సమస్త విఘ్నములను దూరము చేయండి. మా కోరికలు తీర్చండి. మాకు సుఖములు కలిగించండి. అగ్నికి ఘృతము సమర్పించి ఆహుతలు ఇచ్చుచున్నాము. ఆ జ్వాలలను దేవతల వద్దకు పంపండి. "దేవానామవో అద్యావృణీమహే".

7. మరుత్తులు అందరిని పరిశుద్ధులను చేయుదురు. వారు సుందరులు. వారినుంచే శుభములు ఉత్పన్నములగును. వారు ధనములను పెంచుదురు. వారి నామము మనసులకు ఆహ్లాదము కలిగించును. విశిష్టరూప అన్నము కోరి నేను వారిని ఆహ్వానింతును. ప్రార్థింతును. "దేవానామవో అద్యావృణీమహే".

8. జలములందు కలియునదియు, ప్రాణులకు స్వేచ్ఛ ప్రసాదించునదియు. దేవతలను తృప్తులను చేయునదియు, పేర్కొన్నంత ఆనందము కలిగించునదియు, యజ్ఞములను శోభిల్ల చేయునదియు, ఉత్కృష్ట దీప్తత సోమమును ఆశ్రయింతుము. అతనిని బలములు యాచింతుము. "దేవానామవో అద్యావృణీమహే".

9. మేము, మాపుత్రులు చిరంజీవులము కావలెను. అపరాధులము కారాదు. మేము పుత్రాదులతోకలసి సోమమును పంచుకొని పానము చేయుదుము. సుత్తిద్రోహులు సమస్త పాపములందు పడవలెను. "దేవానామవో అద్యావృణీమహే".

10. దేవతలారా! మీరు మానవుల యజ్ఞములు అందుకొనుటకు యోగ్యులు. మేము మిమ్ము కోరినవి ప్రసాదించండి. మేము బలవంతులమగు జ్ఞానము ప్రసాదించండి ధనము, భౌతికబలము యశము ప్రసాదించండి. "దేవానామవో అద్యావృణీమహే".

11. దేవతలు ప్రకాండులు మహితాత్ములు. నిశ్చలులు. మేము వారినుండి అటువంటి రక్షణలనే ప్రార్థించుచున్నాము. మేము ధనమును, భౌతికబలమును పొందవలెను. "దేవానామవో అద్యావృణీమహే".

12. ప్రజ్వలిత అగ్ని వలన మాకు విశిష్టసుఖములు లభించవలెను. మిత్రావరుణుల వద్ద మేము నిరపరాధులము కావలెను. మాకు శుభములు కలుగవలెను. సూర్యుడు మాకు సర్వోత్కృష్ట శాంతిని ప్రసాదించవలెను. "దేవానామవో అద్యావృణీమహే".

13. సత్యస్వభావ దేవతలు సూర్య, మిత్ర, వరుణులు యజ్ఞములకు విచ్చేయుదురు. వారు మాకు సౌభాగ్యము, లౌకికబలము, గోవులు, పుణ్యకార్యములు, వివిధ ధనములు ప్రసాదించవలెను.

14. తూర్పేమి, పడమరేమి, దక్షిణమేమి, ఉత్తరమేమి సూర్యదేవుడు అన్నిదిశలందు మాకు సంపదలు సమృద్ధములు చేయవలెను. దీర్ఘమగు ఆయువు ప్రసాదించవలెను "సవితానో రాసతాందీర్ఘమాయుః"

## ముప్పది ఏడవ సూక్తము

ఋషి - సూర్యపుత్ర అభితపుడు. దేవత - సూర్యుడు.

ఛందస్సు - జగతి - 10 త్రిష్టప్.

1. సూర్యుడు మిత్రావరుణులను చూచును. అతని దీప్తి అత్యంత ఉజ్వలము. అతడు దూరమునుండియే సకల పదార్థములను వీక్షించును. అతడు దేవతల వంశమున జన్మించిన వాడు. సకల పదార్థాములకుస్వచ్ఛత ప్రసాదించువాడు. ఆకాశమునకు పుత్ర స్వరూపుడు. అట్టి సూర్యునకు నమస్కరించండి. పూజించండి. స్తుతించండి.

2. ఇది సత్యవాక్కు ఆకాశము, దినములు సత్యమును అవలంబించియే ప్రవర్తిల్లు చున్నవి. సకలలోకములు, సకల ప్రాణిజాలము సత్యమునే ఆశ్రయించి ఉన్నది. సత్యప్రభావముననే జలములు ప్రవహించు చున్నవి -సూర్యుడు ఉదయించుచున్నాడు. ఆసత్యవాక్కు నన్ను రక్షించవలెను. - "సా మాం సత్యోక్తిః పరిపాతు."

3. సూర్యదేవా! నీవు వేగవంతములగు అశ్వములను రథమునకు పూన్చెదవు. ఆ రథమున ఆకాశమున పయనింతువు. అప్పుడు దేవశూన్యయగు ఏ ప్రాణియు నిన్ను చేరజాలదు. నీ జ్యోతి చిరపరచితమయ్యుసాధారణము. ఆ జ్యోతిని అవలంబించియే నీవు ఉదయింతువు.

4. సూర్యదేవా! నీ జ్యోతి అంధకారములను నష్టపరచునది. నీ కిరణములు లోకములను ప్రకాశింపచేయును. ఆ జ్యోతి ఆ కిరణములచే మా సకల దారిద్ర్యములను నష్టపరచుము. మా పాపములు, వ్యాధులు, దుఃఖములను దూరము చేయుము.

5. సూర్యదేవా! నీవు అనాయాసముగా సకల లోకముల కార్యకలాపములను రక్షింతువు. నీవు ప్రాతః కాల హోమము నుండి ఉదయింతువు. మేము నీ నామమును ఉచ్చరించునప్పుడు దేవతలు మా యజ్ఞమును రక్షించవలెను.

6. ద్యావాపృథ్వులు, జలములు, మరుత్తులు, ఇంద్రుడు మా పిలుపును ఆలకించవలెను. మాపై సూర్యుని కృపాదృష్టి ఉండగా దుఃఖములు మమ్ము చేరరాదు. మేము దీర్ఘజీవుల మై వృద్ధావస్థ పర్యంతము సౌభాగ్యశాలులమై ఉండవలెను. "భద్రంజీవన్తో జరణామశీమహి."

7. సూర్యదేవా! నీవు బంధువులను సత్కరించువాడవు. నీవు నిత్యము ఉదయించినట్లే మేము నిత్యము నీ

ప్రశస్తమనమును చక్షువును దర్శించవలెను. నిత్యము మేము ఆరోగ్యవంతులము కావలెను. మాపుత్ర పౌత్రులు మమ్ము చుట్టుముట్టి ఉండవలెను. సకల దోషములకు దూరముగా ఉండి నిన్ను దర్శించగలుగవలెను. మేము చిరంజీవులము కావలెను.

8. సర్వదర్శక సూర్యదేవా! నీవు ప్రకాండ జ్యోతివి. నీ దీప్తి ఉజ్వలము. అందరి కన్నులందు నీవు సుఖకరుడవు. నీ మూర్తి ఆకాశమును ఆరోహించినపుడు మేము ప్రదీప్తశరీరులమై నిత్యము నీ మూర్తిని దర్శింతుముగాత.

9. సూర్యదేవా! నీ పతాకముతోనే జగములు వెలుగులు పొందును. ప్రతిరాత్రి అంధకారమైనపుడు నీ పతాకము మాయమగును. పింగళకేశసూర్యా ! ఆ ఉత్తమ పతాకము పట్టుకొని ఉదయించుము. మేము దోషరహితులమై నీ పతాకము దర్శింతుము.

10. నీ వీక్షణము మాకు శుభములు ప్రసాదించవలెను. దినము, నీకిరణము, నీ శీలము, నీ ఉత్తాపము శుభప్రదములు కావలెను. మేము ఇంట ఉన్నను, దారిలో ఉన్నను, ప్రయాణ మందున్నను శుభములు కలుగవలెను. సూర్యదేవా! మాకు వివిధ సంపదలు ప్రసాదించుము.

11. దేవతలారా! మా వద్ద ఉన్న ద్విపద, చతుష్పాత్తు లన్నింటికి సుఖములు కలుగవలెను ప్రాణులన్నింటికి ఆహారము కలుగ వలెను. అవి పుష్టివంతములు, బలిష్ఠములు కావలెను. మా సహితముగా వాటికి కూడా అప్రమత్తత లభించుగాత.

12. ధినసంపన్న దేవతలారా! మాటలో, మనసులో, పనిలో మేము దేవతల విషయమున అపరాధము చేసిఉండవచ్చును. అట్టి అపరాధమును దానధర్మములకు విముఖునకు, మాకు అనిష్టము చేయువానికి అంటగట్టండి.

## ముప్పది ఎనిమిదవ సూక్తము

ఋషి - ముష్కవిశిష్ట ఇంద్రుడు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు - జగతి.

1. ఇంద్రా! ఇది యుద్ధము. ఇందు కీర్తిలభించును. దెబ్బమీద దెబ్బపడును. అట్టి యుద్ధమున నీవు ప్రతాపజ్వాలను ప్రదర్శింతువు. శత్రువులనుండి గెలిచిన గోవులను సురక్షితముగా ఉంచుదువు. యుద్ధమున దీప్యమాన బాణములు ప్రబల శత్రువుమీద పడును. యుద్ధమున చూచి జనులు హతాశులు అగుదురు.

2. అట్లుగాన ఇంద్రా! మా ఇంటిని విశేషధనధాన్యములతో, గోవులతో నింపుము. నీవు విజయుడవైనంత నీకు స్నేహపాత్రులము కావలెను. మాకు మేము అభిలషించు ధనమును ప్రసాదించుము.

3. అనేకులచే స్తుతుడవైన ఇంద్రా! ఆర్యుడైనను, అనార్యుడైనను - దేవశూన్యుడు - మాతో యుద్ధము చేయ

సంకల్పించినపుడు వాడు మా చేత సులభముగా పరాజితుడు కావలెను. నీదయవలన మేము అట్టివారిని యుద్ధములందు ఓడించవలెను.

4. ఇంద్రుని కొద్దిమంది పూజింతురు. ఎక్కువమంది పూజింతురు. ఇంద్రుడు దుస్సాధ్యయుద్ధమున విజయుడగును. ఉత్తమోత్తమ పదార్థములను సాధించును. అతడు యుద్ధమందు స్నానము చేయగలడు. సుప్రసిద్ధ యశస్కుడు. ఆశ్రయము కొరకు మేము ఆ ఇంద్రుని అనుకూలుని చేసికొందుము.

5. ఇంద్రా! నీవు నీ భక్తులను ఉత్సాహవంతులను చేయుదువు. మరి మమ్ము ఎవడు ఉత్సాహవంతులను చేయును? నీవు నీ బంధనములు త్రెంచుకొనగల సమర్థుడవని మాకు తెలియును. కావున కుత్సుని బంధములు త్రెంచుకొమ్ము. విచ్చేయుము. నీ వంటివాడు ముష్కరుల బంధములనేల సహించును?

(కుత్సుడు, లుశుడు ఒకేసారి తమ యజ్ఞములకు ఇంద్రుని ఆహ్వానించినారు. ఇంద్రునకు గల స్నేహమున మొదలు కుత్సుని వద్దకు వెళ్లినాడు. లుశుడు ఇంద్రుని కుత్సుడు బంధించినాడనుకున్నాడు.)

## ముప్పది తొమ్మిదవ సూక్తము

ఋషి - కక్షీవత పుత్రి ఘోష, దేవత - అశ్వినులు. ఛందస్సు - జగతి చివరిది త్రిష్టుప్.

1. అశ్వినులారా! మీ రథము సర్వత్ర సంచారి. చక్కగా నిర్మించబడినది. ఆ రథమును రాత్రింబవళ్లు పిలుచుట యజమాని కర్తవ్యమైఉన్నది. ఆరథపు పురాతన నామమును మేము ఉచ్చరింతుము. తండ్రి పేరు పలుకుటలో పుత్రునకువలె ఆరథపు పేరు పలుకుటలో మాకు ఆనందమున్నది.

2. మాతో మధుర వాక్యము ఉచ్చరింప చేయండి. మా కార్యములు పూర్తిచేయండి. మంచి బుద్ధులు కలిగించండి. ఇదిగో ఇవే మా కోరికలు. అశ్వినులారా! అతిప్రశంసిత ధనపు భాగమును మాకు ఇవ్వండి. సోమరసము ప్రీతిప్రదము అగును. అట్లే మమ్ము సహితము యజమానులకు ప్రీతిప్రదులను చేయండి.

3. అశ్వినులారా! తండ్రి ఇంట ఒకసారి ఘోష - వృద్ధురాలగు చున్నది. మీరు ఆమెకు సౌభాగ్య స్వరూపుడైన వరుని తెండి. మీరు నడవలేని వానికి, నికృష్టునకు ఆశ్రయము కల్పించండి అంధులు. దుర్బలులు దుఃఖితులు, రోగగ్రస్తులు మిమ్ము చికిత్సకులని నమ్ముతారు.

4. ఒకడు పాత రథమునకు కొత్తరూపమిచ్చి నడిపించును. అట్లే మీరు జరాజీర్ణ చ్యవనుని యువకుని చేసినారు. తుగ్రపుత్రుని నిరపాయముగా జలమునుండి బయటికి తీసినారు. మీరు చేసిన ఈ ఘనకార్యములు యజ్ఞములందు వర్ణించయోగ్యములు.

5. మీరు చేసిన సకల వీరకృత్యములను నేను జనులకు వివరిస్తాను. అంతేకాదు. మీరు మాత్రమే నిష్ణాతులగు వైద్యులు. కావుననే మీ ఆశ్రయము కొరకు నేను మిమ్ము స్తుతిస్తాను. నా స్తుతులను యజమాని తప్పక విశ్వసించును.

6. అశ్వినులారా! నేను మిమ్ము పిలుచుచున్నాను. వినండి తండ్రి బిడ్డకు బోధించినట్లు నాకు బోధించండి. నాకు నిజమైన బంధువులు లేరు. నేనుజ్ఞాన శూన్యను. నాకు ఒక కుటుంబము లేదు. ఒక బుద్ధిలేదు. నాకు ఎటువంటి దుర్గతి కలుగక ముందే దానిని తొలగించండి.

7. పురుమిత్రుని పుత్రిక 'శున్ధ్యువ' ను మీరు రథము మీద తీసికోని వెళ్లినారు. విమదునితో ఆమె పెండ్లి జరిపించినారు. వధ్రిమతి మిమ్ము పిలిచినది. మీరు ఆమె మాట విన్నారు. ఆమె ప్రసవ వేదన తగ్గించినారు. ప్రసవింప చేసినారు.

8. 'కలి' అనువాడు మీ స్తోత. అతడు ఎంతో వృద్ధుడు అయినాడు. మీరు అతనిని ప్రాయపు వానిగ చేసినారు. 'వందను'ని బావినుంచి బయటికి తీసినారు. కుంటి 'విశ్పల'కు ఇనుపకాలు అమర్చినారు. నడిపించినారు.

9. కోరికలు తీర్చు అశ్వినులారా! రేభుడను వానిని శుత్రువులు మృత ప్రాయుని చేసినారు. గుహలోపడవేసినారు. అప్పుడు మీరే అతనిని సంకటమునునుండి రక్షించినారు. అత్రిఋషిని ఏడుకట్లు కట్టి అగ్నికుండమున వేసినారు. అప్పుడు మీరే అగ్ని కుండమును ఆర్పివేసినారు.

10. అశ్వినులారా! రాజగు 'పేరు'నకు తొంబది తొమ్మిది అశ్వములతో బాటు ఒక ఉత్తమ, శుభ్రవర్ణ అశ్వమును ఇచ్చినారు. అది విచిత్ర తేజస్సుగలది. దానిని చూడగనే శత్రువులు పారి పోవువారు. అది మానవులకు బహుమూల్య ధనము. దాని పేరు విన్నంత ఆనందము కలుగును. దానిని చూచినంత సుఖములు కలుగును.

11. అశ్వినులారా! మిమ్ము కీర్తించినంత ఆనందము కలుగును. మీరు మార్గమున సాగునపుడు జనులు మిమ్ము నలువైపుల నుంచి స్తుతింతురు. మీరు దంపతులను మీ రథపు ముందరి భాగమున కూర్చుండ పెట్టి ఆశ్రయమిచ్చినను వారికి పాపము దుర్గతి, ఆపద అంటరాదు.

12. అశ్విద్వయమా! ఋభుదేవులు మీకు రథము సమర్పించినారు. ఆరథము వెలువడినంత ఆకాశమందు ఉషస్సు అవతరించును. సూర్యుని నుండి ఎంతో అందములగు రాత్రింబవళ్లు కలుగును. అట్టి మనసుతోనే ఆరథమువెక్కియే మీరు విచ్చేయండి.

13. అశ్వినులారా! మీరు ఆ రథముననే పర్వత మార్గమున పయనించండి. 'శయు' నామకుని వృద్ధగోవును పాదియావును చేయండి మీ శక్తి ఎంతటిదనగా తోడేలు నోట బడిన వర్తిక పక్షిని తోడేలు నోటినుండి తీసి రక్షించినారు.

14. భృగసంతానములు రథములు చేసినట్లు అశ్విద్వయమా! మీకు రథము సమర్పించబడినది. మామ కూతురునిచ్చునపుడు అల్లునగు వస్త్రాది భూషణములచే అలంకరించినట్లు నేను మీ కొరకు ఈ స్తోత్రమును అలంకరించినాను.

## నలుబదవ సూక్తము

ఋష్యాదులు పూర్వమువలె

1. అశ్వినులారా! మీరు కర్మబోధకులు. మీ మహారథము ప్రాతః కాలమున బయలు దేరును. ఒక ప్రత్యేక వ్యక్తినుండి ధనము అందుకొనును. సాగును. అప్పుడు తన యజ్ఞసాఫల్యమునకని ఏ యజమాని ఉజ్వలమగు మీ రథమును కీర్తించునో ఆరథముఏది?

2. అశ్విద్వయమా! మీరు రాత్రింబవళ్లు ఎచటి కేగుదురు? ఎచట కాలము గడుపుదురు? శయన కాలమున విధవ తన బావను, సధవ తన భర్తను సమాదరించినట్లు యజ్ఞములందు మిమ్ము సమాదరించి ఎవరు ఆహ్వానింతురు?

(శయుత్రా విధవేవ దేవరం శయన కాలమున విధవ తన బావను అను మంత్ర భాగము భావగర్భితముతో వివరణ అవసరము. 1. విధవలకు అంతటి దుర్గతి లేదు. 2. విధవకు బావతో సంబంధము ధర్మమైనట్లున్నది 3. ఇదియే దేవరన్యాయము ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు అట్లు జన్మించినవారే 4. పంజాబు ప్రాంతమందు దేవరన్యాయము నేటికి చెల్లుబాటులో ఉన్నది.)

3. వృద్ధరాజులనువలె ప్రాతఃకాల స్తోత్రపాఠములు మమ్ము మేల్కొలుపును. యజ్ఞములు అందుకొనుటకు నిత్యము మీరు ఎవరి ఇంటికి చేరుకుందురు? ఎవని పాపములు దూరము చేయుదురు? రాజకుమారులవంటి మీరు ఎవరి యజ్ఞములకు సాగుదురు?

4. వేటకాడు శార్దూలము కొరకు చూచినట్లు యజ్ఞద్రవ్యములు అందుకోని రాత్రింబవళ్లు మీ కొరకు చూచుచున్నారు. కాలమును అనుసరించి జనులు మీ కొరకు హోమములు చేయుదురు. మీరు జనులకు అన్నము అందింతురు. మరి మీరే కదా శుభములకు అధిపతులు!

5. ఉపదేశక ద్వయమా! నేను రాజకుమారి ఘోషను. నేను నలుదిశల మీకథలే చెప్పుదును. మిమ్ములనే ఆలోచిస్తాను. రాత్రనకు, పగలనక మీరు నా వద్దనే ఉందురు రథయుక్తుడు, అశ్వసంపన్నుడగు నా అన్నకొడుకును నిరసింతురు.

(ఘోష కన్య తండ్రి ఇంట ఉన్నది సోదరలు ఆమెను సహించకుండవచ్చును. వారి కొడుకులు అత్తను సహింతురా?

అందుకే నిరసన కావచ్చును)

6. కవిద్వయమా! మీరు రథము అధిరోహించిఉన్నారు మీరు కాత్సునివలె రథమెక్కి స్తోత్ర ఇంటికి చేరుదురు. మీ వద్దనున్న మధువు అత్యధికము - తేనెటీగలు గ్రహించునంతటిది! వ్యభిచారిణివలె తేనెటీగలు నీ మధువు వెంటపడును.

(కుత్సుడు ఇంద్రుని రథమున ఇంద్రసహితుడై సాగును తేనెటీగలే మధువునిచ్చును. కాని అశ్వినులు చేసిన మధువు తేనెటీగలనే మురిపించునంతటిది!)

7. అశ్వినులారా! మీరు **"భుజ్యు"**ని సముద్రము నుండి రక్షించినారు. మీరు రాజగు **'వశు'**ని, **'అత్రి'**ని, 'ఉశన'ను ఉద్ధరించినారు. దాత అయినవాడే మీతో బంధుత్వము చేయగలడు. నీ ఆశ్రయమున లభించు సుఖమునే నేను ఆశించుచున్నాను.

8. అశ్విద్వయమా! మీరు కృశుని కాపాడినారు శయుని కాపాడినారు. మీకు పరిచారిక అయిన విధవను కాపాడినారు. యజ్ఞకర్త కొరకు మీరే మేఘమును భిన్నము చేసినారు. భిన్నమైన దతిశీలమ్ ధారాత మేఘము గర్జించినది. వర్షించినది.

9. నేను ఘోషను మీ దయవలన నారీలక్షణములు గల సౌభాగ్యవతిని అయినాను. నా పెళ్లికి వరుడు విచ్చేసినాడు. మీరు వర్షము కురిపించినారు. సస్యాదులు ఫలించినవి. పల్లమునకు పారు నదులు పంటల వైపుసాగుచున్నవి. ఈ రోజు నేను భార్యను అయినాను. **"అస్మాఅహ్నాభవతి తత్పతిత్వనమ్"**.

(ఘోషలో ఏదోనారీ లక్షణము లోపించినట్లున్నది. అశ్వినులు దానిని సరి చేసినట్లున్నారు. ఆలస్యముగా వరుడు లభించిన వధువు వలె ఘోష పొంగిపోయినది.)

10. తమ భార్యల ప్రాణరక్షణ కొరకు ఏడ్చినంత చేసిన వారున్నారు. స్త్రీలను యజ్ఞమున నియమించిన వారున్నారు. స్త్రీలను తమ బాహుబంధములందు ఎంతోసేపుఉంచి సంతానము పొంది, పితృయజ్ఞమును నిర్వహించిన వారున్నారు. అట్టివారిని భార్యలు ఆనందముగ ఆలింగనము చేసికొందురు.

11. అశ్విద్వయమా! అటువంటి సుఖము నేను ఎరుగును. యువకుడైన భర్త యువతియైన భార్య వీరి సహవాస సుఖమును నాకు బోధించుడు. నాడి ఒకే కోరిక స్త్రీవిషయమున అనురక్తుడైన బలశాలి ఇంటికి చేరవలెను.

12. అన్నవంత ధనవంత అశ్వినులారా! మీరు నన్ను అనుగ్రహించండి. నా మనసులోని కోరికలు తీర్చండి. మీరు కళ్యాణ కారకులు, నాకు రక్షకులు కండి. నేను భర్త ఇంటికి చేరి అతనికి ఇష్టురాలను కావలెను!

13. నేను మిమ్ము స్తుతించుచున్నాను. అందుకు మీరు సంతుష్టులై నా పతి గృహమందు ధనము, సంతతి కలిగించండి. నేను నీరుత్రాగు తీరమును సౌకర్యవంతము చేయండి. నేను పతిగృహమునకేగు మార్గమున విఘ్నములున్న వానిని తొలగించుము.

14. ప్రియదర్శన, శుభంకర అశ్విద్వయమా! ఈ మధ్య మీరు ఎక్కడ, ఎవరింట ఆనందప్రమోదములందు ఉన్నారు? ఎవరు మిమ్ము కట్టి పడవేసినాడు? ఏ బుద్ధిమంతుడగు యజమాని ఇంటచేరినారు?

## నలుబది ఒకటవ సూక్తము

ఋషి - ఘోష పుత్రుడు సుహస్తుడు. దేవత - అశ్వినులు. ఛందస్సు - జగతి.

1. అశ్విద్వయమా! మీ ఉభయులది ఒకే రథము. దానిని అనేకులు ఆహ్వానింతురు. స్తుతింతురు. ఆ మూడు చక్రముల రథము యజ్ఞములకు వెళ్లును. అది నలువైపుల తిరుగును. యజ్ఞములను సుసంపన్నము చేయును. నిత్యము ప్రాతఃకాలములందు స్తుతులచే ఆరథమునే ఆహ్వానింతుము.

2. సత్యస్వరూప అశ్వినులారా! మీ రథము ప్రాతఃకాలమున సిద్ధమగును - సాగును. అది మధువును వహించును. ఆ రథము పైనే యజ్ఞకర్తల వద్దకు వెళ్లండి. మిమ్ము స్తుతించువాని హోత్రయుక్త యజ్ఞమునకు కూడ వెళ్లండి.

3. అశ్విద్వయమా! నేను సుహస్త్యుడను. మధువు చేతబూని అధ్వర్యు కార్యము విర్వార్తింతును. నావద్దకుగాని బలవంతుడు, పురోహితుడు, దాతయగు అగ్నీధ్రుని వద్దకు గాని విచ్చేయండి. మీరు విప్రుల యజ్ఞములకు పోవువారే కావచ్చును. మధుపానము కొరకు మా ఇంటికి విచ్చేయండి.

(ఘోషపుత్రుడు అన్నాడు ఘోషభర్తపేరు చెప్పలేదు. ఘోష స్వతంత్ర వలె ఉన్నది. నేడు సహితము అట్టివారున్నారు.)

## నలుబది రెండవ సూక్తము

ఋషి - అంగిరస కృష్ణుడు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు - త్రిష్టుప్.

1. ధనుర్ధారి గురిచూచి బాణము విడిచినట్లు - ఇంద్రుని గూర్చి స్తుతులు చేయండి. ప్రాంజలులై అలంకృత స్తుతులను సమర్పించండి. విప్రులారా! మిమ్ము స్పర్ధించువారు పరాజితులగు నట్టి స్తుతులు ప్రయోగించండి. స్తోతలారా! ఇంద్రుని సోమము వైపు ఆకర్షించండి.

2. స్తోతలారా! పాలు పితుకుకొని గోవు వలన ప్రయోజనము పొందినట్లు మిత్రస్వరూపుడగు ఇంద్రుని వలన

ప్రయోజనము పొందండి. ఇంద్రుని స్తుతించండి. మేల్కొల్పండి. గింజలగిన్నెను బోర్లించిగింజలు తీసికొన్నట్లు ఇంద్రుని అను కూలుని చేసికొని మీ కోరికలు తీర్చుకొండి.

3. ఇంద్రా! జనులు నిన్ను భోజుడని ఎందుకు అందురో? అర్థమైనది. నీవు దాతవు. అందుకే నీకా పేరు వచ్చినది. నీవు జనులను పదును పెట్టుదువని విన్నాను. నా బుద్ధికి పదును పెట్టుము నన్ను నిపుణుని చేయుము. నాకు సంపన్నుడగు నట్టి అదృష్టము కలిగించుము.

4. ఇంద్రా! జనులు యుద్ధములకు పోయినపుడునీ నామము తలచుకొందురు. నీవు యజమానికి సహాయకుడవు అగుదువు. నీకు సోమము సమర్పించని వానితో నీవు స్నేహము చేయవు.

5. అన్నవంతుడగు ఏవ్యక్తి ఇంద్రునకు ప్రథమ సొమము సమర్పించునో, గోవులు, అశ్వములు దానము చేయుధనవంతునివలె ఇంద్రునకు ఉదారముగ సోమరసము అందించునో, అట్టివానికి ఇంద్రుడు సహాయకుడగును. అతనికి బలిష్ఠులు అనేక సేనలున్న శత్రువులున్నను. ఇంద్రుడు వారిని శీఘ్రాతి శీఘ్రముగ పారద్రోలును.

6. మేము స్తుతించిన ఇంద్రుడు ధనవంతుడు. అతడు మా కోరికలు తీర్చిన్నాడు. ఇంద్రుని శత్రువులు పారిపోవలెను. శత్రుదేశ సంపద ఇంద్రుని చేతికిరావలెను.

7. ఇంద్రా! నిన్ను లెక్కకు మిక్కిలిమంది పిలిచెదరు. నీ వజ్రము భయంకరము. దానితో దగ్గరి శత్రువును దూరము చేయుము. నన్ను గోయుక్తుడను, యువయుక్తుడను చేయుము. నీ స్తోతల స్తుతులను అన్న, రత్న సంపన్నములను చేయుము.

8. సోమరసము అనేకధారలుగా మధురరసము కురింపించుచు ఇంద్రుని దేహమున చేరును. ఆ సమయమున ఇంద్రుడు సోమదాతను వారించడు. ఇకవలదు అనేమాట సహితము అన్నాడు. అంతేకాదు సోమదాతకు కోరినవన్నియు ఇచ్చుమ.

9. ఓడిన జూదరి ఓడించిన జూదరిని వెదికి వట్టి ఓడించును. ఇంద్రుడు అరిష్టకర్తను అట్లే ఓడించును. ఏ దేవభక్తుడు దేవపూజలో కృపణత్వము చూపడో అట్టివానిని ఇంద్రుడు మరింత ధనికుని చేయును.

10. గోవులవలన మేము దుఃఖదారిద్ర్యమును దాటి పోవలెను. అనేకులచే ఆహూత ఇంద్రా! యవలతో మేము ఆకలి తీర్చుకొనగలుగ వలయు. మేము రాజుల వెంట వెంటనడిచి అగ్రసరులమై స్వబలప్రభావమున సంపదలను గెలువ గలుగవలెను.

11. పాపి శత్రువుబారినుండి మమ్ము బృహస్పతి పశ్చిమ, ఉత్తర, దక్షిణ దిశలందు కాపాడవలెను. తూర్పు

దిశయందును మధ్యభాగమునను ఇంద్రుడు మమ్ము రక్షించవలెను. ఇంద్రుడు మా మిత్రుడు. మేము ఇంద్రుని మేము ఇంద్రుని మిత్రులము. అతడు మా కోరికలు తీర్చవలెను.

*శ్రీమందాంధ్ర వచన ఋగ్వేద సంహిత ఏడవ అష్టకము పదవ మండలమున మూడవ అనువాకము సమాప్తము.*

**నాలుగవ అనువాకము నలుబది మూడవ సూక్తము**

ఋషిదేవతే పూర్వవత్. చంధస్సు - జగతి - 10,11 త్రిష్టుప్

1. నా స్తుతులన్ని కలిసి ఉద్దేశ పూర్వకముగ ఇంద్రుని గుణగానము చేసినవి. స్తుతులు సకల విధలాభములు కలిగించ గలవు. భార్యలు భర్తలను ఆలింగనము చేసికొన్నట్లు స్తుతులు శుద్ధస్వభావ ఇంద్రుని ఆశ్రయమునకుగాను అతనిని ఆలింగనము చేసికొనును.

2. ఇంద్రా! నిన్ను విడిచి నా మనసు అన్యత్ర సంచరించదు. నీ మీదనే నేను నా అభిలాషలు నిలిపినాను. రాజు తన భవనమున ఆసీనుడైనట్లు. మీరు కుశలపై ఆసీనులు కండి. ఈ సురిచిర సోమపాన కార్యము సాగించండి.

3. దుర్గతి, అన్నరాహిత్యమునుంచి మమ్ము రక్షించుటకు ఇంద్రుడు మాకు నలువైపుల ఉండవలెను. ఇంద్రుడు ధనదాత సకల సంపదలకు ధనములకు అధిపతి. కోరికలు తీర్చువాడు తేజస్వి ఇంద్రుని ఆదేశమునసుసరించియే గంగాది సప్తనదులు పల్లమునకు ప్రవహించుచున్నవి. వ్యవసాయమును వృద్ధిచేయుచున్నవి.

4. పచ్చని ఆకుల చెట్టును పిట్టలు ఆశ్రయించును. పాత్ర యందున్న ఆనందకర సోమము ఇంద్రుని ఆశ్రయించును. సోమరస తేజమున ఇంద్రుని ముఖము వెలిగినది. ఇంద్రుడు మానవులకు ఉత్కృష్ట జ్యోతి అగును. "మనవేజ్యోతిరార్యమ్."

5. జూదగృహమున తనను గెలిచిన వానిని వెదికి ఓడించినట్లు - ఇంద్రుడు వృష్టినిరోధక సూర్యుని ఓడించును. ఇంద్రా! నీవు ధనాధిపతివి. పాత, కొత్త వాడెవడును నీ పౌరుషమువలె పని చేయజాలడు.

6. ధనద ఇంద్రుడు ప్రత్యేక వ్యక్తిలో వసించును. కోరికలు తీర్చు ఇంద్రుడు స్తోత్రములన్నింటిని జాగ్రత్తగా వినును. ఇంద్రుని ప్రీతుని చేసిన సోమయజ్ఞకర్తలు సోమము వలన శత్రువులను పరాజితులను చేయుదురు.

7. జలము నదులవైపు. చిన్న చిన్న కాలువలు చెరువు వైపునకు సాగునట్లు సోమరసము ఇంద్రునిలోనికి సాగును. యజ్ఞస్థలమున విప్రులు ఇంద్రుని వానకు పంటవలె వర్థిల్ల చేయుదురు.

8. ఆబోతు కోపమున మరొక ఆబోతు మీదకు పోవును. అట్లే ఇంద్రుడు మేఘము మీదకు పోయి తను కోరిన

జలమును వెలికి తీయును. సోమ యజ్ఞము చేసిన వానికి, ఉదారముగ దానములు చేసిన వానికి, హవి సంగ్రహించినవానికి ధనిక ఇంద్రుడు జ్యోతిని ప్రసాదించును.

9. ఇంద్రుని వజ్రము తేజోవంతమై ఉదయించవలెను. పూర్వము వలెనే ఇప్పుడును యజ్ఞక్రియలు జరుగవలెను ఇంద్రుడు ఉజ్వల తేజస్సుతో శోభిల్లవలెను. సాధుజనపాలక ఇంద్రుడు సూర్యునివంటి శుభ్రవర్ణదీప్తితో వెలుగొందవలెను.

10. గోవుల వలన మేము దుఃఖదారిద్ర్యములను దాటిపోవలెను. అనేకులచే ఆహూత ఇంద్రా! యవలతో మేము ఆకలి ఆర్పుకొన గలుగవలెను. మేము రాజులవెంటనడచి, అశ్రసరులమై స్వబలమున సంపదలను గెలువవలెను.

11. పాపి శత్రువు బారినుండి మమ్ము బృహస్పతి పశ్చిమ ఉత్తర దక్షిణ దిశలందు కాపాడవలెను. తూర్పు దిశయందును, మధ్యభాగముననను ఇంద్రుడు రక్షించవలెను ఇంద్రుడు మామిత్రుడు. మేము మిత్రులము. అతడు మా కోరికలు తీర్చవలెను.

## నలుబది నాలుగవ సూక్తము

ఋషి - అంగిరస కృష్ణుడు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు -
1-3, 9,10 త్రిష్టుప్ 4-8 జగతి.

1. ఇంద్రుడు స్థూలకాయుడు అతడు తన విపుల, దుర్ధర్ష బలమున బలశాలురను సహితము బలహీనులను చేయును. అట్టి ధనిక ఇంద్రుడు రథమును ఎక్కినాడు అతడు ప్రమోదించుటకు రావలెను.

2. నరపతి ఇంద్రా! నీ రథము చక్కగా అమర్చినది. నీ అశ్వములు సుశిక్షితములు నీ చేత వజ్రము ఉన్నది. ఆ రూపముగలవాడవై సులభమార్గమున కిందికి దిగిరమ్ము. నీ పానమునకు సోమము సిద్ధముగా ఉన్నది. సోమము త్రావించి మేము నీ బలమును మరింత పెంచుదుము.

3. ఇంద్రుడు నేతలకు నేత. వజ్రహస్తుడు శత్రుబలాపహారి. దుర్ధర్షుడు. కోపము వృథాకానివ్వనివాడు. అతడు తనను వహించు బలిష్ఠ అశ్వయుక్తుడై మా వద్దకు రావలెను.

4. సోమరసము పుష్టి కలిగించును. కలశమున కలసిపోవును. బలమును కదలించును. ఇంద్రా! ఆసోమమును ఉదరమున ధరింపుము. మా బలమును పెంచుము. మమ్ము నీకు ఆత్మీయులను చేసికోనుము.

5. ఇంద్రా! నేను స్తోతను. నా వద్దకు సకల సంపదలు చేరవలెను. నాకు ఉత్తమ అభిలాషలు ఉన్నవి. వానిని తీర్చుకొనుటకు సోమ సంచయనము చేసినాను. యజ్ఞము తలపెట్టినాను. అందుకు అధిపతివగు ఇంద్రా!

విచ్చేయుము. కుశలపై కూర్చుండుము. నీ కొరకు సోమపాత్ర సిద్ధమైనది. అందు కొనుము. దానిని బలాత్కారముగా గుంజు కొనగల వాడు లేనేలేడు.

6. ప్రాచీన కాలమందే యజ్ఞములు చేసి దేవతలను ఆహ్వానించిన వారున్నారు. వారు మహా మహాకార్యములు చేసినారు. సద్గతిని చేరుకున్నారు. కాని యజ్ఞరూప నౌకను ఎక్కనివారు కుకర్ములు, రుణగ్రస్తులు నీచస్థితిలో అణగారి పోయినారు.

7. ఇప్పుడు కూడ అటువంటి దుర్బుద్ధులున్నారు. వారిది అధోగతి కావలెను. వారి దుర్గతి ఎట్టిదగునో చెప్పరాదు. ముందునుంచే యజ్ఞాదులందు దానము చేయువారు. చేరుస్థానము పవిత్రమగును. అచట చిత్రవిచిత్రములగు భోగపదార్థములు లభించును.

8. ఇంద్రుడు సోమపానము చేసి మత్తుడైనంత సర్వత్ర సంచరించును. కదలాడు మబ్బలను ఆకాశమునల్లకల్లోలము చేయును. అప్పుడు ఆకసము బెదిరిపోవును. పరస్పర సంయుక్తములైన ద్యావ, పృథ్వులను ఇంద్రుడు అట్లే ఉంచును. మంచి మాటలు చెప్పును.

9. ధనశాలి ఇంద్రా! నీ కొరకు నేను ఒక గట్టి అంకుశమును పట్టి ఉన్నాను. నీవు ఈ అంకుశరూప స్తోత్రమున గజములను దండిపుము. వానిని వశపరచు కొనుము ఈ సోమ యజ్ఞమునకు విచ్చేయుము. స్థానమును గ్రహించును. ఈ యజ్ఞమందు మమ్ము సౌభాగ్యవంతులను చేయుము.

గత సూక్తపు 10,11 మంత్రములు పునరావృతములు.

## నలుబది అయిదవ సూక్తము

ఋషి - భాలందన వత్సప్రేరుడు. దేవత - అగ్ని. ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్ని తొలుత ఆకాశమున విద్యుద్రూపమున జన్మించినాడు. రెండవ జన్మము జాతవేది, పేర జనమధ్యమున జరిగినది. జలమధ్యమందు మూడవ జన్మకలిగినది. అగ్ని మానవ హితైషి. అతడు నిరంతర ప్రజ్వరిల్లుచుండును. ఉత్తమ ధ్యావమును ఎరిగిన వారు. అగ్నిని స్తుతింతురు.

2. అగ్నీ! మేము నీ మూడు రకముల మూర్తులను ఎరుగుదుము అనేక ప్రదేశములందు నీకు ఉన్న స్థానములను ఎరుగుదుము. నీ నిగూఢ నామములను ఎరుగుదుము. నీవు ఆవిర్భవించిన ఉత్పత్తిస్థానములను సహితము ఎరుగుదుము.

3. ఇంద్రా! మానవ హితము కోరు వరుణుడు నిన్ను సముద్రమధ్యమున, జలములోతున దహించి ఉంచినాడు

ఆకాశస్థానమున సూర్యుడు ఉన్నాడు. అతనిలో కూడా నీవు ప్రజ్వలించి ఉన్నావు. నీ మూడవస్థానము మేఘములందలి వర్షజలమగును. ప్రధాన దేవతలు నీ తేజస్సును పెంచుదురు.

4. అగ్ని ఘోరముగా గర్జించినాడు. అది పిడుగు పాటు అనిపించినది. అగ్ని పృథ్విని నాకును. లతాదులను ఆలింగనము చేసికొనును. అగ్ని ఇదిగో ఇప్పుడే పుట్టినాడు అయినను ఎంతో ప్రజ్వలించినాడు. విస్తరించినాడు.

5. ప్రభాతపు ప్రథమ భాగమున అగ్ని ప్రజ్వలితుడగును. అప్పుడు అతని శోభ ఎట్లుండును? అతడు ఎన్నో శోభలు వెల్లడించును. అగ్ని అశేష సంపదలకు ఆధార భూతుడు స్తోత్రవచనములకు స్ఫూర్తిదాత. సోమరస రక్షకుడు. ధనస్వరూపుడు. బలపుత్రుడు. అగ్ని జలమధ్యమున వసించును.

6. అగ్ని సమస్త పదార్థములను ప్రకాశింప చేయును. అతడు జల మధ్యమున జన్మించును. అతడు జన్మించగానే ద్యావాపృథ్వులను పరిపూర్ణము చేసినాడు. జనులు అగ్ని కొరకు యజ్ఞము చేసినపుడు అతడు మబ్బులువైపు వెళ్లినాడు. వాటిని కొట్టినాడు నీరు తెచ్చినాడు.

7. అగ్ని హవిని కోరును. అతడు అందరిని పావనము చేయును. అతడు నలుదిశల సంచరించును. అరణ్యమున ఉత్కృష్టుడగును. అతడు అమరుడే కాని దుర్త్యమనుష్యులలో ఉండును. సుందర రూపము దాల్చి గతివిధులు ఆచరించును. శుక్లవర్ణ తేజము దాల్చి ఆకాశమును నింపును.

8. అగ్ని జ్యోతిర్మయుడు. అతని దీప్తి మహోత్తరము అతడు వెలుగులతో సాగుచు శోభా సంపన్నుడగును. అగ్ని వనస్పతులను ఆరగించినాడు. అమరుడైనాడు. దివ్యలోకము అగ్నికి జన్మనిచ్చినది దివ్యలోకపు జన్మదాన శక్తి ఎంతగొప్పది!

9. మంగళమయ జ్వాలల అభినవ అగ్నీ! నీకు నేడు ఘృతయుక్త పురోడాశము సమర్పించినవాడు విశిష్టవ్యక్తియగును. అతనిని నీవు సర్వోత్తమ ధనముల వైపు నడిపింపుము. ఆదేవ భక్తుని సుఖసంతోషముల వైపు నడిపించుము.

10. ఒకప్పుడు ఉత్తమోత్తమ అన్నములచే క్రియలు అనుష్ఠించబడును. అట్టితరి నీవు యజమానికి అనుకూలుడవు అగుము. అతడు అగ్నికి ప్రియుడు, సూర్యునకు ప్రియుడు కావలెను. "ప్రియఃసూర్యం ప్రియోఅగ్నాభవ" ఉన్న పుత్రులు, కలుగనున్న పుత్రులు, అతనితో కూడి శత్రు సంహారము చేయవలెను

11. అగ్నీ! నిత్యము యజమానులు నిన్ను పూజింతురు. వివిధములగు ఉత్తమ పదార్థములు సమర్పింతురు విద్వాంసులగు దేవతలు నీతో కలసినారు. తమ ధనపు కోరికలను పూర్తి చేయదలచినారు. గోవులునిండిని గోష్ఠముల ద్వారములు తెరచినారు.

12. మానవులందు అందగాడును. సోమమును రక్షించువాడును అగు అగ్నినే ఋషులు స్తుతింతురు. ద్వేషశూన్య ద్యావాపృథ్వులను ఆహ్వానించుచున్నాము. దేవతలారా! మాకు భౌతకబలమును. ధనబలమును ప్రసాదించండి.

దాశరథి లక్ష్మణాచార్య బుచ్చమాంబల పౌత్రుండును, విద్వాన్ వేంకటాచార్య వేంకటాంబల పుత్రుండును, ఆంధ్ర ప్రదేశ ఆస్థాన కవి దాశరథి కృష్ణమాచార్య అనుజుండును కమలానామ్ని ధర్మపత్నీ సమేతుండును 'పరిశీలన' మను సాహిత్య సమాలోచన గ్రంథకర్తయు, "ప్రేమ్ చంద్ జీవితము రచనలు" అనుహిందీ రచయిత సమీక్షా గ్రంథరచయితయునగు దాశరథి రంగాచార్య విరచిత శ్రీమదాంధ్ర వచన
ఋగ్వేదసంహితమున ఏడవ అష్టకము సమాప్తము.

**సర్వే భద్రాణి పశ్యంతు.**

**శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం**
**ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోపశాంతయే**

# శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత
# ఎనిమిదవ అష్టకము

### పదవ మండలము

### మొదటి అధ్యాయము నాలుగవ అనువాకము

### నలుబది ఆరవ సూక్తము

ఋషి - భాలందన వత్స ప్రేరుడు. దేవత - అగ్ని. ఛందస్సు - త్రిష్టుప్.

***ఓమ్ ప్రహోతాజాతోమహాన్నభోవిన్నృషద్వా సీదదపాముపస్థే |***
***దధిర్యోధాయిసితేవయాంసి యన్తా వసూని విధతే తనూపాః ||***

1. అగ్ని మానవులందున్నాడు జలములందున్నాడు. ఆకాశమున జ్ఞాని రూపమున ఉన్నాడు. అగ్ని సద్గుణములవలన పూజ్యుడు. యజమానులకు హోత అయినాడు. అగ్ని యజ్ఞధర్త అయి వేదిమీద ఉంచ బడినాడు. వత్సప్రేరా ! నీవు అగ్నిని పూజింతువు. అగ్ని నిన్ను రక్షించును. నీకు అన్నము సంపద ప్రసాదించవలెను.

2. జలమధ్యమున ఉన్న అగ్నిని పరిచారకులగు ఋషులు దొంగిలించబడిన పశువునువలె వెదకినారు. ఋషులందు భృగువంశీయులు అగ్నిని అభిలషించినవారు. విప్రులు వారు స్తుతించుచు ఏకాంతమున ఉన్న అగ్నిని కనుగొన్నారు.

3. విభూవస పుత్రుడు త్రితుడు అగ్నిని అన్వేషించ దలచినాడు. అతడు మహా అగ్నిని భూమి మీద కనుగొన్నాడు.

అగ్ని సుఖవర్థకుడు. యజమానుల గృహములందు ఉత్పన్నుడు. తరుణుడు స్వర్గమునకు నాభివంటివాడు "నాభిర్యువాభవతి రోచస్య"

4. అగ్ని మదకరుడు. హోత ఆహ్వానీయుడు. యజ్ఞీయుడు యజ్ఞప్రాపకుడు గతిశీలుడు శోధకుడు హవివాహకుడు మానవులందున్నవాడు. అగ్నిని అర్చించు ఋషులు అగ్నిని స్తుతించి ప్రసన్నుని చేసినారు.

5. అగ్ని విజయుడు. మహానుడు విప్రులను భరించువాడు. జ్ఞాని, పురధ్వంసి, అరణిగర్భుడు, స్తుత్యుడు, హరితలోముడు జ్వాలాయుక్తుడు స్తోత్రప్రియుడు. స్తోతలారా! అట్టి అగ్నిని స్తుతించండి. మానవులు అగ్నికి హవి సమర్పించి తమపనులు నెరవేర్చు కొందురు.

6. అగ్నికి గార్హపత్యాది మూడు రూపములు ఉన్నవి. అతడు యజమాని గృహమును స్థిరపరచువాడు. జ్వాలావంతుడు అగ్ని యజ్ఞగృహమున తన వేదిపై ఆసీనుడగును. అగ్ని ప్రజలు అందించిన హవి అందుకొనును. యజమానికి దానము ఇవ్వదలచును. ప్రజల శత్రువులను హతమార్చును. అట్లే దేవతల వద్ద కేగును.

7. ఈ యజమాని వద్ద అనేక అగ్నులు ఉన్నవి. అవి అన్నియు అజరములు. శత్రుశాసకములు పూజనీయజ్వాలావంతులు. శోధకులు, శ్వేత వర్ణులు. క్షిప్రధర్ములు భరణశీలులు వనములందుండునవి సోమమువంటి శీఘ్రగాములు.

8. అగ్ని తన జ్వాలలవలన కర్మములను సాధించును. పృథ్విని రక్షించుటకు అనుగ్రహపూర్వకముగ స్తోత్రములను స్వీకరించును. గతిశీల మానవులు - దీప్త, శోధక, స్తవనీయ, ఆహ్వాత, యజనీయ - అగ్నిని అర్చింతురు.

9. ఈ అగ్నియే ద్యావాపృథ్వులకు జన్మనిచ్చినాడు. ఈ అగ్నినే జలము, త్వష్ట, భృగువులు మున్నగువారు స్తోత్రములు చదివి సంపాదించినారు. ఈ అగ్నినే వాయువు, అన్యదేవతలు మానవులు యజ్ఞమునకుగాను - నిర్మించినారు.

10. అగ్నీ ! నీవు హవ్యవాహనుడవు. దేవతలు నిన్ను పోషించినారు. అభిలాషులగు మానవులు యజ్ఞము కొరకు నిన్ను అర్చించినారు. అగ్ని దేవభక్తులగు యజమానులకు యశస్సు కలిగించును. అగ్నీ! ఈ యజ్ఞమందు స్తోతలగు నాకు అన్నము ప్రసాదించుము.

**నలుబది ఏడవ సూక్తము**

ఋషి - ఆంగిరస సప్తగుడు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు - త్రిష్టుప్.

1. ఇంద్రా ! నీవు అనేక ధనములకు స్వామివి. మేము ధనాభిలాషులము. నీ కుడిచేయి పట్టుకుంటాము. శూర ఇంద్రా ! నిన్ను అనేక గోవుల స్వామిగా ఎరుగుదుము. "మాకు విచిత్రమువర్ధకమగు ధనమును ప్రసాదించుము." "చిత్రం

వృషణంరాయిందాః"

2. ఇంద్రా ! నీవు శోభన అస్త్రవంతుడవు. శోభన రక్షావంతుడవు. సుందర నేత్రుడవు. నాలుగు సముద్రములను జలములతో నింపువాడవు. మరల స్తుతించదగిన వాడవు. ధనస్వామివి దుఃఖనివారకుడవు. "చిత్రం వృషణంరాయిందాః"

3. ఇంద్రా ! మాకు స్తుతిపరాయణ, దేవభక్త, మహా, మహా, విశాలస్వరూప, సుప్రతిష్ఠత, ప్రసిద్ధజ్ఞాన, తేజస్వి, శత్రుదమనకర్త, పూజ్య, వర్షక పుత్రరూపధనమును ప్రసాదించుము. "చిత్రం వృషణంరాయిందాః"

4. ఇంద్రా ! అన్నవంత, మేధావి, తారక, దనపూరక, వర్ధమాన శోభనబల, శత్రుఘాతక, శతృపురధ్వంసక, సత్యకర్మ, విచిత్ర వర్షక పుత్రరూప ధనమును ప్రసాదించుము. "చిత్రం వృషణంరాయిందాః"

5. ఇంద్రా ! అశ్వయుక్త, రథి, పౌరుషసంపన్న, అసంఖ్యాక గోయుక్త, అన్నవంత, కళ్యాణ సేవక యుక్తవిప్రపరివేష్ఠిత, సర్వ సేవ్యుడగు పూజ్యపుత్రరూపధనమును ప్రసాదించుము. "చిత్రం వృషణంరాయిందాః"

6. నేను సప్తగుడను. సత్యకర్మను, శోభనప్రజ్ఞుడను, మంత్రిస్వామిని, స్తుతులు నన్ను చేరును. నేను అంగిరగోత్రోద్భవుడను. నమస్కరించి దేవతల వద్దకు వెళ్లుదును. నాకు విచిత్ర, వర్షక ధనమును ప్రసాదించుము. "చిత్రం వృషణంరాయిందాః"

7. నేను సుందర సురుచిత భావపూర్ణ స్తుతులు రచిస్తాను. వానిని మనసా పఠింతును. ఈ స్తుతులు శ్రోతల హృదయ స్పందకములు. శ్రోతలు - దూతలవలె - ఇంద్రుని ప్రార్థింతురు. నాకు విచిత్ర, వర్షక ధనమును ప్రసాదించుము. "చిత్రం వృషణంరాయిందాః"

8. నేను కోరినది నాకు ప్రసాదించుము. ఇతరులవద్ద లేనటువంటి వంద నివాసస్థానములను ఇమ్ము. ద్యావాపృథ్వులు దీనిని ఆమోదించవలెను. నాకు విచిత్ర, వర్షక ధనమును ప్రసాదించుము. "అస్మాభ్యంచిత్రం వృషణంరాయిందాః."

(వికుంఠియను సురస్త్రీ తనకు ఇంద్రుని వంటి పుత్రుని ప్రసాదించుమని వ్రతము చేసినది. ఆమెకు ఇంద్రుడే పుత్రుడుగా జన్మించినాడు. ఇది అందుకు సంబంధించిన సూక్తమని శాయణుడు పేర్కొన్నాడు)

## నలుబది ఎనిమిదవ సూక్తము

ఋషి - ఇంద్రుడు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు - జగతి - 7, 10, 11, త్రిష్టుప్.

1. నేనే ధనములకు ప్రధానప్రభువును. శత్రుధనమును జయించువాడను నేనే. నన్నే మానవులు ఆహ్వానింతురు, తండ్రి పుత్రునకు ధనమునిచ్చును. అట్లే నేను హవిర్దాత యజమానికి అన్నము కలిగింతును.

2. నేనే దధ్యంగుని శిరచ్ఛేదము చేసినాను. బావిలో పడిన త్రితుని ఉద్ధరించుట మేఘములందు జలము ఉంచినాను నేను శత్రువుల ధనము గుంజుకున్నాను. మతరిశ్వపుత్రుడు దధీచి కొరకు వర్షముకలిగించ దలచినాను. జలరక్షక మేఘమును భేదించినాను.

(దధ్యంగుడు అధర్వుని పుత్రుడు. ఇంద్రుడు వారించినను మధువిద్యను అశ్వినులకు బోధించినాడు అందువలన ఇంద్రుడు దధ్యంగుని తల నరికినాడు.)

3. త్వష్ట నా కొరకు ఇనుముతో వజ్రాయుధము నిర్మించినాడు. నా కొరకు దేవతలు యజ్ఞములు చేయుదురు. నా సేన సూర్యునివలె దుర్గమము. వృత్రుని వధించుట వలన అందరు నా దగ్గరకే వచ్చెదరు.

4. యజమానులు నన్ను స్తోత్రములు, సోమము సమర్పించి సంతృప్తుని చేయుదురు. అప్పుడు నేను. ఆయుధము ధరించి శత్రువుల గోవులు, అశ్వములు, హిరణ్యము, క్షీరాది యుక్త పశుగణమను జయింతును. అంతేకాదు యజమాని శత్రువులను నాశనము చేయుటకు అనేక ఆయుధములకు పదును పెట్టుదును.

5. నేను సకల ధనములకు స్వామిని. నా ధనమును ఓడించగల వాడు లేడు. నా భక్తులకు మృత్యుభయము ఉండదు. యజమానులారా ! కోరిన ధనము నన్నే అడగండి మానవులు నా స్నేహము విడువరాదు.

6. కొందరు ప్రబలులు ఊపిరి బిగపట్టి ఆయుధము ధరించిన నాతో యుద్ధము చేయుటకు ఇద్దరిద్దరు వచ్చినారు. కొందరు స్పర్థతో నాతో తలపడదలచినారు. వారిని హుంకరించినాను. అంతే పడిపోయినారు చచ్చినారు. నేను మాత్రము తల వంచలేదు.

7. ఒక శత్రువురానీ - ఓడింతును. ఇద్దరు వత్తురా ఓడింతును. ముగ్గురు వచ్చి మాత్రము నన్నేమిచేయగలరు? ధాన్యము నూర్చురైతు పాతపురులను నలిచి వేసినట్లు వారిని నలిచి వేతును. ఇంకను నిష్ఠుర శత్రువును హతమార్తును.

8. గుంగువుల దేశమున ప్రజలమధ్య అతిథిగ్వ పుత్రుడు. దివోదాసును నేను ప్రతిష్ఠించినాను. వారుగుంగువుల శత్రువులను సంహరింతురు. ఆపదలను నివారింతురు. అన్నమువలె వారిని పాలింతురు. పర్ణయ, కరంజ నామకశత్రువధ జరిగిన సంగ్రామమున నేను విఖ్యాతుడను అయినాను.

9. నా స్తోతలు అందరకు ఆశ్రయణీయులు. అన్నవంతులు భోగదాతలు నా స్తోతలను జనులు గో దాతలుగను. మిత్రులుగను. భావింతురు. నా స్తోత విజయము కొరకు యుద్ధమున నేను ఆయుధము ధరింతుము. స్తోతలను

స్తుత్యులను చేయదును.

10. ఇరువురిలో ఒకడు సోమయజ్ఞము చేయును. ఇంద్రుడు వజ్రము ధరించి అతనిని సంపన్నుని చేయును. మరొక యజ్ఞకర్తతో శత్రుయుద్ధమునకు తలపడిన తీక్ష్ణ సోమము అంధకారమున కట్టుబడినాడు.

(దేవతను గూర్చి ఋషులు చెప్పు పద్ధతినుంచి దేవత స్వయముగా చెప్పుకొను పద్ధతి ప్రారంభమైనది. అనంతరకాలమున విభిన్నమతములు ఈ పద్ధతిని అవలంబించినవి. శ్రీమద్భగవద్గీత యందు శ్రీకృష్ణపరమాత్మ దీనినే అనుసరించినాడు.)

11. ఆదిత్యులు, వసువులు, రుద్రపుత్రుల స్థానములకు ఇంద్రుడు హాని కలుగనివ్వడు. నేను అపరాజితుడను. అహింసితుడను. అనభిభూతుడను. దేవతలు నన్ను శుభముల కొరకును, అన్నము కొరకున సృష్టించినారు.

## నలుబది తొమ్మిదవ సూక్తము

ఋషిదేవతే పూర్వవత్ ఛందస్సు - జగతి 2, 11, త్రిష్టుప్.

1. స్తోతకు నేనే ముఖ్యధనము ఇచ్చినాను. యజ్ఞములు నా కొరకే వర్థిల్లుచున్నవి. నా కొరకే యజమాని ధనమును పెంపొందింతును. యజ్ఞము చేయని వానిని సకల సంగ్రామములందు ఓడింతును.

2. స్వర్గదేవతలు, భూచర, జలచర ప్రాణులు నన్ను ఇంద్రుడు అన్నారు. నా అశ్వములు హరితవర్ణలు పౌరుషశాలులు, వివిధ కర్ములు, లఘుగాములు. యుద్ధమునకు వెళ్లుటకు ఆ అశ్వములను రథమున పూన్చెదను. జలము కొరకు ధర్షక వజ్రమును పట్టుదును.

3. ఉశ్న ఋషికి శుభములు కలిగించుటకు 'అత్క' నామక వ్యక్తిని బాదినాను. రక్షణకు ఉపయుక్తములగు అనేక కార్యములు చేసి 'కుత్సు'ని కాపాడినాను. 'శుష్ణు'ని వధించుటకు వజ్రము పట్టినాను. దస్యునకు ఆర్యుడను పేరు పెట్టలేదు.

4. 'వేతసు' దేశమునకు కుత్సఋషిని - తండ్రివలె అధిపతిని చేసినాను. తుగ్రుని, స్మదభుని కుత్సునకు వశపరచినాను. నేను అజమానుని శ్రీసంపన్నుని చేయుదును. అతనిని పుత్రునిగా భావించి అతనికి ప్రియవస్తువులు ఇచ్చి అతనిని దుర్ధర్షుని చేయుదును.

5. శ్రుతర్వుడు నన్ను స్తుతించినపుడు మృగయాసురని అతనికి వప్పగించినాను. నేను 'వశుని' ఆయువునకు 'షట్ గృభు' ని సత్యమునకు వప్పగించినాను.

6. నవవాస్తవుడు, బృహద్రథుడు వృత్రునితో సమముగా వర్ధిల్లు చున్నపుడు వారిద్దరిని వధించినాను వారిని ఈ లోకము నుండి బయటికి గెంటినాను.

7. శీఘ్రగామి అశ్వములు నన్ను వహించును. వాటిపై నేను సూర్యుని నలుదిక్కుల ప్రదక్షిణము చేయుదును. యజమాని సోమాభిషవమునకు నన్ను పిలిచినపుడు ఆయుధమున వధించదగు శత్రువును దూరము చేయుదును.

8. నేడు ఏడు శత్రునగరములను ధ్వంసము చేయువాడను. అందరిని మించిన బంధన కర్తను. తుర్వశ, యదువులు బలశాలురని ఎరిగినాను. వారిని ప్రసిద్ధులను చేసినాను. ఇతర స్తోతలను బలిష్ఠులను చేసినాను. నేను తొంబది తొమ్మిది నగరములను ధ్వంసము చేసినాను.

9. నేనే జలవర్షకుడను. సప్త సింధునదులు ద్రవరూపమున భూమి మీద ప్రవహించు చున్నవికదా - వానిని నేనే ఆయాస్థానములందు ఏర్పరచినాను. నేను శోభన కర్మను. నేనే జలవితరణ చేయుదును. నేను యుద్ధము చేసి యజ్ఞకర్త మార్గమును సుగమము చేసినాను.

10. గోవు స్తనములందు నేనే స్పృహణీయ, దీప్త మధుర, దుగ్ధములను ఏర్పరచినాను. ఈ పనిని మరొక దేవత చేయజాలడు. గోస్తనము నదివలె పాలను పారించును. సోమముతో కలసినంత దుగ్ధము ఎంతో సుఖకరమగును.

11. ఋషి రూపమున ఇంద్రుడు చెప్పినది:-

ఈ విధానముగా ఇంద్రుడు తన ప్రభావమున దేవతలను మానవులను సంపన్నులను చేసినాడు. ఇంద్రుని వద్ద ధనమున్నది. వాస్తవముగ ఇంద్రుడే ధనవంతుడు. వివిధకర్మ, అశ్వయుక్త ఇంద్రా ! నీ పనులు నీ ఆధీనమున ఉన్నవి. ఎంతో ప్రభావితులైన ఋత్విక్కులు నీ ఘన కార్యములను ప్రశంసింతురు.

## ఏబదవ సూక్తము

పూర్వవత్ ఋషి దేవతే. ఛందస్సు - విరాజ - జగతి అభిసారిణి.

1. స్తోతా ! నీ మహాసోమమునకు ఇంద్రుడు ప్రసన్నుడగును. అతడు అందరకు నేత - అందరి సృష్టికర్త. ఇంద్రుని శక్తి ఆశ్చర్యకరము - కీర్తి విపులము - సంపద సుఖకరము. వాటిని ద్యులోక, మానవలోకములు ప్రశంసించును. నీవు ఇంద్రుని పూజించుము.

2. ఇంద్రుడు అందరకు స్తుత్యుడు. ఎల్లరకు ప్రభువు. మానవులకు బంధువు వంటి, హితము కోరువాడు. నా వంటి నరుడు అతనిని సదా సేవించవలెను. ఇంద్రా ! నీవు వీరుడవు సాధువులను పోషించువాడవు ఘనకార్యములు చేయుటకు, బలసాధ్య కార్యములు చేయుటకు, వర్షము కొరకును నిన్నే పూజించ వలసి ఉన్నది.

3. ఇంద్రా ! నీ వలన అన్నము, ధనము, సుఖము సంపద పొందగల అదృష్టవంతుడు ఎవడు? నీవు అసురవధ బలము పొందుటకు నీకు సోమము పంపువాడెవడు? తన భూమి మీద వృష్టి కలుగుటకును, పౌరుషము సాధించుటకును నీకు సోమరసము అర్పించువాడెవడు?

4. ఇంద్రా ! నీవు యజ్ఞానుష్ఠానము చేసి మహామహుడవు అయినావు. సకల యజ్ఞములందును యజ్ఞభాగము అందుకొను అధికారము గలవాడవు. నీవు సకల యుద్ధములందు ప్రముఖ శత్రు సంహారకుడవైనావు. విశ్వదర్శక ఇంద్రా ! నీవు సర్వ శ్రేష్ఠమంత్ర రూపుడవు "మంత్రో విశ్వచర్షణ"

5. నీవు సర్వ శ్రేష్ఠుడవు యజమానులను రక్షింపుము. నీవు గొప్పగా రక్షించ గలవాడవని నరులు ఎరుగుదురు. నీవు అజరుడవగుము. వర్ధిల్లుము. ఈ సోమ యజ్ఞమును పూర్తి చేయుము.

6. బలశాలి ఇంద్రా ! నీవు వరించిన సోమ యజ్ఞములను త్వరగా ముగింప చేయుదువు. నిన్ను ఆశ్రయించుటకు ఈ సోమపాత్ర ఈ యజ్ఞము. ఈ మంత్రము, ఈ పవిత్ర వచనము సిద్ధములై ఉన్నవి. "యజ్ఞోమన్త్రో బ్రహ్మోద్యతంవచః"

7. విప్ర ఇంద్రా ! స్తోత్రమగ్నస్తోతలు వివిధ ధనములు కోరి - ఒకచోటకూడి సోమ యజ్ఞము చేయుదురు. వారికి సోమ రూప అన్నము అందినంత వారి ఆనంద ప్రమోదములు మొదలైనంత స్తుతిరూప సాధమున సుఖములు కలుగవలెను.

(యస్యవాక్యమ్ సఋుషిః యాతేనోచ్యతేసదేవతా, చెప్పినవాడు ఋషి - చెప్పబడినవాడు దేవత అనునది న్యాయము. గత సూక్తములు ఇంద్రుడు తనను గురించి చెప్పుకున్నాడు. అందువలన ఋషియు దేవతయు అతడే అయినాడు. ఈ సూక్తమున రెండు పాత్రలు వహించినాడు ఋషిగా చెప్పినాడు దేవతగా చెప్పబడినాడు.)

## ఏబది ఒకటవ సూక్తము

ఋషి - దేవతలు అగ్ని. దేవత - అగ్ని - దేవతలు. ఛందస్సు - త్రిష్టుప్.

1. దేవతలు అనుచున్నారు :-

అగ్నీ ! నీవు అత్యంత ప్రకాండుడవు. స్థూలాచ్ఛాదనమున వేష్టితుడవై జలములందు ఆసీనుడవైనావు. జ్ఞాత ప్రజ్ఞ అగ్నీ ! నీ యొక్క అనేక ప్రకార దేహమును ఒక దేవత చూచినాడు.

(సౌచకి అగ్ని హవిని వహించుచు దేవతలకు జంకి నీటిలో దాగినాడు. అగ్ని కొరకు వెదకుచున్న దేవతలకు చేప

జలమున అగ్నిని చూపినది. అప్పుడు అగ్నికి దేవతలకు జరిగిన సంవాదము.)

2. అగ్ని అనుచున్నాడు :-

నన్ను చూచిన వాడెవడు? నా యొక్క అనేక ప్రకార దేహములను చూచిన దేవత ఎవరు? మిత్రావరుణులారా! చెప్పండి అగ్ని యొక్క దీప్తము, దేవయాన సాధన దేహము ఎచట ఉన్నది?

3. దేవతలు అనుచున్నారు :-

జ్ఞాతప్రజ్ఞ అగ్నీ ! జలములందును, ఓషధులందును నీవు ఉన్నావు. మేము మీ కొరకు వెదకినాము. విచిత్ర కిరణ అగ్నీ ! యముడు నిన్ను చూచినాడు. గుర్తించినాడు. అతడు చూచినపుడు నీవు నీ దశస్థానములను మించి వెలుగొందుచున్నావు.

(మూడు లోకములు 4.అగ్ని 5.వాయువు 6.ఆదిత్యులు 7.జలముల 8.ఓషధులు 9.వనస్పతులు 10.ప్రాణుల శరీరము. ఈ పది అగ్ని స్థానములు)

4. అగ్ని అనుచున్నాడు :-

వరుణా ! నేను హోత కార్యమున భీతిల్లినాను. వదలి వచ్చినాను. ఇక నన్ను దేవతలు హోమకార్యమున నియమించవలదని నా కోరిక. అందువలననే నా దేహము నానా స్థానములకు చేరినది. నేను అగ్నిని. ఆకార్యమును అంగీకరించను "నా చికేతాహమగ్నిః"

5. దేవతలు అనుచున్నారు:-

అగ్నీ ! లెమ్ము, రమ్ము నరుడు యజ్ఞాభిలాషి అయినాడు. అతడు యజ్ఞపు ఏర్పాట్లన్నియు చేసినాడు. నీవు తమస్సున ఉన్నావు. దేవతలనుండి హోమ ద్రవ్యములు అందుకొనగోరుము. మార్గము సుగమము చేయుము. ప్రసన్న చిత్తుడవగుము. హవిని వహించుము.

6. అగ్ని అనుచున్నాడు :-

దేవతలారా ! రథికుడు దూరమార్గమునకు వెళ్లిపోవును. అట్లే నా అన్నలు ముగ్గురు - భూపతి, భువనపతి, భూతపతి ఈ కార్యము చేయుచు చేయుచునే విగతులైనారు. ఆ భయముననే నేను ఇంత దూరము వచ్చినాను. జింక వేటగాని ధనుష్టంకారమునకు వలె నేను బెదిరినాను.

7. దేవతలు :-

జ్ఞాత ప్రజ్ఞఅగ్నీ ! మేము నీకు జరారహిత ఆయువును ఇచ్చుచున్నాము. అందువలన నీకు మరణము కలుగదు. కళ్యాణచిత్త అగ్నీ! ప్రసన్న చిత్తుడవగుము. దేవతభాగపు హవిస్సు అందించుము "దేవేభ్యోహవిషః సుజాత"

8. అగ్ని :-

దేవతలారా! యజ్ఞపు ప్రథమ హవిర్భాగము ప్రయాజ, శేషహవిర్భాగము - అనుయాజ, అత్యంత విపుల భాగము నాకు అందవలెను. జలముల సారమగు ఘృతము, ఓషధులనుండి ఉత్పన్నమగు ప్రధాన భాగము, ఆయువును నాకు ఇవ్వండి.

9. దేవతలు :-

అగ్నీ! ప్రయాజ, అనుయాజ, విపుల, అసాధారణ హవిర్భాగములు నీకే అందగలవు. సకల యజ్ఞములు నీవే కాగలవు. సకల దిశలు నీ ముందు అవనతములు కాగలవు.

(ఇది సమ్మె జరుగుట - సంభాషణలు పరిష్కారము వలె ఉన్నది.)

**ఏబది రెండవ సూక్తము**

ఋషి - సౌచీక అగ్ని. దేవత - వైశ్వదేవతలు. ఛందస్సు - త్రిష్టుప్.

1. విశ్వదేవతలారా! మీరు నన్ను హోతగా వరించినారు. నేను ఇచట ఉండి చదువ వలసిన మంత్రములను గురించి వివరించండి. నా భాగము ఎంత? మీ భాగమెంత? తేల్చిచెప్పండి. నేను మీ వద్దకు హోమ ద్రవ్యములు తేవలసిన మార్గమెద్దియో కనబరచండి.

2. హోతనై యజ్ఞము చేయుదును. అందుకే ఇచ్చట ఉన్నాను. సకల దేవతలు, మరుత్తులు నన్ను ఈకార్యమునకు నియమించినారు. అశ్వినులారా ! మీరు ప్రతిరోజు అధ్వర్యుకార్యము నిర్వహించ వలసి ఉండును. ఉజ్వల సోమము స్తోత్రరూపము దాల్చుచున్నది మీరిరువురు సోమపానము చేయుదురు.

3. హోత చేయవలసిన కార్యమెద్ది? హోత యజమాని ద్రవ్యమును హవనము చేయును. అది దేవతలకు లభించును. ప్రతిరోజు, ప్రతిమాసము హోమము జరుగును. ఈ హవ్యవాహక కార్యమునకు దేవతలు అగ్నిని నియమించినారు "దేవాదధిరేహవ్యవాహమ్"

4. నేను పలాయనము చిత్తగించినాను. నేను అనేక కష్టములు పడినాను. దేవతలు నన్ను హవ్యవాహకమునకు నియుక్తుని చేసినారు. అగ్ని విద్వాంసుడు, సర్వము తెలిసినవాడు. మా యజ్ఞమును ఏర్పరచును. యజ్ఞము అయిదు విధములది. అందు మూడు త్రిసవనము సోమనిష్పీడితములు మిగిలినవి సప్తఛందస్తవములు.

5. దేవతలారా ! నేను మీకు సేవలు చేయుదును. కావున నాకు అమరత్వము, సంతానము ప్రసాదించండి. నేను ఇంద్రుని రెండు చేతులకు వజ్రము నందింతును. అది అందుకొనియే అతడు సకల శత్రుసేనలను ఓడించును.

6. మూడువేల మూడువందల ముప్పది తొమ్మిది 3339 మంది దేవతలు అగ్నిని సేవించినారు. వారు అగ్నిని ఘృతాభిషిక్తుని చేసినారు. కుశలమీద ఆసీనుని చేసినారు. అగ్నిని హోతరూపమున యజ్ఞమునందు ప్రతిష్ఠించినారు.

## ఏబది మూడవ సూక్తము

ఋషి - దేవతలు. దేవత - సౌచీక అగ్ని. ఛందస్సు - జగతి - త్రిష్టుప్.

1. మేము మనసా కోరిన అగ్ని విచ్చేసినాడు. అగ్నికి యజ్ఞము తెలియును. అతడు తన అవయములను పరిపూర్ణము చేసికొనును. అతని వంటి యజ్ఞకర్త లేనేలేడు. యజనీయ దేవతల మధ్య అగ్ని వేదిపై ఆసీనుడై ఉన్నాడు అతడు మా యజనము చేయవలెను.

2. అగ్ని హోత శ్రేష్ఠయజ్ఞకర్త అతడు వేదిమీద కూర్చున్నాడు. ఆహుతి యోగ్యుడైనాడు ఆహుతి యోగ్య దేవతలకు త్వరగా యజించుటకును. స్తుత్యదేవతలను స్తుతించుటకును. అగ్ని అచట ఉంచినారు. పురోడాశాదులను నలువైపుల నుండి వీక్షించు చున్నాడు.

3. మాది దేవాగమన పూర్వక యజ్ఞకార్యము అగ్ని దానిని సుసంపన్నము చేయవలెను. యజ్ఞపు నిగూఢ జిహ్వా - అగ్ని మాకు లభించినది. అగ్ని సురభియై, దీర్ఘాయువై విచ్చేసినాడు. దేవాహ్వాన రూప యజ్ఞమును అగ్నియే పూర్తి చేసినాడు.

4. అసురులను పరాభవించగల సర్వశ్రేష్ఠవాక్కును మేము ఉచ్చరించవలెను. అన్న భక్షక, యజ్ఞయోగ్య, పంచజనులారా ! మీరు మా హోమ కార్యమును సేవించండి.

5. పంచజనులారా ! నా హోమమును సేవించండి. హవ్యము కొరకు పుట్టిన వారును, యజ్ఞార్హులగు దేవతలు నా హోమమును సేవించండి. పృథ్వి మమ్ము పాపములనుండి రక్షించవలెను. అంతరిక్షము పాపములనుండి కాపాడవలెను.

(1. దేవతలు 2.మానవులు 3.గంధర్వులు అప్సరలు 4.సర్పములు 5. పితరులు వీరు పంచజనులు)

6. అగ్నీ ! యజ్ఞమును విస్తరించుము. లోకములకు వెలుగు నిచ్చు సూర్యునకు అనుగామి వగుము. సత్కర్మలు చేయుట వలన లభించిన జ్యోతిర్మయ మార్గములను దేవయానములను రక్షించుము. అగ్నీ స్తోతల కార్యములను నిర్దోషము చేయవలెను అగ్నీ ! నీవు స్తవనీయుడవగుము. దేవతలను యజ్ఞాభిగాములను చేయుము.

7. సోమయోగ్య దేవతలారా ! రథములకు తగిన గుర్రములను రథములకు కట్టండి. గుర్రపు పగ్గములు పరిశుభ్రము చేయండి. గుర్రములను అలంకరించండి. ఎనిమిదిమంది సారథులు కూర్చుండ దగిన రథమును - సూర్యరథముతో పాటు యజ్ఞమునకు తరలించండి. ఈ రథమునందే దేవతలు సహితము పయనింతురు.

8. అశ్మన్వతినది ప్రవహించుచున్నది దీనిని దాటండి. మిత్ర దేవతలారా! కలిగిన బాధలను వదలండి. నది దాటిన మనకు అన్నము లభించును.

9. త్వష్టకు పాత్రలు చేయుట తెలియును. అతడు దేవతల కొరకు అందమగు పాన పాత్ర చేసినాడు. అతడు మంచి ఇనుముతో చేసిన గొడ్డలి పదును పెట్టుచున్నాడు. దానితోనే బ్రహ్మణస్పతికి యోగ్యమగు పాత్రను చేయు కర్రను కొట్టుము.

10. విప్రులారా ! అమృతపానము కొరకు పాత్రను చేయుటకుగాను గొడ్డళ్లకు పదును పెట్టండి. విద్వాంసులారా! దేవతలు అమరులైనటువంటి గోపనీయ వాసస్థానమును ఏర్పరచండి.

11. ఋభువులు దేవతలు కాదలచినారు. వారు ఒకానొక ఆవు కళేబరమును, దానిముందు దూడ కళేబరమును ఉంచినారు. ఈ కార్యము సాధించుటకు వారికి కుఠారము ఉపకరించినది. ప్రతినిత్యము ఋభుగణములు తమకు యోగ్యములగు ఉత్తమోత్తమ స్తవములను గ్రహించినారు. వారు వాస్తవ శత్రుంజయులు.

**ఆలోచనామృతము**

ప్రకృతివిచిత్రాతి విచిత్రము నిగూఢాతి నిగూఢము - విశాలాతి విశాలము ఇంకేమనగలము? ఇంతే ప్రకృతి ఇంతేనా? కాదు. భాష ఇంతే ! భాష పరిమితము ప్రకృతి అపరిమితము. అపరిమితమును పరిమితముతో చెప్పరాదు. అందుకే వాల్మీకి "గగనం గగనాకాశం సాగరస్సాగరోపమః" అన్నాడు. ఆకాశం ఆకాశం వంటిది సముద్రానికి సముద్రమే ఉపమానం.

సృష్టి మొదలై ఇప్పటికి 195,58,85,169 సంవత్సరాలు పాశ్చాత్యులు పేర్కొంటున్న "చరిత్ర" అనే పదానికి కనీసం వెయ్యేళ్లులేవు. ఈ పరిజ్ఞానంతో అనంతమైన కాలాన్ని కొలవటానికి ప్రయత్నించటం కాళిదాసు అన్నట్లు

"గమిష్యా మ్యపుహాస్యతామ్."

నగరకతలు ఎన్ని వచ్చినవో, ఎన్ని భూస్థాపితములైనవో "రాతియుగం" వంటి కొలమానానికి అందనిది. ఇందులోని తాత్వికత ఏమనిన ఏదీ ఎప్పటికీ ఎదుగుచుండదు. పెరుగుట కూలుట ప్రకృతి నియమము. ఈ చిన్న విషయం తెలియని వాళ్లు చెప్పే " చరిత్ర" అనే దానిని అనంత చరిత్రగల భారతీయులం మనసా, వాచా, కర్మణా నమ్ముతున్నాం ! ఇది పతనానికి పరాకాష్ట!

ఈ అనంతమైన కాలక్రమమున భూమిమీదినుంచి అగ్ని అదృశ్యమైన కాలం ఉండవచ్చును. అగ్ని ఆకాశమున భూమిమీద, జలములందున్నాడు. భూమి మీది అగ్ని అదృశ్యమైనపుడు జలములందలి అగ్నిని ఆవిష్కరించుకు జరిగిన బృహత్ ప్రయత్నపు సంకేతమే ఈ సూక్తముగా కనిపించుచున్నది.

అదృశ్యమైన అగ్నిని పునః ప్రతిష్ఠించుట సామాన్య విషయము కాదు. ఇది వేదకాలమునందే జరిగియుండనవసరము లేదు. అంతకు ముందు ఎన్నడో జరిగిన దానిని వేదము ఉల్లేఖించి ఉండవచ్చును. రెండు వేల యేండ్లనాటి బైబిలు నందు సృష్టి ఆదిని గురించి చెప్పబడినది !

2. ఋభువులు గోవు చర్మమున, గోవును దూడను చేసినారు. చర్మపు దూడతో తల్లిని మురిపించి పాలు పిండుట మనము ఎరుగుదుము. ఇట్టి ప్రయోగమే గోవు విషయమున జరిగి ఉండవచ్చును.

### ఏబది నాలుగవ సూక్తము

ఋషి - వామదేవ బృహదుక్థ్యుడు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు - త్రిష్టుప్.

1. ధనిక ఇంద్రా ! నీ మహాకీర్తిని నేను వర్ణింతును. ద్యావాపృథ్వులు ఒకపరి నిన్ను భయము భయముగా పిలిచినవి. అప్పుడు నీవు దేవతలను రక్షించినావు. దస్యు బలములను సంహరించినావు. యజమానికి బలము కలిగించినావు.

2. ఇంద్రా ! నీవు నీ శరీరమును పెంచినావు. సకల కార్యములను ప్రకటించినావు. బలమువలన సాధ్యములగు పనుల నన్నింటిని పూర్తి చేసినావు. ఇవన్నియు మీ మాయ వలన సాధ్యమైనవి. నీవు చేసిన సకల యుద్ధములందు మాయనిండి ఉన్నది. ఇప్పుడు నీకు శత్రువన్నవాడు లేడు. ఇంతకుముందు ఉండెనా? అది సహితము అసంభవము.

3. ఇంద్రా ! నాకన్న ముందు ఏ ఋషియైనను నీ మహిమల పారమును దర్శించినాడా? నీవు స్వశరీరమునుండి నీ తలిదండ్రులగు ద్యావాపృథ్వులను కల్పించినావు "జనయథాస్తన్వ స్వాయాః"

4. నీవు మహామహుడవు. నీకు నాలుగు అసురఘాతక దేహములున్నవి. వానిని ఎవడును హింసించజాలడు. ఆ శరీరములతోనే నీవు మహా, మహా కార్యములను సాధింతువు.

(1. ఉత్తరసూక్త 2.ఉపాంతవర్జిత 3. దూరత 4. మంత్రములను నాలుగు ఇంద్రుని శరీరములని శాయణడు)

5. గుప్త సంపదలకు, కనిపించు సంపదలకు నీవే అధిపతివి. ఇంద్రా ! నా కోరికలు తీర్చుము. నీవే ఆజ్ఞాపించు వాడవగుదువు. నీవే దాతవగుదువు "త్వమాజ్ఞాతా త్వమిన్ద్రాసిదాతా"

6. జ్యోతిర్మయ పదార్థములందు జ్యోతిని ప్రసాదించినవాడు ఇంద్రుడు. సోమరసాదివస్తువులందు మాధుర్యమును ప్రవేశపెట్టిన వాడు ఇంద్రుడు. బృహదుక్థమంత్ర కర్తయగు ఋషి ఇంద్రునకు ప్రియములు, బలకరములగు స్తోత్రములు కల్పించినాడు.

## ఏబది అయిదవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. ఇంద్రా ! నీ దేహము దూరమందున్నది. పరాఙ్ముఖులైనమానవులు దానిని దాచిపెట్టినారు. ద్యావాపృథ్వులు దానిని భయమున పిలుచును. అప్పుడు నీవు నీ వద్దనున్న మేఘరాశిని ప్రదీప్తము చేయుదువు. పృథ్వినుండి ఆకాశమును పైకి లేపి ఉంచుదువు.

2. నీ యొక్క గుహ్యదేహము విస్తృత స్థానములందు పరివ్యాప్తమై ఉన్నది. అది అత్యంత ప్రకాండము దానితో నీవు భూత భవిష్యత్తులను సృజించినావు. నీవు జ్యోతిర్మయ వస్తువులను సృష్టించదలచినపుడు సకల ప్రాచీన పదార్థములు ఉత్పన్నములైనవి. అప్పుడు పంచజనులు ప్రసన్నులైనారు.

3. సూర్యాత్మక ఇంద్రా ! నీ తేజమున ద్యులోక, భూలోక అంతరిక్షములను నింపినావు. నీ యొక్క ప్రదీప్తములగు నానా విధకార్యములచే అవసరమును బట్టి పంచజనులను, సప్త తత్త్వములను కలిగింతువు. ఇట్టి ఏకభావ కార్యమున నాముప్పది నాలుగు మంది దేవతలు ఇంద్రునకు సాయము చేతురు.

(1. పంచజనులు -1 దేవతలు 2. నరులు 3అసురులు అప్సరలు 4సర్పములు 5పితరులు ఏడుగురు మరత్తులు, ఏడు సూర్యకిరణములు, ఏడులోకములు సప్తతత్త్వములు. 8మంది వసువులు +11మంది రుద్రులు +12మంది ఆదిత్యులు +వషట్కార +విరాట్ ముప్పదినాలుగు మంది దేవతలు)

4. ఉష, నక్షత్రాదులందు నీవే తొలుత వెలుగు కలిగించినావు పుష్టివంతములకు మరింత పుష్టి కలిగించినావు. నీవుపైన ఉందువు. అయినను క్రింద ఉన్నమానవులతో బంధుత్వము కలిగి ఉందువు. ఇది నీ మహత్వము. మహత్తర బలములు కూడిన ప్రభావమగును.

5. కాలాత్మకుడగు ఇంద్రుడు యువకుడై ఉన్నపుడు సకల కార్యములు చేయును. అతని భయమున యుద్ధములందు ఎందరో శత్రువులు పారిపోవుదురు. ఇంద్రుని మాహాత్మ్యము చూడండి - నిన్న మరణించినవాడు. ఈ రోజు జీవించియున్నాడు.

(కాలము మరణించినను మరల పుట్టునని భావము 1.దూర 2.గుహ్య 3.సూర్యాత్మక 4.కాలాత్మక ఇంద్రులను చెప్పినాడు.)

6. అదిగో సుందర అరుణవర్ణ పక్షి వచ్చుచున్నది. దాని బలము అద్భుతము సర్వసమర్థము. అది గొప్పది. విక్రాంతము. ప్రాచీనము గూడులేనిది! అది చేయదలచినది తప్పక జరుగును. అది కోరదగిన సంపదలను గెలుచును. స్తోతలకు ఇచ్చును.

(పక్షి సూర్యుడు చెప్పినది సూర్యరూప ఇంద్రుని గూర్చి)

7. వజ్రధర ఇంద్రుడు మరుత్తులతో కలసి వర్షించు జలమును సాధించినాడు. అతడు మరుత్ యుక్తుడై వర్షము కలిగించినాడు. వృత్రుని వధించినాడు పృథ్విని అభిషిక్తను చేసినాడు. ఇంద్రుడు మహామహుడు. అతడు ఇతర కార్యములందున్నపుడు మరుత్తులు వర్షోత్పత్తి కార్యమున నిమగ్నులగుదురు.

8. మరుత్తుల సాయమున ఇంద్రుడు ఇన్నిపనులు చేసినాడు! ఇంద్రుని తేజము స్వర్గమునకు చేరునది. అతడు రాక్షసులను వధించును. అతని మనస్సు విశ్వవ్యాప్తి. అతడు క్షిప్రవిజయుడు ఇంద్రుడు ఆకసము నుండి వచ్చినాడు. సోమపానము చేసినాడు. దేహమును పెంచినాడు ఆయుధము అందుకున్నాడు. అసురులను వధించినాడు.

## ఏబది ఆరవ సూక్తము

ఋషి - వామదేవ బృహదుక్థ్యుడు. దేవత - విశ్వేదేవతలు. ఛందస్సు - 1 - 3,7, త్రిష్టుప్ 4-6జగతి

1. బృహదుక్థ్యుడు తన మృతపుత్రుడు 'వాజి' ని అన్నమాటలు :-

నీలో ఒక అంశము అగ్ని - రెండవది వాయువు. మూడవది జోతిర్మయము. నీవు ఈ మూడింటిలో ప్రవేశించుము. అప్పుడు నీవు కళ్యాణమయుడవగుము. దేవతలందు సర్వ శ్రేష్ఠుడు, పితృస్వరూప సూర్యలోమునకు ప్రియస్వరూపుడవు అగుము.

2. వాజీ ! పృథ్వి నీ దేహమును దాచుకొనును. భూమి మాకు ప్రీతి జనకము కావలెను. నీకు శుభములు కలిగించవలెను. నీవు స్థానభ్రష్టుడవు కారాదు. నీవు జ్యోతిర్మయుడవు కావలసి ఉన్నది. దేవతలందును. ఆకసమున

ఉన్న సూర్యుని యందును. నిన్ను విలీనము చేసికొనుము - "జ్యోతిః స్వామిమీయాః"

3. కొడుకా! నీవు అందగాడవు. బలశాలివి. నీవు ఉత్తమ స్తుతులు చేసినావు. ఉత్తమ స్వర్గమునకు చేరుము. ఉత్తమ ధర్మమును అనుష్ఠించినావు. ఉత్తమ ఫలము పొందుము. ఉత్తమ దేవతలందు, ఉత్తమ సూర్యుని యందు కలసిపొమ్ము.

4. మా పితరులు దేవతలతో సమానమగు మహిమగలవారైనారు. వారికి దేవత్వము కలిగినది. వారు దేవతలతో కూడి కార్యములు చేయుచున్నారు. సకల జ్యోతిర్మయ పదార్థములకు వెలుగు ప్రసాదించు వానితో కలసి పోయినారు. వారు మరల దేవతల దేహములందు విలీనులు అయినారు.

5. మా పితరులు స్వశక్తిచే సకల బ్రహ్మాండములందు సంచరించినారు. ఇంతవరకు ఎవరును చేరని ప్రాచీన భువనములందు వారు ప్రవేశించినారు. తమదేహములచే సకల భువనములను దాల్చినారు. ప్రజలందు తమప్రభావమును విస్తరింప చేసినారు.

6. దేవతలు సూర్యపుత్రరూపులు. వారు తమ సృజన కార్యమున సర్వజ్ఞుడు, బలశాలి - సూర్యునకు ఉభయ సంధ్యలు కల్పించినారు. మా పితరులు సంతానము కన్నారు. సంతానమున పైతృక బలమును ప్రవేశపెట్టినారు. వంశమును చిరస్థాయిని చేసినారు.

7. జనులు పడవలలో నీటిని దాచినట్లు - శుభములు కలిగి ఆపదలనుండి బయటపడినట్లు బృహదుక్థ్యఋషి స్వశక్తిచే తన మృతపుత్రుని అగ్నిమున్నగు పార్థివ పదార్థములందును దూరమందున్న జ్యోతిర్మయ పదార్థములందును విలీనము చేసినాడు.

## ఏబది ఏడవ సూక్తము

ఋషి - సుబంధు మున్నగువారు. దేవత - మనస్సు. ఛందస్సు - గాయత్రి.

1. ఇంద్రా ! మేము సన్మార్గమునుండి దుర్మార్గమునకు పోరాదు. సోమముగల గృహమునకు దూరముగా పోరాదు. మా మధ్య శత్రువులు చేరరాదు.

2. అగ్ని వలన యజ్ఞమునకు సిద్ధి కలుగును. అగ్ని పుత్రస్వరూపుడై దేవతలవరకు చేరును. అట్టి అగ్నికి హవనము చేయవలెను. మాకు అగ్ని లభించవలెను.

3. నరాశంస సంబంధ సోమమున మనసును పిలుచు చున్నాము. పితరుల స్తోత్రములచే మనసును పిలుచుచున్నాము.

4. నీ మనసు మరలి రావలెను పనిచేయవలెను. బలము ప్రకటించవలెను జీవించవలెను సూర్యుని దర్శించ వలెను.

5. మా పూర్వులు మనసును మరలింపవలెను. దేవతలు మనసును మరలింపవలెను. మాకు ప్రాణవ్రాతము లభించవలెను.

6. సోమమా ! మా దేహమందు మనసును దాల్తుము. మేము సంతతి యుక్తులమగుదుము. నీ పనులందు చేరుదుము.

(అసముడనువాడు ఇక్ష్వాకురాజు అతనికి బంధు, సుబంధు, శ్రుతబంధు, విప్రబంధు అను సోదరులు పురోహితులు ఆరాజు వీరిని వదిలి మాయావులను పురోహితులుగా వరించినారు. అందుకు బంధ్వాదులు కోపించినారు. అది తెలిసి మాయావులు బంధు, సుబంధులను చంపినారు. మిగిలిన సోదరులు శ్రుతబంధు, విప్రబంధువులు మృతసోదరులను పునర్జీవించ వలసినది అన్నారు.)

## ఏబది ఎనిమిదవ సూక్తము

ఋషి - బంధ్వాదులు. దేవత - మనసు. ఛందస్సు - అనుష్టుప్.

(సుబంధు దేహమున మరలి ఇంద్రియ సహితమగు మనసు ప్రవేశించ వలెనని కోరుట)

1. వివస్వతుని పుత్రుడు యముడు అతని వద్దకు నీ మనసు చేరినది. మేము దానిని తిరిగి రప్పింతుము. నీవు ఈ లోకమున ఉండుటకు జీవింతువు. "ఇహక్షయాయజీవసే"

2. నీ మనసు సుదూరమునకు స్వర్గమునకు, భూమిమీదకు పోయినది మేము దానిని తిరిగి రప్పింతును. "ఇహక్షయాయజీవసే"

3. నీ మనసు నలుదిశల దొర్లుచున్నది బహుదూర దేశమునకు చేరినది. మేము దానిని తిరిగి రప్పింతుము. "ఇహక్షయాయజీవసే"

4. నీ మనసు నలుదిశల అతిదూర ప్రదేశమునకు పోయినది మేము దానిని తిరిగి రప్పింతుము. "ఇహక్షయాయజీవసే"

5. నీ మనసు బహుదూరమున నున్న జలపూర్ణ సముద్రమునకు చేరినది. మేము దానిని తిరిగి రప్పింతుము. "ఇహక్షయాయజీవసే"

6. నీ మనసు నలువైపుల వ్యాపించిన కిరణమండలము చేరినది. మేము దానిని తిరిగి రప్పింతుము. "ఇహక్షయాయజీవసే"

7. నీ మనసు దూరమందున్న జలమధ్యమందలి వృక్షలతాదుల మధ్యకు చేరినది. మేము దానిని తిరిగి రప్పింతుము. "ఇహక్షయాయజీవసే"

8. నీ మనసు దూరమందున్న ఉషమధ్యమున చేరినది. మేము దానిని తిరిగి రప్పింతుము. "ఇహక్షయాయజీవసే"

9. నీ మనసు దూరమందున్న పర్వతపంక్తులపైకి చేరినది. మేము దానిని రప్పింతుము. "ఇహక్షయాయజీవసే"

10. నీ మనసు ఈ సమస్త విశ్వమునకు బహుదూరముగ వెళ్లిపోయినది. మేము దానిని తిరిగి రప్పింతుము. "ఇహక్షయాయజీవసే"

11. నీ మనసు భూత, భవిష్యత్తువంటి ఏదోసుదూర ప్రదేశమునకు. వెళ్లి పోయినది మేము దానిని తిరిగి రప్పింతుము. "ఇహక్షయాయజీవసే"

**ఆలోచనామృతము**

ప్రాణి దేనివలన జీవించుచున్నది? ఏది పోయినంత జీవితము చాలించుచున్నది? ఆ ఉన్నదేది? ఈ పోయినదేది ఇది ప్రశ్నయే! దీనికి బదులు లభించలేదు! లభించదు!! ఏలనన ఇది సత్యము ఋతము. దీనిని ఎవడును చూడజాలడు! ప్రాణము, ఆత్మ ఇవి ఉన్నంత కాలము జీవితము ఉండును. ఇవి లేనపుడు కళేబరము మిగులును ప్రాణము, 'ఆత్మ' నామ వాచకములు మాత్రమే! వాటి స్వరూప స్వభావములు తెలియవు!

ఈ సూక్తమున మనసు, ప్రాణమయినది. మనసే ప్రాణమని అప్పటి అవగాహన. మనసునకు, ప్రాణమునకు రూపములేదు. కావున పర్యాయమయిన తప్పుకాదు. మనసే మనిషిని కదిలింప చేయుచున్నది. మనసులేకున్న ఏ అవయవము తన విధి నిర్వర్తించలేదు. మనసులేనపుడు కన్ను చూచుచుండును కాంచదు. ఈ న్యాయము అవయవములన్నింటికి వర్తించును.

అందువలననే మనసన్న ప్రాణ్ ము అన్నాడు !

ఈ మనసు మనిషిని వదిలి ఎచట కేగును?

ఆ ప్రశ్నయే ఈ సూక్తము. అన్వేషణము ఎంతో అందముగా చెప్పినాడు. "తత్త ఆవర్తయామసీహ క్షయామ జీవసే" ! ఇదొక అంతములేని అన్వేషణ !

## ఏబది తొమ్మిదవ సూక్తము

ఋషి - గోపాయనుడు. దేవత - వేరు వేరు. ఛందస్సు -17 త్రిష్టుప్ 8 పంక్తి 9 మహాపంక్తి 10 పంక్త్యుత్తర

1. సారథి కుశలుడైన రథమునెక్కిన వాడు సుఖముగా ఉండును. అట్లే పరమాయువు యవ్వనయుక్తమై పెరుగ వలెను. ఆయువునకు హాని కలిగిన వాడు ఆయుర్వృద్ధి కోరును. నిర్రుతి యనుపాపదేవత దూరము కావలెను. "నిబ్రుతిర్జి హీమతామ్."

2. పరమాయుస్వరూపసంత్తి లాభమునకుగాను మేము సామగానము చేయుదుము. భక్ష్యపదార్థములను కూర్చుకొందుము. మేము నిబ్రుతినిస్తుతించినాము. ఈ సకల భక్ష్యములను భుజించి "నిబ్రుతిర్జి హీమతామ్."

3. మా బలమున శత్రువులను పరాజితులను చేయుదుము. భూమికిపైన ఆకాశమున్నట్లు మేము శత్రువులమీద స్థానము సాధింతుము. మేఘగతిని పర్వతము నిలుపును. శత్రుగతిని మేము నిరోధింతుము. మా స్తుతులు విని "నిబ్రుతిర్జి హీమతామ్."

4. సోమమా! మమ్ము మృత్యువునకు వప్పగించకుము. మేము సూర్యోదయములు చూడవలెను మా వార్ధక్యము ప్రతి నిత్యము సుఖముగా గడువ వలెను.

5. అసునీతి-ప్రాణనేత్రి దేవీ! మనసు మావైపు మరల్చుము. మేము జీవించవలెను. మాకు ఉత్కృష్ట పరమాయువు ప్రసాదించుము. సూర్యుడు ఉన్నంతకాలము మమ్ము జీవించనిమ్ము. మేము నీకు ఘృతము అర్పింతుము. దానిచే పుష్టినందుము.

6. అసునీతీ! మాకు మరల నేత్రములిమ్ము. మరల మా ప్రాణములను మా వద్దకు చేర్చుము. మేము భోగములు అనుభవింపవలెను చిరకాలము సూర్యుని దర్శించవలెను నాశము లేని విధముగా మాకు సుఖములు కలిగించుము.

7. పృథ్వి మరల మాకు ప్రాణదానము చేయవలెను. ద్యులోక అంతరిక్షములు మాకు ప్రాణదానము చేయవలెను. సోమము తిరిగి మాకు శరీరము ప్రసాదించవలెను. మాకు సర్వదా శుభములు కలుగునట్లు పూష మాకు హితకర వాక్కు ప్రసాదించవలెను.

8. మహతి, మాతృస్వరూప ద్యావాపృథ్వులు శుభములు కలిగించవలెను. ద్యులోకము, విశాలపృథ్వి సకల

అశుభములను దూరము చేయవలెను. ఎవరును ఎటువంటి హాని కలిగించరాదు.

9. స్వర్గమందురెండును, మూడును ఓషధులున్నవి. వానిలో ఒకటి భూమి మీద లభించును. అవన్నియు ప్రాణములను రక్షించవలెను. ద్యులోకము, విశాల పృథ్వి సకల అశుభములను దూరము చేయవలెను. ఎవరును ఎటువంటిహాని కలిగించరాదు.

10. ఇంద్రా ! ఉశీనవుని భార్య శకటము తీసికొని వెళ్లిన వృషభమును ప్రోత్సహించుము. ద్యులోకము, విశాల పృథ్వి సకల అశుభములను దూరము చేయవలెను ఎవరును ఎటువంటి హాని కలిగించరాదు.

## అరువదవ సూక్తము

ఋషి - గోపాయవ, బంధ్వాదులు. దేవతలు - వేరు వేరు. ఛందస్సు - 1-6
గాయత్రి 8,9 పంక్తి - మిగిలినవి అనుష్టుప్.

1. అసమాతి రాజు యొక్క జనపదము ఉజ్వలము. మహామహులు ఆజనపదమును ప్రశంసింతురు. వినమ్రులై ఆ జనపదమున ప్రవేశింతురు.

2. అసమాతిరాజు అందగాడు. శత్రుసంహారకుడు. రథము ఎక్కినవాని కోరికలు సిద్ధించినట్లు ఆ రాజు దగ్గరకు వెళ్లువాని కోరికలు తీరును. అతడు భజేరథము వంశమున జన్మించినాడు సుపరిపాలకుడు సత్పతిమ్.

3. అతడు కరవాలము ధరించినను, ధరించకున్నను బలపౌరుషములు ప్రదర్శించగలడు. సింహము మహిషములను వలె అతడు నరులను పడగొట్టగలడు.

4. ధనికుడు శత్రుసంహారకుడు. ఇక్ష్వాకు ప్రభువు రక్షణ కార్యము నిర్వర్తించుచున్నాడు. పంచ జనులారా! స్వర్గసుఖములు అనుభవించండి.

5. ఇంద్రా ! అందరు దర్శించు కొనుటకుగాను ఆకసమున సూర్యుని స్థాపించినావు. అట్లే రథారూఢుడగు అసమాతి రాజునకు అనుగామి వీరులను నియమించుము.

6. రాజా ! అగస్త్యుని దౌహిత్రుల కొరకు రెండు హితవర్ణ అశ్వములను రథమునకు కట్టుము. అతి కృషణలు, ఎన్నడు దానము చేయని వ్యాపారుల నందరను ఓడించుము.

7. ఈ అగ్ని, మాత, పిత, ప్రాణదాత ఔషధము. అగ్ని విచ్చేసినాడు. సుబంధో! ఇదే దేహము. ఇందు వసించుము.

8. రథమును నిలుపుటకు పగ్గమున పట్టి ఉంచుదురు. అట్లే అగ్ని నీ మనసును పట్టి ఉంచినాడు. ఇక నీవు జీవింపుము. కళ్యాణస్వరూపుడవగుము. అరిష్టములు, మృత్యువు దూరము కావలెను.

9. ఈ విశాలపృథ్వి మహా మహా వృక్షములను భరించుచున్నది. అట్లే అగ్ని నీ మనసును భరించి ఉన్నది. ఇక నీవు జీవింపుము. కళ్యాణ స్వరూపుడవగుము. అరిష్టములు, మృత్యువు దూరమగునుగాత.

10. వివస్వత పుత్రుడు యమరాజునుండి నేను సుబంధు మనసును అపహరించినాను. అందువలన అతడు జీవించును. కళ్యాణ స్వరూపుడగును. మృత్యువుదూరమగును.

11. వాయువు ద్యులోకమునుండి క్రిందకు వీచును. సూర్యుడు పైన ఉండి క్రింద మండించును. గోవుపాలు క్రిందినుండి పితుక బడును. అట్లే నీ పాపము క్రిందకు పారవలెను.

12. హస్తము ఎంతటి సౌభాగ్యశాలి ! అది ఎంతో సౌభాగ్యశాలి అగును. ఇది ఎల్లరకు ఔషధమగును, దీని స్పర్శవలన శుభములు కలుగును.

(హస్తమునకు ఎంతటి ప్రభావము ! హస్తమేకదా సర్వము సాధించునది!)

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత ఎనిమిదవ అష్టకము, వచన మండలమున నాలుగవ అనువాకము సమాప్తము.)*

**అయిదవ అనువాకము అరువది ఒకటవ సూక్తము**

ఋషి - మానవ నాభావేదిష్టుడు. దేవత - విశ్వేదేవతలు. ఛందస్సు - త్రిష్టుప్.

1. నాభానేధిష్టు తల్లి, తండ్రి, సోదరులు విషయ విభజనమైనప్పుడు అతనికి భాగము కల్పించలేదు. రుద్రస్తుతి చేయసాగినారు. అప్పుడు నాభానేదిష్టుడు రుద్రస్తవము చేయనుంకించి అంగిరుల యజ్ఞమున చేరినాడు. యజ్ఞపు ఆరవనాడు మరచినవానిని స్పతహోతలకు చెప్పి యజ్ఞము సంపూర్ణము చేయించినాడు.

2. రుద్రుడు స్తోతలకు ధనములు ఇవ్వదలచినాడు. శత్రువులను నష్టపరచుటకు అస్త్రాదులు ఇవ్వదలచినాడు. యజ్ఞవేదికి చేరినాడు. ఆసీనుడు అయినాడు వర్షమేఘము వలె నలుదిశల తన ప్రభావమును ప్రదర్శించినాడు.

3. అశ్వినులారా ! నేను యజ్ఞమున ఉన్నాను. మీ చేతి వ్రేళ్లు పట్టుకున్న వారును, విస్తృతహవిని సంపాదించు వారును, మీ నామములు ఉచ్ఛరించుచు చరుపాకము చేయువారలగు అధ్వర్యుస్తోతల యజ్ఞప్రయత్నములు చూచి

మనోవేగమున మీరు యజ్ఞమునకు వెళ్లుదురు.

4. రేతిరి చీకట్లు అణగి తొలిపొద్దు ఎరుపుడాలు అగుపించినప్పుడు ద్యులోకపుత్ర అశ్వద్వయమా! మిమ్ము నేను ఆహ్వానింతురు. మీరు మా యజ్ఞమునకు విచ్చేయండి. మేము అందించు అన్నము స్వీకరించండి. గ్రాహక అశ్వములవలె భక్షించండి. మాకు హాని తలపెట్టకండి.

5. ప్రజాపతి వీర్యము సంతానోత్పాద సమర్థమైనది. అది వృద్ధి చెందినది వెడలినది మానవ హితము కొరకు ప్రజాపతి తన రేతస్సును సుందర కన్య దేహమున విసర్జించినాడు.

6. ప్రజాపతికి సుందరకన్యతో రతి కోరిక కలిగినది. వారిద్దరు సంగమించినారు. అప్పుడు అల్పశుక్రము విడిచినారు. శుక్ర ఆధారస్వరూపమగు ఒక ఉన్నత స్థానమున ఆ శుక్రము పడినది.

7. పిత కన్యతో సంగమించినప్పుడే పృథ్వితో కలియుటవలన శుక్రము పడినది. సుకృతులగు దేవతలు దీనితో వ్రతరక్షక బ్రహ్మను సృష్టించినారు.

8. ఇంద్రుడు నముచితో యుద్ధము చేయునపుడు నురుగులు చిమ్ముచు వచ్చినారు. అట్లే నా వద్ద మంచి వాస్తోష్పతి మరలి పోయినాడు. అతడు ఏ పాదమున వచ్చినాడో అదే పాదమున మరలి పోయినాడు. అంగిరులు నాకు దక్షిణగా గోవులను ఇచ్చినారు. వాటిని గ్రహించుట సమర్థులయ్యు గ్రహించలేదు.

(నముచిని వధించుటకు ఇంద్రుడు సముద్రపు నురగను ఉపయోగించినాడని వృత్తాంతము వాస్తోష్పతి రుద్రుడే అగును)

9. ప్రజలను పీడించువారును అగ్నివలె దహించు వారలగు రాక్షసాదులు ఈ యజ్ఞమున ప్రవేశించలేరు. ఏలననగా రుద్రుడు ఈ యజ్ఞమును రక్షించుచున్నాడు. రాత్రులందును నగ్న రాక్షసులు యజ్ఞపు అగ్ని వద్దకురాలేరు. రాత్రులందును అగ్ని యజ్ఞమును రక్షించును. అతడు కొరివి చేత బూని అన్న వితరణ చేయుచు ఆవిర్భవించును. రాక్షసులతో యుద్ధము చేయును.

10. అంగిరులు తొమ్మిదినెలలు యజ్ఞము చేయుచునే గోవులను పొందినారు. వారు కమనీయ స్తుతులసాయమున యజ్ఞవచనములు పలుకుచునే యజ్ఞము పూర్తి చేసినారు. వారు ఇహ, పరలోకములందు వర్ధిల్లినారు. ఇంద్రుని చేరినారు. వారు దక్షిణలులేని సత్రయాగము చేసి అవినాశ్యఫలము సాధించినారు.

11. అంగిరులు పాడియావుల అమృతసమము, పవిత్ర దుగ్ధములను యజ్ఞమున కొసంగినారు. అప్పుడు వారు స్తోత్రములచే నూతన సంపదవంటి వర్షజలమును సాధించినారు.

12. యజ్ఞకర్తలతో ఇంద్రుని స్నేహము అపారము. యజ్ఞకర్త పశువులు తప్పిపోయినచో ధనిక, కుశల, నిష్పాప, ఇంద్రుడు ఆవిషయము తెలియ పరచినను, పరచుకున్నను, వెదికి తెచ్చును. అట్లని జనులు చెప్పుకొందురు.

13. సుస్థిర ఇంద్రుడు బహువిస్తారక శుష్ణుని నిగూఢ మర్మములను వెదకి వధించినప్పుడు అతని అనుచరులు అతని చుట్టుమూగి పొగడుదురు, వెంటసాగుదురు.

14. స్వర్గతుల్య యజ్ఞస్థానమున ఆసీనులైన దేవతలు అగ్ని యొక్క తేజస్సును 'భర్గ' అని నామకరణము చేయుదురు అగ్ని యొక్క మరొక తేజస్సు పేరు "జాతవేద" హోమ నిష్పాదక అగ్నీ ! నీవే యజ్ఞమునకు హోతవు. నీవే అనుకూలుడవై మా పిలుపును ఆలకింతువు.

15. ఇంద్రా ! వారిద్దరూ ఆదీప్తమార్తులు, రుద్రపుత్రులు, అశ్వినులు, మా స్తోత్రమును, యజ్ఞమును గ్రహించవలెను. వారు మనువు యజ్ఞమున ప్రసన్నులగుదురు. అట్లే మా యజ్ఞమున ప్రసన్నులు కావలెను. కుశలపై కూర్చుండవలెను. ప్రజలకు ధనము ప్రసాదించవలెను యజ్ఞము స్వీకరించ వలెను.

16. సర్వశ్రేష్ఠ సోమమును అందరు స్తుతింతురు. మేము సహితము స్తుతింతుము. క్రియాకుశల సోమము స్వయముగా వారధి అగును. జలములను దాటును. శీఘ్రగామి అశ్వము రథచక్రముల ఇరసును వడికింఛినట్లు సోమము కక్షీవంతుని అగ్నిని వడికించును.

17. అగ్ని ఇహ, పరలోకముల హితము కోరును. అతడు తరింపచేయువాడు. యజ్ఞకర్త అమృత సమములగు పాలిచ్చు గోవులు పాలివ్వనప్పుడు అగ్ని వాటిని ప్రసవవతులను దుగ్ధదాయనులను చేయును. మిత్ర, వారు, ఆర్యములను శ్రేష్ఠస్తోత్రములచే సంతుష్టులను చేయుదురు.

18. స్వర్గమునందున్న సూర్యుడా! నేను నీ బంధువును. నాభానేదిష్టుడను. నిన్ను స్తుతింతును. నాకు ఆవులు లభించవలెనను కోరిక కలిగినది. ద్యులోకము సూర్యునకు, మాకు ఉత్పత్తి స్థానమగును. సూర్యునకు, నాకు ఎందరు పురుషుల అంతరము ఉన్నది?

19. ద్యులోకమే నా జన్మస్థానము. నేను ఇచటనే నివసింతును. సకల కిరణములును, దేవతలును నావారలే అగుదురు. నేను అందరివాడను. సత్యరూప బ్రహ్మకన్న ముందే ద్విజులు జన్మించినారు. యజ్ఞస్వరూప గోవులేక మాధ్యమికే వాక్కు జనించి ఈ సమస్తమును సృష్టించినది.

20. అగ్ని ఆనందమున సాగును. నలువైపుల తన స్థానము గ్రహించును. ఇతడు ఉజ్వలుడు. ఇహపర ఉభయలోకములకు సాయపడువారు. అతడు కర్రలందుండును. ఇతని జ్వాలలు పైకి లేచును. అతడు స్తుత్యుడు.

అగ్నికి అరణిమాత అరణి సుస్థిర, సుఖావహ అగ్నిని అతిత్వరగా పుట్టించును.

21. ఉత్తమోత్తమ సోత్రములు పలుకుచు పలుకుచు నాభానేదిష్టుడను అలసి నాను. నా స్తుతలు ఇంద్రుని చేరినవి. ధనిక అగ్నీ ! వినుము మా ఇంద్రుని యజ్ఞము చేయుము. నేను అశ్వమేధము చేయువాని పుత్రుడను నా స్తుతుల వలన నీవు వర్ధిల్లుదువు.

22. వజ్రధర నరేంద్ర ఇంద్రా! మేము విశేషధనము కోరినాము. ఇది తెలిసి కొనుము. మేము నిన్ను స్తుతింతుము. నీకు హవి సమర్పింతుము. మమ్ము రక్షింపుము. హర్యశ్వవంత ఇంద్రా! మేము అపరాధులమై నీ వద్దకు చేరకుందుముగాక.

23. దీప్తమూర్తులగు మిత్రావరుణలారా! గోవుల కొరకు అంగిరులు యజ్ఞము చేసినారు. సర్వజ్ఞనాభా నేదిష్టుడు స్తోత్రాభిలాషినై వారివద్దకు చేరినాను. నేను స్తుతించి యజ్ఞము పూర్తి చేసినాను. అందుకే నేను వారికి అత్యంత ప్రియ విప్రుడను అయినాను.

24. ఇప్పుడు మేము గోధనము కోరినాము. అనాయాసముగ స్తుతించినాము. వరుణుని వద్దకు చేరినాము. శీఘ్రగామి అశ్వము ఆ వరుణుని బిడ్డయే. వరుణా! నీవు విప్రుడవు అన్నదాతవు.

25. మిత్రా, వరుణులారా! అన్నవంత పురోహితులు స్తుతించుచున్నారు. మీరు మాకు అనుకూలురు కావలెను మీ బంధుత్వము హితకరము. అందువలన సకల స్థానములందు స్తోత్రవాక్యములు ఉచ్చరించబడును. పరిచితమార్గము సుఖకరమైనట్లు మీ బంధుత్వము మా స్తుతులను సుఖకరము చేయవలెను.

26. పరమబంధు వరుణా! దేవతలతో కూడ స్తోత్రములు, నమస్కారములు అందుకొనుము. వర్ధిల్లుము వరుణుని యజ్ఞమున ఆవుపాలు ఏరులై పారవలెను.

27. దేవతలారా! మీరు యజ్ఞరక్షకులు మమ్ము రక్షించుటకుగాను మీరందరు ఏకము కండి. అంగిరులారా! మీరు ఉద్యమింఛి నాకు అన్నము కలిగించినారు. మీకు అనుమాన నివృత్తి అయినది. గోధనమును అందుకొనండి.

(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత పదవ మండలము ఎనిమిదవ అష్టకమున మొదటి అధ్యాయము సమాప్తము.)

**ఓం నతామిన్తిమాయినో వధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదసీ అద్రుహో వేద్యా భిర్న పర్వతాని నమేత స్థివాంసః**

**రెండవ అధ్యాయము అరువది రెండవ సూక్తము**

ఋషి - మానవ నాభావేదిష్టుడు. దేవత - విశ్వేదేవతలు. ఛందస్సు - వేరు వేరు.

***ఓం యేయజ్ఞేన దక్షిణయాసమక్తా ఇంద్రస్య సఖ్యమ మృత్వమానశ |***
***తేభ్యోభద్ర మఙ్గిరసోవో అస్తుప్రతి గృభ్ణీతమాన వంసుమేధసః ||***

1. అంగిరులారా! మీరు యజ్ఞద్రవ్యములు ఇచ్చినారు. దక్షిణలు ఇచ్చినారు. ఒకేసారి ఇంద్రుని బాంధవ్యము, అమరత్వము పొందినారు. మీకు శుభములు కలుగవలెను. సుయజ్ఞ అంగిరులారా! నేను మనుపుత్రుడను. నన్ను స్వీకరించండి. నేను చక్కగా యజ్ఞము చేయుదును. "ప్రతిగృభ్ణీతమానవం సుమేధసః"

2. అంగిరులారా! మీరు మాకు పితృసములు. మీరు అపహృత గోవులను తెచ్చినారు. సంవత్సరమంతము యజ్ఞము చేసి బలాసురుని వధించినారు. మీకు దీర్ఘాయువు కలుగవలెను. "ప్రతిగృభ్ణీతమానవం సుమేధసః"

3. మీరు సత్యరూపయజ్ఞము చేసినారు. అందువలన ద్యులోకమున సూర్యుని స్థాపించినారు. భూమాతను ప్రసిద్ధను చేసినారు. మీకు సంతతి కలుగవలెను. "ప్రతిగృభ్ణీతమానవం సుమేధసః"

4. దేవపుత్ర ఋషులగు అంగిరులారా! నేను నాభానేదిష్టుడను. యజ్ఞములందు సువచనములు పలుకువాడను. అవధరించండి శోభన బ్రహ్మతేజస్కులుకండి. "ప్రతిగృభ్ణీతమానవం సుమేధసః"

5. వీరు వివిధరూప ఋషులు. అంగిరులు గంభీర కర్మ వంతులు. వారు అగ్ని పుత్రులు వారు నలుదిశల ప్రాదుర్భవించినారు.

6. అంగిరులు వివిధరూపులు అగ్నివలన ద్యులోకపు నలుదిశల ప్రాదుర్భవించినవారు. వారిలో కొందరు నవశ్వము తొమ్మిదినెలల యజ్ఞము చేసినారు. కొందరు దశాశ్వము పదినెలల యజ్ఞము చేసినారు. ఆ విధముగా వారికి గోధన కలిగినది. అంగిరులు దేవతలతో ఉండువారు. వారిలో శ్రేష్ఠుడు నాకు ధనము ప్రసాదించవలెను.

7. అంగిరులు కర్మకర్తలు. వారు ఇంద్రుని సాయమున అశ్వ, గోయుక్త గోష్ఠములను ఉద్ధరించినారు అవిలంబ కర్ణములు గలవారు నాకు వేయిగోవులను ఇచ్చినారు. దేవతలకు యజ్ఞాశ్వమును ఇచ్చినారు.

8. నీటనానిన గింజవలె సావర్ణమనువునకు ధన, సంతాన వృద్ధి కలుగ వలెను. ప్రస్తుతము మనువు వందల అశ్వములు, వేలు గోవులను దానము చేయుటకు సిద్ధముగా ఉన్నాడు.

9. మనువు వలె దానము చేయ గలవాడు లేడు. అతడు స్వర్గమువంటి ఉన్నత భావములవాడు. సావర్ణ

మనువుదానము నదివలె సర్వత్ర వ్యాపించినది "సిన్ధురివ పప్రథే."

10. యదు, తుర్వ రాజర్షులు కళ్యాణకారకులు, గోయుక్తులు, దాసులవంటివారు, మనువు భోజనముకు గాను పశువులను అర్పింతురు.

11. మనువు సహస్రగోవులదాత మానవులకు నేత అతనికి అనిష్టము చేయగలవాడులేడు. మనువు దక్షిణలు సూర్యసమములై ముల్లోకములు ప్రసిద్ధములు దేవతలు సావర్ణ మనువు ఆయువును పెంచవలెను. సకల కర్మలు చేయు మాకు అన్నము లభించవలెను.

## అరువది మూడవ సూక్తము

ఋషి - ప్లతపుత్ర గయుడం. దేవత - విశ్వేదేవతలు. ఛందస్సు - జగతి

16,17 త్రిష్టుప్.

1. దేవతలు దూరప్రదేశములనుంచి వచ్చి మానవులతో స్నేహము చేయుదురు. ప్రసన్నులను చేసినంత దేవతలు వివస్వత పుత్రమనువు సంతానములను పోషింతురు. దేవతలు నహుహ పుత్ర యయాతి యజ్ఞమున ఉపవిష్టులగుదురు. వారందరు మమ్ము ఆదరించి ధనములు ప్రసాదించవలెను.

2. దేవతలారా ! మీ సకల నామములు వందనీయములు. స్తుత్యములు యాగయోగ్యములు అదితి, జలము, పృథ్వినుండి జన్మించిన దేవతలారా! నా ఆహ్వానములు ఆలకించండి.

3. సకలమున సమరించు పృథ్వి దేవతల కొరకు మధుర దుగ్ధములు ప్రవహింప చేయును. మేఘవంతుడు అవినాశ్య ఆకాశము దేవతల కొరకు అమృతము ధరించును. అట్టి అదితి పుత్ర దేవతలను స్తుతించండి. అది మంగళ ప్రదమగును వారి శక్తి ప్రశంసనీయము. వారు వర్షము తెచ్చువారు. వారి కార్యములు సుందరములు.

4. కర్మనిష్ఠమానవులను రెప్పవాల్చక వీక్షించు దేవతలు సేవించుటకుగాను అమృతము అందినది. దేవతల రథము జ్యోతిర్మయము. వారి కార్యములు నిర్విఘ్నములు వారు పాపరహితులు. జన కళ్యాణమునకు గాను వారు ఉన్నత ప్రదేశమున నివసింతురు.

5. స్వతేజవిరాజితులు, యజ్ఞములకు విచ్చేయు సుప్రవృద్ధదేవతలు అహింసితులై ద్యులోకమున ఉన్న మహా దేవతలకు అదితికి శుభములు కలుగునట్లు నమస్కరించండి. శోభన స్తుతులచే సేవించండి.

6. దేవతలారా! నేనుకాక మిమ్ము మరెవరు స్తుతించగలరు? జ్ఞానులు, సంతన వంతులగు దేవతలారా! పాపములనుండి రక్షించి శుభములు కలిగించు యజ్ఞము నేను కాక మరెవరు చేయగలరు?

7. మనువు అగ్నిని ప్రజ్వలింప చేసినాడు. సుమనస్కుడై, సప్తహోతల సహితుడై దేవతలకు ఉత్తమ హోమద్రవ్యములు సమర్పించినాడు. అట్టిదేవతలు మాకు అభయము, సుఖము, సుపథము, శుభములు కలిగించవలెను.

8. ఉత్తమ జ్ఞానులు సర్వజ్ఞాతలగు దేవతలు సమస్తస్థావర, జంగమాత్మక విశ్వమునాకు ఈశ్వరులు. అట్టి దేవతలారా! మీరు మమ్ము కాయక, మానసిక పాపములనుండి రక్షించండి. శుభములు కలిగించండి.

9. మేము యజ్ఞములందు ఇంద్రుని ఆహ్వానింతుము. అది మాకు ఆనందకరమగును. మేము దేవతలను ఆహ్వానిస్తాము. వారు పాపములు వదిలింతురు. వారి కార్యములు సుందరములు. మాకు శుభములు కలుగవలెననియు, ధనము లభించవలెననియు అగ్నీ, మిత్ర, వరుణ, భగ, ద్యావాపృథ్వులు, మరుత్తులను ఆహ్వానింతుము.

10. ద్యులోకరూప నౌక అక్షయము సుసంఘటితము పాపరహితము అవినాశ్యము దీని ఆచరణ సుందరము. మేము మాకు శుభముల కొరకు ఈ నౌకను ఎక్కుదుము. దేవత్వము నొందుదుము. దీని మీద పయనము భయ రహితము. ఇది సుఖములు కలిగించునది. ఇది విస్తరించవలెను.

11. యజనీయ దేవతలారా! మాకు రక్షణలు బోధించండి. నాశము చేయు దుర్గతి నుండి మమ్ము రక్షించండి. మేము సత్యరూప యజ్ఞము ఏర్పరచెదము. మిమ్ము ఆహ్వానింతుము. ఆలకించండి, రక్షించండి శుభములు కలిగించండి.

12. దేవతలారా ! మా రోగములను వదిలించండి. సకల ప్రకార పాపబుద్ధిని నష్టపరచండి. మాకు దాన శూన్య బుద్ధిని కలిగించకండి. దుష్టుని దుర్బుద్ధిని సహితము దూరము చేయండి. మా శత్రువులను దూరమునాకు పంపండి. మాకు సుఖములు, శుభములు కలిగించండి.

13. అదితి పుత్ర దేవతలారా ! మీరు ఉత్తమ మార్గము చూపి పాపములను దాటించి, శుభములు కలిగించినవాడు సంపన్నుడై వర్ధిల్లును. అతనికి హాని కలుగదు. అతడు ధర్మకార్యములు చేయును. అతని వంశము వర్ధిల్లును.

14. దేవతలు అన్నప్రాప్తికిగాను ఏ రథమును రక్షింతురో మరుత్తులు యుద్ధసమయమున సంచిత ధనప్రాప్తికి ఏ రథమును రక్షింతురో ఇంద్రా ! అట్టి ప్రాతః కాల యుద్ధమునాకు సాగు రథమునే నీవు ఆశ్రయింపుము. ఆ రథమును ఎంతటి వాడును నష్టపరచ జాలడు. దానిపై ఎక్కి మేము శుభములు అనుభవింతుము.

15. సుక్షేత్రము, మరుస్థలము రెండింట మాకు శుభములు కలుగవలెను. జలమునందును, యుద్ధమందును

రెండింట మాకు శుభములు కలుగవలెను. అస్త్రశస్త్రము విసరుకొను యుద్ధ మధ్యమున మాకు శుభములు కలుగవలెను. పుత్రులు కలుగు స్త్రీ గర్భమున మాకు శుభములు కలుగవలెను. దేవతలారా ! ధన లాభమునకు మాకు శుభములు సమకూర్చండి.

16. ఎయ్యది పృథ్విమార్గమున సాగుటకు శుభప్రదమగునో ఎయ్యది సర్వశ్రేష్ఠధన పూర్ణమగునో ఎయ్యది వరణీయ యజ్ఞస్థానమున ఉపస్థితమగునో అట్టి గృహమునందును, అరణ్యమునందును మమ్ము రక్షించండి. రక్షకులగు దేవతలారా! మేము సుఖముగా భూమిమీద నివసించవలెను.

17. దేవతలారా! అదితీ! ప్రాజ్ఞుడగు పులతిపుత్రుడు గయుడు ఈ విధముగా మిమ్ము సంవర్ధిల్ల చేయుచున్నాడు. దేవతల ప్రసన్నతయే మానవుల పాలన యగును. గయుడు దేవతలను స్తుతించుచున్నాడు.

## అరువది నాలుగవ సూక్తము

ఋషి - ప్లుతపుత్ర గయుడు. దేవత - వివేదేవతలు. ఛందస్సు - జగతి 12,
16, 17, త్రిష్టుప్.

1. యజ్ఞములందు దేవతలు మా స్తుతులు వినవలెను. దేవతలలో ఏ దేవతస్తుతి, ఎట్లు, చక్కగా రచించగలము? ఎవరు మా మీద దయ తలతురు? ఎవడు సుఖవిధానము చేయగలడు? మమ్ము రక్షించుటకు ఎవడు మా వద్దకు రాగలడు?

2. మా అంతః కరణమున ప్రజ్ఞున్నది. అది అగ్ని హోత్రాదులు చేయ సంకల్పించినది. ప్రజ్ఞ దేవతలను అభిలషించు చున్నది. మా అభిలాషలు దేవతల వద్దకు చేరును. దేవతలు కాకా మరొక సుఖదాతలేదు. ఇంద్రాది దేవతలందు మా అభిలాషలు చేరినవి.

3. పూష ధనదానములిచ్చి పోషించును. అతడు ఇతరులకు అగమ్యుడు. అతనిని స్తుతించండి. దేవతలందు ప్రదీప్తుడు అగ్నిని స్తుతించండి సూర్య, చంద్ర, యమ, త్రిత, వాయు, ఉష, రాత్రి, అశ్వినులను స్తుతించండి.

4. జ్ఞాని అగ్ని ఏ విధముగా అనేక స్తోతలవాడగును? ఏ స్తుతివలన అగ్ని సన్మాని తుడగును? శోభన స్తుతులకు బృహస్పతి వర్థిల్లును అజేకపాత, ఆహిర్బుధ్న్య దేవతలు మా ఆహ్వాన సమయమున సురుచిరస్తవములు ఆలకించవలెను.

5. అవినాశ్య పృథ్వివీ! సూర్యుడు ఉదయించునపుడు నీవు రాజులగు మిత్రా వరుణులను సేవింతువు. సూర్యుడు విశాల రథమునధిరోహించి మెల్లగాసాగును. అతడు అనేక రూపములతో అవతరించును. సప్తర్షులు సూర్యుని ఆహ్వాన కర్తలు.

6. ఇంద్రుని అశ్వములు యుద్ధ సమయములందు స్వయముగా శత్రువుల మహాధనమును తెచ్చి ఇచ్చును. అవి సుశిక్షిత అశ్వములవలె లయ బద్ధముగ అడుగులు వేయును.

7. స్తోతలారా! రథయోజక వాయువును బహుకర్మ కర్త ఇంద్రుని పూషను స్తుతించండి. వారితో మీ సఖ్యత అంగీకరింప చేయండి. వారు ఏకమనస్కులు, అన్యోన్య మనస్కులై ప్రాతఃకాల యజ్ఞమునాకు ఉపస్థితులగుదురు.

8. సరస్వతి, సరయు, సింధుమున్నగు ఇరువదియొక్క నదులను, వనస్పతులను, పర్వతములను, అగ్నిని, సోమపాలక కృశాను గంధర్వుని, బాణబాలక గంధర్వుని నక్షత్రములను, హవిర్భాగముగల రుద్రుని, రుద్రులందు ప్రధానరుద్రుని మారక్షణల కొరకు యజ్ఞమునాకు ఆహ్వానించు చున్నాము.

9. గొప్పవి, తరంగములు గల సరస్వతి, సరయు, సింధుమున్నగు ఇరువదియొక్క నదులు రక్షించుటకు విచ్చేయవలెను. జలప్రేరకములగు ఈ దేవతలు ఘృత, మధుసమాన జలములను అందించవలెను.

10. మహా దీప్త దేవమాత అదితి మా ఆహ్వానము వినవలెను. దేవపిత త్వష్ట తన పుత్రులగు దేవతలు, వపత్నుల సహితుడై మా ఆహ్వానము వినవలెను. ఋభుక్ష, ఇంద్ర, వాజ, రథపతి, బాగా, స్తుత్య మరుద్గణములు స్తుతుల కొరకు మమ్ము రక్షించవలెను.

11. మరుత్తులు అన్నమున్న ఇంటివంటి రమణీయులు. రుద్రపుత్ర మరుత్తుల స్తుతి శుభావహమగును. మానవులందు మేము గోధనవంతులము, కీర్తివంతులము కావలెను. దేవతలారా! సదా మేము అందరము కలసి నడువవలెను "ఇళయాసచేమహే"

12. మరుద్గణ, రుద్ర, దేవబృంద, వరుణ, మిత్రులారా! పాడియావు పొదుగు భారమైనట్లు మీరు ప్రసాదించిన కర్మఫలమును సుసంపన్నము చేయండి. మా స్తోత్రములు విని రథముపై ఎక్కి మీరు మా యజ్ఞమునకు విచ్చేసినారు.

13. మరుత్తులారా! పూర్వము అనేకమారులు మీరు మా బంధుత్వమును రక్షించినారు. ఇప్పుడు సహితము అట్లే చేయండి. మేము సర్వప్రథమముగ వేది ఏర్పరచెదము. అక్కడ అదితి - మానవుల సహితముగ మాకు బంధుత్వము ప్రసాదించ వలెను.

14. ద్యావాపృథ్వులు అందరిని కల్పించునవి. దీప్తిశీలలు యాగయోగ్యులు వారికి జన్మతోనే ఇంద్రాదుల ప్రాప్తి కలిగినది. అవి బహువిధములుగ దేవతలను, మానవులను రక్షించవలెను పాలకులగు దేవతలతో కలసి అవి జలమును ప్రవహింప చేయును.

15. వాణి - వాక్కు - మహామహులను పాలించునది. స్తుతివంతము. దేవతలను స్తుతించునది. సోభిషవ కారణమున మహత్వము సాధించినది. అట్టి వాణి సకల స్వీకరణీయ ధనములను వ్యాపింప చేయును. స్తోతలు స్తోత్రములచే దేవతలను యజ్ఞకాంక్షులను చేయుదురు.

16. గయ ఋషి క్రాంత ప్రజ్ఞుడు. బహుస్తుతిసంపన్నుడు. యజ్ఞజ్ఞాత. ధనేచ్ఛుకుడు. విప్రుడు. అతడు ధనమును ఆశించి ఈ విధముగా ఉక్థములు, స్తోత్రములచే దేవతలను స్తుతించినాడు.

17. దేవతలారా! అదితీ! జ్ఞాని ప్లతి పుత్రుడు గయుడు ఈ విధముగా మిమ్ము వర్ధిల్ల చేసినాడు. దేవతల ప్రసన్నతయే మనుషుల పాలన గయుడు దేవతలను స్తుతించినాడు.

## అరువది అయిదవ సూక్తము

ఋషి - వసుక్రపుత్ర వసుకర్ణుడు. దేవత - వివేదేవతలు.

ఛందస్సు - జగతి 15 త్రిష్టుప్.

1. అగ్ని, ఇంద్రుడు, వరుణుడు, మిత్రుడు, ఆర్యమ, వాయువు, పూష, సరస్వతి, ఆదిత్యగణములు, విష్ణువు, మరుత్తులు, మహి, స్వర్గము, సోమము, రుద్రుడు, అదితి, బ్రహ్మణస్పతులు కలసి తమ మహిమచే అంతరిక్షమును నింపుదురు.

2. ఇంద్రుడు, అగ్ని శిష్టులను రక్షింతురు. యుద్ధములందు కలసి తమ శక్తితో శత్రువును పారద్రోలుదురు. విశాల ఆకాశమును తమ తేజస్సుతో నింపుదురు ఘృతయుక్త సోమరసము వారి బలమును పెంచును.

3. మహత్తమ, అవిచల, యజ్ఞవర్ధక దేవతలను నేను కానున్న యజ్ఞమున స్తుతింతును. మేఘముల నుండి జలము కురిపించు దేవతలు మాకు మిత్రులు కావలెను. వారు మాకు దానములను ఇవ్వలెను. మమ్ము శ్రేష్ఠులను చేయవలెను.

4. ఈ దేవతలు తమ శక్తులతో అందరినేత సూర్యుని, ఆకాశమునందలి గ్రహ నక్షత్రాదులను, ద్యులోక భూలోక, భూలోక పృథ్వులను తమతమ స్థానములందు స్థాపించినారు. ధనదాతల వలె ఉత్తమ దానములు ఇచ్చెదరు. మానవులను శ్రేష్ఠులను చేయుదురు. వారు ధనము లిత్తురు. అందుకే స్తుతించ బడుదురు.

5. మిత్రుడు, దాతయగు వరుణునకు హోమద్రవ్యములు సమర్పించండి. వీరు రాజాధిరాజులు. వీరు ఆవాసహీనులు కాజాలరు. వారి బృహత్ శరీరములు తేజోవంతములై ప్రకాశించును. వీరి వద్ద ద్యావాపృథ్వులు యాచకులవలె నిలుతురు.

6. ఒక గోవు స్వయముగా పవిత్రస్థానమగు యజ్ఞమునకు వచ్చును. అది పాలిచ్చి యజ్ఞ కర్మమును సుసంపన్నము చేయును. ఆ గోవు దాతవరుణుడు, మరియు ఇతర దేవతలకు హోమద్రవ్యములు సమర్పించ వలెను. దేవ

సేవకుడనగు నన్ను రక్షించవలెను.

7. ఏ దేవతలు తమ తేజమున ఆకాశము నింపుదురో ఎవరి జిహ్వ అగ్నియగునో, ఎవరు యజ్ఞమును వృద్ధి చేయుదురో వారు యజ్ఞమున తమతమ స్థానములు తెలిసి ఆసీనులగుదురు. వారు ఆకసమున నిలుతురు. తమ బలమున జలమును వెలికి తీసెదరు. యజనీయ హవిని తమ దేహములందు ధరింతురు.

8. ద్యావా పృథ్వులు సర్వవ్యాపకములు. అవి అందరి తల్లిదండ్రులు. అన్నింటి కన్న ముందు పుట్టినవి. రెండు ఒకే స్థానమున ఉన్నవి. యజ్ఞ స్థానమున నివసించునవి. రెండును ఏకమనస్కులై పూజనీయ వరుణునకు ఘృతయుక్త దుగ్ధములు అందించును.

9. మేఘము, వాయువు, కోరికలు తీర్చువారు. బలవంతులు ఇంద్ర, వాయు, వరుణ, మిత్ర, అదితిపుత్ర దేవతలను అదితిని ఆహ్వానించు చున్నాము. భూలోక, ద్యులోక, జలమందు ఉద్భవించిన దేవతలను ఆహ్వానించుచున్నాము.

10. ఋభువులారా! మీకు శుభములు కలుగుటకు దేవతలను ఆహ్వానించు త్వష్ట వద్దకును, వాయువు వద్దకును, బృహస్పతి వద్దకును, జ్ఞాని, వృత్రఘ్నుడగు ఇంద్రుని వద్దకును, చేరునదియు ఇంద్రుని సంతుష్టపరచు సోమమును మేము ధనము యాచించుచున్నాము.

11. దేవతలు అన్నమును, గోవులను, అశ్వములను, వృక్షములను, లతలను, పర్వతములను పృథ్విని సృష్టించినారు. ఆకాశమున సూర్యుని నిలిపినారు. వారి దానము ఎంతో శోభస్కరము. వారు భూమి మీద మహామహా కార్యములు చేసినారు.

12. అశ్వినులారా! మీరు 'భుజ్యు' ని ఆపదలనుండి రక్షించినారు. 'విధ్రమతి' అనుస్త్రీకి పింగళవర్ణ పుత్రుని ఇచ్చినారు. 'విమదు' నకు అందమైన భార్యను ఇచ్చినారు. 'విశ్వక' ఋషికి 'విష్ణప్వ' దనుపుత్రుని ప్రసాదించినారు.

13. ఆయుధవంత, మధుర మాధ్యమికి వాక్కును, ఆకాశమును వహించు అజేక పాత్రుడును, సింధుఉ, ఆకాశజలము, విశ్వదేవతలకు వారి కర్మములు జ్ఞానముతో కూడిన సర్సవతియు నా వచనములను వినవలెను.

14. ఇంద్రాది దేవతలు అనేక కర్మ, జ్ఞానయుక్తులు మానవ యజ్ఞములందు యజనీయులు అమరుల సత్యజ్ఞాతలు. హవి గ్రాహకులు. యజ్ఞములందు కలసికొనువారు. సర్వజ్ఞాతలు. వారు మాస్తుతులను, ఉత్తమరీతిన సమర్పించిన అన్నమును స్వీకరించవలెను.

15. వసిష్ఠవంశమున పుట్టిన ఈ ఋషి అమరదేవతలను స్తుతించినాడు. సకల భువనములందున్న దేవతలు మాకు కీర్తి కర అన్నమును ప్రసాదించవలెను. దేవతలారా! మాకు శుభములు కలిగించండి. రక్షించండి.

## అరువది ఆరవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్.

1. ఏ దేవతలు విశేష అన్నవంతులో, ఆదిత్యతేజో కర్తలో, ప్రకృష్ట జ్ఞానులో, సర్వధనులో, ఇంద్రవంతులో, అమరులో యజ్ఞమువలన ప్రవృద్ధులో వారిని నిర్విఘ్నయజ్ఞ సమాప్తికని ఆహ్వానించుచున్నాను.

2. మరుత్తులు ఇంద్రునిద్వారా కార్యములకు పంపబడువారు. వరుణునిద్వారా ఆమోదించబడినవారు. జ్యోతిర్మయ సూర్యుని మార్గమును పూర్తి చేసినవారు. శత్రుసంహారకులు. వారి స్తోత్రములను మేము మననము చేయుదుము. విప్రులారా ! మరుత్తుల యజ్ఞము ఏర్పరచండి.

3. పశువుల సహితుడైన ఇంద్రుడు మమ్ము రక్షించవలెను. ఆదిత్యుల సహితముగా అదితి మాకు సుఖములు కలిగించవలెను. రుద్రపుత్ర మరుత్తుల సహితుడై రుద్రుడు మమ్ము సుఖవంతులను చేయవలెను. పత్నీసత త్వష్ట మా సుఖములు పెంచవలెను.

4. అదితి, ద్యావాపృథ్వులు, మహాసత్య అగ్ని, ఇంద్ర, విష్ణు, మరుత్, విశాల, స్వర్గస ఆదిత్యగణ, సుగణ, రుద్రగణ, ఉత్తమదాత సూర్యులను ఆహ్వానించుచున్నాము. వారు మమ్ము రక్షించవలెను.

5. జ్ఞాన సముద్రుడు, కర్మనిష్ఠవరుణుడు, పూష, మహిమాన్విత విష్ణువు, అశ్వినులు స్తోతలకు అన్నము పెట్టువారు, జ్ఞానులు, పాపవినాశకులు, అమరులగు - దేవతలు మాకు మూడంతస్తుల ఇల్లు ప్రదానము చేయవలెను.

6. యజ్ఞము మాకు అభిమత ఫలములు ప్రసాదించవలెను. యజ్ఞ దేవతలు మా కోరికలు తీర్చవలెను. దేవతలు, హవి ఏర్పరచువారు, యజ్ఞాధిష్ఠాత్రి ద్యావాపృథ్వులు, పర్జన్యుడు స్తోత, వీరందరు మా కోరికలు తీర్చవలెను.

7. అన్నము కొరకని అభీష్టప్రదాతలగు అగ్నిని సోమమును స్తుతిస్తాను. సకలలోకము దాతలని వారిని ప్రశంసించును. వారిద్దరినే యజ్ఞమందు పురోహితులు పూజింతురు. వారు మాకు మూడంతస్తుల ఇల్లు ప్రసాదించవలెను.

8. కర్తవ్యపాలన తత్పరులు, బలశాలురు, యజ్ఞములందు అలంకృతులు. మహా దీప్తిమంతులు, యజ్ఞములకు విచ్చేయువారు, అగ్ని చేత ఆహూతులు, సత్యపాత్రులగు దేవతలే వృత్రవధసమయమున వర్షజలము ఏర్పరచినారు.

9. దేవతలు తమ ప్రయత్నమున ద్యావాపృథ్వులను, జలములను, వనస్పతులను, యజ్ఞోపయోగ ఉత్తమ పదార్థములను ఏర్పరచినారు. తమ తేజమున ఆకాశమును, స్వర్గమును వెలిగించినారు. వారు యజ్ఞముతో తమను

జోడించినారు. యజ్ఞమును అలంకరించినారు.

10. ఋభువుల హస్తకౌశల్యము సుందరము - వారు ఆకాశమును ఆశ్రయించినారు. వాయువు, మేఘముల ధ్వని మహత్తరము. జలములు, వనస్పతులు మా స్తోత్రములను పెంపొందించవలెను. ధనదాత భగుడు, ఆర్యమ మా యజ్ఞమునకు విచ్చేయవలెను.

11. సముద్రములు, నదులు, ధూళిమయ పృథ్వి, ఆకాశము, అజేకపాత్, గర్జనశీల మేఘము, ఆహిర్భబుధ్నన నా ఆహ్వానములు వినవలెను.

12. దేవతలారా ! మేము మనువు బిడ్డలము. మేము మీ యజ్ఞము చేయగలుగవలెను ప్రచలితమగు మా యజ్ఞమును చక్కగా సమాప్తము చేయండి. ఆదిత్యులారా! రుద్రులారా! వసువులారా! మీ దానశక్తి అత్యంత శోభాయుతము. మీరు మా స్తోత్రములు వినండి.

13. అగ్ని, ఆదిత్యులు ఇద్దరు దేవతలను ఆహ్వానించువారు. సర్వశ్రేష్ఠ పురోహితులు. వారికి హవిచ్చి సేవింతును. నేను నిర్విఘ్న యజ్ఞమార్గమున సాగుచున్నాను - ఋతస్య పన్థామన్వేమి సాధమా. మా వద్దనున్న క్షేత్రపతి అసుర దేవతలను మాకు ఆశ్రయము ప్రసాదించమని ప్రార్థించుచున్నాము. మా ప్రార్థన మన్నించుటకు వారు సావధానులై ఉందురు.

14. వసిష్ఠసములైన వసిష్ఠవంశజులు స్తుతించినారు. వారు తమకు శుభములు కలుగుటకుగాను వసిష్ఠ ఋషివలె దేవతలను పూజించినారు. దేవతలారా! మిత్రులవలె విచ్చేయండి. సంతుష్టమనస్కులు కండి. అభీష్టఫలములు ఇవ్వండి.

15. వశిష్ఠవంశమున పుట్టిన ఈ ఋషి అమర దేవతలను స్తుతించినాడు. సకల భువనములందున్న దేవతలు మాకు కీర్తి కర అన్నమును ప్రసాదించవలెను. దేవతలారా! మాకు శుభములు కలిగించండి. రక్షించండి.

## అరువది ఏడవ సూక్తము

ఋషి - అంగిరస ఆయాస్యుడు. దేవత - బృహస్పతి. ఛందస్సు - త్రిష్టుప్.

1. మా పితరులు అంగిరులు ఏడు ఛందస్సుల బృహత్ స్తోత్రములు రచించినారు. అవి సత్యమునుండి ఉత్పన్నములు. ఆయాస్య ఋషిలోక హితము కోరువాడు. అతడు ఇంద్రుని ప్రశంసించినాడు. ఉక్థములు రచించినాడు.

2. అంగిరులు యజ్ఞపు సుందర స్థానమునకు తప్పక చేరుదురు. వారు సత్యవాక్కులు, సరళస్వభావులు,

స్వర్గపుత్రులు మహాబలశాలురు. విప్రులవలె ఆచరించువారు.

3. బృహస్పతి సహాయకులు హంసలవలె కలకలము ప్రారంభించినారు. వారి సాయమున బృహస్పతి రాతిద్వారమును తెరిచినాడు. అప్పుడు లోన బంధించిన గోవులు అంబారావములు చేసినవి. అంతట బృహస్పత్యాదులు ఉత్తమ స్తోత్రములను ఉచ్చైస్వరమున ఉచ్చరించినారు.

4. క్రింద ఒక ద్వారము, పైన రెండు ద్వారములున్న చీకటి గుహలో గోవులను దాచినారు. బృహస్పతి అంధకార మధ్యమున ప్రకాశము కలిగించ దలచినాడు. మూడు ద్వారములు తెరచినాడు. ఆవులను వెలుపలికి తెచ్చినాడు.

5. రాత్రి చప్పుడు కాకుండ పడుకొని నగరపు వెనుక భాగమును కూల్చినాడు. సముద్రమువంటి ఆ గుహయొక్క మూడు ద్వారములను తెరచినాడు. ఉదయమైనంత సూర్యుని, గోవులను ఒకేసారి చూచినాడు. అప్పుడు గోవులు మేఘగర్జన వంటి ధ్వనులు చేసినవి.

6. గోవులను నిలిపి ఉంచిన బలమును బృహస్పతి ఆయుధముచే హుంకారముననే చెదరగొట్టినాడు. మరుత్తులను కలిసికొనదలచిన ఇంద్రుడు వారి పాపములను పిడిపించినాడు - గోవులను విడిపించినాడు.

7. సత్యవాదులు, దీప్తిమంతులు, ధనదాతలగు వారి సాయమున అతడు ఆవులను కట్టిపెట్టిన వారి బలమును అణచివేసినాడు. వర్షక, జలదాత, ప్రదీప్తగమన మరుత్తుల సహితుడైన సామస్తోత్రాధిపతి గోధనముపై అధికారము సాధించినాడు.

8. మరుత్తులు సత్యచిత్తులై తమ ప్రయత్నమున గోవులను సాధించియు, బృహస్పతిని గోపతిని చేయదలచినారు. పరస్పర సహాయమున మరుత్తులతో కలిసిన బృహస్పతి గోవులను వెలికి తీసినాడు.

9. బృహస్పతి అంతరిక్షమున సింహమువలె గర్జించువాడు. కోరికలు తీర్చువాడు. విడయుడు. మేము రుత్తులము అతనిని వర్ధిల్లచేయ దలచినాము. వీర, శూరుల యుద్ధమున మంగళమయ స్తుతులతో అతనిని స్తుతిస్తాము.

10. బృహస్పతి నానారూప అన్నములు కలవాడైనపుడు అంతరిక్షమునకు ఆరోహించునపుడు సకల దిశలందు వెలుగులు చిమ్ము దేవతలు అతనిని నోటితో స్తుతింతురు.

11. దేవతలారా ! అన్నలాభము కొరకు నేను చేయు స్తుతులను సార్థకము చేయండి. మీ ఆశ్రయము కలిగించి నన్ను రక్షించండి. నా శత్రువులు నశించవలెను. లోకములను సంతోష పరచు ద్యావా పృథ్వులు మా విన్నపము వినవలెను.

12. ప్రభువును, మహిమాన్వితుడునగు బృహస్పతి జలగర్భ మేఘముల తలనరికినాడు "మూర్ధ్నాన భినదర్బదస్య" జలములను నిలిపి పెట్టిన శత్రువును హతమార్చినాడు గంగమున్నగు నదులను సముద్రమున కంపినాడు. ద్యావాపృథ్వులు, దేవతల సహితలై మమ్ము రక్షించవలెను.

### అరువది ఎనిమిదవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్.

1. రైతు పంటపొలము కాపాడుటకు పక్షులను పారద్రోలుటకు చేయుధ్వనివలెను- మేఘగర్జనవలెను- మేఘము పర్వతమును తాకినప్పటి శబ్దతరంగముల వలెను బృహస్పతి ప్రశంసాధ్వని వినిపించుచున్నది.

2. బృహస్పతి అంగిరుల పుత్రుడు. అతడు గుహయందున్న గోవుల వద్దకు సూర్యకాంతిని తెచ్చినాడు. భగునివలె అతని తేజస్సు వ్యాపించినది. దంపతులను కలిపినట్లు అతడు గోవులను మానవులతో కలిపినాడు. బృహస్పతీ! యుద్ధములందు అశ్వములను వలె గోవులను ఉరికించుము.

3. గరిశనుంచి ధాన్యము బయటికి తీసినట్లు బృహస్పతి పర్వతగుహనుండి గోవులను బయటికి తెచ్చినాడు. గవులు శుభప్రదదుగ్ధములిచ్చునవి. సతత గమనశీలలు. సహృదయణీయులు మనోహర వర్ణనలు, ప్రశంసనీయ మూర్తులు.

4. బృహస్పతి గోవులను ఉద్ధరించి సత్కర్మకు ఆధారస్థానమగు యజ్ఞానుష్ఠానమును సుగమము చేసినాడు. అప్పుడు బృహస్పతి సూర్యుడు ఆకసమునుండి ఉల్కవిసిరినంతగా వెలిగినాడు. అతడు రాతిమూతను తొలగించినాడు. గోవులను విడిపించినాడు. అతడు గోవులగిట్టలతో భూమిని మేఘము వర్షముచే వలె విచీర్ణము చేయించినాడు.

5. వాయువు నీటిమీది నాచును తొలగించినట్లు బృహస్పతి ఆకాశము నుండి అంధకారమును తొలగించినాడు. వాయువు మేఘములను వ్యాపింపచేసినట్లు బృహస్పతి తన ఆలోచనలతో బలాసురుని రహస్యస్థావరము నుండి గోవులను వెల్లడి చేసినాడు.

6. హింసకుడగు బలుని అస్త్రమును బృహస్పతి యొక్క అగ్నితుల్యమై ఆర్పరాని అస్త్రము త్రుంచివేసినపుడు బృహస్పతి గోవుల మీది ఆధిపత్యము సాధించినాడు. నోటిలోనికి పోయిన పదార్థము దంతముల మధ్యనలిగి, నాలుకకురుచి కలిగించును. అట్లే గోవులను అపహరించిన ప్రాణులకు బృహస్పతి జనులకు ఆవుపాల రుచి చూపినాడు.

7. గుహనుండి గోవుల శబ్దములు వినిపించినపుడే బృహస్పతి అందు గోవులు ఉన్నవని గ్రహించినాడు. పిట్ట గ్రుడ్డును పొదిగి పిల్లను తీసినట్లు - బృహస్పతి గోవులను గుట్టనుంచి బయటికి తెచ్చినాడు.

8. కొద్ది నీటిలో కలవరపడు చేపలు కనిపించును. అట్లే బృహస్పతికి పర్వతమున బంధించిన మధుర గోవులు కనిపించినవి. చెట్టునుంచి సోమపాత్రనువలె బృహస్పతి గోవులను గుట్టనుండి బయటికి తెచ్చినాడు.

9. గోవులను చూచుటకు బృహస్పతి ఉషస్సును ఆవిష్కరించినాడు సూర్యాగ్నుల ఉత్తమ తేజమున అంధకారములను నష్టపరచినాడు. ఎముకనుండి ములుగును తీసినట్లు బృహస్పతి బలాసురుని పర్వత బంధము నుండి గోవులను వెలికి తీసినాడు.

10. హిమము పద్మపత్రములను హరించిన పగిది బృహస్పతి బలుని ఆవులను అన్నింటిని హరించినాడు. ఇది అననుకరణీయము. ఈ కార్యము సూర్యచంద్రులు ఉదయించి నంతటిది.

(సూర్యచంద్రులు ఒకేసారి ఉదయించు నంతటి అసాధ్యాకార్యమది. అందువలననే అనుకరింపరానిది.)

11. నల్లని గుఱ్ఱమును బంగారు నగలచే అలంకరించినట్లు పాలకులగు దేవతలు నల్లని ఆకసమును తెల్లని నక్షత్రములచే అలంకరించినారు. వారు చీకట్లను రాత్రి కొరకు, వెలుగులను పగటి కొరకు ఏర్పరచినారు. బృహస్పతి పర్వతములను బ్రద్దలు చేసి గోవులను సాధించినాడు.

12. బృహస్పతి అనేక ఋక్కులు పలికినాడు. అంతరిక్షవాసి అయినాడు, అతనికి నమస్కరించు చున్నాము. బృహస్పతి మాకు గోవులు, అశ్వములు, సంతానము, భృత్యులను ప్రసాదించవలెను.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత ఎనిమిదవ అష్టకము పదవ మండలమున అయిదవ అనువాకము సమాప్తము)*

**ఆరవ అనువాకము అరువది తొమ్మిదవ సూక్తము**

ఋషి - బధ్న్య శ్వపుత్ర సుమిత్రుడు. దేవత - అగ్ని. ఛందస్సు - 1-2, జగతి మిగిలినవి త్రిష్టుప్.

1. బధ్న్యశ్వుడు స్థాపించిన అగ్ని దర్శనీయము కావలెను. అతని ప్రసన్నత శుభప్రదము కావలెను. అతని యజ్ఞాగమనము శోభస్కరము కావలెను. మేము - సుమిత్రులము - అగ్నిని స్థాపింతుము. అప్పుడు అగ్ని ఘృతాహుతులు గ్రహించును. ఉద్దీప్తుడగును. మేము అట్టి అగ్నిని స్తుతింతుము.

2. బధ్న్యశ్వుని అగ్ని ఘృతము వలననే వర్ధిల్లినది. ఘృతమే అగ్నికి ఆహారమగును. అదియే అతనికి పుష్టి అగును. ఘృతాహుతులు అందుకున్న అగ్ని ఎంతో విస్తరించును. ఘృతము సమర్పించినంత అగ్ని సూర్యునివలె

ప్రదీప్తుడగును.

3. అగ్నీ ! మనువు నీ కిరణములను ప్రదీప్తము చేసినాడు. అట్లే నేను సహితము నిన్ను నూతన కిరణపుంజములచే ప్రదీప్తుని చేయుదును. నీవు ధనికుడవగుము. ప్రదీప్తుడవగుము. మా స్తుతులను స్వీకరింపుము. శత్రు సేనను చెదరగొట్టుము. ఇచ్చట అన్నము కలిగింపుము.

4. బధ్న్యశ్వుడు తొలుత నిన్ను ప్రదీప్తుని చేసినాడు. నీవు మా దేహమును, గేహమును రక్షింపుము. నీవు మాకు ప్రసాదించిన వాటి నన్నింటిని రక్షించుము.

5. బధ్న్యశ్వుని అగ్ని ప్రజ్వరిల్లవలెను. అగ్నీ ! రక్షింపుము. జనులను హింసించువారు నిన్ను ఓడించరాదు. వీరుని వలె శత్రువును ఎదిరించుము. నాశము చేయుము. బధ్న్యశ్వుని అగ్ని నామములను సుమిత్రుడను జపింతును.

6. అగ్నీ ! పర్వతముల మీద పెరుగు ధనమును నీవు దస్యులనుండి గెలిచినావు. ఆర్యులకు ఇచ్చినావు. దుర్ధర్ష వీరుని వలె శత్రువును కొట్టుము. యుద్ధము చేయ వచ్చిన వారితో తల పడుము.

7. ఈ అగ్ని సుదీర్ఘవిస్తృతము. ఇతడు ప్రధానదాత. సహస్ర స్థానములను ఆచ్ఛాదించువాడు. శత మార్గముల పయనించునాడు. ఇతడు ప్రదీప్తులకు పుత్రుడు. ప్రధాన పురోహితులు ఇతనిని అలంకరింతురు. అగ్ని దేవభక్తులగు సుమిత్రవంశీయుల గృహమున ప్రదీప్తుడగును.

8. జ్ఞాని అగ్నీ ! నీవు ఇచ్చిన గోవును సులభముగా పితుకవచ్చును. దానిని పితుకుటకు ఎత్తి విఘ్నము కలుగదు. అది అప్రమత్తమై అమృతమువంటి పాలనిచ్చును. దేవభక్త సుమంత్ర వంశమునందలి ప్రధానవ్యక్తి దక్షిణ సంపన్నుడై నిన్ను ప్రజ్వలితుని చేయును.

9. బధ్న్యశ్వుని అగ్నీ ! అమర దేవతలు నీ మహిమను గానము చేయుదురు. మానవులు నీ మహిమ తెలియుటకు సాగినారు. అప్పుడు నీవు అందరినేతలు, వర్ధిల్లు దేవతలతో కలసి కర్మ విఘ్నకరులను ఓడించినావు.

10. అగ్నీ ! తండ్రి కొడుకును వడిలోనికి తీసికొని ఎట్లు ఆలనపాలన చేయునో అట్లే నా తండ్రి నిన్ను సేవించినాడు. యువక అగ్నీ ! నీవు నా తండ్రినుంచి సమిధలు అందుకున్నావు. బాధించు శత్రువులను హతమార్చినావు.

11. సోమరసము సమర్పించు వారలతో కూడి బధ్న్యశ్వుని అగ్ని సర్వదా శత్రువులను ఓడించినాడు. అకార తేజముల అగ్నీ! నీవు పట్టు పట్టి హింసకులను దహించినావు. ఎక్కువ ఎదిగిన హింసకులను అగ్ని హతమార్చినాడు.

12. బధ్న్యశ్వ అగ్నీ! శత్రుహంతయగునతడు సదా ప్రజ్వలితుడు. నమస్కార యోగ్యుడు. బధ్న్యశ్వ అగ్నీ! సమస్త

విజాతీయ శత్రువులను విజాతీయ హింసకులను ఓడించుము.

### డెబ్బదవ సూక్తము

ఋషి - బధ్న్యశ్వ సుమిత్రుడు. దేవత - అగ్ని. ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్నీ! ఉత్తర వేది మీద సమిధ ఏర్పరచినాను. గ్రహించుము. ఘృతశాలి సృక్కును అభిలషించును. ఉన్నత ప్రదేశమున నిలుపుము. మంచిరోజుకని జరుగు యజ్ఞమున జ్వాలలతోపైకి ఎగయుము.

2. అగ్ని దేవతలకు అగ్రగామి. మానవులకు ప్రశంసనీయుడు. వివిధ వన్నెల గుర్రముల మీద ఈ యజ్ఞమునకు విచ్చేయవలెను. అగ్ని అత్యంతయోగ్యుడు. దేవతలందు ముఖ్యుడు అతడు హవిని అందుకొనవలెను.

3. యజమాని హవిర్దాత. అగ్ని సనాతనుడు. దూతకార్యమునకు అగ్నిని యజమాని స్తుతించును. అగ్ని రథములు, అశ్వములతో ఇంద్రాదులను తీసికొని యజ్ఞమునకు విచ్చేయ వలెను. హోతవగుము. ఈ యజ్ఞమున ఆసీనుడవగుము.

4. కుశలు దేవతలు సేవించునవి వంకరవి పొడుగైనవి మా కుశములు సురభిళములు కావలెను. ఒర్వి అగ్నీ! ప్రసన్న చిత్తుడవగుము. హవికోరువారు ఇంద్రాది దేవతలు వారిని పూజించుము.

5. ద్వాద దేవేరులారా! ఆకాశపు ఉన్నత స్థానమును అందుకొనండి, పృథ్వి అంతటి విశాలముగ విస్తరించండి. దేవాభిలాషులు కండి, మీ మహిమలతో దేవతలు అధిష్టించునదియు, విహారసాధనమగు రథమును సాధించండి.

6. ఉష ప్రకాశమాన, ద్యులోక పుత్రి, ఆమెయు రాత్రియు యజ్ఞస్థానమునకు వేంచేయవలెను. అభిలాషిణిలు శోభన ధనులగు దేవులారా! మీ స్థానము విస్తృతము. మసీపస్థము. హవిని కోరు దేవతలను ఆస్థానములందు ఆసీనులు కావలెను.

7. సోమాభిషవమునకు శిలలు కదిలినపుడు అగ్ని సమిద్ధుడైనపుడు హవిధారక యజ్ఞపాత్రను యజ్ఞస్థానమునకు తెచ్చినపుడు పురోహిత, ఋత్విక, విద్వాంసులారా! మీరు ఈ యజ్ఞమందు ధనము ఇవ్వండి "ద్రవిణమాయజోథామ్."

8. ముప్పురు దేవేరులారా! మీ కొరకు మేము కుశలు పరచినాము. ఈ ఉన్నత స్థానమును అధిష్టించండి. ఇళా! ప్రకాశమాన సరస్వతీ! దీప్తపదయుక్త భారతీ! మీరు మనువు యజ్ఞమున హవిని స్వీకరించినారు. మా యజ్ఞముునను హవిని సమర్పించినాము. అట్లే స్వీకరించండి.

9. త్వష్ట దేవా! నీకు మంగళమయరూపము లభించినది. నీవు అంగిరులకు మిత్రుడవగుము. నీవు సుందర

ధనవంతుడవు. హవిని కోరుము, దేవతల భాగము తెలిసికొనుము. వారికి హవిని అందించుము.

10. వనస్పతులచే చేయబడిన యూపకాష్ఠమా! నీవు విద్వాంసుడవు. త్రాళ్లచే కట్టబడుము. దేవతలకు అన్నము అందించుము. వనస్పతి దేవా ! హవి రుచిచూడుము. మేము ఇచ్చిన హవిని దేవతలకు అందించుము. ద్యావా పృథ్వులు మా ఆహ్వానములు రక్షించవలెను.

11. అగ్నీ ! మా యజ్ఞము కొరకు ద్యులోకము, అంతరిక్షము నుండి ఇంద్రుని, వరుణుని, మిత్రని తీసికొనిరమ్ము. యజనీయ దేవతలందురు కుశలపై కూర్చుండవలెను. అమర దేవతలు స్వాహా, శబ్దమునకు ఆనందించవలెను.

## డెబ్బది ఒకటవ సూక్తము

ఋషి - అంగిరస బృహస్పతి. దేవత - బృహదేవత. ఛందస్సు - త్రిష్టుప్ 9 జగతి.

1.బాలకుడు ముద్దుమాటలతో పదార్థములకు ముద్దు పేర్లు పలుకును. ఇది వారి భాషాజ్ఞానపు తొలిమెట్టు, వారి ఉత్కృష్టము, నిర్దోషమగు జ్ఞానము దాగి ఉండును. అది సరస్వతి దయవలన ప్రకటితమగును.

2. జల్లెడతో పిండిని జల్లించినట్లు బుద్ధిమంతులు తమ బుద్ధిబలమున భాషను సంస్కరించి అందింతురు. అప్పుడు విద్వాంసులు తమ అభ్యుదయమును దృష్టియందుంచు కొందురు. వారి వాక్కునందు మంగళమయ లక్ష్మి నివసించును. "లక్ష్మీర్నిహితాధివాచి."

3. బుద్ధిమంతులకు యజ్ఞద్వారమున వాక్కు భాష లభించును. ఋషుల అంతఃకరణవాక్కు వారికి లభించినది. ఆ వాక్కుతోనే వారు జనులను చదివించినారు. సప్తఛందములు ఈ వాక్కునందే స్తుతించును.

4. కొందరికి అనుకున్నను వాక్కు అర్థముకాదు. కొందరికి విన్నను వాక్కు వినిపించదు. సంభోగాభిలాషగల భార్య మంచి దుస్తులు ధరించి భర్తకు తనను ప్రకటించినరీతి కొందరికి వాగ్దేవి స్వయముగా వ్యక్తమగును.

5. విద్వన్మండలిలో కొందరకు 'భావగ్రాహి' అను పేరుగలుగును. అట్టివారు లేకున్న ఎట్టి పనియు జరుగదు. వేదార్థజ్ఞానము కలుగదు. కొందరు రసహీన వాక్యమును అభ్యసింతురు. వారు యదార్థధేనువులుకారు. కాల్పనిక మాయామయ ధేనువులు! "అధేన్వాబరతి మాయమా."

6. మిత్రుని వదిలిన విద్వాంసుని వాణికి ఫలితం సత్కర్మ మార్గమును తెలియ జాలడు "నహిప్రవేద సుకృత స్యపన్థామ్."

7. కాంచగలవాడును, వినగలవాడును మనోభావములు ఎరిగి ప్రకటించుటలో అసాధారుణులగుదురు. అందరు

అట్టివారు కారు. కొందరు పుక్కిటికి తాగు నీరు వంటివారు. కొందరు నడుములోతు నీరుగలతటాకము వంటివారు. మరి కొందరు స్నానము చేయగల హ్రదము వంటివారు.

8. ఒకప్పుడు సమానజ్ఞానములు గల బ్రాహ్మణుల సమావేశము జరుగును. అప్పుడు వారు వేదార్థముల గుణదోష విశ్లేషణ చేయుదురు. వారిలో కొందరికి జ్ఞానమే ఉండదు. కొందరు స్తోత్రజ్ఞులై వేదార్థ జ్ఞాతలై విరాజిల్లుదురు.

9. ఇహమున వేదజ్ఞ బ్రాహ్మణులతోను, పరలోకమందలి దేవతలతోను కర్మ నిర్వహించ నట్టివాడును, స్తోత్రజ్ఞుడు కానివాడును, సోమయజ్ఞము చేయనివాడును పాపాత్మకమగు ఐహిక భాషనేర్చును. మూర్ఖుడగును. నాగలి పట్టువాడగును.

10. కీర్తి మిత్రునివలె పనిచేయును. ఇది సభలందు ప్రాముఖ్యత కలిగించును. కీర్తివలననే చెడు పేరు తొలగి పోవును. కీర్తి లభించినవాడు ప్రసన్నుడగును. కీర్తివలన అన్నము లభించును. బలము కలుగును. ఎన్నో ఉపకారములు సమకూరును.

11. ఒకడు అనేక ఋక్కులు వచించుచు యజ్ఞానుష్ఠానమున సహాయపడును. ఒకడు గాయత్రి ఛందమున సామగానము చేయును. బ్రహ్మయను పురోహితుడు జ్ఞానవిద్యను వ్యాఖ్యానించును. అధ్వర్యుడు యజ్ఞపు వివిధకార్యములు చేయును.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత పదవ మండలము ఎనిమిదవ అష్టకమున రెండవ అధ్యాయము సమాప్తము.)*

**ఓం నతామినన్తిమాయివో నధీరావ్రతాదేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదసీ అద్రుహోవేద్యా భిర్నపర్వతానివమే స్థివాంసః**

**మూడవ అధ్యాయము          డెబ్బది రెండవ సూక్తము**

ఋషి - దేవదేవలోకమునుడు లేక బృహస్పతి. దేవత - జ్ఞానము. ఛందస్సు - అనుష్టుప్.

***ఓం దేవానాంమ వయంజానా ప్రవోచామ విపన్యయా |***
***ఉక్థేషుశస్య మానేషుయః పశ్యదుత్త రేయుగే ||***

1. మేము దేవతల - ఆదిత్యుల - జన్మమును స్పష్టముగా చెప్పగలము. రానున్నయుగమున దేవసంఘము - యజ్ఞానుష్ఠానము పిదపనే స్తోతను చూడగలడు.

2. సృష్టి ఆదిన బ్రహ్మణస్పతి - కర్మకారునివలె - దేవతలను సృష్టించినాడు. ఆసత్ నుండి సత్ ఉత్పన్నమైనది.

3. దేవతల సృష్టికన్న ముందే అసత్ నుండి సత్ ఉత్పన్నమైనది. తదుపరి దిశలు దిశలనుండి వృక్షములు ఉత్పన్నమైనవి.

4. వృక్షముల నుండి పృథివి - పృథివినుంచి దిశలు కలిగినవి. అదితినుండి దక్షుడు, దక్షుని నుండి అదితి ఉత్పన్నులైనారు.

5. దక్షా ! నీ పుత్రిక అదితి దేవతలకు జన్మనిచ్చిన దేవతలు అమరులు స్తుత్యులు.

6. దేవతలు ఇచట జలములందుండి మహోత్సాహము ప్రకటించినారు. వారు నాట్యము చేసినంత పనిచేసినారు. అందువలన ధూళిలేచినది.

7. మేఘములవలె దేవతలు సకలలోకమును ఆవరించినారు. సూర్యుడు నిగూ
ముగ ఉండెను. దేవతలు సూర్యుని ప్రకాశింప చేసినారు.

8. అదితికి ఎనిమిది మంది పుత్రులు - మిత్ర, వరుణ, దాత, ఆర్యమ, అంశ, భగ, వివస్వత ఆదిత్యులు కలిగినారు. వారిలో ఏడుగురిని తీసికొని దేవలోకమునకు చేరినది. ఎనిమిదవ వాడగు సూర్యుని ఆకాశమున విడిచినది.

9. ఉత్తమ యుగమందు ఏడుగురు పుత్రులను తీసికొని అదితి వెళ్లిపోయినది. జనన మరణముల కొరకు సూర్యుని ఉంచినది.

## డెబ్బది మూడవ సూక్తము

ఋషి - శక్తిపుత్ర గేరివీతుడు. దేవత - మరుత్తులు - ఇంద్రుడు. ఛందస్సు - త్రిష్టుప్.

1. గర్భముదాల్చిన ఇంద్రమాత ఇంద్రుని కన్నపుడు మరుత్తులు మహానుభావుడగు ఇంద్రుని - నీవు బలశాలివి. శత్రువినాశమునకే జన్మించినావు. నీవు వీరుడవు. స్తుత్యుడవు, ఓజస్వివి, అభిమానివి అని స్తుతించినారు.

2. దోహక ఇంద్రుని వద్ద సేన నిలిచి ఉన్నది.అప్పుడు మరుత్తులు విశేషస్తోత్రములు చదివినారు. ఇంద్రుని వర్ధిల్ల చేసినారు. విశాల గోష్ఠము మధ్య ఆవులు ఆచ్ఛాదితములై ఉండును. ఆచ్ఛాదన వదలినంత బయటపడును. అట్లే వర్షజలము వ్యాపకా అంధకారము నుండి బయట పడినది.

3. ఇంద్రా! నీ పాదములు మహిమగలవి. నీవు నడచినపుడు ఋభువులు వర్ధిల్లుదురు. సకల దేవతలు వర్ధిల్లుదురు. నీవు సహస్రవృక్షములను నోట పట్టగలవు అశ్వినులను త్రిప్పగలవు "త్వమిన్ద్రసాలావృకాన్స హస్రమాంసంధిషే అశ్వినావృత్యాః."

4. ఇంద్రా! నీవు యుద్ధపు తొందరలో సహితము యజ్ఞములకు చేరుదువు. అప్పుడు నీవు అశ్వినులతో స్నేహము చేయుదువు. మా కొరకు నీవు వేల ధనములు తెచ్చెదవు. అశ్వినులు సహితము మాకు ధనము ఇచ్చెదరు.

5. యజ్ఞమందు ఇంద్రుడు ఆనందించును. మరుత్తులను కలసికొనును. యజమానికి ధనము ఇచ్చును ఇంద్రుడు యజమాని కొరకు దస్యుల మాయను నష్టపరచినాడు వర్షము కలిగించినాడు చీకట్లను చెదర గొట్టినాడు.

6. ఇంద్రుడు శత్రువులందరిని సమానముగనే నష్టపరచును. అతడు ఉష శకటమును నష్టపరచినట్లే శత్రువులను ధ్వంసము చేయును. దీప్తుడు, మహామహుడు, మరుత్తుల మిత్రుడగు ఇంద్రుడు వృత్రవధకు సాగినాడు అతడు శత్రువుల అందమగు దేహములను ధ్వంసము చేసినాడు.

7. ఇంద్రా! నీధనమును ఆశించిన నముచి నిహత మార్చినావు. విఘాతక అసురుడగు 'నముచి'ని మనువు ముందు మాయాశూన్యుని చేసినావు. దేవతలందు మానవులకు మార్గము ఏర్పరచినావు ఆ మార్గము దేవలోకము చేరుకొనుటకు సులభమైనది.

8. ఇంద్రా! నీవు ఈ లోకమును జలము, వెలుగులతో నింపినావు. నీవు ఎల్లరకు స్వామివి. చేత వజ్రము ధరించువాడవు సకల దేవతలు బలముగల నిన్ను స్తుతింతురు. నీవు మబ్బుల తలవంచినావు.

9. జలమధ్యమున ఇంద్రుని చక్రము ఉన్నది. అది ఇంద్రుని కొరకు మధువును భేదించవలెను. ఇంద్రా! నీవు తృణలతాదులందు పాలను, నీటిని నిలిపినావు అవి గోస్తనమునుంచి ఎంతో చక్కగా వెడలును.

10. కొందరు ఇంద్రుడు అశ్వమందు, ఆదిత్యునియందు జన్మించినాడు అందురు. కాని ఇంద్రుడు జలములందు జన్మించినాడు నాకు తెలియును. ఇంద్రుడు కోపమునుండి పుట్టినాడు. శత్రువుల మేడలు ఎక్కినాడు. ఇంద్రుడు పుట్టిన చోటు ఇంద్రుడే ఎరుగును "యతః ప్రజజ్ఞ ఇంద్రో అస్యవేద."

11. గమనశీలలై చక్కగాపడు సూర్యకిరణములు ఇంద్రుని వద్దకు పోయినవి. అప్పుడు పక్షిరూపముగల యజ్ఞాభిలాషి ఋషి ఇట్లు ప్రార్థించినాడు:-

ఇంద్రా! చీకట్లను తొలగింపుము. కంటిని వెలుగుచే నింపుము. మేము పాశబద్ధులము. మమ్ము విడిపించుము. "చక్షుర్ముముగ్ధ్య స్మాన్నధియే బద్ధాన్."

## డెబ్బది నాలుగవ సూక్తము

ఋష్యాద్యాః పూర్వవత్

1. ధనదానమునకుగాను ఇంద్రుడు యజ్ఞము వలన ఆకర్షించబడును. అతనిని దేవతలు, మానవులు ఆకర్షింతురు. యుద్ధమందు ధనమునార్జించు అశ్వములు ఆకర్షించును. శత్రుసంహారము చేయగల యశస్వులు ఇంద్రుని ఆకర్షింతురు.

2. అంగిరుల ఆహ్వానవాదములు ఆకసమందంతట నిండినవి ఇంద్రుని అభిలషించువారును, అన్నము కోరువారలగు దేవతలు అనుష్ఠాతలకు గోవును చూపదలచినారు భూమిని ఏర్పరచినారు. భూమి మీద గోవులను అపహరించిన పణులను చూచినారు. తమ హితము కోరి ఆకాశమున ఆదిత్యసమమగు తమ వెలుగును పరచినారు.

3. వీరు అమరదేవులు. వీరి స్తుతి సాగుచున్నది. వారు యజ్ఞమందు నానా ఉత్తమోత్తమ ధనములను ప్రదానము చేయుదురు. వారు స్తుతులకు యజ్ఞములకు సిద్ధికలిగించవలెను. అసాధారణ ధనము ప్రసాదించవలెను.

4. ఇంద్రా! శత్రువుల గోధనము హరిమ్చదలచిన జనులు నిన్నే స్తుతింతురు. ఈ విశాల పృథ్వి ఒకేసారి పుట్టినది. కాని ఇది సంతానమును కలిగించుచునే ఉండును. ఇది సహస్రధారలుగ సంపన్నదుగ్ధములను ప్రదానము చేయును. ఈ పృథ్వియను గోవును పితుక దలచిన వారు సహితము ఇంద్రునే స్తుతింతురు.

5. ఇంద్రుడు ఎన్నటికి తలవంచనివాడు శత్రువులను దహించువాడు మహా ధనికుడు సుందరస్తుతి మంతుడు. మానవ హితమునకు వజ్రము ధరించువాడు కర్మనిష్ఠ పురోహితులారా! రక్షణ కొరకు ఇంద్రుని శరణుకోరండి.

6. శత్రుపుర విధ్వంసక ఇంద్రుడు ఎంతో ఎదిగిన శత్రువును సంహరించినాడు. అప్పుడు ఇంద్రుడు వృత్రఘ్నుడు అయినాడు. భూమి మీదకు నీటిని దింపినాడు. అంతట జనులు ఇంద్రుని బలశాలి యనియు క్షమాశీలుడని గ్రహించినారు. ఇంద్రుడు మన కోరికలను తీర్చగలవాడు.

## డెబ్బది అయిదవ సూక్తము

ఋషి - ప్రియమేధ పుత్ర పింధుక్షితుడు. దేవత - నది. ఛందస్సు - జగతి.

1. జలమా! సేవకుడగు యజమాని గృహమందు నీ మహిమను వివరిస్తుండును. నదులు ఏడు ఏడుగా ముప్విధములై భూమి, ఆకాశము, ద్యులోకము నుండి బయలుదేరినవి అన్నింటిని మించిన ప్రవాహముగలది సింధునది.

2. సింధూ! నీవు పంటభూములకు పారునపుడు వరుణుడు నీ కొరకు విశాల మార్గము ఏర్పరచినారు. నీవు భూమిమీద ఉత్తమ మార్గమున సాగుదువు. నీవు సకల జగమునకు అగ్రమవై విరాజిల్లుచున్నావు "ఏషామయం జగతా మిరజ్యసి."

3. నేలనుండి ఎగిసిన సింధునాదము ఆకాశమును కప్పి వేసినది. ఇది మహావేగవంతములు, దీప్తములగు తరంగములతో సాగును. సింధునది వృషభనాదము చేయుచు వచ్చునపుడు ఉరుములతో కూడిన వానవచ్చినట్లుండును.

4. తల్లి వద్దకు శిశువులు పాడియావు వద్దకు దూడలు వెళ్లినట్లు ధ్వనించుచు ఇతర నదులు సింధువద్దకు వెళ్లును. యుద్ధమునకేగు రాజు సేనతోవలె తన రెండు సహగామినీ నదులతో సింధునది పురోగమించును.

5. గంగా, యమున, సరస్వతి, శ్రతుద్రి, సత్లజ్, పురుష్ణి - రవి, అసిక్ని - చినాబ్, వీటితో సాగుమరువర్ధవన్ , వితస్త - ఝేలమ్, సుషోమ - సోహన్, ఆర్జికీయ - వ్యాసనదులారా ! మీరందరు ఈ స్తోత్రమును పరుగెత్తి పట్టుకొనండి వినండి.

6. సింధూ ! నీవు తొలుత 'తృష్టామ్' తో సాగినావు. తదుపరి 'సుసర్తు' 'రస' 'శ్వేత్య' లతో కలసినావు. నీవు 'క్రము' 'గోమతులను' 'కుభ' మేహత్ నదులతో కలుపుదువు. ఈ నదులతో కలసి నీవు సాగుదువు.

7. సింధునది సరళగామిని - శ్వేతవర్ణ - ప్రదీప్త - సింధునది పరుగుల నీరు నలువైపులకు సాగును. సింధు నదులందు వేగవంతమ్. ఇది ఆడ గుఱ్ఱము వంటి అద్భుతమైనది. సుందర యువతివలె దర్శనీయ.

8. సింధునది శోభన అశ్వము వంటిది. సుందర రథము వంటిది. శుభ్రవస్త్రము వంటిది. సువర్ణ ఆభరణము వంటిది. సుందర సజ్జ, అన్న, పశువంత్, సౌభాగ్యవతి సింధు మధువర్ధక పుష్పములచే ఆచ్ఛాదితము.

9. సింధువు అశ్వవంత, సుఖకర రథమును గెలుచును. ఆమె ఆరథమున అన్నము తేవలెను. యజ్ఞములందు సింధు రథపు మహిమ గానము చేయబడును. సింధురథము అహింసితము కీర్తికరము మహంతము.

### డెబ్బది ఆరవ సూక్తము

ఋషి - ఇరావత పుత్రుడు సర్పజాతివాడు జరత్కర్ణుడు. దేవత - సోమము.

ఛందస్సు - జగతి.

1. శిలలారా ! అన్నవంత ఉష వచ్చినంత నిన్ను వెల్లడింతును. నీవు ఇంద్ర, మరుత్తులు, ద్యావా పృథ్వులకు సోమము అందించుము. వారిని అనుకూలురును చేసికొనుము. ఈ ద్యావాపృథ్వులు ఏకముగా మనగృహములందు సేవలు అందు కొనవలెను గృహములందు ధనము నింపవలెను.

2. అభిషవశిల చేత పట్టినంత. అశ్వము వంటిదగును. ప్రస్తరమా ! నీవు శ్రేష్ఠసోమమును అందించుము శిలలచే సోమాభిషవము చేయు యజమాని శత్రువు ఓడించగల బలవంతుడగును. ఇది అశ్వములను ఇచ్చును. వాని వలన కావలసినంత ధనము లభించును.

3. ప్రాచీన కాలమున మను యజ్ఞమునకు సోమరసము విచ్చేసినది. అట్లే ఈ ప్రస్తరమున నిష్పిడిత సోమము జలమున ప్రవేశించ వలెను. గృహనిర్మాణములందు గోవులను - యజ్ఞకార్యములందు అశ్వములను స్నానము చేయించుటకు అవశ్విర సోమమును ఆశ్రయింతురు.

4. శిలలారా! రాక్షసులను నష్టపరచండి. నిబ్రుతిని దూరము చేయండి. దుర్బుద్ధిని తొలగించండి. సంతానయుక్త ధనము ప్రసాదించండి. దేవతలను ప్రసన్నులను చేయు శ్లోకములు సమార్జించండి. "దేవావ్యః శ్లోకమద్రయః"

5. శిలలు ఆకాశము కన్న తేజస్వులు 'సుధన్వ' పుత్రుడు 'విభ్వ' కన్న శీఘ్రకర్ములు. సోమాభిషవమున వాయువుకన్న వేగవంతములు. అగ్నిని మించిన అన్నదాతలు దేవతలను ప్రసన్నులను చేయుటకుగాను అట్టి శిలలను పూజించండి.

6. యశస్విశిలలు మా కొరకు అభిషుత సోమమును ఏర్పరచవలెను. అవి స్తోత్రసహిత ఉజ్వల వాక్యము ద్వారా ఉజ్వల సోమయాగమున మమ్ము నిలుపవలెను. నేతలగు ఋత్విక్కులు స్తోత్ర ధ్వనులు చేయుదురు. ఒకరిని మించి ఒకరు కమనీయ సోమరసము, సోమయజ్ఞమును మథింతురు.

7. కదలిన శిలలు సోమమును పిండును. అవి స్తుతులు కోరును. అగ్ని కొరకు సోమరసము సిద్ధము చేయును. అభిషవకారి ఋత్విక్కులు శేషసోమమును సేవింతురు. శుద్ధి చేయుదురు.

8. నేతలారా ! శిలలారా ! మీరు శోభన అభిషవ కర్తలు కండి. ఇంద్రుని కొరకు సోమాభిషవము చేయండి. దివ్యలోకము కొరకు అద్భుత సంపద సమకూర్చండి పార్థివ ధనమును యజమానికి ఇవ్వండి.

### డెబ్బది ఏడవ సూక్తము

ఋషి - భృగుగోత్ర స్యూమరశ్మేరుడు. దేవత - మరుత్తులు. ఛందస్సు - 5
జగతి మిగిలినవి త్రిష్టుప్.

1. మరుత్తులు స్తుతులకు ప్రసన్నులగుదురు. మబ్బువెడలిన వాన చినుకులవలె ధనము కురిపింతురు. హవియుక్త యజ్ఞమువలె జగముల ఉత్పత్తికి కారణభూతులు అగుదురు. మరుత్తుల మహాబలమును నేను పూజించలేను. శుభముల కొరకు సహితము నేను స్తుతించజాలను.

2. మరుత్తులు తొలుత మానవులు. తదుపరి వారి పుణ్యకర్మముల వలన దేవతలైనారు. సేనలన్ని కలసినను మరుత్తులను పరాభవించలేవు. మరుత్తులు ద్యులోకమువారు. మనకు కనిపించరు. వారి పరిధి పెరుగదు. అందువలన వారిని స్తుతించలేదు.

3. స్వర్గమందును పృథ్వియందును. మరుత్తులు స్వశక్తి మీద పెరిగినారు. సూర్యుడు మేఘమునుండి వెలువడువలె మరుత్తులు వెలువడుదురు. వారు వీరపురుషులవలె స్తోత్రాభిలాషులు శత్రుసంహారక శూరులవలె మరుత్తులు వెలుగొందుదురు.

4. మరుత్తులారా ! మీలో మీరు ఢీకొని వర్షము కలిగించినపుడు భూమి బెదరదు బలహీనపడును. మీకు హవి సమర్పించినాము అన్నవంతులవలె అందరు కలసిరండి.

5. రథమున కట్టిన అశ్వములవలె మీరు వేగవంతులు. ప్రభాతకాంతి వలె ప్రకాశింతురు శ్యేనమువలె శత్రువును తరుముదురు. స్వయముగా కీర్తిని ఆర్జించుకొందురు. బాటసారులవలె దిశలకు పయనింతురు వర్షము కురిపింతురు.

6. మరుత్తులారా ! బహుదూరము నుండి మీరు బోలెడు గుప్తధనము తెస్తారు. ధనమును అందుకున్న మీరు గుప్త రూపముననే ద్వేషించు శత్రువును దూరము చేయుదురు.

7. యజ్ఞసంపద కలిగి, యజ్ఞానుష్ఠానము చేసి మరుత్తులకు దానమిచ్చువానికి అన్నము, ధనము, జనము కలుగును వారు దేవతలతో కూడి సోమపానము చేయుదురు. "దేవానామపిహోపేథేఅస్తు."

8. మరుత్తులు సోమ యజ్ఞార్హులు వారు యజ్ఞమును రక్షించువారు. ఆకసమునుండి. ఆదిత్య జలవర్షము కురిపించువారు. వారు వేగరథమున విచ్చేయవలెను మా బుద్ధిని రక్షించవలెను యజ్ఞమున చేరి ఇష్టప్రకారము హవిని ఆరగించవలెను.

## డెబ్బది ఎనిమిదవ సూక్తము

పూర్వవత్ ఋషిదేవత. ఛందస్సు - త్రిష్టుప్ - జగతి.

1. స్తోత్రపరాయణులగు విప్రస్తోతవలె మరుత్తులు యజ్ఞమునందు ధ్యానమున్నవారు దేవతలను యజించు యజమాని కర్మమున నిమగ్నుడైనట్లు మరుత్తులు వృష్టిప్రదాన కార్యమున నిమగ్నులగుదురు. మరుత్తులు రాజుల'వలె పూజనీయులు దర్శనీయులు గృహమేధివలె పాపరహితులు శోభిల్లువారు.

2. మరుత్తులు అగ్ని సమాన తేజోవంతులు. వారి రొమ్మున బంగారునగలు శోభిల్లును. వారు వాయు వేగము

గలవారు. జ్ఞానులవలె పూజ్యులు. సుందర నేత్రులు సుందర వదనులు వారు యజ్ఞములకు ఏగుదురు.

3. మరుత్తులు వాయువువలె శత్రువును గడగడలాడించువారు. అగ్నిజ్వాల వంటి ధగధగలాడు ముఖములవారు. కవచ ధారులగు యోధులవలె శౌర్యవంతులు. పితృవచనము వంటిదాతలు.

4. రథచక్రముల ఇరుసువలె మరుత్తులు ఒకేతీరువారు. జయశీల శూరుల వలె దీప్తిమంతులు దాతలగు మానవుల వలె జలము వర్షించువారు చక్కని స్తుతులు చదువు వారివలె సుశబ్దవంతులు.

5. మరుత్తులు అశ్వములవలె శీఘ్రగాములు ధనిక రథస్వామి వలె మిక్కిలి దాతలు నదులవలె జలమును దిగువకు తెచ్చువారు. అంగిరులవలె సామగాన తత్పరులు నానారూప ధారులు.

6. వారు జలదాత మేఘము వంటి నదీనిర్మాతలు. వజ్రాది ఆయుధములవంటి శత్రుహంతలు వాత్సల్యము గల తల్లి యొక్క పిల్లలవంటి క్రీడా పరాయణులు మహాజనపదములవంటి వెలుగొందువారు.

7. ఉషః కిరణములవలె వారు యజ్ఞాశ్రయులు. శుభములు కోరు వీరులవలె ఆభరణ శోభితులు. నదులవంటి నడకలవారు. వారి ఆయుధములు ప్రదీప్తములు దూరమునకు సాగు బాటసారులవలె అనేకములను దాటుదురు.

8. మరుద్దేవతలారా ! స్తుతులచే వర్ధిల్లండి. మా స్తోతలను ధనికులను, రత్నవంతులను చేయండి. స్తోత్రపు సహకార స్తవమును గ్రహించండి. మీరు మాకు సదా రత్నదానములు చేసినారు.

## డెబ్బది తొమ్మిదవ సూక్తము

ఋషి - పాచీకగుణా లేక వైశ్వానరగుణ అగ్ని లేదా పాజంభ పుత్రసప్తి.

దేవత - అగ్ని. ఛందస్సు - త్రిష్టప్.

1. మానవులు మరణముగలవారు. అగ్ని మహిమవలన వారిలో అమరస్వభావమును నేను దర్శించుచున్నాను. అగ్నియొక్క రెండు దవడలు పరిపూర్ణ ఆకృతిగలవి. అగ్ని నమలకుండనే కర్రలు మున్నగు వానిని భక్షించును.

2. అగ్ని మస్తకము గుప్తస్థానమున ఉన్నది. అతని నేత్రములు వివిధ స్థానములందున్నవి. అతడు నమలడు. మంటలతో కర్రలను మింగును. మానవ యజమానులు చేతులెత్తి అగ్నికి నమస్కరింతురు. అగ్ని వద్దకు చేరి ఆహారము అర్పింతురు.

(ప్రాణులందున్న అగ్ని గుప్తస్థాన స్థితుడగును. అగ్ని నేత్రములు సూర్యచంద్రాదులగుదురు.)

3. బాలుడగు అగ్ని తల్లి పృథ్వీమీద సంచరించుచునే అక్కడిలతాగుల్మాదులను ఆరగించును. నేలలో వ్రేళ్లుండి, ఆకాశమునంటు వృక్షముల ఫలములను పట్టుకొనును. ఇతని జ్వాలలు వృక్షములను దహించును.

4. ద్యావాపృథ్వులారా ! ఋతంబ్రవీమి సత్యము చెప్పుచున్నాను:-

ఈ బాలుడున్నాడే అగ్ని అరణ్యమునే భక్షించినాడు. నేను మానవుడను దేవతాగ్ని విషయము తెలియనివాడను వైశ్వానరా ! నీవు ఎంతో జ్ఞానవంతుడవు. ఆ విషయము సహితము నేను ఎరుగను.

5. అగ్నికి అన్నము అర్పించువాడును. గోఘృతమున యజ్ఞముచేయువాడును. కాష్ఠాదులర్పించి పుష్టి కలిగించువాడును అగు యజమానిని అగ్ని అపరిమితజ్వాలలతో చూచును. అగ్నీ ! అతని విషయమునను, మా విషయమును అనుకూలుడవగుము.

6. అగ్నీ ! నీవు దాహకుడవు. నిన్ను తెలియక అడుగుచున్నాను. నీకు దేవతల మీద ఆగ్రహము కలిగిందా? ఆటలాడుచునో, ఆటలాడకనో హరిత వర్ణ అగ్ని భక్షించునపుడు గోవును ఖడ్గముచే ఖండించినట్లు అన్నము కర్రలు మున్నగు వానిని చెల్లాచెదరు చేయును.

7. అరణ్యమున పెరిగిన అగ్ని వట్టి త్రాళ్ళతో కట్టి వడిగల కొన్ని గుర్రములను రథమున పూన్చినది. అగ్ని కాష్ఠరూప ధనము వలన ప్రవృద్ధుడై అందరను చూర్ణము చేయును. ఇతడు కర్రముక్కలతో పెంపొందువాడు.

## ఎనుబదవ సూక్తము

ఋషి - పౌచీక వైశ్వానరాగ్ని. దేవత - అగ్ని. ఛందస్సు - త్రిష్టుప్.

1. అగ్ని స్తోతలకు అశ్వమును ఇచ్చును. అది గతిశీలమగును. యుద్ధమున శత్రువులను గెలుచును. అన్నము అందించును. అగ్ని వీరుడు, ప్రజ్ఞావంతుడగు పుత్రుని ఇచ్చును. అగ్ని ద్యావాపృథ్వులను శోభామయులను చేయును - కదిలించును. స్త్రీని వీరమాతను చేయును - "వారింవిరకు క్షింపుదన్ధమ్"

2. అగ్ని కార్యమునాకు ఉపయోగించు సమిధకాష్ఠములు శుభప్రదములు కావలెను. అగ్ని తన తేజోబలమున ద్యావా పృథ్వులందు ఉన్నాడు. అగ్ని యుద్ధములందు తన భక్తులకు స్వయముగా సాయము చేయును. గెలిపించును.

3. అగ్ని జరత్కర్ణుడను ప్రసిద్ధృషిని రక్షించినాడు. అగ్ని 'జరూథ' నామక శత్రువును జలమునుండి బయటకు తీసి దహించినాడు. అగ్ని ప్రతప్త కుండమున పడిన అత్రిని ఉద్ధరించినాడు. అగ్ని 'నృమేధ' ఋషిని సంతానవంతుని చేసినాడు.

4. అగ్ని జ్వాలారూప ధనమునిచ్చును. సహస్రగోవులు గల ఋషికి అగ్ని మంత్ర ద్రష్టపుత్రుని ఇచ్చును అగ్ని యజమానులు అందించిన హవిని ద్యులోకమునకు అందించును. అగ్నికి భూమిమీద అనేక స్థానములు ఉన్నవి "అగ్నేర్ధామాని విభృతా పురుత్రా"

5. తొలుత ఋషులు మంత్రములతో అగ్నిని ఆహ్వానింతురు. యుద్ధములందు శత్రుబాధకు లోనయిన మానవులు అగ్నిని గెలుపు కొరకు పిలిచెదరు. ఆకసమున పక్షులు అగ్నిని పిలుచును. వెలగోవులు చుట్టుముట్టి గని విచ్చేయును.

6. మానవ ప్రజ అగ్నిని స్తుతించును. నహుష వంశీయులు అగ్నిని స్తుతింతురు. గంధర్వులు యజ్ఞమార్గపు హిత వచనములను అగ్ని ఆలకించును. అగ్ని మార్గము ఘృతమునందు ఉన్నది.

**ఎనుబది ఒకటవ సూక్తము**

ఋషి - భువనపుత్ర విశ్వకర్మ. దేవత - విశ్వకర్మ. ఛందస్సు - త్రిష్టుప్.

1. విశ్వకర్మ మాకు తండ్రి హోత అతడు సకల భువనములను హవనము చేసినాడు. తాను స్వయముగా అగ్ని యందు ప్రవేశించినాడు. అతడు స్తోత్రాదులచే స్వర్గధనమును కోరినాడు. సకల జగములను అగ్నికి అర్పించినాడు తదుపరి సమీపమున ఉన్న భూత సహితుడై విశ్వ కర్మ సహితము హుతుడు అయినాడు.

2. సృష్టికాలమున విశ్వకర్మ దేనిని ఆశ్రయించినాడు? ఎచటనుండి, ఎట్లు అతడు సృష్టికార్యము ప్రారంభించినాడు? విశ్వదర్శకుడగు విశ్వకర్మ ఏ స్థానమున నిలిచి భూమిని నిర్మించినాడు ఆకాశమును ఏర్పరచినాడు?

3. విశ్వకర్మ నేత్రములు, విశ్వకర్మ ముఖము, విశ్వకర్మ బాహువులు, విశ్వకర్మ పాదములు సర్వదిశలందున్నవి. ఆ దివ్య పురుషుడు కరచరణములచే ద్యావాపృథ్వులను సృష్టించినాడు. అతడు ఒక్కడే అగును "ఏకః"

4. సృష్టికర్తలు ద్యావాపృథ్వులను ఏవనముతో - ఏవృక్షముతో చేసినారు? దేని మీద నిలిచి ఈశ్వరుడు ఈ సకల విశ్వములను ఏర్పరచినాడు? విద్వాంసులారా ! మీమనసులను అడిగి చూడండి !

5. యజ్ఞభాగమును స్వీకరించు విశ్వకర్మా ! యజ్ఞకాలమందు మాకు ఉత్తమ, మధ్యమ, సాధారణ దేహములను చూపుము నీవు అన్నయుక్తుడవు స్వయముగా యజ్ఞము చేయుదువు. నీ శరీరమును బలపరచు కొందువు.

(1. ఉత్తమ భూతావి దేవశరీరాణి 2. మధ్యమభూతావి మనుష్యాది శరీరాణి 3. నికృష్టభూతాని క్రిమి కీటకాది శరీరాణి ఇతి శయణాచార్యః)

6. విశ్వకర్మా ! నీవు ద్యావాపృథ్వులందు యజ్ఞము చేసినావు. స్వయముగా పుష్టివంతుడవు అయినావు. మా

యజ్ఞవిరోధులు మూర్ఛిల్లవలెను. ఈ యజ్ఞమున ధనికుడగు విశ్వ కర్మ స్వర్గఫలదాత కావలెను.

7. నేడు - ఈ యజ్ఞమునాకు మా రక్షణలకు విశ్వకర్మను ఆహ్వానింతుము. అతడు మా సకల హవనములను సేవించవలెను అతడు మా రక్షణకు సుఖోత్పాదకుడు సాధుకర్మవంతుడు కావలెను.

**ఎనుబది రెండవ సూక్తము**

**ఋష్యాద్యాః పూర్వవత్**

1. విశ్వకర్మ శరీరములను సృష్టించువాడు. అనుపమధీరుడు. అతడు తొలుత జలములను కల్పించినాడు తదుపరి జలములందు కదలాడు ద్యావాపృథ్వులను సృష్టించినాడు. ద్యావాపృథ్వుల ప్రాచీనములగు అంచులను విశ్వకర్మ బలపరచినాడు. అప్పుడు ద్యావాపృథ్వులు ప్రసిద్ధములైనవి.

2. విశ్వకర్మ మనసు బృహత్తరము. అతడు స్వయముగా బృహత్తరుడు. సర్వశ్రేష్ఠుడు సర్వర్షుల స్థానదర్శకుడు. విద్వాంసులు అతడు ఒక్కడే శ్రేష్ఠుడు అందురు "పరఃఏకమ్ ఆహుః."

3. విశ్వకర్మ మాకు పాలకుడు. స్రష్ట సకల భువనకర్త విశ్వమందలి సకల ధామములను తెలిసినవాడు. దేవతలకు పేర్లు పెట్టువాడు ఒక్కడే "ఏక ఏవ" సకల భువనములు అతనినే చేరుకొనును.

4. స్థావర జంగమాత్మక విశ్వము ఏర్పడినది. అప్పుడు ఋషులు ప్రాణులకు ధనాదులు సమకూర్చినారు. ఆ ప్రాచీన ఋషులే స్తోతలవలె ధనము వ్యయించి యజ్ఞానుష్ఠానము చేసినారు.

5. ఇది ద్యులోకము ఇది భూలోకము ఇవి అసురులను దేవతలను అతిక్రమించి నిలిచినవి. ఈ జలము ఎటువంటి గర్భము దాల్చినది! అందు నిలిచి ఇంద్రాది దేవతలు పరస్పరము చూచుకొను చున్నారు!!

6. ఆ విశ్వకర్మచే జలము గర్భమున దాల్చినది! గర్భమందు సకల దేవతలు కలసి ఉందురు. "అజస్యనాభావధ్యేకమర్పితం తస్మిన్విశ్వానిభువనాని తస్థుః" అతడు అజుడు జన్మరహితుడు అతని నాభియందు బ్రహ్మాండము నిలిచినది. ఆ బ్రహ్మాండమునందు సకల ప్రాణులు ఉన్నవి.

7. సకల భువనములను సృష్టించిన విశ్వకర్మను మీరు ఎరుగరు. మీ బుద్ధికి అతనిని తెలిసుకొను శక్తిలేదు. అజ్ఞానమను మంచు కప్పిన జనులు నానా కల్పనలు చేయుదురు. వారు ఇహభోగములకే యత్నింతురు - తాత్త్వికముగా ఆలోచించరు. "అసుతృప ఉక్థశాసశ్చరంతి."

**ఆలోచనామృతము :-**

1. అన్వేషణ జీవితము. చివరకు ఆలోచించిన అనుకున్నవి లభించినది అరుదు ! ఇక సృష్టిమూలమును గురించి ఆలోచనకు అంతమెక్కడిది? "విశ్వవిషయ కర్మన్ ఏతన్నామక పరమేశ్వర" అని వేద వ్యాఖ్యాత్ శాయణాచార్యులు.

విశ్వమును చేయువాడు విశ్వకర్మ. కర్మమును బట్టినామము ఆ పదార్థమెయ్యది? ఆ అన్వేషణముననే పేర్లు. ఇవి మనము పెట్టినవి అసలు ఆపదార్థమెయ్యది? ఇది ప్రశ్నయే!

2. ఈ సూక్తములందు సృష్టిని గురించి తెలిసికొను జిజ్ఞాస ఉన్నది. ఒక మహత్తరమైన ప్రశ్ననున్నది! "యద్యదధ్యతిష్ఠద్భువనాని ధారయన్, లోకములను సృష్టించినవాడు దేనిమీద నిలిచినాడు?" మనీషిణోమనసాపృచ్ఛ" విద్వాంసులారా! మనసును అడగండి. విశ్వమును సృష్టించినవాడు సృష్టికి ముందు దేనిమీద నిలిచి సృష్టించినాడన్నది మేధావులకు ప్రశ్న! ఇది ఇంతవరకు ప్రశ్నయే! అసలు ఈ భూమి దేనిమీద నిలిచి ఉన్నది? ఇది ఇంతవరకు నాకు తెలియని ప్రశ్న.

3. 'ఏక ఏవ' ఒక్కడే అను పదము స్పష్టముగా చెప్పబడినది. ఏకవబ్రహ్మో ద్వితీయం బ్రహ్మము ఒక్కడే రెండవవాడులేడు. ఒక్కడే సకల సృష్టిస్థితిలయములకు కారకుడు ఆ ఒక్కడెవరు? 'అజస్య' అని ఒక పదము వాడినాడు. అతడు జన్మరహితుడు ఇది మరొక విశేషణము ! "అజస్యనాభావధ్యేకమర్పితం తస్మిన్విశ్వాని భువనాని తస్థుః" అజుని నాభియందు బ్రహ్మాండము అందుసకల భువనములు ఉన్నవి.

4. అజ్ఞానము మంచు వంటిది. 'నీహారేణ' అన్నాడు. ఒక పదార్థమును చూచుటకు మధ్యనున్న మంచు కరగుట అవసరము. పదార్థము ఉన్నది. దానిని చూచువాడు ఉన్నాడు. మధ్య అజ్ఞానము మాయ నిలిచినది. అజ్ఞానము తొలగిన పదార్థము దర్శనమిచ్చును. చీకటిలో త్రాటిని చూచి పాము అని భ్రమపడు వానికి పోవలసినది చీకటి అప్పుడు వాస్తవము కనిపించును.

భగవద్దర్శన విషయమున మాత్రమే కాదు జీవితమున అనేక విషయములందు ఈ 'అజ్ఞానము' వాస్తవమును చూడనివ్వదు. అజ్ఞానమును అవతలికి జరుపుట అంత సామాన్యముకాదు.!!!

## ఎనుబది మూడవ సూక్తము

ఋషి - తపసపుత్ర మన్యు. దేవత - మన్యు. ఛందస్సు - 1. జగతి
మిగిలినవి త్రిష్టుప్.

1. మన్యువు వజ్రసదృశుడు బాణతుల్యుడు క్రోదాభిమాని అతనిని పూజించిన యజమానికి ఓజస్సు, బలము రెండును కలుగును. అతని సాయమున మేము ఆర్య, దస్యు ఉభయ శత్రువులను ఓడించగలము మన్యూ! నీవు బలకర్తవు బలరూపుడవు మహాబలవంతుడవు.

2. మన్యువే ఇంద్రుడు దేవత హోత వరుణుడు జాతప్రజ్ఞ అగ్ని అగును. సకల మానవ ప్రజ మన్యుని స్తుతించును. మన్యూ ! నీవు మాతండ్రితో కలసి మమ్ము రక్షింపుము.

3. మన్యూ ! నీవు మహాబలవంతుడవు. విచ్చేయుము నా తండ్రిని సాయముకొని శత్రువును ధ్వంసము చేయుము. నీవు శత్రుసంహారకుడవు. వృత్రఘ్నుడవు దస్యుహంతవు మా కొరకు సమస్త ధనములను తెమ్ము.

4. మన్యూ ! నీవు అన్యులను ఓడించువాడవు. స్వయంభువవు. దీప్తిశాలివి శత్రుంజయుడవు. సర్వ దిగ్దర్శకుడవు. శత్రుసహిష్ణుడవు. బలవంతుడవు మా సేనలను తేజోవంతములను చేయుము.

5. ఉత్తమ జ్ఞానవంత మన్యూ ! నీకు నేను యజ్ఞభాగము సమకూర్చలేక పోయినాను. అందువలన పూజించలేక పోయినాను. నీవు మహామహుడవు. నిన్ను నేను పూజించలేక పోయినాను. అందుకు నేను సిగ్గుపడుచున్నాను. నీ గుణమును అనుసరించి, నీ ఇష్టప్రకారము, నాకు హలము ప్రసాదించుటకు విచ్చేయుము.

6. మన్యూ ! నేను నీ దరి చేరినాను. అనుకూలుడవగుము. నాముందు అవతరించుము. నీవు అక్రమాలు సహించగలవాడవు అందరను భరించగలవాడవు.

వజ్రధరమన్యూ! నన్ను ఆత్మీయుడనుకొనుము. మాకు అభ్యుదయము ప్రసాదించుము. అట్లగుట వలన నేను దస్యులను జయించగలను.

7. నా వద్దకు రమ్ము నా కుడిపక్కన నిలువుము. అట్లగుట వలన ఉభయులము వృత్రులను నాశము చేయగలము. నీ కొరకు నేను ఉత్తమము మధురమగు సోమరసము హవనము చేయుదురు. మనము మొదలు ఏకాంతప్రదేశమున సోమమును సేవింతము.

## ఎనుబది నాల్గవ సూక్తము

పూర్వవత్ ఋషిదేవత. ఛందస్సు - 1-3 త్రిష్టుప్ 4-7 జగతి.

1. మన్యూ! మరుత్తులు మున్నగు వారు నీతోకూడ ఒకే రథముపై ఆసీనులు కావలెను. వారు హృష్టులై, ధృష్టులై, తీక్ష్ణ బాణవంతులై, ఆయుధములను పదును పెట్టి, మండిపడు అగ్నివంటివారై నీకు సహాయముగా యుద్ధమునకు తరలవలెను.

2. మన్యూ ! నీవు గనిసమ ప్రజ్వలితుడవగుము. శత్రువులను జయించుము. సహనశీల మన్యూ ! నిన్ను పిలుచుచున్నాము. యుద్ధమున మాకు సేనాపతివగుము. శత్రువులను వధించుము. వారి ధనము మాకిమ్ము. మాకు

బలమునిమ్ము.

3. మన్యూ ! మమ్ము ఎదిరించు శత్రువును జయించుము. కొట్టుచు, చీల్చుచు శత్రువు ముందు దూకుము. నీ దుర్ధర్వ బలమును వశపరచుకొనగలడు.

4. మన్యూ ! నీ స్తుతి జరుగును. నీవు ఒక్కడవు యుద్ధము కొరకు విశేషప్రజను పురికొల్పుము. నీవు సహాయకుడవై ఉండగా మా దీప్తికి హాని కలుగదు. జయము కలుగుటకు గర్జింతుము. "ఘోషం విజయాయ కృణ్మహే"

5. మన్యూ ! నీవు ఇంద్ర సమ విజేతవు. నీ మాటలందు నిందలుండవు. ఈ యజ్ఞమందు మాకు విశేషరక్షకుడవగుము. నిన్ను నీకు ప్రియమగు స్తోత్రమున స్తుతింతుము. ఈ స్తోత్రమున ప్రవృద్ధుడవగుము. నిన్ను లోకోత్పాదకునిగా మేము తెలియుదుము.

6. మన్యువు వజ్రతుల్యుడు శత్రు పరాభవకారి. శత్రునాశకుడు. శత్రునాశము నీ స్వభావమగును. నీ తేజస్సు ఉత్కృష్టము. నీవు కర్మసహితుడవై మా యుద్ధమున వెలుగొందుము నీవు అనేకులచే ఆహ్వానించబడువాడవు.

7. వరుణ, మన్యులారా! లభించిన గోవులను, తెచ్చిన ధనములను మాకు అందించండి. శత్రువులు భీరువులు కావలెను. పరాజితులు కావలెను. జయించవలెను "లయన్తామ్."

### ఎనుబది అయిదవ సూక్తము

ఋషి - సవితృసుత సూర్య. దేవత - వేరు వేరు. ఛందస్సు - వేరు వేరు.

1. దేవతలందు సత్యరూప బ్రహ్మ పృథ్వివి ఆకసమున నిలిపి ఉంచినాడు. ఋతరూప ఆదిత్యుడు ద్యులోకమున సోమము నిలిచి ఉన్నది "దివిసోమోఅధిశ్రితః"

2. సోమముననే ఇంద్రాదులు బలిష్ఠులగుదురు. సోమము వలననే భూమి ప్రకాండమైనది. నక్షత్రములందు సోమము నిక్షిప్తమైనది.

3. వనస్పతిరూప సోమమును నూరినంతనే జనులు సోమపానము చేసినామనుకుందురు. కాని బ్రాహ్మణులు దేనిని సోమమందురో దానిని అయాజ్ఞికులు పానము చేయజాలరు.

4. సోమమా ! స్తోతలు దాచుట ఎరిగిన వారై నిన్ను రహస్యస్థానమున ఉంచుదురు. నీవు ప్రస్తర శబ్దము విందువు నేలమీది నరుడు నిన్ను పానము చేయలేడు. "నాతే అశ్నాతి పార్థివః"

5. సోమదేవా ! నిన్ను పానము చేసినంత నీకు వృద్ధికలుగును. క్షయముకాదు. మాసములు సంవత్సరమునువలె వాయువు సోమమును రక్షించును. రెండింటి స్వరూపము సమానమగును.

6. సూర్యపుత్రి వివాహ సమయమున 'రైంభీ' నామక ఋక్కులు ఆమెకు సఖులు ఆయనవి. 'నరాసీ' నామక ఋక్కులు ఆమెకు దాసీలయినవి సూర్యునియొక్క సుందర వస్త్రములు సామగానమున సంస్కరించ బడినవి.

7. సూర్యపతి గృహమున మెట్టినపుడు చైతన్యమే వలువ అయినది. నేత్రములే ముసుగు అయినవి ద్యావాపృథ్వులు కోశములైనవి.

8. స్తోత్రమే ఆమె రథచక్రమునకు దండము అయినది. కురీరనామక ఛందస్సు రథపు లోపలి భాగమైనది. సూర్య వరులు అశ్వినీకుమారులయినారు. అగ్ని అగ్రగామి దూత అయినాడు.

9. సూర్య మనసున పతిని కోరినది. సూర్యుడు తన పుత్రి సూర్యను ప్రదానము చేయునపుడు సోముడు ఆమెను పెళ్లాడదలచినాడు. కాని అశ్వినులనే వరులుగా స్వీకరించుట జరిగినది.

10. సూర్య తనపతి గృహమునకు వెళ్లినది. ఆమె మనసే ఆమెకు శకటమైనది. ఆకాశము ఆచ్ఛాదనమైనది. సూర్య చంద్రులు శకట వాహకులు అయినారు.

11. ఋక్, సామములు వర్ణించిన రెండు వృషభములు సూర్య చంద్రులు ఆమెకు శకట వాహకులు అయినారు. ఆమె చెవులు రెండు రథచక్రములు అయినవి "శ్రోత్రంతే చక్రే ఆస్తాం" రథము నడచుమార్గము ఆకాశమయినది.

12. సూర్య తనపతి గృహమునకు వెళ్లునపుడు ఆమె మనసే శకటమైనది ఆమె కనులు రథచక్రములైనవి వాయువు రథమునకు అక్షము ఇరుసు అయినది.

13. పతి గృహమునాకు వెళ్లునపుడు సూర్యుడు తన కూతురుకు ఒక వలువ ఇచ్చినాడు. అది ఆమె ముందు నడచినది. మఖనక్షత్రపు ఉదయకాలమున వలువ అంగస్వరూపమైనది. వీడ్కోలు సమయమున ఇచ్చిన గోవులను కర్రచే తోలబడును పూర్వఫల్గుణి, ఉత్తర ఫల్గుణి నక్షత్రములందు వలువను రథము పైన తీసికొని వెళ్లుదురు.

14. అశ్వినులారా! మీరు మూడు చక్రముల రథము ఎక్కినారు. సూర్య పెళ్లి విషయము మాట్లాడినారు ఆమెను పెండ్లాడినారు. అప్పుడు సకల దేవతలు మిమ్ము సమర్థించినారు. మీ పుత్రుడు పూషమిచ్చినాడు.

15. అశ్వినులారా! మీరు సూర్యుడు వరులైవెళ్లినారు కదా అప్పుడు మీ చక్రము ఎచట ఉండెను? మార్గమును గురించి ఆలోచించునపుడు మీరు ఎచట నిలిచినారు?

16. సమయానుకూలముగ నడుచు మీరథమునకు రెండు చక్రములు సూర్యచంద్రులు కనిపించునవి. మూడవ చక్రము కనిపించని సంవత్సరము ఈ విషయము బ్రాహ్మణులు ఎరుగుదురు. విద్వాంసులు ఎరుగుదురు.

17. సూర్య, దేవగణములు, మిత్రుడు, వరుణుడు, వీరందరు ప్రాణుల క్షేమము కోరువారు వారికి నమస్కరించుచున్నాను.

18. వీరు ఇద్దరు శిశువులు సూర్యచంద్రులు వీరు తమశక్తిచే తూర్పుపడమరలకు తిరుగుదురు. వారు ఆటలాడుచు యజ్ఞములకు వచ్చెదరు. వారిలో చంద్రుడు మాసములు, పక్షములు ఏర్పరచుచు విశ్వము వీక్షించును. రెండవ వాడగు సూర్యుడు ఋతువులను ఏర్పరచును. మరల మరల జన్మించును. "జాయతేపునః"

19. సూర్యుడు దినములు సూచించువాడు నిత్యము నూతనుడై ఉదయమున ప్రత్యక్షమగును. దేవతలకు యజ్ఞభాగపు ఏర్పాట్లు చేయును. చంద్రుడు దీర్ఘాయువు ప్రసాదించును. "చంద్రమాప్తిరతే దీర్ఘమయః"

20. సూర్యా ! నీవు పతి గృహమునకు వెళ్లునపుడు-శోభన పలాశము, శాల్మలుతో నిర్మించిన నానా రూప, సువర్ణ వర్ణ ఉత్తమ, శోభన చక్రవంత రథమును ఎక్కుము. సుఖకర, అమర స్థానమందు సోమము వైపు సాగుము.

21. విశ్వావసూ! ఈ కన్య వివాహమైనది నీకు నమస్కరించు చున్నాను. స్తుతించుచున్నాను, నీవు ఇచటనుండి కదలుము మరొక వివాహయోగ్య కన్య పితృగృహమున ఉన్న అచటికి వెళ్లుము. ఆమె నీ భాగ్యమునకు జన్మించినది. ఆమెను గురించి తెలిసికొనుము.

22. విశ్వావసూ! నీకు నమస్కరింతును నిన్ను పూజింతును. నీవు ఇచటినుండి కదలుము. నిలిచిన కన్య వద్దకు వెళ్లుము. ఆమెను పతితో కలుపుము.

23. దేవతలారా ! మా మిత్రులు కన్య తండ్రిగృహమునకు వెళ్లుచున్నారు. వారి మార్గము సుగమము కంటక రహితము కావలెను ఆర్యమ, భగదేవత మమ్ము క్షేమముగా చేర్చవలెను. భార్యాభర్తలు కలసి ఉండవలెను. "సంజాస్పత్యం సుయమమస్తు దేవాః"

24. కన్యా ! సుందరుడగు సూర్యుడు వరుణునిచే పాశబద్ధను చేయించినాడు. నేను నిన్ను ఆ బంధమునుండి విముక్తను చేయుదును. సత్యమునకు ఆధారము, సత్యనివాసమగు స్థానమున నిర్విఘ్నముగా నిన్ను పతిదగ్గరకు చేర్చెదను. "ఋతస్యయోనౌ సుకృతస్యలోకేరిష్టాం త్వాసహ పత్యాదధామి."

25. నేను కన్యను పితృవంశమునుండి విడిపింతును. భర్త గృహమున స్థాపింతును. వర్షక ఇంద్రా ! ఈమె

సౌభాగ్యవతి, సుపుత్రవతి కావలెను.

26. నీ చేతిని అందుకొని పూష నిన్ను ఇచటినుండి తీసికొని వెళ్ళవలెను. అశ్వినులు నిన్ను రథము మీద తీసికొని వెళ్ళవలెను. ఇంటికి చేరి ఇల్లాలివగుము. భర్తను అనుసరించి ఉండుము. భృత్యులు మున్నగు వారిని ఏర్పరచుము.

27. ఈ ఇంట బిడ్డలను కనుము. ఆనందించుము. ఇచట జాగ్రత్తగా మసలు కొనుము. భర్తతో నే దేహమును కూర్చుము ముసలితనము వరకు ఇంట పెత్తనము చేయుము.

28. పాపదేవతయగు కృత్య నీలలోహిత అగుచున్నది. ఈ స్త్రీని విడిచి పోయినది. అప్పుడు ఈమె వంశము వర్ధిల్లినది ఈమె భర్త సంసార బంధనములందు ఉన్నాడు.

29. కృత్య వెళ్లిపోయినది మలిన వస్త్రము వదలండి బ్రాహ్మణులకు ధనము ఇవ్వండి. భార్యాభర్తలు కలిసికొను చున్నారు.

30. భర్త భార్య వస్త్రమును చుట్టు కొనరాదు. అట్లు చేసిన కృత్య అతనిపై ఆక్రమణ చేయును. ఎంతటి వాడైనను ధనహీనుడగును.

31. వరుడు వధువునకు ఇచ్చిన ఆహ్లాదకర వస్త్రములను వచ్చిన వారి ప్రయత్నములను యజ్ఞభాగమలందుకొను దేవతలు విఫలము చేయవలెను.

32. పగతో ఈ దంపతుల వద్దకు వచ్చువారు పాడు కావలెను. దంపతులు సుఖములచే కష్టములను కొట్టి వేయవలెను. శత్రువులు దూరములకు పారిపోవలెను "ద్రాన్త్వరాతయః"

33. సుమంగళీరియంవధూరిమాం సమేత పశ్యత |
సౌభాగ్యమస్యై దత్త్వాయాథాస్తాం విపరేతన ||

ఈమె వధువు సుమంగళి ఆశీర్వదించువారందరు వచ్చి చూడండి ఈమె భర్తకు ప్రేమ పాత్రురాలగునట్లు ఆశీర్వదించండి. అందరు మీ ఇండ్లకు వెళ్లిపొండి.

34. ఈ వస్త్రము దూషితము అగ్రాహ్యము మలినము విషయుక్తము వాడతగినది కాదు. సూర్యను తెలిసిన బ్రాహ్మణుడు మాత్రమే దీనిని పరిగ్రహించగలడు.

35. సూర్య రూపము ఎట్లున్నదో చూడండి ఆమె వస్త్రము మొదట చిరిగినది మధ్యన చిరిగినది నలువైపుల చిరిగినది బ్రాహ్మణుడు మాత్రమే దానిని చక్క పెట్టగలడు.

36. "వివాహే కన్యాహస్తగ్రహణే గృభ్ణామీత్యేషా" వివాహమున ప్రాణిగ్రహణమప్పటిది. నీ సౌభాగ్యము కొరకు నేను నీ పాణిగ్రహణము చేయుచున్నాను. నన్ను పతిగా పరిగ్రహించి వృద్ధావస్థవరకు నడుపుము. ఇదే నా ప్రార్థన, భగ, ఆర్యమ, పూష దేవతలు గార్హపత్యము కొరకు నిన్ను నాకు ఇచ్చినారు.

37. పూషా! ఏ స్త్రీ గర్భమున పురుషుడు బీజము వేయచున్నాడో ఆమెను కళ్యాణిని చేసి పంపుము. ఆమెకు ఇంద్రియ ప్రహారము చేయుదును. "ఉశన్తః ప్రహారామశోపమ్."

38. అగ్నీ ! ముసుగు సహితముగా సూర్యను ముందు నీ వద్దకు తెచ్చెదరు. ఆమెను నీవు సంతానమునకు గాను భర్త చేతికి ఇస్తావు.

39. అగ్ని మరల సౌందర్యము, పరమాయువుతో వనితను అందించినాడు. ఈమెపతి దీర్ఘాయువు అగును. నూరేళ్లు జీవించును "పతిర్జీవాతి శరదః శతమ్."

40. సోముడు మొదట నిన్ను పత్నిగా గ్రహించినాడు. గంధర్వుడు నీకు రెండవ పతి అయినాడు మూడవవాడు అగ్ని మనుష్య వంశజుడు నీకు నాలుగవ పతి అయినాడు.

41. సోముడు ఆమెను గంధర్వునకు ఇచ్చినాడు. గంధర్వుడు అగ్నికి ఇచ్చినాడు ధనసంతాన సహితముగ అతడు నాకు ఇచ్చినాడు "రాయించపుత్రాంశ్చాదాదగ్నిర్మహ్యామధో ఇమామ్"

42. **ఇహైవస్తం మావియౌష్టం విశ్వమాయర్వ్యశ్నుతమ్ |**
**క్రీళన్తేపుత్రైర్నప్తృభిర్మోగమా నౌస్వగృహే ||**

వధూవరులారా ! మీరు కలసి ఉండండి విడిగా ఉండవద్దు ఎంతో కాలము జీవించండి. పుత్ర, పౌత్రులతో ఆడుకొనుచు ఆనందించుచు మీగృహమున ఉండండి.

43. గృహప్రవేశ సమయమందు :-

ప్రజాపతి మాకు సంతానము ప్రసాదించవలెను. ఆర్యమ వార్ధక్యము వరకు మమ్ము కలిపి ఉంచవలెను. వధువా! నీవు మంగళమయవై పతి ఇంట ఉండుము. మా మనుష్యులకు పశువులకు శుభములు కూర్చుము.

44. నీ చూపు దోషరహితము కావలెను భర్తకు శుభదాయకవగుము. పశువులకు క్షేమము కలిగించుము. నీ మనసు ప్రఫుల్లము, సౌందర్యము శుభ్రము కావలెను. వీరమాత వగుము. దేవతల భక్తురాలవగుము. మా మనుష్యులకు

పశువులకు శుభములు కూర్చుము.

45. వర్షక ఇంద్రా ! ఈమెకు ఉత్తమ పుత్రులనిమ్ము. సౌభాగ్యవతిని చేయుము. ఈమె గర్భమున పదిమంది పుత్రులనుంచుము. పతితో కలసి పదకొండుమంది కావలెను "దశాస్యాం పుత్రానాధేహి పతిమేకాదశం కృధి."

46. వధువా ! నీవు అత్తమామలు మరుదులమీద సామ్రాజ్ఞి వగుము. అందరి మీద పెత్తనము చేయుము.

**47. సమఞ్జన్తు విశ్వేదేవాః సమాపోహృదయానినౌ |**
**సంమాతరిశ్వాసంధాతా సముదేష్ట్రీధాతనే ||**

సకల దేవతలు మా ఇద్దరి మనసులను ఏకము చేయవలెను. జల, వాయు, ధాత, సరస్వతులు మా ఇద్దరిని సంయుక్తులను చేయవలెను.

**ఆలోచనామృతము**

మానవుడు ఏకాకిగా వంటరిగా వేరుగా జీవించ జాలడు. పశుపక్ష్యాదులు సహితము వంటరి జీవితము గడుప జాలవు తోడు లేనిది జీవితము సాగదు వంటరి బ్రతుకు బ్రతుకేకాదు.

జీవితమున ఎక్కువకాలము కలిసి ఉండుటకు మగకు ఆడ - ఆడకు మగతోడు అవసరము. ఈ జంటతోడుకు మాత్రమేకాదు గురుతరమగు కుటుంబ బాధ్యతలు నిర్వహించవలసి ఉన్నది. సమాజపు స్వరూప, స్వభావములు ఎటువంటివి అయినను అది దంపతులు కుటుంబము మీదనే ఆధారపడును మంచి కుటుంబమే మంచి సమాజమగును.

ఏ ఇద్దరి స్వభావములు, అభిరుచులు, అభిప్రాయములు ఒక తీరుగా ఉండవు. ఇది ప్రకృతిరీతి. అట్లయినను ఒక ఆడా - మగ జంటను కూర్చుట అవసరము. కొన్ని పక్షిజాతులలో దాంపత్యము అపూర్వము జత బాసిన క్రౌంచపు విషాదమే రామాయణ మహకావ్య నిర్మాణమునకు ఆధారము కదా ! మనిషి పశుపక్ష్యాదుల నుండి నేర్చినాడో - అవసరమే అట్లు చేసినదో విడిపోని జంటను గురించి ఆలోచించినాడు ఇరువురిని కలుపుటకు వివాహమను పవిత్రబంధమును ఏర్పరచినాడు. 'అనన్యారాఘవేణాహం' అని వాల్మీకి సీతతో అనిపించినను 'వాగర్థావివ సంప్రక్తౌ' అని కాళిదాసు ప్రార్థించినను ఈ వివాహ బంధమును నిలుపుటకే సాహిత్యమున ముప్పావు ముప్వీసము ఇందుకే అంకితమగుచున్నది. ఇది నాటిమాట నేటిమాట రేపటిమాట.

ఈ సూక్తమున అందముగ, రమ్యముగ, మనోహరముగ వివాహమును గురించి చెప్పబడినది. ఇది ఏనాటిదో తెలియని కాలమున ఇంత చక్కగా చెప్పబడినది ఇందు వధువుకు ప్రాధాన్యత ఇవ్వబడినది. 'గృహిణీగృహముచ్యతే'

అని కదా నానుడి! ఇటుకలు ఇల్లుకాదు !! ఇల్లాలే ఇల్లగును. !!! ఇల్లాలికి ఇంటిమీద, భృత్యులమీద, పశువులమీద, అత్తమామలు మరదుల మీద అధికారము ఇచ్చినాడు "సామ్రాజ్ఞీ" అన్నాడు నీవుతోడుగా నన్ను వృద్ధావస్థవరకు నడుపుము అని వరుడు ప్రార్థించుట ఆమె అధికారమునకు సంకేతము 42వ మంత్రమును మించిన దాంపత్యమును గురించిన ఆశయము ఉండదేమో! పిల్లలు పిల్లల పిల్లలతో ఆడుకుంటూ గడిపే వార్ధక్యం! ఇంతకు మించి ఆశించగలమా ! మరీ ఆర్ద్రత గలది 45వ మంత్రము పతిని సహితము పదిమంది పుత్రులలో చేర్చి పదకొండవ వానిని చేసినాడు ! పదిమందిని కన్న తల్లి భర్తకు తల్లివలె ప్రేమించుటయే కోరుకొనునది ! 37వ మంత్రమున కాయకమగు కామ సంబంధమును వివరించి 47వ మంత్రమున మనసుల కలయికను అడిగినాడు.

**సమజ్ఞన్తు విశ్వేదేవాః సమాపోహృదయానినౌ |**
**సంమాతరి శ్వాసంధాతా సముదేష్ట్రీదధాతునౌ ||**

అతినాగరకత, అతిసంపద, అతి స్వేచ్ఛతో కుటుంబాలను విచ్ఛిన్నం చేయుచున్న రాక్షస యంత్ర నాగరకతకు ఇది మానవతా సందేశము ! మహావేద సందేశము!! వినెనా కుటుంబము నిలుచును. వినకున్న కుటుంబము కూలును! సమాజము కూలును!! సంస్కారము కూలును !! నరుడు ఎడారిలో ఏకాకయి నిలుచును.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత పదవ మండలము ఎనిమిదవ అష్టకమున మూడవ అధ్యాయము సమాప్తము)*

**ఓం నతామినన్తి మాయినో నధీరావ్రతాదేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదసీ అద్రుహా వేద్యా భిర్న పరవతానినమేత స్థివాంసః**

**నాలుగవ అధ్యాయము ఎనుబది ఆరవ సూక్తము**

ఋషి - ఇంద్రపుత్ర వృషకపి. దేవత - ఇంద్రుడు. ఛందస్సు - పంచపదపంక్తి.

***ఓం విహిసోతో రసృక్షతనేంద్రందేవమమంసత |***
***యత్రామదహృషా కపిరర్యః పుష్టేషు మత్సఖా విశ్వస్మాదింద్ర ఉత్తరః ||***

1. నేను ఇంద్రుడను సోమాభిషవము చేయుమని దేవతలకు చెప్పినాను. కాని వారు ఇంద్రుని కాక 'వృషాపి' ని స్తుతించినారు. సోమప్రవృద్ధయజ్ఞమున వృషాకపి నాకు మిత్రుడై సోమపానము చేసినాడు. హృష్టుడైనాడు అయినను నేనే సర్వశ్రేష్ఠుడను.

2. ఇంద్రా ! నీవు సోమపానమునకు కాదు - హృదయము స్పందించి హరిత వర్ణమృగ వృషాకపికి వద్దకు వెళ్లుదువు.

ఇంద్రుడే సర్వశ్రేష్ఠుడగును. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

3. ఇంద్రా ! వృషాకసి నీ కేమి మేలు చేసినాడని ఉదారుడవై హరితవర్ణ మృగ వృషాకపికి పుష్టి కరమగు ధనము నిచ్చినావు? "విశ్వస్మాదింద్ర ఉత్తరః."

4. ఇంద్రా ! నీకు వృషాకపి ప్రియుడు. నీవు అతనిని రక్షింతువు అట్టివాని చెవిని వరాహమును కోరు కుక్క కొరకవలెను. "విశ్వస్మాదింద్ర ఉత్తరః."

5. ఇంద్రాణి అనుచున్నది :-

నా కొరకు యజమానులు ఘృతయుక్త సామగ్రిని ఏర్పరచినారు. దానిని వృషాకపి దుహితము చేసినాడు నాకు వాని తల నరకవలెననిపించుచున్నది. వారు చెడు కార్యము చేసినాడు వానికి నేను సుఖము కలిగించజాలను. "విశ్వస్మాదింద్ర ఉత్తరః."

6. నన్ను మించిన సౌభాగ్యవతి లేదు సుపుత్రవతియులేదు భర్త ముందు శరీరము ప్రపుల్లము చేయుట యందును రతి సమయమున తొడలు ఎత్తుట యందును నన్నుమించినది లేదు "విశ్వస్మాదింద్ర ఉత్తరః."

7. వృషాకసి మాట:-

అమ్మా! నీవు సులాభిశవు నీ అవయవములు, ఊరువులు తలమున్నగునవి అవసర పరిణామమున ఉండవలెను. ప్రేమాలాపములందు కోకిలవలె నీవు నా తండ్రిని ప్రసన్నుని చేయుము. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

8. ఇంద్రుడు అనుచున్నాడు :-

ఇంద్రాణీ ! నీవు వీరపత్నివి నీభుజములు సుందరములు నీ అంగుళులు సుందరములు. నీవి పొడవైన వెంట్రుకలు, స్థూలములగు ఊరువులు. నీవు వృషాకపిని ఎందుకు కోపించుచున్నావు? "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

9. ఇంద్రాణి అనుచున్నది :-

ఈ వృషకాపి హింసకుడు నన్ను పతి, పుత్ర, విహీనను అనుకుంటాడు. కాని నేను పుత్రవంత ఇంద్ర పత్నిని మరుత్తులు నాకు సహాయకులు "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

10. ఒకతరి యజ్ఞము జరుగును పతిపుత్రవంత ఇంద్రాణి అచటకేగును. యజ్ఞవిధానమును ఏర్పరచును. ఆమెను

అందరు పూజింతురు. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

11. ఇంద్రుడు అనుచున్నాడు:-

స్త్రీలందరిలో ఇంద్రాణియే సౌభాగ్యశాలి అని విన్నాను. ఇతర పురుషులవలె ఇంద్రాణి భర్త ముసలిదనమున పడి చావ వలసిన పనిలేదు "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

12. ఇంద్రాణీ! వృషాకపి మనహితము కోరువాడు అతడు లేక నాకు సంతోషములేదు. వృషాకపికి ప్రీతికరములకు హవ్యాదులే దేవతల వద్దకు చేరును. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

13. వృషాకపి భార్య ! నీవు ధనశాలినివి. పుత్రవతివి మంచి కోడలివి. నీ వృషభములను ఇంద్రుడు భక్షించ వలెను. నీకు ప్రియము, సుఖకరమగు హవిని ఇంద్రుడు ఆరగించవలెను. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

14. నా కొరకు ఇంద్రాణి యాజ్ఞికులను ప్రోత్సహించినది వారు పదిహేను ఇరువది ఆబోతులను వండినారు. వానిని తిందును. బలిసిపోవుదును. యాజ్ఞికులు నా రెండు కుక్షులందు సోమము నింపుదురు. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

15. ఇంద్రాణి అనుచున్నది:-

ఇంద్రా ! వాడి కొమ్ములుగల ఆబోతు గర్జించుచు ఆవుల మందలో దూరి రమించినట్లు నీవు నాతో రమించుము. దధి మంథనము శబ్దము చేయుచు నీ హృదయమునకు కళ్యాణకరము కావలెను. భావాభిలాషిణి ఇంద్రాణి అభిషవించిన సోమము శుభావము కావలెను. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

16. ఇంద్రా ! తొడల మధ్య వ్రేలాడు పురుషాంగము కలవాడు మైధునమునాకు సమర్థుడుకాడు. కూర్చున్నపుడు వెంట్రుకలుగల పురషాంగము విజృంభించుచో అట్టివాడు సమర్ధుడగును. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

17. ఇంద్రుని మాట :-

కూర్చున్నపుడు వెంట్రుకలుగల పురషాంగము విజృంభించిన వాడు మైథున సమర్థుడుకాడు. పురుషాంగము తొడలమధ్య వ్రేలాడువాడు మైథున సమర్థుడగును. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

18. ఇతరులధనము దొంగిలించ బడినపుడు వృషాకపి తనదానిదిగా భావించవలెను. అతనికి కరవాలము, వధ్యస్థలము, కొత్త చరువు, కర్రబండి లభించవలెను. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

19. నేను యజమానులను వీక్షించుచు. ఆర్యులను అన్వేషించుచు, శత్రువులను దూరము చేయుచు యజ్ఞమునకు చేరుకొందును. సోమాభిషవము చేయు వాని సోమమును, హవిని వండు వాని సోమమును పానము చేయుదురు. బుద్ధిమంతులను దర్శింతును. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

20. జలశూన్య మరుభూమికి, బాగుగ పెరిగి కోతకు వచ్చిన అడవికి ఎన్ని యోజనముల అంతరము? వృషాకపీ! దగ్గర నున్న ఇంటినే ఆశ్రయింపుము. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

21. వృషాకపీ! నీవు మరల రమ్ము. నేను ఇంద్రాణి నీ కొరకు మంచి పనులు చేయుదుము. కలలను మార్చు సూర్యుడు అస్తమించినట్లు నీవు కూడ ఇంటికి చేరుము. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

22. తిరిగి వచ్చిన వృషాకపితో ఇంద్రుడు :-

వృషాకపీ ! రమ్ము మా ఇంటికి చేరుము. బహుభోక్తయు జనులను ఆనందపరచు ఆమృగము ఎచటికిపోయనది? "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

23. ఇంద్రుడు బాణము విడిచినాడు. అది మనుపుత్రి పర్శునకు ఇరువది మంది పుత్రులను కలిగించినది కడుపు పెద్దదగు పర్శునకు శుభములు కలుగ వలెను. "విశ్వస్మాదింద్ర ఉత్తరః"

(ఇది తల్లిదండ్రులు కొడుకు మధ్య కలహమువలె ఉన్నది వృషాకపి ఏదో జంతువును పెంచినట్లున్నాడు. అది తలిదండ్రులకు నచ్చలేదు అతడు ఇల్లు విడిచి వెళ్లినాడు. తిరిగి రమ్మని తలిదండ్రులన్నారు. అతడు జంతువును వదలి వచ్చినాడు. చివరి మంత్రము ఆమృగమునకు శుభము కలుగవలెననునది.)

## ఎనుబది ఏడవ సూక్తము

ఋషి - భరద్వాజ పాయుడు. దేవత - రక్షోహాగ్ని. ఛందస్సు - అనుష్టుప్.

1. అగ్ని రాక్షసనాశకుడు బలశాలి యజమానుల మిత్రుడు స్థూలకాయుడు. అతనికి నేను ఘృతముచే హవనము చేయుదును. ఇంటికి వెళ్లుదును. జ్వాలలను పెంచుచు అగ్నిని యజమానులు ప్రజ్వలితుని చేయుదురు.

అగ్నీ ! మమ్ము రాత్రింబవళ్లు హింసక రాక్షసులనుండి రక్షింపుము.

2. జ్ఞాని అగ్నీ ! దంతములను తీక్ష్ణము చేయుము. నీజ్వాలలచే రాక్షసులను కాల్చుము. బాధించు రక్కసులను జ్వాలలతో బాదుము. మాంసభక్షక రాక్షసులను తెగనరికి నోటిలో వేసి కొనుము.

3. రెండు కోరల అగ్నీ ! నీవు రాక్షసుల హింసకుడవగుము. నీ రెండు కోరలను పదును పెట్టుము. వానిని రాక్షసులందు గ్రుచ్చుము శుక్షములనిచ్చు అగ్నీ ! అంతరిక్షమునందలి రాక్షసుల వద్దకు వెళ్లుము వారిని కోరలతో పిండి చేయుము.

4. అగ్నీ ! మా యజ్ఞములు, స్తుతులచే నీ బాణములను నవీకరించుము. వాని అగ్రభాగములందు వజ్రమును కూర్చుము. వానితో రాక్షసుల హృదయములను చీల్చుము. భుజములను తెంచుము.

5. ధనిక అగ్నీ ! రాక్షసుల చర్మములను కోసివేయుము. హింసక వజ్రము వాడియై వారికి తాకవలెను. మాంసభక్షక వృకాదులు వారి మాంసమును తినవలెను.

6. జ్ఞాని అగ్నీ ! రాక్షసులు నిలిచి ఉన్నను తిరుగుచున్నను, ఆకాశమున ఉన్నను దారిలో ఉన్నను- వారు ఎక్కడ కనిపించినను నీ తీక్ష్ణ బాణములచే వారిని నరుకుము.

7. జ్ఞాని అగ్నీ ! అదిగో రాక్షసులు ఆక్రమించుచున్నారు. ఆవ్యక్తిని పట్టినారు. అతనిని ఖడ్గధారల నుండి రక్షించుము. అగ్నీ ! ఉగ్రరూపము దాల్చుము. మొదలు పచ్చిమాంసము తినువారిని హతమార్చుము ఆరక్కసుల మాంసమును పక్షులు తినవలెను.

8. అగ్నీ ! కనిపెట్టుము ఎవడు ఏరాక్షసుడు ఈ యజ్ఞమునకు విఘాతము కలిగించుచున్నాడు? తరుణ అగ్నీ! కట్టెలతో కాల్చి ఆరక్కసిని హతమార్చుము. నీవు మానవుల విషయమున కృపాదృష్టికలవాడవు. ఆ దృష్టితోనే ఈ రాక్షసుని పరిమార్చుము.

9. అగ్నీ! నీ యొక్క తీక్ష్ణ తేజమున మా యజ్ఞమును రక్షింపుము. ఉత్తమ జ్ఞానవంత అగ్నీ! యజ్ఞమునకు ధనము సమకూర్చుము. అనుకూలుడవగుము. మానవులను దర్శించు అగ్నీ! నీవు రాక్షస ఘాతుకుడవు రాక్షసులు నిన్ను కొట్టరాదు.

10. మానవ దర్శక అగ్నీ! మానవ హింసక రాక్షసులను చూడుము. వారితలలను మూడుముక్కలు చేయుము. వారి వెంట రక్కసులున్నారు. వారిని వెంటనే హతమార్చుము. వారి కాళ్లను మూడు ముక్కలుగ నరుకుము.

11. జ్ఞాని అగ్నీ! రాక్షసులు మూడుమారులు నీ మంటలలో పడవలెను. సత్యమును, అసత్యము చేయు రాక్షసులను నీ తేజమున భస్మము చేయుము.

12. అగ్నీ! నీ నఖములు ఖురములంతటివి వానితో సాధువులను హింసించు రాక్షసులను అంతమొందింతువు. అట్టి తేజమునే గర్జించు రక్కసులపై విసరుము సత్యమును అసత్యముచే అణచు రాక్షసులను దధ్యంగ,

అథర్వృషులవలె భస్మము చేయుము.

13. అగ్నీ! స్త్రీపురుషులు జగడములాడు చున్నారు. స్తోతలు తమలో తాము కర్కశపదములు వాడుచున్నారు. అప్పుడు నీకు క్రోధము కలుగును. కోపమున బాణము వదులుదువు. అట్టి బాణమున రాక్షసుల గుండెలు చీల్చుము. ఏలననగా కర్కశపదములు వాడు వారు రాక్షసులే అగుదురు !

14. రాక్షసులను నీ తేజస్సున భస్మము చేయుము. నీ బలమున రాక్షసులను పరిమార్చుము. చంపదగిన రాక్షసులను నీ వెలుగుతో చంపుము. మానవుల ప్రాణములు తీయు రాక్షసులను నరుకుము.

15. నేడు అగ్ని మున్నగు దేవతలు పాపి రాక్షసులను పరిమార్చవలెను. మా తిట్లు రాక్షసులకు తగులవలెను. మిధ్యావాదులగు రాక్షసుల మీద బాణములు పడవలెను రాక్షసులు విశ్వవ్యాపి అగ్ని బంధమున పడవలెను.

16. అగ్నీ ! నరమాంసమును అశ్వము మున్నగుమాంసములను సంగ్రహించువారును అవధ్యగోవులను దొంగలించు వారగు రాక్షసుల తలలను నీ బలమున నరికి వేయుము.

17. ఏడాది ఆవుపాలు రాక్షసులు త్రాగరాదు. మానవదర్శక అగ్నీ! అట్టి అమృతమయ దుగ్ధములను త్రాగపూనిన రాక్షసుడు ఎదురు పడినంత నీ జ్వాలలతో వాని మర్మాంగములను ఛిన్నాభిన్నము చేయుము.

18. రాక్షసులు త్రాగు ఆవుపాలు విషము కావలెను. ఆ దుష్టులను నరికి అదితికి బలి ఇవ్వండి. సూర్యుడు వారిని హింసించవలెను. తృణలతాదులందు మిగిలిన పరిగను మాత్రమే రాక్షసులు తీసికొనవలెను.

19. అగ్నీ! వచ్చిన రాక్షసుని వచ్చినట్లు చంపుము. యుద్ధమందు రాక్షసులు నిన్ను జయించరాదు. పచ్చి మాంసము తిను రాక్షసులను సమూలముగ ధ్వంసము చేయుము. వారు నీ దివ్యాస్త్రముల నుండి తప్పించు కొనరాదు.

20. అగ్నీ! నీ జ్వాలలు అత్యంత ఉజ్వలములు అవి నాశ్యములు తాపకరములు మమ్ము నీవు తూర్పు పడమర, ఉత్తర, దక్షిణ నాలుగు దిక్కులు రక్షింపుము. పాపి రాక్షసులను భస్మము చేయుము.

21. దీప్తగ్నీ ! నీవు కార్మోన్ముఖుడువగుము. నీ కార్యకౌశలమున మమ్ము నలుదిశలందు రక్షింపుము. అగ్నీ! నేను నీకు మిత్రుడను. నిన్ను ముసలితనము చేరదు. నాకు దీర్ఘాయువుగలవార్ధక్యమునిమ్ము. నీవు మరణరహితుడవు. మేము మరణ శీలురము. మమ్ము రక్షింపుము.

22. బలపుత్ర అగ్నీ! నీవు రక్కసులను నీ వ్యాపక తేజమున దహించుము. ఎర్రగా కాలిన కత్తులతో వారిని కాల్చుము.

23. స్త్రీపురుష సంగమమును చూడ సంబరపడుచు తిరుగు రక్కసులను కాల్చివేయుము. అగ్నీ! నిన్ను తాక గలవాడులేడు. నేను స్తుతులతో నిన్ను స్తుతింతును జాగ్రత్త.

24. అగ్నీ ! నీ తేజమున రాక్షస తేజమును నలువైపుల నుండి నష్టపరచుము. రాక్షసుల బలవీర్యములను త్రుంచివేయుము.

## ఎనుబది ఎనిమిదవ సూక్తము

ఋషి - మూర్ధన్వుడు. దేవత - అగ్ని. ఛందస్సు - త్రిష్టుప్.

1. సోమరసము పానయోగ్యము. నిత్యనూతనము. దేవ సేవితము దానిని స్వర్గము, ఆకాశములందున్నగ్నిముందు హుతము చేయబడును. సోమపు ఉత్పాదన, పరిపూరణ, ధారణ కొరకే దేవతలు సుఖకర అగ్నిని వర్ధిల్ల చేయుదురు.

2. చీకట్లు లోకములను మ్రింగును. అందువలన భువనములు అంతర్ధానములగును. అగ్ని వెలువడును సర్వము ప్రసన్నమగును. దేవతలు, ఆకాశము, జలములు, వృక్షములన్నియు సంతుష్టి చెందును.

3. యజ్ఞ భాగములుగ్రహించు దేవతలు నన్ను ఏర్పరచినారు. అందువలన నేను అజరుడు, విశాలుడగు అగ్నిని స్తుతింతును. అగ్ని తన తేజమున భూమ్యాకాశముల మధ్యనున్న స్థానమును ద్యావాపృథ్వులను విస్తరింప చేసినాడు.

4. వైశ్వానరాగ్నిని దేవతలు సేవింతురు. అతడు హోతలందు ముఖ్యుడు. యజమానులు అగ్నిని అభిలషింతురు. అగ్నిని ఘృతయుక్తుని చేయుదురు. ఆ అగ్నియే ఎగురునట్టి పక్షులను పాకునట్టి పాములను, సకల స్థావర జంగమాత్మక జగత్తును సృష్టించినాడు.

5. అగ్నీ! నీవు త్రిలోక శిరమున, ఆదిత్యునితో నివసింతువు. అట్టి నిన్ను మేము చక్కని స్తుతులచే స్తుతింతుము. నీవు ద్యావా పృథ్వుల పూరకుడవు, యజ్ఞయోగ్యుడవు.

6. అగ్ని రాత్రులందు సకల ప్రాణుల మస్తకస్వరూపుడగును. ప్రాతఃకాలమున సూర్యరూపమున ఉదయించును. ఈ అగ్నిని యజ్ఞసంపాదక దేవతల ప్రజ్ఞగా భావించబడును. అగ్ని ఆలోచనపరుడై త్వరగా అన్ని చోట్ల సంచరించును.

7. అగ్ని విశేషముగ ప్రజ్వలితుడైనాడు. సుందరరూపము దాల్చినాడు. ఆకాశమున స్థానము గ్రహించినాడు. అక్కడ దీప్తి చెంది శోభిల్లినాడు. అట్టి అగ్నిని శరీర రక్షకులగు దేవతలు స్తుతించుచు హవిని అర్పించినారు.

8. తొలుత దేవతలు ద్యావాపృథివ్యాదులను మనసున నిరూపింతురు. తదుపరి అగ్నిని పుట్టింతురు - హవిని వెల్లడింతురు. అగ్ని దేవతలకు యజనీయుడు శరీర రక్షకుడు. ద్యులోక, భూలోక అంతరిక్షములకు అగ్ని

తెలిసినవాడు.

9. దేవతలు అగ్నిని ఉత్పన్నము చేయుదురు. సకల పదార్థములతో సర్వమేధ యజ్ఞమున హవనము చేయుదురు. ఆ అగ్నియే సరళగామి అగును. మహాజ్వాలలచే ద్యావా పృథ్వులను తపింపచేయును.

10. అగ్ని ద్యావాపృథ్వులను పూరించువాడు. దేవలోకము నందలి దేవతలు తమ శక్తితోను కేవలస్తుతులతోను అగ్నిని కల్పించినారు. సుఖావహమగు ఆ అగ్నిని మూడు భావములుగ ద్యులోక, భూలోక, అంతరిక్ష ఏర్పరచినారు. ఆ అగ్నియే ధాన్యము, ఓషధులు మున్నగు వానిని పండించు చున్నాడు.

11. యజ్ఞయోగ్యులగు దేవతలు అగ్నిని, అదితిపుత్ర సూర్యుని ఆకాశమున స్థాపించినారు. అప్పుడు వారు జంటగా సంచరించినారు. అప్పుడు సకల ప్రాణులు వారిని చూడ గలిగినవి "ప్రపశ్యన్భువనాని విశ్వా."

12. అగ్ని మానవహితము కోరువాడు. సకల దేవతలు అగ్నిని పగటి పతాకగా ఏర్పరచినారు. ఆ అగ్ని వింతవెలుగుల ప్రభాతము కలిగించును. కదలి పోవునపుడు తనమంటలతో లోకముల చీకట్లను తుడిచి పెట్టును.

13. విప్రులు, యజ్ఞయోగ్యులగు దేవతలు అజరవైశ్వాన రాగ్నిని సృష్టించినారు. ఆ అగ్ని పెరిగి విరాట్ రూపము దాల్చును. అప్పుడు అతడు దేవతల సమక్షముననే చిరకాలము ఆకసమున నిలిచిన చుక్కలను కాంతిహీనులను చేయును.

14. అగ్ని నిత్య దీప్తుడు క్రాంతప్రజ్ఞుడు విశ్వహితైషి అట్టి అగ్నిని మేము మంత్రములచే స్తుతింతుము. వైశ్వానరాగ్ని తన మహిమ వలన ద్యావాపృథ్వులను చిన్నబరుచును. అగ్ని కిందను, మీదను తపించును. "ఇతావస్తాదుత దేవః పరస్తాత్."

15. పితరులను, దేవతలను, మానవుల దేవయాన పితృయాన మార్గములను నేను విన్నాను. ఈ సకలలోకములు ముందుకు సాగుచు ఆరెండు మార్గములనే అనుసరించును.

16. సూర్యుని తలయందు పుట్టిన వాడును, స్తుతులచే పరి పుష్టము చేయబడువాడును, సంచరించునపుడు ద్యావాపృథ్వులచే భరింపబడువాడును, తన విధులందు ఎన్నడును సడలింపురానివ్వనట్టి వాడు వెలుగులు వెలుగుచు సర్వజగములందు సుఖముగా ఉండును.

17. పార్థివ అగ్నికి మధ్యాగ్ని వాయువునకు 'యజ్ఞము ఎవరికి తెలియును' అను విషయమున వివాదము ఏర్పడును. అప్పుడు బంధువులగు ఋత్విక్కులు యజ్ఞము చేయుదురు. కాని ఆ వివాదమును నిర్ణయించు వాడేడి "నక్షన్తయజ్ఞం క ఇదం విదోచత్."

18. పితరులారా ! నేను మీతో తర్కని తర్కములు చేయజాలను. వానిని గురించి తెలుసుకొన దలచినాను. జిజ్ఞాసువువై అడుగుచున్నాను :-

'అగ్నులు ఎందరు? సూర్యులు ఎందరు? ఉషస్సులు ఎన్ని? జలదేవేరులెంతమంది?'

('ఏక ఏవ అగ్నిర్బహుధాసమిద్ధ ఏకః సూర్యో వివానుప్రభూతః ఏకైవోషాః సర్వమిదం విభాత్యేకం పదం విబభూవ సర్వమితి, అవివాలజల్య సంహిత యందు చెప్పబడినది. అగ్ని ఒక్కటే సమిధలు వేరు లోకములన్నిటికి సూర్యుడు ఒక్కడే ఉషస్సును ఒక్కటియే ఈ సమస్తము ఒక్కటియే అయినది.')

## ఎనుబది తొమ్మిదవ సూక్తము

ఋషి - వైశ్వామిత్ర రేణువు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు - త్రిష్టుప్.

1. స్తోతలారా ! నేతలలో శ్రేష్ఠుడగు ఇంద్రుని స్తుతించండి. ఇంద్రుని మహిమ అందరి తేజస్సులను ఓడించును. అతడు మానవులను భరించును. అతని తేజము సకలలోకములను పూరించును. అతని మహిమ సముద్రములను సైతము మించును.

2. ఇంద్రుడు వీరుడు అతడు తన తేజస్సును నలువైపులకు రథ చక్రమునువలె త్రిప్పును. నల్లని అంధకారము అదృశ్యసృష్టి వంటిది. ఇంద్రుడు తన జ్యోతిచే అట్టి అంధకారములను తొలగించును.

3. స్తోతలారా! నాతో కలసి ఇంద్రుని స్తుతించండి. ఆ స్తోత్రము కొత్తది కావలెను. కొద్ది కారాదు ద్యావాపృథ్వులందు నిరూపమానమైనది కావలెను. ఇంద్రుడు యజ్ఞములందలి స్తోత్రముల కొరకు వలె శత్రువులను చేరుటకు కూడ ఆతురపడును. ఆపదలందు అతడు మిత్రులను కోరడు. "చికాయనసఖాయ మీషే."

4. నిర్భయముగా ఇంద్రుని స్తుతించినాము. ఆకాశపు తల నుండి జలము తెచ్చినాను. ఆకాశమున చంద్రునువలె ఇంద్రుడు తన కర్మలవలన ద్యావాపృథ్వులను నిలిపి ఉంచినాడు.

5. దేవిని పానము చేసినంత మనసున వెలుగు నిండునో, ఏది త్వరగా ఉత్తేజము కలిగించునో, ఏది తన శౌర్యమున శత్రువులను గడగడలాడించునో ఏది అస్త్రశస్త్రధారి మరియు గతి శీలమగునో అట్టి సోమము అరణ్యములను పెంపొందించును. అయినను పెరిగిన అడవులు ఇంద్రునకు సాటిరావు. ఇంద్రుని కొంచెపు వానిని చేయజాలవు.

6. ద్యావాపృథ్వులు, ఎడారులు, ఆకాశము, పర్వతములు ఇంద్రునకు సరిరావు. అట్టి ఇంద్రుని కొరకు సోమము

ద్రవించును. ఇంద్రునకు శత్రువు మీద క్రోధము కలిగినపుడు గట్టిగా కొట్టును స్థావరములను సహితము విరుచును "రుజితిస్థిరాణి."

7. రంపము చెట్టును కోసినట్లు ఇంద్రుడు వృత్రుని వధించినాడు. శత్రునగరములను ధ్వంసము చేసినాడు. వర్షజలములకు నదులకు మార్గము కల్పించినాడు. పచ్చి కుండవంటి మబ్బును చిదిమినాడు. అతడు తన మిత్రులగు మరుత్తులతో కలిసి నీటిని మనముందుకు తెచ్చినాడు.

8. ఇంద్రా! నీవు ధీరుడవు స్తోతలను ఋణవిముక్తులను చేయుదువు. ఖడ్గము పశువులనువలె నీవు స్తోతల కష్టములను ఖండింతువు. మిత్రావరుణుల కర్మలను నష్టపరచు మూరులనందరను ఇంద్రుడే వధించును.

9. మిత్ర, ఆర్యమ, వరుణ, మరుత్తులను ద్వేషించు దుష్టులు ఉన్నారు. వారిని వధించుటకు పూనుకొనుము వర్షక, శబ్దకర్త, ప్రదీప్త వజ్రమును తీక్ష్ణముచేయుము.

10. స్వర్గము, జలము, భూమి పర్వతాదులమీద ఇంద్రుని ఆధిపత్యమున్నది. బలశాలురు, బుద్ధిమంతులకు ఇంద్రుడే అధిపతి. కొత్తవి సంపాదించుటకును, పాతవానిని రక్షించుటకును. ఇంద్రునే ప్రార్థించవలసి ఉండును.

11. రాత్రింబవళ్లు, ఆకాశము, జలసాగరము, విశాల వాయువు, పృథ్వియొక్క సీమ, నదులు, గోవులు అన్నింటికన్న ఇంద్రుడే పెద్దవాడు. ఇంద్రుడు అందరిని మించినవాడు.

12. ఇంద్రా! నీ వజ్రము విరుగుట ఎరగరు. జ్యోతిర్మయ ఉషః కిరణములవంటి నీ ఆయుధము శత్రువులమీద పడవలెను. పిడుగుపడి చెట్టును ధ్వంసము చేసినట్లు అనిష్టకారి శత్రువులను గర్జించుచు, మండుచు ఉరుకులు పెట్టు నీ ఆయుధముచే వధించుము.

13. ఇంద్రుడు పుట్టగనే అతనిని మాసములు, అరణ్యములు, వనస్పతులు, పర్వతములు అంటుకొని ఉన్న ద్యావాపృథ్వులు అనుసరించినవి.

14. నీవు పాపులగు రాక్షసులను నరికిన నీ అస్త్రముయేది? గోహత్య స్థానమున గోవులను వధించినట్లు నీ అస్త్రమున తెగిన మిత్రద్వేషి రాక్షసులు నేల మీద పడి చావవలెను.

15. ఇంద్రా ! మా మీద పగబట్టిన, మమ్ము బాధలపాలు చేసి మమ్ము చుట్టుముట్టిన రాక్షసులు గాఢాంధకారమున పడవలెను. వెన్నెల రాత్రులు సహితము వారికి చీకటిమయములు కావలెను.

16. యజమానులు మీ కొరకు అనేక యజ్ఞములు అనుష్ఠింతురు. స్తోతలు ఋషులు మంత్రములచే నిన్ను

ఆహ్లాదింప చేయుదురు. అందరు కలసి నిన్ను పిలుతురు పలుకుము. అర్చించు వారి యెడలప్రసన్నుడవగుము. వారి వద్దకు వెళ్లుము.

17. ఇంద్రా ! మీ స్తోత్రములు మమ్ము రక్షించవలెను. మాకు కొత్త కొత్తవి ఉత్తమ స్తుతులు అందవలెను. మేము వైశ్వామిత్రులము మా రక్షణలకు నిన్ను స్తుతింతుము. మాకు వివిధ పదార్థములు లభించవలెను.

18. ఇంద్రుడు బలిష్టుడు ధనికుడు అతనిని ఆహ్వానించు చున్నాము. యుద్ధకాలమున అన్నము పంచునపుడు అతడే అధ్యక్షత వహించును. యుద్ధమున తన పక్షమును రక్షించుటకు అతడు ఉగ్రమూర్తి అగును, శత్రువులను దునుమాడును. అతడు వృత్రులను వధించును సమస్త ధనములను గెలుచును.

**తొంబదవ సూక్తము**

ఋషి - నారాయణుడు. దేవత - అవ్యక్త పురుషుడు. ఛందస్సు - అనుష్టుప్
చివరిది త్రిష్టుప్.

1. విరాట్ పురుషునకు అనంతశిరములు అనంత చక్షువులు, అనంత పాదములు కలవు. అతడు బ్రహ్మాండము నందంతటను వ్యాపించినాడు ఆయన పాడి అంగుళులంత ఎక్కువైనాడు.

2. ఇంతవరకు జరిగినది, జరుగనున్నది అంతయు అతడే. ప్రాణులు అనుభవించుటకుగాను తన కారణావస్థను విడిచినాడు. జగన్నాథావస్థను దాల్చినాడు. అతడు దేవత్వమునకు ఈశ్వరుడు.

3. ఈ బ్రహ్మాండమంతయు అతని మహిమయే. అతడు స్వయముగా తన మహిమను మించినవాడు. ఇతని ఒక పాదము అంశము - బ్రహ్మాండమున ఉన్నది. అవిశ్యములగు మిగిలిన మూడు పాదములు అంశములు దివ్యలోకమున ఉన్నవి.

4. మూడు అంశములవాడు పైకి లేచినాడు అతని ఒక్క అంశము ఇహమున ఉన్నది. తదుపరి అతడు ఆహార సహిత - ఆహారరహిత - చేతనా చేతన పదార్థములందు వివిధరూపములచే వ్యాపించినాడు.

5. ఆ విరాట్ పురుషుని నుండియే బ్రహ్మాండము ఏర్పడినది. బ్రహ్మాండ దేహమును ఆశ్రయించి జీవరూపుడు జన్మించినాడు. అతడు దేవ మనుష్య రూపుడు అయినాడు. అతడు భూమిని జీవుల శరీరమును సృష్టించినాడు.

6. పురుషరూప మానస హవిచే దేవతలు మానసిక యజ్ఞము చేసినారు. ఆ యజ్ఞమునుండి వసంత రూపఘృతము గ్రీష్మరూపకాష్ఠము - శరద్ రూప హవ్యము కల్పించబడినవి.

7. తొలుత జన్మించినవాడు. యజ్ఞపశురూపమున మానస యజ్ఞమున అర్పించ బడినాడు. అతని ద్వారా దేవతలు సాధ్వులు, ఋషులు యజ్ఞము చేసినారు.

8. సర్వాత్మక పురుషుని హవనము జరిగిన మానస యజ్ఞమునుండి దధిమిశ్రిత ఘృతాదులు పుట్టినవి అందునుండియే వన్యమృగములు, గ్రామ్యమృగములు ఉత్పన్నములైనవి.

9. సర్వాత్మక పురుషుని హోమ యుక్తమగు ఆ యజ్ఞమునుండి ఋక్, సామములు ఉత్పన్నములైనవి. అందునుండియే గాయత్రి మున్నగు ఏడు ఛందస్సులు యజువు ఉత్పన్నములైనవి.

10. ఆ యజ్ఞము నుండియే క్రింద, మీద దంతములుగల అశ్వములు అన్య జంతువులు జన్మించినవి. గోవులు, గొర్రెలు మేకలు పుట్టినవి.

11. ఆ పురుషుని సంకల్పమున సృజించినపుడు అతడు ఎన్ని ప్రకారములుగ జనించినాడు? అతని ముఖము రెండు చేతులు, రెండు తొడలు, రెండు పాదములు ఎవరైనారు?

12. ఇతని ముఖమునుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి క్షత్రియులు, తొడలనుండి వైశ్యులు, పాదములనుండి శూద్రులు జన్మించినారు.

13. అతని మనసునుండి చంద్రుడు - కనులనుండి సూర్యుడు- ముఖమునుండి ఇంద్రాగ్నులు - ప్రాణము నుండి వాయువు కలిగినవి.

14. అతని నాభినుండి అంతరిక్షము - తలనుండి ద్యులోకము - చరణములనుండి భూమి - చెవులనుండి దిశలును భువనములు ఏర్పడినవి.

15. దేవతలు ప్రజాపతి యొక్క ప్రాణాది రూపులు. వారు మానసిక యజ్ఞము చేసినారు అందు పురుషరూప పశువును కట్టినారు. అప్పుడు ఏడు పరిధులు - ఇరువది యొక్క సమిధలు చేయబడినవి.

(ఐహిక మరియు ఆహవనీయములు మూడు + ఉత్తర వేదినమూడు + ఆదిత్యవేది ఒకటి ఇట్లు సప్తపరిధులు. ఇవి సప్త ఛందము కూడ అగును. 12 మాసములు + 5 ఋతువు +3 లోకములు + ఆదిత్యుడు 12 సమిధలు)

16. దేవతలు తమ యజ్ఞమును చేసిన మానస యజ్ఞమందు జగద్రూప వికార ధారకములు, ముఖ్య ధర్ములు ఏర్పడినవి. స్వర్గమందున్న ప్రాచీన సాధ్యులను, దేవతలను మహాత్ములగు ఉపాసకులు పొందగలరు.

**ఆలోచనామృతము**

1. ఈ సూక్తము ప్రఖ్యాత "పురుషసూక్తము".

ఇది అద్వైతమును ప్రతిపాదించుటకు ప్రయత్నించిన సూక్తము ఒకడే ఆధారముగ సమస్తము నిలిచి ఉన్నదని చెప్పిన సూక్తము.

2. "సహస్ర శబ్దస్య ఉపలక్షణత్వాదననైః" అనియణా చార్యులు, వేయి అనంత శబ్దమునకు సంకేతము కావున అవ్యక్త, విరాట పురుషుని తలలు మున్నగునవి అనంతములని అర్థము. కావున స్త్రీపురుషభేద రహితముగా ఎందరు వ్యక్తులున్నారో అందరును ఆమహాపురుషునిలో భాగమే అగుదురు. ఇంత జన సముదాయ స్వరూపుడే విరాటపురుషుడు! ఆ అవ్యక్త పురుషుడు సమాజము కూడ కావచ్చునని నా అభిప్రాయము. సమాజము విరాటము అవ్యక్తము విశాలము అత్యతిష్ఠద్దశాంగుళం. సర్వవ్యాపి బ్రహ్మాండమున కన్న రెండు చేతులు లేక ఒక జానెడు పెద్దది! ఈ సమాజము నుండియే సకలము ఏర్పడినవి.

3. మానస యజ్ఞమును గురించి చెప్పబడినది. ఇది కర్మరూప యజ్ఞముకాదు. జ్ఞానరూప యజ్ఞము. ఇందును గురించి ఉపనిషత్తు లందు ఎంతో వివరముగా చెప్పబడినది. ఇది అవయవములందు ఆధిక్యత మనసుకున్నదని గుర్తించిన యజ్ఞము. మనసు - ఆలోచనలు నుండియే సమస్తము ఉత్పన్న మైనదను ఒక ఉన్నత భావన కావచ్చును.

4. ఇచ్చట నాలుగు వర్ణములు మాత్రము చెప్ప బడినవి. పంచజనులు అనుపదము ఇదివరకు వచ్చినది. దానిని నాలుగు వర్ణులు + నిషాదుడు అని శాయణాచార్యులు వ్యాఖ్యానించినారు.

*(శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత ఎనిమిదవ అష్టకము పదవ మండలమున ఏడవ అనువాకము సమాప్తము.)*

**ఎనిమిదవ అనువాకము తొంబది ఒకటవ సూక్తము**

ఋషి - వీతహవ్యపుత్ర అరుణుడు. దేవత - అగ్ని ఛందస్సు - జగతి - చివరిది త్రిష్టుప్.

1. అగ్నీ! అప్రమత్తులగు స్తోతలు నిన్ను స్తుతింతురు. దాన గుణముగల అగ్ని ఉత్తరవేదిపై ఆసీనుడగును. అన్నలాభమునకు గాను సకల హవికి లోనగును. అగ్ని వరణీయుడు వ్యాపకుడు. దీప్తిమంతుడు. శుభములు కలిగించు మిత్రుడు అతడు మిత్రులను కోరును. చక్కగా జ్వలించును.

2. అగ్ని శుభంకరుడు అతిథి అతడు యజమానుల గృహములందుండును. అరణ్యములందుండును. ప్రజాహితైషి

అతడు విడిచిన వాడుండడు. అతడు సకల ప్రజల గృహములందు ఉండును.

3. అగ్నీ ! నీవు బలవంతులకు బలవంతుడవు తక్కువలో తక్కువ కర్మచేసి మేధావివి అయినావు. సర్వజ్ఞుడవు సంపదల స్థాపకుడవు త్వమేకః నీవు ఒక్కడవే ద్యావాపృథ్వులు వర్ధిల్ల చేసిన ధనములకు స్వామివి.

4. యజ్ఞ వేదికమీద సమయమునకు ఘృతయుక్త నివాస స్థానము ఏర్పరచబడును. అగ్నీ! నీవు దానిని దీప్తించుము. ఆసీనుడవగుము. నీ జ్వాలలు సూర్యకిరణములవలె నిర్మలములై దర్శనమిచ్చును.

5. నీ కిరణములు విచిత్రములు. అవి జలవర్షక మేఘము నుండి వెడలును. ప్రభాతపు రాకను సూచించు వెలుగు వలె కనిపించును. అప్పుడు నీవు బంధవిముక్తుడవు అగుదువు. అరణ్యములను, కర్రలను వెదకెదవు. ఇవన్నియు నీనోటిముందరి అన్నము అగును.

6. కాలానుగుణముగ ఓషధులు అగ్నిని గర్భమున దాల్చును. తల్లివంటి నీరు వాటికి జన్మనిచ్చును. అడవులందలి తీవలు గర్భవతులగును. అట్లేవానికి జన్మనిచ్చును.

7. అగ్నీ! నీవు గాలికి కదిలెదవు. సంచరించెదవు. అందమగు చెట్లయందు వసింతువు. నీవు దహించుటకు సిద్ధము అయినప్పుడు - రథారూఢ యోధులవలె నీ జ్వాలలు ప్రబలములు, అక్షయములయి, శాఖారూపముదాల్చి, బలమును ప్రదర్శింతువు.

8. అగ్ని జనులను మేధావులను చేయును. యజ్ఞమునకు సిద్ధిని ప్రసాదించును. హోమనిష్పాదకుడగును. ఎంతో విశాలుడగును. జ్ఞానియగును. హవి కొంచెమిచ్చినను, ఎక్కువ ఇచ్చినను దానిని అగ్నిమాత్రమే స్వీకరించవలసి ఉండును. ఇతరులుకాదు - "నాన్యంత్వత్"

9. అగ్నీ ! యజమానులు యజ్ఞమున నిన్ను అభిలషింతురు హోతగా నిన్నే వరింతురు. అప్పుడు దైవభక్తి మానవులు కుశలు విరిచెదరు. హవిని తెచ్చెదరు. నీకు ఇచ్చెదరు.

10. అగ్నీ ! నీవే హోత, హోతకార్యము నిర్వర్తించవలసి ఉండును. యజ్ఞకర్తవు నీవే ప్రశాస్త అధ్వర్యు బ్రహ్మకార్యము నిర్వర్తించువాడవు "అసిగృహపతిశ్చ నోదమే" నాకు గృహపతినికూడ నీవే యగుదువు.

11. అగ్నీ! నీవు అమరుడవని తెలిసికొని సమిధలు, హవి సమర్పించువానికి నీవు హోతవగుదువు. అతని కొరకు నీవు దేవదూతవగుదువు. దేవతలను ఆహ్వానింతువు. యజ్ఞానుష్ఠానము చేయుదువు. అధ్వర్యుకార్యము నిర్వర్తింతువు.

12. ఈ సమస్త ధ్యానములు, వేదవాక్యము, స్తోత్రములు అగ్నికే అర్పితములు. అర్థాభిషగల ఈ సమస్త స్తుతులు జ్ఞాని అగ్నియందే మిళితములగును. సంపదల వృద్ధిచే అగ్ని స్తోత్రముల వృద్ధికి సంతుష్టుడగును.

13. స్తోత్రాభిలాషియగు ప్రాచీన అగ్ని కొరకు నేను ఎంతో క్రొత్త సుందర స్తోత్రములు వచింతును. అగ్ని వినవలెను. ప్రణయ పరవశ యువతీ మంచి బట్టలు కట్టి భర్త హృదయమునందు ప్రవేశించినట్లు - నేను అగ్ని హృదయ మధ్య స్థానమునకు చేరుకొందును.

14. అశ్వమేధమన అగ్నికి అశ్వములు, బలిష్టవృషభములు, పిరికి మేకలు ఆహుతిగ ఇవ్వబడును. అగ్ని జలము త్రాగువాడు అతని మీద సోమము ఉండును. అతడు యజ్ఞానుష్ఠాత. అట్టి అగ్ని కొరకు మనసుతో శుభంకర స్తుతులు రచింతును.

15. స్రుక్కునందు ఘృతము, చమసమునందు సోమము నిలిపినట్లే అగ్నీ! నీ సుఖమునందు హవి, పురోడాశాదుల హవనము జరుగును. నీకు నాకు అన్నము, ధనము, మంచి పుత్ర పౌత్రులు గల యశస్సు ప్రదానము చేయుము.

### తొంబది రెండవ సూక్తము

ఋషి - మనుపుత్ర శౌర్యతుడు. దేవత - అనేకులు. ఛందస్సు - జగతి

1. అగ్ని యజ్ఞనేత మానవులస్వామి. హోత రాత్రికి అతిథి వివిధదీప్త ధనవంతుడు దేవతలారా! అగ్నిని సేవించండి. ఎండు కర్రలను కాల్చువాడు పచ్చి కర్రలందు వంకర నడక కలవాడు కోరికలు తీర్చువాడు యజ్ఞమునకు పతాకస్వరూపుడు యజనీయుడగు అగ్ని ఆకాశమున శయనించును.

2. అగ్ని రక్షకుడు ధర్మధారి దేవతలు, మానవులు అగ్నిని యజ్ఞసాధకుని చేసినారు. అగ్ని మహాపురోహితుడు శుభములిచ్చువాయు పుత్రుడు ఉషస్సులు - సూర్యునివలె అతనిని చుంబించును.

3. అగ్ని స్తుత్యుడు మార్గదర్శకుడు. మేము అగ్ని కొరకు హవనము చేయుదుము. అగ్ని దానిని ఆరగించవలెను. అగ్ని శిఖలు ప్రజ్వలములై దీప్తివంతములైనపుడు దేవతలవైపు విసరును.

4. విశాల ద్యులోకము, విస్తీర్ణవచనము, వ్యాప్త అంతరిక్షము, స్తుత్య, ఆసీమ పృథ్వి అగ్నికి నమస్కరించును. ఇంద్ర, మిత్ర, వరుణ, భగ, సవిత మున్నగు బలశాలురగు దేవతలు ప్రత్యక్షమగుదురు.

5. మరుత్తులు వేగశీలురు. వారి సాయమున నదులు ప్రవహించును. ఎల్లలులేని భూమిని కప్పివేయును. ఇంద్రుడు సంచారి అతడు సర్వత్రసంచరించును. మరుత్తుల సాయమున ఆకసమున గర్జించును. వడిగా లోకమున వానకురిపించును.

6. మరుత్తులు తమపని ప్రారంభించినపుడు లోకమును ఆకర్షింతురు. వారు ఆకాశమున శ్యేనమునకు, మేఘమునకు ఆశ్రయులగుదురు. వరుణ, మిత్ర, ఆర్యమ, ఇంద్రులు ఆశ్వారూఢ మరుత్తులకూడి ఈ సకలము వీక్షింతురు.

7. స్తోతలు ఇంద్రుని నుండి రక్షణ, సూర్యుని నుండి దృష్టి, వర్షక ఇంద్రుని నుండి పౌరుషము పొందుదురు. ఉత్కృష్టముగ ఇంద్రుని పూజించిన స్తోతకు - యజ్ఞకాలమును ఇంద్రుని వజ్రము సహాయకారి అగును.

8. ఇంద్రునకు సూర్యుడు భయపడును. భయపడి తన గుర్రములను నడిపించును. నడిపించి మార్గము నందున్న వారల నందరిని సంతోషపరచును. ఇంద్రుడు అంతటివాడు. అతనికి భయపడని వాడెవడు? ఇంద్రుడు భయంకరుడు జలవర్షకుడు అతడు ఆకాశమున గర్జించును. శత్రుంజయమగు వజ్రధ్వని అతని భయముననే నిత్యము వెలువడును.

9. రుద్రుడు కర్మకుశలుడు అతనికి నమస్కరించండి స్తుతులు అర్పించండి. అతడు శత్రువుల వినాశముచేయును. అశ్వారూఢులు, ఉత్సాహులగు మరుత్తుల సహాయము అందుకొనును. ఆకాశము నుండి జలము వర్షించును. శుభంకరుడగును. తనకీర్తిని విస్తరింప చేయును.

10. బృహస్పతియు, సోమాభిలాషులగు ఇతర దేవతలు ప్రజాసంఘముల కొరకు అన్నసంచయనము చేసినారు. అధర్వృషి అందరికన్న ముందు యజ్ఞము చేసినాడు. దేవతలను సంతుష్టులను చేసినాడు. దేవతలు, భృగువంశీయులు బలము కనబరచి ఆ యజ్ఞమునకు వెళ్లినారు. యజ్ఞమున తెలుసుకున్నారు.

11. నరాశంసనామక యజ్ఞమున నలుగురు ఆగ్నులు స్థాపించ బడినారు. ఆ యజ్ఞమునందు బహువర్షక ద్యావాపృథ్వులు, యముడు, అదితి, ధనదత్వష్ట, ఋభుజనులు, రుద్రపత్ని, మరుత్తులు, విష్ణువు స్తోత్రము అందుకున్నారు.

12. మేము అభిలాషులము. పెద్ద పెద్ద స్తోత్రములు చేయుదుము. ఆకాశమందున్న "అహిర్బధ్న్వడు" యజ్ఞ సమయమున వానిని వినవలెను. ఆకాశమున తిరుగు సూర్య, ఇంద్రులారా! మీరు ఆకాశముననే ఉండండి అంతః కరుణమున ఈ స్తుతులు వినండి.

13. పూష సకల దేవతల హితము కోరువాడు జల వంశమున పుట్టినవాడు. అతడు మా పశువులు మున్నగువానిని రక్షించవలెను. ధనము కొరకు ఆత్మస్వరూప వాయువును స్తుతించండి. అశ్వినులారా! మిమ్ము పిలుచుట వలన శుభములు కలుగును. దారిన పోవుచు ఈ స్తోత్రము వినండి.

14. సకల ప్రజకు అభయమిచ్చు స్వామిని తన కీర్తినితాను ఆర్జించుకున్న వానిని మేము స్తుతింతుము. దేవ పత్నుల

సహితముగ హవి అదితి, రేయిభర్త చంద్రుని మేము స్తుతింతుము. వారందరు మానవులను అనుగ్రహించ వలెను.

15. జ్యేష్ఠ అంగిర ఋషి ఈ యజ్ఞమున స్తుతించినాడు ప్రస్తరము లేచినది. సోమమును అందించినది బుద్ధిశాలి ఇంద్రుడు సోమము త్రావినాడు. బలిసినాడు అతని అస్త్రము ఉత్తమ జలవర్ణము కలిగించ సాగినది.

## తొంబది మూడవ సూక్తము

ఋషి - పృథపుత్ర తాన్వి. దేవత - విశ్వేదేవతలు. ఛందస్సు - వేరు వేరు.

1. ద్యావాపృథ్వులారా! మీరు ఎంతో ఎంతో విస్తరించండి. విశాలతములై స్త్రీవలె మా ఇంట ప్రవేశించండి ఈ రక్షణలు ఈ కార్యములచే మమ్ము రక్షించండి.

2. సకల యజ్ఞములందు దేవతలను సేవించువాడును. శాస్త్రముల శ్రోతయు, సుఖకరహవి అందించి దేవతలను సేవించువానిని దేవతలు అనుగ్రహింతురు.

3. దేవతలు అందరకు ప్రభువులు వారి దానము గొప్పది వారు సర్వప్రకార బలవంతులు. వారు అన్ని యజ్ఞములందును భాగములు అందుకొందురు.

4. రుద్రాపుత్రులను స్తుతించిన మానవులకు సుఖములు కలుగును. ఆర్యమ, మిత్ర, సర్వజ్ఞ వరుణ పూష, భగుడు స్తుతించదగినవారు. పుష్టికర్తలు.

5. అహిర్బుధ్న్య జలములతో ఏకత్రుడై కూర్చున్నపుడు సూర్యచంద్రులు ఒకచోట చేరి రాత్రింబవళ్లు జలముతో ధనమును వర్షింతురు.

6. శుభములకు స్వాములగు అశ్వినులు, మిత్రుడు, వరుణుడు తమ తేజములచే మమ్ము రక్షించవలెను. వీరి రక్షలుగల యజమానికి ధనము లభించును. మరుభూమి వంటి దుర్గతిని దాటిపోవును "ఈషతే ధన్వేవదురతే"

7. రుద్రపుత్ర మరుత్తులను, అశ్వినులను, సమస్త దేవతలను, రథారూఢపూషను, ఋభువులను, అన్నవంతమగు సర్వత్రగామి ఇంద్రుని, సర్వజ్ఞులగు ఋభుక్షణులు మున్నగు వారిని స్తుతించుచున్నాము. వారు మాకు సుఖములు అందించవలెను.

8. ఇంద్రుడు మహామహుండు అతడు యజ్ఞములవలన ప్రభాయుక్తుడగును. ఇంద్రుడు వేగవంత రథమును సిద్ధము చేసినపుడు యజ్ఞకర్త ఎంతో సంతోషించును. ఇంద్రుని సోమపానము అసాధారణ మగును. ఇంద్రుని కొరకు యజ్ఞములు జరుగును. ఇంద్రుడు నరులకు అసాధ్యుడు.

9. ప్రోత్సాహక దేవతలారా! మమ్ము ఉజ్వలులను చేయండి. నీవు ధనికులగు యజమానుల ఋత్విక్కులచే స్తుతించబడుదురు. ఇంద్రుడు మాకు బలస్వరూపుడు. అతడు మానవుల యజ్ఞమునకు రాదలచినాడు. తన రథమునకు వాయువునే జత చేసినట్లు అతివేగముగ విచ్చేసినాడు.

10. ద్యావాపృథ్వులారా! మీరు మా పుత్రాదులకు విశేష అన్నము ప్రసాదించండి. అది జనులకు సరిపోవునంతది, బలము నిచ్చునది, ధనలాభము కలిగించునది, విపత్తులనుండి రక్షించునది కావలెను.

11. ఇంద్రా! నీవు మా వద్దకు రాదలచినపుడు - నిన్ను స్తుతించు వారు ఎక్కడ ఉన్నను వారిని యజ్ఞసమయమున రక్షింపుము. ధనదా! నిన్ను స్తుతించువారిని గుర్తింపుము.

12. ఈ నాస్తోత్రము విస్తృతము. ఇది దీప్తివంతమై సూర్యుని వద్ద కేగును. మానవుల సిరులు పెంచును. వడ్రంగి గుఱ్ఱము గుంజు రథము చేసినట్లు నేను దీనిని రచించినాను.

13. మేము ఎవరిని ధనము అర్థింతుమో వారిని గూర్చి ఎంతో మంచి స్తుతులను తేపతేప పారాయణము చేయుదుము. యుద్ధమున సేనలు మరల మరల అగ్రసరులైనట్లు ఈ స్తోత్రము సహితము ముందునకు సాగును.

14. దేవతలందరు అయిదువందల రథములకు గుఱ్ఱములు కట్టి యజ్ఞములకు వెళ్లుదురు. అట్లేనేను దుశ్శీమ, పృథువాక్, వేన, బలిరామాది ధనపతి రాజులవద్దకు వెళ్లినాను. వారి ముందు ప్రశంసా స్తోత్రములు చదివినాను.

15. ఈ రాజులను 'తాన్వా' 'పార్థ్య' 'మాయవ' ఆది ఋషులు డెబ్బది ఏడు అశ్వములను త్వరత్వరగ అడిగినారు.

## తొంబది నాలుగవ సూక్తము

ఋషి - కద్రపుత్ర సర్పార్బుదుడు. దేవత - అభిషవశిలలు. ఛందస్సు - 5
7, 14 త్రిష్టుప్ - మిగిలినవి జగతి.

1. ఆదరణీయ, దృఢప్రస్తరమా! ఇంద్రుని కొరకు సోమాభిషవ శబ్దము చేయుము. మేము యజమానులము. మిమ్ము స్తుతింతుము. ఋత్విక్కులారా! స్తుతించండి సోమవంతులారా! సోమముతో తృప్తులుకండి.

2. ఈ శిలలు వందల, వేలమందివలె ధ్వనులు చేయును. ఇవి సోమ సంసర్గమున హరిత వర్ణములగును. దేవతలను ఆహ్వానించును. శుభకర్మలగు ఈ శిలలు యజ్ఞమునందు దేవతలను ఆహ్వానించు అగ్నికన్న ముందే హవిని అందుకొనును.

3. ఎరుపు కొమ్ములుతిను శోభన భోజనవంత వృషభములవలె ఈ శిలలు శబ్దము చేయును. మాంసము తిను వారు మాంసము ఉడికినంత ఆనంద ధ్వని చేయుదురు ఆ శిలలు అట్టి ధ్వనులు చేయును.

4. మదకరము, అభిషవింపబడు సోమము నుండి ఈ శిలలు ఇంద్రుని పిలుచుచు గొప్పధ్వని చేయును. అవి తమ నోట సోమమును అందుకొనును. అవి అభిషవ కార్యమందుండి శబ్దము చేయుచు పృథ్విని నింపును. భగినీ స్వరూప అంగుళులతో కలిసి నాట్యము చేయును.

5. ప్రస్తరముల శబ్దము విన్నంత ఆకాశమున పక్షుల శబ్దము అనిపించును. ఇవి మృగములందు గమన 'సార' 'కృష్ణసార' మృగముల వలె నాట్యము చేయును. నిష్పీడిత సామరసమును క్రిందికి వలికించి నపుడు సూర్యుడు శ్వేతవర్ణ జలమును పీల్చుచున్నట్లుండును.

6. బలిష్ట అశ్వములు రథమును లాగును. తమ దేహములను పెంచుకొనును. అట్లే ఈ ప్రస్తరములు ఆయతములై సోమరసము కురిపించును. ఇవి సోమమును పీల్చునపుడు శ్వాస సహితముగ ధ్వని చేయును. గుర్రమునుండివలె వీటినోట వెలువడు మాటను నేను వినుచున్నాను.

7. ఈ ప్రస్తరములు అవినాశ్యములు వాని గుణములను కీర్తించండి. సోమాభిషవ సమయమున పదిఅంగుళులు వాటిని పట్టినపుడు ప్రస్తరస్వరూప అశ్వమునకు పది కళ్లెముల వలె కనిపించును.

8. పది అంగుళులు ఈ ప్రస్తరమునకు కవ్వపు త్రాళ్లవంటివై త్వరత్వరగా పనిచేయును. ఇవి చేసిన సోమరసము హరిత వర్ణమై వచ్చుచున్నది. సోమఖండములు మెదిగి, అన్నరూపము ధరించి అమృతరసము వెలువరించును. సోమము యొక్క తొలిభాగమును ప్రస్తరములే అందుకొనును.

9. ఈ శిలలు సోమపానము చేయును. ఇంద్రుని అశ్వముల జంటను చుంబించును. అందునుండి వెడలిన రసము గోచర్మము మీదకు పోవును. ఈ శిలలు సోమము నుండి మధుర రసము తీయును. ఇంద్రుడు దానిని పానము చేసి బలసి, పెరుగును. ఆబోతువలె బలము ప్రకటించును.

10. ప్రస్తరములారా! నిరాశచెందవద్దు సోమఖండము మాకు రసము అందించును. మీరు ఏ యజ్ఞమున ఉందురో వారు సదా అన్నవంతులు, భోజనవంతులు అగుదురు. ధనికులవలె ఉజ్వల తేజోవంతులగుదురు.

11. మీకు అలసటలేదు ఇతరులకు అలసట కలిగింతురు మీకు శ్రమ శిథిలత, జర, రోగము, తృష్ణ, స్పృహ ఉండవు.

12. మీ పూర్వజులు పర్వతములు అవి యుగయుగములనుండి స్థిరములు పూర్ణాభిలాషులు. ఏ పరిస్థితులందును తమ స్థానము వదలవు. అవి అజరములు పచ్చని చెట్లుగలవి పక్షుల కలకలా రావములచే ద్యావాపృథ్వులను నింపును.

13. రథము నడుపువారు రథము నడుపుచు కేకలు వేసినట్లు ఈ శిలలు సోమరసము చేయుచు చప్పుడు చేయును. నాట్లు వేయువారి వలె ఇవి సోమమును వెల్లడి చేయును. ఇవి తింటవి కాని నష్టపరచవు.

14. ఆటలాడు పిల్లడు తల్లిని పట్టుకొని అరచినట్లు సోమాభిషమైనంత ఈ శిలలు అరచును. సోమరసమును అభిషవించిన శిలలను స్తుతించండి. ప్రస్తరములారా ! మీరు రండి తిరగండి.

*(శ్రీమదాంధ్ర ఋగ్వేద సంహిత పదవ మండలము ఎనిమిదవ అష్టకమున నాలుగవ అధ్యాయము సమాప్తము.)*

**ఓం వతామివన్తిమాయినో నధీరావ్రతా దేవానాం ప్రథమాధ్రువాణి**
**నరోదపీ అద్రుహో దేద్యా భిర్న పర్వతావి నమేత స్థివాంసః**

**అయిదవ అధ్యాయము తొంబది అయిదవ సూక్తము**

ఋషి - పురూరవుడు ఊర్వశి. దేవత - ఊర్వశీ పురూరవులు. ఛందస్సు - త్రిష్టుప్.

***ఓం హయేజామే మనపాతిష్ఠఘోరేవ బాంసిమిశ్రాకృణవావ వహైను***
***ననౌ మన్త్ర అమదితా సపతేమయస్కరన్పరత రేచనాహాక్***

1. పురూరవుని మాట :-

అయే! నిష్ఠుర పత్నీ! అనురాగము మనసున నింపుము. నిలువుము. ఇప్పుడే మనము ఊసులాడు కుందము. మనము ఊసులాడకున్న ముందు మనకు సుఖముండదు.

2. ఊర్వశి మాట :-

వట్టి ఊసులాటతో ఏమగును? తొలిసంజవలె నేను నీ నుండి బయటపడినాను. పురూరవా! ఇంటికి మరలుము నేను గాలివంటి దానను అందను.

3. పురూరవుని మాట :-

ఊర్వశీ! నీ వివాహము భరింపరాకున్నది తూణీరము నుండి బాణము వెడలదు. జయశ్రీనాకు దక్కదు. యుద్ధమునకు పోజాలను. అపరిమిత గోవులను తేజాలను. రాజ కార్యములందు బలములేదు. కాంతి కోల్పోయిన నా సైనికులు యుద్ధమందు సింహనాదము మరచినారు.

4. ఊర్వశిమాట :-

సఖీఉషా! ఊర్వశి మాకు భోజనాదులు సమకూర్చును. వెంటనే దగ్గరనున్న పతిశయన గృహాము చేరును. భర్తతో రాత్రింబవళ్ళు సుఖములందు తేలియాడుదును.

5. పురూరవా! రోజుకు మూడు సార్లు నన్ను పురుషదండమున కొట్టినావు. నాకు సవతుల పోరు లేదు. నన్నే నీవు ఎంతో తృప్తిచెందించినావు. నేను నీ ఇంట అడుగిడినాను. అంతే నీవు నాకు వీరుడవైనావు రాజువైనావు నా సకల సుఖముల నిర్ణేత వయినావు.

6. పురూరవుని మాట :-

'సుజూర్ని' 'శ్రేణి' 'సుమ్న' 'ఆపి' 'హ్రదేచక్షు' 'గ్రంథిని' 'చరణ్య' మున్నగు అప్సరసలు - నీవు వచ్చిన తరువాత అలంకరించుకొని నా వద్దకు రాలేదు. కొట్టమునకు చేరు ఆవులవలె అరచును. కాని నా ఇంట అడుగు పెట్టలేదు.

7. ఊర్వశి మాట :-

పురూరవుడు పుట్టినపుడు దేవపత్నులు చూచుటకు వచ్చినారు. స్వశక్తిచే ప్రవహించు నదులు అతనిని పెంచినవి. పురూరవా! నిన్ను యుద్ధమునకు పంపుటకు దస్యులను వధించుటకు దేవతలు నిన్ను పెంచి పెద్ద చేసినారు.

8. పురూరవుని మాట :-

పురూరవుడు మానవుడుగా అప్సరసలవైపు సాగినాడు అప్పుడు వారు తమరూపము విడిచినారు. మాయమైనారు. వారు బెదరని లేడివలె ఉరికినారు. రథమునకు కట్టిన గుర్రమువలె పరిగెత్తినారు.

9. పురూరవుడు మానవుడుగా దేవలోకవాసినులు అప్సరసలతో ముచ్చటలాడ దలచినాడు. వారిని తాక దలచినాడు అప్పుడు వారు లుప్తులైనారు. వారి తనువులు చూపలేదు ఆటలాడు గుర్రముల వలె పారిపోయినారు.

10. అపుడు ఆకసమునుండి ఒక మెరుపుతీగ వచ్చినది. ఆమె ఊర్వశి. మెరుపు వంటి సొగసున వచ్చినది. నా కోరికలన్నింటిని తీర్చినది. ఆమె గర్భము నుండి మనవ ఔరసుడు, సుందర పుత్రుడు జన్మించినాడు. ఊర్వశి వాడిని దీర్ఘాయువును చేయవలెను. "ఊర్వశీ తిరత దీర్ఘమాయుః"

11. ఊర్వశీ మాట:-

పురూరవా! నా గర్భమున వీర్యము విడిచినావు. భూమండలమును రక్షించుటకు ఒకపుత్రుని కన్నావు ఇది జరిగిన నేనుండనని నీకు అనేక మారులు చెప్పినాను. పరిణామము నాకు తెలియును. నీవు వినలేదు. ఇప్పుడు భూమిని పాలించు పని వదిలి వృధామాటలకు ఏలదిగుదువు?

12. పురూరవుని పలుకు :-

నీ కొడుకు నన్ను చేరునా? చేరిన ఏడవకుండునా? కన్నీరు రాల్చకుండునా? పరస్పర ప్రేమసంపన్న స్త్రీపురుషులను ఎవడు విడదీయ దలచినాడు? "అధయదగ్నిః శ్వశురేషుదీదయత్" మామ ఇంట కదా నీవు తేజోరూప గర్భమును ప్రదీప్తము చేసినావు?

13. ఊర్వశి పలుకు :-

నీ మాటలకు ప్రత్యుత్తరము వినుము. కొడుకు నీవద్ద ఉండి కన్నీరురాల్చడు. ఏడవడు. నేను వాని శుభములు కోరుదును. నీ కొడుకును నీ వద్దకు పంపుదును. "అస్మే పరేవ్యస్తః నహిమూరమాపః" మూర్ఖా! ఇంటికి తిరిగి పొమ్ము నన్ను అందుకొన జాలవు.

14. పురూరవుని పలుకు :-

నిన్ను ప్రేమించు పతి ఈ రోజు పడిపోయినాడు మరల లేవడు. వాడు దూరతీరములకు వెళ్లిపోయినాడు వాడు దుర్గతిచే చచ్చునుగాథ వానిని తోడేలు మున్నగునవి మ్రింగునుగాత.

15. ఊర్వశిమాట :-

పురూరవీ! నీవు కోరుకొనకుము. పడిపోకుము. తోడేళ్లుమున్నగునవి నిన్ను తినరాదు. స్త్రీల ప్రేమ నిలుచునదికాదు. స్త్రీ హృదయము వృకహృదయము వంటిది. "నవై స్త్రీణాని సఖ్యావి సన్తి సాలావృకాణాం హృదయాస్యేతా"

16. నేను నానారూపములుగ మానవులందు తిరిగినాను. నేను మనుష్యులందు నాలుగేళ్లు రాత్రి వాసము చేసినాను - ఆకలి తీర్చుకున్నాను తిరిగినాను.

17. పురూరవుని మాట :-

ఊర్వశి అంతరిక్షమును పూరించునది. జలములను చేయునది ఆమెను వసిష్ఠుడు వాసములందు శిష్ఠుడగు

పురూరవుడు వశపరచు కున్నాడు. శుభకర్మముల పురూరవుడు నీ వద్ద ఉండునుగాత. నా హృదయము జ్వలించుచున్నది ఊర్వశీరమ్ము తిరిగిరమ్ము "వర్తస్వ".

18. ఊర్వశి వాక్కు:-

ఇళాపుత్ర పురూరవా! ఈ సకల దేవతలు నీతో అనుచున్నారు కదా:- నీవు మృత్యుంజయుడవగుదువు. హవినిచ్చి దేవతలను పూజింతురు. స్వర్గమునకు చేరి సుఖసంతోషములు అనుభవింతువు.

**ఆలోచనామృతము:-**

ఇది ప్రేమామృతము. ఒక మంచి-చక్కని ప్రేమ కథ !

పేరు ఎప్పుడు వచ్చెనో తెలియదు. కాని ప్రేమ సృష్టితో పుట్టినది.

ప్రేమకు కామము అనే ఒక పెడర్థమును పాశ్చాత్యులు కల్పించినారు. వారన్నదే నిత్య సత్యమని నమ్ముట భారతజాతి నవనాగరకతను చేసినారు అంగ్రేజులు మనము అంగ్రేజులను తరిమినామని చంకలు గ్రుద్దుకొనుట ఒక భ్రమ. నాడు అంగ్రేజులు రాజకీయముగా మాత్రమే పెత్తనము చేసినారు! నేడు అంగ్రేజీని స్వచ్ఛందముగా నెత్తికి ఎక్కించుకున్నాము!!

ప్రేమ యువతీయువకులు మధ్యనుండు లైంగిక సంబంధము అని అంగ్రేజులు చెప్పినారు. అదియేమనకు వేదమైనది! దూడతల్లిని చూచి ఛంగుఛంగున చేరునదేమి? దూడను చూచి చన్నులు చేసి తల్లిపాలిచ్చునదేమి? సూర్యునకు కమలములకు, చంద్రునకు కలువల కున్న సంబంధమేమి? తల్లి పిట్ట పిల్ల పిట్టకు గూటిలోనికి తెచ్చి ఆహారమునందించు దానినేమందురు? విషజంతువులు సహితము తమపిల్లల కొరకు ప్రాణములిచ్చు దానిని ఏమందురు?

ప్రేమకు శారీరక అవసరములతో అంతగా సంబంధములేదు. ప్రేమ మానసికము దానికి లాభనష్టముల బేరీజులతో పనిలేదు.

ప్రేమప్రయోజనము కోరదు అనుబంధము కోరును. ప్రేమ ఇచ్చుటయే ఎరుగును! అడుగుటెరుగదు!! ప్రేమ, త్యాగము రెండు కవలలు. ఒకటిలేనిది రెండవది మనజాలదు.

సీతారాములది ప్రేమ. నలదమయంతులది ప్రేమ. శకుంతలా దుష్యంతులది ప్రేమ, లైలామజ్నూలది ప్రేమ. మిత్రులైన దామను పిథియనులది, దుర్యోధన కర్ణులది ప్రేమ. భారతీయ తత్వమున ప్రేమయే వేదము. వేదన జీవము నివేదన

ఆవేదన ఆరాధన.

ఒక పక్షి వలపు విలాపమునకు స్పందించి అమర రామాయణ మహాకావ్యమును రచించినాడు వాల్మీకి మహర్షి. ప్రేమగాధలకు ఒక కొత్త నిర్వచన మిచ్చిన కాళిదాసు రచించిన "విక్రమోర్వశీయ," మహా కావ్యమునకు ఈ సూక్తమునందలి ఊర్వశీ విక్రముల కథప్రేరణ.

2. ఎంతో చక్కని, తీయని, మాయని కథ చెప్పినాడు విచిత్రమేమనిన దీనిని ఎవరో దర్శించలేదు. స్వయముగా ద్రష్టలయినారు. దేవతలయినారు. ఇది ఆత్మకథవంటిది. వారినోట వెలు వడినది. వారి సంభాషణమే కథయైనది మనసును పిండినది. "దురాపవా, వాత ఇహహమస్మి" నేను నీకు అందను గాలివంటిదానను, ఇవి ఊర్వశిమాటలు ! ఈమె అలిగిపోయినదా? భర్తను తిట్టినదా? శపించినదా? "తేకేతమాయం రాజామేవీర తన్వస్తదాసీత్." నీ ఇంట అడుగుపెట్టినాను. నీవే నావీరుడవు, రాజువైనావు ఈ దేహమేమీదైనది. మరి ఎడబాటు ఎందులకు? విడిచిపోనేల? "రణాయవర్ధయన్దస్యుహత్యాయదేవాః"

దేవతలు నిన్ను యుద్ధమునకు దస్యుహత్యకుగాను వర్ధిల్ల చేసినారు. ఊర్వశి పురూరవునకు అతని కర్తవ్యమును ఎరుక పరిచినది. నేను వచ్చినప్పటినుంచి నా కొంగు పట్టుకొని కూర్చున్నావు. రాచకార్యములు మరచినావు. వాటిని నిర్వర్తించుము. అని శ్రీకృష్ణుడు అర్జునునకు వలె బోధించినది! ఎడబాటును ఇరువురు సహించజాలరు. ప్రేమ ఊర్వశిని త్యాగమునకు పురికొల్పినది! భర్తను కర్తవ్యపరాయణుని చేయుటకు స్వచ్ఛందముగ విరహమును కోరుచున్నది. ఆమె మనసున వలపుగూడు కట్టుకున్నది. సూదులు గ్రుచ్చుచున్నది. అయినను ఆమె భరించినది! ఇది ప్రేమ యగును!! ఇది త్యాగమగును!!! పురూరవునిది మరొక వేదన! యువతీ యువకులు పరస్పర గాఢ ప్రేమ బిడ్డలు కలుగునంతవరకే!! తదుపరి ఉభయుల కంటిపాపలూ పాపలే!!! పురూరవుని విరహము ప్రేయసి వరకు పరిమితముకాదు. ఆమె వద్ద తన బిడ్డున్నాడు! ఇతని విరహము రెండింతలు!! ఊర్వశి మరొక త్యాగమునకు సిద్ధమైనది! బిడ్డను ప్రియునకు ఇచ్చుటకు సిద్ధపడినది. ఈమె త్యాగము రెండింతలు!! ప్రియుని, కన్న బిడ్డను వదులుకున్నది! ఆమె వేదన అక్షరములకు అందనిది మనసున్నవారిని విడువనిది వ్యధలు నిండిన ఆమె కనులు నన్ను కదిలించుచున్నవి! ప్రేమ, త్యాగము స్త్రీకి మాత్రమే సాధ్యమగును! అట్లుండ ఊర్వశి "వవైస్త్రైణాని సఖ్యాపన్తి" స్త్రీ ప్రేమ స్థిరముకాదు, అనుట పురూరవుని మరలించుటకు మాత్రమే. ఇందు సత్యము ఇసుమంతయులేదు.

3. భార్యాభర్తల ప్రేమ వృక్షము వంటిది. అది తొలుత చెట్టు మొదలు వంటిది. అది వారికే ప్రయోజనము. పిల్లలు కలిగినంత కొమ్మలు వేసికాయలు కాయుట వంటిది. తమ కన్న పిల్లలకే ప్రయోజనకరము. అది మరింత పెద్దదైన గృహస్థాశ్రమున అతిథి అభ్యాగతులను సేవించుట వలన సమాజమునకు ఉపయోగపడును.

ప్రేమ నిరంతరము, ప్రియురాలి మీద పెట్టుకున్న పురూరవుడు తన ధర్మమును విస్మరించినాడు. అందువలన సమాజమునకు అపకారము జరిగినది. సామాజిక ధర్మము ప్రణయధర్మమును మించినదని చెప్పుట ఇందలి పరమార్ధము కావచ్చును.

4. ఇందలి సుమధుర కథ తెలిసి ఉండవచ్చును అయినను వివరింతును. మానవుడగు పురూరవుడు అప్సరల వెంట పడినాడు. ఊర్వశిమాత్రము అతనికి అందినది తనకు సంతానము కలిగెనా వదలిపోదునని ఊర్వశి షరతు పెట్టినది. వయసు ఉరుకులు పెట్టగా అందుకు వప్పుకున్నాడు. వేడి చల్లారగా సంతాన వాంఛ కలిగినది. ఊర్వశి సంతానవతి అయినది. పురూరవుని వదలి పోయినది. పురూరవునకు ఊర్వశియు, తన బిడ్డయు కావలెను అది అతని వ్యధ! మానవునకు తాను అనుకున్నవి అన్నియు అందవు! ఇది పచ్చివాస్తవ జీవిత నగ్న సత్యము.

5. మానవులు అప్సరలు వేరు వేరు జాతుల వలె ఉన్నవి. వారికి దాంపత్యము కుదిరినను కుటుంబము ఏర్పడినట్లు కనిపించదు. విశ్వామిత్రునకు మేనక వలన శకుంతల కలిగినది. మేనక బిడ్డను వదిలి వెళ్లిపోయినది. శంతనునకు గంగ వలన దేవవ్రతభీష్ముడు కలిగినాడు. ఆమె భీష్ముని వదిలి వెళ్లిపోయినది గంగ మానవస్త్రీ కాదు దేవత. పెళ్లికాకుండ కలిగిన సంతానమును పోషించు బాధ్యత తండ్రిమీద ఉన్నట్లున్నది. "నివృతస్వ హృదయం తప్యతమే" అన్న పురూరవుని ఆక్రందన నా మనసును వీడకున్నది.

## తొంబది ఆరవ సూక్తము

ఋషి - అంగిరస వరుడు లేదా ఇంద్రపుత్రుడు సర్వహరి దేవత -
హర్యశ్వములు ఛందస్సు - జగతి 12, 13 త్రిష్టుప్.

1. ఇంద్రా! ఈ మహాయజ్ఞమున నీ అశ్వద్వయమును నేను స్తుతించినాను. నీవు శత్రుహింసకుడవు మంచి మత్తులోనికి జారుమని ప్రార్థించు చున్నాను. హరితవర్ణ అశ్వములపై విచ్చేయుము. ఘృతము వంటి మంచి జలమును కురిపించుము. నీవు ఎంతో శుభ్రమైనవాడవు నా స్తోత్రములు నీ వద్దకు చేరవలెను.

2. స్తోతలారా! మీరు ఇంద్రుని యజ్ఞమునకు పిలిచినారు. ఇంద్రుని అశ్వద్వయమును యజ్ఞ గృహమునకు తెచ్చినారు. అశ్వములతో కూడ ఇంద్రుని బలవీర్యములను స్తుతించండి. గోవులు పాలిచ్చి జనులను సంతృప్తులను చేయును కదా! అట్లే ఇంద్రునకు హరితవర్ణ సోమరసమిచ్చి సంతృప్తుని చేయండి.

3. ఇంద్రుని వజ్రము లోహ నిర్మితము. హరిత వర్ణము- సుందరము. అది రెండు చేతులందు పట్టునది. శత్రునాశకము. ఇంద్రుడు ధనికుడు చక్కని దవడలవాడు. కోపము కలిగి బాణము వదిలి శత్రువును సంహరించును. హరిత వర్ణ సోమరసమున ఇంద్రుని అభిషిక్తుని చేయనైనది.

4. వజ్రము ఆకాశమున సూర్యుని వలె వెలుగుచున్నది తన వేగమున సకలదిశలందు వ్యాపించినది. ఇంద్రుడు చక్కగా లోహమయ వజ్రమున వృత్రుని వధించినాడు. అపారదీప్తిని ఆర్జించినాడు.

5. హరిత కేశ ఇంద్రా! పూర్వపు యజమానులు నిన్ను స్తుతించి సర్వప్రకారములగు నీ అన్నములు

ప్రశంసనీయములు నిరుపమములు ఉజ్వలములు.

6. స్తుత్యుడు, వజ్రధరుడగు ఇంద్రుడు సోమరసపానపు ఆనందడోలికలందు తేలియాడునపుడు సుందరములగు అతని అశ్వములు రథమునకు జతయై కొనిపోవును. ఇంద్రుని కొరకు అనేక పర్యాయములు సోమము అభిషవింపబడును.

7. ఇంద్రుడు చలించనివాడు. అతని కొరకు వలసినంత సోమము ఉంచబడినది. ఈ సోమమే ఇంద్రుని అశ్వములను యజ్ఞమువైపు వేగముగా నడిపించును. హరిత అశ్వములు యుద్ధములకు తీసికొను వెళ్లు రథమే ఈ సోమయజ్ఞమునకు చేరినది.

8. ఇంద్రుని గడ్డము, మీసములు, ఉజ్వలములు. అవి ఇనుమువలె గట్టివి. వాటికి సోమము అందును. అవి సోమపానము చేసి బలిసిపోవును. వాటి సంపద యజ్ఞమే అగును. అశ్వములు వానిని యజ్ఞములకు తెచ్చును. అవి గుర్రపుజంటనెక్కి సకల దుర్గతులను దూరము చేయును.

9. ఇంద్రుని అశములు ఉజ్వలమై యజ్ఞమున స్రువము వంటివి అయినవి. అవి తినుటకుగాను వాటి దవడలను కదిలించును. చమసమందున్న కమనీయ సోమరస పానము చేసినవి. తమదేహములను పెంచుకున్నవి.

10. సుందర ఇంద్రుని నివాసము ద్యావాపృథ్వులగును. అతడు రథము నేక్కును. గుర్రపువంటి మహావేగమున సాగును. యుద్ధములకు పోవును. ఎంతో గొప్పస్తుతులు అతనిని ప్రశంసించును. ఇంద్రా! నీవు స్వయంశక్తిచే విశేష అన్నము లిచ్చువాడవు.

**సర్వే భద్రాణి పశ్యంతు.**

## తొంబది ఆరవ సూక్తము

ఋషి - అంగిరస వరుదు లేదా ఇంద్రపుత్రుడు సర్వహరి దేవత -
హర్యశ్వములు ఛందస్సు - జగతి 12, 13 త్రిష్టుప్

1. ఇంద్రా! ఈ మహాయజ్ఞమున నీ అశ్వద్వయమును నేను స్తుతించినాను. నీవు శత్రుహింసకుడవు మంచి మత్తులోనికి జారుమని ప్రార్థించు చున్నాను. హరితవర్ణ అశ్వముల్పి విచ్చేయుము. ఘృతము వంటి మంచి జలమును కురిపించుము. నీవు ఎంతో శుభ్రమైనవాడవు. నా స్తోత్రములు నీ వద్దకు చేరవలెను.

2. స్తోతలారా ! మీరు ఇంద్రుని యజ్ఞమునకు పిలిచినారు. ఇంద్రుని అశ్వద్వయమును యజ్ఞ గృహమునకు తెచ్చినారు. అశ్వములతో కూడ ఇంద్రుని బలవీర్యములను స్తుతించండి. గోవులు పాలిచ్చి జనులను సంతృప్తులను

చేయును కదా! అట్లే ఇంద్రునకు హరితవర్ణ సోమరసమిచ్చి సంతృప్తుని చేయండి.

3. ఇంద్రుని వజ్రము లోహ నిర్మితము. హరిత వర్ణము - సుందరము. అది రెండు చేతులందు పట్టునది. శత్రునాశకము. ఇంద్రుడు ధనికుడు. చక్కని దవడలవాడు. కోపము కలిగి బాణము వదలి శత్రువుని సంహరించును. హరిత వర్ణ సోమరసమున ఇంద్రుని అభిషిక్తుని చేయనైనది.

4. వజ్రము ఆకాశమున సూర్యుని వలె వెలుగుచున్నది. తన వేగమున సకలదిశలందు వ్యాపించినది. ఇంద్రుడు చక్కగా లోహమయ వజ్రమున వత్రుని వధించినాడు. అపారదీప్తిని ఆర్జించినాడు.

5. హరిత కేశ ఇంద్రా! పూర్వపు యజమానులు నిన్ను స్తుతించిరి. సర్వప్రకారములగు నీ అన్నములు ప్రశంసనీయములు నిరుపమములు ఉజ్వలములు.

6. స్తుత్యుడు, వజ్రధరుడగు ఇంద్రుడు సోమరసపానపు ఆనందడోలికలందు తేలియాడు నపుడు సుందరములగు అతని అశ్వములు రథమునకు జతయై కొనిపోవును. ఇంద్రుని కొరకు అనేక పర్యాయములుసోమము అభిషవింపబడును.

7. ఇంద్రుడు చలించనివాడు. అతని కొరకు వలసినంత సోమము ఉంచబడినది. ఈ సోమమే ఇంద్రుని అశ్వములను యజ్ఞమువైపు వేగముగా నడిపించును. హరిత అశ్వములు యుద్ధములకు తీసికొను వెళ్లు రథమే ఈ సోమయజ్ఞమునకు చేరినది.

8. ఇంద్రుని గడ్డము, మీసములు, ఉజ్వలములు. అవి ఇనుమువలె గట్టివి. వాటికి సోమము అందును. అవి సోమపానము చేసి బలిసిపోవును. వాటి సంపద యజ్ఞమే అగును. అశ్వములు వానిని యజ్ఞములకు తెచ్చును. అవి గుర్రపుజంటనెక్కి సకల దుర్గతలను దూరము చేయును.

9. ఇంద్రుని అశ్వములు ఉజ్వలమై యజ్ఞమున స్రువము వంటివి అయినవి. అవి తినుటకు గాను వాటి దవడలను కదిలించును. చమసమందున్న కమనీయ సోమరసపానము చేసినవి. తమదేహములను పెంచుకున్నవి.

10. సుందర ఇంద్రుని నివాసము ద్యావాపృథ్వులగును. అతడు రథమునెక్కును. గుర్రపువంటి మహావేగమున సాగును. యుద్ధములకు పోవును. ఎంతో గొప్పస్తుతులు అతనిని ప్రశంసించును. ఇంద్రా! నీవు స్వయంశక్తిచే విశేష అన్నము లిచ్చువాడవు.

11. ఇంద్రా ! నీవు మహిమాన్వితుడవు. ద్యావా పృథ్వులకు వ్యాప్తి కలిగించినావు. నిత్యము నూతన స్తవములను అందుకొందువు. బలశాలివి. జలగ్రహణ కర్త సూర్యుడు. అతని వద్దకు గోవులను చేర్చుము.

12. ఇంద్రా ! రథమునకు అశ్వములను పూన్చుము. మానవ యజ్ఞములకు తరలుము. నీ కొరకు మధుర సోమరసము సిద్ధమై యున్నది. సేవింపుము. సోమము పది అంగుళుల పని వలన సిద్ధము అయినది. అది యజ్ఞ ఉపకరణము అయినది. యుద్ధ సమయములందు అట్టి సోమపానమునకు పూనుకొనుము.

13. అశ్వవంత ఇంద్రా ! ఉదయ సవనమున సోమము అర్పించబడినది. నీవు దానిని సేవించినావు. ఇది మధ్యాహ్న సవన సోమము. నీకు మాత్రమే అందించబడినది. దానిని ఆస్వాదించుము. వర్షకారి ఇంద్రా ! సోమముతో ఉదరము తడుపుకొనుము.

## తొంబది ఏడవ సూక్తము

ఓషధీ సూక్తము

ఋషి - అథర్వపుత్రభిషక్కు దేవత - ఓషధి ఛందస్సు - అనుష్టుప్

1. పూర్వము మూడు యుగముల క్రితము ప్రాచీన దేవతలు ఓషధులు సృష్టించినారు. అవి పింగళ వర్ణపువి. నూట ఏడు స్థానాలలో లభించునవి. అట్లని నేను ఎరుంగుదును.

2. మాతృరూప ఓషధులారా ! మీ రూపములు అసంఖ్యాకములు. మీ నిలయములు అపరిమితములు. మీరు నూర్ల కర్మముల వారలా ! నన్ను ఆరోగ్యవంతుని చేయండి "మే అనడం కురుత".

3. ఓషధులారా! మీరు పుష్పవంతులు - ఫలవంతులు. రోగుల విషయమున సంతుష్టులు కండి. అశ్వములు జయించిన రీతి వ్యాధులను జయించండి. నరులను వ్యాధులు దాటించు వారలు మీరు.

4. దీప్తిశాలి ఓషధులారా ! మీరు మాతృ స్వరూపులు. వైద్యునకు గోవులు, అశ్వములు, వస్త్రములు నన్ను సహితము సమర్పించుటకు సిద్ధముగ ఉన్నాను. అట్లని మీ ముందు ప్రతిన చేయుచున్నాను.

వైద్యుడు ప్రాణము రక్షించుచున్నాడు. అతనికి ఎంత ఇచ్చినను తక్కువే. శరీర మాద్యంఖలు ధర్మ సాధనం. ధర్మం సాధించడానికి తొలుత కావలసింది శరీరం కదా !

5. ఓషధులారా ! అశ్వత్థము, పలాశము మీ నివాస స్థానములు అగుచున్నవి. మీరు రోగిని అనుగ్రహించిన మీకు గోవులను అర్పించుట ధర్మము. మీరు కృతజ్ఞతా యోగ్యులు.

వేదము అశ్వత్థమునకు పలాశమునకు ఎంతో ప్రాముఖ్యత ఇచ్చినది. అశ్వత్థము రావి. పలాశము మోదుగు. ఓషధులందు వీటి ప్రాముఖ్యతను గుర్తించవలసి ఉన్నది. అశ్వత్థ స్సర్వ వృక్షాణాం అన్నది గీత. బుద్ధ భగవానుని

జ్ఞానోదయము అశ్వత్థచ్ఛాయలోనే జరిగినది.

యజుర్వేదపు తొలి మంత్రము పలాశమును గురించినదే. నేను మోదుగు పూలు, అను నవల వ్రాసినాను.

నేటికీ యజ్ఞయాగాదులు అశ్వత్థ, ఫలాశ సమిధలే !

6. రాజులు సమితియందు సమావేశమగుదురు. ఓషధులు వైద్యుని వద్ద కూడును. ఓషధులు తెలిసిన వానిని విద్వాంసుడు అంటారు. అతడు వ్యాధిపాశకుడు అగుచున్నాడు.

7. ఆరోగ్యము కలిగించుటకు నాకు అశ్వవతి - సోమవతి - ఊర్జయంతి, ఉదోజసాది ఓషధులు తెలియును.

8. కొట్టము నుండి గోవులు బయట పడును. రోగీ ! అట్లే ఓషధులు నీ నుండి వ్యాధులను బయటికి తోలును. ఈ ఓషధులు నీకు ఆరోగ్య ధనము కలిగించును.

9. ఓషధులారా ! మీ తల్లి ఇష్కృతి - ఆరోగ్యకారి. మీరు వ్యాధులను దూరము చేయువారు. దేహ బాధను మీరు బయటికి గెంటుదురు. మీరు రోగిని నిరోగిని చేయుదురు.

10. దొంగ గోష్ఠమును దాటినట్లు - విశ్వవ్యాపి, సర్వజ్ఞ ఓషధులు వ్యాధులను దాటును. దేహమందున్న బాధను ఓషధులు దూరము చేయును.

11. బలశాలి, మధ్యస్థబలశాలి సర్వజనులను లోబరుచుకుంటాడు. అట్లే ఓషధులు రోగి అంగ, ప్రత్యంగ గ్రంధి గ్రంధులలో సంచరించును. వ్యాధులను లోబరచుకొనును. సమస్త అవయవముల నుండి వ్యాధిని పారద్రోలును.

12. వ్యాధి అన్ని అవయవాలను వదలి పోవలెనన్నది వేద విధానము. ఈనాటి వైద్యము వేరు వేరు అవయవాలకు జరుగుతున్నది. ఇది సంపూర్ణ చికిత్స కాకున్నది. అశాస్త్రీయము వరక్తము అగుచున్నది.

13. నీల కంఠ, శ్యేన పక్షులు ఎగిరినట్లు - గాలి వేగమున వీచినట్లు, తొండ పరిగెత్తినట్లు రోగమా ! నీవు వేగముగ దూరము కమ్ము.

14. ఓషధులారా! మీరు ఒకరు రెంటికి, మూడింటకి చేరండి. అట్లు విశ్వమందలి ఓషధులన్నియు ఏకమై నా ప్రార్థనను ఆలకింతురుగాత.

15. ఫలసహిత, ఫలరహిత, పుష్పసహిత, పుష్పరహిత, ఓషధులను బృహస్పతి సృజించునుగాత - మమ్ము

పాపముల నుండి రక్షించునుగాత.

16. ఓషధులు శపథ పాశముల నుండి వరుణ పాశముల నుండి యమపాశముల నుండి దేవపాశముల నుండి మమ్ము రక్షించుగాక.

17. ఓషధులు స్వర్గము నుండి దిగి వచ్చును. అన్నవి :- మేము అనుగ్రహించిన ప్రాణికి అనిష్టము కలుగకుండును గాత.

18. ఏ ఓషధులకు రాజు చంద్రుడు అగుచున్నాడో - ఏ ఓషధులు పరిమిత ఉపకారులో - ఓషధీ ! వానితో నీవే శ్రేష్ఠుడవు. నీవు కోరికలను ఫలింప చేయగలవు. మనసునకు సుఖము ప్రసాదించగలవు.

19. ఏ ఓషధులకు రాజు చంద్రుడు అగుచున్నాడో ఏవి భూమండలమున అనేక చోట్ల లభించునో వేనిని బృహస్పతి ఉత్పత్తి చేసినాడో అవి రోగికి శక్తిని ప్రసాదించునుగాత.

20. ఓషధులారా ! మిమ్ము నేను త్రవ్వితీయుచున్నాను. నాకు నష్టము కలిగించకండి. ఎవని కొరకు త్రవ్వుచున్నానో అతనికి నష్టము కలిగించకండి. మా ద్విపద చతుష్పద సంపదలు రోగ రహితములు అగునుగాక.

లాభము కలుగకున్నను నష్టము కలిగించని ఓషధులు కావలెను. నేటి మందులు - ఒక్కొక్కసారి వ్యాధి కన్న బాధించుచున్నవి. వికటించి ప్రాణములు తీయుచున్నవి ! ఏలనన ఆంగ్ల వైద్యమునకు మూలములు తెలియకున్నవి!

ప్రస్తుతము ఓషధులకు - హెర్బల్స్ కు ప్రాముఖ్యత పెరుగుచున్నది.

సంప్రదాయ భారతీయ జీవన విధానమున ఆహార, విహారాదులందు ఓషధులు అలముకొని ఉన్నది.

21. నా యొక్క ఈ స్తోత్రమును వినుచున్నవియు - దూరమున ఉండి వినలేకున్నవియు నగు ఓషధులు ఏకమై ఈ ఓషధికి శక్తిని ప్రసాదించునుగాత.

22. ఓషధులు సోమరాజుతో ముచ్చటించి అంటున్నవి :-

రాజా ! ఎవనికి స్తోత చికిత్స చేయుచున్నాడో వానినే మేము రక్షించుచున్నాము.

23. ఓషధీ ! నీవు శ్రేష్టమవు. సమస్త వృక్షములు నీ కన్న హీనములు.

మాకు హాని తలపెట్టువాడు నా వద్దకు చేరకుండును గాత.

జ్వరాద్యుపథాపేన సంజాతే అనేన సూక్తేన మార్జయేత్. జ్వరము మున్నగు తాపములు కలిగినప్పుడు ఈ సూక్తమున తుడుచునది అని శాయణుడు.

**తొంబది ఎనిమిదవ సూక్తము**

ఋషి - ఋషిషేన పుత్ర దేవాపి దేవత - బృహస్పతి మిత్రాది
సకల దేవతలు - ఛందస్సు - త్రిష్టుప్

1. బృహస్పతీ! నీవు నా కొరకని ప్రత్యేక దేవత వద్దకు వెళ్లుము. నీవే వరుణుడవు. మిత్రుడవు. ఆదిత్యుడవు. వసువుల సహిత ఇంద్రుడవు అగుచున్నావు. నీవు శంతనుని కొరకు మేఘము నుండి జలవర్షము కలిగించుము.

2. దేవాపీ ! ఒక జ్ఞానియు, వేగవంతుడగు దేవత నీ దూతగ నా వద్దకు వచ్చునుగాత. బృహస్పతి మాకు అభిముఖుడై వచ్చునుగాత. మా నాలుక మీద నీ కొరకు పవిత్ర స్తోత్రము నడయాడుచున్నది.

3. బృహస్పతీ ! మా నోట ఒక శుభ్రస్తోత్రము పలికించుము. అది అస్పష్టము కారాదు. స్ఫూర్తిదాయకము కావలెను. దాని వలన మేము శంతనునకు వర్షము కలిగించ గలుగవలెను. మధుమంతరసము ఆకసము నుండి రాలునుగాత.

4. మధుమంతరసము మమ్ము చేరునుగాత. ఇంద్రుడు అనంత ధనము రథము మీద తెచ్చును గాక.

దేవాపి మా యజ్ఞ కార్యము నిర్వహించును గాత. సకాలమున దేవతలను పూజించును గాక. హోమ ద్రవ్యములు అర్పించి దేవతలను సంతుష్టులను చేయునుగాత.

5. ఋషిషేన పుత్రుడు దేవాపి ఉత్తమ స్తుతులు రచించి, హవనము చేయుటకు ఆసీనుడు అగునుగాత. అపుడు అతడు ఉపరి సముద్రమగు ఆకాశము నుండి దిగువ నున్న భూసముద్రమునకు వర్షము తెచ్చునుగాత.

ఆకాశము సముద్రమే భూమి సముద్రమే అని అందము అల్లినాడు !

6. దేవతలు అంతరిక్షమున జలసముద్రమును మూసిపెట్టినారు. ఋషిషేన పుత్రుడు దేవాపి ఆ జలమును కదిలించినాడు. అప్పుడు స్వచ్ఛ ధరిత్రి మీద శుభ్రజలము ప్రవహించినది.

7. శంతనుని పురోహితుడుదేవాపి. అతడు హోమము చేయుటకు ఉద్యుక్తుడు అయినాడు. జలోత్పాదక దేవి స్తోత్రము నిరూపించినాడు. అందుకు బృహస్పతి సంతుష్టుడు అయినాడు. దేవాపి మనమున స్తోత్రమును ఉదయింప

చేసినాడు.

8. అగ్నీ ! ఋషిషేణం పుత్ర దేవాపి ఋషి కమనీయుడై నిన్ను ప్రజ్వలితుని చేసినాడు. నీవు దేవతల సాయమున జలవర్ష మేఘమును ప్రజ్వలింప చేయుము.

9. అగ్నీ ! పూర్వ ఋషులు స్తుతి సహితులుగ నీవద్దకు వచ్చినారు. నిన్ను ఎందరో ఆహ్వానింతురు. యజమానులు యజ్ఞములు చేయుచు స్తుతులతో నీవద్దకు చేరుచున్నారు. శంతనుడు రథ సహితముగ వేల పదార్థములు దక్షిణలుగ ఇచ్చినాడు. రోహిత నామక అశ్వసహిత అగ్నీ ! విచ్చేయుము.

10. అగ్నీ ! రథముల సహితములుగ తొంబది తొమ్మిదివేల పదార్థములు నీకు ఆహుతిగ అర్పించబడినవి. వానితో నీ దేహమును పెంచుము. మా కొరకు ద్యులోకము నుండి వర్షము తెమ్ము.

11. అగ్నీ ! తొంబది తొమ్మిదివేల ఆహుతుల నుండి ఇంద్రునకు భాగమును ఇమ్ము. నీవు దేవమార్గములు ఎరింగినవాడవు. సమయము చూచి శంతనుని దేవతల మధ్యమున నిలుపుము.

12. అగ్నీ ! శత్రు దురములను కూల్చుము. వ్యాధులను, రాక్షసులను దూరము చేయుము. భూలోకమునకు అంతరిక్షము నుండి అనంత జలరాశిని తెమ్ము.

## తొంబది తొమ్మిదవ సూక్తము

ఋషి - వైఖానసవము, బందేవత ఇంద్రుడు - ఛందస్సు త్రిష్టుప్

1. ఇంద్రా ! నీవు మమ్ము తెలియుచున్నావు. సంపద ప్రసాదించుచున్నావు. ఆ సంపద వర్థిల్లునది. మమ్ము వర్థిల్లచేయునది. ప్రశంసనీయమైనది.

ఇంద్రుని శక్తి పెరుగుటకు మేము ఏమి చేయగలము ! అతని కొరకు వృత్రహింసకు వజ్రాయుధము సిద్ధమై ఉన్నది. ఇంద్రుడు వృష్టి కారకుడు.

2. ఇంద్రుడు విద్యుదాయుధం ధరించి యజ్ఞములకు విచ్చేయును. అతడు బలప్రయోగము చేయును. అధికారమును దాసగతము చేసికొనును. అతడు మరుత్తులతో కలిసి శత్రువులను పరాజితులను చేయును. అతడు ఆదిత్యులకు సప్తమ భ్రాత అగుచున్నాడు. ఇంద్రుని కాదని జరుగు కార్యము ఉండదు.

3.ఇంద్రునిది సుందరగతి. ఆ నడకతోనే అతడు యుద్ధభూమికి చేరును. అతడు దిగ్విజయముగ శతద్వార సహస్త్ర పురం నుంచి ధనము తెచ్చును. ఇంద్రియ పరాయణులగు దురాత్ములను - తన తేజస్సున పరాజితులను చేయును.

4. ఇంద్రుడు మేఘముల వైపు సాగును. మేఘములందు సంచరించును. భూమి మీద బహుజలమును వర్షించును. ఆ జలము చిన్న చిన్న పాయలై, అవి ఏకమై వేగముగ ప్రవహించును. ఆ ప్రవాహమునకు పాదములు లేవు - రథము లేదు.

5. అర్థించకనే ఇంద్రుడు కోరికలు తీర్చును. అతడు ప్రకాంథుడు. దుర్నామము అతనిని చేరదు. అతడు రుద్ర పుత్ర మరుత్తుల యుక్తముగ విచ్చేయునుగాత.

నేను నమ్రుడను. నా తలిదండ్రుల బాధలు తీరినవి. ఏలనన నేను శత్రు ధనమును హరించినాను. శత్రువును ఏడిపించినాను.

6. ఇంద్ర దేవుడు  కల్లోలఘు లేపు వారిని శాసించినాడు. అతడు మూడు కపాలములు ఆరునేత్రములు గల విశ్వరూపుని హతమార్చినాడు. ఇంద్రుని తేజమున త్రితుడు ఇనుము వంటి గోళ్లతో వరాహమును చీల్చినాడు.

7. ఇంద్రుని భక్తులను శత్రువు యుద్ధమునకు పిలిచినచో ఇంద్రుడు దర్పమున తన దేహము పెంచి వారికి శత్రువును వధించగల ఉత్తమ ఆయుధములను ప్రసాదించును. ఇంద్రుడు నరులకు  సర్వోత్తమ నేత యగుచున్నాడు. దస్యుల వధ సమయమున అతడు అనేక శత్రు పురములను ధ్వంసము చేసినాడు.

8. ఇంద్రుడు మేఘపుంజమువలె తృణమయ ధరిత్రి మీద జలము వర్షించుచున్నాడు. అతడు మా నివాసములకు దారి చూపినాడు. అతడు తన సర్వాంగముల నుండి సోమము రాల్చుము. అతడు శ్యేనము వంటి లోహ సదృశత తీక్ష్ణదేహుడు. అతడు దస్యులను వధించువాడు.

9. ఇంద్రుడు తన పరాక్రమ శత్రువులను తన తీక్ష ఆయుధములతో పారద్రోలును. అతడు కుత్సుని స్తోత్రము విన్నాడు. శుషుడు అను అసురుని ఛేదించినాడు. స్తోత, కవి యగు ఉశన విరోధులను వశపరచుకున్నాడు. ఉశనాదులకు దానములు చేసినాడు.

10. మరుత్తులు మానవహితము కోరువారు. ఇంద్రుడు వారితో ధనమంపినాడు. ఇంద్రుడు వరుణుని వంటి తేజోవంతుడు. అందగాడు. బలశాలి. అతని రూపము మనోహరము. అతనిని ఎల్లరు సర్వ రక్షకునిగ భావింతురు. అతడు చతుష్పాద శత్రువును హతమార్చినాడు.

11. ఉశిజపుత్రుడు ఋజిశ్వుడు ఇంద్రుని స్తుతించి పిప్రుని గోష్ఠమును చెదరగొట్టినాడు. ఋజిశ్వుడు సోమము అర్పించి యజ్ఞము చేయగా ఇంద్రుడు శత్రు పురములను ధ్వంసము చేసినాడు.

12. నేను నమ్రుడను. ఇంద్రునకు మరింత హవి సమర్పించ సంకల్పించినాను. కాలినడకన చేరినాను.

ఇంద్రా దేవా! నాకు శుభములు కలిగించుము. అన్నము, బలము, ఉత్తమ గృహాది సమస్తము ప్రసాదించుము.

## నూరవ సూక్తము

ఋషి - వందన పుత్ర దువస్యుడు దేవత - విశ్వే దేవతలు

ఛందస్సు - జగతి - 12 త్రిష్టుప్

1. ధనిక ఇంద్రా! నీతో సమానబల శత్రుసేనను సంహరించుము. స్తోత్రమును స్వీకరించుము. సోమము సేవించుము. మమ్ము రక్షింపుము. మా కొరకు ధనమును వర్ధిల్ల చేయుము. అన్యదేవ సహితుడై సవితమా యజ్ఞమును రక్షించునుగాత. మేము సర్వాతీత అదితిని అర్చించుచున్నాము - "సర్వతాతి మదితిం వృణీమహే".

2. వాయువులు యుద్ధసన్నద్ధులు అయినారు. ఋతు అనుకూల యజ్ఞభాగము వారికి అర్థించండి. పరిశుద్ధ సోమము సేవించండి. వారు కదలునపుడు శబ్దింతురు. వారు శుద్ధ దుగ్ధపానమున నిమగ్నులై ఉన్నారు. సర్వతాతి మదితిం వృణీమహే!

3. మా శుభములు ఆశించువాడును, యజమానియగు వానికి సవితాదేవత అన్నము కలిగించునుగాక. ఆ పరిపక్వ అన్నముతో అతడు దేవతలను అర్చించునుగాత. సర్వతాతి మదితిం వృణీమహే!

4. ఇంద్రుడు మా విషయమున నిత్యము ప్రసన్నుడు అగును గాక. మా యజ్ఞ్య సోమరాజు ఉపస్థితుడు అగునుగాత. బంధుమిత్రుల కోరికల ప్రకారము సర్వకార్యములు పరిపూర్ణములు అగునుగాత. "సర్వతాతి మదితిం వృణీమహే"

5. ఇంద్రుడు తన శక్తిచే మా యజ్ఞములను రక్షించును. బృహస్పతి పరమాయువు కలిగించును. యజ్ఞము సూగతి, మతి, రక్షణ, సుఖము అగుచున్నవి. "సర్వతాతి మదితం వృణీమహే".

6. దేవతలకు ఇంద్రుడే బలమగుచున్నాడు. గృహస్థ అగ్ని దేవతలను స్తుతించును . యజ్ఞము చేయును. కార్యములు నిర్వహించును. వారు యజ్ఞములపుడు పూజ్యులగుదురు. రమణీయులగుదురు. ఆత్మీయులు అగుదురు. "సర్వ తాతి మదితం వృణీమహే".

7. వసువులారా! మీ వెనుక మేము ఎట్టి ప్రధాన అపరాధము చేయలేదు. మీ ముందు సహితము దేవతలకు కోపము తెప్పించునట్టి ఎట్టి అకార్యము చేయలేదు. దేవతలారా! మమ్ము నిరాశపరచకండి." "సర్వతాతి మదితం వృణీమహే".

8. ఎచట మధుసను సోమరసము అర్పించబడునో - ఎచట అభిషవ ప్రస్తరము స్తుతించ బడునో అచటి

వ్యాధులను సవితా దేవత తొలగించుచున్నాడు. పర్వతములు అనర్థమును దూరము చేయుచున్నవి. "సర్వతాతి మదితం వృణీమహే".

9. వసువులారా! సోమము సిద్ధము చేయు ప్రస్తరమునకు ఉన్నతి కలుగును గాక. అప్పటి వరకు మీరు శత్రువులను దూరము చేయండి. సవిత రక్షకుడు. అతనిని సుత్తించవలె. "సర్వతాతి మదితం వృణీమహే".

10. గోవులారా! మీరు పచ్చిక బయళ్లలో సంచరించండి. బలము కలగండి. యజ్ఞములందు మీరు పాత్ర నిండుగ పాలు ఇస్తున్నారు. మీ పాలు సోమరస సమములు. "సర్వతాతి మదితం వృణీమహే".

11. ఇంద్రుడు యజ్ఞమును పూర్తి చేయించును. సర్వులను జరాముక్తులను చేయును. అతడు యువకులను, సోమ యజ్ఞ కర్తను రక్షించును. ఉత్తమ స్తోతకు అనుకూలుడనును. "సర్వతాతి మదితం వృణీమహే".

12. ఇంద్రదేవా! నీ కాంతులు ఆశ్చర్యకరములు. అవి ప్రకాశ పూర్ణములు, వానిని అర్చించ వలెను. నీ దుర్ధర్షకార్యములు స్తోతల కోరికలు తీర్చును. అందుకే ద్యువస్యుడు త్రాటితో గోవు ఆగ్రభామును సులభముగ గుంజుచున్నాడు.

**నూట ఒకటవ సూక్తము**

ఋషి - సోమ పృత్రబుధుడు - దేవత - విశ్వేదేవతలు

ఛందస్సు 9, 11 జగతి, 4,6, గాయత్రి, 5, బృహతి మిగిలినవి త్రిష్టుప్

1. మిత్రులగు ఋత్విక్కులారా ! ఏకమనస్కులై జాగృతులు కండి. అనేకులు ఏకస్థాన వాసులై అగ్నిని ప్రజ్వలితుని చేయండి. నన్ను రక్షించమని రధిక్రుని, ఉషస్సును, అగ్నిని, ఇంద్రుని ఆహ్వానించుచున్నారు.

2. మిత్రులారా! బలకరసుతులు చేయండి. సేద్యమును విస్తరించండి. నాగలివంటిదగు దరిచేర్చు నావను సిద్ధము చేయండి. నాగటి కర్రును పదును చేయండి. ఉత్తమ యజ్ఞమును అనుష్ఠించండి.

3. ఋత్విక్కులారా! నాగలి సిద్ధము చేయండి. కాడివి కట్టండి. ఈ కనిపించు క్షేత్రమున గింజలు నాటండి. మా స్తుతుల వలన అన్నము సమృద్ధమగునుగాత. ధాన్యపు కంకులు పండి రాలును గాక.

4. నాగలితో దున్నుచున్నారు. కాడిని వేరు చేయుచున్నారు. మేధావులు మధుర స్తుతి గానము చేయుచున్నారు.

5. పశువుల కొరకు నీటిపట్టు ఏర్పరచండి. పగ్గములను సిద్దపరచుకొండి. అక్షయమగు నీటి వనరును ఏర్పరచి పారుదల చేయండి.

6. పశువులకు నీటిపట్టు ఏర్పడినది. పగ్గములు నీటిలో నానుచున్నవి. అక్షయమగు నీటి వనరు ఏర్పడినది. దీనితో నీటిని పారించండి.

7. గుర్రములను లేక ఎద్దులను సిద్ధము చేయండి. పొలములోని ధాన్యము కూర్చండి. ధాన్యమును మెల్లగ బండికి ఎక్కించండి.

పశువుల కొరకు ఏర్పరచిన నీటితొట్టి ద్రోణమగుచున్నది. దానికి రాత్రి చక్రము ఏర్పరచనైనది. నరులు నీరు త్రాగు బావి వంటి దానిని ఆ నీటితో నింపండి.

8. గోష్ఠమును సిద్ధపరచండి. అదియే మనుషులు త్రాగు నీటిగ ఉపయోగపడును. దాని దరులు గట్టి పరచండి. ఇనుప బొక్కెనను సిద్ధముచేసి, చేద త్రాటిని గట్టి పరచండి. నీరు వలికిపోకుండ చూడండి.

9. దేవతలారా! ఋత్విక్కులారా! మేము మీ ధ్యానము కోరుచున్నాము. మమ్ము రక్షించండి. మీ ధ్యానము యజ్ఞోపయోగమగును. అదియే మీకు యజ్ఞభాగము ఇచ్చును.

10. చెక్కపాత్రలో ఉంచిన హరిత వర్ణ సోమమును తడపండి. రాతి పాత్రను సిద్దపరచండి. పది అంగుళులతో పాత్రను అందుకోండి. పశువును రథమునకు దానిని ఎక్కించండి.

11. రథపు రెండు ఇరుసులు ధ్వనులు చేయుచు రథమును లాగు పశువులు - ఇద్దరు యువతులతో సరసమాడిన రీతి సాగును. బండిని కర్ర ఆధారముగా నిలిపి ఉంచండి. అది పడరాదు.

12. కర్మధ్యక్షులారా! ఇంద్రుడు సుఖప్రదాత. అతనికి సుఖకర సోమము సమర్పించండి. అతనిని అర్చించండి. ఇంద్రుడు అదితి పుత్రుడు. మీకు బాధల భయము ఉన్నది. కావున రక్షణలకు ఇంద్రుని పిలువండి. అతడు సోమపానము చేయునుగాత.

## నూట రెండవ సూక్తము

ఋషి- ముద్గలుడు, దేవత - ఇంద్రుడు, ఛందస్సు 1-3 బృహతి - మిగిలినవి త్రిష్టుప్

1. ముద్గలా! యుద్ధమున నీ రథము నిస్సహాయము అయినపుడు దుర్ధర్ష ఇంద్రుడు నీకు సాయపడునుగాత.

ఇంద్రా ! ఇది ప్రసిద్ధ యుద్ధము. ధనార్జన సమయమున మమ్ము రక్షింపుము.

2. ముద్గల పత్ని ముద్గలిని రథము అధిరోహించినది. వేయి గోవులను గెలిచినది. అప్పుడు ఆమె వస్త్రమును వాయువు రెపరెపలాడించినది. గోవులను జయించినపుడు ముద్గలిని రథిక అయినది. ఇంద్రసేన వంటి ముద్గలిని శత్రువుల నుండి గోవులను విడిపించినది.

**ఒకనారి యుద్ధము చేయుటను జయించుటను వేదము ప్రస్తుతించుచున్నది.**

3. అరిష్ట దాయకులు, దాడికి సిద్ధమైన శత్రువు మీదకు వజ్రము విసరుము. ఆర్యులైనను దస్యులైనను శత్రువును దారుణమున వధించుము.

4. అది వృషభము. మహానందమున నీరు త్రావినది. కొమ్ములతో మట్టిని చిమ్ముచు శత్రువు మీదకు దండెత్తుచున్నది. దాని అండకోశము పోడవైనది. అది ఆహారము కోరి, కొమ్ములకు పదనుపెట్టి వేగముగ వచ్చుచున్నది.

5. మనుష్యులు వృషభమును చేరినారు. దానిని గర్జింపచేసినారు. యుద్ధమధ్యమున మూత్రింపచేసినారు. అందు వలన ముద్గలుడు ఆహారపటుత్వము గల వందలవేల గోవులను జయించినాడు.

6. శత్రుహింసకు వృషభమును సిద్ధము చేసినారు. దాని పగ్గము పట్టిన సారథి ముద్గలిని గర్జించినది. వృషభము రథమునకు కట్టిసాగినది. ముద్గలిని రథము తోలినది. దాని వెంట సేనలు పరుగులు తీసినవి.

7. ముద్గలుడు విద్వాంసుడు. అతడు రథమును కట్టిపెట్టినాడు. అతి సాహసముగ వృషభమును రథమునకు కట్టినాడు. వృషభము అతి వేగముగ పరుగులు పెట్టినది. ఇంద్రుడు గోపతియగు వృషభమును రక్షించినాడు.

8.ముద్గలుడు చర్మపు త్రాళ్లతో రథమును కట్టినాడు. కొరడా ఏర్పరచినాడు. వృషభము అటునిటు నడిపించినాడు. అనేకానేక గోవులను ఇంటికి చేర్చినాడు. అనేకుల ధనమును ఉద్ధరించినాడు.

9. యుద్ధక్షేత్రమునకాడిపడి ఉన్నది. అది ఆ వృషభము వెంట ఉండినది. ఆ విధముగ ముద్గలుడు వేల ఆవులను గెలిచినాడు.

10. దూరమునగాని, దగ్గరగాని ఎవడైన ఇట్టిది వినియున్నాడా? రథమునకు కట్టబడినదే రథము మీద నిలిచి నడుపుచున్నది! దానికి గడ్డి నీరు అక్కరలేదు. అయినను రథమును లాగును, స్వామికి విజయము కలిగించును.

11. భర్త విడిచిన భార్యవలె ముద్గలిని తన శక్తిని ప్రదర్శించి భర్త ధనమును గుంజుకున్నది. ఆమె మేఘము వర్షించినట్లు శరములు వర్షించినది. అట్టి సారథి వలన మాకు జయము కలుగునుగాత, అన్నాదులు లభించునుగాత.

12. ఇంద్రా! నీవు సకల లోకములకు నేత్రరూపమవు. కన్నులు గలవారికి కూడ నీవే నేత్రమవు. రెండు అశ్వములను ఒకే త్రాటితో కట్టి నడిపింతువు. ధనము కలిగింతువు.

## నూట మూడవ సూక్తము

ఋషి - ఇంద్రపుత్ర అప్రతిరథుడు, దేవతలు, బృహస్పతి, ఇంద్రుడు,
ఛందస్సు, త్రిష్టుప్, 13 అనుష్టుప్

1. ఇంద్రుడు సర్వవ్యాపి. పొగరుబోతు ఆబోతు వంటి భయంకరుడు. శత్రుహంత, మానవులను చలింపచేయువాడు. వడకించువాడు. శత్రువును ఏడిపించును. అతడు నలువైపుల దృష్టి సారించువాడు. మహా, విశాల సేనను ఓడించినవాడు.

2. యోద్ధలగు మానవులారా! ఇంద్రుని సాయమున విజయలు కండి. శత్రువును ఓడించండి. ఇంద్రుడు నలువైపుల దృష్టి ఉంచువాడు. పగవారిని ఏడిపించువాడు. అతడు యుద్ధవిజేత.ఎంతటివాడును వారిని కదిలించజాలడు. అతని చేత శరము ఉన్నది. దుర్ధక్షుడు అతడు దుగ్ధర్షుడు వర్షము కలిగించువాడు.

3. ఇంద్రుని వెంట బాణ తూణీరముల వారు ఉందురు. అతడు అందరను వశరపచు కొనును. యుద్ధములందు అతడు నిరాట శత్రువుతో సమరము జరుపును. అతని ముందునకు వెళ్లిన వారిని జయిఅమ్చును. అతడు నిరాట శత్రువుతో సమరము జరుపును. అతని ముందునకు వెళ్లిన వారిని జయించును. అతడు సోమపాయి. అతని భుజబలము విలక్షణము. అతని ధనువు భయంకరము. ఆ ధనుస్సు నుండియే బాణము విడిచి అతడు శత్రువును రాల్చును.

4. బృహస్పతీ! రక్కిసులను వధించును. శత్రువును బాధించుము. రథముతో విచ్చేయుము. శత్రుసేనను ధ్వంసము చేయుము. శత్రుయోధులను పడగొట్టుము. విజయుడ వగుము. మా రథములను రక్షింపుము.

5. ఇంద్రా! నీవు శత్రుబలజ్ఞాతవు, అనంతకాల ప్రాచీనుడవు. ఉత్కృష్ట వీరుడవు. తేజస్వివి, వేగవంతుడవు. భయంకరుడవు. విపక్ష విజయవి. వీరులకు, ప్రాణులకు అభిముఖముగ సాగువాడవు! నీవు శక్తికి పుత్రరూపుడవు. గోవులను జయించుటకు జయశీల రథమును అధిరోహింపుము.

6. ఇంద్రుడు మేఘములను విదీరము చేయువాడు. గోవులను సాధించువాడు. అతనిచేత వజ్రము ఉన్నది. అతడు తన తేజమున శత్రుసేనను ఓడించును పరిమార్చును.

వీరులారా ! ఇంద్రుని ముందుంచుకొని మీ ప్రతాపము ప్రదర్శించండి. ఇంద్రునికి అనుకూలముగ బలమును

చూపండి.

7. ఇంద్రుడు శతక్రతువు. వీరుడు. మేఘములవైపు సాగువాడు, అతడు నిర్దయబలశాలి. అతడు స్థానభ్రష్టుడు అగువాడుకాడు. శత్రుసేనా విజేత. అతనితో యుద్ధము చేయగలవాడు లేడు. ఇంద్రుడు మా సేనను రక్షించుగాత.

8. ఇంద్రుడు సర్వసేనాని. బృహస్పతి సేనకు కుడిప్రక్క నిలుచును. సోమము అతని ముందు సాగును. శత్రు భయంకరులగు మరుత్తులు, దేవసేనకు అగ్రమున సాగుదురు గాత.

9. ఇంద్రుడు జలవర్షకుడు. వరుణరాజు, ఆదిత్య గణములు, మరుద్గణముల శక్తి భయానకము.

మహానుభావులగు దేవతలు భువనములను వడకించి విజయులు అయినపుడు కల్లోలము చెలరేగినది.

10. ఇంద్రా! అస్త్ర, శస్త్రములు అందించుము. మా సేనల మనుషులను ఉత్సాహ పరచుము. అశ్వబలము వర్ధిల్లునుగాక. రథ నిర్ఘోషధ్వని ఉద్భవించునుగాత.

11. పతాకము ఎగిరినపుడు ఇంద్రుడు మా ప్రక్కన నిలుచును. మా శరములు విజయములు అగును గాత. మా వీరులు అగ్నులు అగుదురుగాక.

దేవతలారా! యుద్ధములందు మమ్ము రక్షించండి.

12. పావదేవతా ! మమ్ము విడువుము. శత్రువును పట్టుము. వారి మనసులను ప్రలోభ పరచుము; వారి దేహములందు నిలువుము. దుఃఖమున హరి హృదయములను తపింప చేయుము. శత్రువులు చీకటి రాత్రులందు కలిసిపోవుదురుగాత.

13. జనులారా! పదండి ముందుకు, విజయులు కండి, ఇంద్రుడు మీకు సుఖములు కలిగించునుగాత. మీరు ఎంత దుర్ధరులో మీ బాహువులు అంత భయంకరములు అగునుగాక.

### నూట నాలుగవ సూక్తము

ఋషి వైశ్వామిత్కృష్టకుడు, దేవత, ఇంద్రుడు, ఛందస్సు, త్రిష్టుప్

1. పురుహూత ఇంద్రా! నీ కొరకు సోమము అభిషుతమై సిద్ధముగ ఉన్నది. ఉభయ అశ్వముల మీద త్వరగా విచ్చేయుము. ప్రధాన స్తోత పాఠములు చేయుచు ఈ సోమమును అందించినారు. సోమపానము చేయుము.

2. హర్యశ్వ ఇంద్రా! యజమానులు సోమమును ప్రస్తరమున సిద్ధము చేసినారు. జలమున శుద్ధి చేసినారు. ఆ సోమమును సేవించుము. కడుపు నింపుము. నీ కొరకు శిలలు సిద్ధము చేసిన సోమముతో మత్తుడవు ఆగుము. స్తుతులు గ్రహించుము.

3. హర్యశ్వ ఇంద్రా! నీవు వర్ణకుడవు. సోమము అభిషుతమై ఉన్నది. నీవు యజ్ఞమునకు వచ్చుటను తెలిసి సోమము అర్పించెదము.

ఇంద్రా! ఉత్తమ స్తోత్రములను అందుకొనుము. ఆమోదించుము. వివిధ కార్యములు చేయుము. నీకు బహు స్తుతులు కలుగునుగాత.

4. క్షమతా శీల ఇంద్రా ! ఉశిజ వంశీయులకు యజ్ఞములు చేయుట తెలియును. వినను ఆశ్రయించినవారు. నీ ప్రభావమున అన్న లాభము కలిగినవారు. సంతానము పొందిన యజమానుల ఇంట ఉన్నవారు ఆనందమయులై నిన్ను స్తుతించుచున్నారు.

5. సూర్యశ్వ ఇంద్రా! నీ స్తుతులు సుందరములు. నీ సంపద ఆశ్చర్యకరము. నీ ప్రకాశము అత్యంతము. నీవు ధనాదులు అందించినవారు ఆత్మరక్ష చేసుకున్నారు. అన్యులను రక్షించుచున్నారు.

6. హర్యశ్వ ఇంద్రా! అభిషుత సోమపానము కొరకు అశ్వద్వయము మీద యజ్ఞములకు చేరుదువు. నీవు శక్తిశాలివి. యజ్ఞములు నిన్నే చేరుచున్నవి. నీవు యజ్ఞజ్ఞాతవు. దానములు చేయువాడవు.

7. ఎవరి వద్ద అనంత అన్నము ఉన్నదో - ఎవడు శత్రుంజయుడో, ఎవడు సోమ ప్రసన్నడో, ఎవనిని కీర్తించిన ఆనందము కలుగునో, ఎవనిని ఎవండును వ్యతిరేకించజాలడో, అట్టి వానిని స్తుతించుచున్నారు. స్తోతల ప్రణామములు అతనిని చేరుచున్నవి.

8. ఇంద్రా! రమణీయములు, వేగవంతములగు గంగమున్నగు ఏడు నదుల ద్వారా శత్రుపురములను ముంచినావు. సాగరమును పెంచినావు. నరుల, దేవతల ఉపకారమునకు తొంబది తొమ్మిది నదులకు మార్గములు ఏర్పరచినావు.

9. ఇంద్రదేవా! నీవు జలద్వారములను తెరచినావు. జలమును తెచ్చుటకు ఒక్కడవే వెళ్లినావు. ఇంద్రా! నీవు వృత్రుని వధించి చేసిన మహత్కార్యము వలన సమస్త లోకములను పోషించినట్లు అయినది.

10. ఇంద్రుడు మహావీరుడు. కార్యకుశలుడు. అతనిని స్తుతించినపుడు ఆనందము కలుగును. ఉత్తమ స్తుతులు అతనిని చేరును. పూజించును. అతడు వృత్రుని వధించినాడు. లోకములను ఏర్పరచినాడు. శక్తిశాలి శత్రువును పరాభవించినాడు. శత్రుసేనకు ప్రతి కూలముగ సాగినాడు.

11. బలశాలి, ధనశాలి ఇంద్రుని ఆహ్వానించండి. యుద్ధములందు అన్నము అందించు నపుడు ఇంద్రుడి అధ్యక్షత వహించును. స్వపక్ష రక్షణకు ఇంద్రుడు ఉగ్రరూపము దాల్చును. శత్రువులను వధించును. వృత్రులను నాశనము చేయును. ధనమును జయించును.

**నూట అయిదవ సూక్తము**

ఋషి - కుత్సపుత్ర సుమిత్రుడు దేవత - ఇంద్రుడు - ఛందస్సు1,
గాయత్రి 11 త్రిష్టుప్ మిగిలినవి ఉష్ణిక్

1. ఇంద్రా! నీవు స్తోత్రాభిలాషివి. స్తుతులు సిద్ధముగ ఉన్నవి. సోమము అభిషుతమై ఉన్నది. వర్షము కలిగించుము. మా క్షేత్రముల ప్రణాళిని జలపూర్ణము చేయుము.

2. ఇంద్రుని అశ్వములు సుశిక్షితములు. అవి అనేక కార్యములు సాధించునవి. అవి శుభ్రములు. కౌశినులు. వాటి ప్రభువగు ఇంద్రుడు దానములు చేయుటకు వచ్చునుగాత.

3. శోభస్కరముగ ఇంద్రుడు అశ్వములను కట్టినపుడు సమస్త పాపములు దూరమైనవి. మానవులు సుఖించినారు.

4. ఇంద్రుడు మానవుల పూజలు అందుకున్నాడు. సమస్త సంపదలను కూర్చినాడు. బహుకార్య సాధన, శబ్దాదుమాన అశ్వములను ఇంద్రుడు నడిపించును.

5. హర్యశ్వములు జూలు గలవి. సుందరములు. ఇంద్రుడు వానిపై ఎక్కినాడు. పుష్టి కొరకు స్వారి చేసినాడు. దవడలు ఆడించుచు అన్నము అడిగినాడు.

6. ఇంద్రుని శక్తి అత్యంత సుందరము. అతడు శోభాయమానుడు. అతడు మరుత్తులతో కలిసి యజమానితో సాధువాదము చేయును. అతడు అంతరిక్షమున ఉండును. ఋభువులు తమ కార్యకుశలతచే రథాదులు సిద్ధము చేసినారు. అట్లే ఇంద్రుడు తన శౌర్యమున అనేక వీరకృత్యములు చేసినాడు.

7. ఇంద్రుడు దంస్యులను వధించుటకు వజ్రము ధరించినాడు. అతడి గడ్డము, మీసములు - అతని అశ్వములు హరితములు. అతని హనువులు సుందరములు. అతడు ఆకాశమంతట విశాలుడు.

8. ఇంద్రా! మా సమస్త పాపములను నష్టపరచును. ఋక్కులు ప్రభావమున ఋక్ శూన్యులను వధించగలుగుదుము గాత. ఏ యజ్ఞము, స్తుతి, సహితము కాకున్నదో అది నిన్ను ప్రతిపాదించకున్నది.

9. ఋత్విజులు యజ్ఞభారము వహింతురు. కార్యారంభము గావింతురు. అప్పుడు ఇంద్రుడు యజమానితో ఒకే పడవపై దాటించునుగాత.

10. పాడియావు. నీకు మంగళ ప్రద అగునుగాక. నీవు సేవించు మధుపాత్ర నిర్మలము, శుభప్రదము అగునుగాత.

11. ఇంద్రా! దస్యువధ సమయమున నీవు కుత్సపుత్రుని రక్షించినావు. బలశాలివగు నీ కొరకు సుమిత్రుడు వందస్తుతులు రచించినాడు. దుర్మిత్రుడు కూడ స్తుతించినాడు.

## నూట ఆరవ సూక్తము

ఋషి - కశ్యప పుత్ర భూతాంశుడు. దేవత - అశ్వినులు -
ఛందస్సు - త్రిష్టుప్

1.అశ్వినీద్వయమా! మీరు ఆహుతులు అభిలషించుచున్నారు. వస్త్రకారుడు వస్త్రమును పెంచిన రీతి మీరు మా స్తోత్రములను విస్తరింప చేస్తారు. మీరు కలిసి విచ్చేయుదురని ఈ యజమాని మిమ్ము స్తుతించుచున్నాడు. సూర్యచంద్రులవలె ఖాద్య పదార్థములను అవలోకించుచున్నారు.

2. రెండు ఎద్దులు పచ్చిక బయలున సంచరించును. అట్లే మీరు యజ్ఞము, దానము చేయువాని వద్దకు చేరుకుందురు. రథమునకు కట్టిన రెండు అశ్వములు పదార్థములను తెచ్చును. అట్లే మీరు ధనదానము చేయుటకు స్తోతల వద్దకు వచ్చెదరు. దూతవలె మీరు జనులందు యశస్సులు కండి. గేదెలు నీటి పట్టునుండి కదలవు. మీరు సోమపానము నుండి కదలకండి.

3. పక్షుల రెండు రెక్కలవలె మీరు కలిసి ఉన్నారు. రెండు మహా పశువుల రీతి మీరు ఈ యజ్ఞమునకు వచ్చి యున్నారు. యజ్ఞ కర్తయగు అగ్నివలె మీరు దీపించుచున్నారు. సర్వత్ర విహరించు పురోహిత ద్వయమువలె మీరు అనేక స్థలములందు దేవతార్చన చేయుచున్నారు.

4. మాతా, పితలు బిడ్డ విషయమున ఆసక్తులు అయినట్ల మీరు మా విషయమున ఆసక్తులుకండి. మీరు సూర్య, అగ్నులవలె దీప్తిశాలురు - రాజువలె శీఘ్రకర్ములు. ధనికుని వలె ఉపకారపరులు అగుదురు గాత. సూర్య కిరణములవలె దృష్టి కలిగించుచు జనులకు సుఖశాంతులు ప్రసాదించండి. సుఖించు మనిషివలె మీరు ఈ యజ్ఞమునకు విచ్చేయండి.

5. చక్కని నడకల వృషభద్వయమువలె మీరు పుష్టివంతులు, రూపవంతులు అగుచున్నారు. మిత్రావరణుల వలె యథార్థదర్శులు, వదాన్యులు, దుఃఖ ఉపశమనులు, స్తుతి ప్రాప్యులు అగుచున్నారు. అశ్వద్వయము వలె తిని, త్రాగి బలిష్టులు అయినారు. మీరు ప్రకాశమాయ ఆకసమున ఉందురు. గొర్రెల వలె ఇష్టము వచ్చినట్లు తిని సుద్రుడ అంగ

ప్రత్యంగముల వారలు అయినారు.

6. గజమును కొట్టుటకు, నిలుపుటకు అంకుశము ఉన్నది. మీరు జనులను నిలుపు చున్నారు. పోషించుచున్నారు. అంతము చేయుచున్నారు. హంతవలె మీరు శత్రు హననులు అగుచున్నారు. అందువలననే మీరు శత్రు విదారకులు, యజమాన పోషకులు అనబడుచున్నారు. మీరు నీట పుట్టినంత నిర్మలులు. బలశాలురు. విజయులు. పరిణామ శీలమగు నా దేహమునకు యౌవనము ప్రసాదించండి.

7. తీవ్ర బల అశ్వినులారా! పొడుగు పాదముల వాడు అన్యుని నీరు దాటించగలడు. అట్లే పరిణామ శీలమగు నా దేహమును ఆపదల నుండి దాటించి ఆశించిన చోటునకు నడిపించండి. ఋభువులతో సమముగ ఉత్తమ రథమును పొందినారు. మీ వేగవంత రథము వాయువులె ఎగిరి శత్రు ధనమును తెచ్చినది.

8. వీరునివలె ఉదరమున ఘృతము పోయండి. మీరు ధనరక్షకులు. అశ్వసహితులైన శత్రు సంహారకులు. మీరు పక్షివలె సుందరులు - సర్వత్రగాములు. అనుకున్నంతనే అలంకృతులై స్తోత్రముల కొరకు యజ్ఞములకు విచ్చేయుదురు.

9. పొడుగు కాళ్ల వానికి లోతునీరు దాటునపుడు ఆశ్రయము, లభించినట్లు మాకు ఆశ్రయము కలిగించండి. మీరు - శ్రోత్రద్వయమువలె -స్తుతులను శ్రద్ధగ విందురు. రెండు యజ్ఞాంగముల వలె మీరు ఈ విచిత్ర యజ్ఞమునకు విచ్చేయండి.

10. రెండు తేనెటీగలు తేనెపట్టులో తేనె చేర్చినట్లు మీరు గోస్తనములందు మధుతుల్య దుగ్ధములను కలిగించండి. శ్రమజీవి శ్రమించి చెమట కార్చినట్లు మీరును స్వేదవంతులె జలము కూర్చండి. దుర్భల గోవు పచ్చిక బయట సంచరించి ఆహారము పొందిన రీతి మీరు యజ్ఞములకు విచ్చేసి ఆహారము పొందుచున్నారు.

11. మేము స్తోత్రములను విస్తరిస్తున్నాము. ఆహార వితరణ చేయుచున్నాము. కావున మీరు ఉభయులు ఒకే రథమున ఈ యజ్ఞమునకు విచ్చేయండి. గోస్తనములందు రుచికర ఆహారము వంటి పాలు ఉన్నవి. భూతాంశర్షి ఈ స్తోత్రము రచించి అశ్వినుల మనోరథమును తీర్చినాడు.

## నూట ఏడవ సూక్తము

ఋషి- ప్రజాపతిసుత దక్షిణ దేవత - ఋత్విక్కులకు అర్పించు దక్షిణ-
ఛందస్సు- త్రిష్టుప్ - 4 జగతి

1. యజమానుల యజ్ఞ నిర్వహణకు గాను సూర్య రూప ఇంద్రుని అనంత తేజము వెడలినది. ప్రాణులన్నియు చీకటి నుండి బయట పడినది. పితరులు ప్రసాదించిన జ్యోతి ప్రత్యక్షమైనది, దక్షిణలు ఇచ్చు ప్రశస్త పద్ధతి ఆవిర్భవించినది.

2. దక్షిణలు ఇచ్చువారు స్వర్గపు ఉన్నత ఆసనమున ఆసీనులు అగుదురు. స్వర్ణదాతలు అమరులు అగుదురు. వస్త్రదాతలు సోమమును చేరుదురు,అందరు దీర్ఘాయువులు అగుదురు.

3. దక్షిణలు ఇచ్చుట వలన పుణ్యకర్మలు పూర్ణములు అగుచున్నవి. ఇది దేవతార్చనలో భాగము అగుచున్నది. ఆచరణ దుష్టమైనపుడు దేవతలు కార్యమును సఫలము కానీయరు. దక్షిణలు పవిత్రముగా ఇచ్చువారి నిందలకు భీతిల్లువారి కార్యములు సఫలములు అగుచున్నవి.

4. వాయువు నూర్లదారులు వీచును. అందు వలన ఆకాశము, సూర్యుడు, నరులు వాయువునకు హవి సమర్ధించుచున్నారు. దేవతలకు తృప్తి కలిగించి దానములు చేయు వారి మనోరధములను దక్షిణలు తీర్చుచున్నవి. ఈ దక్షిణలు తీసుకొనుటకు సప్త పురోహితులకు అధికారము గలదు.

5. దాతను అందరికన్న ముందు ఆహ్వానింతురు. వారు గ్రామాధ్యక్షులగుదురు. అగ్ర భాగమున సాగుదురు. అందరి కన్నముందు దక్షిణ ఇచ్చువానిని నేను అందరి రాజుగ భావింతును.

6. ఎవరు సర్వ ప్రథమ దక్షిణలు ఇచ్చి పురోహితులకు తృప్తి కలిగింతురో వారు ఋషి, బ్రహ్మ అనబడుచున్నారు. వారినే యజ్ఞాధ్యక్షులు, సామగాత స్తోత అనుచున్నారు. వారు అగ్నియొక్క మూడు రూపములను తెలియుచున్నారు.

7. అశ్వములు, గోవులు, మనోహరి స్వర్ణమ దక్షిణలు అగుచున్నవి. మన ఆత్మ స్వరూప అన్నము సహితము దక్షిణ అగుచున్నది. విద్వాంసుడు దక్షిణను దేహ రక్షణ కవచముగ భావించును.

8. దాతకు మృత్యువు లేదు. అతడు దేవత అగును. అతనిని దరిద్రము. బాధలు, దుఃఖములు, వ్యథలు చేరవు. ఈ భూమి మీద, ఆ స్వర్గమున ఉన్న వారలందరు వారికి దక్షిణలు ఇచ్చెదరు. వ్యథలు చేరవు. ఈ భూమి మీద, ఆ స్వర్గమున ఉన్న వారలందరు వారికి దక్షిణలు ఇచ్చెదరు.

9. దాతలు పాడియావును ముందే పొందుదురు. అందకత్తె యగు నవవధువు లభించును. సుర లభించును. దాతలే అజేయ శత్రువును జయింతురు.

10. దాతకు అలంకరించిన జననాశ్వము ఇవ్వబడును. వారి కొరకు సుందరి వేచి ఉండును. పుష్కరిణి వంటి నిర్మలము ఆలయము వంటి మనోహర గృహము సిద్ధమై ఉండును.

11. అశ్వదాతకు సుందర వాహనము లభించును. అతని కొరకు అలంకృత రథము, సిద్ధముగ ఉండును. యుద్ధములందు దేవతలు దాతలను రక్షింతురు. యుద్దములందు దాతలకు విజయము కలుగుచున్నది.

సమర రాయబారము

**నూట ఎనిమిదవ సూక్తము**

ఋషి - పణులు, సరమ, దేవత, సరమ, పణులు, ఛందస్సు, త్రిష్టుప్

బృహస్పతి గోవులను బలాసుర భటులకు పణులు దొంగిలించినారు. గుహలో దాచినారు. ఇంద్రుడు ఆడకుక్క సరమను గోవులను వెతుకుటకు పంపినాడు. సరమ గుహకు చేరి దూత కార్యం నిర్వర్తించినది. ఈ సూక్తము సరమ - పణుల సంభాషణ.

ఇది దౌత్య కార్యము. సరమ సంకేతము మాత్రము. దౌత్య విషయమున సాంకేతికముగ అంతర్జాతీయ న్యాయము. దానిని అనుసరించు జాతులు సూత్రప్రాయముగా దర్శనము ఇచ్చును.

పణులు:-

1. సరమా! నీవు ఏ కార్యము కొరకు ఇచటికి వచ్చినావు? ఇది బహుదూర మార్గము. ఈ మార్గమున వచ్చునపుడు వెనుకకు చూచిన రాజాలరు. మా వద్ద ఏమంత ఉన్నదని నీవు ఇంత దూరము వచ్చినావు? ఎన్ని రాత్రులు నడిచినావు? నదిని ఎట్లు దాటినావు?

వచ్చినది పరజాతిది. ఏదో సంగ్రహించుటకే వచ్చినది. అది పణులకు తెలియును. అయినను దూతిగా వచ్చినది. సౌమ్యముగ పలకరించుచున్నారు.

సరమ:-

2. పణులారా! నేను ఇంద్రుని దూతిని. మీరు గోధనమును కూర్చి ఉంచినారు. దానిని కొనిపోవుట నా అభిమతము. ఇది నేను నది దాట వచ్చిన క్రమము.

తాను ఎవరి దూతి - తన కార్యమేమి? తన శక్తి ఎంత వెల్లడించినది. దాటరాని నదిని దాటినానని. వివరించినది.

3. పణులు :-

సరమా! నీవు ఎవరి దూతవై ఇంత దూరము వచ్చినవో ఆ ఇంద్రుడు ఎంతటివాడు? అతని పరాక్రమము ఎంతటిది? అతని సేన తీరేమీ?

ఇంద్రుడు వచ్చునుగాక. అతడు మాకు మిత్రుడు అగును. అతడు మా గోవులను గ్రహించునుగాత. గోపతిర్నోభవతి - మాకు గోసంరక్షకుడు అగును గాక.

ఇది యుద్ధము నివారించు ప్రతిపాదన ! కాని చురక ఉన్నది. వారు గోవులను ఇస్తారు. ఇంద్రుడు వారి గోవులను రక్షించవలె. వారి అధీనుడు కావలె!

4. సరమ :-

నేను ఎవరి దూతినై ఇంతదూరము వచ్చినానో ఆ ఇంద్రుడు అపరాజితుడు. అతనిని ఎంతటివారును ఓడించజాలరు. అతడు అందరిని ఓడించగలవాడు. గహన, గభీర, నదులు సహితము అతని గతిని నిరోధించజాలవు.

పణులారా! ఇంద్రుడు మిమ్ము హతమార్చగలడు.

పణులు :-

5. సరమా! సుందరివి. నీవు స్వర్గపు శేషసీమ నుండి వచ్చినావు. కావున గోవులలో నీవు కోరిన వానిని నీకు ఇచ్చెదము. యుద్ధము లేక గోవులను ఎవడు ఇచ్చును? మా వద్దను అనేక తీక్ష్ణ ఆయుధములు ఉన్నవి.

శాంతి కొరకు సంధికి సిద్ధపడినాడు. ఇంద్రుడు తమ అధీనుడు కానక్కర లేదు. కొన్ని గోవులను ఇస్తాము అని తమ వద్ద ఉన్న ఆయుధములను గురించి హెచ్చరించినారు. డిప్లోనుసేని పరిశీలించండి.

సరమ :-

6. మీ మాటలు సేనా యోగ్యములు కావు. మీ దేహములందు పాపము నిండి ఉన్నది. ఇంద్రుని శరములు మిమ్ము హత మార్చగలవు. ఇచటికి వచ్చు మార్గములను దేవతలు ఆక్రమించగలరు. అంతేకాదు. బృహస్పతి మిమ్ము బాధలు పెట్టగలడు. మీరు గోవులను వప్పగించకున్న ఆపదలు ముంచివేయును.

వ్యూహము గమనించండి. దేవతలు తొలుత మార్గాలు మూస్తారు. ఇదే ఇప్పటికిని యుద్ధ వ్యూహము ! తదుపరి పణులను హతమారుస్తారు. కాబట్టి గోవులను వప్పగించండి. ప్రాణాలు రక్షించుకొనండి.

సీతను వప్పగించు లంకను రక్షించుకొనుము. అని హనుమ రావణుని హెచ్చరించినాడు.

7. మా సంపదలను పర్వతములు రక్షించుచున్నవి. గోవులు, అశ్వములు, అన్యధనములచే నిండి ఉన్నవి. పణులు రక్షాదక్షులు. వారు తమ సంపదలను రక్షించుకొనగల సమర్థులు. గోవులు అంబారావములు నిండిన మా తావులకు సరమా! నీవు వ్యర్థముగ వచ్చినావు?

పరికించండి. ఇది వేదము. ఒక్క పరుష వాక్యము లేదు 'మధువదిష్యే' - తీయగ మాటలాడుదుము.

సరమ :-

8. అంగిరస, అయాస్య ఋషులు - నవశ్వ గణము సోమ పాన ప్రమత్తులై ఇచ్చటికి వచ్చిపడెదరు. ఈ గోవులణు అన్నింటిని తోలుకొని పోవుదురు. అప్పుడు ఇప్పటి దర్పోక్తులు పనికిరావు.

పణులు :-

9. సరమా! దేవతలు మాకు దడిచినారు. నిన్ను పంపినారు. నిన్ను మేము మా సోదరిగ భావించుచున్నాము. ఇక నీవు తిరిగి వెళ్లకుము. సుందరీ! నీకు గోధవపు భాగము ఇవ్వగలము.

**సోదరికి ఆస్తిలో హక్కు ఉన్నది. ఇది వేదపు మాట! సరమ**

10. నాకు అన్నల, చెల్లెళ్ల, కథలు అర్థము కావు. ఇంద్రుడు పరాక్రమ వంతులగు అంగిరో వంశీయులు సమస్త రక్షణలతో నన్నంపినారు. గోవుల కొరకు పంపినారు. వారి ఆశ్రయమున నేను వచ్చినాను. కావున పణులారా! దూరదేశములకు పారిపోండి.

11. పణులారా! బహుదూరమునకు పారిపొండి. ఇచట గోవులు కష్టపడుచున్నవి. ధర్మమును ఆశ్రయించి గోవులు ఈ పర్వతములు దాటి మరలును గాత. బృహస్పతి -సొమము - సోమభిషవ శిలలు - ఋషులు - విద్వాంసులు గోవులను దాచిన ఈ నెలవును తెలిసికొన్నారు.

**నూట తొమ్మిదవ సూక్తము**

ఋషిక - జుహుర్నామ బ్రహ్మావాదిని - దేవత - విశ్వేదేవతలు

ఛందస్సు - త్రిష్టుప్ - 6-7 అనుష్టుప్

1. బృహస్పతి భార్య జుహు, ఆమెను బృహస్పతి త్యజించినాడు. అందువలన అతనికి బ్రహ్మ పాపము అంటుకున్నది. అప్పుడు సూర్యుడు, శీఘ్రగామి వాయువు, ప్రజ్వలిత అగ్ని, సుఖకర సోముడు, జలదేవత వరుణుడు, సత్యస్వరూప ప్రజవతి, అన్య దేవతలు ప్రాయశ్చిత్తము చేయించినారు.

2. సాహసించిన సోమరాజు తొలుత పవిత్ర చరిత్ర స్త్రీని బృహస్పతికి ఇచ్చినాడు. మిత్రా వరుణులు దానిని ఆమోదించినారు. హోమ నిష్పాద అగ్ని ఆమెను చేయి పట్టుకొని తెచ్చినాడు.

3. ఈమె విధి ప్రకారము పత్ని అయినది. ఈ పత్నిని దేహముతో తాకవలెను. అని అందరు అన్నారు.

ఆమెను వెదుకుటకు వెళ్లిన దూత విషయమున ఆమె అనాసక్త అయినది. బలశాలి రాజు రాజ్యము సురక్షితము అయినట్లు. ఈమె శీలము సురక్షితముగ ఉన్నది.

4. తాపసులగు సప్తర్షులు ప్రాచీన దేవతలు ఈ పత్ని విషయము చెప్పినారు.

ఈమె అత్యంత పవిత్రశీల. ఈమెను బృహస్పతి, వివాహ మాడినాడు. తపస్సు, సచ్ఛీలము నికృష్ణ పదార్ధమును సహితము ఉత్తమ స్థానమునకు చేర్చును.

5. భార్య లేనపుడు బృహస్పతి బ్రహ్మచర్యను అవలంబించినాడు. అతడు సకల దేవతలతో మమైక్యమైనాడు. వారిలో భాగము అయినాడు. ఎట్లు అతడు మొదట భార్యను సోమునిచేత అందుకున్నాడో అట్లే మరల జుహునామక పత్నిని గ్రహించినాడు.

6. దేవతలు, మానవులు మరల బృహస్పతికి అతని భార్యను వప్పగించినారు. రాజులు సహితము శపథ యుక్తముగ శుద్ధ చరిత్ర పత్నిని వప్పగించినారు.

7. పవిత్రశీల పత్నిని మరల తెచ్చి బృహస్పతిని పాపరహితుని చేసినాడు. అప్పుడు వారు భూమి మీది సర్వశ్రేష్ఠ భోజనము చేసినారు. సంతోషముగా ప్రస్థానము సాగించినారు.

## ఆలోచనామృతము.

1. మానవ సమాజం టెక్కు, హైటెక్కు, ఇంటర్నెట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీల మీద బొత్తిగా ఆధారపడలేదు. ఇది కేవలం వర్తక, వ్యాపార, వాణిజ్య అభివృద్ధికి ఉపకరిస్తాయి. ఈ టెక్నాలజీ మనిషిని మారాను కాదు మరలో భాగాన్ని - 'పార్ట్ ఆఫ్ మిషనరీని; చేశాయి. మనిషి ఏ మరలో ఏ భాగమో సహితం ఆలోచించ నివ్వకుండా ప్రచారమైకం (పబ్లిసిటీ ఎనెపిస్తియా)లో ముంచింది. జీవితంలో విశ్రాంతి ఎరుగక టెన్షన్లతో మత్తుమందులను ఆత్మహత్యలను ఆశ్రయిస్తున్నాడు. అమెరికాలో అభివృద్ధి రేటుకన్న ఆత్మహత్యల రేటు అధికంగా ఉంది.

మనిషి ఈ మాయాజాలంలో చిక్కుకున్నాడు. బయటపడలేడు. చావాల్సిందే!

2. మనిషి పుట్టి లక్షల సంవత్సరాలు ప్రకృతి వడిలో శాంతంగా విశ్రాంతంగా జీవించాడు. మరపుట్టి పూర్తిగా రెండు వందల సంవత్సరాలు కాలేదు. అది మనిషిని వ్యాపార వస్తువును చేసింది. అప్పుడే విసుగు పుట్టించింది. అతడు విముక్తి కోసం నానా అగచాట్లు పడుతున్నాడు.

3. ఈ వ్యవస్థ కలకాలం కొనసాగడానికి వీల్లేదు. ఎంచేతంటే ఇది మనిషిని, మనసును, ప్రకృతినీ ధ్వంసం చేస్తున్నది!

రామాయణపు లంకలో సరిగ్గా నేటి పరిస్థితే కనిపిస్తుంది?

హిరణ్యాక్ష్య హిరణ్యకశిపులు భూమిని చుట్టి చంకనపెట్టుకునే ప్రయత్నం చేశారు!

భస్మాసురుడు అమరత్వం సాధించాలని బూడిద అయినాడు!

సైన్సుకు పరాకాష్ట అయిన ఆకాశంలో త్రిపురాలను - మూడు నగరాలను నిర్మించారు!

ఇవన్నీ ప్రకృతి విరుద్దములు ప్రకృతి విరుద్ధం అయింది ఏదీ కలకాలం నిలువదు. నశించాలి. ఇది ప్రకృతి శాసనం! పరమాత్మ శాసనం!

4. ఇది ఇయ్యది - నేటిది పిశాచ నాగరకత దీనికి మనసులేదు - మానవతలేదు.

ఇది పిశాచ నాగరకత. దీనికి మారణాయుధాలు కొమ్ములు. నెత్తిన భూగోళం, చేతుల్లో రక్కసి ధనం! రక్కసి అధికారం!

దీని కళ్ళకు గంతలు. దిక్కు ఎరుగదు - దిస ఎరుగదు. ఉరుకుతున్నది. పరుగులు పెట్తున్నది. వేగం, వేగం, యమవేగం, కన్నుకానదు. మన్ను కానదు, మిన్ను కానదు.

అది కూలక తప్పదు, బొక్కబోరలపడుతుంది. అది సత్యం, అది తధ్యం, అది వాస్తవం. కూలక తప్పదు.

ఆ కూలిన మనిషి వెన్ను తట్టవలసింది. చేయూత నివ్వవలసింది. లేపవలసింది. మానవతామృతం చిలకవలసింది. భారతతాత్వికతయే!

అందుకు భారత యువత సన్నద్ధం కావాలి. అందుకే నా కృషి - ప్రయత్నం తపస్సు!

అది ఫలించిన్నాడు నేను ఎక్కడ ఉన్నా ఆనంద బాష్పం రాలుస్తాను.

5. సమాజం శాసనాల మీదగాని, ప్రభుత్వం మీదగాని ఆధారపడిలేదు. సమాజం మానవ సంబందాల మీద ఆధారపడి ఉంది. మానవ సంబంధాలు కేవలం ఆర్థిక సంబంధాల మీద ఆధారపడిలేవు. మానవ సంబంధాలు స్వచ్ఛందములు. ప్రేమాభిమానాల మీద ఆధారపడినవి.

తల్లిదండ్రులు బిడ్డలను ప్రేమించడం - వారి కోసం అన్ని త్యాగాలకు సిద్ధం కావడం ఇందుకు నిదర్శనం.

అయితే ధనస్వామ్య సమాజంలో ప్రేమలు, అభిమానాలు, ఆత్మీయతలు, అనురాగాలు, అనుబంధాలు ధనానికి ఊడిగం చేస్తున్నాయి. ఈ విలువలు తగ్గుతున్న మాట వాస్తవం కాని ఇంకా పూర్తిగా అంతరించలేదు!

6. సమాజం దాంపత్యం -సెక్సు -మీద  ఆస్తి మీదా నిలుస్తున్నది. ఆదిమానవుని నుంచి ఇదే స్థితి.

ఆదిమ దశలో సెక్సు, ఆస్తి, విషయంలో నరుడు పశువుకన్న భిన్నుడుకాడు. ఆ రెంటి విషయంలో బలం కలవాడే అధిపతి!

నాటి నుంచి సామాజిక సేతలు - ఋషులు, మునులు, కవులు బలహీనుని రక్షించడానికి నిరంతరం ప్రయత్నించారు. వారు అధికారం బలం మీద కాక ధార్మిక బలంతో నరునిలో నైతిక స్థాయిని పెంచడానికి నిరంతరం కృషి చేశారు. వారు చాలా  వరకు సఫలీకృతులు అయినారు.

సెక్సు విషయంలో ఎంతటి నీచులైనా తల్లితో తోబుట్టువులతో సంగమం ఆశించడు!

ఇది మానవజాతి చరిత్రలో మహత్తర విజయం! చరిత్ర సొంతం పరపీడా పరాయణత్వం కాదు!

ఆస్తి విషయంలోనూ సుమారు అంతట విజయం సాగించారు.

మాగృధః కస్యస్విద్దనం - మరొకరి ధనాన్ని ఆశించకు.

సమాజంలో నూటికి తొంభయతొమ్మిది మంది పై ఉపనిషత్తు శాసనాన్ని ఆచరిస్తున్నారు!

అన్యుల ఆస్తిని ఆశించి ఆక్రమించే ఒక శాతం జనమే పాలిస్తున్నారు! కోర్టుల్లో ఉన్న సివిల్ కేసులు ఒక శాతం కూడా ఉండవు!

7. మానవ సంబంధాల్లో అత్యవసరం అయిందీ అతి ప్రధానం అయిందీ భార్యా భర్తల సంబంధం! అది ఉత్పత్తికి, సమాజం నిరంతరంగాసాగే సంతానానికి, కుటుంబం నిలవడానికీ పెరగడానికీ ఉపకరిస్తుంది. భార్యా భర్తలది పవిత్ర బంధం! ఇతర వ్యవస్థల్లో వివాహం కాంట్రాక్టు మాత్రమే! భారత సంప్రదాయ వివాహ బంధం పవిత్రం. అది మరణంతో కూడ తెగిపోదు ! ఏడేడు జన్మలు కొనసాగుతుంది.

8. ఈ సూక్తం వివాహ బంధాన్ని వివరించింది. వేదం శాస్త్రయోని. ఇందులో రామాయణ మూలాలు కనిపిస్తాయి.

i బృహస్పతి, తన భార్య జుహూను త్యజించాడు. సీతను, రావణుడు అపహరించాడు.

ii జుహు ఎచట ఉందో తెలియదు. దూతను పంపారు. ఆమె అనాసక్త అవుతుంది. హనుమంతుడు దూత అవుతాడు.

iii. జుహు సచ్ఛీలం గలది. అని దేవతలు చెపుతారు. సీతా విషయంలో అగ్నిదేవుడు సాక్ష్యం చెపుతాడు.

iv. ఇక్కడ మరొక విశేషం ఉంది. బృహస్పతి సహితం అంత కాలం బ్రహ్మచారిగ ఉన్నాడని దేవతలు నిరూపిస్తారు. రాముని విషయంలో అది జరుగదు.

v. పునర్దాయాం బ్రహ్మజయాం కృత్వా దైవైర్ని కల్బిషమ్, దేవతలు భార్యను కూర్చి బృహస్పతిని పాప విముక్తుని చేశారు అన్నాడు. అంటే భార్యను విడువడం పాపకృత్యం అయింది. రామునికి ఇది వర్తించలేదు.

9. ఏక పతిత్వ, ఏకపత్నీత్వములు దంపతులు, సంతాన, కుటుంబం, సమాజాల సంక్షేమములు అని ఆనాడు వివరించిందాన్ని ఈ నాటి సమాజం ఇంకా గుర్తించ జాలకున్నది! అవివాహిత బాల్యమాతల సంఖ్య అమెరికాలో పెరిగిపోతున్నది. ఇది అశుభ సూచకం!

10. ఎడబాటులో బృహస్పతి, జుహువులు నిగ్రహం పాటించారు. తపస్సు చేశారు. దేవతల రాయబారం పునస్సమాగమం జరిగిన తీరు వివాహాన్ని తలపిస్తున్నది! దేవతలంతా భోజనాలు చేసివెళ్లారు! వివాహబంధం వాగర్థముల వంటి పార్వతీ పరమేశ్వరుల వంటిది. అనన్యా రాఘవేణాహం వంటి సీతారాముల వంటిది. అదియే సమాజానికి శ్రీరామరక్ష.

11. ఈ సూక్తం ఏడు మంత్రాలది. వివాహం ఏడు అడుగుల బంధం. ఏడేడు జన్మల బంధం. అంటే ఒక దంపతుల గుణగణాలు - (Gens) - ఏడు తరాల వరకూ కొనసాగుతాయి.

**నూట పదవ సూక్తము**

ఋషి - భార్గవ జమదగ్ని దేవత - అగ్నులు -ఛందస్సు- త్రిష్టుప్

1. జ్ఞాని అగ్నీ! నీవు మానవ గృహములందు సమిధలతో చేరుము. నీ దేవతను, అన్య దేవతలను అర్చించుము. నీ మిత్రుడు నిన్ను పూజిస్తాడు. నీవు బుద్ధి కుశలుడవు. క్రియా కౌశల్యము గల దూతవు. నీవు దేవతలను తెలిసి తోడ్కొనిరమ్ము.

2. తనూన పాత అగ్నీ! యజ్ఞమార్గమును మధు మిశ్రితము చేయుము. నీ సుందర జిహ్వతో దానిని ఆస్వాదించుము. సద్భావములతో స్తోత్రమును, యజ్ఞమును సమృద్ధము చేయుము. మా యజ్ఞమును దేవభోగ్యము చేయుము.

3. ఆగ్నీ ! నీవు దేవతల ఆహ్వాతవు. ప్రార్థనీయుడవు. వందనీయుడవు. వసువుల సహితముగ విచ్చేయుము.

మహాపురుషా! నీవు దేవతల ఆహ్వాతవు. ప్రార్థనీయుడవు. వందనీయుడవు. వసువుల సహితముగా విచ్చేయుము.

మహాపురుషా! నీవు దేవతల హోతవు. నీకు ప్రేరణ కలిగించుచున్నాము. నీతో సమానముగ యజ్ఞము చేయగలాడు లేడు. సమస్త దేవతల కొరకు యజ్ఞము చేయుము.

4. పూర్వాహ్ణమున కుశలను పూర్వముఖముగా పరచి వేదిని ఆచ్ఛాదించబడును. వానిని మరింత అందముగ విస్తరించబడును. దానిమీద అదితియు, ఇతర దేవతలును ఆసీనులు అగుదురు.

5. స్త్రీలు చక్కగ అలంకరించుకొని భర్తను చేరి తమను ప్రకటించుకుందురు. అట్లే ఆలంకృత ద్వారముల అధిష్ఠాన దేవేరులు తొలగుదురు గాత. ద్వార దేవేరులారా! దేవతలు సులభముగ దాటగలుగునట్లు తెరవండి.

6. ఉషాదేవియు -రాత్రి దేవియు జనులకు నిద్రా సుఖము కలిగింతురుగాక. వారికి యజ్ఞాభాగ అధికారము కలదు. వారు కలసి యజ్ఞ స్థానమున ఆసీనలు అగుదురుగాక. వారు దివ్యలోక దాసిని స్త్రీల వంటి అత్యంత గుణవతులు, శోభాయుక్తలు, ఉజ్వల శ్రీసమేతలు.

7. అగ్ని ఆదిత్యులు ఉభయులు ఉత్తమ వాక్యముల స్తోత్రములు రచింతురు. మానవులు చేయు అనుష్ఠాన కార్యమును నిర్మింతురు, వారు పురోహితులను వారి వారి విధులకు ప్రేరణ కలిగింతురు, వారు క్రియా కుశలురు! తూర్పు దిక్కున వెలుగొందుచు ఉదయిస్తున్నారు.

8. భారతీదేవి మా యజ్ఞమునకు శీఘ్రముగ విచ్చేయునుగాత. ఇళాదేవి ఈ యజ్ఞమును తలచుకొని మానినివలె విచ్చేయునుగాత. వారితో కలిసిన సరస్వతి సహితలగు ముగ్గురు దేవేరులు విచ్చేసి సుఖాసనముల మీద ఆసీనలు

అగుదురుగాత.

9. ద్యావా పృథ్వుల మాతా - పితృ స్వరూపులు. హోతా! ఏ దేవత ఈ ఉభయులను కల్పించి సమస్త ప్రాణిజాలపు సృష్టికి కారకుడు అయినాడు అట్టి త్వష్టను పూజించండి. మీ వద్ద అన్నము కలదు. మీరు విద్వాంసులు నాకు సమముగ యజ్ఞము చేయగలవాడు లేడు.

10. యూప్తస్తంభమా! నీవు సమయానుసారముగ దేవతలకు అన్నము, ఇతర హోమ ద్రవ్యములు అర్పించుము వనస్పతి, శమిత , అగ్నిదేవతలు, ఘృత, మధుయుక్త, హోమ ద్రవ్యములను ఆస్వదింతురుగాత.

11. జన్మతోనే అగ్ని యజ్ఞ నిర్మాత అయినాడు. దేవతలకు అగ్రగామి దూత అయినాడు. అగ్ని స్వరూప హోతలు మంత్రములు చదువుదురుగాక. యజ్ఞోపయోగ దేవవాక్యము ఉచ్చరించబడునుగాక. స్వాహాతో సమర్పించిన వానిని దేవతలు ఆరగింతురుగాత.

## నూట పదకొండవ సూక్తము

ఋషి - వైరూప అష్టాదంష్ట్రుడు - దేవత - ఇంద్రుడు - ఛందస్సు త్రిష్టుప్

1. స్తోతలారా! మీ జ్ఞానము ఎట్లెట్లు స్తోత్ర పారము చేయండి. సత్కర్మానుష్ఠానము చేయండి. ఇంద్రుని ఆహ్వానించండి. ఇంద్రుడు వీరుడు. తనను స్తుతించిన స్తోతలను అనుగ్రహించును.

2. ఇంద్రుడు జలములకు ఆధారమగు అంతరిక్షమునకు ప్రభువు అగుచున్నాడు. చిన్నతనపు గోవు కన్నా చూడ ఆవులన్నింటిలో కలిసిపోవును. అట్లే ఇంద్రుడు సర్వవ్యాపి అగుచున్నాడు. విలక్షణ ధ్వనులతో ఇంద్రుడు వెడలును. అతడు బృహత్ జలరాశికి అధిపతి అగుచున్నాడు.

3. ఈ స్తోత్ర శ్రవణము ఇంద్రుడు మాత్రమే చేయగలడు. అతడు జయశీలుడు. సూర్యునకు మార్గము ఏర్పరచినాడు. నిశ్చలుడగు ఇంద్రుడు జలములను ఆవిష్కరించినాడు. అతడు గోశక్తికి అధికారి. స్వర్గమునకు ప్రభువు. అతడు చిరంతనుడు. అప్రతి పక్షుడు.

4. అంగిర వంశీయులు స్తుతులు కల్పించు సమయమున ఇంద్రుడు విశాల మేఘములను కురిపించినాడు. అతడు అనంత జలమును కల్పించినాడు. సత్యరూప ద్యులోకపు జలములకు అధిపతి అయినాడు.

5. ఇంద్రుడు ద్యావాపృథ్వులు సమానులు. ఇంద్రుడు ఆ రెండింటి అంతటివాడు. అతనికి సమస్త సోమ యజ్ఞముల సమాచారములు తెలియును. అతడు తాపము తగ్గించును. సూర్యునిచే ఆకాశమును ప్రజ్వలింపచేసినాడు. పోషించుటలో అతడు మొనగాడు. అతడు స్తంభముల మీద ఆకాశమును నిలిపినాడు అనిపించును.

6. ఇంద్రా! నీవు వృత్రఘ్నుడవు - వజ్రముతో వృత్రుని వధించినవాడవు. వృత్రుడు ఎదుగుచున్నపుడు దుర్గదుడవగు నీవు వజ్రముచే వాని మాయలను పటాపంచలు చేసినావు. ఆ తరువాత నీవు మహాబలశాలివి అయినావు.

7. ఉషో దేవేరులు సూర్యునిలో కలసినపుడు సూర్యకిరణములు బహువరములతో శోభిల్లినవి. తదుపరి ఆకాశమున చుక్కలు పొడిచినంత బాటసారి సూర్యుని వెలుంగు జాడ కానలేకపోయినాడు.

8. ఇంద్రుని ఆదేశము విన్నది. జలము ప్రవహింపసాగినది. అది బహుదూరము సాగినది.

ఆ జలపు అగ్రభాగమెచట?

దాని మస్తకము ఎచట?

జలమా? నీ మధ్యస్థానమేది? చరమ స్థానమెయ్యది?

9. ఇంద్రదేవా! ఎపుడు వృత్రాసురుడు జలమును గ్రసించుచుండెనో, అపుడు నీవు జలములకు విముక్తి కలిగించినావు. అప్పుడే జలము వేగముగ ప్రవహించినది.

ఇంద్రుడు ఎపుడు జలములకు విముక్తి కలిగించినాడో అపుడు జలము స్థిరముగ నిలువలేక పోయినది.

10. సమస్త జలములు కామాతురవలె ఉరుకుల పెట్టినవి. కలసి సముద్రమునకు సాగినవి.

శత్రుపురధ్వంసి, శత్రుజర్జరకర్త ఇంద్రుడు సర్వదా సమస్త జలములకు ప్రభువు అగుచున్నాడు. పృథివి మీద గల సమస్త యజ్ఞసామాగ్రి, స్తుతులు ఇంద్రుని చేరునుగాత.

## నూట పన్నెండవ సూక్తము

ఋషి - విరూపగోత్ర - ప్రభేదనుడు. దేవత - ఇంద్రుడు. ఛందస్సు -త్రిష్టుప్

1. ఇంద్రా! సోమము సమర్పించినాము. వలసినంత సేవింపుము. ప్రాతః కాలసోమము నీకు ప్రథమ యోగ్యము అగును. నీవు వీరుడవు. శత్రువధకు ఉత్సుకుడవగుము. మేము మంత్రములతో నీ వీరత్వమును ప్రశంసింతుము.

2. ఇంద్రా! నీ రథము మనోవేగమును మించినది. ఆ రథము పైననే సోమపానమునకు విచ్చేయుము. నీవు ఆనందముగ విహరించు హరియను అశ్వములు వేగముగ పరుగులు తీయునుగాత.

3. ఇంద్రా! హరితవర్ణ తేజముతోను - సూర్యుని మించిన నానావిధ కాంతులతోను శోభిల్లుము. మేము బంధుత్వముగ నిన్ను ఆహ్వానించుచున్నాము. మాతో కలసి కూర్చుండి. సోమపానము చేయుము. ప్రమత్తుడవగుము.

4. ఇంద్రా! సోమము సేవించి ఉన్మత్తుడవు అయినప్పటి నీ మహిమను ద్యావా, పృథ్వులు భరింపజాలవు. నీకు స్నేహపాత్రమగు అశ్వములను కట్టుము. యజ్ఞ సామాగ్రి గల యజమాని ఇంటికి విచ్చేయుము.

5. ఇంద్రా! ఎవడు సమర్పించిన సోమమును నిత్యము సేవించి, బలము చూపి, శత్రువధ చేసినాడో ఆ యజమానిని నీ ఇచ్చవచ్చిన స్తోత్రములతో నీకు ప్రేరణ కలిగించుచున్నాడు. నీ మనోరంజనమునకు సోమము సమర్పించుచున్నాడు.

6. శతక్రతు ఇంద్రా ! నీకు ఈ పానపాత్ర అవశ్యము లభించును. దీనితో త్రాగుము. దేవతలు కోరునట్టి మధుతుల్యము - మాదకమగు సోమముతో ఈ చషకమును పూరించినాము.

7. ఇంద్రా ! అన్నము, సోమము సిద్ధముచేసి అనేకులు అనేక స్థానములందు, నిన్ను ఆహ్వానించుచున్నారు. నీకు అర్పించిన సోమము, అన్ని సోమములకన్న - మధురము అగును గాత. అందుననే నీకు రుచి కలుగును గాత.

8. ఇంద్రా! పూర్వకాలమున - అందరి కన్న ముందు - నీవు శౌర్యము ప్రదర్శించినావు. దానిని నేను స్తుతించుచున్నాను. జలము కొరకు నీవు మేఘమును బ్రద్దలు చేసినావు. స్తోత కొరకు గోవును సులభలభ్యము చేసినావు.

9. ఇంద్రా ! నీవు బహుజన అధిపతివి. క్రియా కుశల వ్యక్తులందు బుద్ధిమంతులందు నిన్ను శిష్యునిగ భావింతురు. దూరమునగాని, దాపునగాని నీవు లేని అర్చన ఉండదు.

ధనిక ఇంద్రా! మా స్తుతులను విస్తృతము, సుందరము చేయుము.

10. ధనిక ఇంద్రా ! మేము నీ యాచకులము. మమ్ము తేజస్వులను చేయుము.

ధనాధిపతివియు - మిత్రుడవు అగు ఇంద్రా ! మమ్ము నీ బంధువులనుగ భావింపుము.

యుద్ధకర్త ఇంద్రా ! నీ శక్తియే యదార్థము ధన ప్రాప్తికి లేశమాత్రము అవకాశము ఉండదు. అచట సహితము మమ్ము ధన భాగస్వాములను చేయుము.

## నూట పదమూడవ సూక్తము

ఋషి - శతప్రభేదన విరూపుడు - దేవత - ఇంద్రుడు - ఛందస్సు - త్రిష్టుప్

1. అన్యదేవతలు, ద్యావా పృథ్వులు మనస్పూర్తిగా ఇంద్రుని బలమును రక్షింతురుగాక. ఇంద్రుడు వీరత్వమును సాధించుచు తన మహిమలకు చేరుకున్నాడు. అతడు సోమపానముచేసి అనేక కార్యములు సాధించినాడు. వర్ధిష్ణుడు అయినాడు.

2. విష్ణువు ఇంద్రునకు మధుర సోమలతనంపినాడు. అట్లు చేసి అతడు ఇంద్రుని మహిమను ఉత్సాహపూర్వకముగ ఘోషించినాడు. ఇంద్రుడు ధనికుడు. అతడు అన్య దేవతలతో కూడినాడు. వృత్రుని వధించినాడు. సర్వశ్రేష్ఠుడు అయినాడు.

3. ఇంద్రా ! నీవు ఉగ్రతేజివి. నీవు స్తుతులు ఆశించినావు. అస్త్ర శస్త్రములు ధరించినావు. దుర్ధర్ష వృత్రునిచే యుద్ధము చేయదలచినావు. వెడలినావు. అపుడు సమస్త మరుత్తులు నీ మహిమను పెంచినవి. మరుత్తులు సహితము వర్ధిల్లినారు.

4. ఇంద్రుడు పుట్టుకతోనే శత్రుదమనుడు అయినాడు. అతడు సంగ్రామము కోరినాడు. తన పౌరుషమును పెంచినాడు. ధ్యానించినాడు. వృత్రుని ఛేదించినాడు. మానవులకు విముక్తి కలిగించినాడు. ఉత్తమ కార్యము సాధించినాడు. విశాల ద్యులోకమును పైన నిలిపినాడు.

5. విశాల, విశాల సేనల మీద ఇంద్రుడు ఆకస్మాత్తుగ దునికినాడు. అతడు తన విశిష్ఠ మహిమలుచే ద్యావా పృథ్వులను వశపరచుకున్నాడు. వజ్రము దాత వరుణునకు, మిత్రునకు సుఖకారకము అయినది. అట్టి లోహమయ వజ్రమును ఇంద్రుడు దుర్ధర్ష రూపమున అందుకున్నాడు.

6. ఇంద్రుడు వివిధ ధ్వనులు చేసినాడు. శత్రు వధ సాగించినాడు. అతని బల పరాక్రమములు ప్రకటించదలచినది. జలము వెడలినది.

వృత్రుడు చీకట్లు చుట్టుకున్నాడు. జలమును పట్టి ఉంచినాడు. అయినను ఇంద్రుడు విజృంభించినాడు. బలశాలియై వృత్రుని నరకినాడు.

7. ఇంద్ర, వృత్రులు యుద్ధమున దూకినారు. తొలుత తమ తమ పరాక్రమములు ప్రదర్శించినారు. మహాక్రోధులు అయినారు. యుద్ధము చేసినారు. ఇంద్రుడు వృత్రుని వధించినాడు. చీకట్లు చెదరిపోయినవి. ఇంద్రుని మహిమ అంతటిది. శూరవీరులందు అతనిది అగ్రనామమం.

8. సోమరసము, స్తోత్రముల ద్వారా దేవతలు ఇంద్రుని వర్ధిల్లచేసినారు. ఇంద్రుడు దుర్ధర్ష వృత్రుని వధించినాడు. అపుడు జనులకు అన్నము లభించినది. అగ్ని తన జ్వాలా శిఖచే పదార్థములను భక్షించును. అట్లే జనులు దంతములతో అన్నమును నమిలినారు.

9. స్తోతలారా! ఇంద్రుడు అనేక మిత్ర కార్యములు సాధించినాడు. అతనిని ప్రశంసిం చండి. మంచి వాక్యములు తగిన ఛందస్సుతో రచించండి.

ఇంద్రుడు మనసుతో దభీతిరాజు ప్రార్థన విన్నాడు. ధుని, చమురి అను అసురులను వధించినాడు.

10. ఇంద్రా! నేను నీ కొరకు స్తుతులు రచించినాను. అపుడు విశేష ధనమును - ఉత్తమోత్తమ అశ్వములను కోరినాను. వానిని నాకు ప్రసాదించుము.

నేను పాపములను దాటుదును గాక.
శుభములు కలుగుదును గాత.

మేము కల్పించిన స్తోత్రములను, ఇంద్రా! ధ్యానముగా వినుము. మాకు ధనములు ప్రసాదించుము.

## నూట పదునాలుగవ సూక్తము

ఋషి - నైరూపసధ్మి, దేవత - విశ్వేదేవతలు, ఛందస్సు 4 జగతి మిగిలినవి త్రిష్టుప్

1. అగ్ని, సూర్యులు దేవతలు, వారు ప్రదీప్తులు. వారు నలుదిశల వ్యాపించినారు. త్రిభువన వ్యాపకులు అయినారు. మాతంశ్వకు వారి ప్రసన్నత ప్రాప్తించినది.

ఎపుడు దేవతలు సామమంత్రములను, సూర్యుని కనుగొన్నారో అప్పుడే వారు త్రిభువన పోషణకు ఆకాశమందలి జలమును ఆవిష్కరించినారు.

**మాతంశ్వ అంతరిక్షమున ఉన్న వాయు దేవతట**

2. యాజ్ఞికులు యజ్ఞములందు మూడు నిరృతులను ఉపాసింతురు. తదనంతరము యశస్వి అగ్ని పరిచయము దేవతలకు కలిగింతురు.

విద్వాంసులు అగ్ని మున్నగు వాని మూలములను తెలియుదురు. వారు గోప్య వ్రతములందు ఉందురు.

**అగ్ని, సూర్యుడు, వాయువు మూడు నిర్ఋతులు.**

3. యజ్ఞ వేది యువతి. దానికి నాలుగు కోణములు. ఆమె యొక్క ఘృతరూపము సుందరము స్నిగ్ధము. ఆమె ఉత్తమమగు యజ్ఞసామగ్రి వస్త్రము ధరించును. యజమాని పురోహితుడు అను రెండు పక్షులు దాని మీద కూర్చుండును. అచట దేవతలకు యజ్ఞభాగము లభించుచున్నది.

4.ఒక పక్షి - ప్రాణము - సముద్రము - బ్రహ్మాండమున ఉన్నది. పరిపక్వ జ్ఞానమున నేను దానిని చూచినాను. దగ్గరనున్న తల్లి - వాక్కు - దానిని ఆస్వాదించుచున్నది. మాత సహితము ఆస్వాదించుచున్నది.

5. పక్షి ఒక్కటయే. కాని క్రాంతదర్శి విద్వాంసులు దానిని అనేకముగా కల్పించుచున్నారు. వారు యజ్ఞములందు బహువిధ ఛందస్సులను ఉచ్చరించుచున్నారు. పన్నెండు సోమ పాత్రలను స్థాపించుచున్నారు.

6. విద్వాంసులు నలుబది సోమ పాత్రలను స్థాపింతురు. లేదా నలుబది ఛందస్సులు ఉచ్చరింతురు. వారు పన్నెండు సోమ కలశముల స్థాపింతురు లేదా పన్నెండు ఛందములను ఉచ్చరింతురు. అట్లు వారు మనసా అనుష్ఠానము చేయుదురు. ఋక్సామములతో యజ్ఞ రథమును నడిపింతురు.

7. ఈ యజ్ఞమునకు పదునాలుగు మహిమలు కలవు. ఏడుగురు హోతలు మంత్రములచే యజ్ఞము నిర్వహింతురు. ఏ యజ్ఞమార్గమున నిలిచి దేవతలు సోమపానము చేయుదురు?

అట్టి విశ్వవ్యాపి యజ్ఞమార్గమును వర్ణించగలవాడు ఎవడు?

8. పదిహేను వేల ఉక్థమంత్రములు ఉన్నవి. ద్యావాపృథ్వులవలె ఉక్థములు బృహత్తులు. స్తోత్ర మహిమ వేల విధములది. స్తోత్రములు అపరిమితములు. అట్లే వాక్యములకు పరిమితి లేదు.

9. సకల ఛందస్సుల మాట తెలిసినవాడు ఎవడు? మూల వాక్యమును గ్రహించినవాడు ఎవడు? ఏడుగురు పురోహితుల మీద ఎనిమిదవవాడు కాగల మొనగాడు ఎవడు? ఇంద్రుని హరితవర్ణ అశ్వమును కన్నవాడు ఎవడు? విన్నవాడు ఎవడు?

10. కొన్ని అశ్వములు నేల చివరి వరకు సంచరించును. కొన్ని రథములకు కట్టబడి ఉండును. సారథి రథము మీద ఉండును. అప్పుడు గుర్రపు శ్రమ నివారించుటకు తగిన ఆహారము ఇవ్వబడును.

**నూట పదిహేనవ సూక్తము.**

ఋషి - వృష్టివ్యపుత్ర ఉపస్తుతుడు. దేవత - అగ్ని ఛందస్సు1,7

జగతి 8 త్రిష్టుప్, 9 శక్వతి

1. ఇతడు అగ్ని బాలకుడు. అతనిది ఎంతటి అద్భుత ప్రభావము ! పాలకు అతడు తల్లి వద్దకు చేరడు అతనికి చనుబాలు లేవు! అయినను అతడు ఆవిర్భవించినాడు. బాలకుడైన ఇతడు జన్మతోనే దూతయైనాడు. దూత కార్యము నిర్వహించినాడు.

2. అగ్ని బహుకార్య కారకుడు. దాత. అతనివే ఆహ్వానించుచున్నాము. అగ్నిని జ్యోతిరూప దంతములు. అవి బలవంతులను భక్షించును. అగ్ని జుహువు అను పాత్రలో ఇంద్రునకు యజ్ఞభాగమే అందించును. బలిష్ఠ వృషభము గడ్డిమేసిన రీతి అగ్ని యజ్ఞ భాగమును భక్షించును.

3. పక్షివలె అగ్ని వృక్షమును ఆశ్రయించును. అగ్ని ప్రదీప అన్నప్రదాత. అగ్ని ధ్వనించుచు అడవులును కాల్చుము. జలము ధరించును. నోటితో హవ్యమును దహించును. అతడు అవలోకించి మహానుడు అయినాడు. అతని కార్యము మహత్తము. అతడు తన మారమును ఎర్రబరచును.

స్తోతలారా! అట్టే అగ్నిని స్తుతించండి.

4. అగ్నీ! నీవు అజరుడవు. నీవు మంట పెట్టునపుడు వాయువు నిన్ను చుట్టిముట్టి ఉండు. యజ్ఞాగ్నిని పురోహితులు చుట్టిముట్టి ఉందురు. అప్పుడు నీవు మూడు మూర్తులు దాల్తువు. బలము ప్రదర్శింతువు. పచార్లు చేయుదువు. పురోహితులు - యోద్ధులవలె కోలాహలము చేయుదురు.

5. అగ్ని అన్నింటికన్న ధ్వని చేయువాడు. అగ్నీ! స్తోతలు చేయు శబ్దమునకు నీవు మిత్రుడవు. అగ్ని ప్రభువు. సమీప శత్రు వినాశ కారకుడవు. అతడు స్తోతలు, విద్వాంసుల రక్షకుడు.

అగ్ని విద్వాంసులగు మాకు ఆశ్రయదాత అగుచున్నాడు.

6. అగ్నీ ! నీ తండ్రి శోభస్కరుడు. నీ వంటి అన్నవంతుడు మరొకడు లేడు. నీవు బలశాలివి. సర్వశ్రేష్ఠుడవు. ఆపదలందు ధనుర్ధారివై రక్షింతువు.

జ్ఞానియగు అగ్నికి ఉత్సాహ పూర్వకముగ యజ్ఞ సామాగ్రి అర్పించండి. స్తుతించుటకు సిద్ధముకండి.

7. జ్ఞానులు, కార్యశూరులగు నరులు అగ్నిని స్తుతింతురు. అగ్నిని సంపద బల పుత్రునిగా భావింతురు. యజ్ఞము చేయువారివలె - అగ్ని అనుగ్రహపాత్రులు సుఖింతురు. జ్యోతిర్మయ - గ్రహ, నక్షత్రాదులవలె తేజోవంతులు అగుదురు. శత్రువులను పరాజితులను చేయుదురు.

8. బలపుత్ర శక్తిశాలి అగ్నీ! నేను ఉపస్తుతుడను వర్షకమగు నా స్తోత్రము నిన్ను స్తుతించుచున్నది. మేము నిన్ను స్తుతిస్తున్నాము. మాకు దీర్ఘయువును, సంతానమును ప్రసాదించుము.

9. వృష్టి హవ్య పుత్రులు ఉపస్థితుడు మున్నగువారు నిన్ను స్తుతించుచున్నాము. మమ్ము, స్తోతలను, విద్వాంసులను రక్షింపుము. మేము, వారు నిన్ను వషట్కార మంత్రముతో, "నమో నమః, వాక్యముతోను స్తుతించుచున్నాము.

## నూట పదహారవ సూక్తము

ఋషి - స్థూలపుత్ర అగ్నియుతుడు. దేవత - ఛందస్సు - త్రిష్టుప్

1. ఇంద్రా ! నీవు బలశాలురందు అగ్రగణ్యుడవు. మరింత బలమునకు, వృత్ర వధకు సోమము సేవింపుము. అన్నము, బలము కొరకు నిన్ను ఆహ్వానింతురు. మధు తుల్య సోమపానము చేయుము. తృప్తిచెందుము. వర్షము కురిపించుము.

2. ఇది సోమము. ఇది భాగ్యము. సోమము క్షరితమగుచున్నది. దానిని సారముగ భావింపుము. సేవింపుము. మనమున ఆనందించుము. సౌభాగ్యము, ధనము ప్రసాదించుటకు విచ్చేయుము.

3. ఇంద్రా! స్వరపు సోమము నీకు మత్తు కలిగించునుగాక. పృథివి మీద - నరుల మధ్యన ఉన్న సోమము నీకు మత్తు కలిగించును గాక. నీవు ధనము ప్రసాదించునట్టి సోమము నీకు మత్తు కలిగించునుగాత. శత్రువధ చేయించు సోమము నీకు మాదక మగును గాత.

4. ఇంద్రుడు ఈ లోకమున, ఆ లోకమున స్థిరుడు - సర్వత్రగామి - వృష్టిదాత సోమ రూప ఆహార పదార్థములను నలువైపుల పరచినాము. ఇంద్రుడు ఆశ్వద్వయముతో అచటికి చేరునుగాత.

శత్రుఘాతక ఇంద్రా! మధుతుల్య సోమము గోచర్మ పాత్ర నిండి ఉన్నది. వృషము వలె బలమును ప్రదర్శించుము. యజ్ఞ శత్రువులను పరిమార్చుము.

5. ఇంద్రదేవా ! తీక్ష్ణ అస్త్రములతో రాక్షసులను నేల కూల్చుము. నీ రూపము భయంకరము. నీకు ఉత్సాహము, బలము పెంపొందించు సోమము మేము అందిస్తున్నాము. శత్రువు ముందునకు అత్తాహసముగ వెళ్లుము. శత్రు మధ్యమునకు చేరుము. శత్రువును నరికివేయుము.

6. ప్రభు ఇంద్రా ! అన్నమును విస్తరింప చేయుము. శత్రువు మీద నీ బలమును, ధనుస్సును వ్యాపింప చేయుము. మాకు అనుకూలించుము - సాగుము. శత్రువు చేత పరాజితుడవు కాకుము. స్వంత బలమున దేహమును పెంచుము.

7. ధనిక ఇంద్రా! ఈ యజ్ఞ సామాగ్రిని నీకు అర్పించుచున్నాము. కోపపడక దానిని స్వీకరించుము. ఇదిగో ఇది సోమము. ఇది భాగ్యము. ఇవన్నియు నిన్ను చేరును. తినుము. త్రాగుము.

8. ఇంద్రా! యజ్ఞ సామగ్రి సొంతము నిన్ను చేరును. వండినవి ఉన్నవి! సోమము ఉన్నది రెండింటిని సేవింపుము. అన్నము చేతపట్టి నిన్ను భోజనమునకు పిలుచుచున్నాము. యజమానుల అభిష్టములు తీర్చుము.

9. ఇంద్రాగ్నులకు సురచిత స్తుతులు అర్పించుచున్నారు. నదిలోనికి నావను చేర్చినట్లు నేను స్తుతులను అర్చనకు చేర్చుచున్నాడు.

ఇంద్రాగ్నులకు పురోహితలవలె - దేవతలు పరిచర్యలు చేయుచున్నారు. వారు మేము శత్రు నాశము చేయుటకు మాకు ధనము ప్రసాదింతురుగాత.

### నూట పదిహేడవ సూక్తము

ఋషి - ఆంగిరసభిక్షు దేవత - అన్న ధనదానము ఛందస్సు - జగతి - త్రిష్టుప్

1. దేవతలు ఆకలిని సృష్టించినారు. అది ప్రాణ నాశకము. అన్నము తిన్నంత మాత్రమున ప్రాణమునకు మృత్యు విముక్తి కలుగదు. దానము ప్రాణమును రక్షించును. అయినను దాత ధనమునకు లోటురాదు. ఆదాతను ఎవడును సుఖపెట్ట జాలడు.

2. ఒకడు అన్నార్తుడు అగును. ఆకలితో భిక్ష అడుగుటకు వచ్చును. యాచించును. అప్పుడు అన్నవంతుడు కఠిన హృదయుడవును. ఆకలిగొన్న వానిముందే అన్నము తినును. అతనికి సుఖములు వెతికినను దొరకవు.

3. అన్నము కోరి ఒక దుర్భలుడు అన్నము అడిగినపుడు అన్నదానము చేయువాడు దాత అగుచున్నాడు. అతనికి సంపూర్ణ యజ్ఞఫలము లభించుచున్నది. అతనికి శత్రువులందే మిత్రులు కలుగుచున్నారు.

4. తన సఖుడు వస్తాడు. మిత్రుడు అయ్యువాడు అన్నదానము చేయడు. అట్టివాడు మిత్రుడు అనదగిన వాడు కాడు. అతనిని విడిచిపోవుట ఉత్తమము. అట్టివాని కొంప కాదు. ఆ వచ్చినవాడు మరొక ధనిక దాతను చేరుట మంచిది.

5. యాచకునకు ధనదానము చేయుట తప్పనిసరి. దాత మార్గములు విశాలములు అగును. రథచక్రము ఒకపరి పైకి, ఒకపరి క్రిందకు తిరుగును. అట్లే ధనము ఒకపుడు ఒకని వద్ద మరొకపుడు ఇంకొకని వద్ద ఉండును. దానికి స్థిరత్వము లేదు.

6. ఎవడు ఉదారుడుకాడో వాని బోజనము వృథ యగుచున్నది. అతని భోజనము అతనికి మృత్యువు అగుచున్నది. దేవతలకు అర్చించకు, మిత్రునకు ఇవ్వక తానీ మాత్రము తినువాడు పాపమునే తింటున్నాడు.

7. వ్యవసాయమున నాగలి అన్నము అందించుచున్నాది. హలము తన దారిన వస్తుంది - పోతుంది- అన్నము కలిగిస్తుంది. విద్వాంసుడు మూర్ఖుని కన్న శ్రేషుడు. దాత అదాత పైవాడు అగుచున్నాడు.

8. ఒక అంశపు సంపదవాడు రెండు అంశముల సంపద వానిని - రెండు అంశముల వాడు మూడంశముల సంపదవానిని - మూడంశముల వాడు నాలుగు అంశముల సంపద వానిని యాచించును. ఇది నిచ్చెన పద్ధతి. అల్ప ధనము వాడు అధిక ధనము వానిని కీర్తించును.

9. మన రెండు చేతులు ఒక తీరుని, కాని రెండు సమాన బలము కలవి కావు. ఒకే తల్లికి పుట్టిన రెండు గోవులు సమానముగ పాలు ఇవ్వవు. కవలలు శక్తియుక్తులు భిన్నముగా ఉండును. ఒకే వంశపు వారయినను ఇద్దరు వ్యక్తులు సమాన దాతలు కాలేరు. ఆకలిగొన్న వాని ముందు విస్తరేసి అన్నము పెట్టండి. అతడు తినుటను చూస్తుండండి. ఆకలి తీరి అతడు త్రేన్చినప్పటి మీ ఆనందానికి వెలకకట్టజాలరు. ఏదైనను ఇచ్చుటలో ఉన్న ఆనందము పుచ్చుకొనుటలో ఉండదు.

## నూట పద్దెనిమిదవ సూక్తము

ఋషి - అహమీయగోత్ర - ఉరుక్షయుడు. దేవత - రక్షోహాఅగ్ని ఛందస్సు - గాయత్రి

1. పవిత్ర వ్రతవంత అగ్నీ! మానవుల మధ్య గల నీ స్థానము నందు నీవు ప్రదీప్తుడవు అగుము. శత్రువును వధించుము.

2. నీ కొరకు స్రువము ఎత్తబడినది.ఉత్తమ ఆహుతి ఇవ్వబడినది. నీకు ఉత్తమ ఘృతము నందు రుచి కలుగును గాత.

3. అగ్నిని ఆహ్వానించినాము. అతడు వాక్య స్తుత్యుడు. ప్రదీప్తుడు అగువాడు. అందరు దేవతల కన్న మున్నుస్రువముతో అగ్నిని ఘృత యుక్తుని చేయబడును.

4. అగ్నికి ఆహుతి ఇవ్వబడినది. అతని దేహము ఘృతమయము అయినది. అతడు దీప్తిమంతుడు, సమృద్ధ ప్రకాశకుడు అయినాడు. అతడు ఘృతాక్తుడు అయినాడు.

5. అగ్నీ ! నీవు దేవతలకు హవిని అందించువాడవు. స్తుతించినంత ప్రజ్వలితుడవు అగువాడవు. మానవులు నిన్ను ఆహ్వానించుచున్నారు.

6. మర్త్య మానవులారా! అగ్ని అమరుడు, దుర్ధర్షుడు, గృహస్వామి. అతనిని ఘృతముతో అర్చించండి.

7. అగ్నీ! నీవు ప్రచండ తేజస్వివి అగుము, రాక్షసులను దహించుము. రక్షకుడవగుము. దీప్తిని దాల్చుము.

8. అగ్నీ! నీ స్వభావ సిద్ధ తేజమున రాక్షసినులను దహించుము. స్వస్థానము లందు నిలుపుము. ప్రదీప్తుడవగుము.

9. అగ్నీ! మానవులందు నీవు సర్వశ్రేష్ఠ యజ్ఞకర్తవు, నీ నివాస స్థానము అద్భుతము. నీవు హవ్యవాహనుడవు.

## నూట పందొమ్మిదవ సూక్తము

ఋషి లవరూప ఇంద్రుడు దేవత = అవరూప ఇంద్రుడు - ఛందస్సు - గాయత్రి

ఇంద్రుడు లవరూపము దాల్చినాడు. సోమపానము చేయుచు ఋషులకు దర్శనము ఇచ్చినాడు. ఇంద్రుడు తనను గురించి చెప్పుకొనుచున్నాడు.

1. నేను గోవులను, ఆశ్వాదులను దానము చేయు సంకల్పము గలవాడను. నేను అనేక మారులు సోమము సేవించినాను. "కువిత్సోమస్యాపామితి.'

2. వాయువు వృక్షమును వడకిస్తుంది. పైకి లేపుతుంది. అట్లే సోమరసము నన్ను పైకి లేపినది. 'కువిత్సోమస్యాపామితి.'

3. వడి గల గుర్రము రథమును పైకి లేపి ఉంచును. అట్లే నేను సోమపానము చేసినాను. సోమము నన్ను పైకి లేపి ఉంచినది. 'కువిత్సోమస్యాపామితి.'

4. గోవు 'అంబా' అని దూడ వైపు పరుగు తీస్తుంది. అట్లే స్తుతులు నా వైపు పరుగులు పెట్టును. 'కువిత్సోమస్యాపామితి.'

5.త్వష్ట రథమునకు ముఖ్యమగు సారథి స్థానం నిర్మిస్తాడు. అట్లే నేను స్తోతల మనమున స్తుతిని ఉదయింప జేయుదును. 'కువిత్సోమస్యాపామితి.'

6. పంచ జనులు నా దృష్టికి దూరము కాజాలరు. 'కువిత్సోమస్యాపామితి.'

7. ద్యావా పృథ్వులు రెండును నా ఒక్క పార్శ్వమునకు సమానములు కాకున్నవి, కువిత్సోమస్తాపామితి'.

8. నా మహిమ స్వర్గమును, విశాల, పృథ్విని లంఘిస్తుంది. 'కువిత్సోమస్యాపామితి.'

9. నా శక్తి ఎంతటిదనిన, తలచుకొనిన, ఈ ధరిత్రిని లేపి ఒకచోటు నుంచి మరొక చోటునకు మర్చగలను. 'కువిత్సోమస్యాపామితి.'

10. నేను ఈ పృథ్విని దహించగలను. ఏ చోటునైనను ధ్వంసము చేయగలను. 'కువిత్సోమస్యాపామితి'.

11. నా యొక్క ఒక పార్శ్వము ఆకాశమందున్నది. మరొక భాగము పృథ్వి మీద ఉన్నది. 'కువిత్సోమస్యాపామితి'.

12. నేను మహిమను మించిన మహిమాన్వితుడను. 'కువిత్సోమస్యాపామితి.'

13. నేను స్తుతించబడుచున్నాను. నేను దేవతలకు హవ్యము చేరవేయుదును. స్వయమున హవ్యము గ్రహించి సాగిపోతాను. 'కువిత్సోమస్యాపామితి.'

## నూట ఇరువదవ సూక్తము

ఋషి - అథర్వణపుత్ర బృహద్దివుడు, దేవత - ఇంద్రుడు , ఛందస్సు త్రిష్టుప్

1. ఎవని నుండి జ్యోతిర్మయ సూర్యుడు ఆవిర్భవించినాడో అతడు సర్వశ్రేష్ఠుడు. అతనికి ముందు ఏదీయు లేకుండెను. అతడు జన్మించగనే శత్రు వినాశము చేసినాడు. దేవత లందరు అతనిని అభినందింతురు.

2. ఇంద్రుడు అత్యంత తేజోవంతుడు. విశిష్ట బలశాలి. అతడు దస్యుల గుండెలందు బుగులు పుట్టించును. ఇంద్రా! నీవు సోమము సేవింతువు. దాని ఆనందమున సకల ప్రాణులకు సుఖములు ప్రసాదింతువు. వారిని సంస్కరింతువు. అపుడు వారు నిన్ను స్తుతింతురు.

3. యజమాని దేవతలను సంతృప్తులను చేయును. తనికి వివాహము జరిగినపుడు, సంతానము కలిగినపుడు ఇంద్రునకు సంబంధించిన యుజ్ఞ కార్యములు పూర్తి చేయును. ఇంద్రా ! ఏది సుస్వాదు అగుచున్నదో - అందు అధిక సుస్వాద పదార్థమును చేర్చుము. ఈ అద్భుత మధువునందు మరింత అద్భుత మధువును చేర్చుము.

4. ఇంద్రా! నీవు సోమపానము చేయుదువు. మత్తుడవు అగుదువు. ధనమును జయింతువు. అపుడు జనులు సహితము సోమపానము చేయదురు. ఉన్మత్తులు అగుదురు. అజేయ ఇంద్రా ! స్థిర తేజమును దర్శింప చేయుము. దుస్సాహస రాక్షసుల నిన్ను పరాజితుని చేయకుందురుగాత.

5. ఇంద్రదేవా ! నీవు సాయపడుము. మేము యుద్ధభూమికేగుము. శత్రుంజయులము అగుదుము. స్తుతులతో నీ అస్త్ర - శస్త్రములను ఉత్సాహ పరుస్తాము. మంత్రములతో నీ తేజస్సును తీక్షము చేయుదుము.

6. ఇంద్రుడు స్తుత్యుడు, బహురూపి, విలక్షణ దీప్తియుక్తుడు. అనుపమ ప్రభువు. ఎంతో ఆత్మీయుడు. అట్టివానిని స్తుతించుచున్నాను. ఇంద్రుడు స్వశక్తిచే వృత్రుని, నముచి, కవయ మున్నగు ఏడుగురు దానవులను ధ్వంసము చేసినాడు. అనేక మంది అసురులను హతమార్చినాడు.

7. ఇంద్రా! నీవు ఏ ఇంట హవ్యము అందుకొని తృప్తి చెందుచున్నావో, 'ఆ ఇంట దివ్య పార్థివ' దానములను చేర్చుచున్నావు. ఎపుడు సమస్త భూత స్రష్టులను ద్యావాపృథ్వులు చంచలములు అగుచున్నవో అపుడు నీవు దానికి స్థిరత్వము కలిగించుచున్నావు. ఆ సమయమున నీవు బహుకార్య నిర్వాహకుడవు కావలసి ఉండును.

8. ఋషి శ్రేష్ఠుడును, స్వర్గాభిలాషియగు 'బృహద్దివుడు', ఇంద్రునకు తన స్తుతులు వినిపించినాడు. భూమి మీది నిర్మల నదుల జలము ప్రవహించుచుండునుగాత.

9. అతర్వపుత్రుడు, బుద్ధిశాలి 'బృహద్దివుడు', ఇంద్రునకు తన స్తుతులు వినిపించినాడు. భూమి మీది నిర్మల నదుల జలము ప్రవహించుచుండునుగాత.

అన్నము జనులకు సుబుద్ధి కలిగించునుగాత.

బృహద్దివుడు లోక కళ్యాణము కోరినాడు. తన కొరకు ఏదియు ఆశించలేదు.

## నూట ఇరువది ఒకటవ సూక్తము

ఋషి - ప్రజాపతి పుత్ర హిరణ్యగర్భుడు - దేవత - ప్రజాపతి ఛందస్సు - త్రిష్టుప్

1. తొలుత హిరణ్యగర్భుడు మాత్రము ఉండెను. తదుపరి ప్రాణులు అవతరించినవి. వానికి అతడు ఒక్కడే స్వామి అయినాడు. అతడు ద్యావాపృథుల నిలిపినాడు. 'కస్మైదేవాయ హవిషా విధేయ', అట్టి ఏ దేవతకు హవిస్సు అర్పింతుము?

2. ఎవడు ఆత్మను ఇచ్చినాడు. బలమును ఇచ్చినాడు. ఎవని ఆదేశమును సమస్త దేవతలు పాటింతురు. ఎవని ఛాయ

అమృతమో, ఎవని వశమున మృత్యువు మసలునో అట్టి ;కస్మైదేవాయ హవిషా విధేమ'.

3. ఎవడు తన మహిమ వలన ప్రాణులకు. అనిమిషులకు అద్వితీయ ప్రభువో - ఎవడు ద్విపద, చతుష్పాదులకు స్వామియో అట్టి 'కస్మైదేవాయ హవిషా విధేమ.'

4. ఎవని మహిమ వలన హిమచ్ఛన్న నగములు ఏర్పడినవో - ఎవని సృష్టి సాగర సమేత ధరిత్రి అగుచున్నదో ఎవని భుజములు దిశలు అగుచున్నవో అట్టి 'కస్మైదేవాయ హవిషా విధేమ',

5. ఎవడు ఉన్నత ఆకాశమును, విశాల పృథ్విని తమ తమ స్థానములందు స్థిరపరచినాడో - ఎవడు స్వర్గమును ఆదిత్యుని నిలిపిఉంచినాడో - ఎవడు అంతరిక్షముణ జలము ఏర్పరచినాడో అట్టి 'కస్మైదేవాయ హవిషా విధేమ',

6. ఎవని వలన ధ్యావాపృథ్వులు శబ్దాయమానములై, స్తంభితములై, ఉల్లసితములు అయినవో ఎవనిని దీప్తిశాలి ద్యావా పృథ్వులు మహిమాన్వితునిగ భావించినవో - ఎవని ఆదేశమున సూర్యుడు ఉదయించి ప్రకాశించునో అట్టి 'కస్మైదేవాయ హవిషా విధేమ.'

7. భువనములను 'జలము ఆచ్ఛాదించి ఉండెను. జలము గర్భము దాల్చి అగ్ని, ఆకాశాదు లను సృష్టించెను.' అపుడు దేవతలకు ఒక్కడే ప్రాణాత్మకుడైనట్టి 'కస్మైదేవాయ హవిషా విధేమ'.

8. జలము స్వబలమున అగ్నిని సృష్టించినపుడు ఎవడు అట్టి సమస్త జలముల నలు దిశలను వీక్షించినాడో, ఎవడు సమస్త దేవతలకు ఒక్కడే ప్రాణాత్మకుడు అగుచున్నాడో అట్టి 'కస్మైదేవాయ హవిషా విధేయ.'

9. ఎవడు పృథివికి 'ఆ'కాశమునకు జన్మదాతయో -ఎవని శక్తి సత్యమగునో - ఎవడు ఆనందవర్ధక విశాలజలమును కలిగించినాడో - ఎవడు మమ్ము బాధించుచున్నాడో అట్టి 'కస్మైదేవాయ హవిషా విధేమ.'

10. ప్రజాపతి ! ఈ సమస్త ఉత్పన్నములను నీవు వినా అన్యుడు అధీనమున ఉంచుకొన జాలడు. ఏది కోరి మేము నీ హవనము చేయుదుమో అది మాకు లభించునుగాత. మేము ధనపతులము అగుదుము గాక.

## నూట ఇరువది రెండవ సూక్తము

ఋషి - వసిష్ఠపుత్ర చిత్ర మహనుడు దేవత -
అగ్ని ఛందస్సు 1,5 త్రిష్టుప్ 6,8, జగతి

1. అగ్ని తేజము సూర్యసమము - విచిత్రము. అతడు రమణీయ, సుఖకర, ప్రేమపాత్ర, అతిథి వంటివాడు. అట్టి అగ్నిని మేము స్తుతిస్తున్నాము. అగ్ని దుగ్ధములిచ్చును. భువనము లను పోషించును. బాధలు దూరము చేయును.

అతడు గోవులను, బలమును, ప్రసాదించును. అగ్ని హోతయు, గృహపతియు అగుచున్నాడు.

2. అగ్నీ! నీవు సంతృప్తుడవు ఆగుము. నా స్తుతులందు ఆసక్తుడవు అగుము. నీవు కుశల కార్యశాలివి. తెలియవలసినది అంతయు తెలిసినవాడవు. ఘృతాహుతి అందుకొనుము. స్తోతలను సామగానము చేయమనుము. నీ కార్యములు గాంచియే దేవతలు తమ తమ పనులకు ఉపక్రమింతురు.

3. అగ్నీ! నీవు అమరుడవు. సర్వత్ర గామివి. ఉత్తమ కార్యకర్తయగు దాతకు దానము చేయుము. పూజలు గ్రహించుము. సమిధలచే ఎవడు నిన్ను వర్ధిల్లచేయునో, అట్టి వానికి ఉత్తమ సంపద, సంతానము ప్రసాదించుము.

4. అగ్ని సప్తాశ్వముల స్వామి. యజమాని యజ్ఞసామగ్రి సహితా, అగ్నిని స్తుతించును. అగ్ని యజ్ఞకేతనము - విశిష్ఠ పురోహితుడు. అగ్ని ఘృతాహుతులు లందుకొనును. అభీష్టములు ఆలకించుము. నెరవేర్చుము. అగ్ని దాతలకు ఉత్తమ బలము ప్రసాదించును.

5. అగ్నీ! నీవు సర్వశ్రేష్ఠుడవు. దూతలందు అగ్రగణ్యుడవు. అమరత్వము కోరి నిన్ను ఆహ్వానింతురు. నీవు ఆనందప్రదాతవు. దాతల గృహములందు మరుత్తులు నిన్ను అలంకరించుచున్నారు. భార్గవులు నిన్ను స్తుతిస్తారు. నీ ఉజ్వలత వర్ధిల్ల చేస్తారు.

6. అగ్నీ! నీ కార్యములు అద్భుతములు. యజమాని యజ్ఞానుష్ఠానమున నిమగ్నుడు అగును. అతనికి యజ్ఞఫలముగ యజ్ఞరూపిణియు, దుగ్ధదాయినియు, విశ్వపాలికయునగు గోమము ప్రసాదించుము. నీవు ఘృతాహుతులో అందుకుంటావు. ముల్లోకములను ప్రకాశ వంతము చేయుదువు. నీవు యజ్ఞ గృహమున సర్వత్ర వర్తింతువు. నీవు సర్వత్రగామివి. సుకృతి ఆవరణము నీలో దర్శనము ఇచ్చును.

7. ఉష ఉదయిస్తుంది. యజమానులు నిన్ను దూతగా భావిస్తారు. యజ్ఞము చేయుదురు. అగ్నీ! దేవతలు సహితము నీకు ఘృతము అర్పింతురు. ప్రదీప్తుని చేయుదురు. వర్ధిల్లచేతురు.

8. అగ్నీ! వసిష్ఠ పుత్రులు యజ్ఞమున అనుష్ఠానము ప్రారంభించి, అన్న యుక్తునిచేసి ఆహ్వానించుచున్నారు. యజమానుల ఇళ్లలో మరింత ధనము ఉంచుము. మీరు మాకు శుభములు కలిగించండి పాలించండి.

## నూట ఇరువది మూడవ సూక్తము

ఋషి - భార్గవ వేనుడు - దేవత - వేనుడు. ఛందస్సు, త్రిష్టుప్

1. వేనుడు దేవత. అతడు జ్యోతి పరివేష్ఠితుడు. ఆకాశమున జలనిర్మాత. ఆకాశ మధ్యమున సూర్య కిరణ సంతానమగు జలము ఉన్నది. వేనుడు దానిని నేల మీద కురిపించును. సూర్యునితో జలము కలియును. అపుడు

యజమానులు వేనుని బాలకుని వలె ముద్దుమాటలతో సంతృప్తుని చేయుదురు.

2. వేనుడు అంతరిక్ష జలమాలకు ప్రేరణ కలిగించును. ఆకాశమున ఉజ్వలమూర్తియైన వేనుని వెన్న కాన్పించును. జలముల ఉన్నత స్థానమగు ఆకాశమును వేనుడు దీప్తిమంతము చేయుదు. అతని పారిషదులు - అన్నింటి ఉత్పత్తి స్థానమగు - ఆకసమును ప్రతిధ్వనింప చేసినారు.

3. వేనునితో బాటు జలము నభమున నిలుచును. విద్యుత్తవత్సము. ఆకాశము మాత. తన సహవాసి వేనునితో విద్యుత్తు నర్జించ సాగినది. జలమునకు ఉత్పత్తి స్థానము ఆకాశము. అది ధ్వనించి వేనుని వర్ధిల్ల చేసినది.

4. స్తోతలు బుద్ధి కుశలురు. వారు మహిష గర్జన వంటి - వేనుని ధ్వని విన్నారు. వారు వేనుని రూపపు కల్పన చేసినారు. వారు వేనుని పూజించినారు. నది వంటి నిరంతర జలము పొందినారు. వేనుడు గంధర్వుడు. జలములకు ప్రభువు.

5. విద్యుత్తు అప్సరస. వేనుడు ఆమె ప్రేమికుడు. విద్యుత్తు వేనుని చూచినది. చిరు నవ్వినది. అతడు ఆమెను కౌగిలించుకున్నాడు. ప్రేమికుడు వేనుడు ప్రేయసి విద్యుత్తు. రతి కోర్కెను తీర్చినాడు, బంగారు. రంగు మబ్బులందు శయనించినాడు.

6. వేనుడా! నీవు స్వర్గమున ఎగురు పక్షి వంటివాడవు. నీ రెండు రెక్కలు బంగారు మయములు. లోకమును శాసించు వరుణునకు నీవు దూతవు. నీవు లోకములను పోషించు పక్షి సముడవు. అందరు. నిన్ను దర్శింతురు. మనసున నిలుపుకొందురు.

7. అతడు గంధర్వుడు, స్వర్గపు ఉన్నత ప్రదేశమున ఉన్నత భావములతో వసించును. అతడు నలుదిశల చిత్రవిచిత్ర అస్త్ర, శస్త్రములు ధరించి ఉండును. అతడు తన సుందర రూపమును దాచిపెట్టినాడు. అంతర్హితుడై జలవర్షము కలిగించును.

8. వేనుడు జలమూర్తి. అతనిది గద్దకన్ను. ఆకాశమున ఉండి సర్వసాక్షి అగును. అతడు శుభ్రవర్ష ప్రదీప్తుడు. అతడు మూడవ లోకమగు ఆకసమున నిలిచి ఎల్లరు కోరునట్టి జలమును సృష్టించుచున్నాడు.

## నూట ఇరువది నాలుగవ సూక్తము

ఋషి - అగ్ని దేవత - అగ్న్యాదులు ఛందస్సు - 7. జగతి - మిగిలినవి త్రిష్టుప్

1. అగ్ని ఈ యజ్ఞమునకు ఋత్విగాది పంచవ్యక్తులను నియమించు అధ్యక్షుడు. మా యజ్ఞము సవన

త్రయమగును. వాటిని సప్తహోతలు అనుష్ఠింతురు.

అగ్నీ! ఈ యజ్ఞమునకు విచ్చేయుము. మాకు దూతవు ఆగుము. నేతవు ఆగుము!

**అగ్ని అనుచున్నాడు:-**

2. దేవతలు నన్ను ప్రార్థించుచున్నారు. అందువలన నేను దీప్తిహీన, అవ్యక్త దశ నుంచి దీప్తివంత దశకు చేరుకున్నాను. నేను నలుదిశలు వీక్షించి అమరత్వము పొందినాను. యజ్ఞము నిరాటంకముగ పూర్తి అయినంత అదృశ్యుడను అవుతాను. యజ్ఞమును విడుతును. అరణి యందు ప్రవేశింతును.

3. పృథివి, ఆకాశమార్గము, ఆవలి సూర్యుని వార్షిక గమనమును, అనుసరించి, ఆ యా ఋతువు లందలి యజ్ఞానుష్ఠానము చేయుదును. బలిదేవతలు పితృరూపులు అగుచున్నారు. వారి సుఖమునకు స్తుతులు చేయుదును. యజ్ఞపు అయోగ్య, అపవిత్ర స్థానము నుండి యజ్ఞపు పవిత్ర, ఉపయుక్త స్థానములకు చేరుదును.

4. ఈ యజ్ఞమునందు నేను అనేక వత్సరములు గడిపినాను. ఇచటనే ఇంద్రుని యజించినాను. పితృరూప అరణినుండి ఆవిర్భవించినాను. నా దర్శనము కాకున్న సోమ, వరుణాదులకు పతనము కలుగును. దేశము అల్లకల్లోలమగును. అపుడు నేను అవతరింతును. రక్షింతును.

5. నేను వెడలినంత అసురులు బలహీనులు అగుదురు. వరుణరాజా! నన్ను ప్రార్థించుము. నా రాజ్యమున సత్యము నుంచి అసత్యమును విడదీయుము. దానికి అధిపతివి అగుము.

6. సోమమా ! ఇటు చూడుము - ఇది స్వర్గము - అత్యంత రమణీయము. దీని ప్రకాశము చూడుము. ఇది విశాల ఆకాశము. ఇచట నీవు వెలువడుము.

వృత్రవధ జరుగునుగాత.

సోమమా! నీవు హోమ ద్రవ్యమవు. అన్యహోమ ద్రవ్యములచే నిన్ను పూజింతుము.

7. మిత్ర దేవత క్రాంతిదర్శి. అతడు తన తేజస్సుతో ద్యులోకమును తేజోవంతము చేసినాడు. వరుణరాజు ఆకాశజలమును వర్షింపచేసినాడు. ఆ జలము నదులై లోక కళ్యాణ కారకములగుచున్నది. నదులు - వరుణపత్నులవలె - శుభ్రవరుణ కాంతిని వహించుచున్నవి.

8. జలదేవతలందరు వరుణుని సర్వశ్రేష్ఠ తేజోసంపన్నులు అగుదురు. వరుణనివలెనే వారును హవిస్సులు

అందుకుందురు. ఆనందింతురు. భార్యవద్దకు వలే వరుణుడు వారలను చేరును. ప్రజకు భయము కలిగినపుడు రాజును ఆశ్రయింతురు. జల దేవతలకు భయము కలిగినపుడు వరుణుని ఆశ్రయింతురు - వృత్రుని నుంచి ముక్తి పొందుదురు.

9. సమస్త జల దేవతల భయభీతులగునపుడు వారికి సాయపడి వారి హితముకోరు వానిని ఇంద్రుడని, సూర్యుడని అనుచున్నారు. వారు స్తుత్యులు - జలదేవతల వెంట సాగువారు అగుచున్నారు. విద్వాంసులు అతనిని ఇంద్రుని పేర స్థిరపరచినారు.

## నూట ఇరువది అయిదవ సూక్తము

ఋషి - అంభృణపుత్రివాక్కు - దేవత - సర్వగత పరమాత్మ ఛందస్సు - జగతి, త్రిష్టుప్

**ఋషిక ' వాక్కు' తాదాత్మ్యమున తననే సర్వముగ స్తుతించుచున్నది.**

1. నేను వసువులతోను, రుద్రులతోను సంచరించుచుందును. నేను ఆదిత్యులు, దేవతలు వెంట ఉందును. మిత్రావరుణులు నా యందు ఉన్నారు. నేను ఇంద్రాగ్ని అశ్వినులకు ఆధారము అగుచున్నాను.

2. సోమము శిలలచే పిండబడి సిద్ధమగును. దానిని నేను అనుభవించుచున్నాను. నేను త్వష్ట, పూష భగుని ధరించుచున్నాను. యజమాని యజ్ఞ సామాగ్రి సమకూర్చును. సోమరసము సమర్పించును. దేవతలను సంతుష్టులను చేయును. ఆ యజమానికి నేనే ధనమును ఇచ్చుచున్నాను.

3. నేను రాజ్యమునకు అధీశ్వరిని. ధనప్రదాత్రిని. నేనే జ్ఞానవతిని. నేనే యజ్ఞ పదార్థము లందు శ్రేష్ఠమను. దేవతలు నన్ను నానా స్థావరములందు నియమించినారు. నా ఆశ్రయ స్థానము విశాలము. నేను సమస్త ప్రాణులందు ఆవేశించి ఉన్నాను.

4. ఎవడు ప్రాణము కలిగి వినుచున్నాడో - చూచుచున్నాడో - తినుచున్నాడో వాటిని నా సాయముననే చేయుచున్నాడు. నన్ను నమ్మనివాడు క్షీణించుచున్నాడు.

విజ్ఞులారా! వినండి - నేను చెప్పినదే శ్రేయస్కరము.

5. దేవతలు, మానవులు ఎవని శరణు వేడుచున్నారో అతనికి నేనే ఉపదేశించుచున్నాను. నేను అనుకున్న వానిని బలశాలిని, స్తోతను, ఋషిని, విద్వాంసుని చేయుచున్నాను.

6. ఇంద్రుడు స్తోత్ర ద్రోహి శత్రువును వధించ ఉద్యమించును. అప్పుడు నేనే అతని ధనస్సును విస్తరింప చేస్తాను. మానవుని కొరకు నేనే సమరం సాగిస్తాను. నేను ద్యావా పృథ్వులందు వ్యాపించి ఉన్నాను.

7. నేను పితను. నేనే ఆకాశమును సృష్టించినాను. ఆకాశము శీర్షము అగుచున్నది. సాగర జలము నా స్థానము అగుచున్నది. అచటి నుండియే నేను సమస్త లోకములను విస్తారం చేస్తాను. నా దేహము సమున్నతము. నేను ద్యులోకమును తాకగలను.

8. నేను భువనములను నిర్మిస్తాను. వాయువు వలె వ్యాపిస్తాను. నా మహిమ మహత్తమము. నేను ద్యావా పృథ్వులను అతిక్రమించినాను.

ఇది మహిళ దర్శించిన సూక్తము. ఆమె ఆత్మ విశ్వాసము అనంతము. తానే ఈశ్వరిని అంటున్నది. ఇది అహం బ్రహ్మాస్మి అగుచున్నది. విశ్వమును తనలో చూస్తున్నది. తానే విశ్వము అంటున్నది. ఇది పరమమగు అద్వైత దశ!

## నూట ఇరువది ఆరవ సూక్తము

ఋషి - శిలూషపుత్ర కుల్మలబర్హి - దేవత - విశ్వేదేవతలు

ఛందస్సు - బృహతి - 8 త్రిష్టుప్

1. ఆర్యమ! మిత్రావరుణులు ఎవనిని శత్రువు నుండి రక్షింతురో అట్టి వానిని ఎటువంటి అశుభములుగాని పాపములుగాని ఆక్రమించజాలవు.

2. మిత్ర, వరుణ, ఆర్యమలారా! మానవులను పాపముల నుండి. శత్రువుల నుండి రక్షించవలసినదని ప్రార్థించుచున్నాము.

3. మిత్ర, వరుణ, ఆర్యములు నిశ్చయముగ మమ్ము రక్షించగలరు.

వరుణాది దేవతలారా! మమ్ము దాటించండి. శత్రువు నుండి రక్షించండి.

4. వరుణ, మిత్ర, ఆర్యములారా! మీరు లోక రక్షకులు. నేతృత్వమున నేర్పరులు. మీ వలన మేము రక్షణ పొంది, మీ వద్ద చక్కగ సుఖింతుము గాక.

5. ఆదిత్య, వరుణ, మిత్ర ఆర్యములు మమ్ము శత్రువుల బారినుండి రక్షించెదరు గాక. శత్రు విముక్తులమగు మేము కళ్యాణ ప్రాప్తి కొరకు ఉగ్రమూర్తి రుద్రుని, మరుద్గణ ములను, ఇంద్రుని, అగ్నిని, ఆహ్వానించుచున్నాము.

6. వరుణ, మిత్ర ఆర్యములు మార్గదర్శిత్వమున నిపుణులు. వారు పాపములను, పార ద్రోలుదురు. వీరు నరులకు ప్రభువులు. వారు మమ్ము సమస్త పాపముల నుండి, శత్రువుల నుంచి రక్షించెదరు గాత.

7. వరుణ, మిత్ర, ఆర్యములు మమ్ము రక్షించి సుఖములు కలిగింతురుగాక. ఆదిత్యులు మేము కోరునట్టి సుఖములను మరింతగా ప్రసాదింతురుగాక. వారు మమ్ము శత్రుహస్తము నుండి రక్షింతురుగాత.

8. శుభ్ర వర్ణగోవు పాదమును కట్టిపెట్టినపుడు యజ్ఞ భాగధేయులగు వసువులు దానిని బంధ విముక్తను చేసినారు. అట్లే మమ్ము పాపబంధ విముక్తులను చేయండి.

అగ్నీ! మాకు పరమాయువును ప్రసాదించుమ.

## నూట ఇరువది ఏడవ సూక్తము

ఋషి - భరద్వాజ పుత్రి రాత్రి - దేవత - రాత్రి ఛందస్సు - గాయత్రి

1. రాత్రి వస్తున్నది. సర్వత్ర వ్యాపించినది. ఆమె నక్షత్రములతో శోభలు సంతరించు కున్నది.

2. రాత్రిదేవి విశాల. ఆమె ఉచ్చ, నీచములను కప్పివేసినది. కాంతి వస్తుంది. తిమిరమును బాధిస్తుంది.

3. రాత్రి వచ్చింది. ఉషను సోదరివలె కౌగిలించుకుంది. ఉషస్సు తిమిరాన్ని దూరము చేసినది.

4. పక్షి కొమ్మ మీదికి చేరుతుంది. ఆమె వచ్చినంత మనం నిద్రింతుము. అట్టి రాత్రి దేవి మాకు శుభములు కలిగించునుగాత.

5. గ్రామము లన్నియు, నిస్తబ్ధములు. పాదచారులు, పక్షులు, వేగవంత శ్యేనము నిస్తబ్ధములై నిద్రించుచున్నవి.

6. రాత్రీ ! తోడేళ్లను, దూరము చేయుము. చోరులను తొలగించుమ. మాకు విశేష శుభం కరివి అగును.

7. నలుపు చీకటి కనపడుతున్నది. నన్ను సహితము కమ్మినది. పణములను వలె ఉష చీకట్లను తొలగించునుగాత.

8. ఆకాశ కన్య రాత్రీ! వెళ్లిపోవుచున్నావా? గోవునకు వెల ఈ సూక్తమును నీకు అర్పించు చున్నాను. స్వీకరించుమ.

## నూట ఇరువది ఎనిమిదవ సూక్తము

ఋషి - ఆంగిరస విహవ్యసుడు - దేవతలు - విశ్వేదేవతలు

ఛందస్సు - త్రిష్టుప్ - 9 జగతి

1. అగ్నీ! యుద్ధ సమయమున నా యందు తేజస్సు ఉదయించునుగాత. నిన్ను ప్రజ్వలితుని చేసి మేము మా దేహములను పుష్టివంతము చేసికొందుము. నా ముందు నలుదిశలు అవనతములు అగునుగాక. నిన్ను స్వామిగా చేసికొని మేము శత్రువులను జయింతుముగాత.

2. ఇంద్రాది దేవతలు, మరుదణములు, విష్ణువు, అగ్నియు యుద్ధమున మా పక్షమున నిలుతురుగాక. ఆకాశమంతట విశాల భువనములు మా పక్షము వహించునుగాత. నేను కోరినంత వాయువు అనుకూలమున వీచి నన్ను పావనము చేయును గావుత.

3. నా యజ్ఞము నందు దేవతలు సంతుష్టులు అగుదురుగాక. నాకు ధనము ప్రసాదింతురు గాత. వారి ఆశీర్వాదములు లభించును గావుత. నేను దేవతలను ఆహ్వానింతునుగాత. ప్రాచీనకాలమున దేవతలకు హవిస్సులు అర్పించినవారు అనుకూలురు అగుదురుగాక, నా దేహమునకు ఉపద్రవములు కలుగకుండ నాకు సంతానము కలుగును గావుత.

4. నా యజ్ఞ ద్రవ్యములు నా కొరకును, దేవతల కొరకును అర్పితములు అగునుగాక. నా మనోరథము సిద్ధించునుగాత.నేను పాపలిప్తుని కాకుందునుగాక. సమస్త దేవతలు మమ్ము ఆ రీతిగ దీవింతురు గాక.

5. ఆరుగురు దేవేరులు, ద్యౌ, పృథివి, పగలు, రాత్రి, జలము ,ఓషధులు మాకు లక్ష్మీవృద్ధి కలిగింతురుగాత.

దేవతలారా! ఇచట శౌర్య ప్రదర్శన చేయండి మాకు. మా సంతతికి అమంగళము కలుగ కుండునుగాత.

సోమరాజా! శత్రువు చేత మేము నష్టపడరాదు.

6. అగ్నీ! శత్రువు రథమును నిష్ఫలము చేయుము. దుర్ధర్షుడవగుము. మమ్ము సకల! రీతుల రక్షింపుము. శత్రువుల ఆశలు అడియాసలై మరిలిపోవుదురుగాక. శత్రువు తెలివి గలవాడయిన అతని తెలివి నష్టపడునుగాత.

8. ఇంద్రుడు విస్తృత తేజస్సునకు అధికారి. మహానుడు. సర్వప్రథమ ఆహ్వాత. వివిధ స్థానములందు ఉండువాడు. అతడు ఈ యజ్ఞము నందు మమ్ము సుఖవంతులను చేయునుగాత.

హరితవర్ణ అశ్వస్వామి ఇంద్రా! మాకు సుఖములను, సంతానమును కలిగించుము. మాకు అనిష్టము, ప్రతికూలము జరుగకుండునుగాత.

9. మా శత్రువులు దూరము అగుదురుగాక. ఇంద్రాగ్నుల సాయమున శత్రువులను జయింతుముగాత. వసుగణ, రుద్రగణ, ఆదిత్య గణములు నన్ను సర్వశ్రేష్ఠ మేధావిని, అప్రతిహతుని, అధిరాజును చేయుదురు గావుత.

## నూట ఇరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - ప్రజాపతి - దేవత- పరమాత్మ ఛందస్సు -త్రిష్టుప్

1. అప్పుడు - ప్రళయమప్పుడు అసత్తు లేదు. సత్తు అనునది లేదు. భూమిలేదు. ఆకాశం లేదు. ఆకాశమందలి సప్తలోకములు లేవు. బ్రహ్మాండము ఎచట? దేని స్థానము ఏది? దుర్గమ, గభీర జలము ఉండెనా?

2. అపుడు మృత్యువు లేదు. అమరత్వము లేదు. రాత్రింబవళ్ల భేదము లేదు. వాయు శూన్య ఆత్మావలంబన శ్వాస ప్రశ్వాసయుక్త ఒకే బ్రహ్మము ఉండెను. అతడు వినా అన్యము లేదు.

3. సృష్టికి పూర్వము అంధకారము అంధకారమే అలముకొని ఉండెను. అంతయు అజాతము సర్వము జలమయము. అపుడు తపః ప్రభావమున ఏకమ్ ఒక్కటి కలిగినది.

4. తొలుత మనసున కోరిక పుట్టినది. అందునుంచి బీజము అవతరించినది. విద్వాంసులు మేధస్సును తరచి అదృశ్యము నుంచి దృశ్య పదార్థపు ఉత్పత్తి స్థానమును నిరూపించినారు.

5. బీజ రూపమున మానవుడు పుట్టినాడు. మహిమలు ఆవిర్భవించినవి. వారి కార్య కలాపముల ఉభయ పార్శ్వములు విస్తరిల్లినవి. అన్నము దిగువన భోక్తపైన నిలిచినారు.

6. ప్రకృతి తత్వమును ఎవడు ఎరుంగును? దానిని ఎవడు వర్ణించగలడు? ఏమి కారణమున సృష్టి జరిగినది? దేవతలు సృష్టి నిమిత్తమయినా, తరువాతనే అవతరించినారు. సృష్టి ఎచట మొదలైనది ఎవడు ఎరుగగలడు?

7. విభిన్నమగు ఈ సృష్టి ఎచటి నుంచి జరిగినది? ఏమి కారణమున సృష్టి జరిగినది? ఈ సృష్టి చేసిన దెవడు? చేయనిదెవడు? వీనిని పరంధామము నందున్న వారు ఎరుంగుదురు. వారికి సహితము తెలియునో? తెలియదో?

అది అంత అనిశ్చితము. అనిశ్చితమే! నిశ్చితమెట్లగును? అనిశ్చితముగనే ఉండును. ఇది సత్యము.

## నూట ముప్పదవ సూక్తము

ఋషి - ప్రజాపతి పుత్ర యజ్ఞ - దేవత - ప్రజాపతి ఛందస్సు -త్రిష్టుప్ - 1 జగతి

1. యజ్ఞము నలువైపుల సూత్ర విస్తారము కలది. దానిని వస్త్రమువలె నేయబడును. దేవతలకు బహు హవిస్సులు సమర్పించుటచేత యజ్ఞము విస్తరిల్లుము. యజ్ఞమునకు పితరులు వచ్చినారు. వారు ఇదిపడుగు - ఇది పేక అనుచు వస్త్రమును నేయుచున్నారు.

2. వస్త్రపు పొడవును ఒకరు, వెడల్పును ఒకరు పరచుచున్నారు. ఇది స్వర్గము వరకు సాగుచున్నది. తేజః పుంజ దేవతలెల్లరు యజ్ఞ గృహమున ఆసీనులు అయినారు. ఈ కార్యమునకు సామగానము స్వరము అగుచున్నది.

3. దేవతలు ప్రజాపతి యజ్ఞము చేసినారు. అప్పుడు యజ్ఞపు సీమ ఏమై ఉండెను? పత్రిమలేవి? సంకల్పము ఎయ్యది? ఘృతము ఏది అయి ఉండెను? యజ్ఞ పరిధులు ఏవి ? ఛందమేమి? ఉక్థమేమి?

4. అగ్నిని గాయత్రి - సవితను ఉష్ణిక్కు - సోమమును అనుష్టు - బృహస్పతి వాక్యమును బృహతి ఛందస్సులు ఆశ్రయించినవి.

5. మిత్రావరుణులను విరాట్టు - ఇంద్ర, సోములను త్రిష్టుప్ అన్యదేవతలను జగతి ఛందములు ఆశ్రయించినవి. ఆ రీతిగా ఋషులు, మనుష్యులు యజ్ఞము చేసినారు.

6. ప్రాచీనకాలమున యజ్ఞము అవతరించినది. అపుడు ఋషులు, మనుష్యులు ఉక్త నియమమును అనుసరించి అనుష్ఠించినారు. ప్రాచీన కాలమున యజ్ఞానిష్ఠానము చేసిన వారిని నేను మనోనేత్రమున దర్శించుచున్నట్లు అనిపించుచున్నది.

7.సప్త దివ్యఋషులు స్తోత్రములను , ఛందములను సంకలనము చేసినారు. దానిని అనుసరించియే మరల మరల యజ్ఞానష్ఠానములు చేసినారు. ఫలితములను స్థిరపరచి నారు. సారథి గుర్రపు కళ్లెము పట్టినట్లు విద్వాంసులగు ఋషులు సంప్రదాయ ప్రకారము యజ్ఞములు చేసినారు.

**నూట ముప్పది ఒకటవ సూక్తము**

ఋషి - క్షీవతపుత్రుడు సుకీర్తి -దేవత - ఇంద్రాశ్వినులు

ఛందస్సు - త్రిష్టుప్ - 4 అనుష్టుప్

1. శత్రువిజేత ఇంద్రా! ముందు - వెనుక, ఉత్తర -దక్షిణములందున్న సమస్త శత్రువులను దూరము చేయుము.

శూర ఇంద్రా! నీ మంచి చక్కని సుఖములు అందుకుని మేము ఆనందింతుముగాక.

2. పొలము నందలి పంటను కోసినట్లు ఇంద్రా! యజ్ఞమునందు 'నమః' అనని వారి యొక్కయు, పుణ్య కార్యములు

చేయని వారి యొక్కయు భోజనములను వెంటనే తెంపి వేయుము.

3. ఒకే ఇరుసు మీద బండి నిలువ జాలదు. అతనికి యుద్ధములందు అన్నము కలుగదు. గో, అశ్వ అన్నాదులు ఆశించు వారు స్వప్రయత్న సహితముగ ఇంద్రుని సఖ్యత కొరకు ఆరాటపడుదురు.

4. అశ్వినీద్వయమా! మీరు కళ్యాణమూర్తులు. ఇంద్రుడు 'నముచి' తో యుద్ధము చేసినపుడు - మీరు ఉభయులు కలసి - సోమము సేవించి - ఇంద్ర కార్యమున అతనిని కాపాడినారు.

5. అశ్విద్వాయమా! తల్లిదండ్రులు బిడ్డలను రక్షింతురు. అట్లే మీరు సోమము సేవించి, మీ శక్తి సామర్ధ్యములతో ఇంద్రుని రక్షించినారు.

ఇంద్రా! అపుడు నీ వద్ద సరస్వతి ఉండెను.

6. ఇంద్రుడు ఉత్తమ రక్షకుడు. ధనికుడు. స్వరజ్ఞుడు. అతడు మమ్ము రక్షించి, సుఖములు ప్రసాదించునుగాత. శత్రువును తొలగించి అభయమొసంగునుగాత. మేము మహాశక్తి మంతులము అగుదుముగాక.

7. ఇంద్రుడు యజ్ఞభాగస్వామి. ఉత్తమరక్షకుడు. ధనికుడు. మేము అతని ప్రసన్నతా ప్రాప్తులము అగుదుము గాక. అతడు మా విషయమున సంతుష్టుడు అగునుగాత. ఇంద్రుడు మా దగ్గరి, దూరపు శత్రువును చూపు అందనంత దూరమునాకు తరుమునుగాత.

## నూట ముప్పది రెండవ సూక్తము

ఋషి - నృమేధపుత్ర శకపూతుడు. దేవత - అశ్వినులు - మిత్రావరుణులు
ఛందస్సు - వేరు వేరు

1. ఎవడు యజ్ఞము చేయుచున్నాడో అతనికి ఆకాశము ధనమిచ్చును. భూమి సంపదలు కలిగించుము. యజ్ఞకర్తకే అశ్వినిలు సుఖ సంపదలిచ్చి సుఖవంతుని చేయుదురు.

2. మిత్రావరుణులారా! మీరు పృథివిని పోషించుచున్నారు. ఉత్తమ సుఖముల కొరకు మేము మిమ్ము ఆరాధించుచున్నాము. యజమానుల విషయమున మీ మైత్రీభావ ప్రభావమున మేము శత్రుంజయులము అగుదుము గాత.

3. మిత్రావరుణులారా! మేము మీ కొరకు యజ్ఞ సామాగ్రి సమకూర్తుము. అప్పుడే మా వద్దకు ప్రియధనము చేరుచున్నది. యజ్ఞదాతకు అందునట్టి ధనములకు ఉపద్రవములు కలుగవు.

4. బలశాలి మిత్రా! నీవు ఆకాశము నందలి సూర్యుని కన్న భిన్నుడవు.

వరుణా! నీవు సమస్తమునకు సామ్రాట్టువు. నీ రథపతాక ఇటువైపే వచ్చుచున్నది.

హింస నాశకమగు ఈ యజ్ఞమునకు ఇసుమంత అశుభమును తాకజాలదు.

5. నేను శకపూతుడను. నీచ స్వభావ శత్రువును నష్టపరచగలను. ఏలనన మిత్రదేవుడు 'నా హితైషి' అగుచున్నాడు. మిత్రదేవత నాదేహమును - యజ్ఞ సామాగ్రిని రక్షించునుగాత.

6. మిత్రావరుణులారా! మీరు వశిష్ఠ జ్ఞానవంతులు మీ తల్లి అదితి. ద్యావాపృథ్వులను జలముచే పావనము చేయుడు. దిగువ లోకములకు ఉత్తమ సామాగ్రి అందించును. సూర్య కిరణములచే సమస్త భువనములను పవిత్రము చేయండి.

7. మిత్రావరుణులారా! మీరు స్వయంకృషితో సామ్రాట్టులు అయినారు. మీ రథము వనములందు సంచరించునది. అది అశ్వస్థానమున నిలుచునుగాక. సకల శత్రువులు ఆక్రందించుచున్నారు. మీరు నృమేధ ఋషిని విపత్తుల నుండి రక్షించినారు.

## నూట ముప్పది మూడవ సూక్తము

ఋషి - పిజివనపుత్ర సుదాసుడు - దేవత - ఇంద్రుడు, చందస్సు - వేరు వేరు

1. ఇంద్రునిసేన అతని రథము ముందు ఉన్నది. దానిని పూజించండి. శత్రువు ఎదుట నిలిచి బెదిరించినపుడు ఇంద్రుడు పారిపోవడు. వృత్రవధసేయును. ఇంద్రుడు మా స్వామి. అతడు మమ్ము గురించి ఆలోచించును గాత శత్రువు వింటి అల్లెత్రాడు తెగునుగాత. "అన్యకేషాం జ్యాకా అధిధన్వసు".

2. ఇంద్రా! దిగువ ప్రవహించు నదులకు నీవే విముక్తి కలిగించినావు. నీవే మేఘమును వర్షింపచేసినావు. నీవు అజేయుడవు. శత్రువునకు అవధ్యుడవై అవతరించినావు. నీవు విశ్వపాలకుడవు నిన్ను సర్వశ్రేష్ఠునిగ భావించి నీ దరి చేరినాము. "అన్యకేషాం జ్యాకా అధిధన్వసు".

3. అదాతయగు శత్రువు దృష్టిపథము నుండి తొలుగునుగాక. మా స్తుతులు ప్రస్థానము సాగించునుగాత.

ఇంద్రా ! మమ్ము వధించదలచిన శత్రువును హతమార్చుము. నీ దానశీలత మాకు ధనము ప్రసాదించునుగాత. "అన్యకేషాం జ్యాకా అధిధన్వసు".

4. ఇంద్రా! తోడేళ్ల వంటివారు మా చుట్టు చేరుచున్నారు. వారిని నేలరాల్చుము. నీవు శత్రుంజయుడవు. శత్రుపీడా కారకుడవు. "అన్యకేషాం జ్యాకా అధిధన్వసు".

5. మాకు నికృష్టులు, తోటివారు, అనిష్టకర్మలుచేయు శత్రువులు ఉన్నారు. ఇంద్రా! ఆకాశము భూమిని వంగదీసినట్లు వారిని వంగపెట్టుము. "అన్యకేషాం జ్యాకా అధిధన్వసు".

6. ఇంద్రా ! మేము నిన్ను 'అ'నుసరించు వారలము. నీ బాంధవ్యమునకు అనుకూలములగు కార్యములకే ఉపక్రమించుచున్నాము. మమ్ము పుణ్యమార్గమున నడిపించుము. మేము పాపములను తరింతుముగాక. "అన్యకేషాం జ్యాకా అధిధన్వసు".

7. ఇంద్రా! దేని ప్రభావమున మా మనో రథములు ఫలించునో - అట్టి విద్యను మాకు బోధించుము.

ఈ గోవు పృథివీరూప. ఆమె విశాల స్తనములు గలదై సహస్రధారలుగ దుగ్ధములు వర్షించి మమ్ము పరితుష్టులను చేయును గావుత.

### నూట ముప్పది నాలుగవ సూక్తము

ఋషి - యువనాశ్వపుత్ర మాంధాత - గోధయను బ్రహ్మవాదిని దేవత
ఇంద్రుడు ఛందస్సు - పంక్తి, మహాపంక్తి

1. ఇంద్రా! నీవు ఉషస్సువలె జగముల వెలుగులు నింపువాడవు. నీవు మహానుల కన్నా మహానుడవు మానవులకు సామ్రాట్టువు.

దేవీజానిత్ర్యీ జనీజనద్భద్రా జనిత్ర్యీ జీజనత్. దేవమాత న్నిన్ను కన్నది. నిన్ను కన్నా తల్లి భద్రయైనది.

2. మమ్ము వధించదలచిన శత్రువు ఎంతటి బలవంతుడైనను వాని బలమును నీవు త్రుంచి వేయుదువు. మాకు హాని తలపెట్టినవానిని నేలకూల్చెదవు.

"దేవీ జనిత్ర్యీ జీజనద్భాద్రా జనిత్ర్యీ జనీజనత్".

3. ఇంద్రుడు శక్తిశాలి. శత్రు సంహారకుడు - అందరికి ఆనందము పంచువాడు. అతడు తన శక్తిచే ఎంతో అన్నమును మా వైపు పంపునుగాత - సర్వప్రకారముల మమ్ము రక్షించును గాత.

"దేవీ జనిత్ర్యః జీజనద్భద్రా జనిత్ర్యః జనీజనత్".

4. శత క్రతు  ఇంద్రా! నీవు బహువిధ అన్నములకు ప్రేరణ కలిగించువాడవు. సోమ యజ్ఞకర్తయగు యజమానిని రక్షించుచున్నావు -ధనము ప్రసాదించుచున్నావు.

"దేవీ జనిత్ర్యః జీజనద్భద్రా జనిత్ర్యః జనీజనత్".

5. స్వేద సమమముగ ఇంద్రుని ఆయుధములు నలు దిశలందు పడునుగాక. దూర్వార తంతువులవలె సర్వ వ్యాపకములు అగునుగాక. మా దుర్బుద్ధి తొలగునుగాక.

"దేవీ జనిత్ర్యః జీజనద్భద్రా జనిత్ర్యః జనీజనత్".

6. ఇంద్రుడు జ్ఞాని - ధనికుడు. అతడు మహా అంకుశము వంటి శక్తి ఆయుధమును ధరించును. మేక తన మునిగాళ్లతో చెట్టుకొమ్మను వంచును. అట్లే ఇంద్రుడు తన శక్తి ఆయుధముచే శత్రువును గుంజి హతమార్చును.

"దేవీ జనిత్ర్యః జీజనద్భద్రా జనిత్ర్యః జనీజనత్".

7. దేవతలారా! మీ  విషయమున మేము ఎట్టి లోపము రానీయము. ఏ పని
యందును ఉదాసీనత కనబరచము. మంత్రము, శ్రుతిని అనుసరించి ఆచరింతుము. రెండు చేతులు కలిపి యజ్ఞ సామగ్రిని సేకరింతుము.

### నూట ముప్పది అయిదవ సూక్తము

ఋషి - యమగోత్ర కుమారుడు - దేవత - యముడు ఛందస్సు -అనుష్టుప్

1. ఏ సుందర పత్ర భరిత వృక్షము నందు దేవతల సహితుడై యముడు పానము చేయున్నాడో ఆ వృక్షము మీదనే నేను నా పూర్వజుల సహచరుడను కావలెనని నరపతియగు నా తండ్రి కోరిక.

2. నేను నిర్దయుడను అయినాను. నా తండ్రి వచించిన 'పూర్వజుల సాహచర్య, విషయమును మరచినాను. విరక్తుడను అయినాను. ఇప్పుడు విరక్తి విడిచినాను. అనురక్తుడను అయినాను.

### యముని మాట

3. నచికేతకుమారా ! నీవు ఒక విచిత్ర రథము కోరినావు. దానికి చక్రములు ఉండవు. దండము ఒకటే యగును. అది

సర్వత్ర సంచరించును. తెలివి లేక నీవు ఆ రథమును ఎక్కినావు.

4. 'కుమారా! బుద్ధిమంతులగు బంధువులను విడిచినావు. ఆ రథమును నడిపినావు. అది నీ తండ్రి ఉపదేశమును అనుసరించి సాగినది. ఆ ఉపదేశము దానికి నావ అయినది. ఆశ్రయము అయినది. ఆ నావ మీద ఈ రథము ఇచటి నుండి సాగిపోయినది.

5. ఈ బాలకునకు జన్మనిచ్చిన వారెవరు? ఈ రథమును ఎవరంపినారు. ఈ బాలకుడు యముని ద్వారా జీవలోకమునకు మరల ఎట్లు పంపబడినాడు? వీటన్నింటిని నేడు మనకు ఎవడు చెప్పగలడు?

6. యముని ద్వారా బాలకుని మరల జీవలోకమునకు పంపుట తొలుతనే చెప్పబడినది. ప్రథమపిత ఉపదేశము మూలాంశము విదితమైనది. తదుపరి ప్రత్యాగమన ఉపాయము వివరించబడినది.

7. ఇది యముని నివాస స్థానము. దీనిని దేవతలు నిర్మించినారని చెప్పుకొందురు. యముని ప్రసన్నుని చేయుటకు వేణుగానము చేయబడును. స్తుతులచే యముడు భూషితుడగును.

కఠ ఉపనిషత్తు నందలి నచికేతుని కథ ప్రపంచం ప్రఖ్యాతము. దానికి ఇది మూలము అగుచున్నది. ఆసక్తి గలవారు నా రచన 'అమృత ఉపనిషత్తులు' చూడగలరు.

### నూట ముప్పది ఆరవ సూక్తము

ఋషి - వాతారశన పుత్రులు , జాతి, వాతజూతి, దేవత, అగ్ని, సూర్య, వాయువులు

1. కేశియను సూర్యాగ్ని ద్యావాపృథ్వులను పోషించుచున్నాడు. కేశియే సకల భువనములను ప్రకాశింపచేసి, దర్శనీయము చేయుచున్నాడు. ఈ కేశియే జ్యోతి అనుచున్నాడు.

2. వాతరశన వంశజులగు మునులు పసుపు పచ్చిని వస్త్రములు ధరింతురు. వారు దేవత్వము పొంది, వాయువునాకు అనుగాములు అగుచున్నారు.

3. మేము సకల లౌకిక వ్యవహారములను విసర్జించినాము. వాయువును అధిరోహించి నాము. మీరు మా దేహములను మాత్రము చూడగలరు. మా ఆత్మ వాయు రూపము అగుచున్నది.

4. మునులు ఆకసమున ఎగురగలరు. సకలమును దర్శించగలరు. ఎందరు దేవతలో అందరు వారి బంధువులు అగుచున్నారు. వారు సుకృతముల కొరకే జీవింతురు.

5. వాయుగమనమునకు మునులు అశ్వరూపులు అగుచున్నారు. వారు వాయువు సహచరులు. దేవతలు మునులను ఆశించుచుందురు. వారు పూర్వ, పశ్చిమ సముద్రము లందు వసించుచుందురు.

6. కేశి దేవత అప్సరల, గంధర్వుల, హరిణముల మధ్య విహరించుచుండును. వారు తెలియగలవానిని అన్నింటిని తెలియుదురు. వారు రసోత్పాదకులు. ఆనంద ప్రదాతలగు మిత్రులు.

7. కేశి రుద్రునితో కలసి జలపానము చేయునపుడు వాయువు జలములను కదలించును. కఠిన మాధ్యమిక వాక్కును భంగపరచును.

## నూట ముప్పది యేడవ సూక్తము

ఋషి - భరద్వాజ, కశ్యప, గౌతమ, అత్రి, విశ్వామిత్రాదులు, దేవత
విశ్వేదేవతలు ఛందస్సు - అనుష్టుప్

1. దేవతలారా! నేను పతితుడను - ఉద్ధరించండి. నేను అపరాధిని - అపరాధముల నుండి తప్పించండి. నన్ను చిరంజీవిని చేయండి.

2. సముద్ర పర్యంతము - అవలకూడ వాయువు వీచును. అది రెండు విధములది. ఒకటి స్తోతలకు బలప్రదాత. మరొకటి పాపధ్వంసమై వీచును గాత.

3. వాయువా ! నీవు ఇటు వీచుము. ఓషధులు తెమ్ము. అహితకరమును ఇచట నుంచి తీసికొని పొమ్ము. నీవు లోకములకు ఔషధరూపమవు. నీవు దేవదూతగ సాగుదువు.

4. యజమానీ ! నీ కొరకు సుఖములు, బాధించని రక్షణలు తెచ్చినాను. నీకు బలము కలిగించు కార్యము చేసినాను. ఇక నీ వ్యాధులను దూరము చేయుదును.

5. ఇపుడు దేవతలు, మరుద్గణములు, చరాచరులు రక్షింతురుగాక. ఈ వ్యక్తి వ్యాధి రహితుడు అగునుగాక.

6. జలమే ఔషధము. రోగశాంతి కారకము. జలమే వైద్యము. నీకు అటువంటి జలము చికిత్స కారకము అగునుగాత.

7. రెండు చేతులకు పది అంగుళులు ఉన్నవి. మాటకు ముందు జిహ్వ సాగుతుంది. వ్యాధి నివారణకు నా రెండు చేతులతో నిన్ను తాకుచున్నాను.

## నూట ముప్పది ఎనిమిదవ సూక్తము

ఋషి - ఉరుపుత్ర అంగుడు, దేవత - ఇంద్రుడు ఛందస్సు - జగతి

1. ఇంద్రా! యజ్ఞకర్తలు నీ స్నేహము కోరినారు. యజ్ఞ సామాగ్రి కూర్చినారు. యజ్ఞము చేసినారు. బలాసురుని వధించినారు. అప్పుడు నీవు స్తుతించబడినావు. నీవు కుత్సర్షికి ఉషస్సు కలిగించినావు. జలములకు విముక్తి కలిగించినావు. వృత్రుని సర్వకర్మలను ధ్వంసము చేసినావు.

2. ఇంద్రా! నీవు జనని వంటి జలములకు విముక్తి కలిగించినావు. పర్వతములను వడకించినావు. గోవులను తోలుకొనిపోయినావు. మధురసోమము సేవించినావు. వర్షము కలిగించినావు. ధనములను పెంచినావు.

యజ్ఞోపయోగ స్తుతి వచనములు ఇంద్రుని కీర్తించినవి. ఇంద్రుని సాధన వలన సూర్యుడు దీప్తిశాలి అయినాడు.

3. ఆకసమున సూర్యుడు తన రథమును నడిపించినాడు. ఆర్యులు దస్యులు చేత పరాజితులు కాబోరని నిశ్చయించినాడు.

ఇంద్రుడు యజ్వర్షితోస్నేహము చేసినాడు. పిప్రునామక మాయావి అసురుని బల వీర్యములను నష్టపరచినాడు.

4. ఇంద్రుడు దుర్ధక్షుడు. అతడు దుర్ధర్ష శత్రుసేనను అంత మొందించినాడు. దేవ శూన్యుల సంపదను ధ్వంసము చేసినాడు. సూర్యుడు ప్రత్యేక మాసమున భూసారమును పీల్చుతాడు. అట్లే ఇంద్రుడు శత్రువుపురములందున్న ధనము పీల్చివేసినాడు.

స్తోత్రములు అందుకున్న ఇంద్రుడు ప్రదీప్త అస్త్ర శస్త్రములతో శత్రువును పడ గొట్టినాడు.

5. ఇంద్రుని సేనను ఎదిరించగలవారు లేరు. అతడు స్వరసంచారి. వజ్రమున వృత్రుని వంధించి, పతాక ఎగురవేసినాడు.

ఇంద్రుని వజ్రమునకు శత్రువు బెదరునుగాక. ఉష రథమును నడిపించినది.

6. ఇంద్రా ! సమస్త వీరకృత్యములు నీవియే యని వినుచున్నాము. వంటరిగ నీవు యజ్ఞ విఘ్నకర్తలగు అసురులను వధించినావు. ఆకాశమున చంద్రుని రాకపోకలను ఏర్పాట్లు చేసినావు. వృత్రుడు సూర్యుని రథచక్రమును భంగ పరచినాడు. అపుడు సర్వపిత ద్యులోకము నీ ద్వారముగనే రథచక్రమును నిలువరింప చేసినది.

## నూట ముప్పది తొమ్మిదవ సూక్తము

ఋషి - విశ్వావసు గంధర్వుడు, దేవత - సవితాదులు - ఛందస్సు - త్రిష్టుప్

1. సవిత సూర్య కిరణవంతుడు, ఉజ్వల కేశవంతుడు. అథదుఇ తూర్పున క్రమాగతముగ ఉదయించును. అతడు అవతరించగనే పూష అగ్రసరుడు అగును. అతడు సమస్త లోకములను ఆలోకించును రక్షించును.

2. అతడు మానవులపై కృపాదృష్టి కలవాడు. ఆకాశ మధ్యమున వసిస్తాడు. ద్యావా పృథ్వులను, వాటి మధ్యనున్న ఆకాశమును తన దృక్కులతో పూర్ణము చేయును. సకల దిశలను, మూలలను ప్రకాశింపచేయును. అతడు పూర్వ, పర, మధ్య, ప్రాంత భాగములకు వెలుగు కలిగించును.

3. సూర్యదేవర సంపదలకు మూల పురుషుడు. అతడు తన సామర్థ్యమున ద్రష్టవ్య పదార్థములను వెలిగించును. సవితవలెనే సూర్యుని కార్యములన్నియు ఫలవంతములు అగును. ఎచట సర్వసంపదలు ఏకత్రితములు అగునో అచట సూర్యుడు ఇంద్రుని బోలి వెలుగొందినాడు.

4. సోమమా! మందహాస జలము విశ్వావసు గంధర్వుని చూచినది. పుణ్య కర్మ ప్రభావమున జలము విలక్షణముగ వెడలినది. జలప్రేరక ఇంద్రుడు ఈ విషయము తెలిసి కొన్నాడు. పలుదిశల సూర్యమండలమును వీక్షించినాడు

5. దేవలోకవాసియు - జలసృష్టికర్తయునగు విశ్వావసుడు ఈ విషయములు మాకు తెలియపరచును గాక. ఏది వాస్తవమో, ఏది అజ్ఞాతమో అను విషయమున మా ఆలోచనలకు ప్రేరకుడు అగును గాత. మా జ్ఞానములకు రక్షకుడు అగునుగాత.

6. నదుల చరణములందు ఇంద్రుడు ఒక మేఘమును గాంచినాడు. ప్రస్తర ద్వారమును ఆవిష్కరించినాడు. గంధర్వుడు సమస్త నదుల జలముల విషయము వివరించినాడు. ఇంద్రుడు మేఘముల శక్తిని ఎరింగివాడు.

**మూట నలుబదవ సూక్తము**

ఋషి - పావక అగ్ని - దేవత - శుద్ధి అగ్ని ఛందస్సు - వేరువేరు

1. అగ్నీ! నీ వద్ద ప్రంశసనీయ అన్నము గలదు. నీ జ్వాలలందు విశిష్ఠ దీప్తి కలదు. నీ దీప్తి ప్రకాండము. దీప్తియే నీ సంపద. నీవు కార్యకుశలుడవు. నీవు దాతలకు ఉత్తమ అన్న, బలప్రదాతవు.

2. అగ్నీ! నీవు ప్రకాశముగ ఉదయింతువు. అపుడు నీ తేజము సమస్తమును స్పష్టము చేయును. అవి శుక్ల వర్ణమున వర్ధిల్లును.

అగ్నీ! నీవు ద్యావా పృథ్వులను తాకుచున్నావు. నీవు పుత్రుడవు - ద్యావా పృథ్వులు తల్లులు అగుచున్నవి. అందుకే

ఆటలాడుచు వానిని కౌగిలించుకొనుచున్నావు.

3. అగ్నీ! నీవు తేజోపుత్రుడవు. జ్ఞానివి. ఉత్తమ స్తోత్ర పారములతో స్థాపించబడుచున్నావు. ఆనందించుము. నానావిధ - నానారూప యజ్ఞ సామాగ్రి నీయందే ఆహుతి అగుచున్నది.

4. అగ్నీ! వికసించనున్న కిరణమండలమున శోభిల్లుచు మా ధనమును వర్ధిల్లచేయుము. నీవు సుందరముగ అవతరించినావు. నీవు సమస్త ఫలప్రద యజ్ఞమును స్పృశించుచున్నావు.

5. అగ్నీ! నీవు యజ్ఞమునకు శోభ సమకూర్చువాడవు. జ్ఞానివి. విశేష అన్నప్రదాతవు. ఉత్తమ పదార్థ ప్రాపకుడవు. మేము నిన్ను స్తుతించుచున్నాము. అత్యంత సుందరమును, ఆనంతమును అగు అన్నమును ప్రసాదించుము. సమస్త ఫలితములను కలిగించు ధనము కలిగించుము.

6. అగ్ని యఇజ్ఞ్ పయోగి -సర్వదర్శకుడు - విశాలుడు. మానవులు అగ్నిని సుఖములు అర్థింతురు.

అగ్నీ ! నీవు సర్వము వినగలవాడవు. నీ వైశాల్యము నిరుపమానము. నీవు దేవలోక వాసివి. యాజమానపతి, పత్నులు నిన్ను స్తుతించుచున్నారు.

## నూట నలుబది ఒకటవ సూక్తము

ఋషి - అగ్ని దేవత - విశ్వే దేవతలు, ఛందస్స - అనుష్టుప్

1. అగ్నీ ! ఉపయుక్తమును ఉపదేశించుము. మాకు అనుకూలుడవు - ప్రసన్నుడవు అగుము. నీవు ధనదాతవు మాకు ధనము ప్రసాదించుము.

2. అర్యమ, భగ, బృహస్పతి, అన్యదేవతలు మరియు వాక్యమయి సరస్వతి మున్నగు వారు మాకు ధనము ప్రసాదింతురుగాత.

3. మమ్ము రక్షించుమని మేము సోమరాజు, అగ్ని సూర్య, ఆదిత్యగణ, విష్ణు, బృహస్పతి, ప్రజాపతులను ఆహ్వానించుచున్నాము.

4. ఇంద్ర, వాయు, బృహస్పతులను ఆహ్వానించుటలో ఆనందము ఉన్నది. మేము వారలను ఆహ్వానించుటలో ఆనందము ఉన్నది. మేము వారలను ఆహ్వానించుచున్నాము. ధనప్రాప్తి కొరకు వారు మా విషయమున ప్రసన్నులు అగుదురుగాక.

5. స్తోతా! దానము కొరకు అర్యము, బృహస్పతి, ఇంద్ర, వాయు, విష్ణు, సవిత, సరస్వతులను ప్రార్థించండి.

6. అగ్నీ! నీవు సమస్త అగ్నులతో కలసి మా స్తోత్రముల యొక్కయు యజ్ఞము యొక్కయు సిరులను వర్ధిల్లచేయుము. మా యజ్ఞము కొరకు దాతలను, ధనదానమునకు ప్రేరణ కలిగించుము.

## నూట నలుబది రెండవ సూక్తము

ఋషి - శారంగజాత జరితుజి - దేవత - అగ్ని ఛందస్సు - వివిధము

1. అగ్నీ! మేము జారితులము - నీ స్తోతలము. బలపుత్ర అగ్నీ! నీతో సమమగు ఆత్మీయుడు మరొకడు ఉండడు. నీ నివాస స్థానము సుందరము. దానికి మూడు ప్రకోష్ఠములు ఉన్నవి. నీ మంటలకు మేము కాలుదుము. కావున నీ ఉజ్వల జ్వాలలను దూరముగా ఉంచుము.

2. అగ్నీ! నీవు అన్నముకోరి ప్రత్యక్షమైనప్పటి నీ సుందర రూపము చెప్పనలవిగానిది. బంధువువలె నీవు సమస్త భువనములను అలంకరించుచున్నావు. అటు నిటు కదలు నీ జ్వాలలు మా స్తవములను ఆవిర్భవింప చేయుచున్నవి. పశువుల కాపరివలె నీ జ్వాలలు అగ్రమున సాగుచున్నవి.

3. దీప్తిశాలి అగ్నీ! దహించునపుడు అనేక తృణములను వదలుచున్నావు. ధాన్యభరిత క్షేత్రమును శూన్యము చేయుచున్నావు. మేము నీ ప్రబల శిఖల ఆగ్రహమున పడకుందుము గాక.

4. నీవు వృక్షాదులను క్రింద, మీద కాల్చునపుడు దోచుకొను సేనవలె - విడివిడిగా సాగుదువు. నీకు వాయువు తోడయినపుడు - మంగలి తల గొరిగినట్లు - అసీను ప్రదేశములను ముండనము చేయుదువు.

5. అగ్ని  అనేక శిఖలు గలది. వారి గమ్యము ఏకము. కాని రథములు అనేకములు.

అగ్నీ! నీ శిఖలచే అరణ్యములను దహిస్తావు. వినమ్రమవుతావు ఉన్నత భూమిని అధిరోహిస్తావు.

6. అగ్నీ ! నీవు స్తుతించబడుచున్నావు. నీ యందు  తేజస్సు, జ్వాలలు, బల పరాక్రమములు ఉదయించును గాత. బుద్ధివర్ధిల్లునుగాక. పైకి సాగుము. క్రిందకు దిగుము. నిన్ను సమస్త దేవతలు చేరుకొందురుగావుత.

7. ఇది జలముల మూలభూమి. ఇచట సముద్రము ఉన్నది. అగ్నీ! నీవు అన్యస్థానమునకు చేరుము అచటనే స్వేచ్ఛగ సంచరించును.

8. అగ్నీ! నీ ఆగమన, ప్రత్యాగమునందు దుర్వారములు పుష్పించునుగాక. ఇది తాటకము. ఇవి శ్వేత పద్మములు.

ఇది సముద్రము.

*అక్షర వాచస్పతి డాక్టర్ దాశరథి రంగాచార్య రచించిన శ్రీమదాంధ్ర వచన*
*ఋగ్వేద సంహిత యందలి ఎనిమిదవ అష్టకము నందలి*
*ఏడవ అధ్యాయము సమాప్తము.*

## నూట నలుబది మూడవ సూక్తము

ఋషి - సంఖ్య పుత్ర ఆత్రేయుడు. దేవత - అశ్వినులు ఛందస్సు - అనుష్టుప్

1. అశ్వినులారా ! యజ్ఞములు చేసి, చేసి అత్రి ఋషి వృద్ధుడు అయినాడు. మీరు అతనిని తీర్చిదిద్దినాడు. అశ్వమువలె గమ్యస్థానము చేరినాడు. పాతబడిన రథమును కొత్తదానిగ చేసినట్లు కక్షీవంతునకు నవయవ్వనము ప్రసాదించినారు.

2. ప్రబల పరాక్రమ శత్రువులు - జవనాశ్వము వంటి అత్రి ఋషిని కట్టిపెట్టినారు. గట్టి ముడిని విప్పినట్లు మీరు అత్రిని విడిపించినారు. అతడు నవయవ్వనుని వలె ధరిత్రి మీద సాగిపోయినారు.

3. శుభ్రవర్ణ, సుందర నాయకద్వయమా! అత్రికి జ్ఞానము కలిగించండి. అపుడు నేను మరిన్ని స్తుతులు చేసెదను.

4.ఉత్తమ అన్నవంత నాయకద్వయమా! మీరు మా ఇంట జరిగిన యజ్ఞమహోత్సవ ఆరంభమును మహాసంరంభమున రక్షించిన తీరు కానగా మా దానములను, స్తోత్రములను గ్రహించినారని అర్థమైంది.

5. భుజ్యుడను వాడు సముద్రమున పడినారు. తరంగముల మీద తేలి కొట్టుకొను చున్నాడు. అప్పుడు మీరు పక్షినావ మీద సముద్రము మీదకు చేరినాడు. భుజ్యుని రక్షించినారు - యజ్ఞయోగ్యుని చేసినారు.

6. సర్వజ్ఞ నాయకద్వాయమా! భాగ్యవంతులవలె దాతలై, ధన సహితులై మా వద్దకు విచ్చేయండి. పాలు పొదుగున చేరిన రీతి మమ్ము ధనపూర్ణులను చేయండి.

## నూట నలుబది నాలుగవ సూక్తము

ఋషి -గరుడపుత్ర సుపర్ణుడు. దేవత - ఇంద్రుడు ఛందస్సు - వేరు వేరు

1. ఇంద్రా ! నీవు సృష్టి కర్తవు. ఇది సోమము. అమృత సమము. అశ్వమువలె పరుగులు తీయును. ఇది బలకరి. జీవన స్వరూపము.

2. ఇంద్రుడు దాత. అతని ఉజ్వల వజ్రము స్తవనీయము. ఇంద్రుడు ఊర్ధ్వ కృశనుడను స్తోతకు పాలకుడు. ఋభువుల వలె ఇంద్రుడు యజ్ఞకర్తను పాలించుచున్నాడు.

3. ఇంద్రుడు దీప్తిగలవాడు. యజమానులు అతని ప్రజా. అతడు వారి వద్దకు రాకపోకలు సాగించును. నేను సుపర్ణర్షిని. నా వంశమును అతడు వర్ధిల్లచేసినాడు.

4. గరుడపుత్రుడు సుపర్ణుడు. దూర దేశము నుండి సోమము తెచ్చినాడు. అది సకల కర్మలకు ఉపయోగపడునది - ఉత్సాహమును ఉరికించునది.

5. అది ఎర్రనిది, సృష్టికర్త వంటిది. సుందరము. అన్యులు నష్టపరచరానిది. దానిని తన చరణములచే గరుడుడు తెచ్చినాడు.

ఇంద్రా! సోమము స్వీకరించుము. మాకు అన్నము, పరమాయువు, జీవనము ప్రసాదించుము. సోమము కొరకు మాతో స్నేహము చేయుము.

6. ఇంద్రుడు సోమపానము చేయును. దేవతలకు, మాకు తగురీతి గట్టి భద్రత కలిగించును.

ఉత్తమ కర్మ ఇంద్రా! యజ్ఞము కొరకని మాకు అన్నము, పరమాయువు ప్రసాదించుము. యజ్ఞమునకని ఈ సోమమును మేము సమర్పించుచున్నాము.

## నూట నలుబది అయిదవ సూక్తము

ఋషి - ఇంద్రాణి, దేవత - సపత్ని -ఛందస్సు - వేరు వేరు

1. ఇది ఓషధి. తీవ్రశక్తియుక్తము. దీనిని నేను త్రవ్వి తీస్తాను. ఇది దుఃఖము, భర్తకు వలపు కలగించును.

2. ఓషధీ! నీ పత్రములు ఉన్నతముఖములు. నీవు భర్తకు వలపు కలిగించు ఉపాయమవు. నీ శక్తి అద్భుతము. నా సవతిని దూరము చేయుము, నా స్వామి నా వశమున ఉండునట్లు చేయుము.

3.ఓషధీ! నీవు ప్రధానివి. నేను ప్రధానిని అగుదునుగాత. ప్రధానులందు ప్రధానిని అగుదునుగాక. నా సవతి నీచులందు నీచ అగునుగాక.

4. నేనునా సవతిని పేర్కొనను, సవతి అందరకు అప్రియ అగును. దానిని దూరమున కన్నా దూరమునకు పంపివేతును.

5. ఓషధీ! నీ శక్తి విలక్షణము. నా సామర్థ్యము విచిత్రము. రమ్ము. శక్తి సామర్థ్యములు కలిపి సపత్ని బలము నిర్మూలింతము.

6. పతిదేవా! ఈ శక్తి సంపన్న ఓషధిని నీ తల క్రింద ఉంచినాను. తలదిండు అందించినాను. ఆవుదూడ కొరకు, నీరు పల్లమునకు వలె నీ మనసు నా వైపు పరుగులిడును గాక.

## నూట నలుబది ఆరవసూక్తము

ఋషి - ఇరంమదపుత్ర దేవముని, దేవత - అరణ్యములు, ఛందస్సు - అనుష్టుప్

1. మహారణ్యములారా! చూచుచుండగనే అంతర్ధానమగుదురు. చూపు అందనంత దూరమునకు చేరుదురు. మీరు గ్రామ మార్గము ఏల తెలిసికొనరు? మీకు వంటరితనము భయము కలిగించదా?

2. ఒక మృగము ఆబోతువలె గర్జించును. ఒక పక్షి కిచకిచమని దానికి సమాధానమువలె పలుకునా. అవి తెరలు తెరలుగా ధ్వనిచేయుచు మహారణ్యపు కీర్తిగానము చేయుచున్నట్లు ఉండును.

3. ఈ విపినము నందు ఒక మూల ఆవులు మేయుచున్నవి - ఒకచోట లతాగుల్మాదుల గృహములు ఉన్నవి.

ఇది సాయం సంధ్య - వనము నుంచి అనేక శకటములు వెడలుచున్నవి.

4. ఒకడు ఆవును పిలుస్తున్నాడు. ఒకడు కట్టెలు కొట్టుచున్నాడు. రాత్రులు అరణ్యము లందున్న వారు ధ్వనులు వింటారు.

5. అరణ్యములు ఏ ప్రాణిని వధించవు. పులులు, దొంగలు లేకున్న భయమే లేదు. వనములందున్న రుచిగల ఫలములు తిని హాయిగ కాలక్షేపము చేయవచ్చును.

6. వనములందు కస్తూరి పరిమళములు ఉన్నవి. ఆహారము ఉన్నది. శ్రమలేకున్నది.

అరణ్యములు హరిణముల మాతృరూపలు. అట్లని నేను అరణ్యములను స్తుతించు చున్నాను.

## నూట నలుబది ఏడవ సూక్తము

ఋషి - శిరీష పుత్ర సువేదసుడు - దేవత - ఇంద్రుడు -ఛందస్సు - జగతి - 5 త్రిష్టుప్

1. ఇంద్రా! నీ క్రోధమును ప్రధానముగ భావించుచున్నాను. నీవు వృత్రుని వధించినావు. లోక కళ్యాణమునకు వర్షము కురిపించినావు. ద్యావా పృథ్వులు నీ అధీనమందు ఉన్నవి.

వజ్రధర ఇంద్రా ! నిన్ను చూచి పృథివి గడగడలాడును.

2. ఇంద్రా! నీవు ప్రశంసనీయుడవు, అన్నము సృష్టించ సంకల్పించినావు. నీ శక్తిచే వృత్రుని తొలగించినావు. మానవులు గోవులను కోరి నిన్ను యాచింతురు. సకల హవన, యజ్ఞములందు నిన్నే ప్రార్థించుచున్నాము.

3. ఇంద్రా! నీవు ధనికుడవు. పురుహూతుడవు. వీరు విద్వాంసులు. వారి ముఅద్మ అవతరించుము. నీ కటాక్షమున వారు సిరి వర్ధిల్లు ధనికులు అయినారు. పుత్ర, పౌత్రులను, అన్య అభిలషితములను, విశిష్ఠ ధనము ఆశించి యజ్ఞములు చేయుదురు. నిన్ను ప్రార్థింతురు.

4. ఎవడు ఇంద్రునకు సోమపాన జనిత ఆనందము కలిగించుచున్నాడో అట్టివాడు కోరిన ధనము కొరకు ప్రార్థించుచున్నాడు.

ధనిక ఇంద్రా! నీవు యజ్ఞదాతకు శ్రీ వృద్ధి కలిగింతువు. అట్టివాడు సేవకులు, ధనము, అన్నమున, పరిపూర్ణుడు అగుచున్నాడు.

5. బలము కొరకు నీవు స్తుతించబడుదువు. మాకు ధనము, బలము ప్రసాదించుము.

ప్రియదర్శన ఇంద్రా! నీవు మిత్రా వరుణులవలె అలౌకిక జ్ఞానమునకు అధికారివి. నీవు మాకు అన్నమును పంచి ఇచ్చుచున్నావు.

## నూట నలుబది ఎనిమిదవ సూక్తము

ఋషి - వేనపుత్ర పృథువు - దేవత - ఇంద్రుడు - ఛందస్సు త్రిష్టుప్

1. ప్రభూత ధనవంత ఇంద్రా! మేము సోమము, అన్నము సంపాదించినాము. నిన్ను స్తుతించుచున్నాము. నీ మనసునకు అనుకూలమగు సంపదను మాకు మరింత ప్రసాదించుము. నీ అనుగ్రహమున మేము మా పరిశ్రమ వలననే ధనము కలుగుదుము గాక.

2. ఇంద్రా! నీవు ప్రియదర్శిని - వీరుడవు. నీవు పుట్టినావు. సూర్యమూర్తిని అయినావు. దాస నీవు వర్షకారివి. నీవు సోమము సమర్పించుచున్నాము.

3. ఇంద్రా! నీవు విద్వాంసుడవు. ప్రభుడవు. మేధావివి, ఋషుల స్తుతులు ఆశించువాడవు. నీవు మా స్తుతులను ఆమోదించుము. మేము నీకు సోమము సమర్పింతుము. ఆనందము కలిగింతుము. మాకు అంతరంగివి అగుము.

రథారూఢ ఇంద్రా! ఈ సమస్త ఆహార పదార్థములు నీకు నివేదించుచున్నాము.

4. ఇంద్రా! ఇవి ప్రముఖ స్తుతులు నీ కొరకే చదువబడినవి.

వీర! ఎవరు ప్రముఖులందు ప్రముఖులో వారికి అన్నము ప్రసాదించుము. నీతో స్నేహము చేసిన వారు యజ్ఞములు చేయుదురు గాత. నిన్ను స్తుతించుటకు కూడినవారిని రక్షింపుము.

5. వీర ఇంద్రా! నిన్ను ఆహ్వానించుచున్నాను. వేనపుత్ర పృథువు నిన్ను స్తుతించుచున్నాను. అతడు ఘృతయుక్త యజ్ఞ గృహమున చేరినాడు. నిన్ను స్తుతించుచున్నాడు. నీరు పల్లమునకు పరుగులు పెట్టినట్లు ఇతర స్తోతలు నీవైపు పరుగులు పడుచున్నారు.

## నూట నలుబది తొమ్మిదవ సూక్తము

ఋషి - హిరణ్య స్తూపపుత్ర అర్చితుడు - దేవత - సవిత - ఛందస్సు - త్రిష్టుప్

1. వివిధ పద్ధతులతో సవిత పృథ్విని స్థిరపరచినాడు. నిరాధారముగ ద్యులోకమును నిలిపి పెట్టినాడు. ఆకాశమున సముద్రమంతటి జలరాశిని ఏర్పరచినాడు. మేఘరాశి అశ్వము వలె దేహము దులుపును. అది నిరుపద్రవముగ నిలిచి ఉన్నది.

సవితా దేవత అట్టి మేఘము నుండియే జలమును తీయుచున్నాడు.

2. ఏ స్థానమున నిలిచి సాగరసమ మేఘరాశి భూమిని ఆర్ద్రము చేయుచున్నదో ఆ స్థానమును సవిత ఎరుంగును. జలపుత్ర సవిత వలననే పృథివి, ఆకాశము, ద్యులోకము విస్తరిల్లినవి.

3. సోమము స్వర్గమున పుట్టినది. అమరము. దానితో దేవతలు యజింతురు. అట్టి వారిలో అందరు సవిత తరువాత ఆవిర్భవించినవారే. గరుత్మంతుడు సవిత కన్న మున్ను పుట్టినవాడు. సవిత యొక్క సోమహరణ క్రియను అనుసరించి అతడు ప్రఖ్యాతుడు అయినాడు.

4. ఎల్లరు ప్రార్థించు సవిత స్వర్గపాలకుడు అగుచున్నాడు. గోవు గ్రామమునకు వెళ్లునంత, యోధుడు అశ్వము వద్దకు వెళ్లునంత, కొత్తగ ఈనిని ఆవు దూడ వద్దకు వెళ్లునంత, స్త్రీ భర్త దగ్గరకు వెళ్లునంత ఉత్సాహముగ సవిత మా

వద్దకు వచ్చును గాత.

5. సవితా ! నా తండ్రి, అంగిరో వంశీయుడు, హిరణ్యస్తూపుడు నిన్ను యజ్ఞమునకు ఆహ్వానించుచున్నాడు. నేను నీ ఆశ్రయము కోరినాను. నీకు ప్రణమిల్లుచున్నాను. నిన్ను సేవించుటకు యజమాని సోమలత విషయము వలె - అప్రమత్తుడనై ఉన్నాను.

## నూట ఏబదవ సూక్తము

ఋషి - వసిష్ఠపుత్ర సృళీకుడు - దేవత - అగ్ని ఛందస్సు - వేరువేరు

1. అగ్నీ ! నీవు దేవతలకు హవిస్సు వహించువాడవు. నిన్ను ప్రజ్వలితుని చేసినాము. ప్రదీప్తుడవు ఆగుము. ఆదిత్య, వసు, రుద్రుల సహితముగ మా యజ్ఞమునకు విచ్చేయుము - సుఖములు ప్రసాదించుము.

2. ఇది యజ్ఞము. ఇది స్తవము. స్వీకరించును. దరి చేరుము.

ప్రదీప్త అగ్నీ! మేము మనుష్యులము. సుఖములు ప్రసాదించుమని నిన్ను పిలుచు చున్నాము.

3. అగ్నీ! నీవు జ్ఞానివి. విశ్వ ప్రార్థితుడవు. నిన్ను స్తుతి వచనములచే కీర్తించుచున్నాము. ఎవరు సుఖప్రదులో ఆ దేవతలతో సుఖమునకు విచ్చేయుము.

4. అగ్ని దేవతల పురోహితుడు. మానవులు, ఋషులు అగ్నిని ప్రజ్వలితుని చేసినారు. బోలెడు ధనము కలుగుటకు అగ్నిని ఆహ్వానిస్తున్నాను. అగ్ని మాకు సుఖములు ప్రసాదించునుగాత.

5. అగ్ని - యుద్ధములందు - అత్రి, భరద్వాజ, గవిష్ఠర, కణ్వ, త్రసదసులను రక్షించినాడు. పురోహిశ వసిష్టుడు అగ్నిని సుఖములిమ్మని ఆహ్వానించినాడు.

## నూట ఏబది ఒకటవ సూక్తము

ఋషి -కామగోత్ర శ్రద్ధ - దేవత -శ్రద్ధ -ఛందస్సు - అనుష్టుప్

1. శ్రద్ధతోనే అగ్ని ప్రజ్వలించబడును. శ్రద్ధతోనే యజ్ఞ సామాగ్రి ఆహుతి ఇవ్వబడును. శ్రద్ధ సమస్త మస్తకము అగును. దీనిని నేను స్పష్టము చేయుచున్నాను.

2. శ్రద్ధా! దాతకు అభీష్ట ఫలము ప్రసాదించుము. దానము చేయగోరువారి కోరికలు తీర్చుము. నా శ్రేయోభిలాషులకు, యాజ్ఞికులకు కోరినవరము ప్రసాదించుము.

3. ఇంద్రాదులు అసుర వధ విషయమున ఉగ్ర శ్రద్ధ వహించినారు. అట్లే శ్రద్ధా! భోక్తలకు, యాజ్ఞికులకు కోరిన వరములు ప్రసాదించుము.

4. నరులు, దేవతలు వాయువును రక్షకునిగ చేసికొని శ్రద్ధను ప్రార్థింతురు. సంకల్పము కలిగినపుడు జనులు శ్రద్ధను ఆశ్రయించుచున్నారు. శ్రద్ధ కారణముగనే జనులు ధనము పొందుచున్నారు.

5. ఉదయము, మధ్యాహ్నము మేము శ్రద్ధనే ఆశ్రయించుచున్నాము.
శ్రద్ధా ! మమ్ము జగమున శ్రద్ధావంతులను సేయుము.

## నూట ఏబది రెండవ సూక్తము

ఋషి - శాస - దేవత - ఇంద్రుడు - ఛందస్సు - అనుష్టుప్

1. నేను ఇంద్రుని ఇట్లు స్తుతించుచున్నాను:-

ఇంద్రా ! నీవు మహా శత్రు భక్షకుడవు. అద్భుతడవు. నీ మిత్రునకు మృత్యువు కలుగదు. పరాజయము ఉండదు.

2. ఇంద్రుడు శుభప్రదాత - ప్రజాపతి - వృత్రఘ్నుడు. శత్రువశకర్త, వరదుడు. సోమపాయి, అభయ ప్రదాత. అతడు మా ముందునకు విచ్చేయునుగాత.

3. వృత్రఘ్న ఇంద్రా! రాక్షసులను, శత్రువులను వధించుము. అనిష్టకర శత్రుకోపమును రాల్చుము.

4. ఇంద్రా! మా పగవారిని హతమార్చుము. యుద్ధార్థులగు విపక్షము వారిని బలహీనులను చేయుము మమ్ము నికృష్టులను చేయు వారిని జఘన్య అంధకారమున త్రోయుము.

5. ఇంద్రా! శత్రువు మనసును నష్టపరచుము. మమ్ము హీనులను చేయదలచినవారి మీద నీ ఉగ్ర అస్త్రము ప్రయోగించుము. మము శత్రు క్రోధము నుండి రక్షింపుము. ఉత్తమ సుఖములను ప్రసాదించుము. శత్రువు యొక్క ఘాతుక ఆయుధమును విడుచుము.

## నూట ఏబది మూడవ సూక్తము

ఋషిక - ఇంద్రమాత - దేవత ఇంద్రుడు -ఛందస్సు - గాయత్రి

1. కర్తవ్యపరాయణులైన ఇంద్ర మాతలు ఆవిర్భూత ఇంద్రుని సేవింతురు. ఇంద్రుని నుండి ఉత్కృష్ట ధనము

పొందుదురు.

2. ఇంద్రా ! నీవు బల, వీర్య, తేజములతో జన్మించినావు. నీవు అభీష్ట వరదుడవు.

3. ఇంద్రా! నీవు వృత్రఘ్నుడవు - ఆకసమును విస్తరింపచేసినావు. నీ శక్తిచే స్వర్గమును పైన నిలిపి ఉంచినావు.

4. ఇంద్రా! సూర్యుడు నీ సహచరుడు. నీవు సూర్యుని నీ రెండు చేతులతో పట్టి ఉంచినావు. నీవు స్వశక్తితో వజ్రమునకు పదను పెట్టుదువు.

5. ఇంద్రా! నీ తేజస్సుతో ప్రాణుల అద్భుతములు చేయుదువు. నీవు సమస్త దేశములను ఆక్రమించి నిలిచినావు.

## నూట ఏబది నాలుగవ సూక్తము

ఋషిక - వివస్వత దుహిత యమి - దేవత - ప్రేతము - ఛందస్సు - అనుష్టుప్

1. కొందరు పితరులకు సోమరసము ప్రవహించును. కొందరు ఘృతము సేవింతురు.

ప్రేతమా! ఏ పితరుల కొరకు మధువు పరుగులు పెట్టునో నీవు వారిని చేరుము.

2. తపోబలమున అచలులు అయిన తపోబలమున స్వర్గమున చేరిన, కఠిన తపమాచరించిన పితరులు ఉన్నారు.

ప్రేతమా! నీవు వారిని చేరుము.

3. యుద్ధ భూమిలో యుద్ధము చేసిన మాయా మోహములను వదిలిన బహు దక్షిణలు ఇచ్చిన పితరులున్నారు.

ప్రేతమా? నీవు వారిని చేరుము.

4. పుణ్య కర్మలు చేసి ప్రాచీన పుణ్యవంతులైన - పుణ్యబుద్ధితో తపమాచరించిన పితరుల వద్దకు యమదేవా! ఈ ప్రేతమును చేర్చుము.

5. శత సత్కర్మలు చేసిన సత్పురుషులు -సూర్యారాధకులు - తపో బలశాలురగు పితరుల వద్దకు యమదేవా! ఈ ప్రేతమును చేర్చుము.

# ఆలోచనామృతము

1. మరణము అంతము కాదు. కనీస విరామము కాదు. మరణం కేవలం పరిణామం.

జీవితం నిరంతరం. కల్పాంతం వరకు సాగుతుంది. కల్పాంతంలో కేవలం జలం - సాగరం - సముద్రం ఉంటుంది. భగవానుడు వటపత్ర శాయిగా జలనిధిలో విహరిస్తుంటారు. సమస్త ఆత్మలు ఆ స్వామిలో ఉంటాయి.

ఈ విషయం తెలియకనే జనులు దుర్మార్గాలు చేస్తున్నారు! ఆత్మహత్యలు చేసుకుంటున్నారు!!

2. జీవితం కోరికల మయం. కర్మమయం. కోరికలోంచి కర్మ పుట్టుతున్నది. కోరికలు, కర్మలు అనంతములు. అని ఒక జీవితానికి చాలవు. అని తదుపరి జన్మకు కొనసాగు తుంటాయి. మరణం అంతం కాదు. మార్పు మాత్రమే!

ఈ విషయం తెలియకనే జనులు దుర్మార్గాలు చేస్తున్నారు! ఆత్మహత్యలు చేసుకుంటున్నారు!!

3. జీవితం కర్మమయం. అంటే పనిమయం. పనిచేయని లిప్త ఉండదు. ప్రతి పనికి ఫలితం, పర్యవసానం ఉంటాయి. తప్పదు. నిప్పు కాలుస్తుంది. గాలి మండిస్తుంది. నీరు చల్లారుస్తుంది. పనిని బట్టి ఫలితం సత్కార్యం సత్ఫలితాన్ని ఇస్తుంది. దుష్కార్యం దుష్ఫలితాన్నిస్తాయి. కర్మ మరణంతో అంతం అవుతుంది. ఫలితం మరో జన్మకు సాగుతుంది!

బ్యాంకులో డబ్బు దాచుకుంటాడు. ఇది కర్మ. మనిషి పోతాడు. వడ్డీ వస్తూనే ఉంటుంది. ఇది ఫలితం.

బ్యాంకులో అప్పుచేస్తాడు. ఇది కర్మ. మనిషిపోతాడు. రుణం తీరదు. ఇది ఫలితం!

ఈ విషయం తెలియకనే జనులు దుర్మార్గాలు చేస్తున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు!

4. ఇద్దరు ఒకే రకపు పని చేస్తున్నారు. ఒకనికి ఫలిస్తున్నది. ఒకనికి వికటిస్తున్నది. వికటించినవాడు దైవాన్ని తిట్టిపోస్తున్నాడు. ఇందులో దైవ ప్రమేయం లేదు. అది పూర్వకర్మ మీద ఆధారపడుతున్నాది. మన ఈ జన్మ పూర్మజన్మ కర్మల కొనసాగింపే!

ఈ విషయం తెలియకనే జనులు దుర్మార్గాలు చేస్తున్నారు! ఆత్మహత్యలు చేసుకుంటున్నారు!!

5. కల్ ' జగ్ నహీఁయహ్ కర్ జుగ్ హై

క్యాజాబ్ సొదా నగదహై

ఇస్ హాత్ దొ ఉస్ హాతలే

ఇది కలియుగం కాదు. కర్మయుగం వ్యాపారం సొంతం రొక్కమే!

ఒకచేత ఇవ్వు మరో చేత తీసికో.

మన విద్యా విధానం సొంతంలో జీవిక బోధిస్తున్నారు. జీవితం బోధించడం లేదు.

ఈ విషయం తెలియకనే జనులు దుర్మార్గాలు చేస్తున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు!!

6. వేదం చెడు తలంచదు మధు కరిష్యే! అందుకే ప్రేతాన్ని సత్కార్యం చేసిన వారిని చేరమంటున్నది. ఆ ప్రేతం సత్కర్మలు ఆచరించింది కావచ్చు.

### నూట ఏబది అయిదవ సూక్తము

ఋషి - భరద్వాజ పుత్ర శిరింబిరుడు - దేవత - బ్రాహ్మణస్పతి
విశ్వేదేవతలు - ఛందస్సు - అనుష్టుప్

1. అలక్ష్మీ ! నీవు దాన విరోధినివి, కుత్సిత భాషివి. వికట ఆకృతివి. నిత్య క్రోధనివి. నీవు పర్వతము మీదకు రమ్ము. నిన్ను దూరము చేయు ఉపాయము చేయగలను.

2. అలక్ష్మి వృక్షలతా సస్యములను సమూలముగ నాశనము చేయునది. దుర్భిక్షము తెచ్చునది. దానిని నేను ఈ లోకమునుండియు ఆ లోకము నుండియు, పంపి వేయగలను.

ఉగ్రతేజ బ్రహ్మణ స్పతీ! దాన విరోధిని యగు ఈ అలక్ష్మిని దూరతీరములకు పంపి రమ్ము.

3. అదిగో ఒక దుంగ సముద్రమున తేలుచున్నది. దానికి నాథుడు లేడు. వికట ఆకృత అలక్ష్మీ! దాని మీద సముద్రపు ఆవలికి చేరుము.

4. హింసామయి, కుత్సితభాషి అలక్ష్ములారా! మీరు సమయ తత్పరులై వేగముగ సాగిపోయినపుడు ఇంద్రుని సమస్త శత్రువులు జల బుద్బుదముల వలె విలీనములు అయినారు.

5. వీరలు గోవులను ఉద్ధరించినారు. అగ్నిని విభిన్న స్థానములందు స్థాపించినారు. దేవతలకు అన్నము అందించినారు. అట్టి వారిని ఆక్రమించగల శక్తిశాలురు ఏరి?

## నూట ఏబది ఆరవ సూక్తము

ఋషి - అగ్నిపుత్ర కేతువు - దేవత - అగ్ని , ఛందస్సు - గాయత్రి

1. గుర్రపు పందెములందు జవనాశ్వములను పరిగెత్తింతురు. అట్లే మా స్తుతులు అగ్ని వైపు ఉరుకులు పెట్టుచున్నవి. అగ్ని అనుగ్రహమున మేము ధనము జయింతుముగాత.

2. అగ్నీ! నిన్ను ఆశ్రయించి మేము గోవులను పొందుచున్నాము. నీవు నీ సేనను రక్షించిన రీతి మమ్ము రక్షింపుము. మాకు ధన లాభము కలిగించుము.

3. అగ్నీ! మాకు అనేకగోవుల, అశ్వముల దినము ప్రసాదించుము. ఆకాశమును వర్ణపు స్నానము చేయింపుము. వర్తకులను వాణిజ్య కార్యమందు ప్రవర్తిల్లచేయుము.

4. సూర్యుడు నిత్య సంచారి. అజరుడు. ప్రకాశకుడు. అతనిని ఆకసమున అగ్నియే నిలిపినాడు.

5. అగ్నీ! నీవు ప్రజల జ్ఞాపకమవు. ప్రియతముడవు. శ్రేష్ఠుడవు. యజ్ఞ గృహమున ఆసీనుడవు అగుము. స్తుతులు వినుము. అన్నము ప్రసాదించుము.

## నూట ఏబది ఏడవ సూక్తము

ఋషి - ఆప్త్యపుత్ర భువనుడు - దేవత - విశ్వేదేవతలు ఛందస్సు -ద్విపదత్రిష్టుప్

1. సకల ప్రాణులు మాకు సుఖములు కలిగింతురు గాత, ఇంద్రాది సకల దేవతలు సుఖములు ప్రసాదింతురు గాక.

2. ఇంద్రుడు, ఆదిత్య గణములు మా యజ్ఞములను, పుత్ర పౌత్రాధులను ఉపద్రవ రహితులను చేయుదురుగాత.

3. ఇంద్రుడు, ఆదిత్యులు, మరుత్తులు సహకరింతురుగాత. మమ్ము రక్షింతురు గాక.

4. ఎప్పుడు దేవతలు వృత్రాది అసురులను వధించి మరలినారో ఆనాడు దేవతల అమరత్వమునకు రక్షణ కలిగినది.

5. అనేక ఉపాయములచే స్తుతులను, దేవతల వద్దకు పంపుట జరిగినది. తదుపరి ఆకసము నుండి పడు వర్షము చూడనైనది.

## నూట ఏబది ఎనిమిదవ సూక్తము

ఋషి - సూర్యపుత్ర చక్షువు - దేవత - సూర్యుడు - ఛందస్సు - గాయత్రి

1. దేవతల ఉపద్రవము నుండి సూర్యుడు - ఆకాశ ఉపద్రవముల నుండి వాయవు - భూమి ఉపద్రవముల నుండి అగ్ని మమ్ము రక్షించును గాత.

2. సవితా! మా అర్చనలు స్వీకరించుము. నీ తేజము కొరకు నూరు యజ్ఞములు చేయవలసి ఉండును. శత్రువు యొక్క ఉగ్ర ఆయుధముల నుండి రక్షింపుము.

3. సవిత మాకు చక్షువులు ప్రసాదించునుగాత. పర్వతములు చక్షువులు ప్రసాదించును గాత. విధాత చక్షువులు ప్రసాదించును గాత.

4. మా కన్నులకు చక్కని చూపు ప్రసాదించుము. సకలము స్పష్టముగ కనిపించునట్లు నేత్రములు ప్రసాదించుము. వానితో మేము సమస్తమును చూచెదముగాత.

5. సూర్యదేవా! మేము స్పష్టముగ చూచెదము గాత. మానవులు వేనిని చూచుచున్నారో వానిని విశేషముగ చూచెదము గాక.

## నూట ఏబది తొమ్మిదవ సూక్తము

ఋషిక, దేవత - పులోమ తనయశచి - ఛందస్సు - అనుష్టుప్

1. సూర్యోదయము నా భాగ్యోదయము అని గ్రహించినాను. నా ముందు నా సపత్నులందరు దిగతుడుపే. నేను స్వామిని వశపరచుకున్నాను.

2. నేన పతాకను. నేనే మాస్తకమును. నా స్వామి నుంచి తీయని మాటలు వింటాను. నా స్వామి నన్ను విశ్వసిస్తారు. నా మాట ఆమోదిస్తారు. నా భావమునే అనుసరిస్తారు.

3. నా పుత్రుడు శూరుడు. నా పుత్రిక సర్వశ్రేష్ఠ శోభాశోభిత. నాకు సర్వము తెలియును. నా భర్త వద్ద నా మాటకే విలువ.

4. ఏ యజ్ఞమును చేసి ఇంద్రుడు బలశాలి, శ్రేష్ఠుడు అయినాడో - దేవతలారా! నేను అట్టి క్రతువునే ఆచరించినాను. అందువలన నా సమస్త శత్రువులు ధ్వంసము అయినారు.

5. నా శత్రువు బ్రతకడు. నేను శత్రువులను జయించినాను - వధించినాను. చంచల బుద్ధిగల వారి సంపద అన్యులు హరింతురు. అట్లే అన్య స్త్రీల తేజమును నేను హరించినాను.

6. నేను నా సపత్నులందరను జయించినాను. కావుననే శూరా ఇంద్రునిపై నా అధికారము చెల్లుతుంది. అన్య కుటుంబికుల పైకూడ నా పెత్తనమే సాగుతుంది.

## నూట అరువదవ సూక్తము

ఋషి - వైశ్వామిత్రపూరణుడు - దేవత - ఇంద్రుడు - ఛందస్సు - త్రిష్టుప్

1. ఇంద్రా! ఇది సోమరసము. అత్యంత తీవ్రముగ చేసినాము. ఆహార పదార్థములు సిద్ధముగ ఉన్నవి. సేవింపుము.నీ రాధాశ్వములను ఇటు  మరలింపుము. ఇతర యజమానులు నిన్ను సంతుష్ట పరచజాలరు. నీకే ఈ సోమమంతయు అర్పితము.

2. ఇదిగో ఈ సమర్పించిన, సమర్పించనున్న సోమము సొంతము నీ కొరకే అగుచున్నది. ఉచ్చరించబడు స్తుతులన్నియు నిన్నే పిలుచుచున్నవి.

ఇంద్రా! మా ఈ యజ్ఞమును గ్రహింపుము. నీవు  సర్వజ్ఞుడవు. ఇచటనే సోమపానము చేయుము.

3. ఎవడు తల్లీ మనమున, నిష్కపట భావమున, ప్రీతియుక్త అంతః కరణమున, దైవ భక్తిచే ఇంద్రునకు సోమము సమర్పించుచున్నాడో అట్టి వారి గోవులను ఇంద్రుడు నష్ట పరచడు.

4. ఏ ధనికుడు. అతనికి సోమము సమర్పించునో అతనికి ఇంద్రుడు ప్రత్యక్షమగును. చేయిపట్టి కొనును. పుణ్యకర్మలను ద్వేషించు వారిని ఇంద్రుడు ధ్వంసము చేయును.

5. ఇంద్రా! గోవులు, అశ్వములు, అన్నము ఆశించి నీ రాకకు ప్రార్థించుచున్నాము. నీ కొరకే ఈ అభినవ, శ్రేష్ఠ స్తోత్రము రచించినాము. నీవు సుఖ ప్రదాతవని తెలిసి నిన్ను ఆహ్వానించుచున్నాము.

## నూట అరువది ఒకటవ సూక్తము

ఋషి - ప్రజాపతి పుత్ర యక్ష్మనాశని - దేవత - ఇంద్రుడు ఛందస్సు - త్రిష్టుప్

1. రోగీ! ఈ యజ్ఞ సామగ్రిచే నిన్ను అజ్ఞాత యక్ష్మ, రాజయక్ష్మ విముక్తిని చేయు చున్నాను. అందువలన నీకు జీవన రక్ష కలుగును.

ఏవేని పాపగ్రహములు ముట్టడించి యున్నచో ఇంద్రాగ్నులారా! వాటి నుండి విముక్తి కలిగించండి.

2. ఈ రోగి ఆయువు క్షీణించుచున్నను. ఈ లోకమును విడుచుచున్నట్లనిపించినను, మృత్యువు వద్దకు చేరినను మృత్యు దేవత నిఋతి నుంచి మరలించి తేగలను. నా స్పర్శకు ఇతనికి నూరేళ్ల ఆయువు కలుగును.

3. నేను అర్పించిన ఆహుతి వలన సహస్ర నేత్రుడు ఇతనికి నూరేళ్ల పరమాయువు. ఆయువు కలిగించును. అట్టి ఆహుతి వలననే రోగిని మరలించి తెచ్చినాను. ఇంద్రుడు ఇతనిని సకల పాప విముక్తుని చేసి పూర్ణ ఆయువు ప్రసాదించునుగాత.

4. రోగీ! నీవు శతశరత్తులు - సుఖముగ శత హేమంతములు - శతవసంతములు జీవించుము. ఇంద్ర, అగ్ని, బృహస్పతులు హవ్యమున తృప్తులై ఇతనికి శతాయుష్యము ప్రసాదింతురు గాత.

5. రోగీ! నేను నిన్ను కనుగొన్నాను. మరలించి తెచ్చినాను. నీవు పునర్నవుడవు అయినావు. నీ సమస్త అవయవములను - నేత్రములను, పరమాయువును సాధించినాను.

## నూట అరువది రెండవ సూక్తము

ఋషి - బ్రహ్మపుత్ర రక్షోహుడు దేవత - గర్భరక్షణం ఛందస్సు - అనుష్టుప్

1. అగ్ని స్తోత్రముతో ఏకమగునుగాత. రాక్షస హంత అగ్ని సమస్త బాధలను, ఉపద్రవములను, వ్యాధులను తొలగించునుగాత.

నారీ ! నీ గర్భమును ఆక్రమించిన బాధలు, ఉపద్రవములు, వ్యాధులను అగ్ని తొలగించునుగాత.

2. నారీ ! నీ గర్భమును మాంసభక్ష రాక్షసులు. రోగములు, ఉపద్రవములు ఆక్రమించినచో స్తోత్రయుక్త అగ్ని వానిని నాశము చేయునుగాత.

3. నారీ! పురుష వీర్యము పడునపుడు -శుక్ర స్థితి సమయమున - గర్భగమనమున, ప్రసవమప్పుడు నీ గర్భమునకు నష్టము తల పెట్టిన వానిని మేము దూరము చేయుచున్నాము.

4. నారీ! నీ గర్భమున నష్ట పరచుటకు నీ తొడలను చాచువాని, స్త్రీ పురుషుల మధ్య దూరు వానిని మేము దూరము చేయుచున్నాము.

5. నారీ! నీ సోదరుడు, పతి , పతి సంబధీకులు నీ గర్భమునకు , సంతతికి నష్టము కలిగించదలచినచో అట్టి వారలను మేము దూరము చేయుచున్నాము.

6. నారీ! నీ స్వప్నావస్థలోగాని, నిద్రావస్థలో గాని నిన్ను ముగ్ధను చేయుటకు, నీ సంతతికి నష్టము కలిగించవచ్చు వానిని మేము దూరము చేయుచున్నాము.

ఈ సృష్టి కొనసాగింపు నారీ గర్భం మీద ఆధారపడి ఉన్నది. సమస్త పశు పక్ష్యాదులకు, కొనసాగింపు కూడు స్త్రీ గర్భం మీద ఆధారపడి ఉన్నది. సృష్టిలో మానవ స్త్రీ గర్భానికే అనేక ఆటంకాలు ఎదురు అవుతున్నాయి. అందుకే పూసిన ప్రతి పూవూ కాయ కాదు అను సామెత!

అట్లయ్యు స్త్రీ గర్భమును రక్షించవలసిన బాధ్యత సమాజం మీద ఉన్నదని గుర్తు చేస్తున్నది.

**నూట అరువది మూడవ సూక్తము**

ఋషి - కాశ్యప వివృహుడు - దేవత - రోగనాశని - ఛందస్సు - అనుష్టుప్

1. నీ నేత్రముల, శ్రోత్రముల, నాసికా రంధ్రముల, చుబుక, శిర మస్తిష్క, జిహ్వాల నుండి వ్యాధిని వివృదోమహే, తొలగించుచున్నాము.

2. నీ గ్రీవా ధమనులు, స్నాయువు, ఆస్థిసంధి, భుజములు, హస్తములు, స్కంధముల నుండి వ్యాధిని వివృహామహే,

3. నీ అన్ననాడి, క్షుధనాడి, బృహద్దండము, హృదయ స్థానము, మూత్రాశయము, యకృతు, అన్యాన్యమాంసపిండముల నుండి వ్యాధిని వివృహామహే.

4. నీ ఊరువులు, జఘనములు, జానవులు, గుల్మములు, పాసప్రాంతములు, నితం బములు, కటిప్రదేశము, మలద్వారము నుండి వ్యాధిని వివృహామహే.

5. మూత్ర విసర్జనస్థానము, లోమములు, నఖములు శరీరపు సర్వాంగముల నుండి వ్యాధిని వివృహామహే.

6. ప్రత్యేక అవయవము, ప్రత్యేక రోమము, సంధిస్థానము, నీ సర్వాంగములందలి రోగ ఉత్పత్తి స్థానముల నుండి వ్యాధిని వివృహామహే - తొలగించుచున్నాము.

**ఆలోచనామృతము**

1. శరీర నిర్మాణం, అవయవాలను గురించి తీరు వైద్యశాస్త్రంలో నాటి ప్రావీణ్యతను తెలియపరుస్తుంది. వేదం శాస్త్రానికి మూలం. ఆయుర్వేదం వైద్యశాస్త్రం. ఆయుర్వేదం కనుగొన్న వేప, తులసి లాంటి వనస్పతులకే మళ్లీ ప్రాధాన్యత కలుగుతున్నది! శతాబ్దాల్లోనే ఆల్లోపతి వైద్యం మీద వ్యామోహం తగ్గుతున్నది. వేల సంవత్సరాల ఆయుర్వేదానికి ప్రాధాన్యత పెరుగుతున్నది!

2. ఇంగ్లీషు వైద్యానిది నివారణ మాత్రమే! రోగి జీవితాంతం రోగియే! చికిత్స జీవితాంతం! వ్యాధి నిర్మూలన ఇంగ్లీషు వైద్యపు పరిభాషలో లేదు. అది వైద్యం కాదు- వ్యాపారం. వర్తకం ! Once patient is ever patient!

ఆయుర్వేదపుది వ్యాధి నిర్మూలన అంటే శరీరంలోని సమస్త అవయవాల నుండి వ్యాధి తొలగిపోవటం అని వివరించినాడు - గమనించండి.

### నూట అరువది నాలుగవ సూక్తము

ఋషి - ఆంగీరస ప్రాచేతసుడు - దేవత -దుస్వప్ననాశని ఛందస్సు - వేరు వేరు

1. దుస్వప్నదేవా ! నీవు మనసు మీద అధికారము సాధించినావు. జరుగుము. పారిపొమ్ము. దూరమున సంచరించుము. బహుదూరమున నిర్రుతి ఉన్నాడు. అతను వద్దకు వెళ్లి "జీవించు వారి మనోరథములు బహు విశాలములు - వానిని భగ్నపరచకుము," అని చెప్పును.

2. జీవించు వారి మనోరథములు బహు విశాలములు వారు ఉత్తమ కావ్య వస్తువును కోరెదరు. ఉత్తమ, సుందర ఫలములను ఆశింతురు. వారిని యముడు కళ్యాణమయ దృష్టిచే చూచుచున్నాడు.

3. ఆశపడునపుడు, ఆశాభంగమైనపుడు, ఆశఫలించినపుడు, జాగ్రదవస్థయందును మేము అపకర్మలు చేయుదుము. అగ్ని అట్టి సమస్త పాపములను దూరము చేయును గాత.

4. ఇంద్ర, బ్రహ్మణస్పతులారా! మేము పాపములు చేసినాము. ఆంగీరస ప్రచేతసా! అట్టి అమంగళము నుండి మమ్ము రక్షించును.

5. నేడు మేము విజయులము అయినాను. ప్రాప్తవ్య ప్రాప్తి కలిగినది. అపరాధ విముక్తులము అయినాము. జాగ్రదవస్థ, నిద్రావస్థ, యందలియు, సంకల్ప జన్య పాపములును మమ్ము ద్వేషించు శత్రుల వద్దకు చేరునుగాత.

### నూట అరువది అయిదవ సూక్తము

ఋషి - నిర్రుతి పుత్ర కపోతము - దేవత - విశ్వేదేవతలు ఛందస్సు -త్రిష్టుప్

1. దేవతలారా! ఈ కపోతము నిర్రుతి పంపినది. దుఃఖములు కలిగించుటకు మా ఇంట చేరినది. దానిని ఆరాధించి, దాని అమంగళమును దూరము చేయుదుము. మా దాస, దాసీజనులు - గోవులు, ఆశ్వాదులకు అమంగళము కలుగకుండునుగాత.

2. దేవతలారా! మా ఇంటికి పంపబడిన పావురము మాకు శుభంకరము అగునుగాక అమంగళము కలిగించకుండునుగాత. బుద్ధిమంతుడును, మాకు ఆత్మీయుడవు అగ్ని మా హవ్యములు స్వీకరించునుగాక ఈ రెక్కల ఆయుధము మమ్ము విడుచునుగాత.

3. రెక్కలు కలిగిన అస్త్ర స్వరూప కపోతము. మమ్ము వధించ కుండునుగాత. అగ్ని స్థాపితమైన స్థానముననే మేము ఆసీనులము అగుదుముగాత. మా జనులకు గోవులకు శుభము కలుగునుగాత.

దేవతలారా! ఇచట కపోతము మమ్ము దెబ్బతీయకుండునుగాత.

4. ఉలూకము అమంగళ ధ్వని చేయును. అది మిధ్య అగునుగాత. కపోతము అగ్ని స్థానమున నిలుచును. ఎవని దూతయై ఇది వచ్చినదో - ఆ మృత్యు స్వరూప యమునకు నమస్కారము.

5. దేవతలారా! ఈ పావురము పారద్రోల తగినది. మంత్రములచే దీనిని పారద్రోలండి. అమంగళము శమింపచేసి, ఆనంద సహితముగ ఆవును మేతకు పంపండి.

ఈ పావురము అతివేగముగ ఎగురునది. అది మా అన్నమును వదలి అవ్యస్థానమునకు చేరునుగాత.

## నూట అరువది ఆవర సూక్తము

ఋషి - వైరాజస శక్వరి - దేవత - శత్రునాశని - ఛందస్సు - అనుష్టుప్, మహాపంక్తి

1. ఇంద్రా! నేను సములందు శ్రేష్ఠుడను - శత్రువిజేతను - విపక్ష హంతను - సర్వ శ్రేష్ఠుడను అయి అశేష గోధన స్వామిని అగునట్లు చేయుము.

2. నేను శత్రు ధ్వంసకుడను అయినాను. ఇక నన్ను ఎవడును హింసింపజాలడు వధించ జాలడు. నా సమస్త శత్రువులు నాకు పాదాక్రాంతులు అయినారు.

3. శత్రువులారా! ధనుస్సు రెండు కొనలను నరము కట్టిపెట్టినట్లు మిమ్ము కట్టిపెట్టు చున్నాను. వాచస్పతీ! వారిని నా మాటతో మాట కలుప వలదని చెప్పండి.

4. నా వర్చస్సు నా కర్మలకు ఉపయుక్తము అగుచున్నది. ఆ వర్చస్సుననే శత్రువులను పరాజితులను చేయుటకు వచ్చినాను.

శత్రువులారా! మీ మనోవాక్కాయములను త్రుంచుచున్నాను.

5. మీ ఆర్జన శక్తిని అపహరించినాను. మీ కన్నా అధికుడను అయినాను. మీ తలల మీద ఆడుచున్నాడు. కప్పలు బెకబెకమనట్లు నాపాదాల కిందపడి మూలుగుచున్నారు.

## నూట అరువది ఏడవ సూక్తము

ఋషి -విశ్వామిత్ర జమదగ్నులు - దేవత - ఇంద్రుడు - ఛందస్సు - జగతి

1. ఇంద్రా! ఇది మధుతుల్య సోమము. కలశమందున్న ఈ సోమమునకు నీవే స్వామివి. మాకు మరింత ధనము. విశిష్ఠ పుత్రాదులను ప్రసాదించుము. నీవు తపమాచరించి స్వర్గమును గెలిచినావు.

2. స్వర్గ విజేత ఇంద్రుని - సోమము అందుకొని ఆమోదించు ఇంద్రుని సమర్పింత సోమరసము కొరకు రమ్మని పిలుస్తున్నాము. మా ఈ యజ్ఞమును పరిగ్రహించుము. రమ్ము. శత్రు విజేత ఇంద్రుని శరణువేడ వచ్చినాను.

3. సోమ, వరుణ రాజుల - బృహస్పతి, అనుమతుల శరణమందుండి - ఇంద్రా ! నీ స్తోత్రమున ప్రవృత్తుడను అయినాను. ధాతవు, విధాతవగు నీ అనుమతితో సోమము సేవించుచున్నాను.

4. ఇంద్రా ! నీవు ప్రేరణ కలిగించినావు. చరుమున్నగు ఆహార పదార్థములను నీకు సమర్పించినాను. సర్వ ప్రథమ స్తోతలమై ఈ స్తుతిని ఉచ్చరించుచున్నాము.

ఇంద్రుని మాట :-

విశ్వామిత్ర జమదగ్నులారా! సోమము అందగనే ధనముతో మీ ఇంటికి వచ్చెదను. అపుడు మీరు నన్ను విశేషముగ స్తుతించండి.

## నూట అరువది ఎనిమిదవ సూక్తము

ఋషి - వాతగోత్న అనిలుడు - దేవత - వాయువు ఛందస్సు - త్రిష్టుప్

1. వాయువు రథముతో సమానవేగముగ పరిగెత్తును. అట్టి వాయువు మహిమను నేను స్తుతించుచున్నాను.

వాయువు శబ్దము వజ్రసమము. ఇది వృక్షాదులను వంచి, కూల్చిసాగును. ఇది నలుదిశల ఎరుపు పరచి ఆకాశము ఆలంబనముగ సాగును. ఇది నేల దుమ్మును లేపుచు సాగును.

2. వాయుగతి పర్వతాదులను సహితము వడకించును. అశ్వములు యుద్ధమున పడినట్లు వాయువు పర్వతముల మీద్పా పడును. వాయువు అశ్వములు కట్టిన రధమును అధిరోహించి సమస్త భువనముల సామ్రాట్టువలె సాగును.

3. వాయువు ఆకసమున సంచరించును. ఏనాడును దానికి స్దిరత్వము లేదు. నీరు జల బంధువులు జలమున కన్న మున్ను పుట్టినవారు. వీరు సత్యస్వభావులు. వీరు ఎచట పుట్టినారు? ఎచటి నుంచి వచ్చినారు?

4. వాయుదేవత దేవతల ఆత్మస్వరూపుడు. భువనముల స్వరూపుడు. ఇతడు యథేచ్ఛగ సంచరించును. వారి శబ్దము బహుధ్వనులది వారి రూపము అప్రత్యక్షము హవి సహితులమై మేము వాయువును ఆరాధింతును.

## నూట అరువది తొమ్మిదవ సూక్తము

ఋషి - కక్షీవద్గోత్రశబరుడు - దేవత - గోవు ఛందస్సు - త్రిష్టుప్

1. గోవుల వైపు సుఖకర వాయువు వీచునుగాత. గోవులు బలవర్ధక తృణ, పత్రములు ఆస్వాదించునుగాత. అవి ప్రాణ సంతృప్తికర జలములు త్రాగునుగాక.

రుద్రదేవా ! చరణయుక్త, అన్న స్వరూప గోవులను స్వచ్ఛముగ ఉంచుము.

2. గోవులు కొన్ని సమవర్షలై ఉండును. కొన్ని విభిన్నవర్ణలై ఉండును. కొన్ని ఏకవర్ణలై ఉండును. యజ్ఞాగ్ని గోవులను తెలియుచున్నాడు. అంగదుల సంతానము తపమాచరించి వానిని పృథివి మీద ఏర్పరచినాడు.

3. గోవులు తమను దేవతల యజ్ఞమునకు అర్పించుచున్నవి. సోముడు వాని అశేష ఆహుతులను ఎదుంగుచున్నాడు. ఇంద్రుడు వారి దుగ్ధపూర్ణలను చేసి సంతానయుక్తలనుగ మన గోష్ఠమునకు పంపినాడు.

4. దేవతలు, పితరులు పరిశీలించినారు. ప్రజాపతి మాకు గోవులను ప్రసాదించినాడు. మా గోవులను అన్నింటిని కళ్యాణయుక్తలను చేసి - వాని సంతానము వర్ధిల్లుటకు గాను - మా గోష్ఠముల కంపినారు.

## నూట డెబ్బదివ సూక్తము

ఋషి - సూర్యపుత్ర విభ్రాటుడు దేవతసూర్యుడు - ఛందస్సు - 1,3 జగతి - 4 పంక్తి

1. సూర్యదేవుడు అత్యంత దీప్తివంతుడు, మధుతుల్య సోమరస పానము చేయును. యజ్ఞము చేయు వారికి

ఉత్తమ ఆయువును ప్రసాదించును. అతడు వాయు ప్రేరణతో ప్రజలను స్వయముగ రక్షించును. ప్రజలను పోషించును. వారికి ప్రకాశము కలిగించును.

2. సూర్యరూపమగు కాంతి గోళము ఉదయించుచున్నది. అతడు ప్రకాండ దీప్తిశాలి. సంస్థాపితుడు. సర్వోత్కృష్ట అన్నదాత. అతడు ఆకసమున నిలిచినాడు. ఆకాశమునకు ఆశ్రయము కలిగించుచున్నాడు. అతడు శత్రుహంత. వృత్రఘ్నుడు. అసుర ఘాతకుడు. విపక్ష సంహారకుడు.

3. సూర్యుడు సమస్త జ్యోతిర్మయ పదార్థములందు శ్రేష్టుడు - అగ్రగణ్యుడు. అతడు విశ్వజిత్తు - ధనవిజేత, అనంత ప్రకాశవంతుడు. సమస్త పదార్థములను కనబరచువాడు. వర్ణము కలిగించుటకు విస్తరిల్లినాడు.

అతడు బల సంపన్నుడు - అక్షయ తేజోవంతుడు.

4. సూర్యదేవా! నీవు జ్యోతిష్మంత ప్రకాశకుడవై - ఆకాశమున విరాజిల్లినావు. నీ ప్రతాపము సకల కర్మలకు సహాయకము. యజ్ఞములకు అనుకూలము - భువనమునలకు పుష్టికరము అగుచున్నది.

## నూట డెబ్బది ఒకటవ సూక్తము

ఋషి - భృగుపుత్ర ఇటుడు - దేవత - ఇంద్రుడు - ఛందస్సు గాయత్రి

1. ఇంద్రా ! 'ఇట' ఋషి నీకు సోమము అర్పించినాడు, అపుడు నీవు అతని రథమును రక్షించినావు. సోమయుక్త ఇటుని కేక విన్నాను.

2. యజ్ఞము కంపించినది. ధనుర్ధారి యగు యజ్ఞపు మస్తకము నుండి దేహమును వేరు చేసినావు.

3. ఇంద్రా! అస్త్ర బుధ్న పుత్రుడు నిన్ను తేప , తేప స్తుతించినాడు. కావున వేనపుత్ర పృధువును అతనికి వశపరచినావు.

4. ఇంద్రా! సూర్యబింబము పడమట క్రుంగినపుడు అతడు ఎచటికి వెళ్లునది దేవతలు సహితము ఎరుంగరు. నీవు మరల సూర్యుని తూర్పునకు తెస్తావు.

## నూట డెబ్బది రెండవ సూక్తము

ఋషి - ఆంగిరస సంవర్తనుడు - దేవత - ఉష ఛందస్సు -విరాజ

1. ఉషా! వింత వెలుగుతో విచ్చేయుము. నిండు పొదుగుతో ఆవులు దారి పట్టినవి.

2. ఉషా! ఇవిగో సంపన్న స్తోత్రములు. వానిని ఆకలించుటకు రమ్ము. యజమాని దాన సామాగ్రి అందుకుంటాడు. దాతృత్వము ప్రసాదిస్తాడు. యజ్ఞ సంపాదన చేస్తాడు.

3. అన్నము కూర్చినాము. ఉత్తమ వస్తుదానమునకు సంసిద్ధులము అయినాము. సూత్రము వంట యజ్ఞమును విస్తార పరుస్తున్నాము. నీకు యజ్ఞము అర్పిస్తున్నాము.

4. ఉష తన సోదరి రాత్రి యొక్క అంధకారము పోగొట్టినది. ఉత్తమ బుద్ధిచే రథమును నడిపించినది.

**నూట డెబ్బది మూడవ సూక్తము**

ఋషి - అంగిరస ధ్రువుడు - దేవత - రాజు - ఛందస్సు - అనుష్టుప్

1. రాజా! నిన్ను రాజ్యాధిపతిని చేయుచున్నాము. నీవు ఈ రాజ్యపు ప్రభువవు అగుము. స్థిరముగ, నిశ్చలముగ నిలుపుము. ప్రజ్ఞ నిన్ను అభిలషించును గాక. నీ రాజ్యమునకు హాని కలుగకుండును గాక.

రాజకీయాన్ని ఎంత స్పష్టముగా వివరించుచున్నాడో గమనించండి. మేధావి - సామాజిక నేత - ధర్మము రాజును చేస్తున్నది.

భారత తాత్వికతలో ధర్మం రాజకీయాన్ని శాసించింది. సమాజం రాజకీయాన్ని శాసించింది అనడం మరింత సమంజసం. ప్రస్తుతం రాజకీయం కండకావరం. ధన మదంతో సమాజాన్ని శాసిస్తున్నది. ఇది భారత, పాశ్చాత్య తాత్త్వికతల మౌలిక భేదం.

రాజు - రాచరికం - చంచలం కారాదు. స్థిరం కావాలి. ప్రజలు అభిలషించేట్లుగా రాజు రాజ్యం పాలించాలి.

రాజ్యానికి హాని కలుగకుండ సమాజం - రాజకీయం చూడాలి.

2. రాజా! నీవు రాజ్యముణ పర్వతమువలె నిశ్చలముగ నిలుపుము. రాజ్య భ్రష్టుడవు కారాదు. ఇంద్రునివలె ఇచట నిశ్చలముగ నిలువుము. రాజ్యమును పరిపాలించుము.

3. ఇంద్రుడు ధ్రువములగు హవిస్సులు అందుకున్నాడు. రాజును ధ్రువముగ ప్రతిష్ఠించినాడు. బ్రహ్మణస్పతియు, సోమరాజును సదాలోచన కలిగింతురుగాక.

స్థిరత్వానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాడు. ఇంద్రుని అంతటి స్థిరముగ ఉండమని చెప్పి, ఇంద్రుడే ప్రతిష్టించినాడు

అంటున్నాడు, ఇంద్రుడు దేవరాజు మాత్రం కాదు. 'శత క్రతు' నూర్ల సత్కార్యములు చేసినవాడు. రాజు విద్వాంసుల మేధావుల సూచనలను అనుసరించాలి అంటున్నాడు.

ఒక్కసారి నేటి అరాచకీయ రాచకీయన్ని పరిశీలించండి.

1. భారత ప్రభుత్వం సార్రీ "గవర్నమెంట్ ఆఫ్ ఇండియా"లో భారతీయత లేశమాత్రం లేదు. రాజ్యాంగం సహితంగా సమస్తం పాశ్చాత్యులు మన మీద రుద్దినవే!

2. ఏ రాజకీయ పార్టీకి, సత్యం, ధర్మం, నీతి, నియమం అనేవి ఉన్నాయనే విషయం తెలియదు. ప్రజలను వంచించడంలో వారిని ఓట్లిచ్చే యంత్రాలను చేసి మాటలు తమ దగ్గర ఉంచుకోవడంలో ఒకరిని మించిన వారు మరొకరు. ఎవరికీ దేశం ప్రజలు పట్టితేరు - అధికారమే పరమావధి!

` 3. ప్రభుత్వంలోను, విధానాల్లోనూ, అస్థిరత్వం! కొంతకాలం రష్యావిధానాలు - ఇపుడు అమెరికా బానిసత్వం.

4. 'బ్రహ్మణాస్సంతు నిర్భయాః' బ్రహ్మణులు భయంలేని వారు కావాలి అనేది వేద సూత్రం. మేధావులు నిర్భయంగా ఆలోచించి వివరించ గలగాలి. ఈ దేశంలో ఒక్క పార్టీ సహితం మేధావులకు స్వేచ్ఛ ఇవ్వడానికి సిద్ధంగా లేదు.

వేదపు ఆదర్శం ఎంత నిత్యసత్యం అయిందో గమనించండి. నమస్కరించండి.

4. ఆకాశము ధ్రువము. పృథివి ధ్రువము. ఈ పర్వతములు ధ్రువములు! సమస్త విశ్వము ధ్రువము. అట్లే ప్రజల మధ్య రాజు ధ్రువముగా నిలుచునుగాక.

5. 'ధ్రువంతే రాజావరుణో ధ్రువందేవో బృహస్పతిః

ధ్రువంత ఇన్ద్రశ్చాగ్నిశ్చ రాజ్యం ధారయతాం ధ్రువమ్".

వరుణ రాజు స్థిరుడు అగును గాక. బృహస్పతి దేవత స్థిరుడు అగునుగాక. ఇంద్రాగ్నులు స్థిరులై రాజ్యమును స్థిరముగ పోషింతురుగాక.

ప్రభుత్వం పంచభూతము లంతటి స్థిరం కావాలి. అంతటితో చాలదు. మేధావులు, వర్షములు, ఇంద్రుడు అగ్ని అస్థిరులు కాక స్థిరులే దేశాన్ని పోషించాలి.

ప్రభుత్వానికి స్థిరత్వం ప్రధాన అంశం అంటున్నది వేదం.

ఈ ప్రభుత్వాలు సర్వత్ర అస్థిరములు.

అనిశ్చితములు!

ఈ దేశ భాగ్యం అనిశ్చితం - అస్థిరం.

'నమో భరత మాతా'

6. అక్షయ హవి యందు అక్షయ సోమరసమును మిశ్రమము చేయుచున్నాము. కావున ఇంద్రుడు ప్రజలను ఏకముగను, పన్నులిచ్చి వారిగను చేసినాడు.

**నూట డెబ్బది నాలుగవ సూక్తము**

ఋషి - ఆంగిరస అభివర్త దేవత - రాజు ఛందస్సు - అనుష్టుప్

1. యజ్ఞ సామాగ్రి సహితముగ దేవతల వద్దకు చేరవలెను. ఇంద్రుడు యజ్ఞ సామాగ్రి అందుకున్నాడు. అనుకూలుడు అయినాడు.

బ్రహ్మణస్పతీ! మేము ఆ విధముగ యజ్ఞము చేసినాము. మాకు రాజ్యప్రాప్తి కలిగించుము.

2. రాజా! ఎవరు మాకు విపక్షులో - ఎవరు మాకు హింసక శత్రువులో - ఎవరు సేనా సహితులై మా మీదకు వచ్చెదరో - ఎవరు మమ్ము ద్వేషింతురో వారిని పరాజితులను చేయుము.

3. సవిత నీకు అనుకూలుడు అయినాడు. సోమము నీకు అనుకూలుడు అయినాడు. సమస్త ప్రజా నీకు అనుకూలురు అయినారు. ఆ విధముగా నీకు అందరి అభిమానము లభించినది.

4. దేవతలారా! ఎట్టి యజ్ఞ సామాగ్రిచే ఇంద్రుడు యజ్ఞకర్త, అన్నవంతుడు అయినాడో దానితోనే నేను యజ్ఞము చేసినాను. అందువలన నేను శత్రురహితుడను అయినాను.

5. నాకు పగవారు లేరు. నేను పగవారిని పరిమార్చినాను. నేను ఈ రాజ్యమునకు రాజును. శత్రు నివారణయందు సమర్థుడను అయినాను. నేను సకల ప్రాణుల, మంత్రముల అధీశ్వరుడను అయినాను.

**నూట డెబ్బది అయిదవ సూక్తము**

ఋషి - అర్బుదసర్పపుత్ర ఊర్ధ్వగ్రావుడు - దేవత - సోమము - ఛందస్సు - గాయత్రి

1. ప్రస్తాములారా! సవితా దేవత స్వశక్తిచే మిమ్ము సోమము సమర్పించుమని నిర్దేశించినాడు. మీరు మీ కార్యము నిర్వర్తించండి. సోమము అందించండి.

2. ప్రస్తరములారా! దుఃఖమును తొలగించండి. దుర్బద్ధిని తొలగించండి. గోవులను మాకు ఔషధ స్వరూపులను చేయండి.

3. ప్రస్తరములు పరస్పరము కలసినవి. నలువైపుల గల విశాల ప్రస్తరపు శోభనందినవి. రసవర్షక సోమము మీద ప్రస్తరములు తమ బలమును ప్రదర్శించుచున్నవి.

4. ప్రస్తరములారా! యజమాని సోమయజ్ఞ కర్తయగుచున్నాడు. అతని కొరకు మీరు సోమము సిద్ధము చేయండి. సవితా దేవత మిమ్ము అందుకు నియమించినాడు.

## నూట డెబ్బది ఆరవ సూక్తము

ఋషి - ఋభుపుత్ర సునుడు, దేవత - ఋభు, అగ్నులు,

ఛందస్సు - గాయత్రి, అనుష్టుప్

1. ఋభువులు మహా సంగ్రామమునకు వెడలినారు. బిడ్డలు తల్లిచుట్టు నిలుచుందురు. ఋభులు అట్లే లోక పోషణార్థము పృథివికి నలువైపుల వ్యాపించి ఉన్నారు.

2. అగ్ని జ్ఞాని. దేవయోగ్య స్తోత్రములచే అతనిని ప్రసన్నుని చేయండి. అగ్ని మన హవ్యములను వహించునుగాత.

3. ఇతడు అగ్ని. దేవతల వద్దకు వెళ్ళువాడు. ఇతడు హోత. యజ్ఞమందు ఇతనిని స్థాపించబడును. అగ్ని రథము వలె హవ్యము వహించును. అగ్నిని యజమానులు, పురోహితులు పరివేష్ఠించి ఉంటారు. అగ్నికి యజ్ఞ సంపన్నము తెలియును.

4. అగ్ని రక్షకుడు అగును. ఇతని ఆవిర్భావము అమృత ఆవిర్భావము వంటిది. అతడు బలశాలురకు బలశాలి. పరమాయువు వర్ధిల్ల చేయుటకే అగ్ని అవతరించినాడు.

## నూట డెబ్బది ఏడవ సూక్తము

ఋషి - ప్రజాపతి పుత్ర పతంగుడు - దేవత - మాయ ఛందస్సు - జగతి - త్రిష్టుప్

1. విద్వాంసులు మనసుతో ఆలోచించినారు. మనో నేత్రమున అవలోకించినారు. ఒక పక్షిని ఆత్మను - దర్శించినారు. దానిని మాయ చుట్టుకున్నది. ఇది సముద్ర మధ్యమందు ఉన్నదని విద్వాంసులు వచించినారు. వారు విధాత కిరణముల లోనికి చేరదలచుచున్నారు.

2. పక్షి మనసు నందుండియే మాట నేర్చినది. గర్భ మధ్యమందు ఉండగనే గంధర్వుడు వాక్కు నేర్పినాడు. ఆ వాణి దివ్య, స్వర్గ సుఖప్రధాత్రి. బుద్ధికి అధీశ్వరి. విద్వాంసులు సత్యమార్గమున ఆ వాణిని రక్షించుచున్నారు.

3. ఆత్మ గోపాలకుడు. అతనికి నాశనము లేదు. అతడు ఒకపుడు దగ్గర - ఒకపుడు దూరమున అనేక మార్గములందు సంచరించుచుండును. అతడు ఒకపుడు అనేక వస్త్రములు ఒకేసారి ధరించును.

ఒకపుడు వేరు , వేరు వస్త్రములు ధరించును. అట్లు అతడు మరల మరల ఈ లోకమునకు వచ్చుచుండును - పోవుచుండును.

## నూట డెబ్బది ఎనిమిదవ సూక్తము

ఋషి - తాక్ష్యపుత్ర అరిష్టనేమి - దేవత - తారుక్ష్యుకు ఛందస్సు - త్రిష్టుప్

1. తారుక్ష్యుడు - గరుడుడు  - పక్షధారి - సోమము తెచ్చుటకు పంపబడినవాడు. శత్రుం జయుడు, శత్రు రథవిజేత, అతని రథము అజేయము. అతడు సేనలకు సంగ్రామ ప్రేరకుడు. అతనినే మేము శుభములు కోరి ఆహ్వానించుచున్నాము.

2. మేము ఇంద్రుని దానశక్తిని ఆహ్వానింతుము. అట్లే గరుడుని దానశక్తిని ఆహ్వానింతుము. మంగళము కొరకును - విపత్తు  నుండి దాటుటకు నావను వలె అట్టి దానశక్తిని ఆశ్రయిస్తాను.

ద్యావా పృథ్వులారా! మీరు విశాలురు - బృహతులు - సంవ్యాపకులు - గంభీరులు. రాకపోకలందు మమ్ము బాధించవలదు.

3. సూర్యుడు స్వతేజమున వర్షమున, జలమును విస్తరింప చేయును, అట్లే గరుత్మంతుడు పంచజనులకు పరిపూర్ణ భండారము కలిగించును. గరుడుని గతి శత, సహస్ర ధన ప్రదాత్రి యగుచున్నది. శరము సరిగా గురిపెట్టినపుడు ఆటంకము ఉండనట్లే గరుడ గమనమునకు ఆటంకము ఉండదు.

## నూట డెబ్బది తొమ్మిదవ సూక్తము.

ఋషి - ఉశీన పుత్ర శిబి దేవత - ఇంద్రుడు -ఛందస్సు - అనుష్టుప్, త్రిష్టుప్

1. పురోహితులారా! లేవండి. ఇంద్రునకు సముచిత భాగము సమర్పించుటకు ఉద్యమించండి. అది పచనమైనదో హోమము చేయండి. ఉడుకకున్న ఉత్సాహమున ఉడికించండి.

2. ఇంద్రా ! హవ్యము సిద్ధమైనది. సమీపమునకు విచ్చేయుము. సూర్యుడు నెత్తి మీదకు వచ్చినాడు. వంశరక్షకుడగు పుత్రుడు అటునిటు తిరుగు తండ్రి కొరకు నిరీక్షించు రీతి - బంధుజనులు హస్తములందు యజ్ఞ సామాగ్రితో నీ కొరకు నిరీక్షించుచున్నారు.

3. ఆవుపాలను కాచి తోడేసినంత ఓకే పవిత్ర  వినూత్న పదార్థము సిద్ధము అగును. అది 'దధి ధర్మహవి 'అగుచున్నది. బహుధన ధాత, వజ్రధర ఇంద్రునకు మధ్యాహ్న సవనమున 'ధధి ధర్మహవి' సమర్పించబడును. ఆ హవిని ఇంద్రుడు ఆనందముగ ఆస్వాదించునుగాత.

## నూట ఎనుబదవ సూక్తము

ఋషి - ఇంద్ర పుత్ర జయుడు దేవత - ఇంద్రుడు ఛందస్సు - త్రిష్టుప్

1. పురుహూత ఇంద్రా! నీవు శత్రుంజయుడవు. నీ తేజస్సు సర్వశ్రేష్ఠము. నీ దానమును ఇటు మళ్లింపుము. కుడిచేతితో ధనము నిమ్ము. నీవు ధనములకు - స్తోత్రములకు స్వామిని అగుచున్నావు.

2. అడవి మృగము భయంకరము అయినట్లు ఇంద్రా! నీవు భీకరాకారమున దూరపు స్వర్గము నుండి దిగి వచ్చుచున్నావు. వాడియైన వజ్రమునకు సానపట్టి శత్రువులను వధించుము. విపక్షులను దూరము చేయుము.

3. ఇంద్రా ! నీవు తేజోవంతుడవై జన్మించినావు. ఆ తేజము అత్యాచార నివారకము. నీవు నరుల కోర్కెలు తీర్చువాడవు, పగతురను దండించువాడవు అగుచున్నావు. నీవు దేవతల కని ఈ లోకమును విస్తరింప చేసినావు.

## నూట ఎనుబది ఒకటవ సూక్తము

ఋషులు - వేరువేరు - దేవత - విశ్వేదేవతలు, ఛందస్సు - త్రిష్టుప్

1. ఎవరు ప్రథలో, ఎవరు సప్రథలో వారి నుంచి వసిష్ఠుడు - ధాతయు, దీప్తుడును అగు సవిత మరియు విష్ణువు నుండి రథంతర సామము తెచ్చినాడు. ఇది అనుష్టుప్ ఛందము గలది. ధర్మమును హవిని శుద్ధము చేయునది అగుచున్నది.

2. ఏది నిగూఢ బృహత్ సామమో, దేవి ద్వారమున యజ్ఞము అనుష్ఠింపబడునో అది తిరోహితము అయినది. దానిని సవిత మున్నగువారు కనుగొన్నారు. ధాత, దీప్త సవిత, విష్ణు, అగ్ని నుంచి భరద్వాజుడు బృహత్ సామమును తెచ్చినాడు.

3. అభిషేక క్రియా నిష్పాదక ధర్మ యజుస్సు యజ్ఞకార్యము లందు ప్రధానముగ ఉపయుక్త మగునది. దాతమున్నగు దేవతలు మనసున ధ్యానించి దానిని పొందినారు. పురోహితులు ధాత, విష్ణు, సూర్యుల నుండి దానిని తెచ్చినారు.

## నూట ఎనుబది రెండవ సూక్తము

ఋషి - బృహస్పతి పుత్ర తపమూర్ధుడు, దేవత - బృహస్పతి, ఛందస్సు - త్రిష్టుప్

1. బృహస్పతి దుర్గతిని నష్టపరచునుగాక. పాప నాశమునకు స్తుతికి స్ఫూర్తి కలిగించును గాత. అమంగళము శమింపచేసి దుర్మతిని నష్టపరచును గాత. యజమాని రోగమును నాశనముచేసి భయమును హరించునుగాత.

2. ప్రయాజ యందు నరాశంస అగ్ని మమ్ము రక్షించును గాత. అనయాజ మందు మాకు శుభములు కూర్చునుగాత. అమంగళము నశింపచేసి, దుర్మతిని దూరము చేయును గాత. యజమాని రోగమును నాశము చేసి, భయమును హరించునుగాత.

3. స్తోత్ర ద్వేషులగు రాక్షసులను బృహస్పతి దగ్ధము చేయునుగాత. అట్లయిన హింసకులు మరణింతురు. అమంగళము నశింపచేసి, దుర్మతిని దూరము చేయునుగాత. యజమాని రోగమును నాశనముచేసి, భయమును దూరించునుగాత.

## నూట ఎనుబది మూడవ సూక్తము

ఋషి - ప్రజాపతి పుత్ర ప్రజావంతుడు దేవత - యజమాని,
పత్ని, ఆత్మ -ఛందస్సు - త్రిష్టుప్

1. యజమానీ! నేను మనోనేత్రమున నిన్ను చూచినాను. నీవు జ్ఞానివి. తపము నుండి పుట్టిన వాడవు. తపముతో శ్రీవృద్ధి పొందినావు. ఇచట ధనాదులను పుత్రులను పొందుము. ప్రసన్నుడవు అగుము పుత్రులే నీ కోరికగా ఉన్నారు. సంతానము కనుము.

2. పత్నీ! నేను మనో నేత్రమున నిన్ను చూచినాను. నీ రూపము కాంతి మంతము. నీవు సమయమును అనుసరించి గర్భము కోరుచున్నావు. నీవు పుత్రుని కోరినావు. నా వద్దకు వచ్చి తరుణిని అగుము. పుత్రుని కనుము.

3. నేను హోతను. నేనే వృక్షాదులందు గర్భాదాన కారణమును. నేనే అన్యప్రాణులకు గర్భాదానము చేయును. నేను భూమి మీద ప్రజలను ఉత్పత్తి చేయుదును. అన్యస్త్రీ లందును పుత్ర ఉత్పాదకుడను అగుచున్నాను. యజ్ఞము వలన అన్నింటికి సంతానము కలిగించినాడు.

## నూట ఎనుబది నాలుగవ సూక్తము

ఋషి - త్విష్ట - దేవత - వేరు వేరు - ఛందస్సు - అనుష్టుప్

1. స్త్రీ యోనిని విష్ణువు గర్భాధాన ఉపయుక్తము చేయునుగాక. త్వష్ట రూపము ఏర్పరచును గాథ ప్రజాపతి వీర్యపాతమున సహాయపడునుగాక. దాత నీ గర్భమును పోషించునుగాత.

2. సినీవాలీ! నీవు గర్భమును పోషింపుము. సరస్వతీ ! నీవు సహితము గర్భమును పోషించుము స్వర్ణకమల భూషణ అశ్వినీ ద్వయమా! సంతానము పిలుచుచున్నాము.

3. పత్నీ ! నీ గర్భస్థ సంతానము కొరకు అశ్వినులు అరణులు పట్టియున్నారు. పదవ మాసమున ప్రసవించుటకు అదే గర్భస్థ సంతానమును పిలుచుచున్నాము.

## నూట ఎనుబది అయిదవ సూక్తము

ఋషి - వరుణపుత్ర - సత్యధృతి - దేవత - ఆదిత్యుడు - ఛందస్సు - గాయత్రి

1. మిత్ర, అర్యమ, వరుణుల సతేజ, దుర్ధర్ష, మహదాశ్రయము మాకు లభించునుగాత.

2. గృహమందు, పథోమందు, దుర్గమ స్థానమందు, ఆ ముగ్గురుని ఆశ్రయించిన వారిని ఎంతట శత్రువును ఏమి చేయజాలడు.

3. ఈ ముగ్గురు అదితి పుత్రులు ఎవరికి నిరంతరము జ్యోతి ప్రసాదించుచున్నారో వారికి జీవన రక్షణ కలుగును. వారిని ఎంతటి శత్రువును ఏమి చేయజాలడు.

## నూట ఎనుబది ఆరవ సూక్తము

ఋషి - వాతగోత్ర ఉలస్యుడు - దేవత - వాయువు - ఛందస్సు - గాయత్రి

1. వాయువు ఔషధ సమమై మా హృదయములందు చేరునుగాత. వాయువు కళ్యాణ కరము సుఖకరము అయి ఆయుర్దాయము పెంచునుగాత.

2. వాయువా! నీవు మాకు తండ్రివి, తల్లివి, బంధుడవు. మా జీవితమునకు ఔషధమవు అగుము.

3. వాయువా! నీ ఇంట అమృతనిధి ఉన్నది. అందు నుంచి మా జీవితము కొరకు అమృతము ప్రసాదించుము.

## నూట ఎనుబది ఏడవ సూక్తము

ఋషి - అగ్నిపుత్ర వతుడు - దేవత - అగ్ని - ఛందస్సు -గాయత్రి

1. నరులారా! వరపుత్రవతుడు అగ్నికి మనసు శత్రువు నుండి రక్షించుణుగాత. 'సనఃపర్షదతిద్విషః.

2. అగ్ని అత్యంత దూర ప్రదేశమగు ఆకాశము నుండి విచ్చేసినాడు అగ్ని మనసు శత్రువు నుండి రక్షించునుగాక. 'సనఃపర్షదతిద్విషః'

3. అగ్ని వృష్టి వర్షకుడు. ఉజ్వల శిఖలవాడు. రాక్షసులను వధించువాడు. సనఃపర్షదతి ద్విషః - అగ్ని మనసు శత్రువు నుండి రక్షించునుగాత.

4. వాయువు సకల భువనములను భిన్న రూపములతోను, మిశ్రమ రూపములతోను అవలోకకించును. 'సనః పర్షదతిద్విషః.'

5. అగ్ని ద్యులోకమునకు ఆవల కాంతిమయ రూపమున ఆవర్భివించినాడు. 'సనః పర్షదతిద్విషః.'

## నూట ఎనబది ఎనిమిదవ సూక్తము

ఋషి - అగ్నిపుత్ర శ్యేనుడు - దేవత - అగ్ని - ఛందస్సు - గాయత్రి

1. పురోహితులారా - యజమానులారా! అగ్ని జ్ఞాని, అతనిని ప్రజ్వలింపచేయండి. అతడు విచ్చేసి కుశలమీద ఆసీనుడు అగునుగాత.

2. బుద్ధిమంతులగు యజమానులు అగ్నిపుత్రులు అగుచున్నారు. అగ్ని వర్షము కలిగించువాడు. అతని కొరకు విశాలము, శోతనకరమగు స్తుతికి ప్రేరణ కలిగించుచున్నాను.

3. అగ్నికాళి, కరాళాది సుందరి జ్వాలలచే దేవతలకు వానిని అందించుచున్నాడు. అగ్ని దేవతల సహితుడై మా యజ్ఞమునకు విచ్చేయునుగాత.

## నూట ఎనుబది తొమ్మిదవ సూక్తము

ఋషిక - సర్పరాజ్ఞి - దేవత - సూర్యుడు - ఛందస్సు -గాయత్రి

1. సూర్యుడు గతిపరాయణుడు - తేజస్వి అతడు ఉదయాచలము చేరినాడు. మాతృమూర్తియగు ప్రాగ్దిశను ఆలింగనము చేసికొన్నాడు. తదుపరి పితృమూర్తి యగు ఆకసమున సాగినాడు.

2. సూర్యుని దేహమున కాంతి సంచరించును. అట్టికాంతి అతని ప్రాణ మధ్యము నుండి వెడలుచున్నది. అతను మహానుడు అయినాడు. ఆకసమున వ్యాపించినాడు.

3. సూర్యుని ముప్పది స్థానములు శోభిల్లును. గతి పరాయణుడగు సూర్యుని కొరకు స్తుతులు ఉచ్చరించబడును. అతడు నిత్యము తన కిరణములచే శోభిల్లును.

## నూట తొంబదవ సూక్తము

ఋషి - మధుచ్ఛంద పుత్ర అఘమర్షణుడు - దేవత - సృష్టి -ఛందస్సు - అనుష్టుప్

1. ప్రజ్వలిత తపస్సు నుండి యజ్ఞము. సత్యము ఆవిర్భవించినవి. తదుపరి రాత్రింబవల్లు అనంతరము జలజ సముద్రము కలిగినవి.

2. జలపూర్ణ సముద్రము నుండి సంవత్సరము పుట్టినది. తదుపరి రాత్రింబవల్లు కలిగినవి. అతడు సమస్త ప్రాణులకు స్వామి యగుచున్నాడు.

3. పూర్వకాలమును అనుసరించియే ఈశ్వరుడు సూర్యచంద్రులను స్వర్గ, పృథివి, అంతరిక్షములను సృష్టించినాడు.

## ఋగ్వేద సంహిత యందలి చివరి
## నూట తొంబది ఒకటవ సూక్తము

ఋషి - సంవనుడు - దేవత అగ్ని - సమత - ఐక్యత - ఛందస్సు - త్రిష్టుప్, అనుషుప్

1. అగ్నీ! నీవు వరదుడవు. ప్రభువవు. నీవు సమస్త ప్రాణులందు నిలిచి ఉన్నావు. నీవు యజ్ఞవేది మీద జ్వలింతువు. 'నోవసూనాభర' -మాకు ధనములను అందించుము.

2. స్తోతలారా! మీరు కలసి ఉండండి. ముక్తకంఠమున స్తుతులు చదవండి. మీరు ఏక మనస్కులు అగుదురుగాత ప్రాచీన దేవతలు ఏకమై హవి స్వీకరించినారు. మీరు సహితము ఏకమై ధనాదులు తీసికొనండి.

3. పురోహితులు ఏకమున వచ్చెదరుగాత. ఏకమై స్తుతింతురుగాక. వారు ఏకచిత్తులు, ఏకమనస్కులు అగుదురుగాక.

పురోహితులారా! మిమ్ము ఒకే మంత్రముతో మంత్రిస్తాను. ఒకే హవితో హవనం చేస్తాను.

4. సమానీవ ఆకూతిః సమానా హృదయానినః
సమానమస్తునో మనో యథావః సుసహాసతి.

మీ సంకల్పములు సమానములు అగునుగాత. మీ హృదయములు సామములు అగునుగాత మీ మనసులు సమానములు అగునుగాత. మీరు సంపూర్ణముగా సంఘటితులు అగుదురుగాత.

అక్షర వాచస్పతి డాక్టర్ దాశరధి రంగాచార్య రచించిన శ్రీమదాంధ్ర వచన ఋగ్వేద సంహిత యందలి పదవ మండలమును, ఋగ్వేద సంహితయు సమాప్తము.

**స్వస్తి ప్రజాభ్యః పరిపాలయంతాం**
**న్యాయ్యేన మార్గేణ మహీం మహీశాః**
**గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం**
**లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**

*** సమాప్తం ***

---